# స్వతంత్రత నుండి..స్వాతంత్ర్యానికి

## (తెలుగులో స్త్రీల సాహిత్యం క్రీ.శ.1900–1947)

డా॥ జంధ్యాల కనకదుర్గ

ముఖచిత్రాలు :

స్త్రీవ్యక్తి ,దేశ స్వాతంత్ర్యోద్యమసాధనకై కృషిచేసిన తెలుగు మహిళలు- ప్రత్యేకతలు (ఎడమనుండి కుడికి)

*పైవరుస :*

1. వేమూరి శారదాంబ- 1896 లోనే స్త్రీవిద్య, స్త్రీస్వతంత్రతను ప్రతిపాదించి, సమాజసంస్కృతిని ప్రశ్నించిన తొలి కవయిత్రి.
2. భండారు అచ్చమాంబ-1902 లో తెలుగులో ప్రథమ కథారచయిత్రి.
3. కొటికలపూడి సీతమ్మ-1902 లో స్త్రీసమాజాల రూపకల్పనలో ఆద్యురాలు.
4. సరోజిని నాయుడు-స్వాతంత్ర్యసమరయోధురాలు, దేశస్వాతంత్ర్యోత్సవ తొలి జాతీయ పతాకాన్ని అందించిన మహిళ.
5. ఆచంట రుక్మిణి-1938 లోప్రథమాంధ్ర మంత్రిణి.
6. గుమ్మడిదల దుర్గాబాయమ్మ-స్వాతంత్ర్యసమరయోధురాలు, భారతరాజ్యాంగనిర్మాణ సంఘుసభ్యురాలు

*మధ్యవరుస :*

1. కనుపర్తి వరలక్ష్మమ్మ - 1918 లోస్త్రీల రాజకీయ హక్కులు, స్వాతంత్ర్యాన్ని ప్రతిపాదించిన తొలి మహిళ. అన్ని సాహిత్యప్రక్రియలలో ఉద్యమ సాహిత్య రచయిత్రి. తొలి స్వీయచరిత్ర రచయిత్రి.స్త్రీలకు వయోజనవిద్య,వేసంగి పాఠశాలవిద్యలను ప్రతిపాదించిన తొలిమహిళ. ఆంధ్ర రాష్ట్రోద్యమ నాయకురాలు.
2. పులవర్తి కమలావతిదేవి - 1923 లో స్వరాజ్యాన్ని నిర్వచించిన తొలి మహిళ. దళిత,గిరిజన, హిందుమహమ్మదీయుల ఐక్యతలగురించిన కథల తొలి రచయిత్రి.
3. వట్టికొండ విశాలాక్షి - అభ్యుదయ కవయిత్రి.
4. మాగంటి అన్నపూర్ణ - తొలి సత్యాగ్రహ ఖద్దరు ఉద్యమ నాయకురాలు.
5. దువ్వూరి సుబ్బమ్మ - సత్యాగ్రహోద్యమంలో జైలుశిక్షకు గురియైన తొలి తెలుగు మహిళ.
6. పొణకా కనకమ్మ - స్వాతంత్ర్యోద్యమనాయకురాలు, కాంగ్రెస్ తొలి తెలుగు సభ్యురాలు.

*కిందివరుస :*

1. బాలాంత్రపు శేషమ్మ - హిదూసుందరి పత్రికా సంపాదకురాలు.
2. కళ్ళేపల్లి నెంకటరమణమ్మ - స్త్రీల ఆస్తిహక్కును ప్రస్తావించిన తొలి మహిళ, ఆంధ్రలక్ష్మి పత్రికాధిపతి, మాతృభాష ఉద్యమకారిణి.
3. కాంచనపల్లి కనకాంబ - ప్రథమాంధ్ర నవలారచయిత్రి.
4. ఉన్నవ లక్ష్మీబాయమ్మ - జాతీయ బాలికావిద్యాసంస్థ వ్యవస్థాపకురాలు.
5. దర్శి అన్నపూర్ణ - తొలి రజస్వలానంతరవివాహిత, సంఘసేవికురాలు. సహజీవనసంస్కృతిని ప్రతిపాదించిన తొలి రచయిత్రి.
6. బత్తుల కామాక్షమ్మ - ఈతనేర్చిన తొలి మహిళ, ఆంధ్రవిశ్వవిద్యాలయ తొలిమహిళా సెనెట్ మెంబరు, గౌరవ న్యాయాధికారిణి.

# స్వతంత్రత నుండి...... స్వాతంత్ర్యానికి

(తెలుగులో స్త్రీల సాహిత్యం - క్రీ.శ. 1900-1947)

డాక్టర్ జంధ్యాల కనకదుర్గ

జంకదు ప్రచురణలు,
గుంటూరు.

**స్వతంత్రత నుండి...... స్వాతంత్ర్యానికి**

(తెలుగులో స్త్రీల సాహిత్యం - క్రీ.శ. 1900-1947)

ప్రథమ ముద్రణ : జులై 2021

ప్రతులు : 500

ప్రచురణ :

జంకదు ప్రచురణలు,

గుంటూరు.

ప్రతులకు చిరునామా:

**డాక్టర్ జె.కనకదుర్గ**

ఇంటి నెం.5-35-18, 3వ లైను, 18వ క్రాస్ రోడ్డు,

బ్రాడీపేట, గుంటూరు.

ఆంధ్రప్రదేశ్-522002

చరవాణి-9491140299

E mail id : jankadu1953@gmail.com

ముద్రణ :

శ్రీశ్రీప్రింటర్స్, విజయవాడ

srisriprinter.vja@gmail.com

Ph : 9490634849

వెల : అమూల్యం

# స్వతంత్రత నుండి........ స్వాతంత్ర్యానికి-
## (స్త్రీలసాహిత్యం-క్రీ.శ. 1900-1947)

### ఆణిముత్యాలు

"మహిళాభివృద్ధియే దేశాభివృద్ధి"

"స్త్రీ పురుషులు సమానస్థితి యందున్నప్పుడే స్వరాజ్యమునకర్థత"

"సమానత్వము స్త్రీలనిర్బంధమును, నిస్సహాయతను తొలగించి దేశ కల్యాణానికి తోడ్పడి స్వరాజ్య మిప్పించును."

"మనదేశమునకు స్వరాజ్యము కావలెనన్న స్త్రీలకు స్వాతంత్ర్య మిచ్చుట మొదటి మెట్టు."

"స్త్రీ స్వాతంత్ర్యమునకు స్త్రీలే పనిచేయవలయును." - మైదవోలు పద్మావతి.

"స్వాతంత్ర్య నిరోధకమే అవినీతికి ప్రోత్సాహకరం." - సోమయాజుల లక్ష్మీనరసమ్మ.

"స్వాతంత్ర్యం ఒకడు దానం చేయటానికి, ఇంకొకరు పరిగ్రహించటానికి భిక్ష లాంటిది కాదు. స్వాతంత్ర్యాన్ని ఎవరికి వారే సంపాదించుకోవాలి, ఎవరికి వారే నిలబెట్టుకోవాలి."

- *గుమ్మడిదల దుర్గాబాయమ్మ.*

"జాతీయతకు వాఙ్మయమునకు అవినాభావసంబంధమెల్ల కాలములో నుండక తప్పదు.. ఇకనైనను కర్తవ్యము గ్రహించి స్త్రీవాఙ్మయనిర్మాణమునకై దీక్షబూనవలదా" - చేబ్రోలు సరస్వతి.

"జాతికి జీవకళను ప్రసాదించెడిది సాహిత్యము" - "సాహిత్యం ఉంటే యుద్ధసామాగ్రితో పనిలేదు"

- కస్తూరి రామలక్ష్మీదేవి.

"సారస్వతంలో స్త్రీ ఒక నూతనాదర్శము, ఒక నూతన వ్యక్తిత్వమును నిరూపించాలి. స్త్రీలెప్పుడు శక్తివంతులై సారస్వతోపాసకులయ్యెదరో నాడు సారస్వతలోకంలో ఒక నూతన శకము ప్రారంభమగును." - కామరాజు సరోజిని.

"స్త్రీకి స్వకీయమైన దేహముగలదు, మనస్సుగలదు, బుద్ధిగలదు..కానిస్వతంత్రములుగావు.. పురుషునిచిత్తవృత్తికి బద్ధమై స్త్రీ దైహికములైన తన సుఖంబుల విడనాడుకోవలయును. మానసికములైన తన వాంఛలను చంపుకొనవలయును. బుద్ధిజన్యమైన తన పరిజ్ఞానమును నశింపజేసికొనవలయును." - కనుపర్తి వరలక్ష్మమ్మ.

# అంకితం

జంధ్యాల కుమారస్వామి
08.03.1926 - 17.06.2006

లక్ష్మీప్రసన్నమ్మ
01.01.1931 - 14.08.2014

స్త్రీవిద్యా ప్రాముఖ్యతను గ్రహించిన మా తల్లిదండ్రులు 60 సం.ల క్రితమే నన్ను చదివించిన ఫలితంగా, ఈ పుస్తకరచనను చేసేటప్పుడు, వారు మాతో పంచుకొన్న స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి సంఘటనలను గుర్తుకు వచ్చేటట్లు చేసిన వారి స్మృతికి అంజలి ఘటిస్తూ, "స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి" (తెలుగులో స్త్రీల సాహిత్యం - క్రీ.శ.1900-1947) అనే ఈ గ్రంథాన్ని తీర్చుకోలేని ఋణంగా మా అమ్మానాన్నలకు అంకితం యిస్తూ.

- డాక్టర్ జంధ్యాల కనకదుర్గ



డాక్టర్ వకుళాభరణం రామకృష్ణ

# ముందుమాటలు....

ఆంధ్రదేశంలో స్త్రీ చైతన్యం రూపుదాల్చి, స్త్రీలు తాము ఎదుర్కొంటున్న సామాజిక రుగ్మతలకు ఎదురొడ్డి ఉద్యమాలు నిర్మించడం,రచనలు చేయడం, సమాజాలు నిర్వహించడం, 19 వ శతాబ్ది చివరకే మొదలయింది. సాంఘిక సంస్కరణోద్యమాల్లో భాగంగా వీటిని విశాలార్థంలో చూసినా, 20 వ శతాబ్ది మొదటి రెండు దశాబ్దాల కాలానికి స్త్రీల ఉద్యమాలు తమ ప్రత్యేకతను సంతరించుకొన్నాయి. సంస్కరణోద్యమ భావజాలానికి తోడుగా జాతీయభావాలను జోడిస్తూ స్వాతంత్ర్యోద్యమమూ మొదలయింది.

ఆంధ్రదేశంలో చెప్పుకోదగ్గ పరిణామం, 1920 కల్లా మహాత్ముడు జాతీయోద్యమ నాయకత్వం చేపట్టే నాటికే, స్త్రీసమాజాలు, స్త్రీ రచయిత్రులు సాహిత్యసృష్టి చేయడం, పత్రికలు నడపడం, ఉద్యమాల్లో ప్రత్యక్ష భాగస్వాములు కావడం జరిగాయి. ఈ క్రమంలో రచయిత్రుల రచనలు, ఉపన్యాసాలు, సత్యాగ్రహాలు, అరెస్టులు సరే ఆ కార్యరంగాన్ని అటుంచి, సమాంతరంగా తమ సృజనను జాతీయోద్యమంవైపుకు మళ్ళించి, విభిన్నరచనలు, ప్రక్రియలు – వ్యాసం, కథ, కవిత, జీవితచరిత్రలు – చేపట్టడం, స్థానికం మొదలు రాష్ట్ర స్థాయిలో సమాజాలను నిర్వహించడం, వార్షికసభలు జరిపి తీర్మానాలు చేయడం ముమ్మరంగా కొనసాగాయి.

ఇందులో భాగంగానే, ప్రస్తుతం మీ ముందున్న గ్రంథం". స్వతంత్రత నుండి – స్వాతంత్ర్యానికి" వెలువడుతోంది. ఇదొక జమిలి ఆశయం. ఒకవైపు స్త్రీలు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఉద్యమిస్తూ, రచనలు చేస్తూనే, మరోపార్శ్వంలో స్వాతంత్ర్య సాధన కోసం తమ కలాలకు పనిపెట్టారు. ప్రస్తుత గ్రంథం వారి రచనలను పరామర్శించి, సమీక్షించింది.

తెలుగులో జాతీయోద్యమ సాహిత్యంపై సాధికారిక రచన చేసిన మద్దూరి సుబ్బారెడ్డిగారి లాంటి పరిశోధకులున్నారు. వారి రచనల్లో స్త్రీ రచయిత్రుల రచనలు నామమాత్రంగానే వున్నాయి. ఆ తర్వాతి కాలంలో స్త్రీలసాహిత్యం, స్త్రీలపత్రికలపై – స్త్రీవాదసాహిత్యం ప్రత్యేక సాహితీ ప్రక్రియగా రూపుదిద్దుకోక మునుపు– పరిశోధనలు కొనసాగాయి. కానీ, వాటిలో చాలవరకు ప్రచురణకు నోచుకోలేదు.

ప్రస్తుత గ్రంథరచయిత్రి మాటల్లో "కాలానుగుణంగా స్త్రీల ఆలోచనల పరిణామాన్ని అర్థంచేసుకోవడానికి, 1900 నుండి1947 వరకు వెలువడ్డ సాహిత్యాన్ని దశాబ్దాలవారిగా అధ్యాయాలను విభజించడమే స్వాతంత్ర్యోద్యమం నాటి స్త్రీల చరిత్రను అవగాహన చేసుకోవటానికి అనువైన విషయంగా భావించటం జరిగింది. ఈ స్త్రీలసాహిత్యమే ఒక చరిత్ర. ఆ చరిత్రయే సాహిత్యంగా విరాజిల్లింది." ఇది ఆమె అభీష్టం!

క్రీ.శ.1900 నుండి 1947 దాకా, పదిసంవత్సరాల కాలపరిధి ఒక అధ్యాయంగా మొత్తం అయిదు అధ్యాయాలుగా విభజించి ఆయా దశాబ్దాలలో వెలువడ్డ స్త్రీల రచనలను విశ్లేషించారు. ఈ క్రమంలో స్త్రీలసాహిత్యకృషి, దేశస్వాతంత్ర్యానికి అది చేసిన దోహదం చర్చించారు. ఒకవైపు స్త్రీల ఉద్యమాల్లోని విశేషాలను వివరిస్తూ మరో వైపు స్వాతంత్ర్యోద్యమ ప్రగతిని వివరించే ప్రయత్నం చేశారు. దశాబ్దాలవారిగ కాకుండా, ఉద్యమం రూపుదిద్దుకొంటున్న వివిధ దశలవారిగా అధ్యయనం చేయడం మరోపద్ధతి. కాగా, రచయిత్రి ముందు చెప్పిన పద్ధతినే ఎంచుకొన్నారు. అదలా వుంచుదాం.

విషయసంపన్నత సమృద్ధిగా వుండడం, గ్రంథం చివర 'అంజలి' శీర్షికకింద 'ఉద్యమస్త్రీలు – కారాగారవాస స్త్రీల పట్టిక' పొందుపరచడం, 'ఆనవాళ్ళు' అనే 'సాహిత్యసూచికల పట్టిక' యివ్వడం హర్షణీయం. ఇవి భావి పరిశోధకులకు ఎంతగానో వుపకరిస్తాయి. 'ఉపయుక్త గ్రంథావళి' చివర్లో యివ్వడం సముచితంగా వుంది.

ఇంతటి బృహత్తరకృషి సల్పిన డా.జంధ్యాల కనకదుర్గగారికి అభినందనలు.

హైద్రాబాద్ **డాక్టర్ వకుళాభరణం రామకృష్ణ**

*అక్టోబరు, 2020*

డాక్టర్ కాత్యాయనీ విద్మహే

# నావి నాలుగు మాటలు

డాక్టర్ జంధ్యాల కనకదుర్గ నాకు ముప్ఫయ్యేళ్లుగా తెలుసు. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పరిశోధనకు వచ్చి నాకు స్నేహితురాలు అయ్యారు. తెలుగు కథాకావ్యాలలో మహిళల జీవితం గురించి ఎంఫిల్, పిహెచ్.డి డిగ్రీల కోసం తను పరిశోధన చేసిన కాలంలో ఇద్దరం కలిసి చదువుకొనటం ఆశ్చర్యానందాలు, ఆలోచనలు పంచుకొనటం ఎప్పటికీ మరచి పోలేనివి. అధ్యయన ఉత్సాహం ఎంతో, శ్రమచేయగల శక్తి ఎంతో అంత తొందర, వేగం కూడా తన స్వభావంలో ఉన్నాయి. ఇప్పుడు ముందుమాట వ్రాయమని నాకు పంపిన 'స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి' అనే ఈ పుస్తకంలోనూ అదే కనిపిస్తుంది.

అధ్యాపక వృత్తికాలం ముగిసి విశ్రాంత జీవితం గడుపటానికి గుంటూరులో స్థిరపడి కూడా కనకదుర్గ ఎప్పుడూ విశ్రాంతిగా లేరు. సాహిత్యం చదువుతూనే ఉన్నారు. ఆలోచిస్తూనే ఉన్నారు. వ్రాస్తూనే ఉన్నారు. ప్రచురిస్తూనే ఉన్నారు. గుంటూరులో లంకా సూర్యనారాయణ గారు పూనుకొని వెంకటేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో అభివృద్ధి చేసిన లైబ్రరీ ఆమె ఆసక్తులకు ఆకర్షణ కేంద్రం అయింది. పాత పత్రికలు వరుసగా తిరగేస్తుంటే కనిపించిన స్త్రీల రచనలు ఆమెను నిలవనీయలేదు. నూట ఇరువయ్యేళ్ళ క్రితపు మహిళలల ఆలోచనలు, అభిప్రాయాలు, చరిత్ర తెలిసివస్తున్నప్పుడు కలిగే ఉద్వేగం అది.

ఆ స్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు. స్త్రీల భావజాల చరిత్ర ఏమిటి? అన్న ఆసక్తితో 2011 లో యూజీసీ మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కు పనిచేసినప్పుడు నాకది అనుభవం. 1900 నుండి 1950 వరకు అప్పటివరకు విని ఎరుగని దాదాపు అయిదువందల మంది మహిళా రచయితల రచనలలో వ్యక్తమైన వాళ్ళ ఆకాంక్షలు, ఆలోచనలు తెలిసివస్తూ స్త్రీల సాహిత్య చరిత్ర నిర్మాణ దిశగా నన్ను పురికొల్పాయి. మరింత సమాచారాన్ని సేకరించటానికి వనరులను తెలుసుకొంటూ, ఉన్న సమాచారాన్ని క్రోడీకరించుకొంటూ అప్పటి నుండి నా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాను. అటువంటి సమయంలో కనకదుర్గ సరిగా ఆ కాలపు స్త్రీల రచనలను సేకరించి వ్రాసిన ఈ పుస్తకం గురించి చెప్పారు. మరొక సాహిత్య వ్యాసాల సంకలనం కూడా

వేస్తున్నానని ఏ పుస్తకానికైనా ముందుమాట వ్రాయాలని కోరితే, నా ఆసక్తికి, లక్ష్యానికి తగినది ఇదేనని ఈ పుస్తకానికి ముందుమాట వ్రాయటానికి అంగీకరించాను.

సమాచారం సమృద్ధిగా మన చేతిలో ఉన్నప్పుడు ఎన్ని రకాల అధ్యయన విన్యాసాలకైనా అవకాశం ఉంది. 1900 నుండి 1947 వరకు వచ్చిన స్త్రీల సాహిత్యం కనకదుర్గ దగ్గర ఉన్న సరుకు. దీనిని సాహిత్య చరిత్ర ఆసక్తులతో చూసినప్పుడు చారిత్రక క్రమంలో ఒక్కొక్క రచయిత్రి రచనలను ఒకదగ్గరకు తీసుకువచ్చి విశ్లేషించవచ్చు. లేదా ప్రక్రియా పరంగా స్త్రీలు చేసిన కృషిని, సాధించిన పరిణితిని గురించి చర్చించ వచ్చు. సామాజిక ఆర్థిక రాజకీయ పరిణామాల దృష్ట్యా స్త్రీలు ఏయే పరిస్థితులకు, సమకాలీన సమస్యలకు స్పందించి రచనలు చేశారు అన్న సూత్రం ప్రాతిపదికగా విద్య, ఉద్యోగం, పెళ్ళిళ్ళు, కుటుంబజీవితం, సామాజిక ఉద్యమాలు, రాజకీయ ాద్యమాలు – ఈ రకంగా విషయపర వర్గీకరణ చేసి ఆయా సమస్యలకు సంబంధించిన స్త్రీల రచనలను అన్నిటినీ ఒక చోట క్రోడీకరించి మదింపు వేయవచ్చు.

కనకదుర్గ ఎంచుకొన్న పద్ధతి చారిత్రక పద్ధతి. 1900 నుండి ప్రతి ఒక దశాబ్దాన్ని ఒక యూనిట్ గా చేసుకొని స్త్రీలు ఎన్ని ప్రక్రియలలో ఏయే విషయాలమీద వ్రాసారో వాటన్నిటినీ వేరువేరుగా చర్చించారు. వీటన్నిటినీ కలిపే అంతః సూత్రం స్త్రీల వ్యక్తిగత స్వాతంత్రాన్ని కోరుతూ ప్రారంభమైన సంస్కరణ ఉద్యమం ఇచ్చిన చైతన్యం స్త్రీలను దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయోద్యమంలో భాగస్వాములు అయ్యేట్లు చేసిందన్న ఒక అవగాహన. ఇది చాలా కీలకమైనది. 1900 – 1947 వరకు వివిధపత్రికలలోను, విడిగా పుస్తకాలుగాను వచ్చిన స్త్రీల రచనలను సేకరించి స్త్రీల ఆలోచనలో, ఆచరణలో క్రమానుగతంగా వచ్చిన మార్పులను బేరీజు వేస్తూ ఈ పుస్తకాన్ని రూపొందించారు కనకదుర్గ. ఇంత బృహత్తర కార్యానికి పూనుకొన్నందుకు ఆమెను అభినందించాలి.

స్త్రీల సాహిత్య సృజన మేధో నైపుణ్యాల విశ్లేషణ ఈ పుస్తకానికి లక్ష్యం కాదు. స్త్రీలు ఏమి వ్రాసారో. స్వీయ అభివృద్ధికి భిన్న సామాజిక సాంస్కృతిక రంగాలలో ఉన్న అవరోధాలను గుర్తించారో, వాటిని అధిగమించే మార్గాల గురించి ఎలా ఆలోచించారో, ఏ కార్యక్రమాలను రూపొందించుకొన్నారో విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, సంఘాలలో సమీకృతం కావటం – ఈ మొదలైన మైలురాళ్లు దాటుకొంటూ రాజకీయ భాగస్వామ్యం అనే ప్రస్థానం దిశగా వాళ్ళ ప్రయాణం ఎట్లా జరిగిందో 1900 నుండి 1947 వరకు ప్రతి పదేళ్లను ఒక యూనిట్ గా చేసుకొని ఆ కాలపు స్త్రీల సాహిత్యం ఆధారంగా నిరూపించే ప్రయత్నం ఇందులో చేశారు కనకదుర్గ. అందుకు ఎక్కువగా ఉపయోగపడ్డవి ఉపన్యాసాలు, వ్యాసాలు. కథలు కవిత్వం ఆ తరువాతి స్థానం ఆక్రమిస్తాయి. నాటకాలు, నవలలు తక్కువ. తక్కువ అంటే స్త్రీలు ఆ ప్రక్రియలలో పని చేయలేదని కాదు. ఉన్నవి కూడా లభించటం కష్టంగా ఉందని. శక్తివంచన లేకుండా కనకదుర్గ స్త్రీల రచనలను

వెయ్యివరకు సేకరించి మదింపు చేసి వ్రాసిన పుస్తకం 'స్వతంత్రత నుండి .. స్వాతంత్ర్యానికి'. అందువల్ల స్త్రీల సాహిత్య చరిత్ర నిర్మాణానికి చెప్పుకో దగిన ఒక ఆకరం తయారైంది.

అర్ధశతాబ్ది కాలం మీద వచ్చిన స్త్రీల రచనలు ఏవైతే తాను సేకరించారో వాటన్నిటి సూచిక ఈ పుస్తకానికి అనుబంధంగా ఇచ్చారు కనకదుర్గ. అది ఆమె శ్రమకు నిదర్శనం మాత్రమే కాదు, స్త్రీల సాహిత్యంపై పరిశోధన చేయదలచిన వాళ్లకు ప్రథమ సమాచారం ఇయ్యగల వనరు కూడా. అలాగే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న స్త్రీల వివరాలు జిల్లాల వారీగా ఇయ్యటం బాగుంది.

సమాచార సేకరణ, సమీకరణ వరకు బాగానే ఉంది. పుస్తకరచన పద్ధతిలో సమతౌల్యం గురించి కాస్త శ్రద్ధ పెట్టి ఉంటే మరింత బాగుండేది. పునరుక్తులు, అన్వయం కుదరని వాక్యాలు సరిచేసుకొనటానికి వీలైనవే.

ఏమైనా స్త్రీల సాహిత్యం పట్ల అభినివేశంతో అరవైలలో కూడా ఇరవైలలోని ఉత్సాహ శక్తిని ఆవాహన చేసుకొని ఇంత శ్రమపడి ఈ పుస్తకాన్ని రూపొందించిన కనకదుర్గకు హృదయపూర్వక అభినందనలు. ఈనాలుగు మాటలు వ్రాయటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు.

పశ్యంతి
వరంగల్

**డాక్టర్ కాత్యాయనీ విద్మహే**
*12-3-2021*

డాక్టర్ మేడిపల్లి రవికుమార్

# దాచేస్తే దాగని సత్యాలు

పాఠ్యప్రణాళికాసంఘ అధ్యక్షులు,
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,
తిరుపతి - 517 502. ప్లవ-ఉగాది

*ఇతిహాసపు చీకటి కోణంలో*
*అట్టడుగున పడి కాన్పించని*
*కథలన్నీ కావాలిప్పుడు*
*దాచేస్తే దాగని సత్యం*

అన్నాడు మహాకవి శ్రీ శ్రీ. నిజమే ! కొన్ని సత్యాలు ఎవరెంత దాచినా దాగవు. చారిత్రక చీకటి కోణాల్లో ఎంత అట్టడుగున పడి కన్పించకుండా ఉన్నా, కావలసిన సమయం వచ్చినప్పుడు ఆ కథలన్నీ బైటకి కదలక తప్పదు. అందుకు ఎవరో ఒకరు పూనిక వహించక పోరు. ఇతిహాసాల కాలం నుంచీ ఇది క్రమం తప్పకుండా జరుగుతున్న ప్రక్రియే. ఇక్కడ ఈ విషయం ప్రస్తావించడానికి ఒక కారణం ఉంది.

భారతీయ సంస్కృతి విశిష్టమైంది. భారతీయులెవరూ దీనిని కాదనలేరు. అయితే, కొన్ని కొన్ని అంశాలపై ఒకనాడు లోకాయతులు చార్వాకులు మరోనాడు హేతువాదులు ఈనాడు భౌతికవాదులు కొన్ని ప్రశ్నలు లేవనెత్తిన సందర్భాలు లేకపోలేదు. ముఖ్యంగా సంస్కృతిలో స్త్రీ స్థానానికీ, ఉనికికీ సంబంధించి సుదీర్ఘమైన చర్చలు జరిగాయి.

పితృస్వామ్య వ్యవస్థ అన్ని పార్శ్వాలలోనూ స్త్రీని అణచి పెట్టిందనీ, స్వేచ్ఛ లేకుండా చేసిందనీ, విద్యను నిషేధించిందనీ, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోరనీ, వాటికి గుర్తింపు ఉండదనీ... ఇలా అనేక అభిప్రాయాలున్నాయి. ఒకటి రెండు సందర్భాల్లో, ఒకరిద్దరి విషయంలో కొంత మినహాయింపు ఉండొచ్చుగాని;

పై అభిప్రాయాలను పూర్తిగా అసత్యాలని కొట్టి పారేయలేం. ప్రజా పోరాటాలల్లోనూ, ప్రజాఉద్యమాలల్లోనూ ప్రజలందరూ సమష్టిగా పాల్గొన్నప్పటికీ స్త్రీలు వెనకబడి పోవడం, పురుషులు మాత్రమే ముందుండటం చరిత్రలో మనం గమనిస్తున్న వాస్తవమే! అందుకే మనకు జాతీయ నాయకులు కన్పించినంతగా జాతీయ నాయికలు అగపడరు. మహాత్ములు, మహర్షులు వంటి జాబితాల్లో మగవారు కన్పించినంతగా మహిళలు అగపడరు. ఉద్యమాల చరిత్రలలోనూ, పోరాటాల చరిత్రలల్లోనూ మాత్రమే కాదు; సాహిత్య చరిత్రలోనూ ఇదే పరిస్థితి. చరిత్రల్లో లేకపోవడం వేరు; చరిత్రలల్లో మరుగున పడటం వేరు. మొదటిది జాలిపడే అంశం. రెండోది బాధపడే విషయం.

సంస్కరణోద్యమాలలోనూ, జాతీయోద్యమాలలోనూ మనకు కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, గరిమెళ్ళ సత్యనారాయణ, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి రచయితలు అధిక సంఖ్యలోనే కనిపిస్తారు. రచయిత్రుల విషయంలో కనుపర్తి వరలక్ష్మమ్మ, బండారు అచ్చమాంబ వంటి అతి కొద్ది మంది పేర్లే వినిపిస్తాయి. అంతకు మించి పెద్దగా లేరు కాబోలు అన్న అభిప్రాయం పాఠక లోకంలో రెండు మూడు తరాలుగా స్థిరపడిపోయింది.

అయితే, చరిత్రలో దాచేస్తే దాగని సత్యాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా రచయిత్రుల విషయంలో. వాటిని ఎల్లకాలం అణచిపెట్టి ఉంచలేం. వాటిని దాటిపెట్టి ఉంచలేం. ఆ దాచేస్తే దాగని సత్యాలకోసం ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు భగీరథ ప్రయత్నం చేయకపోరు. ఆ స్వచ్ఛమైన ఊట ఉవ్వెత్తున ఎగసి పడకపోదు. ఇప్పుడా పనికి పూనుకున్నవారు డా. జంధ్యాల కనకదుర్గ గారు. ఇప్పుడు ప్రకటిస్తున్న "స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి" అన్న ఈ గ్రంథం అందుకు ప్రబల సాక్ష్యం.

క్రీ.శ. 1900 నుండి 1947 వరకు తెలుగులో వెలువడిన స్త్రీల సాహిత్యం ఈ గ్రంథంలో విశ్లేషించబడింది. ఐదు అధ్యాయాలతో, ప్రవాహ వేగంతో రూపొందించబడిన ఈ గ్రంథంలో స్త్రీల సాహిత్యాంశాలు పదుల సంఖ్యలో కాదు, వందలుదాటి కన్పిస్తాయి. అధ్యాయాల కూర్పులోనూ, విషయ విభాగంలోనూ కనకదుర్గ గారి పరిశోధనా అనుభవం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

ఈ గ్రంథం చదివిన తరువాత పాఠకులెవరూ ఈ గ్రంథం చదవక ముందున్న స్థితిలో ఉండలేరు. అనేక విషయాలు మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. గత శతాబ్ది తొలినాళ్ళలో తెలుగు నాట ఇన్ని తెలుగు పత్రికలు వెలువడ్డాయన్న సంగతి, తెలుగులో ఇంత మంది రచయిత్రులు ఉన్నారన్న విషయం మనలో చాలా మందికి కొత్తగా తోస్తుంది. ఈ రచయిత్రులెవరూ రంగవల్లిక గురించీ, రాగమాలిక గురించీ రచనలు చేసినవారుకాదు. శక్తివంతమైన జాతీయోద్యమ సాహిత్యాన్ని సృష్టించినవారు. సామాజిక సంస్కరణ గురించి ఎలుగెత్తి చాటిన వారు. స్త్రీ అస్తిత్వంకోసం, వారి ఆత్మగౌరవాన్ని స్థిరపరచడం కోసం నడుం బిగించినవారు.

ఈ అర్ధశతాబ్ది కాలంలో ఈ రచయిత్రులు చేపట్టని సామాజిక అంశం లేదు. స్వీకరించని సాహిత్య ప్రక్రియలేదు. పద్యం, గేయం, కథ, వ్యాసం, నాటిక వంటి అనేక సాహితీ ప్రక్రియలు ఈ రచయిత్రుల చేతిలో సేద తీరాయి. వీరి ప్రతిభతో చేవ తేరాయి. వీటన్నింటినీ ఒక క్రమ పద్ధతిలో అందించడంలో కనకదుర్గగారు పూర్తిగా సఫలీకృతులయ్యారు. అన్ని విషయాలు ఈ గ్రంథంలో రచయిత్రి పొందుపరచినప్పటికీ ఈ గ్రంథంలోని కొన్ని విషయాలు ప్రస్తావించకుండా ఉండలేకపోతున్నాను.

ఈనాడు స్త్రీవాద భావజాలం సమాజంపై ఎంతో కొంత ప్రభావం చూపుతూ ఉంది. పితృస్వామ్య వ్యవస్థ ప్రసాదించిన పురుషాధిపత్య భావజాలాన్ని ఎవరు ప్రశ్నించినా ఈనాడు అంతగా ఆశ్చర్యం అనిపించుకోదు. అయితే 'స్త్రీవాదం' అన్నది ఊహకు కూడా అందని రోజులలో శ్రీమతి ఆత్మూరి అన్నపూర్ణమ్మ 'కుమార సుగుణ బోధిని' అనే శతకాన్ని రచించారు. ఇందులో అన్నపూర్ణమ్మగారి భావాలు మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. (పు. 118)

*"రుసరుసలాడుచు దిట్టుచు*
*గసరుచు గోపింప సతుల గ్రక్కున వశులై*
*మసలుదురని తలపోయుదు*
*రసురుల వలె దుష్టపురుషులవని కుమారా"*

స్త్రీలను చులకనగా అంచనా వేసే పురుషులను కవయిత్రి ఎద్దేవా చేశారు. అటువంటి వారిని అసురులుతో పోల్చి చెప్పారు. కనకదుర్గ గారు చెప్పినట్టు ఆనాటికే స్త్రీలు అంతటి ధైర్యాన్ని కూడగట్టుకొని వ్యవహరించడం విశేషమే.

స్త్రీకి విద్య అవసరమన్న వాస్తవాన్ని ఆనాటి రచయిత్రులందరూ గుర్తించారు. అందు కోసం ఎంతగానో పరితపించారు. అందుకు నిదర్శనంగా

**ఈ గ్రంథంలో కనకదుర్గగారు ఆ నాటి స్త్రీల రచనలను కొల్లలుగా ఉదహరించారు**

- *వితంతువుపట్ల ఈ నాటికీ సమాజంలో చులకన భావం పూర్తిగా పోలేదు. వితంతువులు కాకపూర్వం ఏమన్నా చదువుకుంటే ఆ చదువు తప్ప, వితంతువులైన తరువాత వారిని పై చదువుకు ప్రోత్సహించడం అన్నది ఈ నాటికీ అరుదైన విషయమే. అయితే, 1910 దశాబ్దంలోనే ఎంతో మంది రచయిత్రులు వితంతువులకు విద్య ఆవశ్యకతను గుర్తించి ప్రోత్సహించిన సందర్భాలెన్నో ఉన్నాయి. స్త్రీలకు సాధారణ విద్య మాత్రమే కాకుండా వృత్తి విద్య, శాస్త్ర విజ్ఞానం ఆవశ్యకతను కూడా ఆనాటి రచయిత్రులు గుర్తించారు. ఈ విషయాన్నింటినీ కనకదుర్గ గారు వేరు వేరు సందర్భాల్లో సాధికారికంగా విశ్లేషించారు.*
- *"స్త్రీలకు ఆధ్యాత్మిక విద్యలు తెలియజేసేవారు. కానీ లౌకిక ప్రపంచజ్ఞానం మాత్రం తెలియాల్సిన అవసరం లేదని భావించి, స్త్రీలను ఇంటి బానిసలుగా మార్చిన సామాజిక సంస్కృతిని ఆ నాటి రచయిత్రులు విమర్శకు పెట్టడం జరిగింది." (పు. 69)*
- *"స్త్రీవిద్య, స్త్రీ వృత్తివిద్యలు దేశాభివృద్ధికి అవసరమని, దేశ ఆర్థికవ్యవస్థలో స్త్రీ భాగస్వామ్యానికి గుర్తింపు కలిగేలా అడుగు వేయటాన్ని స్పష్టం చేస్తుంది" (పు. 78).*
- *సాధారణ స్త్రీకే కాక వితంతువుకు కూడా వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అనుభవించే అర్హత ఉంది. ఈ విషయాన్ని రచయిత్రులు అనేక మంది ఆ నాటికే ఎలుగెత్తి చాటారు. ఆదుర్తి భాస్కరమ్మ రచించిన 'బాలికా వివాహము' అనే వ్యాసం (1913) ఈ అంశాన్ని తేట పరుస్తుంది (పు. 98).*

- మేధాశక్తిలో పురుషులకంటే స్త్రీలు తక్కువ కాదని కొందరు రచయిత్రులు తమ రచనల్లో నిరూపించారు. 'కాంచనపల్లి కనకాంబ'ను గురించిన వ్యాసం (1913) ఈ కోవకు చెందినదే (పు. 98).

- ఆనాటి కొందరు రచయిత్రులలో ఉన్న ప్రాపంచిక జ్ఞానం మనల్ని అబ్బురపరుస్తుంది. కె. కనకమ్మ 'విద్యావశ్యకత'ను గురించి ఒక వ్యాసం (1914) రాశారు. అందులో జపాను, ఫిలిప్పైన్, రష్యా వంటి దేశాలలోని స్త్రీలు విద్యను అభ్యసించడం ద్వారా ఎంతగా అభివృద్ధి చెందారో చక్కగా విశ్లేషించారు. (పు. 96). ఆనాటి రచయిత్రులు నిరంతర అధ్యయనం ద్వారా ప్రాపంచక జ్ఞానాన్ని పుష్కలంగా పొందారనడానికి ఈ వ్యాసం ఒక ఉదాహరణ.

- పితృస్వామ్య సంస్కృతిలో భాగంగా వారసత్వ సంపదకు సంబంధించిన చట్టాలు 1896 నుంచి అమలులో ఉన్నాయి. తొమ్మిది దశాబ్దాల తరువాత 1985 లో స్త్రీలకు కూడా ఆస్తి హక్కును కల్పిస్తూ చట్టం ఏర్పడింది. అయితే, ఈ చట్టం ఏర్పడకముందే తొలి నాటి రచయిత్రులు వారసత్వపు ఆస్తిహక్కు చట్టాన్ని విమర్శకు పెట్టారు. వి. సరస్వతి రచించిన 'ముద్దుకూతురు' (1933) అనే కథ ఈ విషయాన్నే చర్చించింది. కొడుకుతో పాటు కూతురుకు కూడా తండ్రి ఆస్తిలో భాగం రావడం ఆమె జన్మహక్కని న్యాయశాస్త్ర పరిజ్ఞానంతో ఆనాడే తెలియచేశారు. ఆ రచయిత్రి యొక్క క్రాంతదర్శనానికి ఈ కథ ఒక మచ్చుతునక అని కనకదుర్గగారు చక్కగా అంచనావేశారు (పు. 219).

- పాతివ్రత్యం పేరుతో మన సమాజం స్త్రీ చుట్టూ అల్లిన అనేక అంశాలను కూడా ఆ నాటి రచయిత్రులు చర్చకు పెట్టారు. వెంకాయమ్మ రచించిన 'దేవుడు' (1933) అనే కథ (పు. 220), వింజమూరి వెంకట రత్నమ్మ రచించిన 'నేటి స్త్రీ కర్తవ్యం' (1933) అనే వ్యాసం 'పతియే ప్రత్యక్షదైవం' అనే భావనను విమర్శకు పెట్టాయి. ఈ భావన మూలంగా స్త్రీలు ఎంతగా వంచింపబడుతున్నారో ఈ రచనలు నిరూపించాయి (పు. 205).

- లైంగికవేధింపులకు సంబంధించిన అంశాలుకూడా ఆనాటి రచయిత్రులు తమ రచనల్లో ఆవిష్కరించారు. తాడి నాగమ్మ రచించిన 'కథగాదు' (1935) అనే కథ ఈ అంశానికి సంబంధించిందే. స్త్రీలు ఎదుర్కొంటున్న లైంగిక సమస్యను చిత్రించడమే కాకుండా, అటువంటి సందర్భాల్లో స్త్రీలు ఆ సమస్యను ఎలా ఎదుర్కోవాలో కూడా ఈ కథ సూచించడం విశేషం (పు. 324).

- కొందరు సంస్కరణ వాదుల్లోని డొల్లతనాన్ని కూడా ఆనాటి రచయిత్రులు పట్టి చూపించారు. బులుసు ప్రకాశమ్మ రచించిన 'నీకేసి చూసినంత మంది' (1942) అనే కథ ఈ అంశానికి సంబంధించిందే. స్త్రీ స్వాతంత్ర్య వాదులమనే ముసుగులో బతుకుతున్న కొందరు కుహనా సంస్కరణవాదులు – భర్తలుగా తమ భార్యలు తమ కంటే ఉన్నతంగా గుర్తింపబడటాన్ని సహించలేకపోవడం రచయిత్రి ఈ కథలో చిత్రించారు (పు. 384).

❁ *1938 లో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు 'పాకిపిల్ల' అనే ఖండకావ్యం రాసిన విషయం మనందరికీ తెలుసు. అయితే, 1933 లోనే వింజమూరి వెంకటరత్నమ్మ 'పాకివాడు' అనే కవితను ప్రచురించారు. బహుశా ఈ విషయం మనలో చాలా మందికి తెలియదు.*

*"నెయ్యుడా ! నీవు తాకరాని నరుఁడంచు*
*శుచి యెరుఁగని వాడ వంచు జనవితతి*
*పల్క హేతువేమొకొ?..."*

*అనే ప్రశ్నతో ఈ కవిత ప్రారంభమవుతుంది. ఆనాటి హరిజనోద్ధరణలో భాగంగా ఈ గేయం వెలువడిందని స్పష్టం అవుతుంది.*

❁ *ఇలా – ఈ గ్రంథంలో తవ్విన కొద్దీ దాచేస్తే దాగని సత్యాలెన్నో ప్రతిపుటలోనూ వెలికివస్తూనే ఉన్నాయి. ఈగ్రంథం చివర రెండు విలువైన అనుబంధాలున్నాయి. ఆనాటి జాతీయోద్యమంలో భాగంగా వివిధ దశల్లో ఏయే ప్రాంతాల నుంచి ఎందరెందరు స్త్రీలు ఉద్యమంలో పాల్గొన్నారు? ఎంతెంత మంది స్త్రీలు అరెస్టుయ్యారు? ఎందరెందరు స్త్రీలు జైలు పాలయ్యారు? ఎంతెంత కాలం స్త్రీలు జైలులో మగ్గిపోయారు? అనే విషయాలు మొదటి అనుబంధం తెలియచేస్తుంది.*

❁ *రెండో అనుబంధం సాహిత్యానికి సంబంధించింది. 1900 నుండి 1947 వరకు ఎంత మంది రచయిత్రులు ఏయే అంశాలకు సంబంధించి, ఏయే ప్రక్రియల్లో రచనలను చేశారో వివరాలున్నాయి. తేదీ ప్రకారంగా ఆయా రచనలను ప్రచురించిన పత్రిక వివరాలు కూడా ఈ అనుబంధంలో పొందుపరచడం విశేషం. సుమారు 900 దాకా ఉటంకింపులున్న ఈ అనుబంధాన్ని వెలకట్టలేం.*

❁ *ఈ గ్రంథం – తొలి పేజి నుంచి అనుబంధాల చివరి పుట వరకూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒక సాహిత్య సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం. ఈ సాక్ష్యాలను సేకరించి, ఒక క్రమంలో పొందుపరచి ఈ గ్రంథరూపంలో అందించడంలో డా. జంధ్యాల కనకదుర్గ గారి శ్రమ కూడా వెలకట్టలేనిదే! ప్రతి పేజిలోనూ, ప్రతి పేరాలోనూ వారిలోని పరిశోధనా నిబద్ధత ప్రతిఫలిస్తుంది.*

❁ *చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఇంతటి విలువైన గ్రంథాన్ని వెలుగులోకి తెస్తున్నందుకు తెలుగు వారందరి పక్షాన కనకదుర్గగారికి కృతజ్ఞతలు, అభినందనలు తెలియచేస్తున్నాను.*

*ఇటువంటి విలువైన పరిశోధనా గ్రంథాలు కనకదుర్గగారి కలం నుంచి ఇంకా వెలువడవలసిన అవసరం ఉంది. గతాన్ని తెలుసుకోకుండా వర్తమానాన్ని లెక్క కట్టలేం. గతాన్నీ వర్తమానాన్నీ అధ్యయనం చేయకుండా భవిష్యత్తుకు పునాదిరాళ్ళు వేయలేం.*

# స్త్రీలసాహిత్య ప్రాముఖ్యత
## (క్రీ.శ 1900-1947)

**డాక్టర్ జె.కనకదుర్గ**

భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి భూమికయైనది సంఘసంస్కరణోద్యమం. ఆ క్రమంలోనే క్రీ.శ.1900 నాటికే స్త్రీలలో వ్యక్తిస్వాతంత్ర్యపు స్పృహ పెరిగింది. అది స్త్రీవిద్యావశ్యకతను, స్వతంత్ర జీవనావశ్యకతను గుర్తించే చైతన్యాన్ని కలిగించింది. ఆ చైతన్యమే క్రమంగా పెరిగి దేశస్వాతంత్ర్య సాధనదిశగాకూడా కొనసాగి 1947 సం. వరకు దాదాపుగా 50 సంవత్సరాలపాటు తెలుగులో స్త్రీలు వ్రాసిన వ్యాసాలు, కథలు, నాటకాలు, కవితలు, పాటలువంటి వివిధ సాహిత్యప్రక్రియలలో ప్రతిఫలించింది. స్త్రీలు వ్రాసిన సాహిత్యం కాబట్టి ఇది స్త్రీలసాహిత్యం. చారిత్రక క్రమానుగతంగా స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యం పరస్పర ఆశ్రిత, ప్రచోదకాలని గుర్తించిన స్త్రీల ఆలోచనల పరిణామశీలతను ప్రస్ఫుటం చేసింది ఈ స్త్రీలసాహిత్యం. సమాజంలో పురుషులవలె స్త్రీలు సామాజిక, ఆర్థిక, రాజకీయసమానత్వాన్ని అనుభవించగల అవకాశాలతో పాటు గౌరవప్రదమైన సామాజిక జీవనం ఉండటాన్ని స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య చిహ్నంగా ప్రతిఫలించిన సాహిత్యమిది.

స్త్రీలకు స్వాతంత్ర్యం లేకుండా చేస్తూ అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రతి సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ విషయాలను అణువణువునా విశ్లేషణకు పెడుతూ, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యసాధనకు అవసరమైన ఉద్యమచైతన్యాన్ని స్త్రీలందరిలో కలిగించటానికై చేసిన సాహిత్యసృజనయే ఈ స్త్రీలసాహిత్యం. స్త్రీల కుటుంబ సామాజిక సంబంధాల జీవితానుభవాలనుండి పుట్టి సామాజిక-సాంస్కృతిక పునర్నిర్మాణాన్ని కోరుకొన్న సాహిత్యం. సామాజిక వైరుధ్యాలను పోగొట్టి సాంస్కృతిక పరివర్తనంతో జీవితాలను పునర్నిర్మించుకోవాలని స్త్రీలు సృష్టించుకొన్న సాహిత్య సాధనం. స్త్రీల చైతన్యమే కళాసౌందర్యంగా భాసిల్లిన సాహిత్యం. స్త్రీల సమస్యలకు కారణమైన నిర్దేశిక సామాజిక సంస్కృతిని అధిగమించేటట్లు చేసిన వారి చైతన్యం, క్రియాశీలకమై సామాజిక-సాంస్కృతిక మార్పును కోరుకొని స్త్రీల విముక్తికై దారులను ఏర్పరచటాన్ని ప్రతిఫలించిన సాహిత్యం. స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యసాధనకోసం కృషిచేస్తూనే అదనంగా పురుషులతోపాటు భారతదేశానికి ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం కావాలని సమాంతర పోరాటం చేసేక్రమంలో స్త్రీలు సాంఘిక, రాజకీయ, ఆర్థిక హక్కుల చైతన్యాన్ని పొందిన క్రమాన్ని నాటి స్త్రీల సాహిత్యం ప్రతిఫలింపచేసింది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీలకర్తవ్యాన్ని, జాతీయతను ప్రబోధించి,

జాతీయాభిమానాన్ని పెంచగలిగిన సాహిత్యం ఇది. స్త్రీలు పత్రికా సంపాదకులుగా ప్రచురించిన సాహిత్యంకూడా అవటంతో మరింతగా విలువలను సంతరించుకొన్న సాహిత్యమిది. సాహిత్యచైతన్యం సాధనమైతే యుద్ధసామగ్రితో పని ఉండదని నిరూపించినది ఈ స్త్రీలసాహిత్యం.

భారతదేశస్వాతంత్ర్యోద్యమ కాలంలో ఉన్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయపరిస్థితుల నేపథ్యంలో, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యసాధనకు, దేశస్వాతంత్ర్యసాధనకై స్త్రీలలో కలిగిన భావజాల పరిణామాలను, వారి క్రియాశీల దృక్పథాన్ని ప్రతిఫలింపజేస్తూ స్త్రీలు వ్యాసాలు, కథలు, నాటకాలు, కవితలు, పాటలు పదాలవంటి వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసారు. అందుకే ఇది ఒక చారిత్రక సాహిత్యస్రవంతి. ఇది స్త్రీల కొరకు, స్త్రీలచేత, స్త్రీల యొక్క సాహిత్యంగా చరిత్రలో చోటుచేసుకోవటమే దీని ప్రత్యేకత. ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ప్రత్యేకమై, తెలుగుజాతి ఉనికికి, ప్రగతికి, స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి నిలువెత్తు సాక్ష్యం. ఈ స్త్రీలసాహిత్య చరిత్రయే. ఈ స్త్రీలసాహిత్యం ఒక సాంఘిక-సాంస్కృతిక దేశ చరిత్ర, నీతి, ఆరోగ్యం, ఆర్థికం, రాజకీయం, సమాజం, గణాంకం, పత్రికారంగం (జర్నలిజం), వాణిజ్యం, పౌర, న్యాయశాస్త్రాల పరిజ్ఞానంతో సమ్మిళితమైన సమాహార సంపూర్ణ మానవ శాస్త్రం. విలువైన మహిళాఅధ్యయన శాస్త్రంకూడా. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యం కలిసివెరసి భారతదేశ స్వాతంత్ర్యోద్యమ పతాకచిహ్నంగా భాసిల్లిన సాహిత్యం. లింగవివక్షలేని భారతదేశ రాజ్యాంగ నిర్మాణానికి రహదారులను ఏర్పరిచిన సాహిత్యమిది.

స్త్రీలయొక్క అక్షరాస్యత ఒక్కశాతంగా ఉన్నకాలంలోనే వైజ్ఞానిక పరికరాల సదుపాయాలు, ప్రోత్సాహం ఏమీలేని రోజుల్లో స్త్రీలు చైతన్యవంతులై, జాతీయ, అంతర్జాతీయ సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ పరిణామాలను గురించిన అవగాహనను ఏర్పరచుకొని, అభ్యుదయభావాలతో కూడిన తమ రచనలద్వారా తోటి స్త్రీలలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ చైతన్యాన్ని కలిగించిన సాహిత్యమిది. స్త్రీలు సాహిత్య సృజనకారులుగా ఆ నాటి సమాజానికి అవసరమైన స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యపు స్పృహను, దేశభక్తిని తమ రచనలలో ప్రతిఫలింపచేసి, జాతిని చైతన్యపరిచిన సాహిత్యమిది. స్త్రీలు తమ కాలంనాటి సాంఘిక-సాంస్కృతిక విషయాలను, ఆర్థిక, రాజకీయపరిణామాలను రచయిత్రులుగా తమ స్వభావాలలో జీర్ణించుకోవటంచేతనే ఆవిర్భవించిన సాహిత్యమిది. వ్యక్తిస్వతంత్రపు విలువ, దేశ స్వాతంత్ర్యపు విలువలను స్త్రీలు గ్రహించుకోగలిగే చైతన్యాన్ని అందించగల సాహిత్యంకూడా.

ఈ సాహిత్యం ఆధునిక ఆంధ్రస్త్రీల అభివృద్ధి చరిత్ర, సామాజిక వాస్తవిక చరిత్ర కూడా. ఈ స్త్రీలసాహిత్యం చరిత్రగానూ, చరిత్ర సాహిత్యంగానూ భాసిల్లి ప్రయోగాత్మకంగా నిరూపింపబడిన సామాజికశాస్త్రం. సమాజమనే ప్రయోగశాలలో మథించగా ఉద్భవించిన సజీవసాహిత్యం. వాస్తవిక

చైతన్యంతో సామాజిక ఫలితాలను నిరూపించిన సాహిత్యంకూడా ఇది. స్త్రీలు సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగటానికి ఉపయోగపడే వివిధ సాహిత్య ప్రక్రియారచనల సమాహారం ఈ స్త్రీలసాహిత్యం. స్త్రీలయొక్క సామాజిక సంబంధాలలోనుండి పుట్టిన సాహిత్యం ఇది. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యసాధనా సాహిత్యంగా నాటి యుగధర్మాన్ని ప్రతిఫలించింది. తరతరాల స్త్రీల అభివృద్ధికి ఉపయోగపడే ఒక చుక్కాని. స్త్రీలసమస్యలకు పరమౌషధం. ఆధునిక మహిళాచైతన్యానికి అడుగులు ఆనాడే పడ్డాయని తెలియచేసే సాహిత్యం. నేటి మహిళా సంఘాల ఆశయసిద్ధికి కరదీపికగా ఉన్న సాహిత్యమిది. అటువంటి స్త్రీలసాహిత్యసృజనకు కారణమైన ప్రేరణాంశాలను గ్రహింపుకు తెచ్చి తమలోకి తాము తొంగి చూసుకొనేటట్లు చేసే సాహిత్యం ఇది.

ప్రస్తుత ప్రపంచీకరణ సందర్భంలో ఆర్థిక-రాజకీయ, సామాజిక-సాంస్కృతిక చలనసూత్రాల ప్రభావంతో అతలాకుతలమవుతున్న ప్రజాజీవనసమస్యలకు ఈ సాహిత్య వ్యాసాలలో, కథలలో పరిష్కారాలను చూపించిన మార్గదర్శక సాహిత్యం ఇది. మానవీయ విలువలతో కూడినది ఈ స్త్రీలసాహిత్యం. నేటియువత స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యాన్ని గౌరవిస్తూ, దేశస్వాతంత్ర్య సంరక్షణకై పూనుకొనేటట్లుగా ఈ స్త్రీలసాహిత్య అధ్యయనం మరింత స్ఫూర్తినిస్తుంది. అమెరికాలోని ప్రపంచప్రసిద్ధి పొందిన 'స్వేచ్ఛాచిహ్నం'లో ప్రతిఫలించే 'స్త్రీలచదువు ప్రపంచానికి వెలుగు' అన్న భావనను గుర్తుకువచ్చేటట్లు చేస్తుంది.

ఈ స్త్రీలసాహిత్యం 1900 నుండి1947సం.ల వరకు పుంఖానుపుంఖాలుగా వచ్చినప్పటికి నేటికీ విస్మృతసాహిత్యంగా ఉండటం దురదృష్టం. విస్తృతమై, విస్మృతమైన స్త్రీలసాహిత్యంలో నిక్షిప్తమైన ఆ నాటి స్త్రీల ఉద్యమ భావజాలాన్ని, దాని పరిణామశీలతను తొలిసారిగా వెలుగులోకి తేవటానికి చేసిన ప్రయత్నఫలితమే ఈ 'స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి' అనే పుస్తకం. ఉవ్వెత్తున ఎగసిపడిన వారి విస్తృత చైతన్యాన్ని భారతదేశపు 75వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా స్మరించుకొనేటట్లు చేసే రచన ఇది.

గుంటూరు **డాక్టర్ జంధ్యాల కనకదుర్గ**

*15-04-2021*

# అంతరంగం...

క్రీ.శ. 1900–1947 వరకు వచ్చిన స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి స్త్రీలసాహిత్యచరిత్రను పరిశీలించే క్రమంలో స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యసాధన, దేశస్వాతంత్ర్యసాధన పరస్పర ప్రచోదకాలుగా ఉన్న విషయం గ్రహింపుకు వచ్చింది. అందుకని ఆధునికయుగంలో భారతదేశస్వాతంత్ర్యానికి పూర్వం రచింపబడి విస్మృతమై, విస్తృతంగాఉన్న స్త్రీలసాహిత్యాన్ని సేకరించి, దేశంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ చలనసూత్రాల ప్రభావంతో స్త్రీలలో కలిగిన ఆలోచనలలోని పరిణామశీలతను వెలుగులోకి తేవాలనిపించింది.

భారతదేశంలోని సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక–రాజకీయ పరిణామాల నేపథ్యంలో వచ్చిన ఆ నాటి స్త్రీలసాహిత్యాన్ని చారిత్రక సంఘటనల దృష్టితో, దశాబ్దాలవారిగా సాహిత్యప్రక్రియాపరంగా విభజించటం జరిగింది. ఆ పదేళ్ళకాలంలో వచ్చిన స్త్రీలసాహిత్యంలో వివిధప్రక్రియాపరంగా ఆ యా రచయిత్రుల రచనలను ఒకచోటకుచేర్చి, వారి సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీల ఆలోచనలు, వాటియొక్క పరిణామశీలతను వెలికి తీయటం జరిగింది. చారిత్రక పద్ధతిద్వారా దేశచరిత్రకు, స్త్రీల అభివృద్ధిచరిత్రకు సంబంధంఉన్న స్త్రీలఉద్యమభావజాలంయొక్క క్రమపరిణామశీలతను వెలికితీసి, వారు స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై చేసినకృషిని, దేశస్వాతంత్ర్యసాధనలో భాగస్వాములయిన విషయాన్ని తెలియచెయ్యాలనిపించింది. నాటి సృజనకారులుగా తెలుగుప్రాంతాలలోని స్త్రీలు ఎక్కడికక్కడ సమాంతరంగా సామాజిక భావాలను ప్రతిబింబిస్తూ వ్రాసే క్రమంలో పునరుక్తిభావాలు చోటుచేసుకున్నా కూడా రచయిత్రులందరు తమ తమ స్థాయిమేరకు తోటి స్త్రీలలో కలిగించిన సాహిత్యచైతన్యాన్ని తెలియజేయాలనిపించింది. ఎంతో విలువైన ఈ స్త్రీలసాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చే ధ్యేయంముందు ఈ పుస్తకంలోని పునరుక్తులుకూడా అల్పవిషయంగా అనిపించక తప్పదు.

పాఠశాలలో ఈ స్త్రీల సాహిత్యాన్ని పాఠ్యాంశంగా పెట్టినట్లైతే నేటికీ స్త్రీలు వెనకబడి ఉండేవారు కారనీ. పురుషులలో కూడా సంస్కారం ఏర్పడి స్త్రీలను గౌరవించాల్సిన అవసరాన్ని వారు గుర్తించేవారనీ స్త్రీ, పురుష సమానత్వం కొంతవరకూ సాధ్యమయ్యేదని అర్థం అవుతుంది.

100 సం.క్రితంనాటి పాతపత్రికలలోని ఈ సాహిత్యం అందరికి అందుబాటులో ఉన్నా లేకపోయినా, పాఠకుల అవగాహనకై సుమారు 4 నుండి 10 పేజీలవరకు రచయిత్రులు వ్రాసిన సాహిత్యవిషయ సారాంశాన్ని క్లుప్తంగా పేర్కొనటం జరిగింది. అందుకనే ఈ పుస్తక రచనాక్రమంలో అవసరంమేరకు సాహిత్యాంశాన్ని విపులీకరించి, ప్రతి రచనకు చివరిలో దానికి సంబంధించిన విషయ విశ్లేషణ, విమర్శ, వ్యాఖ్యానంతోపాటు కీలకమైన స్వీయ ప్రతిపాదనలు చేయటం జరిగింది. ఆ యా దశాబ్దాలలో వచ్చిన సాహిత్యంలోని వ్యాసాలు, కథలు, నాటకాలు, కవితలను క్రమానుగతంగాకూర్చి ప్రతి ప్రక్రియాపరమైన విభాగానికి చివరిలోను, ఆ దశాబ్దంలో వచ్చిన మొత్తం సాహిత్యానికిని ముగింపును ఇస్తూ, ఆ పదేళ్ళ కాలపరిధిలో స్త్రీలలో కలిగిన సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ భావపరిణామశీలతను, చైతన్యాన్ని ప్రత్యేకంగా పేర్కొనటం జరిగింది.

ఆధునికయుగంలో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'ఆంధ్రకవయిత్రులు' అనే గ్రంథంలో స్వాతంత్ర్యానికి పూర్వమున్న కొంతమంది కవయిత్రులను ఆమె పేర్కొన్నారు. వేళ్ళమీద లెక్కపెట్టగలిగే విధంగా అక్కడక్కడా రచయిత్రులను మరికొంతమంది గుర్తించినా, విస్తృతమైనది ఈ ఉద్యమసాహిత్యం అనే దృష్టితో ఈ స్త్రీల సాహిత్యాన్ని గురించిన పరిశోధనా ప్రచురణ ఇంతకు మునుపు రాలేదు.

1900 నుండి 1947 సం.ల మధ్యకాలంలో రచింపబడిన స్త్రీలసాహిత్యాన్ని పరిశోధించే క్రమంలో అనేకమంది రచయిత్రులను, రచనలను నేను గుర్తించినప్పటికీ, వారిలో స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యసాధనా ధ్యేయంతో వ్రాసిన రచయిత్రుల రచనలను మాత్రమే స్వీకరించి ఈ పుస్తకంలో పేర్కొనటం జరిగింది. స్త్రీలసాంఘిక, ఆర్థిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిఫలింప చేసినటువంటి లభ్యమైన సాహిత్యాన్ని పరిశీలించి వ్రాయటం జరిగింది. నాటి స్త్రీలు వ్రాసిన ఉద్యమసాహిత్యాన్ని తొలిసారిగా వెలుగులోకి తీసుకొచ్చి, **'స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి'** అనే పుస్తకరూపంలో ప్రచురించే అవకాశం నాకు లభించినందుకు సంతోషిస్తూ, ఈ స్త్రీలసాహిత్య సృజనకారులందరికీ నా వందనాలు తెలుపుకుంటున్నాను. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఉద్యమ భాగస్వాములుగా జైలుశిక్షలను అనుభవించి అమరజీవులైన మహిళలత్యాగాన్ని స్మరించుకుంటూ వారికి అంజలి ఘటిస్తున్నాను.

అభ్యర్థనమేరకు ఈ పుస్తకానికి ముందుమాటలు వ్రాసి నా ప్రయత్నాన్ని అభినందించిన, బహుగ్రంథరచయిత,హైద్రాబాద్ లోని కేంద్రీయవిశ్వవిద్యాలయంలో చరిత్రవిభాగపు పరిశోధకులుగా విద్యార్థులను తీర్చిదిద్దిన పూర్వఆచార్యులు డా.వకుళాభరణం రామకృష్ణగారికి నమస్సులతో కృతజ్ఞతలు.

గతఏడాది ఈ రచనకు ముందుమాటలు వ్రాయాలని కోరుతూ పుస్తకాన్ని పంపినప్పుడు నిర్మాణాత్మక సూచనలు చేసి ప్రోత్సహించిన బహుగ్రంథ రచయిత్రి, ప్రసిద్ధ స్త్రీవాద విమర్శకులు,

కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు గ్రహీత, పరిశోధనలలో ప్రచోదకశక్తి, కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వఆచార్యులు డా.కాత్యాయినీ విద్మహేగారు నాయందుండే అభిమానంతో నాలుగు మాటలు వ్రాసి నన్ను అభినందించినందుకు ఆమెకు సదా కృతజ్ఞతాభివందనాలు.

అడిగిన వెంటనే 'దాచేస్తే దాగని సత్యాలు' అంటూ కూలంకషంగా గ్రంథాన్ని అవగాహనచేసుకొని రచనకు ఉన్న క్రొత్తవిలువలను నిజాయితీతో గుర్తించి, పాఠకచైతన్యాన్ని కలిగించిన సాహితీవేత్త,బహుగ్రంథరచయిత, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆచార్యులు డా. మేడిపల్లి రవికుమార్ గారికి వందనపూర్వక కృతజ్ఞతలు.

నేను రెండేళ్ళక్రితమే ఈ పుస్తకరచనకు పూనుకొని శిథిలావస్థలో ఉన్న వందేళ్ళనాటి పాతపత్రికలను తిరగేస్తుంటే, నా కష్టాన్ని చూడలేక అరచేతిలో ఇమిడిపోయే విధంగా డిజిటల్ సాంకేతికరూపంలో పత్రికలను అందించి, సులభతరంచేసి ఈ రచనకు దోహదశక్తియై నన్ను కృతకృత్యులనుచేసిన గుంటూరులోని అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయ వ్యవస్థాపక నిర్వాహకులు శ్రీ లంకా సూర్యనారయణగారికి కృతజ్ఞతాభివందనాలు చెప్పటం నాబాధ్యత.

ఈ పుస్తక రచనలో తన సంపూర్ణ సహకారాలు అందించిన జీవితసహచరులు శ్రీఎమ్.వి.శాస్త్రికి, (సింగరేణి ప్రభుత్వ కంపెనీ, విశ్రాంత అధికారి) సాంకేతికంగా ముఖచిత్రాల రూపకల్పన చేసియిచ్చిన ఆత్మీయ సోదరుడు జె.వి.ఎస్.వి ప్రసాద్ కు (బి.ఎస్.ఎన్.ఎల్, విశ్రాంత ఇంజనీర్), తదితర కుటుంబసభ్యులకు, ప్రత్యక్షంగాగాను పరోక్షంగాగాను ప్రోత్సహించి, తమ సహాయసహకారాలను అందించిన సాహితీ మిత్రులకు, సాంకేతిక సహకారులకు కృతజ్ఞతలు.

పుస్తకం తీర్చిదిద్దడంలో ఎంతో సహకరించిన 'మనసు ఫౌండేషన్' రాయుడు గారికి, కవర్‌పేజికి సహకరించిన గిరిధర్ గారికి కృతజ్ఞతలు.

సకాలంలో సంతృప్తికరంగా ముద్రించి యిచ్చిన శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు గారికి అభినందనలతో కూడిన కృతజ్ఞతలు చెప్పుకోవటం నా కర్తవ్యం.

**డాక్టర్ జంధ్యాల కనకదుర్గ,**
**విశ్రాంత ప్రిన్సిపాల్.**
*(సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం,)*

గుంటూరు
*15-04-2021.*

# స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి

## (తెలుగులో స్త్రీల సాహిత్యం క్రీ.శ.1900-1947)

### అనుక్రమణిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట - ఆచార్య వకుళాభరణం రామకృష్ణ | - | V |
| | నావి నాలుగు మాటలు - ఆచార్య కాత్యాయనీ విద్మహే | - | VII |
| | దాచేస్తే దాగని సత్యాలు - ఆచార్య మేడిపల్లి రవికుమార్ | - | X |
| | స్త్రీలసాహిత్య ప్రాముఖ్యత (1900-1947) - జంధ్యాల కనకదుర్గ | - | XV |
| | అంతరంగం | - | XVIII |
| 1. | సంఘసంస్కరణోద్యమం-ఆధునికయుగంలో స్త్రీలసాహిత్యావిర్భావం - వికాసం | - | 1 |
| | 1.1. స్త్రీల సాహిత్య ఆకరాలు | - | 4 |
| | 1.2. సారస్వత సమాచారం | - | 6 |
| | 1.3. స్త్రీల సాహిత్య వికాస పూర్వరంగం | - | 10 |
| | 1.4. స్త్రీల స్వతంత్రత - దేశస్వాతంత్ర్యం | - | 15 |
| 2. | సాహిత్యము - (క్రీ.శ.1900-1909) - స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్యోద్యమం స్త్రీవిద్య - వందేమాతరం ఉద్యమం - సాంఘిక సాంస్కృతిక చైతన్యం | - | 21 |
| 3. | సాహిత్యము - (క్రీ.శ.1910-1919) - హోమ్‌రూల్ ఉద్యమం 1919 చట్టం - స్త్రీ, పురుషసమానత్వము - స్త్రీల సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కుల చైతన్యం | - | 65 |

| | | | |
|---|---|---|---|
| 4. | సాహిత్యము – (క్రీ.శ.1920–1929) సత్యాగ్రహోద్యమం<br>సహాయనిరాకరణ – స్త్రీల ఆర్థికస్వావలంబన –<br>దేశ స్వరాజ్యోద్యమ చైతన్యం | – | 125 |
| 5. | సాహిత్యము (క్రీ.శ1930–1939) శాసనోల్లంఘనఉద్యమం<br>భారతదేశ ప్రభుత్వ చట్టము | | |
| | 5.1. (అ) (క్రీ.శ.1930–1934) ఉప్పుసత్యాగ్రహము –<br>లోకల్ బోర్డులలో స్త్రీల భాగస్వామ్యం | – | 173 |
| | 5.2. (ఆ) (క్రీ.శ.1935–1939) భారతదేశ ప్రభుత్వచట్టం – ఎన్నికలు<br>స్త్రీల రాజకీయ సాధికారికత – మహిళాహక్కుల<br>న్యాయచైతన్యం – బిల్లులు | – | 256 |
| 6. | సాహిత్యము (క్రీ.శ.1940–47) క్విట్ఇండియా ఉద్యమం –<br>'సాధించు–మరణించు' నినాదం – బ్రిటిష్ వారి నిష్క్రమణం –<br>భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన | – | 348 |
| 7. | సాహిత్యము–( క్రీ.శ.1947) –<br>భారతదేశ స్వాతంత్ర్య చట్టము – దేశ స్వాతంత్ర్యసిద్ధి | – | 400 |
| 8. | సాహిత్యం – స్వాతంత్ర్యమహోత్సవము 15–8–1947 | – | 408 |
| 9. | అమూల్యం – స్త్రీల సాహిత్యం (క్రీ.శ.1900–1947) | – | 413 |
| 10. | అనుబంధం | | |
| 10.1. | అంజలి (ఉద్యమ స్త్రీలు – కారాగారవాస స్త్రీల వివరాల పట్టిక) | – | 416 |
| 10.2. | ఆనవాళ్ళు – (ఉపయుక్త సాహిత్య సూచికలు) | – | 430 |

# 1. సంఘసంస్కరణోద్యమం - ఆధునికయుగంలో స్త్రీలసాహిత్యావిర్భావవికాసాలు

భారతదేశంలోని స్వాతంత్రోద్యమం ఆధునికయుగానికి నాంది పల్కింది. 1860-70ల తరువాతి కాలాన్ని ఆధునికయుగం అని భావించటం పరిపాటి. ఉద్యమ ప్రారంభకాలంలోనే స్వాతంత్ర్యసాధనకు సాంఘిక సంస్కరణలు అవసరం అవటంతో దానికి సాధనమైన సాహిత్య సంస్కరణ కూడా జరగాలనే గ్రహింపు కలిగింది. స్త్రీలు, పురుషులు ఐకమత్యంతో స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలంటే స్త్రీవిద్య, స్త్రీల భావప్రకటనస్వేచ్ఛ, స్త్రీలస్వతంత్రత అవసరమని భావించారు. స్త్రీలవిద్యను అభివృద్ధిపరచాలనుకొని బాల్యవివాహాలవంటి సాంఘిక దురాచారాలను రూపుమాపే దిశగా అడుగులువేసే క్రమంలో స్త్రీలలో, పురుషులలో చైతన్యాన్ని కల్గించాల్సిన అవసరాన్ని గుర్తించటంతో సాహిత్యంలో నూతనశకం ప్రారంభమైంది.

బ్రిటిష్ ప్రభుత్వము, సంఘసంస్కర్తలు ఏర్పాటుచేసిన బాలికాపాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించిన స్త్రీలు సమాజంలోను తోటి స్త్రీలలో కలగాల్సిన స్వీయసంస్కరణకై తగిన చైతన్యాన్ని కలిగించే విధంగా సాహిత్యసృజనకు పాదులు త్రవ్వారు. ఆధునికయుగంలో 1896 లో వేమూరి శారదాంబ స్త్రీవిద్యను ఆటంకపరుస్తున్న సామాజిక కుటుంబ సంస్కృతిని ప్రశ్నించటంగా వ్రాసిన మాధవశతకం అనే రచనతో స్త్రీలసాహిత్యావిర్భావం జరిగింది. ఆ దశలోనే స్త్రీలలో శక్తిసామర్థ్యాలు ఉన్నాయనే స్పృహను, ఆత్మవిశ్వాసాన్ని పెంచటానికి భారతదేశ చారిత్రక స్త్రీల కథలను 1898లో భండారు అచ్చమాంబ 'అబలాసచ్చరిత్ర రత్నమాల' అనే వచన గ్రంథాన్ని రచించింది. స్త్రీలచేత సృజింపబడిన సాహిత్యం కాబట్టి ఇదిస్త్రీలసాహిత్యం.

క్రీ.శ.1900 నుండి స్త్రీలలో వ్యక్తిస్వాతంత్ర్యచైతన్యాన్ని కలిగించే విధంగా స్త్రీలు సాహిత్యాన్ని సృజించారు. స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై స్త్రీలయొక్క విద్యావివాహ స్వాతంత్ర్యం, ఆర్థిక స్వావలంబన, దేశాభివృద్ధి, రాజకీయసాధికారికత వంటి విషయాలలోను, సమాంతరంగా దేశస్వాతంత్ర్యసాధనకు స్త్రీలను చైతన్యపరిచేవిధంగాను వివిధసాహిత్యప్రక్రియలలో సాహిత్యాన్ని

వ్రాసారు. ఆ క్రమంలోనే 1900 నుండి ఈ స్త్రీలసాహిత్యం వికాసదశను అందుకొంది. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యసాధనకు, దేశస్వాతంత్ర్యసాధనకు అవసరమైన ఉద్యమచైతన్యాన్ని స్త్రీలందరిలో కలిగించటానికై చేసిన సాహిత్యసృజనయే ఈ స్త్రీలసాహిత్యం.

దేశజాతీయోద్యమ కాలంనాటి పత్రికలలో స్త్రీలు వ్రాసిన వ్యాసాలు, కథలు, నాటకాలు, కవితలు, నవలలు, పాటలు స్వీయచరిత్రలు, జీవితచరిత్రలువంటివి పుంఖానుపుంఖాలుగా కనపడటం విస్మయాన్ని కలిగించే విషయం. అంత విస్తృతంగా వచ్చిన స్త్రీలసాహిత్యం విస్మృత సాహిత్యంగా మరుగునపడి ఉండటం విచారకరం. పెన్ను, పేపరు, లైట్లకాంతి అరుదుగా లభించే రోజుల్లో, ఇంటిపనులతో సతమతమవుతూనే తీరిక చేసుకొని, స్త్రీలు తాము చదువుకున్న ఇంటిబడి చదువుకు తమ మేధాశక్తిని జోడించి, పరిశీలనాజ్ఞానంతో పదునుపెట్టి సాహిత్యసృజన చేయటం మరింత ఆశ్చర్యకరం. క్రియాశీల దృక్పథంతోకూడిన రచనలుచేసి సమాజంలోని స్త్రీలను చైతన్యవంతులుగా చేయాలనుకోవటం స్ఫూర్తినిచ్చే విషయం.

సాహిత్యంద్వారా స్త్రీలు తమ అభిప్రాయప్రకటన చేయగలగటమే స్త్రీల స్వతంత్రతకు చిహ్నం. అక్కడనుండి ప్రారంభమైన స్త్రీలస్వతంత్రతయే దేశస్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలను పాల్గొనేటట్లుచేసింది. అందుకే ముందుగా స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉండాలనుకొన్నారు. దానికై స్త్రీవిద్యాభివృద్ధి జరగాలనుకొన్నారు. బాలికా పాఠశాలలలో స్త్రీలు కాస్తో కూస్తో విద్యావంతులు కాగలిగినవారు, తోటిస్త్రీలు కూడా విద్యావంతులు కావాల్సిన అవసరాన్ని గుర్తించారు. అవసరాలను గుర్తించటం ఒకఎత్తు, అయితే ఆ అవసరాలను నెరవేర్చుకోవటానికి ఆలోచనలను పెంచుకొని, క్రియాశీలదృక్పథాన్ని రూపొందించుకోవటం మరియొక ఎత్తు. స్త్రీల విద్యకు ఆటంకప్రాయమైన దురాచారాలవంటి సామాజికసంస్కృతిపట్ల విముఖత్వం కలిగే విధంగా స్త్రీలలో చైతన్యం కలిగించటానికై సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నారు. స్త్రీలకు స్వాతంత్ర్యం లేకుండా చేస్తూ అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రతి సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక–రాజకీయ విషయాలను అణువణువునా విశ్లేషణకు పెడుతూ, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యసాధనకు అవసరమైన ఉద్యమచైతన్యాన్ని స్త్రీలందరిలో కలిగించటానికై చేసిన సాహిత్యసృజనయే ఈ స్త్రీలసాహిత్యం

స్త్రీల విద్యాభివృద్ధికై తమ పెళ్ళికి మునుపు 3,4 తరగతుల వరకు చదువుకున్న స్త్రీలు ముందుకు వచ్చి, ఆడపిల్లలకు చదువు చెప్పించాల్సిన అవసరాన్ని ప్రచారం చేయటానికి సాహిత్యసృజన చేసారు. ఆ క్రమంలోనే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందగలమని అనుకొన్నారు. స్త్రీలు పురుషులు అనుభవిస్తున్న స్వాతంత్ర్యాలలోని తేడాను గ్రహించారు. స్త్రీలు విద్యాప్రాముఖ్యతను గురించి ఎక్కడికక్కడ తాము ఏర్పాటుచేసుకొన్న స్త్రీసమాజాలలో ఉపన్యసిస్తూ, నాటకాలు, కథలు, వ్యాసాలను వ్రాసి, వాటి యొక్క ప్రచురణకై స్త్రీలు సంపాదకత్వాన్ని కూడా వహించారు. తోటిస్త్రీలలో చైతన్యాన్ని కలిగించటానికి స్త్రీలు తమ ఆధ్వర్యంలో పత్రికలను ప్రారంభించారు.

విద్యతో స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందగలమని అనుకొన్న క్రమంలోనే స్త్రీలు పురుషులు అనుభవిస్తున్న స్వాతంత్ర్యాలలోని తేడాను గుర్తించగల స్త్రీల చైతన్యాన్న నాటి స్త్రీలసాహిత్యం

ప్రతిఫలింపచేసింది. సమాజంలోని లింగవివక్షా సంస్కృతిని గుర్తించి, స్త్రీలు, పురుషులు సమానమనే భావన కలిగే టట్లుగా స్త్రీలు సాహిత్యాన్ని సృష్టించారు. ఆ సాంఘిక చైతన్యమే స్త్రీలు సామాజిక కుటుంబాలలోని తమ అస్వతంత్ర జీవనానికి కారణమైన సూక్ష్మాతిసూక్ష్మ అంశాలను గుర్తించేటట్లు చేసి, సాంఘిక-సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ సమానత్వ సాధన దిశగా సాగింది. పురుషులతో పాటు తాము సమానమేనని, తమకు సమాన హక్కులున్నాయనీ. వారివలె తాము స్వతంత్రులమేనని, స్త్రీలస్వతంత్ర్యం కోసం స్త్రీలే పాటుపడాలనీ భావించారు.

స్త్రీల సాంఘికచైతన్యాన్ని ప్రతిఫలింపజేసిన స్త్రీలసాహిత్య సృజనయే స్త్రీలలో అభ్యుదయాన్ని కలిగించి స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి ఉన్నసంబంధాన్ని గ్రహించేటట్లు చేసింది. స్త్రీలు కాస్త చదువుకుని పత్రికాపఠనం చేయటంతో వారికి పాశ్చాత్యదేశాల పరిజ్ఞానం ఏర్పడింది. దానితో తోటి స్త్రీలలో రాజకీయ చైతన్యం కలగాల్సిన అవసరాన్ని గుర్తించారు. తోటి కుటుంబస్త్రీలలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్య చైతన్యాన్ని కలిగించే దిశగా సాహిత్యసృజన చేసి స్త్రీలను చైతన్యపరచటం నేటికీ విస్మయం కలిగించే విషయం. ఈనాటి స్త్రీవాదోద్యమానికి నాడే స్పష్టమైన అంకురాలు మొలకెత్తాయనీ, వాటి వృక్షచ్ఛాయలు నేటికీ స్త్రీజాతికి గొడుగుపడ్తున్నాయని నాటి స్త్రీలసాహిత్యపఠనం వల్ల అర్థం అవుతుంది.

స్త్రీల స్వతంత్రజీవనానికి ఆర్థికస్వావలంబన అవసరమని భావించిన స్త్రీలు ఆ దిశగా కృషిచేస్తూ, పురుషులతోపాటు సమానంగా జీవించటానికై రాజకీయ స్వాంతంత్ర్యంకూడా కావాలని ఆలోచించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీల సాంఘిక, ఆర్థిక, రాజకీయజీవితానికి ఆటంకప్రాయంగా ఉన్న అన్నివిషయాలలోని సమస్యలను అన్నికోణాలనుండి విశ్లేషించుకుంటూ, విమర్శించుకుంటూ పరిష్కారానికి తగిన చైతన్యం తెచ్చుకోవటాన్ని నాటి స్త్రీలసాహిత్యం ప్రతిఫలించింది.

స్త్రీలసాహిత్య ఫలితంగా స్త్రీలు ముందుగా సాంఘికచైతన్యం తెచ్చుకొని, తమ వ్యక్తిస్వాతంత్ర్యానికై అవసరమైన జీవనస్వతంత్రతను తామే తెచ్చుకొని రాజకీయచైతన్యాన్ని ప్రోదిపుచ్చుకొని, ఉద్యమభాగస్వాములై దేశస్వాతంత్ర్యానికి పాటుపడ్డ విషయంకూడా స్త్రీలసాహిత్యంలో నమోదు అయింది. స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకత నాటి స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చి మూలకందమై నిలిచింది. స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యోద్యమంతోపాటు సమాంతరంగా దేశ స్వాతంత్ర్యోద్యమంలోకూడా భాగస్వాములయిన విషయం అర్థమవుతుంది.

దేశస్వాతంత్ర్య సాధనలో స్త్రీలు ఇంటినుండి బయటకు వచ్చి జాతీయోద్యమంలో పాల్గొనటం జరిగింది. ఆనాడున్న పరిస్థితులలో కుటుంబ బంధనాలను, ఆంక్షలను అధిగమించి స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనటం ఒక ప్రత్యేకత. స్త్రీలు సాహిత్య సృజనతో తోటి స్త్రీలలో స్వతంత్ర భావాలను, దేశభక్తి చైతన్యాన్ని రగిలించారు. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్య సాధనలో నాటి స్త్రీల భాగస్వామ్యం అర్థమయితేనే నేటికీ స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలనే చైతన్యానికి, దేశస్వాతంత్ర్యసంరక్షణకి ఉన్న మౌలికత అర్థం అవుతుంది. జాతీయోద్యమంలో తమ జీవితాలను

పణంగాపెట్టి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన స్త్రీలు, పురుషులు చిరస్మరణీయులు. భారతదేశ స్వాతంత్ర్య సాధనలో సాంఘికసంస్కరణలు, సత్యాగ్రహం, సహాయనిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘనం, క్విట్ ఇండియా ఉద్యమాలు ప్రధాన ఘట్టాలు. భారతదేశంలోని ఆర్థిక, రాజకీయ పరిణామాలకు అనుగుణంగా స్త్రీలు చైతన్యవంతులు కావటానికి వివిధ ప్రక్రియలతో కూడిన సాహిత్యాన్ని సృజించటంచేతనే దేశస్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు భాగస్వాములు కాగలిగారు. అందుకే స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి తగిన చైతన్యాన్ని కలిగించటమే నాటి స్త్రీలసాహిత్య ప్రధాన ఆశయంగా స్పష్టమవుతుంది. స్త్రీలయొక్క అభివృద్ధి రాజకీయ చైతన్యంతో ముడిపడి ఉంటుందని భావించి శాసనసభ్యురాండ్రుగా శాసనసభలలో చేయాల్సిన చట్టాలను వివరించారు.

స్త్రీసమాజాలు అఖిలభారత మహిళాసభల స్థాయివరకు విస్తరించి, స్త్రీవిద్య, స్త్రీల హక్కులు, స్త్రీల స్వతంత్ర జీవనం, శాసనసభ్యత్వం గురించి చేసిన ఆలోచనల పరిణామశీలత ఫలితంగానే స్త్రీలు ఉద్యమంలో భాగస్వాములవటంతో దేశస్వాతంత్ర్య సాధన సాధ్యమయిందన్న విషయాన్ని ఈ సాహిత్యం ప్రతిఫలింపచేసింది. ఆధునికయుగంలో ఈ స్త్రీలసాహిత్యమే నేటి స్త్రీల జీవనస్వాతంత్ర్య చరిత్రగా అర్థమవుతుంది. దేశస్వాతంత్ర్యోద్యమ చరిత్రకు స్వావలంబన కూడా. శ్రీశ్రీ అన్నట్లుగా చరిత్ర అంటే మానవ జీవన వికాసం సాధించిన పరమార్థం అని భావిస్తే స్త్రీలఅభివృద్ధి సాధించిన దేశస్వాతంత్ర్యాన్ని ప్రతిఫలింపచేసిన స్త్రీలసాహిత్యచరిత్ర యిది.

ఈ స్త్రీలసాహిత్యం క్రియాశీలకమైన సామాజిక వాస్తవ చైతన్యాలను ప్రతిఫలింపచేసిన చారిత్రక-సాంఘిక ప్రయోగాత్మక సాహిత్యం. భారతదేశపు పారతంత్ర్యపాలనయొక్క విముక్తి ఉద్యమ సమయంలో స్త్రీలకోసం, స్త్రీలచేత, స్త్రీలయొక్క సాహిత్యసృష్టి జరిగింది. దాని ఫలితంగా ఏర్పడిన సాంఘిక చైతన్యముతో కూడిన స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, జాతీయోద్యమ స్వాతంత్ర్యకాంక్షతో కలిసి వెరసి స్త్రీలు భారతదేశ స్వాతంత్ర్యోద్యమ భాగస్వామ్యాన్ని వహించగలగటంతో దేశస్వాతంత్ర్య సాధనను సులభతరం చేయగలిగింది.

చరిత్రపుటలలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కొంతమంది స్త్రీలపేర్లను పేర్కొన్నారు గాని, ఆనాటి స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యసాధనకై సృష్టించిన సాహిత్యోద్యమచైతన్యాన్ని వెలుగులోకి తీసుకురాకపోవటం దురదృష్టకరం. నేటికి సమాజంలో స్త్రీలవ్యక్తిత్వంమీద చులకన భావం ఉండటంచేతనే నాటి స్త్రీలసాహిత్యం విస్మృతికి గురి అయింది. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యసాధనలకై సృజింపబడిన ఈ స్త్రీలసాహిత్యం విస్తృతమైనా విస్మృతంగా ఉండటం విచారకరం.

## 1.1. స్త్రీలసాహిత్య ఆకరాలు

ఇంటిబడిలోనూ, బయటబడిలోనూ ప్రాథమికంగా విద్యావంతులు కాగలిగిన స్త్రీలు, స్త్రీవిద్య, స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకతను గుర్తించి, స్త్రీపురుషసమానత్వాన్ని కోరుకొంటూ

స్వేచ్ఛాకాంక్షను పెంపొందించుకొని భారతదేశ స్వాతంత్ర్యానికై అంచెలంచెలుగా పాటుబడిన విధానం తెలుగులో 1900 నుండి వచ్చిన స్త్రీల సాహిత్యం ప్రతిఫలించింది. స్త్రీసమాజాలలో స్త్రీలు జ్ఞానంతో, ధైర్యంగా చేసిన ఉపన్యాసాల ప్రచురణతోపాటు నాటి స్త్రీలలో కలగాల్సిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిఫలించిన స్త్రీల సాహిత్యాన్ని ప్రచురించిన నాటి 'హిందూసుందరి' 'సావిత్రి', 'అనసూయ', ఆంధ్రలక్ష్మి, 'గృహలక్ష్మి', 'ఆంధ్రపత్రిక' (వార్షికసంచిక) 'భారతి' 'వాసవి' 'కలావతి', 'శారద', 'సరస్వతి', వివేకవతి, ఆంధ్రభూమి, స్త్రీధర్మ, సువర్ణలేఖ, జనానా, సమదర్శిని, బాలసరస్వతి, రూపవాణి మొదలగు తెలుగు పత్రికలను పరిశీలనలోకి తీసుకోవటం జరిగింది. స్త్రీలు వ్రాసిన వ్యాసాలు, ప్రచురించబడిన స్త్రీల ఉపన్యాసములు, కథలు, కవితలు, నాటకాలు, శతకాలు, నవలలు, స్వీయచరిత్రలు, జీవితచరిత్రలు, పాటలు, నవలానువాదాలు, గల్పికలు, జానపదగేయాల వంటి సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీల స్వతంత్రజీవన కాంక్షయే వారిని దేశస్వాతంత్ర్యంవైపు అడుగులువేయించిందని అర్థంఅవుతుంది. స్త్రీలఉపన్యాసాలు కూడా పత్రికలలో ప్రచురితమవటంచేత దీనిని స్త్రీల సాహిత్యంగా పేర్కొనటం జరిగింది. స్త్రీలే పత్రికలను నడిపి, సంపాదకత్వం వహించి స్త్రీల ప్రగతికి కృషిచేయటం చిరస్మరణీయం. ప్రారంభంలో స్త్రీల అభివృద్ధికి పాటుబడిన వీరేశలింగం గారి ప్రచురణలో వచ్చిన చింతామణి పత్రికను, రాయసం వెంకటశివుడి ఆధ్వర్యంలో వచ్చిన జనానా పత్రికను పరిశీలించటం జరిగింది. క్రీ.శ. 1902 లో సత్తిరాజు సీతారామయ్య గారి ఆధ్వర్యంలో స్త్రీల రచనల ప్రచురణకై ప్రారంభించిన 'హిందూ సుందరి' అనే పత్రికకు మొసలిగంటి రామాబాయమ్మ, వెంపల శాంతాబాయి, మాడభూషి చూడమ్మ, బాలాంత్రపు శేషమ్మ వంటివారు సంపాదకత్వాన్ని వహించారు. స్త్రీల రచనలకు వేదికగా 1904 నుండి కాకినాడలో పులుగుర్త లక్ష్మీనరసమాంబ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'సావిత్రి' అనే పత్రిక, 1906 నుండి లభ్యమైన సువర్ణలేఖ అనే మాసపత్రిక, చిల్లరిగె రమణమ్మ ఆధ్వర్యంలో 1909 నుండి "వివేకవతి" 1914 నుండి వింజమూరి వెంకటరత్నమ్మ గారి ఆధ్వర్యంలో 'అనసూయ' పత్రిక, 1921 నుండి బరంపురంలో కళ్ళేపల్లె వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో "ఆంధ్రలక్ష్మి" అనే పత్రికలు వచ్చాయి. 1910 నుండి "ఆంధ్రపత్రిక" అనే(వార్షిక సంచిక) పత్రిక, 1924 నుండి అనిబిసెంట్ అధ్యక్షతన ఏర్పడిన 'ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్' వారి ఆధ్వర్యంలో ప్రచురితమై లభ్యమైన తెలుగు, తమిళ, ఆంగ్లభాషల సమ్మిళితమైన "స్త్రీధర్మ" అనే మాసపత్రిక, 1924 నుండి "భారతి" అనే పత్రిక, 1926 నుండి "వాసవి" అనే పత్రిక, 1928 నుండి డా.కె.యన్ కేసరి ఆధ్వర్యంలో స్త్రీలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తూ, స్త్రీల రచనలకు ప్రాధాన్యతనిచ్చిన "గృహలక్ష్మి" అనే పత్రిక వచ్చాయి. గృహలక్ష్మి పత్రికకు చేబ్రోలు సరస్వతి మొదలగు స్త్రీలు సహాయ సంపాదకులుగా ఉండటం జరిగింది. 1933 నుండి "ఆంధ్రభూమి" అనే పత్రిక ప్రారంభింపబడినది. "శారద" పత్రికకు పాటూరు బాలసరస్వతి సంపాదకత్వాన్ని వహించింది. స్త్రీవ్యక్తి స్వాతంత్ర్య సాధనకు, దేశస్వాతంత్ర్యానికి తగిన చైతన్యాన్ని స్త్రీలలో కలిగించటానికి, స్త్రీల అభివృద్ధిని కోరుకొంటూ వచ్చిన స్త్రీల సాహిత్యాన్ని ప్రచురించిన నాటి

పత్రికలను ఈ రచనకు ముడిసరుకుగా చేసుకోవటం జరిగింది. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ స్వీయప్రచురణలో 1953 లో వచ్చిన "ఆంధ్ర కవయిత్రులు" అనే గ్రంథం నుండి స్వాతంత్ర్యోద్యమ కాలంలో వ్రాసిన కవయిత్రుల కవిత్వాన్ని కూడా కవితావస్తువును బట్టి ఆయా సందర్భాలలో యిమిడేటట్లుగాచేసి ఉటంకించటం జరిగింది. 1940 నుండి వచ్చిన ప్రజాశక్తి ప్రచురణలోని కవిత్వాన్ని, స్వీయ ప్రచురణలలో వచ్చిన కవిత్వాన్ని, వివిధ సంస్థలును, వ్యక్తిగతంగాను ప్రచురించిన నాటి కాలపు నవలలను అనుశీలించటం జరిగింది.

స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకతను దానికి మూలమైన స్త్రీవిద్యను, దేశస్వాతంత్ర్య ఉద్యమ చైతన్యాన్ని ప్రతిఫలించిన స్త్రీలసాహిత్యాన్ని మాత్రమే స్వీకరించటం జరిగింది. ఇంకా చాలమంది మహిళారచయిత్రులు వివిధ అంశములతో వ్రాసినవి అనేకం అందుబాటులో ఉన్నప్పటికీ, ఈ గ్రంథరచనకు అనుపయుక్తమైన సాహిత్యాన్ని పరిహరించటం జరిగింది. నాటి పత్రికలు చేసినకృషి అమోఘమని భావించాలి. స్త్రీలు నిర్వహించిన పత్రికలే కాక, నాడు జనానా, గృహలక్ష్మి మొదలగు పత్రికలలో పత్రికాధిపులుగా, సంపాదకులుగా తమ తమ పత్రికలలో వారు ప్రచురించిన ప్రముఖులైన స్త్రీలను గురించిన, స్త్రీలసమాచారానికి సంబంధించిన వ్యాసాలను అవసరం మేరకు ఉపయోగించుకోవటం జరిగింది. 1908-09, 1921-22 సంవత్సరముల నాటి స్త్రీలసాహిత్యాన్ని ప్రచురించిన పత్రికలు అందుబాటులో లేకపోవటం విచారకరం. కేవలం స్త్రీలరచనలను ప్రచురించే స్త్రీల సంపాదకత్వంలో వచ్చిన పత్రికలలోని అనామక రచయితలయొక్క రచనల విషయంలో ప్రత్యామ్నాయంగా ఆ యా పత్రికాధిపురాలను, సంపాదకురాలను పేర్కొనటం జరిగింది. స్త్రీల స్వీయసంస్కరణలో భాగంగా స్త్రీలు తోటిస్త్రీలలో చైతన్యం కలిగించే విధంగా అనంతమైన సాహిత్యసృష్టి చేసారు.

స్త్రీల ఉపన్యాసాల ప్రచురణలు వ్యాసాలరూపంలో "సహితస్యభావం" తోను ఈ పత్రికలలో ఉండటం చేతను, వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలోనూ ఈ రచనలు ఉండటంచేత దీనిని స్త్రీల వాఙ్మయం అనే కంటే స్త్రీల సాహిత్యం అనటమే సబబుగా ఉంటుంది. ఈ పుస్తకంలోనే అనుబంధంగా ఉన్న 'ఆనవాళ్ళు' అనే శీర్షికక్రింద ఉపయుక్తమయిన సాహిత్య సూచికలను కాలక్రమానుగతంగా పత్రికాపరమైన సమాచారంతో యివ్వటం జరిగింది. ఈ సాహిత్యపఠనం వల్లనే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యసాధనకై ఆలోచనలను చేయటం, క్రమంగా దాన్ని సాధించటానికై సమాజంలో తమకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం ఉండాలనే వారియొక్క చైతన్యం అర్థం అవుతుంది.

## 1.2. సారస్వత సమాచారం

క్రీ.శ. 1900 సం.నాటికి స్త్రీలలో అక్షరాస్యత ఒక్కటే శాతం కాబట్టి సాహిత్య రచనలు విస్తృతంగా చేయటానికి అవకాశం తక్కువ కాబట్టి ప్రారంభదశలో స్త్రీలు ఉపన్యాసాలను ఎక్కువగా ఇచ్చారు. అయితే ఆ ఉపన్యాసాలను ఎలా ఇవ్వాలి, వ్యాసరచన ఎలా చేయాలి, కథలు ఎలా

వ్రాయాలి, నాటకాల రచన ఎలా ఉండాలి అనే విషయాలకు సంబంధించిన సమాచారము అందుబాటులో లేకపోయింది. అయినా తోటిస్త్రీలలో వ్యక్తిస్వాతంత్ర్యానికి,దేశస్వాతంత్ర్యానికి సంబంధించిన ఆలోచనలను పెంచేదిశగా నాటి స్త్రీలు నిబద్ధత, నిజాయితీతో రచనలు చేయటానికి సంకల్పించారు. స్త్రీలు బహిరంతరాలలో తమ ఆవశ్యకతలను గుర్తించి స్వేచ్ఛ కావాలనుకొన్నారు అందుకే ఈ సాహిత్యంలో వస్తువిషయానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంది.

నిరక్షరాస్యులైన స్త్రీలలో స్త్రీవిద్యపట్ల చైతన్యం కల్గించటానికి క్రీ.శ. 1902 నుండి ప్రారంభమైన స్త్రీసమాజాలలో ఉపన్యాసాలను ఇచ్చేవారు. ఉపన్యసించటం ఒక గొప్ప కళ. మేధాశక్తికి, అభివ్యక్తీకరణకు, పరిజ్ఞానాన్ని పదునుపెట్టి శ్రోతలలో విషయం పట్ల అవగాహన, అనుభూతిని కల్గించటంతోపాటు అదే సమయంలో ఆ విషయం వారి మనసులో నాటుకునేటట్లుగా ఉపన్యసించగలగాలి. వారిలో కలిగిన తదనుభూతియే చైతన్యాన్ని కల్గిస్తుంది. అదేకాక సమాజసంస్కృతి నిబంధించిన ఆంక్షల వలయంనుండి బయటకు రాలేని తోటిస్త్రీలకు తెలియ జేయటానికి ఉపన్యాసాన్ని విన్నవాళ్లు తోటి స్త్రీలను చైతన్యపరచటానికి వీలుగాను ఉపన్యాసాలను యిచ్చారు. ఈ ఉపన్యాస విషయాలు ప్రయోజనకరంగా ఉండాలనీ, మరియు వేరే ప్రాంతమందున్న అక్షరాస్యులైన స్త్రీల ఉపన్యాస సారాంశాలను తెలుసుకోవటానికి, సార్వకాలికంగా ఉండేవిధంగానూ అవి వ్యాసాల రూపంలో ప్రచురింపబడ్డాయి. దాదాపు **88** ప్రచురిత ఉపన్యాసవ్యాసాలను స్వీకరించటం జరిగింది.

స్త్రీవిద్య, స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యం, ఉన్నతవిద్య, శాస్త్రపరిజ్ఞానం దిశగా స్త్రీ, పురుషులు సమానులు అనే భావన అభివృద్ధి చెందటానికి తగినట్లుగా సంస్కృతిలోని లోపాలు సరిదిద్దుకోవ టానికి వ్యాసాలను వ్రాసారు. సమాజ మానవ జీవిత సత్యావిష్కరణకు నిబద్ధతతో కూడిన విమర్శలతో వ్యాసరచన సాగి స్త్రీలలో అవగాహనను మరింతగా పెంచగలిగింది. దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితులపట్ల అవగాహనను కల్గిస్తూ కులమతాల సామరస్యంతో కూడిన సమాజ స్థాపనను ప్రబోధిస్తూ, స్త్రీలు తమ ఆర్థిక దుస్థితిని, అస్వతంత్రతను గుర్తించగలిగేటట్లు చేసారు. స్త్రీలు దేశ స్వాతంత్ర సాధన దిశగా చైతన్యవంతులు కావటానికి వ్యాసరచన విషయ పరిపక్వతను పొందింది. వ్యాసరచన ప్రారంభం, విషయప్రతిపాదన, ఆ విషయాలను బలంగా నిర్దేశింపజేసి ఆ విషయాన్ని పాఠకుల మనస్సులో నాటుకునేటట్లు చేసి అవగాహనను పెంచి ఆలోచింపచేసి చైతన్యస్పృహను కల్గించే విధంగా 1900 నుండి వ్యాసరచన సాగింది. నాడు ఘనతవహించి స్ఫూర్తినిచ్చే సమకాలీన స్త్రీల సంగ్రహ 'జీవితచరిత్రలను' వ్యాసాలరూపంలో ప్రచురించి సామాన్య స్త్రీలను కూడా చైతన్యపరచటం జరిగింది. ఇటువంటి విషయప్రాధాన్యత గల **470** వ్యాసాలను పేర్కొనటం జరిగింది.

ఆ క్రమంలోనే క్రీ.శ. 1902 నుండి కథారచనను, నాటకరచనను ప్రారంభించారు. స్త్రీలు రచనలు చేస్తే వాటిని చదవాలని ఉత్కంఠ అందరిలోనూ ఉంటుంది. విద్యావంతులైన పురుషులు

తమ స్త్రీలను చదివించాలని అనుకోకపోవటంతో పురుషులలో కూడ చైతన్యం కలగాల్సిన అవసరాన్ని గుర్తించి, పురుషులు తమ భార్యలను అక్షరాస్యులను చేయాల్సిన బాధ్యతను తెలియ జేసే కథారచన ప్రారంభమైంది. స్త్రీలస్వతంత్రతకు, దేశస్వాతంత్ర్యానికి సంబంధించిన **102** కథలను తీసుకోవటం జరిగింది.

భండారు అచ్చమాంబ ఆ కోవలోనే 'భార్యాభర్తల సంవాదం-స్త్రీవిద్య', 'దంపతుల ప్రథమ కలహం' వంటి కథల రచనకు పూనుకున్నారు. కథలలోనే అంతర్గత నాటకంగా పాత్రల సంభాషణ లతో వాస్తవికవస్తువుకు పట్టంకట్టటం జరిగింది. కథావస్తువు ఒకసామాజిక, సాంస్కృతిక పరిణామాన్ని ప్రకాశింపజేసేదిగా ఉంది. కథలకు శీర్షికలను పెట్టటంలో కూడా జాతీయాలను, సామెతలను, చమత్కారపు మెలికలను పెట్టి కథలకు పేర్లు పెట్టేవారు. దాంట్లో భాగంగా 'ఐదు మాసములు-ఇరువది దినములు', 'మార్పులమంగ', 'పునిస్త్రీపునర్వివాహము', 'పిల్లికి చరలాటము-ఎలుకకు ప్రాణసంకటం', 'విత్తొకటి వేస్తే చెట్టొకటి మొలుస్తుందా?' 'ఇది కథకాదు', 'గొంగళిపురుగు' వంటి కథా శీర్షికలు ఉన్నాయి. కోర్టుకు వెళ్లి న్యాయశాస్త్రంలోని లింగ వివక్షను ప్రశ్నించాలనుకున్నా వీలుకాని పరిస్థితులలో అవే విషయాలు మనసును కలవరపెడుతుంటే రాత్రి నిద్రపోయిన తర్వాత వచ్చిన కలలో న్యాయాధిపతిని ప్రశ్నించటంగా నూతన ఒరవడితో 'నాస్వప్నము' వంటి కథలు వచ్చాయి. కథ ముగింపులో సాంకేతికంగా కొసమెరుపును సంధిస్తూ వచ్చిన కథలుగా 'స్త్రీతత్వము' 'రెండువరాలు' వంటి కథలు చదివింపచేస్తాయి. ఆధునిక స్త్రీ కోరుకున్న ఆదర్శమే రెండువరాలు వంటి కథలో అర్థమవుతుంది. అంతేకాక 'మాదిగ వెంకడు', 'దేవుడు' వంటి అభ్యుదయ, విప్లవాత్మక ఆలోచనలకు ఆలవాలమైన కథలు పాఠకులను తట్టిలేపుతాయి. కాల్పనిక కథావస్తువులకంటె భిన్నంగా సామాజిక వాస్తవ సంఘటలను కథగా చిత్రించటం కష్టసాధ్యమైన విషయం. సహజ సామాజిక వాతావరణంలో పాఠకులకు దృశ్యమానమయ్యే రీతిలో కథను కూర్చి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ విషయాలతో కూడిన చైతన్యాన్ని అందించగలిగి, పాఠకులు తమలోకి తాము తొంగిచూసు కునేటట్లుగా రచించిన 'సాధ్వి', 'సుశీల రజస్వలానంతర వివాహము', 'దిక్కుమాలు మాలబాలకుని కథ', 'కుటీరలక్ష్మి', 'మిహరున్నీసా', 'పోశమ్మగండి', 'గేదెల రామక్క జీవితచరిత్ర సంగ్రహము' వంటి కథలు ఈ కోవకు చెందుతాయి.

సహాయనిరాకణోద్యమ ప్రారంభకాలంలో విదేశీవస్తు బహిష్కరణతోపాటు స్వదేశీదీక్షకై జాతీయతా భావాలను అభివృద్ధిపరుస్తూ స్త్రీలు సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో పాల్గొనే చైతన్యాన్ని కలిగిస్తూ కథలు వ్రాసారు. ముఖ్యమైన ఖద్దరువస్త్ర తయారివంటివి కుటుంబ వాతావరణంలో చేయగలిగి జాతీయాభిమానాన్ని పెంపొందించుకోవటం స్త్రీల కర్తవ్యంగా తెలియజేస్తూ కథలు వచ్చాయి. దేశదారిద్ర్య నిర్మూలనలో భాగంగా కుటీరపరిశ్రమల అభివృద్ధిని తెలియజేసే 'కుటీరలక్ష్మి', 'ఖద్దరు' వంటి కథలు, 'బాతాఖాని' వంటి గల్పికలవంటి చిన్ని కథలు

వచ్చాయి. నవలా లక్షణాలను పేర్కొనక మునుపే రూపొందించిన **5** వచనప్రబంధాలు లేదా నవలలను పరిశీలనకు తీసుకోవటం జరిగింది. **3** స్వీయచరిత్రలు ఉన్నాయి.

సమాజాలలో స్త్రీ పాత్రలలో స్త్రీలు ముందుకువచ్చి కుటుంబ సహజ వాతావరణంలో సంభాషిస్తూ నిరక్షరాస్యులలో స్త్రీవిద్యా వ్యాప్తిని అభివృద్ధిపరచటంగా స్త్రీల నాటకరచన ప్రారంభ మయింది. వాస్తవిక విషయప్రస్తావనకై సమాజంలోని సహజమైన వ్యక్తులుగా స్త్రీపాత్రలు ఉంటాయి కాబట్టి ఆహార్యము (వేషధారణ) రంగస్థల హంగులు అంతగా అవసరం లేకపోయింది. ఆ రోజుల్లో అటువంటి అవకాశము, వసతులు కూడా తక్కువ. నాటక లక్షణాలంటూ ప్రత్యేకంగా లేకపోయినా, సమాజంలోని వాస్తవ సంఘటలను, సామాజిక వ్యక్తుల స్పందనలను పొందుపరచి, పాత్రల ద్వారా వ్యవహారిక భాషలోనే అభివ్యక్తీకరణ చేయించే విధంగా స్త్రీలు వ్రాసిన ఈ నాటక ప్రక్రియ అభివృద్ధిచెందింది. అలా స్వాతంత్ర్యానికి పూర్వంవ్రాసిన స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిన నాటకాలు **33** లభించాయి.

ఈ నాటకప్రదర్శనలకు సామాజిక ప్రయోగశాలయే రంగస్థలంగా ఉండేది. అందుకే స్త్రీసమాజాలలో, స్త్రీలచేత, స్త్రీలకొరకు, స్త్రీలయొక్క రచనలుగా స్త్రీ పాత్రలతో సాగిన నాటకాలు, నాటక ప్రదర్శనలను నాటి స్త్రీ ప్రేక్షకులలో చైతన్యం కలిగించాయని చెప్పటం అతిశయోక్తికాదు. ఈ నాటక ప్రదర్శనలో స్త్రీలు పాత్రధారులుగా పాల్గొనటంచేత అందరి స్త్రీలలో నాడు ధైర్యాన్ని, అభివ్యక్తీకరణను, భావస్వేచ్ఛను అభివృద్ధిపరచగలిగాయి అనేది కూడా అంతే సత్యము. నాటకాలలో అంతర్నాటకాలను కూడా జొప్పించిన 'స్త్రీపునర్వివాహ ప్రహసనం', 'హాస్యసంజీవి', 'పతివశీకరణం' వంటి నాటకాలను, 'ప్రేమవేదిక', 'సరస్వతి–పుష్పావతి' వంటి సంభాషణాత్మక 'చర్చ'లతో కూడిన నాటకాలు వచ్చాయి.

స్త్రీవిద్య, స్త్రీసమాజాలు, మహిళాచట్టాలు, స్త్రీల శక్తియుక్తుల ప్రశంసలకు సంబంధించిన కవితలను వ్రాసారు. దేశభక్తిని, జాతీయాభిమానాన్ని పెంపొందిస్తూ, స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను భాగస్వాములు చేయటానికి 'మేలుకొలుపుల' వంటి కవిత్వము వచ్చింది. దేశసేవికల గొప్పతనాన్ని దేశనాయకులను స్తుతించే కవిత్వం వచ్చింది. ఉప్పుసత్యాగ్రహం ఊపందుకున్న సమయంలో ఉద్యమస్త్రీలు తమ కవితలతో తోటి స్త్రీలలో ఉద్యమస్ఫూర్తిని కలిగించే విధంగా కవితలు, గేయకవితలు, పాటలు వచ్చాయి. ప్రాచీన కావ్య పఠన ప్రభావంతో కొంతమంది స్త్రీలు పద్యరచనను చేపట్టగా ఆధునిక విద్యావతులు వచన కవితలను రచించారు. సత్యాగ్రహ ఉద్యమంలోని ప్రధాన అంశాలైన ఖద్దరుతయారీ, ఖద్దరువసనధారణ, అస్పృశ్యత, మద్యపాన నిషేధం, మాతృభాషా ప్రయోజనము, జాతీయవిద్యవంటి విషయాల పట్ల సమాజానికి స్త్రీలు తమ కవితలతో ప్రబోధము చేసారు. ఖద్దరుతయారీ ఉద్యమంలో భాగంగా రాట్నపుపాటలను పాడారు. స్త్రీసమాజాలు, స్త్రీవిద్య, దేశభక్తికి సంబంధించిన విషయాలతో కవితలల్లి మంగళహారతులను, కీర్తనలను, పాటలను మొత్తం **9** స్వరపరిచారు. 1940 తర్వాత అభ్యుదయ భావాలు అభివృద్ధి చెంది, విప్లవాత్మకమైన

ఆలోచనల ప్రేరణతోనూ 'మనదీ భారతదేశం' మరియు 'ప్రబోధ గీతాల' వంటి అభ్యుదయ కవితలు వచ్చాయి. 1947 వరకు వచ్చిన ఈ అంశాలతో కూడిన **98** కవితలు, **6** శతకాలను గ్రహించటం జరిగింది.

అక్షరాస్యులైన స్త్రీలు దూరప్రాంతాలలోని తోటి స్త్రీలతో మిత్ర సంబంధాలను కొనసాగిస్తూ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ విషయాలను వారితో పంచుకొనేందుకు దూరాల దారాలను అల్లుతూ స్త్రీలు లేఖాసాహిత్యాన్ని కూడా అభివృద్ధి పరిచారు. అవే కల్పలత, కమలకు లేఖలు, శారద లేఖల రూపంలో **12** లేఖలు ప్రసిద్ధిని పొందాయి.

క్రీ.శ.1900 నుండి 1947 వరకు స్త్రీలు రచించిన స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి సంబంధించిన సాహిత్యానికి, సమాంతరంగా వచ్చిన దేశస్వాతంత్ర్యానికి సంబంధించిన సాహిత్యం వచ్చింది. విస్తృతమైన స్త్రీలసాహిత్యంగా ఘనమైన దైనప్పటికీ విస్మృతంగా ఉండటంతో దానిని ఇప్పుడు వెలుగులోకి తేవటం జరిగింది.

## 1.3. స్త్రీల సాహిత్య వికాస పూర్వరంగం

భారతీయులకు పరిపాలనాదక్షత లేదని భావించిన బ్రిటిష్ వారికి చెంపపెట్టుగా రాజకీయ స్వాతంత్ర్యఫలితాలను అనుభవించటానికి ముందే సాంఘిక,విద్యారంగాలలోసంస్కరణలు జరిగాయి. ప్రజలందరూ సమానంగా అభివృద్ధిచెందటం ముఖ్యమనే భావనతో బెంగాలీ వాఙ్మయంలో సంస్కరణలుచోటుచేసుకున్నాయి. విక్టోరియారాణి భారతదేశంలో బాలికలపాఠశాలలను ప్రారంభింప చేసింది. ఆ క్రమంలో భారతదేశంలోసంస్కరణోద్యమం ప్రారంభమై, స్త్రీవిద్యకు ప్రాధాన్యత పెరిగింది. 1874లో కందుకూరి వీరేశలింగం బాలికాపాఠశాలను నెలకొల్పాడు. దేశాభ్యుదయానికి స్త్రీవిద్యకు ఉన్న లంకెపై అవగాహన ఏర్పడి, స్త్రీవిద్యా ప్రచారంలో సంఘసంస్కర్తలైన స్త్రీలు, పురుషులు భాగస్వాములయ్యారు. సంఘసంస్కరణయే జాతీయ చిహ్నమైంది.

క్రీ.శ.1890 లో తిలక్ కూడా 'పెళ్ళి' అనేది దురాచారంగా ఉండకూడదనీ, బహుభార్యత్వం ఉండకూడదనీ, స్త్రీవిద్య ఉండాలనీ, బాల్యవివాహాలు ఆచరణయోగ్యంకాదని, ఈ విషయాలను బ్రిటిష్ వారిచేత చెప్పించుకోవటం భారతీయుల ఆత్మగౌరవానికి భంగకరమనీ, స్వీయసంస్కరణలు అవసరమని భావించాడు. కందుకూరి వీరేశలింగం కుటుంబస్త్రీలను కష్టాలకు గురిచేస్తున్న సాంఘిక దురాచారాల నిర్మూలన జరగాల్సిన అవసరాన్ని చెప్పాడు. "ఇంటనుండు స్త్రీల కష్టములను నివారింప లేనివారము రాజ్యాంగ స్వాతంత్ర్యములను పొంది దేశము యొక్క కష్టముల నెట్లు నివారింప గలుగుదమ"ని చెప్పి విద్యావంతులైన ప్రజలే మిగిలినవారిని విద్యావంతులను చేయగలిగే టట్లుగా స్వీయసంస్కరణ మార్గాలలోనే స్త్రీల అభివృద్ధిని కోరుకొన్నారు. దేశస్వాతంత్ర్యంకంటే ముందుగా సాంఘికసంస్కరణ ముఖ్యమని భావించిన రాజారామమోహనరాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహాదేవ్ గోవిందరనడే, కందుకూరి వంటివారు తమ పత్రికల ద్వారా ప్రచారం చేసారు.

క్రీ.శ.1900 నాటికి భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రథమంగా సంఘసంస్కరణలను చేపట్టిన క్రమంలో స్త్రీలఅభివృద్ధి ప్రాముఖ్యత వహించింది. సమాజంలో స్త్రీలు కుటుంబ బానిసత్వంనుండి విముక్తి కాగలిగినపుడే వారి ఆలోచనలు విస్తృతమవుతాయనీ, భావించిన సంఘసంస్కర్తలు ముందుగా స్త్రీలలో సాంఘిక చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరాన్ని గుర్తించారు. దానికై స్త్రీలు విద్యావంతులు కావాలని భావించారు.

స్త్రీవిద్య స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్య సాధనకు ప్రధాన భూమిక అయింది. క్రీ.శ.1900 నాటికే స్త్రీవిద్యకు, స్త్రీలలోని శక్తియుక్తుల వెలికితీతకు స్త్రీలసాహిత్యం ద్వారా అడుగుజాడలు ఏర్పడ్డాయి. క్రీ.శ.1881-99 సం.ల మధ్యన జీవించిన వేమూరి(దాసు) శారదాంబ వ్రాసిన 'మాధవశతకా'న్ని స్త్రీజన వికాసానికై స్త్రీవిద్యను కోరుకొన్న శతకంగా స్త్రీలసాహిత్యంలో మొదటిదిగా చెప్పుకోవాలి. స్త్రీలకు సామాజిక సంబంధాలు బలపడే విధంగా రచించిన మానవ ప్రబోధాత్మకమైన సాంఘికశతకంగా 'మాధవశతకా'న్ని పేర్కొనవచ్చు. కవయిత్రి ఇంటిబడిలోనే సంస్కృతాంధ్ర గ్రంథాలను అభ్యాసం చేయటంతో పొందిన జ్ఞానశక్తిచే స్త్రీవిద్యావశ్యకతను గుర్తించింది. స్త్రీలచదువంటే చెవులు మూసుకునే నాటి సమాజంలోఉన్న పెద్దలలో, తల్లిదండ్రులలో, భర్తలలో, ఆడపిల్లలలో స్త్రీవిద్యకు సంబంధించిన ఆలోచనలను, ప్రశ్నలను రేకెత్తింపజేసిన శతకమిది. వేమూరి శారదాంబ 1896 ప్రాంతంలో వ్రాసిన వందపద్యాల కూర్పుతో ఆమె మరణాంతరం 'మాధవశతకం'గా 1901 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే వరకు 'కలావతి' పత్రికలో ప్రచురింపబడినది. సమాజంలో పురుషులతో పాటు స్త్రీలకు సమానమైన విద్యావకాశాలు లేవని వేలెత్తి చూపిన శతకమిది. గృహ నిర్వహణను, శిశు పోషణాన్ని, స్త్రీలు మరింత సమర్థవంతంగా నిర్వహించటానికి గాని 'కరణేషు మంత్రి'గా భార్య ఉండాలన్నా గాని స్త్రీవిద్య అవసరమని చెప్పింది. సంసారరథం సజావుగా నడవాలంటే విద్యావంతులైన భర్తతో సమానంగా విద్యావంతురాలైన భార్యలుకూడా ఉండాలని గుర్తించమంది. నాటి స్త్రీలకు శాస్త్రజ్ఞానం అందుబాటులో లేకపోయినా, శిశుపోషణ విజ్ఞానం, బాలచికిత్స, చరిత్ర, భూసమాచారం తెలిసి ఉండాలని చెప్పింది. దేశభాషలను స్త్రీలు నేర్చుకోవాలనీ. చదువుకున్న పురుషులు దుష్టులు కానప్పుడు స్త్రీలు చదువుకుంటే దుర్గుణులెట్లా అవుతారని సమాజ సంస్కృతిని ప్రశ్నకు పెట్టిన శతకమిది.

*"తరుణులు విద్య నేర్చిన స్వతంత్రము లిమ్మనుచుండ్రటంచునం*
*దురె యది కల్ల దాము దగునో యెవి పూనగనెవ్వి గూడదో*
*యెరిగియె పొందుచుండ్రు గద యెప్పుడు గూడను బాగ విద్యలన్*
*గరచినవారు గాననిది న్యాయమె జెప్పగ చూడ మాధవా!"- (ప. 79)*

అని సామాజిక న్యాయాన్ని ప్రశ్నకు పెట్టింది.విద్యావంతులైన స్త్రీలు స్వాతంత్ర్యాన్ని ఇవ్వమంటారనే భయం పురుషులలో ఉందనీ, అది అసత్యమనీ, అన్యాయమనీ కవయిత్రి ధైర్యంగా

చెప్పింది. స్త్రీలు చదువుకుంటే ఏ మేరకు స్వతంత్రతను అనుభవించాలో వారికి తెలుస్తుందని చెప్పి స్త్రీలకు స్వతంత్రత ఉండాలనీ, దానికి పురుషులు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టపరిచింది. నాటి సామాజిక స్థితిలో స్త్రీలు చదువుకోవల్సిన కర్తవ్యాన్ని ప్రబోధించింది. దీనిలో పరోక్షంగా స్త్రీ విద్యకు స్త్రీల స్వతంత్రజీవనానికి ఉన్న లంకెకూడా అర్థమవుతుంది.

ఫిబ్రవరి, మార్చి, 1898 చింతామణి పత్రికలో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' రచనోద్దేశాన్ని గురించి భండారు అచ్చమాంబ వ్యక్తంచేసిన అభిప్రాయాలను 'ఉపోద్ఘాతము' అనే శీర్షికన చేసిన ప్రచురణలో 'స్త్రీలు అబలలనీ బుద్ధిహీనులనీ, వివేక శూన్యులని, సకల దుర్గుణాలకు నిలయ మనియు చెప్పే భావాలన్ని అసత్యములని చెప్పింది. శౌర్యధైర్యవతులు, అసమాన్య విద్యావిభూషితలు, జ్ఞానవతులు, రాజ్యకార్య ధురంధరత్వము, స్వదేశాభిమానము, సకల సద్గుణ విభూషితులైన భారతదేశస్త్రీలు నాటి పూర్వులలో ఉన్నారని పేర్కొన్నది. మరియు స్త్రీలకు విద్యనేర్పించి స్వాతంత్ర్యం ఇస్తే స్త్రీలు చెడిపోతారనే ఆరోపణలు నిరర్ధకాలనీ, స్త్రీ విద్యాస్వాతంత్ర్యాలవల్ల దేశానికి లాభమే గాని నష్టం కలుగదనీ, స్త్రీవిద్య అత్యంతావశ్యకమని తెలియజేసింది. కల్పనా కథలు కాక వాస్తవమైన చారిత్రక స్త్రీలను తెలియజెయ్యాలనుకున్నట్టును, మొదటిభాగంలో వేయిసంవత్సరాల నుండి అప్పటి వరకున్న భారతదేశంలోని చారిత్రక స్త్రీలను, రెండవభాగంలో పౌరాణికస్త్రీలును, మూడవ భాగంలోనూ ఇంగ్లండు మొదలైన పరదేశీ స్త్రీల చరిత్రములు ఉంటాయని' వ్రాసింది.

'అబలాసచ్చరిత్రరత్నమాల' గ్రంథంలోని రాణీ భవానీ, రాణీ సువర్ణమయి చరిత్రలను అప్పటికే జనానాపత్రిక ప్రచురించినదని ఆమె తెలియజేసింది. రాణి భవానీ తన భర్త యైన రామకాంతుడు రాజ్యాధిపతిగ, భోగలాలసుడిగా ఉండి మంత్రియొక్క హితోపదేశం కూడా వినక పోయేసరికి, ఆ మంత్రి కోపంతో నవాబు దగ్గరికి వెళ్ళి రాజ్యాన్ని స్వాధీనం చేసుకోమంటాడు. ఆ విషయాన్ని తెలుసుకొన్న రాణి భవాని భర్తను తీసుకొని వేరే ప్రాంతానికి వెళ్ళి, ముందుగా భర్తను తనకు అనుకూలునిగా చేసుకొంటుంది. బుద్ధికుశలతతో రాజు దగ్గర ఉండే మరోవ్యక్తి ద్వారా నవాబు ప్రాపకాన్ని పొందటమేగాక భర్త మరణానంతరం రాజ్యపాలన చేపట్టిందనీ, తనకూతురిని కోరుకొంటూ బంగళారాజు దండెత్తి వస్తున్న సంగతి తెలిసి సైన్యాన్ని సిద్ధంచేసి ఆ తురుష్కరాజుని జయించగలిగిందని చెప్పింది. అంతేగాక ఆ బంగాళారాజుని పదవీచ్యుతిని చేసి హిందూ రాజుని ప్రతిపాదిస్తూ రాజమండలికి సలహాయిచ్చిందని తెలియజేసింది. ఇటువంటి రాణిభవానీ చరిత్ర ద్వారా స్త్రీలలోని పరాక్రమం, పరిపాలనా శక్తిని తెలిపి నాటి స్త్రీలకు ఉత్సాహాన్ని కలిగించింది.

విద్యావంతురాలైన రఖుమాబాయి (జులై 1899 చింతామణి పత్రిక) తన భర్త డాక్టరు కృష్ణాజీ వలన జ్ఞానాన్ని పొంది ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తూ స్త్రీ విద్యను ప్రోత్సహించిందనీ, విద్యను బోధించటంలో ప్రవీణురాలనీ, ఉత్తమ ఉపాధ్యాయిని అని నాటి లేడీ సూపరిండెంట్ ఆఫ్ ఫిమేల్ ఎడ్యుకేషన్ అయిన ఎచ్. లిటిల్ దొరసాని 1895లో ప్రశంసాపత్రాన్ని రఖుమాబాయికి

ఇచ్చిన విషయాన్ని వ్రాసింది. ఆవిధంగా ఈ రఖుమాబాయి చరిత్ర చెప్పి స్త్రీలందరూ స్త్రీ విద్యను ప్రోత్సహించాలని తెలియజేసింది.

'కర్మదేవి' (జులై 1899 చింతామణి) అనే స్త్రీయొక్క చరిత్రలో ఆమె ధైర్య, సాహస సద్గుణోపేతుడైన వ్యక్తిని వరించి తల్లిదండ్రులను ఒప్పించి పెళ్ళి చేసుకొంటుంది. దీనికి మునుపే ఆమెను వివాహమాడాలనుకొన్న రాజు రాజ్యం మీదకు దండెత్తిరాగా ఆమె యొక్క భర్తయైన సాహు ఎదుర్కోవటం జరుగుతుంది. ఇందులో కర్మదేవి తన వివాహ విషయంలో స్వతంత్ర నిర్ణయం తీసుకొన్న ధీరగా కనబడుతుంది.

'అబలా సచ్చరిత్ర రత్నమాల' గ్రంథములోని ముందుమాటలో భాగంగా మొదటి రెండు విభాగాలలో 50 మంది స్త్రీల చరిత్రలున్నాయని తెలియజేయటం జరిగింది. వాటిలో 'వీరమతి' కథ మొదటిది. వీరమతి విద్యావంతురాలుగా యుద్ధవిద్యలు నేర్చి తనపై జరిగిన లైంగికదాడిని ఎదుర్కొని ఆత్మరక్షణ చేసుకొన్న ధైర్యసాహసాలుగల యువతి. కాబట్టి స్త్రీలు విద్యావంతులు అయితేనే సమాజంలో ధైర్యసాహసాలతో ఆత్మరక్షణ చేసుకోగలుగు తారని చెప్పి స్త్రీలను స్త్రీలే రక్షించుకోగలరనీ, స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన కథ ఇది.

'ఖానా' అనే ఆమె నక్షత్రాలు లెక్కపెట్టగల గణిత శాస్త్రజ్ఞురాలనీ, స్త్రీలు గణితాన్ని అభ్యసించగలరనీ, మేధోవంతులు కాగలుగుతారనీ తెలియజేసింది. ఈ గ్రంథంలోనే 12 వ శతాబ్దపు అల్లాకుతుబుద్దీన్ ఖిల్జి నుండి పద్మిని తనయుక్తితో భర్తను కాపాడుకున్న యువతి అనీ, రాణీరుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి వంటి యుద్ధపరాక్రమ యోధురాళ్లను గురించి తెలియజేసింది. అంతేకాక బ్రిటీష్ వాళ్ళ పరిపాలనలోనే ఉన్న విద్యావంతులు, మహాపరాక్రమవంతులైన యోధురాళ్లను గురించి కూడా తెలియచేసింది.

బ్రిటీష్ వాళ్ళ పరిపాలనలో మహారాష్ట్రయువతియైన ఆనందీబాయి జోషి స్త్రీవిద్యా విజయ దుందుభిని మ్రోగించిందనీ, వివాహానంతరం భర్త దగ్గర చదువు నేర్చుకొని డాక్టరు కోర్సు చదవటానికి అమెరికా వెళ్ళి అక్కడ భారతీయ సంప్రాదాయాలను విదేశీవనితలకు నేర్పిందని తెలియజేసింది. స్త్రీని చదివించాల్సిన బాధ్యత భర్తలకుందనీ, స్త్రీలు వివాహానంతరం చదివి పెద్దచదువులు చదువుకొని పాశ్చాత్యదేశాలకు వెళ్ళినా మన భారతీయ సంప్రదాయాలను వదిలిపెట్టరని తెలియజేసింది. ఈమె చరిత్రను వ్రాసి, ఆనాడు చదువుకుంటున్న స్త్రీలపైనున్న సామాజిక అపోహలను తొలగించే విధంగా అచ్చమాంబ స్త్రీ విద్యను ప్రోత్సహించింది. డాక్టరు కోర్సు చదివిన మొదటి భారతీయ మహిళ ఆనందీబాయి అని అర్థం అవుతోంది.

'సత్యవతి' అనే ఆమెను గురించి వ్రాస్తూ ఆంగ్లేయులు పన్నులు వేసినప్పుడు కట్టలేక బాధలు పడ్తుంటే, బ్రిటిష్ వారు పల్లెస్త్రీల ఇంటికి వెళ్ళి వస్తువులను వేలంవేసి పన్నులు వసూలుచేస్తున్న వ్యక్తిపై సత్యవతి కత్తి దూసింది. భర్తచనిపోయాడని ఆమెకు చెప్పినా

మామప్రోద్బలంతో సహగమనాన్ని విరమించి పురుష వేషం వేసికొని మామగారిని రక్షిస్తుంది. చనిపోయాడని చెప్పబడిన తన భర్త బందీగా ఉన్నాడని తెలిసి యుక్తితో అతణ్ణి విడిపించుకున్న ధైర్యసాహసాలున్న స్త్రీగా ఆమెనుగురించి తెలియచేసింది. 1921లో పన్నుల నిరాకరణోద్యమానికి స్ఫూర్తినిచ్చిన చారిత్రక స్త్రీ జీవితకథగా భావించవచ్చు.

1826 లో భర్త మరణానంతరం కొడుకు చిన్నవాడవటంతో రాజ్య రక్షకురాలుగా రాజ్యానికి వచ్చిన రఖుమాబాయి ఖజానా ఖాళీ అయిందని తెలుసుకొని తన నగలను అమ్మి వర్తకం ప్రారంభిస్తుంది. హిందూదేశం అంతటా వర్తకశాలలు ఏర్పరచి, ఆ డబ్బుతో అనేక దానధర్మాలు చేసిందనీ, రఖుమాబాయియొక్క చరిత్ర చెప్పి స్త్రీలకున్న వ్యాపారనైపుణ్యాన్ని తెలియజేసింది. స్త్రీలందరు వాణిజ్యం చేయగల సమర్థులనే ప్రేరణను కలిగించే విధంగా వ్రాసిన కథయిది.

ధనలక్ష్మి అనే విద్యావంతురాలైన స్త్రీకి ఒకనాడు తుఫాను వచ్చినపుడు పుస్తకంలో తాను చదివిన వాక్యంలో భాగంగా కట్టెనుపట్టి మునిగిపోకుండా నదిని ఈదవచ్చనే విషయం గుర్తుకు వచ్చింది. తామెక్కిన, ఓడ మునుగుతుంటే తనకొంగున భర్తను కట్టుకొని తానొక కట్టెను పట్టుకుని సముద్రపు నీటిని ఈదిన స్త్రీ చరిత్రను తెలిపి స్త్రీలు పుస్తకాలలో చదివిన విజ్ఞానాన్ని ఆపత్సమయంలో ఉపయోగించుకొనే తెలివిని కలిగియుంటారని స్త్రీలలో విద్యాస్ఫూర్తి కలిగే విధంగా వ్రాసింది.

'మహారాణి స్వర్ణమయి'ని గురించి వ్రాస్తూ ఆమె భర్త మతిభ్రమణంతో చనిపోతూ రాజ్యాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి వీలునామా వ్రాసి చనిపోయినపుడు, ఆమె ఆ నాటి సుప్రీమ్‌కోర్టులో దావావేసి బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకున్న ఆస్తిని తిరిగిపొందగలిగింది. ప్రజల పన్నుల భారాన్ని తగ్గించే విధంగా వ్యవసాయదారులకు సహాయాన్ని చేసిందనీ, స్త్రీ విద్యాలయాలు కట్టించిందని తెలిపింది. అపాత్రదానం కాకుండా ఆమె దానధర్మాలు చేస్తున్న విషయం  తెలుసు కొన్న బ్రిటీష్ వారు ఈమెకు 'క్రౌన్ ఆఫ్ ఇండియా' అనే బిరుదును ఇచ్చిన విషయాన్ని వ్రాసి, వితంతువు అయినా నిరాశచెందకుండా బ్రిటిష్ వారిపై న్యాయస్థానంలో పోరాడి ఆస్తిని హస్తగతం చేసుకొందని తెలియజేసింది. ఒక స్త్రీ ప్రజోపయోగ కార్యక్రమాలు చేయటాన్ని ఘనతగా చెప్పుకొనే వారనీ, ఆమెయొక్క చరితను తెలియజేసి నాటిస్త్రీలలో పోరాటపటిమను పెంచినట్లు అర్థమవుతుంది.

1879లో వనలతాదేవి అనే విద్యావంతురాలైన బెంగాలీయువతి వితంతుశరణాలయాలను నిర్వహించి, స్త్రీజనోన్నత కార్యక్రమాలు చేస్తుండేదని తెలిపింది. స్త్రీలు విద్యనేర్చితే స్వతంత్రంగా జీవించగలరనీ భావించి బెంగాల్ లో 'సుమతీ సమాజాన్ని' ఏర్పరచిందనీ, అదేపేరుతో మాసపత్రికను స్త్రీల కొరకు ప్రచురించిందనీ, శిశుపోషణ చేస్తూనే చివరి క్షణం కూడా తన భర్త ఆరోగ్యాన్ని పట్టించుకున్నదనీ తెలియచేసింది. స్త్రీలు విద్యావంతులైతే సామాజికాభ్యుదయానికి పాటు పడగలరనీ, భర్తకు విలువనిస్తారని తెలియజేస్తూ, నాటి పురుషుల సామాజిక అపోహలను

పోగొట్టే ప్రయత్నం భండారు అచ్చమాంబ చేసింది. స్త్రీలు సామాజికసేవలో ముందంజవేయటానికి తోడ్పడిన స్త్రీలచరిత్రలను 'అబలాసచ్చరిత్ర రత్నమాల' లో పొందుపరచిన ఆమె చిరస్మరణీయురాలు.

స్త్రీవిద్యావశ్యకతను స్త్రీలు విద్యావంతులుగా, పరాక్రమశక్తిమంతులుగాను రంజిల్లిన చారిత్రక నేపథ్యాన్ని తెలియజేసిన ఈ పూర్వ స్త్రీలసాహిత్యం, క్రీ.శ.1900 సం.నాటి స్త్రీలకు ప్రేరణకాగా స్త్రీలకు తమ వ్యక్తి సాతంత్ర్యపు విలువలు అవగాహనకు వచ్చి, వాటిని సాధించటానికై తాము ముందుగా విద్యావంతులు కావలసిన ఆవశ్యకతను గుర్తించారు. ఇది దేశస్వాతంత్ర్య సాధనకు కూడా అవసరమైన విషయంగా భావించి, స్త్రీలందరిలో తదనుగుణ చైతన్యాన్ని కలిగించటానికి అనంత సాహిత్యాన్ని స్త్రీలు సృజించారు. స్త్రీల వ్యక్తిసాతంత్ర్య ఉద్యమాన్ని, దేశస్వాతంత్ర్య ఉద్యమాన్ని అవగాహన చేసుకోవటానికి క్రీ.శ 1900 సం. తరువాత వచ్చిన ఉద్యమ స్త్రీలసాహిత్యాన్ని తెలుసుకోవాలి.

## 1.4. స్త్రీల స్వతంత్రత-దేశస్వాతంత్ర్యం

స్త్రీలయొక్క స్వతంత్రజీవన సమాలోచనలు విస్తృతమై, స్త్రీల హక్కులచైతన్యాన్ని నింపుకొని వివక్షారహిత రాజ్యాంగ నిర్మాణానికై రహదారులు వేసాయని నాటి స్త్రీలసాహిత్యాధ్యయనం తెలియజేస్తుంది. భారతదేశ రాజ్యాంగానికి మహిళలహక్కుల పరిరక్షణకు అవినాభావ సంబంధం ఉంది. హక్కుల వినియోగమే స్వాతంత్ర్యానికి చిహ్నం. పరాయిపాలనను పారద్రోలి దేశస్వాతంత్ర్య సాధనలో నాటి స్త్రీ, పురుషుల భాగస్వామ్యపు స్మరణ రాజ్యాంగ స్ఫూర్తిని కల్గించింది. కాని స్త్రీ,పురుష వివక్షారహితమైన ప్రజాస్వామ్యపు రాజ్యాంగ నిర్మాణానికి సోపానాలు వేసినది మాత్రం స్త్రీల స్వతంత్రజీవన సమాలోచనలే అని నాటి స్త్రీలసాహిత్య అధ్యయనంవల్ల అవగాహన కలుగుతుంది. భారతదేశ న్యాయచట్టాలను రూపొందించటంలో ఈ స్త్రీల సాహిత్యం దిక్సూచి వంటిదని అర్థమవుతుంది. ఆంధ్రప్రాంతంలో స్త్రీజనం చేసిన ప్రాథమిక హక్కుల పోరాటం భారతదేశ రాజ్యాంగానికి రహదారులను వేసిందనేది చారిత్రక సత్యం. ఈ సత్యావిష్కరణకు స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి స్త్రీలభావాలను ప్రతిఫలింపజేసిన స్త్రీల సాహిత్యం భూమిక కాగలిగింది. అందుకే తోటి స్త్రీలను చైతన్య పరుస్తూ స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు, దేశస్వాతంత్ర్య సముపార్జనకు స్త్రీలలో పెరిగిన ఆలోచనల చైతన్యానికి అక్షరాకృతియై కరదీపికగా ఉన్నటువంటి క్రీ.శ.1900సం. నుండి 1947సం. వరకు తెలుగులో వచ్చిన పత్రికలలోని ఈ స్త్రీలసాహిత్యాన్ని వేదికగా చేసుకోవాలి.

భారతదేశ స్వరాజ్య సంపాదన ప్రధానలక్ష్యంగా రాజకీయస్వాతంత్ర్యానికై పురుషులతోపాటు స్త్రీలు పోరాటం చేస్తూ, అదనంగా స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యానికై సమాంతరంగా పోరాడవలసి వచ్చింది. ముందుగా స్త్రీలు తమ అస్వతంత్ర జీవనానికి, అవిద్యకు ఉన్న లంకెను గుర్తించి తమ జీవనహక్కుల వినియోగానికై విద్యావంతులు కావల్సిన అవసరాన్ని గుర్తించారు. స్త్రీలకు స్వాతంత్ర్యం

ఉంటేనే దేశ స్వాతంత్ర్యం వచ్చినా ప్రయోజనం ఉంటుందని కందుకూరి వీరేశలింగం భావించి స్త్రీవిద్యకు పునాదులువేసారు. వేమూరి శారదాంబ 1896లోనే తాను వ్రాసిన 'మాధవ శతకం'లో స్త్రీలను చదువుకో నీయకుండా చేస్తున్న సామాజిక కుటుంబ అసమాన సంస్కృతిని ప్రశ్నకు పెట్టి స్త్రీవిద్యపట్ల ఆలోచనలను రేకెత్తింపజేసింది. ఇవే ప్రజాస్వామిక రాజ్యాంగ సమాన హక్కులకు, లింగవివక్షలేని విద్యాహక్కుకు పునాదులు వేసాయని అర్థం చేసుకోవచ్చు.

క్రీ.శ. 1900సం.నాటికి కాస్త విద్యావంతులైన స్త్రీలు విదేశీ స్త్రీల జీవితాలను వారియొక్క రాజకీయ హక్కులను తెలుసుకుంటూ కుటుంబంలో తమ అస్తిత్వాలను గురించిన ఆలోచనలను పెంచుకున్నారు. అందుకే 1902 నుండి స్త్రీవిద్య అభివృద్ధిచెందటానికి 'స్త్రీసమాజాల' నే పేరుతో స్త్రీలు సమాజాలను ఏర్పాటు చేసుకోవటంతో స్త్రీవిద్యా ఉద్యమం ఊపందుకొంది. 1902 నుండి వచ్చిన భండారు అచ్చమాంబ రచనలలో స్త్రీలు విద్య ద్వారా జ్ఞానాన్ని పొంది తమ బానిసత్వాన్ని తొలగించుకునే స్వతంత్రపు ఆలోచనలను పెంచుకొని తోటి స్త్రీలకు పంచాలనుకోవటం జరిగిందని అర్థమవుతుంది. అందుకే స్త్రీలు పత్రికారంగంలో ప్రవేశించి ప్రత్యేకంగా స్త్రీల సాహిత్యాన్ని ప్రచురించటం జరిగింది. స్త్రీల వ్యక్తిస్వతంత్ర్య సాధనకు, దేశస్వాతంత్ర్య సాధనకు అవసరమైన సాంఘిక–సాంస్కృతిక, ఆర్థిక–రాజకీయ చైతన్యాన్ని రగిలించింది ఈ స్త్రీల సాహిత్యమే. స్త్రీవిద్య స్త్రీలలో ధైర్యస్థైర్యాలను పెంచుతుందని భావించిన స్త్రీలు ఇంట్లో తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించగలమనుకోవటమే భారత రాజ్యాంగం నిర్వచించిన ఆలోచనల స్వేచ్ఛకు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు మార్గాన్ని ఏర్పరచింది. స్త్రీలలో వ్యక్తిత్వస్పృహ పెరిగి స్త్రీల అస్తిత్వకాంక్ష మొగ్గతొడిగింది. 1903 నాటికి స్త్రీలకు ఉన్నత విద్యావకాశాలు పెరగాలనీ, గణితం, చరిత్ర, బాలవైద్యం తెలిసి ఉండాలని స్త్రీ సమాజాల ద్వారా చైతన్యం కలిగిస్తే స్త్రీజన సామూహిక స్వేచ్ఛ స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి ప్రేరకమవుతుందనీ భావించారు. స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా స్త్రీలు స్వయంగా బాలికాపాఠశాలలను నెలకొల్పి స్త్రీ విద్యకు బాటలు వేసారు. అంతేకాదు స్త్రీల చదువుకు వైవాహిక సంస్కృతి ఆటంకంగా ఉన్నదని బాల్యవివాహాలను నిరసించటమే కాక స్త్రీ పునర్వివాహపు హక్కులను గురించిన ఆలోచనలు పెంచుకొని గౌరవప్రదమగు జీవన హక్కులను గుర్తించటం జరిగింది. పురుషులతో పాటు స్త్రీలు సమానంగా జన్మించినా అటు తండ్రియొక్క గాని ఇటు భర్తయొక్క ఆస్తిలో గాని హక్కులేనితనాన్ని గుర్తించి ఆడవాళ్ల యొక్క వారసత్వపు ఆర్థికహక్కుల దిశగా ఆలోచనలు పెంచుకున్నారు. 1904 సం.నాటికే స్త్రీలకు ఆస్తిహక్కు ఉండాలని భావించారు.

1905లోనే స్త్రీవిద్యాభివృద్ధికి దేశాభివృద్ధికి ఉన్న సంబంధాన్ని గుర్తించారు. స్వదేశీవస్తు వినియోగానికై సాహిత్యప్రచారం చేసారు. దేశస్వాతంత్ర్యం కోసం స్త్రీ, పురుషులు ఐకమత్యంతో పోరాడిల్సిన అవసరాన్ని గుర్తిస్తున్న రోజులలోనే అంటే 1905 లోనే స్త్రీలస్వతంత్రత కోసం స్త్రీలే ఐకమత్యంతో పోరాటం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. స్త్రీవిద్యకు, స్త్రీల అస్వతంత్ర

జీవనానికి, దేశస్వాతంత్ర్యానికి ఉన్న లంకెను గ్రహించగలిగారు. వితంతు స్త్రీల దుస్థితికి కారణమైన సమాజసంస్కృతిని గుర్తించారు. 1905లో బెర్లిన్ లో జరిగిన ప్రపంచ స్త్రీల సభలో పాల్గొన్న భారతదేశ స్త్రీలు తమ దేశ అస్తిత్వాన్ని గౌరవాన్ని నిలపటానికి తమ ఖద్దరు చీర చెంగులను చించి జెండాను తయారుచేసి ప్రదర్శించటం, నాటి భారతజాతీయగీతాన్ని ఆలపించటం స్త్రీల స్వతంత్ర నిర్ణయాలకు నిదర్శనమని భావించవచ్చు. 1906లో లండన్ నుంచి వచ్చిన దాదాభాయి నౌరోజి కోసం ఏర్పాటు చేసిన సభలో భారతదేశ వారసత్వంకల ఒక మేడం కామా అనే పారశీక స్త్రీ పతాక ఆవిష్కరణ చేయటం జరిగింది. 1906 నాటికే స్త్రీలయొక్క వివాహపు సంకెళ్ళను తెంచుకొని వైవాహిక స్వాతంత్ర్యాన్ని పొందాలకొన్నారు. 1910 నాటికే స్త్రీలసాహిత్యంలో స్త్రీ, పురుషుల స్వతంత్ర జీవనంలోని తేడాను గుర్తించే ఆలోచనలు స్పష్టమయ్యాయి. అవిద్య, ఆస్తిహక్కులేమియే స్త్రీల అసమానత్వానికి కారణం అనీ, స్త్రీలు అదనంగా సాంఘిక, ఆర్థిక, స్వాతంత్ర్యాలకోసం పోరాడాలని భావించారు. స్త్రీల స్వాతంత్ర్యానికి దేశస్వాతంత్ర్యానికి ఉన్న లంకెను గ్రహించి ముందుగా స్త్రీలు భౌతిక, బౌద్ధిక, మానసిక స్వేచ్ఛను అనుభవించ గలిగినప్పుడే దేశస్వాతంత్ర్య సాధన సులభతరం అవుతుందని భావించారు. స్త్రీల అవిద్యా నిర్మూలనకు కృషిచేస్తూనే, ఆర్థికస్థోమత దిశగా అడుగులువేసే క్రమంలో గృహపరిశ్రమల తయారీతో ఆదాయాన్ని పొందాలనుకున్నారు. స్వరాజ్యసాధనకై తిలక్ ప్రస్తావించిన స్వదేశీవస్తు తయారీలో భాగంగా స్త్రీలు నూలువడకటం, స్వదేశీసబ్బుల తయారీవంటివి నేర్చుకున్నారు. బ్రిటిష్ వారు యాంత్రిక వస్తుతయారీతోనే భారతదేశ ఆర్థికస్వామ్యాన్ని పొందుతున్నారని గ్రహించి దానికి విరుగుడుగా స్త్రీలు గృహపరిశ్రమల ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకోవటం చేసారు. 1910 లో స్త్రీవిద్య స్త్రీలనాగరికతా చిహ్నమని భావించారు. విద్యవల్ల స్త్రీలు పాశ్చాత్య జ్ఞానాన్ని పెంచుకోవటంతో 1910 నాటికే ఓటుహక్కును గుర్తించి స్త్రీలు రాజకీయచైతన్యాన్ని పెంచుకోవటం జరిగింది. ఆ నాటికే స్త్రీలు రజస్వలానంతరం వివాహంచేసుకొనే స్వతంత్రతకై ఉద్యమచైతన్యాన్ని పొందగలిగారు. అంటే 20 వ శతాబ్దపు మొదటి దశకంలోనే స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూనే దేశస్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాలుపంచుకోగలిగారు.

1911 నాటికి స్త్రీవిద్యాహక్కును ప్రతిపాదించారు. పనివిభజన స్త్రీపురుషులకు సమానంగా ఉండాలని భావించారు. స్త్రీలు తమ ఆరోగ్యం గురించి ఆలోచించటంతో పాటు పురుషుల బహుభార్యాత్వపు సంస్కృతిని నిరసిస్తూ స్త్రీ పురుషులకు కుటుంబంలో సమాన సంస్కృతిగల లైంగిక హక్కు ఉండాలని భావించారు. స్త్రీలు తమ ఆరోగ్యభద్రతకు సంబంధించిన చైతన్యాన్ని పెంచుకున్నారు. 1911లోనే స్త్రీ– పురుషుల సమానత్వపు ఆలోచనలు పెరిగి తమకు పురుషులతోపాటు సమాన గౌరవస్వాతంత్ర్యాలు ఉండాలనుకున్నారు. 1912 నాటికి 'విడాకుల' ప్రస్తావన తెచ్చారు. హిందూవివాహ చట్టాన్ని గురించి ఆలోచనలు నాడే కలిగాయి. విదేశాలలో స్త్రీల విద్యావిధానాన్ని ఆకళింపు చేసుకొన్నారు. దైవభక్తి కంటే దేశభక్తి, దేశాభిమానం ముఖ్యమనీ,

సంఘదురాచార నిర్మూలనయే దేశాభివృద్ధిమార్గమని భావించారు. స్త్రీలకు రాజకీయోద్యోగాల అర్హత ఉండాలను కొన్నారు. 1916 లో స్త్రీలకు సమాన ఆర్జనావకాశాలు గల స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకతను గుర్తించారు. అదే దేశస్వాతంత్ర్యసాధనకు మార్గాన్ని ఏర్పరుస్తుందని భావించారు. 1917లోనే స్త్రీలకు విశ్వవిద్యాలయం ఉండాలని భావించారు. 1918 నాటి స్త్రీలు రాజకీయ స్వాతంత్ర్యానికి తాము అర్హులనే భావనను పెంచుకున్నారు. అప్పుడే స్త్రీలు రాజకీయాలలో పాల్గొనేందుకు లింగవివక్ష కారణమనీ గ్రహించారు. 1919 లో ఉద్యోగాలలో స్త్రీ పురుషులకు సమాన అవకాశాలు ఉండాలను కున్నారు. అందుకనే 1919 ఇండియా చట్టం పాలనలో ముస్లిములకు ప్రత్యేక నియోజక స్థానాలను కేటాయించేసరికి 1919 లోనే స్త్రీలకు ప్రత్యేక నియోజక స్వాతంత్రం ఉండాలనే ఆలోచనన చేసారు. ఆ కారణంగానే స్త్రీలు 1920 లో గాంధీజీ పిలుపుతో సత్యాగ్రహోద్యమంలో భాగస్వాములై సహాయ నిరాకరణోద్యమాన్ని ముందుండి నడపగలిగారు. స్త్రీలు ఎదుర్కొనే కుటుంబ హింసను చట్టానికి పట్టించేస్థితికి వారి ఆలోచనలు పెరిగాయి. 1924లో స్త్రీల స్వయంపోషకత్వం తమ స్వతంత్ర జీవనానికి అవసరమని భావించారు.

1925 నాటికి స్వరాజ్య సంపాదన స్త్రీల విద్యుక్తధర్మమని భావించారు. స్త్రీసమాజాలు అభివృద్ధి చెంది 1927 నాటికి రాష్ట్ర, జాతీయమహిళాసభలు ఏర్పడ్డాయి. 1929 లో స్త్రీని నిర్వచిస్తూ ఆమెకు శరీరముంది, మెదడుంది, హృదయముందనీ, కానీ వాటిపై పురుషుని అధికారం ఉంటోందని, స్త్రీ పురుషుని సొత్తుకాదని భావిస్తూ, స్త్రీలు స్వతంత్రంగా జీవించేహక్కును తమ మానవహక్కుగా భావించారు. 1929 నాటికి విద్యావంతులైన స్త్రీలకు ఓటుహక్కు లభించింది. పురుషులు దేశస్వాతంత్రాన్ని పొందటానికి ముందే స్త్రీ స్వతంత్రురాలు కావాలనుకున్నారు. స్త్రీలకు స్వాతంత్ర్యం జన్మహక్కనీ, మానవహక్కు అనే ఆలోచనలు పెంచుకున్నారు. 1930 లో స్త్రీలకు పురుషులతోపాటు సమానమైన గౌరవహక్కులుగల సామాజిక జీవనం కావాలనుకొని చట్టప్రయోజనాలను తెలుసుకుంటూ స్త్రీలహక్కులను సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు.

1930 లో ప్రారంభమైన ఉప్పుసత్యాగ్రహంలో స్త్రీలు పాల్గొని రాజకీయ స్వాతంత్ర్యంకోసం పోరాడి జైలుపాలయ్యారు. గర్భిణిలుగాను, ప్రసవవేదనను జైళ్ళల్లో భరించారు. అప్పుడే స్త్రీలు తమ భావస్వేచ్ఛకు సంబంధించి చట్టపరమైన హక్కులను విశ్లేషించుకున్నారు. 1931లో మద్రాసు లోకల్ బోర్డులచట్టం వచ్చింది. గ్రామస్వరాజ్యంలో స్త్రీల భాగస్వామ్యం ఉండాలనుకున్నారు. మున్సిపాలిటిలు, బోర్డులు ఏర్పడ్డ నేపథ్యంలో స్త్రీలు 1932 లో పాలనారంగంలోకి అడుగువేయటం, క్రమంగా నామనిర్దేశంగా పదవిని పొందటంకాక స్త్రీలు ఎన్నుకోబడి స్త్రీల సమస్యలను తీర్చటానికి స్త్రీల స్వతంత్ర నిర్ణయాధికారానికి బాటలు వేయాలనుకున్నారు. ఆ రకంగా తమకు రాజ్యధికారాలలోని పాలనహక్కులను పొందాలనుకున్నారు. 1932 లోని శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు పోలీసుల చేతిలో మాన, ప్రాణ, జీవనహక్కుల భంగాన్ని

అనుభవించినా ఉద్యమ ధైర్యాన్ని కోల్పోలేదు. స్త్రీలు అబలలుకాదు ప్రబలలని నిరూపించు కోవాలనుకొన్నారు. 1932 నాటికి స్త్రీలు తాము ఎదగగలిగి తోటివారికి సహాయపడగల స్థితికి చేరుకోవాలనీ, ఆదాయాన్ని పెంచు కోవటానికి వ్యాపారపు మెలకువలు గ్రహిస్తూ ఆర్థికశక్తిగా ఎదిగితేనే దేశ స్వాతంత్ర్యానికి పాటుపడగల సమర్థత స్త్రీలకు ఉంటుందని భావించారు. 1933 లో కుటుంబంలోని భర్తల అధికారాలను ప్రశ్నకు పెట్టటంతోపాటు స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యపు హక్కును సంపాదించుకోవాలనుకున్నారు.

1935లోనే స్త్రీలు తమ సామాజిక అస్తిత్వాలకు సంబంధించిన ఆలోచనలు పెంచుకొని సామాజిక సంస్కృతిని నిరసించే విధంగా స్వతంత్ర నిర్ణయాలు చేసుకోవాలని భావించారు. 1935 నాటికి ఎన్నికల ద్వారా శాసనసభ్యత్వంకై స్త్రీ-పురుషులకు సమాన ప్రాతినిథ్యం ఉండాలనే రాజకీయ హక్కులచైతన్యం అభివృద్ధి చేసుకున్నారు. ఉన్నత విద్యావంతులైనస్త్రీలకేకాక సంతకం చేయగలిగిన స్త్రీలకు ఓటుహక్కును, ఎన్నికల హక్కును విస్తరింపజేయాలనుకున్నారు. రాష్ట్రీయస్వాతంత్ర్యానికి, అంతర్గత స్వపరిపాలనకు రాజ్యాంగం ఏర్పాటు చేసుకునే దిశగా స్త్రీలు పురుషులతో పాటు ఉద్యమంలో పాల్గొన్నారు. 1935 లో స్త్రీల హక్కులకై శాసనసభలో బిల్లును పెట్టాలనుకున్నారు. స్త్రీలు తమకు సంపూర్ణస్వేచ్ఛ కావాలనుకున్నారు. 1936 లో సాంఘిక, రాజకీయ, ఆర్థికరంగాలలో స్త్రీ పురుష సమానత్వపు ఆవశ్యకతను గుర్తించి లింగవివక్ష ఉండకూడదనీ రాజకీయ రంగాలలో ఎన్నికకాబడే హక్కు పురుషులకు వలె స్త్రీలకు ఆత్మహక్కని భావించారు. 1936 లోనే స్త్రీలు తాము చేసే ఇంటిచాకిరికి వేతనాలు కావాలని కోరుకున్నారు. 1937లో పురుషులతో పాటు సమానంగా స్త్రీలు ఉద్యమంలో పాల్గొనటానికి స్త్రీల గర్భధారణ ఆటంకంగా ఉన్నదని భావించారు. స్త్రీలు కేవలం సంతానాన్ని కనే జీవయంత్రాలు కాదనీ, తల్లినవ్వాలనుకోవటంగాని గర్భస్రావం వంటి విషయాలలో గాని స్త్రీలకు హక్కుఉండాలని ఆనాడే గుర్తించటం జరిగింది. విదేశాలలో వలె స్త్రీలు సైన్యంలో కూడా చేరవచ్చనే ఆలోచనలు పెరిగాయి. స్త్రీల వ్యక్తిత్వాలను అగౌరవపరిచే పత్రికా ప్రకటనలను, చిత్రాలను నిరసించారు. 1938 నాటికి ప్రత్యేక నియోజకవర్గాలకు స్త్రీలు శాసనసభ్యులుగా ఎన్నిక కాబడి తమ రాజకీయ హక్కులను పొందాలనుకోవటం జరిగింది. దానితో రాజకీయాలకు, స్త్రీలస్థితికి ఉన్న సంబంధాన్ని గుర్తించారు. అంతేకాక పెళ్ళిళ్ళు రిజిష్టర్ చేయబడాలని కోరుకున్నారు. 1938 నాటికి శాసనసభ సభ్యత్వానికి ఎన్నుకొనబడే హక్కును సాధించుకున్నారు. సామాన్య స్త్రీలుకూడా కాస్త చదువుకోవటంచేత ఓటును వేయగల హక్కును వారు సంపాదించుకున్నారు. 1938 నాటికే స్త్రీలు న్యాయచట్టాలయొక్క లింగవివక్షా స్వభావం స్త్రీలకు పురుషులతో సమానంగా జీవించేహక్కు లేకుండా చేసిందని గ్రహింపు కలిగి సాంఘిక, ఆర్థిక, న్యాయాలను ప్రశ్నకు పెట్టటం జరిగింది.

1938 నాటికే స్త్రీ సమస్యలన్నీ పురుషుల సమస్యలలో కలిసి ఉన్నాయనీ గుర్తించటమే కాక స్త్రీలు పురుషులు సమానంగా జీవించేహక్కు కలిగిఉంటేనే స్త్రీల స్వతంత్రపు జీవనహక్కుకు

రక్షణ ఉంటుందని భావించారు. ఆర్థికవిధానం మారాలని స్త్రీలకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ హక్కులు కావాలని స్త్రీలకు స్వాతంత్ర్యం జన్మహక్కని భావించారు. 1940-41 లో వ్యక్తి సత్యాగ్రహోద్యమంలోనూ, 1942లో జరిగిన క్విట్ఇండియా ఉద్యమంలోనూ పురుషులతో పాటు సమానంగా స్త్రీలు భారతీయజెండాను చేపట్టి ఉద్యమం చేయటం జరిగింది. 1947 ఆగస్టు 15వ తేదీన ఎగురవేయబోయే భారతదేశ స్వాతంత్రపు జెండాను తెలుగింటి కోడలైన సరోజనీ నాయుడు, నెహ్రూకు అందించటం జరిగింది. డా. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ నిర్మాణ సంఘసభ్యురాలిగా ఆంధ్రవనితయైన గుమ్మడిదల దుర్గాబాయి (దేశముఖ్) స్త్రీలకు సమానహక్కులు, సమానన్యాయం ఉండాలని సూచించటమే ఒక ప్రక్క స్త్రీలస్వతంత్రతకు, దేశస్వాతంత్ర్యానికిని, మరొకవైపు స్త్రీలహక్కుల చైతన్యానికి స్వతంత్ర భారతదేశ రాజ్యాంగ నిర్మాణానికి ఉన్న అవినాభావసంబంధం అర్థమవుతుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలకుకూడా భారత ప్రజాస్వామిక రాజ్యాంగంయొక్క అమలులో స్త్రీలు పురుషులతో సమానంగా జీవించలేని దశలో ఉండటానికి కారణాలు విశ్లేషించుకుంటూ స్త్రీలు తమ హక్కుల పరిరక్షణకై మరింతగా కృషిచేసే దిశగా సాగటానికి స్వాతంత్రోద్యమం నాటి స్త్రీల సాహిత్య పఠనం అవసరం. స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన వారిఆలోచనల పరిణామాన్ని స్మరించుకోవటానికి వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో పాత తెలుగు పత్రికలలో నిక్షిప్తమై విస్తృతంగా, విస్మృతంగా పడియున్న నాటి స్త్రీల సాహిత్యం ఇచ్చిన చైతన్యం నేటికీ స్ఫూర్తిదాయకం. కాలానుగుణంగా వచ్చిన స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన స్త్రీల స్వతంత్ర జీవన హక్కుల చైతన్యం, స్త్రీ, పురుషులు చేసిన దేశస్వాతంత్రపు స్వరాజ్య హక్కుల పోరాటం కలిసివెరసి వివక్షారహితమైన భారతదేశ ప్రజాస్వామిక రాజ్యాంగ నిర్మాణానికి దారిదీపాలుగా భాసించాయనే స్పృహ కలిగి, నేటికీ స్త్రీలహక్కుల పరిరక్షణ దిశగా సాగటానికి అది అవసరమని అర్థమవుతుంది. ఈ సాహిత్యాన్ని తెలుసుకోవటానికి ముందుకు సాగాలి.

## 2. సాహిత్యం (క్రీ.శ.1900-1909) - స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యోద్యమం స్త్రీవిద్య - వందేమాతరం ఉద్యమం - సాంఘిక, సాంస్కృతిక చైతన్యం

క్రీ.శ. 1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటు తరువాత ఏర్పడిన పరిణామాలలో భాగంగా క్రీ.శ. 1870 లోనే బ్రిటిష్ వారి వ్యాపారాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలో గణేష్ వాసుదేవజోషి స్వయంగా నూలువడికి తనవస్త్రాలను తానే తయారుచేసుకుని ధరించేవాడని చరిత్ర తెలియజేసింది. స్త్రీ విద్యా ఉద్యమం ప్రారంభమైంది. బ్రిటిష్ పాలన యెడల ప్రజావాహినిలో అసంతృప్తుల జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. భారతీయులు పరాయిపాలన యొక్క పీడన గురించి మాట్లాడు కోవటానికి ఏర్పరుచుకున్న సమావేశమే 1885 నాటి అఖిలభారతకాంగ్రెస్. 1905 లో జరిగిన వంగరాజ్య విభజనను వ్యతిరేకిస్తూ వందేమాతరం ఉద్యమం ప్రారంభమయింది. ఆ క్రమంలో 1905-06 ప్రాంతాలలో తిలక్ స్వదేశ వస్తు తయారీని ప్రబోధిస్తుంటే 1908 లో తిలక్ గురువైన దాదాభాయ్‌నౌరోజీ 'స్వరాజ్' ఆదర్శాన్ని ప్రకటించారు. వంగ రాజ్యవిభజన అనంతరం రూపొందించిన 'వందేమాతరం' గీతాలాపన ప్రచారానికై ఆంధ్రదేశానికి వచ్చిన బిపిన్ చంద్రపాల్ రాజకీయ సంచలనాన్ని కలిగించారు. బాలగంగాధర తిలక్ నినాదమైన 'స్వరాజ్యం జన్మహక్కు' అన్న భావన బలంగా నాటుకోవటం జరిగింది. అతివాదులుగా బాల్, పాల్, లాల్ త్రయం (బాలగంగాధర తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్) స్వదేశీపాలనకై వందేమాతరం ఉద్యమాన్ని ఊపందుకునేటట్టు చేశారు. తిలక్ నినాద ప్రభావంతో స్త్రీలలో స్వతంత్రం తమ జన్మహక్కు అనే భావన ఏర్పడటంచేతనే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం అవసరమని గుర్తించారు.

భారతీయులు స్వాతంత్ర్యసాధనకంటె ముందు సంఘసంస్కరణయే ముఖ్యమైనదిగా భావించారు. సమాజంలో స్త్రీలు కుటుంబ బానిసత్వంనుండి విముక్తి కాగలిగినపుడే వారి ఆలోచనలు విస్తృతమవుతాయనీ, అప్పుడు మాత్రమే స్త్రీలు స్వాతంత్ర్యాన్ని పొందగలరని భావించిన సంఘసంస్కర్తలు ముందుగా స్త్రీలలో సాంఘిక చైతన్యాన్ని కలగించాల్సిన అవసరాన్ని గుర్తించారు. దానికై స్త్రీలు విద్యావంతులు కావాలని భావించారు. భారతదేశంలో బాలికాపాఠశాలలును

ఏర్పడ్డాయి కాని ఆ పాఠశాలలకు ఆడపిల్లలను పంపటానికి నాటి తల్లిదండ్రులు అంతగా యిష్టపడ లేదు. బాల్యవివాహాలను చేసి ఆడపిల్లల బరువును వదిలించుకునే రోజులవి. అందుకే కాస్త చదువుకొన్నస్త్రీలు ముందుగా స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని స్త్రీవిద్యాప్రచారానికి పూనుకొన్నారు. పల్లెల్లో కూడా బాలికాపాఠశాలలుంటే తప్ప ఆడపిల్లలు చదువుకోలేరు. స్త్రీలు విద్యావంతులవటానికి బాల్యవివాహాలు ప్రధాన అవరోధమని భావించటంతో ముందుగా వాటిని రూపుమాపాలనుకున్నారు. అందుకని స్త్రీలు తమ విద్యాభివృద్ధికోసం తామే పాటుపడాలనీ దాని కోసం బాల్యవివాహాలను నిషేధించాలని గ్రహించారు. ముసలివరుడు కన్యాశుల్కాన్ని చెల్లించి చిన్నపిల్లని పెళ్ళి చేసుకోవటంతో బాలవితంతువుల సంఖ్య ఎక్కువైందని గ్రహించారు. ఆస్తిహక్కు లేనివారుగా ఉన్న బాలవితంతువులు కూడా చదువు కొని తమ విద్యాప్రాముఖ్యతను గురించి ఉపన్యసిస్తూ, నాటకాలు వేస్తూ, కథలు, వ్యాసాలను వ్రాసి, వాటి ప్రచురణకై స్త్రీలు సంపాదకత్వాన్ని కూడా వహించారు. తోటిస్త్రీలలో చైతన్యాన్ని కలిగించటానికి స్త్రీలు తమ ఆధ్వర్యంలో పత్రికలను ప్రారంభించారు.

కాలక్రమంలో ప్రాథమిక పాఠశాలవిద్యయేగాక నాటి స్త్రీలు ఉన్నతవిద్యను, పారిశ్రామిక విద్యలను నేర్చుకోవాల్సిన అవసరాన్ని గుర్తించటంతోపాటు స్త్రీలకు స్వతంత్ర జీవనావశ్యకత ఉండాలని భావించారు. పురుషులకు స్త్రీలు భయపడినన్నాళ్ళూ స్త్రీలకు స్వతంత్ర వ్యక్తిత్వం లేదనీ, పురుషులతో సమానమైన జీవనం ఉన్నప్పుడే స్త్రీల బానిసత్వం పోతుందని గ్రహింపు కలిగింది. స్త్రీల ఆలోచనలు గౌరవింపబడి నప్పుడే స్త్రీకి వ్యక్తి స్వాతంత్ర్యం ఉన్నట్లనీ, అప్పుడే సమాజాభివృద్ధి ఉంటుందని భావించారు. స్త్రీలు విద్యను, ఆస్తిని కలిగిఉండటమే స్త్రీల వ్యక్తిస్వతంత్రతకు నిదర్శనమని భావించారు. అందుకని స్త్రీలు తమకు ఆస్తి హక్కు ఉండాలని భావించారు. ఆ రోజుల్లోనే తిలక్ స్వరాజ్యం జన్మహక్కు అని వందేమాతర ఉద్యమాన్ని ప్రచారం చేయటం జరిగింది. దానిలో భాగంగా బిపిన్ చంద్రపాల్ ఆంధ్రప్రాంతంలో చేసిన ఉపన్యాసాలను వినటంతో స్త్రీలు తమకు స్వతంత్రజీవితం జన్మహక్కు అని భావించారు. పరాయిపాలనలోని దేశబానిసత్వాన్ని స్త్రీలు గుర్తించి, దాని విముక్తికై ఆలోచించటం మొదలుపెట్టారు. దేశదారిద్ర్య నిర్మూలనకై స్వదేశీ వస్త్రతయారీని మొదలుపెట్టారు. తమకు ఆధ్యాత్మిక జ్ఞానంకంటే కూడా ప్రపంచజ్ఞానం కావాలనుకున్నారు. ఈ ప్రపంచజ్ఞానమే స్త్రీలకు స్వతంత్రతను కలిగిస్తుందని అనుకొన్నారు. అంతేకాదు సమాజంలోని లింగవివక్షా సంస్కృతిని గుర్తించి స్త్రీలు, పురుషులు సమానమనే భావన కలిగేటట్లుగా స్త్రీలు సాహిత్యాన్ని సృష్టించారు. తమ పెళ్ళికి మునుపు 3,4 తరగతుల వరకు చదువుకున్న స్త్రీలు ముందుకు వచ్చి ఆడపిల్లలకు చదువు చెప్పించాల్సిన అవసరాన్ని ప్రచారం చేయటానికి సాహిత్యసృజన చేసారు.

స్త్రీవ్యక్తి స్వాతంత్ర్య సాధనకై 20 వశతాబ్దపు మొదటి దశకంలోనే స్త్రీలను చైతన్య పరచటానికి స్త్రీలు సాహిత్య సృజన చేసారు. స్త్రీలు విద్యావంతులైతేనే స్వతంత్రులు కాగలరని భావించి స్త్రీసమాజాలను ఏర్పాటు చేసుకొన్నారు. స్త్రీవిద్యాభివృద్ధిని పత్రికాముఖంగా ప్రచారం

చేయటంతో పాటు స్వదేశీవస్తు తయారీని అలవాటుచేసుకొని స్త్రీలు రాజకీయవ్యవహారాలకు సంబంధించిన ఆలోచనలను పెంపొందించుకొన్నారు. సామాజిక స్త్రీల భావాలకు ప్రతినిధులుగాను, తోటి స్త్రీలను చైతన్యవంతుల్ని చేయటానికి స్త్రీలు వ్యాసాలు, కథలు, నాటకాలు, కవితలు, కీర్తనలు, మంగళహారతులను వ్రాసారు.

క్రీ.శ.1900 నుండి వచ్చిన స్త్రీలసాహిత్యం స్త్రీలలో విద్యాపరమైన సాంఘిక చైతన్యాన్ని కలిగించి వ్యక్తిస్వాతంత్ర్యానికి ద్వారాలు తెరిచిందనీ, అది క్రీ.శ. 1910 నాటికి ఆర్థిక-రాజకీయ ఆలోచనల చైతన్యంగా పరిణమించిందనే విషయం నాటి స్త్రీలసాహిత్యంలో అర్థమవుతుంది. స్త్రీలసాహిత్యం కలిగించిన చైతన్యంతో క్రమంగా స్త్రీలు తమ విద్యావశ్యకతను గుర్తించి అనతి కాలంలోనే సాంఘిక చైతన్యాన్ని తెచ్చుకొని, దేశాభివృద్ధికై ఆర్థిక, రాజకీయ వ్యవహారాలపట్ల ఆలోచనలను పెంచుకొన్నారు. దేశ స్వాతంత్ర దీక్షకు వారు పూనుకొనేటట్లుగా చేసిన నాటి స్త్రీలసాహిత్య ఉద్యమచైతన్యం స్త్రీవ్యక్తి స్వతంత్రత నుండి ప్రారంభమై దేశ స్వాతంత్ర్యానికి దారితీసిందని స్పష్టమవుతుంది.

20 శతాబ్దపు మొదటి దశకంలో స్త్రీవిద్య, వివాహాలు, గృహకృత్య నిర్వహణ, స్త్రీసమాజాలు, స్త్రీల రాజకీయవ్యవహారాలు, ఆస్తిహక్కుల స్పృహవంటి విషయాలతో ప్రచురిత ఉపన్యాసాలు 39, వ్యాసాలు 59, కథలు 7, నాటకాలు 9, కీర్తన 1, మంగళహారతి 1 స్త్రీల సాహిత్యంలో చోటుచేసుకున్నాయి.

**ప్రచురిత ఉపన్యాసాలు/వ్యాసాలు**

విదేశాలలోని విద్యావంతులైన స్త్రీలను గురించిన విషయాలను గ్రహించిన భారతీయస్త్రీలు చేసిన ఉపన్యాసాల యొక్క అనువాదాలుగా ఆంధ్రదేశంలోని స్త్రీలకు అవగాహన కల్పించటానికి 20 శతాబ్దపు ప్రారంభం నాటికే జనానా పత్రిక కృషిచేసింది. అక్షరాస్యులైన స్త్రీలు స్వల్ప సంఖ్యలో ఉండటంతో స్త్రీలు ఎక్కువగా స్త్రీసమాజ సభలలో ఉపన్యసించారు. వాటిని ప్రచురించే బాధ్యత నాటి పత్రికలు వహించుటచేత అవి స్త్రీల వాఙ్మయాలైనప్పటికి అక్షరత్వాన్ని పొంది వ్యాసాల రూపంలో సాహిత్య చరిత్రలో చోటు చేసుకున్నాయి. స్త్రీవిద్య పట్ల స్త్రీలలో సాంఘిక చైతన్యాన్ని రగిలించ టానికిని, స్త్రీలు పత్రికారచనలు చేయటానికి నేపథ్యపుశక్తిగా ఉన్న జనానాపత్రికను తరతరాలు గుర్తుంచుకోవాలి. దేశంలోని వివిధప్రాంతాలలో ఆంధ్రేతరస్త్రీలు స్త్రీవిద్యాభివృద్ధికై చేసిన ప్రసంగాల యొక్క అనువాదాలను జనానాపత్రిక ప్రచురించి స్త్రీలచైతన్యానికి నాందిపలికింది.

'స్త్రీవిద్యను గూర్చిన నియామకము' (జనవరి 1900 జనానాపత్రిక) అనే దానిని గురించి లక్నోపట్టణమున జరిగిన దేశీయసంఘ సంస్కరణ మహాసభలో స్త్రీవిద్యను గురించిన నియామకాన్ని గురించి రోజాలీలాలు (అలహాబాద్ వాసి) అనే మహిళ ఉపన్యసించింది. దానియొక్క అనువాద ప్రచురణలో స్త్రీవిద్య భారతదేశంలో అభివృద్ధి చెందితేనే గానీ హిందూసంఘం అభివృద్ధి

చెందదనీ, దానికై స్త్రీలను ఉపాధ్యాయినులుగా నియమించాలనీ, దానిలో భాగంగా స్త్రీలపాఠశాలలో ఉపాధ్యాయినులకు బోధనాపద్ధతిని నేర్పాలని చెప్పింది. ఒకవేళ పాఠశాలలు లేకపోయినా ఉపాధ్యాయినులే ఇండ్లకుపోయి స్త్రీలకు చదువునేర్పాలనీ, నీతి, మతం, దేహారోగ్యం, పాకశాస్త్రం, గృహనిర్వాహకత్వం, శిశుపోషణా ధర్మాలను బోధించటమే గాక, ఆ స్త్రీల ఆరోగ్యాన్ని కూడా పరీక్షించాలని చెప్పటం జరిగింది. ఆ సభలోనే ఇంగ్లండు నుండి వచ్చిన గార్లండు దొరసాని మాట్లాడుతూ తమ లండను నగరంలో 'వనితైకమత్యోద్ధారణా' సమాజం ఏర్పడి 40 సం.ల నుండి స్త్రీవిద్యకు పాటుపడటంతో నేటికి స్త్రీలు విద్యావంతులయ్యారనీ, ఆ కారణంగానే ఇంగ్లండు దేశము బాగుపడిందని చెప్పింది. అలాగే హిందూదేశంలో పురుషులు తమభార్యలను విద్యావంతులను చేస్తే దేశమునకు తప్పక మేలు కలుగుతుందని తెలియజేసింది. అంతేకాక, బొంబాయిమహాసభలో రామాబాయిగారు చెప్పినట్లుగా వివాహవిషయంలో సంస్కరణలు స్త్రీవిద్యాభివృద్ధికి దోహదం కాగలుగుతాయని చెప్పినట్లు పత్రిక తెలియజేసింది.

*స్త్రీలవిద్యాభివృద్ధికి బీజం వేసిన వ్యాసమిది. ఉపాధ్యాయినుల నియామకం జరిగితే స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందనీ, వారు ప్రతియింటి గడపను చేరుకొని స్త్రీలకువిద్య నేర్పాలనీ, భర్తలు భార్యలను చదివింప జేయాలనీ, బాల్యవివాహసంస్కరణలు అవసరమని భావించటం జరిగింది.*

బరోడా రాజ్యములోని స్త్రీవిద్య (మార్చి1900 జనానా)ను గురించి బరోడా మహారాణి చేసిన ఉపన్యాసం యొక్క అనువాదాన్ని పత్రిక ప్రచురిస్తూ స్త్రీలు తీరుబడి సమయంలో విద్యాభివృద్ధి చేసుకోవాలనీ, ఆ విధంగానే బరోడాలో విద్యాభివృద్ధి జరిగిందని చెప్పింది. ఘోషావల్ల మహమ్మదీయ బాలికలు చదువుకోవటం లేదనీ, బాలికలు పైచదువులు చదువుకోవటానికి వీలుగా అక్కడ విద్యార్థి వేతనాలను ఏర్పాటు చేసారనీ, కుట్టుపని, హైజనీ (పరిశుభ్రత), పాకశాస్త్రం మొదలగునవి నేర్పించేవారని తెలియజేసింది.

దామెర్ల సీతమ్మ తాను పాల్గొన్న 'దివ్యజ్ఞాన సమాజం' (మార్చి 1900 జనానా)ను గురించి వ్రాస్తూ, సభలో అనిబిసెంటు పాల్గొన్నారనీ, ఆ సభకు వెళ్ళిన మహిళలను అమర్యాదగా చూడటం నాటి పురుషులకు సిగ్గుచేటయిన విషయమని తెలిపింది. వారు స్త్రీలను తమతో సమానంగా చూడకపోతే ఇక దేశమేవిధంగా బాగుపడుతుందనీ, స్త్రీ జాతికి విముక్తి కలుగనీయకుండా స్త్రీలను అణచిపెడుతున్నారని భావించింది. తమ బాధలను స్త్రీలు పత్రికలకు రహస్యంగా తెలియజేయ టానికి గానీ లేదా కనీసం ఉపన్యాసాలను వినే అర్హతలైనా స్త్రీలకు కల్పించే విధంగానైనా పరోపకార పారీణులైన పురుషులు ముందుకు వచ్చి అవకాశాలను కల్పించాలని తెలియజేసింది.

ఈమె వ్రాసిన 'వెలిభయంలేని సంస్కరణ' (సెప్టెంబరు 1904 హిందూసుందరి) అనే మరొక వ్యాసంలో బాలురకు ఆలస్యంగా పెళ్ళి చేస్తే యువకులుగా వారిలో సంఘసంస్కరణ దృక్పథం పెరిగి వారికిముందుగా స్వతంత్ర జీవనం ఏర్పడుతుందని భావించింది. అప్పుడే బాలికల యొక్క బాల్యవివాహాలు తగ్గుముఖం పడ్తాయనీ యువకుల విషయానికి సంబంధించింది కాబట్టి అదొక వెలిభయంలేని సంస్కరణ అని తెలియచేసింది.

ఈమెయే వ్రాసిన 'విద్యవలని లాభాలు' (జులై 1907 సావిత్రి) అనే ఇంకొక వ్యాసంలో పురుషులకు వలె స్త్రీలకు కూడా విద్య లాభకారి అనీ, స్త్రీ విద్యావంతురాలైతే జ్ఞానం కలుగుతుందనీ, భర్తకు కూడా అన్నివిధాల అనుకూలంగా ఉంటుందనీ, విద్యవల్ల లాభాలు ఉన్నాయని కూడా దామెర్ల సీతమ్మ తెలియజేసింది.

*స్త్రీలు బయటకువచ్చి సభలలో పాల్గొనే స్వతంత్రంలేదనీ, వారు లోకజ్ఞానం సంపాదించా లనుకునే ప్రయత్నంలో భాగంగా సమాజంలోని పురుషులలో రావల్సిన చిత్తసంస్కారాన్ని తెలియజేయటంగా అర్థం అవుతుంది. స్త్రీలవిముక్తిని ఆలోచింపజేస్తూ స్త్రీలు తాము చదువుకున్న ఇంటిబడి విజ్ఞానంతోనే పత్రికా రచనకు పూనుకోవటమే స్త్రీల ప్రగతికి దిక్సూచి అయ్యింది. నాటి స్త్రీలు అలా ప్రార్థించారంటే, స్త్రీలకు సామాజిక గౌరవంలేదనీ, స్త్రీ జాతిని అణచివేస్తున్న పురుషాధిక్యత స్పష్టమవుతోంది.*

*బాల్యవివాహాలను ఎదురుదాడిలో భాగంగా ఎదుర్కోవచ్చనీ, అప్పుడు బాలికావిద్య అభివృద్ధి చెందుతుందని భావించింది. కుటుంబ సంస్కృతిలోని యువకుల స్వాతంత్ర్యానికి బాలికావిద్యకు ఉన్న సంబంధాన్ని రచయిత్రి తెలియజేసింది. స్త్రీ విద్యా సమస్యను మగపిల్లల వైపు నుండి నరుక్కు రావాలని భావించింది. ఆ రోజుల్లో ఆడపిల్లకు పెళ్ళయినప్పటి నుండి వారిని బడికి పంపించ కూడదనే సామాజిక ఆంక్షలు ఉండేవి. కాబట్టి ఆ రకమైన పరిష్కారాన్ని సూచించింది. స్త్రీవిద్యకు బాల్యవివాహవ్యవస్థ అడ్డంకి అనీ, దాని నివారణ దిశగా మగ పిల్లలకు పెళ్ళిళ్ళను ఆలస్యంగా చేయగలిగితే, వయసువచ్చేంతవరకు ఆడపిల్లలుచదువుకోగలరనే దామెర్ల సీతమ్మ సూచనలను స్త్రీ వివాహవ్యవస్థలో ముఖ్యమైనదిగా భావించాలి. అప్పుడే స్త్రీలవిముక్తికి మార్గమేర్పడుతుందనే భావనను రచయిత్రి వ్యక్తం చేసింది.*

స్త్రీలచేత పంజాబులో నడపబడే 'కన్యామహావిద్యాలయం' వారి యొక్క వార్షిక నివేదిక యొక్క అనువాదాన్ని పత్రిక ప్రచురిస్తూ (జూన్ 1900 జనానా) ఒకటి నుండి 10 వ తరగతి వరకు బాలికలకు విద్య నేర్పిస్తున్నారనీ, 5 గురు ఉపాధ్యాయినులు, ఇద్దరు పండితులతో బోధనచేయబడుతోందనీ, వయోజన స్త్రీలకు ప్రత్యేక తరగతి ఉందని పేర్కొంది. అనాథబాలికలకు వసతి కల్పిస్తున్నారనీ, వివాహితులు విద్యార్థులుగా ఉన్నారనీ, అమెరికా దొరసాని ఈ విద్యాలయాలకు కొంత ఆర్థిక సహాయం చేస్తున్నారనీ, సాధారణ విద్యయే గాక కుట్టుపని, వంట. చిత్రలేఖనము, కలములు చెక్కడం, మట్టిప్రతిమలు చేయటం వంటివాటిని నేర్పిస్తున్నారనీ, దానిలో చిన్న పుస్తకభాండాగారం ఉందని తెలియజేసింది. మతబోధ, నీతి సాంఘిక విషయాలు, వేద మంత్రాలు నేర్పిస్తున్నారనీ, పెద్ద తరగతి బాలికలచేత చిన్న తరగతి బాలికలకు విద్యాబోధన చేయిస్తున్నారని బాలికలు, వివాహితులు, వితంతువులు కలిపి మొత్తం **129** మంది విద్యార్థులున్నారని పేర్కొనటం జరిగింది.

*భారతదేశంలో స్త్రీలవిద్యాభివృద్ధికి వేసిన బాటలను తెలియజేస్తూ మిగిలిన రాష్ట్రాలలో కూడా స్త్రీల విద్యాభివృద్ధికి చేయవలసిన కర్తవ్యాన్ని ఈ వ్యాసం స్ఫురింపచేసింది.*

'స్త్రీలకు రాజకార్యవిషయములు' అనే శీర్షకన (జూన్ 1900 జనానా) పత్రికాధిపులు తెలియజేస్తూ న్యూజిలాండు స్త్రీలు రాజకార్య విషయములందెక్కువ హక్కులు కలిగియున్నారనీ, రాజ్యసభలోని సభికులను ఏర్పరచే అధికారం ఆ స్త్రీలకుందనీ, సత్ప్రవర్తన లేనివారునూ, దారాపుత్రాదులను సరిగ్గా చూడని వారిని సభకు నియమింపబడాలని కోరినయెడల స్త్రీలు అట్టివారిని తమ ప్రతినిధులుగా చేయటానికి ఒప్పుకోరని తెలియజేసింది. అంతేకాక ఆ దేశపు ప్రధానమంత్రి తన భార్యనుగురించి వార్తాపత్రికలో ప్రచురించిన విషయాన్ని పత్రిక పేర్కొంటూ "రాజకార్య విషయము" లందు స్త్రీలకు హక్కునిచ్చినయెడల గృహకల్లోలముకు కారణమై గృహకృత్య నిర్వాహకత్వమునకు విఘ్నము గలుగుతుందని భర్త భయపడినా, స్త్రీలకటువంటి అధికారం ఉండటంచేతనే ఎటువంటి అనర్థములు జరగవని" చెప్పిన దానిని ఉదాహరించింది. అందుకే న్యూజిలాండు దేశము అన్నివిధముల అభివృద్ధి చెందినట్లునూ న్యూజిలాండు వనితలు రాజకార్య విషయంలో అధికారములున్నా కూడా ఇంటిపనులందు జాగరూకతతోనే ఉంటున్నారు కాబట్టి విద్యాస్వాతంత్ర్యాలు కలిగిన స్త్రీలు మరింతగా అభివృద్ధిచెందితే దేశాభివృద్ధికి కారకులవుతారని పత్రిక తెలియచేసింది.

'అతిబాల్యవివాహఫలితాల'ను (జూన్ 1900 జనానా) గురించి పత్రికాధిపులు తెలియ జేస్తూ బాలభార్యలు, బాలమాతలు ఉండటంచేత సరైన శిశుపోషణ జరగకపోవటంతో భారతీయులు దుర్బలురనే అపప్రథకు గురి అవుతున్నారనీ, అంతేగాక బాలికావిద్యకు విఘాతం కలుగుతోందనీ, కార్మిక కుటుంబస్త్రీలలో కూడా ఈ అతిబాల్యవివాహాలవల్ల స్త్రీల శరీరపాటవము తగ్గుతున్నదని తెలియజేసింది. అతిబాల్యవివాహాలవల్లనే స్త్రీలు స్వతంత్రభావాలతో పనులను చేయలేరనీ, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోతున్నారనీ, వివాహమనేది దేశక్షేమాన్ని బట్టి ఉంటుందనీ, వితంతు వివాహాలు చేయాలనీ, స్త్రీ, పురుషుల జీవితకాలాన్ని ఈ బాల్యవివాహాలు తగ్గిస్తున్నాయనీ తెలియచేయటం జరిగింది. అంతేగాక స్త్రీకి దుర్నీతితో నడిచే భర్తను విడిచిపెట్టే హక్కు గానీ, ఆస్తిహక్కుగానీ లేకపోవటమే గాక తండ్రి, భర్త, కొడుకులయొక్క దయాదాక్షిణ్యాల మీద స్త్రీలు బ్రతుకుతున్నారనీ, సంతానహీనులై నిర్బంధవైధవ్యంకల స్త్రీలు తమను పోషించేవారు లేక అవస్థపడుతూ మృత్యువు వస్తేనేగాని సుఖంలేదనే భావనలో ఉన్నారని పేర్కొంది. తప్పుడు మార్గాలను చెప్పే శాస్త్రాలను అనుసరించకూడదనీ, బాల్యవివాహాలను రూపుమాపాలనే ఆలోచనలను పత్రిక ప్రతిపాదించటం జరిగింది.

*బాల్యవివాహాలు స్త్రీల శారీరక, మానసిక వ్యక్తిత్వాలకు గొడ్డలిపెట్టువంటి విషయాలనీ, స్త్రీలకు ముందుగా స్వతంత్రభావాలు ఉండాలనే భావనను రేకెత్తిస్తూ స్త్రీల ముందుకు పత్రిక తెచ్చిన వ్యాసమిది.*

జులై, ఆగష్టు, అక్టోబరు 1900 జనానా పత్రికల ప్రచురణలో, వితంతువైన గుండు అచ్చమాంబ, యాత్రాస్థలగ్రంథాన్ని వ్రాసినట్లును, పుల్లాభట్ల పార్వతమ్మ బాలవితంతువైనా

ధైర్యంతో కందుకూరి వీరేశలింగంగారి అండనుచేరి 1899 లో గవరయ్య శాస్త్రిగారిని పునర్వివాహం చేసుకొని విద్యావంతు రాలైందని తెలియజేసింది. పరిశుద్ధఆస్తిక మతగ్రంథాలను చదువుకుంటూ గంజాం నందలి సంఘసంస్కార సమరాంగణంబున ధైర్యము వహించి పోరాడిన వనితగా ఆమెను పేర్కొంటూ జనానా పత్రిక కొనియాడింది.

*స్త్రీవిద్యను గురించి ప్రచారం చేస్తుంటే వారు ఉన్నత విద్యను పొందగలిగారా, ఎవరైనా స్త్రీలు పునర్వివాహం చేసుకున్నారా, అనే సందేహాన్ని నివృత్తి చేస్తూ స్త్రీలందరికీ విద్యాభివృద్ధి యందు ప్రేరణకలగటానికి విద్యావంతులైన స్త్రీలను గురించిన సమాచారాన్ని జనానా పత్రిక ఇవ్వటం జరిగింది.*

1900 సం.లో చెన్నపురిలో ప్రకటింపబడిన తెలుగువారిలోని స్త్రీవిద్యాశాతం గురించి (జనవరి 1901 జనానా పత్రిక) పేర్కొంటూ ప్రతి వెయ్యిమందిలో 77 మంది పురుషులు చదువుకుంటూంటే 1000 కి 5 గురు మాత్రమే తెలుగు స్త్రీలు చదువుకుంటున్నట్లు తెలియజేసింది. మొత్తము 1,29,067 మంది బాలికలలో 1,06,718 మంది ప్రైమరీ స్కూళ్ళలోనూ మిగిలిన వారిలో సగం (66,025) మంది అప్పర్ ప్రైమరీ స్కూళ్ళలోనూ, లోయర్ సెకండరీలో 36,096 మంది, అప్పర్ సెకండరీలో 425 మంది, సర్వకళాశాలలో 20 మంది బాలికలు చదువుతున్నా రనియూ, సెకండరీ, కళాశాలలో క్రైస్తవులు, యురోపినియన్లు, ఈస్టిండియనులు చదువుకంటు న్నారనీ, హిందూస్త్రీలు ప్రైమరీ వరకే చదువుకున్నారని తెలియజేసింది. స్త్రీ విద్య లేకపోయినా దేశం అభివృద్ధి చెందదనీ, చదువుకున్న పురుషులు తమ స్త్రీలను చదివించాలనీ, బాలికలకు బాల్యంనుండి విద్యను నేర్పించాలనీ, ప్రభుత్వం బాలికాపాఠశాలలను ఏర్పాటు చేయాలని పత్రిక సూచించింది.

యం.ఏ. పరీక్షను ఇచ్చిన ఒక తెలుగు స్త్రీ గురించి పత్రిక తెలియజేస్తూ (ఏప్రిల్ 1901 జనానా) బందరులోని ఓరుగంటి శివరామకృష్ణయ్య పుత్రికయైన 'కమలాంబ సత్యనాథం' బందరులో ఎఫ్.ఎ, బి.ఏ. లలో గెలుపొందిందనీ, ఆ సంవత్సరం చెన్నపురిలో ఇంగ్లీషులో ఎమ్.ఏ పరీక్షలో జయము పొందటమే విద్యాభిమానులకు పండగ దినమని పేర్కొంది. ఈమె చెల్లెలు రత్నాంబకూడా ఎమ్.ఏ. పరీక్షకు చదువుతోందనీ, ఉన్నత విద్యావంతులుగా వీరిద్దరూ పత్రికలకు ఇంగ్లీషులో వ్యాసాలు వ్రాస్తూన్నారనీ, హిందువులు సర్వప్రయత్నముల తమపుత్రికల విద్యా పోషణమును గావించమని పత్రిక తెలియజేసింది.

'హిందూసుందరి పత్రిక' అనే శీర్షికన (మే 1901 జనానా పత్రిక) కమలాంబ సత్యనాథంను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ భారతదేశంలో మొట్టమొదటిసారిగా స్త్రీలకోసం పెట్టిన 'హిందూసుందరి' అనే ఆంగ్ల పత్రికకు ఆమె సారథ్యం వహిస్తోందనీ, అందులో స్త్రీవిద్య, నీతి, పరోపకార విషయాలలో విదేశీస్త్రీలను గురించి ఉందని పేర్కొంది. హిందూ దేశములో కూడా స్త్రీవిద్యా స్వాతంత్ర్యాది విషయాలను చర్చించేందుకు దేశభాష పత్రికలు వస్తున్నాయనీ, స్త్రీలు

ఇంగ్లీషు జ్ఞానమును పొందటానికే 'హిందూసుందరి' అనే ఇంగ్లీషు పత్రికను ధైర్యంగా నడుపుతున్న తెలుగువారి పుత్రికయైన కమలాంబ సత్యనాథంగారికి విద్యాభామినుల ప్రోత్సాహం ఉండాలని పత్రికాధిపులు తెలియజేయటం జరిగింది.

'స్త్రీవిద్య'ను గురించి (ఫిబ్రవరి 1904 తెలుగు జనానా) కమలాంబ ఇంగ్లీషులో చేసిన ఉపన్యాస అనువాదంలో మానవులలో ఉన్న శక్తులను అభివృద్ధి చేసేది విద్య అనీ, జ్ఞానస్వీకారము మనస్సునకు అభిరుచిని కలుగజేస్తుందని పెద్దలు చెబుతారనీ, గృహకృత్య సంబంధపు పనులన్నీ నేర్పుతో చేస్తూనే, నీతిమంతంగా ఉండే స్త్రీలకు సాధనతో విద్యను బోధించే స్త్రీలు కావాలని ఆమె తెలియజేసింది. అంతేకాదు, అత్తాకోడళ్ళ మధ్య ఐకమత్యం ఉండాలనీ, పురుషులవలె స్త్రీలకు బాల్యమునందే విద్యయందు ఆసక్తి, అభిరుచిని కలిగించాలనీ స్త్రీలకు విద్య లేకపోవటానికి వారి అజ్ఞానం, రాణివాసమే కారణమని భావించింది. విద్యనేర్చితే శిశుపోషణలో మెలకువలు, వారి సుగుణాలు వన్నెకెక్కుతాయనీ వివాహానంతరం కూడా స్త్రీలు స్వయంకృషితో చిన్నప్పుడు నేర్చుకొన్న విద్యను అభివృద్ధిచేసుకోవాలని పిలుపునిచ్చింది. స్త్రీలు విద్యాలాభములను తెలుసుకోవాలనీ, బాలికలు మెట్రిక్యులేషన్ వరకు చదువుకోవాలనీ, వివాహితస్త్రీలకు ఇంటిదగ్గర స్త్రీసంఘంచేత వారానికి రెండుగంటలు చదువునేర్పాలనీ, విద్యాలాభం తెలియని అసూయగ్రస్థులైన వారియొక్క అజ్ఞానతిమిరాన్ని పోగొట్టాలని కమలాకరమ్మ తన ఉపన్యాసంలో చెప్పింది. అదేవిధంగా అనిబిసెంటు కూడా హిందూ వితంతువులను గురించిన అభిప్రాయం చెబుతూ, హిందూస్త్రీలు బాల్యంలోనే వితంతువులగుటచే అందరూ కన్యలుగా ఉండే స్థితిలో ఉన్నారనీ, ప్రౌఢవయస్సులో పెళ్ళిజరిగితే అంగసౌష్ఠవంగల శిశువులు జన్మిస్తారనీ, హిందూ వితంతువు విద్యనేర్చి సమాజసేవలో పాల్గొనాలనీ చెప్పినట్లు పత్రిక తెలియజేసింది.

1902 ఏప్రిల్ చెన్నపురిలో 'బాలికావిద్య' (మే 1902 జనానా) ను గురించి కమలాంబ చేసిన ఉపన్యాసంలో దేశంలో బాలికలకు విద్యనేర్పించటం ఆవశ్యకమని అందరూ గ్రహిస్తున్నారనీ, స్త్రీలు అవిద్యవలననే వెనకబడియున్నారనీ, భార్య తన విద్యానాగరికతను అభివృద్ధిచేసుకోవటం లోపంకాదని భావించింది. పాఠశాలలలో గృహకృత్యములకు ఉపయోగించే విద్యతోపాటు లెక్కలు, వ్యాకరణం, కళలుకూడా నేర్పిస్తున్నారనీ, భర్త ప్రోత్సహిస్తే స్త్రీవిద్య బాగా విజృంభిస్తుందని చెప్పింది. స్త్రీలను ఉపాధ్యాయినులుగా నియమించటమే గాక గాలి, వెలుతురుగల గదులలో సభలు ఏర్పాటుచేసుకొనే విధంగా బాలికా విద్యను నేర్పిస్తేనే, స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందని పురుషులు కూడా గ్రహించాలని కమలాంబ సత్యనాథం చెప్పినట్లు గా పత్రిక తెలియజేసింది.

జనానా పత్రిక ప్రభావంతో ఒక ఆంధ్రవనిత భారతదేశంలో స్త్రీలకోసం మొట్టమొదటగా ఆంగ్లంలో పత్రికను నడుపుతుండటాన్ని స్ఫూర్తిగా తీసుకొని స్త్రీలు పత్రికారంగంలోకి అడుగు పెట్టగలిగారు. తమ కలాలకు పదునుపెట్టారు. వివాహానంతరం స్త్రీలు విద్యను కొనసాగించాలనీ, వితంతు స్త్రీలు కూడా విద్యనేర్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయటమేకాక, స్త్రీలు గణితం, కళలను నేర్చుకోవాలని కమలాంబ సత్యనాథం తెలియజేసింది.

'కృతి విమర్శనము' (సెప్టెంబరు 1901 జనానా) అనే శీర్షికన పత్రికాధిపులు వ్రాస్తూ భండారు అచ్చమాంబ వ్రాసిన 'అబలా సచ్చరిత్రరత్నమాల' అనే గ్రంథంలో భారతదేశీయ స్త్రీల చరిత్రమును ఆమె సులభశైలిలో వ్రాసిందనీ, ఆ కథలో 'రఖుమాబాయికేశోకర్' 'రాణీ గౌరీ లక్ష్మీబాయి' చరిత్రలు చదివిన తరువాత స్త్రీలచరిత్రలు స్త్రీలే చెప్పటం యుక్తమనీ భావించినట్లు చెప్పింది. చదువుకున్న స్త్రీలకు పతిభక్తి తక్కువ అనే వారికి సమాధానంగా 'అబలాసచ్చరిత్ర రత్నమాల' గ్రంథమును అచ్చమాంబ తనభర్తకు అంకితమిస్తూ "దేవాదిదేవునికంటె నధికుండైన తన భర్తఋణము తాను తీర్చుకోలేనని" భండారు అచ్చమాంబ చెప్పిన వాక్యములను పత్రిక తెలియజేసింది.

*ఈ వ్యాసం ద్వారా పదిమందికి తెలిసేలా అబలాసచ్చరిత్ర రత్నమాలను గురించిన గ్రంథ ప్రచారాన్ని పత్రిక చేసింది. స్త్రీల చరిత్రలను స్త్రీలే బాగా వ్రాయగలరనీ, స్త్రీలచరిత్రల ప్రభావం స్త్రీలపై ఉంటుందని భావించటం జరిగింది.*

భండారు అచ్చమాంబ వ్రాసిన 'గుణవతియగు స్త్రీ' (మే 1901 జనానా) అనే వ్యాసంలో దశకుమారచరిత్ర యందలి కథను ఉటంకిస్తూ 'వణిజుడు తవ్వెడు వడ్లు యిచ్చివండి భోజనం పెట్టమని అడుగగా ఒక స్త్రీ తన తెలివితేటలను ఉపయోగించి బియ్యం తయారుచేసి, వడ్లపొట్టు తీసి, దానినమ్మి ఆ డబ్బుతో గిన్నె, కట్టెలుకొంటుంది. ఆ తవుడును, వండగా వచ్చిన కట్టెబొగ్గులను విక్రయించి కూర, చింతపండు ఉప్పును కొని అతనికి తృప్తిగా అన్నంపెట్టే సరికి ఆమె నైపుణ్యానికి మెచ్చిన ఆ వణిజుడు ఆమెను పెళ్ళిచేసుకొంటాడు. ఆ కథను తెలియచేస్తూ స్త్రీలు సంసారమును పొదుపుగా చేయగల గృహకార్య నిర్వహణత్వాన్ని రచయిత్రి తెలియజేసింది.

'స్త్రీవిద్యయెక్క ప్రభావం' (ఆగష్టు 1902 హిందూ సుందరి) ను గురించి భండారు అచ్చమాంబ ఉపన్యసిస్తూ అయిస్ లండన్ ద్వీపంలో స్త్రీ పురుషులందరూ సమానంగా విద్య నేర్చుకుంటారనీ, అక్కడ స్త్రీ పురుషులకు సమానంగా రాజకీయహక్కులు ఉన్నాయనీ, స్త్రీ పురుషులు కలిసి రాజ్యవ్యవస్థను నిర్వహించుకుంటారని చెప్పింది. విద్యాశాఖలో స్త్రీలే పాఠశాలలో విద్యనేర్పిస్తారనీ, అక్కడ కారాగృహాలు, సైన్యము మొదలగు వాటి అవసరం లేకపోవటానికి కారణము స్త్రీ విద్యా ప్రభావమేనని తెలియజేసింది.

ఈమె వ్రాసిన "స్త్రీలు గమనింపవలసిన కొన్ని యంశములు-పరోపకార చింత" (సెప్టెంబరు 1902 హిందూసుందరి) అనే వ్యాసంలో పరోపకారం చేయనప్పుడు మానవజన్మ వ్యర్థమనీ, పరోపకారమందు ఊరకనే మనసుపెట్టటం కాక, శక్తి కొలది ఏరీతిని ఎవ్వరికి ఉపకారం చేయవలనో భావించి త్రికరణ శుద్ధిగా చేయటమే పరోపకారమని తెలిపింది. ఎదుటిమనిషిని దుఃఖపెట్టరాదనీ, మన ప్రవర్తన ఎదుటివారికి అనుకూలంగా ఉండాలనీ, ఎదుటివారిమీద అసూయ కలిగినపుడు వారికి రోజూ ఉపకారం చేస్తే, ఆ అసూయామనస్తత్వం తగ్గుతుందని భావించింది. ఒరులు తప్పు చేస్తున్నా వారిని సరిదిద్దాలనీ, అపరాధుల యెడ కాఠిన్యం వహించకూడదనీ, అందరియందు ఉపకారబుద్ధి, సమదృష్టి ఉండాలనీ, అదే పెద్ద పరోపకారమని తెలియజేసింది.

'స్త్రీవిద్య' (ఫిబ్రవరి 1903 హిందూసుందరి)ను గురించి అచ్చమాంబ ఉపన్యసిస్తూ స్త్రీవిద్య బలహీనంగా ఉందనీ, స్త్రీల కొరకు పెట్టు పత్రికలకైనా స్త్రీలు వ్యాసము వ్రాసి పంపే ధైర్యముండటం లేదని చెప్పింది. స్త్రీలు తమకున్న స్వల్పవిద్యను కూడా నాశనం చేసుకుంటున్నారనీ, విద్యావతియైన స్త్రీ ఇంటిని సమర్థవంతంగా తీర్చిదిద్ది భర్తను సంతోషపెట్టగలదని తెలియజేసింది.

ఈమె చేసిన 'బాలికాపాఠశాలలలోని లోపం-తన్నివారణోపాయం' (మార్చి 1903 హిందూసుందరి) అనే మరొక ఉపన్యాసంలో స్త్రీవిద్య పురుష విద్యవలెనే ఆవశ్యకమనియు, పాఠశాలలో బాలికలకు గృహనిర్వాహకత్వం నేర్పించాలనీ, స్త్రీలు గొప్ప గొప్ప గ్రంథాలు చదివి ఉపన్యాసాలిచ్చే స్థాయిలో ఉండాలని చెప్పింది. తాను వ్రాసిన 'అబలాసచ్చరిత్ర రత్నమాల' గ్రంథంలో చెప్పినట్లుగా రఖుమాబాయి, ఆమెయొక్క కూతురు కమలాకరమ్మ ఉద్యోగాలలో ఉంటూ కూడా గృహకృత్యాలను అధిక దక్షతతో సక్రమంగా నిర్వర్తించారని తెలిపింది. స్త్రీవిద్యవలన స్త్రీలకు విశేష స్వాతంత్ర్యము ఏర్పడుతుంది కాబట్టి బాలికలకు పాకశాస్త్రం, వృక్షశాస్త్రం, బాలవైద్యశాస్త్రం, గృహకృత్య నిర్వాహకత్వం నేర్పాలని తెలియజేసింది. అంతేకాదు స్త్రీలకు బాల్యవివాహాలవల్ల వాళ్ళకు పుట్టే పిల్లలు దుర్బలత్వంతో ఉండటంచేతనే విదేశీయులకు భారతీయులు దుర్బలులనే భావన ఏర్పడుతోందని భావించింది. ఉమ్మడికుటుంబాలలో బాల్యవివాహమైన భార్యభర్తలు కలసి కూర్చొని మాట్లాడుకోవటం చూస్తే, మిగిలిన అవివాహిత బాలికలు కూడా రజోగుణప్రేరితులై చిన్నతనంలోనే రజస్వల అవుతున్నారనీ, స్త్రీలకు పురుషులకు అల్పప్రాయములోనే యవ్వనం ఏర్పడటంతో దుర్బలసంతానం కల్గుతోందని చెప్పింది. బాలికలు యౌవనవంతులై పర్యాప్తయోను లయిన తరువాతనే రజస్వలానంతరవివాహం చేయాలనీ, ఋగ్వేదంనుండి, అశ్వలాయన సూత్రాలనుండి, స్మృతులనుండి ప్రౌఢవివాహాలు జరిగిన స్త్రీలను ఉదాహరణగా యిచ్చి బాల్యవివాహాలను నిర్మూలించటమే దేశోపయోగకరమైన విషయమనీ, అదే వేదసంస్కృతి అనీ తెలియజేసింది.

'గృహిణీ ధర్మములు' (ఏప్రిల్ 1903 హిందూ సుందరి) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ దంపతులమధ్య ఐకమత్యం ఉంటే అనేక సమాజ దేశహిత కార్యక్రమాలను చేయవచ్చునీ, భర్తకు సేవ చేసినా అతని ఆజ్ఞను పాటించినా స్వాతంత్ర్యానికి, గౌరవానికి భంగకరంకాదని తెలిపింది. కొంత స్వతంత్రత, కొంతపారతంత్రత ప్రతిజీవికి సహజమనీ, స్త్రీ పురుషులిద్దరూ సమాన స్వాతంత్ర్యం కలిగి ఒకరికొకరు లోబడి యుండాలని తెలియజేసింది.

'ఆనందం' (మే 1903 హిందూసుందరి) ను గురించి వ్రాసిన వ్యాసంలో ఈమె స్త్రీలు సంతోషంగా, ఆనందంగా గృహకృత్యాలు నిర్వహించుకోవటంచేతనే ఇంట్లో అందరూ ఆనంద స్వభావులై ఉంటారనీ చెప్పింది. తోటి స్త్రీలతో మిత్రసంబంధాలను నెరపటం అవసరమనీ, స్త్రీలు ఆనందంగా ఉండాల్సిన అవసరాన్ని ఇంటికి వచ్చిన తోటి స్త్రీ మిత్రులకు తెలియజేసినట్లు అర్థం అవుతుంది.

'విద్యావతులగు యువతులకొకక విన్నపం' (జూన్ 1903 హిందూసుందరి) అంటూ ఈమె చేసిన ఇంకొక ఉపన్యాసంలో పురుషులు స్త్రీవిద్యా ప్రోత్సాహకరములైన పనులు చేసినా, స్త్రీల యుపేక్ష వల్ల స్త్రీవిద్యాభివృద్ధి జరగటంలేదని చెప్పింది. బాల్యవివాహానంతరం బాలికలు పురుషఉపాధ్యాయులు గల పాఠశాలలకు వెళ్ళటంలేదనీ, నేర్చినవిద్యనుకూడా వారు వివాహానంతరం మరిచిపోతున్నారనీ, వారికి గణిత, వ్యాకరణాలు అసలు గుర్తుకు రావటంలేదని తెలిపింది. బాలికాపాఠశాలలో స్త్రీలు విద్యావతులగుట కష్టముగా నున్నదనీ, బాలికలు అల్పవిద్యతోనున్నారనీ, కాబట్టి ఉపాధ్యాయినులను పాఠశాలల్లో నియోగిస్తే స్త్రీవిద్యాభివృద్ధి జరుగుతుందని చెప్పింది. అంతేకాక, విద్యావంతులకు స్త్రీ స్వాతంత్ర్యం వంటి సంస్కరణల విలువ తెలుస్తుందనీ, స్త్రీలు బోధకులుగా ఉంటే స్త్రీవిద్యాలయాలలో స్త్రీలు స్వేచ్ఛగా విద్యను ఆర్జించగలరని తెలియజేసింది. చదువుకొన్న స్త్రీలు వంతులవారీగా రెండుగంటల చొప్పున బాలికాపాఠశాలలో పాఠాలను బోధించాలనీ, ప్రతిగ్రామంలో పాఠశాలలు ఏర్పాటు చేసి, గణితం, వ్యాకరణం దేశచరిత్రలు చెపూ్త బాలికలకు శాస్త్రపరిజ్ఞానాన్ని అందించాలని చెప్పింది. ఆ విధంగా స్త్రీవిద్య యెడల విద్యావంతులైన స్త్రీలు బాధ్యత వహించాల్సిన విషయాన్ని విన్నవించింది.

'మచిలీపట్నంలో' జరిగిన స్త్రీ సమావేశంలో 1902 డిసెంబరు 24 వ తేదీన అచ్చమాంబ చేసిన ఉపన్యాసాన్ని గురించిన(జులై 1903 హిందూ సుందరి) పత్రికా ప్రచురణలో స్త్రీ సమాజాలద్వారా స్త్రీ విద్యను ప్రోత్సహిస్తే ప్రయోజనం కలుగుతుందనీ, వంగదేశపు స్త్రీలు పురుషులతో సమానమైన స్వాతంత్ర్యమును పొందటానికై స్త్రీసమాజాలు ఏర్పరచుకున్నారనీ, స్త్రీల యెడల ఉన్న దురాచారాలను పోగొట్టుకోవాలని వారు భావిస్తున్నారని చెప్పింది. స్త్రీసమాజాల పట్ల లోకులు వింతగా జూసినా, విమర్శించినా పట్టించుకోవద్దనీ, కాలాన్ని సద్వినియోగం చేయటానికై స్త్రీసమాజాలకు వెళ్ళే స్త్రీలకు గౌరవం పెరుగుతుందనీ, అమెరికాలో స్త్రీలు స్త్రీసమాజాలుగా ఏర్పడి దేశహిత కార్యక్రమాలు చేస్తున్నారని తెలియజేసింది. స్త్రీలు ఉన్నతవిద్యను నేర్చుకుంటే ఎన్నో లాభాలున్నాయనీ, స్త్రీవిద్య దేశక్షేమానికి సత్సంతానాభివృద్ధికి ముఖ్యమని చెప్పింది. అంతేకాదు, స్త్రీసమాజాలవల్ల స్త్రీలలో ఐకమత్యం పెరుగుతుందనీ, అత్తాకోడళ్ళ మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయనీ, దేశాభివృద్ధికి స్త్రీలు పాటుపడాలనీ, స్త్రీలకు సద్గుణాలే నగలనీ, తోటివారిని ద్వేషించకూడదనీ, లోకోపకారం చేయటానికి ధనం, అధికారం, స్వాతంత్ర్యం అవసరంలేదని చెప్పింది. స్త్రీలందరూ స్నేహితులుగా మెలగాలనీ, స్త్రీలు భూగోళశాస్త్రం, దేశచరిత్రలు చదువుకొని ఇతర స్త్రీలకు తెలియజేయాలనీ, గోండు జాతివారిలో మిత్రుల పండగ చేసుకుంటారనికూడా తెలియజేసింది. అలాగే స్త్రీలు స్త్రీసమాజాలలో మిత్రత్వంతో మెలగాలనీ, విద్యాభివృద్ధి, దేశాభివృద్ధి, శిశుపోషణ, పరిశుభ్రతవంటి సద్గుణాలను కలిగేటట్లుగా తమ అభిప్రాయాలను వెల్లడి చేస్తూ స్త్రీలు మాట్లాడగలగాలని భండారు అచ్చమాంబ చెప్పింది.

*స్త్రీలలో కూడా మేధాశక్తి ఉంటుందని గ్రహింపుకు తెచ్చే దశకుమారచరిత్రంలోని పద్యరూపంలో ఉన్న కథను ఉదాహరించి కథాకథనరచనకు బీజం వేయటం జరిగింది. స్త్రీలలో మేధాశక్తి*

*ఉంటుందనే చైతన్యాన్ని స్త్రీలలో కలిగించి స్త్రీలు తమ శక్తియుక్తులను గుర్తించేవిధంగా రచింపబడిన కథను ఉదాహరణగా చెప్పింది. అటువంటి స్త్రీల మేధాశక్తిని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవలసిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీలు విద్యావంతులైతే రాజ్యవ్యవస్థలోని రాజకీయ హక్కులు కూడా లభించి స్త్రీ పురుషుల సమానత్వం వస్తుందనీ, అప్పుడే స్త్రీల ప్రగతి ఉంటుందనే భావాలకు నాంది పలికింది. అంటే స్త్రీల రాజకీయ చైతన్యానికి పునాది పడటం అర్థం అవుతుంది. స్త్రీల మధ్య ఉండవలసిన పరస్పర సహకారానికి, మిత్రసంబంధాలకు అవసరమైన స్త్రీల ఐక్యతకు పెద్దపీట వేయాలని భావించింది. స్త్రీలు తమ పెళ్ళి, సంతానాన్ని గురించిన లైంగికతను, దేశాన్ని గురించి ఆలోచనలను చేసేవిధంగా చైతన్యపరిచింది. సమాజం భయపడే విధంగా భర్త ఆజ్ఞను వ్యతిరేకించే దిశగా స్త్రీలు దుష్కార్యములు చేయకూడదనీ, సత్ప్రవర్తన కలిగి ఉండాలనీ, పరస్పరం ఆజ్ఞలను పాటిస్తూనే, ఇద్దరూ స్వతంత్రాన్ని అనుభవించాలని భావించింది. ఆ నాటి సమాజానికి అవసరమైన ఐకమత్యభావన, స్త్రీపురుషుల మధ్యన ఉండాల్సిన సమానత్వం ఇంటినుండి ప్రారంభం కావాలని భావించింది. ఈ భావనయే స్త్రీసమాజాల అభివృద్ధికి అవకాశాలను విస్తృతం చేయగలిగింది. బాలికావిద్యకు ఆటంక ప్రాయమైన విషయాల విశ్లేషణకు పూనుకోవటం జరిగింది. బాల్యవివాహాలను నిర్మూలించగలిగి రజస్వలానంతర వివాహాలను ఆచరణలో పెడితేనే స్త్రీవిద్యాభివృద్ధి ఉంటుందనీ, విజ్ఞానంతో విద్యావంతులుగా తోటి స్త్రీలను తీర్చిదిద్దటంలో స్త్రీలను చైతన్యపరచటంగా అర్థం అవుతుంది. స్త్రీలకు విద్యవల్ల స్త్రీల స్వాతంత్రపు విలువ తెలుస్తుందనీ, ఉపాధ్యాయినులు బోధకులుగా ఉంటేనే స్త్రీ విద్య అభివృద్ధి చెందుతుందనీ భావించింది. స్త్రీవిద్యాపాఠ్యాంశాలలో గణితానికున్న ప్రాధాన్యతను తెలియజేసింది. అంతేకాక స్త్రీలు కావ్యపఠనాన్నే కాక వారు గణితం, చరిత్ర వంటి విషయాలను తెలుసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీవిద్య స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి పునాది అని తెలియజేసింది. స్త్రీలు అభివృద్ధి చెందటానికి, స్త్రీల భావప్రకటన స్వేచ్ఛకు ఏర్పాటుచేయబడ్డ స్త్రీసమాజాల ప్రాధాన్యతను భండారు అచ్చమాంబ తెలియజేసింది.*

కొటికలపూడి సీతమ్మ 'కృతి విమర్శనము' (జులై 1902 హిందూసుందరి) అనే శీర్షికన వ్రాస్తూ భండారు అచ్చమాంబ వ్రాసిన 'అబలా సచ్చరిత్రరత్నమాల'ను గురించి చెబుతూ విద్యా విహీన దశలో నున్న స్త్రీలకు అత్యంత ఉపయుక్తంగా వేయి సంవత్సరములనుండి ఆనాటి వరకున్న హిందూ దేశమునందలి ఉత్తమ స్త్రీల సచ్చరిత్రము'లను గురించి వ్రాసిందని తెలిపింది. శౌర్య, ధైర్య సాహసములు, పాతివ్రత్యం, దైవభక్తి, విద్యాసంపత్తి, పరోపకార నిరతి, దానశీలత్వము గల స్త్రీ రత్నాల చరిత్ర ఆ గ్రంథంలో ఉందని తెలియజేసింది.

వేమవరపు మహాలక్ష్మి ఒక స్త్రీసమాజంలో చేసిన ఉపన్యాసం (ఫిబ్రవరి 1903 హిందూసుందరి) లో భండారు అచ్చమాంబ జనానా స్త్రీల అభివృద్ధికోసం సమాజాలను స్థాపించి వార్తాపత్రికలు, సద్గ్రంథ పఠనం చేయిస్తూ స్త్రీలకు నానాదేశ విశేషాలను చెబుతున్నారని పేర్కొంది.

రుద్రవరపు కామేశ్వరమ్మ చేసిన ఉపన్యాసం (ఫిబ్రవరి 1903 హిందూసుందరి) లో భాగంగా భండారు అచ్చమాంబ సాన్నిధ్యమే ఆనందాన్ని కలుగిస్తుందనీ, పురుషులు స్త్రీలకు

విద్యనేర్పించకపోయినా అచ్చమాంబవంటి వివేకవతులు సభలు పెట్టి స్త్రీలకుత్సాహం కల్గిస్తున్నారని చెప్పింది. అచ్చమాంబ అనేకభాషలను నేర్చియున్నారనీ, ఆమె సాన్నిధ్యంలో ఉన్నప్పుడు సమాజము 'స్త్రీలవిద్య' ను అణచిపెట్టి, వారిని బానిసలుగా చూస్తున్నారనే ఆలోచన కలుగుతుందని తెలిపింది. దూషణభూషణలను పట్టించుకోకుండా స్త్రీజాతి యొక్క అభివృద్ధి కొరకు ఉపకారం చేస్తున్న అచ్చమాంబను ప్రశంసించింది. సభలోని స్త్రీలందరూ స్త్రీవిద్య యెడల స్ఫూర్తి పొందేటట్లుగా చేసింది.

*భండారు అచ్చమాంబలోని స్త్రీశక్తిని ఉదాహరిస్తూ ఆమెలాగా స్త్రీలు ఆలోచించాల్సిన అవసరాన్ని తెలియజేసింది. తమజాతి అభివృద్ధికై ఒక స్త్రీ మరొకస్త్రీని ప్రశంసిస్తుందనే విషయం అర్థం అవుతోంది.*

కాకినాడలో 'స్త్రీ విద్యార్థినీ సమాజం' (మార్చి 1903 హిందూసుందరి) అనే వ్యాసంలో ఆ సమాజస్థాపన సభలో పులగుర్త లక్ష్మి నరసమాంబ ఆ నాటి సభకు వచ్చిన అచ్చమాంబను గురించి ప్రసంగిస్తూ ఆమె జాత్యభిమానంతో స్త్రీల అభివృద్ధి కొరకు మానవరూపాన్ని దాల్చిన అవతారమనీ, అబలాసచ్చరిత్ర రత్నమాలను వ్రాసిందని చెప్పింది. కాలమును వృథాచేయక ఆమె హిందీ, గుజరాతీ, బెంగాలి భాషలో పాండిత్యాన్ని సంపాదించిందనీ, స్త్రీల సమాజాలకు వచ్చి అందరినీ విద్యాభివృద్ధికై ప్రోత్సహిస్తోందనీ, స్త్రీలు ఐకమత్యంతోఉండి విద్యాభివృద్ధి చేసుకోవాలనీ, కాకినాడలోని స్త్రీవిద్యార్థినీసమాజ స్థాపనకు భండారు అచ్చమాంబయే కారకురాలని తెలియజేసింది.

'భండారు అచ్చమాంబ' (సెప్టెంబరు–అక్టోబర్ 1903, డిసెంబరు, జనవరి 1904–05 హిందూసుందరి, ఫిబ్రవరి 1905 జనానా మరియు సతీహితబోధిని)ను గురించిన పత్రికా ప్రచురణలో ఆమె 1874లో జన్మించినదనీ, తండ్రి కొమర్రాజు వెంకటప్పయ్య కృష్ణామండలానికి చెందినవాడనీ, చిన్నతనంలోనే తండ్రిపోవటంతో, ఆమె తల్లి తన కొడుకును, అచ్చమాంబను తీసుకొని తన తమ్ముడింటికి చేరుకుందనీ, ఆ తర్వాత అచ్చమాంబను మేనమామకు ఇచ్చి పెండ్లిచేయటంతో భర్తయైన మాధవరావుతో ఆమె మధ్యపరగణాలకి వెళ్ళిందని తెలియజేసింది. చిన్నప్పుడు తనకు చదువుచెప్పించక పోయినా వివాహానంతరం తమ్ముడి పుస్తకాలు తీసుకొని చదువుకొని విద్యాగంధాన్ని వంటబట్టించుకుందని చెప్పింది. మిక్కిలి ఉత్సాహవంతురాలని, అల్లిక, కుట్టు పనులు, హిందీ భాష నేర్చుకుందనీ, తనతమ్ముడు కొమర్రాజు లక్ష్మణరావు చదువుకోగలగటం, తాను ఆడపిల్లగా చదువుకోలేకపోవటానికి ఉన్న వివక్షను గుర్తించి, స్త్రీలకు బాల్యమునుండి విద్యాగంధం సోకనియ్యనందుకే స్త్రీలు మూర్ఖురాండ్రుగా కన్పడుతున్నారని భావించిందని తెలిపింది. ఆమె అనేక గ్రంథపఠనాలచే జ్ఞానాభివృద్ధిని కలిగించుకుందనీ, మహారాష్ట్ర స్త్రీచే వ్రాయబడిన ఆనందీబాయి చరిత్రం చదివివినప్పుడు స్త్రీవిద్య, స్త్రీస్వాతంత్ర్యాన్ని గురించిన ఆలోచనలు ఆమెలో పెరిగాయనీ, ఆమె వ్రాసిన 'అబలాసచ్చరిత్ర రత్నమాల' లో 'ఆనందీబాయి' ను గురించి వ్రాస్తూ చారిత్రక స్త్రీలలో ఒకరిగా ఆమెను పేర్కొందని తెలియజేసింది. అచ్చమాంబ ఒక అనాథ పిల్లవాడ్ని

దగ్గరకు తీసుకొని ఆపిల్లవాడికి ఉన్నతవిద్యను చెప్పించిందనీ, ఆమెకు మహారాష్ట్ర, కర్ణాటక, ఘూర్జరభాషలతో పరిచయం ఉందని తెలిపింది. పుత్ర, పుత్రికా వియోగానికి విరుగుడుగా 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథమును వ్రాసి తనకు సహకరించిన భర్తకు ఆమె అంకితమిచ్చిందనీ, అది చింతామణి పత్రికలో వరుసగా వచ్చిందని తెలియజేసింది. 1903లో తెలుగుదేశమంతా తిరిగి అక్కడక్కడా స్త్రీ సమాజాలను నెలకొల్పి ఉపన్యాసములిచ్చేదనీ, జ్ఞానప్రదములయిన కథలను వ్రాసిందనీ, తన మరిది వితంతువివాహం చేసుకునేటట్టు ప్రోత్సహించిందని పేర్కొంటూ, 1904లో మరణించిన భండారు అచ్చమాంబ యొక్క జీవితచరిత్రను, వివిధ పత్రికలు తెలియజేసాయి.

*స్త్రీలు చదువుకోవటానికి ఒక మార్గదర్శిగా భండారు అచ్చమాంబను పేర్కొనటం జరిగింది. స్త్రీసమాజాలకు మూలవిరాట్టుయైన అచ్చమాంబ చనిపోవటాన్ని నాటి స్త్రీలు విచారకరంగా భావించి ఆమెను గురించి వ్రాసిన స్మృతివ్యాసాలను ప్రచురిస్తూ, నాడున్న అన్ని పత్రికలు ఆమె జీవిత విశేషాలను పేర్కొనటం అర్థమవుతుంది.*

పి.కౌసల్య 'అహో! స్త్రీవిద్యకు ఎంత గతి పట్టినది (జూన్ 1901 జనానా) అనే శీర్షికన వ్రాస్తూ దేశాభివృద్ధికిగాని, జ్ఞానాభివృద్ధికి గాని స్త్రీలకు విద్యనేర్పించుట ప్రధానమనీ, స్త్రీవిద్య తగినంతగా అభివృద్ధి చెందుటలేదని తెలిసింది. బాలురువలె బాలికలు తల్లిదండ్రులకు ధనసహాయము చేయలేరనే భావన ఉండటంచేతగాని, బాల్యవివాహాల కారణంగాగాని స్త్రీవిద్య వెనకబడిఉందనీ, స్త్రీలు చదువుకోవటానికి వీలుగా జనానా పాఠశాలలను ఎక్కువగా స్థాపించాలని తెలియజేసింది.

*స్త్రీవిద్య అభివృద్ధిచెందాలంటే బాలికలకు పాఠశాలలను నెలకొల్పాల్సిన అవసరాన్ని పుల్లాభట్ల కౌసల్య తెలియజేసింది.*

కొటికలపూడి సీతమ్మ వ్రాసిన 'సత్యము' (ఆగష్టు 1901 కలావతి) అనే శీర్షకన స్త్రీలు కొద్దో గొప్పో విద్యనభ్యసించటం చేతనే బ్రహ్మమందిరాలకు రాగలుగుతున్నారనీ, పరమేశ్వరుని ఆరాధనతోపాటు పుణ్యాంగనల చరిత్రలు తెలిసికొని సద్గుణాలు అలవర్చుకుని తాము అభివృద్ధి చెందటమేకాక తమ సంతతిని కూడా ఆభివృద్ధి పరచగలుగుతున్నారని తెలిపింది. స్త్రీలు గృహకృత్యముల అనంతరం లోకాభిరామాయణంతో కాలాన్ని వ్యర్థపుచ్చక జ్ఞానాభివృద్ధిని చేసుకోవాలనీ, నోములు, వ్రతాలకంటె కూడ సత్యవ్రతం గొప్పదనీ తామేగాక తమ పతులు కూడా సత్యవ్రతులుగా ఉండేటట్లు చేసేబాధ్యతను స్త్రీలు తీసుకోవాలనీ ఇదే పరిశుద్ధ ఆస్తికత్వమనీ, జ్ఞానార్జన, సత్యవ్రతం స్త్రీ, పురుషులకు అర్హకృత్యమని తెలియజేసింది.

"దైవభక్తి" (సెప్టెంబరు1901 కలావతి) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ, కందుకూరి రాజ్యలక్ష్మమ్మ ప్రార్థనా సమయంలో నారీమణులచేత ఈశ్వరప్రార్థన చేయిస్తూంటే ఆమెపాడే కీర్తనలను విని స్త్రీలు సంతోషపడేవారు కానీ, ఆకీర్తనలందలి అర్థమును తెలుసుకోవడానికి యిష్టపడకపోయే వారని తెలిపింది. దేవపూజానంతరం కల్లలు మాట్లాడితే ఉపయోగం ఉండదనీ,

అంతఃకరణశుద్ధి ఉండాలనీ, చేసేపనిలో మంచి చెడ్డల విచక్షణాజ్ఞానం ఉండాలనీ, సత్ప్రవర్తన ముఖ్యమనీ, ధర్మానుష్ఠానం ప్రముఖధర్మంగా భావించటమే పరిశుద్ధ ఆస్తిక మతోద్దేశమని తెలియజేసింది.

'నీతిని' గూర్చి ఈమె చేసిన ఉపన్యాసంలో (మే 1902 హిందూసుందరి) అన్నిదేశాలలో ఉన్నవారికి నీతి సమానంగానే ఉంటుందనీ, నీతిని అనుసరించుటకు స్త్రీల కెక్కువ అవకాశా లున్నాయనీ, స్త్రీలు కలిసినప్పుడు చిన్న చిన్న విషయాలకు కూడా అబద్ధం ఆడకుండా సత్యమునే మాట్లాడాలని చెప్పింది. ఆత్మాభివృద్ధిదాయకమగు విద్యను అభివృద్ధి చేసుకోవటానికి పుస్తక పఠనానికై తప్పనిసరిగా కాలాన్ని నిర్దేశించుకోవాలనీ, విద్య సమకూరకపోతే స్త్రీలను బానిసలుగా భావిస్తారని తెలిపింది. వారానికొకసారి స్త్రీలందరూ ఒకచోట సమావేశమై నీతి, విద్యావిషయాలు చర్చించుకోవాలనీ, స్త్రీలు ఐకమత్యంగా ఉండటం స్త్రీల ముఖ్యధర్మం అని తెలియజేసింది. (ఇక్కడే స్త్రీసమాజాల స్థాపనకు అంకురార్పణ జరిగింది).

'హిందూ స్త్రీలవిద్యావశ్యకత' (జులై 1902 హిందూసుందరి) అనే శీర్షికన ఈమె చేసినమరొక ఉపన్యాసంలో విద్యాలక్ష్మిని దూషించవద్దనీ, విద్యాలక్ష్మి పూజనీయం కాబట్టి పురుషులు స్త్రీలకు కూడా విద్యాలక్ష్మి అనుగ్రహం ఉండాలని భావించాలని చెప్పింది. స్త్రీలు తీరిక వేళలోను విద్య నేర్వవచ్చుని, చిన్నతనంలో విద్య నేర్చుకోనందుకు బాధపడవద్దనీ, భండారు అచ్చమాంబగారు స్త్రీసంఘాలయందు అభిమానంతోనే స్వదేశీస్త్రీల చరిత్రలను తెలియజేస్తూ 'అబలా సచ్చరిత్రరత్నమాల' అనే గ్రంథాన్ని వ్రాసిందనీ, దాన్ని చదుకోవాలని తెలియజేసింది.

'స్త్రీవిద్య' (1902 ఆగస్టు హిందూసుందరి) ను గురించి కొటికలపూడి సీతమ్మ చేసిన ఉపన్యాసంలో విక్టోరియా పరిపాలనలోని భారతదేశంలో బాలికా పాఠశాలలు ఏర్పడ్డాయి గానీ, తల్లిదండ్రులు కూతుళ్ళను నిజమైన విద్యాభిలాషతో పంపటంలేదని చెప్పింది. విద్యాజ్ఞానం ప్రారంభమయ్యే ఐదేండ్ల వయసుకే బాల్యవివాహాలు చేయటంతో, వివాహానంతరం గృహసంబంధ పనుల వత్తిడితోను బాలికలు పాఠశాలకు వెళ్ళకపోవటంతో బాలికల విద్యాభివృద్ధి జరగటం లేదని తెలియజేసింది. ఉచిత బోధన చేసే ఉపాధ్యాయులను నియమించినప్పటికీ, తల్లిదండ్రులు తమ బాలికలను సరిగ్గా పాఠశాలలకు పంపటం లేదనీ, ఐదేండ్లు వచ్చిన తర్వాత గ్రహణశక్తి, పెరిగి 2,3 తరగతులు చదివే సరికి పెళ్ళిచేస్తుంటే బాలికలు చదువును ఆపేస్తున్నారనీ, ఆటలాడుతూ విలువైన కాలాన్ని బాలికలు వ్యర్థం జేస్తున్నారని తెలియజేసింది.

'స్త్రీవిద్య' ను (సెప్టెంబరు 1902 హిందూసుందరి) గురించి ఈమె చేసిన మరొక ఉపన్యాసంలో స్త్రీలు చదువుకోలేకపోతే సత్యాన్ని గ్రహించగల మంచిచెడుల విచక్షణా జ్ఞానం ఏర్పడదనీ, స్త్రీలు విద్యవల్ల వృద్ధినొందితేనే సంతతిని వృద్ధిలోకి తీసుకురాగలరని, విద్యతోనే మానవజన్మ సార్థకం కాగలుగుతుందని తెలియజేసింది.

ఈమెయే 'పత్రికా సహపాఠినులకొక విజ్ఞాపనము' అనే శీర్షికన వ్రాస్తూ, (ఏప్రిల్ 1903 హిందూసుందరి) సత్తిరాజు సీతారామయ్యగారు హిందూసుందరిని దగ్గర ఉండి ప్రచురిస్తున్నారని పత్రికాపఠనం చేయటానికి స్వాతంత్ర్యాన్నిచ్చిన వారికి కృతజ్ఞతతో ఉండాలనీ, పత్రికలు చదివి సద్విషయాలను అభిమానులై చదవాలనీ, స్వీయలోపాలను తర్కించుకోవాలనీ, దురాచారాలను నివారించు కోవాలని తెలిపింది. గృహసౌఖ్యం, పిల్లల పెంపకానికి కావల్సిన అభివృద్ధికర విషయాలను తెలుసుకోవాలనీ, స్త్రీ విద్యాభిమానులయెడ ద్వేషాన్ని పోగొట్టుకోమనీ, భర్తమీద అధికారాన్ని చూపించి సుఖాన్ని పొందలేమనీ, పత్రికాపఠనం చేయటంతోపాటు తెలిసిన విషయాలను వ్యాసాలుగా వ్రాసి పత్రికలకు పంపటం స్త్రీలు చేయాలని తెలియజేసింది.

"పరోపకారం" అని ఈమె చేసిన ఉపన్యాసంలో భాగంగా (ఆగష్టు 1904 హిందూసుందరి) బాలికా విద్యవల్ల వారిలో పరోపకార చింత పెరుగుతుందనీ, అదే దేశక్షేమానికి దారి తీస్తుందని పేర్కొంది.

'స్త్రీవిద్య' (డిసెంబరు 1905 – జనవరి 1906 హిందూసుందరి) ను గురించి ఈమె ఉపన్యసిస్తూ గత 30 సంవత్సరముల నుండి స్త్రీ విద్యకు కృషిచేస్తున్నారనీ, కొంత అభివృద్ధిని సాధించారనీ, స్త్రీలకువిద్య అత్యంతావశ్యకమని చెప్పింది. ధర్మపత్నులకు విద్యావివేకాలుండాలని పురుషులు భావించాలనీ, పరనింద, అసత్యం, స్వార్థం వంటిది విద్యావిహీనులకుంటాయనీ, స్త్రీలు విద్యావంతులైతే సద్గుణ సంపన్నులు కాగలరనీ, విద్యను స్త్రీలు బంగారం కంటే విలువైనదిగా భావించేటట్లు చేయాలని కోరింది.

'హిందూ సుందరుల విద్యాభివృద్ధి' (జనవరి1905 జనానా)ని గురించి ఈమె చేసిన ఇంకొక ఉపన్యాసంలో తన గురువైన కందుకూరి వీరేశలింగం గారు 'శ్రీవిక్టోరియా వితంతు శరణాలయమను పేర' ఒక అనాథ రక్షణశాలను ఏర్పరచారనీ, విద్యాభివృద్ధికొరకు లోయర్ సెకండరీ పాఠశాలను స్థాపించి బాలికలు, సంసారస్త్రీలు, వితంతు స్త్రీలు చదువుకోవటానికి అవకాశాలు కల్పించారని చెప్పింది. స్త్రీవిద్య అభివృద్ధి చెందాలంటే ఇటువంటి పాఠశాలలు అవసరమనీ దేహపోషణకు, అన్నవస్త్రాదులకు, అల్పపోషణకు తగిన విద్యాస్వాతంత్ర్యాలు కరవై దుఃఖించే వితంతు స్త్రీల జ్ఞానప్రచారానికై కంకణంకట్టుకొన్నారని తెలియజేసింది. అంతేకాదు, పురుషులచే నిర్బంధింపబడే హిందూ స్త్రీలు తాము పురుషులతో సమానంగా స్వాతంత్ర్యము వహించాలంటే మానవ జన్మను సార్థకంచేసుకున్న యితరదేశ స్త్రీల చరిత్రలను తెలుసుకోవాలనీ, గృహభారం వహించే స్త్రీలకు గణితశాస్త్ర విజ్ఞానం ఉంటే వారు గృహకృత్య నిర్వహణంలో సమర్థులగుదురనీ, వేడుక కోసం కాక జ్ఞానంకోసం స్త్రీలు చదువుకుంటే ఫలమెక్కువ ఉంటుందని తెలిపింది. స్త్రీవిద్య అభివృద్ధి చెందకపోవటానికి మహమ్మదీయుల కాలం నుండి ఏర్పడిన స్త్రీల అంతఃపురవాసమనీ, స్త్రీలు చదువుకుంటుంటే, ఇంటిపనిని, పిల్లలకు పాలివ్వటాన్ని మాని

పాఠాలు చదువుకుంటారా అని హేళన చేసినా పట్టించుకోవద్దనీ, స్త్రీలు చదువుకుంటూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేసింది.

కందుకూరి వీరేశలింగంగారి 56 వ జన్మదినం రోజున వారిని గురించి కొటికలపూడి సీతమ్మ ఉపన్యసిస్తూ (మే 1904 హిందూ సుందరి) వీరేశలింగంగారు సుగుణ సంపన్నుడుగా అనాథ యువతీ జనరక్షణ చేసారనీ, వారు కార్యశూరులనీ, దేశమాత నుద్ధరించుటకు స్త్రీవిద్యకై పరిశ్రమ చేసారని సంఘదురాచారమును రూపుమాపేదిశగా వితంతు పునర్వివాహాలను చేసి వారికి కొత్త జీవితాలనిచ్చారని పేర్కొన్నది. స్త్రీలు తాము జీవించే హక్కును పొడిగించేదిశగా మూఢ సంప్రదాయాలమీద కత్తినీ, కలాన్ని దూసి సమాజానికి ఎదురొడ్డిన వ్యక్తిగా కందుకూరి వీరేశలింగంగారిని భావించటమే స్త్రీల జీవితాన్ని మెరుగుపరచే విషయమనీ, దానినే వారు చేసిన దేశోద్ధరణగా భావించాలని తెలియజేసింది. వీరేశలింగంగారి స్త్రీ విద్యా ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యతను స్త్రీలు వహించాలని కొటికలపూడి సీతమ్మ తెలియజేసింది.

*స్త్రీ విద్యావంతురాలయి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ జ్ఞానాభివృద్ధితో సత్యసంరక్షణ చేయటమే విద్యాలక్ష్యంగా ఈమె భావించింది. మతమనేది విశ్వాసాన్ని కలిగించేది కాబట్టి ముందుగా స్త్రీలలో నూతనంగా మతోద్దేశ్యాన్ని తెలియచేసి మంచి వ్యక్తిత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఆమె చేసిన ఒక ప్రయత్నంగా భావించవచ్చు. స్త్రీల బానిసత్వ నిర్మూలనకు స్త్రీవిద్యకు ఉన్న లంకెను తెలియజేసింది. స్త్రీలు వారానికి ఒకసారి తరచుగా ఒకచోట చేరి స్త్రీసమస్యలపైన చర్చించుకోవాలనే స్త్రీసమాజాలయొక్క ఆలోచనలకు కొటికలపూడి సీతమ్మయే మే,1902లో బీజంవేయటం జరిగింది. ఆ ఆలోచనయే స్త్రీసమాజాలు ఏర్పడటానికి భూమిక అయి ఆస్కాస్త్రీసమాజము, బృందావన స్త్రీసమాజము, స్త్రీవిద్యార్థినీ సమాజాలు ఏర్పడటం జరిగింది. స్త్రీసమాజాల స్థాపనతో స్త్రీవిద్యాఉద్యమం ఊపందుకొన్నది. స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్యోద్యమానికి పునాదియైనది. స్త్రీవిద్యను గురించి స్త్రీల శక్తియుక్తులను తెలియజేస్తూ సమాజంలో రావల్సిన భావపరిణామాన్ని తెలిపి స్త్రీలకు ధైర్యాన్నిచ్చే ప్రయత్నంచేయటం జరిగింది. ఆడపిల్లల యొక్క బాల్యవివాహాలు స్త్రీవిద్యకు ప్రతిబంధకాలని స్త్రీలు గ్రహించగలిగేటట్లు తెలియజేసింది. స్త్రీలకున్న బంగారపు లోహదృష్టిని మరల్చి స్త్రీవిద్య బంగారమనే లోకదృష్టిని ఈమె కల్గించాలనుకోవటమే స్త్రీజాతికి సామాజిక విలువలను సంతరింపజేయటంగా భావించవచ్చు. స్త్రీవిద్యపట్ల సామాజికనిరసనను పట్టించు కోనక్కరలేదనీ, దానికి భయపడాల్సిన అవసరం లేదనీ, వితంతుస్త్రీల విద్యావకాశాలను కొటికలపూడి సీతమ్మ తెలియజేసింది.*

'కొటికలపూడి సీతమ్మ'ను (ఫిబ్రవరి1904 హిందూసుందరి) గురించి పత్రికా సంపాదకురాలు వ్రాస్తూ ఆమె తన విద్యాభ్యాస విషయంలో యిరుగు పొరుగు బాలురవద్ద అక్షరాలు, గుణింతాలు నేర్చుకొందనీ, ఆమె అధికశ్రమపడి విద్యనేర్చినదని తెలిపింది. క్రమంగా కష్టపడి తన విద్యా పరిజ్ఞానాన్ని పెంచుకుందనీ, వివాహానంతరం కూడా ఆమె విద్యార్జనను మరువలేదనీ,

‘స్త్రీవిద్య’ను గురించిన ఉపన్యాసములు యిస్తూ దేశీయ సంస్కరణలో చురుకుగా పాల్గొన్నదని పత్రికాధిపులు తెలియజేయటం జరిగింది.

‘కొటికలపూడి సీతమ్మ’ (మార్చి 1904 హిందూసుందరి)ను గురించి కందుకూరి రాజ్యలక్ష్మి వ్రాస్తూ సీతమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోయినా గృహకృత్యములే గాక స్త్రీలవిద్యా, జ్ఞానాభివృద్ధికి పాటుపడుతోందనీ, స్త్రీలకుపయోగించే మంచి పుస్తకాలు చదివి, వ్రాస్తూ స్త్రీసమాజంలో స్త్రీలను ప్రోత్సహిస్తోందనీ, స్త్రీలమధ్య కలహాలను నిర్మూలిస్తూ ఐకమత్యాన్ని సీతమ్మ పెంపొందిస్తోందని పేర్కొంది.

ఉన్నవ లక్ష్మీబాయమ్మ వ్రాసిన ‘ఐకమత్యము’ ను (మార్చి 1904 హిందూసుందరి) గురించిన వ్యాసంలో స్త్రీలు చదువుకుంటే తోటి స్త్రీలతో స్నేహంతో ఉంటారనీ, ఐకమత్యాన్ని అభివృద్ధి చేసుకోగలరని తెలియజేసింది.

‘స్త్రీవిద్య’ (నవంబరు 1903 హిందూసుందరి)ను గురించి ఈమె చేసిన ఉపన్యాసంలో భాగంగా సామాజిక అపోహలను పోగొడుతూ స్త్రీలు చదువుకుంటే గృహకృత్యాలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలరనీ, భండారు అచ్చమాంబ, కొటికలపూడి సీతమ్మ, పెద్దిబొట్ల వేంకటసుబ్బమ్మవంటి వారు విద్యావంతులై గృహకృత్య నిర్వహణత్వంలో బాలల బాగుకోసం ప్రయత్నిస్తున్నా’రని చెప్పింది.

ఈమెయే వ్రాసిన ‘దేవునియెడల మనము చెల్లించవలసిన విధులు’ (జనవరి 1904 జనానా) అనే వ్యాసంలో స్త్రీలు విగ్రహారాధనను తగ్గించుకొని విదేశీస్త్రీలవలె చదువుకుంటూ జ్ఞానసంపాదనకు పాటుపడాలనీ, దురాచారాలను సవరించుకొని దేశమును మంచి స్థితిలోకి తేవాలని, దానినే స్త్రీలు దైవభక్తిలో భాగంగా చేయవలసిన పనులుగా ఉన్నవ లక్ష్మీబాయమ్మ తెలియజేసింది.

*స్త్రీలు స్వేచ్ఛగా, నిర్భయంగా బతకాలంటే విద్యావంతులు కావల్సిన అవసరాన్ని పేర్కొనటంతో పాటు విద్యావంతులైన స్త్రీలలో ఐకమత్యం ఉంటుందని భావించింది. స్త్రీలు తమ విద్యకై చేసే కృషియే దైవభక్తిగా భావించమని తెలియజేసింది.*

‘స్త్రీవిద్య’ను గురించి సిరూరుకాంత చేసిన ఉపన్యాస అనువాదంలో (నవంబరు 1901 జనానా) సంఘసంస్కారానికి స్త్రీవిద్య ముఖ్యమనీ, సాంఘిక దురాచారాలకు స్త్రీల అజ్ఞానమే కారణమనీ, సమాజంలో పెరిగే శిశువులకు తల్లియే దయ, ప్రేమవంటి గుణములు గల మంచి ప్రవర్తనను నేర్పవలెననీ తెలిపింది. స్త్రీలు దయాస్వభావమే తమముఖ్య ఆభరణాలుగా భావించితే దేశము మంచిస్థితిలో ఉంటుందనీ భావించింది.

బాలాంత్రపు శేషమ్మ వ్రాసిన ‘స్త్రీవిద్యాభిమానులకు విన్నపం’ (జనవరి 1902 హిందూసుందరి) అనే వ్యాసంలో ఆర్యులు స్త్రీలకు కట్టుబాట్లను పెట్టారనీ, స్త్రీలకు ఎటువంటి

స్వతంత్రత లేదనీ, స్త్రీలు బానిసలనీ, వారు గౌరవపాత్రులు కారనే జీవనసంస్కృతిని పెట్టారని తెలిపింది. విద్యావిహీనులుగా స్త్రీలు కాంతివిహీనులయి జీవిస్తున్నారు కాబట్టి, స్త్రీలు విద్యావంతులై గౌరవాన్ని, కొంతైనా స్వతంత్రను పొందాలనీ, విదేశీస్త్రీలు రాజ్యాధిపత్యాన్ని వహించి ఉన్నతస్థానాల్లో ఉంటున్నారని చెప్పింది. స్త్రీలు పురాణాలు కాకుండా వార్తాపత్రికలు చదివితే ప్రపంచజ్ఞానం ఏర్పడుతుంది కాబట్టి స్త్రీలు విద్యావంతులయ్యేటట్టు చూసే బాధ్యత పురుషులమీదనే ఉందని తెలియజేసింది.

'ఉన్నతవిద్య' (జులై 1905 హిందూ సుందరి)ను గురించి ఈమె చేసిన ఉపన్యాసంలో స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించటానికి తగిన ధైర్యవంతులుగా మారాలనీ, విద్యను అభివృద్ధి చేసుకోవాలనీ, విశేష భాషాభివృద్ధి, దేశచరిత్రలు, భూగోళం, శరీరశాస్త్రాన్ని, సాహిత్యాన్ని తెలుసుకోవాలని చెప్పింది. ఉన్నతవిద్యతో తమలోని దుర్గుణాలను పోగొట్టుకొని ఐకమత్యంతో మెలగాలనీ, స్త్రీలు ఉద్యోగాలు చేయగలిగితే పురుషులకంటేకూడా విశేషస్వేచ్ఛ కలవారవుతారనీ, అంతరించిపోయిన స్త్రీలయొక్క స్వాతంత్ర్యాన్ని నిలబెట్టటానికి అందరూ కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చింది. 'లక్ష్మీభారతీసమాజోద్ధారకురాలి'గా వీరలక్ష్మమ్మ సంఘాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలియజేసింది.

'విద్యాభిలాషగల యోబాలికామణులారా' (సెప్టెంబరు 1906 హిందుసుందరి) అంటూ ఈమె చేసిన మరొక ఉపన్యాసంలో విక్టోరియారాణి ప్రతిపల్లెయందు, పట్టణమందు బాలికా పాఠశాలలను పెట్టి స్త్రీ విద్య అందించిందనీ, స్త్రీలకు చదువు అంటేనే చెవులు మూసుకునే వారు కూడా తమ ఆడపిల్లలను బడికి పంపించే స్థితికివచ్చారనీ, వీరేశలింగంగారు రెండు సంవత్సరములు కష్టపడి లోకంలో మూడొంతులమందిని స్త్రీవిద్యాభిమానులుగా మార్చివేసారని చెప్పింది. భర్తల, సోదరుల ప్రోత్సాహం ఉన్నచోట ఆడవాళ్ళు బడికి, సమాజాలకు రాగలుగు తున్నారనీ, స్త్రీలు నీతివిద్యను ఐకమత్యాన్ని గురించి తెలుసుకోవాలనీ, ప్రతిగ్రామంలో స్త్రీలు వారానికొకసారి సమాజాలకు రావాలని తెలియజేసింది.

'స్త్రీ విద్య'(జనవరి1907 హిందూసుందరి) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ అంతరించిన స్త్రీస్వాతంత్ర్యం తిరిగి రావాలంటే స్త్రీలు చదువుకోవాలనీ, స్త్రీలు దేశభాషలో ఉన్నతవిద్యను అభ్యసించే అవకాశాలు పెరిగాయని బాలాంత్రపు శేషమ్మ తెలియజేసింది.

*స్త్రీ విద్యావంతురాలయితే సాంఘిక దురాచారాలను నిర్మూలించ వచ్చునే భావనను ఈమె తెలియజేసి, విద్యపట్ల స్త్రీలను సుముఖులుగా చేయటం అర్థమవుతుంది. స్త్రీవిద్య స్త్రీల స్వతంత్ర జీవనానికి మార్గాన్ని ఏర్పరుస్తుందనీ స్త్రీలు పత్రికా పఠనం ద్వారా ప్రపంచ జ్ఞానం పొందాల్సిన అవసరాన్ని చెప్పి దానికి పురుషుల సహకారం కావాలని భావించింది. ఉన్నత విద్యకై స్త్రీలు సాహిత్యాన్ని, శరీరశాస్త్రాన్ని, దేశచరిత్రలు గురించి అవగాహన చేసుకుంటూ తమ స్వాతంత్ర్యాన్ని*

*గురించిన ఆలోచనలు పెంచుకోవాల్సిన అవసరాన్ని సూచించింది. స్త్రీలకు కావ్యపఠనంతోపాటు చరిత్ర, గణితం, ప్రకృతి శాస్త్రం, శరీరశాస్త్రాలను గురించిన అవగాహన అవసరమనీ, అవి నేర్చి ఉద్యోగాలు చేయగలిగితే స్త్రీలు స్వతంత్రజీవనాన్ని గడపగలుగుతారని తెలియజేసింది. స్త్రీల ఆలోచనలు ఉన్నత విద్యార్జనకై అభివృద్ధిచెందాల్సిన అవసరాన్ని తెలిపి స్త్రీవిద్యాభివృద్ధిలో తండ్రి, సోదరుల బాధ్యతను తెలియజేసింది. నాటి స్త్రీలలో పరభాషలో చేయాల్సిన విద్యాభ్యాసంవల్ల కలిగే భయాన్ని పోగొట్టటంతో పాటు స్త్రీస్వాతంత్ర్యకాంక్షను రగులుకొల్పటం కన్పడుతుంది. స్వభాషలోని స్త్రీవిద్యకు స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని బాలాంత్రపు శేషమ్మ పేర్కొంది.*

సత్యవతి వ్రాసిన 'విద్యాధికులగు హిందూపురుషులకొక విజ్ఞాపనం' (ఏప్రిల్ 1902 జనానా) అనే వ్యాసంలో ఒకస్త్రీగా విజ్ఞాపన చేయటాన్ని పురుషులు చిన్నతనంగా భావించవద్దనీ, పురుషులతో స్త్రీలు మిత్రులుగా ఉంటారనీ, దేశాభివృద్ధికి స్త్రీవిద్య అవసరమనీ, బ్రిటిష్ వారివల్లనే స్త్రీవిద్య ప్రోత్సహింపబడినదని తెలిపింది. పురుషుల ఆలోచనలలో స్త్రీలనుగురించి వారు గృహకృత్యాలు చేస్తే చాలనుకుంటున్నారు గానీ, ఆ కృత్యములను నిర్వహించటానికైనా కూడా స్త్రీలు గృహవిద్యను నేర్చుకోవాలనీ, కుటుంబాలలో స్త్రీలకు బొత్తిగా స్వతంత్రత లేకుండా ఉంటోందనీ, విద్యలేని స్త్రీలను దాసీలుగా భావిస్తున్నారని చెప్పింది. స్త్రీలు చదవను వ్రాయటమేగాక గృహనిర్వహణకు ఉపయోగపడు దేహారోగ్యధర్మములు, ఇంటి శుభ్రతను నేర్చుకోవాలనీ, ప్రాచీన స్త్రీలవలె నేటి స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలని తెలియజేసింది. బాలికల కొఱకు పాఠశాలలు నెలకొల్పాలనీ, నూటికిద్దరే బాలికలు చదువుకుంటున్నారనీ, స్త్రీలు తమ విద్యావిషయంలో పట్టుదలతో ఉండాలనీ, దేశీయవిద్యను, పరదేశవిద్యను సమానంగా నేర్చుకోవాలనీ, స్త్రీల మానసికాభివృద్ధికి అడ్డుపడ వలదనీ పురుషులకు సత్యవతి విన్నవించటం జరిగింది.

*స్త్రీల విద్యకు, స్త్రీల స్వతంత్ర జీవనానికి ఉన్న లంకెను తెలియజేస్తూ స్త్రీవిద్యను ఆటంకపరచవద్దని పురుషులకు విన్నవించింది. స్త్రీలు అస్వతంత్రులుగా ఉన్నారనే స్పృహను కల్గించిన వ్యాసమిది.*

'స్త్రీవిద్యావిజయవార్త' అనే శీర్షక క్రింద (మే 1902 హిందూసుందరి) పులుగుర్త లక్ష్మి నరసమాంబ వ్రాస్తూ పెద్దిభట్ల వెంకటప్పయ్య పంతులు "దేశమునభివృద్ధిదేజరిల్ల".. "మంచి బుద్ధి దేశవృద్ధి గణనీతినొనర్చెసుతకు" అని తమ కూతురియొక్క ఆంగ్లపాఠశాల ప్రవేశాలకై తండ్రి మిషనరీస్ వారిని కోరాడని తెలిపింది. కుమార్తె వెంకటసుబ్బమ్మ వివాహిత అయినప్పటికీ నాయనమ్మ ప్రోత్సాహంతో చదువును కొనసాగించి ఇంగ్లీషు మీడియంలో లోయర్ సెకండరీ పరీక్షలో ఉత్తీర్ణురాలైందనీ తెలియజేసింది. ఆమె చదువుకున్న ఆంగ్లపాఠశాలలో ఉపాధ్యాయినులుగా స్త్రీలే ఉండటం చేత ఆమెచదువుకు అడ్డంకి లేకపోయిందని తెలియజేసింది.

'స్త్రీల యున్నత విద్య' (మే 1903 హిందూసుందరి) ను గురించి పులుగుర్త లక్ష్మీనరసమాంబ చేసిన ఉపన్యాసంలో స్త్రీలకు ఉన్నత విద్యవలన ప్రయోజనం ఉందనీ, అల్పవిద్యతోనే స్త్రీలు

సంతోషపడకూడదనీ, సులభగ్రాహ్యంకాని కావ్యాలను పెద్దల చేత చెప్పించుకొనియైనా విద్యాభివృద్ధిని పొంది తద్వారా లోకజ్ఞానాన్ని పొందాలని చెప్పింది. అంతేకాదు, 'నేటి స్త్రీలు స్త్రీలేకాదు, పురుషులునూ' అని చెప్పి స్త్రీల ఉన్నతవిద్యను అంగీకరించని వారి విషయాలను పట్టించుకోకుండా తీరిక చేసుకొని సద్గ్రంథాలు చదివి 'గార్గి' వంటి విద్యావంతులైన స్త్రీల స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చింది. స్త్రీలు ఉన్నత విద్యాభ్యాసం చేయటం వల్ల సులభగ్రంథములనే గాక కఠినమైన శాస్త్రగ్రంథాలను కూడా పఠించగల నేర్పు వారికి ఏర్పడుతుందనీ, దానివల్లనే స్త్రీల అభివృద్ధి మరియు లోకాభివృద్ధి జరుగుతుందని చెప్పింది.

*వివాహితులైన స్త్రీలు కూడా తమ విద్యాభివృద్ధిని చేసుకునే అవకాశం ఉంటుందనే చైతన్యాన్నిచ్చిన వ్యాసమిది. స్త్రీ పురుషుల సమానత్వానికి దారితీసేది స్త్రీల ఉన్నత విద్యయే అని అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. స్త్రీల ఉన్నత విద్యావ్యాప్తికి బీజంవేయటం జరిగింది. స్త్రీల విద్యను గురించి మరొక అడుగు ముందుకు వేసి స్త్రీలకు శాస్త్రజ్ఞానం కావాలనీ, అదే స్త్రీల అభివృద్ధికి సోపానం అవుతుందని తెలియజేస్తూ స్త్రీలకు ప్రాథమిక విద్యయే కాక స్త్రీల ఉన్నత విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని పులుగుర్త లక్ష్మీనరసమాంబ తెలియజేయటం జరిగింది.*

ఓ.ఆదెమ్మ చేసిన 'స్త్రీవిద్య' (జూన్ 1902 హిందూసుందరి) అనే ఉపన్యాసంలో స్త్రీలు తమ తోటి స్త్రీలను గౌరవంగా చూడాలనీ, స్త్రీలు కూడా బాల్యము నుండి విద్యాప్రసంగాలలో పాల్గొనాలనీ, స్త్రీలకు లాభము గలుగునట్లుగా పనులు చేయటమే నాగరికమని భావించింది. స్త్రీల 'విద్య' అనేది స్త్రీలకే గాక దేశానికి కూడా నాగరికతా చిహ్నమని తెలియజేసింది.

ఈమె వ్రాసిన 'దక్షిణదేశపు మనదేశపుస్త్రీల తారతమ్యము' (అక్టోబర్ 1902 హిందూసుందరి) అనే మరొక వ్యాసంలో తెలుగుస్త్రీలు దక్షిణభారతదేశపు స్త్రీలకు గల స్వతంత్రతను గురించి అర్థం చేసుకోలేక పోతున్నారనీ, వారు సంగీతం పాడితే వారిని భోగం వాళ్ళని భావించటం, సంగీత సాహిత్యపు విద్యలు నేర్చితే భర్త తమను విసర్జిస్తాడని భావిస్తారని, అది తెలుగుస్త్రీల అవివేకత్వంగా గ్రహించాలని ఓరుగంటి ఆదెమ్మ చెప్పింది. (ఆనాడు ప్రాంతాన్నే దేశమని భావించేవారు.)

*పుట్టుకతో స్త్రీ, పురుషులు సమానమైనప్పుడు ఇరువురి స్థాయిలో ఉన్న తేడా యొక్క స్వభావాన్ని అర్థంచేసుకునే క్రమంలో ముందుగా 'స్త్రీవిద్య' యొక్క అవసరాన్ని గుర్తించింది. అక్షరజ్ఞానులైన స్త్రీలు 'స్త్రీవిద్య' అవసరాన్ని స్త్రీలు గుర్తించేటట్టుగా ఉపన్యాసాలను ఇచ్చి తోటి స్త్రీలలోవిద్యాభివృద్ధిని కలిగించటమే నాగరికత అనీ, స్త్రీలవిద్యాభివృద్ధికి స్త్రీలే పూనుకోవాలని ఓరుగంటి ఆదెమ్మ భావించింది.*

కందుకూరి రాజ్యలక్ష్మి చేసిన 'ఈశ్వరభక్తి' (జులై 1902 హిందూసుందరి) అనే ఉపన్యాస ప్రచురణలో స్త్రీలు విద్యావంతులు కావాలని కొందరు పుణ్యపురుషులు ప్రయత్నిస్తున్నారనీ, రోజూ

స్త్రీలు ప్రార్థనాబ్రహ్మమందిరంలో ఈశ్వర ప్రార్థన చేయాలనీ, స్త్రీలకు తీరికయైనపుడు మంచి పుస్తకాలు చదివి ఎదుటివారికి కూడా వినిపించాలని చెప్పింది. కందుకూరి అనుయాయులుగా కొంతమంది పురుషుల మద్దతు స్త్రీ విద్యకు ఉంటుందని చెప్పింది.

*స్త్రీలలో విద్యా సంబంధమైన ధైర్యాన్ని కలిగించే ప్రయత్నంగా ప్రార్థనా మందిరాన్ని వేదికగా చేసుకొన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు.*

అ.లక్ష్మీకాంతమ్మ ఇచ్చిన 'స్త్రీవిద్య' (నవంబరు 1902 హిందూసుందరి) అనే ఉపన్యాసంలో పరమాత్మ యిచ్చిన పంచేంద్రియ, జ్ఞానేంద్రియములను మంచిపనులకు వినియోగించటానికి తగిన జ్ఞానం కలగటానికి స్త్రీవిద్య అవసరమని చెప్పింది. స్త్రీ విద్యావంతురాలయితే శిశుపోషణము, గృహకృత్యములను చక్కగా నెరవేర్చ కలుగుతుందనీ, రాజమహేంద్రవరంలో కొటికలపూడి సీతమ్మ స్త్రీ సమాజాలను పోగుచేసి స్త్రీ విద్యాభివృద్ధి చేస్తున్నారని తెలియచేసింది. మానవజన్మ ధన్యతను పొందటానికి తగిన జ్ఞానాన్ని కలుగజేసేది స్త్రీవిద్య అని తెలియజేసింది.

'ఒక సుందరి' అనే పేరుతో 'స్త్రీ నీతిని' గూర్చి (ఏప్రిల్ 1903 హిందూ సుందరి) వ్రాస్తూ దేశంలో పురుషులు మాత్రమే ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారనీ స్త్రీ విద్యాభివృద్ధి జరుగుచున్న కాలంలో కూడా బాలికలు 2,3 తరగతుల తర్వాత చదువును కొనసాగించటం లేదని తెలిపింది. సద్గ్రంథాన్ని చదివితే జ్ఞానాభివృద్ధి కలుగుతుందనీ, నీతిని, విద్యను పెంపొందించుకోవాలనీ అచ్చమాంబ, కొటికలపూడి సీతమ్మ మంచి గ్రంథాలు వ్రాసి స్త్రీలను దోషరహితులుగా చేయాలని కోరింది.

*బాలికావిద్యాభివృద్ధిని అంచనా వేయటం మొదలుపెట్టారని అర్థమవుతుంది.*

'హిందూ స్త్రీల గుట్టు' (ఏప్రిల్ 1903 హిందూసుందరి) అనే వ్యాసంలో గంటి జోగమాంబ స్త్రీలలో ఉన్న చపలత్వానికి, అజ్ఞానానికి చిహ్నంగా ఉదాహరిస్తూ ఒక స్త్రీ తన భర్త ఆమెకు చెప్పిన నల్లకాకికి తెల్లకాకి పుట్టిన కథ చెప్తూ, దానివలన రాజుకు ఉపద్రవం ఉంటుందని భర్త చెప్పిన విషయాన్ని నీలాటి రేవుదగ్గర తోటి స్త్రీలతో పంచుకొంది. ఆ విషయం అలా అలా ప్రాకి రాజుగారి చెవినబడి ఆ అపవాదాన్ని సృష్టించిన వానిని శిక్షించాలనుకుంటాడు. కాని బుద్ధిబలంతో ఆ భర్త శిక్షనుండి తప్పించుకోగలిగాడని చెప్పి, స్త్రీలు భర్తలు ఏంచెప్పినా గుడ్డిగా నమ్ముతారుగానీ విచక్షణాజ్ఞానాన్ని వినియోగించరని తెలియజేసింది.

*స్త్రీలు చదువుకుంటే గానీ విచక్షణాజ్ఞానం అబ్బదనీ తెలియజేసింది. స్త్రీలలో సత్యజ్ఞానాన్ని పెంచేది చదువేనని నొక్కి వక్కాణించింది.*

గొడవర్తి బంగారమ్మ వ్రాసిన 'దేశాభిమానంగల స్త్రీలకొక ప్రార్థన' (జూన్ 1903 హిందూ సుందరి) అనే వ్యాసంలో హిందూదేశం బీదదేశంగా ఉండటానికి కారణం స్త్రీవిద్య లేక

పోవటమేననీ, వయసున్న వితంతువివాహాలకంటే కూడా స్త్రీవిద్యాసంస్కరణం ముందు జరగాలని తెలిపింది. ఆనందగజపతిరాజు విజయనగరంలో బాలికాపాఠశాలను ఏర్పరచినా అది సరిగా నిర్వర్తింపబడటంలేదనీ, పురుష ఉపాధ్యాయులుండటంచేత పదిఏండ్లు వచ్చిన బాలికలు సిగ్గుతో విద్యాభ్యాసం చేయటంలేదనీ, అందుకని 1897 ఫిబ్రవరిలో విజయనగరంలో తానొక బాలికాపాఠశాల పెట్టి తెలుగు, ఇంగ్లీషు చదవటం వ్రాయటం నేర్పటానికి తాను పూనుకున్నట్లు పేర్కొంది. వూలు, కుట్లుకుట్టటం నేర్పిస్తున్న విషయాన్ని చెప్పి మరొక ఇద్దరు సహాయకురాండ్రు ఉంటే బాలికలసంఖ్య పెరుగుతుందనే భావనతో దానికి తగినట్లుగా ధనసహాయానికై విజయనగరం రాణీగారి సహాయాన్ని అర్థిస్తే ఆమె చందాను యిప్పించినట్లు తెలియజేసింది.

*ఈ వ్యాసరచయిత్రి ఒక వ్యక్తిగా, స్త్రీగా సమాజంలో ముందుకు వచ్చి వితంతు స్త్రీలకు పునర్వివాహం కంటె ముందు చదువుకే ప్రాధాన్యత నివ్వాలనీ, అదే అన్ని సమస్యలను తీరుస్తుందని భావించి, బాలికావిద్యకు కృషి చేయటం అభినందనీయం. స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉంటే స్త్రీ విద్య అభివృద్ధి చెందుతుందని, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన విషయాలపట్ల సూక్ష్మమైన సునిశిత పరిశీలనతో రచయిత అర్థంచేసుకోవటమే సామాజిక ప్రగతిగా భావించవచ్చు. అంతేగాక ఆంధ్ర వనితగా ఆంధ్రదేశంలో బాలికాపాఠశాలను నెలకొల్పిన ప్రథమస్త్రీగా గొడవర్తి బంగారమ్మకు స్త్రీజాతి ఋణపడి యుండక తప్పదు.*

వలివేటి బాలాత్రిపుర సుందరమ్మ, 'రాజామునందలి జనానాసభ' (జులై 1903 హిందూ సుందరి)లో చేసిన ఉపన్యాసంలో స్త్రీల కంటే పురుషులు శారీరక, మనోధారుఢ్యమునందు, విద్యయందు ఎక్కువగా ఉండి, స్త్రీ జన్మకు రెండవస్థానానిచ్చారనీ, 'అబలలని' పిలువబడే స్త్రీలు విద్య నేర్చుకుంటేనే ఉన్నత స్థితిలో ఉండగలరని చెప్పింది. విద్యవలన సృష్టిలోని జీవ, నిర్జీవ పదార్థాల సృష్టిని గురించి తెలుసుకోవచ్చనీ, పంచభూతాలను గురించి, వివిధ దేశాచారాలను గురించి, శరీరశాస్త్రం గురించి తెలుసుకోవచ్చుని, గృహనిర్వహణను నేర్పుగా చేయవచ్చుని తెలిపింది. స్త్రీలు ఒక యింటిదగ్గర కలసి ఒక్కొక్క సంగతిని గురించి చదువుతూ అవసరమైన జ్ఞానాన్ని సంపాదిస్తే చాలా ఉపయోగములు ఉంటాయని తెలియజేసింది.

ఆ జనానా సభలోనే వెంపల శాంతాబాయి ఉపన్యసిస్తూ హిందూదేశంలో స్త్రీలకు విద్య లేకుండాచేసి వారిని మూఢులుగా మార్చారనీ, స్త్రీ రత్నముల సాంగత్యంలో విద్యావంతులు అవుతున్నారు కాబట్టి స్త్రీలందరూ కాలాన్ని వ్యర్థపుచ్చక విద్యావంతులు కావాలనీ, బాలికలకు రెండక్షరాలను నేర్పించి, విద్యాసారాన్ని నేర్పింపక స్త్రీలను దుర్గుణులని చెప్పే విషయాలను నమ్మవద్దని చెప్పింది. విద్యనేర్చితే స్త్రీలు చెడునడత కల్గియుంటారంటే మరి పురుషులు కూడా అట్టివారేఅని అనవలసివస్తుందనీ, విద్యాద్వేషులు పన్నే కుతంత్రాలకు లోబడకుండా స్త్రీలు విద్యాధనాన్ని ఆర్జించాలని తెలియజేసింది.

*స్త్రీలు ఉన్నతస్థితికి ఎదగటానికి ప్రకృతిశాస్త్ర జ్ఞానం అవసరమనీ, అప్పుడేవారిని పురుషులు గౌరవిస్తారని తెలియజేసింది. స్త్రీవిద్యను ఆటంకపరుస్తున్న పురుషుల కుట్రను అర్థంచేసుకోమని చెప్పింది. స్త్రీలు తమ సామాజిక హోదాని గురించి ఆలోచించాలని ఆ నాడే భావించింది.*

ఆగష్టు 1903 జనానా పత్రికయొక్క ప్రచురణలో చెన్నపురి రాజధానిలో 1901 సం.లో దొరతనం వారు వేయించిన జనాభా లెక్కలను, విద్యావంతుల పట్టిక ప్రకారం 1,74,68491 మంది హిందూస్త్రీల సంఖ్యలో 1,21,462 మంది దక్షిణ భారతదేశపు నాలుగు భాషలలో విద్యావంతులైన స్త్రీలు ఉండగా అందులో చెన్నపట్నంలోని విద్యావంతులైన స్త్రీలలో ప్రతి 1000 మందికి తెలుగు స్త్రీలు కేవలం 5గురు మాత్రమే చదువుకున్నారని తెలియజేసింది. వివిధ వయస్సులలో విద్య నేర్చిన వారు (దక్షిణ భారతదేశపు) నాలుగు భాషలలోనూ వ్రాయటం, చదవటం చేయగలిగినవారు 24 శాతం వారు మాత్రమే ఉన్నారు. 10 సం.లలోపు హిందూ బాలికలు 48,24,031 మంది ఉండగా విద్య నేర్చిన వారు 8,262 మంది ఉన్నారు అనగా (0.58 శాతం). 10-15 సం.ల వారు 19,78,221 మంది స్త్రీలలో విద్య నేర్చిన వారు 28,921 (0.68 శాతం). 15-20 సం.ల లోపు వారు 1,30,20,668 మంది ఉండగా విద్య నేర్చిన వారు 22,027 మంది (0.46 శాతం), 20 సం.ల పైబడిన హిందూ స్త్రీలు 93,63,571 మందిలో 68,252 మంది (0.13 శాతం) చదువుకున్నారని అర్థం అవుతుంది. అన్ని మతములలో వివిధ వయస్సులవారిగా స్త్రీల సంఖ్య 1,95,84,070 ఉండగా వారిలో 1,80,488 మంది విద్యావంతులైన స్త్రీలు 1 శాతంగా ఉన్నారని పత్రిక తెలియజేసింది. అంటే స్త్రీల విద్య 1900 సం. నాటికి ఒక శాతం మాత్రమే ఉన్నట్లుగా అర్థమవుతుంది.

వి. సీతమ్మ వ్రాసిన 'మనకు బలము కలుగు'టెట్లు' (నవంబరు 1903 హిందూసుందరి) అనే వ్యాసంలో ధనవంతుల కంటేకూడా స్త్రీలు కష్టపడి పనిచేస్తే దేహారోగ్యం బాగుంటుందని స్త్రీలలోని వర్గపర ఆత్మన్యూనతా భావాన్ని తగ్గిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యమని భావించమని స్త్రీలు శారీరకంగా బలంగా ఉండాలనీ, స్త్రీలను ప్రోత్సహించటం జరిగింది.

*స్త్రీలయొక్క సుకుమార సౌందర్యంకంటె కూడా శారీరక ఆరోగ్యమే వారి మనోపరిపక్వతకు దారి తీయగలుగుతుందని భావించటం జరిగింది. స్త్రీలు అబలలు అనే సామాజిక అపప్రథను పోగొట్టి తాము సబలలుగా తయారయి ఆత్మన్యూనతను పోగొట్టుకోవ్వాల్సిన అవసరాన్ని గుర్తించటం జరిగింది.*

వెంపల శాంతబాయి వ్రాసిన 'సమాజలాభము' (నవంబరు 1903 హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీసమాజాలు ఏర్పడాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ వాటివల్ల స్త్రీవిద్యను అభివృద్ధి చేసుకోవచ్చునీ, స్త్రీసమాజాలలో ఒకరెరిగిన విషయాలు మరొకరు పంచుకోవచ్చునీ, అక్షరజ్ఞానంతో ప్రపంచ విషయాలపట్ల అవగాహనను పెంచుకోవచ్చునీ, మొసలిగంటి రామాబాయమ్మ ఆస్కాసమాజానికి మాత అని తెలియజేసింది.

ఇల్లు పరిధిగాగల స్త్రీలను సమాజంలో అడుగుపెట్టేటట్లు చేసి చూట్టూరా సమాజాన్ని, దేశాన్ని అవగాహన చేసుకునే స్థితికి స్త్రీని తీసుకువచ్చే ప్రయత్నం స్త్రీసమాజాల ద్వారా జరిగిందని భావించవచ్చు.

'హిందూబాలికలవిద్య'ను గురించి అనిబిసెంటుగారు ఆంగ్లంలో చేసిన ఉపన్యాస అనువాదంలో (జనవరి 1904 హిందూసుందరి) చెన్నపురిలో 'హిందూసమాజమనే' సభ జరిగిందనీ, అందులో అనిబిసెంటు మాట్లాడుతూ దేశావసరాలనుబట్టి హిందూభామినులు విద్యను నేర్చుకోవాలనీ, హిందూధర్మములకెల్ల హిందూస్త్రీల హృదయములే నిలయమనీ, పురుషులతో పాటు స్త్రీలను అభివృద్ధి పరచాలనీ, పురుషులవలె స్త్రీలకు విద్యాభివృద్ధి జరగాలని చెప్పింది.

బుచ్చి బంగారమ్మ 'స్త్రీ సమాజవార్షికోత్సవసభ' (ఫిబ్రవరి 1904 జనానా) లో చేసిన ఉపన్యాసంలో ఆ సభకు వచ్చియున్న జమీందారిణి మరియు డిప్యూటి కలెక్టరు భార్య బుద్ధవరపు వీరలక్ష్మమ్మ చిన్నప్పుడే విద్యనేర్చి గృహకృత్యములు నిర్వహించుకుంటూనే, స్నేహితురాండ్రకు బోధచేస్తూ స్త్రీలలో విద్యపట్ల ఆసక్తిని కలిగిస్తున్నారని చెప్పింది. స్త్రీలు కార్యక్రమాలను చేయాలంటే ఐకమత్యం అవసరమనీ, అతిబాల్య వివాహాలవల్ల స్త్రీలు అజ్ఞానాంధకారంలో ఉంటున్నారనీ, ఆంగ్లప్రభుత్వంలో స్త్రీలు స్వేచ్ఛను పొందాలని అనుకుంటున్నారని తెలిపింది. స్వేచ్ఛ మరియు ఐకమత్యంతో కలిసిఉంటేనే, స్త్రీలసమాజం ముందుకు పోగలుగుతుందని స్త్రీలుతమ అభిప్రాయాలను ఉపన్యసించగలిగితేనే స్త్రీలకు ఉచితమైన స్వాతంత్ర్యం, ఉత్సాహం, వివేకం కలుగుతాయని తెలియజేసింది.

ఈమె వ్రాసిన 'కాలము సద్వినియోగమునకు తెచ్చుటెట్లు' (ఫిబ్రవరి 1904 హిందూసుందరి) అనే వ్యాసంలో ముందునుంచి స్త్రీ పురుషులు వివిధ పనులలో నిమగ్నమై పరస్పర ఆధారితంగా సంసారం చేస్తున్నారనీ, అవసరమైతే స్త్రీలు గృహకృత్యములేగాక రాచకార్యముల యందు సహాయ పడ్డారని తెలిపింది. వంటపనిలో ఆహారనిద్రలతో స్త్రీలు జంతువులా గడపవలసిన అవసరం లేదనీ, ఇరుగుపొరుగువారితో కాలక్షేపం చేస్తూ కాలాన్ని వ్యర్థపరచకుండా మంచి విషయాలను నేర్చుకోవాలని చెప్పింది. కాలము అధిక విలువైనదనీ, పిల్లలు కూడా కాలవ్యయం చేయకుండా తల్లులు చూసుకోవాలనీ, స్త్రీ సమాజంలో బాలికల చేత వినబడిన విషయాలను తల్లులు గ్రహించ గలగాలని తెలియజేసింది.

'హిందూ ఆచారాలను' (మార్చి1904 జనానాపత్రిక) గురించి ఈమె ఉపన్యసిస్తూ చూడి కుదుత్తమ్మ బరంపురం నుండి స్త్రీ సమాజానికి వచ్చేదనీ, ఆమె తనకూతుర్ల యొక్క విద్యాభివృద్ధిలో నిజమైన అభిమానం చూపిస్తోందని చెప్పింది. పాఠశాల అనంతరం ఇంటిదగ్గరే ఉపాధ్యాయినులను నియమించి సాహిత్యాదిగ్రంథాలను చెప్పిస్తోందనీ, శాఖాభేదమున్న వివాహాలు చేసుకొని ఐకమత్యంతో ఉండాలనీ, మంచి కార్యక్రమాలలో స్త్రీలందరూ పాల్గొనవలెనని తెలియజేసింది.

‘అస్కాస్త్రీ సమాజాన్ని’ (సెప్టెంబరు–అక్టోబరు 1905 సావిత్రి) గురించి బుర్రా బుచ్చి బంగారమ్మ ఉపన్యసిస్తూ అసికా పట్టణమునందు మూడు సంవత్సరముల నుండి స్త్రీసమాజం నడపబడుతోందనీ, 1902లో ఉన్నవ లక్ష్మీబాయమ్మ అధ్యక్షత వహించిన స్త్రీసమాజం అసికా (మచిలీ)పట్టణంలో ఏర్పడిందని చెప్పింది. యువతీమణులందరూ ఐకమత్యంతో కలసిమెలసి ఉంటూ, స్త్రీలకుపయుక్తములగు వివిధాంశములను వారు ఉపన్యసించటం, గ్రంథపఠనం చేస్తూ ఉండటం స్త్రీల భవిష్యదభివృద్ధికి సూచకంగా ఉందనీ, ప్రతిసంవత్సరం దాదాపుగా 30 సభలను నిర్వహించారని తెలియజేసింది. స్త్రీలందరూ సమావేశమై సద్గ్రంథాంశములను శ్రోతలకు తెలియజేస్తూ, స్త్రీవిద్యను గురించి, స్త్రీల ఐకమత్యం గురించి, స్త్రీ, సంఘాభివృద్ధి గురించి చర్చించుకోవటానికి అనువుగా సభలను నిర్వహించేవారని తెలియజేసింది. పిల్లలపని, ఇంటిపని ముగించుకొని వ్యయప్రయాసలకు ఓర్చి ఈ సమాజాలకు సమావేశానికి అధ్యక్షులుగా వచ్చిన కళ్ళేపల్లె వెంకటరమణ, పులగుర్త లక్ష్మీ నరసమాంబ మొదలగువారి యొక్క సహకారాన్ని ప్రశంసించింది.

*స్త్రీలు విద్యావంతులై ఐకమత్యాన్ని అర్థం చేసుకుని సామూహికంగా స్వేచ్ఛపొందాలనీ, తమ అభిప్రాయాలను స్త్రీలు స్వేచ్ఛగా వ్యక్తీకరించ గలిగితేనే వివేకం, స్వాతంత్ర్యం వాళ్ళకు కలుగుతాయని చెప్పి, స్త్రీల విద్యాప్రగతికై స్వాతంత్ర్య మార్గాలను బుర్రా బుచ్చిబంగారమ్మ సూచించింది. స్త్రీవిద్య స్త్రీల అభిప్రాయప్రకటనకు, స్త్రీల స్వేచ్ఛకు, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి పునాదులు వేసి, స్త్రీలలో స్వాతంత్రకాంక్షను వెలిగించటం కనపడుతుంది. చూడికుడుత్తమ్మ స్త్రీవిద్య అనే దానిని ఒకసంస్కరణోద్యమంగా ఇంటి నుండి ప్రారంభించిందనీ అర్థం అవుతోంది. స్త్రీలు తమ తీరిక వేళలను చదువుకు వెచ్చించి కాలాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని బుర్రా బుచ్చిబంగారమ్మ సూచించింది. స్త్రీల అభివృద్ధికి స్త్రీసమాజాలే మూలస్థంభాలని అర్థమవుతుంది.*

భట్టిప్రోలు రాజరాజేశ్వరమ్మ ‘స్త్రీవిద్య’ (ఫిబ్రవరి 1904 హిందూసుందరి) ను గురించి ఉపన్యసిస్తూ స్త్రీలు విద్యావంతులైతే బంధువులకు మిత్రులకు లేఖలు వ్రాసి సమాచారములను తెలుసుకోవచ్చునీ, స్త్రీలమధ్య సత్సంబంధాలు ఏర్పరచుకోవచ్చునీ చెబుతూ, చదువులేక అజ్ఞానంతో బాలికలు పరస్పరం తగవులు పెట్టుకుంటూ అనైక్యమత్యంతో ఉంటున్నారని చెప్పింది.

*మానవసంబంధాల అభివృద్ధికి స్త్రీవిద్య ఎంతఅవసరమో తెలియజేసి, జాతీయ సంస్కరణోద్యమంలో స్త్రీల భాగస్వామ్యాన్ని తెలియజేయటం జరిగింది.*

కళ్ళేపల్లె వెంకటరమణమ్మ చేసిన ఉపన్యాసం ‘మహిళా మనోరమ’ (1904 ఫిబ్రవరి సావిత్రి) అనే శీర్షికా ప్రచురణలో దేశంలోని స్త్రీల హీనస్థితికి పురుషులే కారణం అనీ, స్త్రీ, పురుషుల స్వాతంత్ర్యంలో తేడా ఉండకూడదనీ, ‘నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి’ అనేది పురుషుడు

కల్పించినదనీ స్త్రీధనాన్ని ఎగవేస్తున్నారనీ, స్త్రీలకు ఆస్తిహక్కులేదనీ, స్త్రీలు విద్యావంతులయితే తప్ప స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండదని చెప్పటం జరిగింది.

*స్త్రీలయొక్క ఆస్తిహక్కును గురించి ఆలోచన చేయటమే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికై వేసిన మలి అడుగు. పురుషాధిక్యతను విమర్శకుపెట్టటమేకాక, స్త్రీవిద్యకు స్త్రీల స్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని కళ్ళేపల్లె వెంకటరమణమ్మ తోటి స్త్రీలు గ్రహించ గలిగేటట్లు వ్రాసింది.*

'అత్తివిల్లి కామేశ్వరమ్మ' చేసిన 'విద్య' (మార్చి 1904 హిందూసుందరి) అనే ఉపన్యాసంలో చదువుకుంటే స్త్రీలు మోసం చేస్తారనే అపప్రథను ప్రచారం చేస్తున్నారనీ, స్త్రీల వికాసానికి విద్య ముఖ్యమని చెప్పింది.

*స్త్రీవిద్యను అడ్డుకోవటానికి సమాజంలోని శక్తుల కుతంత్రాన్ని బయటపెట్టింది.*

దామెర్ల సుందరమ్మ కందుకూరి వీరేశలింగంగారి జన్మదిన ఉత్సవ సభలో ఉపన్యసిస్తూ (మే 1904 హిందూసుందరి) స్త్రీ విద్యావిషయమె పట్టుదలతోను కులాచారాలను సంస్కరిస్తూ కందుకూరివంటి సంఘసంస్కర్తలు వ్రాసిన గ్రంథాలను స్త్రీలు చదువుతున్నారని తెలిపింది

'ఇండియా దొరతనంవారి నిర్ధారణ' (మే 1904 జనానా) అనే శీర్షికన పత్రిక ప్రచురిస్తూ దొరతనంవారు ప్రవేశపెట్టిన స్త్రీవిద్యవలన దేశీయుల నీతి విద్యావిషయములందు అధికవృద్ధి కలుగుతోందనీ, బాలికావిద్య తక్కువగా వున్నదనీ, 1901-02వ సం.లో బాలికల సంఖ్య 444, 470 అనీ, నూటికిద్దరే బాలికలు విద్యనేర్చుకుంటున్నారని తెలిపింది. స్త్రీవిద్యాభివృద్ధికై ముఖ్యస్థానాలలో ప్రైమరీ బాలికాపాఠశాలలు నెలకొల్పటం, బోధనాభ్యసన పాఠశాలల సంఖ్య వృద్ధిపరచటం, పాఠశాలల పరీక్షాధికారిణుల సంఖ్యను అభివృద్ధి పరచటం వంటి విషయాలలో మునిసిపాలిటీ, లోకల్ బోర్డుల కృషి తగినంతగా లేనిచోట దొరతనం వారే స్వయంగా స్త్రీవిద్యను గురించి పాటుపడుతున్నారని చెప్పింది.దాదాపుగా సగం విద్యార్థులు బాలబాలికలు కలిసి చదివే పాఠశాలలోనే బాలికలు చదువుతున్నారనీ, అయితే పల్లెటూళ్ళలో ఈ విద్యావిధానం బాగుందని భావించారని తెలియజేసింది. 1901-02 లో జరిగిన జనాభా లెక్కల ప్రకారం తెలుగు ప్రజలలో ప్రతి వెయ్యిమందిలో 67 మంది పురుషులు చదువుకుంటే కేవలం ఏడుగురు స్త్రీలు మాత్రమే చదువుకున్నట్టు నమోదు చేయబడిందని పత్రిక తెలియజేసింది.

*స్త్రీల చదువేగాక స్త్రీల విద్యాభివృద్ధిని గురించిన అంచనాలను అవగాహన చేసుకోవటానికి సామాజికాభివృద్ధితో మానవ సంబంధాల అభివృద్ధి సూచికను తెలియజేయటం ఆనాడే ప్రారంభమైందని అర్థం అవుతుంది.*

1904 నాటివరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో బాలికలు చదువుకుంటే మంచి వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను పొందగలిగి మగపిల్లలతో పాటు సమానంగా ఎదగగలరనే విశ్వాసాన్ని కల్గించింది.

వారిలో సాంస్కృతికంగా ఏర్పడిన బిడియాల్ని ఆత్మన్యూనతను తగ్గించే క్రమంలో వారిలోని ధైర్యస్థైర్యాలను వెలికితీసి స్త్రీలు స్వేచ్ఛావాయువులు పీల్చుకునే వాతావరణాన్ని కల్గించే చైతన్యం ఈ సాహిత్యం కలిగించింది. అంటే స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి బలమైన పునాది ఏర్పడటం జరిగింది.

*స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి అవసరమైన స్వయంపోషకత్వాన్ని, స్త్రీ, పురుషుల సమాన స్వాతంత్ర్యాన్ని గురించిన ఆలోచనలు అభివృద్ధిచెందాయి. స్త్రీలకు కావ్యపఠనమేకాక గణితశాస్త్ర పరిజ్ఞానం అవసరమనీ, అప్పుడే స్త్రీలు గృహనిర్వహణ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించగలరని చెప్పటంతో పురుషులు స్త్రీవిద్యపట్ల మొగ్గుచూపగలరని భావించవచ్చు. స్త్రీలలో దేశాభిమానం దేశసంరక్షణను గురించిన భావాలను స్త్రీలసాహిత్యం అభివృద్ధిచేసింది.*

కొలిచిన కాంతమ్మ 'స్త్రీ విద్య' (ఆగష్టు 1904 హిందూ సుందరి) ను గురించి వ్రాస్తూ విద్య నేర్చిన స్త్రీలకు మంచినడత ఏర్పడుతుందనీ, వారు తమపిల్లలకు మంచి నడతను నేర్పించగలరనీ, పురుషులవలె స్త్రీకి విద్య అవసరమని తెలిపింది. ప్రతి ఊళ్ళో బాలికా పాఠశాలలున్నాయనీ, కొంచెము చదవటం, వ్రాయటం, కుట్టుపని వంటివి వస్తున్నాయిగానీ, అది అసంపూర్తిగానే ఉందని భావించింది. కాస్తవిద్య నేర్చిన స్త్రీలు తెలివిమాలి గర్వముతో ఉంటున్నారనీ, భర్త కోపిస్తే, ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ సంపూర్ణ విద్యను నేర్చుకుంటే అలాంటి పనులు చేయరని తెలియజేసింది.

ఈమె వ్రాసిన 'దేశాభిమానం' (ఏప్రిల్ 1905. హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీవిద్యవల్ల స్త్రీలకు జ్ఞానాభివృద్ధి కలిగి తాము చేయవలసిన అర్హకృత్యములు తెలుసుకోగలరని, దేశాభిమానంకలిగి దేశమునకు మేలుచేయు పనులు చేయగలరనీ, ప్రాణములు ధారపోసియైన దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందనీ తెలియజేసింది. కందుకూరి విరేశలింగం స్త్రీవిద్యకు పాటు పడ్డారని, విద్యావంతులైన స్త్రీలుగా భండారు అచ్చమాంబ, కొటికలపూడి సీతమ్మ, మొసలికంటి రామాబాయమ్మ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ మొదలగువారు దేశాభివృద్ధికి పాటు పడుతున్నారని కొలిచిన కాంతమ్మ ఉదాహరించింది.

*స్త్రీలను ప్రోత్సహిస్తూనే స్త్రీవిద్యా జ్ఞానానికి, దేశాభిమానానికి, దేశరక్షణకు ఉన్న సంబంధాన్ని గ్రహింపుకు తేగలిగింది. స్త్రీలు తమ విద్యాజ్ఞానంతో దేశాభిమానాన్ని పెంచుకొని దేశాన్ని బాగుచేసుకోవాలని చెప్పటంతో స్త్రీల విద్యాభివృద్ధి కొరకే కాక పరతంత్ర పాలనలో మగ్గుతున్న దేశాన్ని గురించిన ఆలోచనలు పెంచుకోవటం జరిగింది. దేశాభివృద్ధిలో స్త్రీల కర్తవ్యాన్ని సూచించటం జరిగింది. స్త్రీవిద్యకు దేశస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని కొలిచిన కాంతమ్మ తెలియజేసింది. స్త్రీల వ్యక్తిత్వం పరిణామ దశలో ఉన్నప్పుడు చదువుకున్న స్త్రీలు ఇంట్లో భర్త క్రిందపడిఉండాలంటే స్వతంత్రం కోల్పోయినట్లు బాధపడటం చేతనే ఆత్మహత్యలు చేసుకునే స్థితికి చేరినట్టు అర్థం అవుతోంది.*

మొసలికంటి రామాబాయమ్మ వ్రాసిన 'పూర్వపుకాలపు హిందూ స్త్రీలస్థితి' (సెప్టెంబరు 1904 హిందూసుందరి) అనే వ్యాసంలో భరతఖండవాసులుగా పూర్వకాంతలు విద్యా విభూషితులుగా పేరుగాంచారనీ నేడు కూడా స్త్రీలు కాలమును వ్యర్థపుచ్చక జ్ఞానధనమార్జించి ఉన్నతస్థితిని పొందాలని ఆమె భావించింది.

గాదె వెంకటలక్ష్మీ నరసమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (అక్టోబర్–నవంబర్ 1904 హిందూ సుందరి) అనే వ్యాసంలో స్త్రీలు విద్యావంతులైతే పురుషులను ధిక్కరిస్తారనీ, గృహకృత్యములు చేయరనే భావన పురుషులలో ఉందని తెలిపింది. తమకు విద్య లేనందుకు స్త్రీలు సిగ్గుపడకపోగా విద్యావంతులైన స్త్రీలను హేళన చేస్తున్నారనీ తమకు విద్యాభ్యాసంతో పనిలేదని స్త్రీలు చెప్పటం స్త్రీవిద్య వెనకబడటానికి కారణమని భావించింది. స్త్రీలు స్వభాషలో సత్సాంగత్యాన్ని కల్గించేటటు వంటి పురాణాలలోని, ధర్మశాస్త్రంలోని పనికొచ్చే సారవిద్యలు నేర్చుకోవాలని చెప్పింది. స్త్రీ విద్యను తోటి స్త్రీలు హేళనచేయటం కూడదని తెలియజేసింది.

*స్త్రీవిద్య వెనుకబడటంలో స్త్రీల బాధ్యతను వేలెత్తి చూపించి వారిలో కలగాల్సిన చైతన్యాన్ని తెలియజేసింది.*

మోటుపల్లి రామాబాయమ్మ 'బృందావని స్త్రీ సమాజంలో స్త్రీవిద్య' (ఫిబ్రవరి–మార్చి 1905 హిందూ సుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో జీవితాలకు వెలుగును, జ్ఞానాన్ని యిచ్చే విద్య స్త్రీ పురుషుల బేధం లేకుండా ప్రతిమనిషికీ అవసరమనీ, స్త్రీలకు విద్య అవసరం లేదనే మాటలు పురుషులతో పాటు స్త్రీలు కూడా అనటం శోచనీయంగా ఉందని చెప్పింది. పురుషులకు లాభాన్ని చేకూర్చే విద్య స్త్రీలపట్ల నష్టదాయకమెలా అవుతుందనీ, స్త్రీలు విద్యను నేర్చుకోవటం విటులకు ఉత్తరాలు రాయటానికా అని అంటున్నారంటే అదేవిధంగా పురుషులు చదువుకోవటం కూడా జారభామినులకు ఉత్తరాలు వ్రాయటానికేనా అని ప్రశ్నకు పెట్టింది. అంతేకాదు, స్త్రీ విద్యవల్ల పెక్కు లాభములున్నా వాటిని గురించి ఆలోచించటం లేదనీ, సంసార శకటాన్ని లాగటానికి స్త్రీ పురుషులిద్దరూ సమాన బాధ్యత వహించాలి కాబట్టి యిద్దరూ విద్యావంతులవాల్సిన అవసరం ఉందని తెలియజేసింది. అంతేకాదు విద్యరాని స్త్రీకి విచక్షణా జ్ఞానమెలా ఉంటుందనీ, అందుకే సంసారంలో విద్యలేని తేడాతోనే అనవసరంగా గొడవలు వస్తున్నాయనీ, స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబ సంబంధ వ్యవహారాలను స్త్రీ చక్కబెట్టగలదని తెలిపింది. సంగీతం నేర్చుకొని భర్తను ఆనందింప జేయగలుగుతుందనీ, విద్యావంతురాలైన తల్లి అయితే బిడ్డలు విద్యావంతులుగానూ సద్గుణాలతో పెంచబడతారని చెప్పింది. తీరిక సమయాలలో స్త్రీలు సద్గ్రంథపఠనం చేసి అనేక విషయాలలో జ్ఞానాన్ని పొందవచ్చునీ, గ్రంథరచన కూడా చేయవచ్చునీ, పురాణాలలోని దేశచరిత్రలలోని విద్యావంతులైన స్త్రీలను ఉదాహరించి వారు వ్రాసిన గ్రంథాలను పేర్కొనవచ్చని స్త్రీలను ప్రోత్సహించింది. సమకాలీనులైన స్త్రీల అభివృద్ధిని ఉటంకిస్తూ ఓరుగంటి కమల,

సుందరమ్మ లిద్దరూ ఎమ్.ఏ పరీక్షలందు కృతార్థులై జ్ఞానపథమును చూపిస్తూన్నారనీ, స్త్రీలు పత్రికాధిపత్యాన్ని కూడా వహించగలుగుతున్నారని తెలియజేసింది. స్త్రీలకు విద్యనేర్పింపక, వారిని నీచులని చూడటంవలనే దేశం పరులచేత జయింపబడి స్వతంత్రాన్ని కోల్పోయిందనీ, నేడు కందుకూరి వీరేశలింగం స్త్రీ జాతిని ఉద్ధరించటానికి కంకణబద్ధులైనారనీ, హూణదొరసానులు, క్రైస్తవ మిషనరీలు స్త్రీ విద్యాభివృద్ధికై భారతదేశంలో బాలికాపాఠశాలలు నెలకొల్పారనీ, దేశం బాగుపడాలంటే అందరూ స్త్రీవిద్యాభివృద్ధికి కృషిచేయమని ప్రార్థించింది.

ఈమె వ్రాసిన 'ఐకమత్యము-బృందావనన స్త్రీ సమాజం' (జులై.1905 బాలసరస్వతి మాసపత్రిక) అనే వ్యాసంలో స్త్రీలందరూ ఐకమత్యముతో ఉండవలెననీ, ప్రతిపనినీ నిర్వహించాలంటే సామూహికంగా మానవులు కృషిచేస్తారనీ, పురుషులలో ఉన్నట్టే స్త్రీలలో కూడా ఐకమత్యం వృద్ధిచెందాలనీ, స్త్రీలందరూ మిత్రులుగా ఉండాలని తెలిపింది. స్త్రీలను గురించి చెప్పే చెడ్డనానుడులను రూపుమాపే విధంగా సత్ప్రవర్తనలో స్త్రీలు నడుచుకోవాలనీ, తోటిస్త్రీలను, పురుషులను, పరస్పరం సోదర సోదరీమణులుగా భావించాలనీ, విద్యనేర్చుకొని వివేకత్వాన్ని పొందాలనీ, ఐకమత్యంతో సమాజాన్ని వృద్ధిలోకి తీసుకురావాలని తెలియజేసింది.

'విజ్ఞాపనము' (ఆగష్టు-సెప్టెంబరు1905 హిందూసుందరి) అని బృందావన స్త్రీసమాజంలో ఈమె చేసిన మరొక ఉపన్యాసంలో స్వదేశీప్రీతి, స్వజాతి యందలి ప్రేమాతిశయంతో స్త్రీసమాజాలు ఏర్పరచి తోటి స్త్రీలకు విద్యాజ్ఞానాన్ని, స్వేచ్ఛను కలుగచేయాలనీ, భండారు అచ్చమాంబ చేసిన కృషి గొప్పదనీ నాటి వార్షికోత్సవ సభలో పేర్కొంది.

'వితంతుకేశఖండనాన్ని' (అక్టోబర్-నవంబరు 1905 హిందూ సుందరి) గురించి ఈమె వ్రాసిన వ్యాసంలో బ్రాహ్మణ కుటుంబములో ఉండే వితంతువుల ఆచారాన్ని దుయ్యబడుతూ బాల్యవివాహాలను అరికట్టాలనీ, వేదకాలంలో ఇటువంటి ఆచారాలు లేవనీ, మహమ్మదీయ కాలంలో ఆరంభించబడినవని తెలిపింది. స్త్రీల కామోద్రేకాన్ని అణచటానికి పెట్టినట్టుగా చెప్తూ ఆచారాన్ని సమాజంలోని పురుషులే పెట్టారనీ, బాల్యవివాహాలను చట్టబద్ధంగా ఆపుచేయాలనీ, వితంతు కేశఖండనాన్ని కూడా శిక్షించే చట్టాలు రావాలని మోటుపల్లి రామాబాయమ్మ తెలియజేసింది.

*స్త్రీలకు విద్యలేకపోవటం చేతనే వారిని తక్కువచేసి మాట్లాడుతున్నారని, అదే దేశం స్వతంత్రం కోల్పోవటానికి కారణమని మోటుపల్లి రామాబాయమ్మ ముఖ్యమైన ప్రతిపాదన చేసింది. స్త్రీలు చదువుకుంటే సంసారాన్ని చక్కదిద్దుకునే నేర్పు వారికి అలవడుతుందనీ, సంసారాలు సమాజాలు బాగుండాలంటే పురుషులకువలె విద్య ద్వారా స్త్రీల అభివృద్ధి జరగాలనీ, అలా జరగక పోవటం చేతనే దేశం స్వాతంత్ర్యాన్ని కోల్పోయిందని తెలియజేసి స్త్రీవిద్యకు-దేశస్వాతంత్ర్యాన్నికి ఉన్న లింకును బయటపెట్టింది. స్త్రీలమధ్య ఉండవలసిన ఐక్యతా సంబంధాలను మరొకసారి నొక్కిచెప్పటం జరిగింది. స్త్రీలవ్యక్తిత్వస్వేచ్ఛ సమాజాభివృద్ధికై పాటుపడే స్త్రీలఐకమత్యంలో ఉందని స్త్రీల సంఘటితశక్తిని ఆలోచింపజేయటం జరిగింది.*

*స్త్రీసమాజాల లక్ష్యాలను ప్రచారం చేయాలని భావించటం జరిగింది. స్త్రీలు బయటకు రాగలిగితేనే విద్యాభివృద్ధిని చేసుకోగలరని ఆమె అభిప్రాయంగా అర్థం అవుతుంది. పితృస్వామ్యపు కుట్రను స్త్రీలు అవగాహన చేసుకోవటం మొదలుపెట్టారు. వితంతుస్త్రీల విద్యాభివృద్ధికి వారి సమాజజీవనానికి ఆటంకమైన వితంతు కేశఖండనాన్ని శిక్షించే చట్టం రావాలనుకోవటమే స్త్రీల శరీరాలమీద పెత్తనమున్న పురుషాధిక్య సమాజపు సంస్కృతిని శిక్షకు గురిచేయాలని మోటుపల్లి రామబాయమ్మ భావించింది. వితంతుస్త్రీల వ్యక్తిస్వతంత్రతను, స్వేచ్ఛను అరికట్టే సంస్కృతిమీద ధ్వజమెత్తి, పితృస్వామ్యపు కుట్రను గ్రహించగలగటం వలన స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్య సాధనకు మార్గమేర్పడింది. దీనినొక ఒక విప్లవాత్మక ఆలోచనగా భావించాలి.*

నూలు సత్యవతమ్మ 'స్త్రీవిద్య' (ఫిబ్రవరి-మార్చి 1905 హిందూసుందరి) ను గురించి వ్రాసిన వ్యాసంలో మహమ్మదీయ ప్రభుత్వపు రోజుల్లో స్త్రీలవిద్య క్షీణదశను పొందినదనీ, పూర్వము భారతదేశంలో స్త్రీవిద్య ఉందనీ, కాబట్టి ప్రస్తుతం మనదేశముల నేలు ఇంగ్లాండ్ దేశప్రభుత్వం స్త్రీలు తప్పక చదువవలెనని చట్టాలు చేయాలని తెలిపింది. స్త్రీలువిద్య లేకపోతే పశుతుల్యులుగా భావింపబడతారనీ, సద్గ్రంథపఠనం చేయాలనీ, స్త్రీలు విద్యనేర్వనందున వారికి స్వాతంత్ర్యం లేదనే దానికి విరుగుడుగా ఆంగ్లేయులు బాలికా పాఠశాలలను పెట్టారనీ, విద్యాభ్యాసం దేహపరిశ్రమఅనీ, పురుషులు స్త్రీలను చదివింపజేయాలనీ, ప్రభుత్వ సహాయం కూడా కావాలని తెలియజేసింది.

*బ్రిటిష్ ప్రభుత్వం బాలికాపాఠశాలలను నెలకొల్పటంలోని ఉద్దేశంగా వారు భారతదేశ స్త్రీలస్వతంత్రాన్ని ఆకాంక్షించారని భావించింది. స్త్రీవిద్యను తప్పనిసరి చేస్తూ చట్టము వస్తేగాని స్త్రీలకు స్వతంత్రజీవనం లభించదని భావించింది. విద్యాభ్యాసం ఒకదేహపరిశ్రమ అని చెప్పింది.*

'మన హిందూ వితంతువుల దుస్థితి' (ఏప్రిల్ 1905 హిందూసుందరి) ని గురించి వారణాసి కామేశ్వరి వ్రాస్తూ కన్నబిడ్డలకు బాల్యవివాహాలు చేసి, భర్తృవియోగం కలిగిన తరువాత వారికి పునర్వివాహంచేసే ధైర్యం తల్లిదండ్రులకు ఉండటంలేదనీ, కందుకూరి వీరేశలింగం బోధించి నట్లుగా వితంతువులకు పునర్వివాహం చేయాలని తెలిపింది. ప్రౌఢవయస్సు వారైతే వారికిష్టంలేని యెడల విద్యాభివృద్ధినైనా కల్పించాలనీ, వారు చదువుకొని లోకజ్ఞానాన్ని పొందగలుగుతారనీ, వితంతువులు ఆహార నియమాలతో శుష్కించిపోకుండా చూడాలని అటువంటి స్త్రీలయిక్కట్లను స్త్రీలు ఐకమత్యంతో రూపుమాపాలని తెలియజేసింది.

*స్త్రీగా తోటిస్త్రీల దుస్థితికి స్పందించటం,వితంతుస్త్రీల అవిద్యకు,అనారోగ్యపు దుస్థితికి కారణాలను అన్వేషించి పరిష్కారమార్గాన్ని సూచించటం స్త్రీలప్రగతికారక సంస్కృతిపట్ల స్త్రీల ఆలోచనలు పెరగటంగా అర్థం అవుతుంది.*

"ఆంధ్రప్రకాశిక"లో 'స్వదేశీకాంత' పేరుతో వ్రాసిన వ్యాసాన్ని తిరిగి 'స్వదేశీ వస్తు ప్రేరేపణం' (సెప్టెంబరు-అక్టోబరు 1905 సావిత్రి) అనే శీర్షిక క్రింద వచ్చిన పత్రికా ప్రచురణలో

దేశక్షేమానికై ఐక్యతతో పనిచేయటాన్ని నేర్పించేది స్వదేశీ వస్తు ప్రేరేపణయే అనీ, పాశ్చాత్యుల యంత్రంతో తయారైన వస్త్రాలు అన్ని దేశాలకు ఎగుమతి అవుతూ చౌకగా ఉండటంతో స్వదేశంలోని వస్త్ర తయారీకి, చేతి పనులకు దుర్దశ కలిగిందని తెలిపింది. దేశ వస్త్రతయారీకి ఖర్చు ఎక్కువ అయినా స్వదేశీ వస్త్రాల వినియోగానికి ప్రతిజ్ఞ చేయాలనీ అలా చేయటంతోనే బెంగాల్లో స్వదేశీ వస్తు వినియోగం పెరిగిందని చెప్పింది. స్వదేశీవస్తు ప్రేరేపణయే దేశక్షేమ కరమని భావించి బాలికలకు విద్య నేర్పిస్తే స్వదేశీవస్తు వినియోగంలో స్త్రీల తోడ్పాటు ఉంటుందని తెలియజేయటం జరిగింది.

*తిలక్ చేసిన 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే ప్రబోధ ప్రభావం ఉండటంతో స్త్రీలలో దేశంపట్ల, స్వదేశీ వస్తువుల పట్ల, దేశ ఆర్థికవ్యవస్థపట్ల ఆలోచనలను పెంచగలిగిన వ్యాసమిది. అందుకే రచయిత్రి తన పేరులో 'స్వదేశీ'తనాన్ని ఇముడ్చుకోవటం కనబడుతుంది. నాడు ప్రారంభమైన వందేమాతరం ఉద్యమ ప్రభావంతో స్వదేశీయత స్త్రీల ఆలోచనలలో చోటు చేసుకొన్న విషయంగా అర్థం అవుతుంది. స్త్రీ విద్యకు స్వదేశీయతకు ఉన్న సంబంధాన్ని తెలిపింది.*

1905, డిశెంబరులో జరిగిన '19వ సంఘసంస్కరణ మహాసభ' (జనవరి1906 సువర్ణలేఖ మాసపత్రిక) ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ స్త్రీవిద్య అభివృద్ధిచెందటానికి గృహపాఠశాలలు ఏర్పడాలనీ, మద్యపాననిషేధం, వితంతుశరణాలయాల స్థాపన, ఐకమత్యం, పంచముల అభివృద్ధికి కృషిచేయాలని సభలో తీర్మానాలు చేసినట్లు పత్రిక తెలియజేసింది.

'పురాతన హిందూసుందరులు' (మార్చి, 1906 సువర్ణలేఖ మాసపత్రిక) అనే పత్రికాధిపుల ప్రచురణలో పూర్వయుగంలో స్త్రీలు పురుషులతో సమానంగా వేదోపనిషత్తులవంటి సమస్త విద్యలను నేర్చి సర్వస్వాతంత్ర్యాలను కలిగి, పురుషులతో పాటు సమానగౌరవాన్ని పొందేవారని తెలిపింది. ఆ వేదాలలోనే స్త్రీలు గృహకృత్యాలతోపాటు యుద్ధవిద్యలను కూడా నేర్చినట్లు ఉందనీ, స్త్రీలు చదవటం, వ్రాయటమేగాక, గురువులు, శిష్యులుగాను ఉండేవారనీ, అందుకే శతపథబ్రాహ్మణంలో విద్యావతి, చిరంజీవియైన పుత్రిక కావాలని కోరుకొన్నట్లును ఉటంకించడం జరిగింది.

*స్త్రీలు విద్యావంతులు కావటానికి పూర్వకాలంలో విద్యావంతులైన భారతదేశపు స్త్రీలను పత్రికాముఖంగా ఉటంకించి ప్రోత్సహించటం అర్థమవుతుంది.*

'కాశీ'లో జరిగిన హిందూస్త్రీల మహాసభలో ఒక బంగాళాస్త్రీ 'హిందూ స్త్రీల ముఖ్యవిధులు' (ఏప్రిల్ 1906 జనానా పత్రిక)ను గురించి చేసిన ఉపన్యాసంలో దేశంలో కొన్ని మార్పులు జరుగుతున్నాయనీ, స్త్రీవిద్య, స్త్రీ స్వతంత్రత, స్త్రీ విధులు మున్నగువిషయాలకు ప్రాముఖ్యత పెరుగుతోందని, స్త్రీలు దేశాభివృద్ధి విషయంలో చేయాల్సిన కార్యక్రమాలను గురించి చర్చించుకోవాలని తెలిపింది. పురుషులు ఎదగటానికి స్త్రీల సహకారం ఉంటుందనీ, దేశాన్ని కాపాడటానికి పూర్వం స్త్రీలు భర్తలకు వీరతిలకం దిద్దిపంపించారని తెలియజేసింది. అమెరికా స్త్రీలు తమ భర్తల మద్యపాన నిషేధానికి చట్టాలు చేయించారనీ, కాని నేడు ఇక్కడి స్త్రీలు

బలహీనమగు శిశువులను కనటంతో పౌరుషాన్ని పారద్రోలుతున్నారనీ, దేశంఅభివృద్ధి చెందాలంటే స్త్రీలు తమను తాము సంస్కరించుకునే దిశగా ధైర్యసాహసాది గుణాలు పెంచుకోవాలని పిలుపునిచ్చింది. హిందూవనితల అభివృద్ధికి స్త్రీసమాజాలను ఏర్పాటు చేసుకోవాలనీ, స్త్రీలు సమాజంలో కష్టపడి, రోగులకుపచారాలు చేయటం, ఛాయా ప్రతిమలు తీయటం, కుట్టుపని, పాకంవంటి పనులు నేర్చుకొని ఉపాధిని పొందాలని బంగళాస్త్రీ సూచించింది.

*స్త్రీలు ధైర్యసాహసాది గుణాలు పెంపొందించు కోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. స్త్రీ ధైర్యసాహసాలతో ఉంటూ స్త్రీసమాజాలను ఏర్పరచుకొని ఉపాధిని పొందటం స్త్రీల విధులని చెప్పటం స్త్రీల స్వయం పోషకత్వానికి, ఆర్థికస్వాతంత్రానికి బీజం వేయటంగా భావించాలి. స్త్రీలు ఉపాధినిపొందే విద్యను నేర్చి స్త్రీ స్వతంత్రజీవనాన్ని పొందాలని భావించింది. స్వీయసంస్కరణలో భాగంగా స్త్రీలు ధైర్యవంతులై, ఉపాధిని పొందగలిగి వ్యక్తిస్వాతంత్ర్య సాధకులైతేనే దేశాభివృద్ధికై కర్తవ్యోన్ముఖులు కాగలరని భావించటం జరిగింది.*

'హిందూ స్త్రీల సభ' (ఏప్రిల్ 1907 జనానా)ను గురించి 'ఒకానొకరు' అనే పేరుతో వ్రాసిన వ్యాసంలో ఆంగ్ల వనితలు, హిందూవనితలు కలిసి ఒంగోలులో జరిగిన సభకు వెళ్ళటము జరిగిందని తెలిపింది. ఆ సభలో బాలికలు స్త్రీవిద్య అవసరమా అనే దానిని చర్చించి రూఢిచేసుకోవటం జరిగిందనీ, అలాంటి సభలనే వారు భీముని పట్నంలో పెట్టి 'స్త్రీలకు ఉన్నత విద్య' అవసరమని చెప్పిన విషయాలను తెలియచేసింది.

*స్త్రీలు ఉన్నత విద్యా సముపార్జనకై అడుగులు వేయటం ప్రారంభించారని అర్థం అవుతుంది.*

జనానా పత్రికలోని విషయంగా "స్త్రీ సహాయం" (ఏప్రిల్, మే 1907 హిందూసుందరి) అనే శీర్షికన హిందూసుందరి పత్రికా ప్రచురణలో కుటుంబంలో కేవలం భర్త ఉద్యమం (ప్రయత్నం)వల్ల సౌఖ్యంలేనట్లుగానే, సంఘంలోకూడా పురుషులలోని చెడు తొలగింపబడాలంటే స్త్రీలసహాయం అవసరమని తెలిపింది. ఇంగ్లాడు, ఫ్రాన్స్, జర్మని, అమెరికా, జపాన్, దేశాలలో స్త్రీ విద్యాభివృద్ధి వల్ల ఆయా దేశాలు వృద్ధిపొందాయనీ సంఘంలో స్త్రీవిద్య, స్త్రీవృద్ధి, స్త్రీసహాయం సంఘానికి అవసరమనీ, అప్పుడే స్త్రీలు సంఘానికి కొంత బాధ్యత వహించగలరని తెలియజేసింది.

*ఇటు కుటుంబంకాని అటు సమాజంకాని అభివృద్ధిచెందాలంటే స్త్రీవిద్యఅవసరం ఎంతైనా ఉందని పత్రిక తెలియజేసింది.*

క్రీ.శ.20వ శతాబ్దపు మొదటి దశకంలో స్త్రీలు వ్రాసిన దాదాపు 57 వ్యాసాలు, 39 ప్రచురిత ఉపన్యాసాల రూపంలో మొత్తంగా 96 వ్యాసరచనలలో స్త్రీవ్యక్తిస్వతంత్ర సాధనకు ప్రధానమైన స్త్రీవిద్యావశ్యకత పట్ల తోటి స్త్రీలలో చైతన్యాన్ని కలిగించటమే ధ్యేయంగా స్త్రీలు సాహిత్య సృజన చేసారు. స్త్రీల సమస్యలను చర్చించుకోవటానికి, ఐకమత్యాన్ని పెంపొందింపజేసు కోవటానికి స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకోవాలని పిలుపునిచ్చారు. బాలికాపాఠశాలలను స్థాపించి,

ఉపాధ్యాయినులను నియామకంచేయాలనీ, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన బాల్యవివాహాలవంటి సాంఘికదురాచార నిర్మూలన, వితంతు స్త్రీలకు విద్య, స్త్రీలపునర్వివాహం, వితంతు స్త్రీసంస్కృతి పట్ల నిరసన, స్త్రీవిద్యా విషయంలో పురుషుల బాధ్యతను తెలిపారు. స్త్రీపురుష సమానత్వభావన, స్త్రీలకు ఆస్తిహక్కు, స్త్రీల ఉన్నత విద్య, చరిత్ర, గణితం, శాస్త్ర, పారిశ్రామిక విద్యాధ్యయనం, ప్రపంచజ్ఞానం, సామాజిక, రాజకీయ పరిణామాలపై తోటిస్త్రీలలో అవగాహనను కలిగించే విధంగా స్త్రీల వ్యాసరచన సాగింది. అంతేకాక, వందేమాతరం ఉద్యమ ప్రభావంతో స్వదేశీవస్త్ర, వస్తు తయారీ, కుటుంబ, దేశదారిద్ర్య నిర్మూలన, స్త్రీలకు స్వతంత్రత, సామాజిక గౌరవం ఉండాలనే భావనలను ప్రబోధించే వ్యాసాలను స్త్రీలు వ్రాసారు.

**కథలు**

స్వాతంత్ర్యోద్యమ ప్రారంభంలో సంఘసంస్కరణకై ముందుగా స్త్రీలు విద్యావంతులు కావాలని భావించారు దానికై ఐకమత్యం ఉండాలని ఆలోచనలను చేసారు. చదువుకుంటే జ్ఞానం కలుగుతుందనీ, సత్యాన్ని తెలుసుకొనే ప్రయత్నంలో వారు తమలోని అజ్ఞానాన్ని గుర్తిస్తారనీ, అస్తిత్వపు విలువలను గ్రహించగలుగుతారనీ, అప్పుడే స్త్రీలు వ్యక్తిస్వతంత్రతను పొందగలరని భావించారు. దాన్ని సాధించే దిశగా సాగి తోటి స్త్రీలలో చైతన్యం కలిగించటానికి స్త్రీలు సాహిత్య సృజన చేసారు. స్త్రీలలో ఒక్క శాతం అక్షరాస్యతఉన్న రోజుల్లో మౌఖికంగా చెప్పుకోగల కథల ద్వారా విషయాన్ని హత్తుకొనేటట్లు చేయవచ్చని భావించారు. ఆ క్రమంలోనే చదువుకొన్న స్త్రీలు తమ ఆలోచనల పరిణామ ఫలితాలను స్త్రీలు సులభంగా ఆకళింపు చేసుకుంటూ పదిమందితో పంచుకోవటానికి, తోటి స్త్రీలలో ఆసక్తిని కలిగిస్తూ కథల రూపంలో ప్రచారం చేయటానికి వీలుగా రచయిత్రులు కథాప్రక్రియను చేపట్టారు. 20 శతాబ్దపు మొదటి దశకంలోనే 8 కథలు వచ్చాయి. భండారు అచ్చమాంబ స్త్రీవిద్యాభివృద్ధి, స్త్రీవిద్యా ప్రయోజనాలను తెలియజేస్తూ వ్రాసిన 7 కథలు వచ్చాయి. ఈమెనే తెలుగు సాహిత్యంలోని ప్రథమకథా రచయిత్రిగా భావింపక తప్పదు.

భండారు అచ్చమాంబ వ్రాసిన 'లలితా శారదలు' (సెప్టెంబరు 1901 జనానా) అనే కథను తాను బాలికల కోసం వ్రాస్తున్నానని ఆమె చెపుతూ, కథలో ఒక బాలిక అధికారి యొక్క కూతురిగా తనని తాను గొప్ప అనుకుంటూ తోటిఆడపిల్లలను చులకనచేసి మాట్లాడుతూ అవమానిస్తుంటే ఎవరూ ఆమెతో స్నేహంచేయలేదని తెలిపింది. ఆ బాలిక ఒక స్త్రీని అవమానించటానికి ప్రయత్నించినాకూడా, ఆమెకు ముళ్ళుగుచ్చుకుంటే ముళ్ళుతీసి ఆ స్త్రీయే కాపాడినప్పుడు బాలికలో పరివర్తన కలిగిందనీ, అపకారికి ఉపకారంచేసే తత్వాన్ని నేర్చుకొని ఆమెనొక గురువుగా భావించిందని తెలియజేసింది.

*మిత్రురాండ్రు పరస్పరం ఎదుటిమనిషిలోని తప్పులను పోగొట్టి ఐకమత్యంతో మెలగాల్సిన అవసరాన్ని తెలియ చెప్పిన కథ. బీద, ధనిక తేడాలను పోగొట్టుతూ స్త్రీలలో ఐకమత్యం ఏర్పడాల్సిన విషయాన్ని తెలియజేసింది. అదే ముందుముందు స్త్రీలకు సామూహికశక్తిని ఇస్తుందని అర్థమవుతుంది.*

ఈమె వ్రాసిన 'దంపతుల ప్రథమకలహము' అనే (1902 జూన్, హిందూ సుందరి పత్రిక) సంభాషణాత్మక కథలో ఒక స్త్రీ తన అభిప్రాయాలకు విలువనివ్వని భర్త దగ్గర స్వతంత్రంలేని దాసిగాను, విక్రయింపబడిన పరిచారికగాను తాను ఉండదలచుకోలేదని చెప్పటం జరిగింది.

*స్త్రీల స్వతంత్ర వ్యక్తిత్వానికి, అస్తిత్వజీవనానికి బీజం పడటంగా అర్థం అవుతుంది. 1902 నాటికే కథలో స్త్రీ తన అస్తిత్వానికి ఉన్న విలువను అంచనా వేయటం మొదలైందని స్పష్టమయింది.*

ఈమె వ్రాసిన 'ధనత్రయోదశి' (నవంబరు 1902 హిందూసుందరి) అనే మరొక కథలో భర్త యజమానికి తెలియకుండా డబ్బుతెచ్చినా, భర్త అవినీతిని సమర్థించక అతనిని ధర్మమార్గంలో పెట్టిన భార్య కథ ఇది. యజమాని తనదగ్గర పనిచేసే గుమస్తా ధైర్యాన్ని, నిజాయితీని మెచ్చుకొని ధనసహాయం చేయటం జరిగింది.

స్త్రీలు కుటుంబ జీవనంలో దారిద్ర్యంలో ఉన్నా సత్యసంధతతో అవినీతి సొమ్మును ఆశించక భర్తను కూడా నిజాయితీపరుడిగా చేసే అవకాశం ఉంటుందని తెలియజెప్పిన కథ ధనత్రయోదశి. స్త్రీల గృహనిర్వహణా బాధ్యతను తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'భార్యభర్తల సంవాదం–స్త్రీ విద్య' (డిసెంబరు 1902 హిందుసుందరి) అనే కథారూప ప్రక్రియలో భర్త ప్రోత్సాహం ఉంటే, స్వీయ ప్రయత్నంతో భార్య పుస్తక పఠనం చేయగలిగిన స్థితికి చేరుకుంటుందని తెలిపింది. స్త్రీ చదువుకుంటే వైధ్యవం వస్తుందని చెప్పే ముసలి వారి మాటలకు శాస్త్రంలో ఆధారంలేదనీ, అది ఒక మూఢనమ్మకం అని చెప్పి, భార్య చదువుకొంటే భర్తకు స్వయంగా ఉత్తరాలు వ్రాయగలుగుతుందనీ, పిల్లలకు చదువు చెప్పగలదని చెప్పింది. పిల్లలను సద్గుణవంతులుగా పెంచినందుకు ఆ తల్లిదండ్రులను సమాజంలోని వారు రూపుదాల్చిన దేవతలుగా వారిని కొలిచేరోజు వస్తుందని తెలియజేసింది.

*భార్యలో తాను విద్యావంతురాలు కాగలననే ఆత్మవిశ్వాసాన్ని పెంచటం భర్త యొక్క బాధ్యత అని, అటువంటి దంపతులను సమాజం గౌరవిస్తుందని కూడా కథలో తెలియజేయటం జరిగింది. స్త్రీ చదువుకుంటే భార్యాభర్తల మధ్య ప్రేమానురాగ సంబంధాలు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పటమే కాక స్త్రీ విద్యకు ఆటంకప్రాయమైన మూఢవిశ్వాసాన్ని, అపప్రథను నిర్మూలించే ప్రయత్నం జరిగింది.*

ఈమెయే వ్రాసిన "భార్యా భర్తల సంవాదం" (ఆగస్టు 1903 హిందూసుందరి) అనే మరో కథలో భార్యకు పుస్తకాల మీద ధ్యాస లేకుండా నగల మీద వ్యామోహం ఉండటాన్ని భర్త విమర్శిస్తూ తరతమ భేదంలేని సద్గుణాలంకారములే స్త్రీల సౌందర్యానికి చిహ్నమనీ, స్త్రీలు నగలు ధరించడంలో మాత్రమే స్వతంత్రంగా ఉన్నామనే భావనలో ఉన్నారనీ భర్త వ్యక్తం చేసాడని తెలియజేసింది.

*స్త్రీలు తమకు ఎన్ని నగలుంటే అంతగా తాము గొప్ప అని భ్రమించే వారియొక్క భ్రమను తొలగించి చదువుమీద వారిదృష్టిని మళ్ళింపుచేయటం భర్తబాధ్యత అని కథలో తెలియజేసింది.*

ఈమె వ్రాసిన 'అద్దమును-సత్యవతియును' (ఫిబ్రవరి1904 హిందూ సుందరి) అనే కథలో ఒకబాలిక అద్దములో కనబడే తన ప్రతిబింబమును గురించిన జ్ఞానం లేకపోవటంతో భయాందోళనకు గురి అయిందని తెలియజేసింది.

*ఆడపిల్లలు ఎంతటి అజ్ఞానస్థాయిలో ఉన్నారో తెలియచేసింది. స్త్రీలు తమ అజ్ఞానాన్ని గుర్తించటమే జ్ఞానమార్గానికి పునాదిగా భావించింది. అజ్ఞానం భయాన్ని కలిగిస్తుంది కాబట్టి అటువంటి అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి విద్య అవసరమని గ్రహించాలి.*

ఈమె వ్రాసిన 'బీదకుటుంబం' (ఫిబ్రవరి 1904 సావిత్రి) అనే ఇంకొక కథలో ఒక వాస్తవ వృత్తాంతాన్ని గురించి వ్రాస్తున్నానని చెప్పి ఒక స్త్రీ తన భర్తయొక్క జీతానికి చేదోడు వాదోడుగా తాను వడ్లు దంచి, విసిరిపెట్టి నాల్గు రూపాయలు వెనుకకు వేస్తూ ఉండేదట. భర్త మరణించినా వివేకవతిగా ధైర్యం తెచ్చుకొని తక్కువ అద్దె గల యింటికి మారి, అహోరాత్రులు కష్టపడి ఆ కూలితో ఆరుగురు బిడ్డలను పోషించుకునేదని తెలిపింది. వ్యర్థప్రసంగాలు చేయకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబానికి అవసరమైన ఆర్జన చేసుకుంటూ ఉండేదని తెలియజేసింది. అంతేకాదు, ఆమె పిల్లలను క్రమశిక్షణలో పెంచటంతో బీదవాళ్ళైనాకూడా వారు ఎవరింట్లో తిండికి ఆశించక ఉండేవారనీ, ఒకవేళపెట్టినా తల్లి అనుమతితోనే తీసుకొనేవారని చెప్పింది. తీరిక సమయాలలో ఆమె చదువుకుంటూ పిల్లలకు చదువు చెపుతూఉండేదనీ ఒక రోజు ఎదురింటి ధనవంతురాలికి కడుపునొప్పి వస్తే తన జ్ఞానంతో ఆమెకు చికిత్సచేయగలిగిందని తెలియజేసింది.

*బీదరికం ఉన్నా స్త్రీ చదువుకుంటే కష్టాలను అధిగమించే ధైర్యం తెచ్చుకొని పిల్లల్ని సక్రమంగా పెంచి తన జ్ఞానాన్ని అందరికీ పంచిపెట్టకలదనీ, ధనవంతులుకూడా మెచ్చుకునే విధంగా పరోపకారం చేయగలిగిందని నిరూపింపబడిన కథయిది. స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించగల కథ. ఇలాంటి స్త్రీలవల్లే దేశాభివృద్ధి జరగగలదు. ఆ రకంగా స్త్రీల మధ్య మానవసంబంధాలకు అంకురార్పణ చేయటం జరిగింది. తత్ఫలితంగా ఏర్పడేదే స్త్రీల సంఘటిత శక్తి అనీ, అదే స్త్రీసమాజాల అభివృద్ధికి కారణం అవుతుందని భండారు అచ్చమాంబ భావించినట్టు అర్థంఅవుతుంది.*

పి. కౌసల్య వ్రాసిన 'సాధువర్తనం' (మే 1903 హిందూసుందరి) అనే కథలో ఎన్ని కష్టాలు వచ్చినా నీతి, న్యాయవర్తనము, సత్యవాక్పరిపాలనము, ధైర్యములను విడిచిపెట్టకుండా గడిపే జీవితం భార్యాభర్తలకు ఆనందదాయక విషయం అవుతుందని తెలియచేసింది.

క్రీ.శ.20 శతాబ్దపు మొదటి దశకంలో వచ్చిన స్త్రీలసాహిత్యంలోని కథలలో స్త్రీలు చదువుకోవాలనుకోవటం, తమ అజ్ఞానాన్ని గుర్తించటం, ఆత్మవిశ్వాసాన్ని, అస్తిత్వవ్యక్తిత్వాన్ని పెంచుకోవటం, ఐకమత్యాన్ని సాధించటం కనపడుతుంది. భ్రమలను పోగొట్టుకోవటం, పరోపకారం చేయటం, బీదరికంకంటే విద్య గొప్పదని భావించేటట్లు జేయటం, భార్యల విద్యాభివృద్ధి

పట్ల భర్తల బాధ్యతను తెలియజేయటంగాను అర్థమవుతుంది. స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యాన్ని సాధించటానికి అవసరమైన మానసిక పరిపక్వతకై పునాదులు వేయగల ఆలోచనలను ఈ కథలు ప్రతిఫలింపచేసాయి.

**నాటకములు**

స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు ప్రధానమైనది స్త్రీవిద్యాభివృద్ధి. దానికై స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని, స్త్రీవిద్యా ప్రచారం చేసారు. అతిస్వల్పమైన అక్షరాస్యతగల స్త్రీలలో చదువుపట్ల ఆసక్తిని రేకెత్తించటానికి ఉపన్యాసాలు చేయటంతోపాటు, చిన్న చిన్న నాటకాలు వేసి, పాత్రలపరమైన సంభాషణల ద్వారా తోటి స్త్రీలలో విద్యాసక్తిని కలిగించాలని అనుకొన్నారు. రంగస్థలహంగు, ఆర్భాటం, ఆహార్యాలు లేకుండానే సహజమైన యింటి వాతావరణంలోనో, స్త్రీసమాజాలు సమావేశమయ్యే గదులలోను, లేదా స్త్రీలు కలుసుకోగలిగే చెఱువుగట్ల దగ్గరగాని స్త్రీలచదువును చర్చించుకొన్నట్లును, సునాయాసంగా నాటకప్రయోగానికి వీలుగాఉండేటట్లుగా నాటకాలను వ్రాసారు. 20 వ శతాబ్దపు మొదటి దశకంలోనే 9 నాటకాలు వచ్చాయి.

అప్పుడప్పుడే స్త్రీలు సమూహాలుగా ఒకచోటచేరి స్త్రీవిద్యకు సంబంధించిన విషయాలను చర్చించుకోవటానికి వీలుగా స్త్రీసమాజాల స్థాపనోద్దేశ్యం కలిగిందనీ, స్త్రీలు అలాకలిసినప్పుడు స్త్రీవిద్యా ప్రయోజనాన్ని కుటుంబసభ్యులు గుర్తించాలనే భావాన్ని నాటకరూపంలో తెలియజేస్తే, నిరక్షరాస్యులైన స్త్రీలు అర్థం చేసుకోగలరనే భావనకు స్త్రీల సాహిత్యంలో నాటకరచనకు నాంది అయినది.

విన్నకోట లక్ష్మీజోగమ్మ వ్రాసిన 'అవివేకపు వెంకమ్మ' (జులై నుండి సెప్టెంబరు 1902 హిందూసుందరి) క్రమసంచికలలో వచ్చిన నాటకంలో ఇద్దరు స్త్రీల సంభాషణలో భాగంగా ఇంకా కాపురానికి రాని కోడలికి ఆమె పుట్టింటివారు ఇంటి దగ్గర చదువుచెప్పించటాన్ని విమర్శిస్తూ ఆ అత్త యిరుగమ్మ పొరుగమ్మ మాటల ప్రభావంచేత కోడలు చదువుకోవటాన్ని నిరసించిందని తెలిపింది. ఆమె చెల్లెలు వచ్చి స్త్రీలు చదువుకున్నా యింటిపనులు చక్కగా నిర్వహించగలరనీ బాధపడవద్దని చెబుతుంది. వియ్యపురాలు కూడా తన కూతురును చదువుమాన్పించు దామంటే కూతురు ఏడుస్తోందనీ, వీణకూడా నేర్చుకుంటోందని, ఇక అత్తవారి యిష్టప్రకారం చదివించాలని చెబుతుంది. స్త్రీలు భండారు అచ్చమాంబలాగా విద్యావంతురాలు కావాలనీ, ఆడపిల్లల్ని చదివించాలని తెలియజేసింది.

*వివాహానంతరం కూడా స్త్రీవిద్య కొనసాగాల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

మొసలిగంటి రామాబాయమ్మ వ్రాసిన 'నీలాటిరేవు' (డిసెంబరు 1902 హిందూసుందరి) అనే నాటకంలో బాల్యదశలో పిల్లలు తల్లులదగ్గర మసలుతుంటారు గాబట్టి తల్లి విద్యావంతు రాలైతే పిల్లలను మంచిగుణములుగల వారిగా పెంచగలరని తెలియజేసింది. అంతేగాక గృహనిర్వహణతో బాటు స్త్రీలు చదువుకుంటే పత్రికలు చదవగలిగి దేశంలోని సంగతులన్ని

గ్రహించవచ్చుని "నీలాటి రేవు దగ్గర" చేరిన ఇద్దరు స్త్రీల సంభాషణలో భాగంగా నాటక వస్తువును తెలియజేయటం జరిగింది.

*నీళ్ళకోసం స్త్రీలు చెరువులు, రేవుల దగ్గరకు చేరుకొన్నప్పుడు స్త్రీవిద్యావిషయాలే చర్చించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

బాలాంత్రపు శేషమ్మ 'ధైర్యస్థైర్యములు' (జనవరి 1904 సావిత్రి) అనే సంభాషణాత్మక నాటకాన్ని వ్రాస్తూ బాలికలు చదువుకుంటే వారిలో ధైర్యస్థైర్యాలు పెరుగుతాయనీ, బయటకు వెళ్ళినపుడు సమస్యలు ఎదురైనా యుక్తితో ఆలోచించి ఆత్మరక్షణ చేసుకోగలరని ఒక బాలికా పాత్రద్వారా తెలియజేసింది. దానికై స్త్రీలరచనలను ప్రచురించే పత్రికలైన 'హిందూసుందరి' అనే పాతపత్రికతోపాటు పులగుర్త లక్ష్మీనరసమాంబచేత ప్రారంభింపబడి నూతనంగా పెట్టిన 'సావిత్రి' పత్రికను కొనుక్కొని చదువుకోమనీ, దానివల్ల అక్షరజ్ఞానం లభిస్తుందని మరొక బాలికాపాత్ర చేత చెప్పించింది.

*స్త్రీలు నిర్భయంగా పత్రికను చదువుకునేటట్టుగా బోధించింది.*

వల్లూరి మాణిక్యమ్మ వ్రాసిన అనామకమైన సంభాషణాత్మక నాటకం (మార్చి 1904 జనానా)లో అసికాపట్టణంలో జరుగుతున్న మీటింగుకి వెళ్ళివచ్చిన స్త్రీ ఒక పాత్రధారిణిగా మిగిలినవారికి మీటింగ్ విశేషాలను చెబుతూ, చాలా మంది స్త్రీలు ఆ సభకువచ్చారనీ, బుచ్చిబంగారమ్మ ఆ సభలోని స్త్రీలు చేసిన ఇంగ్లీషు ఉపన్యాసాన్ని తెలుగులో అనువదించి సభలో వారికి తెలియజేసిందనీ, అతిబాల్యవివాహం గురించి మాణిక్యమ్మ (బహుశా ఈవ్యాస రచయిత) మాట్లాడినట్లుగా చెప్పింది. పెళ్ళంటే తెలియని బాలికలకు పెళ్ళిచేయటం, ముసలివాళ్ళకిచ్చి చేయటంతో నిర్బంధ వైధవ్యం ఏర్పడుతోందనీ, పూర్వాచార పరాయణియైన చదువురాని స్త్రీని వెకసక్కెము లాడుతున్నారనీ, స్త్రీలు చదువుకుంటే నీతి జ్ఞానాలు సంపాదించు కుంటారని తెలిపింది. స్త్రీలు ముచ్చట్లతో కాలాన్ని దుర్వినియోగం చేస్తున్నారనీ, స్త్రీసమాజాలకు మగవాళ్ళురారని చెప్పినట్లుగా ఆ స్త్రీ పాత్ర చెప్పగా తమ ఊరిలో కూడా స్త్రీసమాజం పెట్టుకోవాలని మరొక స్త్రీపాత్ర అనటంతో నాటకం ముగుస్తుంది.

*పుస్తకపఠనం చేయలేని స్త్రీలు సమాజాలలో ప్రదర్శించిన నాటకాలద్వారా స్త్రీలకు విద్యపట్ల ఆసక్తిని పెంచుతూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, బాల్యవివాహాలు నిర్బంధ వైధవ్యానికి కారణమనీ గుర్తించేటట్లు రచయిత్రి చేసింది. స్త్రీలుసమస్యలను చర్చించుకొనే సమావేశాలకు స్త్రీలు వెళ్ళగలిగే చైతన్యాన్ని కల్గించే ప్రయత్నమే స్త్రీలు బాహ్యప్రపంచంలో వేసే ముందడుగుగా భావించవచ్చు. స్త్రీలు అనువాదకులుగాకూడా ఉన్నట్లు అర్థమవుతుంది.*

ఉన్నవ లక్ష్మీబాయమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (మార్చి1904 హిందూసుందరి) అనే నాటకంలో ఇద్దరు స్త్రీల సంభాషణలలో భాగంగా స్త్రీలు విద్యనేర్చి పరీక్షలు వ్రాసి, మీటింగులో ఉపన్యసించటాన్ని అపోహతో విమర్శించటమే గాక స్త్రీ పురుషులకు భేదం లేకుండా తిరుగుతున్నారని ఒక స్త్రీపాత్ర చెప్తుంది. మరొక స్త్రీపాత్ర మాట్లాడుతూ జ్ఞానాభివృద్ధికి పరోపకారానికి, పతిభక్తికి వినయాది

సద్గుణములకు విద్యాజ్ఞానం అవసరమనీ, నోములు వ్రతాలు చేయటం,నగలు ధరించి తిరగటం కంటే కూడా సద్గుణసంపన్నతతో, విద్యావంతులుగా ఉంటేనే గౌరవం ఉంటుందని చెప్తుంది. విద్యలేని స్త్రీలు మగవాళ్ళతో నిర్భయంగా, స్వేచ్ఛగా మాట్లాడలేకపోతున్నారనీ, మంచివిద్యను అభ్యసించిన స్త్రీ సత్ప్రవర్తనతో నిర్భయంగా సమాజంలో సంచరించగలదని ఆ స్త్రీ పేర్కొనటంతో నాటకం ముగుస్తుంది.

*స్త్రీలు విద్యావంతులయితే సమాజంలో నిర్భయత్వంతో స్వేచ్ఛగా సంచరించగలరనీ, అదే స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి చిహ్నమని ఉన్నవ లక్ష్మీబాయమ్మ భావించింది.*

పత్రికాసంపాదకురాలి ప్రచురణలో వచ్చిన అనామక రచనయైన 'వింతలమారి వీరమ్మ' (సెప్టెంబరు1904 హిందూ సుందరి) అనే నాటకంలో సావడిలో చేరిన స్త్రీలలో ఒక మహిళ 'స్త్రీవిద్య'ను గురించిన సభలూ, ఉపన్యాసాలు పత్రికాపఠనం వంటివి సంసారులకు అవసరం లేదని చెప్పగా మరొక స్త్రీపాత్ర భర్త భార్యను సభలకు తీసుకెడతానంటే ఆ స్త్రీ సభలకెళ్ళనని మొరాయించిన విషయాన్ని చెప్పటం జరిగింది.

*స్త్రీలు ఎటువంటి అజ్ఞానంలో ఉన్నారో తెలియజేసింది. స్త్రీసమాజాలకు స్త్రీలు వెళ్ళవలసిన అవసరాన్ని తెలిపింది. భర్తలు ప్రోత్సాహమిచ్చినా స్త్రీలు సభలకు వెళ్ళాలనుకొన్నా తోటిస్త్రీలకు భయపడే నేపథ్యపు సామాజిక సంస్కృతి అర్థం అవుతుంది. అందుకే ముందుగా స్త్రీలలో మహిళలలపట్ల, స్త్రీవిద్యపట్ల సదవగాహన కల్గించే అవసరాన్ని రచయిత్రులు గుర్తించారు.*

పత్రికాధిపురాలు ప్రచురించిన 'కమలా విమలా సంవాదము' అనే నాటకంలో (నవంబరు 1904 సావిత్రి) స్త్రీలు చదువుకున్నాగాని, పత్రికలలో వ్యాసాలు వ్రాస్తున్నాగాని వారిని పురుషులు విమర్శిస్తున్నారనీ, దాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ తెలిపింది.

*స్త్రీలు సామాజిక విమర్శకు లొంగకూడదనీ, పట్టించుకోకుండా విద్యాభివృద్ధికై ముందుకు సాగాలనీ చెబుతూ స్త్రీలను వెన్నుతట్టే విషయమిది. నాటి సాంఘికవ్యవస్థ యొక్క స్వరూప స్వభావానికి అద్దంపట్టిన నాటకమిది.*

పత్రికాసంపాదకురాలి ప్రచురణలో వచ్చిన 'కమల' (డిసెంబరు1905 – జనవరి1906 హిందూసుందరిలో) అనే నాటకంలో కమలా విమలా పాత్రల సంభాషణలో భాగంగా తెలియజేస్తూ బాల్యవివాహాలవల్ల కుటుంబంలో స్త్రీలు కష్టపడుతున్నారనీ, వధూవరులకు బుద్ధి తెలిసి చదువుకున్న తరువాత నచ్చినవానిని వివాహం చేసుకుంటే కుటుంబంలో సంతోషం ఉంటుందని చెబుతుంది. కమలపాత్ర తనతండ్రి చదువుకోక పోవటంతో తన తల్లిని బాధపెడుతున్నాడనీ, తల్లి చదువుకొని నౌకరీ చేస్తానని చెప్పి భర్తను ఇంట్లో వంటచేయమని అడుగుతుంది. భర్త కూతుర్ని చదువుకోని వాడికిచ్చి పెళ్ళిచేయాలనుకుంటున్నానని చెప్పి తన మాటే సాగనిస్తానంటే, అతని ఉద్దేశాన్ని కొనసాగనీయననీ భార్య చెప్పటం జరిగింది.

*ఈ నాటకంలో స్త్రీలకు చదువుకోవాలని ఉన్నా అటువంటి పరిస్థితులు లేకపోవటాన్ని, సమాజసంస్కృతి ఇచ్చిన కుటుంబ ఆధిపత్యంగల ఆమె భర్త తాను చదువుకోననీ, ఆమెనూ*

*చదువుకోనీయననీ, కూతురిని చదువుకోని వాడికిచ్చి పెళ్ళిచేస్తాననే ఆ అజ్ఞానియైన భర్తయొక్క మూర్ఖత్వాన్ని బయటపెడుతుంది. స్త్రీ విద్యపట్ల భర్తల యొక్క అజ్ఞానాన్ని ఖండించాల్సిన బాధ్యత భార్యలకుందని తెలియజేసిన నాటకమిది.*

*స్త్రీ విద్యావంతురాలైతే తనకు నచ్చిన వానిని పెండ్లి చేసుకునే స్వతంత్రం వస్తుందనీ, అవసరమైతే భార్యగా ఉద్యోగం కూడా చేసుకోవచ్చునీ, పురుషుని అధికారం క్రింద స్త్రీ బ్రతకాల్సిన అవసరం లేదనీ తెలియజేసిన నాటకమిది. కుటుంబసంస్కృతి ఏర్పాటుచేసిన పనివిభజనను తారుమారుచేస్తేగాని స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యం సాధ్యపడదని 1905 నాటికే భావించారు. ఇక్కడ స్త్రీకి విద్య, ఉపాధి ఉండటంతో కుటుంబంలోని పురుషుడి పెత్తనం చెల్లే అవకాశం లేకుండా చేయాలనుకోవటమే ఒక విప్లవాత్మకమైన ఆలోచనగా అర్థమవుతుంది.*

పత్రికాసంపాదకురాలి ప్రచురణలో వచ్చిన 'విమల' (సెప్టెంబరు–అక్టోబరు–నవంబరు 1906 హిందూసుందరి క్రమప్రచురణలో) అనే నాటకంలో తండ్రి కూతుర్ని ముసలివాడికిచ్చి బాల్యవివాహం చేయాలనుకున్నా బాలిక ఆ పెళ్ళికి ఒప్పుకోకపోవటంతో ఆడపిల్లకు ఇంటిచదువు చెప్పించటం తనతప్పు అనీ, దానివల్ల అలా మాట్లాడుతోందనీ భావించి, కన్యాశుల్కపు డబ్బుకాశపడి కూతురిని ఒక ముసలాడికిచ్చి పెళ్ళిచేద్దామనుకొంటాడు. దానిని తెలుసుకొన్న ఒక సంఘసంస్కర్త యొక్క కూతురు వచ్చి తాళిని తెంపి పడేయమని చెప్పి యుక్తవయస్సులో ఉన్న వరుని వివాహమాడమని చెప్పగా, ఆ బాలిక కాకిలాగా ఆముసలివాడి దగ్గరపడి ఉండటంకంటె హంసలాగా తక్కువకాలమైనా బ్రతకాలనుకోవటంతో నాటకం ముగించటం జరిగింది.

*సమాజంలోని అసమవయో వైవాహిక సంస్కృతిగల వివాహపుతంతులోని తాళిని తెంపి స్త్రీ సాంస్కృతిక సంకెళ్ళను వదిలించుకొని విదిలించుకోవాలనుకోవటం కనబడుతుంది. ఆనాటికది విప్లవాత్మకఆలోచన. తల్లిదండ్రులు ముసలాడికిచ్చి పెళ్ళిచేస్తే, ఆ తాళిని తెంపి మరొక యువకుడ్ని పెళ్ళిచేసుకునే ధైర్యం స్త్రీల ఆలోచనలో వచ్చింది. ప్రాచీన వివాహ వ్యవస్థపట్ల నిరసనతో పాటు, స్త్రీల మానసిక, శారీరక స్వేచ్ఛకై గట్టి పునాదులు ఏర్పడటంగా భావించవచ్చు. ఈ భావజాలమే స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యోద్యమ సాధనామార్గంగా భావించాలి.*

20వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు అవసరమైన స్త్రీవిద్యా ప్రయోజనాన్ని తెలుసుకోవటానికి స్త్రీలు ముందుగా స్త్రీ సమాజాలకు రావటానికి స్త్రీలు నాటకాలను రచించినట్లు అర్థమవుతుంది. స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన బాల్యవివాహాలను, వైవాహిక సంస్కృతిలోని లోపాలను గుర్తించి, వాటిని నిర్మూలించగలిగే స్వతంత్రతను పొందాలను కోవటం, పితృస్వామ్యంలోని పనివిభజనను వ్యతిరేకించాలనుకోవటం 20 శతాబ్దపు ప్రారంభంలోనే వచ్చిన నాటకాలలో స్పష్టమయింది. పత్రికాపఠనంద్వారా లోకజ్ఞానం పెంచుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ ప్రయోగాత్మకమైన ఈనాటక రచనలద్వారా తోటి స్త్రీలలో చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేసారు.

**కవితలు**

వేమూరి శారదాంబ వ్రాసిన 'మాధవశతకం' (మార్చి, ఏప్రల్, మే 1901 కలావతి పత్రిక) లో స్త్రీవిద్యపట్ల వ్యతిరేకతగల సమాజాన్ని సామ, దాన, భేద, దండోపాయాలతో సంస్కరించాలని అనుకొంది. అందుకే ముందుగా స్త్రీపురుషులలో మేధోశక్తులు సమానమనే భావనను కలిగిస్తూ

*"వలదనుటెట్లు విద్య మగవారలకెట్టులనట్లేకదా*
*పొలతులు విద్యయందు రుచి పూనకయుండుట తప్పిదంబుగా*
*లలనలు నాలుగక్షరములం జదవంగనె విద్య కాదుగా*
*తెలివి సమమ్ము పూనగను స్త్రీపురుషుల్దరయందు మాధవా!"*

స్త్రీ, పురుషులలో తెలివితేటలు సమానంగానే ఉంటాయని భావించేటట్లు చేసింది. స్త్రీపురుషుల విద్యపట్ల ఉన్న సామాజిక వివక్షాస్వభావాన్ని వేలెత్తి చూపించింది.

స్త్రీలు చదువుకొంటే వారిలో చెడ్డగుణాలు ఏర్పడతాయనే అపప్రథకు చెంపదెబ్బకొద్తూ, మగవారు చదువుఅంటేకూడా చెడ్డవారైనట్లేకదా అంటూ

*"చదివిన దుర్గుణంబులను జాలగబొందుదురంద్రుగాని య*
*య్యది చెడుబుద్ధులన్ గరపునట్లయినన్మగవారు నేర్వ చె*
*ల్లదుగద విద్యనెట్లు మది రంగుగ నేరుచుచున్నవారలి*
*య్యదనున నందరున్ జెడగునందిరి జూడగదయ్య మాధవా!"*

అని సమాజానికి చురకవేసింది.

స్త్రీలు విద్యావంతులైతే స్వతంత్రులవుతారనీ, తమ మాటలను పట్టించుకోరనే భయం వారిలో ఉంటుందికాబట్టి వారి నాడిని పట్టుకొన్న కవయిత్రిగా

*"తరుణులు విద్య నేర్చిన స్వతంత్రములిమ్మటంచుంద్రటంచునం*
*దురే యది కల్ల దాము దగునో యెవి పూనగనెవ్వి గూడదో*
*యెఱింగియె పొందుచుంద్రుగద యెప్పుడుగూడను బాగవిద్యలన్*
*గరచినవారు గాననిది న్యాయమె జెప్పగచూడ మాధవా!"*

*అని సామాజిక సంస్కృతిని ప్రశ్నకు పెట్టింది. స్త్రీలకు స్వాతంత్ర్యం యిచ్చేందుకు పురుషులకేమి హక్కుఉందని ఈనాడు స్త్రీలు చర్చించుకొనే విషయాన్ని ఆనాడే శారదాంబ చెపుతూ స్త్రీలు స్వతంత్రతను తామంతట తామే పొందుతారనీ, బాధ్యతతో ఏ మేరకు స్వాతంత్ర్యాన్ని వినియోగించుకోవాలో వారికి తెలుసని చెప్పిన క్రాంతదర్శి శారదాంబ.*

కొటికలపూడి సీతమ్మ 'స్త్రీవిద్య' (ఆంధ్రకవయిత్రులు-ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ) ను గురించి వ్రాస్తూ

*"స్త్రీలు విద్యనేర్వ చెడిపోదురనుమాట*
*కల్లయనుదోప నెల్లఱకును*
*విశదపఱుతునొక్క విద్యావతి చరిత్ర*
*సంగ్రహంబుగాగ చదువుడయ్య"*

అని విద్యావంతులైన స్త్రీలు చెడిపోతారనేది అసత్యమనీ దానికి నిదర్శనంగా ఒక విద్యావతి చరిత్రంగా 'అహల్యాబాయి' వృత్తాంతాన్ని చెప్పింది.

**మంగళహారతి**

దామెర్ల సుందరమ్మ కందుకూరి వీరేశలింగంగారికృషిని స్తుతిస్తూ స్వయంగా వ్రాసిన మంగళహారతి (మే 1904 హిందూసుందరి) ని ఆ సభలో పాడుతూ

*"మహిమీదవెలసిన మన హిందు దేశమును*
*అభివృద్ధి నొందించు వేడ్కతోడా*
*విడువకెప్పుడుపాటుపడుచుండునట్టి*
*యావీరేశలింగకవివరునకెపుడు (జయమంగళం నిత్యశుభమంగళం)*

*పతిహీనలయినట్టిపడతులను*
*జూచియోదయార్ద్ర హృదయుడయి*
*వారివెతలనెటులయినదీర్పవలె*
*ననుచునుజేపట్టికృతకృత్యుడయిన యా ధీరునకును ॥జయమంగళం॥*

*అంగనలవిద్యకయి వలదనెడివారితో*
*ఔననుచు వాదములనొనరజేసి॥*
*కట్టకడకుతానె దిట్టయయినిలచిన*
*కవికులోత్తముడయిన ఘనునకెపుడు ॥జయమంగళం॥*

*కలలోననయినను గల్లయననెట్టిదో*
*యెరుగకను సత్యమార్గంబునందే*
*చరియించుచున్నెపుడు కొనియాడబడుచున్న*
*సజ్జనోత్తముడయినగుణశాలికి ॥జయమంగళం॥*

*సకలలోకములను యేమరకనెల్లపుడ*
*పాలించుచున్న యాసర్వేశ్వరుండు*
*కలకాలమారోగ్యభాగ్యంబుకృపనిచ్చి*
*యాపురుషరత్నమునెపుడుబ్రోచుగాత॥జయమంగళం॥ నిత్యశుభమంగళం"* అంటూ

*స్త్రీవిద్య, స్త్రీపునర్వివాహం వంటి విషయాలలో మహిళాభివృద్ధికై వీరేశలింగంగారు కృషిచేసారని ప్రశంసించింది. ఒక స్త్రీగా పరపురుషుని కార్యనిర్వహణను ప్రశంసించటమే ఒక సాంస్కృతిక పరిణామం.*

## కీర్తన

నుదురుపాటి లక్ష్మీనరసమ్మ వ్రాసిన 'కీర్తన' (మే 1905 హిందూసుందరి)లో

"గౌ. కాంతామణిరో। నీమహిమ వర్ణించుటకును మేమెంతటి వారము ఓతల్లీ।క। ఇంగ్లాండందున జననమునొంది హిందూదేశపు బాలికామణులకు మనోరథములు దీర్పగ మందారంబై వెలసితివి ।క। విద్యాసాగరివై యుండుటచే విబుధులు నిరతము మన్ననతో। నిను బూజింతురు నిండగు భక్తిని నీకాశారద సాటియెగా ।క। తల్లీ నీవిట జనుదెంచుటచే ధన్యుల మయితిమి నేడు మా। కొఱతలు దీరును కరుణతొ మాకిట గవర్నమెంటుస్కూలును దయ చేయుమా ।క। సర్వేశుడు నిను సతతము బ్రోచుత సంపత్సౌభాగ్యంబులతో? మార్తాండ పురబాలికలొసగెడు। మావందనములు గైకొనుమా ।క।" అంటూ

*బాలికా విద్యావ్యాప్తికి ప్రచారంచేస్తూన్న ఆనిబిసెంట్ ను స్తుతిస్తూ కర్నాటక సంగీతపు కూర్పులో వ్రాసిన కవితలో బాలికావిద్య అభివృద్ధిచెందాలంటే ప్రభుత్వంవారు ప్రతి ఊరిలోనూ పాఠశాలలను నెలకొల్పేటట్లుగా చూడమని ఆనిబిసెంట్ ను వేడుకోవటం కనబడుతుంది.*

*సాధారణంగా స్త్రీలు కలుసుకోవటానికి వీలయిన చోటు పేరంటానికై పిలిచిన యిల్లు. అక్కడ ఆకర్షించేవి మంగళహారతి పాటలు, కీర్తనలు. అందుకే పాడుకోవటానికి వీలుగా పాటలను, కీర్తనలను రచించి, స్వరకల్పనచేసి, స్త్రీవిద్య, స్త్రీపునర్వివాహాన్ని ప్రచారంచేయటాన్ని గొప్ప విషయంగా భావించాలి. ఆ నాడే ఒక స్త్రీ కవితను వ్రాసి, దానికి సంగీత స్వరకల్పన చేసి కీర్తన రూపంలో పాడుకుంటూ స్త్రీలు ప్రచారం చేసేటట్లు చేయటం గుర్తింపుపొందాల్సిన విషయంగా భావించాలి.*

స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి గాని, దేశస్వాతంత్ర్యానికి గాని స్త్రీవిద్య ముఖ్యమని సంఘ సంస్కర్తలు భావించారు. క్రీ.శ 20 శతాబ్దపు మొదటి దశకంలో అంటే 1900-1909 సం.ల వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన నాటి స్త్రీల ఆలోచనల పరిణామాలలో స్త్రీవిద్య, స్త్రీ స్వాతంత్ర్యం మొగ్గతొడగటం కనబడింది. 20 వ శతాబ్దపు ప్రారంభంలో ఒక్క శాతంగా ఉన్న బాలికావిద్యను అభివృద్ధిచేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రతి పట్టణంలో బాలికాపాఠశాలలను నెలకొల్పినా, బాలికావిద్య అభివృద్ధి చెందక పోవటానికి కారణాలను విశ్లేషించుకున్నారు. స్త్రీలలో వ్యక్తిత్వస్పృహ పెరిగింది. స్త్రీవిద్యా ప్రాముఖ్యతను గురించి ప్రచారం చేయటానికి స్త్రీసమాజాలను ఏర్పరచుకొంటూ ఐక్యతాభావాన్ని పెంచుకోవాలనీ, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన బాల్యవివాహాలను నిర్మూలించాలనీ, వితంతు స్త్రీల విద్యాభివృద్ధికి ఆటంకమైన వితంతు కేశఖండనాన్ని నిషేధిస్తూ చట్టాలు రావాలని

భావించారు. స్త్రీపునర్వివాహాలను గురించిన ఆలోచనలను పెంచుకున్నారు. స్త్రీవిద్యావిషయంలో తండ్రి, సోదరులు, భర్తల బాధ్యతలను తెలియజేసారు. స్త్రీవిద్యాభివృద్ధికి అడ్డువచ్చిన సామాజిక కుటుంబ సంస్కృతిని అధిగమించే చైతన్యం రావాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ సాహిత్య సృజన చేసారు. స్త్రీలవిద్యపట్ల సామాజిక నిరసనను పట్టించుకోవాల్సిన అవసరంలేదని భావించారు. స్త్రీలు చదువు కుంటే దూరంగా ఉన్న భర్తకు, స్నేహితులకు ఉత్తరాలు వ్రాయచ్చునీ, స్త్రీలందరూ ఐకమత్యంతో ఉండాలనీ, పత్రికాపఠనం చేయాలని తెలియజేసారు. స్త్రీలకు దాయభాగం (ఆస్తిహక్కు) లేదని గ్రహింపుకు రావటం జరిగింది. విదేశీ స్త్రీలు విద్యావంతులుగా రాజ్యకార్య ధురంధరత్వాన్ని వహించిన విషయాలను అవగాహన చేసుకున్నారు. స్త్రీల నిర్ణయాలలోనూ, స్త్రీల ఆలోచనలలోనూ, స్త్రీల వాక్కులలోనూ స్వతంత్రం ఉండాలని గ్రహించారు. స్త్రీపురుషులు అనుభవిస్తున్న స్వతంత్రంలో ఉన్న తేడాను గుర్తించారు. స్త్రీలకు విద్యవల్ల ధైర్యంతో నిర్భయంగా, స్వేచ్ఛగా భావప్రకటన చేసే శక్తి, గౌరవం ఉన్నప్పుడే స్త్రీలకు స్వాతంత్ర్యం వస్తుందని అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని భావించారు. స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించి చరిత్ర, గణితం, శిశు పోషణ, ప్రకృతి, శరీర శాస్త్రాల పరిజ్ఞానాన్ని పొందాలనుకున్నారు. స్త్రీలు ఉద్యోగాలు చేయాలనే ఆలోచనలను పెంచుకున్నారు. స్త్రీలు ముందుకు వచ్చి బాలికలకు తెలుగు, ఆంగ్లంలో వ్రాయటం, చదవటం నేర్పించేందుకు పాఠశాలలను నెలకొల్పారు. వందేమాతరం ఉద్యమాన్ని అందిపుచ్చుకొని స్వదేశీవస్త్ర, వస్తుతయారీలో భాగస్వాములై దేశక్షేమాన్ని కోరుకుంటూ జాతీయాభిమానాన్ని పెంచుకున్నారు. బాల్యవివాహపు సంస్కృతిని నిరసిస్తూ తాళిబొట్టును తెంపే స్వేచ్ఛను పొందాలను కోవటమేకాక కుటుంబంలో భర్తపెత్తనాన్ని అడ్డుకొని స్త్రీవిద్యను అభివృద్ధి చేయాలనుకోవటం, పితృస్వామ్యపు పనివిభజనను తారుమారుచేస్తూ స్త్రీలు ఉద్యోగం చేయాలను కోవటం, ఉపాధినికూడా పొందాలనుకోవటం జరిగింది. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై బలమైన పునాదులు వేసుకొంటూ దేశాభివృద్ధికై వందేమాతర ఉద్యమంలో భాగస్వాములవటంగా స్త్రీల ఆలోచనలు స్పష్టమయ్యాయి. మొత్తము మీద 20 శతాబ్దపు మొదటి పదేండ్లలోనే స్త్రీవిద్యాభివృద్ధిని అభివృద్ధిచేసుకోవాలని భావనతో పితృస్వామ్యపు కుటుంబసంస్కృతిని అధిగమించే చైతన్యాన్ని నాటిస్త్రీలు తెచ్చుకోవటం ఆశ్చర్యకరమైన విషయం. 1902లోనే స్త్రీకి విద్యయే నాగరికత అని భావించారు. 1903లోనే సమాజంలో స్త్రీలు ద్వితీయస్థానంలో ఉన్నారనే గ్రహింపును పొందారు.

ఈ దశాబ్దం తర్వాత వచ్చిన జాతీయోద్యమ రాజకీయపరిణామాల ప్రభావంతో నిరంతర ప్రక్రియగా సాగిన స్త్రీలవ్యక్తిత్వసాధనలో చోటుచేసుకొన్న రాజకీయ చైతన్యాన్ని అర్థం చేసుకోవటానికి ముందుకు సాగాలి.

# 3. సాహిత్యం (1910-1919) - హోమ్‌రూల్ ఉద్యమం - 1919 చట్టం - స్త్రీపురుష సమానత్వం - స్త్రీల సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కుల చైతన్యం

1910 వ దశకంలో భారతదేశంలో ప్రజాస్వామ్యానికి బీజారోపణ జరిగింది. బెంగాల్ విభజన కారణంగా తిలక్ వంటి ఉద్యమనాయకులతో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమంలో భాగంగా స్వదేశీ వస్త్రతయారీ, విదేశీవస్తు బహిష్కరణ, ప్రభుత్వ విద్యాలయాల బహిష్కరణ, జాతీయవిద్య, న్యాయపాలనా బహిష్కరణ వంటివి చేయటంతో ఆంగ్లేయుల వ్యాపారానికి గండిపడింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వచ్చిన వందేమాతరం ఉద్యమాన్ని అణచటానికి 1910 లో మింటో-మార్లే సంస్కరణల రూపంలో ఇండియా మంత్రి మార్లే ప్రతిపాదించిన దమననీతిని రాజప్రతినిధియైన మింటో కూడా సమర్థించాడు. 1911లో వచ్చిన ఇండియా మంత్రి క్ర్యూ బ్రిటిష్ రాజప్రతినిధియైన హార్డింజ్ సలహాతో బెంగాల్ విభజనను రద్దుచేయటం జరిగింది. అదే సమయంలో ఉద్యమకారుల ప్రభావాన్ని తగ్గించటానికి బ్రిటిష్ ప్రభువైన జార్జి రాజధానిని కలకత్తానుండి ఢిల్లీకి మార్చాడు. బీహార్, ఛోటా నాగపూర్, ఒరిస్సాలను బెంగాల్ నుండి విడదీసి ప్రత్యేక రాష్ట్రనిర్మాణం చేయాలనుకుంటూ, జాతీయా భిమానులు ఎక్కువగా ఉన్న బెంగాల్ లో రాజకీయప్రాధాన్యాన్ని తగ్గించాలనుకున్నాడు. బ్రిటిష్ వారు హిందూముస్లింలమధ్య మతబేధాలను సృష్టించటం మొదలుపెట్టి శాసనసభలో ముస్లింలకు ప్రత్యేకస్థానాలు ఏర్పాటుచేయాలని భావించారు. భూస్వాములు, వర్తకులు, యూరోపియన్లకు ప్రత్యేకస్థానాలు ఇవ్వాలనుకున్నారు. మింటోమార్లే సంస్కరణలవల్ల కేంద్రశాసనసభలలోనూ, రాష్ట్రశాసనసభలలో అనధికార సభ్యులసంఖ్యను, ఎన్నుకోబడిన సభ్యులసంఖ్యను పెంచాలనుకొన్నారు. సాధారణ నియోజకవర్గాలు, భూస్వాముల, ముస్లింల ప్రత్యేక నియోజకవర్గాలతోపాటు వర్తకసంఘాలకు నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. ఈ సంస్కరణలవల్ల సభలలో బడ్జెట్ ను చర్చించే అవకాశం వచ్చింది. రాజప్రతినిధి యొక్క కార్యనిర్వహణ సభలోనూ, గవర్నర్ కార్యనిర్వహణసంఘంలోనూ ఒక్కొక్కరు

చొప్పున ఇద్దరు భారతీయులకు సభ్యత్వాన్ని ఇచ్చింది. బ్రిటిష్ ఇండియామంత్రి సభలో కూడా భారతీయులకు రెండుస్థానాలను కేటాయించింది. ప్రథమ ప్రపంచసంగ్రామ సమయంలో (1914–1918) విదేశాలలోని భారతీయులు సాయుధపోరాటాన్ని జరిపినవారుగా దేశంలో స్వరాజ్యాన్ని సంపాదించే తలంపుతో పంజాబుకు వచ్చి తిరుగుబాటు చేసారు. దివ్యజ్ఞానసమాజ నాయకురాలు అనిబిసెంట్ రాజకీయరంగ ప్రవేశంచేసి హోమ్ రూల్ (ఆంతరంగిక స్వపరిపాలన) ఉద్యమాన్ని ప్రారంభించగా 1914లో జైలు నుండి విడుదలైన తిలక్ వచ్చి హోమ్ రూల్ ఉద్యమంలో భాగస్వామి అయ్యాడు. హోమ్ రూల్ ఉద్యమాన్ని అణచటానికై బ్రిటిష్ ప్రభుత్వం నేరారోపణ చేయాల్సిన అవసరం లేకుండానే శిక్షించేటట్లుగా 'రౌలత్' చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1916 లో లక్నోలో జరిగిన సమావేశంలో కాంగ్రెసు బ్రిటిష్ వారి ఇతర వలస రాజ్యాలలోవలె భారతదేశంలో కూడా రాష్ట్రాలలో స్వపరిపాలనా విధానం ఉండాలనుకున్నారు. 1917లో ఇండియామంత్రియైన మాంటేగ్ భారతదేశంలో బాధ్యతాయుత పరిపాలనను ప్రవేశపెట్టే ఉద్దేశంలేదని అన్నందుకు అనిబిసెంటు హోమ్ రూల్ ఉద్యమాన్ని ఉధృతం చేసారు. ఉద్యమనాయకులు లాలాలజపతిరాయ్ పేర్కొన్నట్లుగా భారతదేశంలోని రాష్ట్రాలన్ని సమాఖ్యగా ఏర్పడగలిగి, వైజ్ఞానిక, రాజకీయ గౌరవం పొందేందుకు తగిన వాస్తవ స్వేచ్ఛాసమానత్వం, ఆర్థిక విధానాలను రూపొందించే స్వేచ్ఛ కావాలనీ, కేంద్ర ప్రభుత్వానికి సామ్రాజ్య వ్యవహారాలలో మాత్రమే అధికారం ఉండాలని తెలియజేసారు. కాని 1916 లో ఛెమ్స్ ఫర్డ్ దానికి అంగీకరించినా 1917లో వచ్చిన మాంటేగ్ అధికారవర్గ సూచనల ప్రకారం భారతీయులకు రాష్ట్రప్రభుత్వ  పాలనకై బాధ్యతాయుత ప్రజాస్వామ్యానికి ఇంకా అర్హత రాలేదనీ, క్రమంగా భవిష్యత్తులో ఇవ్వవచ్చని చెప్పాడు. 1919 నుండి ప్రజలు పరాయిపాలనను పూర్తిగా నిరసించారు. అందుకనే మాంటేగ్–ఛెమ్స్ ఫర్డ్ సంస్కరణలు వచ్చాయి. మాంటేగ్–ఛెమ్స్ ఫర్డ్ సంస్కరణల ఫలితంగా ప్రజలచేత ఎన్నుకొనబడిన శాసనసభ నిర్ణయించేటట్లుగా ప్రభుత్వం, అధికారులయొక్క ఉద్యోగకాల నిర్ణయం ఉండాలని సూచించగా, దీనికి అందరూ అంగీకరించటంతో 1919 చట్టం తయారైంది. దీని ప్రకారం కేంద్రశాసనసభలో దిగువసభ/శాసనసభ మరియు ఎగువసభ/కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ ఏర్పడేటట్లుగానూ, శాసనసభ ఎన్నుకోబడిన సభ్యులతోనూ, నామనిర్దేశిక సభ్యులతోనూ ఉండేటట్లును, ఎగువసభకు గవర్నర్ జనరల్, రాష్ట్రశాసనసభలకు గవర్నర్లను ఏర్పరచి వారి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక సభలు ఉండేటట్లు రూపకల్పనచేసి, గవర్నరుకు బడ్జట్ ను తిరస్కరించే ప్రత్యేక అధికారాన్ని ఇవ్వటం జరిగింది. ఆ విధంగా ద్వంద్వ పరిపాలన వచ్చింది. దేశ రాజకీయ సంస్కరణలు జరుగుతున్నప్పుడు భారతీయులకు పాలనలో అడుగుపెట్టే స్వతంత్రాన్ని పొందటానికి నియోజకవర్గ స్వాతంత్ర్యం ఏర్పడింది. ముస్లిమ్‌లకు ప్రత్యేక నియోజకస్థానాలను ఏర్పాటుచేసారు. స్త్రీలుకూడా తాము పురుషులతో సమానంగా నియోజకవర్గ స్వాతంత్ర్యం పొందాలనీ, స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకతను, స్త్రీలకు ఓటుహక్కు ఉండాలనే భావనలను ప్రతిఫలింపచేస్తూ స్త్రీల సాహిత్యం వచ్చింది.

స్త్రీవిద్యా ప్రచారంతో పాటు ఆస్తిహక్కు, స్త్రీ, పురుష సమానత్వం, ఓటుహక్కు, స్త్రీలకు ప్రత్యేక నియోజకస్థానాలు ఉండేటట్లుగాను, స్త్రీలకు రాజకీయ వ్యవహారాలలో భాగస్వామ్యం కోరుకొన్న స్త్రీల ఆలోచనలుగా రచయిత్రులు సాహిత్యాన్ని సృజించాలని భావించారు. స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యోద్యమం కొనసాగిస్తూనే సమాంతరంగా దేశస్వాతంత్ర్యోద్యమంలోను భాగస్వాము లవ్వాలనుకునట్లు అర్థమవుతుంది. ఈ దశాబ్దంలో స్త్రీలు బలహీనంగా ఉన్న తమ వ్యక్తిత్వపు శక్తులను గుర్తిస్తూ, వ్యక్తిస్వాతంత్ర్యసాధనకై సోపానాలను నిర్మించుకోవటం జరిగింది.

క్రీ.శ.20 వ శతాబ్దపు రెండవ దశకంలో స్త్రీవ్యక్తి స్వతంత్రత, దేశస్వాతంత్ర్యానికి సంబంధించి 28 ప్రచురిత ఉపన్యాసాలు, 98 వ్యాసాలు, 2 కథలు, 11 నాటకాలు, 7 కవితలు, 1 కీర్తన, 1 మంగళహారతి, 1 స్వీయచరిత్రం వచ్చాయి.

**వ్యాసాలు**

1910 నుండి1919 వరకు స్త్రీవిద్యావశ్యకత, స్త్రీస్వతంత్ర జీవనావశ్యకత వంటి అంశాలతో వచ్చిన దాదాపుగా123 వ్యాసాలను స్త్రీల సాహిత్యంలో భాగంగా తీసుకోవటం జరిగింది.

పులుగుర్త లక్ష్మీనరసమాంబ వ్రాసిన 'స్వధర్మసేవ' (ఏప్రిల్ 1910 ఆంధ్రపత్రిక ప్రథమ వార్షిక సంచిక) అనే వ్యాసంలో పుట్టుకతోనే మానవులకు స్వతంత్ర జ్ఞానం ఉంటుందనీ, తన దేశం, తన మతం, తన జాతిసంఘానికి అనుగుణంగా స్వధర్మాన్ని నిర్వర్తించే స్వతంత్రజ్ఞానం ముఖ్యమనీ, స్త్రీ సంఘాలకు ఆ ధర్మాచరణ బాధ్యత ఉందని పేర్కొంది. స్వతంత్రజ్ఞానం జన్మసిద్ధమనీ, ఆ జ్ఞానాన్ని స్త్రీ అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'ఆంధ్రమహిళాసభ' అనే (ఏప్రిల్1911, సావిత్రి) వ్యాసంలో ఆంగ్లేయ ప్రభువులు, స్వదేశీప్రభువులు, సజ్జనులవల్ల స్త్రీవిద్య ఉదయించిందనీ, స్త్రీలు వార్తాపత్రికలను చదువుతున్నారనీ, స్త్రీసమాజాలను ఏర్పాటుచేసుకొని స్త్రీవిద్యాభివృద్ధికై పాటుపడుతున్నారనీ, కొందరు స్త్రీలు బాలికాపాఠశాలలను స్థాపించి పనిచేస్తున్నారని తెలిపింది. ఆంధ్రస్త్రీలు ఐకమత్యంతో మహాసభలను ఏర్పాటుచేసుకొని స్త్రీవిద్యాభివృద్ధికై తీర్మానాలు చేసుకొంటున్నారనీ, స్వభాషలోను, రాజకీయభాషలలోను స్త్రీలు విద్యాభివృద్ధిని పొందాలని పులుగుర్త లక్ష్మీనరసమ్మ తెలియజేసింది.

కొటికలపూడి సీతమ్మ 'పులుగుర్త లక్ష్మీనరసమాంబ కొక విన్నపము' (ఆగష్టు 1911 హిందూ సుందరి) అనే శీర్షికన లేఖ వ్రాస్తూ స్త్రీ సమాజాలకు స్త్రీలను ఆహ్వానిస్తూ సువాసినులను మాత్రమే కులాంగనలుగా పేర్కొని ఆహ్వానించారనీ, పునర్వివాహం చేసుకొన్న స్త్రీల పేరుకు ముందు కులాంగనను పేర్కొనరాదని సావిత్రి పత్రికాముఖ ఆహ్వానాన్ని ఉదాహరించింది. అలా భావించిన సంఘనియమాన్ని దుయ్యబట్టటమేకాక, అది సభ్యుల తప్పుకాదనీ, స్వయంగా పులుగుర్త లక్ష్మీనరసమాంబయే బందరు సభలో స్త్రీలకు పునర్వివాహం మంచిది కాదని అతిహాసముగా పేర్కొన్నదనీ, దాన్నిబట్టి ఆలోచించగా పైకి సంస్కర్తల్లా ఉంటున్నారుగానీ వారు త్రికరణశుద్ధిగా సమాజాలలో పనిచేయాలనీ ఆమెకొక హెచ్చరిక చేసింది.

*స్త్రీ సమాజాలలోని పనులను సభ్యులు త్రికరణశుద్ధిగా చేస్తేనే స్త్రీల అభివృద్ధి ఆచరణాత్మకం అవుతుందని హెచ్చరిక చేయటం అర్థం అవుతోంది.*

జూలూరు తులశమ్మ 'ఐకమత్యం' (ఏప్రిల్ 1910 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) అనే శీర్షికన వ్రాస్తూ స్త్రీ పురుషుల మధ్య ఐకమత్యం లేకపోవటం చేతనే హిందూ దేశం దుస్థితిలో ఉందని పేర్కొంది.

'స్త్రీవిద్య' (అక్టోబరు 1910 హిందూసుందరి) ను గురించి ఈమె చేసిన ఉపన్యాసంలో విద్యాధికులగు స్త్రీలు అక్కడక్కడా కనపడుతున్నా, స్త్రీ పురుషుల హేళనలతో ఆడపిల్లలను నాల్గవ తరగతికంటె హెచ్చుగా చదివించటం లేదనీ, స్త్రీల అల్పవిద్యవల్ల నష్టాలున్నాయనీ, గ్రంథపఠనానికి తగిన సమర్థత ఏర్పడక మంచిగ్రంథాలను చదవలేక పోతున్నారని చెప్పింది. బాల్యవివాహాలు చేస్తున్నారనీ, స్త్రీలను అబలలుగా, జ్ఞానశూన్యులుగానూ వక్కాణిస్తున్నారనీ, విడవరాని కట్టుబాట్లతోనే అంటే సాంప్రదాయాలను పాటిస్తూనే విద్యను నేర్పించినచో స్త్రీలోకమునకు శ్రేయోదాయకంగా ఉంటుందని తెలిపింది. వితంతువులకు విద్య నేర్పించాలనీ, కుట్టుపనిని నేర్పించాలనీ, వారిని గృహ బానిసలుగా తయారుచేయవద్దనీ, వారికి బ్రహ్మవిద్య కంటె ముందుగా అవసరమయ్యేది ప్రపంచజ్ఞానం అని తెలియజేసింది.

'హిందూస్త్రీల దుస్థితి' (జులై 1912 హిందూసుందరి)ని గురించి ఈమె వ్రాస్తూ మనుస్మృతి ప్రకారం ఆడపిల్లలకు రజస్వలానంతర వివాహం సమ్మతమే కాబట్టి బాల్యవివాహాలు చేయవద్దనీ, ఆడపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించమని తెలిపింది. వితంతువుల శిరోముండనం శిరచ్ఛేదం కంటే కూడా భయంకరమైనది కాబట్టి దాన్ని నిర్మూలన చేసే విధంగా సోదరజనాలు పూనుకుంటే హిందూ స్త్రీలహైన్యం కొంతవరకు తగ్గిపోతుందని తెలియజేసింది. రచయిత్రి యొక్క స్వానుభవమే నిదర్శనం.

'స్త్రీవిద్య' (జులై 1914 హిందూసుందరి) ను గురించి ఈమె వ్రాస్తూ విద్యామహిమవల్ల అమెరికా, జపాన్, ఇంగ్లండు అభివృద్ధిని సాధించాయనీ, పురుషులకు దేశాభిమానం, సత్ప్రవర్తన ఉండాలంటే వారికి బోధించే తల్లులు స్త్రీలే కాబట్టి ముందుగా స్త్రీలు విద్యావంతులు కావాలని తెలియజేసింది. స్త్రీలు సాహిత్యం, గణితం, ఇంగ్లీషు, కళలు నేర్చి దేశాభివృద్ధికి పాటుపడాలనీ, స్త్రీలు విద్యావంతులైతే నీతి సత్ప్రవర్తనతో ఉంటారనీ, ఉన్నతవిద్యనేర్చి ఉపాధ్యాయినులుగా చదువును బోధించవచ్చనీ, స్త్రీలు వైద్య విద్యను అభ్యసించాలనీ, ఆ రకంగా దేశానికి సేవచేయాలనీ తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'విద్యామూల్యత' (ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక ఏప్రిల్ 3వ తేది 1916) అనే వ్యాసంలో స్త్రీలు పురుషులవలె విద్యను ఆర్జించితే స్వతంత్ర జీవనాన్ని సాగించగలరనీ, స్వదేశాభిమానం, స్వజన సంఘీభావం, ధైర్యస్థైర్యాలు వారిలో పెరిగితే దేశం పారతంత్ర్యంనుండి విముక్తి పొందాలనే ఆలోచనలు వారికి వస్తాయని జూలూరు తులశమ్మ తెలియజేసింది.

*స్త్రీలకు ఆధ్యాత్మిక విద్యలు తెలియజేసేవారు గానీ లౌకిక ప్రపంచ జ్ఞానం మాత్రం తెలియాల్సిన అవసరంలేదని భావించి స్త్రీలను ఇంటి బానిసలుగా మార్చిన సామాజిక సంస్కృతిని విమర్శకు పెట్టటం జరిగింది. స్త్రీల హైన్యానికి కారకమైన వితంతు సంస్కృతిపట్ల స్పందించాలని చెప్పింది. విద్యతో స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందాలనీ, స్త్రీల స్వతంత్రతయే దేశస్వాతంత్ర్య సాధనకు ప్రథమ సోపానం అని ఆనాటి రచయిత్రిగా ప్రజలలో చైతన్యం కలిగించింది. 1916 నాటికే స్త్రీలలో అభివృద్ధికావల్సిన భావజాలాన్ని తెలియజేయటం జూలూరు తులశమ్మ యొక్క క్రాంత దర్శనానికి నిదర్శనంగా భావించవచ్చు.*

'స్త్రీలు పత్రికారంగం' (1910 జులై సావిత్రి) లో అడుగుపెట్టాల్సిన అవసరాన్ని పత్రికాధిపురాలు తెలియజేస్తూ స్త్రీల విద్య ఆశించిన మేర అభివృద్ధిచెందాలనీ, ఆంగ్లదేశస్త్రీలు విద్యావంతులై రాజకీయరంగంలో తరించాలనే పట్టుదలతో ఉన్నారని తెలియజేసింది.

*స్త్రీలు పత్రికలద్వారా సమాజాన్ని, దేశాన్ని గురించి నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించగలిగేతేనే వారికి వ్యక్తిస్వాతంత్ర్యం లభించినట్లుగాను, అప్పుడే వారు దేశస్వాతంత్ర్యం వైపు అడుగులు వేయగలుగుతారని భావించవచ్చు.*

చిన్నారప్పగారి వెంకమ్మ 'స్త్రీవిద్య' (జులై 1910 హిందూసుందరి) అనే అంశాన్ని గురించి స్త్రీ సమాజంలో ఉపన్యసిస్తూ విద్య అనేది స్త్రీ పురుషులిద్దరికీ అవసరమనీ, వృత్తివిద్య సరిగా బోధపడటానికి తగిన భాషాజ్ఞానం విద్యయే ఇస్తుందని చెప్పింది. స్త్రీలుకూడా తమతమ దేశాలకు ప్రాంతాలకు తగినట్టుగా వృత్తివిద్యలను అభ్యసించాలనీ, స్త్రీలను విద్యావంతులుగా, వివేకరాండ్రుగా చేయగలిగితే ఇంట్లో భర్తకే కాక దేశానికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేసింది.

*స్త్రీలు సాధారణ చదువులు, శాస్త్రవిద్యయేకాక వృత్తివిద్యలను కూడా నేర్చుకోవాలనీ, ఆ విద్యలే దేశాభివృద్ధికి మూలమని చెప్పింది. స్త్రీల జీవితాలకు దేశస్థాయిలో విలువ ఉన్నదని భావించి, స్త్రీలు ఆ దిశగా అడుగులు వేయాలనుకోవటం స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనలో వేసిన మరొక అడుగుగా భావించాలి.*

దామెర్ల సీతమ్మ గుంటూరు నందలి 'హిందూ స్త్రీల మహాసభ'లో (జులై 1910 హిందూ సుందరి)లో ఉపన్యసిస్తూ మనుధర్మశాస్త్రంలోని విషయాలు పురుషుల కనుకూలంగా ఉన్నాయనే భావనను ఖండిస్తూ స్త్రీల ఉనికికి విలువనిచ్చే విధంగా కూడా ఉన్నాయని సమర్థించటం ఆమె మాటల్లో అర్థం అవుతుంది.

ఈమె 'మనుధర్మశాస్త్రములోని స్త్రీల యాచారములు' (జులై 1911 హిందూ సుందరి) గురించి వ్రాస్తూ మనువు స్త్రీలను గౌరవించమని చెప్పాడు గానీ, తక్కువ చేయలేదనీ, మనుధర్మ శాస్త్రంలోని స్త్రీసంబంధ ధర్మాలను ఖండించినవారితో మనుస్మృతిలోని విషయాలకున్న మరోపార్శ్వంతో వాటిని భిన్నంగా సమర్థించటం చేసింది.

'స్త్రీవిద్యావిషయం' (జనవరి 1912 హిందూ సుందరి) అనే అంశం మీద గుంటూరు నందలి సనాతన ధర్మమండలిలో దామెర్ల సీతమ్మ చేసిన ఉపన్యాసంలో విద్యవల్ల లాభమున్నదని స్త్రీలు గ్రహించగలిగారనీ, స్త్రీవిద్యను అభివృద్ధిచేసే మార్గాలనుకూడా తెలుసుకోవాలని తెలిపింది. విద్యాహీనతవల్ల స్త్రీలకు కలిగే బాధను పురుషులు తెలుసుకోలేక పోతున్నారని చెప్పింది. వితంతువుల కష్టాలు పురుషులకు తెలియటంలేదనీ, స్త్రీల బాధలను పోగొట్టుకునే ప్రయత్నం స్త్రీలే చేయాలని చెప్పింది. అంతేకాదు ఇతరదేశాలందలి స్త్రీల విద్యాభివృద్ధిని గ్రహించాలనీ, 'నరసాపుర మండలాభివర్ధనీ' సంఘము వారు బహుమాన పరీక్షలు ఏర్పరిచినారని తెలిపింది. పరీక్షలు వ్రాయటానికైనా స్త్రీ విద్యార్జన చేయాలనీ, దానికోసం పాఠశాలలను ఏర్పరచి ఉపాధ్యాయురాండ్రను నియోగించటానికి తగిన చేయూతను ఇవ్వాలని, స్త్రీ సమాజమువారు స్త్రీల విద్యావిషయంపై పాటుపడాలని పిలుపునిచ్చింది. స్త్రీ సనాతన ధర్మమండలివారు బాలికాపాఠశాలలో ఖద్దరు వర్తకాన్ని మొదలుపెట్టి మార్గదర్శకులవుతున్నారనీ, దానికి ఏకా వెంకటరత్నమ్మ మరియు ఇప్పగుంట వెంకమాంబ పూనుకున్నారనీ, విద్యవలన వివేకము, జ్ఞానం కలిగి తమను పశుప్రాయులుగా చూసే స్థితినుండి స్త్రీలు విముక్తిపొందుతారని తెలియజేసింది.

ఈమె వ్రాసిన 'స్త్రీ విద్యయెట్లున్నది దానినభివృద్ధి చేయుటెట్లు?' (ఏప్రిల్ 1912 వివేకవతి) అనే మరొక వ్యాసంలో స్త్రీవిద్య హీనస్థితిలో ఉందనీ, మైసూరు, బరోడా, మహారాజులు బాలికా పాఠశాలలు స్థాపించినా స్త్రీలు పాఠశాలకు వెళ్ళక మూర్ఖురాండ్రుగా ఉన్నారనీ, విద్యావంతులవటానికి ప్రయత్నించటం లేదనీ, తమ స్త్రీలను విద్యావంతులు చేయాలనే భావన పురుషులకే ఉండాలనీ, కొంతమంది సత్పురుషులు స్త్రీవిద్యకు పాటుపడుతున్నారని తెలిపింది. స్త్రీలు దేశభాషయైన సంస్కృతం, మాతృభాషయైన తెలుగును, రాజకీయ భాషయైన ఇంగ్లీషును నేర్చుకోవాలనీ, నాటికే చదువుకున్న మాఢభూషి చూడమ్మ, మామిడన్న కామేశ్వరమ్మ నడింపల్లి బుచ్చి వేంకటసుబ్బమ్మ, బాలాంత్రపు శేషమ్మ, గార్లపాటి సత్యవతి, దామెర్ల సీతమ్మ ఉపాధ్యాయినులుగా స్త్రీవిద్యను బోధిస్తున్నారని పేర్కొంది. గుంటూరులో 'సనాతనమండలి' వారు బాలికాపాఠశాలను స్థాపించి బోధిస్తున్నారనీ, మాగంటి వేంకటరత్నమ్మగారు దాని అభివృద్ధికి కృషిచేస్తున్నారనికూడా దామెర్ల సీతమ్మ తెలియజేసింది.

*స్త్రీలు విద్యవల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోలేకపోతున్నారని భావించింది. స్త్రీవిద్య అంటే పరీక్షలలో ఉత్తీర్ణత చెందటమేకాక ప్రయోగాత్మక విద్యలో భాగంగా బాలికలకు చేతిపనులను నేర్పి వారు తయారు చేసిన ఖద్దరును విక్రయించే వర్తకాన్ని గుంటూరులోని బాలికాపాఠశాలలో ప్రారంభించటం చాలా గొప్ప అని భావించాలి. అప్పటికింకా గాంధియొక్క ఖద్దరు, స్వదేశీదీక్షను గురించిన ప్రచారం జరగలేదనీ కూడా గుర్తించాలి. స్త్రీలకు ఉపాధివిద్యలను అందించాలని తెలియజేసి స్త్రీల విముక్తికి మార్గాలను దామెర్ల సీతమ్మ సూచించింది.*

'దామెర్ల సీతమ్మ' (మే 1911 హిందూసుందరి)ను గురించి పత్రికాసంపాదకురాలు తెలియజేస్తూ ఆమెకున్న విద్యాసక్తితో ఆమె ఇంటివద్దనే చదవటం, వ్రాయటం నేర్చుకోగలిగిందనీ,

వితంతువైన ఈమె రాజమహేంద్రవరంలో 'విద్యార్థినీసమాజాన్ని' స్థాపించి స్త్రీ విద్యాభివృద్ధికి తోడ్పడిందని పత్రిక తెలియచేసింది.

'ప్రస్తుతపు తెలుగుస్త్రీల విద్యాస్థితి' గురించి (జులై 1910 సావిత్రి) పత్రికాధిపులు వ్రాస్తూ బంగళా(బెంగాల్), పారసి, కేరళ స్త్రీలు విద్యయందు ముందంజ వేస్తున్నారనీ, తెలుగు స్త్రీలు ఆంగ్ల విద్యాభ్యాసంలో వెనకబడిఉన్నారనీ దేశభాషలో విద్యనభ్యసించటానికి తెలుగు స్త్రీలు ముందుకు వస్తున్నారని తెలిపింది. తల్లిదండ్రులు స్త్రీవిద్యా లాభాలను తెలుసుకోవటంలేదనీ, అక్షరజ్ఞానం కల స్త్రీలు పత్రికాపఠనం చేస్తున్నారనీ బాలికావిద్యకు సంబంధించిన పుస్తకాలు తగినంతగా ప్రచురింపబడటంలేదనీ, ఆంధ్ర స్త్రీలు రాజకీయ వ్యవహారంలో తాము స్వతంత్రంగా ఉండాలని పట్టుబడుతున్నారని తెలియజేసింది.

మామిడన్న కామేశ్వరమ్మ "స్త్రీవిద్య" (ఆగష్టు 1910 హిందూసుందరి)ను గురించి చేసిన ఉపన్యాసంలో స్త్రీలకు విద్యఅవసరమనీ, ఇంటినిర్వహణ, పరిశుభ్రత గురించి చక్కగా బాధ్యత వహించగలిగే స్త్రీని చూసినప్పుడు, బయట కష్టపడి యింటికి వచ్చిన భర్తకు సుఖంగా ఉంటుందని చెప్పింది. స్త్రీలలోని మూఢత్వాన్ని పోగొట్టేది విద్యఅనీ, పూర్వకాలంలో విద్యావంతులైన స్త్రీలున్నారనీ, స్త్రీలు శ్రద్ధతో చదివితే ఉద్యోగాలనుకూడా చేసుకోవచ్చనీ, నేడు మైసూరులో స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉద్యోగాలు చేస్తున్నారనీ, కలకత్తా, బొంబాయిలో ఉన్నత విద్యనభ్యసించిన స్త్రీలున్నారనీ తెలియజేసింది.

'స్త్రీవిద్య' (డిసెంబరు 1910 హిందూ సుందరి)ను గురించి స్త్రీ సనాతనధర్మమండలిలో ఈమె చేసిన ఉపన్యాసంలో పూర్వకాలంలో స్త్రీలు విద్యావంతులుగా గౌరవనీయులుగా చూడబడ్డారనీ, మధ్య యుగాలలోని పరిపాలనలో కుంటుపడినా నేడు బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పరచిన బాలికా పాఠశాలలవల్ల ఆడపిల్లలు చదువుకుంటున్నారని చెప్పింది. పల్లెల్లోని స్త్రీలు మూఢత్వంలో ఉండి నగలు, వస్త్రధారణలో పట్టణకాంతల ననుసరిస్తున్నారుగానీ వినయము వివేకాల విషయాన్ని అనుసరించటంలేదని తెలియజేసింది.

ఈమె వ్రాసిన 'హిందూస్త్రీల ప్రస్తుతస్థితి' (ఏప్రిల్ 1911 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే వ్యాసంలో పల్లెటూళ్లల్లో కూడ స్త్రీ సమాజాలు ఏర్పడటంవల్ల స్త్రీలు చదువు కుంటున్నారని, తమలో తాము ఐకమత్యాన్ని అభివృద్ధి చేసుకొంటున్నారనీ, స్త్రీలు పత్రికాధిపత్యాన్ని చక్కగా నిర్వహించగలుగుతున్నారని తెలిపింది. సభలో చక్కగా ఉపన్యసించ గలుగుతున్నారనీ, పట్టణాలలో జనానా (స్త్రీ) పాఠశాలలో స్త్రీలు బోధకురాండ్రుగా ఉన్నారనీ, పల్లెల్లో కూడా స్త్రీలు బోధకురాండ్రుగా ఉంటే స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందని తెలియజేసింది.

'పరీక్షాప్రయోజనం' (సెప్టెంబరు 1911 హిందూ సుందరి)ను గురించి ఈమె వ్రాస్తూ స్త్రీలు దురాచారములవాత బడి మూర్ఖురాలుగా మారుతూండటంతో స్త్రీలను, స్త్రీవిద్యను

అతినీచముగా మాట్లాడుతున్నారనీ, స్త్రీలు అజ్ఞానాంబుధిలోపడి మునిగి పోకుండా పరీక్షలనే నావను ఏర్పరచారని తెలిపింది. స్త్రీవిద్య అభివృద్ధి చేసుకోవటానికి పరీక్షలు అవసరమనీ, కులాంగనలే కాక సమస్త మతస్త్రీలకు పరీక్షాధికారాలనిచ్చి, స్త్రీవిద్యకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించింది.

*పల్లెల్లో స్త్రీవిద్యాభివృద్ధి జరగటానికి ఒక సాంస్కృతిక పరిష్కారాన్ని సూచించింది. స్త్రీసమాజాలు ఏర్పడాలనే ఆలోచన వచ్చిన దశాబ్దంలోపే పల్లెల్లోకూడా స్త్రీసమాజాలు ఏర్పడాలని భావించడమే స్త్రీల అభివృద్ధికి సోపానాలు వేయటంగా భావించవచ్చు. స్త్రీలు విద్యావంతులైతే పురుషుల యొక్క కష్టాలను మాన్పించగలుగుతారనీ, స్త్రీల చదువు గృహనిర్వహణకు బాగా ఉపయోగపడుతుందని భావించింది. అవసరమైతే ఉద్యోగానికిగాని, ఆర్జనకుగాని ఉపయోగ పడుతుందనీ, స్త్రీవిద్య అవసరంలేదనే పురుషుల మనస్తత్వానికి మందు వేయటంగా భావించాలి. స్త్రీల చదువేకాక స్త్రీలే పరీక్షాధికారులుగా ఉంటే స్త్రీ విద్య అభివృద్ధి జరుగుతుందని మామిడన్న కామేశ్వరమ్మ భావించటం అర్థం అవుతుంది.*

'స్త్రీవిద్య' (డిసెంబరు 1910 హిందూ సుందరి)ను గురించి స్త్రీ సనాతనధర్మమండలి సభలో ఏకా వెంకటరత్నమ్మ చేసిన ఉపన్యాసంలో మిస్ బ్రూయర్ దొరసానిగారు స్త్రీల విద్యాభివృద్ధికై అనేక ఉపాయములు చెప్పి పాఠశాలలను ప్రారంభించమని చెప్పగా తాను బాలికాపాఠశాలను గుంటూరునందు ఏర్పాటుచేసినట్లు చెప్పింది. పురుషులు కూడా స్త్రీ విద్యాభివృద్ధికై అనేక ఉపన్యాసములు ఇస్తూ స్త్రీలు విద్య నేర్చుకునే స్వాతంత్ర్యాన్ని ఇస్తున్నారనీ, పల్లెల్లో కూడా పాఠశాలను ఏర్పాటుచేసి బీదలకు, అంగవిహీనులకు, సహాయము చేస్తూ విద్యనేర్పినట్లయితే స్త్రీలలో విద్యాభివృద్ధిఉంటుందని తెలిపింది. స్త్రీలకు జ్ఞానోదయాన్ని కలిగించవచ్చనీ, నాగరికత కూడా అలవడుతుందనీ, ప్రపంచజ్ఞానాన్ని పొందుతున్నారనీ, విక్టోరియా దయాస్వభావంతో బాలికా పాఠశాలలు వెలియటంతో స్త్రీల విద్యాభివృద్ధి జరిగిందని తెలియజేసింది.

'స్త్రీలకు వోట్లు' (ఆగష్టు 1910 హిందూసుందరి) అనే పత్రికా సంపాదకురాలి ప్రచురణలో దేశదేశాలలో స్త్రీలకు 'వోట్లు' అనే నినాదాలు మ్రోగుతున్నాయనీ, ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే హక్కుకోసం స్త్రీసంఘాలు స్థాపించుకున్నారని తెలిపింది. ఆస్ట్రేలియా, కొలరెడోలో, న్యూజిలాండు దేశాలలోవలె తమకు వోటుహక్కు కావాలనీ ఇంగ్లాండులోని స్త్రీలు వోటు హక్కుకై ఉపన్యాసా లిస్తున్నారని తెలియజేసింది.

*స్త్రీలకు రాజకీయ వ్యవహారాలతో సంబంధం ఉంటుందని గుర్తించే విధంగాను, 1910 సం. నాటికే స్త్రీలు ఓటుహక్కును గురించిన ఆలోచనలను పెంచుకొనేటట్లుగాను, స్త్రీలలో రాజకీయ చైతన్యం కలిగించటం ఈ వ్యాసోద్దేశంగా అర్థం అవుతుంది. దేశస్వపరిపాలనా స్వాతంత్ర్యానికి దారితీసేవిధంగా స్త్రీలు ముందడుగు వేయటానికి తగిన చైతన్యాన్ని కలిగించే వ్యాసమిది.*

'బహుమానపు హెచ్చరిక' (ఆగష్టు1910 హిందూ సుందరి) అనే శీర్షికన మాడభూషి చూడమ్మ వ్రాస్తూ స్త్రీసమాజం ఏర్పాటుచేసిన సభలో భండారు అచ్చమాంబ గురించి చేసిన ఉపన్యాసంలో భాగంగా అచ్చమాంబ 1874లో జన్మించినదనీ ఆమె సంచరించిన ప్రతి ప్రదేశంలోను స్త్రీ సమాజాలను నెలకొల్పి స్త్రీవిద్యకు కృషిచేసిందని చెప్పింది. అబలాసచ్చరిత్ర రత్నమాల అనే గ్రంథాన్ని వ్రాసి దేశాభిమానాన్ని ప్రకటించుకున్నదనీ, స్మృత్యర్థం ఆమెపేర 'బంగారు పతకం' ఏర్పాటుకావింపబడిందని తెలియజేసింది. స్త్రీవిద్యకు ప్రోత్సాహకాలను తెలుపుతూ పరీక్షలో ఉత్తమస్థాయిలో ఉత్తీర్ణులు కావల్సిందనీ కూడా తెలియజేసింది.

ఈ సభలోనే భండారు అచ్చమాంబను గురించి మాడభూషి చూడమ్మ ఉపన్యసిస్తూ చెప్పిన కవితలో

*"తిరిగినచోటెల్ల స్త్రీ సమాజంబుల నెలకొల్పుచుండెదు నెలతమిన్న*
*యాంధ్ర జాతికి యొక్క భూషణంబయి యలరుచునుండెదును*
*సాధ్విలలామల చారిత్ర రత్నముల్ హారమ్ముగూర్చిన యతుల చరితయ*
*ని తన్నునందరుగొనియాడవెలసిన యట్టి శ్రీ భండారు అచ్చమాంబ*
*నీదునాజ్ఞల చెల్లించి నిష్కళంక నీతిఁదా జరియించినరీతి నెల్ల*
*తెలుపనిను జేరవచ్చెనో దేవదేవ సకల కల్యాణగుణధన్యసర్వమాన్య"* అని స్తుతిస్తూ..

భారతదేశంలో స్త్రీల దుస్థితిని తొలగించటానికి అచ్చమాంబ వ్రాసిన 'అబలాసచ్చరిత్ర రత్నమాలయే' ఉపయోగకరంగా ఉంటుందనీ,

*"దేశాభిమానంబు తెల్పుటకోయన దేశచరిత్ర తెలుగు వ్రాసె*
*భాషాభిమానంబు బ్రకటించుటకోయన దెలుగు బుస్తకమాల తేటనొసగె*
*స్త్రీవిద్య తన నెంతో ప్రీతికరంబంచు భగిని పేరను పతకంబొసగె"* అని తెలియజేసింది.

మాడభూషి చూడమ్మ 'కందుకూరి రాజ్యలక్ష్మి జీవితాన్ని' (సెప్టెంబరు 1910 హిందూ సుందరి) గురించి వ్రాస్తూ రాజ్యలక్ష్మికి 8 ఏండ్ల ప్రాయంలోనే పెళ్ళిచేసినా భర్త కందుకూరి వీరేశలింగంగారు అక్షరాభ్యాసంచేయించి ఇంటిచదువు నేర్పించటంవల్ల గ్రంథపఠనం చేయగలిగిందనీ, తోటి స్త్రీల విద్యకై విద్యార్థినీ సమాజాలను పునరుద్ధరించిందని తెలిపింది. వితంతు వివాహాలపట్ల భర్తకు సహచరిగా నిలిచిందనీ చెబుతూ భర్తల ప్రోత్సాహం ఉంటే వివాహితస్త్రీలు కూడా చదువకోవచ్చనీ తెలియజేసింది.అంతేకాక, రాజ్యలక్ష్మి వలె స్వదేశవస్తు ప్రీతిని, స్వతంత్ర భావాలనూ కలిగి యుండటమే జీవిత ధన్యతగా పేర్కొంటూ స్త్రీలలో సామాజిక స్పృహను రేకెత్తించటం జరిగింది.

'బాలాంత్రపు శేషమ్మగారు' (నవంబరు1910 హిందూసుందరి) గురించి ఈమె వ్రాస్తూ శేషమ్మ 1878లో పుట్టిందనీ స్త్రీవిద్య అంటే చెవులుమూసుకునే కాలంలో రాజమండ్రిలో

విద్యాభ్యాసం చేసిందనీ పత్రికలో స్త్రీవిద్యను గురించి వ్యాసాలు వ్రాసిందని తెలిపింది. కాకినాడ శ్రీవిద్యార్థినీసమాజానికి సహాయకార్యదర్శిగా ఉన్నదనీ, విద్యాధికురాలుగా పరోపకారం చేస్తూ దేశాభివృద్ధి కార్యములు చేసిందని తెలిపింది. ఆమెకు చిన్నతనంలోనే తండ్రి పోవటంచేత అక్కా బావగారింట ఉండి నాల్గవ తరగతి వరకు చదివిందనీ, ఇంటి దగ్గరే భారత గ్రంథ పఠనం చేసిందనీ, ఆమె బావగారు తాను పనిచేసే స్కూళ్ళల్లోని మరొక ఆంగ్లవిద్యను అభ్యసిస్తున్న అతనితో ఈమెకు వివాహం చేసారని చెప్పింది. భార్యాభర్తలిద్దరూ కరుణ హృదయులగుటచే ఈమె స్త్రీవిద్య, వితంతు ఉద్ధరణకై పూనుకోవాలని భావించిందనీ, శేషమ్మ కాకినాడలో 'విద్యార్థి సమాజ' సభ్యురాలుగా ఉంటూ మంచిమంచి ఉపన్యాసాలు ఇచ్చి స్త్రీ విద్యను ప్రోత్సహించిందని తెలియజేసింది.

*విద్యావంతులైన స్త్రీలు సాంఘిక సంస్కరణ కార్యక్రమాలకు పాటుపడ్డారు అనే దానికి నిదర్శనమిది. 1901-02 నాటికి తెలుగు ప్రాంతాలలో విద్యనేర్చిన 1 శాతం స్త్రీలలో ఈమె కూడా ఒకరని అర్థం అవుతోంది.*

గుంటూరు సభలో 'ఆంధ్రవార్తాపత్రికల ప్రచారము' (నవంబరు 1910 హిందూ సుందరి) ను గురించి మాడభూషి చూడమ్మ చేసిన ఉపన్యాసంలో భాగంగా వార్తాపత్రికలవల్లనే స్త్రీలు విశేషజ్ఞానాన్ని సంపాదిస్తూన్నారనీ, స్వల్ప విద్యావంతులుగా కూడా పత్రికలకు వ్యాసాలు వ్రాయగలుగుతూన్నారని చెప్పింది. దేశాభిమానంతో విద్యాభివృద్ధియే ప్రయోజనంగా కొన్ని పత్రికలు ప్రచురింపబడుతున్నాయనీ, స్త్రీలచే నడపబడే హిందూసుందరి, సావిత్రివంటి, పత్రికలలో స్త్రీల వ్యాసాలు ఉంటాయనీ, స్త్రీలు చదువుకోవటం తప్పని భావించిన జానపదులు కూడా తమ భార్యాబిడ్డలచేత పత్రికలను చదివింపజేస్తున్నారనీ, ఖండాంతర విశేషాలను తెలుసు కొంటున్నారనీ, పత్రికలను పోషించుట పురుషార్థంక్రింద భావించాలని తెలియజేసింది.

'కళ్ళేపల్లె వెంకటరమణమ్మ' (డిసెంబరు 1910 హిందూ సుందరి) ను గురించి ఈమె వ్రాస్తూ పండిత పుత్రిక అగుటచే ఈమె బాల్యమునుండి సద్గ్రంథ పఠనం చేసిందనీ, వివాహానంతరం భర్తకు స్త్రీవిద్య, స్త్రీలంటే గౌరవభావం ఉండటంచేతనే ఈమెను పాఠశాలకు పంపి చదివించారని తెలిపింది. ఆమె అత్తింట్లో విశేషవిద్యను సంపాదించిందనీ, సంగీతాన్ని నేర్చుకుందనీ, మామగారు ఈమెకు శాస్త్రజ్ఞానం తెలియజేసి కవిత్వంచెప్పే సామర్థ్యాన్ని కలిగించారని చెప్పింది. చక్కగా ఉపన్యాసాలిచ్చేదనీ శశిరేఖ, హిందూసుందరి, కృష్ణాపత్రికకు వ్యాసాలు వ్రాసిందనీ, తెలుగు స్త్రీల మూఢాచారములను నివారణామార్గాలను గురించి వ్యాసాలు వ్రాసిందని తెలిపింది. నర్సాపురంలోని విద్యార్థినీ సంఘపరీక్షలకు విచారణాధికారిగా సేవ చేసిందనీ, కాకినాడలో విద్యాభివృద్ధిని గురించి చక్కటి ఉపన్యాసాలను ఇచ్చిందని తెలియజేసింది.

*విద్యవల్ల సృజనాత్మక శక్తిని, నిర్వహణాసామర్థ్యాన్ని పెంచుకొన్న ఆధునిక తెలుగు స్త్రీకి నమూనాగా ఈమెను గురించి చెప్పటం జరిగింది.*

మాడభూషి చూడమ్మ వ్రాసిన 'శాస్త్రములు స్త్రీలకవశ్యకమా' (మార్చి 1911 హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీలకు 14సం.లోపే శాస్త్రజ్ఞానాన్ని పాఠశాలలో తెలియజేయాలనీ, స్త్రీలు జ్ఞానవంతులైతే పిల్లలను తెలివిగలవారిగా పెంచుతారనీ, ముఖ్యంగా స్త్రీలకు శారీరకశాస్త్ర పరిజ్ఞానం అవరసమనీ తెలియజేసింది. స్త్రీవిద్యలో ప్రధానమైనది శాస్త్రవిజ్ఞానసముపార్జన అనీ అది కుటుంబ, సామాజిక అభివృద్ధికి అవసరమనీ తెలియజేసింది.

'ఎవరెక్కువ స్త్రీలా? పురుషులా?' (ఏప్రిల్ 1911 ఆంధ్రపత్రిక ఉగాది వార్షిక సంచిక) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ జ్ఞానాభివృద్ధిలోనూ, గృహాది విషయాలలోనూ స్త్రీ పురుషులు సమాన గౌరవ స్వాతంత్ర్యంతో ఉండాలని చెప్పి స్త్రీలుగానీ పురుషులుగానీ ఒకరికంటే ఒకరు ఎక్కువకాదని తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'నీతివిద్య బోధించుటకు జాతిమతము లావశ్యకమా'? (జులై 1911 హిందూసుందరి) అనే మరొక వ్యాసంలో మానవజీవిత చరిత్రలో మానవులు వేదాలను, శాస్త్రాలను రచించి నాగరికతతో రాజ్యాలను ఏర్పరచారనీ, అప్పుడే వర్ణవ్యవస్థ ఏర్పడిందనీ, చేసేవృత్తులను బట్టి కులాలుగా ఏర్పడినా పర్పస్పరం వైవాహిక సంబంధాలు ఏర్పరచుకున్నారని తెలిపింది. రామానుజులవారు పంచములను గుడిలోకి వచ్చి తీర్థప్రసాదాలు తీసుకునేటట్టు చేశారనీ, జగన్నాథక్షేత్రంలో మంగలికులం వారు ప్రసాదాన్ని తెస్తారని చెప్పింది. సంస్కర్తలు జాతిని చూడక నీతిని బోధిస్తారనీ, 'కురళ్' అనే గ్రంథం వ్రాసిన తిరువళ్ళువర్ అనే మాలవానిని రాజు తన సంఘంలో చేర్పించుకొన్నాడనీ, నీతివిద్య బోధింపబడితేనే దేశమభివృద్ధి చెందుతుందనీ, ఏజాతి, మతములవారైనను స్త్రీలకు నీతివిద్యను బోధించాలని మాడభూషి చూడమ్మ తెలియజేసింది.

*అక్షరాస్యత అభివృద్ధిచెందిన స్త్రీలు పత్రికాపఠనం ద్వారా ప్రపంచాన్ని అవగాహనచేసుకునే స్థితిని చేరుకోవటం అర్థంఅవుతుంది. అంతేకాక పత్రికలను స్త్రీలు నడుపుతున్నారనీ పత్రికా పోషణను ఒక పురుషార్థంగా భావించాలని చెప్పి పత్రికలకున్న ప్రాధాన్యతను తెలియజేసింది. నాడైనా నేడైనా ప్రజలకు ప్రపంచజ్ఞానాన్ని అందించగలిగేది పత్రికారంగమే. స్త్రీల చదువు, ఉన్నతవిద్యతో పాటు స్త్రీలకు శాస్త్రవిజ్ఞానం అవసరమనీ, అది దేశాభివృద్ధికి అవసరమని భావించింది. స్త్రీలు తమకు పురుషులతోపాటు సమాన స్వాతంత్ర్య గౌరవాలు ఉండాలనే భావన వారిలో కలిగేటట్లు ఆలోచింపజేసే విధంగా చైతన్యాన్ని కలిగించటం జరిగింది.*

*ప్రజాస్వామిక దృక్పథానికి పాదులు వేయటం స్పష్టమయింది. నీతివిద్య నిమ్నజాత్యోద్ధరణ జాతిసంస్కారాన్ని తెలియజేస్తుందనీ, అదే దేశాభివృద్ధికి ముఖ్యమని భావించింది. అప్పటికింకా గాంధీ వచ్చి హరిజనోద్ధరణను ప్రబోధించటానికి ముందే విద్యావంతులైన స్త్రీల ఆలోచనలలో అభివృద్ధికర పరిణామం కలిగిందనేదానికి నిదర్శనము ఈ వ్యాసం. స్త్రీపురుషసమాన స్వాతంత్ర్య గౌరవాలు, సాంఘిక న్యాయం ఉండాలని మాడభూషి చూడమ్మ ఆశించింది.*

'పూర్వస్త్రీల ఔన్నత్యం' (ఆగష్టు 1910 హిందూసుందరి) గురించి బాలంత్రపు శేషమ్మ వ్రాస్తూ వేద, పురాణకాల స్త్రీలలో విద్యావంతులు ఉన్నారనీ, నేడు ఆనందీబాయి, వెంకట సుబ్బమ్మవంటి మరికొంతమంది విద్యావంతులైన స్త్రీలున్నారనీ, ఇంకా స్త్రీవిద్యఅభివృద్ధి చేయబడాలని తెలియజేసింది. కాబట్టి స్త్రీలకోసం స్త్రీ విద్యాభివృద్ధికి పరీక్షలు పెడుతున్నారని తెలియజేసింది.

'నవీనోద్యమము' (మార్చి 1914 హిందూసుందరి)ను గురించి ఈమె వ్రాస్తూ నూతన ధర్మాలతో కార్యక్రమాలను చేయు ఉద్యమంద్వారా నూతన వికాసము కలిగే విధంగా స్త్రీసమాజాలు స్థాపించి విద్యను, చేతిపనులను స్త్రీలకు నేర్పిస్తూ సభలను నిర్వహించాలని తెలిపింది. ఊరూరా తిరిగి బాలికలకు విద్యనేర్పింపమని బోధించాలనీ, బాలికావిద్యతో పాటు వితంతువిద్యను ప్రోత్సహించేలా జాతీయవిద్యను నేర్పించటానికి బులుసు సూరమ్మగారు కృషిచేస్తున్నారనీ, స్త్రీలసంఘాలు మరికొన్ని నూతన ఉద్యమాలను ప్రారంభించాలని తెలియజేసింది.

*స్త్రీలవిద్యాభివృద్ధి మార్గాలను అన్వేషించే క్రమంలో పరీక్షలుపెట్టాలనీ, స్త్రీసమాజాల ద్వారా స్త్రీలకు విద్యను, చేతిపనులను నేర్పించాలనీ, నూతన ఉద్యమం రావాలని బాలాంత్రపు శేషమ్మ సూచించారు.*

బాలాంత్రపు శేషమ్మ, బొమ్మనపు వెంకటరత్నమ్మ కార్యదర్శినులుగా నిర్వహించిన అష్టమాంధ్ర మహిళాసభా విశేషాలను వారు తెలియజేస్తూ (జూన్ 1917 హిందూసుందరి) సభలో 17 తీర్మానాలు చేసారని తెలిపింది. స్త్రీలకు విశ్వవిద్యాలయాలు ఉండాలని విద్యాపరీక్షలు పెట్టాలనీ, వారిలో నెగ్గినవారిని గవర్నమెంటు స్కూళ్ళలో బోధకురాండ్రుగా నియమించే ప్రయత్నాలు చేయాలనీ, సమప్రాధాన్యంగల స్త్రీ పురుషులుంటేనే సంఘం, దేశం అభివృద్ధి చెందుతుందనీ, దానిని మహిళాసభలవల్ల కొంతవరకు సాధించాలని చెప్పింది. ఐరోపావారు యుద్ధ విషయాలను గ్రహిస్తే భారతీయులు బ్రిటిష్ వారికి బాసటగా ఉన్నారని అర్థం అవుతోందనీ, వేదకాలంనాటి స్త్రీల గౌరవ స్వాతంత్ర్యాలు తిరిగి బ్రిటిష్ ప్రభుత్వంలో తలలెత్తుతున్నాయనీ, స్త్రీలు కూడా తాము చదువుకోవాలనే జిజ్ఞాసను పెంచుకొంటే స్త్రీవిద్యకు చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయనీ తెలియజేసింది.

*1917లోనే స్త్రీల కోసం విశ్వవిద్యాలయాల స్థాపన జరగాలని సభలో తీర్మానించటం విశేషం.*

'హిందూస్త్రీల ప్రస్తుతవిద్యాస్థితి'ని (అక్టోబరు,1910 సువర్ణలేఖ) గురించి జె.సి.బోసు దొరసాని గారు ఉపన్యసిస్తూ భారతదేశంలో సంఘనిర్మాణానికి స్త్రీలు పురుషులు కలిసి పనిచేయాలనీ, ప్రస్తుతనాగరికతకు అనుకూలంగా స్త్రీలు మార్పును, సర్దుబాటు చేసుకోవాలని చెప్పింది. స్త్రీలకు దేశభాషలలో విద్యాబోధన జరుగుతోందనీ, పశ్చిమదేశ స్త్రీలకున్న వస్తునిర్మాణ శక్తిని, అన్యదేశవిద్యాకౌశలాన్ని స్త్రీలు గ్రహించాలనీ, వితంతుస్త్రీలకు పునర్వివాహాలు జరిపించాలనీ, సంఘీభూతంగా స్త్రీలు ఉండాలని తెలియజేసింది.

ఈ 'స్త్రీసనాతనధర్మమండలి' సభలోనే పా. కృష్ణవేణమ్మ చేసిన ఉపన్యాసంలో ఊరిలోని మిషనరీవారు బోర్డింగు హైస్కూలు శంకుస్థాపనకు ఆహ్వానించగా తాను వెళ్ళినపుడు అక్కడ వారియొక్క దేశభక్తికి అచ్చెరువొంది వారి నాగరికతను గుర్తింపలేని అశక్తతకు సిగ్గు కలిగిందని తెలిపింది. విద్యార్థినులు, నాగరికతను ఏర్పరచుకోవాలనీ, సద్గ్రంథపఠనంచేసి హిందూమత ధర్మాల ప్రకారంగా పాఠశాలలను ఏర్పాటు చేసుకోవాలనీ, పురుషులు మాత్రమే విద్యనభ్యసించే స్వదేశాభిమానం ఉండకూడదని చెప్పింది. ప్రతిమండలంలో స్త్రీలచే స్థాపింపబడే స్త్రీసనాతన ధర్మమండలి అనే బాలికాపాఠశాలకు అందరూ చేయూత నొసగి స్త్రీ విద్యాభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందని తెలియజేసింది.

*స్త్రీవిద్యను స్త్రీల నాగరికత చిహ్నంగా భావించటం మొదలైంది. స్త్రీల అభివృద్ధికై జరిగే సంస్కరణోద్యమంలోని స్త్రీల ఆచరణాత్మకతకు మచ్చుతునక ఈ వ్యాసం. స్త్రీలవిద్య అనేది నాగరికతగాను, స్వదేశాభిమానానికి ప్రేరణశక్తిగాను గుర్తించటం జరిగింది.*

'బృందావనపుర స్త్రీసమాజం' (జనవరి 1911 సావిత్రి) ను గురించి పత్రికాధిపురాలు వ్రాస్తూ బందరులో 1902లో భండారు అచ్చమాంబచేత స్త్రీసమాజం స్థాపింపబడిందని అది పురస్త్రీల విద్యాభివృద్ధికి తోడ్పడుతోందని, అటువంటి స్త్రీసమాజాలు ప్రతిగ్రామంలో కూడా స్థాపిస్తే స్త్రీల విద్య అభివృద్ధి చెందుతుందని తెలియజేసింది. తరువాత పులుగుర్త లక్ష్మీనరసమ్మ సమాజాశీర్వాద పద్యములను చదువుతూ తన కవితలో స్త్రీసమాజాల లక్ష్యాలను పేర్కొంటూ

*"తనదేశ సోదరీతతికినీసంఘంబు – విద్యాభివృద్ధి గావించుగాక*
*తనదేశ సోదరీతతికినీసంఘంబు – సుజ్ఞానబోధంబుఁజొన్పుఁగాక*
*తనదేశ సోదరీతతికినీసంఘంబు – పాత్త్రానగూర్చి పెంపొందుఁగాక*
*తనదేశసోదరీతతికినీసంఘంబు – కార్యశూరత్వంబుగఱపుగాక"*

అంటూ... స్త్రీసమాజాల ప్రయోజనాలను, సమాజాశయాలనుచెప్పి స్త్రీలకు అవసరమైన కార్యశూరత్వాన్ని కవితలో వెలువరించటం అర్థమవుతోంది.

'సోదరి' అనే పేరుతో వ్రాసిన 'నవీన నారీరత్నాలు' (జనవరి1911 హిందూసుందరి) అనే వ్యాసంలో బరోడా, విజయనగరం, కురుపాం రాణుల పేర్లను పేర్కొని వారు అభివృద్ధి చేసిన స్త్రీవిద్య, చేతిపనులు దేశాభివృద్ధికి ముఖ్యధనమని తెలియజేసింది. ఆంధ్రదేశంలో బుర్రాబుచ్చి బంగారమ్మ, గొల్లకోట సూరమ్మ, బులుసు సూరమ్మ, సీతమరాజు నర్సమాంబ, పులుగుర్త లక్ష్మీనరసమ్మ, ఏకా వెంకటరత్నమ్మ, యిప్పకుంట వెంకమాంబ, కొటికలపూడి సీతమ్మ, దామెర్ల సీతమ్మ, కళ్ళేపల్లి వేంకటరమణమ్మ, మోటుపల్లి రామాబాయమ్మ, మొసలిగంటి రామాబాయమ్మ వంటి వారు స్త్రీ సమాజాలను నెలకొల్పుతూ బాలికావిద్య, స్వదేశీబట్టల తయారీని నేర్పుతున్నారని ప్రశంసించింది. ఆ నారీరత్నాలు స్వతంత్ర జీవనేచ్ఛగలవారగుటచే స్త్రీలకు

ఉపయోగపడే పనులు చేస్తున్నారనీ తెలియజేసింది. దానికి అనుబంధంగా నాటి పత్రికాధిపురాలు మరికొంతమంది స్త్రీలను పేర్కొంటూ బాలంత్రపు శేషమ్మ, మాడభూషి చూడమ్మ, పి. లక్ష్మీకాంతమ్మ, జూలూరు తులశమ్మ, దేవదారు సీతమ్మ, చొప్పనమాణిక్యాంబ, చిలుకూరి వెంకట రత్నమాంబ, పిల్లలమర్రి కామేశ్వరమ్మ, కె. అలమేలుమంగమ్మ వంటి మరికొంతమంది నారీరత్నాలున్నారని తెలియజేసింది.

*స్త్రీల అభివృద్ధికై పాటుపడ్డ నాటి నారీరత్నాలను స్మరించుకునేటట్టు చేసింది. స్త్రీసమాజాలలో నేర్పుతున్న స్త్రీవిద్య, స్త్రీలవృత్తివిద్యలు దేశాభివృద్ధికి అవసరమనిభావించి, దేశ ఆర్థికవ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యానికి గుర్తింపు కలిగేలా అడుగులు వేయటం స్పష్టమవుతుంది.*

పిళ్ళారిసెట్టి లక్ష్మీకాంతమ్మ విజయనగరమండలి సత్యసంవర్ధనీ సమాజపు సభలో 'విద్యావశ్యకత' (జనవరి 1911 హిందూసుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో పురుషులకు వలె స్త్రీలకు విద్యఅవసరమనీ, బిడ్డలు తెలివిగలవారుగా తయారవ్వాలంటే స్త్రీవిద్య అవసరమనీ, కందుకూరి హిందూకాంతలకు పాఠశాలను ఏర్పాటుచేసారని చెప్పింది. కొటికలపూడి సీతమ్మ విద్యావంతురాలనీ, పులుగుర్తు లక్ష్మీనరసమాంబ 'సావిత్రి' పత్రికాధిపురాలుగా, శ్రీమతి మొసలిగంటి రామాబాయమ్మ 'హిందూసుందరి' పత్రికాధిపురాలుగానూ పత్రికకు వ్యాసాలు వ్రాస్తున్నారనీ, వ్యాసాలను ప్రచురిస్తున్నారని తెలిపింది. స్త్రీలు చదువుకోవటం చేతనే వైద్యం నేర్చుకొని శిశువుల దేహారోగ్యాలను గురించి అర్థంచేసుకుంటున్నారనీ, స్త్రీల చరిత్రలను చదువుకొని స్త్రీల శక్తిసామర్థ్యాలను అర్థం చేసుకుంటున్నారనీ, తమ బిడ్డలను చదివించగలుగుతున్నారనీ చెప్పింది. ఆ సభలో న్యాయపతి విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ స్త్రీ పురుషులకు లింగభేదమేగానీ, జ్ఞానభేదం లేదనీ, పురుషులుతోపాటు కొందరు స్త్రీలుకూడ స్త్రీవిద్య అనర్థదాయకమంటున్నారని చెప్పటం వారి మూఢత్వానికి నిదర్శనమని తెలియజేసింది.

*జ్ఞానానికి లింగవివక్షలేదనే భావనయే స్త్రీలఅభివృద్ధికి మూలమైన విషయంగాను, స్త్రీలు తమ శక్తి సామర్థ్యాలను గుర్తించగలిగేటట్లుగా చైతన్యపరచటం స్పష్టమవుతుంది. స్త్రీవిద్యా ఫలితాలను తెలియజేసింది.*

సత్యసంవర్ధినీసమాజ సభలో (జనవరి 1911 హిందూసుందరి) గుండాల సుభద్రమ్మ చేసిన ఉపన్యాసంలో, ఇప్పటిస్త్రీలు చదవను, వ్రాయను చేయగలిగేంత వరకు చదవగలిగితేచాలని అనుకుంటున్నారుగానీ, ఆ స్థాయి విద్యకూడా ప్రభుత్వంపెట్టిన బాలికాపాఠశాలలను నెలకొల్పటం చేత వీలయిందని చెప్పింది. ఆడపిల్లలు మగపిల్లల మధ్య తేడా కన్పించటానికి ఆడపిల్లలకు విద్యను నేర్పించకపోవటమేననీ, స్త్రీలను చిన్నతనంలో చదివించగలిగితే పురుషులతోపాటు తెలివితేటలు గలవారిగా స్త్రీలు భావింపబడేవారనీ, కాబట్టి స్త్రీలు విద్యను అభివృద్ధి చేసుకొంటేనే స్త్రీ పురుషులు సమానంగా చూడబడతారని తెలియజేసింది.

*విద్యావిషయంలో స్త్రీల పెంపకంలోని తేడాను ఆనాడే స్త్రీలు గుర్తించారు. స్త్రీవిద్యపట్ల గల సామాజిక సంస్కృతిలోని లింగవివక్షను తెలియజేస్తూ విద్యావంతులైన స్త్రీలు తోటి స్త్రీల విద్యకు కృషిచేయాల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

'బృందావనపుర స్త్రీసమాజము' (జనవరి 1911 సావిత్రి)ను గురించి పత్రికాధిపురాలి ప్రచురణలో భండారు అచ్చమాంబచే బృందావనపుర స్త్రీసమాజమును నవంబరు 1902లో స్థాపింపబడి పునరుద్ధరింపబడినదని తెలిపింది. ధనికుల సహాయంతో 300 పుస్తకాలుగల గ్రంథాలయాన్ని స్థాపించారనీ, చదువుకుంటున్న బాలికులకు బహుమతి ఇస్తున్నారనీ, ప్రస్తుతము ఈ సమాజాన్ని వల్లూరు పార్వతమ్మ, వేమూరి వరలక్ష్మమ్మ, మోటుపల్లి రామాయమ్మ నడిపిస్తున్నారని తెలియజేసింది.

అనాసవరపు సీతారావమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (ఫిబ్రవరి 1911 హిందూ సుందరి) అనే వ్యాసంలో ప్రతి ఊళ్ళో స్త్రీలసభలు పెట్టటంతో స్త్రీలమధ్య అన్యోన్య స్నేహం ఏర్పడిందనీ, పురుషుల వలె స్త్రీలు తమ బుద్ధిని అనేక విషయాలలో ఉపయోగిస్తున్నారని తెలిపింది. మహారాష్ట్ర చరిత్రలో స్త్రీలు రాజకీయ విషయాలను, రాజ్యభారాన్ని వహించి ప్రజలకు సౌఖ్యహేతువయ్యారనీ, వారిలో అహల్యాబాయిని అందరూ మరిచిపోరనీ, విదేశాలలో స్త్రీలు విద్యనభ్యసిస్తున్నారనీ జన్మసాఫల్యాన్ని పొందుతున్నారని చెప్పింది. స్త్రీలను సాధ్యమైనంత వరకు చదివింపజేసి సంసారంలో నుండు కష్టసుఖాలను బోధపరచి సుఖజీవనాన్ని గడపటానికి ముఖ్యసాధనం స్త్రీవిద్య అని తెలియజేసింది.

*స్త్రీవిద్యవల్ల స్త్రీలు సభలను ఏర్పాటుచేసుకొని వారిమధ్య స్నేహసంబంధాలు అభివృద్ధి చెందటానికి బాటలు వేస్తాయని చెప్పటం, స్త్రీసమాజాలవల్ల కలిగిన ఫలితాలు నిరూపితమవు తున్నట్టు అర్థం అవుతుంది.*

పెనుగొండ తాలూకాలోని కొత్తచెర్వులో జరిగిన సంఘసంస్కరణ సభలో కమ్మ చిన్నారప్ప వెంకమ్మ స్త్రీ పురుషులను సంబోధిస్తూ 'స్త్రీ విద్య'ను (మార్చి 1911 హిందూసుందరి) గురించి చేసిన ఉపన్యాసంలో భాగంగా స్త్రీలకు విద్యలేనందువల్ల కలిగే మూఢత్వానికి ప్రతీకారం ఆలోచించలేకపోతున్నారనీ, భండారు అచ్చమాంబ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ విద్యావంతులుగా ప్రశస్తి పొంది ఉన్నారనీ, విద్యాదేవత సరస్వతి కాబట్టి, పురుషులకంటే స్త్రీలకే చదువుకునే హక్కు ఎక్కువగా ఉందని చెప్పింది. స్త్రీవిద్య హిందూధర్మశాస్త్ర సమ్మతమనీ, కుటుంబంలోని స్త్రీలను చదివించక మూఢులుగా పురుషులు తయారు చేస్తున్నారు కాబట్టి అపకీర్తి పురుషులకే వస్తుందని హెచ్చరించింది.

*స్త్రీల విద్యాహక్కును ప్రతిపాదించటం జరిగింది. స్త్రీలు తమ విద్యాహక్కుల చైతన్యాన్ని పొందటమే స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై చేరుకొనే మార్గం.*

ఇదే సభలో ఆడికాసుల కొల్లాపూర్ణమ్మ ఉపన్యసిస్తూ స్త్రీలు గృహకృత్యానంతర విరామ సమయంలో మంచిగ్రంథాలు చదువుకోవటానికి విద్య అవసరమనీ, సద్గుణవతియైన స్త్రీలు విద్యతో

మరింతగా ప్రకాశిస్తారనీ, అజ్ఞానులు స్త్రీలకు విద్యకూడదని పలికేపలుకులను పట్టించు కోకుండా ఉండాలని చెప్పింది. విద్యావంతులైన రష్యా, జపాన్, జర్మనీ, బరోడా దేశస్త్రీలు అక్కడి పురుషులకు సహకరించి అభివృద్ధిని పొందుతున్నారన్న విషయం తెలియటంవల్లనే బ్రిటిష్ దొరతనం భారతదేశంలో బాలికాపాఠశాలలను స్థాపించిందని తెలిపింది. పురుషులకువలె స్త్రీలకు విద్యా వివేకములు నేర్పించి స్త్రీలుచేసే గృహకృత్యాలలో పురుషులు సహాయపడవలసిన అవసరాన్ని తెలియజేసింది.

*కుటుంబ సంబంధాలలో పనివిభజనను స్త్రీ, పురుషులు పరస్పరం పంచుకోవాల్సిన అవసరాన్ని నాడే స్త్రీలు తెలియజేసారు.*

కొటికలపూడి సీతమ్మ 'స్త్రీ ఉన్నత విద్య' (ఏప్రిల్ 1911 హిందూసుందరి) ను గురించి వ్రాస్తూ ఐహిక సంబంధములైన గృహకృత్య నిర్వహణ, శిశుపోషణం, బంధుప్రీతి వంటి ధర్మాలను నెరవేర్చాలంటే స్త్రీలకు ఉన్నత విద్య అవసరమనీ, దానికై ఉన్నత విద్యాలయాలు స్థాపించాలని తెలిపింది. ఉన్నితవిద్యవల్ల ఐకమత్యం, పరోపకారం, శిశుపోషణం, దేహపరిశ్రమలు, కాలవినియోగం వంటి విషయాలపై స్త్రీలకు గౌరవము కలుగుతుందని, అప్పుడే వారిలో దేశాభివృద్ధి, స్వజాత్యభివృద్ధివంటి భావాలు పెరుగుతాయనీ, బాల్యవివాహ నివారణయే దేశోన్నతికి బాటలు వేస్తుందని తెలియచేసింది.

*స్త్రీల కుటుంబధర్మ నిర్వహణకు ఉన్నతవిద్య అవసరమనీ, అదే దేశోన్నతికి కారకం అవుతుందని స్త్రీల కుటుంబధర్మాలను తెలియజేసింది.*

కాకినాడలో జరిగిన 'ఆంధ్ర మహిళా సభ'కు (ఏప్రిల్ 1911 సావిత్రి పత్రికలో) అధ్యక్షత వహించిన కళ్ళేపల్లె వేంకటరమణమ్మ చేసిన ఉపన్యాసంలో స్త్రీలు కాలమును వ్యర్థపుచ్చక దేశాభ్యుదయాన్ని గురించి ఆలోచించాలనీ, స్త్రీలకు ఉన్నతవిద్య యొక్క ఆవశ్యకత ఏర్పడిందని తెలిపింది. స్త్రీలు భౌతిక, ఆధ్యాత్మిక విద్యలను నేర్చుకోవాలనీ, మాతృభాషలో బోధన జ్ఞానసముపార్జనకు ఉపయోగపడుతుందనీ, స్త్రీలు కర్మవిద్యలయిన వృత్తి విద్యలను, కళలను కూడా అభ్యసించాలనీ, దేశ ప్రకృతిని అవగాహన చేసుకునే జ్ఞానం స్త్రీలకు అవసరమని చెప్పింది.

ఈమెయే వ్రాసిన 'హిందూ దేశాభ్యుదయానికి స్త్రీలెట్లు తోడ్పడగలరు' (1911 ఏప్రిల్ 12 తేదీ ఆంధ్రపత్రిక వార్షిక సంచిక) అనే వ్యాసంలో దేశంలో బాలికావివాహాలవల్ల స్త్రీలు స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, పురుషుల చేతిలో కీలుబొమ్మలవలె మారి దాసీలుగా బ్రతుకుతున్నారనీ, స్త్రీలలో ఈ మూఢత్వం పోవాలని తెలిపింది. స్త్రీలకు ఉన్నతవిద్య ఉండాలనీ, దేశాభ్యుదయం కోరేవారు బాలికా వివాహాలను నిరుత్సాహపరచాలనీ, ఉన్నత విద్యావంతులైన స్త్రీల తోడ్పాటు దేశాభ్యుదయానికి కారకం అవుతుందని తెలియజేసింది.

'ఆంధ్ర స్త్రీలస్థితి' (ఏప్రిల్ 1912, ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ బాలికా వివాహాలవల్ల స్త్రీ విద్య కుంటుపడిందనీ, సంఘము యొక్క సృష్టి, స్థితి,

లయలకు కారకురాలు స్త్రీ అంటూ, స్త్రీ సంఘము ఏర్పడి స్త్రీవిద్యను ప్రోత్సహిస్తుంటే పూర్వచారపరాయణులు వారిని దూషిస్తున్నారనీ, దానివల్ల సంఘాభివృద్ధి జరగదని తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'స్త్రీవిద్యకు భంగకరమగు వైవాహికధర్మములు, వానిని తొలగించు నుపాయములు' (మే 1912 హిందూసుందరి) అనే మరొక వ్యాసంలో వైవాహిక సంబంధ బాంధవ్యములు శాశ్వతంకాదనీ, పరలోకానికి వెళ్ళేటప్పుడు వెంటరావని తెలియజేస్తూ, వివాహం మాత్రము స్థిరమైనది, శాశ్వతమైనది అని మధ్యకాలంలో వాళ్ళు చెప్పిన విషయాలేగానీ, వేదాలు చెప్పినవికావని తెలిపింది. యుక్తవయస్సు వచ్చినవారికి వివాహము జరగటంగాని లేదా బ్రహ్మచారిణులుగా వారు ఉండటం జరిగేదనీ, అవసరమైతే పునర్వివాహం చేసుకునేవారనీ, స్త్రీలు పురుషులతో సమానులుగా ఉన్నారని తెలియజేసింది. అంతేకాదు, ప్రస్తుతం పురుషులు నీతిబాహ్యములగు స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండటం చేతనే బాల్యవివాహాలు చేస్తున్నారనీ, భర్త ఎంతమంది భార్యలు లేదా స్త్రీలతో గడిపినా అతన్ని సహించి సేవకురాలిగా భార్య పడుండాలనే భావన అసహ్యమని చెప్పింది. భర్తచనిపోతే భార్య అతనికోసం బ్రహ్మచర్యంతో గడపటం అన్యాయమనీ, అదే వివాహధర్మానికి అడ్డంకి అని చెప్పి స్త్రీలను మూర్ఖురాండ్రుగా చేయటంచేతనే స్త్రీ విద్యాభ్యుదయానికి ఆటంకం కలుగుతోందనీ, రజస్వలానంతర వివాహాలకై ఉద్యమాలు చేయాల్సిఉందనీ, బాల్యవివాహాల రూపుమాపి దేశాభ్యుదయానికి కృషిచేయాలని భావించింది. అంతేకాక, వైవాహిక ధర్మము నీతితో సంభవించిదనీ, మతముతో సంబంధం లేనిదనీ, జాతిమత వివక్షలేని పూర్వకాలపు వివాహాలనే ప్రమాణంగా భావించాలనీ, పిల్లకు బాల్యంలో పెళ్ళిచేస్తే కన్యాదానఫలం లభింపదనీ, యుక్తవయస్సు వచ్చిన తర్వాత వరునకు స్వాధీనంచేసినపుడే వస్తుందని తెలిపింది. బాల్యవివాహాలను రూపుమాపాలనీ, వివాహంలోనే గర్భాదానమంత్రాలు చదివించినంత మాత్రమున ఆ వరుడు చనిపోగానే ఆమె ఎలా వితంతువవుతుందనీ ఆలోచించమని చెప్పింది. స్త్రీలకు మైనారిటీ తీరువరకు గర్భాదానం కూడదనియు, సంరక్షకులు చేసిన వివాహములు రద్దుచేసుకొనేటట్లుగా యువతులకు స్వాతంత్ర్యం ఇప్పించే విధంగా బిల్లులు ప్రవేశపెట్టాలని కూడా తెలియజేసింది.

కందుకూరి రాజ్యలక్ష్మి నెలకొల్పిన స్త్రీసమాజసభలో ఈమె చేసిన (సెప్టెంబరు 1912 హిందూసుందరి) ఉపన్యాసంలో రాజమండ్రిలోని వీరేశలింగంగారు, చిలకమర్తివంటివారు ఆంధ్రదేశాభివృద్ధిని కోరుతూ స్త్రీవిద్యాభివృద్ధిని చేయటంచేతనే దేశాభివృద్ధి జరుగుతోందనీ, ప్రతి గ్రామాల్లో స్త్రీసమాజాలను ఏర్పాటుచేసి స్త్రీవిద్యాభివృద్ధి చేయాలని చెప్పింది.

'స్త్రీలకు ఉన్నత విద్య'(అక్టోబరు-నవంబరు-డిసెంబరు 1912 సావిత్రి) అని ఈమె చేసిన మరొక ఉపన్యాసంలో విద్య అంటే వృత్తిఅనీ, స్త్రీలకు వృత్తి విద్యలు అవసరమనీ, ఉన్నతవిద్యలు ప్రకృతి, నీతి, వైద్యం, పాకశాస్త్రం, దేశచరిత్ర, శిశు సంరక్షణం వంటి శాస్త్ర పరిజ్ఞానంకూడా అవసరమనీ, సంగీతం, కుట్టుపని వంటి కర్మవిద్యలు నేర్చుకోవాలనీ, స్త్రీలు జ్ఞానాభివృద్ధిని విస్తృతం చేసుకోవాలని చెప్పింది.

'ఆంధ్ర యోగినీమణులు' (డిసెంబరు 1912 హిందూ సుందరి)గురించి కళ్ళేపల్లె వెంకటరమణమ్మ వ్రాసిన వ్యాసంలో కాకినాడ పట్టణంలోని మహిళా సభకు అగ్రాసనాధిపత్యం వహించిన స్త్రీలు పూర్వాచార పరాయణులని, నవనాగరికాగ్రేసరులని చెబుతున్నారు గాని వారెంతటి విద్యాధికులో చెప్పటంలేదనీ, గతరాత్రి ఆ పట్టణానికి వచ్చిన యోగినీమణులను చూడటానికి స్త్రీలోకమంతా వచ్చినదనీ, వారిరువురూ కృష్ణాజిల్లాకు చెందినవారని తెలిపింది. వారు కన్యాత్వమునందే జ్ఞానోదయం పొందినా బ్రహ్మచర్య యోగ్యత లేక, నిషేకానికి మునుపే వైధవ్యం రాగా భర్తకు పిండోదకాలొదిలి వారిద్దరూ యోగినులయ్యారనీ, వారి వేషభాషలు వైధవ్య ఆచారాలకు వ్యతిరేకంగా ఉన్నాయనీ, వారు స్త్రీలందరితో స్నేహపూర్వకంగా సంభాషిస్తున్నారని చెప్పింది. సమస్త జీవులకు పతి 'దేవుడ'నీ, భర్త విగ్రహంవంటివాడనీ, విగ్రహారాధనను విడుచుటయే విధికార్యమనీ, అదే జ్ఞానయోగమనీ, భర్తయొక్క ఆత్మనిత్యం కాబట్టి భార్యలకు విధికార్యం ఉండదనీ, వారిని వితంతువులని అనకూడదనీ, స్త్రీలకు మాంగల్యం అవసరంలేదని బోధిస్తున్న ఆ యోగినీమణులను చూసిన స్త్రీలు అభినందిస్తున్నారనీ, దానికి ఆంధ్రదేశం గర్వపడాలని తెలియజేయటం జరిగింది.

'మహిళాసభ'లో ఈమె చేసిన ఉపన్యాసం (జూన్ 1916 హిందూసుందరి) లో నేటి స్త్రీలకు కావల్సింది, స్త్రీ విద్యాస్వాతంత్ర్యం అనీ, స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసించటానికి దేశభాష అవసరమనీ, వితంతువులకు దేశసేవకు పనికివచ్చే విద్యనేర్పించాలనీ, స్త్రీవిద్యాస్వాతంత్ర్యానికి అడ్డువచ్చేది నిర్బంధ బాలికా వైవాహిక ధర్మమని చెప్పింది. దాని నివారణకు స్త్రీలు సమాజాలుగా ఏర్పడి ప్రచారం చేయాలనీ, పారతంత్ర్యపాలకులను పారద్రోలటానికి స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యం అవసరమని కళ్ళేపల్లి వెంకటరమణమ్మ తెలియజేసింది.

*స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్య సాధనను, దేశాభివృద్ధిని ఆలోచించటానికి స్త్రీవిద్య పరమావధి అని ఈమె సూచించింది. స్త్రీలకు శాస్త్రవిజ్ఞానం గానీ, ఆధ్యాత్మిక విజ్ఞానవిషయాలు గానీ, వృత్తివిద్యలను గానీ స్వభాషలో బోధించటం అవసరమని చెప్పింది. ఇంగ్లీషువారి పరిపాలనలో, ఆంగ్లమాధ్యమ విద్యావ్యవస్థ ఉన్నప్పుడే స్వభాషలోనే విద్యాబోధనచేస్తే స్త్రీల విద్యాభివృద్ధి జరుగుతుందని భావించటం ఆమె క్రాంతదర్శనానికి నిదర్శనం. బాల్యవివాహాలకు, స్త్రీల ఉన్నత విద్యకును, స్త్రీల స్వాతంత్ర్యానికి, దేశాభ్యుదయానికి ఉన్న సంబంధాన్ని తెలియజేసింది. దేశాభ్యుదయానికి స్త్రీలు పాటుపడినప్పుడే స్త్రీల జీవితపు విలువలు పెరుగుతాయని తెలియచెప్పింది. శారదాచట్టాలకు ఆయువుపట్టువంటి విషయాలను తెలియజేసింది. పురుషుల యొక్క నీతిబాహ్య స్వాతంత్ర్యం, అసమానవైవాహిక సంస్కృతి స్త్రీల సమస్యలకు కారణం అనీ, వేదాలను పేర్కొని స్త్రీల పునర్వివాహాన్ని సమర్థించి పూర్వాచార పరాయణులకు కనువిప్పు కలిగించే విధంగా తెలియజేసింది. రజస్వలానంతర వివాహబిల్లు పెట్టి ఉద్యమం చెయ్యాలని భావించింది. అవసరమైతే తనకు జరిగిన బాల్యవివాహాన్ని రద్దుచేసుకొని స్వాతంత్ర్యాన్ని పొందేవిధంగా బిల్లును ప్రవేశపెట్టాలని భావించింది. అంటే విడాకుల బిల్లుకు అంకురార్పణ*

*చేయటంగా అర్థమవుతుంది. స్త్రీలకు వైవాహిక స్వాతంత్ర్యం ఉండటమే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యసాధన అని అర్థమవుతుంది.*

*స్త్రీలలో సమాజంలోని శాస్త్రవిజ్ఞానం, వృత్తివిద్యల పట్ల అభిరుచిని కలిగించటం, వృత్తివిద్యలను నేర్చుకొని కుటీర పరిశ్రమలను పెట్టుకొంటే ఆర్జనాపరులు కాగలుగుతారనీ, అదే స్త్రీలను వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందేటట్లు చేయగలుగుతుందని భావించి తోటిస్త్రీలలో వ్యక్తిస్వాతంత్ర్య సాధనకై చైతన్యపరచటం అర్థమవుతుంది. సనాతన ధర్మంగా భావింపబడే విధవత్వాన్ని వేదాంత జ్ఞానంతో ఖండించి ఆచరణలో పెట్టినవారిని స్త్రీలోకమంతా అభినందిస్తుందని తెలియజేసి వితంతువులలో ఉండే ఆత్మన్యూనతను తగ్గించి మామూలు స్త్రీలలాగానే వారంతా సమాజంలో కలిసిపోవాలని ఆకాంక్షించటం జరిగింది. యోగినుల ఆధ్యాత్మిక విజ్ఞానం సమాజంలోని వితంతు జీవితాలను బాగుచేసే విధంగా వితంతుసంస్కృతిని మార్చగలదనీ, వారి వేదాంత ధోరణిని స్త్రీలందరూ మెచ్చుకొన్నారని తెలియ జేయటమే స్త్రీల అభిప్రాయాలలోని మార్పును కోరుకోవటంగా భావించవచ్చు. పూర్వాచారపరాయణుల చేత కనువిప్పు కలిగిస్తేనే స్త్రీల జీవితాలు బాగుంటాయనీ భావించటమే స్త్రీల మేధాశక్తికి, యుక్తికి నిదర్శనం. కుహనా శాస్త్రరూపంలో స్త్రీలపై ఏర్పడిన భావజాలాన్ని ఖండించే చైతన్యాన్ని సాహిత్యంద్వారా ప్రచారం చేస్తూ స్త్రీలలో వ్యక్తి స్వాతంత్ర్యపు స్పృహను కళ్ళేపల్లి వెంకటరమణమ్మ కలిగించాలనుకొన్నది. అంతేకాక, దేశస్వాతంత్ర్య సాధనకు స్త్రీవిద్యాస్వాతంత్ర్యం ముఖ్యమని ఈమె భావించింది.*

'విద్యార్థినీసమాజం', (జులై 1915 హిందూసుందరి) అనే పత్రికాసంపాదకురాలి వ్యాసంలో కాకినాడలో కళ్లేపల్లె వెంకటరమణమ్మగారి ఆధ్వర్యంలో స్త్రీవిద్యార్థినీ సమాజం నడపబడుతుందనీ, భండారు అచ్చమాంబ చేత ప్రారంభింపబడినదనీ, పిదప 1910వ సంవత్సరంలో దానిని బాలాంత్రపు శేషమ్మ, దామెర్ల సీతమ్మ గార్లు పునఃప్రారంభం చేసారని తెలిపింది. ప్రతి శుక్రవారం వార్తాపత్రిక చదువుకొనటం, సద్గ్రంథపఠనం జరిగేదనీ 550 పుస్తకములు కలిగిన 'పుస్తక భాండాగారమును' అభివృద్ధిచేస్తూ స్త్రీలోకానికి ఆమె తోడ్పడుతోందని బాలాంత్రపు శేషమ్మ, దామెర్ల సీతమ్మ గార్లు తెలియచేసారు.

*స్త్రీవిద్యార్థినీ సమాజంలో స్త్రీలకు ప్రత్యేకించి ఉచిత గ్రంథాలయాలు ఉన్నాయనీ, స్త్రీలందరూ చదువుకోవటానికి మార్గదర్శకమైన వ్యాసం.*

'మహిళామృదువాణి' అనే (మే, జూన్ 1911 సువర్ణలేఖ) పత్రికాధిపుల ప్రచురిత వ్యాసంలో భారతదేశంలో ఠాకురాణి ఛౌలే, కాకరోచి, నర్మదాబాయి, ఖగనీయల, గిరిధరకవిరాజపత్ని, చంద్రకలాబాయి, రాణిచంపాదేవి వంటి కవయిత్రులు ఉన్నట్టు పత్రిక తెలియజేసింది.

సుభద్ర అనే రచయిత్రి 'శ్రీమతి కాళహస్తి అలమేలుమంగమ్మ గారు' (జూన్ 1911 హిందూ సుందరి) అనే దేశాభిమానం గల స్త్రీ యొక్క చరిత్రను గురించి వ్రాస్తూ ఆమెయొక్క చరిత్రము నూతన చరిత్రమనియు, లేకలేక పుట్టిన ఆమెను తల్లిదండ్రులు బాలికా పాఠశాలలో

చేర్పించినా, 8 ఏండ్లకే పెళ్ళిచేయాలనుకున్నప్పుడు బ్రహ్మసమాజ మతస్థుడు అడిగినా ఇవ్వక మంచి వరుడికోసం ఎదురుచూస్తూంటే రజస్వలగా ఆమె కఠినమైన ఘోషాఖైదిని అనుభవించిందని తెలిపింది. రజస్వలను పెళ్ళిచేసుకోవటానికి ముందుకువచ్చే వరుడు దొరకక చివరికి ఈమెను మునుపే యిష్టపడ్డ సంస్కారియైన వ్యక్తికి ఇచ్చి పెళ్ళిచేసారని తెలియజేసింది. భర్త ప్రోత్సాహంతో ఆమె పుస్తకపఠనాన్ని చదువును కొనసాగించి ఆంగ్లము, ద్రావిడ భాషలను నేర్చుకుందనీ, దారిద్ర్యంలో కూడా భర్తకొక మంత్రిణిగా ఉండి సలహాలిచ్చినదని తెలియజేసింది. అంతేకాదు, స్వయంగా సభలలో ప్రసంగాలిస్తూ ద్రావిడ భాషలో వ్యాసాలు వ్రాసిందనీ, ఆంగ్లభాషలో ఉపన్యసించి హ్యూమ్ దొరల మెప్పును పొందిందనీ, దేశంలో పత్రికలన్నీ ఆమె ఉపన్యాసాలు విని ఆమెను కొనియాడారనీ, ఈమె బహుభార్యత్వపు దురాచారాన్ని పోగొట్టటానికి కృషిసల్పిందని తెలిపింది. కొన్నిపాఠశాలలకు లేడీ సూపరింటెండెంట్‌గా పనిచేసిందనీ, నిమ్నజాత్యుద్ధరణ సంఘంలో చేరి కృషిచేసిందనీ, స్త్రీలకు విద్యాదానం చేయాలని పుస్తకాలు వ్రాసిందనీ, అవి ముద్రింపబడాలని కోరుతూ, ఆమెను గురించిన నాటి సామాజిక వాస్తవమైన స్త్రీ జీవిత సమాచారాన్ని అందించింది.

ఈమెయే 'స్త్రీలకు ఇంగ్లీషు విద్య అవసరమా?' (ఫిబ్రవరి 1912 హిందూసుందరి) అనే శీర్షికన వ్రాస్తూ స్త్రీలకు ఇంగ్లీషువిద్య అవసరమేననీ, విదేశీయులు, మిషనరీ స్త్రీలు దొరసానులుగా ఉన్నారనీ, ఇంగ్లీషువారు మనభాషను నేర్చుకోవాలని ప్రయత్నించినా కష్టమగుటచే వారి విద్యను మనకు నేర్పుతున్నారని తెలిపింది. ఇంగ్లీషు నేర్చుకొని మిగిలిన రాష్ట్రాలకు స్త్రీలు కలెక్టర్లుగా గొప్ప ఉద్యోగినులుగా వెళ్ళగలుగుతున్నారనీ, మగవాళ్ళు హేళనచేసినా పట్టించుకోకుండా స్త్రీలు ఇంగ్లీషు భాషను నేర్చుకొని నాగరికులై పరిపాలిస్తే హైందవ దేశాన్ని ఉన్నత స్థితిలోకి తీసుకొని వెళ్ళగలరని భావించింది. స్వభాషను నేర్చుకుంటూనే పరభాషను నేర్చుకొని ప్రపంచ విషయాలు నేర్చుకోవాలని సుభద్ర భావించింది.

*స్త్రీలు విద్యాభివృద్ధిని చేసుకోవటమేకాక, పాఠ్యపుస్తకాలను వ్రాయగలిగే స్థితికి చేరటం స్త్రీవిద్యాభివృద్ధికి శిఖరాయమానమైన కొలమానంగా భావించాలి. ప్రథమ రజస్వలానంతర వివాహితగా ఆమెను భావించేటట్టు చేసి స్త్రీలు ఎంత ఎత్తుకైనా ఎదుగగలరనీ, ఎదురీదగలరనీ, సమాజంచేత గౌరవింపబడే విధంగా జన్మను సార్థకం చేసుకోగలరనే స్ఫూర్తినిచ్చే విధంగా తెలియజేసింది. రజస్వలానంతర వివాహం జరగటమే స్త్రీల విద్యాభివృద్ధికి కారణమైందనీ కరణేషు మంత్రిగా ఉండాలంటే స్త్రీకి విద్య అవసరమనీ తెలియజేసింది. స్త్రీలు మంచి ఉపన్యాసకులుగా అవటమేగాక బహుభార్యత్వ దురాచార నిర్మూలన చేయాలనుకోవటం, నిమ్నజాత్యుద్ధరణ చెయ్యాలని తెలియజేసింది. స్త్రీలవిద్యాభివృద్ధి దురాచారనిర్మూలనకు ఉపయోగపడుతుందని తెలియజేసి స్త్రీల అభివృద్ధికి, ఆలోచనల పరిణామ ఫలితాలను ప్రయోగాత్మకంగా నిరూపించేస్తూ స్ఫూర్తినిచ్చింది. అంతేకాదు, నాడు స్వభాషతోపాటు పాలనాభాషనుకూడా నేర్చుకుంటే స్త్రీలకు ప్రపంచ జ్ఞానం అలవడుతుందని సుభద్ర భావించింది.*

పిల్లలమర్రి కామేశ్వరమ్మ వ్రాసిన 'వితంతుశిరోముండనము' (ఆగస్టు 1911 హిందూ సుందరి) అనే వ్యాసంలో వితంతు స్త్రీలకు శిరోముండనాన్ని పెట్టటానికి వేదాలు పురాణాలు పుట్టాయనీ, ఆడపిల్లలను బాలవితంతువులు అయ్యేవిధంగా పెళ్ళిళ్ళు చేసి వంటలక్కలుగా వంటింట్లో మగ్గేటట్టు చేసిన తల్లిదండ్రులే దూష్యమైనవారని తెలిపింది. మహాపురుషులు కొంతమంది ముందుకువచ్చి స్త్రీలకు విద్య ఉండాలని చెప్పే వారితోనైనా వితంతువులు తమకు కూడా విద్యనేర్పించమని అడిగే స్థితిని కల్పించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేసింది.

*విద్యావంతులైన వితంతువులందరూ ఒక్కచోటచేరి వితంతుస్త్రీల బాధలు తొలిగేటట్టుగా ప్రయత్నించాలని దిశానిర్దేశం చేసుకోవటంగా వ్యాసం అర్థం అవుతుంది.*

గూడపాటి లక్ష్మీనరసమ్మ వ్రాసిన 'వివాహములు' (ఆగష్టు 1911 హిందూ సుందరి) అనే వ్యాసంలో బాల్యవివాహములు శాస్త్రసమ్మతము గాక విరుద్ధములని, అనర్థదాయకములని, విద్యనేర్చుట పత్రికలో పేరు వేసుకోవటానికిగాక దేశోద్ధరణ కోసమనితెలిపింది. సమాజాలలో సభ్యులుగా పనిచేస్తూ రజస్వలానంతర వివాహాలకు పూనుకోవాలనీ, పూర్వకాలం నాటి పరిస్థితులు యిప్పుడు లేవనీ, ప్రౌఢవివాహాలను ఆచరణలో పెట్టాలని తెలియజేసింది.

ఈమె 'హైందవ యువతీపతనము' (సెప్టెంబరు 1911 హిందూ సుందరి) అనే శీర్షికన వ్రాస్తూ పూర్వకాలంలో స్త్రీలు విద్యావంతులుగా ఉన్నారనీ, బాల్యవివాహాల వల్ల స్త్రీలకు విద్యావికాసం కలగటంలేదనీ, బాల్యవివాహాలను మాన్పించి విద్యార్జన చేసేటట్లుచేసి రజస్వలానంతర వివాహాలు చేయాలని తెలిపింది. అప్పుడే దేశం, సంఘం, బాగుపడుతుందనీ, దానికై బాలికాపాఠశాలలు ప్రతిగ్రామాలలో పెట్టాలని కోరారు.

'హైందవయువతీపతనము' (విజ్ఞానవల్లరి వీరేశలింగ పుస్తకభాండాగార ప్రచురణ డిశెంబరు, 1911) అనే శీర్షికన ఈమెయే వ్రాస్తూ వేదకాలంలో ఋక్కులు వ్రాసిన స్త్రీలు ఉన్నారనీ, నాడు స్త్రీలు పురుషులతో సమానంగా సభలకు వెళ్ళేవారనీ, కాని మధ్యయుగాలలో బాల్యవివాహాలతో స్త్రీవిద్య వినాశనాన్ని పొందిందని తెలిపింది. రజస్వలానంతర వివాహాలవల్ల స్త్రీవిద్యార్జనకు అవకాశం ఉంటుందనీ, సంఘాన్ని ఉద్ధరించాలనుకొనేవారు బాలికాపాఠశాలలను స్థాపించాలని తెలియజేసింది.

*స్త్రీలవిద్యాభివృద్ధి జరగాలంటే రజస్వలానంతర వివాహాలు జరిగే వైవాహికసంస్కృతి ఉండాలని భావించింది. రజస్వలానంతర వివాహాల ప్రాచుర్యంతోపాటు, ప్రౌఢవివాహాలను గురించిన ఆలోచనలు కలగటం అర్థం అవుతుంది. స్త్రీల వివాహానికి, స్త్రీ విద్యకు, దేశాభివృద్ధికి ఉన్న లంకెను గూడపాటి లక్ష్మీనరసమ్మ తెలియజేసింది.*

ఉప్పలూరి నాగరత్నమ్మ వ్రాసిన 'స్త్రీ పునర్వివాహముల' (అక్టోబరు – నవంబరు 1911 హిందూసుందరి) అనే వ్యాసంలో స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతమనీ, కందుకూరి వీరేశలింగం,

ఈశ్వరచంద్రవిద్యాసాగర్ వంటివారు కృషిచేస్తూన్నారని తెలిపింది. బాల్యవివాహాలుచేస్తూ వితంతువులు కాగానే కర్మసిద్ధాంతాన్ని చెపుతున్నారనీ, విరూపిణిలుగా మారుస్తున్నారనీ, "వినరా దేవా విపతుల ఖేదము చిరిగిన చేలములరుదుగ నిచ్చి/పరిచారికలని భావనచేసి పరిపరివిధముల పనులను చెప్పి/తరగని దుఃఖము తరుణలకా?" అంటూ కవితారూపంలో ప్రశ్నించింది. బాలవితం తువులు ఏకాకినులుగా లోకమునకు ఉపకారం చేయలేరనీ, గార్హస్థ్య జీవితముంటేనే ఉపకారం చేయగల వారవుతారని బుచ్చి బంగారమ్మ చెప్పిన మాటలు సమంజసమని కూడా పేర్కొంది.

*అందుకే బ్రిటిష్ ప్రభుత్వం 1856 లోనే స్త్రీపునర్వివాహచట్టాన్ని చేసిందనీ, కందుకూరి వీరేశలింగం1881 లో మొదటి స్త్రీపునర్వివాహాన్ని ఆచరణలో పెట్టగలిగారని అర్థమవుతుంది.*

'ఉప్పలూరి నాగరత్నమ్మ జీవితం' (మార్చి 1913 హిందూ సుందరి) ను గురించి 'వివేకవతి' అనే పేరుతో వ్రాస్తూ నాగరత్నమ్మకు బాల్యంలోనే వైధవ్యం వచ్చినా తండ్రి మరణానంతరము ఆమెయే ధైర్యంతో తాను వితంతు శరణాలయములో చేరాలనుకున్న విషయాన్ని వీరేశలింగం గారికి ఉత్తరం వ్రాయగా, ఆమెను గుంటూరు నందలి శరణాలయాల్లో చేర్పించారని తెలిపింది. అక్కడ విద్యనేర్చిందనీ, తదుపరి ఆమెకు 18 సంవత్సరములప్పుడు పునర్వివాహం జరిగిందనీ, తనకున్న లోకానుభవంతో గ్రంథరచన చేసిందనీ, లోకోపకారానికై వీరేశలింగం గారి పుస్తకాలను ఆమె పంచిపెట్టేదని తెలియజేయటం జరిగింది.

*వితంతు స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యాన్ని అనుభవించగల స్థితికి చేరుకొన్న ఉదంతానికి నిదర్శనమిది.*

బుర్రా బంగారమ్మ వ్రాసిన 'పునర్వివాహితులు కులాంగనలేనా' (అక్టోబరు–నవంబరు 1911 హిందూసుందరి) అనే వ్యాసంలో వైవాహిక ధర్మాలవల్ల వివాహితలు కులటలని భావింపబడరనీ, భర్తృత్వమే స్త్రీలకు గౌరవం తెస్తుందనటం అనుచితమని తెలిపింది. వివాహవిధిని అనుసరించి పునర్వివాహం దోషమనుట తప్పనీ, ధర్మశాస్త్రమంటే సాంఘిక కట్టుబాట్లకై పూర్వులేర్పరిచిన ప్రవర్తనా విధులని, ప్రస్తుతకాలాన్ని, సంఘాన్నిబట్టి స్త్రీలకు పునర్వివాహాన్ని నిషేధించకూడదనీ పునర్వివాహితులు కులాంగనలేననీ పేర్కొంది.

*సమాజసంస్కృతి ఆ యా కాలములలోని వ్యవస్థలను బట్టి మారుతుందని ఊహించి కాలానుగుణంగా సామాజిక సంస్కృతీ స్వభావంకూడా మారుతుందనీ, దాన్ని అంగీకరించాలని చెప్పటం ఆ నాటికది గొప్పశాస్త్రీయమైన ఆలోచనయే.*

పెద్దచిగుళ్ళరేవు వెంకమ్మ మరియు పెద్దచిగుళ్ళరేవు పేరమ్మ కలిసి తమసోదరులకు 'హిందూసోదరులకు విన్నపము' (జనవరి 1912 హిందూసుందరి) అంటూ వ్రాస్తూ పురుషులకు వలె స్త్రీలకు కూడా విద్యావివేకాలు అవసరమనీ, భర్తతో ఆశ్రమానికి వెళ్ళినప్పుడు అక్కడ కలిసిన స్త్రీలతో పరిచయం పెంచుకొని, కుశలములు విచారిస్తున్నందుకు, అక్కడ చెప్పిన నీతి బోధనలు

విని సమాజంలోని దుర్గుణాలను తెలుసుకుంటారనీ, సోదరులు తమతో మాట్లాడటం మానేసారని తెలిపారు. పలకరించినా మాట్లాడకుండా సోదరీమణులను నిరాదరణ చేసి స్త్రీలను బానిసలుగా చూడటం సోదరులకు ధర్మమా? అంటూ స్త్రీజాతి తరపున హిందూసోదరులందరికీ విన్నవించింది.

*స్త్రీలు తోటిస్త్రీలతో మిత్రసంబంధాలను పెట్టుకుంటూ వారిలో ఐక్యత పెరిగితే అందరూ కలసి తమ అధికారాన్ని వ్యతిరేకిస్తారనే భయం భారతీయ పురుషులకు ఏర్పడినట్లు అర్థం అవుతుంది. పితృస్వామ్యసంస్కృతి రక్షణకై బాధ్యత వహించటంగా కుటుంబ వ్యవస్థలోని సోదరులు స్త్రీలకు సామాజికసంబంధాలు లేకుండాచేసి, సమాజజ్ఞానాన్ని తెలుసుకొనే అవకాశంలేకుండా చేయాలనుకోవటం స్పష్టమవుతుంది. ఆ కిటుకుని నాడే స్త్రీలు కనిపెట్టారు.*

మందపాటి భారతమ్మ "హిందూస్త్రీల ప్రస్తుతపుస్థితి"( జనవరి 1912 హిందూసుందరి)ని గురించి వ్రాస్తూ, లోకంలో ప్రతి వస్తువు మార్పుచెందుట ఎంతసహజమో అలాగే స్త్రీలలోనూ మార్పు ఉండాలనీ, మార్పునకు కాలమే ఆధారమనీ, స్త్రీవిద్యయందు అటువంటి మార్పే వచ్చిందని తెలిపింది. విరామం కలిగినపుడల్లా స్త్రీలు పుస్తకపఠనం చేయటమో, వీణవంటి వాయిద్యాలు నేర్చుకోవటమో, పత్రికలకు వ్యాసాలు వ్రాయటమో చేస్తున్నారనీ, స్త్రీలు మంచి చరిత్రములు చదివి పాఠశాలలో బోధకురాండ్రుగా ఉద్యోగాలు చేస్తున్నారనీ, కొద్దిరోజుల్లో స్త్రీలకు ఉన్నతస్థితి కలుగుతుందని తెలియజేసింది.

*స్త్రీల ఆలోచనలలో మార్పును కోరుకోవటమే అభివృద్ధి సూచకమనే భావనను కలిగించటం జరిగింది. స్త్రీలు బోధకురాండ్రుగా ఉద్యోగాలలో నియామకాన్ని పొందటం స్త్రీల ఆర్థికస్వేచ్ఛకై వేసిన మరొక అడుగు. ఒక ఆశావాదిగా రచయిత్రి వ్రాసిన వ్యాసమిది.*

'ఆచంట రుక్మిణమ్మ' (ఫిబ్రవరి 1912 హిందూసుందరి)ను గురించి పత్రికా సంపాదకురాలు వ్రాస్తూ ఒక మునుసబుగారి కూతుళ్ళు ఎమ్.ఎ. పరీక్ష పాస్ అవటాన్ని చూసి ఆనందించిన ఆచంట రుక్మిణమ్మయొక్క తండ్రి తన కూతురును చదివించాలనుకున్న విషయాన్ని చెప్పగా, దానిని నమ్మక వీరేశలింగంగారు పరిహసించారని తెలియజేసింది. తన కూతురును చదివించాలనుకున్నాడు కాని అతని మరణంతో కష్టాలు వచ్చాయనీ, రుక్మణి అవివాహితగానే ప్రెసిడెన్సీ కళాశాలలో ఎమ్.ఎ చదువుతుండగా డా.ఆచంట లక్ష్మీపతిగారిని వివాహం చేసుకొన్నదని ఆమెను గురించి పరిచయం చేసింది.

'స్త్రీవిద్య-వివాహానికి తగిన వయస్సు' (ఫిబ్రవరి 1912 హిందూసుందరి) ను గురించి వెలిబుచ్చిన ఆచంట రుక్మిణి అభిప్రాయాలను భాషాంతరీకరణం చేసిన పత్రికాసంపాదకురాలి ప్రచురణలో బాల్యవివాహాలను నిరసిస్తూ ఉన్నత విద్యావంతురాలైన యువతులను ఉదాహరించి ఆడపిల్లకు 12 ఏండ్లు వచ్చిన తర్వాతనే పుస్తక పఠనం మీద ఆసక్తి పెరుగుతుందని తెలిపింది. బాగా చదువుకుంటేనే శిశుపోషణను, గృహనిర్వాహకత్వాన్ని తెలుసుకుంటారనీ, నీతి మార్గాన్ని

పెంచాలన్నా, దేహదారుఢ్యంగల పిల్లలను వృద్ధిచేయ గలగాలన్నా స్త్రీకి విద్య అవసరమనిచెప్పింది. విద్యావంతురాలైన స్త్రీకుటుంబాన్నిచక్కగా నిర్వహించగలుగుతుందనీ, ప్రతిబాలిక తనవివాహంతో తానుచేపట్టే గృహనిర్వహణమనే ఉద్యోగానికి తగినశక్తి తనకుందా లేదా అని ఆలోచించుకోవాలని ఆచంట రుక్మిణమ్మ చెప్పిన విషయాలను పత్రిక తెలియజేసింది.

*గృహ నిర్వహణాన్ని స్త్రీల ఉద్యోగనిర్వహణగా భావించమని చెప్పింది. ఆ గృహిణీ ఉద్యోగానికి కూడా ఆడపిల్లలకు విద్య మరియు యుక్తవయస్సును అర్హతగా చెప్పటం జరిగింది.*

'శ్రీమతి ఆచంట రుక్మిణి' (ఆగష్టు 1912 వివేకవతి) అనే శీర్షికన పత్రికాధిపురాలు హిందూసుందరి పత్రికనుండి తాను ఆచంట రుక్మిణి గురించి తెలుసుకొన్న విషయాలను ప్రచురిస్తూ తండ్రి ఆమెను చదివించాలనుకున్నాడనీ, కాని ఆమెకు 10 వ ఏటనే తండ్రి మరణించినా ఆమె ధైర్యము విడవక మద్రాసునందలి ప్రెసిడెన్సీ కళాశాలలో ఎఫ్.ఏ. చదివిందనీ, అక్కడ డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారిని వివాహం చేసుకుందని తెలియజేసింది. అంతేకాదు ఆచంట రుక్మిణమ్మ వ్రాసిన 'చదువువలని లాభములు' అనే వ్యాసంలో స్త్రీసమాజాలు స్త్రీలలో ఐక్యతను పెంపొం దిస్తున్నాయనీ, అన్నికులాల, వర్గాల స్త్రీల మధ్య అన్యోన్యత ఏర్పడుతుందని తెలిపింది. సమాజాలలో పుస్తకభాండాగారాలుండాలని ఆ పుస్తకాలను స్త్రీలు చదువుకోవాలనీ, స్త్రీలు ఎప్పుడూ ఇంట్లోనేవుండి విచారగ్రస్తులుగా ఉండకుండా సమాజాలకు వెళ్ళి తోటిస్త్రీలతో స్నేహం వృద్ధిచేసుకోవాలని ఆచంట రుక్మిణి తెలియజేసిన విషయాలను 'సరస్వతీ సభ'లో చదివి వినిపించటం జరిగిందని వివేకవతి పత్రికా సంపాదకురాలు తెలియజేసింది.

మొసలిగంటి రామాబాయమ్మ వ్రాసిన 'రజస్వలానంతర వివాహములు' (మార్చి 1912 హిందూ సుందరి) అనే వ్యాసంలో స్త్రీ విద్యాభిలాషియు, వివాహసంస్కరణాభిలాషియు ఐన మిస్ టెన్నెంటు దొరసాని అమెరికా నుండి వచ్చి తన జీవితాన్ని భారతదేశ స్త్రీజాత్యుద్ధరణానికై పూనుకొన్నదనీ, భారతదేశంలో స్త్రీల వైవాహికసంస్కృతిలో రజస్వలానంతర వివాహాలు నవీనం కాదని తెలిపింది. బాల్యవివాహాలవల్ల స్త్రీలు మనోదేహబలాలు లేని సంతానోత్పత్తిని కలిగిస్తున్నారనీ, 'వివాహం' అనే పదం కూతుళ్ళ కన్యత్వాన్ని పోగొట్టటానికి అనుకుంటున్నారు గానీ, దానిని భారతదేశపు ఔన్నత్యాన్ని నాశనం చేసే వేరుపురుగుగా భావించటంలేదని చెప్పింది. స్త్రీ పురుషులకు ఆమరణాంతర సంబంధ బాధ్యతను విడదీయటానికి వీలులేని విధంగా సంకెళ్ళ బీగాలను వేయటానికే మనుష్యులు ఆడిన జీవనాటక ప్రారంభం పెళ్ళి అని తెలియజేసింది. 'వివాహం' అంటే స్వాతంత్ర్యం కాదనీ, కేవలం పురుషులు కామాన్ని తీర్చుకొనే వ్యవస్థగా భావించటంచేత దానివల్ల బలహీనమైన సంతానోత్పత్తి జరుగుతోందని తెలిపింది. యుక్తవయస్సు వచ్చిన తర్వాత తగిన వరుడిని ఎన్నుకోవటం, వివాహం చేసుకొనే విధానాన్ని మనవేదాలలో చెప్పారని ఉదాహరిస్తూ, ప్రౌఢవివాహానంతరమే నిషేకాలు (గర్భాదానం) చెయ్యాలనీ, నేటి మాతలు జ్ఞానవంతులై పిల్లలకు విద్యాభివృద్ధిని కలిగించి, రజస్వలానంతర వివాహాలుచేసి ఆడపిల్లలను బాల్యవివాహాలనే నరకంనుండి కాపాడమని మొసలిగంటి రామాబాయమ్మ తెలియజేసింది.

*రజస్వలానంతరం ప్రౌఢవివాహాలు ఉండాలనీ, బాల్యవివాహాలవల్ల బలహీనమైన సంతానం కల్గుతోందని, ఆ మరణాంతరం కూడా తాళాలు వేయబడే విధమైన వివాహం జీవన నాటకమనే తాత్వికతను ప్రతిపాదించింది. వివాహం వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ఇవ్వటం లేదనీ, పురుషుని కామానికి ఉపయోగపడుతోందని పురుషుల కామేచ్ఛకై పెళ్ళితంతు ఏర్పడినదని మొసలిగంటి రామాబాయమ్మ భావించింది.*

'బాల్యవివాహము ఉన్నతవిద్యకు ఆటంకం' (ఏప్రిల్ 1912 హిందూ సుందరి) అనే శీర్షికన బరంపురంసభలో మిస్సుకేరీ ఏ.టినెంటు యిచ్చిన ఉపన్యాస అనువాదంలో ఆమె భారతదేశంలో పూర్వకాలంలోని స్త్రీలు విద్యావంతులు, గౌరవనీయులుగా ఉండేవారని తెలిసి ఆనందంగా ఉందనీ, నేడు కూడా బాలబాలికలకు నిర్బంధ విద్యను ఉచితంగా ప్రవేశపెడితే స్త్రీ విద్యాభివృద్ధి జరగుతుందని తెలిపింది. పల్లెటూళ్ళలో కూడా బడులను పెట్టటానికి ప్రభుత్వం ధనమివ్వాలనుకుంటోందనీ, గుంటూరు ప్రాంతంలోని వేటపాలెంలో కొండ వెంకటప్పయ్య గారు స్థాపించిన మెట్రిక్యులేషన్ స్థాయి బాలికల బడిని హిందూ వివాహసంస్కరణ సంఘం వారు నిర్వహిస్తున్నారని చెప్పింది. అక్కడ సగంమంది 9 ఏళ్ళలోపు వివాహిత మరియు వితంతు బాలికలు ఆ పాఠశాలలో విద్యను నేర్చుకుంటున్నారని చెప్పింది. అమెరికాలో వివాహ నిర్బంధంలేదనీ, అక్కడ పనులు చేయటానికి వితంతువులకే మిక్కిలి ప్రాధాన్యాన్ని, గౌరవాన్ని ఇస్తారనీ, అలాగే ఇండియాలో కూడా వితంతువులకు బడిలో బోధన చేయగల విద్యను అందించాలనీ అప్పుడే హిందూ దేశ స్త్రీల అభివృద్ధి జరుగుతుందని భావించింది. బరంపురంలో కూడా హిందూసంఘం స్థాపించి పిల్లల వివాహ వయస్సును పెంచాలనీ, ఆడపిల్లల విద్యను అభివృద్ధి చేయాడానికోసం వ్యాసాలు, పుస్తకాలు వ్రాసి ప్రకటనలు చేయాలనీ, వరశుల్క కన్యాశుల్కాలను రూపుమాపాలనీ, కనీసం ఒక కులంలోని వారైనా వివిధశాఖలలో వివాహ సంబంధాలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో లక్ష్యాలను స్త్రీసమాజాలు ఏర్పరచుకోవాలని టినెంటు దొరసాని తెలియజేసింది.

*ఒకప్రక్క బాల్యవివాహాలను ఎదుర్కొంటూనే మరొకప్రక్క వితంతువుల విద్యాభివృద్ధికి కృషిచేయాలనీ, వితంతువుకు సమాజంలో గౌరవ స్థానం యివ్వాలని భావించటంతోపాటు, కన్యాశుల్కాన్ని, వరశుల్కాన్ని ఎదుర్కోవాలని పేర్కొనటం జరిగింది. బాలికలకు నిర్బంధ విద్యను ప్రతిపాదించింది.*

కందుకూరి వెంకాయమ్మరావు స్త్రీల స్థితిని గురించి చేసిన 'ఉపన్యాసము' (జూన్ 1912 వివేకవతి) లో విద్యావంతులైన స్త్రీలు తమ అభివృద్ధికొరకు పాటుపడాలనీ, మీటింగ్‌లు, సమాజ సమావేశాలకు వెళ్ళగలగాలని పిలుపునిచ్చింది. స్త్రీలు తమ తోటివారిని విద్యావిషయంలో ప్రోత్సహించాలనీ, చదవటం, వ్రాయటం అనే విద్యాసాధనలను ఉపయోగించి విదేశీస్త్రీలవలె ఉన్నతవిద్యను అభ్యసించాలనీ, స్త్రీ వైద్యులుగా, ఉపాధ్యాయినులుగా ఎదిగి స్త్రీల అభివృద్ధికి కృషిచేయటం దేశగౌరవమని తెలియజేసింది.

‘స్త్రీ స్వాతంత్రం’ (సెప్టెంబరు 1912 వివేకవతి) ను గురించి ఈమె ఉపన్యసిస్తూ స్త్రీలు విద్యావంతులై, భర్తలవలె సద్వృత్తిని చేపట్టి ద్రవ్యార్జన చేయాలనీ, స్త్రీల సత్ప్రవర్తనమే పాతివ్రత్యమనీ, అప్పుడే స్త్రీలకు స్వాతంత్ర్యం వస్తుందని తెలియజేసింది.

‘పిల్లలపెంపకము’ (అక్టోబరు 1912 వివేకవతి) ను గురించి ఈమె చేసిన మరొక ఉపన్యాసంలో తల్లులు తమ బాలికలను పాఠశాలలకు పంపి వారికి ‘విద్య’ వచ్చేటట్టు చేయాలనీ, వారిచేత కావ్యపఠనం చేయించాలనీ, వేశ్యావృత్తి ఘోరమైనదనీ, దాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం శాసనం చేయాలనీ, తెలియజేసింది. అంతేకాదు బాల్యవివాహాలు చేయకూడదనీ ఆడపిల్లలకు వయస్సు వచ్చిన తర్వాత తగిన వరునకిచ్చి వివాహం చేయటమే ఆడపిల్లల స్వాతంత్ర్యాన్ని కాపాడే ధర్మమనీ, కన్యాశుల్కాలు, వరశుల్కాలను తీసుకోవటం, ఇవ్వటం నాగరికత కాదనీ వీటిని రూపుమాపేటట్లుగా ప్రభుత్వం శాసనాలు చేయాలని తెలియజేసింది.

‘సంఘసంస్కరణము’ (నవంబరు 1912 వివేకవతి) ను గురించి కందుకూరి వెంకాయమ్మ రావు చేసిన ఉపన్యాసంలో, దురాచారాములను దిద్ది మంచిఆచారములను ఆచరణలో ఉండేటట్లు చేయటమే సంఘసంస్కరణమని చెప్పింది. కాలానికి అనుగుణంగా సంస్కరణలను చేయాలనీ, అదే ‘రాజనీతి’ అని, అందరూ ఐకమత్యంతో కార్యాన్ని చక్కబెట్టటమే సంఘబలమనీ, ఆవిధంగా దేశక్షేమంలో స్త్రీలు భాగస్వాములు కావాలని కందుకూరి వెంకాయమ్మరావు తెలియజేసింది.

*స్త్రీలు ఉన్నత విద్యావంతులై దేశాభివృద్ధికి కృషిచేయాలని భావించింది. ఆడపిల్లలకు వరుని ఎన్నుకొనే స్వేచ్ఛ ఉండటమే వారికున్న స్వాతంత్ర్యానికి చిహ్నమని తెలియజేసింది. వేశ్యావ్యవస్థ యొక్క స్వభావాన్ని అర్థంచేసుకొనే నిషేధచట్టం రావాలని ప్రయత్నం జరిగింది. స్త్రీలు నాటి సమాజంలో దురాచారాలను సంస్కరణలతో, సంఘబలంతో రూపుమాపటమే రాజనీతి అనీ అప్పుడే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొంది దేశ స్వాతంత్ర్యంవైపు అడుగులు వేయగలరని వెంకాయమ్మ చైతన్యపరచటం జరిగింది.*

‘స్త్రీలను, బాలికలను రక్షించుట’ (అక్టోబరు 1912 హిందూసుందరి) అనే పత్రికా సంపాదకురాలి ప్రచురణలో బాలికలను, స్త్రీలను అవినీతినుండి కాపాడటానికి నౌరోజీ బిల్లును ప్రవేశపెడుతన్నారని తెలిపింది. 16 సంవత్సరాలు తక్కువ వయస్సుగల బాలికలను రక్షించాలనీ, ఇండియాలో వ్యభిచార వృత్తిని నాశనంచేయాలనీ 1869 నుండి ఉత్తరప్రత్యుత్తరాలు 30 సంవత్సరాల నుండి జరుపుతున్న విషయం పరిష్కరింప బడలేదని చెప్పింది. దేశంలో విద్యాభివృద్ధి జరుగుతున్న కొలది స్త్రీలను రక్షించే విషయాలను ఆలోచించి 372–373 సెక్షన్ లు సవరించాలని చేసిన విన్నపం 1911 సంవత్సరంలో కాస్త ముందడుగును వేయించిందని తేలియజేసింది. అంతేకాక, ఇదివరకు ప్రభుత్వం శిశుహత్య, నరబలులు, సహగమనాన్ని మాన్పించగలిగారనీ,

ప్రభుత్వం ఆలోచిస్తే వ్యభిచార గృహాలను నిర్మూలించగలరనీ, అటువంటి బాలికలకు రక్షణశాలను ఏర్పరచాలనీ, స్త్రీలను దేవాలయాలకు సమర్పించటం కూడా శాస్త్ర విరుద్ధమనీ, ఈ బిల్లువల్ల స్త్రీలను కాపాడవచ్చుని భావించినట్టు పత్రిక తెలియజేసింది.

*స్త్రీలను వ్యభిచార కూపాలనుండి కాపాడటం కూడా దేశాభివృద్ధి కార్యక్రమంలో భాగమని దానికై బిల్లును ప్రవేశపెట్టాలనే 'ఆకాంక్ష'ను రేకెత్తించిన వ్యాసమిది. వేశ్యావృత్తి నిషేధం గురించి ఆలోచించి, అది స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం లేకుండాచేస్తున్నదనీ, స్త్రీల లైంగికతపై ఉన్న పితృస్వామ్యపు హక్కును నిరసించటంగా భావించాలి.*

చిలంబి త్రిపురసుందరమ్మ 'స్త్రీవిద్య' (నవంబరు 1912 హిందూ సుందరి) ను గురించి వ్రాసిన వ్యాసంలో దైవదర్శనంతో జన్మసాఫల్యం చేసుకోవటంలో స్త్రీ పురుషులు సమానులే అనీ, పూర్వకాలంలో అరుంధతి, చంద్రమతి, దమయంతి, సీత, ఊర్మిళలు విద్యావంతులనీ, రెండు మూడు శతాబ్దాల క్రింద మొల్ల, తరిగొండ వెంగమాంబ, అచ్చమాంబ, డాక్టరు పరీక్ష వ్రాసి ద్వారకాబాయమ్మ, విద్యాపరిశ్రమ చేసిన సుబ్బలక్ష్మమ్మవంటి వారిని లోకం కొనియాడుతోందని తెలియజేసింది. అంతేకాదు, సర్వజన సామాన్యంబుగా జీవుడు ప్రాణవాయువును గూడుకొని శ్రోత్రేందియముద్వారా శబ్దమును విని వాగింద్రియం ద్వారా రచింపజేయుట విద్యయని అది అందరిలో సమానంగానే ఉంటుందనీ, విద్యకు అధిష్ఠానదేవత సరస్వతి అని పరమాత్ముడే నిర్ణయిస్తే స్త్రీ విద్య కూడదనటం తప్పని చెప్పింది. స్త్రీలు జ్ఞానహీనులుగా ఉండకూడదనీ, శాస్త్ర విచారణలచే మూర్ఖతను బాపుకోవటానికైనా ప్రతి ఒక్కరికి విద్య అవసరమని భావించింది. అంతేకాక ఇంట్లో పురుషుడు లేనప్పుడు వచ్చిన జాబును చదవటానికీ, వర్తక సమయంలో లెక్కలు తెలపటానికి, పిల్లలకు చదువు చెప్పటానికి, భగవద్గీతవంటి గ్రంథములు చదువుకోవటానికి తండ్రులు స్త్రీలకు విద్య నేర్పించాలని అభిప్రాయపడింది.

బెజవాడలోని భక్తిజ్ఞానవైరాగ్య స్త్రీసమాజ సభలో ఇవ్వటూరి లక్ష్మీనరసమ్మ చేసిన (నవంబరు 1912 హిందూసుందరి) ఉపన్యాసంలో ఆర్యావర్తంలో స్త్రీలకు విద్య అనవసరమని వాదిస్తున్నారు గానీ పూర్వము విద్యావంతులైన స్త్రీలుండేవారనీ, మధ్యకాలంలో బాలికలకు 12 సం.లు వచ్చినప్పటినుండి విద్య నేర్చుకొనే అవకాశం లేకుండా పోయిందని చెప్పింది. నేడు నాగరికులైన పురుషులు స్త్రీవిద్యను ఉద్ధరిస్తున్నాకాని స్త్రీలు విద్యావిహీనులైతే అభివృద్ధి ఉండదని చెప్పింది. అంతేకాక స్త్రీలు విద్యాస్వాతంత్ర్యానికై సంస్కృతం లేదా దేశభాషలలోని వేదార్థాలను, వేదాంతాన్ని గ్రహించాలనీ, అబలా సచ్చరిత్ర రత్నమాల గ్రంథంలో భండారు అచ్చమాంబ దేశ చారిత్రక స్త్రీల గొప్పతనాన్ని తెలియజేసారని తెలిపింది. విద్యలేని స్త్రీకి ధైర్యం ఉండదనీ, మండన మిశ్రుని భార్య ఆరుశాస్త్రాలు వేదాలు, చదివి తన పెళ్ళిముహూర్తమును తానే నిశ్చయించుకొని మండనమిశ్రుని వివాహము చేసుకొందని తెలియజేసింది.

*స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యసాధనకు స్త్రీల విద్యాస్వాతంత్ర్యమే ప్రధాన మార్గమని భావించారు. అంతేకాక స్త్రీలు ధైర్యంతో ఉండాలని భావించారు.*

ఇప్పగుంట వెంకమాంబ 'స్త్రీవిద్య'ను (నవంబరు 1912 హిందూసుందరి) గురించి చేసిన ఉపన్యాసంలో పూర్వము ఉన్నతవిద్యావంతులుండేవారనీ, ఇటీవల స్త్రీవిద్య నశించిందనీ, విక్టోరియా రాణి, ఎడ్వర్డ్ చక్రవర్తి, జార్జ్ చక్రవర్తి స్త్రీవిద్యను వెలుగులోకి తెచ్చారని చెప్పింది. స్త్రీలకు చదువు లేకపోవటంచేతనే గయ్యాళులు అనిపించుకుంటున్నారనీ, వితంతువులను బాధపెడుతున్నారనీ, విద్యవలన వివేకము కలుగుతుందనీ, స్త్రీలు విద్యావిలువను తెలుసుకోవాలని తెలియజేసింది.

*ఆధునిక యుగంలో స్త్రీవిద్యావ్యాప్తికి కృషిచేసిన నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి భారతస్త్రీలు కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిందేనేమో!*

వాడ్రేవు సుందరమ్మ వ్రాసిన 'సంఘసంస్కరణ విషయములు' (నవంబరు, డిసెంబరు 1912 వివేకవతి) అనే వ్యాసంలో స్త్రీ విద్యావంతురాలైతే పిల్లలను బడికి పంపిస్తుందనీ, విద్యను గురించి స్త్రీలు మూఢాభిప్రాయాలతో ఉన్నారనీ, స్త్రీ ఉద్యోగం చేయవచ్చనీ తెలియజేసింది.

'వితంతువుల కొక విన్నపము' (అక్టోబరు 1917 వివేకవతి పత్రిక) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ ఆకలి, ఆశ, సంతోషం, జబ్బులన్నవి వితంతువులకు ఉండవంటూ కుటుంబ వ్యక్తులందరూ వారిని చిన్నచూపు చూస్తుంటే ఇంటెడు చాకిరీ చేస్తూ బానితస్వంతో మగ్గుతున్నారని తెలిపింది. స్వాతంత్ర్యాన్ని పొందాలంటూ విన్నపము చేయాలనుకొని 'స్వాతంత్ర్యాత్సుఖమాప్నోతి, స్వాతంత్ర్యాల్లభతే పరాం, స్వాతంత్ర్యా న్నిర్వృతి గచ్ఛేథా, స్వాతంత్ర్యా త్పరమంపదం' అని స్వతంత్ర జీవనం యొక్క విలువను తెలియజేసింది. స్త్రీ, పురుషుల ఆత్మలొక్కటే అయినప్పుడు స్త్రీలు తెలివితక్కువ వారనటం తప్పనీ, స్త్రీలలోనూ సాహసులున్నారనీ, బాలురవలె బాలికలకు విద్య నేర్పించాలనీ, స్త్రీలు విద్యయనే నగతోనే అలంకరింప బడతారని చెప్పింది. స్త్రీవిద్యను గురించి ఉపన్యాసాలిచ్చే పురుషపుంగవులకు తమ భార్యలు విద్యావంతులవటం యిష్టం ఉండకపోవటం కూడా స్త్రీల అవిద్యకు కారణమనీ, కాబట్టి పురుషులు ముందుకొచ్చి కుటుంబంలోనూ సమాజంలోనూ స్త్రీ విద్యను ప్రోత్సహించాలని చెప్పింది.

ఈమె వ్రాసిన 'సంఘసంస్కరణ విషయములు' (నవంబరు 1917 'వివేకవతి' పత్రిక) అనే మరొక వ్యాసంలో గ్రహణం గురించి చేసిన పుకార్లను నమ్మవద్దనీ, ఒక గర్భిణీ తన కూతురుకి చంద్రగ్రహణం చూపిస్తూ అన్నంపెట్టినా, తరువాత ఆమెకుపుట్టిన బిడ్డ కెటువంటి మొర్రులు కలగలేదని తెలిపింది. కాసులకాశించేవారు చంద్రన్న పట్టిన భూతాన్ని నెలలో పోగొట్టగలమని చెప్పి జనానికి తమ గొప్పలు చెప్పాలనుకునే వారిని నమ్మద్దనీ, ప్రకృతిలో రాత్రింబగళ్ళు ఏర్పడటంలాంటి సహజ విషయాలవలె గ్రహణం కూడా ఒకటి అనీ, మనుషులు తెలివితో ప్రకృతి జ్ఞానాన్ని తెలిసికొని మంచి చెడ్డలను ఆలోచించాలని వాడ్రేవు సుందరమ్మ తెలియజేసింది.

*స్త్రీలకు స్వతంత్ర జీవనమే ఇహపరసౌఖ్యాలను యిస్తుందనే ఆధ్యాత్మిక భావన చేయటం జరిగింది. స్త్రీలు మూఢనమ్మకాలను పోగొట్టుకోవాలనీ, విజ్ఞానదృక్పథాన్ని పెంచుకోవాలని భావించింది. స్త్రీ విద్యాభివృద్ధి విషయంలో భర్తలకు ఉన్న కుహనతత్వాన్ని బయటపెట్టింది.*

కాశీనాధుని రామాబాయమ్మ 'ఆంధ్రమహిళాసభ' లో చేసిన ఉపన్యాసంలో (మార్చి 1913 హిందూసుందరి) స్త్రీల విద్యాస్థితిని తెలుపుతూ బాలికలు ప్రథమపాఠశాలలో చదువుట, వ్రాయుట, అంకగణితం వంటివి నేర్చుకుంటున్నారనీ, బాలికల చదువుకు తల్లిదండ్రులు ఖర్చుపెట్టటానికి యిష్టపడక పోవటంచేతనే బాలికావిద్య కుంటుపడుతోందనీ, భద్రతదృష్ట్యా బాల్యవివాహాలు చేస్తున్నారనీ, కాలానుగుణంగా ఈ బాలికావివాహ సంస్కృతి మారాలనీ, బాల్యవివాహమే సంఘముయొక్క దుర్బలత్వానికి కారణమని చెప్పింది. యువతీవివాహాలు జరిపే సంస్కరణలను దొరసానులు చేపట్టారనీ, బొంబాయిలో పదునారేండ్ల వరకు పెళ్ళికాకుండా స్వేచ్ఛాసంతోషాలతో చదువుకుంటున్న బాలికలున్నారనీ, చదువుకుంటున్న పార్శీస్త్రీలకు అవసరమైన స్వతంత్రం ఉందనీ, దీనులైన బాలవితంతువులకు పునర్వివాహం చేయాలని చెప్పింది. అంతేకాదు, వితంతు స్త్రీలకు ఉన్నతవిద్యను కల్గించాలనీ, శాస్త్రజ్ఞానం గల విద్య స్త్రీలకు అవసరమనీ, పురుషులకువలె శారీరకబలాన్ని కల్గించే వ్యాయామ విద్యలను అందిస్తే దేహారోగ్యం ఉంటుందనీ, బుద్ధిబలాన్ని పెంచే భాషాసాహిత్య గ్రంథపఠనం చేస్తే శిశుపోషణమువంటి శాస్త్రజ్ఞానం అలవడుతుందని తెలిపింది. స్త్రీల విద్యాభివృద్ధికై విజ్ఞానచంద్రికామండలి, ఆంధ్రభాషాభివర్ధనీ సంఘము కృషిచేస్తోందని మాతృభాషలో విజ్ఞానాన్నిపొంది, పరభాషలనునేర్చి ఆ భాషలలోని పుస్తకపఠనం చేస్తే విజ్ఞానం విస్తృతమవుతుందనీ తెలియజేసింది. అంతేకాదు, వేదాలలో స్త్రీ పురుషుల సమానత్వం ఉందనీ, ప్రస్తుతకాలంలో తల్లిదండ్రులు మగపిల్లవాడిని మడిమాన్యాలమ్మి చదివించుతున్నారుగానీ, ఆడపిల్ల చదువుకు అల్పవ్యయాన్ని పెడుతున్నారని చెప్పింది. అయినా చదువువచ్చిన ఆడపిల్లలు గంజాంలో 5327, విశాఖపట్టణంలో 7493, గోదావరి జిల్లాలు 11,793, కృష్ణాజిల్లా 16,199, గుంటూరు లో 8564, నెల్లూరులో 6214, కడప లో 2808, కర్నూలు 2844, మంది ఉన్నారనీ, కృష్ణాజిల్లాలో అధికంగాఉన్నారనీ, క్రైస్తవబాలికలు పెద్దవారైన తర్వాతకూడా విద్యను కొనసాగిస్తున్నారని చెప్పింది. బాల్యవివాహాలలో హిందూబాలికలు చదువును కొనసాగించటంలేదనీ, బాల్యవివాహాలు తగ్గితేనే దేశం బాగుపడుతుందనీ, పార్శీ స్త్రీలలో యువతీ వివాహాలేగానీ బాల్యవివాహాలు లేవనీ, వారు దేశభాషలో చదవుకుంటున్నారని తెలిపింది. బాలవితంతువుకు విద్య, పునర్వివాహం అవసరమనీ, స్త్రీలకు మనోవికాసం కలిగించే ప్రపంచజ్ఞానాన్ని తెలిపే విద్య కావాలనీ, వారిలో బుద్ధిబలం పెరగాలనీ, దానికై విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్రభాషావర్ధినీ సంఘం ఉన్నాయనీ, బుద్ధి వికసిస్తే శాస్త్రపరిజ్ఞానంతో పాటు పలు భాషలను నేర్చుకోవచ్చునికూడా తెలియజేసింది.

'ఆంధ్రస్త్రీల విద్యాస్థితి' (సెప్టెంబరు 1917 హిందూసుందరి) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ భారతదేశంలోని వంగ రాష్ట్రములో (బెంగాల్), బొంబాయి రాష్ట్రంలో స్త్రీ విద్యాభివృద్ధి ఉందనీ,

చెన్న రాష్ట్రంలో క్రైస్తవాంగనల విద్యాభివృద్ధి ఉందనీ, ఆంధ్ర స్త్రీల విద్యాభ్యాసం వెనుకబడి ఉండటానికి వారి విద్యాభ్యాసమునకు తగిన సదుపాయములు లేవని చెప్పటం జరిగింది. ఆంధ్ర దేశంలో ఒక్కటి కూడా స్త్రీల కళాశాల లేదనీ, చెన్నరాష్ట్రంలో గల 42 బాలికా మధ్యమ పాఠశాలలో 7 మాత్రమే ఆంధ్ర దేశంలోనూ, అక్కడ 1553 బాలికా ప్రథమ పాఠశాలలు ఉంటే 554 తెలుగు జిల్లాలలో ఉన్నాయనీ, ఉపాధ్యాయినుల పాఠశాలలు చెన్నరాష్ట్రంలో 22 ఉంటే తెలుగు దేశంలో 8 మాత్రమే ఉన్నాయనీ, ఇతర వృత్తి విద్యలు నేర్పే పాఠశాలలు ఆంధ్ర దేశంలో ఒక్కటి కూడా లేదని తెలియజేసింది. అంతేకాక ప్రథమ పాఠశాలలో 40,000 బాలికలు, మధ్యమ పాఠశాలలో 500 మంది బాలికలు, ఉపాధ్యాయిని వృత్తివిద్యయందు 120 మంది తెలుగు స్త్రీలు చదువుతున్నారనీ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఆంధ్రరాష్ట్రం ఉపస్థాపితం అయితేనే స్త్రీవిద్య ఆంధ్రదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతుందనీ, ఆంధ్రోద్యమాన్ని సాధించటంలో స్త్రీలుపాటు పడిననూ, స్త్రీవిద్యా స్వాతంత్ర్యాలు ఏర్పడలేదని చెప్పింది. ప్రభుత్వం ముఖ్య పట్టణాలలో స్త్రీల మధ్యమ పాఠశాలను, పురపాలనాధికారంతో ప్రతి పట్టణంలో బాలికలకు ప్రథమ పాఠశాలలను ఏర్పాటుచేయాలనీ, ఆంధ్రదేశమునందలి పాఠశాలలో జాతీయభావాలకు అనుకూలంగాఉన్న విద్యను, కళలను, నేర్పించాలని తెలియజేసింది. స్త్రీవిద్యా వ్యాప్తికై చెన్నపురిలో క్రైస్తవులు చేయు ప్రయత్నములు ప్రశంసింపదగినవనీ, ఆంధ్రస్త్రీలకు మాతృభాషను బాగుగా నేర్పటానికి విద్యాలయాలు లేవనీ, కొండ వెంకటప్పయ్య పంతులు గారు స్త్రీవిద్యాభివృద్ధికి శారదానికేతనాన్ని ప్రతిష్ఠించారనీ, దానివలన ఆంధ్రస్త్రీల అభివృద్ధి జరుగుతుందని విశ్వాసం ఏర్పడుతోందని తెలిపింది. వితంతుశరణాలయాల వంటి శరణాలయాలు ఆంధ్ర దేశంలో ఉంటే స్త్రీలను విద్యావంతులను చేసి స్వతంత్ర జీవనాధారాన్ని కల్పించవచ్చునీ, తాను సరోజినీదేవి ఉపన్యాసం వినటం వల్ల స్త్రీలకుదేశసేవ చేయగల సామర్థ్యం ఉందని అర్థమైందనీ, స్త్రీలు మాతృదేశాభిమానంతో తమ జ్ఞానాన్ని దేశసేవకు వినియోగించాలని కాశీనాథుని రామాబాయమ్మ తెలియజేసింది.

*హిందూవివాహ సంస్కృతిని విమర్శకుపెట్టి యితరమతస్థుల వివాహాలలోని స్త్రీలవిద్యాభివృద్ధిని పోల్చి చెప్పి హిందూబాల్యవివాహాలు స్త్రీ విద్యకు ఆటంకాన్ని కలిగించటమేకాక నిర్బంధ వైధవ్యంకూడా స్త్రీల బాధలకు కారణం అవుతున్నదని తెలియజేసింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాషాపరంగా జాతివివక్షను ఎదుర్కొంటున్న తెలుగు స్త్రీలవిద్యాభివృద్ధికి అవకాశాలు లేకపోతుంటే ఆంధ్రరాష్ట్రోద్యమభావాలను పెంచుకొని ఆంధ్రవిశ్వవిద్యాలయ స్థాపన జరగాలని కాశీనాథుని రామాబాయమ్మ ఆకాక్షించింది. ఆ తర్వాతే అంటే 1926 లో ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు.*

వింజమూరి వెంకటరత్నమ్మ 'స్త్రీల ముఖ్యవిధుల' (జూన్ 1913 హిందూసుందరి) ను గురించి వ్రాస్తూ స్త్రీలు తల్లిదండ్రులయందు, భర్తకు విధేయతతో ఉండవలెను గానీ, భర్త భార్యను బానిసగా చూడరాదని తెలిపింది. స్త్రీలు శిశుసంరక్షణను, దేహారోగ్యం గురించి ఆహారమూ,

శుభ్రమైన వస్త్రధారణ, పశుసంరక్షణ, తరురక్షణ వంటి సద్విద్యలు నేర్చుకోవాలని, బాల్యవివాహాలు చేయకూడదనీ, వితంతువులకు విద్యను నేర్పించి వారిని ఉపాధ్యాయినులుగా తీర్చిదిద్దటం వంటివి స్త్రీల ముఖ్యవిధులని పేర్కొంది.

'శ్రీమతి కె.కనకమ్మగారి చరిత్రము' (జులై 1913 హిందూసుందరి) అంటూ ఆమెను గురించి పత్రికాసంపాదకురాలు తెలియజేస్తూ 1893 లో గుంటూరులో జన్మించిన కనకమ్మ 1900 లో బాలికాపాఠశాలలో ప్రవేశించి 1904 వరకు చదివిందనీ, ఆ తర్వాత పెళ్ళిజరిగి, వైధవ్యం కలుగగా నెల్లూరిలోని అన్నగారింటికి వెళ్ళి 1906 లో నెల్లురులోని బాలికాపాఠశాలలో తిరిగి ప్రవేశించి 3 వ ఫారం వరకు (అంటే 8వ తరగతి) చదివిందని తెలిపింది. ఆ తర్వాత ట్రైనింగ్ కోర్సు చదివి 1910లో నర్సాపురం పరీక్షకు వెళ్ళి ప్రథమస్థానం పొందిందనీ, తాను చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయినిగా చేరిందనీ, తర్వాత విజ్ఞాన చంద్రికా పరిషత్ పరీక్షలు వ్రాసి సువర్ణపతకాన్ని పొందిందనీ, ఆమెలో సంపూర్ణ దేశాభిమానం ఉండటంచేతనే స్త్రీ విద్యావిషయంలో కార్యక్రమాలు చేపట్టిందని చెప్పింది. స్త్రీ సమాజాలవల్ల స్త్రీలలో పెరిగే ఐకమత్యం, జ్ఞానం, సామాజిక చలనంవల్ల స్త్రీలు వివేకవంతులు కాగలిగితే ఆ స్త్రీలను వారి భర్తలు కూడా గౌరవిస్తారనీ, స్త్రీల సమస్యలను గురించి చర్చించుకుంటూ అవగాహన చేసుకోవచ్చునీ కనకమ్మ చెప్పిందని తెలియజేస్తూ ఆమెయే కవితిలక కాంచనపల్లి కనకాంబగా ప్రసిద్ధిపొందిందని తెలియజేసింది.

కాంచనపల్లి కనకమ్మ 'వివేకము' (సెప్టెంబరు 1913 వివేకవతి) ను గురించి వ్రాసిన వ్యాసంలో మనిషి యొక్క తెలివియే జంతువుల నుండి వారిని వేరుగా నిరూపింపబడుతుందనీ స్త్రీ, పురుషులకు 'వివేకము' మానసిక వృత్తియై యుంటుందనీ, స్త్రీ, పురుషులిద్దరిలో బుద్ధిమంతులు, బుద్ధిహీనులు ఉంటారనీ, స్త్రీలను మాత్రం బుద్ధిహీనులని అనకూడదని తెలిపింది. ప్రతి కార్యమును చక్కగా తెలుసుకొనుట విద్యయనీ, దానినే తెలివి అంటారనీ, పుస్తకాలు చదవటంతోపాటు లోకజ్ఞానాన్ని గ్రహించాలనీ, దానికోసం అనేక కర్మలజ్ఞానాన్ని, మనోవృత్తులను తెలుసుకోవాలని భావించింది. విక్టోరియారాణి బాలికలపాఠశాలలనుపెట్టి స్త్రీలయొక్క బుద్ధికుశలతలను చిగుర్చేటట్లు చేసారనీ, స్త్రీలు విద్యావంతులైతే బిడ్డల పెంపకం బాగుంటుందనీ, బిడ్డలయభివృద్ధియే దేశౌన్నత్యానికి ప్రధానకారణమని చెప్పింది. స్త్రీలు తెలివిని ఉపయోగించి యుక్తాయుక్త విచక్షణా జ్ఞానంతో స్వదేశాభివృద్ధిని చేయగలరనీ, అందుకు స్త్రీలు సంఘములుగా జేరి, ఆత్మగౌరవంతో ఉత్తమకార్యములను చేయవలెనని తెలియజేసింది.

కె .కనకమ్మ చేసిన ఉపన్యాసంలో (నవంబరు 1913 హిందూ సుందరి) నెల్లూరు పట్నంలో వైశ్యబాలికారత్నమైన పూలమ్మనుగురించి తెలియజేస్తూ, నరసాపురమునందలి 'స్త్రీవిద్యాభి వర్ధనీ సంఘం' వారు పెట్టిన పరీక్షలో పూలమ్మ జయాన్ని పొందిందని తెలియజేస్తూ, వైశ్యజాతిస్త్రీలు విద్యాభివృద్ధికై తోడ్పడుచుండటమే దేశస్త్రీల అభివృద్ధికి అనుకూలకాలమని చెప్పింది. స్త్రీలకు

విద్యలేకపోతే దేశము అభివృద్ధిచెందదనీ, వేదకాలంలో 'గార్గి' అనే స్త్రీ బ్రహ్మవిద్యా విశారదురాలుగాను ఉండేదనీ 'వాక్కు' అనునామె సూక్తములను రచించినదనీ, బౌద్ధకాలంలోనూ విద్యావంతులైన స్త్రీలున్నారనీ, కవిత్వం చెప్పిన కుమ్మరిస్త్రీలు ఉన్నారనీ, దేశాభివృద్ధికి స్త్రీవిద్య ముఖ్యమని తెలియజేసింది.

'విద్యావశ్యకత' ను (ఏప్రిల్ 1914 హిందూసుందరి) గురించి కె. కనకమ్మ వ్రాస్తూ జపాను ఫిలిప్పైన్ దీవుల స్త్రీలు విద్యవల్ల అభివృద్ధి చెందారనీ రష్యను స్త్రీలు భర్తలతో యుద్ధ భూమికి ఏతెంచి ఫిరంగి గుండ్లను, వ్రయ్యలయిన ఓడలను తిరిగి బాగుచేయటం వంటి వీరరసపు పనులతో సహకరించటం చేతనే ఆ దేశం విజయాన్ని పొందగలిగిందని తెలిపింది. ఆర్ద్రహృదయం, సహానుభవం, శాంతం, శిక్షాధర్మప్రవేశం, శాస్త్రపరిజ్ఞానం, ప్రపంచ పరిచయంగల తల్లులు శిశువులయందలి శక్తిని, సామర్థ్యాన్ని, వివేకాన్ని పెంచేవిధంగా తగిన సమయంలో ప్రబోధించ గలరనీ, దానికి తల్లులకు విద్యాజ్ఞానం అవసరమని కె. కనకమ్మ చెప్పింది.

'స్త్రీవిద్య'ను గురించి కనకాంబ చేసిన ఉపన్యాసం (మార్చి 1915 హిందూసుందరి)లో స్త్రీ పురుషులందరి బుద్ధిబలాలు సమానమేనని, అల్పవిద్యతో పదార్థ విషయములందు గుణదోషము లను గ్రహించు జ్ఞానం లభించదు కాబట్టి స్త్రీలు కేవలం చదవటం వ్రాయటమేగాక ఉన్నత విద్యావంతులు కావాలని చెప్పింది. శిశుపోషణకై విద్య అవసరమనీ దానికి తల్లులు బాధ్యత వహించాలనీ, దేశాభివృద్ధికి స్త్రీలే ముఖ్యకారణమనీ, విద్యావంతులైన పూర్వకాలపు స్త్రీలు దీనికి ఉదాహరణ అనీ, బాలికలకు విద్యనేర్పిస్తేనే వారియొక్క స్వాభావిక ప్రజ్ఞ, బుద్ధి స్వాతంత్ర్యం వెల్లడి అవుతుందని తెలిపింది. ఆదాయవ్యయాలను కనిపెట్టి భర్తకు చేదోడు వాదోడుగా ఉండగలుగుతారనీ వివిధదేశ చరిత్రలు చదివితే మానవజాతి అభివృద్ధి కూడా ముఖ్యమని తెలుసుకుంటారనీ, అప్పుడే సగభాగంగా ఉన్న భారతీయస్త్రీల అభివృద్ధి 50 శాతంగా ఉంటుందని తెలియజేసింది.

'స్త్రీ విద్యావశ్యకత' (మే 1917 హిందూసుందరి) ను గురించి ఈమె వ్రాస్తూ భారతదేశంలో పూర్వకాలంలో విద్యావంతులైన స్త్రీలున్నారనీ, వేదమంత్రాలను రచించిన స్త్రీలున్నారనీ, విద్యయనగా డిగ్రీలు కాదనీ, విద్యవలన యుక్తాయుక్తము తేటపడి దుర్బుద్ధి నిర్మూలన జరిగి సద్బుద్ధి వృద్ధిచెంది ధర్మకార్యాశక్తిని కలిగించటమే విద్య అని తెలిపింది. "చదువునకు సాటియననయ్యది యే లోకమున లేదని యందురుగానన్ జదివింపవలయు నబలల, జదువెఱుగని యాడుదాని జన్మమేలో" అని జన్మసార్థకం చేసుకోవాలంటే స్త్రీలు కూడా విద్యను అభివృద్ధి చేసుకోవాలని కాంచనపల్లి కనకమ్మ తెలియజేసింది.

*స్త్రీలు ఎటువంటి విద్యనేర్చుకోవాలో తెలియజేస్తూ విద్యద్వారా మంచిచెడులను గురించిన తెలివి కలిగియుండటమే మనిషిలక్షణమనీ, ఆ తెలివితోనే స్త్రీలుస్వదేశాభివృద్ధికి పాటుపడగలరని*

*తెలియజేసింది. దేశాభివృద్ధిలో స్త్రీల సగ, సహ భాగస్వామ్యాన్ని గుర్తించమని రచయిత్రి తెలియచేయటం విశేషం. స్త్రీపురుషుల మేధాశక్తి సమానమేనని చెప్పి స్త్రీలలో ఆత్మన్యూనతను పోగొట్టే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా వృత్తివిద్యలతో పాటు, మనోవిజ్ఞాన విద్యను నేర్చుకోవాలని చెప్పటమంటే స్త్రీలు సమాజాన్ని చదవాలని భావించింది. అప్పటివరకు పతిసేవయే పరమార్థంగా భావించే స్త్రీలు చదువుకోవటమే జన్మసార్థక్యంగా భావించటం అర్థమవుతుంది. అంతేకాదు, విద్య భూమికగా ఉంటేనే దానినుండి స్వాతంత్ర్యవృక్షం అభివృద్ధి చెందుతుందని కాంచనపల్లి కనకమ్మ భావించింది.*

'కాంచనపల్లి కనకమ్మ' (సెప్టెంబరు 1913 వివేకవతి) ను గురించి పత్రికా సంపాదకురాలు వ్రాస్తూ చెన్నపురిలోని విజ్ఞానచంద్రికా పరిషత్తు నిర్వహించిన పరీక్షల్లో సాహిత్యము, చరిత్ర ప్రకృతి శాస్త్రములలో కనకమ్మకు ఎక్కువమార్కులు వచ్చినందుకు సువర్ణపతకాన్ని బహూకరించారనీ, ఆమె యితరులకు స్ఫూర్తిప్రదాత అని పేర్కొంది. బాలికాపాఠశాలలో ఉపాధ్యాయినులు ఉండటంచేత ఎక్కువమంది బాలికలు చదువుకోగలుగుతారనీ, స్త్రీ పురుషులు దేవునికి మాత్రమే ఉత్తరవాదులనీ, వితంతువుగా స్త్రీ శిక్షింపబడకూడదనీ, స్త్రీ పురుషులు ఇంటిదగ్గర విద్యాభ్యాసం చేయటానికి విజ్ఞానచంద్రికా పరిషత్తు నెలకొల్పబడిందని తెలిపింది. స్త్రీగా పురుషవిద్యార్థులకంటె కనకమ్మ ఎక్కువ మార్కులు తెచ్చుకోవటమే, స్త్రీలు పురుషులకంటె తక్కువగాదని నిరూపింపబడిందనీ, మద్రాసులో ముద్రింపబడిన విజ్ఞానసర్వస్వములో అన్ని ప్రాచ్య, పాశ్చాత్య దేశాల శాస్త్రవిజ్ఞానం, కళలకు సంబంధించిన విషయాలు ఉన్నాయనీ తెలియజేసింది.

కొటికలపూడి సీతమ్మ 'సత్కార్యోత్సాహము' (జులై 1913 హిందూసుందరి)ను గురించిన వ్రాసిన వ్యాసంలో స్త్రీసమాజాలు కలిసి లోకానికి ఉపయోగపడే విషయమాలను చర్చించుకొనే ఉత్సాహం చూపటం, విద్యావంతులైన స్త్రీలు తోటిస్త్రీలు చదువుకోవటానికి వీలుగా పుస్తక భాండాగారాలను ఏర్పరచటంవంటివి చేస్తున్నారని తెలిపింది. కందుకూరి వీరేశలింగంగారి భార్య అయిన రాజ్యలక్ష్మమ్మ ప్రార్థనా సమాజాలను ఏర్పాటుచేసి స్త్రీలు పరస్పరం సమావేశ మయ్యేటట్లు చేయటమే సత్కార్యోత్సాహమనీ, అది అభివృద్ధి సూచకమనీ, స్త్రీలకు సాధ్యమైన కార్యక్రమాలలో భాగంగా తాము ఆచరించే దురాచారాలను తొలగించుకోవటం చేయాలని భావించింది. వితంతువు కూడా పునిస్త్రీలవలె అన్ని పనులు చేయవచ్చనీ, వారును స్త్రీసమాజాలకు వచ్చి విద్యనభ్యసించి, స్వతంత్రతను పొంది దేశోద్ధారక కార్యక్రమాలు చేపట్టాలనీ, వారికి వీలుగా వితంతు శరణాలయాలు ఉన్నాయనీ, స్త్రీలపాఠశాలలో విద్యావంతులైన వితంతువులు ఉపాధ్యాయినులుగా చేరితే బాలికావిద్య అభివృద్ధి చెందుతుందనీ దానికి ఉదాహరణగా కాంచనపల్లి కనకాంబ అని తెలియజేసింది.

*వితంతుస్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని అనుభవించే అర్హత ఉందని వారిలో చైతన్యాన్ని కలిగించింది.*

ఆదుర్తి భాస్కరమ్మ వ్రాసిన 'బాలికా వివాహములు' (జులై, ఆగష్టులలో 1913 హిందూ సుందరి) అనే వ్యాసంలో అతిబాల్యవివాహములు హిందూమతవిషయమైనదనీ, ఇదొక దురాచారమనీ, వేదకాలంలో ఇటువంటి వివాహాలు లేవనీ, స్త్రీలు తమకు యుక్త వయస్సు వచ్చిన తర్వాత స్వయంవరంద్వారా గాని తల్లిదండ్రుల అనుమతితోనూ తగిన వరుడ్ని నిర్ణయించుకునేవారని తెలిపింది. పురాణయుగంలోనూ ప్రౌఢవివాహాలున్నాయనీ, నేడు బాల్యవివాహాలతో వివాహం అంటే అవగాహనలేని పసికూనలకు పెళ్ళిళ్ళుచేస్తున్నారనీ, వితంతువులైన ఆ బాలికలు నిర్బంధవైధవ్యాన్ని అనుసరిస్తూ దుఃఖితులగుచున్నారని చెప్పింది. పురుషులు అక్కరకు వస్తారు కాబట్టి విధురులైన (భార్యావియోగులు) పురుషులకు నిర్బంధాలుండవనీ, స్త్రీలకు మాత్రం పెడుతున్నారనీ, స్త్రీలు పురుషులు సమానంగానే చనిపోయినా పురుషులకు పెళ్ళిళ్ళు, స్త్రీలకు వికృత రూపాలను ఏర్పాటుచేస్తున్నారని పేర్కొంది. స్త్రీలలోనూ శౌర్యపరాక్రమాలున్నాయని చరిత్ర తెలుపుతోందనీ, పురుషులకున్న వివాహ సంస్కృతివల్ల వయసులో పెద్దవాడికిని చిన్నబాలికకు పెళ్ళిచేయటంవల్ల, బాలికలు చిన్నవయస్సులో గర్భం దాల్చటం జరుగుతోందని తెలిపింది. ఇటువంటి వివాహాలవల్ల స్త్రీల విద్యకు నష్టం కల్గుతోందనీ, విద్యలేమిచే శిశుపోషణం సరిగా చేయలేకపోతున్నారనీ, ఇటువంటి విషయాలలో సంస్కరణ వాదులు బయట ఉపన్యాసాలేగానీ, ఇంట్లోమాత్రం తమ స్త్రీలమాటవల్ల బాల్యవివాహాలు చేస్తున్నట్టు వాపోవటం కనబడుతోందని తెలియజేసింది.

*బాల్యవివాహాలకు కారణాలను విశ్లేషించి, వాటివల్ల నష్టాలను తెలియజేసింది. బాల్యవివాహాలను సంస్కరించే విషయంలోని కుహనాతత్వాన్ని బయటపెట్టింది.*

దేవరకొండ వెంకటసుబ్బమ్మ వ్రాసిన 'మన యభివృద్ధియెట్లు?' (సెప్టెంబరు 1913 హిందూ సుందరి) అనే వ్యాసంలో పూర్వకాలమందు హిందూస్త్రీలలో విద్యావంతులు, పరాక్రమవంతులు ఉన్నారనీ, కాని నేడు స్త్రీలు ఇంటిలో బానిసలుగా ఉన్నారనీ, స్త్రీజాతి అభివృద్ధి చెందితేనే సంఘము, దేశము అభివృద్ధి చెందుతుందని తెలిపింది. సమాజంలో స్త్రీవిద్య, స్త్రీకి స్వాతంత్ర్యం ఉండాలని సంఘసంస్కర్తలు కృషిచేస్తున్నారనీ, స్త్రీలు వైద్యగ్రంథాలు, గృహనిర్వాహకత్వం, శిశుపోషణ, పాకశాస్త్రం, ఆరోగ్యశాస్త్రంతోబాటు గృహాదాయవ్యయములను చక్కని గణితశాస్త్రాన్ని అభ్యసించాలని చెప్పింది. రాజకీయవిద్యకాబట్టి ఇంగ్లీషు నేర్చుకోవాలనీ, బాల్యవివాహాలు కన్యాశుల్క, వరశుల్కాలను నిర్మూలించాలనీ, బాలికాపాఠశాలలో స్త్రీలను ఉపాధ్యాయినులుగా ఉంచాలని ప్రభుత్వాన్ని కోరాలని తెలియజేసింది.

*స్త్రీజాతి అభివృద్ధిచెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించింది.*

వై.వి.రంగనాయకమ్మ 'అనాథస్త్రీవిద్యాభివృద్ధి' (సెప్టెంబరు 1913 హిందూసుందరి) ని గురించి వ్రాస్తూ విశాఖపట్నంలో వితంతువులకై ఉన్నత విద్యాలయం స్థాపించారనీ, భర్తపోయిన స్త్రీలు దుఃఖంలో మునిగిపోయి యింటిచాకిరికి పరిమితం కాకుండా ఈ బాలికా విద్యాలయాలలో చేరాలని పిలుపునిచ్చింది. స్త్రీలు వైద్యురాండ్రుగా, ఉపాధ్యాయినులుగా వృద్ధిచెందాలనీ, సమాజ

విమర్శకు వెరవవద్దనీ ఆంగ్లేయుల పాఠశాలలో హిందూబాలికలకు ప్రవేశం ఉందనీ, క్రైస్తవమతాన్ని బోధించరనీ, ఇంటిదగ్గర దేశభాషలు చదివినా ఇంగ్లీషులో శాస్త్రజ్ఞానం ఉంటుంది కాబట్టి అవన్నీ తెలుసుకోవాలంటే ఉన్నతవిద్యాలయాలకు వెళ్ళాలనీ, అదే స్త్రీలకు రాజమార్గమని తెలియజేసింది.

*సమాజంలో వితంతుస్త్రీలు ఎక్కువ కాబట్టి వారి విద్యాభివృద్ధి ముఖ్యమని భావించారు. ప్రత్యేకంగా ఉన్నతవిద్యాలయం ఉందని వితంతుస్త్రీలకు తెలియజేసే ప్రయత్నం జరిగింది. వితంతు ఉన్నతవిద్యాలయ విద్యార్థినిగా రచయిత్రి తోటిస్త్రీల విద్యాభివృద్ధికై చేసిన ప్రయత్నం అర్థం అవుతోంది.*

బులుసు సూరమ్మ 'అవున్నత్యము' (అక్టోబరు 1913 హిందూసుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో విద్యావంతులైన స్త్రీలుగా వితంతువులు పల్లెల్లోకి వెళ్ళి స్త్రీవిద్యను గురించి ఉపన్యాసాలివ్వాలనీ, అక్కడ స్త్రీసమాజాలను ఏర్పరచాలనీ, దేశాభ్యుదయం దేశస్త్రీల మీదనే ఆధారపడి ఉంటుందని దేశచరిత్రలు ఘోషిస్తున్నాయని చెప్పింది. స్త్రీజాతిని ఉద్ధరించటానికి స్త్రీలసదుద్యమంలో భాగంగా స్త్రీలు 'ఇండియా సేవకసంఘం' వంటి సంఘాన్ని స్థాపించి ప్రతిపల్లెలోనూ ఉపసంఘాలను ఏర్పాటుచేయాలనీ, స్త్రీలకు విద్యాగంధం కలిగేవిధంగా వితంతు స్త్రీలు ప్రయత్నించాలని తెలియజేసింది.

*దేశాభివృద్ధిలో వితంతువులపాత్ర గొప్పదని తెలియజేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించటం అర్థంఅవుతుంది. ఈ ఆలోచనలే స్త్రీలలో దేశస్వాతంత్ర్యసాధనకు దారులు వేసాయి. వితంతువులు కూడా ఒక సంఘాన్ని ఏర్పరచుకొని పల్లెల్లో స్త్రీవిద్యాభివృద్ధికి పాటుపడమని చెప్పింది.*

పులివర్తి ఈశ్వరమ్మ 'ప్రస్తుతోన్నతవిద్య' (జనవరి 1914 హిందూసుందరి) ను గురించి వ్రాస్తూ బాలికాపాఠశాలలో విద్యాభ్యాసానంతరం స్త్రీలు ఉన్నతవిద్యను అభ్యసిస్తేనే శాస్త్రజ్ఞానం కలిగి సమస్త ధర్మాలను, పాండిత్యాన్ని పొందగలరనీ, లౌకిక జ్ఞానాన్ని తెలిపే ఆంగ్లభాషా పాండిత్యాన్ని పొందవచ్చని తెలిపింది. తండ్రి విద్యాభిమాని అయితేనే కూతురిని ఉన్నతవిద్యను అభ్యసించేటట్లు చేస్తున్నాడనీ, ఉపాధ్యాయులుకూడా బాలికల విద్యాభివృద్ధికి తోడ్పడాలనీ, స్త్రీలు గణితము, చరిత్రాన్ని చదువుకోవాలనీ, బాలికలకు నరసాపురి పరీక్ష వ్రాయటమే ఉన్నతవిద్యగా ప్రస్తుతం ఉన్నదనీ, వారిని దొరతనంవారు ఉపాధ్యాయినులుగాను నియమిస్తున్నారనీ, దానివల్ల బాలికా విద్య అభివృద్ధి చెందుతోందని తెలియజేసింది.

బెజవాడలో ఏప్రిల్ 11-12 వ తేదీలలో 1914 సంవత్సరంలో ఏర్పాటు చేసిన (ఏప్రిల్ 1914 హిందూసుందరి) ఆంధ్రమహిళా మహాజన సభలో చర్చించబడే విషయాలను గురించి ఆ సభకు కార్యదర్శులుగా ఉన్న ముద్దాసుబ్బమ్మ, అయ్యదేవర దుర్గాంబ సంయుక్తంగా తెలియజేస్తూ - స్త్రీల ఉన్నతవిద్యాభివృద్ధికై అధికసంఖ్యలో బాలికాపాఠశాలలు ఏర్పడాలనీ, వితంతురక్షణ, స్త్రీ శరణాలయాలుండాలనీ, ఉపాధ్యాయినీ నియామకానికి అర్హతగా గుర్తింపునివ్వాలనీ, యుక్తవయస్సు

వచ్చిన బాలికలను పాఠశాలలకు పంపేటట్లు చూడాలని చర్చకు పెట్టాలనుకొన్నట్లు తెలిపింది. స్త్రీధనాన్ని కాపాడుకునే మార్గాలను బోధించాలనీ, శిశుసంరక్షణ, గృహనిర్వాహకత్వం, ఆరోగ్యశాస్త్రాలను పాఠశాలలో నేర్పి బాలికలకు 16 సంవత్సరములు వచ్చిన తరువాత వివాహం చేయాలనే నిబంధన, కన్యాశుల్కం, వరశుల్కాలను నిషేధించుట, 40 ఏళ్ళ పైబడిన పురుషునికి కన్యనిచ్చి వివాహం చేయరాదని పేర్కొన్నారు. వర్ణాలలోని అంతశ్శాఖల భేదాన్ని పోగొట్టుకొనుట, సమాజాలను అభివృద్ధి పరుచుటవంటి కార్యక్రమాలను సభలో చర్చించే విషయాలుగా నిర్ణయించటం జరిగింది.

*సభలలో సమర్థవంతంగా స్త్రీలకు సంబంధించిన చర్చలను నిర్వహించాలనుకోవటం స్త్రీల ప్రగతి సూచకంగా భావించాలి.*

'ఆంధ్రోద్యమం' (ఏప్రిల్ 1914 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే శీర్షిక క్రింద యం.సుశీల వ్రాస్తూ ఆంధ్రదేశోద్యమం అంటేనే ఆంధ్రజాతీయతనుద్ధరించే సాధనం అనీ, హైందవ జాత్యోద్ధరణకు ఆంధ్రోద్యమం ముఖ్యమనీ, దత్తమండలంలో కళాశాలలు, పత్రికలు లేవనీ ఉన్నత విద్యనభ్యసించిన యువకులు పోరాడుతున్నారని తెలిపింది. వ్యవసాయానికి ఉపయోగపడే పారిశ్రామికవిద్యలు అవసరమనీ, మసరీన్(మచిలీపట్నం)వస్త్రాలతో పరదేశాలకు వ్యాపారాభివృద్ధి జరగాలనీ, ఆంధ్రభాష గొప్పతనాన్ని గుర్తిస్తేనే విద్యావంతులు కాగలరని సమగ్ర మానవ జాతీయోద్ధరణానికి 'ఆంధ్రోద్యమము' మార్గదర్శకం కావాలని తెలియజేసింది.

*జాత్యుద్ధరణకోసం ఆంధ్రోద్యమం సాగాలనుకోవటంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికిగల చరిత్ర ప్రారంభమైందని అర్థం అవుతుంది. 1911 నుండి కొనసాగుతున్న ఆంధ్రోద్యమం స్వాతంత్ర్యోద్యమానికి సమాంతరంగా జరుగుతూనే ఉంది.*

చట్రాతి లక్ష్మీనరసమ్మ 'స్త్రీ విద్యావిధానము' (హిందూ సుందరి జూన్ 1914)ను గురించి వ్రాస్తూ స్త్రీజన జీవనానికి మూలకందమైనవి శాస్త్రీయ, శిల్ప, సాహిత్య, కర్మలనే చతుర్విధ విద్యలనీ శాస్త్రము-సాహిత్యాలు అనే రెండు విద్యలు నేర్చుకోవటానికి స్త్రీ, పురుషులు సమానంగా అర్హులనీ, వృత్తిపరమైనవి అభిరుచిని బట్టి నేర్చుకోవచ్చునీ తెలియజేసింది. నవనాగరికతలో భాగంగా స్త్రీలలో ఉన్నతవిద్య అంకురిస్తోందనీ, కాని దేశంలో స్త్రీవిద్య తగినట్టుగా వ్యాపించటంలేదనీ, స్త్రీవిద్య సంఘజీవనానికి అత్యావశ్యకమనీ, కాలానుగుణధర్మాన్ని అనుసరించి కార్యాలను నిర్వహించాలనీ, అహేతుక కాంక్షను విడనాడి, నవీనములలోని మంచిని గ్రహించి స్త్రీలు విద్యావంతులు కావాలని తెలియజేసింది.

ఈమె 'స్త్రీ స్వతంత్ర జీవనావశ్యకత'ను ( ఏప్రిల్ 1916 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) గురించి మరొక వ్యాసాన్ని వ్రాస్తూ విద్యావంతులైన స్త్రీలు తమబిడ్డల విద్యాభివృద్ధికై ప్రోత్సహిస్తున్నారనీ, స్త్రీలు గృహకృత్య నిర్వహణలో సమర్థులుగా ఉన్నారు గాని వారికి స్వతంత్ర

జీవనం అవసరమని వారు భావించటం లేదని తెలిపింది. పూర్వము స్త్రీ, పురుషులు కలసి వృత్తులు చేసుకునేవారనీ ఇప్పుడు స్త్రీలు నవీన విజ్ఞానాన్ని పొంది వ్యాపారవేత్తలై జీవించాల్సిన అవరసముందని అందరూ గుర్తించాలని తెలియజేసింది. ద్రవ్యము పదార్థ రూపముగ మారినప్పుడే అభివృద్ధి అనేది జరుగుతుందనీ ఆర్థికాభివృద్ధి లేనిది దేశాభివృద్ధి జరగదనీ, స్త్రీలు పురుషులతో పాటు వివిధ విద్యలు నేర్చితే వారికి స్వతంత్రజీవనం ఉంటుందనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలిపింది. స్త్రీలకు ఆర్జనావకాశం యిచ్చి వారికి స్వాతంత్ర్యం యిస్తేనే ఐకమత్యం పెరిగి వారిలో దేశాభిమానం పెరుగుతుందని చట్రాతి లక్ష్మీనరసమ్మ తెలియజేసింది.

*స్త్రీలు పురుషులవలె శాస్త్రవిద్యలను అభ్యసించాలని భావించింది. ప్రతివిషయంలో స్త్రీలు సమానమైన వ్యక్తిస్వాతంత్ర్యాన్ని కోరుకోవటం అర్థమవుతుంది. స్త్రీలు హేతుపూర్వకమైన నూతన ఆలోచనలుచేయాలని భావించింది. స్త్రీల స్వతంత్రజీవనావశ్యకతను గుర్తించటమే వారి స్వేచ్ఛకు చిహ్నంగా భావించింది. దేశఆర్థికస్థితిని పెంచగలిగే మార్గాలను రచయిత్రి ఒక ఆర్థికశాస్త్రవేత్తగా తెలియజేస్తూ స్త్రీలు వస్తూత్పత్తిరంగానికి ఉపయోగపడే వివిధ విద్యలు నేర్చుకొని నాటి కాలానుగుణంగా స్త్రీలు వ్యాపారవేత్తలుగా ఎదగగలిగితేనే స్త్రీలకు స్వతంత్రజీవనం ఏర్పడుతుందని భావించింది. అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేస్తూ స్త్రీవిద్యకు, స్త్రీస్వతంత్ర జీవనానికి, జాతీయాభిమానానికి ఉన్నలంకెలను చట్రాతి లక్ష్మీనరసమ్మ నాడే పట్టుకోవటం గొప్పవిషయం.*

ఏకా వెంకటరత్నమ్మ సత్యవర్ధినీ సమాజోత్సవంలో 'స్త్రీవిద్య' (జులై 1914 హిందూ సుందరి) ను గురించి ఉపన్యసిస్తూ, కొందరు రాజభక్తికి వ్యతిరేకమైన పనులు చేస్తున్నారనీ, ప్రస్తుతం చల్లని ప్రభుత్వం ఉందనీ, విద్యావ్యాపారాలు అభివృద్ధిచెందుతున్నాయనీ, రైలు, తంతివార్తలు, ఉపయోగకరంగా ఉన్నాయనీ, జార్జి చక్రవర్తికి, హార్డింజి ప్రభువుకు బెంగాల్ విభజనను రద్దు చేసినందుకు మంచి జరగాలని చెప్పింది. స్త్రీవిద్య అభివృద్ధి చెందాలనీ, అతిబాల్యవివాహాలు కన్యా, వరశుల్కాలనే దురాచారాలున్నాయనీ, విద్యాగ్రహణంవల్ల స్త్రీలు సత్ప్రవర్తనులుగా ఉంటారనే భావన ఉండబట్టే నాగరికమైన అమెరికా, ఐరోపావంటి దేశాలలో స్త్రీలు విద్యావంతులుగా ఉన్నారనీ, బాలికాపాఠశాలలో స్త్రీలు ఉపాధ్యాయినులుగా ఉండాలని తెలియజేసింది.

వెన్నా మంగతాయారమ్మ 'స్త్రీవిద్య' (అక్టోబరు 1914 హిందూసుందరి) ను గురించి వ్రాస్తూ విద్యావశ్యకత అందరికీ సమానమేననీ, బాలికలకు విద్యనేర్పించాలనీ, విద్యాచట్టం స్త్రీలకు ఉపయుక్తమగు విద్యలను నేర్పాలనీ, దేశచరిత్ర గణితం, భాషాజ్ఞానం, శారీరకశాస్త్రాలు, శిశు పోషణం, పాకశాస్త్రం, సంగీతం, చిత్రలేఖనాలు వంటి విద్యలను నేర్పాలని తెలిపింది. ఆరోగ్యంగా ఉండి ఇంటినిర్వహణ చేయగలిగితేనే భవిష్యత్తుల్లో స్త్రీలు రాజకీయోద్యోగాలు చేయగలుగుతారనీ, మాతృభూమిని సంస్కరించుకొనే విధంగా స్త్రీ విద్యావ్యాప్తికి కృషిచేయాలని చెప్పింది. ఇది ఆమె యొక్క క్రాంతదర్శనానికి మచ్చుతునక.

*స్త్రీల జీవితాలలో విద్య, ఆరోగ్యం యొక్క ప్రాధాన్యతను తెలియజేసింది. వివిధ శాస్త్రాధ్యయనంతో కూడిన స్త్రీల గృహనిర్వహణాసామర్థ్యమే వారు చేయగల రాజకీయ ఉద్యోగాలకు అర్హతగా భావించింది. స్త్రీలు రాజకీయవ్యవహారాలలో చోటు కల్పించుకోవాలనే ఆలోచనలను రేకెత్తించింది.*

పెండ్యాల బాలాత్రిపురసుందరమ్మ 'దేశభక్తి' (అక్టోబర్ 1914 హిందూసుందరి) ని గురించి వ్రాస్తూ దైవభక్తి మనస్సును పరిశుద్ధం చేస్తే దేశభక్తివలన దేశము అభివృద్ధి చెందుతుందనీ, స్వదేశాభిమానం కలిగిన దేశభక్తి, దైవభక్తి కంటె గొప్పదని తెలిపింది. దేశభక్తి విలువైనదనీ ఆంగ్లేయులు వ్రాసిన ప్రతి పుస్తకంలో దేశభక్తిని గురించిన అంశముంటుందనీ, ఆంగ్లేయుల దేశచరితలు చదవటంవల్ల భారతీయులలో కూడా దేశభక్తి కుదురుకుంటోందనీ తెలియజేసింది.

*దైవభక్తికంటె దేశభక్తి గొప్పదని భావించింది.*

దామెర్ల భ్రమరాంబిక మహిళాసమాజసభలో ప్రసంగించిన 'ఉపన్యాసము' (జనవరి 1915 హిందూసుందరి)లో భాగంగా విద్యయందు, బుద్ధియందును స్త్రీ పురుషుల స్థితి సమానంగా ఉంటేనే దేశం బాగుపడుతుందనీ, దేశాభివృద్ధి విషయంలో సంఘసంస్కరణలను దేశాభిమానంగా భావిస్తూ ఉపన్యాసాలిస్తున్నారు గానీ, ఆచరణలో ఉండటంలేదని చెప్పింది. బొంబాయి రాజధానియైన అమరావతీ వాస్తవ్యుడైన గోపాలకృష్ణ గోఖలే తనకు బ్రిటిష్ వారు లండన్ లో ఉన్నతపదవిని ఇవ్వజూపినా నిరాకరించి దేశాభివృద్ధికర ప్రయత్నాలు చేయాలనుకున్నారనీ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ దేశాభిమానంతోనే సంఘ దురాచారాలను నిర్మూలించాలనుకున్నారని తెలిపింది. తగినన్ని బాలికాపాఠశాలలు లేకపోవటంతో స్త్రీల విద్యాభివృద్ధి కుంటుపడిందనీ, తర్కశాస్త్ర పాండిత్యం గల గార్గి, గణితశాస్త్ర పాండిత్యం గల లీలావతి, బ్రిటిష్ వారిపై పరాక్రమాన్ని చూపించిన ఝాన్సీవంటి భారతీయ స్త్రీమూర్తులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చింది. స్త్రీలు ఖగోళ, భూగోళ చరిత్రలు తెలుసుకుంటూ జ్ఞానవంతులు కావాలనీ, తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషలను నేర్చుకొని లోకజ్ఞానాన్ని పొందాలనీ, పిల్లలను పాఠశాలలకు పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లులపై ఉందని తెలియజేసింది.

'ఆర్.ఎన్.సుబ్బలక్ష్మమ్మగారు' (ఫిబ్రవరి1915 హిందూసుందరి) గురించిన పత్రికా సంపాదకురాలి ప్రచురణలో ఆమెకు మూడేండ్ల వయస్సున్నప్పుడే విద్యాభ్యాసంచేయటానికి చెన్నపురిలోని మిషనరీ స్కూలుకు వెళ్ళిందనీ, బాల వితుంతువైనా ఈమె తల్లియొక్క పట్టుదలతో బి.ఏ, యల్ టి. పూర్తి చేసినట్టు తెలిపింది. ఆమె బి.ఏ చదువుకునేటప్పుడే చెన్నపురిలో వితంతు విద్యార్థులకోసం గవర్నమెంటు సహాయంతో వితంతు శరణాలయం ప్రారంభించిందనీ, ఆ శరణాలయంలో శని, ఆదివారాలలో పిల్లలకు ఉచితంగా సంస్కృతం, వీణ వంటి వాయిద్యాలు నేర్పించేవారని చెప్పింది. ఆ శరణాలయంలోనే ఈమె సహోపాధ్యాయినిగా ఉందనీ, బాలికలను కన్నతల్లివలె ఆమె చూసేదని పత్రిక ఆర్.ఎన్.సుబ్బలక్ష్మిని గురించి పేర్కొనటం జరిగింది.

*ఒక వితంతుస్త్రీ వితంతుశరణాలయాన్ని స్థాపించి, స్వయంగా బోధించగలగటమంటేనే స్త్రీల అభివృద్ధికి స్త్రీలే పాటుపడగలరనే దానికి నిదర్శనంగా భావించాలి.*

యర్రగుంట్ల జనార్దనమ్మ వ్రాసిన 'విజ్ఞాన చంద్రికా పరీక్షలు' (మార్చి 1915 వివేకవతి) అనే వ్యాసంలో స్త్రీలకు, పురుషులకు దైవం సమానబుద్ధి, గుణాలనిచ్చిందనీ, అజ్ఞానాన్ని కదలించటానికి విద్య అనే విసనకర్ర అవసరమనీ, స్త్రీలు చదువనారంభిస్తే తమకు దాస్యం సరిగా జరగదనే భావనతోనే పురుషులు స్త్రీలను చదువుకోనీయకుండా చేస్తున్నారనీ, స్త్రీలపై అభిమానం ఉంటే వారికి స్వాంతంత్ర్యాన్ని ఇవ్వాలనే తలంపు వారికి కలగాలని చెప్పింది. స్త్రీలు కూడా ఎన్నిపాట్లు పడియైనా విద్య నార్జించవలెననీ, నేటి ఏలికయైన పంచమ జార్జి చక్రవర్తి స్త్రీలకు ఉన్నత పాఠశాలను విశాఖపట్నంలో, చెన్నపట్టణంలో స్థాపించాడని తెలిపింది. కొంతమంది పురుషులు ముందుకొచ్చి స్త్రీలకు చదువునేర్పించి తమతోపాటు స్వతంత్రం కలిగించాలను కుంటున్నారు కాబట్టి స్త్రీ పురుష భేదం లేకుండా విద్యనార్జించాలనీ, పిల్లలకు విద్యనేర్పించటానికి తల్లులు జ్ఞానాన్ని వృద్ధిపరచుకోవాలని తెలిపింది. తీరిక సమయాలలో దేశచరిత్రలు, పురాణగాథలు ఆరోగ్యసూత్రాలను తెలుసుకుంటూ తాము రచించిన వాటిని పఠనగ్రంథాలుగా ఏర్పరచాలనీ, విద్యా వ్యాసంగం ఏర్పడిన తరువాత చాలునని అనుకోకుండా, విజ్ఞానచంద్రికా పరీక్షను నరసాపురం తాలుకాభివృద్ధినీసంఘంవారి పరీక్షను వ్రాయాలని చెప్పింది. విద్య లభిస్తే సృష్టియందున్న ప్రతి వస్తువుల ఉత్పత్తిని గుర్తించవచ్చని తెలియజేసింది.సమాజంలో పురుషులు స్త్రీవిద్యా స్వాతంత్ర్యానికి విలువను యిచ్చినప్పుడే, వారికి స్త్రీలమీద అభిమానమున్నట్లని తెలియజేసింది.

'ఉన్నతవిద్య' (మే 1917 హిందూసుందరి) ను గురించి ఈమె చేసిన ఉపన్యాసంలో బాలికలను సంబోధిస్తూ దేశకాలపాత్రములననుసరించి స్త్రీలకు ఉన్నతవిద్య అవసరమనీ, పురుషులవలె స్త్రీలు కూడా స్వభాషను ముందుగానేర్చి తర్వాత ఇంగ్లీషు విద్యను అభ్యసించాలనీ, తల్లిదండ్రులు తమ పుత్రికా ప్రేమను ఆడపిల్లలకు చదువునేర్పించటం ద్వారా వ్యక్తం చేయాలని చెప్పింది. స్త్రీలు కూడా ఉద్యోగం చేయవచ్చనీ, స్త్రీలు ఉన్నతవిద్య నేర్చుకొని పాఠశాలలో బోధకురాండ్రుగా ఉంటే బాలికావిద్య అభివృద్ధి చెందుతుందనీ, సరోజనీదేవి ఉన్నతవిద్య నభ్యసించటం చేతనే ఇంగ్లీషులో కవిత్వం చెప్పగలుగుతోందనీ, స్త్రీలకు ఉన్నతవిద్యయే గౌరవాన్ని కలిగిస్తుందని తెలియజేసింది. ఆడపిల్లలకు చదువుచెప్పించటమే తల్లిప్రేమకు నిదర్శనమని యర్రగుంట్ల జనార్దనమ్మ చెప్పింది.

*స్వయంగా ఆమె విజ్ఞానచంద్రికా పరీక్షలో మొదటిస్థానంలో నిలిచిన అనుభవంతో చెప్పటం జరిగింది. తల్లీ కూతుళ్ళకు ఏకకాలంలో చైతన్యాన్ని యివ్వవలసిన అవసరాన్ని గుర్తించింది. స్త్రీవిద్య స్త్రీలకు సామాజికగౌరవాన్ని ఇస్తుందని భావించింది. స్త్రీలు స్వేచ్ఛగా చదువుకోవటానికి స్త్రీలకు ప్రత్యేక ఉన్నత పాఠశాలలు ఉండాలనే ఆలోచనలను పెంచుకొన్నట్లు అర్థమవుతుంది.*

ఆకెళ్ళ కామేశ్వరమ్మ ఆంధ్రజన మహిళాసభలో 'స్త్రీవిద్య'ను గురించి చేసిన ఉపన్యాసంలో (జూన్, జులై 1915 హిందూసుందరి) దేశసేవలో భాగంగా పురుషులతోపాటు స్త్రీలు సహచర్యము చేయాల్సిన అవసరమున్నది కాబట్టి విదేశీ స్త్రీలవలె భారతదేశ స్త్రీలు విద్యావంతులు కావాలనీ, మద్రాసులో స్త్రీల కళాశాలను విజయనగరంలో రాజావారి ఆధ్వర్యంలో బాలికలకు హైస్కూలును ఏర్పాటుచేసారని చెప్పింది. స్త్రీ పురుషుల నడవడిని బట్టి, బుద్ధికుశలతలను బట్టి స్వాతంత్ర్యం అలవడుతుందనీ, అందుకని స్త్రీవిద్యాభివృద్ధి అవసరమనీ, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన అతిబాల్య వివాహాలను నిరోధించాలనీ, కన్యాశుల్క, వరశుల్కాలు నిషేధించాలని తెలిపింది. స్త్రీలు నగలనుకాక విద్యను అలంకారంగా చేసుకోవాలనీ, సమావేశాలలో దేహారోగ్యం, శిశుపోషణకు సంబంధించిన విషయాలను చర్చించి జ్ఞానాన్ని పొందాలనీ, స్త్రీలకు ప్రత్యేక వ్యాయామశాలలు ఉండాలని తెలియజేసింది.

*బుద్ధికుశలత్వంతో స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని సాధించాలని భావించింది. స్త్రీలు తమ ఆరోగ్యానికై వ్యాయామంపై దృష్టిని పెట్టమని చెప్పింది.*

మహారాజ్ఞి లలితకుమారమ్మ 'విజయనగరమందు ఆంధ్రమహిళామహాసభ'లో చేసిన ఉపన్యాసంలో (జూన్, జులై 1915 హిందూసుందరి) హిందూదేశంలో స్త్రీల సమాగమాలు సాధ్యమవుతున్నాయనీ, కుటుంబంలో స్త్రీలు అచేతనంగా అస్వతంత్రులుగా మిగలక మగవారికి సహాయసహకారాలు అందించాలంటే స్త్రీలు విద్యావంతులు కావాలని చెప్పింది. పాశ్చాత్య దేశాలలో స్త్రీలు డాక్టర్లు, ఉపాధ్యాయులుగానూ, పార్లమెంటు మెంబర్లుగానూ, యుద్ధాలలో పురుషులకు సహాయకారులుగాను ఉన్నారనీ, ఆయా దేశాలలో స్త్రీలు కాంగ్రెసుగా ఏర్పడి సమావేశాలు జరుపుకుంటారని తెలిపింది. స్త్రీలకు హృదయధర్మం మెండుగా ఉంటుందనీ, దానికి మనోధర్మం తోడుకావాలంటే స్త్రీలు విద్యావంతులు కావాలనీ, నేటి పరిస్థితులలో దేశీయవ్యాపారాలు చేస్తున్న వారు స్వగృహాలలో స్వజాతిలోని అబలలేనని, వాణిజ్యం, రాజకీయాలలో భారతదేశపురుషులకు సంబంధాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పింది. ప్రాచీన ఆచారములుగల స్త్రీలు మంచిని గ్రహించి శిశుసంరక్షణ, గృహనిర్వహణ వంటివాటితోపాటు నవీన ఆచారంగా దేశాభిమానాన్ని వహించాలనీ, దానికి యుక్తాయుక్తములు గ్రహించగల జ్ఞానాన్నిచ్చే విద్య అవసరమనీ, మద్రాసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలేజీ, విశాఖపట్నంలో హైస్కూలు వంటివి అన్ని పట్టణాలలో, పల్లెలలో ఏర్పాటుచేయాలని కోరింది. ఉపాధ్యాయినులుగా స్త్రీలుంటే బాలికావిద్య అభివృద్ధి చెందుతుందనీ తల్లులు ఇంటివద్ద పిల్లలకు మత విద్య బోధిస్తే పాఠశాలలో శారీరక శాస్త్రం, దేహారోగ్యం, శిశు పోషణలు, సంగీతం, చేతిపనులు వంటి విద్యలు నేర్పిస్తే దేశాభివృద్ధి జరుగుతుందని చెప్పింది.

*పల్లెల్లో కూడా ఉన్నతపాఠశాలల ఏర్పాటును ఆమె ప్రతిపాదించింది. సాంప్రదాయంతో పాటు దేశాభిమానాన్ని కొత్త ఆచారంగా పాటించమని తెలియజేసింది. స్త్రీల కుటీర పరిశ్రమలే దేశీయవ్యాపారమని పేర్కొంది.*

మంతిని వెంకటరమణమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (జులై 1915 వివేకవతి) ను గురించిన వ్యాసంలో స్త్రీ రత్నముల కథలను బట్టి ఆ స్త్రీలపట్ల మగవారి దృక్పథం తెలుసుకోవచ్చునీ, స్త్రీలు తమతో సమానంగా జన్మను పొందారనీ, కుటుంబంలో వారిని దాసీలుగా కాక తగిన ఆలోచనలు చెప్పగల స్నేహితులుగా భావించి గౌరవిస్తే, వారు తగిన ఆలోచనను చెప్పగలవారని తెలిపింది. తగిన ఆలోచనలివ్వటానికి తగినజ్ఞానం, సూక్ష్మబుద్ధి, దూరదృష్టి స్త్రీల కుంటుందనీ, వారు చదువుకుంటే లోకజ్ఞానం కలుగుతుందనీ, స్త్రీలు కూడా నలుగురితో కలిసి తిరగటానికి సిగ్గు పడకూడదని భావించింది. పురుషులు భార్యలను తిండిపెట్టే దాసీలుగా చూస్తే, వారికి ఇష్టంలేకపోతే దాసీలుగా బయటకు వెళ్ళి ముష్టిఎత్తుకు బ్రతుకుదామనో లేదో ఎక్కువ జీతం ఇచ్చేవారి దగ్గరకు వెళ్ళిపోతారని చెప్పింది. ఉపకారం కాక కోపంవస్తే అపకారం కూడా చేయవచ్చు కాబట్టి భార్యలను దాసీలుగా చూడకూడదని పురుషులు తమ భార్యలను బయటకు తీసుకువెళుతుంటే వారికి సామాజిక పరిజ్ఞానం కలుగుతుందని చెప్పింది. స్త్రీలు దాసులవలె ఉపచారములు చేస్తున్నాకూడా భర్త యింటి నుండి వెళ్ళగొడితే నిలవనీడలేని పరిస్థితి వారికి ఏర్పడుతుంది కాబట్టి దానికంటే ముందే స్త్రీలు సామాజిక గౌరవస్థానాన్ని సంపాదించాలని తెలియజేసింది.

*స్త్రీపురుషుల పుట్టుకలో తేడాలేదనీ, విద్య, లోకజ్ఞానంలో స్త్రీలు పురుషులతో సమానులైతేనే స్త్రీలకు దాసీ బ్రతుకు ఉండదనీ, భర్త స్నేహంగా చూడాలంటే స్త్రీలు సామాజిక గౌరవాన్ని పొందాలనీ, దానికై స్త్రీలు సమాజంలో స్వేచ్ఛగా సంచరించగలగాలనీ, అప్పుడే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని సాధించగలరని భావించింది. స్త్రీ, పురుషుల మధ్యన మిత్రసంబంధాలు ఏర్పడాలంటే ఇళ్ళల్లో స్త్రీలను భర్తలు స్నేహితులుగా గౌరవించాలనీ, ఆగౌరవాన్ని స్త్రీలు ముందుగా యింటిలో పొందాలనీ, అదే స్త్రీలకు సామాజిక గౌరవం యిస్తుందని మంతిని వెంకటరమణమ్మ భావించింది.*

చోరగుడి సీతమ్మ విజయనగరంలోని ఆంధ్రమహిళామహాసభలో చేసిన ఉపన్యాసం (అక్టోబరు 1915 హిందూసుందరి)లో నిర్బంధ వైధవ్యంతో పుట్టింట్లో కష్టాలు పడుతున్న స్త్రీల కోసం ప్రభుత్వం అనాథశరణాలయాలను కట్టించారనీ, అలాగే కొండ వెంకటప్పయ్య గుంటూరు లోని వేటపాలెంలో 'శారదానికేతనము'ను పేర అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేసారనీ, ఇంద్రియగోచరం కాని ఆర్ష, పుణ్యపాపాలవంటి విషయాలుగాక ప్రపంచంలోని సజీవ, నిర్జీవ విషయాలతో కూడిన ప్రకృతి శాస్త్ర పరిజ్ఞానం స్త్రీలకు ఏర్పడాలని చెప్పింది. దానికై విజ్ఞానచంద్రికా పరిషత్తువారు 'విజ్ఞానసర్వస్వ'మనే గ్రంథాన్ని సమకూర్చారని తెలిపింది. బాలికాపాఠశాలలో ఉపాధ్యాయినులుంటే బాలికావిద్య అభివృద్ధి చెందుతుందనీ, భార్య కరణేషుమంత్రిగా ఉండటానికైనా స్త్రీలు శరీరశాస్త్రాలకు సంబంధించిన ఉన్నతవిద్యను అభ్యసించాలనీ, స్త్రీలు సమాజాలను ఏర్పరచుకొని స్త్రీవిద్యాఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చింది. రజస్వలానంతర విద్యాభ్యాసానికి వీలుగా స్త్రీలే ఉపాధ్యాయినులుగా, పరీక్షాధికారులుగా ఉండే స్త్రీ విద్యాలయాలు అవసరమని తెలియజేసింది.

*స్త్రీలు ప్రకృతిశాస్త్రవిజ్ఞానాన్ని అభ్యసించాల్సిన అవసరాన్ని ఈమె పేర్కొంది.*

ఎమ్.ఎన్.కమల వ్రాసిన 'హైందవ స్త్రీలు-దేశసేవ' (ఏప్రిల్ 1917 ఆంధ్రపత్రిక ఉగాది వార్షిక సంచిక) అనే వ్యాసంలో దేశాభివృద్ధికై రాజకీయ, సాంఘిక, నైతిక విషయాలలో స్త్రీల సహాయం అవసరమనీ, స్త్రీలు దేశసేవకు అర్హులని గుర్తించాలనీ, స్త్రీ విద్యాభివృద్ధి జరగాలని తెలిపింది. అహల్యాబాయియొక్క రాజ్యమునందలి స్త్రీలు పాటుపడి సంఘసేవ, దేశసేవ చేసారనీ, స్త్రీల ఔన్నత్యమే దేశాభ్యుదయం కాబట్టి దేశభక్తులెల్లరు స్త్రీజనులకు ఉన్నతవిద్యను నేర్పి దేశ సేవకు వారిని అర్హులుగా చేయాల్సిన కర్తవ్యం ఉందని తెలియజేసింది.

*స్త్రీలు తమ ఇంటిలోని వారికి సేవచేయటమే గాక దేశానికి కూడా సేవ చేయాల్సిన కర్తవ్యాన్ని ప్రబోధించిన వ్యాసమిది.*

ద్రోణంరాజు వెంకటలక్ష్మాంబ వ్రాసిన 'స్త్రీవిద్యా-సంస్కరణము' (ఏప్రిల్ 1917 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే వ్యాసంలో ఆంగ్ల విద్యాధ్యయనంతో పాటు మాతృభాషలో అక్షరజ్ఞానము కలిగించకపోవటంచేత గ్రంథములు అర్థంకాక మాతృభావన తగ్గుతోందనీ, జ్ఞానప్రబోధం కలిగించే గ్రంథాలులేవని తెలిపింది. జ్ఞానంకోసం మాతృభాషను ప్రథమ భాషగానూ, మతగ్రంథాల కోసం సంస్కృత భాషను రెండవ భాషగానూ, విదేశీనారీమణుల చరిత్రలు చదివి స్ఫూర్తిపొందటానికి హూణభాష (ఆంగ్లం) తృతీయభాషగా ఉండాలని పేర్కొన్నది. విద్యాసంస్కారం స్త్రీ పురుష పాఠశాలలో అవసరమనీ, స్త్రీలపాఠశాలలో వైద్యశాస్త్రం, ప్రకృతి శాస్త్రం, దేశచరిత్రములు నేర్పాలనీ, స్త్రీలకు నిర్బంధ ఉచితపాఠశాలను ఏర్పాటుచేయాలని చెప్పింది. స్త్రీలవిద్య అభివృద్ధిచెందాలంటే గ్రంథాలయాలు, సంఘములు అవసరమనీ, గ్రంథాలయాలలో పుస్తకపఠనంతో పాటు, స్త్రీసమాజా లలో స్త్రీలు ఒకరి జ్ఞానాన్ని ఒకరు పంచుకొనే అవకాశం ఉంటుందనీ, స్త్రీవిద్యాభివృద్ధి జరిగితే దేశము యథాగతి ఉన్నతస్థితిని చేరుకుంటుందని తెలియజేసింది.

*మాతృభాషలో విద్యాబోధన ఉంటే స్త్రీవిద్య అభివృద్ధి చెందుతుందనీ, స్త్రీలు ఉన్నత విద్యావంతులు కాగలరనీ, స్త్రీ విద్యాభివృద్ధి దేశాభివృద్ధికి మిక్కిలి సహకరిస్తుందనీ, స్త్రీవిద్యకై గ్రంథాలయాలు ప్రతి పల్లెయందు ఉండాలని భావించింది. స్త్రీలు వైద్యశాస్త్రాన్ని అభ్యసించాలని చెప్పటమేకాక స్త్రీలనిర్బంధవిద్యకై ఉచితవిద్యాలయాలను ఏర్పాటుచేయాలని సూచించింది.*

*నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పరచిన పాఠశాలలో ఆంగ్లమాధ్యమం స్త్రీల విద్యకు ఆటంకంగా ఉందనీ, మాతృభాషలో బోధన ఉంటే స్త్రీలు ఎక్కువ సంఖ్యలో చదువుకోగలరని భావించింది. అంతే గాక పల్లెల్లో గ్రంథాలయాలు ఉంటే స్త్రీలు వెళ్ళి పత్రికలు చదివి ప్రపంచజ్ఞానాన్ని పొందగలరని భావించింది. స్త్రీ విద్యాభివృద్ధికున్న సోపానపంక్తులను స్త్రీలు నిర్మించుకోవటం అర్థం అవుతుంది. పల్లెటూళ్ళలో పాఠశాలలేగాక గ్రంథాలయాలు ఉంటే స్త్రీలకు ప్రపంచజ్ఞానం అలవడుతుందని భావించటమే స్త్రీలవిద్యాభివృద్ధి కాంక్షను తెలియజేస్తోంది. స్త్రీలు తమచూపును*

*ప్రపంచంవైపు విస్తరింప చేయాలనుకోవటమే స్త్రీల అభివృద్ధి, దేశౌన్నత్యాన్ని చాటి చెప్పేందుకు తగిన వాతావరణం ఏర్పడటమేనని భావించవచ్చు.*

అష్టమాంధ్ర మహిళాసభలో కోకా కృష్ణవేణమ్మ చేసిన ఉపన్యాసం (ఆగష్టు 1917 హిందూసుందరి) లో భాగంగా, స్త్రీవిద్యను అభివృద్ధి చేయటానికి పాఠశాలలు పెట్టినా స్త్రీ విద్యావిహీనులుగా పరితపిస్తూనే ఉన్నారనీ, స్త్రీలకున్నత విద్య గరిపి వారిని ఉన్నతస్థితికి తేవాలని చెప్పింది. తల్లులే విద్యావంతులైతే పిల్లలకు పసితనములో సద్విద్యను అందిస్తారనీ, స్త్రీలు ఐకమత్యంతో ఉండి శిశుపోషణాది కృత్యములను తెలుసుకోవాలనీ, స్త్రీలను ఉపాధ్యాయినులుగా నియామకం చేస్తే బాలికాభివృద్ధి చెందుతుంది కాబట్టి స్త్రీలకు ఉన్నతవిద్యను అందించాలని తెలియజేసింది.

పొణకా కనకమ్మ వ్రాసిన 'హిందూ స్త్రీల పవిత్ర ధర్మములు (సెప్టెంబరు 1917 హిందూ సుందరి) అనే వ్యాసంలో భారత జనని భారతజాతీయోద్ధరణకు కళంకం తెచ్చిపెట్టే పుత్రికా రత్నములను చూసి తపిస్తోందనీ, ప్రస్తుతకాలంలో పాశ్చాత్య నాగరికతను అవలంబిస్తూ వారి నాగరికతను నేర్చి, ధనధాన్యాలను అమ్మి వస్తువాహనాలను కొనుగోలుచేసి గృహకృత్యాలను పట్టించుకోక, కాలమంతా వ్యర్థముగా లోకాభిరామాయణంతో గడుపుతున్నారని తెలిపింది. పూర్వకాలంలో భారత స్త్రీలు కులశీలాలు విడువక భర్తను దైవంగా భావించి పతికి ఎల్లవేళలా తోడ్పాటును అందించారనీ, ప్రస్తుతం యుక్తాయుక్త పరిజ్ఞానంలోపించిందని భావించింది. స్త్రీలు తమ ధర్మాలను నిర్వర్తించక పోవటంతో వారిలో దేశాభిమానం తొలగి జాతీయతాశక్తి క్షీణించి, స్వధర్మాలను విడనాడుతున్నారనీ సంఘకార్యక్రమాలను నెరవేర్చటంలేదనీ, నీతివిచక్షణ లేకుండా పవిత్రమైన భారతజాతీయ ధర్మాలను వదిలిపెట్టకూడదని చెప్పింది.

*సంపన్నవర్గ స్త్రీలు నవనాగరికతలో భాగంగా క్లబ్బులలో గడుపుతూ ఇంటిని పట్టించు కోవటంలేదనీ, బాధ్యతారహితంగా ప్రవర్తించటం నాగరికతకాదనీ హెచ్చరించింది.*

సూరి భ్రమరాంబ స్త్రీల నాగరికతను గురించి చేసిన 'ఉపన్యాసము' (మార్చి 1918 హిందూసుందరి) లో పురుషులతోపాటు స్త్రీలకు నాగరికత సమంగా పెంపొందితే సాంఘిక రాజకీయ విషయాలలో స్త్రీలు చేయదగినది ఎంతో ఉందనీ, అతిబాల్యవివాహాలు లేకుండా చేయాలనీ, స్త్రీ పునర్వివాహాలు జరిగేలా ఉండాలని చెప్పింది. కన్యాశుల్క వరశుల్కాలకు కారణంగా స్త్రీల మూర్ఖత్వాన్ని పురుషులు చిత్రంగా చూస్తున్నారనీ, వాటిని తొలగించుకోవాల్సిన బాధ్యత స్త్రీలపై ఉందని తెలియజేసింది.

*స్త్రీలకు పురుషులతో సమానమైన నాగరికత ఉండాలంటే స్త్రీలకు సాంఘిక, రాజకీయ భాగస్వామ్యం అవసరమని గుర్తించింది. అప్పటివరకు పితృస్వామ్యం నిర్దేశించిన భారతీయ స్త్రీల కుటుంబ సంస్కృతి కంటే భిన్నమైన సాంఘిక, రాజకీయ చైతన్యం తెచ్చుకోవటమే ఆధునిక స్త్రీల నాగరిక జీవనసంస్కృతిగా భావించింది.*

చుండి తులశమ్మ 'బాల్యవివాహము' (మార్చి 1918 హిందూ సుందరి) ను గురించి చేసిన ఉపన్యాసంలో రాజులెట్టి వారైనా గానీ దేశమందలి రాజకీయ వ్యవహారముగానీ, సంఘ సంస్కరణములుగాని చక్కగా ఉంటే, దేశమందలి వివిధ జాతులవారు నీతిప్రవృత్తి గలవారైతేనే దేశము అభివృద్ధిని పొందుతుందని చెప్పింది. సంఘములో స్త్రీ పురుషులు ముఖ్యాంగములనీ కాబట్టి సంస్కరణలకై స్త్రీవిద్యావశ్యకతకు ప్రామఖ్యం ఉందనీ, కాని దానికి అడ్డుగానున్న బాల్యవివాహము నిర్మూలించుకోవాలనీ, అతి బాల్యవివాహాలు అడుగంటే విధంగా స్త్రీవిద్య వృద్ధి చెందితేనే భారతమాత అభ్యుదయాన్ని పొందుతుందని తెలియజేసింది.

'ఆంధ్ర మహిళా సమాజం' (మార్చి 1918 అనసూయ)ను గురించి దేవరాజు వెంకట రత్నమ్మ ఆ సమాజకార్యదర్శిగా వ్రాస్తూ ఖరగపురంలో భండారు అచ్చమాంబచే 'ఆంధ్ర మహిళాసమాజము' స్థాపింపబడిందనీ, తెలుగు పత్రికలు, పుస్తకాలు తెప్పించి ఖరగ్ పూరు నందలి ఆంధ్ర మహిళలు చదువుకునే సదుపాయాన్ని కల్పించినట్లును తెలియజేసింది.

*ఆంధ్రదేశంలోనే గాక నాటి మధ్యపరగణాలలో కూడ ఆంధ్రస్త్రీల విద్యకై భండారు అచ్చమాంబ కృషిచేసిందని అర్థం అవుతుంది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ 'స్త్రీ స్వాతంత్ర్యం' (సెప్టెంబరు 1918 అనసూయ పత్రికలో) అనే శీర్షిక క్రింద వ్రాస్తూ స్త్రీలు పురుషుల క్రింద బానిసలు కారనీ, వివాహం ఆమరణాంతపు బీగమని స్త్రీలకొకింత స్వేచ్ఛ ఉండాలనీ, స్త్రీలు పురుషులవలె సమానంగానే పుట్టారనీ, స్త్రీలకు బుద్ధి, మనసు, జ్ఞానం యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం ఉన్నాకూడా బలవంతమగు జాతి బలహీనమగు జాతిని కించపరచుట స్వాభావికమేనని చెప్పింది. (ఇక్కడ నేటి పాఠకులకు శ్రీశ్రీ 1938లో వ్రాసిన 'దేశ చరిత్రలు' అనే గేయం గుర్తుకు రాకమానదు). పురుషులు స్త్రీలను అణగద్రొక్కు తున్నారనీ, స్త్రీలు విద్యావంతులైతే లోకజ్ఞానం ఏర్పడి స్వాతంత్రకాంక్ష ఉదయిస్తుంది కాబట్టి స్వాతంత్ర్యవాదులు స్త్రీలను స్వతంత్రులుగా భావించటమే గాక రాజకీయస్వాతంత్ర్యానికి కూడా స్త్రీలు అర్హులు అని భావించమని తెలియజేసింది. స్త్రీల పుట్టుక, ఎదుగుదల, స్వేచ్ఛవంటి విషయాలలో స్త్రీలు పురుషులతో సమానమనే భావన ఏర్పడాలనీ, అదే సమాజాంతర్గత సంస్కృతిగా స్వాతంత్ర్యాన్ని ఇస్తుందని తెలియజేసింది.

*పురుషాధిక్యతను పేర్కొని స్త్రీలస్వాతంత్ర్యానికి అది అడ్డుగా ఉందనీ, స్త్రీలు స్వతంత్రులైతేనే రాజకీయస్వాతంత్ర్యాన్ని అనుభవించగలరనీ, అప్పుడే దేశానికి స్వతంత్రం వస్తుందని భావించింది. పితృస్వామ్యసంస్కృతి స్త్రీలస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్య సాధనకు గొడ్డలిపెట్టువంటి విషయమనీ, దానిని విమర్శకు పెట్టిన తొలి వ్యాసము ఇది. దేశానికి స్వాతంత్ర్యం కావాలనుకొంటే పురుషులు ముందుగా స్త్రీల రాజకీయస్వాతంత్ర్యాన్ని ఒప్పుకోవాలని చెప్పిన తొలి మహిళ కనుపర్తి వరలక్ష్మమ్మ.*

గుడిపూడి ఇందుమతీదేవి వ్రాసిన 'స్త్రీలు పురుషులకంటే తక్కువ వారా?' (సెప్టెంబరు 1918 అనసూయ) అనే వ్యాసంలో స్త్రీలకు, పురుషులకు వారివారి పంచేంద్రియాలలో తేడా

ఉన్నా స్త్రీల అంతరేంద్రియాలలో సత్యం, దయ, శౌచంతోపాటు లోకజ్ఞానంకూడా ఎక్కువేననీ, స్త్రీలకు స్వాతంత్ర్యం యిచ్చి సద్విద్యను అందిస్తే వారు లోకాన్ని ఉద్ధరించగలరని తెలియజేసింది.

'సుకుమారము' (జులై-ఆగష్టు1919 అనసూయ) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ స్త్రీలు సుకుమారులని అనిపించుకోవాలని ప్రయత్నించటానికి కారణం వారిలోని విద్యలేనితనం అనీ, స్త్రీలయొక్క బుద్ధిలోపం, తల్లిదండ్రులు, భర్తల ఆలోచనా లోపం, ధనవంతులమనే గర్వం వారిలో ఉండటమేననీ దాని వల్లనే స్త్రీలు సుకుమారులుగా తయారవుతున్నారని భావించింది. భర్తలు తమస్త్రీలు ఉన్నతవిద్యావంతులు అయ్యేవిధంగా మంచి పుస్తకాలు తెచ్చి ప్రోత్సహించాలనీ, స్త్రీ సేవాభావంతో బుద్ధికుశలతతో ఉండాలనీ, స్త్రీలను స్వతంత్రులుగా తీర్చిదిద్దే బాధ్యత భర్తపై ఉన్నదనీ, స్త్రీలు సబలలుగా తయారుకావల్సిన అవసరం ఉందని తెలియజేసింది. ప్రాచీనకాలంలో స్త్రీలు సబలలని అనిపించుకొని స్వాతంత్ర్యాన్ని అనుభవించగలిగారనికూడా ఇందుమతి తెలియజేసింది.

*సమాజం యొక్క సంస్కృతిలోని లింగవివక్ష స్వభావాన్ని స్త్రీలు గుర్తించేటట్లు చేయటమే గాక ఒక అడుగు ముందుకు వేసి స్త్రీలు పురుషులకంటే కొద్దిగా ఎక్కవేనని గుర్తింపజేస్తూ మానవజాతికొక సవాలును విసిరినట్లుగా అనిపిస్తుంది. స్త్రీలు పురుషులకంటే తక్కువకాదనే ఆత్మవిశ్వాసమే, వారిని పురుషులతోపాటు సమానంగా స్వాతంత్ర్యోద్యమంలో ముందడుగులు వేయించగలుగుతుంది. స్త్రీలు అబలలని అనిపించుకుంటున్నారంటే వారికి వ్యక్తి స్వాతంత్ర్యం లేనట్లే అని గుడిపూడి ఇందుమతి భావించింది.*

జరుగుమిల్లి రామాబాయమ్మ వ్రాసిన 'స్త్రీనియోజక స్వాతంత్ర్యము' (జులై 1919 అనసూయ) అనే వ్యాసంలో సౌతుంబరో విచారణ సంఘంవారు భారతాంగనలకు నియోజకవర్గ స్వాతంత్ర్యమును వినియోగించుకునే అర్హత లేదని ఇచ్చిన నివేదికను రాజదాససతీ, అనిబిసెంటు, సర్ నారాయణ సావర్కరు వ్యతిరేకించారనీ, భారతాంగనలకు నియోజకవర్గ స్వాతంత్ర్యం ఉండాలని తెలిపింది. స్త్రీలు రాజకీయ విద్యను నేర్చుకోవాలనీ, ప్రపంచంలో జరిగే ప్రతివిషయంపట్ల అవగాహన పెంచుకోవాలనీ, అమెరికా, ఫ్రాన్స్, ఐరోపా దేశాలలో స్త్రీలు పార్లమెంట్ సభ్యులుగా ఉన్నారనీ, అలా భారతాంగనలు రాజకీయోద్యోగాలలో ఉండాలంటే భారత స్త్రీలకు ప్రత్యేక నియోజకవర్గ స్వాతంత్ర్యం ఉండాలని పేర్కొన్నది. దానికి అవసరమైన విద్యావంతులైన స్త్రీలు భారతదేశంలో ఉన్నారనీ, సరోజనీదేవి బ్రిటిష్ సభకు తెలియజేసిందనీ, అనిబిసెంటు స్త్రీలకు జాతీయ ప్రబోధం చేస్తున్నారని రచయిత తెలియజేసింది.

*స్త్రీలు తమ రాజకీయ హక్కులను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయటం జరిగింది. 1919 చట్టం ముస్లింలకు సభలలో ప్రాతినిధ్యం వహించటానికి ప్రత్యేక నియోజపు వర్గం కేటాయించినట్లుగానే, కేంద్ర రాష్ట్రశాసన సభలలో స్త్రీలు కూడాప్రాతినిధ్యం వహించగల*

*సభ్యులుగా ఉండాలనే ఆలోచనలతో స్త్రీలకు కూడా ప్రత్యేక నియోకవర్గ స్వాతంత్ర్యం కావాలని జరుగుమిల్లి రామాబాయమ్మ భావించింది. స్త్రీలలో రాజకీయస్వాతంత్ర్యం పొందాలనే చైతన్యం కలగటమే, స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనలో చేరుకొనే ఉన్నతమైన మెట్టుగా భావించాలి.*

గోపిసెట్టి సూర్యనారాయణమ్మ వ్రాసిన 'స్త్రీవిద్య' (నవంబరు1919 అనసూయ) అనే వ్యాసంలో స్త్రీలకు చదువులేక జ్ఞానశూన్యులుగా ఉండటం చేతనే దేశం క్షీణదశలో ఉందనీ, స్త్రీలు స్వభాషలో చదువుకుంటే తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయరనీ, వారు పిల్లల్ని బాగా చదివించేటట్లు చేస్తే కుటుంబం, దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేసింది.

*స్త్రీలు స్వభాషలో విద్యాధ్యయనం చేస్తేనే సామాజిక విషయాలపట్ల అవగాహన బాగా పెరుగుతుందనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని భావించటం స్పష్టంమవుతోంది.*

క్రీ.శ.1900 నుంచి మొదలైన స్త్రీవిద్యావశ్యకతను గుర్తించి, ప్రచారం చేస్తున్నా, 1909 తరువాతకూడా సాహిత్యంద్వారా చైతన్యపరచాల్సిన అవసరం స్పష్టమవుతోంది. పురుషాధిక్య సమాజంలో స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యసాధన ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాల్సిన అవసరం ఏర్పడింది.

1910 నుండి 1919 వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలోని వ్యాసాలలో భారతదేశానికి సంబంధించిన స్వధర్మనిర్వహణకై స్త్రీలకు స్వతంత్ర జ్ఞానం అవసరమనీ, స్త్రీలు పత్రికారంగంలో అడుగు పెట్టాలనీ, స్త్రీవిద్యాభివృద్ధికై స్త్రీసమాజాలు కృషిచేయాలని భావించారు. విదేశీస్త్రీలకున్న వోటుహక్కును గ్రహింపుకు తెచ్చుకొన్నారు. స్త్రీసమాజాలలో, బాలికాపాఠశాలలో స్వదేశీబట్టల తయారీని నేర్పించటం, స్త్రీలకు ఉన్నతవిద్య,వైద్యం, మనోవిజ్ఞానశాస్త్రపరిజ్ఞానం అవసరమని భావించటం, పల్లెల్లోని పాఠశాలల్లో స్త్రీబోధకురాండ్ర నియామకం జరగాలని కోరుకొన్నారు. స్త్రీపురుషులకు సమానావకాశాలుండాలని భావించటం, బాల్యవివాహాలు శాస్త్రసమ్మతంకాదని భావించటం, పునర్వివాహం, రజస్వలానంతర వివాహంవంటి వైవాహిక స్వాతంత్ర్యం ఉండాలనీ, వితంతుస్త్రీల విద్యావికాసం జరగాలనీ, స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన విషయాలను తొలగించుకొనే ఉపాయాలను అన్వేషించారు. వ్యభిచారకూపాలనుండి స్త్రీలను, బాలికలను రక్షించటమే సంఘసంస్కరణలో స్త్రీల బాధ్యత అనీ, భర్తలు భార్యలను స్నేహితులుగా చూస్తే వారికి సామాజిక గౌరవం ఉంటుందని భార్యలను బానిసలుగా చూసే భర్తలకు హెచ్చరిక చేసారు. ఆంధ్రమహిళా మహాసభల ఏర్పాటు, స్త్రీలఅభివృద్ధి, దేశాభ్యుదయంలో స్త్రీల భాగస్వామ్యం, దేశభక్తి, స్త్రీల దేశసేవయే దైవభక్తి అనీ, స్త్రీలయొక్క స్వతంత్ర జీవనావశ్యకతను, దేశస్వాతంత్ర్య సాధనకు అవసరమైన స్త్రీలకు రాజకీయ స్వాతంత్ర్యం ఉండాలని, దానికై ప్రత్యేకమైన స్త్రీ నియోజక స్వాతంత్ర్యం వంటి విషయాలకు సంబంధించిన ఆలోచనలను స్త్రీలు పెంచుకొనేటట్లుగా స్త్రీలను చైతన్యపరిచే వ్యాసరచనలు వచ్చాయి.

**కథలు**

క్రీ.శ.20 శతాబ్దపు రెండవ దశకంలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై పరితపిస్తూ 2 కథలు వచ్చాయి. అందులో ఒకటి వైవాహిక స్వాతంత్ర్యానికిని, మరొకటి స్త్రీవిద్యకు ఆటంకప్రాయమైన విషయానికి సంబంధించినది.

వాడ్రేవు సుందరమ్మ వ్రాసిన 'వృద్ధభర్త-బాలభార్య', అనే కథలో (డిసెంబరు 1912 వివేకవతి) ఇంట్లోనే చదువుకుంటూ ఉన్న వితంతుకూతురుపై తనకే స్వతంత్ర్యం ఉందనీ భావించిన తండ్రి, ఆమెకు పునర్వివాహంచేయాలన్న విషయం పట్టించుకోకుండా, తన ముగ్గురుభార్యలు చనిపోయినాకూడా తాను మాత్రం తిరిగి పెళ్ళిచేసుకోవాలనుకొంటాడు. దానికై వేరొక తండ్రికి కన్యాశుల్కం ఇచ్చి ఆతని కూతురును ఇచ్చి పెళ్ళిచేయమని అడుగుతాడు. ఆ పిల్లయొక్క తల్లిదండ్రులు డబ్బుతీసుకొని, ఈ వృద్ధ వరునితో కూతురికి ప్రధానం జరిపించారు. కానీ ఆ పెళ్ళికూతురు తనకా పెళ్ళి యిష్టంలేదని చెప్పినప్పటికీ ఆమె తల్లిదండ్రులు విననందుకు వారిని ఆమె అసహ్యించుకొని, వచ్చిన ఆ ముసలి పెళ్ళికొడుకునే తాతగా భావించింది. తల్లిదండ్రులు ఇచ్చిన విక్రయ సొమ్ముకింద ఆ ముసలివరునితో వెళుతుంది. విక్రయసొమ్ముకు తగినట్లుగా అతనికి సేవ చేస్తానని చెప్పి అతని యొక్క కుమారుడ్ని ఇచ్చి పెళ్ళిచేయమని అడుగగా అతడట్లే చేయాల్సి వచ్చిందని తెలియజేసింది.

*ఈ కథలో స్త్రీ తన స్వతంత్ర నిర్ణయానికి అనుగుణంగా ముసలితనంలో తనసేవకై చేసుకొన్న వృద్ధ వివాహాన్ని నిరసిస్తూ బలంగా తన సమస్యను యుక్తితో పరిష్కరించుకొన్నదని తెలియజేసింది. ఇదే స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అనుభవించటంగా భావించాలి.*

పత్రికాధిపురాలు ప్రచురించిన "చంపక సందేహ నివృత్తి" (నవంబరు-డిసెంబరు 1919 అనసూయ) అనే కథలో గురుశిష్యుల సంభాషణలో భాగంగా స్త్రీవిద్యను మాన్పించే పురుషులను ముందుగా విద్యావంతుల్ని చేయాలనీ, స్త్రీల ఆశయాలను అణచివేసే మగవారిలోనే తప్పంతా ఉన్నదని చెప్పింది. సాంఘిక జీవనంలో స్త్రీల యెడల నిరాదరణ, తిరస్కారం ఉందనీ, సమాజంలో స్త్రీల యెడల పెట్టిన దురాచారాలన్నీ పురుషులు పెట్టినవేయని తెలిపింది. యువకులు చదువుకున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటామంటే తప్ప ఆడపిల్లలను చదివించరనీ, అప్పుడు స్త్రీల స్థితి బాగుపడి స్త్రీలకు స్వతంత్ర జీవనం ఏర్పడుతుందని తెలియజేయటం జరిగింది.

*స్త్రీల అణచివేతకు మూలాలను అన్వేషిస్తూ సామాజిక సంస్కృతిని ఏర్పరచినది పురుషులేనని అందుకే ముందుగా పురుషులలో మార్పుకలగాలని భావించటం జరిగింది. స్త్రీవిద్యకు, స్త్రీల వైవాహిక సంస్కృతిపట్ల పురుషులలో రావల్సిన మార్పును సూచించింది. స్త్రీవిద్యాభివృద్ధి జరగాలంటే ముందుగా పురుషుల్లో జ్ఞానం కలగటానికై వారిని విద్యావంతుల్ని చేయాలని భావించింది.*

ఈ దశాబ్దపు కథలలో స్త్రీవిద్యను అణచివేస్తున్నది పురుషులేనని, వారిలో మార్పు రావలసిన అవసరం ఉందని భావించారు. అంతేకాక, వైవాహిక సంస్కృతిపట్ల స్త్రీలు నిరసన చూపించి స్వీయనిర్ణయం తీసుకోవటం స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి నిదర్శనమని అర్థమవుతుంది.

**నాటకాలు**

20 వ శతాబ్దపు రెండవ దశకంలో మొత్తం 11 నాటకాలు వచ్చాయి. స్త్రీవిద్యావంతురాలు కావలసిన ఆవశ్యకతను, స్త్రీలు తమ ఆరోగ్యాన్నిపట్టించుకోవాల్సిన అవసరాన్ని, స్త్రీపునర్వివాహాలు, వితంతుస్త్రీల విద్యా విషయాలను, నిరక్షరాస్యులైన స్త్రీలను చైతన్యవంతులను చేయాలని భావించి, స్త్రీసమాజాలలో స్త్రీపాత్రలయొక్క సంభాషణాలద్వారా తెలియజేయాలనుకొన్నారు.

మాడభూషి చూడమ్మ వ్రాసిన 'శారదాకుసుమ సంవాదం' (జులై 1910 హిందూసుందరి) అనే నాటకంలో భాగంగా శిశుపోషణ శాస్త్రాన్ని స్త్రీలు చదువుకొంటే బిడ్డలను ఆరోగ్యవంతంగా పెంచగలరని శారదపాత్ర చెప్పగా దానికి కుసుమ పాత్ర మాట్లాడుతూ అమ్మమ్మలే మంత్రసానులుగా పురుడుపోస్తుంటే ఇంకా ఈ శాస్త్రాలు చదవాల్సిన పని లేదంటుంది. దానికి శారద పాత్ర 'హితబోధిని' అనే పుస్తకాన్ని మరియు ఆచంట లక్ష్మీపతిగారు వ్రాసిన "పత్నీహితసూచని" వంటి వ్యాసాలనుచదివి పిండోత్పత్తిక్రమాన్ని తెలుసుకోవాలనీ, బాల్యవివాహాల వల్ల రజస్వల కాగానే పూర్తిగా ఎదగక పోయినా గర్భాదానాలు చేయటంతో గర్భసంచి బలంగా లేకపోవటంతో శస్త్రచికిత్సలు చేస్తున్నారనీ, పిల్లలు లోపల అడ్డంగా తిరగటంతో మాతాశిశు మరణాలు ఏర్పడుతున్నాయని చెప్పింది. అందుకే స్త్రీలు శిశుశాస్త్రాన్ని, శరీరశాస్త్రాన్ని చదువుకోవాలనీ, ఆడపిల్లల గర్భధారణ వయస్సు కనీసం 16 సంవత్సరాలు గానీ 20 సంవత్సరాలు గానీ దాటితే ఆరోగ్యవంతమైన శిశువులు పుడతారనీ శారద కుసుమతో సంభాషించినట్లుగా నాటకాన్ని ముగించటం జరిగింది.

*స్త్రీలలో బాల్యవివాహాలు, మాతృత్వంపట్ల తగిన శాస్త్రజ్ఞాన చైతన్యాన్ని కలిగించే రూపకంగా అర్థం అవుతుంది. మానవజాతిని సృష్టించే స్త్రీలకు శిశుశాస్త్రం, శరీర శాస్త్రం తెలిసి ఉండాలని భావించింది. అందుకే స్త్రీలు తమ శారీరక, మానసిక ఎదుగుదలకు శాస్త్రాధ్యయనం అవసరమని భావించటం జరిగింది.*

ఈమెయే వ్రాసిన 'ఆరోగ్యము' (ఏప్రిల్ 1911 హిందూసుందరి) అనే మరొక నాటకంలో దేహారోగ్యం గురించి ఒక స్త్రీపాత్రచేత చెప్పిస్తూ సకల ధర్మాలను ఆచరించాలంటే శరీరమే సాధనమని, ఆయాసం ఎక్కువై స్త్రీనీళ్ళు తెస్తుంటే బిందె జారి కాలుమీద పడి గాయమైందనీ, కానీ ఆమెకు ఆరోగ్యం మీదకంటె ధనాన్ని పోగుచేసే దృష్టి ఎక్కువగా ఉండటంతో అమ్మోరి మొక్కులు, ఎరుకల దానిచేత వైద్యం చేయించుకున్నదని తెలియజేసింది. పైగా పుట్టలో పాలుపోస్తే

తగ్గుతుందనీ అనుకుంటారు గానీ ఆసుపత్రిలో మందునీళ్ళు త్రాగలేరనీ, ఆమె భర్త భూతవైద్యం, జపతపాలు చేయిస్తున్నాడని చెప్పగా, దానికి చదువుకున్న విజ్ఞానవతి అయిన స్త్రీ మాట్లాడుతూ ఆమెకు వచ్చినది హిస్టీరియా జబ్బుగానీ, దయ్యం పట్టటం కాదనీ, ఔషధాలను వాడాలని చెప్పింది. స్త్రీలకు విద్య లేకపోవటంతో తమనుగానీ, బిడ్డలనుగానీ కాపాడుకోవటం తెలియక అనారోగ్యం పాలవుతున్నారనీ, దానికి స్త్రీల ఆచారవ్యవహారాలే కారణమనీ, ముందుగా ప్రజలు నాగరికులు కావాలని చెప్పటంతో అక్కడ ఉన్న స్త్రీలు తమకు ఆరోగ్యము గురించి బోధింపమని అడిగారని చెప్పింది.

*ఇది ఒక ప్రభావితంచూపగల ఫలప్రదమైన నాటకప్రయోగంగా అర్థం అవుతుంది. ప్రజలలో దేహారోగ్యంపట్ల ఉన్న మూఢనమ్మకాలను పోగొట్టుకొని స్త్రీలు తమకుగాని తమ బిడ్డలయొక్క ఆరోగ్యానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలనే చైతన్యం కలిగించిన నాటకమిది. మూఢాచారాల పట్ల స్త్రీలు తెచ్చుకోవల్సిన చైతన్యాన్ని మరియు స్త్రీల ఆరోగ్యమే జాతి, దేశనాగరికత, దేశాభివృద్ధి అనే భావనలను కలిగించే నాటకం యిది. విద్యావతియైన స్త్రీగా శాస్త్ర పరిజ్ఞానంతో స్త్రీల దేహారోగ్యం గురించి మాడభూషి చూడమ్మ ఆలోచించటం స్త్రీలు వ్యక్తిత్వస్పృహను పొందటమే.*

కవికొండల సుబ్బలక్ష్మి వ్రాసిన 'స్త్రీ పునర్వివాహ ప్రహసనం' (డిసెంబరు 1910 హిందూసుందరి) అనే నాటకంలో ఒకపాత్ర సంభాషిస్తూ బ్రతుకుమీద నమ్మకం లేని వితంతు స్త్రీలకు కూడా మనసుంటుందనీ, భర్త చనిపోతే స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చనే ఆలోచనలను ప్రచారం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. మరొకపాత్ర కందుకూరువారు చెప్పినట్లుగా స్త్రీపునర్వివాహపు ఆలోచనలను స్త్రీలలో రేకెత్తించే బాధ్యత స్త్రీల మీద ఉందనీ, ఆ రకంగా పురుషులవలె స్త్రీలు పునర్వివాహ స్వాతంత్ర్యాన్ని పొందవచ్చని చెప్తూ దానికి ముందుగా వ్యక్తి స్వాతంత్ర్యం స్త్రీలకు అవసరమని చెప్పింది.

*స్త్రీలలో వ్యక్తిస్వాతంత్ర భావన ఉంటేనే వివాహసంస్కృతిలోని స్త్రీల సమస్యలను రూపుమాపుకోగలరనీ, పురుషులవలె సమానమైన వివాహసంస్కృతి ఏర్పడాలని భావించటాన్ని స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యసాధనకై చేయాల్సిన కర్తవ్యంగా బోధించింది.*

ఈమెయే వ్రాసిన 'స్త్రీ పునర్వివాహ ప్రహసనం' (ఫిబ్రవరి 1911 హిందూసుందరి) అనే మరొక నాటకంలో భాగంగా సరోజినీదేవి పేరుతో అధ్యక్షురాలి పాత్రను ప్రవేశపెట్టగా ఇతరస్త్రీలు కందుకూరి రాజ్యలక్ష్మి మొదలగు పేర్లతో ఉన్న పాత్రలను ప్రవేశపెట్టి 'స్త్రీల పునర్వివాహం' యొక్క ఆవశ్యకతను రాజ్యలక్ష్మి అనే పాత్ర ఉపన్యసించినట్లుగా వ్రాసిన నాటకం ఇది. స్త్రీకి పునర్వివాహాలను శాస్త్రములు సమ్మతించకపోయినను స్త్రీలుగా ఆలోచిస్తే 'కామ' మనేది స్త్రీ పురుషులకు సమానమేనని స్త్రీకి పునర్వివాహం చేయటం వల్ల 'ఆత్మహత్యలు, రాజ్యదండన,

భ్రూణ హత్యలు లేకుండా ఉంటాయి కాబట్టి అదే హిందూ దేశానికి మహోపకారమనే భావాలను రాజ్యలక్ష్మిగారి ఉపన్యాసంగా రూపొందింపబడి నాటకం లోని పాత్ర ద్వారా కవికొండల సుబ్బలక్ష్మి తెలియజేస్తుంది.

*స్త్రీసమాజాల ఆశయాలను ప్రత్యక్షీకరిస్తూ వ్రాసిన నాటకమిది. ఆ రకమైన ప్రచారంగా స్త్రీల 'లైంగికతకు' సంబంధించిన విషయాలపట్ల సమానహక్కును ప్రతిపాదించటం జరిగింది. స్త్రీలకు కామభావన ఉంటుందా అనే సందేహంకల సమాజానికి స్త్రీ, పురుషులకు సమానమైన లైంగిక భావనలుంటాయనే ప్రతిపాదన చేయటం, సమాజంలోని అసమనైతిక లైంగికసంస్కృతికి గొడ్డలివేటును వేయటం ప్రారంభమైంది. జాతిఅభివృద్ధిలో వితంతుస్త్రీల శారీరక, మానసిక వికాసాన్ని కోరుకోవటం కనపడుతుంది. స్త్రీలలో వ్యక్తిత్వస్పృహను కలిగించే రచన యిది. స్త్రీల లైంగిక అణచివేతయే పితృస్వామ్యపు బలం కాబట్టి ఆ లైంగికతతోనే పురుషాధిక్యతను ఎదుర్కోవాలని భావించింది.*

ఓరుగంటి ఆదెమ్మ వ్రాసిన 'ఆరోగ్యం' (ఏప్రిల్ 1911 హిందూసుందరి) అనే నాటకంలో తల్లీ పిల్లల మధ్య జరిగిన సంభాషణలో భాగంగా తల్లిపాత్ర పిల్లలు మట్టిలో ఆడుకొని వచ్చి స్నానంచేయకపోయినా, ధారాళంగా గాలివచ్చే గదిలో పడుకోకపోయినా, తిన్న ఆహారం అరగక పోయినా పిల్లలు అనారోగ్యం పాలవుతారనీ, దేహారోగ్యం దెబ్బతింటుందని చెప్పింది. శారీరక పరిశుభ్రత ముఖ్యమనీ, నిర్మలమైనగాలి, నీరును గ్రహించాలనీ, అనారోగ్యంపాలయితే మందువేసుకోవాలని తాను పుస్తకపఠనంవల్ల పిల్లల దేహారోగ్యానికి సంబంధించిన విజ్ఞానాన్ని పొందగలిగానని తెలియచేసింది.

*విద్యావంతురాలైన స్త్రీ తనబిడ్డలను శుభ్రమైన వాతావరణంలో పెంచి వారి దేహారోగ్యానికి ప్రాధాన్యతనివ్వటం అర్థం అవుతుంది. ఆరోగ్యసంరక్షణ మానవాభివృద్ధి సూచికలో ఒక అంశం.*

గూడపాటి లక్ష్మీనరసమ్మ వ్రాసిన 'హాస్యసంజీవి' (మే 1911 హిందూసుందరి) అనే నాటకంలో సత్యాన్ని పాటించక అబద్ధపు సాక్ష్యమిచ్చి డబ్బు సంపాదించి యింటికి వచ్చిన భర్త తన భార్యతో డబ్బు సంపాదనకై తాను అసత్యమాడినట్లుగా తన తెలివితేటలను గురించి చెప్పాడు. భార్య అతనితో మొదట తప్పని వాదించినా, అతని సాంగత్యంలో ఆమెకూడా అబద్ధాలు చెప్పటం నేర్చుకొందనీ, అబద్ధపు సాక్ష్యం చెప్పిన భర్తను పట్టకుపోవటానికి పోలీసులు రాగా భర్త ఇంట్లో లేడని తాను కూడా అబద్ధమాడిందని తెలియజేసింది.

*భర్త సత్యద్వేషి అయి భార్యను కూడా ప్రభావితం చేయటంతో ఆమెకూడా సత్యసంధతను విడనాడినట్లును, స్త్రీలయొక్క గుణశీలాలకు భర్తలే కారకులని తెలియజేసిన నాటకమిది. స్త్రీలు అబద్ధాలాడతారనే అపప్రథను పోగొట్టుతూ పురుషులే అసత్యాలు మాట్లాడి స్త్రీలు అసత్యవంతులు కావటానికి కారకులవుతారని భావింపజేయటం కనపడుతుంది.*

పి.లింగమాంబ వ్రాసిన 'సంభాషణము' (మార్చి 1914 హిందూసుందరి) అనే ప్రయోగాత్మకమైన నాటకంలో భాగంగా కూతురిని చదువుయందు శ్రద్ధచూపించమని హెచ్చరించే విద్యావంతురాలైన తల్లిపాత్రగా హిందూ దేశ వైస్రాయిగా హార్డింజ్ ప్రభువు ఉన్న సమయంలో 1911లో రాజధాని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చబడిందనీ, ఇంతకుమునుపు బ్రిటిష్ వారు ప్లాసీ యుద్ధంలో సురాజుద్దౌలాను జయించిన మొదలుగా కలకత్తాను రాజధానిగా చేసుకొన్నారని చెప్పింది. యుద్ధాలు రావటానికి కారణాలుగా దేశసరిహద్దులు, వర్తకవిషయాలు, మతవిషయాలుంటాయని, కూతురుకు తల్లి చరిత్రపాఠాన్ని ప్రశ్నోత్తరాల రూపంలో చెప్పటం జరిగింది.

*విద్యావంతులైన తల్లులు యింట్లోకూడా తమ బాలికల విద్యాభివృద్ధికి పూనుకుంటారని తెలియజేసిన ప్రయోగాత్మక సాహిత్యరూపకమిది. స్త్రీ చదువుకుంటే ఆ కుటుంబంలోని వారంతా చదువుకోగలుగుతారు అనేది సత్యమని తెలియజేయటం జరిగింది.*

ఆరణి చూడామణి వ్రాసిన 'జ్ఞానోదయం' (జనవరి1915 హిందూసుందరి) అనే నాటక సారాంశంగా స్నేహితురాలి పాత్రచేత చెప్పిస్తూ, వితంతువులైన స్త్రీలు సభలకు వెళ్ళాలనీ, అక్కడ స్త్రీలకు చదువు వల్ల లాభాలు అర్థం అవుతాయనీ, విద్య నేర్చుకున్న స్త్రీలు గ్రంథపఠనంతో పాటు స్వయంగా తమకు తెలిసిన విషయాలను ఉపన్యాసించాలని చెప్పటం జరిగింది.

*ఈ నాటకంలో వితంతు స్త్రీలు చదువుకోవటమేకాక పదిమందిలో ఉపన్యసించగలగాలని చెప్పి సమాజంలో వితంతువులకు గుర్తింపుకలిగితే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భావించింది. అట్టి ఆత్మవిశ్వాసమే వారి అభివృద్ధికి, స్వతంత్ర జీవనానికి అవకాశాన్ని యివ్వగలుగుతుంది. సాంస్కృతిక సంకెళ్లలో ఉన్న వితంతు స్త్రీలు సమాజంలోకి వచ్చి స్త్రీల విద్యను గురించిన ఆలోచనలు పెంచుకోవటమే గాక సభలలో ఉపన్యసించగల శక్తిని వారు పొందగలరని చెప్పటం జరిగింది. వితంతుస్త్రీలలో ధైర్యోత్సాహాల వంటి వ్యక్తిత్వాన్ని పెంచే విధంగా ప్రోత్సహిస్తే, స్త్రీలలో జ్ఞాననేత్రం తెరుచుకొంటుందనే భావన కూడా అర్థం అవుతుంది. స్త్రీలు, అందునా వితంతుస్త్రీలు విద్యాభివృద్ధితో సమాజ ప్రస్థానాన్ని ప్రారంభించటమంటే వ్యక్తిస్వాతంత్ర్యానికై మరోప్రపంచంలో అడుగుపెట్టటమే.*

వాడ్రేవు సుందరమ్మ వ్రాసిన 'సంఘసంస్కరణ విషయము' (ఏప్రిల్ 1919 వివేకవతి) అనే నాటకంలో ముగ్గురు స్త్రీల సంభాషణలలో భాగంగా స్త్రీలు చదువుకోవాలని చెప్తూ ఉదాహరణగా ఒక ఆడబడుచు పాత్ర తన తల్లి, తమ్ముడు, ఎప్పుడూ పుస్తక పఠనంచేసే తన మరదలని కొట్టి ఇంటినుండి పంపించారని చెప్పింది. భార్య బయటకు వెళుతూ కూడ తన భర్త సేవ గొప్పదనే విధంగా పద్యాలు వ్రాసి భర్తకు ఇవ్వగా, భర్త తన భార్య విజ్ఞానాన్ని, చదువును మెచ్చుకొని ఆమె యందు మిక్కిలి యిష్టుడిగా తయారయ్యాడని ఆ ఆడబడుచు చెబుతుంది.

*స్త్రీలు చదువుకోవటమే వారి సంసారజీవితానికి రక్షణ అని తెలియచేయటం జరిగింది.*

ఈమెయే వ్రాసిన 'సంఘసంస్కరణ విషయములు' (ఏప్రిల్, మే 1918 వివేకవతి) అనే పేరుగల మరొక నాటకంలో ఇద్దరు స్త్రీల సంభాషణలో భాగంగా స్త్రీలకు స్వతంత్రజీవన మెందుకని ఒక ఆమె అడిగిన ప్రశ్నకు, సమాధానంగా మరొక స్త్రీ ధనవంతులకు సంపద ఉంటుంది కానీ సామాన్య స్త్రీలు మాత్రము ధాన్యము మొదలగు వానిచే వర్తకము చేయవచ్చునీ, బట్టలు కుట్టుట, గర్ల్ స్కూలులో మేస్టర్లుగా, డాక్టర్లుగా కష్టపడి పనిచేయవచ్చునీ అప్పుడే వారికి స్వతంత్ర జీవనం ఉంటుందని చెప్పింది. దానికి మొదటి స్త్రీపాత్ర పురుషులను నిర్లక్ష్యంచేస్తూ ఉంటే స్త్రీలు స్వతంత్రంగా ఉండేదెలా అని అడుగుతుంది. దానికి ఉదాహరణగా రెండవ స్త్రీ ఒక కథను పేర్కొంటూ అందులో ఐదుగురు అప్పుచెల్లెళ్ళలోని చివరిపిల్ల రాజును పెళ్ళిచేసుకోవాలని బలంగా భావించి దానికి తగ్గ వాతావరణాన్ని ఏర్పరచుకుందనీ, కాని మిగిలినవారు అల్పులనే పెళ్ళిచేసుకోవాలనే భావనతో రాజుగారి వంటమనిషిని, చాకలిని, కంసాలిని, తోటమాలిని చేసుకున్నారనీ, కాని తరువాత వారు చెల్లెలియొక్క వైభోగానికి అసూయచెంది ఆమెకు పుట్టిన పిల్లలను మార్చి జంతువుల పిల్లలు పుట్టారనీ మూడుసార్లు రాజును నమ్మించ ప్రయత్నంచేసారు. దానితో ఆరాజుకు రాణీమీద కోపం వచ్చి ఆమెను వదిలిపెట్టేసరికి, మంత్రి ఆమెను తనయింట్లో పెట్టుకున్నాడనీ, అక్కలు చెల్లెలుకు పుట్టిన ఇద్దరు మగపిల్లలను, ఆడపిల్లను పెట్టెలోపెట్టి నదిలో వదిలారనీ, తరువాత పిల్లలు లేని ధనవంతులచేతిలో ఆ పిల్లలు పెంచబడిన విధానాన్ని చిలుక రాజుకు తెలియజేయటంతో చివరకు అతడు రాణిని కలుసుకొని ఆమె యొక్క అక్కలు నల్గురిని శిక్షించటం జరిగిందని తెలియజేసింది.

*ఈ కథాత్మక నాటకంలో ఉన్నతస్థితిని కోరుకొన్న చెల్లెలు యొక్క సంకల్పం గొప్పది అనీ, ఆమె తన తెలివితేటలను తనయొక్క స్వతంత్ర జీవనానికి ఉపయోగించుకుందనే కథ చెప్తూ స్త్రీలు బానిసలుగా గాక మేధాశక్తితో స్వతంత్రంగా జీవించటం నేర్చుకోవాలని చెప్పింది. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యం వారికి ఉన్నతజీవితాన్ని యిస్తుందని భావించింది.*

గుడిపూడి ఇందుమతి దేవి వ్రాసిన 'స్త్రీవిద్యా ప్రశంస' (జూన్ 1918 అనసూయ) అనే నాటకంలో తోటి స్త్రీలకు చదువు చెప్పటమే దేశసేవగా భావించాలనీ, ఇంటింటికీ వెళ్ళి స్త్రీలకు విద్య నేర్పాలనీ దానితోపాటు చేతిపనులు, కుట్టుపనులు నేర్పాలని స్త్రీల సంభాషణ ద్వారా తెలియజేయటం జరిగింది.

*స్త్రీవిద్యాభివృద్ధి దేశసేవలో భాగమని గుర్తిస్తేనే దేశాభివృద్ధి, దేశస్వాతంత్రం ఉంటుందని భావించటంవల్లనే నేటి మానవాభివృద్ధి సూచికలో విద్య ఒక కొలమానం అయ్యింది. అంతర్గత స్వపరిపాలనకై హోమ్‌రూల్ ఉద్యమ ప్రభావంతో దేశసేవలో భాగంగా స్త్రీవిద్యాభివృద్ధి ప్రముఖమైందని భావించింది. స్త్రీ విద్యావంతురాలైతే స్వతంత్ర జీవనమనే ఆలోచనలు పెరుగుతాయనీ, దానంటదే దేశ స్వాతంత్రానికి మార్గం చూపుతుందని భావించారు. గురజాడ వారి 'దేశమంటే మట్టికాదోయ్-దేశమంటే మనుషులోయ్'... 'కొంతమేల్ తలపెట్టవోయ్' అనే కవిత యిక్కడ గుర్తుకురాక తప్పదు.*

ఈ దశాబ్దంలో వచ్చిన నాటకాలలో స్త్రీలకు శిశుపోషణకై శాస్త్రవిజ్ఞానం అవసరమనీ, వితంతు స్త్రీలపునర్వివాహం, వితంతుస్త్రీలకు సామాజికజీవనం ఉండాలనుకోవటం, తమ ఆరోగ్యంపట్ల స్త్రీలు శ్రద్ధ చూపంచాలని తెలియజేసారు. స్త్రీపురుషులకుసమాన లైంగిక భావనలుంటాయని, విద్యావంతురాలైన తల్లి పిల్లలకు జ్ఞానాన్ని అందించగలుగుతుందనీ, తోటి స్త్రీలకు విద్య నేర్పించటం దేశసేవ అనీ, విద్యావంతురాలైన స్త్రీని భర్త యిష్టపడతాడనే విషయాలతో స్త్రీలు నాటకరచన చేసి తోటిస్త్రీలలో చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేసారు.

**కవితలు**

20వ శతాబ్దపు రెండవ దశకంలో స్త్రీలు తమ కవితారచనకు పదును పెడుతూ 7 కవితలను వ్రాసారు. స్త్రీవిద్యా ప్రచారం చేయటానికి వీలుగా కవితలను అల్లి స్త్రీసమాజాలలో పాడుకొనేటట్లుగా వ్రాసారు.

ఉ. నారాయణాంబ వ్రాసిన 'స్త్రీ విద్యాప్రశంస' (ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచిక ఏప్రిల్ 1910) అనే కవితలో 'స్త్రీవిద్య సంఘ దురాచారులపాలిట వజ్రాయుధమని, 'నెలత'కు విద్య దగినట్లు నేర్చుకున్న దేశమంతకంతకు దీనదశకు వచ్చుననియు... సౌఖ్యములిచ్చును విద్య తల్లి కాన రమణులకద్ది వద్దనెడు రాక్షసనీతిని నమ్మరాదుగాకమృతమా హాయి యొక్కరికి హాని మఱొక్కరికింపొనర్చునే" అని స్త్రీలకు విద్యఅందాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించింది.

*విద్య పురుషుల పాలిట అమృతమైతే స్త్రీల పాలిట హానికరం ఎలా అవుతుందనీ, అది రాక్షసనీతియని సమాజాన్ని ప్రశ్నకు పెట్టింది. స్త్రీలు తమ విద్యావిషయంలోని అసమానత్వాన్ని గుర్తించి సమాజాన్ని ప్రశ్నించటం మొదలు పెట్టారు. ఈ ప్రశ్నించటమనే జ్ఞానమే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యసాధనకు ప్రధానమార్గంగా భావించాలి. సినారె 'విశ్వంభర' కావ్యంలో చెప్పినట్లుగా ప్రశ్నించటమే జ్ఞానానికి బీజమని అర్థమవుతుంది.*

ఉప్పల నరసమాంబ వ్రాసిన 'స్త్రీ విద్యాపంచరత్నములు' (సెప్టెంబరు1910 సావిత్రి) అనే కవితలో స్త్రీల చదువు వల్ల పిల్లలపెంపకం బాగుండటమే కాక "చేడె చదివినప్పుడు సేమమొదవు, కీడులెవ్వియునెన్నడు మూడబోవు కానఘనులారా! పురుషాగ్రగణ్యులారా కాంతలకు విద్య నేర్పింపగడకవలయు" అనీ, స్త్రీలదుస్థితిని మదిలో ఆలోచించి పాడుపద్ధతులను పోగొట్టమనుచూ, స్త్రీలకు విద్యలేకపోతే దేశమంతయు దీనస్థితిని పొందుననీ, స్త్రీకి విద్య ఉన్న సత్ప్రవర్తనతో అమితకీర్తి పొందగలదని తెలియజేసింది.

*స్త్రీల విద్యను యిష్టపడని పురుషులలో చైతన్యాన్ని కలిగించే కవితను వ్రాసింది. స్త్రీవిద్య పట్ల స్త్రీలలో చైతన్యం కల్గిస్తూనే పురుషులలో కూడా చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరాన్ని గుర్తించటం జరిగింది.*

శ్రీమతి ఆత్మూరి అన్నపూర్ణమ్మ వ్రాసిన 'కుమార సుగుణ బోధిని' అనే శతకంలో (ఆంధ్ర కవయిత్రులు-ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ) పురుషసంఘ నిరంకుశాభారతమును సరిదిద్దటానికి పూనుకునేవారు సంఘానికి అవసరమని స్త్రీకి నీతులు చెప్పటానికి అందరూ పెద్దలే అనీ

*'పిచ్చుకపై బ్రహ్మాస్త్రము*
*విచ్చలవిడి వేయునట్లు, విరివిగా సుకవుల్*
*హెచ్చుగా విద్యల నేరిచి*
*వచ్చిరె స్త్రీనీతి గఱుప వసుధకుమారా.'*

*'రుసరుసలాడుచు దిట్టుచు*
*గసరుచు గోపింప సతులు గ్రక్కునవశులై*
*మసలుదురని తలపోయుదు*
*రసురులవలె దుష్ట పురుషులవని కుమారా!'* అని

భూమిమీద స్త్రీలకు మాత్రమే నీతులను బోధించే పురుషులను రాక్షసులతో పోల్చి చెప్పగల ధైర్యాన్ని స్త్రీలు పొందగలిగారని అర్థమవుతుంది.

జూలూరు తులశమ్మ వ్రాసిన 'జననీ వియోగవిచారము' (సెప్టెంబరు 1910 హిందూ సుందరి) అనే శీర్షికన కందుకూరి రాజ్యలక్ష్మి స్మృతిగా చెప్పిన పద్యాలలో భాగంగా ఆమె కృషిని ప్రశంసిస్తూ

*"గతిలేక కష్టముగూచి చింతించెడు*
*గరితల దయ జూచు కాంతయెవతె*
*తలిదండ్రి దయమాలి తరిమిపుచ్చిన*
*యట్టి కాంతల బ్రేమించు గరితయెవతె*

*వెలలేని సద్ధర్మ వితతిని బోధించి*
*యజ్ఞానమడచిన యమ్మయెవతె*
*అరలేని యనుకంప నారసిదుఃఖంబు*
*లపనయించిన యట్టి యతివయెవతె*

*అట్టి మా రాజ్యలక్ష్మమ్మ నలఘునాతిని*
*కాలగతినిట్లు నెడబాసి కనల వలసె*
*నకట కాలంబు దాటగా నలవియగునె*
*ఫాలనేత్రునకయి నను బ్రహ్మకైన"*

అంటూ ఆమెమరణం పట్ల తన విచారాన్ని తెలిపింది.

కాంచనపల్లి కనకమ్మ వ్రాసిన 'సమాజలాభము' (జూన్ 1911 హిందూ సుందరి) అనే కవితలో స్త్రీ సమాజాలను గురించి వ్రాస్తూ, "ఐకమత్యంబునకు మూలమైన వేరు–సుగుణగ్రహనైక నిర్దుష్ట సుపథమరయ స్వార్థసంపాదనోచిత సాధనంబు–స్నేహ సురతరుస్కంధమై చెలగుమిగుల" అనీ "అఖిలవిద్యా ప్రసంగైక హర్మ్యమతుల–సుగుణ శాలినీ చరిత్ర సూచకంబు,– వివిధ విషయ పరిజ్ఞాన విపణితలపఁ–గామినీ జనభావ సంస్కార మరయ" అనీ "మందమతులైనను సమాజ మందుజేరి వివిధ విషయప్రసంగముల్ వినుటవలన–బొందెదరు/ బుద్ధి వికసనంబందు వలనఁ – బతిసుత హితాభిమానంబుఁబడతు చెలిమి" అనీ 'వనితలబలలటంచును పల్కబడిన' – సంఘమైవారు సంస్కార సరణిఁగాంచ–సహజ మానసికోన్నతి సత్ప్రవృత్తిఁ – దనరిలోకంబునందున ఘనులుకారె?!" అని సమాజాలు స్త్రీల అభివృద్ధికి పాటుపడుతున్నట్టు తెలియజేసింది.

ఈమె వ్రాసిన మరొక కవితలో ("ఆంధ్రకవయిత్రులు"–ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

*"చదువజదువజదువ సంసారమాలేదు*
*వంటలేదు, కడుపుపంట లేదు*
*మంటమగని జూడ మహిళాసభలనుంట*
*చదువునకు ఫలమగు శాంతి లేదు!"* అని

*సమాజంలో స్త్రీలు చదువుకుంటూ, స్త్రీలసభలకు వెళుతూ, స్త్రీలకు కుటుంబ సంస్కృతి నిర్దేశించిన పనులు చేయటంలేదనే భావంతో భర్తలు అసంతృప్తిచెందటాన్ని కాంచనపల్లి కనకాంబ వివరించింది.*

అనామక కవయిత్రి వ్రాసిన 'పంచరత్నములు' (నవంబరు 1911 సావిత్రి) అనే పద్యాలను పత్రికాధిపురాలి ప్రచురణలో 'భార్యలపాలిటి మృత్యుదేవతలు' అనే శీర్షికన తల్లిదండ్రులను వదిలి భర్తను నమ్మి వచ్చిన స్త్రీలను ఇంటినుండి గెంటివేసేవారును, భార్యలను మానసిక శారీరక హింసకు గురిచేసేవారును, ఆలిని మోసపుచ్చి వెలయాలికి ధనము వెచ్చించువారును, విద్య కులకాంతలకు తగదని ఇంట్లోనే బందీచేసి స్వేచ్ఛనివ్వని వారును, చదువుకుంటున్న స్త్రీలను కులటలని నిందించు భర్తలు భార్యలపాలిటి మృత్యుదేవతలని పేర్కొంటూ

*"చదువులుబ్రొద్దుబుచ్చుటను సార్థమొనరజన్మమంచు, స*
*త్పథముల నేర్పుగ్రంథములు దద్దయఁగాంచెడు స్త్రీలుజూచి,యి*
*య్యది కులటంచు నారటమునందుచు నారడి బెట్టివారలం*
*బ్రతుకగనీనివారెకద భార్యలపాలిటి మృత్యుదేవతల్"* అనీ

*"తనుగని పెంచినట్టితలిదండ్రుల, సోదరపాళి వీడినా*
*ధునకెనలేదటంచుదమచో సుఖదుఃఖములొందు కాంతలన్*
*జనవునుజేరదీసి ఘనసౌఖ్యములీయక వేపుచున్నదా*
*వనటలఁద్రోయువారెకద భార్యలపాలిటి మృత్యుదేవతల్"*

అంటూ తన కవితలో తెలియజేసింది. భర్తలు పెట్టేహింసలను బట్టబయలుచేయటం ఆ నాటికది స్త్రీలసాహసంగా భావించాలి. అందుకే కవితా కర్తృత్వం అనామకంగానే ప్రచురింప బడిందని అర్థమవుతుంది. భార్యలవిద్యను ఆటంకపరిచేది భర్తలేనని స్త్రీలపాలిటి వారే మృత్యుదేవుళ్ళని స్పష్టంచేసింది. భర్తల కుసంస్కారపు జీవనవిధానాన్ని బట్టబయలు చేసింది.

బ్రహ్మండం కనకసుందరమ్మ వ్రాసిన 'అబలా విలాపం' (సెప్టెంబరు-అక్టోబరు1919 అనసూయ) అనే సుదీర్ఘ కవితలో పురాణస్త్రీలను, చారిత్రక స్త్రీలను పేర్కొంటూ వారిలో అస్త్రవిద్యలు నేర్చి పరిపాలన చేసినవారున్నారనీ, నేటి స్త్రీలకు ఉద్యోగాలు తగవని చెప్తున్నారనీ, స్త్రీలను అబలలని భావించవద్దనీ, స్త్రీలకు తెలియాల్సిన శాస్త్ర విద్యలు నేర్పకుండా, స్త్రీలను అజ్ఞానులనటం అన్యాయమని చెప్పింది. అతిథులకు, రోగులకు, పిల్లలకు అవసరమైన దానిని స్త్రీలు ఇవ్వాలంటే భర్త అనుమతి అవసరమనీ, స్త్రీ స్వాతంత్ర్యాన్ని ఎరగదనీ, స్త్రీలు వేదసాహిత్యవేత్తలు అయితే భర్తమాయలకు పడియుండరనీ, అందుకే వారు విద్యావంతులు కాకుండా ఉండటానికి చిన్నప్పుడే పెళ్ళిచేస్తున్నారని తెలిపింది. బాల్యవివాహాలతో వరుని ఎన్నుకునే స్వేచ్ఛను లేకుండా చేస్తున్నారనీ, స్త్రీ విద్యావంతురాలైతే సద్బుద్ధి ఉండదని ప్రచారం చేస్తున్నారుకానీ, చరిత్రలో విద్యావంతులైన స్త్రీలు దుర్గుణులుగా లేరనీ, స్త్రీలు తీర్థాలంబడి తిరగవచ్చుగానీ, కులకాంత సభలకు వెళ్ళకూడదా అని ప్రశ్నించింది. వ్యవహారచతురత లేకపోతే పూర్వస్త్రీలు రాజ్యాలను ఎలా ఏలగలిగారనీ ప్రశ్నిస్తూ, పురుషులు మాత్రం స్త్రీమీద స్త్రీని పెళ్ళిచేసుకోవచ్చు గానీ, భర్తవిహీనులైన స్త్రీలు పునర్వివాహం చేసుకోకూడదనటానికి వారికి ఆ అధికారం ఎలాఉందనీ అనీ, స్త్రీల యొక్క అవిద్యకు కారణం పురుషులేననీ, బహుభార్యత్వపు అధికారం పురుషులకెవరిచ్చారనీ రచయిత ప్రశ్నకుపెట్టింది.

*అబలావిలాపం అంటూ చెప్తితేనే పురుషులు చదువుతారని భావించి వ్రాసిన కవితలో మాత్రం స్త్రీవిద్యను గురించి పురుషులను ఆలోచింపచేస్తూ, స్త్రీలపైపురుషులకున్న అనైతికతాధికారాలను కవితలో ప్రశ్నకు పెట్టటం ఆనాటికది చాలా గొప్ప విషయం. బహుభార్యాత్వపు సంస్కృతియే పురుషాధిక్యతకు చిహ్నమనీ, విద్యావంతులై స్త్రీలు దానిని ఎదుర్కొనే చైతన్యం తెచ్చుకోవాలని భావించింది.*

ఈ దశాబ్దపు కనితలలో స్త్రీవిద్యా ప్రయోజనాలను, స్త్రీసమాజాలకు స్త్రీలు వెడితే స్త్రీలలో ఐకమత్యం పెరుగుతుందనీ, బాల్యవివాహాలు స్త్రీలవిద్యకు ఆటంకంగా ఉన్నాయనీ, వివాహానంతరం భర్త చదువుకోనీయడనీ, స్త్రీలకు స్వతంత్రం లేకుండాచేస్తున్న భర్తలు మృత్యుదేవుళ్ళనీ, స్త్రీల అవిద్యకు భర్తలే కారకులనీ, పురుషులకున్న అధికారాన్ని ప్రశ్నకు పెడుతూ కవితలను రచించారు.

**కీర్తన**

దే.సుబ్బలక్ష్మి వ్రాసిన 'కీర్తన' (సెప్టెంబరు 1914 హిందూసుందరి) లో స్త్రీసమాజాలను గురించి స్త్రీలు సదవగాహన చేసుకోవాలని తెలియజేస్తూ స్వయంగా కవితవ్రాసి కీర్తనను కూర్చి'ఫాలనయన దయాలవాల'అనే కీర్తనబాణీలో పాడుకోవాలని చెప్పినది. ఆ "కీర్తన"యే

*"స్త్రీసమాజము లేమిటని మదిరోష పడుటయు వీడుడీ।*
*ఆశతో భువిలోన యాసర్వేశువేడుటా జూడుడీ* ॥స్త్రీ॥

*అక్కలారా వింతయనుమీ, ముక్కుపై వేల్దీయుడీ।*
*చక్కగా జగదీశుగొల్చియు, నిక్కమేదో దెలియుడీ* ॥స్త్రీ॥

*మగువలిటుల జేయతగదని మిగుల నాడుట వీడుడీ।*
*మగువలకు జ్ఞానం బొసంగను జగతిపోషకు జేరుడీ* ॥స్త్రీ॥

*శాంతిచిత్తము గల్గునూ మన చింతలన్నియు దొల్గునూ।*
*అంత మనమిటుజేరి వేడిన సంతసంబై యుండునూ* ॥స్త్రీ॥

*వాసిగాను శ్రీకాకుళంబున జేసె స్త్రీల సమాజమూ।*
*ఓసతీమణులార! మీరలజూచినను కడుమోదమూ।*
*దబ్బ రేదో తథ్యమేదో ధరణిలోపల గాంచుడీ।*
*సుబ్బలక్ష్మి దెల్పు మార్గము సుఖముగను మదినుంచుడీ"* ॥స్త్రీ॥ అని

స్త్రీసమాజాల ప్రయోజనాలను తెలుపుతూ కీర్తనలో తన పేరుగల స్వీయ ముద్రనుకూడా జోడించి వ్రాసింది. స్త్రీల అభివృద్ధిలో భాగంగా మూఢనమ్మకాల నిర్మూలన జరగాలని భావించింది.

**నవల**

1917లో చెన్నపురినందలి వితంతు శరణాలయంలో విద్యనభ్యసిస్తున్నప్పుడు కాంచనపల్లి కనకాంబ 'రాధ' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించింది. దీనికి మూలగ్రంథమైన నటేష్ శాస్త్రి వ్రాసిన 'దిక్కట్రఇరుకళందిగల్' (ఇరువురు అనాథ బాలికలు) అనే ద్రావిడభాషా(తమిళ) గ్రంథానికి తెలుగు అనువాదమిది. సవతితల్లి కుట్రవల్ల మధ్యదారిలోనే ఇద్దరు అనాథబాలికలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాకూడా ధైర్యస్థైర్యాలతో, విచక్షణాజ్ఞానంతో మోసగాళ్ళబారినుండి తప్పించుకొని రక్షకభటుల సహాయంతో జమీందారు అండన చేరటం జరిగింది. ఆ జమిందారు వీరిని ఒక అనాథశరణాలయంలో చేర్పించటం, అక్కడవారు చక్కగా చదువుకొని తోటి విద్యార్థినులతో ఐకమత్యంతో ఉంటూ మిత్రసంబంధాలతో ఉండటాన్ని తెలిపింది. వారిద్దరిలో ఒకరు స్నేహానికి ప్రాముఖ్యతనివ్వటం, మరొకరు తన కాళ్ళ మీద తాను నిలబడటానికై ఉపాధ్యాయినిగా చేరి విద్యార్థులకు బోధన చేయుటయందు నిమగ్నురాలవటం, చివరకు తండ్రిని కలుసుకోవటం జరిగి, వారు తమను వరించినవారిని వివాహాలు చేసుకోవటంతో వారి జీవితం ముగుస్తుంది.

*అన్నిరకాలుగా ఇబ్బందులకు గురియైన స్త్రీలలో ధైర్యస్థైర్యాలుంటే విద్యావంతులై స్త్రీలు అభివృద్ధిని సాధించగలరనే చైతన్యాన్ని ఇవ్వగల అనువాద నవల ఇది. 'రాధ'పాత్ర అనాథబాలికలకు స్ఫూర్తినిచ్చే మూర్తిమత్వం కలది. బాల్యవివాహాలవల్ల నాటి వితంతువులు తాము అనాథలమనీ, తామెలా జీవితాన్ని గడపగలమన్న వారికి స్ఫూర్తినిస్తూ, తెలుగువారి*

*ఆడపిల్లలు తమకు ఎదురైన సమస్యలను ధైర్యస్థైర్యాలతో ఎదుర్కొనవచ్చుని చెప్పింది. విచక్షణా జ్ఞానంతో మనుషులను అంచనా వేసుకుంటూ ముందుకు పోవాలనీ, తద్వారా విద్యావంతులై జీవితాన్ని చక్కగా గడపవచ్చునే భరోసా కలిగించే కథావస్తువు ఉన్న నవలను (వచన ప్రబంధం) అనువదించి స్ఫూర్తినిచ్చినట్లుగా భావించవచ్చు.*

## స్వీయచరిత్ర

'ప్రేమలత' (జులై-ఆగష్టు1919 అనసూయ) అనేపేరుతో కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన స్వీయచరిత్రలో ఆమె యొక్క భర్త చెన్నపట్నంలో చదువుకునేటప్పుడు ఆయనతో ఈమెకు వివాహం జరగటంతో ఈమె అత్తవారింట్లో ఉండాల్సిరావటం జరిగిందనీ, ఆనాడు ఆమె పడ్డకష్టాలకు చావాలనుకున్నా, అలా చేయటం తెలివితక్కువతనమని భావించిందట. తన జీవితాన్ని స్త్రీ జనాభ్యుదయోద్యమానికి వినియోగించాలనుకొన్నట్లును, అత్తవారువాళ్ళు భర్తకు తనమీద లేనిపోని మాటలు చెప్పినా, రోగగ్రస్థుడైన భర్తకు సేవచేసి భర్తయొక్క అన్యోన్యతను పొందగలిగినట్లును తెలిపింది. భర్తప్రేమకై వశ్యౌషధాలు వాడకూడదనీ, సత్ప్రవర్తనతో ఉంటే స్త్రీలు ఎటువంటి కష్టాలనైనా అధిగమించగలరని రచయిత్రి తన జీవిత చరిత్రద్వారా తెలియజేసింది.

*ఆనాటి సమాజంలో మందులుమాకులు పెట్టి ఏరకంగానైనా భర్తలు తమను ఇష్టపడేటట్లుగా చేసుకోవటానికి స్త్రీలు ప్రయత్నించటం మూర్ఖత్వం అనీ, పైపెచ్చు అది భర్తల అనారోగ్యానికి దారితీస్తోందని భావించింది. ఎన్నికష్టాలు వచ్చినా స్త్రీలు చనిపోకూడదనే సందేశం ఇవ్వటానికి కనుపర్తి వరలక్ష్మమ్మ స్వీయచరిత్ర వ్రాసి స్త్రీలలో మూఢత్వం పోగొట్టటానికి, జీవితంమీద ధైర్యంనింపటానికినీ చేసిన ప్రయత్నంగా అర్థం అవుతుంది.*

## లేఖా సాహిత్యం

దామెర్ల సీతమ్మ వ్రాసిన "ఆచంట లక్ష్మీపతి గారికి వ్రాయబడిన లేఖ" లో (ఫిబ్రవరి 1912 హిందూసుందరి) ఆచంట లక్ష్మీపతిగారు విద్యావతియైన రుక్మిణమ్మను స్వయంవర వివాహం చేసుకొని "బాలికావివాహ దుష్ట బాలిశంపు రక్కసినిఁబాఱద్రోలిన వారిగా" కీర్తించటం కన్పడుతుంది.

20 శతాబ్దంలోని రెండవ దశకంలో వచ్చిన స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన విషయాలుగా స్త్రీలలో స్వతంత్ర భావాలు అభివృద్ధిచెంది జన్మసిద్ధమైన స్వతంత్రజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే క్రమంలో పునరుత్పత్తికి సంబంధించిన శరీర శాస్త్రము, శిశుపోషణ గురించి తెలుసుకోవటమేగాక, వృత్తివిద్యల ద్వారా ఆర్థికస్థితిని పెంచుకోవాలనుకున్నారు. స్త్రీల ఆరోగ్యం గురించిన ఆలోచనలను పెంచుకొన్నారు. స్త్రీశక్తి దేశానికి ఉపయోగకరంగా ఉంటే స్త్రీజాతికి విలువ పెరుగుతుందని భావించారు. విదేశాలలోని స్త్రీలవలె విద్యాభివృద్ధితోపాటు స్త్రీలు రాజకీయ వ్యవహారాలలో

ఉండాలనుకొన్నారు. ఉద్యోగాలు కూడా చేసుకోవాలను కోవటంవంటి ఆలోచనల పరిణామ శీలతతోపాటు దేశముయొక్క దీనస్థితిని అవగాహన చేసుకోవాలనుకున్నారు. వివాహిత స్త్రీలు కూడా విద్యనుకొనసాగించాలనీ శాస్త్రపరిజ్ఞానము గణితము, చరిత్ర, వైద్యం, మనోవిజ్ఞానం వంటి విషయాలతో స్త్రీవిద్య అభివృద్ధిచెందాల్సిన అవసరాన్ని గుర్తించారు. స్త్రీలకు ఆధ్యాత్మిక జ్ఞానము కంటే ప్రపంచ జ్ఞానము అవసరమనే స్థితికి చేరుకున్నారు. విదేశీస్త్రీలు ఓటుహక్కుకై పోరాడుతూ రాజకీయ వ్యవహారాలలో పురుషులతోపాటు సమానంగా గౌరవాన్ని పొందుతున్నారని గుర్తించారు. స్త్రీ పునర్వివాహ ప్రచారం చేయాలని పురుషులకులేని నిర్బంధవైధవ్యం స్త్రీలకు ఎందుకనీ స్త్రీ, పురుషులు సమానంగా ఎందుకులేరని సామాన్యస్త్రీలు కూడా ఆలోచించటం మొదలుపెట్టారు. వితంతుసంస్కృతిని నిరసించారు. స్త్రీల పుస్తకపఠనం కోసం స్త్రీలే ముందుకువచ్చి స్త్రీల గ్రంథాలయాలను స్థాపించారు. పర్యావరణము, పరిశుభ్రత, స్త్రీల ఆరోగ్యానికి సంబంధించిన ఆలోచనలను పెంచుకున్నారు. రజస్వలానంతర వివాహాలను క్రియారూపంలో చూపించి నిర్దేశిత సమాజసంస్కృతిని అధిగమించారు. జాతి, మత భేదాలుండ కూడదనీ నీతివిద్య నేర్పితే నిమ్నజాత్యుద్ధరణతో జాతిసంస్కారం జరుగుతుందనుకున్నారు. ప్రౌఢవివాహాలను ఆచరణలో పెట్టటానికి స్త్రీల వివాహాలవయస్సు పెరగాలనుకున్నారు. బాల్యవివాహాలు, నిర్బంధవైధవ్యంవంటి విషయాలలో తల్లిదండ్రులను విమర్శించటం మొదలుపెట్టారు. స్త్రీలవిద్యావిషయాలలోను స్త్రీలసమావేశాలకు వెళ్ళనీయకుండా చేసే సోదరుల భావాలను గుర్తించారు. స్త్రీలు పుస్తకపఠనము చేస్తుంటే కులట అంటారనీ నిరంతరం హింసకు గురిచేస్తున్న భర్తలే స్త్రీలపాలిటి మృత్యుదేవతలని భర్తల దుర్మార్గాన్ని బట్టబయలుచేసారు. స్త్రీవిద్యకు, స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టయిన సామాజిక కుటుంబసంస్కృతిని నిరసించే స్థితికి స్త్రీలు చేరుకోవటం కనపడుతుంది. స్త్రీలు నెలకొల్పిన బాలికా పాఠశాల విద్యలో ఉపాధిని కల్పించే నూలువడకటం, ఖద్దరు వర్తకము చేయటాన్ని ప్రారంభించారు. దేశభాషతో పాటు ఆంగ్లభాషనుకూడా స్త్రీలు నేర్చుకోగలిగితేనే దేశాన్ని పాలించే శక్తి స్త్రీలకుంటుందనీ, భార్యను సేవకురాలుగా చూసే వివాహంలో స్వాతంత్ర్యంలేదనీ, అది ఆమరణాంతపు సంకెళ్ళల బీగం అనీ, స్త్రీకి స్వతంత్రజీవనం అవసరమని భావించారు. స్త్రీల స్వాతంత్ర్యాన్ని గురించి విశ్లేషణ చేసారు. వేశ్యావ్యవస్థను నిర్మూలించి ఆ స్త్రీలను విద్యావంతులుగా చేసి వారికి సమాజంలో గౌరవప్రదమైన జీవనం ఉండేలా స్త్రీసమాజాలు బాధ్యత వహించాలను కున్నారు. స్త్రీసమాజాలను విస్తృతంచేసుకొని ఆంధ్రమహిళాసభలను ఏర్పాటుచేసుకొన్నారు.

దేశాభ్యుదయానికి స్త్రీలు తమవంతు సహకారాన్ని ఇవ్వాలనుకున్నారు. స్త్రీలకు విద్యా బోధన చేయటమే దేశసేవ అనీ, దేశభక్తియే దైవభక్తి అని ఆ దిశగా స్త్రీలు తమవ్యక్తిత్వాలను పెంచుకోవాలనీ, బాలికలు విద్యనేర్చి ముందుగా బుద్ధి స్వాతంత్ర్యాన్ని పొందాలనీ, విద్యావంతులైతేనే

స్త్రీలు స్వతంత్రులు కాగలరనీ వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములైతే దేశాభివృద్ధి ఉంటుందనీ, స్త్రీ, పురుష సమానత్వం సామాజిక నాగరికతా చిహ్నం కావాలనీ స్త్రీలు నియోజకవర్గ స్వాతంత్ర్యం పొందాలంటే ముందుగా స్త్రీలు రాజకీయవిద్యను నేర్చుకోవాలని భావించారు. ముస్లింలకు 1919 చట్టం ఏర్పరచిన ప్రత్యేక నియోజకవర్గ స్వాతంత్ర్యాన్ని గుర్తించి స్త్రీలు తాము కూడా ప్రత్యేక నియోజక స్వాతంత్ర్యాన్ని పొంది రాజకీయ వ్యవహారాలలో భాగస్వాములు కావాలనుకున్నారు.

క్రీ.శ. 20 వ శతాబ్దపు మొదటి, రెండు దశాబ్దాలలో స్త్రీలుతమ విద్యాభివృద్ధితో పాటు ఉద్యోగం చేయాలనుకొంటూ ఆర్థికస్వావలంబనదిశగా ఆలోచనలను పెంచుకొన్నారనీ, రాజకీయాలలో తమప్రవేశానికై వారికి ప్రత్యేకనియోజక స్వాతంత్ర్యం ఉండాలని భావించి, స్త్రీలలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యపు చైతన్యాన్ని కలిగించే విధంగా స్త్రీలు రచనలు చేసారని నాటి సాహిత్య ప్రతిఫలనం స్పష్టం జేసింది. ఆ నాటి స్త్రీసమాజాలు, స్త్రీలసాహిత్యం కలిగించిన చైతన్యంతో, 20వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి బలమైన పునాదులు వేసుకొని, రెండవ దశకంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాల యొక్క చైతన్యాన్ని తెచ్చుకొని స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్య సాధనా సోపానాలను స్త్రీలు అంచలంచెలుగా అధిరోహించటం స్పష్టమవుతుంది. స్త్రీలలో పెరుగుతున్న వ్యక్తిస్వాతంత్ర్యపు ఆలోచనలు, జాతీయాభిమానం దేశస్వాతంత్ర్యపు ఆలోచనలు పెరిగాయి. అందుకే తర్వాతి కాలంలో స్త్రీలు గాంధీపిలుపుకు స్పందించి సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనగలిగారు. కాబట్టి స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్య సాధనా క్రమంలోనే స్త్రీలయొక్క దేశ స్వాతంత్ర్యోద్యమ భాగస్వామ్యాన్ని అవగాహన చేసుకొనే దిశగా అడుగులు వేయాలి.

# 4. సాహిత్యం (1920-1929) - సత్యాగ్రహోద్యమం - సహాయ నిరాకరణ - స్త్రీలఆర్థికస్వావలంబన - దేశస్వరాజ్యోద్యమ చైతన్యం

ఈ దశాబ్దంలో స్వాతంత్ర్యోద్యమం ఖచ్చితమైన ప్రణాళికలతో ముమ్మరమైంది. 1917 లో దక్షిణాఫ్రికాలో నల్లజాతీయుల విముక్తికై పాటుపడిన గాంధీ తన బారిష్టరువృత్తిని వదిలి భారతమాత సంకెళ్లను వదలించటానికి పూనుకొని నాటి గోపాలకృష్ణ గోఖలే వంటి వారిని కలిసి సత్యాగ్రహ ఉద్యమం చేపట్టాలని ఒప్పింప చేయటం జరిగింది. హోమ్ రూల్ ఉద్యమాన్ని అణచటానికి 1918లో ఎవరినైనా అకారణంగా అరెస్ట్ చేసే హక్కు నిచ్చే కొత్త రౌలత్ చట్టం వచ్చింది. భారతీయులు దాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన ఫలితంగా మాంటేగు-ఛేమ్స్ ఫర్డ్ సంస్కరణలు వచ్చాయి.

మాంటేగు-ఛేమ్స్ ఫర్డ్ సంస్కరణల ఫలితంగా 1919 చట్టం వచ్చింది. హోమ్ రూల్ ఉద్యమాన్ని నడిపిన అతివాదులందరూ విడుదలయ్యారు. ఒకప్రక్క ముస్లింలకు నియోజక స్వాతంత్ర్యం లభించటం, మరొక ప్రక్క బ్రిటిష్ వారు జయించిన టర్కీలోని మతగురువైన ఖలీఫ్ శిష్యులుగా భారతదేశంలోని ఉన్న ముస్లింలు ఖిలాఫత్ ఉద్యమాన్ని మొదలుపెట్టి మునుపు భారతదేశం ముస్లింల పరిపాలనలో ఉంది కాబట్టి తాము వారసులుగా భారతదేశ పాలనాపగ్గాలు వహించాలనుకున్నారు. మింటో-మార్లే సంస్కరణలతో ప్రాముఖ్యత వహించిన ముస్లింలకు హిందువులతో సఖ్యత లేకుండా పోయేసరికి దాన్ని గమనించిన గాంధి తనకు అంతకు పూర్వము నుండి మిత్రులైన ముస్లింలను అనునయించి హిందూముస్లింల ఐక్యతతో మాత్రమే స్వాతంత్ర్యం సాధించవచ్చని ఒప్పించాడు. మరొకప్రక్క విప్లవకర జాతీయవాదులను కలుసుకొని దౌర్జన్యంతో కాక అహింసాతత్వంతో, అసహాయోద్యమంతో స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చని చెప్పాడు. అందరిని కలుపుకొని 1920 లో జాతీయోద్యమానికి గాంధి నాయకత్వాన్ని వహించాడు.

హిందువులు, ముస్లింలు, ఖిలాఫత్ ఉద్యమకారులవంటి అఖిలభారతసంస్థల సహకారంతో గాంధి 1921-22 నుండి సహాయ నిరాకరణోద్యమంద్వారా స్వాతంత్ర్యోద్యమాన్ని సాగించాడు.

ఇంతకు మునుపే తిలక్ సారథ్యంలోనే విదేశీవస్తువుల బహిష్కరణ, ప్రభుత్వవిద్యాలయాల బహిష్కరణ, న్యాయస్థానాల బహిష్కరణ, ప్రభుత్వోద్యోగాల రాజీనామా, సైన్యంలోని సిపాయిల తిరుగుబాటు, పన్నుల ఎగవేత, స్వదేశీ, జాతీయ విద్య, పంచాయితీ కోర్టులవంటి ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించగా, వాటికి అదనంగా 1920 నాటికి గాంధీ శాసన బహిష్కారాన్ని చేర్చాడు. కాని ప్రభుత్వం శాసనసభల ఎన్నికలను ప్రకటించింది. గాంధికి ఎన్నికల బహిష్కరణ చేయాలని లాలాలజపతిరాయ్ సూచించగా దానికి గాంధి ఆమోదం కూడా ఉండటంతో ఎన్నికల బహిష్కరణలో సహాయనిరాకరణోద్యమం ఊపందుకుంది. ఇదే సమయంలో తిలక్ మరణించాడు. మోతీలాల్ నెహ్రూ సూచనప్రకారం స్వరాజ్యసంపాదనకై విదేశీ వస్తుబహిష్కరణను చేయాలని భావించి దీనిలో భాగంగానే ప్రభుత్వోద్యోగాలు, బిరుదులు, సన్మానాలను త్యజించటం, లాయర్లు బ్రిటిష్ న్యాయస్థానాలను బహిష్కరించి వాటిస్థానంలో పంచాయితీ కోర్టులను స్థాపించటం, ఎన్నికలలో అభ్యర్థులు నిలబడకుండా ఉండటం, ఒకవేళ నిలబడ్డా ఓటర్లు ఓటువేయకూడదని చెప్పాడు. విదేశీవస్తువుల బహిష్కరణ వంటి కార్యక్రమాలలో సత్యాగ్రహులు స్వార్థత్యాగ, స్వయం నిగ్రహంతో, అహింసతో ఉద్యమాన్ని నడపాలని తగిన శిక్షణను పొందాలని గాంధి నిర్దేశించాడు.

స్వదేశీవస్తువులనే ఉపయోగించాలనుకునే సరికి అందరికీ సరిపోయేటట్లుగా మగ్గాల మీద తయారుచేసే బట్టలను సరఫరా చేయలేక పోయేసరికి రాట్నంతో నూలు వడుకు కార్యక్రమాన్ని ప్రతియింట్లో పునరుద్ధింపబడింది. మునుపు బాలగంగాధర్ తిలక్, అరవింద పాల్, బిపిన్ చంద్రపాల్ హింసా వ్యతిరేకులు కాదు కాబట్టి వారి విప్లవోద్యమానికి సహకరించే ధైర్యం ప్రజలలో ఉండేదికాదు. కాని గాంధీ అహింసాతత్వంతో సాగించే దేశాభిమాన ఉద్యమానికి ప్రజల సహకారం అందే అవకాశం ఉంది. 1919 నాటి రాజ్యాంగానికి బదులుగా సంపూర్ణస్వాతంత్ర్యాన్ని ప్రసాదించగల సహాయ నిరాకరణోద్యమాన్ని గాంధీ ప్రారంభించగానే కలకత్తా, బొంబాయి నుండి వర్తకుల సహకారం అందటంతో అందరూ కలసి శాంతియుతంగా న్యాయసమ్మతమైన పద్ధతులతో 'స్వరాజ్యం' సంపాదించాలనే ఆశయం పెట్టుకున్నారు. సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలు, బహిష్కరణ కార్యక్రమాలు, శాసనోల్లంఘమనే మూడు విధాలుగా సహయనిరాకరణోద్యమం చేయాలని భావించారు.

సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలలో విదేశీవస్తు బహిష్కరణ మరియు విదేశీవస్త్రదహనం, రాట్నాలపై నూలువడకటం, ఖద్దరుఉత్పత్తి, ఖద్దరువసనధారణ, మద్యపాననిషేధం, అస్పృశ్యతా నివారణ, హిందూముస్లింల ఐక్యతను సాధించటం ప్రధానంగా ఉంటాయి. బహిష్కరణ కార్యక్రమాలలో శాసనసభలు న్యాయస్థానాలు, విద్యాలయాలయొక్క బహిష్కరణ, బిరుదములు త్యజించుట దీనిలో భాగాలు. మూడవదైన శాసనోల్లంఘనం కాలానుగుణంగా జరగాలని భావించారు. ఈ ఉద్యమంలో విద్యార్థులు, గృహిణులు కూడా పాల్గొనటం జరిగింది. అందుకే గాంధి స్త్రీ, పురుషుల సమానత్వాన్ని కోరుకుంటూ స్త్రీలను ముందుంచి సహాయ నిరాకరణోద్యమాన్ని

నడిపించాలనుకున్నాడు. కాని శాసనసభలకు ఎన్నికలు రావటంతో కాంగ్రెస్ లోని జాతీయ వాదులు, ముస్లింలు ఎన్నికలలో పాల్గొనగా, కాంగ్రెస్ మితవాదులు పాల్గొనలేదు. 1920 సం.లో 100 కోట్ల విదేశీవస్త్రాలు దిగుమతులుకాగా అది 1921-22 నాటికి 57 కోట్లకు తగ్గింది. ఈ విధంగా ఖద్దరుధారణ విజయవంతమై స్వదేశీఉద్యమంగా నిలిచింది. మరొకప్రక్క అక్రమ సంఘాల అల్లర్లు ఏర్పడ్డాయి. కాని చిత్తరంజన దాస్, బెంగాలులో శాసనోల్లంఘనాన్ని అనుసరించమన్నాడు. బెంగాల్ లో యువకులు, స్త్రీలు శాసనోల్లంఘనం చేయటంతో జైళ్ళు నిండిపోయాయి. బ్రిటిష్ అధికారుల దమననీతిని దేశమంతా ఖండించింది. ముస్లింలను, అస్పృశ్యులను కలుపుకున్నారు. వైస్రాయి రౌండుటేబుల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి అన్ని పక్షాలనాయకులు చర్చలు జరపాలని అన్నా గాంధిమాత్రం శాసనోల్లంఘనంచేయటానికే సిద్ధపడ్డాడు. న్యాయస్థానాలలోని ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేయమన్నాడు. దానికి బ్రిటిష్ ప్రభుత్వం గాంధికి ఆరుసంవత్సరాలు జైలుశిక్షవేసారు. బ్రిటిష్ అధికారులకు సహాయంచేసే జమీందార్లను, తహశీల్దారులను ప్రజలు ప్రతిఘటించారు. మొదటగా బయటకు వచ్చిన వల్లభాయ్ పటేల్, రాజగోపాలచారి, ప్రకాశంపంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, చిత్తరంజన్ దాస్, రాజేంద్రప్రసాద్, మోతీలాల్ నెహ్రూ వంటి ఉపనాయకులతో గాంధీ సహాయనిరాకరణోద్యమాన్ని సాగించాడు.

పన్నులను అధికంగా వసూలు చేయాలనే ఆలోచనతో బ్రిటిష్ ప్రభుత్వం గుంటూరు జిల్లాలలోని చీరాల-పేరాల గ్రామాలను కలిపి మునిసిపాలిటిగా చేద్దామనుకుంటే వారి ప్రయత్నాన్ని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రతిఘటించారు. గ్రామాలను ఖాళీచేసి ఊరివారంతా దగ్గరలో ఉన్న పోరంబోకు స్థలాలలో గుడిసెలు వేసుకొని ప్రత్యమ్నాయ ప్రభుత్వంలాగా పరాయి ప్రభుత్వంతో పోరాడారు. గోపాలకృష్ణ నిర్బంధితుడు కాగానే, అధికారులు భేదాలను సృష్టించి, జరిమానాలను విధించటంతో పది నెలల తర్వాత ప్రజలు తిరిగి తమ స్వగ్రామాలు చేరటంతో మున్సిపాలిటీని ఒప్పుకోక తప్పలేదు. పల్నాడు తాలుకాలలో అటవీశాఖవారు విధించే పశువులు మేత మీద 'పుల్లరి' అనే పన్నువేయటాన్ని ప్రజలు ప్రతిఘటించారు. పోలీసులు చేసిన కాల్పులలో కన్నెగంటి హనుమంతును కోల్పోయినా ప్రజలు తమ సమరం కొనసాగించాలనుకొన్నారు. కానీ తుదకు విరమించుకొని, అహింసతో ఉద్యమం సాగించాలనుకోవటంతో తిరుగుబాటును ఉపసంహరించు కున్నారు. పెదనందిపాడులోని గ్రామాలలోని ప్రజలు శిస్తుల నిరాకరణోద్యమం చేసే దిశగా పర్వతనేని వీరయ్యచౌదరి, కొండ వెంకటప్పయ్య నాయకత్వంలో ఉద్యమం సాగించినపుడు పోలీసుల, సైనికుల దౌర్జన్యానికి లొంగకపోగా గ్రామాధికారులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసారు.

అస్సాంలో తేయాకు తోటల యజమానులపట్ల అధికారుల పక్షపాతంతో రక్షణలేకుండా కార్మికులు ఇబ్బందులు పడుతున్నప్పుడు సహాయ నిరాకరణోద్యమం ద్వారా యజమానులకు నష్టం కల్గించేవిధంగా కార్మికులు ఉద్యమం చేయాలనుకున్నారు. బీహారు రాష్ట్రంలో రైతులు అడవుల విషయంలో జమీందార్లు విధించిన నిర్బంధాలను తొలగించుకోవటానికి మోతీలాల్

నెహ్రూ, జవహర్‌లాల్‌నెహ్రూల నాయకత్వంలో 'కిసాన్' ఉద్యమాన్ని లేవదీసి శిస్తులను చెల్లించకపోయేసరికి జమీందార్లు కష్టాలకు గురిఅయ్యారు. పంజాబు రాష్ట్రంలో సిక్కులు గురుద్వారాలలో అవినీతికి పాల్పడే మహంతులకు వ్యతిరేకంగా అతివాదులైన అకాలీల సారథ్యంలో సత్యాగ్రహాన్ని సాగించారు. కల్లుదుకాణాలు, విదేశీవస్త్రాలను విక్రయించే చోట ఉద్యమకారులు పికటింగ్ చేసారు. బొంబాయి రాష్ట్రాలలోని మాలెగావ్ గ్రామంలో ఖిలాఫత్ ఉద్యమ ప్రభావితులైన ముస్లిం అధికారులు జారీచేసిన నిషేధబిల్లును ఉల్లంఘించగా పోలీసుల దమనచర్య సాగింది,

మలబారు జిల్లాలో మాప్లాలనే ముస్లింలు బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి యురోపియన్ అధికారులను హత్యచేసి ఖిలాఫత్ రాజ్యం స్థాపించటంతో హిందువుల కోపానికి కారణమయ్యారు. అయితే సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్న ప్రజలలో రాజకీయ చైతన్యపు ఉధృతివల్ల, పోలీసులు, సైనికులు, జైళ్ళు, అరెస్టుల వంటి వాటియొక్క భయాలు వారిలో లేకుండాపోయాయి.

1923 లో ఉప్పుపన్నును ప్రభుత్వం రెండురెట్లు పెంచింది. కాంగ్రెసులోని మితవాదులు శాసన సభలలో ప్రవేశించాలనుకొని నెహ్రూ, కేల్కారు స్వరాజ్యపార్టీని నిర్మాణం చేసారు. గాంధి జైలు నుండి విడుదల అయి 'స్వరాజ్యాన్ని' సంపాదించే ప్రయత్నంలో కాంగ్రెస్ నియమావళికి అవసరమైతే విరుద్ధంగా ప్రవర్తించవచ్చని చెప్పాడు. బెంగాల్ లో గోపీనాథ్ సాహు అనే యువకుడు యురోపియన్ ను హత్యచేసినందుకు అది అహింసాతత్వానికి వ్యతిరేకమని గాంధీ భావించాడు. 1925 లో గాంధీ కాంగ్రెస్‌కు, స్వరాజ్య పార్టీకి అనుబంధం కుదిరి అఖిలభారత చర్ఖా సంస్థ కాంగ్రెస్ అనుబంధ సంస్థగా పనిచేసింది.

1925లో స్వరాజ్య పక్షనాయకులుగా మోతీలాల్ నెహ్రూ సంపూర్ణ బాధ్యతాయుత ప్రభుత్వాన్ని దేశంలో ప్రవేశపెట్టటానికై 1919 చట్టాన్ని సవరించాలని, ప్రజలందరి ప్రాతినిధ్యంతో రౌండు టేబుల్ సమావేశాలు జరపాలనీ, దేశంలో అల్పసంఖ్యాక వర్గాల రక్షణకై నియమాలను ఏర్పరచాలనీ, కొత్తగా ఎన్నుకునే భారతశాసనసభ రాజ్యాంగాన్ని రూపొందించి బ్రిటిష్ పార్లమెంటు వారి ఆమోదాన్ని పొందే విధంగాను, భారతదేశ ఐ.సి.యస్. అధికార్ల నియామకాలు బ్రిటన్ లోని ఇండియా మంత్రికి ఉండరాదని భావించారు.

1927లో కాంగ్రెస్ సమావేశానికై డొమినీయన్ ప్రతిపత్తియా లేదా సంపూర్ణ స్వాతంత్ర్యమా? అనే లక్ష్యంగా ఉద్యమం సాగాలని పర్యాలోచన చేసారు. ఆ సమయంలో వచ్చిన సైమన్ కమీషన్ ను 'గోబాక్' అనే నినాదంతో ప్రకాశంపంతులువంటి వారు గుండ్లకు గుండెలనెదురొడ్డి నిలిచారు. బ్రిటిష్ వారిపై ఒత్తిడిని పెంచి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలని కాంగ్రెస్ లో జాతీయవాదులు భావించారు. అయితే మోతీలాల్ నిర్ణయంతో డొమినీయన్ ప్రతిపత్తిని కోరటంతోపాటు, 'సమాఖ్య' విధానం ఉండాలనీ, కేంద్ర, రాష్ట్ర శాసనసభలలో మంత్రివర్గానికి బాధ్యతవహించే శాసనమండలి ఉండాలని తీర్మానించారు. దామాషాప్రకారం ప్రత్యేక ప్రాతినిధ్య

నియోజకాలుండాలని భావించారు. రాజ్యాంగాన్ని ఏర్పరచుకొని పాలించే డొమినీయన్ ప్రతిపత్తిని బ్రిటిష్ ప్రభుత్వం ఒప్పుకోకపోతే తిరిగి సంపూర్ణ స్వాతంత్రోద్యమం సాగించాలనుకున్నారు. 'స్వరాజ్య' మనే మాట స్థానంలో 'సంపూర్ణస్వాతంత్ర్యం' అనే పదాన్ని ఇమిడ్చి దాన్నిసాధించటానికి అన్నిప్రాంతాలలో శాసనోల్లంఘనం చేయాలనుకున్నారు. బ్రిటిష్ వారికి కట్టిన పన్నులను వారు తిరిగి భారతీయులకు వాడకుండా ఇండియా మంత్రి జీతాలకు, సైన్యానికి ఖర్చు పెట్టటానికై రైతులమీద 20 శాతం పన్నును, ఉప్పు మీద 3 శాతం పన్నును కట్టాలనే సరికి అది పేదలకు కష్టమవటంతో స్వాతంత్ర్యం అనేది ప్రతిజాతికి జన్మహక్కుఅని ప్రజలకు నమ్మకం కలిగి ప్రజలందరూ శాసనోల్లంఘనానికి పూనుకోవాలనుకున్నారు.

సహాయనిరాకణోద్యమంలో అవసరమైనది ఐకమత్యము. ముందుగా స్త్రీలు తమమధ్య ఐకమత్యము పెరిగి వ్యక్తిస్వాతంత్ర్యన్ని సాధించుకొంటూ స్వావలంబనకై తగినవిధంగా వనరులను వాతావరణాన్ని ఏర్పరచుకొంటూ దేశస్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలని భావించారు. దానికై స్త్రీలు ధైర్యస్థైర్యాలతో ఉద్యమానికి సంసిద్ధులు కావటానికినీ, వారిని తోటిఉద్యమకారులు గౌరవంగా చూడగలగాలనీ, విద్యావంతులు తమ కుహనాతత్వాన్ని విడిచిపెట్టి స్వదేశీసేవలో భాగస్వాములు కావటానికి స్త్రీలు స్వదేశీవ్యాపార విద్యలను నేర్చుకొనేందుకును, తగిన సాహిత్యచైతన్యాన్ని కలిగించే విధంగా రచనలు చేసారు. ఆ తరువాత సత్యాగ్రహ ఉద్యమచైతన్యం స్త్రీలలో కలిగేలా సాహిత్యసృజన చేసారు. ఖద్దరుతయారీ, హిందూ మహమ్మదీయ సఖ్యత, హరిజనోద్ధరణ వంటి ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలను స్త్రీలు చేపట్టే విధంగా ప్రోత్సహిస్తూ సాహిత్యాన్ని వ్రాసారు.

గాంధి సత్యాగ్రహ ఉద్యమంలో స్త్రీలు ముందుండాలనీ, అరెస్టులకు గురియైనా బెదరని త్యాగాలు చెయ్యాలనీ, అప్పుడే ఉద్యమం శీఘ్రంగా ఫలితాలనిస్తుందనీ పిలుపునిచ్చాడు. ప్రభుత్వ వ్యతిరేకంగా ధారాళంగా ఉపన్యాసాలిస్తూ సత్యాగ్రహోద్యమంలో పాల్గొనటంతో అరెస్టు చేయబడిన గారిలో దువ్వూరి సుబ్బమ్మ మొదటి ఆంధ్రమహిళగానూ రెండవ భారతదేశ మహిళగానూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చోటుచేసుకున్నది. అయితే ఈసందర్భంలో చీరాల–పేరాల ఉద్యమ సమయంలో అరెస్టు కాబడిన రావూరి అలమేలుమంగతాయారును స్మరించుకొవాలి.

స్త్రీలందరూ సత్యాగ్రహ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఖద్ధరుధారణ, నూలు వడకటం, రాట్నంతిప్పటం, స్వదేశీదీక్ష, విదేశీవస్తు బహిష్కరణలను చేసి భారతదేశ దారిద్ర్యాన్ని వదిలించాలనుకున్నారు. హరిజనోద్ధరణకై పూనుకున్నారు. స్త్రీలు అంచలంచెలుగా దేశరాజకీయాలలో ప్రవేశించాలనుకోవటానికి వీలుగా ఓటుహక్కును పొందాలనుకోవటం, ప్రత్యేక నియోజకవర్గాలలో ఎంపిక కాబడాలనుకోవటమేకాక శాసనసభలలో సభ్యత్వం కోసం తగిన చైతన్యాన్ని తెచ్చుకొన్నారు. తాము ప్రజలచేత ఎన్నుకోబడితేనే శాసనసభలలో స్త్రీల సమస్యల పరిష్కార దిశగా చట్టాలను తయారు చేయించగలుగుతామనే స్పృహ ఏర్పడటం జరిగింది. ఆ

స్పృహతో సృజనకారులైన నాటి స్త్రీలు, సామాజిక స్త్రీల ఆలోచనల పరిణామాన్ని ప్రతిబింబించే విధంగా అనంతసాహిత్యాన్ని సృష్టించారు. స్త్రీలు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని పొందటమే స్త్రీల స్వతంత్రత అని భావించారు. భారతదేశంలోని రాజకీయ పరిణామాలకు అనుగుణంగా స్త్రీలు చైతన్యవంతులై అటు స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి ఇటు దేశస్వాతంత్ర్యానికి తగినచైతన్యాన్ని స్త్రీలలో కలిగించటమే స్త్రీల సాహిత్య ప్రధాన ఆశయంగా అర్థమవుతుంది.

## వ్యాసాలు

1920 నుండి 1929 వరకు స్త్రీలసాహిత్యంలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు, సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా చేసిన సహాయనిరాకరణలో స్త్రీల భాగస్వామ్య చైతన్యాన్ని కలిగించేందుకు దాదాపుగా స్త్రీలు వ్రాసిన 41 వ్యాసాలు, 9 ప్రచురిత ఉపన్యాసాలు, 15 కథలు, 4 నాటకాలు, 12 కవితలు, 1 కీర్తన, 2 లేఖలు, 2 నవలలు వచ్చాయి.

20 శతాబ్దపు మూడవ దశకంలో వచ్చిన మొత్తం50 వ్యాసాలలో దేశాభ్యుదయానికి స్త్రీవిద్యావశ్యకత, స్త్రీల స్వతంత్ర జీవనావశ్యకత, రాజకీయ వ్యవహారాలలో స్త్రీల భాగస్వామ్యం వంటి విషయాలు చోటుచేసుకొన్నాయి.

చదలపాటి వరలక్ష్మి యొక్క 'ఐకమత్యము' అనే ఉపన్యాసంలో (ఫిబ్రవరి 1920 అనసూయ పత్రిక) స్త్రీలు విద్యావంతులైతే జ్ఞానవంతులై లోకమాతకు తోడ్పడి ఆమెను కాపాడుకుంటారని తెలియజేసింది. స్త్రీలు ఐకమత్యాన్ని సాధించటమే దేశాభిమానాన్ని పెంచటంగా అర్థం అవుతుంది.

'హిందూస్త్రీలు గృహమునందు నేర్చుకోదగిన సకాయకష్టకర్మలు' (మార్చి, ఏప్రిల్, మే 1920 విద్యాభివర్ధిని పత్రిక)ను గురించి నెమలి కనకమ్మ చెప్పిన ఉపన్యాసంలో విద్య స్త్రీ, పురుషులిద్దరికీ ఆవశ్యకమనీ, స్త్రీలు వృత్తివిద్యలను నేర్చుకొంటే కుటుంబఆదాయానికి జీవనోపాయమేకాక, భార్యాభర్తలమధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయని చెప్పింది. దేశంయొక్క నాగరికత,ధనార్జన శక్తి, అధికారబలంకూడా చేకూరుతుందనీ, అదే దేశానికి స్వాతంత్ర్యాన్ని కలిగిస్తుందనీ, స్త్రీలకు స్వతంత్రజీవనాన్ని యిస్తుంది కాబట్టి స్త్రీలు గృహంలోనే సకాయకష్ట విద్యలు అంటే వృత్తి విద్యలను నేర్చుకోవాలని తెలిపింది. అప్పుడే పదార్థవినియోగం అభివృద్ధి చెందుతుందనీ, బాలికలకు పాఠశాలలో వృత్తివిద్యలను నేర్పించాలనీ, వృత్తివిద్యలను అభ్యసించిన స్త్రీలు ఉపాధ్యాయులుగా స్త్రీలను ఒక యింటిదగ్గర జేర్చి, వారికి కుట్టుపని, నేతపని, లోహాలతోను, కర్రలతోను కలంకారీవస్తు తయారీనీ, పెరటితోటల పెంపకాన్ని నేర్పించి, వాటి ఉత్పత్తుల కొనుగోలుకై వస్తుప్రదర్శన శాలలను ఏర్పాటుచేయాలని తెలియజేసింది.

*స్త్రీల ఆర్థికస్వావలంబనకు ఉపయోగపడే వృత్తివిద్యలను నేర్చుకోవాలని స్త్రీలకు దిశానిర్దేశం చేసింది.*

దేశరాజు లక్ష్మీబాయమ్మ వ్రాసిన 'దేశాభివృద్ధి కరణమార్గము' (ఏప్రిల్, మే, జూన్ అనసూయ 1920) అనే వ్యాసంలో బ్రహ్మచర్యము, యోగము, అగ్నిహోత్రం, వంటి వాటివలన ప్రజలు పుడుతూ, దేశాభివృద్ధికర విషయాలను ఆచరణలోకి తేవాలని కోరుకోవటం కన్పడింది.

ఆలమూరి వీరలక్ష్మమ్మ వ్రాసిన "స్త్రీల స్థితినభివృద్ధి చేయు మార్గములు" (జూన్ 1920 వివేకవతి) అనే వ్యాసంలో దేశంలోని జనంలో సగభాగం కంటె ఎక్కువమంది స్త్రీలున్నారనీ, వీరు కష్టసాధ్యమైన గృహకృత్యములే కాక, చాలమంది కూలినాలి చేసుకొని మగవారివలె ద్రవ్యోపార్జన చేస్తూన్నారని తెలిపింది. స్త్రీల స్థితి బాగుంటే దేశస్థితి బాగుంటుందనీ, అన్ని కార్యాలలో పురుషులకు స్త్రీలతోడ్పాటు ఉండాలంటే స్త్రీలకు విద్య అవసరమనీ, దానివల్ల గుణసంపాదనమే కాక ధర్మాధర్మ విచక్షణచేసే శక్తి ఉంటుందని భావించింది. వివిధ దేశాలలోని ఆచారాలను పరిశోధించి తమ జీవితాలలోని లోపాలు తెలుసుకోవాలనీ, అవసరమైతే యాత్ర పేరుతో విదేశీయానం చెయ్యాలని, సభలలోని బోధనలను స్త్రీలు ఆచరణలో పెట్టినప్పుడే దేశం బాగుపడుతుందని తెలియజేసింది.

'బాల్యవివాహాలు'(జులై 1920 వివేకవతి) అనే పత్రికా సంపాదకురాలి వ్యాసంలో హిందువులలో బాల్యవివాహాల ఆచారం బ్రాహ్మణ, వైశ్యకులాల నుండి మిగిలిన కులాలకు కూడా పాకిందనీ, నిర్బంధ వైధవ్యాన్ని అనుసరిస్తున్నారని తెలిపింది. వధూవరులు వయసువచ్చిన తరువాత వరించుకొని పెళ్ళిళ్ళు చేసుకోవాలనీ, స్త్రీలు పురుషులను ఎన్నుకునేటప్పుడు వారి ప్రయోజకత్వాన్ని, ధైర్యస్థైర్యాలను చూసి వివాహం చేసుకోవాలని తెలియజేసింది.

వింజమూరి వేంకటరత్నమ్మ 'హిందూ బాలికల యాటలలోని తత్వము' (ఆగష్టు 1920 వివేకవతి) ను గురించి వ్రాస్తూ పూర్వకాలంలో స్త్రీలు విద్యావంతులుగా ఉండేవారనీ, మధ్యయుగాలలో ఇతర దేశస్థులు హిందూ దేశాన్ని పరిపాలించటంలో సమాజంలో ఏర్పడిన అరాచకత్వం స్త్రీవిద్యానష్టాన్ని కలిగించిందని తెలిపింది. స్త్రీలు నోములునోస్తూ పాటలు పాడుకుంటున్నారు గానీ వాటి అర్థాన్ని బోధపరచుకోవటంలేదనీ పాటల్లోనే ఎన్నో వైజ్ఞానిక విషయాలుంటాయని చెప్పింది. ఉదాహరణగా వెండిగిన్నెకు కొండ ఎక్కి చేయి బెణికినప్పుడు దానికి వైద్యంగా వేపాకు చేదు, వెల్లులి గడ్డ, నూనెబొట్లను నూటొక్క ధారలుగా పోస్తే ఆ ఎముకల బెణుకు తగ్గుతుందని చెప్పిన పాటలున్నాయనీ, అలాగే స్త్రీలు విద్యావంతులైతే ఇంట్లోనే వైద్యం చేయగల స్థితిలో ఉంటారనీ తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'స్త్రీ సంతానము లేక పురుష సంతానము కోరదగినది' (జులై 1924 అనసూయ పత్రిక) అనే వ్యాసంలో స్త్రీవిద్యా విషయంలో స్త్రీసంతానంయెడ తల్లిదండ్రుల ఉపేక్షయే కారణమనీ, స్త్రీలను చదివిస్తే దేశసేవ చేయగలరనీ, అదే దేశక్షేమమనీ, స్త్రీలలో కూడా స్వాతంత్ర్యాభిలాష ఉంటుందని వింజమూరి వెంకటరత్నమ్మ తెలియజేసింది.

*ఆడపిల్లల పెంపకంలో తల్లిదండ్రులు వారిని మగ పిల్లలవలె చూడాల్సిన అవసరాన్ని తెలియజేసింది. లింగసమానత్వం దేశస్వాతంత్ర్యసాధనా సోపానమని తెలియజేసింది. స్త్రీల స్వాతంత్ర్యాభిలాషకు, దేశస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధం అర్థమవుతుంది. 'లింగవివక్షా' స్వభావాన్ని పాఠకులు ఆలోచించేటట్లుగా రచన చేసింది.*

కృ.వేం.లక్ష్మమ్మ వ్రాసిన 'స్వయంవర వివాహములు' (ఏప్రిల్ 1921 – ఆంధ్రపత్రిక వార్షిక సంచిక) అనే వ్యాసంలో స్త్రీలు ఉన్నతవిద్య, ఐకమత్యం, స్వయంవర వివాహాలు ఉండాలనే స్వతంత్రేచ్ఛను కలిగిఉండాలనీ, స్వదేశీ వ్యాపారం పెంచుకునే నూతన విద్యలను స్త్రీలు నేర్చుకోవాలని చెప్పింది. స్త్రీలలో స్వతంత్రేచ్ఛ పెరగాల్సిన అవసరాన్ని, వ్యాపారవిద్యలను స్త్రీలు తెలుసుకోవాలని భావించింది.

*స్త్రీలు సమాజంలోకి వచ్చి ఐకమత్యంతో వైవాహిక స్వాతంత్ర్యపు హక్కు కలిగి, వ్యాపారం చేయటానికి తగిన స్వేచ్ఛాభావాలు వారిలో ఉండాల్సిన అవసరాన్ని గుర్తించింది.*

మాడభూషి చూడమ్మ సత్యవర్ధనీ సమాజమున చేసిన 'ఉపన్యాసం' (డిసెంబరు 1921 హిందూసుందరి)లో స్త్రీవిద్య దేశాభ్యుదయ సాధనమనీ, విద్యావతిగా వేళాంబి అలివేలమ్మగారు చెప్పిన విషయంగా స్త్రీసంఘాల కొరకు గృహములను, గ్రంథాలయములను ఏర్పరచటానికి కృషిచేస్తున్నామని తెలిపింది. ముందుగా స్త్రీ విద్యాభివృద్ధితో, స్త్రీలకు తగిన స్వాతంత్ర్యం తేవటానికి, స్త్రీలు తెలివిగా ప్రవర్తించి గృహకృత్య నిర్వహణము చేయటానికి తగిన విద్యను నేర్పించటానికి, వితంతు స్త్రీలు దేశాభ్యుదయానికి తోడ్పడే పనులు చేయటానికి సంఘాలు పూనుకోవాలని పిలుపునిచ్చింది. తురక ప్రభుత్వంలో స్త్రీ విద్యాసంస్కారం నశించిందనీ, వేదకాలంలో విద్యావంతులైన స్త్రీలు వివాహంచేసుకొన్న యువతులుగా సోదరులతో భాగంపంచుకొని బోధకురాండ్రుగా ఉండేవారనీ యుద్ధవిద్యలు, వృత్తి వ్యాపారపు మెలకువలు నేర్చుకొనుట సంఘవిషయంగా ఉండేదని చెప్పింది. సంఘవిషయాలైన స్త్రీల ఆరోగ్యవిషయంలోనూ స్త్రీలను గౌరవించటంలోనూ మార్పులకై కట్టుబాట్లను చేసిందనీ, కాని తరువాత వచ్చిన ప్రభుత్వాలు అంతరాలను ఏర్పరచి విద్యా విహీనతను కల్గించాయనీ, శాస్త్రవిరుద్ధం అంటూ స్త్రీవిద్యా నాశనాన్ని కోరుతున్న వారిని ఖండించాలని చెప్పింది. నేడు స్త్రీ విద్యాభివృద్ధికి స్త్రీసమాజాలు ఏర్పడ్డాయనీ, స్త్రీవిద్యా ఉద్యమాన్ని చేస్తున్నారనీ, ప్రస్తుతమునకు తగినమార్పులు చేసుకుంటూ బాల్యవివాహాలను, మూఢాచారాలను పోగొట్టుకోవాలని స్త్రీసమాజాలు ప్రచారాలు చేస్తున్నాయని తెలియజేసింది.

కాకినాడలో జరిగిన 'అఖిల భారత మహిళా మహాసభ'లో పులుగుర్త లక్ష్మీనరసమాంబ చేసిన ఉపన్యాసంలో (ఆంధ్రపత్రిక సౌజన్యంతో 'ఆంధ్రసర్వస్వము' అనే పత్రికాప్రచురణ, జనవరి 1924) స్త్రీలు అబలలు కారనీ, స్త్రీలు రాజకీయ వ్యవహారములో పాల్గొనాలనీ, దానికి అవసరమైన విద్యాజ్ఞానాన్ని సంపాదించాలనీ, స్వాతంత్ర్యోద్యమంలో పురుషులతోపాటు స్త్రీలుకూడా పాల్గొనాలని పిలుపునిచ్చింది. మన పూర్వీకులైన విద్యావంతులైన స్త్రీలవలె నేటిస్త్రీలు విద్యాధ్యయనం చేయాలనీ,

ముందుగా జాతీయవిద్యను అభ్యసించాలనీ, దానివల్ల మాత్రమే రాజకీయపరిజ్ఞానం ఏర్పడుతుందని చెప్పింది. జాతీయ వస్త్రధారణలలో భాగంగా రాట్నంతిప్పి నూలువడికి, ఖద్దరువస్త్రాలను తయారుచేయాలనీ, విదేశీవస్త్రాల కొనుగోళ్ళవల్ల మనడబ్బు విదేశాలకు వెడుతోందనీ, దాన్ని అడ్డుకోవటానికిగాని దారిద్ర్యాన్ని తగ్గించుకోవటానికిగాని ఖద్దరు వస్త్రధారణ ముఖ్యమని తెలిపింది. పూర్వము నిమ్నజాతులవారి కళలు గొప్పవిగా ఉండేవని, మరికొన్ని అంతరించాయనీ, ఆత్మజ్ఞానంతో నిమ్నజాతులు స్పృశ్యులే అని భావించాలని చెప్పటం జరిగింది.

*గాంధి తలపెట్టిన సత్యాగ్రహోద్యమములో ఖద్దరు వస్త్రధారణ, హరిజనోద్ధరణ సహాయ నిరాకరణలు ప్రధానాంశాలనీ, వాటిని అఖిలభారత మహిళా సభలో చెప్పి స్త్రీలందరినీ చైతన్య వంతులు చేయటానికి ఆ నాటి ఈ ప్రసంగమెంతో దోహదం చేసి ఉంటుందనేది నిశ్చయంగా భావించవచ్చు. అంతేగాక స్త్రీలు రాజకీయవ్యవహారంలో పాల్గొనాలనీ, దానికి జాతీయ విద్య అవసరమనీ, అప్పుడే స్వదేశంకోసం స్వతంత్ర కాంక్షతో స్త్రీలు పనిచేయగలుగుతారనీ భావించింది.*

*1924 నాటికే ఆంధ్రప్రాంతంలో స్త్రీలు జాతీయస్థాయిలో సభలను ఏర్పాటుచేసుకొని ఉపన్యసించగల స్థాయికి చేరుకోవటం ప్రశంసించతగ్గ విషయం.*

'స్త్రీధర్మము' (స్త్రీధర్మపత్రిక, ఏప్రిల్ 1924) ను గురించి పత్రికాసంపాదకురాలు వ్రాస్తూ పూర్వ యుగాలలోను, కలియుగంలోను పురాణేతిహాసాలలో స్త్రీలు విద్యావంతులుగా చెప్పబడ్డారనీ, ఆనాడు అనిబిసెంటు స్త్రీ న్యాయవాదిగా గుర్తింపబడ్డారని తెలిపింది. పురుషులు తమకు అవమానం కలుగుతుందనే భయంతోనే తమబలంతో స్త్రీవిద్యను, స్త్రీస్వతంత్రతను అణచిపెడుతున్నారనీ, స్త్రీలుపురుషులు సమానులేనని పత్రిక తెలియజేసింది.

'మద్రాసు కార్పరేషన్ వారి తీర్మానాలను' (స్త్రీధర్మపత్రిక, ఏప్రిల్ 1924) పత్రికా సంపాదకురాలు ప్రచురిస్తూ ఏడేళ్ళ వయసులోపల ఉన్న బాలబాలికలకు నిర్బంధవిద్య ఉండాలనీ, స్త్రీలు శిశుపోషణ చేసేవారు, గ్రామారోగ్యాన్ని కాపాడేవారు స్త్రీలే కాబట్టి మహిళా ఉద్యమఫలితంగా మద్రాసు పౌరసభ బాలికలకు నిర్బంధవిద్యను చట్టంగా చేసిందని తెలిపింది. శాసనసభలకు ఎన్నికకాబడే అధికారం స్త్రీలకు ఉండాలనీ, స్త్రీపురుషులకు సమాన పౌరసత్వం ఉండాలనీ, స్త్రీపురుషులకు సమానమైన సాంఘిక, రాజకీయ, నైతికసమానత్వ సాధనకై 'సర్వదేశీయశాంతి' అనే స్వాతంత్ర సమితి ఏర్పాటయినదని పేర్కొంది. కెన్యాలో సరోజినీదేవి భారతీయులకు బ్రిటిష్ వారు చేస్తున్న అన్యాయాలను గురించి ఉపన్యసించి ప్రపంచానికి తెలియజేసిందనీ, స్త్రీలకు స్వీయఆలోచనాశక్తిని పెంచగల జ్ఞానాన్ని అందించే విద్యను నేర్పించాలని తెలియజేసింది.

*బాలికల నిర్బంధవిద్యాశాసనం, శాసనసభలకు ఎన్నికకాబడిన అధికారం స్త్రీలకు ఉండాలని భావించారు.*

ప్రయాగ గంగాభవానమ్మ వ్రాసిన 'స్త్రీల విద్యాపరిస్థితులు' (మే 1924 అనసూయ పత్రిక) అనే వ్యాసంలో ప్రాచీనకాలం నుండి విద్యావంతులున్నట్లు వేదాలు, పురాణాలు తెలియజేస్తున్నా యనీ, కాలక్రమాన పరరాజుల వత్తిడిచే భారతదేశ పరిస్థితులు మారి స్త్రీవిద్య వెనకబడిందనీ,

స్త్రీవిద్యావ్యాప్తి ఆంగ్లేయ పద్ధతిలో వ్యాప్తి చెందుతోందనీ, అది ఉద్యోగానికి పనికివస్తుందిగానీ, ఆత్మజ్ఞానానికి అంతగా ఉపయోగపడటం లేదని తెలిపింది. విదేశీ స్త్రీలు పురుషులతో సమానంగా ఉద్యోగం చేస్తూ రాజసభలలో హోరాహోరీ పోరాడుతున్నారనీ, కాని మనదేశంలో స్వేచ్ఛ అనేది లేదనీ, హైందవస్త్రీలలో విడాకులుండవు కాబట్టి ఉద్యోగం చేసి ఒంటరిగా సంపాదించుకోవాల్సిన అవసరం లేదని చెప్పింది. నవనాగరిక విద్యలలో జాతీయత కొరవడుతోందనీ, కాబట్టి ఆర్షధర్మానుసారంగా జాతీయతను స్త్రీవిద్యలో భాగంగా నేర్పితే స్త్రీసంఘం ఉన్నత దశకువచ్చి దేశగౌరవం నిలబడుతుందని తెలియజేసింది.

'స్త్రీ సమాజవార్షికోత్సవ నివేదికా ప్రశంసము' (మే 1924 అనసూయ) అనే శీర్షికన భీమునిపట్నం పురపాలకసంఘం తరపున బాలికలకు బహుమానం ఇచ్చే సందర్భంలో కోట లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ 1920 లో ఈ బాలికా పాఠశాల ఎలా ఉందో అలానే 1924లోనూ ఉందనీ, స్త్రీ విద్యాభివృద్ధికి పాటుపడితేనే స్త్రీ విద్య అభివృద్ధిచెందుతుందనీ, గాంధీ, సరోజనీదేవి స్త్రీల యభివృద్ధికై పాటుపడుతున్నారనీ, పురపాలకసంఘం చేయలేకపోతున్నా స్త్రీలందరూ సహాయపడి విద్యాలయాభివృద్ధికే కృషిచేయాలని పిలుపునిచ్చింది.

'స్త్రీవిద్య' (స్త్రీధర్మపత్రిక మే, 1924) ను గురించి కోట లలిత వ్రాస్తూ పూర్వం భారతదేశంలో యుద్ధాలు చేసిన స్త్రీలు ఉన్నారనీ, నేడు బాల్యవివాహాలవల్ల స్త్రీవిద్యకు ఆటంకం ఏర్పడుతోందనీ, లోకజ్ఞానంకోసం స్త్రీలు నవలలు, చరిత్రలు, పత్రికలు చదవాలనీ, స్త్రీలకు స్వేచ్ఛ అవసరమని తెలియజేసింది.

'అబలాభివర్ధినీసమాజం' (స్త్రీధర్మపత్రిక మే 1924) ను గురించి ఆర్ సోనాబాయమ్మ వ్రాస్తూ ఈ సమాజంలో స్త్రీవిద్య, సాంఘిక, మత, చారిత్రాత్మక విషయాలు చర్చింపబడతాయనీ, ఖేముపనులు, ఇంగ్లీషు నేర్పిస్తారని తెలియజేసింది.

'రాటపుసందేశం' (స్త్రీధర్మపత్రిక, అక్టోబరు 1926) అనే శీర్షికన ఆర్.సోనాబాయమ్మ చేసిన ఉపన్యాసంలో పూర్వకాలంనుండి భారతదేశంలో రాట్నపు పరిశ్రమ ఉన్నతస్థితిలో ఉండి విదేశాలకు రవాణాచేసేదనీ, మహాత్ముని జన్మదినసందర్భంగా రాట్నాలపరిశ్రమను అభివృద్ధి చేయాలని తెలియజేసింది.

'వృత్తాంతం' అనే శీర్షికన, (స్త్రీధర్మపత్రిక మే 1924) పత్రికాసంపాదకురాలు వ్రాస్తూ శాసన సభలలో పురుషులకు మాత్రమే ఎన్నికల అధికారాన్ని యిచ్చారనీ, దానికై స్త్రీలు పోరాడాలనీ, సమావేశాలను ఏర్పాటు చేసుకొని స్త్రీపురుష భేదం పోగొట్టాలనీ, జాతిభేదం ఉండకూడదని తెలిపింది. నిర్బంధవైధవ్యపద్ధతిని ఆపాలనీ, స్త్రీలకు సమానమైన రాజకీయ, సాంఘికచట్టాలు ఉండాలనీ, స్వరాజ్యంకోసం స్త్రీలను భాగస్వాములను చేస్తున్నారుగాని వారికి స్వాతంత్ర్యం ఉండకూడదనటం అన్యాయమని తెలియజేసింది.

*స్త్రీలరాజకీయ సాధికారికతకు అడ్డుగా ఉన్న లింగవివక్షతకు సంబంధించిన చైతన్యాన్ని పత్రిక కలిగించింది.*

జరుగుమిల్లి రామాబాయమ్మ వ్రాసిన 'వృద్ధవివాహం' (జులై 1924 అనసూయ పత్రిక) అనే వ్యాసంలో ధనవ్యామోహంలో కూతురిని వృద్ధుడికిచ్చి పెళ్ళిచేస్తున్నారనీ, మగవాడు ముసలితనం వరకూ ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకునే స్వేచ్ఛ ఉన్నదనీ, ఆ కారణంచేతనే బాల వితంతువులైన స్త్రీలు పెడదారిపట్టే అవకాశం ఉంటుందని చెప్పింది.

*స్త్రీల అనైతికతకు బాల్యవివాహం కారణమని చెప్పటం జరిగింది.*

పి.కమలమ్మ వ్రాసిన 'వివేకానందస్వామి' అమెరికా స్త్రీలను గురించి చేసిన ఉపన్యాసానికి (జులై 1924 అనసూయ) తెలుగు అనువాదంగా విదేశీస్త్రీలు స్వేచ్ఛగా ప్రవర్తిస్తారనీ వ్యాపారాలు, విద్యాసంస్థలను నిర్వహిస్తారనీ, మనదేశంలో పురుషులు స్త్రీలను నీచపు పురుగులుగా చూస్తున్నారనీ, భారతీయులు మనుషులుగా ప్రవర్తించాలనీ, ఇక్కడ స్త్రీశక్తిని అగౌరవపరచటంతోనే దేశం వెనకబడిందని వివేకానందుడు చెప్పిన విషయాలను తెలియచేయటం జరిగింది.

నెల్లూరుకి చెందిన 'పొణకా కనకమ్మ' (ఆగస్టు 1924 అనసూయ)ను గురించి పత్రికాధిపురాలు వ్రాస్తూ పాఠశాలకు పోకపోయినా విద్యావంతురాలుగా పొణకా కనకమ్మ గుర్తింపబడటం ఆంధ్ర స్త్రీ ప్రపంచానికి గర్వకారణమనీ, అనిబిసెంట్ హోమ్ రూలు ఉద్యమంలో చాలా శ్రద్ధగా పనిచేసిందనీ, ఆమెయొక్క దేశభక్తి, భాషాసక్తి, కార్యదీక్ష, సుగణసంపన్నత ప్రశంసనీయములని పేర్కొంది. కాకినాడలోని జాతీయ మహాసభకు పొణకా కనకమ్మ వచ్చిందనీ, తెలియజేసింది. అంతేకాక పొణకాకనకమ్మ 1923 వ సం.లో 'కస్తూరిదేవి విద్యాలయం'లో ఉచితవిద్యను ప్రవేశపెట్టారనీ, సంస్కృతం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు విద్యలను, రాట్నంతో నూలు వడకటం ఫేము పని, పరిశ్రమలు, సంగీతం యోగా నేర్పించివారనీ, పౌరాణిక ఐతిహాసిక కథలను బోధించేవారని పత్రిక తెలియజేసింది.

*సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో భాగంగా రాట్నంవడికి నూలుతీయటంవలననే విదేశీవస్త్ర బహిష్కరణ చేయవచ్చునీ, స్వదేశీయులైన, భారతీయులందరికీ సరిపోయేవిధంగా నూలువడకటం కోసం స్త్రీలకు రాట్నంతో నూలువడికే పరిశ్రమను నేర్పటం మొదలుపెట్టారని కూడా పత్రిక తెలియజేసింది.*

'దామరాజు సుందరమ్మగారు' (సెప్టెంబరు 1924 అనసూయ) అనే శీర్షికన కొటికలపూడి సీతమ్మ వ్రాసిన వ్యాసంలో 1875 లో జన్మించిన సుందరమ్మ రాజమండ్రి వాసిగా బాలికా పాఠశాలలో విద్యాభ్యాసం చేసిందనీ, పురాణాలలో దేశచరిత్రములను గురించి అభిరుచితో సద్గ్రంథాలను ఆమూలాగ్రంగా చదివిందని తెలిపింది. ఆచారాలప్రాబల్యం చేత ఈమె తండ్రి వీరేశలింగంగారి మిత్రుడైనను ఈమెకు 12 ఏండ్లకే వివాహం జరిపించాడనీ, భర్త

వ్యసనపరుడగుటచే కొంత ఆస్తిని తనపేర వ్రాయించుకుందనీ, ఆమె భర్త మరణసమయంలో పశ్చాత్తప్తుడగుచూ భార్యకు అపకారం చేసినందుకు క్షమాపణ కోరాడని చెప్పింది. ఆమెకుగల మతవిషయజ్ఞానం, న్యాయవిచక్షణ గొప్పదనీ ఆమెకు దేశసేవా వాంఛకలదనియూ, బీదస్త్రీకి ఆర్థిక సహాయం చేసిందనీ, తనతండ్రి తనకు బాల్యవివాహం చేయటంచేతనే ఆమెకు దుఖము కలిగినదనీ, కష్టాలను సహించలేని ఆమె చివరకు చిత్తచాంచల్యాన్ని వహించిందని తెలియజేసింది.

*ఆచారాలకు అనుగుణంగా బాల్యవివాహం చేయటంచేత ఆమెకు విద్యావినాశనమేగాక, వ్యసనపరుడైన భర్తవల్ల ఆరోగ్యనాశనం కూడా కలిగినదనీ, చివరకు పిచ్చికూడా వచ్చిందనీ సుందరమ్మ జీవిత కథను ఉదాహరణగా చూపించింది. అప్పటికింకా చట్టపరమైనహక్కు లేనందున భర్త ఆస్తికి తానే వారసురాలవ్వాలని భావించింది.*

గుడిపూడి ఇందుమతిదేవి 'స్త్రీలకుద్యోగం' (నవంబరు 1924 అనసూయ) అనే శీర్షికన వ్రాస్తూ స్త్రీలు ఉద్యోగం చేస్తే ఇంటి పనులు చేయరనే అపోహను పోగొట్టటానికై ఉద్యోగినులైన స్త్రీలు ఇంటి పనులు చేస్తూ కూడా తోటి స్త్రీలకు విద్యను కూడా నేర్పిస్తున్నారని తెలియచేసింది.

సమర్థి స్వర్ణమ్మ 'నిర్బంధవిద్య'ను (స్త్రీధర్మపత్రిక, డిశెంబరు 1924) గురించి వ్రాస్తూ బాలికలకు విద్య సర్వార్థసిద్ధినిచ్చే కల్పవృక్షమనీ, కామధేనువనీ, దానిని కులాచారంచేయాలనీ, స్త్రీలపురోభివృద్ధికై స్త్రీలకు ఎన్నికల అధికారం యివ్వాలనీ, స్త్రీలు కావ్యపఠనం చేయాలనీ, లలితకళలను అభ్యసించాలనీ, చర్కా తిప్పుతూ ఉండాలని ఉద్బోధించింది.

వి.పద్మ 'స్త్రీవిద్య' (స్త్రీధర్మ, డిశెంబరు 1924)ను గురించి వ్రాస్తూ స్త్రీలు విద్యను సేకరించటానికి మార్గాలను సూచిస్తూ సత్సాంగత్యం, సద్గ్రంథపఠనం, దేశసంచారం అవసరమనీ, ప్రతిమానవులకు విద్యను అభ్యసించుట సర్వసామాన్యమైన హక్కు అని తెలిపింది. భండారు అచ్చమాంబ వంటి వారు విద్యనభ్యసించి తోటిస్త్రీలను విద్యావంతులను చేస్తున్నారనీ, విద్యవంతులైతేనే స్త్రీలు, వారిబిడ్డలు దేశసేవ చేయగలుగుతారనీ, గృహకృత్యముల అనంతరం స్త్రీలు గ్రంథములను చదివి విద్యావంతులు కావాలని తెలియజేసింది.

పులవర్తి కమలావతిదేవి వ్రాసిన 'స్వరాజ్య సంపాదన యందు స్త్రీల విద్యుక్త ధర్మం' (ఆంధ్రపత్రిక వార్షిక సంచిక మార్చి1925) అనే వ్యాసంలో 'స్వరాజ్యమం'టే ఏమిటో స్త్రీలే తెలుసుకోవాలనీ, బ్రిటిష్ రాజును, ఆంగ్లేయులను ద్వేషించటంకంటేకూడా, ఆ ప్రభుత్వపు ప్రతినిధిగా భారతదేశంలోఉన్న స్టేట్ మంత్రి, వైస్రాయ్, గవర్నరు, మంత్రులు కాలవ్యవధిలో మారుతుంటారు కాబట్టి వారి ప్రభుత నచ్చకపోతే లండన్ లో వలె వారిని మార్చవచ్చని తెలిపింది. వారికి వ్యతిరేకంగా తీర్మానాలు చేసినా రాజద్రోహం కాదనీ దానికి స్వరాజ్యం అవసరమనీ మానవహక్కులు ముఖ్యమనీ, ముఖ్యంగా భారతీయులచే ఎన్నుకోబడిన వ్యక్తికి కోశాధికారమును ఇవ్వమని అడగటమే స్వరాజ్యమనీ, ఆ స్వరాజ్యాన్ని పొందటానికి సహాయనిరాకరణోద్యము మొదలుపెట్టారని చెప్పింది. రాట్నముతిప్పి నూలువడికి భారతీయులు తమవస్త్రాలను తామే

తయారుచేసుకొని ధరించగలిగితే ఆ ధనము భారతీయుల చేతుల్లోనే ఉంటుందనీ, తీరికవేళల్లో స్త్రీలు అటువంటిపనులలో నిమగ్నమవటమే అహింసతో స్వరాజ్యసాధన చేయగలగటం అని తెలియజేసింది. అంతేకాదు, భారతీయులు ప్రజాప్రతినిధులుగాగల రాష్ట్రప్రభుత్వం ఉండాలనీ, ఆంగ్లప్రభుత్వం క్రిందఉన్న మనహక్కులను సంపాదించుకుంటే దేశాన్ని ఎలా పరిపాలించుకోవాలో చెప్పుకోవచ్చునీ, పైఅధికారం బ్రిటిష్ ప్రధాని చేతిలో ఉన్నాకూడా భారతదేశంలోని ప్రజలకు మంత్రులు నచ్చకపోయినా, ఆర్థికమంత్రి సరిగ్గా లేకపోయినా వారిని తొలగించుకునే అధికారం భారత ప్రజలకు ఉండటమే 'స్వరాజ్య' సంపాదన అని చెప్పింది. స్వరాజ్య పార్టీ ఏర్పడి స్వరాజ్య ప్రతిపత్తిని (డొమినీయన్) పొందటమే ముఖ్యమనీ, పాశ్చాత్యదేశాలవంటి వలసరాజ్యాలలో ఉన్న అంతర్గత స్వపరిపాలన/డొమినీయన్ ప్రతిపత్తి కల్గియుండటాన్ని స్వరాజ్యంగా భావించవచ్చని తెలియజేసింది.

*స్వరాజ్యానికి ఉన్న నిర్దిష్టమైన అర్థాన్ని స్త్రీలందరూ అవగాహన చేసుకోవటానికి, వారు స్వాతంత్ర్య ప్రచారానికి పూనుకొనటానికి పులవర్తి కమలావతిదేవి స్వరాజ్య పదాన్ని స్పష్టంచేసింది. 1919 చట్టాన్ని బాగా అర్థంచేసుకొని భారతీయులు స్వరాజ్యం కోసం పట్టుబట్టాల్సిన అవసరాన్ని గ్రహించేటట్లు చేసింది. అంతేకాదు ఖద్దరు వస్త్రధారిణులై స్త్రీలు రాట్నంతిప్పితే దేశం సుభిక్షమవుతుందనీ, ప్రేమ, అహింసతోనే సహాయనిరాకరణ చేయవచ్చునీ, అప్పుడే స్వరాజ్యసంపాదన వీలవుతుందని చెప్పింది. స్త్రీలందరినీ ఖద్దరు, నూలువడికే సత్యాగ్రహ ఉద్యమ భాగస్వామినులుగా చేయటమే దేశస్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీలందరి భాగస్వామ్యానికి నిదర్శనంగా భావించాలి. దేశస్వరాజ్య సాధనలో ఇది ఒక ప్రయోగాత్మకమైన స్త్రీలసాహిత్యోపకరణము.*

'స్త్రీలు నాటకరంగ ప్రవేశం' చేస్తేనే ప్రేక్షకులు స్త్రీపాత్రల భావానుభూతిని పొందగలరనీ, పులవర్తి కమలావతీ దేవి, ధర్మవరం లక్ష్మీదేవి, జాగర్లమూడి జానకమ్మ వరుసగా గృహలక్ష్మి పత్రికలో (మే, జూన్ ఆక్టోబరు 1929 గృహలక్ష్మి పత్రిక) వ్యాసాలు వ్రాసారు. స్త్రీల నాటకరంగ ప్రవేశం స్త్రీలస్వేచ్ఛను కళాప్రయోజనాన్ని కలిగిస్తుందని భావించారు. స్త్రీలు బహిరంగంగా అందరి ముందు నిలబడితే పురుషుడు వారిని సహించగల మనస్తత్వం పురుషులకు ఉండాలనికూడా భావించారు. అప్పుడే స్త్రీ స్వేచ్ఛను అనుభవించిందనే దానికి తార్కాణమనీ, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనగలరనీ భావించి ఉండవచ్చు.

'స్త్రీలు-వారిసేవాసక్తి' (స్త్రీధర్మపత్రిక, మార్చి 1926)ని గురించి ఆనిబిసెంట్ చేసిన ఉపన్యాస అనువాద ప్రచురణలో స్త్రీలు తమ హక్కుల గురించి మేల్కొనుట శుభసూచకమనీ, జ్ఞానాన్ని యివ్వగల మతాన్ని స్త్రీలు అవలంబించాలని తెలిపింది. భారతదేశంలో మొదటి న్యాయస్థానం మద్రాసులో ఏర్పాటుచేయబడిందనీ, స్త్రీలయొక్క శిక్షణలో నడపబడే బాలనేరస్థుల సదనం మద్రాసులోనే ఉందనీ, అన్యోన్యతతో స్త్రీ, పురుషులు ఉంటే భారతదేశానికి గౌరవస్థానం ఉంటుందని తెలియజేసింది.

'శ్రీమతి డా.అనిబిసెంట్' (స్త్రీ ధర్మపత్రిక, అక్టోబరు1926) అనే శీర్షికన వి.పాపమ్మ అనిబిసెంట్ గురించి వ్రాస్తూ భారతదేశంలో స్త్రీవిద్యకై కృషిచేస్తున్నదనీ, వారికి మత, సాంఘిక, రాజకీయ విద్యాది విషయాలను తెలియజేయటానికి పత్రికను స్థాపించిందనీ, భారతీయులకు స్వాతంత్ర్యసంపాదనకై 'కామనువెల్తుబిల్లు'ను తయారుచేసి సమ్మతికై ఇంగ్లాండుకు వెళ్ళిందని ఆమెను ప్రశంసించింది.

'విద్యావంతులు-వారికర్తవ్యములు' (స్త్రీధర్మపత్రిక, మార్చి 1926) అనే శీర్షికన సుల్తానా మీర్ అమీరుద్దీన్ చేసిన ఉపన్యాస ప్రచురణలో స్త్రీలఉద్యమం ప్రాధాన్యత వహిస్తోందనీ, స్త్రీసమాజాలు దేశానికి మేలు చేస్తున్నాయనీ, బాధ్యతతో స్త్రీలు శిశుపోషణచేయటమే దేశసేవ అనీ, వారి భావిస్థితి స్త్రీలమీదనే ఆధారపడి ఉందనీ, చెన్నపురిలో స్త్రీలకు ఎన్నికల హక్కు వచ్చిందని తెలియజేసింది.

'స్త్రీవిద్య-వెంటనే చేయవలసిన పని' (స్త్రీధర్మపత్రిక, జూన్ 1926) అనే శీర్షికన శ్రీమతి ఎ.ఎల్ హైడికోపర్ వ్రాస్తూ 'స్త్రీలకమిషన్'ను వెంటనే నియమించాలనీ, దానివలన భారతస్త్రీలకు విద్యాలాభమేకాక స్త్రీల సమస్యలకు పరిష్కారం ఏర్పడుతుందని తెలిపింది. పాఠ్యాంశాలను, పరీక్షలను నిర్ణయించేందుకు స్త్రీలే స్టాండింగ్ కమిటీలో ఉండాలనీ, స్త్రీకార్మికులు పనిచేసేచోట శిశు పోషణాలయాలు ఉండాలనీ, స్త్రీపురుషులకు సమానహక్కులు ఉండాలని తెలియజేసింది.

'వృత్తాంతములు-వ్యాఖ్యలు' (స్త్రీధర్మపత్రిక, అక్టోబరు 1926) అనే శీర్షికన సంపాదకురాలు వ్రాస్తూ జరగబోతున్న రాష్ట్రీయశాసనసభలకు స్త్రీలు ఏపార్టీవారైన స్త్రీలను ప్రతినిధులుగా నిలబెట్టి ఎన్నుకోవాలనీ, అల్పసంఖ్యగా ఉన్నా శాసనసభలో స్త్రీనియామకసభ్యులు ఉండేటట్లు చూసుకోవాలని తెలిపింది. విశ్వవిద్యాలయసెనెట్ మెంబర్లుగా స్త్రీలసమావేశాలను ఏర్పాటుచేయాలనీ, స్త్రీలకు ప్రత్యేక స్నానఘట్టాలుఉండాలనీ, ప్రచారకులతో శిశుఆరోగ్యసమావేశాలు జరపాలనీ, కన్యల గర్భాదాన అంగీకార వయస్సును పెంచాలని తీర్మానాలు చేయాలని తెలియజేసింది.

'అఖిలభారత స్త్రీమహాసభ' (స్త్రీధర్మ పత్రిక, ఫిబ్రవరి1927) లో బరోడామహారాణి చేసిన ఉపన్యాస అనువాదంలో స్త్రీలు చేస్తున్న ఉద్యమానికి పురుషులసహకారం ఉండాలనీ, అతిబాల్య వివాహాలను రూపుమాపటానికై హరిసింగ్ గౌరుగారు 16 ఏళ్ళకు తక్కువగాని వివాహవయసును నిర్ణయించే చట్టాన్ని సామ్రాజ్య శాసనసభలో చేయించారని చెప్పింది. స్త్రీలు బానిసలుగా ఉంటే మనుష్యులు స్వాతంత్ర్యాన్ని పొందలేరనీ, దేశం అభివృద్ధి చెందాలంటే స్త్రీలు, పురుషులు సమానమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యాలను పొందాలని తెలిపింది. దేశపరిస్థితులకు అనుగుణమైన వృత్తి విద్యలను స్త్రీలకు అందించాలనీ, స్త్రీలు తమ భర్తల ఆస్తులలో భాగస్వాములుగా అయ్యే శాసనాలను తేవాలనీ, బాలబాలికలకు నిర్బంధ ప్రారంభవిద్య ఉండాలని తీర్మానంచేయాలని తెలియజేసింది.

దీనికి అనుబంధంగా పత్రిక సంపాదకీయాన్ని ప్రచురిస్తూ మద్రాసులో స్త్రీల ఉద్యమ ఫలితంగా మద్రాసు శాసనసభ సభ్యురాలిగాను,సభయొక్క ఉపాధ్యక్షురాలిగాను డా.ముత్తు లక్ష్మిరెడ్డి నియమింపబడ్డారని తెలిపింది. అంతేకాక, కొంతమంది స్త్రీలు ఓటుహక్కును వినియోగించు కొన్నారనీ, స్త్రీల ఓటింగ్ శాతం పెరగాలంటే స్త్రీపోలింగ్ ఆఫీసర్లు ఉండాలనీ, మద్రాసు విశ్వవిద్యాలయం సెనేటుమెంబర్లుగా స్త్రీలు నియమింపబడ్డారనీ, విద్యాసంపత్తివల్ల స్వాతంత్ర్య వాతావరణం వల్ల స్త్రీలు దేశాభివృద్ధికి పాటుపడగలరని తెలియజేసింది.

'బాలికలు–లోకసేవ' (జూన్ 1927 భారతి) అనే వ్యాసంలో రొట్టెకల్ సుబ్బమ్మ భారతదేశంలో కూడా 'గరల్ గైడింగ్' ఉద్యమం బాలికలలో ప్రచారం కావాలనీ, దాని ప్రకారం స్త్రీలు లోకమునకు, తమ స్వదేశమునకు, ప్రజాకోటికి సేవచేసే విధంగా బాలికా వ్యవస్థలోనే శిక్షణ పొందగలుగుతారనీ, దేశానికి వారి అవసరముందని తెలియజేసింది.

*దేశసేవను బాలికా విద్యలో భాగంగా పాఠ్యాంశ శిక్షణారూపంలో పెట్టాలనుకోవటమే నాటి బాలికలను భవిష్యత్తులో దేశపౌరులుగా తీర్చిదిద్దాలనుకోవటంగా అర్థమై ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఇది నేటి జాతీయసేవా పథకం వంటిది.*

ఆ.భాస్కరమ్మ వ్రాసిన 'అతిబాల్యవివాహం' (డిసెంబరు 1927 భారతి) అనే వ్యాసంలో అతిబాల్యవివాహాలలో పఠించే మంత్రాలయొక్క అర్థాలు ఆ బాలికలకు తెలియవనీ, అవి ఆరోగ్యానికి, ప్రజాభివృద్ధికి అనుకూలంగా ఉండాలని చెప్పింది. ప్రౌఢవివాహాలు చేస్తే అతి బాల్యవైధవ్యం, బాలింతల చావులు, సంసారిక బాధలువంటివి చిన్న పిల్లలకు ఉండవనీ, స్త్రీలు పూనుకొని 'గౌరుబిల్లు' ప్రకారం బాలికలకు పదహారు సంవత్సరములు నిండిన తరువాత పెళ్ళి జరిగేటట్లుగా చట్టం చేసి ఆచరణలో పెట్టాలని తెలియజేసింది.

*శారదాబిల్లు ప్రకారం 14 ఏండ్లు వస్తేనే ఆడపిల్లకు పెళ్ళి చేయాలంటే ఆ వయసు కూడా సరిపోదనీ, ఆడపిల్లలలో 16 ఏండ్లు వస్తేనే శారీరక, మానసిక పరివర్తన వస్తుందని రచయిత్రి వంటివారు భావించటంచేతనే గౌరుగారు శాసనసభలలో దీనిని ప్రతిపాదించినట్లు అర్థం అవుతుంది.*

దూ.సూర్యకాంతమ్మ 'ఆంధ్రరాష్ట్ర మహిళావిద్యా సంస్కరణ సభ' (జనవరి 1928 హిందూ సుందరి) లో చేసిన ఉపన్యాసంలో స్త్రీల పురోభివృద్ధికై చేయాల్సిన పనులలో ముఖ్యమైనది ఆయుర్దాయము, ఆరోగ్యానికి సంబంధించిన విషయమనీ, విదేశీస్త్రీల ఆయుఃప్రమాణం 45–50 మధ్య ఉండగా భారతదేశంలో 23–25 మధ్య ఉందనీ, శిశుమరణాలు ఆయా దేశాలలో 1000కి 30–40 మధ్య ఉండగా మనదేశంలో 1000కి 200 మంది శిశుమరణాలు ఉన్నాయని చెప్పింది. మనదేశపు అతిబాల్యవివాహాలవల్ల ఆడుతూ పాడుతూ త్రుళ్ళుతుండె వయస్సులో స్త్రీలు ఆపరేషన్ల పాలవుతున్నారనీ మానవ శరీరం, మెదడు వృద్ధి వికాసాన్ని పొందే 16 ఏండ్ల వయస్సులో

వృద్ధాప్యం వస్తోందని తెలిపింది. శిశుపెంపకంలో సరైన వేళకు బాలికలకు ఆహారనిద్రలు కరువవటం జరుగుతోందనీ, అందుకని డా.గౌరుగారు 12 ఏండ్లలోపు ఆడపిల్లలకు వివాహం చేయకూడదనీ వైశ్రాయి శాసన సభలో బిల్లును ప్రవేశపెట్టారని చెప్పింది. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ ఆడపిల్లలకు 16, మగపిల్లలకు 21 ఏండ్లలోపు వివాహాన్ని నిషేధంచేస్తూ బిల్లును పెట్టాలనీ, స్త్రీలు సభలు నిర్వహించి తీర్మానాలు చేసి బిల్లును ప్రవేశపెట్టించాలని భావిస్తున్నారని తెలియజేసింది.

*ఇదొక గణాంక శాస్త్రవిషయం. మానవాభివృద్ధి సూచికలో స్త్రీల ఆరోగ్యానికున్న ప్రాధాన్యతను నాడే స్త్రీలు గుర్తించారు అనేదానికి నిదర్శనమిది.*

డి. బుచ్చికృష్ణమ్మ "స్త్రీ విద్యకు లలితకళల ప్రాధాన్యం"ను గురించి చేసిన ఉపన్యాసంలో (జనవరి 1928 హిందూసుందరి) జపాన్ లో వలె మనదేశ విద్యాలయాలలో ఆంధ్రకావ్య పఠనం, సంగీతం, చిత్రలేఖనం, కళాత్మకమైన చేతిపనులను నేర్పించే పాఠశాలలు పెట్టి స్త్రీల కళా పరిశ్రమలను అభివృద్ధి చేయాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

1928 వ సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన ఢిల్లీలో జరిగిన రెండవ 'అఖిలభారత మహిళావిద్యావిషయక' సభలో (ఏప్రిల్1928 హిందూ సుందరి) చేసిన తీర్మానాలుగా సి.సుబ్బలక్ష్మమ్మ తెలియజేస్తూ బాలికలకు నిర్బంధవిద్యను పెట్టాలనీ, అతిబాల్యవివాహాలను నిర్మూలన చేయాలనీ, స్త్రీ విద్యావిషయంలో ఇనస్పెక్టర్లగానూ, టెక్స్టు బుక్కు కమిటీలో స్త్రీలను మెంబర్లుగా చేయాలని తీర్మానించారు. బాలికలకు దేశసేవను నేర్పాలనీ, వ్యవసాయాన్ని బాలికలకు నేర్పాలనీ, బాలికలకు నర్సింగ్ స్కూల్స్ పెట్టాలనీ, స్త్రీవిద్యాభివృద్ధి విషయమైన ఫిల్ములు ప్రదర్శించాలని తీర్మానాలు చేసారు. ఈ విషయాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టగలిగే విధంగా సెలెక్టు కమిటీలో స్త్రీలు మెంబర్లుగా ఉండాలనీ, దానికై ప్రతిప్రావెన్సు నుండి ఒక్కొక్క స్త్రీని ప్రతినిధిగా పెట్టుకోవాలనీ, దానికై ఆంధ్రరాష్ట్రం నుండి కోకా కృష్ణవేణమ్మను ఎన్నుకోవటం జరిగిందనీ, ఆమె స్త్రీ విద్యావిషయంలో సభలో చేసిన తీర్మానాలను కోకా కృష్ణవేణమ్మ స్టాండింగ్ కమిటీ (స్థిర సమాజంలో) కి నివేదిస్తారని తెలియజేసింది.

*1928 నాటికి విద్యావంతులైన స్త్రీలు విద్యావిషయంలో, పాఠ్యాంశ నిర్ణయం చేయటంలోనూ, స్థాయీ సంఘాలలో సభ్యురాండ్రుగా ఎదగగలగటమే స్త్రీల ప్రగతికి సూచికగా భావించవచ్చు. అంతేగాక స్త్రీలకు వ్యవసాయవిద్య, నర్సింగ్ విద్యను నేర్పాలని సూచించింది. అఖిల భారత స్థాయిలో మహిళాసభలను ఏర్పాటు చేసుకొన్నారని అర్థం అవుతోంది.*

కాకినాడలోని స్త్రీవిద్యార్థినీసమాజంవారు ప్రతి పౌర్ణమినాడు జరిపే సభలో "ఉమెన్స్ డే" (ఫిబ్రవరి 1928 హిందూసుందరి)ను గురించి పత్రికాసంపాదకురాలు తెలియజేస్తూ 'మదరాసులో ఉమెన్స్ డే' అనే పేరుతో ఒక నవీన సంస్థను స్థాపించారనీ, స్త్రీలు గత నెలలో

సమావేశం అయ్యారనీ ఆ సభాధ్యక్షురాలిగా సర్ సిరీదేవీ, ఉపాధ్యక్షురాలుగా డా. ముత్తు లక్ష్మీరెడ్డి, కోశాధికారి శ్రీమతి స్వామినాధన్ సతి, కార్యదర్శిగా శ్రీమతి మాలతి వట్టువర్ధన్ వంటివారితో కలిపి 100 మంది సభ్యురాంద్రు కార్యనిర్వాహకవర్గంగా సంస్థ ఏర్పడిందని తెలిపింది. ఆ సభలోనివారు తీర్మానాలు చేస్తూ, భారతజాతి యొక్క దేహదారుఢ్యం, భావిమాతల శ్రేయస్సును, శిశుమరణాలను తగ్గంచటానికి విరాళాలు సేకరించాలని, స్త్రీవిద్యా సంస్కరణలు అవసరమనీ, సంపూర్ణ విద్యావికాసాలలో వైద్యపరీక్షను ముఖ్యాంశంగా చేసినట్లు పత్రిక తెలియజేసింది. అంతేకాదు, స్వీయాభివృద్ధికి, సామాజిక పునర్నిర్మాణాలకు మహిళాసంఘాలను స్థాపించి వాటిని కాపాడే బాధ్యతను ఈ 'ఉమెన్స్ డే' సంస్థ వహించాలని తెలిపింది. మాతృధర్మం, శిశుశ్రేయానికై జాతీయసేవ చేయటానికి ఔషధాలయాలు, అనాధశరణాలయాలను ఏర్పాటుచేయాలనీ, చెరసాలలమార్పులు, గౌరువిద్యా విధానం, బాలికలకు ఉపచారకార్యవిద్యను (నర్సింగ్), జారగృహ నిర్మూలనం, చిత్రలేఖనం, సాంఘిక పునర్నిర్మాణం, ధార్మిక, రాజకార్య విషయాలలో స్త్రీలు పాల్గొనటం వంటివి చెయ్యాలని నిర్ణయించారని తెలిపింది. వైవాహిక వయోకాలపరిమితిని శాసనపూర్వకంగా చేయటానికి ప్రభుత్వం వారిని కోరటం చేయాలనీ, వధూవరులను ద్రవ్యమిచ్చి కొనే దురాచారాన్ని ఖండించాలని కూడా భావించారని సభావిశేషాలను తెలియజేసింది. ఆ సభలోనే కమలాబాయి సాహెబు యాకూబ్ హుసేన్ సతి సభలో మాట్లాడుతూ పర్దాపద్ధతి యనుపేరున, స్త్రీలు ఘోషాలోనుండునట్లు బలవంతం చేసే ఆచారాన్ని గర్హించాలనీ దేశశ్రేయానికి, మానవ ధర్మానికి ఈ ఆచారాన్ని రద్దు చేయాలని ప్రార్థించిందని పత్రిక తెలియజేసింది.

ఆ సభలో ఆనందబాయి మాట్లాడుతూ అవిభక్త, విభక్త కుటుంబాలలోని ఆస్తి, స్త్రీధనాన్ని అనంతర వారసత్వంలోను, స్త్రీల భాగస్వామ్యవిషయాన్ని స్త్రీల స్వత్వముల (హక్కులు) దిశగా సాంఘిక పునర్నిర్మాణం జరగాలని చెప్పింది. స్త్రీల గృహపరిశ్రమకు, దేశపరిశ్రమలకు తమ శక్తిని సమర్పించటం స్త్రీల కర్తవ్యమని చెప్పిందని తెలియజేసింది. ఆ తరువాత శ్రీరామదేవి మాట్లాడుతూ, పరిశ్రమలందు స్త్రీ పురుష వివక్ష లేకుండా సమాన వేతనాన్ని ఇవ్వాలనీ, పిల్లలను ఫ్యాక్టరీలలో పెట్టకూడదనీ, పరిశ్రమలని రిజిష్టర్ చేయాలని చెప్పిన విషయాన్ని పత్రిక పేర్కొంది.

అదే సభలో అలమేలు మంగతాయారమ్మాళ్ మాట్లాడుతూ జాతికి గృహస్థ జీవనానికి హానికరంగా ఉన్న మత్తువస్తు, పాన, దురభ్యాసాన్ని తొలగించాలనీ, 1928లో అటువంటి వాటికి తక్కువ సంఖ్యలో లైసెన్స్ ఇవ్వాలని చెప్పింది. మాలతీవర్ధన్ దేవీ మాట్లాడుతూ స్త్రీలకువలెనే పురుషులకు నీతిని పవిత్ర ఆచరణీయంగా ఉండాలనీ మాతృత్వదశను పొంద వాంఛించునప్పుడే దానిని కోరుకొనేవిధంగా స్త్రీకి హక్కులుండాలనీ, వివాహ వయోనిర్ణయాన్ని హెచ్చించాలని తెలియజేసింది. ఆ సభలోనే పాల్గొన్న కమలా ఛటోపాధ్యాయిని మాట్లాడుతూ, స్త్రీల ప్రాతినిధ్యానికై ప్రాంతీయ ప్రభుత్వాలలో మున్సిపల్ కౌన్సిళ్ళలో, లోకల్ బోర్డులలో స్త్రీలకు ప్రత్యేక స్థానాలు కేటాయించాలనీ, అటువంటి స్త్రీలను ఎన్నుకునే అధికారం ప్రతి స్త్రీసమాజానికి ఉండాలని

పత్రిక చెప్పింది. సభాప్రసంగాలతోపాటు, స్త్రీలు సంపూర్ణస్వరాజ్యం, స్వయంపరిపాలనకై తగిన ధర్మాలను నెరవేర్చుకోవాలని స్త్రీలు భావిస్తున్నారని విద్యార్థిసంఘం చెప్పిన విషయాలుగా పత్రికాసంపాదకురాలు తెలియజేసింది.

*మదరాసులో జరిగిన సభలో స్త్రీలు తమ అభివృద్ధిని గురించి, సామాజిక, ఆర్థిక, రాజకీయాలలోని భాగస్వామ్యాన్ని, స్త్రీలహక్కులను గురించిన అవగాహనను కల్గించి, స్త్రీలు తమజీవితాలపైన గాక దేశం యొక్క స్వరాజ్యసంపద గురించికూడా ఆలోచించాలని భావించారు.*

'ఆంధ్రరాష్ట్రమహిళా విద్యాసంస్కరణ సభ' (ఫిబ్రవరి 1928 హిందూసుందరి) లో మల్లిమడుగుల ఉపనిషద్దేవి చేసిన ఉపన్యాసంలో పిల్లలందరూ ఇంగ్లీషు భాష చదువుకోవటంలో నష్టాలున్నాయనీ, దానివలననే పిల్లలకు విద్య త్వరగా అభివృద్ధిచెందటం లేదనీ, వారికి స్వంతంత్రంగా తమ అభిప్రాయాలు ఇంగ్లీషులో వ్యక్తంచేయగల భాషానైపుణ్యం రాదనీ, తీక్షణమైన బుద్ధితో ఆలోచించి కొత్త విషయాలు కనిపెట్టగల వయసంతా ఆ భాష నేర్చుకోవటంలోనే గడుపుతున్నారని చెప్పింది. అంతేకాక, ఇంగ్లీషు భాషలో కాకుండా మిగిలిన దేశాలలోవలె తమ తమ మాతృభాషలలో శాస్త్రాధ్యాయనం చేసిన వారు ఎన్నో కొత్త విషయాలను కనిపెడుతున్నారనీ, 'దుబాసీ' సహకారంతో పనులను అస్వతంత్రంగా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. ఫస్టుఫారంనుండి ఇంగ్లీషుభాషనేర్పుతూ తెలుగు ఒకభాషగా ఉంచారనీ, రెండుభాషలూ రాక భావాలు వ్యక్తం చేయలేకపోతున్నారనీ, పరభాషలోకాక దేశభాషలలో విద్యావిధానం ఉండాలని కూడా చెప్పింది. అదేకాక, విద్యార్థులు విశ్వవిద్యాలయాలు అభిమానశాస్త్రములోని జ్ఞానాన్ని దేశంలో వ్యాపింప జేయాలనీ, పరభాషలో వ్రాస్తే స్వభాషలో అనువదించి ఇతరులకు బోధించుట కష్టసాధ్య మగుతుందనీ, పరభాషను ఒక భాషగా మాత్రమే నేర్పితే పాశ్చాత్యదేశాలలో విద్యాధికురాలైన స్త్రీలలాగా తమజాతి యొక్క నాగరికతను పరిచయం చేయగలుగుతారని చెప్పింది. దేశభాషలోని కావ్యాలు, శతకాలు, ఆయుర్వేదం, తత్త్వశాస్త్రాలు తెలుసుకుంటూ వేరొకవంకన ఆంగ్లసాహిత్యం, పాశ్చాత్య ప్రకృతిశాస్త్రాలను తెలుసుకుంటుంటే విద్య సజాతీయంగానూ, నూతనశక లక్షణాలను కలిగి దేశంలోని విద్యలేనివారికి ఉపయోగకారిగా ఉంటుందని తెలియజేసింది.

*ఆంగ్లబాషలో విద్యాధ్యయనం ఆడపిల్లల చదువుకి అడ్డంకి అని భావించింది. మాతృభాషలో శాస్త్రాధ్యాయనం వల్ల కొత్తవిషయాలు కనిపెట్టగలరని భావించింది. జాతీయ విద్యను మాతృభాషలో బోధిస్తేనే జాతి నాగరికత సార్థకం అవుతుందని భావించింది. పరభాషా వ్యామోహంగల పాలకులు ఈ విషయాన్ని యిప్పటికీ గుర్తిచకపోవటం పాలితుల దురదృష్టం.*

'సమదర్శిని' అనే పత్రికయొక్క ప్రథమసంపుటిలో 'నారి' అనే శీర్షికన మాగంటి అన్నపూర్ణాదేవి వ్రాసిన అసంపూర్ణమైన 'నారి' అనే అముద్రిత గ్రంథసారాంశాన్ని (ఏప్రిల్ 1928–29 ఉగాది సంచిక) ప్రచురిస్తూ 'నారి' ని గురించి అన్నపూర్ణాదేవి యొక్క అభిప్రాయములుగా

తెలియజేసింది. 'నారి' కి ఎంతో విలువ ఉన్నదనీ, నారీ మూలముననే పురుషులకు అన్నపానాదులు, బంధుత్వబంధనాలు కలుగుతున్నాయనీ, కన్నతల్లివలెను, ఉపాయంతోనూ సంసారమునందు స్త్రీ ప్రాప్తవస్తువగుటయే కారణమనీ, అటువంటి స్త్రీనిపెళ్ళిచేసుకొని కొంతధనాన్ని పొందుతున్నాడని ఆమె భావించిందని పత్రిక తెలిపింది. అంతేకాదు, బలవంతుడిగా అధర్మప్రకృతి ఉండటంచేతనే స్త్రీని అసహాయురాలుగా, అబలగా చూస్తున్నాడనీ, నారీభారమును వహించుటనగా బలవంతంతో స్వజాతి(పురుషుల) హస్తముల నుండి కాపాడటం అని, అవసరార్థమే, సోదరివిలువ పెరుగుతుందనీ, పురుషునియొక్క సుఖశాంతి ప్రదాయినిగా ఉండటానికి స్త్రీ సృష్టింపబడినదని భావిస్తున్నారని అన్నపూర్ణ వ్రాసినవిషయాన్ని పత్రిక తెలిపింది. అమెరికా ఇంగ్లాండు, జపాను దేశములందు స్త్రీలు స్వాతంత్ర్యాన్ని సంపాదించటానికి సర్వవిధాలయత్నించి సఫలీకృతులయ్యారనీ, ఆదిమ జాతులలో స్త్రీ పురుషులు సమానస్థితిలో ఉండేవారని, తరువాత స్త్రీని తన ఆధీనంలోని ఒకవస్తువుగా చూడటంచేత తనయిష్టానుసారంగా ఉపయోగిస్తున్నాడు కాబట్టే పురుషుడు స్వతంత్రుడిగా ఉంటున్నాడనీ, స్త్రీకి విలువనివ్వటం నేర్చుకోవాలనీ, 'నారీ' అనే గ్రంథభాగంలో మాగంటి అన్నపూర్ణాదేవి తెలియజేసిన భావనలను పత్రిక తెలియజేసింది..

*పెట్టుబడిదారివ్యవస్థలో స్త్రీని ఒక వినియోగితా వస్తువుకింద చూడటంతో స్త్రీలకు సొంత వ్యక్తిత్వం, స్వాతంత్ర్యం ఉండటంలేదని పితృస్వామ్యసంస్కృతి రహస్యాన్ని నాడే 'నారీ' అనే గ్రంథంలో మాగంటి అన్నపూర్ణమ్మ చెప్పటం నేటి స్త్రీవాదసాహిత్యానికి చుక్కానివంటిది.*

'మాగంటి అన్నపూర్ణాదేవి' ని గురించి (నవంబరు 1928 హిందూసుందరి) బాలాంత్రపు శేషమ్మ వ్రాసిన సంతాపసందేశంలో ఆమె 1900లో జన్మించినదనీ అన్నపూర్ణకు శిశుతరగతులు ముగించిన పిమ్మట, ఆమె తల్లిదండ్రులు గుంటూరులోని మిషన్ బాలికాపాఠశాలలో రెండేళ్ళు చదివించి అనంతరం కలకత్తాలోని బ్రాహ్మబాలికాపాఠశాలలో చదివించారనీ, అక్కడ ఆమె హేమచంద్ర సర్కారుగారి యింట ఉందనీ, బెంగాలీభాషను నేర్చుకున్నదని తెలియజేసింది. అంతేకాక, తెలుగులోని వివాహమంత్రాలతో ఆమెకు 1920లో మాగంటి బాపినీడుతో వివాహం జరిగిందనీ, దేశసేవ నిమిత్తమై వ్యవసాయవిద్యాభ్యాసానికి బాపినీడు అమెరికా వెడుతుంటే “మీరు నన్ను మరచినను మాతృదేశమును మరువబోకండి” అని చెప్పి పంపిందనీ శేషమ్మ తెలిపింది. గాంధి పిలుపుతో తాను అమెరికాకు వెళ్ళటంకోసం కొన్న ఓడ టికెట్టును వదులుకుని, దేశసేవకై ముందుకు నడిచి స్వరాజ్యసైన్యంలో చేరిందనీ, సభాపీఠములమీద ఆంధ్రాంగ్లములలో ఉపన్యాసా లిచ్చిందనీ, స్వరాజ్య భిక్షను యాచించిందని తెలిపింది. తన నగలను, భర్త చేతి గడియారాన్ని కూడా స్వరాజ్యభిక్షకు అర్పించటమేగాక తన పట్టువస్త్రాలను స్వదేశీదీక్షలో భాగంగా కాల్చివేసిందనీ, 1923లో తిరిగి వచ్చిన భర్తచే ఓడరేవు దగ్గరే ఖద్ధరు ధరింపజేసిందనీ, అమెరికాలో ఉన్న భర్తకు ఆమె వ్రాసిన లేఖలన్నింటిలో దేశస్వాతంత్రదీక్షా విశేషాలే వ్రాసిందని శేషమ్మ తెలిపినట్లు పత్రిక తెలియజేసింది.

అన్నపూర్ణయొక్క కార్యదీక్షకు, స్వయంకృషికి, సంఘపట్టుదలకు ప్రముఖులు నివాళులను అర్పించిన విషయాన్ని పత్రిక ప్రకటించింది. ఆమె కూడా అనారోగ్యాన్ని లెక్కచేయక విద్యాభివృద్ధి చేసికొని గ్రంథరచన కూడా చేసిందనీ, ఉన్నతవిద్య నేర్చుకొని స్వతంత్ర జీవితం గడపాలను కుందనీ, సంఘ నిర్బంధము విధించినా వాటిని సహించి తనజీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందని పేర్కొంది. ఈమె దేశసేవను మహాత్ముడు ప్రశంసించాడనీ, ఈమె మరణంపట్ల గాంధి విచారాన్ని వ్యక్తంచేస్తూ ఆమె స్మారక చిహ్నాన్ని ఏర్పాటుచేయాలన్నారని బాలాంత్రపు శేషమ్మ తెలియజేసిన విషయాన్ని కూడా పత్రిక అనుబంధంగా ప్రచురించింది.

*స్త్రీలకు సంబంధించిన వార్తలను పత్రికలకు వ్రాసి పదిమందితో పంచుకోవాలన్నా వారిలో చైతన్యం తేవాలన్నా స్త్రీలకు విద్య ముఖ్యమైన ప్రథమసాధనం అనీ, విద్యనేర్చిన బాలికలకు జ్ఞానవార్తలను వ్రాసే నేర్పు కలుగుతుందనీ, పత్రికాప్రచురణ, పత్రికాపఠనం ద్వారా స్త్రీలలో జ్ఞానం అభివృద్ధి చెందుతుందని పత్రిక తెలియజేసింది.*

'నన్ను మఱచినను దేశమును మఱవవద్దు' (అక్టోబరు 1929 భారతి) అనే శీర్షికన ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ వ్రాస్తూ అన్నపూర్ణ వ్యక్తిత్వాన్ని, సంఘసేవను, స్వదేశీదీక్షను పేర్కొని గాంధీ అన్నపూర్ణను గురించి చెప్పిన వాక్యములను ఉటంకిస్తూ ఆమె మరణము వలన కేవలం భక్తురాలనే కాదు, పుత్రికను గోల్పోయినట్లు భావించుతున్నానని గాంధి అన్నట్లు తెలిపింది. "భారత పురంధ్రులలోన అనేకులను నా పుత్రికలుగా భావించుకొనగల భాగ్యమునాకు కలదు కాని వారందరిలో నీమెయే అత్యుత్తమురాలనీ, ఆమె నిశ్చల భక్తితో ఫలాపేక్షను వదలి దేశసేవ గావించిందనీ, భారత నారీమణులెల్లరు పవిత్రహృదయులై ఉండాలనీ, ఆమెవలె దేశారాధనము నందు ప్రాణ సమర్పణము కావించినగాని భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందలేదనుట నిశ్చయమని, అన్నపూర్ణ పేరున స్మారక చిహ్నం ఏర్పాటుచేయుట విధాయకమని" గాంధీ చెప్పిన మాటలను గుర్తుచేసింది.

*స్త్రీలకు దేశారాధన ఉంటేతప్ప దేశస్వాతంత్ర్యం సిద్ధించదని భావించటం జరిగింది. గాంధీ మాటల్లో స్వాతంత్ర్యోద్యమ సాధనలో స్త్రీల భాగస్వామ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఉందని అర్థమవుతుంది.*

సత్యరాజు శ్యామలాంబ చేసిన 'బ్రహ్మకృపాహి కేవలం'? (జులై 1928 హిందూ సుందరి) అనే ఉపన్యాసంలో భారతదేశంలో స్త్రీల భావిజీవితం ఔన్నత్యాన్ని పొందాలంటే బాల్యవివాహాలు తగ్గి, ప్రౌఢవివాహాలు పెరగాలనీ, ఆచారభేదాలు స్త్రీలకు బానిసత్వాన్ని, పరాధీనతను గలిగించాయని చెప్పింది. ప్రౌఢవివాహాలను ఆచరించటానికి బాలికలకు సమస్త విధముల శరీరపోషణ, జ్ఞానపోషణ, చేయాలనీ, స్త్రీలకు వివాహమే మొదటిదిగా చెప్పటంతో వారు తమనితాము బాలమాతలుగా ఊహించుకోవటం జరుగుతోందనీ, వితంతు బాలికలకు తప్ప బాలికలు విద్యను అభ్యసించటం

లేదనీ, స్త్రీ బానిసగా ఉన్నంత వరకు స్త్రీలకు స్వాతంత్ర్యం అనేది ఉండదని తెలియజేసింది. అంతేకాదు, బాలమాతల కాన్పులను, వారి శరీరారోగ్యము గురించి, వారి స్వేచ్ఛలేని సంసార జీవితాన్ని ఆలోచించాలనీ, స్త్రీలకు దాస్యవిమోచనం జరగాలంటే స్వయంకృషితో జ్ఞానధనాన్ని సంపాదించాలనీ, పురుషులు స్త్రీలను పనిముట్లుగా భావించటం తగ్గాలని చెప్పింది. నిర్బంధ వివాహాలు తొలగితేనే స్త్రీలకు స్వేచ్ఛ ఉంటుందనీ, అప్పుడే విద్యాధికురాండ్రుకాగలరనీ, చేతిపనులు నేర్చుకోవాలనీ, ఆర్థిక దుస్థితివల్ల చేసే వేశ్యావృత్తిని నిర్మూలించాలనికూడా చెప్పినట్లు పత్రిక తెలియజేసింది. స్త్రీలను మున్సిపల్, కౌన్సిల్, లోకల్బోర్డులలో మెంబర్లుగా ఉండేందుకు వారు విద్యను నేర్చుకోవాలనీ, స్త్రీలకు శిశుపోషణం, గృహవిద్యయే కాక ముఖ్యమైన దేశాభివృద్ధి విద్య కూడా తెలిసి ఉండాలని తెలిపింది. తండ్రి, భర్తల ఆస్తిలో భాగం ఉండాలనీ, అన్నింటికీ నివారణోపాయంగా స్త్రీలు విద్యాజ్ఞానధనాన్ని పొందితే పురుషులకంటే స్త్రీలు ప్రతి విషయంలో ముందడుగు వేయగలరని కూడా సత్యరాజు శ్యామలాంబ చెప్పింది.

*సామాజికసంస్కృతి మూలాలను వెలికితీస్తూ స్త్రీలబానిసత్వానికి దేశబానిసత్వానికి ఉన్నలంకెను చెప్పి స్త్రీలు శరీరపోషణ, జ్ఞానపోషణ చేసుకోవాలనీ, మున్సిపల్ ఎన్నికలలో పాల్గొని అర్హతను సంపాదించుకుంటే స్త్రీలు పురుషులతోపాటు సమానులవుతారనీ భావించింది. 1919 చట్టం ప్రకారం జరగబోయే మున్సిపల్ ఎన్నికలకై స్త్రీలలో రాజకీయ సామర్థ్యం, పరిపాలనా సామర్థ్య నిర్మాణాలను పెరిగే విధంగాను, ఆత్మవిశ్వాసం పెంచేటట్లుగాను చైతన్యపరచగల వ్యాసమిది. స్త్రీలు మున్సిపాలిటీలలో మెంబర్లుగా ఉండటానికి అవసరమైన దేశసేవాభివృద్ధిని బోధించే విద్యను అభ్యసించాలని చెప్పటమే స్త్రీవిద్యకు పరాకాష్ఠస్థితిగా భావించాలి.*

గుండాల రాజామణి, వ్రాసిన 'బాల్యవివాహ సమస్య' (మార్చి 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో మనదేశ జాతికి, మతానికి, నాగరికతకు కళంకాన్ని ఆపాదిస్తూ భారత శక్తినంతా పీల్చి పిప్పిచేసే 'బాల్య వివాహాల సంస్కృతి'ని ఆమూలాగ్రంగా ఛేదించాలని తెలియజేసింది.

'స్త్రీలు–జాతీయత'ను గురించి (మార్చి 1929 గృహలక్ష్మి) పత్రికాధిపులు వ్రాస్తూ పాశ్చాత్య దేశాలు అభివృద్ధి చెందటానికి కారణం ఆ దేశస్త్రీలు వ్యాయామం, వర్తకం, ఉద్యోగాలు చేయటం, రాజకీయములందు పురుషులతో సమానంగా పాల్గొనటమేననీ, అక్కడ స్త్రీలు, స్వయంగా పురుషులు ఏర్పరచిన కట్టుదిట్టములను ఉల్లంఘించారని పత్రిక తెలిపింది. భారతదేశంలో కూడా స్త్రీలు తమ అభివృద్ధిని గురించి తీవ్రంగా ప్రయత్నంచేయాలనీ, భారతదేశంలో జాతీయత పునరుద్ధరింప బడాలంటే అది ఇంటినుండి ప్రారంభం కావాలని చెప్పింది. జోలపాటలు, స్వదేశీవస్తువుల వాడకం, చిన్నపిల్లల పాఠాలలో స్వదేశాభిమానంవంటి జాతీయభావాలు వ్యాప్తికావాలనీ, స్త్రీలు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో జాతీయాభిమానం వెల్లివిరిస్తే భారతదేశం అభివృద్ధి చెందగలుగుతుందని పత్రిక అభిప్రాయపడటం జరిగింది.

*ప్రతి ఇల్లు, ప్రతి పాఠశాలలనుండి జాతీయాభిమానంతో స్వాతంత్ర్య రథం బయలు దేరాలని భావించింది. కుటుంబ పితృస్వామ్య సంస్కృతిని ఎదిరించమనీ, అదేసమయంలో స్వదేశీ జాతీయతను పెంచుకోవాలని తెలిపింది.*

అయ్యదేవర బాలాత్రిపుర సుందరమ్మ వ్రాసిన 'స్త్రీలు రాజకీయమున పాల్గొను విధము" (ఏప్రిల్ 1929 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే వ్యాసంలో దాదాభాయి నౌరోజి 1906లో కాశీలో 'భారతదేశమునకు స్వరాజ్యమే గమ్యస్థానమని చెప్పారనీ, దేశ స్వరాజ్యం కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ, మరొకప్రక్క బాలగంగధర్ తిలక్, అరవింద ఘోష్, బిపిన్ చంద్రపాల్ వంటి జాతీయవాదులు ఉద్యమం చేసారని తెలిపింది. 1914లో భారతదేశానికి వచ్చిన గాంధీ భారతదేశంలో కైరా, చాంపరానులలో తాను నడిపిన సత్యాగ్రహాన్ని భారతదేశంలోని నాటి ఉద్యమాల్లో చూడగలిగాడనీ, భారతదేశంలో స్వరాజ్య ప్రయత్నంచేసాడని చెప్పింది. తిలక్ చెప్పిన 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని ప్రతిభారతీయుడు భావించాలనీ, దానికై కాంగ్రెస్ ను కార్యక్షేత్రంగా చేశాడని తెలియజేసింది. అంతేకాక ఖద్దరు పరిశ్రమను అభివృద్ధి చేయాలనీ, గాంధీసతి, దాసుసతి, చిత్తరంజన్ దాస్ సతి, నెహ్రూసతి, సరోజినీ, అనసూయజీ, సరళాదేవి, బేగం మహమ్మదాలి, బేగం అన్సారి, బేగం క్వారీ, బేగం హజరత్ మోహని, ఉన్నవ లక్ష్మిబాయమ్మ, దువ్వూరి సుబ్బమ్మల వంటివారు దేశసేవకురాండ్రుగా ఉన్నారని తెలిపింది. స్త్రీలకు రాజ్యాధికారం దొరికినచో స్త్రీలు పురుషుల కంటే అధికధైర్యంతో, అధికనీతితో, అధికన్యాయంతో రాజ్యం చేస్తారని చరిత్ర తెలియజేస్తోందనీ, స్త్రీలు విద్యావంతులై వీరమాతలు కావాలనీ, దేశాభ్యుదయం స్త్రీలపై ఆధారపడి ఉన్నదనీ, పురుషులు తమ స్త్రీలను బాగుచేయాలనీ, అప్పుడే పురుషులు కూడా బాగుపడగలరనీ, స్త్రీల సహాయంతోనే స్వాతంత్ర్య ధ్వజాన్ని ప్రతిష్ఠించి స్వరాజ్యాన్ని సంపాదించగలరనికూడా తెలియజేసింది.

*సత్యాగ్రహంలో స్త్రీల ప్రాతినిధ్యమే దేశస్వాతంత్ర్యాన్ని సాధిస్తుందని భావించింది. స్త్రీలు చదువుకొని జాతీయోద్యమంలో పాల్గొనేసరికి స్త్రీ పురుషులు సమానులేననే భావన స్త్రీలలో పెరిగింది. ఓటుహక్కుగల పరిజ్ఞానంతో స్త్రీలకు రాజకీయాధికారం కావాలనుకోవటమే స్త్రీల రాజకీయ చైతన్యానికి నిదర్శనం. భారతీయులలో స్వరాజ్యఉద్యమానికి సమాంతరంగా ప్రతి ఇంట్లో స్త్రీలకు ముందుగా స్వాతంత్ర్యానిచ్చే బుద్ధి ఉండాలనీ, అపుడే స్వరాజ్యాన్ని పొందగలమని తెలియజేసింది.*

'మదరాసు శాసనసభ యెన్నికలు' (మే 1929, విద్యానంద పత్రిక) అనే శీర్షికన స్త్రీసంఘములు ఎన్నికలలో నిలబడే అభ్యర్థులకు ప్రశ్నావళిని రూపొందించి మద్రాసు ఎన్నికల సంస్థకు పంపించారు. అవి వరుసగా స్త్రీలకు ఉన్నతవిద్యాభివృద్ధికి తగిన సాధనములను సమకూర్చుతున్నారా అనీ, మాతాశిశు వైద్యశాలలను పాఠశాలలలో పిల్లలకు వైద్యతనిఖీనీ ఏర్పాటు చేస్తున్నారా అనీ, శారదాబిల్లును సమర్థిస్తున్నారా లేదా అనీ, పసికూనలను వివాహమాడే

ముసలివానిని శిక్షిస్తారా లేదా అనీ, వరశుల్క దురాచారాన్ని అణగద్రొక్కుతారా లేదా అనీ, 18ఏండ్ల వయసు గర్భాదానాన్ని అంగీకరిస్తారా లేదా అనీ, వితంతు వివాహాన్ని ప్రోత్సహిస్తారా లేదా అనీ, వ్యభిచారంనుండి బాలికా సంరక్షణ, దేవదాసివ్యవస్థ నిర్మూలన, భార్యాభర్తలకు అర్థనీయ వివాహములు, భార్యకు, కుమార్తెకు పారంపర్య ఆస్తిహక్కును కూర్చగలరా లేదా అనీ, మద్యపాన నిషేధం, అస్పృశ్యతానిర్మూలనం, కార్మికస్త్రీల దురవస్థను పోగొట్టే చట్టాలను కలిగిస్తారా లేదా అనీ ప్రశ్నలు రూపొందించి ఎన్నిక కాబడబోయే శాసనసభ్యులయొక్క అభిప్రాయ సేకరణ చెయ్యాలనుకొన్నారు.

*స్త్రీలకు ఓటు హక్కు రాగానే, స్త్రీలసంక్షేమానికి కావలసిన విషయాలను ఎన్నికలకు ముందుగానే శాసనసభ్యులుగా ఎన్నిక కాబోయే వ్యక్తులకు స్పష్టంచేసిన వారి ముందుచూపు ఈనాటి స్త్రీలు గ్రహించగలగాలి.*

పురిటి సూర్యనారాయణమ్మాళ్ వ్రాసిన 'స్త్రీస్వాతంత్ర్యం' (జులై 1929 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు పురుషులు సమానమైనప్పటికీ, స్త్రీ జ్ఞానశూన్యంగా ఉండటంచేత స్త్రీలు ఐకమత్యంతో ఉండటంలేదనీ, స్త్రీలు జ్ఞానాన్ని పొందాలంటే చదువుకోవాలనీ, స్త్రీ పురుషులిద్దరూ చదువుకుంటేనే సంసారపుత్రాసు సమానంగా తూగగలదని చెప్పింది. పూర్వాచారపరాయణులు, మతాచారములు, స్త్రీస్వాతంత్ర్యాన్ని తిరస్కరిస్తున్నారనీ, సంఘసంస్కర్తలు స్త్రీలను చదువుకునేటట్టు చేయగలిగితే, స్త్రీ కొంత స్వతంత్రురాలు కాగలుగుతుందని అభిప్రాయపడింది.

*స్త్రీ, పురుషులకు సమానంగా విద్యను అందించటమే భారతీయ సమాజంలో స్త్రీ స్వాతంత్ర్యానికి చిహ్నంగా భావించవచ్చని అభిప్రాయపడింది.*

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ వ్రాసిన 'స్త్రీవిద్యా విజయధ్వజం' (ఆగష్టు 1929 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశసేవకు, సంఘసేవకు స్త్రీ పురుషుల పరస్పర సహకారం ఉండాలనీ, స్త్రీలు వంచితులవటం వల్లనే దేశపతనం ప్రారంభమైందనీ, స్త్రీలు సర్వహక్కులు గల సహభాగస్వాములని గుర్తించాలని చెప్పింది. పాశ్చాత్యవిద్యలోని 'దేశభక్తిని' నేర్చుకోకుండా వారి వేషభాషలను మాత్రము అనుకరిస్తున్నారనీ, స్త్రీల శ్రేయస్సే దేశశ్రేయస్సనీ, బాలికలే భావిభారత భాగ్యనిర్మాతలనీ 'విదేశీ విద్యాలయాలలో జాతీయవిద్య లభించాలంటే గురుకులాల విద్యాభ్యాసం ఉండాలనీ, దేశసేవ, సర్వసౌభాతృత్వం అభివృద్ధిని కలిగించే చదువులు కావాలని తెలియజేసింది.

*స్త్రీవిద్యాభివృద్ధి జాతీయతతో ముడిపడి ఉండాలనీ, పురుషుల సహకారముంటే స్త్రీలు సంఘసేవ చేయగలరని భావించింది.*

వి.సరస్వతి వ్రాసిన 'స్త్రీస్వాతంత్ర్యం' అనే వ్యాసంలో (సెప్టెంబరు 1929 గృహలక్ష్మి) మనుధర్మ శాస్త్రంలో చెప్పినట్లుగా భారతీయులలో స్త్రీలు బానిసలుగా ఉంటే దేశానికి స్వాతంత్ర్యం ఎలా వస్తుందనీ, స్త్రీకి తన దేహంపై తనకు స్వాతంత్ర్యం లేదనీ, ఒకరికి తమ శరీరాలపై

స్వాతంత్ర్యం లేనప్పుడు మరొకరికి దేశంపై స్వాతంత్ర్యం కావాలా అనీ, పురుషులు స్వాతంత్ర్యాన్ని పొందటానికి ముందు స్త్రీకి స్వాతంత్ర్యం ఉండేటట్లు చూడాలని నొక్కి వక్కాణించింది.

*మనుధర్మశాస్త్రాన్ని విమర్శకు పెట్టటం జరిగింది. స్త్రీస్వతంత్రతయే దేశ స్వాతంత్ర్యానికి ముఖ్యమైన మెట్టని ఆమె అభిప్రాయపడింది.*

కంచి మంగళమ్మ వ్రాసిన "శాంతి" (సెప్టెంబరు 1929 గృహలక్ష్మి) అనే వ్యాసంలో కుటుంబంలో స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబంలో శాంతి ఉంటుందనీ, విద్యావంతురాలైన భార్య భర్తను గొంతెమ్మ కోర్కెలు కోరదనీ, అప్పుడే భార్యభర్తల మధ్య ప్రేమకు ఆస్కారం ఉంటుందని తెలియచేసింది. విగతభర్తృకయైన స్త్రీ విద్యావంతురాలైతే సోదరుల మీద ఆధారపడకుండా స్వతంత్ర జీవనం చేయగలదనీ, స్త్రీ పురుషులు సమానవిద్యా స్వాతంత్ర్యాలుంటేనే కుటుంబంలో శాంతి రాంటుందని తెలియచేసింది.

*కుటుంబంలో విద్యావంతులై, స్వీయపోషకత్వంతో సాధించిన స్త్రీలస్వాతంత్ర్యం, సమానత్వమే శాంతియుతసమాజానికి దేశస్వాతంత్ర్యానికి దారితీస్తుందని ఆమె భావనగా అర్థమవుతుంది. స్త్రీవిద్య పురుషులకు ప్రయోజనకరంగా ఉంటుందనే భావనను వారిలో రేకెత్తించాలనుకొంది.*

'హైందవ స్త్రీ సమస్య' (అక్టోబరు 1929 గృహలక్ష్మి) ను గురించి పద్మావతీ శ్రీరామ్ వ్రాస్తూ నూటికి ఏడుగురు స్త్రీలు చదవనూ, వ్రాయనూ నేర్చియున్నారనీ విద్యావ్యాప్తికి స్త్రీలు కృషిచేయాలనీ, పురుషులకు నేర్పువిద్య స్త్రీలకు పనికిరాదని తెలిపింది. సంగీతం, చిత్రలేఖనం, శిశుపోషణం, ప్రసవవైద్యం ప్రథమ చికిత్స నేర్పించాలని, స్త్రీలందరూ వైద్యవిజ్ఞానాన్ని ఆర్జించి ఉపచారిణులుగా (నర్సులుగా) పనిచేయాలనీ, స్త్రీ ప్రచారక సమితి ఏర్పడి స్త్రీలకు ఉచితంగా నేర్పితేనే స్త్రీలుఅభివృద్ధి చెందగలుగుతారనీ, అప్పుడే దేశానికివిముక్తి కలుగుతుందని తెలియజేసింది.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన "స్త్రీ" (అక్టోబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో జాతి అభివృద్ధి స్త్రీపై విశేషంగా ఆధారపడి ఉన్నదనీ, స్త్రీ సంతానాన్ని ప్రసాదించే జీవయంత్రము కాదనీ, స్త్రీకి స్వకీయమైన దేహం, మనస్సు, బుద్ధి కలదు కాని అవి స్వతంత్రము కాక పురుష చిత్తానుసారములుగా ఉన్నాయని భావిస్తున్నారని తెలిపింది. "పురుషుని చిత్తవృత్తికి బద్ధమై స్త్రీ దైహికములైన తన సుఖములను విడనాడుకోవలెను. మానసికములైన తన వాంఛలను జంపుకొనవలెను. బుద్ధిజన్యమైన తన పరిజ్ఞానమును నశింపజేసికొనవలెను" అని స్త్రీ సమూలముగా పురుషుని అంతఃకరణమునకు లోబడియుండుట యావత్ప్రపంచమున బహుకాలము నుండి చెల్లుబడియైన ప్రభుత అని తెలియజేసింది. అంతేకాక, ఇప్పుడిప్పుడే స్త్రీలకు స్వాతంత్రం పొందాలనే ఊహ కలుగుతోందనీ, స్త్రీలకు విద్యాప్రదానమే స్వాతంత్ర్యం అనీ, విద్య అనే తాళంచెవితో మూయబడిన స్త్రీ జ్ఞానకవాటం తెరుచుకోవటంతో నిద్రాణస్థితిలో ఉన్న స్త్రీల శక్తి, సామర్థ్యాలు బయటపడుతున్నాయనీ, అందుకనే స్త్రీకి స్వాంత్రత్యం ఇవ్వటానికి పురుషుడు తన ఆధిపత్యాన్ని

కుదించుకోవాలని చెప్పింది. అంతేకాదు పాశ్చాత్యస్త్రీలవలె విద్యా, వైవాహిక, మత, రాజకీయ స్వాతంత్ర్యాలను భారతదేశ స్త్రీలు పొందాలనీ, దానికై సాంఘికాచారాలు అడ్డుకట్టగా ఉన్నాయనీ, వాటిని తొలగించాలని పిలుపునిచ్చింది. స్త్రీ, పురుషుని సొత్తు, బానిస అనే భావాలు పోవాలనీ, సాంఘిక వ్యవస్థ చక్కబడి స్త్రీల తోడ్పాటు ఉంటేనే దేశ స్వాతంత్రం వస్తుందనీ, స్త్రీశక్తి మేలుకొంటే స్త్రీలకు స్వతంత్రజీవనమే కాక భారతదేశపు దాస్యశృంఖాలాలను కూడా తెంపగలుగుతుందని తెలియజేసింది.

*స్త్రీ విద్యకు, స్త్రీల శక్తి సామర్థ్యాల వెలుగుకు, స్త్రీస్వతంత్రతకు, దేశస్వాతంత్రానికి ఉన్న లంకెను స్పష్టం చేసిన వ్యాసమిది. (ఇక్కడ 2-12-1930 న చలం 'స్త్రీ' అనే నవల యొక్క ముందుమాటగా పెట్టిన 'స్త్రీకి శరీరం ఉంది దానికి వ్యాయామం కావాలి, స్త్రీకి హృదయం ఉంది దానికి అనుభూతి కావాలి, స్త్రీకి మెదడు ఉంది దానికి జ్ఞానం కావాలని చెప్పిన మాటల క్రమానికున్న పునాది ముందే ప్రచురితమైన ఈ వ్యాసంలో ఉన్నదని అర్థం అవుతుంది.)*

'ఆంధ్రదేశ స్త్రీవిద్యాసంస్థలు' (అక్టోబరు 1929 గృహలక్ష్మి) అనే శీర్షికన స్త్రీలకోసం పెట్టిన విద్యాసంస్థలను గురించి పత్రికాధిపులు తెలియచేస్తూ రాజమండ్రిలో 'వైశ్యసేవాసదనాన్ని' వైశ్యస్త్రీల అభివృద్ధికోసం 1920 లో నాళం రామలింగయ్యగారు స్థాపించారనీ, వాఙ్మయం, వైద్యం, లలితకళలు, కార్మికవిద్యలు నేర్పేవారని తెలియజేసింది.

1922 వ సంవత్సరమున గుంటూరులో స్త్రీలకు ఉన్నతవిద్యను గడపటానికి 'శ్రీ శారదా నికేతనము' ఉన్నవ లక్ష్మీబాయమ్మ చేత స్థాపింపబడిందనీ, దానిలో 8 సంవత్సరముల విద్యావిధానం ఉందనీ, మొదటి ఐదు సంవత్సరములు సాహితీ ప్రకరణమనీ, చివరి మూడు సంవత్సరములు విదుషీ ప్రకరణమని నిర్ణయింపబడింది. చదవను, వ్రాయను వచ్చిన బాలికలకు సాహితీప్రకరణలో ప్రవేశం కల్పిస్తారనీ. సంస్కృతాంధ్రాలతోపాటు, ఆంగ్లం గానీ, హిందీని గాని ఆభిమాన భాషగా తీసుకొనవచ్చుననీ, ఆయా భాషలలో ఉత్తీర్ణులైతేనే విదుషీ పట్టభద్రులవుతారని పత్రిక తెలియజేసింది.

నెల్లూరులో 'కస్తూరిదేవివిద్యాలయాన్ని' 1923 లో పొణకా కనకమ్మ స్థాపించారనీ, జాతీయపద్ధతిలో ఉచిత విద్యను అందిస్తూ, తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషా విద్యలును, రాట్నం, ఫేముపని వంటి పరిశ్రమలు, సంగీతం, యోగాను నేర్పుతూ గృహిణులైన స్త్రీలకు కూడా ప్రవేశం కల్పించారనీ తెలియజేసింది.

కాకినాడలో 1924లో మహిళా జాతీయవిద్యాలయంగా స్త్రీల పురోభివృద్ధికై 'విద్యార్థినీ సమాజము' నెలకొల్పబడిందనీ, విద్యాలయంయొక్క యాజమాన్యంలో సభ్యురాలైన బాలాంత్రపు శేషమ్మగారి ఆధ్వర్యంలో 'హిందూసుందరి' అనే పత్రిక వెలువడిందని తెలిపింది. దీనిలో సంస్కృతం, హిందీ పరీక్ష, కుట్టుపని, సంగీతం, ఊలుపని, నేర్పబడుతుందనీ, ప్రభుత్వంవారిచే ఈ విద్యాలయం

గుర్తింపబడిందనీ, దీనిలో ఉన్న గ్రంథాలయానికి రాజ్యలక్ష్మి పుస్తక భాండాగారమని పేరును పెట్టటం జరిగిందని తెలియజేసింది.

1927లో గుంటూరు నందు మాజేటి శ్రీరాములుగారు స్థాపించిన 'వైశ్యయువతీ విద్యాలయాన్ని' మాజేటి శేషమాంబ అభివృద్ధిపరచి పట్టణంలోనేకాక చుట్టుపక్క గ్రామాల నుండి వచ్చిన బాలికలకు చిత్రలేఖనం, సంగీతం, యంత్రపు కుట్లు, నేత్రవైద్యం, రాట్నం, తెలుగు, ఇంగ్లీషు, గణితం దేశచరిత్రలు వంటివి నేర్పించేవారనీ, విద్యను ఉచితంగా నేర్పటమేగాక బీదబాలికలకు ఉచితభోజనసౌకర్యం కూడా ఏర్పాటుగావించారని పత్రిక తెలియచేయటం జరిగింది.

1922 నుండి ఆంధ్రదేశంలో స్త్రీలే పాఠశాలలను నెలకొల్పి బాలికల విద్యాభివృద్ధికై కృషిచేయటం భారతదేశ మానవాభివృద్ధి సూచికలో స్త్రీవిద్యయొక్క భాగస్వామ్యాన్ని గుర్తించగల ఒక విశేషస్థానంగా భావించాలి.

అట్లూరి వేంకటసీతమ్మ వ్రాసిన 'బాల్య వివాహాల నిషేధము' (అక్టోబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో బాల్య వివాహాల వల్ల స్త్రీలు చదువుకోలేకపోవటమే గాక, మాతృస్థానంలో ఉన్న స్త్రీ తన ఆరోగ్యాన్ని కాపాడుకోలేని స్థితిలో ఉంటే ఇంకా శిశుసంరక్షణ ఎలా చేయగలుగుతుందో ఆలోచించమని చెప్పింది.

మాతాశిశు సంరక్షణ దేశాభివృద్ధికి ఒక సూచిక అనే విషయాన్ని ఆనాడే స్త్రీలు గ్రహించగలిగారు.

అయ్యదేవర బాలాత్రిపురసుందరి వ్రాసిన 'స్త్రీలు-గృహ పరిశ్రమలు' (అక్టోబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో హైందవ గృహపరిశ్రమలయొక్క నాశనంవల్ల విదేశీవర్తకులు భారతదేశంలో లాభాలను ఆర్జిస్తున్నారని తెలిపింది. స్త్రీలు రాట్నం వడికి స్వదేశీవస్త్ర తయారీ చేయాలనీ, అప్పడే స్త్రీలు పురుషునితో పాటు ధనార్జనమున భాగస్వాములౌతారని, అది ఆర్థికంగా దేశమునకు ఉపయోగపడుతుందనీ, స్త్రీలు సోమరితనాన్ని తగ్గించుకొని గృహపరిశ్రమలకు పాటుపడాలని పిలుపునిచ్చింది. స్త్రీలకు గృహపరిశ్రమల ద్వారా ఆర్థిక స్థోమత పెరుగుతుందనీ, తద్వారా విదేశీవర్తకం నశిస్తే బ్రిటిష్ అధికారానికి తూట్లు పడతాయనీ, దానంతట అదే దేశస్వాతంత్ర్యానికి దారి ఏర్పడుతుందని తెలిపింది.

*స్త్రీల యొక్క ఆర్థికస్వావలంబన స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి చిహ్నమని భావించింది. స్త్రీలు తయారీ, ఉత్పత్తి రంగాలలో పాల్గొనాలనీ, తద్వారా స్త్రీల స్వయం పోషకత్వంతో పాటు దేశీయాభివృద్ధి కూడా జరుగుతుందని చెప్పి, ఆర్థికస్వాతంత్ర్యానికి దేశస్వాతంత్ర్యానికి ఉన్న లంకెను తెలియజేసింది. మార్కెట్టుశక్తుల విజృంభణగల నేటికాలానికి యిది చాలా ఉపయోగపడే విషయం. అంతేకాదు మానవాభివృద్ధిసూచికలో ఆదాయానికి, స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్యానికి ఉన్న విలువ అర్థమవుతుంది.*

మద్దాలి సీతారామమ్మ వ్రాసిన 'బాల్యవివాహములు' (నవంబరు1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో వివాహవయోనిర్ణయబిల్లు వచ్చిందనీ, వివాహాల విషయాలలో యువతీ యువకులకు

తమ వివాహాన్ని గురించి నిర్ణయించుకునే అధికారం ఉంటుందిగాని తల్లిదండ్రులకు కాదనీ, బలవంతపు బాల్య వివాహాలు చేయవద్దని తెలియజేసింది.

*శారదాచట్టంవల్ల స్త్రీల కుండే వైవాహిక హక్కును తెలియజేసింది. స్త్రీలకు నిర్ణయాధికారం ఉండటమే స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్యానికి చిహ్నం.*

'డా.కొటికల లక్ష్మమ్మ' (నవంబరు 1929 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ బళ్ళారికి చెందిన ఆమె సాంకేతిక విద్యాసముపార్జనానికై ఢిల్లీ, బొంబాయిలో వైద్యవిద్యను అభ్యసించిందనీ, సంఘసేవాభిలాషతో ప్రజాజీవనంలో పాల్గొన్నదనీ, బొంబాయి రాష్ట్రీయ ఆంధ్రమహాసభను ఏర్పాటుచేసిందని తెలియజేసింది. అంతేకాదు, హార్టాంగుకమిటీ వారి నివేదిక ప్రకారం ఆంధ్రప్రాంతములో స్త్రీ విద్య వెనుకబడి యున్నదనీ, 1917–22 మధ్య బాలికాపాఠశాలలు ఏర్పాటైనా, బాలురసంఖ్యలో నాల్గవవంతు మాత్రమే బాలికలే విద్యను నేర్చుకుంటున్నారనీ, స్త్రీ విద్య అభివృద్ధి చెందటానికి ప్రతి రాష్ట్రమునందు స్త్రీ విద్యాధికారిణి ఉండాలని చెప్పింది. స్త్రీలు మున్సిపల్ సంఘములలో, తాలుకా బోర్డులో, జిల్లాలు, మండలబోర్డులో సభ్యురాండ్రుగా ఉండాలనీ, వీలైతే వితంతువులకు నిర్బంధ స్త్రీవిద్యను ఏర్పాటుచేయాలనీ, స్త్రీలనైతిక, శారీరాభివృద్ధికి ఉపయోగపడే విద్యను నేర్పించాలనీ, మతపరమైన జ్ఞానం స్త్రీలకుండాలని తెలియజేసింది.

*స్త్రీలు విద్యావంతులై విద్యాధికారిణిగా ఉంటూ మున్సిపల్ బోర్డులలో సభ్యులై స్త్రీవిద్యను ప్రోత్సహించే విధంగా స్త్రీలు ప్రజాజీవనంలోకి రావాలని పిలుపునిచ్చినట్లుగా పత్రిక తెలియజేసింది.*

కొడాలి సీతారామదేవి 'గృహకృత్య విజ్ఞానం' (నవంబరు 1929 గృహలక్ష్మి)ను గురించి వ్రాస్తూ స్త్రీలు గృహనిర్వహణలో పరిశుభ్రత పాటించాలన్నా, ఆరోగ్యాన్ని యిచ్చే పాకములు చేయాలన్నా శిశుసంరక్షణలో పరిశుభ్రతపాటించాలన్నా, శిశుపోషణానికై పుష్టికర ఆహారం అందించాలన్నా గృహవిజ్ఞానం స్త్రీలకు అవసరమని తెలిపింది. ఇంట్లో క్రమపద్ధతిలో వస్తుసంరక్షణ చేయాలన్నా, దాసదాసీజనాలతో మానవసంబంధాలు నెరపాలన్నా స్త్రీలకు గృహవిజ్ఞానం అవసరమని తెలియజేస్తూ గృహయాజమాన్యానికి, ఇంటి కీర్తికి, గౌరవానికి స్త్రీవిద్య అవసరమని తెలియజేసింది.

*నేటి గృహవిజ్ఞానశాస్త్ర విద్యాపాఠ్యాంశాలను ఆనాడే స్త్రీలు నిర్ణయించారు.*

కొత్తపల్లి కౌసల్యాదేవి వ్రాసిన 'స్వయంకృషి–స్వతంత్ర జీవనము' (డిసెంబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో స్వీయశక్తి, స్వయంకృషితో నూలువడికి, రాట్నం తిప్పి ఖద్దరుధారణ చేయటమే స్వతంత్ర జీవనానికి నిదర్శనమని తెలియజేసింది.

*సత్యాగ్రహ ఉద్యమంలో ఖద్దరు తయారీ, ఖద్దరు వస్త్రధారణకై ప్రచారం జరగటం ముఖ్యం. స్త్రీలస్వీయశక్తి వినియోగం వారి స్వతంత్ర జీవనవిధానానికి బాటలు వేస్తుందనీ, అదే దేశ స్వాతంత్ర్య సాధన అనీ, రెండింటికి ఉన్న అనుబంధాన్ని స్పష్టపరిచింది.*

ఆలపాటి సీతమ్మ వ్రాసిన 'స్త్రీల హక్కులు-తత్సంస్కరణములు' (డిసెంబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో స్త్రీలుకూడ పురుషులవలె శక్తినిజూపే స్వాతంత్ర్యాభిలాషతో ఉన్నారనీ, స్వాతంత్ర్యం స్త్రీల జన్మహక్కు అనీ, స్త్రీలకు గౌరవాన్ని ఇవ్వాలనీ, స్త్రీలు విద్యావంతులు అవుతున్నారనీ, వారి హక్కులు పునర్వికసితములు కావాలని తెలిపింది. ప్రస్తుత శతాబ్దంలో హరివిలాస శారదగారు పెట్టిన బిల్లును వివాహ వయోనిర్ణయచట్టంగా తెచ్చి స్త్రీలోకానికి ఉపకారం చేశారనీ, అవిభాజ్యపు కుటుంబాలలో భర్త మరణానంతరం భార్యకు భరణమిచ్చే ఆచారాన్ని రూపుమాపే విధంగా శ్రీహరిశంకరగారు పెట్టిన వారసత్వపు బిల్లులో భర్త ఆస్తిని భార్య, తత్సంతానం అనుభవించే విధానాన్ని చట్టం అయ్యే విధంగా రూపొందించి సామ్రాజ్య శాసనసభలో పెడుతున్నారని తెలియజేసింది.

*స్త్రీలకు ఆస్తిహక్కును యివ్వగల చట్టాన్ని రాష్ట్ర శాసనసభలలో ప్రవేశపెడుతున్నారని చెప్పి, అవి స్త్రీలకు ఎలా ఉపయోగపడతాయే తెలియజేయాలనుకోవటం అంటేనే స్త్రీల యొక్క సాంఘిక, ఆర్థికహక్కులను తెలియచేయటమే. కుటుంబంలో భర్త శాసకుడిగా ఉండే కుటుంబస్థితి నుండి స్త్రీలు శాసనసభలలో తమ జీవితాలకు మార్పును కలిగించగల శాసనాలను గురించి తెలుసుకొనే స్థితికి చేరుకోవటమే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యోద్యమ సాధనాక్రమంలో అభివృద్ధిని సాధిస్తున్నట్లుగా అర్థమవుతుంది.*

కొంగర అన్నపూర్ణ వ్రాసిన 'వరశుల్కం' (డిసెంబరు 1929 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో యువకులు చదువుకుని, ఆడపిల్లలు చదువుకోక పోవటం చేతనే వరశుల్క సమస్య ఏర్పడిందనీ, స్త్రీ పురుషులలో చదువుకొన్న యువకుడికి కట్నం ఎక్కువ ఇవ్వాల్సివస్తోందని చెప్పింది. సమాజంలో, కుటుంబాలలో స్త్రీలు ద్వితీయ స్థానంలో ఉండటానికి కారణం స్త్రీల అవిద్య అనీ, అందుకే వరకట్నంగా నష్టపరిహారాన్ని ఇవ్వవలసివస్తోందని తెలియచేసింది.

*సామాజికకుటుంబ వ్యవస్థలో స్త్రీవిద్యా ప్రాముఖ్యాన్ని తెలిపి, స్త్రీలు అవిద్యావంతులుగా ఉండటంచేతనే సమాజంలో స్త్రీలు ద్వితీయస్థానంలో ఉన్నారనీ, అదే వరశుల్కాలకు కారణం అవుతోందని గుర్తించమని తెలియజేసింది. ఆనాడే స్త్రీలు తమ సామాజికహోదాకు ఉన్న విలువను గుర్తించటం జరిగింది. స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యపువిలువలను అంచనా వేసుకోవటం జరిగింది.*

తుర్లపాటి రాజేశ్వరి 'బెజవాడలో జరిగిన ఆంధ్ర మహిళాసభలో (డిసెంబరు 1929 గృహలక్ష్మి పత్రికలో) ఇచ్చిన ఉపన్యాసంలో స్త్రీవిద్య మిగులు అధోగతిలో ఉందని 'హార్టాంగ్' కమిటీ సూచించిందనీ, ప్రొ. కార్వేగారు మహరాష్ట్రలో హైందవస్త్రీల విశ్వవిద్యాలయం స్థాపించారనీ, మద్రాసులో క్వీన్ మేరీ కళాశాల ఏర్పడిందని తెలిపింది. బాలికలకు ఉన్నతవిద్యను అందించగల పాఠశాలలు పెడుతున్నారనీ, స్త్రీలకు దేశభక్తిని పెంపొందించే విద్య అవసరమని

చెప్పింది. అంతేకాదు భర్తయొక్క ఆస్తి భార్యకు చెందటమే కాక, తండ్రి ఆస్తి కూడా కుమారులతో పాటు కూతుళ్ళకు సమానంగా ఇవ్వాలని చెప్పింది. మున్సిపాలిటీలు, లోకల్ బోర్డులలో స్త్రీలకు కొన్ని ప్రత్యేక స్థానాలు ఇవ్వాలనే చట్టం తయారు చేయబడాలని కూడా చెప్పింది.

*కూతుళ్ళకు పుట్టుకతోనే కొడుకులతోపాటు సమానంగా ఆస్తిహక్కు ఏర్పడితే స్త్రీ, పురుష సమానత్వం ఉంటుందని భావించటం జరిగింది. ఈమె ఆలోచనయే 1985 లోనూ, దాని సవరణగా 2005 లోనూ చట్టం రూపంలోకి వచ్చింది. స్త్రీల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యమే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి చిహ్నమని భావించింది.*

బెజవాడలో జరిగిన ఆంధ్రమహిళాసభలోనే డా.ముత్తు లక్ష్మీరెడ్డి చేసిన ఉపన్యాసంలో (డిసెంబరు 1929 గృహలక్ష్మి) రాజరామమోహనరాయలు, కందుకూరి వీరేశలింగం వంటి పురుషులే స్త్రీలపై సానుభూతి చూపిస్తూ స్త్రీల అభివృద్ధి, స్వాతంత్ర్యం కోసం పాటుపడుతున్నారనీ, స్త్రీలకు వోటింగ్ అధికారాన్ని విస్తరింపచేయాలనీ, వివిధ ప్రభుత్వ విధానాలకు, సాంఘిక పరిస్థితులకు పరస్పర సంబంధం ఉంటుందని తెలిపింది. మాంటేగ్యూ–ఛేమ్స్ ఫర్డు సంస్కరణల వల్ల స్త్రీలకు మున్సిపాలిటీలో సభ్యులుగా ఉండే అధికారం ఏర్పడిన నాటి నుండి స్త్రీలలో అపూర్వమైన సంచలనం కలిగి సాంఘిక, ఆర్థిక విద్యావంతులై, స్వీయపోషకత్వాన్ని పొందుతున్నారనీ, రాజకీయవిషయాలలో స్త్రీలు పాల్గొంటున్నారనీ, స్త్రీలు దేశాభివృద్ధికరమగు ఉద్యమాలలో పాల్గొంటున్నారని తెలియజేసింది. స్త్రీలలోని సంపూర్ణ శక్తులన్ని విజృంభించాలంటే స్వాతంత్ర్యం అవసరమని ఆమె చెప్పినట్లుగా పత్రిక తెలియజేసింది.

అనుబంధంగా, అదే సభలో చేసిన తీర్మానాలుగా పత్రిక తెలియజేస్తూ బాల్యవివాహ నిషేధమైన శారదాచట్టం అమలును, తండ్రి, భర్త సొత్తులో స్త్రీలకు వాటా, గర్భాదాన వయోనిర్ణయం చేయాలనీ, ఖద్దరు వంటి దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహాన్నివ్వాలనీ, డా. ముత్తు లక్ష్మీరెడ్డిగారి 'దేవదాసీ సేవా నిషేధ' చట్టం అమలులోకి రావాలని, హిందు మహ్మదీయుల ఐక్యత, అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేధం కోసం పాటుపడాలనీ, ఆంధ్రదేశంలో గ్రామగ్రామాలలో స్త్రీల సేవాసదనాలను ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానాలు చేశారనికూడా పత్రిక తెలియజేసింది.

*ప్రభుత్వవిధానాలకు, సాంఘిక పరిస్థితులకు సంబంధం ఉందనీ, స్త్రీల సాంఘిక, ఆర్థిక రాజకీయ భాగస్వామ్యం స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని యిస్తుందనీ, అప్పుడే స్త్రీలు దేశసేవలో పాల్గొనగలరని భావించారు. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని స్పష్టంచేసారు. స్త్రీలకు ఓటింగ్ అధికారం ఉంటేనే మున్సిపాలిటీ సభ్యులుగా సాంఘిక పరిస్థితుల విధానాన్ని నిర్ణయించగలుగుతారనీ, అప్పుడే స్త్రీలు నామనిర్దేశక వ్యక్తులుగా కాక స్వేచ్ఛగా రాజకీయ విషయాలలో భాగస్వాములు కాగలుగుతారని భావించారు. స్త్రీల ఓటింగ్ శక్తికి దేశస్వాతంత్ర్యానికి ఉన్న పునాదిప్రాయమైన రాజకీయలింకును తీర్మానాలరూపంలో ప్రతిపాదించటం జరిగింది.*

1920 నుండి 1929 వరకు వచ్చిన వ్యాసాలలో స్త్రీల ఐకమత్యమే దేశాభిమానమనీ, సత్యాగ్రహ కార్యక్రమాలలో, సహాయ నిరాకరణలో స్త్రీల భాగస్వామ్యం, స్త్రీలస్థితి అభివృద్ధి చెందే మార్గాలను అన్వేషించటం, బాల్యవివాహాల నిర్మూలన, దేశాభ్యుదయానికి స్త్రీవిద్యావశ్యకత, అఖిలభారత మహిళామహాసభల నిర్వహణలో స్త్రీలు అబలలుకారని భావించారు. స్వరాజ్య ఉద్యమాన్ని అవగాహనచేసుకొని స్త్రీలు రాజకీయాలలో పాల్గొనాలని భావించారు. స్త్రీలు తమ ఓటుహక్కుకు ఉన్నవిలువను గ్రహించి ఎన్నికలలో నిలబడే అభ్యర్థులకు స్త్రీల సమస్యలను గురించిన ప్రశ్నావళిని రూపొందించాలనుకొన్నారు. ఖద్దరు తయారీ, ఖద్దరు వస్త్రధారణ, స్త్రీలు విద్యాసంస్థలను  స్థాపించటం, స్త్రీలు ఉద్యోగాలు చేయాలనుకోవటం, దేశ స్వరాజ్య సంపాదనలో స్త్రీల భాగస్వామ్యం, దేశసేవికల స్ఫూర్తి, దేశసేవను బాలికావిద్యలో భాగంగా నేర్పించటం, స్త్రీవిద్యాసంస్కరణలు ఉండాలని భావించారు. ఉమెన్స్ డే సంస్థ యొక్క సభా తీర్మానాలు, ప్రౌఢవివాహాలు, స్త్రీపురుషులకు సమాన స్వాతంత్ర్యాలు ఉండాలనీ, భర్తయొక్క ఆస్తిలో భాగస్వామ్యం ఉండాలనుకోవటం జరిగింది. ఫ్యాక్టరీలను రిజిష్టరు చేయాలనీ, వాటిలో స్త్రీపురుషులకు సమానవేతనాలను యివ్వాలనీ, బాలకార్మికులు ఉండరాదని భావించారు, స్త్రీ సంతానాన్ని కనే జీవయంత్రంకాదనీ, స్త్రీల శరీరానికి,మనసుకు, బుద్ధికీ స్వతంత్రత ఉండటమే స్త్రీల స్వాతంత్ర్యం అని భావించారు. స్త్రీలకు గృహకృత్యవిజ్ఞానం, గృహపరిశ్రమల విజ్ఞానం ఉండాలనీ, స్త్రీల స్వయంకృషి స్త్రీలకు స్వతంత్ర జీవనాన్ని యిస్తుందనీ, స్త్రీల హక్కుల సంస్కరణ జరగాలనీ, భావించారు. వేశ్యావ్యవస్థ, మద్యపానం, వరకట్న దురాచారాలను రూపుమాపాలనీ, మహిళాసభలలో స్త్రీల సాంఘిక, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యాన్ని గురించిన ఆలోచనలను చేయటంవంటి విషయాలతో స్త్రీలను చైతన్యపరిచే వ్యాసరచన జరిగింది.

**కథలు**

క్రీ.శ.20 వ శతాబ్దపు మూడవ దశకంలో సత్యాగ్రహ ఉద్యమప్రచారానికి, ఆడపిల్ల పుట్టుక, చదువు, వివాహం వంటి విషయాలలో స్త్రీపురుష సమానత్వపు హక్కుల సాధనకై ప్రజలలో చైతన్యం కలిగించే దృష్టితో స్త్రీలు 13 కథలను వ్రాసారు.

'హిందూదైవము' (మార్చి1924 అనసూయ) అనే కథలో గుడిపూడి ఇందుమతీదేవి స్వీయానుభవాన్ని కథనంచేస్తూ తాను సింగరేణి నుండి వస్తున్నప్పుడు రైలులో తనకొక మహ్మదీయ యువతితో పరిచయం జరిగిందనీ, ఆమె తనతో మాట్లాడుతూ తమ కుటుంబం పెరుమాళ్ళ యెడల చూపిన నిరాదరణకు ఫలితంగా ఆమెకొడుకు పిచ్చివాడయ్యాడని చెప్పింది. అతనిని ఆవహించిన నరసింహుడు ఆ మహమ్మదీయ కుటుంబంలో తనవిగ్రహాన్ని పెట్టి శుచిగా పూజించమన్నాడనీ, అలా చేయగా అతడికి పూర్వపుమతి వచ్చిందని చెప్పిందట. హిందువులు పీర్లను, మహ్మదును సేవించుచున్నారనీ, ఏ మతములోనైన ధర్మము ఒకటే అని చెప్పింది.

*రచయిత్రి వాస్తవవిషయమన్నట్లుగా వ్రాస్తూ హిందూ మహమ్మదీయ ఐక్యతకు సంబంధించి చైతన్యాన్ని విస్తరింపజేయటం స్పష్టమవుతుంది. హిందూ, మహమ్మదీయుల మధ్యన సఖ్యతను సాధించటం సత్యాగ్రహ ఉద్యమంలో ఒక ప్రధాన అంశం.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'కనకవల్లి' (ఏప్రిల్ 1924 అనసూయ) అనే కథలో ఒకతల్లి అయిదవ తరగతి వరకు చదివిన గారాబు బిడ్డయైన కనకవల్లివి నగలకు ఆశించి వృద్ధవరునికి రెండవ భార్యగా కట్టబెట్టింది. కాపురానికి వెళ్ళిన కనకవల్లి ఒకరోజు పూలు పెట్టుకొన్నందుకు ఆడబిడ్డ మాట్లాడిన మాటలను సమర్థిస్తూ, భర్త కూడా ఆమెను కించపరుస్తూ మాట్లాడేసరికి, ఆమె ఆ ముసలిభర్తతో యమయాతనను అనుభవించలేననీ, భావించి తాను వెళ్ళిపోతానని చెప్పింది. భర్త ఆమె వంటిమీద నగలు లాక్కుని, తలలోనిపూలు పీకివేసి ఆమెను ఇంటినుండి వెళ్ళగొట్టాడు. దానితో ఆమె నూతిలోపడి ఆత్మహత్య చేసుకోదలచి సమాజంలోని తల్లిదండ్రులకు ఒకలేఖవ్రాస్తూ వృద్ధవరులకిచ్చి ఆడపిల్లల గొంతుకోయవద్దనీ, వృద్ధ వరునితో వివాహమైతే ఆ భార్యభర్తల మధ్య అన్యోన్యతకు తావుండే అవకాశం ఉండదని చెప్పి, చిన్నపిల్లలను వివాహమాడవద్దనీ అటు వృద్ధవరులకు హెచ్చరికచేసి చనిపోతుంది.

*ఈ కథలో అయిదవ తరగతి వరకు చదువుకున్న స్త్రీగా ఆమె లేఖవ్రాసిపెట్టి చనిపోవటంతో భర్తకు, ఆడబిడ్డకు జైలు శిక్ష పడుతుందని తెలియజేస్తూ అటు తల్లిదండ్రులకు ఇటు వృద్ధవరులకు హెచ్చరికగా వ్రాసినకథ ఇది. కుటుంబ విషయంలో శిక్షాస్మృతి యొక్క ప్రయోజనాన్ని ఆలోచించటమే గాక చివరిక్షణంలోకూడా ఒకస్త్రీగా బాధ్యతవహించి సమాజంలో చట్టంపట్ల భయభక్తులుండాల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

ఈమెయే వ్రాసిన 'కుటీరలక్ష్మి' (ఏప్రిల్ 1924 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక) అనే కథలో ఒక స్త్రీకి ఆమె యొక్క భర్త మరణానంతరం ఊహించని దారిద్ర్యం వచ్చినా, ఇంట్లోనే రాట్నం త్రిప్పి నూలువడికి తనకాళ్ళమీద తాను నిలబడి పిల్లలను పోషించుకోగలిగిందనీ తెలియజేసే కథ ఇది.

*స్త్రీల స్వయం పోషకత్వానికి, స్వతంత్రంగా జీవించగల స్థితికి చేరుకోవటానికి రాట్నం దారి చూపిందని తెలియజేసే కథ ఇది.సహాయనిరాకరణోద్యమంలో భాగమైన ఖద్దరు ఉత్పత్తి యొక్క ప్రభావం ఒక కుటుంబ ఆర్థికస్థితిని కాపాడింది. జాతీయోద్యమానికి ప్రధాన చక్రమైన రాట్నానికి, కుటుంబ దారిద్ర్యానికి, స్త్రీలస్వావలంబనకు, దేశస్వాతంత్ర్యానికి ఉన్న అనుబంధాన్ని తెలియజేసిన కథ ఇది.సహాయ నిరాకరణోద్యమంవల్ల దేశఆర్థికస్థితి బాగుపడటమే కాక విదేశీవ్యాపారానికి గండికొట్టగలిగి దేశస్వరాజ్యానికై వేసిన ముందడుగుగా భావించవచ్చు. స్వాతంత్ర్యోద్యమ చైతన్య ఫలితాలను ప్రయోగాత్మకంగా నిరూపించిన కథయిది.*

ఈమె వ్రాసిన 'బ్యాంకి బుచ్చిరాజు' (జనవరి, ఫిబ్రవరి 1926 భారతి పత్రిక) అనే ఇంకొక కథలో తండ్రి ఆడపిల్ల పుట్టుక విషయంలో నిరసనను చూపిస్తే, తల్లి భర్తతో తగాదాపడియైన ఆడపిల్లను బాగా చూసుకోవాలని అనుకుందని తెలియజేసింది.

*ఆడపిల్ల పుట్టుకకు ఉన్న విలువ తల్లికి మాత్రమే తెలుస్తుందనీ, తండ్రుల యొక్క లింగ వివక్షా స్వభావాన్ని బయటపెట్టింది. ఆడపిల్లల పెంపకంలో తల్లులబాధ్యతను తెలియజేసింది.*

ఈమె వ్రాసిన "ప్రేమ ప్రభావము" (మే 1927 భారతి) అనే మరొక కథలో తండ్రిని ఎదిరించి కొడుకు ఖద్దరు ఉద్యమంలో పాల్గొనటానికి సిద్ధమైనప్పుడు తల్లి వీరమాతగా మద్దతు పలికిన కథ.

*స్వాతంత్ర్యోద్యమాన్ని బాగా అర్థం చేసుకుని తనకు పాల్గొనే అవకాశం లేకపోయినా కొడుకును ప్రోత్సహించటం ఆ తల్లితనానికి నిదర్శనం. దేశసేవావిషయంలో స్త్రీల భావోద్రేకాలకు, వారి స్వేచ్ఛకు కుటుంబం ఒక సాంస్కృతిక పరిధిని నిర్మించిందని అర్థం అవుతుంది. అంతేగాక దేశస్వాతంత్ర్యోద్యమంలో మాతల పరోక్ష భాగస్వామ్యం గొప్పదనే భావన కూడా కల్పిస్తుంది. కొడుకుమీద ప్రేమ ఉండటమంటే కొడుకును దేశసేవకు పురికొల్పడమేనని స్పష్టమవుతోంది.*

ఈమెయే వ్రాసిన 'దీర్ఘసుమంగళీభవ' (ఆగష్టు 1928 భారతి పత్రిక) అనే కథలో విదేశాలలో చదివి వచ్చినందుకు ఆ యువకుడు ప్రాయశ్చిత్తం చేసుకోనందుకు వూరివాళ్ళు అతడిని, ఆతని తల్లిదండ్రులను ఊరినుండి వెలివేశారు. అయినా వెరవక ఆ యువకుడు వితంతువైన తన చిన్ననాటి స్నేహితురాలిని పెళ్ళిచేసుకున్నందుకు ఆ ఉళ్ళోవాళ్ళకి కోపం వచ్చే సరికి ఆ యువతి పరాశరస్మృతిలోని స్త్రీ పునర్వివాహ ప్రమాణాన్ని చూపించే సరికి ఆమె తండ్రి ఆమెను 'దీర్ఘ సుమంగళీ భవ' అని దీవిస్తాడు.

*స్త్రీ పునర్వివాహాన్ని ఆమోదించటమే తల్లితండ్రుల్లో కూతురి యొక్క వితంతు వివాహ విషయంలో మార్పు వస్తోందని తెలియజేస్తూ, తండ్రులలో పెరగాల్సిన చైతన్యాన్ని తెలియజేసింది. వితంతువు పునర్వివాహం చేసుకుంటే తిరిగి సుమంగళిత్వాన్ని పొందగలుగుతుందని స్మృతి ప్రమాణాలతో నిరూపించి సామాజికోన్నతిని పునర్నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది. స్త్రీల పునర్వివాహం స్త్రీల స్వాతంత్ర్యానికి స్వేచ్ఛనిచ్చే విషయంగా భావించి, స్త్రీల స్వతంత్రతను, దేశస్వాతంత్ర్యానికి మార్గం ఏర్పడటానికిని స్త్రీ పునర్వివాహపు హక్కుకు ఉన్న లంకెను కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.*

రాజ్యలక్ష్మిదేవి వ్రాసిన 'సఫేద్ టోపీ' (మార్చి1926 భారతి పత్రిక) అనే కథ హిందీ నుండి అనువదింపబడినది. ఈ కథలో విదేశీ వస్త్ర బహిష్కరణలో యువకుల భాగస్వామ్యం ఉండాలని తెలియచేసింది.

ఆ. భాస్కరమ్మ వ్రాసిన 'ప్రభావతి' (ఆగష్టు 1926 భారతి పత్రిక) అనే కథలో చదువుకుంటున్న బాలికకు నాటి సమాజ సంస్కృతి ప్రకారం వివాహం చేసినా, పెళ్ళి తర్వాత కూడా ఆ బాలిక చదువుకుంటూ గడిపిందనీ, ఆమె బాలవితంతువు అయినా తాను చదువును కొనసాగించి దేశసేవలో భాగస్వాములు కావాలనుకుందనీ, కాని సమాజసంస్కృతికి తల్లిదండ్రులు లొంగి శిరోముండనానికి పూనుకుంటే ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలియజేసింది.

*స్త్రీలు దేశసేవ చేయాలనుకున్నా సమాజసంస్కృతి దానికి అవకాశం లేకుండా చేసిందని తెలియచేస్తూ ఇక దేశప్రగతి ఎలా ఉంటుందీ అని ఆలోచించమని తెలియజేసిన కథ.*

సి. లక్ష్మి వ్రాసిన 'శాంతి' (జూన్ 1928 భారతి పత్రిక) అనే కథలో యువతీయువకులు ప్రేమించుకున్నా ఆ ప్రేమను దేశాభిమానంగా మార్చుకొని దేశసేవలో తమప్రేమను నిరూపించు కోవాలని భావించారనీ, ప్రేమికులు పరిస్థితులవల్ల విడిపోయినా తమ ఆశయాలకు అనుగుణంగా ఆ ప్రేమను మాతృదేశసేవలో చూపించుకోవచ్చనే ఆదర్శమైన జాతీయ ప్రేమను నిరూపించిన కథ ఇది.

*యవ్వనంలో స్త్రీ-పురుషుల మధ్య గల ఆకర్షణ ప్రేమగా మారుతుంది కాబట్టి ఆ ప్రేమను ఉన్నతీకరించు కోవాలంటే ఆ ప్రేమస్వభావాన్ని వ్యక్తులయందు కాక మాతృభూమి సేవా కార్యములలో దర్శించటమే ఆదర్శప్రేమ అనీ, యువతీ యువకులు మాతృదేశసేవ వైపు మళ్ళించే శక్తి ప్రేమకుంటుందని నిరూపించిన కథ. అప్పుడప్పుడే సమాజంలో చదువుకోవటానికి బయటకు వచ్చిన యువతీ యువకులు పరస్పరం స్నేహం చేయగల వాతావరణం ఏర్పడటంతో యువకుల దృష్టిని మాతృదేశసేవవైపు మళ్ళింపచేయగల కథ ఇది. 'ప్రేమ' జాతీయతతో కూడి ఉంటే దానికి వైఫల్యం ఉండదని తెలియజేసే కథ ఇది. యువతీయువకుల యువశక్తికి ప్రేమకు దేశసేవయే పరమావధి అని స్ఫురింపజేసింది. అదే దేశస్వాతంత్ర్యానికి అవసరమైన యువశక్తి అని భావించటం జరిగింది.*

గుమ్మడిదల దుర్గాబాయి వ్రాసిన "నే ధన్యనైతిని" (జనవరి 1929 భారతి పత్రిక) అనే కథలో తల్లీ, తండ్రి చనిపోతూ భారతాంబ ఋణం తీర్చుకొనే విధంగా దేశసేవను చేయమని చెప్పిన మాటలకు అనుగుణంగా ఆ యువతి చదువుకున్న ఒక వితంతవు స్థాపించిన బాలికా పాఠశాలకు వెళ్ళి స్త్రీవిద్యాభివృద్ధికై పాటుపడుతుంది. ఆ వితంతువు సోదరుడైన ఒక యువకుడు సైమన్ కమీషన్ వచ్చినప్పుడు కలిగిన కల్లోలంలో భాగంగా విదేశీ వస్త్రబహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు అన్నచేత కోపింపబడి, సోదరి పెట్టిన పాఠశాలకే రావటం జరిగింది. ఆ యువతి, ఈ అబ్బాయి కలిసి విద్యార్థినులచేత రాట్నం తిప్పి నూలు వడికించటాన్ని నేర్పిస్తూ ఆ పాఠశాల అభివృద్ధికి పాటుపడుతుంటే ఆ పాఠశాల స్థాపకురాలు ఆమెయొక్క చివరిక్షణంలో స్త్రీ విద్యాభివృద్ధికి, దేశసేవకు వారిని పాటుపడమని మాటతీసుకొంటుంది. తన తదనంతరం ఆ కార్యక్రమం నిరాటంకంగా సాగేటట్టుగా తాను ఏర్పాటు చేయగలిగినందుకు తనజీవితం ధన్యమైందని భావిస్తుంది.

*స్త్రీవిద్యయే స్త్రీలకు స్వతంత్రజీవనాన్ని కలిగిస్తుందనీ, అదే దేశసేవకు, దేశాభివృద్ధికి, దేశ స్వాతంత్ర్యానికి దారి తీస్తుందని బాగా నమ్మిన ఆ స్త్రీ, తరతరాల స్త్రీవిద్యకు తాను చేసిన కృషితో తన జీవితం ధన్యమైందని భావించింది.*

వి.సుబ్బమ్మ వ్రాసిన 'చిట్టి' (అక్టోబరు 1929 గృహలక్ష్మి) అనే కథలో మగవాడి పుట్టుకకు ప్రాధాన్యతనిచ్చి, ఆడపిల్లలను నిర్లక్ష్యం చేయగా అనారోగ్యంతో ఆ పిల్ల చనిపోయిన విషయాన్ని తెలియజేసింది. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో చూపిన 'లింగవివక్ష' స్వభావాన్ని బయటపెట్టింది. ఆడపిల్లల జనసంఖ్యలోని తరుగుదలను ఆనాడే తెలియజేసింది.

*తల్లిదండ్రులదృష్టి ఆడపిల్ల, మగపిల్లల పెంపకంలో సమానంగా ఉంటేనే సమాజంలో స్త్రీ-పురుష సమానత్వం వస్తుందని, ఆడపిల్లలు సక్రమంగా ఎదగగలరని అర్థం అవుతుంది. ఆడపిల్లల ఎదుగుదల దేశాభివృద్ధిలో కీలకమైన విషయం. స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యోద్యమానికి సామాజిక కుటుంబ సంస్కృతిలోని లింగవివక్ష ప్రధానకారణమని గుర్తించటం ఆనాడే ఐక్యరాజ్యసమితి నిర్ణయాలకు స్త్రీ వాదానికి బలమైన పునాది ఏర్పడింది.*

పి.రుక్మిణీబాయి వ్రాసిన 'సుందరి' (అక్టోబరు 1929 గృహలక్ష్మి) అనే కథలో భర్త కనుమరుగయ్యే సరికి సమాజం చేత బాలవితంతువుగా భావింపబడిన బాలిక తాను ఉన్న ఊళ్ళో బ్రతకటం కంటేకూడా ఒంటరిగా కలకత్తాలో గాంధీపాదసేవ చేసుకునైనా బ్రతకవచ్చని భావిస్తుంది. ఉత్తరం వ్రాసిపెట్టి వెళ్ళబోతుంటే ఆ విషయాన్ని గ్రహించిన తల్లిదండ్రులు ఆమెవెంట వెళ్ళడం జరిగింది. అల్లుడ్ని మోసగాండ్రు బలిదానానికి రంగూన్ దేశానికి పంపగా, అక్కడనుండి అతడు తప్పించువచ్చి కలకత్తాకు రావటంతో భార్యాభర్తలు కలుసున్నారు.

*బాలవితంతువుగా సమాజ ఛీత్కారాలను ఎదుర్కోవటంకంటే గాంధీ సేవాశ్రమంలో చేరి దేశానికి ఉపయోగపడాలని బాలవితంతువుల కర్తవ్యాన్ని తెలియచేసిన కథ యిది.*

పెద్దాడ కామేశ్వరమ్మ వ్రాసిన 'ఇది యశాస్త్రీయమా?' (డిసెంబరు1929 గృహలక్ష్మి) అనే కథలో సంతోషంగా జీవించటం మానవహక్కుఅనీ, బాల్యవివాహానంతరం వదిలిపెట్టిన భర్త యిచ్చిన అనుమతి పత్రం ద్వారా, పురుషునివలె స్త్రీ కూడా పునర్వివాహంచేసుకొని సంతోషంగా జీవించటం స్త్రీల హక్కు అని చెప్పింది. ప్రతిస్త్రీకి జీవించే హక్కు ఉంటుందనీ, పురుషులు వివక్షతతో పెట్టిన శాస్త్రభావాలన్నీ అశాస్త్రీయాలనీ, స్త్రీ పునర్వివాహపుహక్కు అశాస్త్రీయం కాదనీ తెలిపిన కథ యిది.

*రచయిత స్త్రీలకున్న పునర్వివాహహక్కు శాస్త్రీయమనీ, దానిని సాధించుకునే మార్గాన్ని సూచించి చైతన్యపరచి పితృస్వామ్యపు కుట్రను బహిర్గతం చేసిన కథ ఇది. అంతేకాదు స్త్రీలకు జీవించే మానవహక్కులు ఉన్నట్లుగా భావింపజేయటంగా ఈ కథ ఆలోచింపజేస్తుంది. 1929 వ సం.లోనే తమ జీవనహక్కుకు, మానవహక్కుకు సంబంధించిన చైతన్యం ఉండటం స్త్రీలలో కలగటం ఆశ్చర్యకరం.*

20 శతాబ్దపు మూడవ దశకంలో వచ్చిన కథలలో స్త్రీలలో దేశాభిమానంతో, స్త్రీలు సత్యాగ్రహోద్యమ నిర్మాణ కార్యక్రమాలలో భాగస్వాములయ్యే విధంగా, ఖద్దరు తయారీ, విదేశీ వస్త్ర బహిష్కరణ, హిందూమహమ్మదీయుల ఐక్యత పట్ల చైతన్యాన్ని కలిగించటం అర్థమవుతుంది. సాంఘికసంస్కరణలలో భాగంగా ఆడపిల్లలయొక్క పుట్టుకకుఉన్న విలువ, వారి చదువు, వితంతుస్త్రీల విద్య, వారి పునర్వివాహంపట్ల సామాజిక బాధ్యత, యువతీయువకుల ప్రేమను దేశసేవలో చూపించాలను కోవటం, భర్తకి ఉన్నట్లుగానే విగతభర్తృకలైన స్త్రీకి కూడా పునర్వివాహాన్ని మానవ హక్కుగా, జీవన హక్కుగా ఉండాలనుకోవటం వంటి విషయాలలో స్త్రీపురుష సమానత్వపు ఆలోచనల చైతన్యాన్ని కలిగించగల కథలు వచ్చాయి.

**నాటకాలు**

ఈ దశాబ్దంలో స్త్రీల సత్యాగ్రహోద్యమ భాగస్వామ్యాన్ని, బాల్యవివాహాలు స్త్రీవిద్యకు ఆటంకమనీ, మాతాశిశుసంరక్షణ ఆవశ్యకతను తెలియజేసేందుకును స్త్రీల సాహిత్యంలో 5 నాటకాలు వచ్చాయి.

గుడిపూడి ఇందుమతిదేవి వ్రాసిన 'ఉపాధ్యాయిని' (జనవరి 1923 అనసూయ పత్రికలో) అనే నాటకంలో ఆంగ్లభాష, ఆంగ్లవేషాలను కట్టిపెట్టి, వచ్చిన జీతంకంటే వ్యయం తగ్గించుకోవాలనీ ఖాళీ సమయాలలో కుట్టుపనులు గానీ, ఉన్నత విద్యనుగానీ నేర్చుకోవాలని బదిలీ పైవెడుతున్న వితంతువైన ఒక ఉపాధ్యాయినికి రైలు ప్రయాణాలలో భాగంగా ఒక స్త్రీచేత చెప్పించటం జరిగింది.

*ఈ నాటక రచనలో స్వదేశీ ఉద్బోధ కనడుతుంది. స్త్రీలు పొరుగూరికి వెళ్ళి ఉద్యోగాలలో చేరుతున్నారని కూడా అర్థమవుతుంది.*

ఈమె వ్రాసిన 'బ్రాహ్మణ కన్యా వివాహ ప్రహసనం' (జూన్1924 అనసూయ పత్రిక) అనే మరో నాటకంలో పాత్రల సంభాషణలలో భాగంగా బాల్యవివాహాలవల్ల స్త్రీలు చదువుకోలేక పోతున్నారనీ, స్త్రీలు అస్వతంత్రులుగా ఉంటే దేశాభ్యుదయం ఉండదనీ, స్త్రీలలో స్వజాత్యాభిమానం కొరవడి చదువుకున్న తోటి స్త్రీలను దూషిస్తూ ఉన్నారని గుడిపూడి ఇందుమతి తెలియజేసింది.

*సమాజంలో స్త్రీల ఆలోచనలలోని దోషాన్ని గుడిపూడి ఇందుమతిదేవి వేలెత్తి చూపించింది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'పురిటిగది' (ఏప్రిల్ 1923 శారద) అనే నాటకంలో స్త్రీల సంభాషణలో భాగంగా భర్త డాక్టరైనాకూడా అతడు తన తల్లిమాటవిని చీకటిగదినే పురిటిగదిగా ఉంచేసరికి, ప్రసవం కష్టమైందనీ, ఒక దొరసానివచ్చి గర్భిణిని ఆ గది నుండి బయటకు తీసి ప్రసవంచేసి శిశువును కాపాడినదని తెలియజేసింది. మూర్ఖంగా పాతసాంప్రదాయాన్ని ఆచరించకుండా గాలి, వెలుతురు వచ్చేగదినే పురిటిగదిగా చూడాలనీ, 'గాలి' ప్రాణాధారమని అందరూ గ్రహిస్తే, మాతా, శిశు ఆరోగ్యం సంరక్షింపబడుతుందని ఆరోగ్యకరమైన మానవజాతి సృష్టిజరగాలని చెప్పింది.

*మాతా, శిశు ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరలక్ష్మమ్మ ఆ నాడే తెలియజేసింది.*

అయ్యదేవర బాలా త్రిపుర సుందరి వ్రాసిన 'ఖద్దరు' (జూన్ 1928 హిందూ సుందరి) అనే నాటకంలోని భార్యా భర్తల సంభాషణలలో భాగంగా కలెక్టరు ఆఫీసులో గుమస్తా ఐన భర్తకు షోకులు, సిగరెట్లు, పాశ్చాత్య వస్త్రధారణ యిష్టమైతే, అతని భార్యకు రాట్నం తిప్పి నూలు వడకటం, ఖద్దరు వస్త్రధారణ వంటివాటిని నిరంతరం యిష్టపడుతుందని అర్థమవుతుంది. దానికై ఆ భర్త భార్యను హేళన చేస్తూ తక్కువగా చూసేవాడనీ, అయితే అతనికి రోగం వచ్చి ఆఫీసుకు వెళ్ళలేక జీతంరాని దుర్భర దారిద్ర్యపరిస్థితిలోఉన్నప్పుడు భార్య రాట్నంవడికి, నూలును అమ్మిన డబ్బులతో ఇంటిని గడపగలిగిందనే సత్యాన్ని తెలుసుకున్న భర్త పశ్చాత్తాపపడి రాట్నపరిశ్రమను నిర్వహించటం తన అభిమాన విషయంగా మార్చుకోవటాన్ని నాటకరచన ద్వారా తెలియజేసింది.

*ఖద్దరు ఉత్పత్తి ప్రయోజనాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించిన సాహిత్యంగా దీన్ని భావించవచ్చు. కొన్నికుటుంబాల సమూహాలే సమాజం, దేశం కాబట్టి ప్రతిఇంట్లో రాట్నము వడికి నూలుతీయటం, ఖద్దరు వస్త్రధారణ చేయగలిగితే అంతిమంగా దేశదారిద్ర్యం వదులుతుందనీ, విదేశీవ్యాపారానికి గండిపడుతుందనీ, అప్పుడు బ్రిటిష్ వారు తమ అధికారాన్ని వదులుకొని పారిపోతారనీ, తద్వారా దేశస్వాతంత్ర్యసాధన సులభమవుతుందని అంచనావేయటం జరిగింది.*

ముస్తా కోటీశ్వరమ్మ వ్రాసిన 'సరిసమానులుగారా' (స్త్రీధర్మ మాసపత్రిక అక్టోబరు 1929) అనే నాటకంలో అక్కాతమ్ముళ్ళ సంభాషణలో భాగంగా, తమ్ముడు పురుషులకు స్త్రీలపై చులకన భావం ఉండటం చేతనే కట్నాల ఆశతో మళ్ళీ పెళ్ళిచేసుకోవచ్చని భార్యను అనుమానిస్తూ స్త్రీలను నిర్దాక్షిణ్యంగా భర్తలు చంపుతున్నా, కోర్టులు కూడా న్యాయంచేయటంలేదని అంటాడు. అదే సమయంలో ఆమె స్నేహితురాలు వచ్చి బాలికలకు చదువు చెప్పించక 12 ఏండ్లకే పెళ్ళిచేసేసరికి భర్త,అత్తల నిరంకుశాధికారానికి స్త్రీలు బలి అవుతున్నారనీ, హిందూదేశంలో మహమ్మదీయుల పాలనలో బాల్యవివాహాలు మొదలయ్యాయనీ, మాతాశిశు మరణాలు భారతదేశంలోనే ఎక్కువ అని అంటుంది. అంతేకాక, కూతుళ్ళకు కూడా చదువు చెప్పించమని తల్లిదండ్రులను కోరుతూ, తోబుట్టువులను వారితో సమానంగా చూడమని సోదరులను వేడుకొంటూ, స్త్రీవిద్య వలననే కష్టాలు తీరుతాయనీ, స్త్రీలకు శాసనసభ సభ్యత్వాన్ని యిచ్చే తీర్మానంచేసారనీ, స్త్రీలు శాసనసభ్యులుగా స్త్రీలయొక్క ఉద్ధరణకు పూనుకోగలరనీ మాట్లాడుకోవటంతో స్నేహితరాండ్ర సంభాషణ ముగుస్తుంది.

*ఈ నాటకంలో సమాజంలోని స్నేహితురాండ్రు కలిస్తే స్త్రీలసమస్యలనే చర్చించుకుంటూ పరిష్కారమార్గాలను అన్వేషించుకుంటుంటారనీ, స్త్రీలశాసన సభ్యత్వమే స్త్రీలసమస్యలకు పరిష్కారమని భావించారని అర్థమవుతుంది.*

ఈ దశాబ్దంలో వచ్చిన నాటకాలలో స్త్రీల అభివృద్ధికి మాతాశిశుసంరక్షణ అవసరమనీ, సత్యాగ్రహ ఉద్యమ ప్రభావంతో ఖద్దరు తయారీతో దారిద్ర్యాన్ని నిర్మూలనంచేయవచ్చనీ, స్త్రీల అస్వతంత్రత తొలగటమే దేశాభ్యుదయమనీ,బాల్యవివాహాలను అరికడితేతప్ప, స్త్రీవిద్యాభివృద్ధి కలగదనీ ప్రజలను చైతన్యపరిచే నాటక రచన జరిగింది.

**కవితలు**

ఈ దశకంలో దేశస్వరాజ్యానికై స్వజాత్యాభిమానాన్ని పెంచుతూ, సత్యాగ్రహ ఉద్యమంలో స్త్రీలు భాగస్వాములయ్యే విధంగాను, స్త్రీవిద్యాభివృద్ధి కోసం బాల్యవివాహాలను అరికట్టే విషయంలోను స్త్రీలను చైతన్యపరిచే13 కవితలు వచ్చాయి.

కొంతమంది స్త్రీలు తమ కవితా గానంతో ఉద్యమంలో పాల్గొన్నా మిగిలిన స్త్రీలు కూడా ఉద్యమంలో పాల్గొనటానికి తగిన చైతన్యాన్ని ఇవ్వటానికి సాహిత్యాన్ని పరికరంగా చేసుకున్నారు. ఆ ప్రయత్నంలో నాటి కవయిత్రులు వ్రాసిన కవిత్వాన్ని తెలుసుకుంటే ఈనాటి స్త్రీలకు 'దేశభక్తి' యెడల గగుర్పాటు కలుగక మానదు.

సహాయనిరాకరణలో భాగంగా ఖద్దరువసన(వస్త్ర) ధారణ బ్రిటీష్ వస్త్రవ్యాపారం పై గండికొట్టే విధంగా భారత స్వరాజ్యలక్ష్మియే ఖద్దరు కట్టినట్టుగా భావించి కనుపర్తి వరలక్ష్మి వ్రాసిన 'స్వారాజ్యలక్ష్మి' (నవంబరు1923 అనసూయ) అనే కవితలో

*'మానసంబెంత చింతలో మఱుగుచున్న*
*జబ్బుచేనొడలస్సి చెడి జడతనున్న*
*మనదు ముద్దు స్వరాజ్యను గనినయంత*
*పోవుచింతయు రుజయును బోవునిజము'*

*"ఖద్ధరు వసనమే సదా గట్టుకొనియు*
*పేరు ముద్దు స్వరాజ్యగా బెట్టుకొనియు*
*సరసగాంధి సందేశంబు సారమేదో*
*యదియ బోధించే నీ బాల నతివ చూడు"*

అని స్వరాజ్యలక్ష్మి కి కవితా తోరణం కట్టింది.

*సహాయ నిరాకరణ ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి పూర్ణస్వతంత్రతను పొందటానికి తగిన ప్రధాన కర్తవ్యంగా గాంధి చెప్పిన స్వదేశీ విద్య, ఖద్దరు ధారణ, హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం వంటి విషయాలను దృష్టిలో పెట్టుకొని తోటి స్త్రీలలో చైతన్యం తేవటానికి చెప్పిన కవితఇది.*

నేమాని భారతీరత్నాకరాంబ 'భారతీ నక్షత్ర మాలిక'లో (ఆంధ్ర కవయిత్రులు, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

*"జాతీయత్వము, దేశభక్తి, స్వమతాచారాభిలాషంబునన్*
*పాతివ్రత్యము, సత్ప్రవర్తనమునన్ సర్వాదరాస్థానమౌ*
*నీతిన్ గార్యములందు శ్రద్ధ యెద నిండారుటన్ మాపయిన్*
*ప్రీతింజేసి యొసగ వేడెదను తల్లీ నిత్యమున్ భారతీ!"* అంటూ

స్వజాత్యాభిమానాన్ని నిరంతరం కాపాడుకోవటమే భారతజాతి రక్షణ అని భావించింది. అంతేకాదు జాతీయతే దేశభక్తిగా భావించి

*"పరదేశానుగతంపు నాగరికతల్ పాటించి, జాతీయతన్*
*వెరపింతేనియు లేక మా పడతుకల్ విద్యావతీ రత్నముల్*
*ధర పాల్చేయుచునున్న వారలుగదా ! దాక్షిణ్య పుణ్యాత్మ వై*
*తరుణీ ! వారలకిచ్చి ప్రోవుమా స్వజాత్యాసక్తిన్ భారతీ"* అని చెప్పటం జరిగింది.

మనమంతా భారతీయులమనే భావనయే భారతదేశ స్వాతంత్ర రక్షణసూత్రమని తెలియజేసింది.

వాడ్రేవు రంగనాయకమ్మ వ్రాసిన 'విద్య లాభమా' (మే 1925 శారద పత్రిక) అనే కవితలో "తెలివినిచ్చు జ్ఞానమిచ్చు కీర్తినిబెంచు హీనదశం దొలగించు నేరుపుంజెలువుగనిచ్చు, శీలము రచించును, గ్రంథము డించుఁబెంచు మైత్రిలతను, నీతి నిల్పు నరుచే! తుదివిద్యను మోక్షరాజ్యముంగలగంగ చేరియుంట, యటుగావున లోకమునందుఁబూరుషల్..." అనీ,

*"లలనలు సత్కళావిభవలక్షణ సంయుతులౌచు మౌఢ్యముం*
*బలువిడంద్రోచి సర్వజనబంధువులై విలసిల్లుదంచునే*
*నెలమిన్ గోరుదానను, మదీయ సహోదరసోదరీగణం*
*బులకును నాకు శారదప్రపూర్ణ దయామతితోడ సత్కళా*
*ఫలమునొసంగుగావుత ధ్రువంబగ నానతులంది పొందుగన్"* అని

ఒక జమిందారుని యొక్క కూతురుగా విద్యాలాభాన్ని తన కవితలో తెలియజేసింది. ఆదిపూడి వసుంధరాదేవి, బి.ఏ వ్రాసిన 'శారద' (జులై 1925 శారద) అనే కవితలో

*"శాస్త్రజ్ఞులు శాస్త్రమ్ములన్నింటి సొంతభాషను వ్రాయజూచుటకును*
*దేశచారిత్రముల్ తేటతెల్లమ్ముగా చదువుయత్నంబులు సలుపుటకును"* అని

స్త్రీవిద్యను ప్రోత్సాహపరచమంటూ శారదాదేవిని స్తుతించింది. స్వభాషలో దేశచరిత్రలను శాస్త్రపరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచే స్త్రీ విద్యకావాలని భావించింది.

వఠ్యం వెంకటానంతలక్ష్మి వ్రాసిన భారతమహిళా తారావళి (స్త్రీధర్మ మాసపత్రిక అక్టోబరు 1925) అనే కవితలో భారతస్త్రీలను గురించి పేర్కొంటూ

"వీరమునుగొనుమాడ్కింజదువ
నేరువరా స్త్రీలు పతులు నియమించినచో...
కాలము మారుచున్నది
స్త్రీల స్వతంత్రంబు హెచ్చు శీఘ్రములోనన్...

జనకుడు చదివినవాడయి
తనయునికైదేండ్ల యపుడు దగువిద్యనిడుం
జననియె చదివినదగుచో
బనిలేదొకపాఠశాల భారతమహిళా !

పదునేడుకోట్ల యువతుల
మదితలంపకయే స్వతంత్రమణి గోరెదరా
సుదతుల హక్కులుపురుషుల
వదలునె యెన్నాళ్ళకైన భారతమహిళా !

బాలికలు విద్యనేర్వక
గాలము పోనీయకుండు ఘనశాసనమల్
మేలగురీతినిసల్పగ
పాలకులనుగోరవలదె భారతమహిళా !

అతిబాల్యవివాహములన్
సతులకు వైధవ్యమబ్బ చచ్చినయటులౌ
మతిరాని చిన్నబిడ్డలఁబతులకుఁ
గట్టంగవలదు భారతమహిళా !

ఆరోగ్యముతో స్త్రీలను
గౌరవముగ బ్రతుకనిచ్చు ఘనవరమొసగం
గూరిమి స్త్రీవైద్యులపరి
వారంబును గోరుమమ్మ భారతమహిళా !

*సులభముగాదు జయింపగ*

*వెలదులసంఘములు వెలసి వేరుగనవలెం*

*పలువిధములబ్రతియూరంబ్ర*

*బలవలెనుద్యమము ధాత్రి భారతమహిళా !* అని చెప్పిన కవితలో

స్త్రీల విద్య, వితంతు సంస్కృతీ నిరసన, స్త్రీల గౌరవజీవనం, స్త్రీవైద్యురాండ్ర ఆవశ్యకత వంటి విషయాలలో స్త్రీసంఘాలు స్త్రీల ఉద్యమాన్ని పెంపుచేయాలని భావించింది.

'శ్రీ దేవీఅన్నపూర్ణాదేవి స్మృతి' (నవంబరు 1927 భారతి) అనే కవితలో ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ మాగంటి అన్నపూర్ణ మరణానంతరం ఆమెను స్మరిస్తూ (1900-27) ఇరవైఏడు ఏండ్లు మాత్రమే జీవించిన అన్నపూర్ణను గురించి 27 పద్యాలతో స్తుతిస్తూ, అన్నపూర్ణ పెక్కు గ్రంథములను చదివి గ్రంథసారాన్ని వంటబట్టించుకుందనీ "దేశమునకై పుట్టు దేశమునకే చచ్చి తీరవలయు" ననే స్ఫూర్తి సార్థక నామధేయురాలనీ, మాగంటి బాపినీడుగారిని వివాహం చేసుకుందనీ, ఆమెను నమ్ముకొన్న దేశభక్తులకు, సంఘసంస్కర్తలకు దుఃఖాన్ని మిగిల్చిందనీ కవితలో తెలియజేసింది. అంతేకాదు, నిష్కపటత్వం, ఓర్పు, సౌమ్యత, వైదుష్యవివేచనాపటిమ కారుణ్యమనే సొమ్ములను ఆమె ధరించినదనియు, బెంగాలీయులైన దివిజేంద్రనాధుని నాటకాలను తెలుగులో వ్రాసినదనీ, రామకృష్ణుని బోధనలను గ్రహించినదనీ నిర్వాణ గ్రంథరత్నాలను అనువదించిందని కవితలో తెలిపింది. అంతేకాక.

*"కనుగొన దేశసేవకయి గాంధీమహాత్ముడు ఖాదీ దీక్షగై*

*కొని వడిఁగార్యరంగమునకున్ దిగనెన్నడొ, నాడె భర్తతో*

*దనమెరికాకుఁబోవుట చటాలున మాని మహాత్మునాజ్ఞఁగై*

*కొని దిగికార్యభూమిని నకుంఠిత సేవ యొనర్చి మించితే"*

అని స్మరించి ఒక్క సంవత్సరంలోనే ఆమె'మోహన్దాస్ ఖాదీ పరిశ్రమాలయమును' స్థాపించిందనీ, స్త్రీలకు విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలనే ఆలోచన ఆమెకు ఉండేదనీ పద్యాలరూపంలో కొనియాడింది.

*సహాయనిరాకరణోద్యమంలో మాగంటి అన్నపూర్ణాదేవి సేవలు చిరస్మరణీయాలు, స్ఫూర్తిప్రదాయకాలని అర్థం అవుతుంది. సహాయ నిరాకరణోద్యమానికి తన వైవాహిక జీవితాన్ని పణంగాపెట్టి అలసిపోయి అనారోగ్యంతో ప్రాణాలను వదలిన అన్నపూర్ణాదేవి స్త్రీల స్వాతంత్ర్యోద్యమంలో చిరస్మరణీయంగా నిలిచింది. ఉద్యమ స్త్రీల సంస్కృతికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తిగా ఆమెను స్తుతించటం జరిగింది.*

కాలనాధభట్ల సూర్యప్రకాశమ్మ 'ఆంధ్రమాత' (అనసూయ ఏప్రిల్ 1928) అనే కవితలో ఆంధ్రదేశ స్త్రీలను గురించి ప్రశంసిస్తూ

*"దాతృత్వమునను కాంతలు గొప్ప వారన*
*డొక్కా సీతమ్మ తానొక సాక్షి*
*రాజకీయంబుగ రమణులే నిధులన*
*నలసరోజనీదేవి వెలయుసాక్షి*
*బలముచేవనితలు ప్రతిభగాంచిరనంగ*
*నువిదతారాబాయి యొక్క సాక్షి*
*చదువుచే లేమలు సత్కీర్తి గొనిరన*
*నచ్చమాంబాదేవి యరయసాక్షి*
*సదృశము తాము గాంచియు సకల వనిత*
*లకును గొప్ప గడించిన లలనలెల్ల*
*నీకు బిడ్డలుగాఁగను నెగడినార*
*లఖిలగుణపూత మా తల్లి యాంధ్రమాత!"* అని

*కవయిత్రి పౌరాణిక, పూర్వకాలపు ఆంధ్రచారిత్రక స్త్రీలు, సామాజిక సేవ చేసిన ఆంధ్రస్త్రీల గొప్పతనాన్ని పేర్కొని స్త్రీలలో శక్తి యుక్తులను దేశంకోసం జ్వలింప చేయటం కన్పడుతుంది.*

వెలువోలు వసంతకుసుమావతి 'స్త్రీవిద్య' (మార్చి1929 గృహలక్ష్మి) అనే

*"విద్య నేర్చిన తల్లులు బిడ్డలకును*
*మొదటి నుండియుఁ జాలసద్బోధ కఱపి*
*వీరబుధులుగ వారిఁగావింపఁ గలరు*
*కాన స్త్రీవిద్య దూరంగఁ గాదు మీకు!*

*విద్య నేర్చిన వారలు విరివి జ్ఞాన*
*వార్తలన్ వ్రాయు నేర్పును బడయఁగల్గి*
*జగతి మాహాత్మ్యముల నెన్నొనెలువుకతన*
*బాలికావిద్య దూరంగఁ బాడియౌనె!!"* అంటూ

*కవితలో స్త్రీవిద్యను నిషేధించటం సిగ్గుచేటని, విద్య నేర్చిన స్త్రీ బిడ్డలకు సద్బోధ చేయగలదనీ, విద్యనేర్చుకుంటే జ్ఞానవార్తలను వ్రాయ నేర్చుకోగలుగుతుంది కాబట్టి బాలికావిద్యను నిషేధించకూడదని అభిప్రాయపడింది.*

వెలువోలు వసంతాదేవి "మహాత్మాగాంధీ" ని గురించి వ్రాసిన కవితలో (జులై, గృహలక్ష్మి 1929)

*"సర్వసర్వంసహా జనశ్రవణసుఖము*
*మధురమధుర మ్మహింసానుమాన్యగీత*
*మాలపించు వసంతపికాధిపతివి*
*గాంధి! మముఁబ్రోచు మీపాదకంజరజము.*

*ఖండఖండాంతర స్థితాఖండజనము*
*పూరుషశ్రేష్ఠుడని మిమ్ముఁబొగడుచుండ*
*నతపరాధీన దుఃఖాననమ్ము నందుఁ*
*దెల్లస్మితరేఖ భరతభూదేవి దాల్చు*

*ఈదరిద్ర నారాయణు లీవిధానఁ*
*గోట్లకొలుదిగఁ గూడునుగుడ్డలేక*
*పొందువంతకు నీవెంతొ కుందికుంది*
*రాట్నమొసంగితి తన్నివారణముగాగ*

*సతత సనాతన హిందూమతమ్ము పేర*
*స్త్రీలకును బంచములకును జెప్పరాని*
*స్నిగ్ధవేదనలెన్నెన్నొ కల్గుచుండ*
*మించుమీబోధ వాని వారించు చుండె.*

*మీస్వరాజ్యసంకల్ప మమేయసిద్ధి*
*నందుఁగావుతమని మాదుప్రార్థనంబు*
*అలమహాత్ముల సంకల్పబలమువలన*
*నెట్టికార్యములేని గట్టెక్కకున్నె?"* అంటూ

*గాంధిబోధనలు స్త్రీల, పంచముల బాధలను పోగొట్టవచ్చని భావించింది. సత్యాగ్రహో ద్యమం స్వరాజ్యసంకల్పంతో ప్రారంభించినదని భావించింది. సామాజిక న్యాయ విషయంలో స్త్రీలు, పంచములు సమానబాధితులు అని భావించింది.*

స్థానాపతి రుక్మిణమ్మ వ్రాసిన 'ఝాన్సీ లక్ష్మీబాయి' కవితలో (1929 అక్టోబర్ గృహలక్ష్మి)

*"వీరలోకంబు చచ్చిన వీరబాల*
*లక్ష్మీబాయిని సతత మీయిలాతలాన*
*భరత వనితల హృద్వీథి ప్రబలుచుండ*
*ముదముతోడతఁ జేమోడ్చి మొక్కుదాన"* అంటూ

*వీరనారీ స్ఫురణను గుర్తుచేసి స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీలలో చైతన్యాన్ని కలిగించాలనుకుంది.*

చట్టి రాధమ్మ 'అన్నపూర్ణాదేవి' (నవంబరు1929 గృహలక్ష్మి)ని గురించి కవిత వ్రాస్తూ మాగంటి అన్నపూర్ణాదేవిని ఒక అవతారమూర్తిగా భావిస్తూ

*"శ్రీ ఆంధ్ర గర్భాన స్త్రీరత్నమైపుట్టి బెంగాలు యొడిలోన పెరిగినావు*
*గాంధి బోధల యుద్ధరంగమున దిగుచు రాట్నమును పూని ఖద్దరు గట్టినావు*
*'మమ్ము మరచినాదేశము మరవక'నుచు భర్తతో పల్కి అమెరికా కంపినావు*
*అతడు వచ్చినతోడ నాతని కెదురుగ బోయివూడ్పించి ఖద్దరు పుట్టమిచ్చి*

*కట్టియున్నవి వారాశి గలిపినావు*
*భరతస్త్రీ జాతి యౌన్నత్యమరసినావు*
*మరల వెలయవె సోదరిమమ్ముబ్రోవ*
*ఆంధ్రనారీవతంస! శ్రీ అన్నపూర్ణ!"* అంటూ

*ఆమె స్వాతంత్ర్యదీక్షను దేశభక్తిని కొనియాడింది. దేవుళ్ళను బ్రోవమని అడిగే స్థితి నుండి స్మృతిలో భాగంగా దేశభక్తురాలిని ఒక దివ్యశక్తిగా భావించి కాపాడమని వేడుకోవటం అర్థమవుంది.*

నడివింటి వెంకటరత్నమ్మ వ్రాసిన కవితలో 'శారదాచట్టము' (నవంబరు 1929 గృహలక్ష్మి) ను ప్రశంసిస్తూ

*"ఎన్నోదినాలనుండి మన హిందువులన్ గ్రసియించుచున్నయీ*
*పిన్నతనంపు పెండిళుల పీచమడంచి జగద్ధితంబుగా*
*ఇన్నిదినాల నీవుపొనరించితి, శారద! శాసనంబునిన్*
*సన్నుతిసేయిగావలదె సంతతమున్ భారతాంగనామణుల్*

*మా చిరకాల ధర్మములు మంటను గల్పెదరే శృతి స్మృతుల్*
*నీచపుకార్యమిద్ది తగునేయని పల్కెడు నంచుబల్కు నా*
*పాచిక మాటకారుల విపక్షులనందరి గెల్చినాడవే*
*నీచరితంబు ధన్యమగు నిక్కముగా వినుమమ్మా, శారదా!"* అని

*స్త్రీలయొక్క వివాహవిషయంలో శృతి, స్మృతుల వాక్కులకు గొడ్డలిపెట్టుగా వచ్చిన శారదాచట్టం స్త్రీలజీవితాలలో మార్పును కల్గించగలదనీ, శారదాచట్టం గురించి ప్రజలలో అవగాహన కల్గించటం ఈ కవితోద్దేశంగా భావించవచ్చు. సాంస్కృతిక పరిణామపు విలువలను స్త్రీలు*

*అంచనా వేయగలగటం గొప్ప విషయంగా భావించాలి.*

వి.జ్ఞానాంబ వ్రాసిన కవితలో 'మాగంటి అన్నపూర్ణ' (నవంబరు 1929 గృహలక్ష్మి) కృషిని ప్రేరణగా భావిస్తూ

*"ఖద్దరు ధరియించి కాల్పుడీ పరదేశ వస్త్రంబు లనిన ప్రశస్త వీవు*
*అంటరాని తనంబు మటుమాయ మొనరింప నిరతంబు మదినెంచు నెలత వీవు*
*స్వారాజ్యమే స్త్రీల జన్మహక్కని దెలిపి స్వాతంత్ర దీక్షకై సాగితీవు*
*బీదసాదల జూచి ప్రేమతో సర్వంబు ధారవోసిన యట్టి దాత్రి వీవు*

*విపుల విఖ్యాతి గాంచిన వెలది వీవు*
*సకల విద్యలనేర్చిన చతురవీవు*
*నిన్ను వినుతింప నేరీతి నేర్తుమమ్మ*
*సద్గుణ పూర్ణ! శ్రీయన్నపూర్ణ" అని*

అన్నపూర్ణస్మృతిలో భాగంగా ఆమె యొక్కజాతీయోద్యమ భాగస్వామ్యాన్ని కొనియాడింది. స్త్రీయొక్క సాధ్వీతనంకంటేకూడా ఆమెయొక్క దేశభక్తిని, జాతీయాభిమానాన్ని కొనియాడటమే స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి పరిణామంగా భావించాలి.

*ఈ కవితలలో జాతీయాభిమానాన్ని పెంచటం, స్వరాజ్యకాంక్షను రగిలించటం,దానికై ఖద్దరువస్త్ర ధారణ, అంటరానితనం యొక్క నిర్మూలనవంటి విషయాలను, దేశసేవలో భాగస్వాములైన నాయకా, నాయికల స్ఫూర్తిని కలిగించటం, బాల్యవివాహనిషేధ చట్టం గురించిన అవగాహన, ఆంధ్రస్త్రీల ఔన్నత్యాన్ని కీర్తించటం కనపడుతుంది.*

**నవలలు**

ఈ కాలంలో దేశసంరక్షణకు స్త్రీల త్యాగం, భర్తల స్త్రీలోలత్వం, వేశ్యలలోని మంచితనానికి సంబంధిచిన 2 నవలలు వచ్చాయి.

1924 లో సరస్వతీ శక్తిసంస్థ ప్రచురించిన పులవర్తి కమలావతీదేవి రచించిన 'కుముద్వతి' అనే నవలలో శివాజీతనయుడైన శంభాజీ నరేంద్రుని భోగలాలసత మరియు ఆతని రాజకీయాలకు కుముద్వతి తనపెళ్ళిని పణంగా పెట్టి తనను పెంచిన వారిని కాపాడాలను కుంటుంది. కాని ఆ రాజు దుష్యంతుడు శకుంతలను మోసబుచ్చినట్లుగా మోసబుచ్చాలనుకున్న సమయంలో ఆమెకు సహాయంగా చక్రవర్తియైన రాణాప్రతాపుడు నిలబడగా, నిజాలను అందరికి తెలిసేటట్లుగా చేయాలనుకొన్నది. ఆమె తన సోదరుడైన వీరసేనుడుకి అండగా నిలబడటంమేకాక శంభాజీ నరేంద్రునిచేతనే అతడు తనని రహస్యంగా పెళ్ళిచేసుకున్న విషయాన్ని అందరి మధ్యా అతడు

ఒప్పుకొనేటట్లు చేస్తుంది. ఆమె మహారాష్ట్ర సామ్రాజ్ఞి కాగలిగిందనీ, ఆమె బీదలందరి సమస్యలను తీర్చిన కరుణాంతరంగగా నిలిచిందనీ నవలలో అర్థం అవుతుంది.

*అశ్వవిద్యను తెలిసిన స్త్రీగా ఆమె ఒంటరిగా రాజు దగ్గరికి చేరి తన పెండ్లిని పణంగా పెట్టి బందీయైన తన వారిని కాపాడిన ధైర్యవతిగాను, నీతిమంతురాలిగా ప్రేమను త్యాగం చేసి రాజ్యాన్ని రక్షించిన వనితగాను కుముద్వతి పాత్రను తీర్చిదిద్ది, రచయిత్రి స్వాతంత్ర్యోద్యమనాటి స్త్రీలలో ధీరత్వాన్ని నింపేటట్లుగా ఈ రచన చేసినట్లు అర్థమవుతుంది.*

చెన్నపురికి చెంది కడప కుటుంబవాసియైన అ. పె. పిరాట్టమ్మ వ్రాసిన 'శోభావతి' (1924 ప్రొద్దుటూరు లో జానకీ ముద్రాక్షరమాల) అనే సాంఘిక నవలలో పురుషులకు వేశ్యాలంపటం ఉన్నా వారి భార్యలు ఓర్పుతో జీవితాన్ని గడపటమనేది సాంఘికమైన సామాన్య విషయం కానీ, ఈ నవలలో ఒక వేశ్య తన దగ్గరుకువచ్చిన పురుషుడ్ని సన్మార్గంలో తిప్పి భార్యపై అనురాగం ఏర్పడేటట్లు చేసి కుటుంబవ్యవస్థను కాపాడటం అనేది చాలా ప్రత్యేకమైన విషయం. వేశ్యలు పురుషులను మోహంలో ముంచి వారి ఆస్తిపాస్తులన్ని దోచేస్తారనీ, కుటుంబాలను విచ్ఛిన్నమయ్యేట్లు చేస్తారనే భావననుండి వేశ్యలలో మంచి వారుంటారని చెప్పింది. దీనికి ఉదాహరణగా ఒకవేశ్య భార్యలు గతించిన వారి భోగానికి మాత్రం ఉపయోగపడాలనుకుంటుంది గాని పెళ్ళికాని యువకులు వచ్చినా వారికి పెళ్ళియ్యేటట్లు చేస్తుంది. భార్య ఉన్నా ఆమెను పట్టించుకోకుండా తన దగ్గరకు వచ్చిన వారికి హితబోధచేసి భార్యపై అనురాగం ఏర్పరుచుకునేటట్లుచేసి వారిని తమ భార్యలోని గొప్పతన్నాన్ని గుర్తించేటట్లు చేస్తుంది.

*కుటుంబ వ్యవస్థలోని పురుషులు భార్యదగ్గర మాత్రమే సుఖాలనుపొందాలని భావించేటట్లు చేసి కుటుంబాన్ని నిలబెట్టిన ఒక వేశ్యకథ ఇది. వేశ్యలలో రావల్సిన సంస్కారంతో పాటు, వేశ్యాలోలురైన భర్తలు కూడా తెల్సుకోవాల్సిన సంస్కారాన్ని తెలిపి, వారి దృష్టిని స్వాతంత్ర్యంవైపు మళ్ళించేటట్లుగా ప్రయత్నం చేసిన నవల ఇది.*

ఈ నవలల్లో దేశసంరక్షణలో స్త్రీలు చూపించిన ధీరత్వాన్ని, కుటుంబాలను నిలపెట్టిన వేశ్యల బాధ్యతాయుత మంచితనాన్ని వెలికితీయటం కనపడుతుంది.

**లేఖలు**

ఈ దశాబ్దంలో స్త్రీల సాహిత్యంలో 2 లేఖలు చోటుచేసుకోవటం జరిగింది. గ్రామీణ వ్యవస్థలో దూరంగా ఉన్న బంధుమిత్రులతో సామాజిక, రాజకీయ పరిణామాలను పంచుకోవటానికిని ఉపయోగపడేవి లేఖలేనని భావించిన స్త్రీలు లేఖాసాహిత్యంవైపు తమ దృష్టిని మరలించారు.

ధర్మవరం లక్ష్మీదేవి 'శారదకు ప్రత్యుత్తరం' (అక్టోబరు 1929 గృహలక్ష్మి) అంటూ వ్రాసిన లేఖలో శారదా యాక్టు వచ్చిన తర్వాతకూడా 'అష్టవర్షాద్భవేత్కన్యా' అనేది మారలేదనీ, ప్రతిదానికీ

చట్టం కావాలనుకోవటం కంటే యోగ్యతనుబట్టి స్త్రీలు తమనితామే మార్చుకోవాలనీ, జ్ఞానం కంటె యోగ్యత ముఖ్యమని తెలిపింది. స్త్రీల విషయంలో రామాయణంలో రాముడు, భారతంలో ధర్మరాజు విమర్శకు గురికాక తప్పలేదనీ, కళత్రములు రంగస్థలంమీద అభినయం చేసినంత మాత్రాన పరపురుషునితో మానసికంగా దగ్గరయ్యారని వారిని తక్కువగా మాట్లాడకూడదనీ వ్రాసింది. అంతేకాదు, బాల్యవివాహం జరిగి ఇష్టంలేని భర్తతో పైకి కాపురంచేస్తూ మనస్సులో మరొకరిని ఊహించుకోవటం కంటే నాటకంలో పురుషులతో అభినయించటంవల్ల శాస్త్రంలో వలె వారు ఆలుమగలుకారని చెప్పింది. విద్యాస్వాతంత్ర్యంతో అన్నవస్త్రాలకు అధీనంకాని స్త్రీ తానై మనసును అర్పించిన మనుజుడే స్వపురుషుడనీ, వివాహం అయి అన్నవస్త్రాలకు ఆధారపడితే ఆ భర్త పరపురుషుడేననీ, స్త్రీలు రంగస్థలం మీదకువస్తే దురాచారాలు ప్రబలవనీ, చిత్రాంగి పాత్రలో రాజరాజ నరేంద్రుని అవివేకత్వాన్ని ప్రదర్శించటంగా నాటకాన్ని భావించాలనికూడా తెలియజేసింది.

*విద్యావంతులై, స్వీయసంస్కారంతో స్వయంపోషకత్వాన్ని పొందగలిగినప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడుతుందని తెలియజేసింది. అదే సామాజిక కుటుంబవ్యవస్థలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి మూలసూత్రమని భావించింది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ తన ఊహానెచ్చెలి ఐన కల్పలతకు శారదపేరుతో వ్రాసిన 'శారద లేఖల'లోని విషయంగా (డిశంబర్ 1929 గృహలక్ష్మి) 02.11.1929 తేది నుండి బెజవాడలో జరిగిన ఆంధ్ర మహిళా సభావిశేషాలను వ్రాస్తూ డాక్టరు ముత్తులక్ష్మిరెడ్డి సభాధ్యక్షులుగా చేసిన ఆంగ్లోపన్యాస అనువాదాన్ని ఒక నారి చదువగా ఆ సభలో తుర్లపాటి రాజేశ్వరమ్మ మహోపన్యాసం చేసిందని తెలిపింది. ఆ తర్వాత సభలో తీర్మానాలు చేసారని తెలియజేస్తూ, ఖద్దరు, హిందీ, స్త్రీ పునర్వివాహము, స్త్రీ వారసత్వం, గౌరుగారి వివాహ వయోనిర్ణయ శాసనం, సంపూర్ణ స్వాతంత్ర్యం, అస్పృశ్యత వంటి పెక్కు విషయాలపై ముందు సభా తీర్మానాలు చేసారని వ్రాసింది. అంతేకాక సభలో అస్పృశ్యతా విషయాలు వచ్చేసరికి స్త్రీలు మాలలను ఏవిధంగా దరి చేర్చుకుంటామంటూ కొంత మంది లేచారనీ, ఆ మరునాడు జరిగిన సమావేశంలో స్త్రీ విద్య, కీ.శే. మాగంటి అన్నపూర్ణ గురించి మరియు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను, స్త్రీలు నాటకరంగ ప్రవేశం గురించి ప్రసంగించగా అందు స్త్రీల నాటకరంగ ప్రవేశము వివాదాలకు కారణమైందని తెలియజేసింది. ముత్తులక్ష్మిరెడ్డి వచ్చీరాని తెలుగులో అందరితో కలుపుగోలుగా మాట్లాడిందనీ, ఆ తర్వాత ఏర్పాటైన ప్రదర్శనశాలలో ఖద్దరుతో నేసిన పలురకాల వస్త్రాలు, సన్న నూలు వస్త్రాలు, జరీ, పట్టు, ఉన్ని వస్త్రాలు, రాట్నంతో తయారుచేయబడిన చేతి రుమాళ్లు, శాలువాలు, చొక్కాలు ఉన్నాయని, గాంధీ గారు వడికిన నూలు, వివిధ రకాల రాట్నములు ప్రదర్శనమునకు పెట్టారని తెలిపింది. శారదానికేతనపు చిత్రకారుల చిత్తరువులు ఆశ్యర్యాన్ని కలిగించాయనీ, ఖద్దరు వస్త్రాలు, పుస్తకాలు, ఔషధాలు, ఫేము వస్తువులు అమ్మకానికి పెట్టారని, శారదానికేతనపు బాలికలు తయారు

చేసినట్టి కుట్టుపనులు, చిత్తరువులు, ఫేము వస్తువులు అందరినీ ఆకర్షించాయని వ్రాసింది. అంతేకాక, ఆ రెండవనాడు కొనసాగిన సభలో ఉన్నవ లక్ష్మిబాయమ్మ, బత్తుల కామాక్షమ్మ, వేదాంతం కమలాదేవి, గుమ్మడిదల దుర్గాబాయి, యామినీపూర్ణతిలకమ్మ ఉపన్యసించారనీ శారదాచట్టాన్ని అందరూ ఆమోదించారనీ, స్త్రీలకు విద్య, ప్రపంచజ్ఞానం ఏర్పడితే దేశ, జాతి, సౌభాగ్యం కల్గుతుందని ఆ సభ కెళ్లిన తనకు అనిపించిందని లేఖలో వ్రాసింది.

*సభలలో స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్యాన్ని దేశస్వాతంత్ర్యాన్ని గురించి చర్చించుకోవటమే స్త్రీల ప్రగతి సూచికగా భావించాలి. అప్పటివరకు స్త్రీలు అత్తల బాధలను, వంటకాల గురించి మాట్లాడుకొనే స్థాయినుండి స్త్రీలువ్యక్తిస్వాతంత్ర్యాన్ని, దేశస్వాతంత్ర్యం గురించి మాట్లాడాలనుకొనే స్థాయికి ఎదిగిన విషయం అర్థమవుతుంది.*

ఈ లేఖా సాహిత్యంలో స్త్రీలు రంగస్థల ప్రవేశానికి అర్హులనీ, మహిళాసభలలో చర్చించుకొన్న దేశసామాజిక, రాజకీయ పరిణామాలలో స్త్రీల ఉద్యమాలను గురించి దూరంలో ఉన్న స్నేహితులకు తెలియజేయటం కనపడుతుంది.

20 వ శతాబ్దపు మూడవ దశకంలో స్త్రీలు సహాయనిరాకరణోద్యమంలో భాగమై సత్యాగ్రహ నిర్మాణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటానికి స్త్రీలమధ్య ఐకమత్యం ఉండాలని స్త్రీలను గౌరవంగా చూడగలిగితేనే ఉద్యమంలో స్త్రీలు స్వేచ్ఛగా పాల్గొనగలరని భావించారు. భారతదేశం యొక్క 'స్వరాజ్యం'ను గురించిన నిర్దిష్టమైన ఆలోచనలు పెంచుకోవటం జరిగింది. సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా ప్రతియింట్లో రాట్నంతో నూలువడికి ఖద్దరు వస్త్రతయారీ చేస్తేనే ఇటు కుటుంబం యొక్క అటు దేశదారిద్ర్యం కూడా తీరుతుందని భావించారు. గృహపరిశ్రమల ఫలితంగా విదేశీవస్త్ర వ్యాపారానికి గండికొట్టగలిగితే వ్యాపారరీత్యా భారతదేశంలో అడుగుపెట్టిన బ్రిటిష్ వారు పలాయనం చెందగలరని భావించారు. స్వరాజ్యం రావాలంటే ముందు ఆర్థికవ్యవస్థను పెంచుకుంటూ ఎన్నికలద్వారా పరిపాలనను తమస్వాధీనంలోకి తెచ్చుకోవటంలో స్త్రీల భాగస్వామ్యం ఉండాలనే ఆలోచనలు చేసారు. వేశ్యావ్యవస్థ స్వభావాన్ని గుర్తించి వేశ్యస్త్రీలలో ఉన్న మంచితనాన్ని గుర్తించి వారికి సామాజిక జీవితం ఉండాలని కోరుకున్నారు. ప్రతితల్లి తమ కొడుకులను దేశసేవలో భాగస్వాములను చేయాలనుకోవటం, ఖద్దరు ఉద్యమాలలో పాల్గొని మరణించిన దేశసేవికలను స్మరించుకోవటం, స్త్రీల విద్యద్వారా స్త్రీలపుట్టుకకు విలువ ఉంటేనే స్త్రీలు స్వాతంత్ర్యాన్ని పొందగలరనీ, అప్పుడే దేశస్వాతంత్ర్యాన్ని పొందటం సులభతరం అవుతుందని భావించటం జరిగింది. స్త్రీల పాఠశాలలను స్త్రీలే నెలకొల్పి నడిపించాలను కోవటం జరిగింది. విద్యార్థినీ సమాజాలు ఏర్పడటం, బాలికావిద్యలో దేశసేవను పాఠ్యాంశంగా పెట్టాలనీ, స్త్రీలే పాఠ్యాంశ నిర్ణయాధికారాన్ని వహించి బాలికలను దేశానికి ఉపయోగపడే రేపటి స్త్రీలుగా తీర్చిదిద్దాలను కోవటం, అనాథశరణాలయాలను నెలకొల్పటం అర్థమవుతుంది. ఆంధ్రమహిళామహాసభలను

పెట్టుకొని తీర్మానాలను చేయటం, అఖిలభారత మహిళామహాసభలలో తెలుగుస్త్రీలు పాల్గొనటం. సమాంతరంగా చేస్తున్న ఆంధ్రోద్యమంలో భాగంగా ఆంధ్రస్త్రీల గొప్పతనాన్ని వర్ణిస్తూ కవితలు వ్రాయటం, ఖద్దరుతయారీకి తగిన చైతన్యాన్ని ఇచ్చేదిశగా సాహిత్యసృజన చేసారు.

స్త్రీలు స్వతంత్రంగా రాజకీయాలలో పాల్గొనగలిగితేనే దేశం బాగుపడుతుందనీ, స్త్రీల శరీరం, మనస్సు, మెదడు పొందే స్వేచ్ఛనే స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యం అని నిర్వచించటం జరిగింది. ఆడపిల్ల, మగపిల్లల పుట్టుకలోని తేడాను గుర్తించి, స్త్రీలపుట్టుకకు విలువనిచ్చే విధంగానూ, స్త్రీలు గృహపరిశ్రమల ద్వారా ఆర్థికస్వావలంబన పొందాలనీ, 1919 వ చట్టం ప్రకారం అవకాశం ఏర్పడిన నామనిర్దేశకంగాకాక స్త్రీలు మున్సిపల్ లోకల్ బోర్డులయొక్క ఎన్నికలలో పాల్గొని స్త్రీల అభివృద్ధికి పాటుపడాలనుకున్నారు. స్త్రీలు తమ జన్మహక్కు ఐన సమానత్వాన్ని పొంది వ్యక్తిస్వాతంత్ర్యంతో జీవించటాన్ని స్త్రీల మానవహక్కుగా, జీవనహక్కుగా గుర్తించారు. ఈ దశాబ్దంలో స్త్రీలలో హక్కుల చైతన్యం పెరిగింది. సాంఘిక సంస్కృతీ పునర్నిర్మాణం జరగాల్సిన అవసరాన్ని గుర్తించి, భర్త ఆస్తిలో భాగస్వామ్యులుగా స్త్రీలు తమ ఆస్తిహక్కును నొక్కి వక్కాణించారు. స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు ముమ్మరంగా పాల్గొనాల్సిన అవసరాన్ని గుర్తించి దానికి తగ్గ సాంఘిక నేపథ్యాన్ని తయారు చేసుకోవటం జరిగింది. స్త్రీలు నర్సింగ్ విద్యను అభ్యసించగలిగితే దేశసేవకు ఎక్కువ ఆస్కార ముంటుందని భావించారు. అన్నిరంగాలలో స్త్రీల ప్రతినిధులు ఉండాలని తీర్మానాలు చేసుకున్నారు. ప్రతిరంగంలో తమహక్కులను వినియోగించుకుంటూ స్త్రీలు ముందడుగు వేయాలనుకోవటం కనబడుతుంది. అంతేకాదు, స్త్రీలమధ్య మానవసంబంధాలు అభివృద్ధి కావటానికి స్త్రీమిత్రోత్సవాలు జరుపుకోవాలని అనుకున్నారు. మద్రాసులో ప్రతినెలా పౌర్ణమినాడు 'ఉమెన్స్ దే'ను చేసుకోవాలని నిర్ణయించుకుంటూ తమ సంస్థకు కూడా 'ఉమెన్స్ దే' అనే పేరుపెట్టి స్త్రీలు తమ అభిప్రాయాల వితరణకై ఒకరోజును కేటాయించాలనుకోవటం జరిగింది. అంటే స్త్రీలు తమజీవితాలను గురించి తాము ఆలోచించుకోవటంగా అర్థంచేసుకోవచ్చు.

సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాలలో స్త్రీల భాగస్వామ్యమే స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యమనీ, అదే దేశస్వాతంత్ర్యానికి బాటలు వేయగలుగుతుందని భావించారు. 20 వ దశాబ్దపు మూడవ దశకంలో స్త్రీలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించగల సాహిత్యసృజనను స్త్రీలు చేసారు. అందుకే మూడవ దశాబ్దంలో స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యోద్యమానికి సమాంతరంగా 1930 నుండి ప్రారంభమైన ఉప్పుసత్యాగ్రహ స్వాతంత్ర్యోద్యమంలో తమ భాగస్వామ్యాన్ని తీవ్రతరంచేసి, అరెస్టులయ్యేంత వరకు కొనసాగించటాన్ని, స్త్రీలు రాజకీయవ్యవహారాలలో సాధించిన సాధికారికతను తెలుసు కోవటానికై స్త్రీలసాహిత్యచరిత్రలో ముందుకు సాగాలి.

## 5.1. (అ) సాహిత్యం(1930-1934) - శాసనోల్లంఘన ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం - లోకల్ బోర్డులలో స్త్రీల భాగస్వామ్యం

సత్యాగ్రహోద్యమాన్ని కొనసాగిస్తూనే, ఉప్పుపన్ను విషయంలో ఆగ్రహానికి గురిఅయి శాసనోల్లంఘనం చేయాలనుకోవటం జరిగింది. ఉప్పుసత్యాగ్రహోద్యమం 1930 మార్చిలో మొదలయి ఏప్రిల్ లో దండితీరాన్ని చేరింది. సంపూర్ణస్వాతంత్ర్యాన్ని వెంటనే సాధించటానికి చేసిన శాసనోల్లంఘనలో ఉప్పుసత్యాగ్రహం ఒకటి. ఉప్పును దేశంలో భారతీయులు తయారు చేసుకొన్నాకూడా బ్రిటిష్ ప్రభుత్వము తన హక్కుగా ఉప్పుపై పన్నులు వేసే విధానాన్ని 1882లో 'సాల్ట్ యాక్ట్' అనే శాసనం చేసింది. అప్పటికే దేశఆదాయంలో 8 శాతంగా ఉన్న ఉప్పుపన్నుకు వ్యతిరేకంగా సముద్రతీరమందు ప్రజలు తమ ఉప్పు తామే తయారు చేసుకొనే విధంగా గ్రామీణ ప్రజలు, స్త్రీలు ఎక్కువగా ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనేటట్టుగా రూపకల్పన చేసారు. మద్యపాన నిషేధానికై వేలంపాటలో కాంట్రాక్టర్లను పాల్గొననీయక పోవటం, విదేశీవస్త్రాల విక్రయాన్ని ఆపి, నూలువడికి ఉత్పత్తిచేయటం, హిందూ ముస్లింల ఐక్యత వంటి కార్యక్రమాలు తిరిగి మొదలైనాయి. గాంధిని నిర్బంధించగా స్త్రీలు ఉప్పుసత్యాగ్రహంలో ఎక్కువగా పాల్గొని స్వాతంత్ర్యసంపాదనలో ఉద్యమ భాగస్వాములు కాగలిగే అవకాశాన్ని పొందారు. ప్రజలు ఉప్పుపన్నును కట్టకపోగా గ్రామాధికారులుకూడా శిస్తులు కట్టించుకోకపోవటం, మిల్లు యజమానులు బట్టలను చౌకధరలకు అందించాలనుకోవటం వంటి ఉద్యమచర్యలతో బ్రిటిష్ వారి ఆర్థిక లాభాలకు గండికొట్టటం జరిగింది. ఈ ఉద్యమాన్ని అణచటానికి బ్రిటిష్ ప్రభుత్వం పాటిస్తున్న దమననీతికి వ్యతిరేకంగా హర్తాళ్ళు, పికెటింగ్, ఊరేగింపులు చేసారు. సమావేశాలు జరుపుకుంటున్న ప్రజలను, స్త్రీ పురుషులనే తేడాలేకుండా నిర్బంధించటం, జైళ్ళలో స్త్రీలపై పోలీసులు అత్యాచారాలు చేయటాన్ని, కొట్టటాన్ని, హింసించటాన్ని, మితిమీరి దుర్భాషలాడటాన్ని స్త్రీలు తట్టుకుని నిలబడటం వంటి విషయాలను బ్రిటిష్ వార్తా పత్రికలలో ప్రచురించారు. గర్భిణులైన స్త్రీలను అరెస్టు చేసి జైల్లోపెట్టగా వారి ప్రసవాలు జైళ్ళల్లోనే జరిగిన సంఘటనలు ఉన్నాయి.

భారతీయులు అడిగిన డొమినీయన్ ప్రతిపత్తిని (అంతర్గత స్వపరిపాలన) బ్రిటిష్ పార్లమెంటులో ప్రవేశపెట్టటం యిష్టంలేని బ్రిటిష్ వాళ్లు 1927లో సైమన్ కమీషన్ ను పంపగా శాసనోల్లంఘన నిరసనకారులు కమీషన్ ని వెనక్కి వెళ్ళమని నినదించారు. కాని కన్సర్వేటివ్ పార్టీ అధికారంలోకి ఉండటంచేత సైమన్ కమీషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చట్టాన్ని రూపొందించటానికి ప్రయత్నించారు. కాని 1930లో లేబర్ పార్టీ నాడు బ్రిటిష్ పార్లమెంటులో ఉండటంతో వైస్రాయి సూచనప్రకారం డొమినీయన్ ప్రతిపత్తికై రౌండ్ టేబుల్ సమావేశాలు మూడు దఫాలుగా జరిగినా ప్రయోజనం లేకపోయింది. 1930 నుండి 1931 లో మూడు సమావేశాలు జరిగాయి. కానీ మొదటి సమావేశంలో కాంగ్రెసు పాల్గొనలేదు. ఆ సమావేశంలోనే బ్రిటిష్ విద్యాలయ విద్యార్థియైన 'రహమత్ ఆలీ' అనే యువకుడు ముస్లింలు అధికారులుగా ఉండే రాష్ట్రాన్ని ముస్లిం రాజ్యంగా భావించి 'పాకిస్థాన్' ఏర్పడాలని హిందూ-ముస్లిం సమస్యను పరిష్కరించే దిశగా దేశం బాధ్యతాయుత పరిపాలన చేయాలని సూచనచేశాడు. రెండవ సమావేశం విఫలమైనా, మూడవ సమావేశంలో డొమినీయన్ ప్రతిపత్తికి రాజ్యాంగనిర్మాణానికి చర్చలు జరిగి గాంధితో వైస్రాయ్ ఇర్విన్ ఒడంబడిక చేసుకోవటం జరిగింది. స్వీయరాజ్యాంగ నిర్మాణానికై మూడవ రౌండ్ టేబుల్ సమావేశంలో గాంధి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఇమ్మని గట్టిగా నొక్కిచెప్పారు. కాని తరువాత వచ్చిన విల్లింగ్టను ఆ ఒడంబడికను ఒప్పుకోలేదు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా విడిపోయారు. తిలక్, అరవిందఘోష్, మొదలు పెట్టిన అతివాద పోరాటానికి కొనసాగింపుగా వారి శిష్యుడైన చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్ వారి అనుచరులు కలసి శాంతియుత గాంధి సత్యాగ్రహం వల్ల లాభంలేదనీ, సాయుధ పారాటం చేయాలని భావించారు. ఉప్పుసత్యాగ్రహం తర్వాత గాంధీ-ఇర్విన్ ఒప్పందంలో భాగంగా రౌండుటేబుల్ సమావేశానికి గాంధీ లండన్ వెళ్ళినపుడు భారతదేశంలో బ్రిటీష్ వాళ్ళు సాయుధ పోరాటం చేస్తున్నందుకు భగత్ సింగ్ ని ఉరితీయటం జరిగింది. మూడవ రౌండుటేబుల్ సమావేశానికి ఆరు రోజుల ముందు భగత్ సింగ్ భారతదేశంలో బ్రిటిష్ అధికారిని చంపటంతో, ప్రభుత్వం భగత్ సింగ్, రాజగురు జయదేవ్ లను ఉరితీసారు. దానితో కల్లోలం పెరిగి భారతీయులు బ్రిటీష్ వారి పాలనా సంస్థలను ధ్వంసం చేసారు. ఆ సందర్భంలో చంద్రశేఖర్ అజాద్ ను వెదుకుతున్న పోలీసులకు బందీగా దొరకటం యిష్టంలేక వారికి అజాద్ చిక్కకుండా తనని తానే కాల్చుకొని, దేశంకోసం ఆత్మబలిదానం చేసుకొన్నాడు. గాంధి తిరిగివచ్చే లోపలే అస్పృశ్యులను హిందువులనుండి వేరుచేసే ప్రయత్నాలను బ్రిటిష్ వారు మొదలుపెట్టారు. ఇంగ్లీషును నేర్పి ప్రజలమధ్య అంతరాలను పెంచటం, ప్రజలను, జమీందార్లను విడదీయటం, యజమానులు-కార్మికుల మధ్య సంబంధాలను విచ్ఛిన్నం చేయటం, కాంగ్రెస్ మితవాదులను, జాతీయవాదులను విడగొట్టటం, హిందూ ముస్లింలను విడగొట్టటం, అస్పృశ్యులకు హిందువుల మధ్య విబేధాలను సృష్టించి పాలించే విధంగా బ్రిటిష్ వారు ప్రయత్నాలు ఎప్పటికప్పుడు చేస్తూండేవారు. ఆ విధంగా

భారతీయులకు స్వరాజ్యాన్ని గాని డొమీనియన్ ప్రతిపత్తి గానీ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని గాని ఇవ్వకుండా బ్రిటిష్ వారు భారతీయులను బాధించిన విషయాలు నేటికీ చారిత్రక సత్యాలుగా ఉన్నాయి. పూనా ఒడంబడిక వల్ల రాష్ట్రశాసనసభలో అస్పృశ్యులకు ఎక్కువ స్థానాలు కేటాయించటంతో పాటు, హిందువులలోని వివిధ మతాలు, విద్యాలయాలు, పబ్లిక్ సంస్థలను ఉపయోగించుకొని పెక్కుదేశాలలో లేని విధంగా స్వాతంత్ర్యానంతరం మాత్రమే శాసనం చేసుకునే విధంగా ఒడంబడిక జరిగింది.

1932లో బ్రిటిష్ వారు కమ్యూనల్ అవార్డు రూపంలో అస్పృశ్యులను హిందూ మతంనుండి విడదీసారు. గాంధి అస్పృశ్యతా ఒడంబడిక చేసుకున్నా పార్లమెంటులోని లిబరల్ పక్షంవారు ముస్లింలను తృప్తి పరచటానికి రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టారు. సాంఘిక సమస్య పరిష్కారదిశగా కమ్యూనల్ అవార్డు కింద ముస్లింలు, అస్పృశ్యులు, బలహీనవర్గాలు, సిక్కులు, ఆంగ్లోఇండియన్లు, భారతీయక్రైస్తవుల యూరోపియన్లు, వర్తక వ్యాపారాలు చేసేవారు. భూస్వాములు, కార్మికులను అల్పసంఖ్యాకులుగా భావించింది. వారంతా ప్రత్యేక వర్గాలుగా గుర్తింపబడ్డారు. వీరంతా వారివారి ప్రత్యేకనియోజక వర్గాలద్వారా ప్రతినిధులను ఎన్నుకొనే విధానాన్ని ప్రవేశపెట్టి మిగిలినవారికి సాధారణ నియోజక వర్గాలని పేరుపెట్టింది. హిందూ నియోజకవర్గం ప్రతినిధుల సంఖ్య వేరుగా ఉంది. దామాషాకంటె అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రతినిధుల సంఖ్య ఎక్కువగా ఉంది. బ్రిటిష్ వారు హిందువుల యొక్క రాజకీయ పలుకుబడిని తగ్గించి ఉప్పుసత్యాగ్రహరూపంలో చేసిన శాసనోల్లంఘనానికి తగిన గుణపాఠం చెప్పాలనుకున్నారు. కేంద్రరాష్ట్ర శాసనసభలలో అల్పసంఖ్యాకుల జనసంఖ్య కంటె దామాషా పద్ధతిలో వారి ప్రతినిధుల సంఖ్య ఎక్కువగానే ఉంది. బ్రిటిష్ పార్లమెంటు ఉభయసభల సంయుక్త కమిటీని నియమించి నివేదిక ఇవ్వమని అడుగగా కాంగ్రెస్ వారు కమిటీ ముందు చర్చలలో ప్రతిపాదనను చేసినా పట్టించుకోకుండా అఖిలభారత సమాఖ్య, ద్వంద్వపరిపాలనకు సంబంధించిన చట్టాన్ని చేసారు. అదే భారతదేశ ప్రభుత్వచట్టం, 1935 గా రూపొందింపబడింది. ఈ చారిత్రక, ఆర్థిక, రాజకీయ ఉద్యమ నేపథ్యంలో స్త్రీలలో కలిగిన చైతన్యాన్ని, భావపరిణామశీలతను ప్రతిఫలిస్తూ స్త్రీల సాహిత్యసృష్టి జరిగింది.

20 వ శతాబ్దం ప్రారంభం నుండి స్త్రీ విద్యావశ్యకతను గురించి స్త్రీలు అనుశ్రుతంగా సాహిత్యంద్వారా పోరాటం చేస్తూనే ఈ నాల్గవ దశకంలోకూడా స్త్రీస్వతంత్రజీవనానికి, దేశస్వాతంత్ర్యానికై పునాదిప్రాయమైన స్త్రీవిద్యకు మరింతగా ప్రాముఖ్యతను యివ్వటం అర్థం అవుతుంది. స్త్రీలను సాటి మనుషులుగా చూడమని హెచ్చరిస్తూనే, స్త్రీలు కూడా కుటుంబ సంబంధాలలో తాము బానిస-యజమాని సంబంధాలతోఉండి పరాధీనులుగా ఉన్నామనే స్పృహను వారిలో కలిగించే విధంగా స్త్రీలు సాహిత్యసృజన చేసారు. దాని నుండి విముక్తికై విడాకులు తీసుకోవచ్చనే ఆలోచనలు కల్గిస్తూ స్వాతంత్ర్యోద్యమానికి సమాంతరంగా స్త్రీవిద్యా చైతన్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఇంకా ఉందని నాటి రచయిత్రులు భావించారు.

స్త్రీల ప్రగతికి, స్వాతంత్ర్యానికి అడ్డుగా ఉన్న కుటుంబసంస్కృతి నుండి విముక్తిపొంది స్త్రీలలో తాము స్వతంత్రులు కావాలనే ఆలోచనలు పెరిగాయి. స్త్రీలకు అవసరమైన వైవాహిక స్వాతంత్ర్యాన్ని తెలియచేసింది. స్త్రీ స్వాతంత్ర్యానికి, ప్రగతికి మొదటి నుండి అడ్డుగోడగా నిలిచినది ఈ వివాహసంస్కృతియే అని స్త్రీల సాహిత్యం ప్రతిఫలింపజేసింది.

ఈ దశాబ్దంలో జరిగిన ఉప్పుసత్యాగ్రహరూపంలో చేసిన శాసనోల్లంఘనంవంటి రాజకీయపరిణామాల ప్రభావంతో స్త్రీలు సాహిత్య సృజన చేసి, వ్యక్తి స్వాతంత్ర్యోద్యమంతోపాటు స్వదేశీ వస్త్రతయారినీ, ఖద్దరు ధారణను వహించే చైతన్యాన్ని తోటి స్త్రీలలో పెంపొందింపజేసారు. దుర్గాబాయమ్మ వంటి తెలుగు మహిళలెందరో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని అరెస్ట్ అయి జైలుశిక్ష అనుభవిస్తూ అష్టకష్టాలుపడినా, సబలలుగా దేశవిముక్తికై నిలబడ్డ విషయం అర్థమయ్యేటట్లుగా స్త్రీలు సాహిత్యాన్ని సృజించారు.

1930 నుండి 1934 వరకు స్త్రీల సాహిత్యంలో 78 వ్యాసాలు, 2 ప్రచురిత ఉపన్యాస వ్యాసాలు, 32 కథలు, 4 నాటకాలు, 35 కవితలు, 1 కీర్తన, 3 లేఖలు, 1 స్వీయచరిత 1 నవల, 1 పాట వచ్చాయి.

స్త్రీవిద్యాభివృద్ధి, స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యం, రాజకీయ వ్యవహారాలలో స్త్రీల భాగస్వామ్యం, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్యం, శాసనోల్లంఘనంలో సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలలో స్త్రీలను చైతన్యపరిచే వ్యాసాలు మొత్తంగా 80 ఉన్నాయి..

నెల్లూరుకు చెందిన 'పొణకా కనకమ్మను' (జమీన్ రైతు పత్రిక 1930) గురించి ప్రచురిస్తూ సత్యాగ్రహంలో ఏడాది జైలుకెళ్ళిందని స్త్రీలలో కాంగ్రెసుపార్టీ తొలి తెలుగు సభ్యురాలు-ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు ఉపాధ్యక్షురాలుగా దేశాభ్యుదయానికి జాతీయ విద్య పునాది అని నమ్మి కస్తూరిబా బాలికా విద్యాలయం స్థాపించిందని తెలియజేసింది.

*స్త్రీలు కాంగ్రెసు పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని జాతీయోద్యమానికి దిక్సూచికలుగా ఉండటం గమనింపదగింది.*

'ఆచంట రుక్మిణమ్మ' (జనవరి 1930 గృహలక్ష్మి) అనే శీర్షికన ఆమెను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ 1929 డిశెంబరు 26 నుండి 28 తేదీల వరకు లాహోర్లో జరిగిన అఖిల భారత మహిళాసభకు అధ్యక్షతవహించిన ఆచంట రుక్మిణమ్మ, ఐరిస్ అంతర్జాతీయ మహాసభలో ప్రాతినిధ్యం వహించిందనీ, కాండీనగరమందు యువజన మహాసభకు అధ్యక్షతవహించినదనీ, చెంగల్పట్టు జిల్లా బోర్డుకు సభ్యత్వము వహించిన గొప్ప స్త్రీ అని పత్రికాధికారులచేత కొనియాడబడినదని తెలియజేసింది.

*సమాజంలోని స్త్రీ అంతర్జాతీయస్థాయికైనా ఎదగగలుగుతుందని రుజువుపరుస్తూ స్త్రీలలో స్ఫూర్తిని కల్గించే ప్రయత్నాన్ని పత్రిక తెలియజేసింది.*

లేళ్ళ నాగభూషణమ్మ 'స్త్రీవిద్య'(జనవరి 1930 గృహలక్ష్మి)ను గురించి వ్రాస్తూ గృహ యజమాన్యానికి ఇంటి కీర్తికి, గౌరవానికి స్త్రీవిద్య అవసరమనీ, వివేచనాజ్ఞానం పరిపూర్ణ విద్యవల్ల ఏర్పడుతుందని తెలిపింది. స్త్రీలు గృహపరిశ్రమలందే గాక, రాజకీయ విషయములు, విద్యావిషయ వ్యవహారాలలోనూ సహాయసహకారాలు అందించాలనీ, దేశంకోసం కష్టపడాలనీ దానికి సరోజనీదేవియే తార్కాణమని తెలియజేసింది.

*స్త్రీలు రాజకీయవిషయాలలో భాగస్వాములు కావల్సిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీలు విద్యావంతులైతే గౌరవించాల్సి వస్తుందనే అపోహలను తగ్గించాలనుకొంది. సమాజంలో స్త్రీలను గౌరవించే సాంప్రదాయం పెరగాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. స్త్రీలకు గౌరవప్రదమైన జీవితమే వారి స్వంతంత్ర జీవనానికి చిహ్నమని భావించింది.*

ఇల్లిందల సరస్వతి 'భరతమాతకొకజాబు' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) అని వ్రాస్తూ విద్యావిహీనులైన హిందూస్త్రీలు ఉపన్యాసాలకు వచ్చినాకూడా సారాంశాన్ని గ్రహించ లేకపోతున్నారని, నగల గురించి మాట్లాడుకుంటున్నారని, పుస్తకాలమీద శ్రద్ధలేదని, గృహకృత్యాలు శిశుపోషణాన్ని సరిగ్గా నిర్వహించలేకపోతున్నారని, భర్తతో సమానంగా ఉండలేకపోతున్నారని తెలియజేసింది. పురుషులు కూడా ఉపన్యాసాలిస్తున్న స్త్రీలను గురించి "జంతువులు కూడా ఉపన్యాసాలు ఇస్తున్నాయని హేళనచేస్తున్నారని, పురుషులకు స్త్రీల యెడల ఎట్లా ప్రవర్తించాలో తెలియటం లేదని, స్త్రీని తోడునీడలాగా భావించకపోగా స్త్రీలను అనవసర విషయాలలో జోక్యం చేసుకోవద్దని అంటారనీ, దేశంలో పురుషులు కూడా "స్త్రీకి స్వాతంత్ర్యం ఏమిటని" ప్రశ్నిస్తున్నారని భరతమాతకు జాబు రూపంలో వ్రాసింది.

*భరతమాతను తన పుత్రికలైన భారతస్త్రీలు స్వతంత్రులు కావాలని వారికి ఉద్బోధ చేయమని వేడుకోవటం స్పష్టమైంది.*

కొత్తపల్లి లక్ష్మీకాంతమ్మ 'స్త్రీవిద్య' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ పూర్వం గొప్ప విద్యావంతులు, పరాక్రమవంతులైన స్త్రీలున్నారనీ, పూర్వాచారం నేటికీ కొనసాగే పరిస్థితులు లేవనీ, ఇప్పటి పరిస్థితులనుబట్టి స్త్రీలకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలనీ, దేశంలో జాతీయతాధ్వజం రెపరెపలాడాలన్నా, జాతీయాభ్యున్నతి కలగాలన్నా స్త్రీవిద్య అవసరం అని తెలియజేసింది.

*స్త్రీవిద్య, స్త్రీస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యం పరస్పర ఆశ్రితాలని తెలియజేసింది.*

డి.రాజేశ్వరి 'నా జీవనావయాత్ర' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) అనే వ్యాసరూపంలో ఉన్న ఆత్మకథను తెలియజేస్తూ, చిన్నప్పుడే తల్లిపోవడంతో తన విద్య కుంటుబడిందనీ, తాను యిష్టపడిన వ్యక్తితో వివాహం కావటానికి వరశుల్కం అడ్డుపడిందనీ, అడిగినా ఆనాడు తాను తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పలేకపోయినందుకు బాధపడింది. తన తండ్రి తనను ముదుసలి

కిచ్చి పెళ్ళిచేయగా పుష్పవతికాకమునుపే వైధవ్యం వచ్చిందని, కొంతమంది జాలిపడి బ్రహ్మ సమాజంలో చేర్పించి పునర్వివాహం చేయాలనుకున్నారు గాని పూర్వాచారపరాయణుడగు తండ్రితో తాను ఉండాలనుకోవటం జరిగిందనీ, తండ్రి మరణానంతరం ఒంటరిగా చావకూడదని ధైర్యం తెచ్చుకొని కాశీ చేరుకొన్న విషయాన్ని తెలియజేసింది.

*అభిప్రాయాలను చెప్పలేని తన అశక్తతను గుర్తించటమే వ్యక్తిత్వవికాసానికి దారితీస్తుందని భావించవచ్చు. ఆ వ్యక్తిత్వంతోనే ఆమె ఆత్మహత్యనుండి విరమించుకొని స్వతంత్రమైన బ్రతుకు తెరువును, భద్రతను వెదుకుకోవటం అర్థమవుతుంది.*

యన్.కమలావతీదేవి వ్రాసిన 'వి.సరస్వతి గారికి' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో అంతకు మునుపు పత్రికలో ప్రచురితమైన సరస్వతి వ్రాసిన వ్యాసంలో స్త్రీకి స్వాతంత్ర్యం ఉండాలనీ, దానికై స్త్రీకి విద్య కావాలనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసినట్లు తెలిపింది. దానికి స్పందిస్తూ స్త్రీకి విద్య అవసరమనీ, అయితే ఎటువంటి విద్య నేర్వాలో కూడా వ్యాసంలో తెలపాలనీ, అలాగే స్త్రీకి స్వాతంత్ర్యం ఉండాలనీ, కాని ఎంతమేరకు ఆ స్వాతంత్ర్యం ఉండాలో కూడా ఆలోచించాలని చెప్పింది. విద్యావతి అభివృద్ధిచెందినా పురుషద్వేషికాకూడదనీ, స్త్రీకి స్వాతంత్ర్యం లేదని చెప్పిన మనుధర్మశాస్త్రాన్ని తాను సమర్థించటంలేదని కూడా చెప్పింది. అయితే స్త్రీ, పురుషులిద్దరు సమానాభిమానంతో ఉండాలనీ, విద్యావంతులుగా స్త్రీలు ఉద్యోగాలు చేయాలనుకోవటం కంటె కూడా శారదాబిల్లు ప్రయోజనం సిద్ధించేటట్లు చేయాలనీ, ఇంటిపని, బయటపనిగా పని విభజన స్త్రీ పురుషులిద్దరికి జరిగిందనీ, స్త్రీలు ఇల్లు వదిలిపెట్టి, శిశుపోషణం చేయకుండా ఉద్యోగాలకు పరిగెత్తాల్సిన అవసరంలేదనీ తెలిపింది.

*స్త్రీలు అభివృద్ధిచెందే క్రమంలో పురుషద్వేషులు కాకూడదనే సామాజిక భావనను తెలిపిన రచన ఇది.*

దీనికి అనుబంధంగా అద్దంకి అనసూయ వ్రాస్తూ ఆంగ్లస్త్రీలను మార్గదర్శకులుగా భారతస్త్రీలు భావించాలన్న సరస్వతి గారి అభిప్రాయాన్ని ఖండిస్తూ, ఆంగ్లవనితలతో పాటూ భారతదేశంలో పూర్వమున్న గొప్ప స్త్రీలను స్ఫూర్తిగా తీసుకోవాలని భావించింది.

*ఆంగ్లవ్యామోహంలో భారతజాతీయతను విస్మరించకూడదనే భావన అర్థం అవుతుంది.*

మద్దాలి సీతారావమ్మ వ్రాసిన 'స్త్రీలకు విద్యా స్వాతంత్ర్యముల యావశ్యకత' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలుగృహకృత్యములు చేస్తేచాలనీ, స్త్రీలకు ఏ విషయంలోను స్వాతంత్ర్యమీయరాదని వాదించే వారిని చూస్తుంటే విచారం కలుగుతోందని తెలిపింది. తల్లుల స్వాతంత్ర్యకాంక్ష పిల్లలపై ప్రతిబింబిస్తుందనీ, భారత పురుషులకు స్త్రీల విద్యాస్వాతంత్ర్యములే తమకు సిద్ధించే జయమని గుర్తించటం లేదనీ, స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యాలు లేకపోతే అది స్త్రీలకు పురుషులకు హానికరమని గుర్తించాలని తెలియజేసింది.

*స్త్రీల విద్యాస్వాతంత్ర్య కాంక్ష భర్తకు, పిల్లలకు జయాన్ని కల్గించే విషయంగా గుర్తించమని తెలియజేస్తోంది.*

గుమ్మడిదల దుర్గాబాయమ్మ వ్రాసిన 'అబలలయెడ అన్యాయములు' (మార్చి 1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పురుషులకోసం ఉప్పుసత్యాగ్రహరూపంలో చేసిన శాసనోల్లంఘనానికి తాము బలిదానం చేసుకోవటానికి సిద్ధపడేస్త్రీలను పురుషులు ఒక ఆటవస్తువుగా చూస్తూ వారిని కష్టాలకు గురిచేస్తున్నారని తెలిపింది. తమకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నిస్తే వారిని ఇంటినుండి వెడలకొడుతున్నారనీ, అలా జరుగుతుండటానికి కారణంగా స్త్రీ పరాధీనగా అస్వతంత్రంగా అబలగా ఉండటమేననీ, గుర్తించమంది. భర్త దైవమనే మాటను ఖండించింది. ముసలివానికిచ్చే బాల్యవివాహాల ఫలితంగా వితంతువులు పునర్వివాహం చేసుకోకూడదనటం అన్యాయమనీ, ఈ అన్యాయంపట్ల స్త్రీలు మౌనంగా ఉండటానికి కారణం వారికి విద్య లేకపోవటమేనని చెప్పింది. వారు చదువుకోవాలనుకున్నా తండ్రి, సోదరులు అడ్డుపడుతుండటమే గాక స్త్రీలను నమ్మకూడదనీ, వారు శక్తిహీనులనే కారణాన్ని చూపిస్తూ ప్రచారం చేస్తున్నారని తెలిపింది. స్త్రీల ఆరోగ్యం బాగుంటేనే బిడ్డలు ఆరోగ్యవంతులవుతారనీ, అటువంటి పిల్లలు దేశానికి కావాలని, స్త్రీలు చదువుకోకపోవటమే స్త్రీల కష్టాలన్నిటికీ కారణమనీ, వారిని అబలలను చేస్తున్నారనీ బాధపడింది. స్త్రీల అవిద్య స్త్రీల పరాధీనతకు, అస్వతంత్రతకు కారణమని చెప్పింది. అంతేకాదు, స్త్రీలకు వారు రాజకీయ అధికారులుగా తయారయ్యే స్వాతంత్ర్యం కావాలనీ, స్త్రీలు శక్తిహీనులు కారని తెలియజేసింది. అంతేకాక స్త్రీజాతి శరీరంకూడా రక్తమాంసాలతో నిర్మింపబడినదనీ, వారికిని హృదయము, ఆత్మ, మంచి చెడులనాలోచించే శక్తి, సుఖదుఃఖములను భరించే ఓర్పు ఉంటుందనే ఆలోచనలేక పురుషుడు తనని యజమానిగా భావించుకుంటూ స్త్రీ తన భావాలకు అనుగుణంగా బ్రతకాలనీ భావిస్తున్నాడనీ, లేదా బహిష్కరణయే స్త్రీకి శిక్షగా వేస్తున్నాడని చెప్పింది. దానికి కారణం స్త్రీ పరాధీనయై రాండటమేననీ, స్త్రీలు అస్వంత్రులు, అబలలు అనే భావాలు బలీయంగా ఉండటానికి కారణం స్త్రీ విద్యావంతురాలు కాకపోవటమేననీ, స్త్రీలు భారతదేశోద్ధరణకు పూనుకోవాలనీ స్త్రీలను తమ శక్తియుక్తులను గురించి ఆలోచించుకోమని గుమ్మడిదల దుర్గాబాయమ్మ తెలియచేసింది.

*స్త్రీలు విద్యావంతులై స్వతంత్రులై తమశక్తి యుక్తులను భారతదేశోద్ధరణకు వినియోగించమనీ, అదే స్త్రీలను సబలలను చేస్తుందని భావించింది.*

'దుర్గాబాయమ్మ' (అక్టోబరు 1931 గృహలక్ష్మి) ను గురించి పత్రిక 1909 లో జన్మించిన దుర్గాబాయి తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో విద్య నభ్యసించిందనీ, తన 14 ఏండ్ల వయస్సులో హిందీపాఠశాలను నిర్వహించిందని తెలిపింది. 1929 లో ఆంధ్రసంచారం చేసిన గాంధీతో మెలగటంతో వారి ఆంతర్యాన్ని గ్రహించి 1930 లో తూర్పుగోదావరి జిల్లా సభ్యత్వాన్ని పొందిందనీ, అయితే భర్త ఆరోగ్యరీత్యా మదరాసు వెళ్ళాల్సిన అవసరం ఏర్పడటంతో అక్కడ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని 1930 ఏప్రిల్ లో పోలీసు శిక్షను అనుభవించిందని చెప్పింది.

ఉప్పు సత్యాగ్రహ సందర్భంగా అరెస్టు కాబడి ఏడాదిపాటు జైలుశిక్షను అనుభవించిన దేశసేవిక దుర్గాబాయమ్మ అని పత్రిక కొనియాడింది.

ముప్పలనేని పుష్కరాంబ వ్రాసిన 'స్త్రీవిద్య-దాని ఆవశ్యకత' (మార్చి 1930 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో శిశుపోషణానికి స్త్రీవిద్య అవసరమనీ, విదేశీ స్త్రీల వలె భారతదేశంలో స్త్రీశక్తులు కూడా ధైర్యంగా, స్వతంత్రంగా మాట్లాడాలనీ, స్త్రీలు వీరమాతలైతేనే భారతమాత సంతోషపడుతుందని చెప్పింది.

*స్త్రీలు ధైర్యంగా తమ అభిప్రాయ ప్రకటనకు పూనుకోవటమే స్వతంత్రత యొక్క చిహ్నంగా భావించింది.*

పులవర్తి కమలావతిదేవి వ్రాసిన 'విడాకుల చట్టం' అనే వ్యాసంలో (మార్చి 1930 గృహలక్ష్మి) 'చెన్నరాష్ట్ర స్త్రీ విద్యా సాంఘిక సంస్కరణ' సభలో భాగంగా విడాకుల చట్టం మీద చర్చ జరిగిందనీ, త్రాగుబోతులు, జారులు, దుష్టులైన భర్తలతో సంసారం చేయాల్సిన అవసరం లేదని సభలోనివారు భావించారని తెలిపింది. పురుషులు ఇవ్వకపోయినా స్త్రీ కోరితే విడాకులివ్వాలని చర్చకు పెట్టారనీ, స్త్రీలకు సాంఘిక కట్టుబాట్లనుండే స్వతంత్రం కావాలనే ఆలోచనలు పెరగడంతో ఈ చర్చ జరిగిందని తెలియజేసింది.

ఈమె 'దామెర్ల కమలరత్నమ్మ' (ఆగష్టు 1930 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ కమలరత్నంగారి తల్లి బాగా చదువుకున్నదనీ, ఆమె నరసాపురము నందు స్త్రీసమాజమును ఏర్పాటు చేసిందనీ, స్త్రీలకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయటానికి, నరసాపుర తాలుకాభివృద్ధికి సమాజాన్ని అభివృద్ధిచేయటానికి చేసిన సేవ నిరుపమానం కాబట్టి విద్యాధికురాలైన స్త్రీ గౌరవానికి పాత్రురాలు కాదగినదని తెలియజేసింది. కమలారత్నంకూడా నరసాపురంనందు ప్రముఖులైన ట్రైలరోన్నత పాఠశాలలో చదువుకొన్నదనీ, రాజమహేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోందనీ, ఢిల్లీలోని అఖిలభారతమహిళాసభలో పాల్గొన్న ఆదుర్తి భాస్కరమ్మ ఈమెకు ఆడబడుచు అని చెప్పింది. ఈమె చేస్తున్న సాంఘికసేవను గుర్తించి ప్రభుత్వంవారు ఈమెను రాజమండ్రిలో మహిళాన్యాయాధికారిగా నియమించారనీ, బెంచికోర్టులలో స్త్రీలకు కూడా ప్రాతినిధ్య ముంటే గాని నేరస్థస్త్రీల కష్టాలు తొలగవని భావించిందనీ, ఈమె అనంతపురమున స్త్రీల రాజకీయ పారిశ్రామిక నైతికాభివృద్ధికై విశేషకృషి చేసిందని పులవర్తి కమలావతిదేవి తెలియజేసింది.

*స్త్రీ న్యాయాధికారిణి స్థాయికి చేరుకోవటమే స్త్రీ సాధికారికతకు ముందడుగు వేయటంగా భావించవచ్చు. తల్లి విద్యావంతురాలు అవటంచేతనే కూతురు కూడ బాగా చదువుకొని ఉన్నతమైన ఉద్యోగార్హతను పొందగలిగిందని నిరూపితమైనట్లుగా అర్థమవుతుంది.*

పెద్దాడ కామేశ్వరమ్మ వ్రాసిన 'వైధవ్యమా? విచ్ఛేదమా' (సమదర్శిని, మార్చి 1930) అనే వ్యాసంలో పురుషులయొక్క బహుభార్యాత్వం కారణంగాను, అన్యోన్య ప్రేమలేనప్పుడును, భర్త

చెడుతిరుగుళ్ళు తిరుగుతున్నప్పుడును స్త్రీలకు వివాహ విచ్ఛేదం అవసరమనీ, అటువంటి భర్తతోడి కాపురంకంటే వైధవ్యమే నయమని భావించటం జరిగింది.

*బాధపెట్టే భర్తకంటే అతడు తనకు దూరమవ్వాలని కోరుకోవటమంటే, పాతివ్రత్యాన్ని మించిన విప్లవాత్మక ధోరణి వారికి ఏర్పడిందని అర్థమవుతుంది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'స్త్రీలకు నవీనచట్టములు, వాని ప్రయోజనము' (ఏప్రిల్ 1930 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక) అనే వ్యాసంలో పూర్వ సమాజంలో స్త్రీలు పరాధీనులుగా ఉన్నారనీ, కాని నేడు స్త్రీలకు కూడ ప్రత్యేక మనోబుద్ధి శక్త్యాదులు కలవనీ, అవకాశాన్ని కలిగిస్తే వారియొక్క బుద్ధి, వివేకాలు దేశపురోవృద్ధికి సాధనములు అవుతాయని తెలిపింది. దానికై శారదాచట్టము, వయోవివాహనిర్ణయం, స్త్రీపునర్వివాహ చట్టములు ఏర్పడి స్త్రీలకు వైవాహిక స్వాతంత్ర్యమును ఒనగూర్చాయని తెలియచేసింది. అంతేకాక, వారసత్వచట్టంవల్ల స్త్రీలకు ఆర్థికలాభం తోడ్పడుతుందనీ, దేవదాసీల చట్టములు, వ్యభిచార నిరోధక చట్టము స్త్రీలనైతికాభివృద్ధికి సహాయం అవుతుందని చెప్పింది. చట్టసభలో, స్థానిక సంఘములో స్త్రీలకు ఇచ్చిన హక్కు స్త్రీలకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని కలగజేస్తుందనీ, కాని వీటిని స్త్రీలు వినియోగించుకొనే నేర్పుకావాలనీ, విద్యలేకపోవటంచేత ఆ హక్కులపై అవగాహన స్త్రీలకుండటం లేదని భావించింది. అంతేకాదు, స్త్రీలు విద్యను అభివృద్ధి చేసుకుంటే కన్యాశుల్కం, బాల్యవివాహాలు తగ్గుతాయనీ, బాలవితంతువులు ఉండాల్సిన అవసరం ఉండదనీ, స్త్రీలకు సాంఘిక నిర్బంధాన్ని విధించారనీ, ఆర్థిక హక్కు లేకుండా చేయటంతో స్త్రీలు అస్వతంత్రులుగా ఉన్నారనీ, దానికై స్త్రీలు సంఘాలుగా ఏర్పడి, సభలు జరుపుకుంటూ తీర్మానాలు చేసుకోవాలని చెప్పింది. స్త్రీలు రాజకీయాలలో కృషిచేసేలా స్త్రీసమస్యలు తీర్చుకోగలిగే చట్టాలను ప్రవేశపెట్టే స్థితికి స్త్రీలు చేరుకుంటేనే భారతదేశ పురోభివృద్ధికి, పునర్నిర్మాణానికి దోహదం కాగలుగుతుందనికూడా తెలియజేసింది.

"స్త్రీ అబలకాదు" (ఏప్రిల్ 1930 గృహలక్ష్మి) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ స్త్రీయొక్క ఆత్మబలం గొప్పదనీ, పురాణాల నుండి చరిత్ర నుండి ఉదాహరణలు ఇచ్చి స్త్రీలలో సాత్వికబలం, పరాక్రమబలం ఉందని గుర్తించమంది.

గుంటూరులో జరిగిన "ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభావిశేషాలు" (ఫిబ్రవరి 1932 గృహలక్ష్మి) ను గురించి ఈమె వ్రాస్తూ ఆ సభకు అధ్యక్షతవహించిన విద్యావతియైన వసుంధర యొక్క కట్టుబొట్టులో జాతీయత ఉందనీ, కుగ్లర్ ఆసుపత్రి వైద్యురాలిగా ప్రజలమన్నను పొందిన క్రైస్తవ సోదరియైన దానమ్మచేసిన ఉపన్యాసంలో స్త్రీసంఘమునకు ఉపయుక్తములగు అనేక విషయాలను పొందుపరిచిందని తెలిపింది. సభలో ఆంగ్లవిద్యనభ్యసించినవారు అల్లోపతి వైద్యం ఉండాలని చెప్పగా మిగిలినవారు ఆయుర్వేదం ఉండాలనీ భావించారని చెప్పింది. అంతేకాదు, బాలికల పాఠశాలలో స్త్రీలే ఉపాధ్యాయులుగా ఉండాలనీ, స్త్రీలు ఉద్యోగం చేయటం గౌరవ ప్రదంగా భావించాలనీ, ఆంధ్రదేశంలో స్త్రీలకొక ప్రత్యేక కళాశాల ఉండాలనీ, బాలికలను జాతీయ

విద్యాసంస్థలలో చేర్పించాలనీ, స్త్రీలకు కట్టుబాట్ల రూపంలో ఉన్న ఉక్కుపంజరం ముక్కలు ముక్కలవుతోందని తెలిపింది. విడాకుల తీర్మానం స్త్రీ-పురుషుల హృదయాలలో ఆందోళన కల్గిస్తోందనీ శారదాచట్టం ప్రకారమే వివాహ వయోనిర్ణయం ఉండాలని చెప్పినట్లు తెలియచేసింది. అంతేకాక, స్త్రీలకు ఉభయ కుటుంబాలలో ఆస్తిహక్కు ఉండే తీర్మానాలు చేయాలనీ, పునర్వివాహేచ్ఛగల బాలవితంతువులను సంరక్షకులే వివాహంచేయాలనీ, సంసారేచ్ఛలేని స్త్రీలు సన్యాసం పుచ్చుకొని దేశసేవ చేయవచ్చని తెలియచేసింది. పురుషులు భార్య బ్రతికుండగా మరో యువతిని పెండ్లిచేసుకోవటాన్ని నిషేధించే తీర్మానం ఉండాలికానీ విడాకుల తీర్మానం అవసరం లేదనీ, భార్యావియోగంకలిగిన వ్యక్తి భర్తృవియోగం కలిగిన స్త్రీనే వివాహంచేసుకోవాలని తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'స్త్రీ సమాజములు' (అక్టోబరు 1932 గృహలక్ష్మి) అనే వ్యాసంలో సనాతనము, నవీనము, జాతీయమనే మూడు రకాలైన స్త్రీసమాజాలు నాడు ఉన్నాయనీ, సనాతన సమాజాలలో వృద్ధులు, వితంతు స్త్రీలు ఉంటారనీ, ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూ, సనాతన మతాచార సాంప్రదాయాలను పాటిస్తారనీ, ఒక స్త్రీ గురుస్థానంలో ఉంటుందనీ, వీరు జీర్ణదేవాలయాల పునరుద్ధరణ, సప్తాహాల వంటి కార్యక్రమాలు చేస్తారనీ తెలిపింది. నవీనపద్ధతులలో నడిచే స్త్రీసమాజాలకు 'క్లబ్' లని పేరనీ, ఉద్యోగస్థులు, విద్యావంతులు ఉంటారనీ, స్త్రీలకు అన్ని హాబీలు ఉండాలనీ, వార్తాపత్రికలమీద కంటే బ్యాడ్మింటను, టెన్నిసు వంటి ఆటలపై ఆసక్తి అనీ వారు ప్రాచీన సంప్రదాయాలను యిష్టపడరనీ, క్లబ్ లలో ఇంగ్లీషు భాషలోనే మాట్లాడుతారనీ, పాశ్చాత్యనాగరికా విజ్ఞానం ఇష్టమని భావించింది. ఇక మూడవరకానికి చెందిన స్త్రీసమాజాలు జాతీయ పద్ధతులను పాటిస్తారనీ, వారికి స్వదేశీ అభిమానమనీ, సంస్కరణలపట్ల సుముఖత చూపిస్తారనీ, రాట్నముమీద హిందీమీద ప్రేమఎక్కువనీ ఖద్దరుధారణ ముఖ్యమనీ, అవసరమైతే రాజకీయాందోళనలో పాల్గొనుటకు వెనుదీయరని తెలియజేసింది.అంతేకాక మరికొన్ని ప్రార్థనా సమాజాలున్నాయనీ, నైతిక పారమార్థిక కృషి వీరికి ముఖ్యమనీ మరియు భజన సమాజాలున్నాయనీ, విజ్ఞానం అవసరం లేకనే పుణ్యభ్రాంతిలో మెలగుతుంటారని తెలిపింది. స్త్రీ సమాజాలనేవి స్త్రీల అభ్యున్నతికి తోడ్పడాలనీ, విద్య, విజ్ఞానం, నీతి, ధర్మం, సేవ, భగవద్భక్తి అన్నీ స్త్రీ పురోభివృద్ధికి మార్గములేననీ, స్త్రీల సమస్యలను చర్చించుకుంటూ ఆశయాలతో ఉంటే స్త్రీసమాజం అభివృద్ధి పొందుతుందని చెప్పింది. అయితే జాతీయ స్త్రీసమాజాలలో కూడా దేశీయ దురభిమానం ఇండకూడదనీ, స్త్రీసమాజాలు లోపాలను సవరించుకుంటూ స్త్రీలోకాన్ని సేవిస్తూ స్త్రీలపురోభివృద్ధికి పాటుపడేవిధంగా కర్తవ్యోన్ముఖం కావల్సిన అవసరాన్ని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

ఈమె వ్యాసాలలో పురుషుడు భార్య ఉండగానే మరొకపెళ్ళి చేసుకొనే సామాజిక సంస్కృతిపై ధ్వజమెత్తటం గమనార్హం. స్త్రీల సంస్కృతిపై ఆంక్షలను నిరసిస్తూ పురుష సంస్కృతిపై ధ్వజమెత్తారు. స్త్రీల అభివృద్ధికి ఆటంకప్రాయమై సామాజిక స్త్రీల సంస్కృతిని నిర్మూలించాల్సన అవసరాన్ని, స్త్రీలు పురుషులతో సమానంగా ఎదగాల్సిన విధానాన్ని తెలియజేసింది. స్త్రీలకు వైవాహిక స్వాతంత్ర్యం, ఆస్తిహక్కు ఉంటే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడుతుందనీ, అదే రాజకీయ

స్వాతంత్ర్యానికి దారి చూపుతుందని భావించింది. స్త్రీలు తమలోని శక్తియుక్తులను గుర్తిస్తేనే వాటిని ఉపయోగించుకునే ఆలోచనలు అభివృద్ధిచెందుతాయని భావించటం జరిగింది. స్త్రీలు కుహనాతత్వం లేకుండా చిత్తశుద్ధితో స్త్రీసమాజాలలో పనిచేస్తూ స్త్రీలసమస్యల పరిష్కారానికై స్త్రీల విద్యాభివృద్ధికై కృషిచేయాలని కనుపర్తి వరలక్ష్మమ్మ భావించింది.

'చోరగుడి సీతమ్మ' (ఏప్రిల్ 1932 గృహలక్ష్మి) ను గురించి ఈమె వ్రాస్తూ బాపట్లలో జన్మించిన చోరగుడి సీతమ్మ 40 ఏండ్లు మాత్రమే జీవించినను ఆమె ఒక విదుషీమణి, కవయిత్రి అనీ ఆనాటి స్త్రీల పత్రికలైన హిందూసుందరి, సావిత్రి పత్రికలకు గద్యపద్యవ్యాసాలు వ్రాసేదని తెలిపింది. ఆమె 1913 లో ప్రథమాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించినదనీ, 1915లో యుక్తవయస్కులగు కుటుంబీకులు బాలవితంతువులు చదువుకోవటానికి 'త్రిపుర సుందరీ సమాజ యువతీవిద్యాలయా'న్ని స్థాపించిందనీ, ఆర్థికంగా సహాయపడి స్త్రీవిద్యాభివృద్ధికి కృషి చేసిందని తెలియజేసింది. ఆమెస్మారకార్థం వరలక్ష్మమ్మ (బాపట్లలో) స్థాపించిన స్త్రీహితైషిణీ మండలిలోని గ్రంథాలయానికి 'సీతా పుస్తకసదనమని' పేరుపెట్టి కృతజ్ఞత తెలుపుకోవటం జరిగిందనీ, 'జానపదులకు రాత్రి బడినీ, ప్రౌఢస్త్రీలకు పాఠశాలను, స్త్రీలకొక సమాజమును ఏర్పరచి సేవ చేసిందని కొనియాడింది."స్త్రీ హితైషిణీ సీతామాంబను, స్త్రీహితైషిణీ మండలిని నేడు గౌరవింతుము, నాడు భక్తిని గ్రంథ సుమమాలన్" అని చోరగుడి సీతాంబకు కనుపర్తి వరలక్ష్మమ్మ నివాళులర్పించింది.

*స్త్రీవిద్యాభివృద్ధికై గ్రామాలలో రాత్రి పాఠశాలలను,యువతీవిద్యాలయాలను నెలకొల్పగలిగిన స్త్రీగా చోరగుడి సీతమ్మ స్త్రీల మనస్సులను సంతృప్తి పరచటంతో వారిచేత ఒక దేవతగా పూజింపబడే అర్హతను పొందగలిగింది.*

ఈమె 'పిఠాపురం మహారాణి' (మార్చి 1933 గృహలక్ష్మి) గురించి వ్రాస్తూ ఆమె పాఠశాలలను, శరణాలయాలను, ఘోషాస్కూళ్ళను, స్త్రీలక్లబ్బులను నెలకొల్పిందనీ, ఆమెకు పాశ్చాత్య సాంప్రదాయాలకంటె హిందూమతాచారాల ప్రాశస్త్యం ముఖ్యమని చెప్పింది. విడాకులచట్టం పురుషులకే అనుకూలంగా ఉంటుందనీ, వారు భరణంకూడా ఇవ్వాల్సిన అవసరంలేకుండా ద్వితీయ వివాహం చేసుకునే వీలుంటుందని రాణి తన అభిప్రాయాం చెప్పిందని తెలిపింది. ఆమె ఒక జ్ఞానభాండాగారమనీ ఐహికపరమైన విద్యలందు మంచి అనుభవాన్ని సంపాదించినందున ప్రాచ్యప్రతీచ్య దేశాలలోని మత సంఘరాజకీయార్థిక విషయములను చర్చించగలిగినదనీ, ఆమె పంచమ బాలికలకు లాడ్జి కట్టించిందని తెలియజేసింది.

*పంచములైన బాలికల అభివృద్ధికై వసతిగృహాలు కట్టించటం అనే గొప్ప నిర్ణయాన్ని తీసుకోవటమే పంచములు జీవితాలలో ముందడుగు వేసే అవకాశం వారికి కల్గించటాన్నే ఆమె ఆధ్యాత్మికతగా అర్థంచేసుకోవచ్చు.*

'కొటికలపూడి సీతమ్మ' (జూన్ 1934 గృహలక్ష్మి) ను గురించి ఈమె వ్రాస్తూ ఆమె స్వయంకృషిచే విద్యాజ్ఞానాన్ని అలవరచుకున్నదనీ కందుకూరి వీరేశలింగంగారి శిష్యురాలిగా కొటికలపూడి సీతమ్మ విద్యనేర్చి స్త్రీ సమాజాలకు అధ్యక్షత వహించి ఉపన్యాసాలు చేసి స్త్రీల అభివృద్ధికి పాటు పడిందని తెలిపింది. ఆక్షేపణలకు భయపడకుండా ధైర్యంతో స్త్రీల ఉన్నతికి పాటుపడిందనీ, 1913 లో బాపట్లలోని ప్రథమాంధ్ర మహిళాసభకు అధ్యక్షత వహించిందనీ, పీఠికాపుర మహారాజ్ఞిగారికి ఆంధ్రసాహిత్యమును, ఛందోలక్షణాదులను ఆమె నేర్పేవారని తెలియజేసింది. కొటికలపూడి సీతమ్మ విదుషీమణి, కవయిత్రి, సంఘ సంస్కర్తయనీ, సేవావ్రత అని శ్లాఘించి, స్త్రీ అవటంచేతనే ఆమెను పత్రికలు గుర్తించటంలేదని బాధపడింది.

'ఆంధ్రమహిళా మహాసభ'(నవంబరు 1934 గృహలక్ష్మి) ను గురించి ఈమె వ్రాస్తూ భారతదేశంలోని ఉద్యమాలలో మహిళోద్యమం ఒకటనీ, ఉద్యమఫలితంగానే స్త్రీలు తమ అవిద్యను, నిస్సహాయతను, దాస్యాన్ని గుర్తించి వాని నుండి విముక్తికై కృషి చేస్తున్నారని తెలిపింది. ప్రతి సంవత్సరం కేంద్ర శాసనసభలలోనూ రాష్ట్రీయ శాసనసభలలోనూ ప్రతిపాదించే బిల్లులన్నీ ఈ ఉద్యమాలవల్లనే పెట్టటం జరిగిందనీ, స్థానిక సంస్థలలో స్త్రీల ప్రాతినిధ్యం కూడా మహిళోద్యమ ఫలితమేననీ, స్త్రీల సంఘాలకు గుర్తింపురావటం జరిగిందని భావించింది. అఖిలభారత మహిళా సభలలో భారతదేశమందలి స్త్రీజనాభిప్రాయాలను గ్రహించ గలుగుతున్నారనీ, అఖిలభారత మహిళా సంఘపు నిబంధనలకు లోబడి ఆంధ్రరాష్ట్రీయ సభలు జరుగు తున్నాయని తెలిపింది. అక్కడ అందరూ మాతృభాషలో అభిప్రాయాలు చెప్పగలుగుతున్నారనీ, కాని సభాధ్యక్షులుగా ఇంగ్లీషు వచ్చిన వారిని పెట్టటంలో స్త్రీలు కొంత అసంతృప్తికి కారకులవుతున్నారనీ, అఖిలభారత మహిళాసభలలో ఇంగ్లీషు, హిందీలో మాట్లాడేవారుండటంతో చర్చిస్తున్న విషయాలు ఆంధ్ర స్త్రీలకు అర్థం కావాలంటే ఆ సభావిషయాలను అనువదించి పత్రికాముఖంగా ప్రకటిస్తే రాష్ట్రీయ స్త్రీలకు అవగాహన ఏర్పడుతుందని చెప్పింది. సభలలో అవసరం మేరకే రాష్ట్రీయ సభలలో ఇంగ్లీషు భాషను వాడాలనీ, ఎక్కువగా మత, సంఘ, రాజకీయార్థిక సమస్త విషయములందునూ ఆంధ్రస్త్రీల విద్యావివేకాలు గుర్తింపబడుతున్నాయనీ, అందుకే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

*మహిళలఉద్యమం సాధించిన విజయంగా స్త్రీల హక్కులకై చేసిన చట్టాలు మహిళా ప్రగతికి ఉపయోగపడటంగా అర్థమవుతుంది. అనేక రాష్ట్రాలనుండి వివిధ భాషలను మాట్లాడే స్త్రీలు ఉంటారు కాబట్టి ఆంగ్లంలో చేసిన ఉపన్యాసాలను వారు అర్థంచేసుకొనేటట్లుగా అనువదించాలని సూచించింది. ఆంధ్రస్త్రీల శక్తి సామర్థ్యాలనుబట్టి ఆంధ్ర రాష్ట్రం కావాలని కోరుకొంది.*

'కనుపర్తి వరలక్ష్మమ్మ' (సెప్టెంబరు1933 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు తెలియజేస్తూ బాపట్లలో పుట్టి నాల్గవతరగతి వరకు చదివిన కనుపర్తి వరలక్ష్మమ్మ పత్రికాపఠనంతో ప్రపంచ జ్ఞానాన్ని పొంది గృహలక్ష్మి, భారతి, ఆంధ్రపత్రికలలో ఎన్నోవ్యాసములు, కవితలు,

కథలు పుంఖాను పుంఖాలుగా వ్రాసిన రచయిత్రి అనీ, స్త్రీలంటే అబలలు కారనీ, వారికి స్వతంత్రం ఉండాలని భావించిందని తెలిపింది. స్త్రీలస్వాతంత్రమే దేశస్వాతంత్రానికి దారితీస్తుందని భావించి సాహిత్య సృజనకావించిందనీ, బాపట్లలో 1931 సంవత్సరంలో 'స్త్రీహితైషిణీ మండలి'ని స్థాపించి స్త్రీవిద్యాభివృద్ధికి కృషిచేస్తూ, స్త్రీలకు శాస్త్రజ్ఞానం, కళలు చరిత్ర, వృత్తి విద్యలు, ఉన్నత విద్య, పారిశ్రామిక విద్యలు కూడా అభ్యసించాల్సిన అవసరాన్ని గురించి తెలియజేసిందని ఆమెను గురించి పత్రిక తెలియజేసింది.

'కనుపర్తి వరలక్ష్మమ్మ'ను గౌరవిస్తూ చేసిన గృహలక్ష్మి స్వర్ణకంకణ సన్మానోత్సవాన్ని పత్రిక ప్రచురిస్తూ (ఏప్రిల్ 1934 గృహలక్ష్మి) ఆ సందర్భాన్ని పురస్కరించుకొని సంగం లక్ష్మీబాయమ్మ మాట్లాడిన విషయంగా తెలియజేస్తూ కనుపర్తి వరలక్ష్మమ్మ శారద లేఖలను వ్రాసి కేసరిగారికి అంకితం చేసిందనీ, 'శారదలేఖలు' దేశంలో జరుగుతున్న దురాచారాలను చక్కగా చాటినవనీ, వాటిని బాలికలకు పాఠ్యాంశంగా పెట్టాలని చెప్పింది. కనుపర్తి వరలక్ష్మమ్మ చేసిన సూచనప్రకారం పత్రికా సంపాదకురాంద్రుగా స్త్రీలుండాలని వరలక్ష్మమ్మ వ్రాసిన విషయాన్ని గుర్తుచేసి, స్త్రీలు పత్రికా సంపాదకత్వాన్ని చేపట్టినా ఎక్కువ రోజులు చేయలేక పోతున్నారని, అయినా గృహలక్ష్మి పత్రిక స్త్రీల సంపాదకత్వాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నదని తెలియచేసింది. అదే పత్రికలో కనుపర్తి వరలక్ష్మమ్మ మాట్లాడిన విషయంగా తన విద్యాభివృద్ధికి చిన్నతనం నుండి సోదరులు, తర్వాత భర్త, తోడ్పడేవారనీ, పురుషులు స్త్రీలయెడ నెంత ఉదారంగా, ఎంత సరళంగాఉంటే స్త్రీ జీవితం అంతగా విశ్వాసం చెందుతుందనీ, డా. కె.యన్. కేసరిగారి ఆధ్వర్యంలో గృహలక్ష్మి పత్రిక విజ్ఞాన వ్యాప్తికే గాక, స్త్రీలను కూడ ఉద్ధరిస్తోందనీ గృహలక్ష్మి పత్రికకు స్త్రీలు సంపాదకత్వం చేస్తే బాగుంటుందని సూచించింది. తన భర్త సహకారం ఉండటం చేతనే తాను గత 6 ఏళ్ళ నుండి గృహలక్ష్మి పత్రికకు రచనలు చేయగలుగుతున్నానని చెప్పి, గృహలక్ష్మి పత్రిక ఆంధ్రమహిళా భ్యున్నతికై అశేషకృషి సాగిస్తోందని వరలక్ష్మమ్మ తెలియజేసింది. పత్రికాధిపతులైన కేసరి ప్రసంగిస్తూ సనాతన, ఆధునిక భావాలు గల సంఘసంస్కర్తల మధ్య ఐకమత్యం ఉండాలనీ, దానివల్ల దేశానికి స్వాతంత్ర్యం సులభంగా వస్తుందనీ, రాజకీయ, నైతిక మత, సాంఘిక విషయాలను స్త్రీ, పురుషులకు ఈ 'శారదలేఖలు' సుప్రభోదాన్ని చేస్తున్నాయనీ, అందుకే కనుపర్తి వరలక్ష్మికి స్వర్ణకంకణ సన్మానోత్సవం చేస్తున్నామని పత్రిక పేర్కొనటం జరిగింది. అంతేకాదు సంఘాభివృద్ధి స్త్రీలయోగక్షేమాలమీదనే ఆధారపడి ఉంటుందనీ, స్త్రీ, పురుషుల అన్యోన్యమైత్రి ఏర్పడినప్పుడే దేశస్వాతంత్ర్యం సిద్ధిస్తుందని వరలక్ష్మమ్మ భావించినదనీ, నెల్లూరులోని వర్ధమాన సమాజంవారు ఆమెను సన్మానించారని తెలిపింది. వరలక్ష్మమ్మ 'శారద లేఖల' పేర మహోప న్యాసాలను వ్రాసిందనీ, రాజకీయ, నైతిక, మత, సాంఘిక విషయాలను మహిళాలోకానికి తెలియ చేసిందనీ, దేశహితమునకై శారదలేఖలను వ్రాసినదనీ, ఆమెయొక్క సన్మానపత్రంలో పత్రిక తెలియ జేసింది. కనుపర్తి వరలక్ష్మమ్మ స్త్రీలనుఉద్ధరించటానికై అనేక రచనలు చేసిందని చిల్కపాటి సీతాంబ.

*"రచనయందు నీతి విదురత్వము నందు మనోహరంబులే*
*వచనములందు రమ్యమృదువాణిలోని సజ్జన సమ్మతంబుల్*
*సుచరితలందు వస్తుపరిశోధనాతాలిచణత్వమందు నిం*
*కెచటుదలచి చూడసరియే వరలక్ష్మి సతీమతల్లికిన్"* అని పద్య కవిత్వంచెప్పి

ఆమెను సభలో ప్రశంసించింది. ఆ సభలోనే శిష్టా వరలక్ష్మమ్మ ఉపన్యసిస్తూ, 'శారదలేఖలు' స్త్రీల రచనలకు ఒరవడి పెట్టాయని పేర్కొంది.

'నాల్గవ అఖిల భారత మహిళా మహాసభను (ఏప్రిల్ 1930 వాసవి) గురించి పత్రికాధిపులు వ్రాస్తూ ఆ సభలో చేసిన తీర్మానాలను తెలియజేస్తూ, స్త్రీల పాఠశాలలో సంగీత, నృత్య, గృహపారిశుద్ధ్యం, పాకశాస్త్రం, శిశుపోషణ ఆరోగ్యశాస్త్రానికి సంబంధించిన పాఠ్యాంశాలు తప్పక ఉండాలనీ, స్త్రీలకు తీరుబడియైన మధ్యాహ్న సమయాలలోను, రాత్రిపాఠశాలవంటివి ఏర్పాటుచేయాలని తీర్మానాలు చేసారని పత్రిక తెలిపింది. బీదరికం, వయసుతో సంబంధం లేకుండా అందలి స్త్రీలకువిద్యాభివృద్ధి చేయాలనీ, సేవాసదనాలైన శాంతినికేతనం, కార్వే స్త్రీలవిశ్వ కళాశాల, దేవదారుసదనం, మధువాసరం, గుంటూరులోని శారదానికేతనము మొదలగు సంస్థలలో నవీనపద్ధతిలో విద్యావిధానం ఉండేవిధంగా ఉపాధ్యాయినులకు శిక్షణయివ్వాలనికూడా తీర్మానం చేసారని తెలియజేసింది. శారదాచట్టం వచ్చినాకూడా ప్రౌఢవివాహాలలో భాగంగా స్త్రీలవయస్సు 14 సం.లకు కాకుండా 16 సం.లకు పురుషుల వయస్సు 21 సం.లకు పెంచి శాసనాలు చేయాలనీ, నిర్బంధ వివాహాలు ఉండకూడదనీ, బహుభార్యాతత్వాన్ని నిషేధించాలనీ, అసమాన వయోవివాహాలుచేసే తల్లిదండ్రులను శిక్షించాలని తీర్మానంచేసారని చెప్పింది. అంతేకాక, హిందూ వితంతువుకు భర్తభాగంలో ఆస్తిహక్కు మరియు దత్తతహక్కు ఉండాలనీ, బిడ్డల సంరక్షకులుగా తల్లిదండ్రులిద్దరికీ సమానాధికారాలుండాలని తీర్మానంచేసారనీ పత్రిక తెలిపింది. ఘోషా పద్ధతివల్ల స్వేచ్ఛలేక అసమర్థత పెరుగుతూంది కాబట్టి ఘోషాపద్ధతిని నిషేధించాలనీ, వేశ్యావ్యవస్థను రూపుమాపి వారిలో వివాహేచ్ఛకలిగే విధంగా ముత్తులక్ష్మి బ్రోతల్ బిల్లును పెడుతున్నారని చెప్పినట్లు పత్రిక పేర్కొంది. బిడ్డల చెడుప్రవర్తనకు కోర్టులో శిక్షించటం కంటె కూడా వారిలో సత్ప్రవర్తన కలిగించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసి దండనాధికారాన్ని దయాళులైన స్త్రీలకే ౦ంచాలని తీర్మానించారు. అస్పృస్యతానివారణ చేయాలనీ, ప్రజలలో దేశాభిమానాన్ని జాత్యభిమానాన్ని పెంచాలనీ, అంతర్జాతీయ సౌభ్రాతృత్వం నేర్పాలనీ, వైశ్యసంఘం వారు గాంధీతత్వంతో స్వరాజ్యం కొరకు సత్యాగ్రహాల్లో పాల్గొనాలని తీర్మానం చేసినట్లుగా పత్రిక తెలియజేసింది.

*స్త్రీలకు వయోజన విద్య, ఆస్తిహక్కు, సమానాధికారాలు, న్యాయవ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యాన్ని చర్చకు పెట్టటమేకాక, ఘోషాపద్ధతిని, వేశ్యావ్యవస్థను రూపుమాపాలనీ, వైశ్య స్త్రీలు కూడా సత్యాగ్రహోద్యమంలో పాల్గొనవలసిన అవసరాన్ని తీర్మానాలుగా చేసి స్త్రీలను చైతన్య పరచటం కనపడుతోంది.*

ఇందిరాదేవి వ్రాసిన 'మానవసంఘం' (ఏప్రిల్ 1930 వాసవి) అనే వ్యాసంలో మానవుల విద్య, సర్వమత సామరస్యంకోసం దివ్యజ్ఞానం ఏర్పడినదనీ, దేశానికి పాటుపడేవాళ్ళు తమకున్నదాంట్లో కొద్దిగా బీదలకు పెట్టాలనీ, గ్రామాలలో అన్ని కులాల, మతాలవారు ఐకమత్యంగా ఉండాలని తెలిపింది. గాంధి ఆదర్శాన్ని పాటిస్తే దేశోద్ధరణకై కృషిచేయటమే మానవ సంఘసేవ అని చెప్పింది. వారిలో మానవసేవ యొక్క ముఖ్యోద్దేశ్యాన్ని చెబుతూ, దేశోద్ధరణలో మానవసేవ ముఖ్యమని తెలియజేసింది.

అయ్యగారి రుక్మిణమ్మ వ్రాసిన 'పల్లెటూళ్ళు' (జూన్ 1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పల్లెటూళ్ళను మార్చిన గాని దేశం అభివృద్ధి చెందదనీ, విద్యాధికులు పల్లెల్లోని ప్రజలతో మమేకమై వారిలోని దుర్గుణాలను మాన్పించి, విద్యను అభివృద్ధి చేయాలని తెలిపింది. ప్రతికుటుంబంలో స్త్రీలు విద్యావిహీనులుగాను, బాలవితంతువులుగాను, కష్టపడుతున్నారనీ, భర్తలు భార్యలను పశు వులకంటె కూడా హీనంగా చూస్తున్నారనీ, గర్భిణులు దురవస్థకు లోనవుతున్నారనీ, నాయకులు దేశోద్ధరణకై పూనుకోవాలని భావించింది. దేశప్రగతికి పల్లెటూళ్ళు పట్టుగొమ్మలనీ, పట్టణాలలో స్త్రీలు అభివృద్ధిచెందితే సరిపోదనీ, అభివృద్ధి జరగాల్సింది ప్రధానంగా పల్లెల్లో అని తెలియజేసింది.

*గ్రామీణ స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత దేశనాయకత్వం పైన ఉందని భావించింది.*

జి.వెంకమ్మ వ్రాసిన 'ప్రౌఢవివాహముల వలన లాభనష్టములు' (జులై 1930 గృహలక్ష్మి) అనే వ్యాసంలో యుక్తవయస్కులైన తరువాత ఒకరినొకరు వరించి చేసుకొనే వివాహంవల్ల ప్రౌఢ వయస్సులో బలంగా ఉన్నవారియొక్క సంతానంకూడా దృఢంగా ఉంటుందనీ, ఆ వయస్సులోనే కామమనే స్పందనలు కలుగుతాయని తెలిపింది. బాల్యవివాహాలవల్ల బాలవితంతువుల సంఖ్య అధికమౌతుందనీ, బాల్యవివాహాలవల్ల భర్తయొక్క అనురాగం అంటే ఏమిటో తెలియనిస్థితిఅనీ, బాల్యవివాహాలవల్ల బాలికల విద్య అభివృద్ధి చెందదనీ, స్త్రీ పురుషులిద్దరూ బాల్య వివాహం వల్ల విద్యావిహీనులుగా ఆజ్ఞానులుగా ఉండటంతో వారికి అభివృద్ధి ఉండదనీ అభిప్రాయపడింది.

*ప్రౌఢవివాహాలవల్ల స్త్రీల విద్యాభివృద్ధి పెరుగుతుందనీ, అదే స్త్రీ పురుషుల అభివృద్ధి సూచకమనీ భావించింది.*

యన్.రాజ్యలక్ష్మమ్మ 'స్త్రీలకెట్టి విద్యయవసరము' (ఆగష్టు 1930 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ బుద్ధిశాలియైన పురుషుడు తన భార్యను విద్యావతిగా చేయాలనీ, స్త్రీలకు అనేక భాషలలో పరిచయం ఉండాలని తెలిపింది. ఆరోగ్యం, విద్య, మితవ్యయం తెలియాలిగానీ, ఉద్యోగానికై అర్రులు చాచాల్సిన అవసరం లేదనీ, స్త్రీలకు గృహకృత్యములకు సంబంధించిన విద్య ఉంటే చాలని తెలియజేసింది.

'వ్యాయామవిద్య'ను (సుధ మాసపత్రిక జనవరి 1931) గురించి ఆచంట రుక్మిణి వ్రాస్తూ చంద్రగుప్తుని కాలంలో రక్షకభట వర్గమంతా స్త్రీలతోనే నిండి ఉండేదనీ, బాలబాలికలకు

పాఠశాలలో వ్యాయామవిద్యను నేర్పటానికి మదరాసు విశ్వవిద్యాలయంవారు వ్యాయామ ఉద్యోగినిని నియామకంచేసారనీ, స్త్రీలు వ్యాయామంతో బలాఢ్యులుగ తయారయితే వారికి ప్రసవసమయంలో కష్టాలు ఉండవని తెలియజేసింది.

*స్త్రీలకు వ్యాయామవిద్య అవసరమని భావించింది.*

అంతర్జాతీయ సమావేశానికి వెళ్ళివచ్చిన స్త్రీగా ఆంధ్రస్త్రీలకీర్తిని ఖండాంతరాలకు వ్యాప్తిచేసిన 'ఆచంట రుక్మిణమ్మ'ను (జులై 1931 గృహలక్ష్మి) గురించి పత్రిక తెలియజేస్తూ లవణసత్యాగ్రహ సమరంలో ప్రభుత్వంచేత పట్టుబడిన ప్రథమాంధ్రపురంధ్రిగా ఆంధ్రరమణుల సాహసాన్ని చాటిచెప్పిందనీ, 1929 సంవత్సరం, డిసెంబరు 26, 28 తేదీలమధ్య లాహోరులో జరిగిన అఖిలభారత మహిళాసభకు అధ్యక్షతను వహించిందని తెలిపింది. 1930 లో ప్రథమాంధ్ర శాసనకర్త్రయైనదనీ, యువజనమహాసభకు అధ్యక్షత వహించిన దేశసేవా పరాయణియనీ, విద్యావతిగా మద్రాసు విశ్వవిద్యాలయము సెనేట్ మెంబరుగా ఆంధ్రస్త్రీల గౌరవాన్ని ఇనుమడింప జేసిందనీ, ఐదవ ఆంధ్రమహిళాసభలో అధ్యక్షురాలిగా ఉన్న ఆచంట రుక్మిణమ్మను చూసి ఆంధ్రస్త్రీలు గర్వపడుతున్నారని తెలియచేయటం జరిగింది.

*విద్యావంతురాలైన స్త్రీగా విదేశీ సమావేశాలలో పాల్గొనటమే గాక, శాసననిర్మాణకర్త్రగా ఎదగటమే స్త్రీల అభివృద్ధియొక్క పతాకచిహ్నంగా భావించవచ్చు.*

శ్రీ నాళం రామలింగయ్య నెలకొల్పిన రాజమండ్రిలోని 'వైశ్యసేవా సదనం' (ఫిబ్రవరి 1931 వాసవి)ని గురించి పత్రికాధిపులు తెలియజేస్తూ వైశ్యస్త్రీల అభివృద్ధికై నాళంవారు వైశ్యసేవాసదనాలను1920లో స్థాపించారనీ, అందులో మతం, వాఙ్మయం, వైద్యం, లలితకళలు, కార్మికవిద్యలు నేర్పించటమేకాక స్త్రీలలో సౌభ్రాతృత్వం, ఆత్మవిశ్వాసాలను అభివృద్ధి చేసుకునేటట్టు చేసారనీ, స్వయంకృషితో సంస్కృతాంధ్ర ఆంగ్లవిద్యలు నేర్చిన బత్తుల కామాక్షమ్మ దీనికి నియంత్రణాధికారిణిగా ఉండేవారని పత్రిక తెలిపింది.

*ఒక స్త్రీ వైశ్యసదనానికి నియంత్రణాధికారిగా ఉండటమంటేనే స్త్రీలయొక్క యాజమాన్య నిర్వహణా సమర్థత అర్థంఅవుతుంది.*

'హిందూదేశ ఆశయములు' (ఫిబ్రవరి 1931 వాసవి) అనే శీర్షకన దర్భి అన్నపూర్ణమ్మ వ్రాసిన జిడ్డుకృష్ణమూర్తి గారి 'థియాసఫి ఇన్ ఇండియా' అనే దానికి చేసిన అనువాదంలో దేశము కంటె జీవితం ముఖ్యమనీ, జీవితంయొక్క ఆదర్శాలను గమనించిన దేశమే నిజమగు స్వతంత్రతను పొందుతుందనీ, ఏదేశం సాంస్కృతిక స్వాతంత్ర్యాన్ని పొందలేదని తెలిపింది. రాజకీయ స్వాతంత్ర్యత గల ప్రదేశాలలో నిర్బంధాలు లేకపోతేనే ప్రతివ్యక్తి ఆత్మశక్తిని విజృంభింప చేసుకుంటారనీ, పూర్వసాంప్రదాయాలను పాటించాలని భావిస్తే అది స్వేచ్ఛకు భంగాన్ని

కలిగిస్తుందనీ, ఏదేశం ఏజాతిగాని అంతరంగమున స్వతంత్రించనిదే బహిరంగమున స్వేచ్ఛను పొందజాలదని తెలియజేసింది. హిందూదేశము కష్టపరంపరగా క్రమంగా అనుభవాల్ని సంపాదించి పరిపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందుతుందనీ, బాల్యవివాహాలు, నిర్బంధవైధవ్యం, వితంతువులకై పెట్టిన ఆచారాలు, స్త్రీలను నిర్లక్ష్యంగా చూడటం, కుల విభజన, ధనిక, బీదతేడాలు పోయి దేశములో జ్ఞానశక్తి ప్రజ్వరిల్లాలని చెప్పింది. అప్పుడే ప్రజలు సాంఘిక, రాజకీయ స్వాతంత్రాన్ని పొందగలరనీ, గర్వము విడనాడి దేహశుశ్రుత, పనిని తగ్గించుకునే ఉపాయాలు, సాంఘిక స్వాతంత్ర్యం, పరస్పర సహాయం చేసుకొనుట వారికి కర్తవ్యంగా ఉండాలని తెలియజేసింది.

*అంతర్గత మానసిక స్వేచ్ఛ మానవ వికాసానికి మూలమనీ, స్త్రీలకు సాంస్కృతిక సమానత్వం కావాలనీ, వర్గ, కుల భేదాలు పోతే ఏర్పడే జ్ఞానం సాంఘిక స్వాతంత్ర్యానికి దారితీస్తుందనీ, అప్పుడే స్త్రీలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందగలరని చెప్పింది. దాని ఫలితంగా మానవులు దేశంలో పరిపూర్ణస్వాతంత్ర్యాన్ని పొందుతారనీ చెప్పి, స్వాతంత్ర్య సముపార్జనా మార్గాలను అన్వేషించమనే ప్రబోధం చేసింది. సమాజంలోని సాంస్కృతిక సమానత్వానికి, అంతర్గతస్వేచ్ఛకు, దేశస్వాతంత్ర్యానికి ఉన్న లంకెను తెలియజేసింది.*

'దరిశి అన్నపూర్ణమ్మ' (జనవరి 1932 నాటి గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపుల ప్రచురణలో 1907లో జన్మించిన ఆమె బళ్ళారి కాన్వెంట్, తిరువళ్ళి బాలికల ట్రైనింగ్ కాలేజీలోనూ, గుంటూరు శారదా నికేతనంలో విద్య పూర్తి చేసిందని పేర్కొంది. సికింద్రాబాద్ నగరంలో విద్యార్థినిగా పాఠశాల వార్షికోత్సవంలో 'ప్రహ్లాద నాటకమండలి' తరపున లీలావతి పాత్రను పోషించి బహుమానాలను పొందిందనీ, దివ్యజ్ఞాన సమాఖ్యలో ఉపన్యాసాలు ఇచ్చేదని తెలియజేసింది. అంతేకాక, బెజవాడలోని సమాజంలోనూ, ఆంధ్రమహిళాసభకు కార్యదర్శినిగా ఉందనీ, బొంబాయిలో జరిగిన అఖిలభారత మహిళా సభకు తెలుగుజాతి తరపున ప్రతినిధిగా వెళ్ళిందని తెలియజేసింది. ఆమెకు దర్శి చెంచయ్యగారితో వివాహమయిన తరువాత దంపతులిద్దరూ కలిసి బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, విశ్వబ్రాహ్మణ వితంతు బాలికలకు వివాహం చేసారనీ వితంతువులకు ద్రవ్య సహాయం చేసారనీ వ్యభిచారిణులను ఉద్ధరించారనీ, వీరికి అస్పృశ్యత, జాతి వివక్ష లేదనీ, స్త్రీ, పురుషులకు సమానమైన హక్కులు, సమానమైన బాధ్యతలు ఉండాలని వాంఛించే వారిలో దరిశి అన్నపూర్ణ ఒకరని పత్రిక తెలిపింది. 1930 వ సం.లో లవణ సత్యాగ్రహంలో పాల్గొన్నదనీ వాసవి పత్రికలకు వ్యాసాలు వ్రాసేదనీ వైశ్యులకు నవీన సాంప్రదాయములను బోధించేదని, కాని ఆమె 25 సం.లకే మరణించటం దుఃఖదాయకమని గృహలక్ష్మి పత్రిక తెలియజేసింది..

*స్త్రీలు చదువుకుంటే ఏ స్థాయికన్నా ఎదగగలరనీ, సత్యాగ్రహంలో సమైక్యతకై హరిజనోద్ధరణ ముఖ్యమని భావించిన గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టిన స్వాతంత్రసమర శీలిగా దర్శి అన్నపూర్ణ జీవితం స్పష్టమవుతుంది.*

తూనుగుంట్ల వేంకటసుబ్బమ్మ వ్రాసిన 'శారదానికేతనము నందు వైశ్యబాలిక రజస్వల యగుట' అనే వ్యాసంలో (ఫిబ్రవరి 1932 వాసవి) చిట్టూరి అన్నపూర్ణాదేవి గుంటూరు నందలి శారదానికేతనంలో ఆంధ్రాంగ్ల, సంస్కృతం, సాహిత్యం, గానం, చిత్రలేఖనం చదువుతూ 14 ఏండ్ల వయస్సులో రజస్వల అయినప్పుడు ఆశ్రమాధిపతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ శాస్త్రోక్తంగా ఆశ్రమ విద్యార్థినుల సమక్షంలో వేడుకలు జరిపించారనీ, ఇల్లిందల సరోజినీదేవి వచ్చి ఋతుధర్మమును గురించి ఉపన్యసించిందని పేర్కొంది. ఆమె తల్లిదండ్రులు ఆమెకు 16 ఏండ్ల వయస్సువరకు అందులోనే విద్యగరపించే ఒడంబడిక ఉండటంతో ఆమె సాహితీ పరీక్ష వ్రాసినట్లు తెలిపింది.

*ఋతుధర్మాన్ని బాహాటంగా చేసిన ప్రకటన ఒక నూతన లైంగిక సంస్కృతీ సంకేతంగా భావించాలి. ఆ రకంగా బాలిక విద్యను కొనసాగించటమే కాక రజస్వలానంతర వివాహానికి అడుగులు వేయటంగా అర్థం అవుతుంది. శారదానికేతనంవల్లనే బాల్యవివాహాలు, నిర్బంధ గృహస్థాశ్రమం తగ్గి, ఆడపిల్లలు చదువుకోగలిగారనీ, దానికి ప్రయోగాత్మక ఉదాహరణగా భావించటం చేత తరువాత వారికి ఆదర్శంగా నిలిచిన సంఘటనగా దీనిని చెప్పుకోవచ్చు.*

జి.శ్యామలాంబ వ్రాసిన 'వైశ్య వితంతువుల యొక్క విద్యాభివృద్ధి' (మార్చి 1931 వాసవి) అనే వ్యాసంలో బాల వితంతువులకు విద్యచెప్పించుట ముఖ్యావశ్యకమనియు "కూతురు యింటను విధవై కూడువండ, తండ్రి రెండవ పెండ్లాడి తరుణిగూడె" అని స్వార్థముతో తండ్రి, కూతుర్ని సంఘమునుండి విడదీయకూడదనీ, కూతురుకు విద్యను నేర్పిస్తేవారే గురువులై పిల్లలను పాఠశాలకు పంపుతారని తెలిపింది. నాళంవారు వితంతు శరణాలయాలను, సేవాసదనమును ఏర్పాటుచేసి ఉభయభాషా ప్రవీణయైన బత్తుల కామాక్షమ్మను నియమించారనీ, ఆడపిల్లను భర్తల దగ్గరకు పంపేటప్పుడు లేని దుఃఖము, బాలవితంతువులను విద్యకై సేవాసదనాలకు పంపేటప్పుడు కూడా ఉండకూడదనీ, విద్యాబుద్ధులు నేర్పిస్తే వారు సన్మార్గవర్తనతో దుశ్చింతకు దూరమవుతారని చెప్పింది.

*స్త్రీలకుండాల్సిన సాంఘిక సంబంధాలను స్పష్టపరచిన వ్యాసం. వైశ్యకులంలో స్త్రీలు విద్యలో వెనకబడిఉన్నారనీ, వితంతువులకు విద్యనేర్పించటానికి నాళంవారు వితంతు శరణాలయాలను కట్టించారనీ, ఈ విషయంలో బత్తుల కామాక్షమ్మ కృషిగొప్పదనీ, సత్ప్రవర్తనకు, విపత్తులు పొగొట్టుకోవటానికి వైశ్యవితంతువులు విద్యనేర్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

గంటి శేషమ్మ వ్రాసిన 'గ్రామపునర్నిర్మాణం-స్త్రీల బాధ్యత' (ఏప్రిల్ 1931 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ఏ కార్యము చేపట్టినసూ స్త్రీలే బాధ్యత వహిస్తారు కాబట్టి కొత్తగా బాధ్యతను గురించి గుర్తు చేయనక్కరలేదనీ, ప్రస్తుతం గ్రామాలన్నీ దుర్వాసనతో, మురుగు గుంటలతోనూ, మంచినీటి చెరువులు బురదగుంటలుగానూ ఉన్నాయనీ, గ్రంథాలయాలు గానీ క్రీడాస్థలాలుగానీ

లేవనియూ, స్త్రీవిద్యాభివృద్ధి లేదని, గ్రామాలలో అంతటా బాలవితంతువులేనని శారదాబిల్లుకు అడ్డుపడుతున్నారని తెలియజేసింది. స్త్రీని అబల అని పిలిచిననాటి నుండియే దేశం క్షీణదశనొందు చున్నదనీ, సబలలనే భావనతోనే గాంధీ స్త్రీలను ఉద్యమానికి ఆహ్వానించాడనీ, గ్రామాలు పునర్నిర్మాణం కంటెకూడా ముందుగా అవి పునరుజ్జీవనం చెందాల్సిన అవసరం ఉందనీ, దానికై విద్యావంతులైన స్త్రీలు గ్రామాలలోని స్త్రీలకు విద్యా, దేహ మనోబలములను అభివృద్ధిచేయాలనీ, అదే సమస్తకార్యసాధనకు వీలుకల్గిస్తుందని భావించింది. స్త్రీలు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకునే మెలకువలను, పూలమొక్కలు, కూరగాయల పెంపకాన్ని, ఆరోగ్యమార్గాలను, శిశుపోషణా పద్ధతులను పల్లెలోని స్త్రీలకు చెప్పాలనీ, మద్యపానాన్ని రూపుమాపటానికి స్త్రీలు పూనుకోవాలనీ తెలిపింది. అంతేకాక, గ్రామస్థులు అందరూ కలసి సహకార సంఘాలేర్పరచుకొని తమతమ వృత్తులను అభివృద్ధిచేసుకోవాలనీ, స్త్రీలు విద్యావంతులైతే అబలలు అనే తమకున్న అపప్రథను పోగొట్టుకోగలరని తెలియజేసింది.

*లోకల్ బోర్డు ఎన్నికలలో నిలబడటానికి ముందుగా గ్రామాల స్థితిగతులు అధ్యయనం చేయటం, గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకునే స్థాయికి స్త్రీలు ఎదగాల్సిన అవసరాన్ని తెలిపే సాహిత్యం వచ్చింది. ఉప్పుసత్యాగ్రహానంతరము స్వయంప్రతిపత్తికై రౌండుటేబుల్ సమావేశాలకు వెళ్ళి స్వరాజ్యం విషయంలో విఫలమవుతున్న సమయంలో జిల్లాలు, పంచాయితీ స్థాయిలో ఎక్కడికక్కడ స్వయంప్రతిపత్తి కలిగేవిధంగా గ్రామీణాభివృద్ధి పునర్నిర్మాణానికై స్త్రీలు నడుముకట్టాలన్న ఆలోచనలు పెరిగాయి. పల్లెలలో స్త్రీలకున్న గృహపరిపాలనా బాధ్యతతోపాటు, గ్రామపునరుజ్జీవనంలో స్త్రీల భాగస్వామ్యం అవసరమని తెలియచేయటం జరిగింది. 1928లో మద్రాసుప్రభుత్వచట్టం మున్సిపాలిటీలు మరియు లోకల్ బోర్డులలో స్త్రీలకు ప్రాతినిధ్యం కల్గించిన సమయంలో స్త్రీల బాధ్యతను గుర్తు చేయటం జరిగింది.*

సమయమంత్రి రాజ్యలక్ష్మమ్మ వ్రాసిన 'గ్రామపునర్నిర్మాణం–స్త్రీల బాధ్యతలు' (మే. 1931 గృహలక్ష్మి)అనే వ్యాసంలో గ్రామ పునర్నిర్మాణంలో స్త్రీ పురుషులు సమానంగా భాగస్వాములవ్వాలనీ, దేశాభివృద్ధికి గ్రామాభివృద్ధి ముఖ్యమనీ, గ్రామాలలో సామాజిక ఆరోగ్యం, పాడి, పశుపోషణ, మంచినీటి వనరుల ఏర్పాటు, గ్రామప్రజల విద్యాభివృద్ధి జరగాలని తెలిపింది. ఆర్థిక పుష్టికై ఖర్చులు తగ్గించుకోవటం, అభివృద్ధికర నూతన వ్యవసాయ పద్ధతి, నూలు వడకటం, వ్యసనాలు వీడటం, స్త్రీవిద్యాభివృద్ధి, పత్రికాపఠనం, శిశుపోషణ, కుట్టుపని వంటి విషయాలలో వృద్ధి జరిగేటట్టు చూడాలనీ, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని తెలియచేసింది.

*సమగ్ర గ్రామీణాభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం పునాదిగా ఏర్పడటమే రాజకీయపాలనా చైతన్యానికి, స్వపరిపాలనకోసం కలిగిన ముందుచూపునకు మచ్చుతునకగా భావించవచ్చు.*

రామరాజు మైత్రేయి వ్రాసిన 'గ్రామపునర్నిర్మాణము-స్త్రీలబాధ్యత' (జూన్ 1931 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పల్లెలలోని ధనికులు పిల్లల చదువులకై పట్టణాలకు వలసపోయారనీ, బీదలకు విద్యాగంధం ఉండటంలేదనీ, ధనిక బీదలమధ్య అంతరం పెరిగిపోతోందనీ, పైపెచ్చు బీదలలో మద్యపానం ఉంటోందని తెలిపింది. అంతేకాక, గ్రామజనాభా ఎక్కువనియు, ఆదాయం ఎక్కువగావచ్చే గ్రామాలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదనియు, దేశభవన నిర్మాణాలకు గ్రామాలే పునాదులనియు, గ్రామచికిత్సాలయాలలో సౌకర్యాలు పెంచితే గ్రామప్రజల ఆరోగ్యం బాగుంటుందని తెలియచేసింది. పట్టణీకరణ గ్రామాలలోకి చేరి వర్గభేదాన్ని సృష్టిస్తోందనీ, గ్రామాభివృద్ధిలో గ్రామప్రజల ఆరోగ్యం ముఖ్యమని భావించింది. అంతేకాదు గ్రామస్వరాజ్యం ఉండాలనీ, గ్రామాల సమస్యలు రచ్చబండలోనే తీర్చుకోవచ్చనీ, గ్రామ పంచాయతీల పునరుద్ధరణకై కొండ వెంకటప్పయ్య కృషి చేసారనీ 1920 లో ఆమోదింపబడిన మద్రాసు గ్రామపంచాయితీ శాసనంవల్ల గ్రామపారిశుద్ధ్యానికి, ఆరోగ్యానికి, విద్యకు, నీటిపారుదలకు ప్రాధాన్యం పెరిగిందని తెలియజేసింది. పల్లెలలో స్త్రీలు చిన్నచిన్న సంఘాలుగా ఏర్పడి సుఖప్రసవాల గురించి, శిశు పోషణ, ఆరోగ్యవిధులను గురించి గ్రామపంచాయితీల యాజమాన్యం క్రింద ప్రదర్శనలివ్వాలనీ, పాఠశాలలు ఏర్పరచుకోవాలనీ, దినపత్రికల విషయాలను, హరికథలమూలంగాను గ్రామప్రజలకు అందేటట్లు చేయాలనీ తెలిపింది. పెన్నానది దగ్గర డామ్ కడితే సాగునీరు అందుతుందనీ, సహకార పరపతిసంఘాలద్వారా వ్యవసాయాన్ని అభివృద్ధిచేయాలని, స్త్రీలకు వయోజనవిద్యను, గృహ పరిశ్రమలవిజ్ఞానాన్ని నేర్పాలనీ, భారతరాజ్యాంగ పరపాలనావిషయాలను వారికి తెలియచేయాలనీ దానికై నాటకాలు, వీధిభాగవతాలవంటి కళాప్రక్రియలను ఉపయోగించుకోవాలని చెప్పింది. పల్లెల్లో గ్రంథాలయాలను అభివృద్ధిచేయాలనీ, గ్రంథాలయాలలో ఇంగ్లీషు దినపత్రికలలోని విషయాలను తెలియజేయాలనీ, బాలికలకు ప్రత్యేక గ్రంథాలయాలుండాలనీ, అవసరమైతే స్త్రీలకందుబాటుగా సంచారగ్రంథాలయాలు ఉండాలనీ, గ్రామాలలో ఉపాధ్యాయులు, వైద్యవిద్య నేర్చినవారు ఇతర దేశాలలోని గ్రామాలను గురించి తెలుసుకొనివచ్చి భారతదేశంలోని గ్రామాలను పునర్నిర్మించు కోవాల్సిన అవసరం ఉందని తెలియజేసింది.

*గ్రామపరిపాలనకు, గ్రామాభివృద్ధికి అవసరమైన అన్ని విషయాలను పేర్కొనటం జరిగింది. సమగ్ర గ్రామాభివృద్ధికి గ్రామస్వరాజ్యం కావాలనీ, గ్రామప్రజలే తమతమ గ్రామాల సమగ్రవికాసానికై గ్రామాలను పునర్నిర్మించుకోవాలని తెలియజేసింది. గ్రామపునర్నిర్మాణమే దేశాభివృద్ధియనీ, గ్రామస్వరాజ్యం దేశస్వాతంత్ర్యానికి వెన్నెముక అనీ, గ్రామస్వరాజ్యం స్త్రీల అభివృద్ధికి పునాదివంటిదని భావించింది. స్త్రీలు మానవాభివృద్ధికి అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి, పారిశుధ్యంవంటి పాలనావిషయాలను ప్రస్తావించే స్థితికిస్త్రీలు చేరుకొన్నారని అర్థమవుతుంది. పల్లపుభూములలోకి పెన్నానది నీళ్ళు వెళ్ళిపోయి వ్యర్థంకాకుండా ఉండటానికై డ్యాముసుకట్టాలనే ఆలోచనచేసి ప్రజల తాగు, సాగునీటి కష్టాలను పరిష్కరించుకోవాలను కొన్నారు. వారి విజ్ఞానానికి జోహార్లు. స్త్రీల విజ్ఞానం ఏస్థాయికి ఎదిగిందో తెలియగలదు.*

కోకా భానుమతి 'అఖిలాసియా మహిళామహాసభ'ను (జూన్ 1931 గృహలక్ష్మి) గురించి వ్రాసిన వ్యాసంలో ఆసియాఖండంలో ఉన్న దేశాలమధ్య పరస్పర సంఘీభావం ఏర్పడటానికిది, ప్రపంచమందు శాంతి కల్గుతుందనే లక్ష్యంతోను అఖిలఆసియా మహిళామహాసభ ఏర్పాటు కావింపబడిందని తెలిపింది. 1931లో జనవరి 19 నుండి ఆ నెల 24వ తేదీ వరకు మహాసభలు లాహోర్ లో జరిగాయనీ, ఆసియాఖండమందలి దేశదేశాలనుండి స్త్రీలు ఆ సభకు వచ్చారనీ, మహమ్మదీయ కాంతయైన రేఫిసతి ఆ సభను ఏర్పాటుచేసారని చెప్పింది. ఆ సభలో పాశ్చాత్యదేశపర్యటన చేసినటువంటి, ఆంగ్లపండితురాలు, కవయిత్రియైన సరోజనీదేవి ఆ సమయంలో కారాగృహంలో ఉన్నప్పటికీ ఆమెను అధ్యక్షురాలిగా ఎన్నుకోవటం జరిగిందనీ, డా. ముత్తులక్ష్మీరెడ్డి ఆంగ్లము ద్రవిడభాషలలో ఉపన్యసించినదని తెలిపింది. సభాప్రారంభంలో వేదశ్లోకం చదివారనీ, ప్రపంచం నుండి సంగ్రామ పిశాచమును పారద్రోలి శాంతిని నెలకొల్పుటకు ఆ సభ ఆవశ్యకమని భావించారనీ, ప్రపంచమందలి ఇతర ఖండాలలోని, దేశాలలోని స్త్రీల సంఘాలు సభను ప్రశంసిస్తూ, తమ దేశస్థుల సంస్కృతికి అడ్డురాని విధంగా అమెరికాలోని మహిళాశాసనసభకు తగిన సలహాలు సూచనలు చేయవలసిందిగా అఖిలాసియా మహిళా మహాసభ వారిని కోరినట్లుగా తెలియజేసింది.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ వ్రాసిన 'ఇంటరంటే ఏంటి' (జూన్ 1931 గృహలక్ష్మి) అనే వ్యాసంలో బ్రిటీష్ వాళ్ళకు, ఉన్నతవర్గాల సౌకర్యానికి ఏర్పాటు చేయబడిన రైలుబండి పెట్టెయే 'ఇంటర్' అనీ, దానిలో ప్రయాణించటానికి తాను టికెట్టుకొని ఎక్కినప్పుడు ఒకనాటి సంఘటనగా స్వాతంత్రోద్యమంలో గాంధీ శిష్యురాలైన మీరాబాయి ఆనాడు తనతో చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయని తెలిపింది.దేశంలో అన్నార్తులు, దరిద్రులుగాఉన్న భారతీయులకోసం ధనవంతులు తమడబ్బును వారిబాధకు ఉపయోగించకుండా ఎక్కువ ధనాన్ని వెచ్చించి బ్రిటీష్ వారి రైళ్ళలో ఇంటరుస్థాయి టికెట్టుకొని ప్రయాణించటం సబబుకాదని చెప్పిన ఆమె అభిప్రాయం గుర్తుకు వచ్చిందని చెప్పింది. సహాయనిరాకరణలో భాగంగా స్వాతంత్ర్యోద్యమ నేతలైన గాంధీవంటివారు కూడా మూడవ తరగతి రైలుపెట్టెలో ఎక్కేవారు గానీ, ఇంటరు ఎక్కేవారుగాదనే విషయం కూడ తనకు గుర్తుకువచ్చి 'ఇంటరంటే ఏంటి' అనే నినాదం తన చెవులలో మారుమ్రోగిందని లక్ష్మీబాయమ్మ స్వీయానుభవాన్ని తెలియజేసారు.

*బీదలను ఆదుకోవటమే దేశసేవ అనీ అటువంటి సేవలతోనే స్వాతంత్ర్యోద్యమం నడపాలని భావించింది.*

బత్తుల కామాక్షమ్మ 'ఆశ్రమములు-ఋషులు' (జులై1931 వాసవి) అనే వ్యాసంలో వ్రాస్తూ పూర్వకాలంలో ఆశ్రమాలలో స్త్రీలు విద్యావంతులైనట్లే నేడు అనిబిసెంటు స్థాపించిన

మదనపల్లి ఆశ్రమం, ఠాగూర్‌ఆశ్రమం, కాశీలో మదనమోహన మాలవ్య విశ్వవిద్యాలయంలో, రాధాకృష్ణస్వామి వారి సత్సంగంవంటి ఆశ్రమాలలో స్త్రీ,పురుషులు చదువుకోవటానికి ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపింది. ప్రత్యేకంగా స్త్రీలకోసం, రుసాలోని కార్వేసేవాసదనం, మద్రాసు సేవాసదనం, గుంటూరు శారదానికేతనం, రాజమహేంద్రంలోని సనాతన విద్యాలయాలు స్త్రీలకు జ్ఞానాభివృద్ధిని కలుగిస్తున్నాయనీ తెలియజేస్తూ చేతివృత్తులు, ఉన్నతవిద్యలు నేర్చుకొని వైశ్యసంఘ స్త్రీలు కూడా చదువుకొని జాతీయ భావాలు పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది.

'స్త్రీవిద్య' (మార్చి1932 వాసవి) ను గురించి ఈమె చేసిన ఉపన్యాసంలో 'పురుషులకు వలె స్త్రీలకు విద్య అవసరమనీ, స్త్రీలు సంఘములో పురుషులతో సంఘీభావంతో మెలిగి సంఘాభివృద్ధికై పాటు పడగలరనీ, స్త్రీసేవాసదనాలలో గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపింది. పూర్వం ఖాన అను పేరుగల ఆమె గణిత శాస్త్రవేత్త అని, మమత వేదాధ్యయనాన్ని చేసిందనీ, వాక్కు అనే ఆమె ఋగ్వేద సూక్తాన్నిచెప్పిందని, సూర్య అనే స్త్రీ పెక్కు గణిత సూత్రాలను కనుగొందని చెప్పింది. స్త్రీలు లౌకిక విద్యలే కాక వైదిక విద్యలను నేర్చారనీ, స్త్రీలు శాస్త్రజ్ఞానంలో ఆరితేరేటట్లుగా విద్యను నేర్పించాలనీ, సంఘదురాచారములైన బాల్యవివాహాలు, స్త్రీపునర్వివాహ నిషేధంవంటి విషయాలలో ఆలోచనలు మారితేనే దేశమభివృద్ధి చెందగలదు కాబట్టి స్త్రీవిద్య అవసరమని బత్తుల కామాక్షమ్మ తెలియజేసింది.

*స్త్రీలు చదువుకోవటానికి ఉన్న అవకాశాలను, విద్యాలయాల సమాచారాన్ని తెలియజేయటమే రచయిత్రికి స్త్రీవిద్యాభివృద్ధి పట్లగల నిబద్ధతను తెలియజేస్తుంది.*

'సీరము సుభద్రాంబ' (జులై 1931 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ ఆమెకు ఐదవయేటనే వైధవ్యంకలిగినా గ్రంథపఠనం చేత విద్యావంతురాలై అనేక పద్యగద్య కావ్యాలను వ్రాసిందనీ, దానిలో సురుచీ విజయం, శిరోమణి అనే నాటకములు, ఆంగ్లనవలకు 'జాగిలమనే' అనుసరణ రచన చేసినట్లుగా పత్రికలో తెలియజేయటం జరిగింది.

*బాలవితంతువైన స్త్రీ విదేశీభాషాగ్రంథాలను తెలుగులోకి అనువాదంచేయగల స్థితికి చేరుకోవటం హర్షణీయం.*

పరుచూరు భువనేశ్వరీ దేవి 'స్త్రీలు-క్షయరోగము' (జులై 1931 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ స్త్రీలలో క్షయరోగం ఎక్కువగా ఉండటానికి కారణం స్త్రీ పురుషులు చేసే భోజనంలోని తేడావల్లను, తల్లిదండ్రులు చూపించే స్త్రీ పురుషుల పోషణలోని తేడాల వల్లనే స్త్రీలు రోగులుగా మారుతున్నారనీ, నేడు యువతులు వృద్ధస్త్రీలు సమానంగానే ఉన్నారని తెలిపింది. శుద్ధవాయు, వ్యాయామభ్రమణం లేని ఘోషా కూడా కారణమనీ, స్త్రీలు పురుషులు తిన్నట్టు బలవర్ధకమైన ఆహారం తినక మిగిలిపోయిన చద్ది కూడు తినటమేననీ, పురుషుల నిర్లక్ష్యం స్వార్థపరత్వం కూడా కారణమనీ, స్త్రీలలో శరీరసంరక్షణను గురించిన విజ్ఞానవిహీనత కూడా కారణమని చెప్పింది.

వీటన్నిటికీ విరుగుడుగా స్త్రీ విద్యావంతురాలై మంచి ఆహారాన్ని వేళకు భుజించే అలవాటు చేసుకోవాలనీ, క్షయరోగ ప్రారంభదశలోనే తన్నివారణోపాయాన్ని ఆలోచించాలనీ అదే దేశశ్రేయస్సని తెలియజేసింది.

*జీవనహక్కులలో భాగంగా స్త్రీలు తమఆరోగ్యంపట్ల శ్రద్ధచూపించాల్సిన అవసరాన్ని, దానికై విద్యాబుద్ధులు అవసరమని గుర్తించమంటుంది. ఆడపిల్లలకు ఒకరకమైన ఆహారాన్ని, మగపిల్ల వాడికి బలవర్ధకమైన తిండిని పెట్టే తల్లుల వివక్షాస్వభావాన్ని తగ్గించుకోవాల్సిన చైతన్యాన్ని కలిగించింది. ఆడపిల్లల పెంపకంలో తల్లిదండ్రులలో రావాల్సిన మార్పును తెలియజేసింది.*

కందుకూరి వీరేశలింగంగారి జన్మదినోత్సవ సందర్భంగా 'ఆంధ్రస్త్రీజనోద్ధారకుడు' (అక్టోబరు 1931 గృహలక్ష్మి) అనే శీర్షికన పాలపర్తి సరోజినీదేవి వ్రాస్తూ స్త్రీ జనాభివృద్ధికి, స్త్రీల అభ్యున్నతికై సంఘ సంస్కారానికి పూనుకొన్న వీరేశలింగం గురించి తోటి స్త్రీలకు తెలుపుతూ స్త్రీల స్వతంత్ర జీవనానికి పునాదివేసారనీ, స్త్రీవిద్యోద్ధరణకై స్త్రీల పాఠశాలలను, స్త్రీసమాజాన్ని స్థాపించిన విధానాన్ని తెలియజేసింది. బాల్యవివాహాల నిర్మూలనకు పాటుపడటమే కాక వితంతు పునర్వివాహానికై ముందుకు వచ్చి 1881సం. డిసెంబరు12వ తేదీన మొదటి వితంతుస్త్రీ పునర్వివాహాన్ని జరిపించారనీ, వెలివేయబడ్డా వెఱవక వితంతు శరణాలయాలను కట్టించిన విషయాన్ని స్మరణకు తేవటం జరిగింది.

*కందుకూరి వీరేశలింగం స్త్రీల ప్రగతికై చేసిన సేవను స్మరిస్తూ స్త్రీలందరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటం జరిగింది.*

పేరి అన్నపూర్ణమ్మ వ్రాసిన 'స్త్రీల చరిత్ర ఎవరునెరుగరు' (అక్టోబరు 1931 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు ఏమి చేస్తారో పురుషులు తెలుసుకోలేరంటూ స్త్రీలకు కళంకభావం అంటగట్టడం తప్పు అనీ, భర్తను చూస్తే భార్యభయపడే విధంగా భర్త ఆమెమీద పూర్ణ అధికారంతో ఉండటంచేత భర్తతో చెప్పాలనుకునే విషయాలను చెప్పుకునే స్వాతంత్ర్యంకూడా భార్యలకులేదని తెలియజేసింది.

*స్త్రీలచరిత్ర 'ఎవరునెరుగరు' అనే వ్యంగ్యమైనసామెత రావటానికి పురుషుల ప్రవర్తనయే కారణమని గ్రహించాలని తెలియజేసి స్త్రీలపై అపప్రథను సృష్టిస్తున్న సామాజిక కిటుకును బయటపెట్టింది. కుటుంబంలో భర్త తన అధికారంతో భార్యలను భయభ్రాంతులకు గురి చేస్తూ వారియొక్క జీవన హక్కులకు భద్రత లేకుండా చేస్తుంటే ఇక స్త్రీల స్వాతంత్ర్యమెక్కడిదని భావించింది.*

*కుటుంబంలో భార్యకు భర్తదగ్గర తాను చెప్పాలనుకున్న మాటలను నిర్భయంగా తెలియజేసే అవకాశం ఉండటమే కుటుంబంలో పునాదిప్రాయమైన స్త్రీ స్వతంత్రానికి, దేశస్వాతంత్ర్యానికి నాంది పలకటంగా భావించవచ్చు.*

చావలి అన్నపూర్ణమ్మ 'స్త్రీలయాధికృత' (అక్టోబరు 1931గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ పూర్వకాలపు స్త్రీలలో విద్యావంతున్నారనీ, పురుషులకంటే స్త్రీలకే శరీరపాటవమెక్కువనీ, సహాయనిరాకరణలో స్త్రీలే ఎక్కువగాపాల్గొని సత్యాగ్రహప్రచారం చేస్తున్నారనీ, లవణసత్యాగ్రహ సందర్భంలో సరోజనీ ప్రదర్శించిన ధైర్యసాహసములు గొప్పవని తెలిపింది. రాజకీయరంగమున స్త్రీలోకాన్ని ఉత్తేజపరిచిన దువ్వూరి సుబ్బమ్మవంటివారు కలరనీ, స్త్రీల శక్తిత్వమే స్త్రీలను అధికులుగా నిలబెడుతుందనీ, దేవీభాగవతంలో కలియుగమున స్త్రీలు దివ్యాంశరూపులుగాను, పురుషులు స్త్రీలకు భృత్యులుగా ఉంటారని చెప్పిందనీ, పాశ్చాత్య స్త్రీలవలె భారతదేశపు స్త్రీలు స్వాతంత్ర్యాన్ని పొందినా గృహకృత్య ధర్మాన్ని విడవవద్దనీ, లోకమర్యాదను అతిక్రమించవద్దని తెలియచేసింది.

*రాజకీయరంగంలో స్త్రీలు పురుషులకు మించిన శక్తిసామర్థ్యాలను ప్రదర్శించారని ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తేటతెల్లమయింది. అలాఅని స్త్రీలు ఇంటిపనులను నిర్లక్ష్యం చేస్తే పురుషులు స్త్రీలను బయట ప్రపంచంలోకి రానీయకుండా చేస్తారనీ ఆమె ఆలోచనగా భావించాలి.*

పత్రికాధిపులు ప్రచురించిన 'అసెంబ్లీసభ–స్త్రీలసమస్యలు' (మార్చి1932 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారతశాసనసభలో స్త్రీలసమస్యల నివారణ దిశగా హరవిలాస శారద గారు ప్రవేశపెట్టిన హిందూ వితంతువుల వారసత్వపుబిల్లు, హరసింగ్ గౌరు గారు ప్రతిపాదించిన హిందూ వివాహ విచ్ఛేద బిల్లులు వీగిపోయినట్లుగాను, కాని ఆ బిల్లులవల్ల హిందూసాంఘిక విధానంలో స్త్రీలకురక్షణ ఉంటుందని తెలిపింది. వితంతువులకు ఆస్తిహక్కువస్తే దుబారా చేస్తారనీ, అవిభక్త కుటుంబం విచ్ఛేదమవుతుందనీ బిల్లును చర్చించినా 25 శాతం మంది ఆమోదించినా 50 శాతం మంది సభ్యులు వ్యతిరేకించారనీ, రాజ్యాంగ నిర్మాణపు మార్పు జరిగే ఈ కాలంలో స్త్రీలకు శాసనసభలో ఓటింగ్ హక్కు లేదుకాబట్టి వివాహవిచ్ఛేద బిల్లుపై చర్చచేయటం కూడా అనవసరమనీ, రాబోయే ఎన్నికలో స్త్రీలు శాసనసభ్యురాండ్రయితే అప్పుడు చేయాల్సిన అవసరం ఉంటే ఆలోచించవచ్చుని చెప్పి బిల్లును తప్పిపుచ్చటం జరిగిందని పత్రిక తెలియజేసింది.

*స్త్రీల వైవాహిక సంస్కృతిలో లింగవివక్షను నిర్మూలించేవిధంగా స్త్రీలు శాసనసభలలో ప్రవేశించి చట్టాలు చేస్తేనే సమాజంలోని అందరూ ఆచరించాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని అర్థమవుతుంది. స్త్రీలు ఓటుహక్కుతోనే వ్యక్తి స్వాతంత్ర్యాన్ని సాధించుకోగలుగుతారనీ, రాజకీయాలకు సంబంధించిన శాసనసభలలో స్త్రీలు ఓటుహక్కుతోనే తమ ఆస్తిహక్కును సాధించుకోగలరనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.*

'స్వర్గీయ అన్నపూర్ణాదేవి' (ఏప్రిల్ 1932 ఆనందబోధిని పత్రిక) అనే శీర్షికన ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ వ్రాస్తూ మాగంటి అన్నపూర్ణ యొక్క విద్యాభ్యాసం, వివాహం, గ్రంథరచనలను పేర్కొనుచు ఆమె వ్రాసిన 'సీతారామము' అను రామాయణ సంగ్రహాన్ని నాటి విద్యాలయములలో పాఠ్యాంశంగా పెట్టారనీ, 'నవవర్షస్వప్నమా' అనే గ్రంథమును వంగభాషలో సరళాదేవి వ్రాసిన నవలను ఆంధ్రీకరించిందని తెలిపింది. స్వరాజ్యతృష్ణ, స్వాతంత్ర్యంగల ఆమె ఖద్దరుమూటలను

భుజాలమీద పెట్టుకుని ఇల్లిల్లూ, వీధివీధి తిరుగుతూ స్వరాజ్యభిక్షకై విక్రయించినదనీ, ఆమె రాజకీయవ్యవహారములందు 'చతుర'అని పేర్కొనటమే గాక, ఆమె తనభర్తకు వ్రాసిన లేఖలన్నింటిలో ఆమె భారతదేశ స్వరాజ్యకాంక్షయే కన్పడుతోందనీ, ఆ లేఖలను పేర్కొనటం జరిగింది.

*మాగంటి అన్నపూర్ణ మరణానంతరం ఆమె దేశసేవను గురించి, త్యాగశీలతను గురించి స్తుతిస్తూ నాటి పత్రికలలో అనేక వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. స్వాతంత్ర సమరదీక్షలో ఆమెనొక వీరాంగనగా గుర్తించటంచేత నేటికీ ఆమె స్మరణీయురాలవుతోంది.*

పరిమి సీతామణి వ్రాసిన 'హిందూవితంతువు' (ఏప్రియల్ 1932 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పద్మనీ సత్యనాథన్ వ్యాసానికి చేసిన అనువాదంగా వితంతువులు వివాహప్రకటన చేయటమేగాక, వారు సౌందర్యవంతులు, కట్నములిచ్చు పెండ్లికొడుకులు కావలయునని ప్రకటించటాన్ని విడ్డూరమని పద్మనీసత్యనాథన్ విమర్శించారనీ, కానీ స్త్రీలు సహగమన సంస్కృతిస్థాయి నుండి నేడు వితంతువుగా పత్రికా ప్రకటన చేసి వివాహమాడగల స్థితికి చేరినందుకు అభినందించాలని తెలిపింది. మొదట్లో శారదాబిల్లు కష్టతరంగా భావించినా తర్వాత వితంతువుల సంఖ్య తగ్గిందనీ, ఒక బాలిక తనకు బాల్యవివాహం జరిగినప్పుడు భర్తను తాను ఒక్కసారే చూసినట్టును, వితంతువుగా కుటుంబాలలో అష్టకష్టాలు పడుతున్నట్టుచెప్పింది. వితంతు పునర్వివాహాన్ని కుటుంబంలోవాళ్ళు సంప్రదాయ విరుద్ధమంటారనీ, భర్త అంటే ప్రేమలేదను కుంటారనే భావంతో స్త్రీ వితంతువుగా ఉండిపోవటానికే ఆ బాలిక నిర్ణయించుకుందని తెలియజేసింది. అంతేకాదు, వితంతువును గృహకృత్యాలకు పరిమితిచేస్తారనీ, కాని నేడు వితంతువులు విద్యను అభ్యసించటం మేలని తలుస్తున్నారనీ, అంతేగాక స్వేచ్ఛగా ఉండాలని భావిస్తూ పునర్వివాహేచ్ఛను కలిగి యుండటం ప్రగతి అని చెప్పింది. పూర్వం బిడ్డలున్న వితంతువుకు బిడ్డలదగ్గర జీవితం వెళ్ళిపోయేదనీ, గొప్పయింటి వితంతువు చదువుకొని డాక్టరుగా, నర్సులుగా, ఉపాధ్యాయులుగా ఉండి పొట్టపోషించుకుంటున్నారనీ, క్రొత్తనాగరికతగా స్త్రీలుపునర్వివాహం చేసుకోవాలనుకుంటూ పరాశరస్మృతి ప్రకారం సమర్థించు కుంటున్నారని తెలియజేసింది.

*వితంతుస్త్రీల విద్యాభివృద్ధి వారికి భావప్రకటనా స్వేచ్ఛను, వైవాహిక స్వాతంత్ర్యాన్ని, వితంతుసంస్కృతినుండి విముక్తిని కలిగించిందనీ, స్వీయపోషకత్వాన్ని ప్రయోగాత్మక రీతిలో పొందాలనుకున్నారని అర్థమవుతుంది.*

పాలపర్తి సరస్వతి వ్రాసిన 'జాతీయారోగ్యము-స్త్రీలకర్తవ్యం' (మే 1932 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశంలో బాలబాలికలు తమ ఆరోగ్యంకాపాడుకోవాలన్నా, విద్యావంతులై జాతీయాభిమానం కలిగి ఉండాలన్నా, స్త్రీలు ఆరోగ్య శాస్త్రములను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భావించింది. స్త్రీలు దారిద్ర్యనిర్మూలన మార్గాలను అన్వేషించి పిల్లలకు మంచి పోషకాహారాన్ని అందించాలనీ, తెల్లబియ్యం కాక దంపుడు బియ్యపు అన్నం పెట్టాలనీ, పిల్లల

ఆహారంలో వేపుళ్ళు కాకుండా ఉడకబెట్టిన కూరగాయలు పెట్టాలనీ, ముద్దపప్పు కంటె పెసలు, శెనగలు, బఠాణీల వంటివి ఎప్పటికప్పుడు వండి పెట్టాలనీ, పచ్చికాయల పచ్చళ్ళు తినాలనీ, పులుసును తగ్గించాలని, సుగంధద్రవ్యాలను తగ్గించాలని చెప్పింది. శరీరవ్యాయామాన్ని పిల్లలకు నేర్పాలనీ, ఇవ్వన్నీ గృహనిర్వాహకత్వాన్ని వహించే స్త్రీలు చూసుకుంటే కుటుంబం ఆరోగ్యకరంగా ఉండి జాతీయాభ్యున్నతి కలుగుతుందని అభిప్రాయపడింది.

*పోషకాహారపు విలువలను స్త్రీలు గుర్తించి తమ పిల్లలను ఆరోగ్యవంతులుగా పెంచగలిగితే దానంతటదే దేశం మానవాభివృద్ధి సూచికలో ఉన్నత స్థానంలో ఉంటుందనీ అదే దేశప్రగతి అనీ, పిల్లలందరూ శక్తియుక్తులైన పౌరులై స్వాతంత్ర్య సమరోద్యమంలో ముందునిలబడ గలుగుతారనీ భావించవచ్చు.*

కొప్పర్తి కృష్ణవేణి వ్రాసిన 'ఆంధ్రరాష్ట్రము-స్త్రీలు' (మే 1932 గృహలక్ష్మి పత్రికలో) అనే వ్యాసంలో నాభాష, నా సంఘం, నా దేశం అనే భావన అన్యోన్యదేశీయ భావయుగంలోకి మార్పును కల్గిస్తుందనీ, దేశభక్తి దేశౌన్నత్యం కోసం పాటుపడువారు ఆంధ్రులనీ, స్త్రీ పురుష వివక్షతలేక సహకారాన్ని అందించుకుంటే భారత స్త్రీలు, వారిలో మరీ ఆంధ్ర స్త్రీలు పురుషులతోపాటు సమానులేనని, వారికి సమాన సౌకర్యాలు, సమాన బాధ్యతలు, హక్కులు కావాలని చెప్పింది. అంతేకాదు స్త్రీలకు గృహ నిర్వాహకత్వంలోనూ, రాజ్య నిర్వాహకత్వంలోనూ సమాన గౌరవం ఉండాలనీ, అదే దేశ నాగరికతాచిహ్నంగా ఉండాలనీ, అది దేశ స్త్రీల భాగ్యమేననీ, స్త్రీలు తమ జన్మహక్కును అనుభవించటానికి స్త్రీలకు వివక్షారహితమైన స్వాతంత్ర్యం కావాలని తెలియజేసింది.

*సమాజంలోను, రాజ్యకార్య నిర్వహణత్వంలోను వివక్షారహిత స్వాతంత్ర్యం కలిగిఉండటం అంటే స్త్రీ పురుషులు సమానంగా హక్కులను అనుభవింగలగటమేననీ, అదే దేశనాగరికతా చిహ్నం కావాలని ఆశించింది.*

కమలారత్నమ్మ వ్రాసిన 'అసహాయ మహిళాగృహాల ఆవశ్యకత' (జులై 1932 గృహలక్ష్మి పత్రికలో) అనే వ్యాసంలో స్త్రీలను సామాజిక సాంస్కృతిక బాధల నుండి విముక్తి చేయమనీ, వారి విద్యాభివృద్ధికి, నివాసాలకు వీలుగా మహిళా వసతిగృహాలు ఉండాలని తెలిపింది.

*అనాథ వితంతుస్త్రీలయొక్క బాధలు తొలగి ఆత్మవిశ్వాసంతో బతకాలంటే వారికి వసతిగృహాల కల్పన అవసరమని భావించటమే స్త్రీలు బయట ప్రపంచాలలో అడుగుపెట్టి స్వేచ్ఛావాయువులను శ్వాసించటంగా భావించాలి.*

చిలుకూరి లక్ష్మీనరసమ్మ వ్రాసిన 'లోకల్ బోర్డులు-స్త్రీలు' (జులై 1932 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు జాతీయజీవనమందు, స్థానిక జీవనమునందు పాల్గొన్నా స్వతంత్రించలేక పోవటం, విద్యావిహీనులుగా ఉండటంతో తమ హక్కులనైననూ కాపాడుకోలేని పరిస్థితులలో ఉన్నారని తెలిపింది. కాని నేడు విద్యావ్యాప్తి కలిగి, వార్తాపత్రికల పఠనంతో, రాజకీయ

వాతావరణంతో ముందుకు సాగుతున్నారనీ, దీన్ని గుర్తించటం చేతనే స్త్రీలు సంఘసేవలో పాల్గొన్నారనీ, అప్పుడే దేశానికి సంపూర్ణ జాతీయజీవనం ఏర్పడుతుందనీ, వారికి ప్రత్యేక సౌకర్యాలు ఏర్పరచినారని చెప్పింది. స్త్రీలు సంఘజీవనానికి తోడ్పడుతారనే భావనతోనే 1931 సంవత్సరం మద్రాస్ లోకల్ బోర్డుల చట్టం ప్రకారం స్త్రీలు ఓటర్లుగానే కాక, మెంబర్లుగా ఎన్నికకాబడే అవకాశాన్ని యిచ్చిందనీ, కేవలం నామనిర్దేశంతో ప్రభుత్వ నియోజితురాలుగా బోర్డుమెంబరయితే ప్రజలకు, సభ్యులకు భిన్నాభిప్రాయం ఏర్పడితే ప్రభుత్వం పక్షాన్నే నిలవాల్సివస్తోందని తెలియ జేసింది. ప్రజలచేత ఎన్నుకోబడితేనే ప్రజలసమస్యలపట్ల గట్టిగా అభిప్రాయాన్ని వ్యక్తం చేయవచ్చునీ, అప్పుడే ప్రభుత్వం కోసం గాక స్త్రీలు వోటర్ల విశ్వాసానికై వారి సమస్యలపట్ల స్పందిస్తు ప్రజాహితజీవనంలో పాల్గొనగలుగుతారని భావించింది. పురుషులతో స్త్రీలు పోటీపడు తున్నారనీ, స్త్రీలు, పురుష ఓటర్లు కూడా స్త్రీలను బలపరచాలనీ, స్త్రీలు కూడా సభా నిర్వహణా నిబంధనలు తెలుసుకోగలగాలనీ, అవకాశాన్ని ఉపయోగించుకోవాలనిచెప్పి స్త్రీలుసంఘసేవ చేయటం గౌరవనీయం అవుతుందనే అభిప్రాయాన్ని చిలుకూరి లక్ష్మీనరసమ్మ వెల్లడించింది.

ఈమెయే వ్రాసిన 'లోకల్ బోర్డులు – స్త్రీలు' (జులై 1932 భారతి) అనే వ్యాసంలో లోకల్ బోర్డులంటే గ్రామానికి సంబంధించిన పంచాయితీలు, తాలుకా జిల్లా బోర్డులనీ, వీటిలో అల్పసంఖ్యాక వర్గములతో పాటు స్త్రీలకు కూడా ప్రత్యేక స్థానము కల్పించినప్పటికీ, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ఆ బోర్డులలో ఎన్నిక కావచ్చని తెలిపింది. ఇన్ని రోజుల నుండి అవకాశాలన్నీ పురుషుల అధీనంలోనే ఉన్నాయనీ, వారు కళంక మోహితులవుతున్నారు కాబట్టి స్త్రీలు ఏ పక్షముననూ వహించక స్వతంత్ర అభ్యర్థినులుగా ఎన్నికలలో నిలబడాలనీ, అలాగయితేనే లోకల్ బోర్డుకు సంబంధించిన పనులను స్త్రీలు సదాశయంతో నిర్వహించగలరని తెలియజేసింది. స్త్రీలు సభ్యులైతే ముందుగా ప్రణాళిక ప్రకారంగా కుల, వర్గ, మతాతీతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారనీ, జనులక్షేమం, ఆరోగ్యం, విద్య, మార్కెట్లు, మరుగుదొడ్లను నిర్మించవచ్చునీ, శిశురక్షణ, నీటివసతి వంటివి కలిగించవచ్చునీ, ప్రజలందరు మన్నిస్తే దానికి పురుషుల సహకారం కూడా ఉంటుందని భావించింది. స్త్రీలు జాతీయ జీవనంలోకి వచ్చి తమ హక్కులను కాపాడుకోవాలనీ, రాజకీయ వాతావరణంలోని మార్పులు గమనించితేనే దేశానికి సంఘానికి సేవ చేయగలరనీ, అప్పుడే దేశంలో సంపూర్ణజీవన విధానం ఏర్పడుతుందని తెలిపింది. ప్రభుత్వ నిర్మితములైన లోకల్, మున్సిపాలిటీ, శాసనసభలలోనే కాక ప్రభుత్వేతర సంస్థలలోను స్త్రీలు ధైర్యసాహసాలతో సమానంగా పాల్గొంటున్నారనీ, స్త్రీలు లోకల్–బోర్డుల్లోను, మద్రాస్ లోకల్–బోర్డులోనూ 1931లో కొత్త చట్టాలు తెచ్చి స్త్రీలకు అధిక సౌకర్యాలు కల్పించారని చెప్పింది. స్త్రీలకు ఓటింగ్ అధికారాన్నే గాక స్త్రీలు చట్టాన్ని ఉపయోగించుకొని లోకల్ బోర్డుల్లో స్త్రీలు మెంబరుగా కూడా ఎన్నిక కావాలనీ, స్త్రీలు ప్రభుత్వం చేత మెంబర్లుగా నియమింపబడిన దానికంటే ఎన్నికలలో నిలిచి అధికారం పొందితేనే స్త్రీలు తమ నిర్ణయాలను నిర్భయంగా ప్రభుత్వానికి తెలియజేయవచ్చని భావించింది.

స్త్రీలు తమ రాజకీయ హక్కులకోసమే గాక గ్రామపాలనలో స్వతంత్ర భావాలను నిర్ణయాలను తెలపగలిగేస్థాయికి పెరిగాలని స్త్రీలలో రాజకీయచైతన్యం రగిలించిన వ్యాసమిది. స్త్రీలు లోకల్ బోర్డులద్వారా గ్రామాభివృద్ధి చేయగలగాలంటే ప్రత్యేకస్థానాలలో నామనిర్దేశంగా నియోగింపబడటమేగాక స్త్రీలు ఎన్నికలలో నిలబడి సభ్యత్వాన్ని పొందితే స్వతంత్రంగా పరిపాలనా నిర్ణయాలలో భాగస్వాములు కాగలరని భావించారు. స్త్రీలు తమకు కేటాయించిన ప్రత్యేక స్థానాలలోనేకాక జనరల్ కోటాలో కూడా ఎన్నిక కాబడితేనే బోర్డులలో స్త్రీల సభ్యత్వ సంఖ్య పెరగగలదని భావించింది. ఆనాటి స్త్రీల ఆలోచనలే భారతదేశంలో 1994 లో పంచాయితీరాజ్ చట్టంగా రూపొందింపబడింది. అంటే గ్రామపరిపాలన చేయగల లోకల్ బోర్డులలో స్త్రీలు తమరాజకీయ హక్కులను అనుభవించే దిశగా ఎదగాల్సిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీలు సంఘసేవచేయాలన్నా తమ రాజకీయహక్కులు వినియోగించుకోవాలన్నా స్త్రీలు విద్యావంతులైతేనే సక్రమంగా పరిపాలన చేయగలుగుతారని భావించింది. స్త్రీవిద్యకు, స్త్రీల రాజకీయ హక్కులకు ఉన్న సంబంధాన్ని వ్యక్తం చేయటం జరిగింది. స్త్రీల హక్కులకు స్త్రీల జాతీయజీవనానికి ఉన్న సంబంధాన్ని గుర్తించగలిగారు. ఇక్కడ స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి ఉన్న విలువ అర్థమవుతుంది.

'మదరాసు విశ్వవిద్యాలయము – స్త్రీపట్టభద్రులు' (సెప్టెంబరు 1932 గృహలక్ష్మి) ను గురించిన పత్రికాధిపుల ప్రచురణలో 1932 ఆగష్టులో మదరాసు విశ్వకళాపరిషత్ వారిచే పట్టప్రదానోత్సవము జరిగిందనీ, 1835 మంది పట్టభద్రులు పట్టములను పొందగా వారిలో 110 మంది స్త్రీలు ఉన్నారనీ, ఒక స్త్రీ బి.యల్. పట్టా పొందిందనీ, ఆరుగురు యమ్.బి.బి.యస్. పట్టాను, నలుగురు బి.యస్.సి. పట్టాను పొందారనీ, ఐదుగురు యల్.టి. పట్టభద్రులున్నారనీ, ఎనిమిదిమంది స్త్రీలు యమ్.ఏ. లోనూ, తొమ్మిదిమంది బి.ఏ. ఆనర్స్ లోనూ, యాభైమంది స్త్రీలు బి.ఏ. పట్టాలను తీసుకొన్నారని తెలియజేస్తూ స్త్రీలు డాక్టర్లు, ఉపాధ్యాయులు అగుటకు మాత్రమే కాక ఇతర వృత్తులయందును చొరబడాలని పత్రిక తెలియజేసింది.

మనపాకం కమలమ్మ వ్రాసిన 'స్త్రీలు–బీమాసమస్య' (సెప్టెంబరు 1932 గృహలక్ష్మి) అనే శీర్షికన స్త్రీలు ఉన్నత విద్యనభ్యసించి స్వతంత్ర జీవనము, కుటుంబ పోషణం చేస్తూన్నా కూడా బీమారంగంలో ప్రవేశించటం లేదనీ, వర్తక పారిశ్రామికాభివృద్ధి కొరకు బీమా కంపెనీల సహకారం ముఖ్యమనీ, అది ప్రజాసేవకు, జాత్యుద్ధరణకు కూడా ఉపయోగపడుతుందని తెలిపింది. స్త్రీలకు ప్రసవ సమయపు అపాయం ఉంటుందనే భావనతో స్త్రీలను చేర్చుకోవటంలేదనీ, ఒకవేళ చేర్చుకున్నా ప్రసవసమయంలో అదనపు ప్రీమియం కట్టాల్సి వస్తోందని చెప్పింది. స్త్రీలు వ్యాపారరంగంలో కూడా అడుగుపెట్టి బీమాసౌకర్యాన్ని పొందాలనీ, బీమాకంపెనీలు కొన్ని స్త్రీలశాఖలను అభివృద్ధి కావిస్తూ స్త్రీలను ఏజంట్లుగా నియమిస్తున్నారనీ, స్త్రీలకు అర్థమయ్యే విధంగా బీమా విషయాలు మాతృభాషలో ఉండాలని తెలియజేసింది.

*స్త్రీలు వ్యాపారరంగంలోకి ప్రవేశించటమే గాక బీమా సౌకర్యాలతో వ్యాపారంలో నష్టపోకుండా, తమకు అనుకూలంగా ఉండేటట్లుగా ఆలోచించటమే స్త్రీలు మరింతగా ప్రగతిమార్గంలో పయనించాలనుకోవటంగా భావించాలి.*

పాకల సౌభాగ్యవతి వ్రాసిన 'స్త్రీలు-బ్రహ్మ సమాజం' (జనవరి 1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు విద్యావిహీనులై పురుషుల కామోపశాంతికి ఉన్నంతకాలం దేశం బాగుపడదనియు, రాజా రామమోహనరాయలు స్త్రీల అభివృద్ధియే జాతీయాభివృద్ధి అవుతుందని భావించి స్త్రీలకెక్కువ గౌరవాన్ని ఇచ్చారనీ, స్త్రీలకు ప్రత్యేక హక్కులు, ఆస్తి, స్వాతంత్ర్యం ఉండాలనీ, స్త్రీలకు ప్రత్యేక మానవత్వంఉందని భావించటం చేతనే సతీసహగమనాన్ని నిషేధించాలని భావించారని తెలిపింది. స్త్రీ సత్వంగూడా ఆత్మాభిమానం పొందాలనీ, పురుషులతో సమానంగా బ్రతకటం స్త్రీలహక్కనీ, స్త్రీలు తమ స్వాతంత్ర్యానికే కాక నాగరికతా పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిచ్చి దానికి నూతన రూపాన్ని కలిగించగలరనే భావాన్ని వ్యక్తం చేసింది.

*స్త్రీ అంటే భోగవస్తువు కాదనీ, ఆమెకు ప్రత్యేక మానవత్వం ఉంటుందని అటు పురుషులు ఇటు స్త్రీలు గుర్తించాల్సిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీ-పురుషుల సమానత్వమే నాగరికతా చిహ్నంగా భావించమని చెప్పింది.*

చిలకపాటి భారతీదేవీ వ్రాసిన 'అస్పృశ్యత' (జనవరి1933 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో దేశారిష్టాలు తొలగాలంటే అస్పృశ్యత పోవాలనీ, లింగవివక్షతో స్త్రీలు, సామాజిక వర్గదృష్టితో హరిజనులు బాధితులుగా ఉన్నారనీ, వారి అభివృద్ధి ఉంటేనే స్వాతంత్ర్యసాధన మరింత సులభతరమవుతుందని తెలియజేసింది.

*సమాజంలో స్త్రీలు, హరిజనులు సమాన బాధితులేనని భావించింది. దేశ స్వాతంత్ర్యోద్యమ సాధనలో హరిజనోద్ధరణ భాగంగా ఉండాలని తెలియజేసింది.*

వలివెల శాంతమ్మ వ్రాసిన "ఇకనెంత కాలముందునా" (జనవరి1933 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో తల్లిదండ్రులు ఆడపిల్ల, మగపిల్ల వాడి పెంపకంలో వివక్ష చూపటంతో, పెళ్ళి తర్వాత మగవాళ్ళు భార్యల మీద అధికారం చెలాయిస్తున్నారనీ, పురుషాధిక్య సమాజాన్ని ఎదర్కొనే క్రమంలో స్త్రీల బాగుకోసం కృషి చేసే వారికి పరస్పర సహకారాన్ని ఇవ్వాలని తెలియజేసింది.

*ఆడపిల్ల పెంపకంలోని వివక్షయే పురుషాధికారానికి కారణమని గ్రహించగలిగారు. స్త్రీ పురుషులు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొనటంతో స్త్రీ పురుషసమానత్వాన్ని సాధించవచ్చనే విశ్వాసం పెరిగిన రచయిత్రులు స్త్రీపురుషసమానత్వాన్ని పెంపొందించే రచనలు చేయాలనుకున్నారు. ఆక్రమంలోనే పితృస్వామ్యపుమూలాలలోని కిటుకును కనిపెట్టమని వలివెల శాంతమ్మ తెలియజేసింది.*

'స్త్రీలు-వార్తాపత్రికా నిర్వహణము' (ఫిబ్రవరి 1933 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ వార్తాపత్రికలను యువతయే నిర్వహించాలనీ, ఆరోగ్యమును, విద్యతోబాటు వార్తలను

కూడబెట్టునేర్పు స్త్రీలకు ఉంటేతప్ప పత్రికలను నిర్వహించలేరనీ అవసరమైతే ఏకబిగిన ఎనిమిది గంటలు పనిచేయాల్సి వుంటుందని తెలిపారు. పత్రికా నిర్వహణమందు స్త్రీలు చూపే కార్యదీక్ష గొప్పదనీ, నిర్వహించాలంటే స్త్రీలు వివిధ దేశముల చరిత్రలు, మహాపురుషుల జీవితాలు, అర్థశాస్త్రం, సాంఘికశాస్త్రం, రాజ్యాంగతత్వముల చరితలు, మనస్తత్వశాస్త్రం సారస్వతము మొదలగు వాటియందు జ్ఞానం ఉండాలని తెలిపారు. అమెరికాలో హెచ్చు జీతం పొందిన న్యూయార్కు హెరాల్డు ఆదివారపు పత్రికా సంపాదకురాలుగా విలియమ్ బ్రౌను అనే స్త్రీ రత్నము, రాజ్యాంగ విషయాలలో అనీఫోర్టు, ఫ్రాంసిస్ పార్కిన్ సన్, ఫిలడెల్ఫికారో వంటి స్త్రీలు, వ్యాపారాలను గురించి వ్రాసిన దరోతిథాంప్సన్ వంటి విదేశీ స్త్రీలు పత్రికా నిర్వహణలో ప్రసిద్ధి పొందారనీ, భారతదేశంలో సదానందు భార్య 'ప్రి ఫ్రీప్రెస్సు' సంపాదకురాలుగా ఉన్నారనీ, 'స్త్రీ ధర్మము' అనే పత్రికను నిర్వహించారని తెలిపారు. 'స్త్రీధర్మ పత్రికను' డా. ముత్తులక్ష్మీరెడ్డి నిర్వహిస్తోందనీ. 'ఇండియన్ లేడీస్ మేగజైను'ను నడిపిన కమలా సత్యనాథం వంటివారు పత్రికలను నిర్వహిస్తున్నారనీ, అలానే తెలుగు ప్రాంతంలో 'హిందూసుందరి' అను పత్రికకు సంపాదకులుగా స్త్రీలు ఉన్నారనీ, స్త్రీలు పత్రికారచన చేస్తున్నారనేదానికి గృహలక్ష్మి పత్రిక నిదర్శనమని పత్రిక తెలియచేసింది.

*కుటుంబ నిర్వహణ చేస్తూనే స్త్రీలు పత్రికా నిర్వహణరంగంలో కృషిచేయటాన్ని పురుషులు చేసినదానికంటే గొప్పదిగా భావించాలి.*

సత్యాగ్రహ నిర్మాణ కార్యక్రమాలలో భాగంగా అస్పృశ్యతా నివారణ ప్రధాన విషయంగా రచనలు వచ్చాయి. దీని ఫలితంగా అస్పృశ్యులకు ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయిస్తూ 1935 చట్టం తయారుచేయబడింది.

'పంచములు' శీర్షికన (మార్చి 1933 గృహలక్ష్మి) స్థానాపతి రుక్మిణమ్మ వ్రాస్తూ పంచములకు దేవాలయాల ప్రవేశం ఉండాలని తెలియజేసింది.

దేశిరాజు భారతీదేవి వ్రాసిన 'గ్రామపునర్నిర్మాణంలో– స్త్రీలు' (ఆంధ్రప్రదేశ్ వార్షిక సంచిక ఏప్రిల్ 1933) అనే వ్యాసంలో ప్రపంచంలో అన్ని దేశాలవారు గ్రామపునర్నిర్మాణం కావించుకొని సాంఘిక, రాజకీయారోగ్యబలములను పెంపొందించుకొని అభివృద్ధి పొందుతున్నారనీ నిర్మలమైన వాయుప్రసారం, మంచినీరు, దుర్గంధంలేని పేదగృహాలు ఉండాలని తెలిపింది. గ్రామ ప్రజలందరూ, స్వతంత్ర జీవనం కలిగి దేశహిత కార్యోత్సాహం, దేశాభిమానం కలిగి ఉండాలనీ, వ్యవసాయాదాయం తగినంతగాలేనప్పుడు చేతి పనులను అభివృద్ధి చేసుకోవాలనీ, వివాదాలను గ్రామ పంచాయితీ స్థాయిలో పరిష్కరించుకోవాలని తెలిపింది. విద్యాధికుల వృత్తాంతం, వార్తాపత్రికలు చదివి సారాంశాన్ని విద్యావిహీనులకు తెలియజేయాలని, దేశోపయోగవిషయాలను, తెలుసుకొని ఆచరణలోపెట్టే బాధ్యతను వహించే గ్రామసంఘాలు ఉండాలని తెలియజేసింది.

*స్త్రీలు ఆరోగ్యపరమైన స్వతంత్రజీవనాన్ని పొందటానికి పరిపాలనావిధానంలో వారి భాగస్వామ్యం ఉండాలనే ఆలోచనలు స్త్రీలలో విస్తృతమవుతున్నాయని అర్థం అవుతుంది.*

ఈమెయే వ్రాసిన 'అస్పృశ్యతా నిర్మూలన' (మే 1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో 'పంచములనగా సంకరజాతులు కారనీ, గుణగణాలనుబట్టి వర్ణాలు ఏర్పడ్డాయనీ, మాలతనయుడైన పరాశరుడు బ్రహ్మర్షి అయ్యాడనీ, మాలకన్యయైన అరుంధతిని వివాహమాడిన వశిష్టుణ్ణి రాముడు గురువుగా గౌరవించాడని తెలిపింది. శాకాహారులు, మాంసాహారులుగా విడిపోయి పరస్పరం గౌరవంగా బ్రతికారనీ, ప్రస్తుత కాలంలో స్త్రీలు వారికి విద్య, శుభ్రతనేర్పి జాతి, మత విచక్షణ లేక ప్రజలెల్లరూ ఏకమై ఉంటేనే దేశదుస్థితి తొలుగుతుందని భావించింది. దేవాలయాలలో గృహములలో మాలవారిని రానిచ్చినంత మాత్రాన మైలబడరు కాబట్టి స్త్రీలు అస్పృశ్యతా నివారణకై తమ అధీనంలో యున్న కార్యక్రమాలలో అస్పృశ్యులను ఆహ్వానించాలనీ, మాలస్త్రీలు కూడా పరిశుభ్రత పాటించే విధంగా తయారవ్వాలనిచెప్పింది. జాతిసమైక్యతతో సత్యాగ్రహ ఉద్యమ కార్యక్రమాలలో ఒక్కటై మెలగటానికి అవసరమైన అస్పృశ్యతా నివారణకు స్త్రీలే ఎక్కువగా బాధ్యతవహించాలని దేశిరాజు భారతీదేవి తెలియజేసింది.

1932 లో చేసుకొన్న పూనా ఒడంబడికలో భాగంగా బ్రిటిష్ వారు హిందూవుల్ని విభజించే దృష్టితో అస్పృశ్యులకు ఎక్కువసంఖ్యలో నియోజకస్థానాలను కేటాయించగా వారి విభజించే కుట్రను అర్థంచేసుకొని దేశస్వాతంత్ర్యసాధనకై వారిని కలుపుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి అస్పృశ్యతా నివారణ దిశగా స్త్రీలను చైతన్యపరుస్తూ సాహిత్య సృజన చేసారు.

మందా ముత్యాలమ్మ వ్రాసిన 'అస్పృశ్యతా నివారణము–స్త్రీల విధికృత్యములు' (మే 1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు ప్రత్యేక సభలు జరుపుకొని పురుషులతో సమానహక్కులు కావలెనని తీర్మానం చేస్తున్నారనీ, స్త్రీలు గురువులుగా, న్యాయవాదులుగా ఉపాధ్యాయులుగానే కాక రాజకీయ కార్యములకు ముందంజవేస్తున్నారనీ, దేవదాసీ నిర్మూలనను, స్వదేశీవృత్తుల వ్యాపకం, అస్పృశ్యతా నివారణమువంటి కార్యక్రమాలలో జనసామాన్యంలో స్త్రీలు చైతన్యం కలిగిస్తున్నారని తెలిపింది. గృహకృత్యములు నిర్వహించి తీరిక సమయాలలో రాట్నం తిప్పి నూలువడికి బట్టలు నేయించి అమ్మటంలో కుటుంబ ఖర్చులకు సహాయపడుతున్నారనీ, స్త్రీలు నూలువడకటమే దేశభక్తిలో భాగమనీ, స్త్రీలు విద్యావతులై బాలెంత, శిశుమరణాలను తగ్గించాలనీ, బిడ్డలకు చేతిపనులన్నీ తల్లులే నేర్పిస్తున్నారనీ తెలిపింది. మానవులెవరైన వారి వృత్తిని ముగించి పరిశుద్ధ స్నానం చేసిన తరువాత స్పృశ్యులే అగుదురనీ, పిల్లల మలమూత్రములు తీసే తల్లి అస్పృశ్యురాలిగా భావిస్తున్నామా అని ప్రశ్నించుకోవాలని తెలియజేసింది. అంతేకాదు, పూర్వకాలంలో ఏ కులంలో పుట్టిన వారైనా బ్రహ్మజ్ఞానం కలిగిన వారయ్యారనేది గుర్తుంచుకోవాలనీ, తండ్రి చెప్పులు కుట్టేవాడైతే అస్పృశ్యుడిగా భావించినా అతని కొడుకు కలెక్టరయితే స్పృశ్యుడిగానే భావిస్తున్నారనీ, హరిజనులను ఉద్ధరించటం అటుంచి, ఇండ్లలో దేవాలయాలలో, పాఠశాలలో వారికి ప్రవేశం కల్పించాలని తెలియజేసింది.

*హరిజనోద్ధరణకై హేతుబద్ధమైన అభిప్రాయాలు వెల్లడించటం స్త్రీల మేధాశక్తికి, ప్రతీకంగా భావించి విజ్ఞానవంతులుగా ఆలోచింపజేయటం నేటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.*

'తెల్లకాగితము-నల్లక్షరములు' (మే 1933 గృహలక్ష్మి) అనే శీర్షికన పత్రికాధిపుల ప్రచురణలో అది నల్లయక్షరాలు గల నూటఏబది పుటల గ్రంథమనీ, వైస్రాయికి, గవర్నర్లకు అపరిమితమైన అధికారాలను యిచ్చిన మాంటేగ్-ఛేమ్సు ఫర్డు సంస్కరణల అనంతరం ఏర్పడిన ఆందోళనకు ఫలితంగా బ్రిటిష్ దొర తరువాత కొన్ని నూతన సంస్కరణల ప్రతిపాదనలను పంపారని తెలిపింది. దానిలో భాగంగా వలసరాజ్యాలతో సమానమైన ప్రభుత్వవర్గం హిందూదేశంలో కూడా నెలకొల్పబడుతుందనీ, కానీ, వ్రాసిన తెల్లకాగితం మీద ఎక్కడా 'డొమీనియన్ స్టేటస్' అను పదమే దొరకలేదనీ, తిరిగి పార్లమెంటువారు కమీషను పెట్టటం వంటివి చేసారు గానీ, భారతదేశంలో మార్పేమీలేదనీ, డొమీనియన్ స్టేషస్ కోసం రౌండుటేబుల్ కాన్ఫరెన్సులకు వెళ్ళినా ఆశాభంగమే కలిగిందని తెలిపింది. కలకత్తాలోని మితవాదులు రెండవ రౌండ్ టేబుల్ సభకు వెళ్దామని గాంధీని కోరగా ఆయన ముందు ప్రతిఘటించినా వెళ్ళాడనీ, పూనాసంధితో పార్లమెంటువారు మతపరమైన, అల్పసంఖ్యాపరమైన సాంఘికతత్వంతో హరిజనులను సవర్ణులనుండి విడతీస్తూ ఆ నియోజకవర్గమును రద్దు చేయటం జరిగిందని చెప్పింది. స్త్రీలకు ప్రత్యేక నియోజక వర్గం ఏర్పరచినా, సాంఘికతత్వం లేని నియోజక వర్గములను రద్దు చేయాలని హిందూ స్త్రీల సంఘాలు ప్రధానమంత్రికి తంతి వార్తలను పంపారనీ, ప్రత్యేక నియోజక వర్గాలకంటె ముందుగా దేశాన్ని దాస్యశృంఖలాలలో బంధించే విధంగా ప్రభుత్వ సంస్కరణ లున్నప్పుడు స్త్రీలకు సమష్టి నియోజకవర్గం, వయోజన వోటుహక్కు వలన ఉపయోగం లేదనీ తెలిపింది. పురుషులు రాజకీయంగా బానిసలై యున్న దేశంలో స్త్రీలు స్వతంత్రతను అనుభవింప జాలరని ముత్తులక్ష్మి గారు చెప్పిన మాట సత్యవంతమైనదని భావించింది. హిందూదేశంలో రాజకీయాన్వేషణలో పురుషులు స్త్రీలకెన్నడూ ఎదురురాలేదనీ, స్త్రీలు పౌరహక్కులకోసం తల్లడిల్లుతూనే ఉన్నారనీ తెలియజేస్తూ, 'తెల్లకాగితాన్ని' విమర్శించటం జరిగింది. అంతేకాక టర్కీ దేశంలో స్త్రీలు మేలిముసుగులను విసర్జించుకొని ఉద్యోగాలు చేస్తున్నారనీ, చైనాదేశంలో ప్రౌఢవివాహాలు, ఏకపత్ని నిబంధనలవంటి చట్టాలు వచ్చాయనీ, సైన్యంలో పోలీసు శాఖలో స్త్రీలు పనిచేస్తున్నారని తెలిపింది. జపాన్ లో స్త్రీలకు వోటుహక్కు లేకున్నా మిగిలిన దేశాలలోవలె అన్నిహక్కులు ఉన్నాయనీ, విదేశాలలో స్త్రీలకు రాజకీయస్వాతంత్ర్యం రాగానే వెంటనే స్త్రీజనాభివృద్ధి సంస్కరణలు జరుగుతున్నాయని తెలిపింది. భారతదేశంలో పురుషులతో సమానమైన హక్కులు స్త్రీలకు ఉండాలంటే స్త్రీ వోటర్లు, ప్రతినిధులు ఎక్కువమంది ఉండాలనీ, శాసనసభలకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండాలంటే ప్రజాస్వామిక రాజ్యాంగయంత్రం అవసరమని పత్రిక తెలియజేసింది.

*బ్రిటిష్ దొరల కుహనామనస్తత్వాన్ని గ్రహించుకొంటూ దేశస్వాతంత్ర్యంపట్ల స్త్రీలు తమ ఆలోచనలను పెంచుకోవటాన్ని పత్రిక తెలియజేసింది.*

మద్దింశెట్టి తిరునాథమ్మ వ్రాసిన 'స్త్రీలు రాజకీయవ్యవహారములో పాల్గొనగలరా' (మే 1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పురాణయుగం నుండి స్త్రీలు పురుషులవలె దేశపరిస్థితులను ధైర్యసాహసాలతో చక్కబెట్టారనీ, విదేశీస్త్రీలలో బొడీనియా, జోన్ ఆఫ్ ఆర్క్ అటువంటివారనీ,

హిందూదేశంలో రాజకీయంగా విశాలపాండిత్యంలో సోదరునికి తోడ్పడి రాచకార్యాలను చక్కబెట్టినవారు ఉన్నారని తెలిపింది. హర్షవర్ధనుని చెల్లెలు రాజశ్రీ, తండ్రి మరణానంతరం రాజ్యపాలన చేసిన రజియాసుల్తాన్, తిరగబడ్డ సామంతరాజులను అణగద్రొక్కి రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించిన రాణి రుద్రమదేవి, భర్తతోపాటు శత్రుసైన్యంతో పోరాడిన రాణిసంయుక్త చాంద్‌బీబి, దేశబానిసత్వాన్ని తొలగించటం కోసం పాటుపడిన ఝాన్సీలక్ష్మీబాయి వంటి గొప్ప స్త్రీల చరిత్రలు చదివితే స్త్రీలు రాజకీయ వ్యవహారాలలో సమర్థవంతంగా పాల్గొనగలరని తెలియజేసింది.

*రాజకీయవ్యవహారాలలో స్త్రీలు ఎక్కువగా పాల్గొని సమర్థతను పెంచుకోగలిగితేనే స్త్రీ పురుషసమానత్వాన్ని సాధించగలరనీ, అప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం సంపూర్ణంగా ఉంటుందని భావించి నాటి స్త్రీలకు స్ఫూర్తిని కలిగించగలిగిన వ్యాసమిది.*

వింజమూరి వెంకటరత్నమ్మ వ్రాసిన 'నేటి స్త్రీలకర్తవ్యం' (అక్టోబర్1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో "సృష్టికొఱకు తేజస్సు తిమిరమునే పాణిగ్రహణము చేసుకొనుచున్నది" అనే రవీంద్రుని సుభాషితముల కనుగుణంగా స్త్రీని అంధకారంలో ఉంచటమంటేనే, అణకువతో స్త్రీలను ఉండేటట్లు చేయటమేనని, అణకువఅంటే ఆత్మగౌరవరాహిత్యము, నైచ్యముగాదనీ, అలా భావించేవారు గాంధీ ఉపదేశాన్ని తలచుకొంటే, స్త్రీలను గౌరవంగా చూస్తారని తెలిపింది. "ఆది జనకుండు, పిమ్మటనధిపుడావల తనయుడును శాసకుల్ గదా వనితకుర్వినెన్నడేనియు స్వాతంత్ర్యమున్నదయ్యా" అని అనిపించకమానదనీ, స్వతంత్ర జీవనం వేరు, సహధర్మచారిణత్వం వేరని చెప్పింది. జీవితకాలంలో "ఇతరులాడవలసిన భూమికలేవో మరచిపోవుటవలన ఆ భూమిక యొక్క అర్థమును కూడ మరచిపోవుచున్నార"నే మహానుభావుల మాటలను ఉటంకిస్తూ లోకకల్యాణానికి సంఘనిర్మాణానికి, కుటుంబ పవిత్రతకు వలయు విద్యావివేకం, స్వాతంత్ర్యపు హక్కును స్త్రీలు సంపాదించుకోవాలని చెప్పింది.

*కుటుంబంలోని భార్యాభర్తృ సంబంధాలలోని స్వతంత్రజీవన విధానమే దేశ స్వాతంత్ర్యానికి పునాదిప్రాయంగా భావించటం జరిగింది.*

చుండూరి రత్నమ్మ వ్రాసిన 'రాజారామమోహన రాయ్' (నవంబరు1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో సతీసహగమన నిషేధ చట్టాన్ని అమలులోకి తేవటానికి రాజారామమోహన రాయ్ చేసిన కృషిని అభినందిస్తూ, స్త్రీలకు స్వాతంత్ర్యాన్నిచ్చి వారు అభివృద్ధి చెందటానికి కావల్సిన అవకాశాలన్నింటినీ ఇవ్వవలసిందని తెలియజేసింది. అంతేకాదు రాజారామమోహన్ రాయ్ గారు తెచ్చిన సతీసహగమన నిషేధచట్టాన్ని రద్దు చేయమంటూ 800 మంది సంప్రదాయవాదులైన భారతీయ పురుషులు సంతకం పెట్టిన పత్రాన్ని బ్రిటిష్ గవర్నమెంటుకు ఇచ్చారని చెప్పింది. రాజారామమోహన్ రాయ్ గారు దానిని ఒప్పుకోవద్దంటూ లండన్ కు వెళ్ళి బ్రిటీష్ పార్లమెంటులో మాట్లాడటం జరిగిందనీ, ఆ మరునాడే లండన్ లో రాజారామమోహన్ రాయ్ గారు మృతిచెందటం విచారకరమని తెలియజేసింది.

*సతీసహగమననిషేధచట్టము విషయమై రాజారామమోహనరాయ్ గారు తమ ప్రాణాలను పణంగా పెట్టినట్లు అర్థమవుతుంది.*

'సప్తమాంధ్ర మహిళాసభ'లో చుండూరి రత్నమ్మ చేసిన ఉపన్యాసంలో (డిసెంబరు 1933 గృహలక్ష్మి) స్త్రీ గౌరవాన్ని గురించి చెబుతూ నేటి నాగరిక దేశంలో వాడుతున్న సమానహక్కులు, స్త్రీ స్వాతంత్ర్యం అనే మాటలు పూర్వము ధర్మబద్ధమై ఉండేవనీ, స్త్రీ స్వాతంత్ర్యం అంటే తుచ్ఛభోగాలకై చేసే స్వేచ్ఛావిహారం కాదనీ, కానీ నేడు పరాధీనత వల్ల ధార్మికవిద్య నశించిందనీ, సంఘం దురాచారభూయిష్టమైనదనీ, దానికై సంఘాన్ని సంస్కరించుకోవాలని తెలిపింది. నేటి పురుషులవిద్య నిరుద్యోగ సమస్యను కల్గిస్తోందనీ, సేవకావృత్తిలో ఉన్న స్త్రీలను అదే దారిపట్టిస్తున్నారనీ, జర్మనీదేశస్థుడైన హిట్లరు స్త్రీలు గృహనిర్మాణంలో రాణించాలనీ, పురుషులు రాజకీయ వ్యవహారాలలో రాణించాలనీ భావించాడనీ, స్త్రీలకు కృత్రిమ హక్కులు అనవసరమని చెప్పింది. నాగరిక పద్ధతులు ఆదర్శం కాదనీ, సంఘాన్ని బాగుచేసుకోవటానికి స్త్రీ జనోద్ధరణ అవసరమనీ, పాఠశాలవిద్య కంటె సంగీతం, శిశుపోషణ, రాట్నమున నూలుతీయుట నేర్పాలనీ, స్త్రీలకు సంఘసేవ, మతవిద్య. నైతికవిద్య నేర్పాలనీ, దానికోసమే గుంటూరులో శారదానికేతనం, రాజమండ్రిలో వైశ్యసేవాసదనం వంటి జాతీయవిద్యాలయాలు ఏర్పడ్డాయనీ తెలియజేసింది. మనదేశంలో విడాకులు సరిపడవనీ, సంస్కరణ విధానంలో భాగంగా ప్రతిజిల్లాలో స్త్రీవిద్యా నికేతనాలు, అనాథశరణాలయాలు, వైద్యాలయాలు, శిశుపోషణాలయాలు, వ్యాయామ సంఘములు, పారిశ్రామిక విద్యాలయాలు ఉండాలనీ, స్త్రీ జనాభ్యుదయం పత్రికలు, పుస్తక పఠన మందిరాలు ఉండాలని తెలియజేసింది.

ఆసభలోనే సరస్వతీబాయి ఎమ్.ఎ., ఎల్.టి. ఆధ్వర్యంలో సభాతీర్మానాలు చేసారనీ, అందులో భాగంగా ప్రతిగ్రామంలో బాలబాలికలకు నిర్బంధోచిత విద్యాలయాలుండాలనీ, ఆంధ్ర రాష్ట్రంలో ప్రత్యేక స్త్రీల కళాశాల ఉండాలని తీర్మానం చేసారు. ఆరోగ్యం కొరకు ప్రతి ఊరినందు పబ్లిక్ పార్కు లుండాలనీ, ప్రతి తాలుకా ముఖ్యపట్టణాలలో స్త్రీ సబ్–అసిస్టెంటు సర్జను, యిద్దరు మంత్రసానులు ఉండాలనీ, స్వదేశీ తయారీయైన వస్తువులు, ఖద్దరు వాడాలనీ, బాల్యవివాహనిషేధ చట్టము అమలు పరిచేటట్టు చూడటం చేయాలని తీర్మానాలు చేసినట్లు తెలియజేసింది.

*ప్రతిగ్రామంలో ఆడపిల్లలకు నిర్బంధ ఉచితవిద్యను బోధించే విద్యాలయాలు ఉంటేనే బాలికావిద్యాభివృద్ధి ఉంటుందని భావించింది. సాంప్రదాయమైన బాధ్యతతోనే స్త్రీల అభ్యుదయ సంస్కరణలు ఉండాలనీ, స్త్రీల గృహనిర్వహణాబాధ్యత ముఖ్యమని భావించారు.*

'చుండూరు రత్నమాంబ గారు' (ఫిబ్రవరి 1934 గృహలక్ష్మి) అనే శీర్షికన ఆమెను గురించిన పత్రికాధిపులు ప్రచురణలో ఆమె ఒక ధీర చరిత్రురాలని పేర్కొంటూ కాకినాడలోని జమిందారుని తనయగా 1893 లో చుండూరు రత్నమాంబ జన్మించిందనీ, ఆమె చదువు, సంగీతం గల

సంస్కరణాభిలాషి అనీ, ఆమెకు జాతీయతాభావం, దేశారాధన ఉగ్గుపాలతోనే పట్టుబడ్డాయని తెలిపింది. ఏకేశ్వరోపాసకులైన శ్రీరామ శ్రేష్ఠితో 1901లో వివాహం జరిగిందనీ, వివాహానంతరం కూడా హిందీ, సంస్కృత భాషలలో పరిజ్ఞానాన్ని పొందిందనీ, నాళం రామలింగయ్య గారు నెలకొల్పిన వైశ్యసదనాన్ని నిర్వహిస్తున్న బత్తుల కామాక్షమ్మ గారితో కలిసి రాజమండ్రిలో ఏర్పాటైన వైశ్యసేవాసదనపు సభలో పాల్గొని జాతి, కుల, మతాలకు అతీతంగా బాలికలకు సరస్వతిని ఉపాసించే అర్హత కల్గించాలని సూచన చేసిందని తెలియజేసింది. ఈమె అనేక వితంతు వివాహాలను దగ్గరుండి జరిపించిందనీ, మనుమలనెత్తే వయసులో స్వదేశీ ఉద్యమంలో పాల్గొని ఆర్నెల్లు చెరసాలలో శిక్షననుభవించిందనీ, 1931 సం.లో వచ్చిన కొల్లేటి వరద బాధితులకు సహాయ సహకారాలు అందించిందనీ, చదివిన చదువులు విశ్వకళ్యాణానికి వినియోగించాలని చెప్పిందని తెలిపింది. ఈమె సత్రాలకు, చావడులకు విరాళాలు యిచ్చిందనీ, ఏలూరులో యువతీజన పఠనాలయాన్ని, గ్రంథాలయాన్ని నెలకొల్పిందనీ, భారతీయులు 50 ఏండ్లు వచ్చేవరకు దైవాన్ని స్మరించనవసరం లేదని భావించిందనీ,యుక్తవయస్సులో భారతజాతి నిర్మాణానికి కృషిచేయాలని చెప్పిందని తెలిపింది. స్త్రీ-పురుషసమానత్వాన్ని కోరిందనీ, పిల్లలను చెన్నపురిలోని దివ్యజ్ఞాన సమాజంలో చదివించిందనీ, చుండూరు రత్నమాంబ తన జీవితాన్ని సార్థకత్వం చేసుకుందని పత్రిక తెలియజేసింది.

*స్త్రీ జనాభ్యుదయానికి కృషిచేసిన నారీమణిగా రత్నమ్మగారి జీవితం జన్మసార్థకతను పొందిందని అర్థం అవుతుంది. 1933 లో ఆమె 'సప్తమాంధ్ర మహిళాసభ'లో చెప్పిన మాటలను ఆచరణలో చూపించగలిగిన ఆమెను అభ్యుదయ స్త్రీగా భావించాలి.*

'ఆంధ్రమహిళా సభలు' (నవంబరు 1933 గృహలక్ష్మి) అనే శీర్షికన పత్రికాధిపుల ప్రచురణలో కృష్ణాజిల్లా లోని నూజివీడులో స్త్రీల ప్రాతినిధ్యంతో 27-9-33 తేదీన సభలు జరిగాయనీ, ఖద్దరు, హరిజనసేవ, హిందీ మున్నగు జాతీయ విషయాలను గురించిన ప్రబోధం జరిగిందనీ, గుమ్మడిదల దుర్గాబాయమ్మ గ్రంథాలయాల ఆవశ్యకత, మాతృభాషా విధానమును గురించి ఉపన్యసించారని తెలియజేసింది. అలాగే బాపట్లలో స్త్రీహితైషిణీమండలి వారు రాజారామమోహనుని శతవార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన సభలో జ్ఞానాంబ ఉపన్యాసం చేసారనీ, కమలమ్మ స్త్రీలు-బీమావ్యాపారం గురించియు, స్త్రీవిద్య, నగలు, దేవీ నవరాత్రులను గురించి మిగిలిన స్త్రీలు ఉపన్యసించారని తెలిపింది. విశాఖపట్టణంలో జరిగిన శ్రీగాంధి నవరాత్రుల ఉత్సవసభలో గుండుమళ్ళ రంగనాయకి చేపట్టిన ఖద్దరు వంటి కార్యక్రమాలు జరిగాయనీ, గోదావరి జిల్లాలో దేశసేవికలు వచ్చి నిర్బంధ ప్రాథమిక విద్య, దేశీయపరిశ్రమలు, శారదాబిల్లు, కన్యావరశుల్కములు, విధవా వివాహములు, నిమ్నజనోద్ధరణ, వివాహవిచ్ఛేదంవంటి విషయాలపై తీర్మానములు చేసారని తెలియజేసింది. ఆ సభలోనే ఇందిరాదేవి ఉపన్యసిస్తూ స్త్రీల గౌరవ స్వాతంత్రాలు తిరిగి నిలబెట్టటానికి స్త్రీవిద్య అవసరమనీ, స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలనీ,

ప్రజోపయోగ సంస్థలందు స్త్రీలు పాల్గొనాలనీ, స్త్రీ స్వాతంత్ర్యపు తీరుని భారతీయ ఆత్మతత్వంతో సమన్వయ పరిచి గృహజీవనంలో లోకమర్యాదతో ఉంటూ స్త్రీలు గౌరవమైన బహిరంగ జీవనంలో పాల్గొనాలని ఆమె చెప్పినట్లు పత్రిక తెలియజేసింది.

ఆ సభలోనే సారంగు సీతాదేవిచేసిన ఉపన్యాసంలో స్త్రీలు సంఘవిషయాలలో, మత విషయాలలో, రాజకీయ విషయాలలోనూ పురుషులు అనుభవిస్తున్న హక్కులు, బాధ్యతలు స్త్రీలకు కూడా ఉండాలని తీర్మానించి సంఘవిషయమైన హక్కుతో స్థిరచరాస్తులకు సంబంధించిన విషయాలలోను, స్త్రీల స్వాతంత్ర్యానికై వారికి హక్కులను కలుగజేయాలని తెలిపింది. బాల్య వివాహాలు తగ్గితే బాలవితంతువుల సంఖ్య తగ్గుతుందనీ, భర్తయందు అనురాగం కలిగే వయస్సులో వివాహం ఉండాలనీ, దానికై సాంఘిక సంస్కరణలు స్త్రీపురుషులు కలిసి చేయాలనీ, సంఘోద్ధరణకు పూనుకోవాలని చెప్పినట్లుగాను పత్రిక తెలియజేసింది.

*స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు అవసరమైన సాంఘిక, సాంస్కృతిక, మత, ఆర్థిక, రాజకీయ హక్కులు కావాలని తీర్మానాలను చేసారు.*

కందుకూరి శ్రీమహాలక్ష్మమ్మ (నవంబరు 1933 గృహలక్ష్మి)ను గురించిన పత్రికాధిపుల ప్రచురణలో భర్త మరణానంతరం జమిందారిణియైన శ్రీమహాలక్ష్మమ్మ విద్యభ్యాసమొనర్చి 1899 లో గంజామునందలి ఉర్లాం సంస్థానాధిపతిగా భర్త చేపట్టిన చెరువులు, తోటల సంరక్షణను చేస్తూనే, ఉర్లాంలో లోయర్ సెకండరీ పాఠశాలను పెట్టి నూటఏబదిమంది పిల్లలకు ఉచిత భోజన సదుపాయాలతో విద్యను చెప్పించిందని తెలిపింది. సంవత్సరానికి రెండుమారులు వికలాంగులకు కూడు, గుడ్డను అమర్చేదనీ, ఆమె ఏర్పరిచిన వేదపాఠశాలలో సంస్కృతం చదివి విద్వాంసులైన వారున్నారనీ, దానధర్మాలకు ప్రసిద్ధిపొందిన ఆమె 1908లో చనిపోయిందని తెలియజేసింది. కందుకూరి మహాలక్ష్మమ్మ చేసిన సామాజికాభివృద్ధి సేవ ఎంతోమంది ధనికవితంతువులకు స్ఫూర్తినిస్తుందని తెలియజేయటం జరిగింది.

*1900 సం.లోనే ఒక స్త్రీ విద్యాసంస్థలను నెలకొల్పి, వారికి ఉచితవిద్య, భోజన సదుపాయాలు కల్పించటమేకాక వికలాంగులను ఆదరించటం ఘనమైనవిషయంగా భావించాలి.*

వేదవల్లి తాయారమ్మ వ్రాసిన 'బాల్యవివాహములు' (డిసెంబరు 1933 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ, పురుషుల అన్యోన్య ప్రేమను వృద్ధిపరచేది వివాహమనీ, ప్రస్తుత దేశంలో బాల్యవివాహాలు, అతి బాల్యవివాహాలు జరుగుతున్నాయనీ, బాలికలు పన్నెండేండ్ల వయస్సులో రజస్వలలై గర్భధారణ వహిస్తున్నారు, కానీ కనీసం గర్భధారణకు 20 సంవత్సరములు వయస్సు ఉండాలని తెలిపింది. భర్తమరణానంతరం బాలవితంతువుగా యావజ్జీవిత దుఃఖాన్ని అనుభవిస్తున్నారనీ, నిర్బంధవైధవ్యంలో మృత్యువు పాలవుతున్నారనీ, శారదా చట్టమును ప్రవేశపెట్టిన శ్రీహర విలాస శారదగారు, ముత్తు లక్ష్మీరెడ్డిగారు వందనీయులనీ, దీనివలన బాలికలు విద్యావంతులు కాగలుగుతారని తెలియజేసింది.

*బాలికలకు 14 సం.లు వస్తే గానీ, వివాహం చేయరాదనేది శారదాచట్టంలో ప్రతిపాదించిన విషయం. స్త్రీల ఆరోగ్యరీత్యా స్త్రీ గర్భధారణ వహించాల్సిన వయస్సును చర్చించగలిగారంటే అంటే స్త్రీల లైంగికతకు సంబంధించిన విషయాలపట్ల స్త్రీలు అవగాహనను పెంచుకోవటంగా అర్థమవుతుంది. శారదాచట్టంయొక్క విలువను స్త్రీలు గ్రహించేటట్లుగా చైతన్యపరచిన వ్యాసమిది.*

'గాదెచూడి కుదుత్తమ్మ' (జనవరి 1934 గృహలక్ష్మి)ను గురించి పత్రికాధిపులు తెలియజేస్తూ గంజాం మండలం వైష్ణవకులంలో పుట్టినదనీ, భర్త విదేశాలకు వెళ్ళివచ్చినా ప్రాయశ్చిత్తకాండ అవసరంలేదని చెప్పిందనీ, మహిళాసమాజాన్ని స్థాపించిందనీ, తన మనమరాలికి పునర్వివాహం చేసిన ధీరఅనీ, పిల్లలందర్నీ సద్గుణాలతో పెంచిన ధీరురాలనీ ఆమెను పత్రిక కొనియాడటం జరిగింది.

*నాటి మూఢవిశ్వాసాలను నిర్మూలనం చేసి మహిళాభివృద్ధిని ఆచరణసాధ్యంచేసిన వనిత ఈమె.*

చిల్కపాటి సీతాంబ 'స్త్రీ మహిమ' (జనవరి 1934 గృహలక్ష్మి)ను గురించి వ్రాసిన వ్యాసంలో డబ్బుగల స్త్రీ పురుషులు తమ సంతానంయొక్క అభివృద్ధికై విద్యావతిని పెళ్ళిచేసుకుంటున్నారు గానీ, అదే గ్రామాలలో స్త్రీలు విద్యావతులైతే నగర యువతులవలె తమ భర్తలను దేశమాత దాస్య విముక్తికై పంపి గాంధీ ఆశయాలను నెరవేర్చగలరని తెలిపింది. స్త్రీలు విద్యాజ్ఞానంతో దేశానికి ఉన్నతిని కలిగించాలనీ, పల్లెస్త్రీలు సంతానాన్ని కనటంకోసం కాక దేశ ప్రయోజనమైన కార్యాచరణకు పూనుకోవాలనీ, దానికై స్త్రీలు జ్ఞానం సంపాదించాలి కాబట్టి విద్యావంతులు కావాలని చెప్పింది. వితంతు స్త్రీల పునర్వివాహం కంటె కూడా వారికి ఉన్నత విద్య నేర్పించి బాలికాపాఠశాలో ఉపాధ్యాయినులనుగా నియోగించి గ్రామాల్లోని స్త్రీ విద్యకు పాటుపడేటట్లు చేయాలని కోరింది.

*స్త్రీల విద్య కుటుంబానికి లేదా దేశాభివృద్ధికి కూడా అవసరమని వారు విద్యనేర్చి జ్ఞానవంతులైన తర్వాత ఆ జ్ఞానాన్ని దేశభవితకు, దేశదాస్య విముక్తికి ఉపయోగించాల్సిన అవసరాన్ని సూచించటం జరిగింది. పల్లీయుల, పట్టణవాసుల యొక్క దేశభక్తికి సంబంధిచిన విషయాలలోని అంతరాలను గుర్తించటం జరిగింది.*

'ఆంధ్రదేశము నందలి స్త్రీల' సంఖ్యను గురించి ( ఫిబ్రవరి 1934 గృహలక్ష్మి) పత్రికాధిపుల ప్రచురణలో వివరిస్తూ మొత్తంగా 97,73,582 మంది స్త్రీలుండగా వారిలో పట్టణ స్త్రీలు 9,45,614 మరియు పల్లెల్లో 88,27,898 మంది స్త్రీలు ఉన్నారని తెలియజేసింది. గణాంకాలనుపట్టి పల్లెల్లోనే స్త్రీల సంఖ్య ఎక్కువకాబట్టి బాలికావిద్యాభివృద్ధి అక్కడే ఎక్కువగా జరగాలని పత్రిక తెలియజేసింది..

ప్రేమాదేవి 'భారత నారీమణుల భావికర్తవ్యం' (జూన్ 1934 గృహలక్ష్మి) అంటూ వ్రాసిన వ్యాసంలో స్త్రీలు శృంగారదేవతల వలెగాక సబలలుగా నిరూపింపబడాలనీ, సమాజంలోని దుర్మార్గాలను సహించకూడదనీ, స్త్రీలు స్వాతంత్ర్యం సంపాదించినా సంఘంలోని ఎగుడు దిగుడు

స్థాయిలను తగ్గించకపోతే ఉపయోగం ఉండదని తెలిపింది. సంఘానికి ప్రచారం వల్ల జ్ఞానాన్ని అందించటమేగాక తమ ప్రవర్తనవల్లకూడా అందించాలనీ, వైద్యశాలలో స్త్రీలే నర్సులుగాఉండి రోగులకు చికిత్స చేస్తున్నట్లుగా సమాజంలోని రోగులందరికీ చికిత్స చేయటానికి, ప్రతిస్త్రీ ఆ జాడ్యాలను రూపుమాపటానికి నడుంకట్టాలని సూచించింది.

*వర్గభేదంగాని, కుల, మత భేదాలుగాని లేని విధంగా స్త్రీలు సమానస్వాతంత్ర్యాన్ని అభిలషించారని అర్థమవుతుంది. స్త్రీలు తాము జ్ఞానవంతులవటమే గాక సమాజంలో అసమానత్వమనే రుగ్మతలకు చికిత్సచేయగల స్థితికి చేరుకోవటం స్త్రీల భావికర్తవ్యమని అర్థం అవుతుంది. ప్రజాస్వామిక భావాల పరిణితి స్త్రీల ఆలోచనలో ఏర్పడిందని తెలుస్తోంది.*

తాడి నాగమ్మ వ్రాసిన 'స్త్రీ కన్నీరు' (అక్టోబరు 1934 గృహలక్ష్మి) అనే వ్యాసంలో బైబిల్, ఖురాన్, రామాయణం, భారతం వంటి చారిత్రక కావ్యాలలోని యుద్ధాలకు స్త్రీయే మూలకారణమని భావించేటట్టు చేసారనీ, విదేశీయ కావ్యాలలో షేక్ స్పియరు వ్రాసిన 'హేమలెట్' నాటకంలోనూ స్త్రీ తన మరిదిని పొంది భర్తను హత్య చేయించిన దుష్టపాత్రగా తన తల్లిని గురించి కొడుకు భావించాడు కానీ, ఆ అక్రమసంబంధంలోని ఆ పాపంలో తన పినతండ్రి పాపం కూడా ఉందని భావించనందుకు బాధపడటం జరిగింది. అంతేకాదు, స్త్రీలను అలా వర్ణించటానికి పురుషుడు స్త్రీని ఒక భోగవస్తువుగా చూడటమే కారణమనీ, పురుషుని స్వేచ్ఛా విహారాన్ని స్త్రీ ప్రశ్నించ కూడదనే భావన అనీ, పురుషులు తమకున్న బలహీనతలే స్త్రీలకుంటాయనే నిత్యశంకతో స్త్రీలను నమ్మరాదనే ప్రచారాలు చేస్తున్నారని తెలియజేసింది. స్త్రీలు సాధ్వులు, సుగుణశీలురైనా గౌరవింపబడకపోవటం కారణంగా దేశం క్షీణించిపోతోందనీ, దుఃఖపడ్డ స్త్రీకన్నీటికి విశ్వమే కరిగిపోతుందని, స్త్రీల కన్నీరుకు విలువ వుంటుందనీ, స్త్రీల స్వేచ్ఛను గౌరవించటమే తమని తాము రక్షించుకోవటమనీ, అదే దేశరక్షణ అని తెలియజేసింది.

*సాహిత్యంలోని పితృస్వామ్యసంస్కృతి యొక్క లింగవివక్షాస్వభావాన్ని బయటపెట్టింది.*

శ్రీసాధ్వీరత్నమ్మ వ్రాసిన 'స్త్రీజన్మ ప్రశంసమైనదే' (అక్టోబరు 1934 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పురుషులు బుద్ధిలో అహంకారంతో ఉంటారనీ, స్త్రీ హృదయం సేవాభావంతో ఉంటుందనీ, అందుకే గాంధీ తనకు స్త్రీ భావం రావాలనీ కోరుకున్నాడని తెలిపింది. పిల్లలను, భర్తను ధార్మికులుగా తీర్చిదిద్దేది ఆ యింటి యిల్లాలే అనీ, స్త్రీ సంఘాలు పరస్పర ద్వేషంతో కాక సేవాభావంతో ఉండాలనీ, స్త్రీ జన్మ గొప్పదని తెలియజేసింది.

'అత్యం సత్యవతీ దేవి'ని గురించి (నవంబరు 1934 గృహలక్ష్మి) పత్రికాధిపుల ప్రచురణలో ఆమె బెంచి కోర్టుకు ఆనరరీ మెజిస్ట్రేట్ గా నియమింపబడిందనీ, తాలుకాబోర్డు మెంబరుగా పౌరసేవ చేసినట్లును తెలియజేసింది.

*న్యాయవ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యం, నిర్ణయాధికారం స్త్రీల ప్రగతిసూచికగా భావించవచ్చు.*

యార్లగడ్డ చిలుకమ్మ వ్రాసిన 'రష్యను స్త్రీల వీరత్వం' (నవంబరు 1934 గృహలక్ష్మి) అనే వ్యాసంలో బోల్షివిక్ ఉద్యమ నేతయైన మిస్ ఒలగగోరేకేప్ యొక్కచరిత్రవ్రాస్తూ ఆమె లెనిన్ కి కూడా సలహా ఇవ్వగల స్థితికి చేరిందని తెలిపింది. రష్యను స్త్రీల వీరత్వం, విప్లవోద్యమంగొప్పదనీ, సోవియట్ ప్రభుత్వాన్ని జారుల దాస్యశృంఖలాల నుండి విముక్తి చేసే దృష్టి ఆ స్త్రీలకు నిరంతరం ఉండేదనీ, అందుకే సోవియట్ రష్యాలో ప్రజాస్వామ్యం ఏర్పడిందని చెబుతూ అలాగే భారతదేశస్త్రీలు కూడా వీరత్వంతో సమరంలో పాల్గొని భారతదేశ దాస్యశృంఖలను విడదీయాలని తెలియజేసింది.

*భారతదేశంలో 1934లో కమ్యూనిజం ప్రవేశించటంతో రష్యాలోని కమ్యూనిష్టుల విప్లవాన్ని తెలియజేస్తూ, రష్యాలో వలె భారతదేశంలోకూడా విప్లవం అవసరమని భావించటం జరిగింది.*

1930 నుండి1934 వరకు వచ్చిన వ్యాసాలలో ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్యం, స్త్రీల కారాగారశిక్షలు, రాష్ట్రస్థాయి, అఖిలభారత, అంతర్జాతీయ స్థాయిలలో జరిగిన మహిళామహాసభలలో స్త్రీలు పాల్గొని తీర్మానాలను చేయటం, రాజకీయవ్యవహారాలలో స్త్రీల భాగస్వామ్యానికై స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలని భావించటం జరిగింది. స్త్రీల సహకారం ఉండాలనుకోవటం, పరాధీనత, అస్వతంత్రతకు తావులేని భారతజాతీయత, స్త్రీలు స్వశక్తిని గుర్తించగల స్త్రీవిద్య ఉండాలనుకోవటం, స్త్రీసమస్యలను తీర్చగల విడాకులవంటి నవీనచట్టాలు కావాలనుకోవటం, స్త్రీలకు ఆస్తిహక్కుఉంటేనే రాజకీయ స్వాతంత్ర్యం లభిస్తుందని అనుకోవటం జరిగింది. స్త్రీలకు వయోజన విద్య, సమానాధికారాలు, న్యాయవ్యవస్థలో స్త్రీలభాగస్వామ్యం ఉండాలనీ, వర్గ, కులభేదాలు లేని జ్ఞానంతోనే స్త్రీలకు సాంఘిక, రాజకీయస్వాతంత్ర్యం లభిస్తుందనీ, గ్రామపునర్నిర్మాణంలో స్త్రీలభాగస్వామ్యంఉండాలని కోరుకొన్నారు. లోకల్ బోర్డులలోను, శాసనసభలలోను స్త్రీలు ఎన్నిక కాబడాలనుకోవటం, సంఘ నిర్మాణంలో స్త్రీలకు స్వాతంత్ర్యపు హక్కు ఉండాలనిభావించారు. వైద్యురాండ్రుగా స్త్రీలు అభివృద్ధిచెందాలనుకోవటం, సాహిత్య, సాంఘికరంగాలలో సేవచేసిన స్త్రీల ప్రశంస, రష్యనుస్త్రీల వీరత్వాన్ని గ్రహించటం వంటి విషయాలను తెలియజేస్తూ స్త్రీలు వ్యాసరచన చేసారు.

**కథలు**

క్రీ.శ.1930 నుండి1934 వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకు అవసరమైన విద్య, వైవాహిక స్వాతంత్ర్యసంస్కృతికి, దేశస్వాతంత్ర్యానికి సంబంధించిన 35 కథలు వచ్చాయి.

మాగంటి శకుంతల వ్రాసిన 'సరస్వతి కష్టములు గట్టెక్కుట' (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మి) అనే కథలో వితంతుసోదరిని ఇటు పోషించటం ఇష్టంలేక అటు సంప్రదాయవాదిగా పునర్వివాహం చేయటం యిష్టంలేక వాళ్ళ అన్నలు ఆమెను తీసుకెళ్ళి ఒక రైలుస్టేషన్ లో వదిలిపెట్టారు. ఆమెను చేరదీసిన సంఘ సంస్కరణవాదులు ఆమెకు పునర్వివాహం చేసేసరికి సోదరుడు వచ్చి క్షమించమని అడిగి యింటికి తిరిగిరమ్మనగా, ఆమె తాను రానని చెప్పి పశ్చాత్తాపం నిజమైతే సోదరుని సంఘసంస్కర్తగా స్త్రీపునర్వివాహం చేస్తానని ప్రమాణం చేయమని అడిగింది.

*వితంతువివాహాలపట్ల కుటుంబంలోని పురుషులలో రావాల్సిన సామాజిక చైతన్యానికి ప్రతీక ఈకథ. అప్పుడే వితంతువులు బయటప్రపంచంలో గౌరవప్రదంగా తిరగగలుగుతారని స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొంటారని భావించింది. స్త్రీపునర్వివాహానికి స్త్రీజాతిస్వాతంత్ర్యానికి ఉన్న లంకెను తెలియజేస్తోంది.*

మైదవోలు పద్మావతి వ్రాసిన 'త్యాగిని' (మార్చి 1930 గృహలక్ష్మి పత్రిక) అనే కథలో ఆబాలగోపాలం సత్యాగ్రహ పోరాటంలో పాల్గొంటుంటే తన కొడుకు స్వరాజ్య ఉద్యమంలో పాల్గొననందుకు కొడుకును ప్రశ్నించే సరికి కొడుకు తన తండ్రి జాతీయ ఉద్యమంలో అప్పటికే మరణం చెందటంతో, తన తల్లిని ఎవరు చూసుకుంటారనే బాధను వ్యక్తం చేసాడు. ఆ తల్లి తనకన్న దేశమాతయే ముఖ్యమని కొడుకుకు చెబుతుంది. స్వతంత్రోద్యమంలో పాల్గొని తండ్రి మరణించటం చేత తల్లి బాధ్యత వహించటానికి కొడుకు ఉద్యమంలో పాల్గొనటం లేదని గ్రహించిన ఆ తల్లి, తండ్రివలె కొడుకు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనటానికి వీలుగా అతనికి తల్లి బాధ్యతను తప్పించటానికి తాను చనిపోతున్నానని లేఖ వ్రాసి పెట్టి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిందని తెలియజేసిన కథ ఇది.

*మాతృదేశ స్వాతంత్ర్యం కోసం ఆ మాతృమూర్తి చేసిన 'ప్రాణత్యాగం' స్వరాజ్యరథానికి కందెనగా మారిందని అర్థంకాక తప్పదు.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'ముందు కథ' (జులై 1930 భారతి పత్రిక) అనే కథలో బాల్య వివాహ నిషేధ చట్టం వస్తుందనే భయంతో తల్లిదండ్రులు ముందుగానే ఏడాది వయసులో ఉన్న తన కూతుర్ని ఏడేండ్ల వయసున్న బాలుడికిచ్చి పెళ్ళిచేయటం జరిగిందనీ, పెళ్ళి అవడం చేత కూతుర్ని పాఠశాలకు పంపి చదివించక పోయేసరికి ఆమెకు లోకజ్ఞానం కాని, నాగరికత గాని అంతగా లేకపోయిందని చెప్పింది. కాని ఆ వరుడు మగపిల్లవాడుగా న్యాయశాస్త్రం చదవటంతో అతడు తనకున్న జ్ఞానంతో అసలు బాలబాలికలకు పెళ్ళి చేయటానికి తల్లిదండ్రులకు హక్కు లేదనీ, తమకు నచ్చిన వారిని చేసుకునే వెసులబాటులేని ఆచారాలను తిట్టుకుంటాడు. హిందూమత ధర్మ ప్రకారం బ్రహ్మచర్యంలో విద్యాభ్యాసానంతరమే పెళ్ళి అని నిర్ణయించింది కాబట్టి తమకు బాల్యంలో జరిగిన పెళ్ళి పెళ్ళే కాదు కాబట్టి ఆమెతో కాపురాన్ని ఇష్టపడననేసరికి బాలిక తండ్రి మరొకరికిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నా ఆచారం అడ్డురావటంతో, ఆచారాల మధ్య ఆ స్త్రీ బాధితురాలయినట్లు తెలియజేసింది.

సాంఘిక దురాచారాలు స్త్రీల సమస్యలకు కారణమైన విషయాన్ని, బాల్యవివాహాలు ఆడపిల్లలను చదువులేకుండా, నాగరికంగా ఎదగనీయకుండా చేస్తున్నాయనీ దానివల్ల వివాహాలు విచ్ఛిన్నమయ్యే అవకాశ ముందుంటుందని తెలియజేసేదే ఈ 'ముందు కథ'.

ఈమెయే వ్రాసిన 'ఐదుమాసములు యిరువది దినములు' (అక్టోబరు 1931 గృహలక్ష్మి పత్రిక) అనే కథలో ఖద్దరు వస్త్రములను ధరించటం ఇష్టంలేని భార్యయందు విముఖత్వముగల

ఆమెయొక్క భర్త విదేశీ వస్త్రదహన ఉద్యమంలో భాగంగా జైలు కెడతాడు. అయితే భర్త విముఖత్వానికి, స్వదేశీ ఖద్దరు ధరించలేని తనయొక్క అస్వతంత్రత, బానిసత్వం గ్రహింపుకు రాగా, ఆమె తన భర్తకిష్టమైన ఖద్దరు ధరించి, ఖద్ధరు వడకటం నేర్చుకోవటమే కాక తోటిస్త్రీలు కూడా ఖద్దరును ధరించే విధంగా చేయటం కోసం తన యింట నోముకు వచ్చేవారందరు ఖద్దరు ధారణ చేయాలని నియమాన్ని పెట్టింది. ఆ రకంగా అందరూ ఖద్దరు ధారణలో పూజ చేస్తున్న సమయంలో జైలులో ఆమె భర్త యొక్క సత్ప్రవర్తను మెచ్చి ఆర్నెల్ల శిక్షలో 10 రోజులు శిక్షను తగ్గించగా యింటికి వచ్చిన ఆమె భర్తకు ఆశ్చర్యం కల్గే విధంగా ఆమె అతనిమెడలో ఖద్దరు దారంతో కట్టిన మాలను వేసేసరికి భార్యలో వచ్చిన దేశ స్వాతంత్రాభిమానానికి ఆ భర్త సంతోషపడతాడని తెలియజేసింది.

*భర్తల ప్రేరణతో భార్యలు కూడా దేశస్వాతంత్ర్యపు విలువలను గుర్తించటం నేర్చుకుంటారనీ, సత్యాగ్రహ ఉద్యమంలో స్వదేశీయాభిమానాన్ని పెంచే ఖద్దరు ధారణయే ప్రధానసూత్రమని కనుపర్తి వరలక్ష్మమ్మ భావించింది.*

ఈమె వ్రాసిన "అయితే పాపము లలిత గతేమిటి?" (మే. 1933 భారతీ పత్రిక) అనే మరొక కథలో బాల్య వివాహం చేసి కూతురిని హాస్టల్లో పెట్టి చదివిస్తుంటే అత్తగారు తన కోడలు చదువుకుంటే మాట వినదేమోననే భయంతో చదువుకుంటున్న కొడుకుతో కోడలి చదువు మాన్పించి యింటికి తెమ్మంటుంది. అతను హాస్టలుకి వెళ్ళి భార్యను చదువుమానేసి కాపురానికి రమ్మంటే ఆమె తన నిర్ణయంగా తల్లిదండ్రులు యిష్టప్రకారం చేస్తానంటుంది. తన మాటకు విలువ నివ్వకుండా భార్యరానందుకు తాను మగాడిగా ఇంకొక పెళ్ళి చేసుకుంటానంటాడు. కాని ఆ అమ్మాయి తల్లి మాత్రం కూతురు చదువును మాన్పించేందుకు, తమ యింట్లో ఉన్న కూతురిపై అత్తారింటి వారికేమి అధికారమున్నదనే భావన చేసింది.

*అప్పటికి 'విడాకుల చట్టం' లేదు కాబట్టి పురుషులు ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకొనే వెసులుబాటు ఉండటంతో అతడు స్త్రీల చదువుకంటే కూడా తన తల్లిమాటకే విలువిచ్చి రెండోపెళ్ళి చేసుకునే స్థితిలో ఉన్నాడు. కాని ఆ అమ్మాయి తల్లికి మాత్రం స్త్రీల చదువుకు ఉన్నవిలువ తెలుసుకాబట్టి స్త్రీవిద్యకు విలువనివ్వని అత్తవారింట్లో తన కూతురుకు సుఖముండదని భావించటం జరిగింది. ఆడపిల్ల పెళ్ళి, కాపురం కంటే కూడా స్త్రీల చదువుకే విలువనివ్వాలని తెలిపిన కథయిది. భర్త మూర్ఖత్వానికి భార్య చదువు బలికావల్సిన అవసరం లేదని తెలిపిన కథ. కోడలు చదువుకోవాలని భావించే అత్తలు సమాజంలో ఉండాలని చెప్పే కథ ఇది.*

ఈమె వ్రాసిన 'ఒట్టు' (భారతి – శ్రీముఖనామ సంవత్సరం – డిసెంబరు 1933) అనే ఇంకొక కథలో స్త్రీలను నాటకరంగస్థలం మీద ప్రవేశపెట్టాలని భావించి తన మిత్రుల దగ్గర తన భార్యచేత నాటకం వేయిస్తానని 'ఒట్టు' వేసి రావటంచేత ఆ భార్య భర్త కోసం నాటక

ప్రదర్శనలో పాల్గొంది. కాని ఏడుస్తున్న పిల్లలకు భర్త పాలుపట్టలేక, జ్వరం వస్తే బిడ్డను చూడలేక పోయాడు. ఏడుస్తున్న పిల్లవాడి కోసం ఆ భర్త రంగస్థలం దగ్గరికి వెళ్ళగా అదే సమయంలో తన భార్య చిత్రాంగి పాత్రలో సారంగధరుడనే ప్రియుడి పాత్రతో భోగోపయుక్తమగు మాటలు మాట్లాడుతుంటే సహించలేకపోతాడు. అమాంతం రంగస్థలం మీద దూకి భార్యను రంగస్థలం నుండి క్రిందకు తెచ్చి రసాభాసం చేసాడు. స్త్రీలు నాటకరంగం స్థలంమీద మొగవాళ్ళతో నటిస్తుంటే పురుషులు భరించలేరనీ, కాని స్త్రీ పాత్రల పరమైన అనుభూతితో స్త్రీలు నటించినప్పుడు పురుషునితో చేసే నటనలో అది మనస్సుకు అంటదని తెలియజేసింది.

*పితృస్వామ్యపు అనుమాన ప్రవృత్తి ఉండటంతోపాటు పురుషుడు కుటుంబ నిర్వహణలోను, శిశుపోషణలోను అశక్తుడని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.*

ఈమెయే వ్రాసిన 'గొంగళి పురుగుల కథ' (అక్టోబరు 1934 ఆంధ్రభూమి) లో భాగంగా మునగచెట్టుకు పట్టిన గొంగళి పురుగులే పెరిగి సీతాకోకచిలుకలై ఆకర్షణీయంగా ఉండి గూటి చుట్టూ తిరుగుతూ ఉన్నట్లే క్రైస్తవ మిషనరీలు ధనాకర్షణ చూపి మతబోధచేయటానికి ప్రయత్నిస్తుంటారని చెప్పింది. చెట్టునుకొట్టినా గొంగళిపురుగుల బాధపోనట్టుగా తొందరపడి క్రైస్తవమతాన్ని తీసుకుంటే అది సవరించుకోలేని అపరాధం అవుతుందని కథద్వారా కనుపర్తి వరలక్ష్మమ్మ హెచ్చరిక చేసింది.

*భారతీయులలో మతాభిమానం తగ్గితే ఉద్యమంయొక్క ఐక్యతకు నష్టం వాటిల్లుతుందని ఆనాటి సమాజపు ఆలోచనగా తెలియజేసింది.*

ఈ దశాబ్దంలో కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన ఐదుకథలలో వివాహానంతర స్త్రీవిద్యపట్ల భర్తలు తమ తల్లిదండ్రులమాటలకు ప్రాధాన్యతనిచ్చి, భార్యలను వదిలిపెట్టి (అప్పటికి విడాకులచట్టంలేదు) మరొకపెళ్ళి చేసుకొంటున్నారనీ, అయినా స్త్రీలు మాత్రం విద్యకే ప్రాధాన్యత నిస్తున్నారనీ తెలియజేసింది. భర్త ఆశయాలైన ఖద్దరు ఉద్యమంలో భాగస్వాములయి ఖద్దరు విలువను గ్రహించటం, భర్త తన భార్యను సమాజంలోకి రానివ్వాలనుకొన్నా కూడా పితృస్వామ్యపు అనుమాన సంస్కృతి అతనిని నిలువనీయదనీ, మతమార్పిడులు హిందువుల ఐక్యతను దెబ్బతీస్తున్నాయని తెలియజేసింది.

ద్రోణంరాజు సీతాదేవి వ్రాసిన 'లలిత' (సెప్టెంబరు 1930 భారతీ పత్రిక) అనే కథలో చదువుకున్న తండ్రి ఉద్యోగ బాధ్యతలలోపడి తీరికలేక లలిత పెళ్ళి విషయంలో వేరొకరిని సంబంధాలు చూడమని బాధ్యత పెట్టే సరికి అతడు పెళ్ళిముహూర్తం పెట్టించుకొని వస్తాడు. కాని పెళ్ళికి వచ్చిన వరుడు నచ్చలేదని లలిత అతనితో పెళ్ళికి యిష్టపడలేదని తెలియజేసింది.

*స్త్రీలు చదువుకోవటంతో వివాహ విషయంలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగల స్థితికి ఎదిగిన విషయం ఈ కథలో అర్థం అవుతుంది. ఇదే స్త్రీల స్వతంత్ర నిర్ణయాలకు, వ్యక్తిస్వాతంత్ర్య జీవనానికి, సాధికారికతకు చిహ్నాలుగా భావించాలి.*

దరిశి అన్నపూర్ణమ్మ వ్రాసిన (డిసెంబరు 1930 వాసవి) 'సుశీల' అనే కథలో ఒక బాలిక పాఠశాలకు వెళ్ళి చదువుకుంటుంటే అందరూ గుసగుసలు పోయారనీ, అంతేగాక ఒక పండితుడిచేత ఇంటి దగ్గరే విద్యనేర్పించినందుకు సాంఘికంగా ఆ కుటుంబాన్ని వెలివేసారని చెప్పింది. తండ్రి ఆమెను ఒకతనికిచ్చి పెళ్ళిచేయగా, అతడు చోరుడిగా మారి మరణిస్తాడు. తర్వాత ఆమె పాఠశాలలో వేసిన నాటకానికి బహుమానంవచ్చినా చోరుని భార్యకు ఇవ్వకూడదంటారు. కాని ఆమె తనయొక్క తల్లిదండ్రుల మరణానంతరం, ఆ ఊరిలోని ఒకరు ఆమెను మానభంగం చేయాలని ప్రయత్నిస్తుంటే, వారి నుండి తప్పించుకొని ఒక ముసలాయన సహాయంతో కలకత్తాలోని విద్యాసంస్థకు చేరుకుంది. అయితే ఆమె ఊరివాళ్ళు ఆ వసతి గృహంలో కూడా ఆమెను ఉండనీయకుండా ప్రయత్నించేసరికి, ఆ వసతిగృహంవారుకూడా వెళ్ళగొట్టారు. ఆమె  ఆ ముసలి వ్యక్తి పంచన చేరినందుకు ఆయనతో ఆమెకు రంకులు కడుతుంటే వాళ్ళ నోళ్ళు మూయించటానికి, తన మనుగడ కోసం ఆ ముసలి వ్యక్తిని పెళ్ళిచేసుకుందామని అడిగి పెళ్ళిచేసుకొంటుంది. వయోభేదం ఉండటంతో ఇద్దరూ భార్యాభర్తలవలె గాక స్నేహితులుగా సహజీవనం చేసారనీ, ఆమె స్త్రీ సంఘానికి పాటుపడుతూ గ్రామాలలో మహిళామండలులు, స్త్రీవిద్యాలయములను నెలకొల్పుతున్న విషయాన్ని తెలుసుకున్న గాంధి వీరిదాంపత్యాన్ని ప్రశంసించాడని తెలియజేసింది.

*కథలోని అంశాలనుబట్టి ఇదొక వాస్తవ ఘటనకు సంబంధించిన విషయంగా  భావించవచ్చు. స్త్రీలు చదువుకోకూడదనే సాంఘిక నిషేధానికి అడుగడుగున హింసకు గురి అయిన స్త్రీ వ్యక్తిగతంగా బతకలేకపోయి స్వతంత్రం కోల్పోయిందని అర్థమవుతుంది. అందుకనే ఆమె విద్య అనే సాధనంతో ముందుకెళ్ళటానికి విద్యను కొనసాగించాలనుకొని తాను వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొంది దేశసేవలో భాగస్వామి కాగలిగిందని అర్థంఅవుతుంది. అంతేకాదు ఆనాటికే సహజీవనమనే సంస్కృతి అనే పదాన్ని అర్థవంతంగా వాడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. లైంగికసంబంధాలులేని వివాహవ్యవస్థలోని సహజీవనమిది.*

ఈమెయే వ్రాసిన 'జ్ఞానాంబ' (జనవరి 1931 వాసవి) అనే కథలో స్త్రీలు పుస్తకపఠనం చేయటాన్ని పురుషులు అవమానంగా భావించే ఇంటికి కోడలుగా జ్ఞానాంబ వెళ్ళిందనీ, అక్కడ ఆమె మామ వ్యాపారలాభానికై సోమరులైన బైరాగులను ఇంటికి పిలిపించి పూజించమనగా ఆ పనిచేయనందుకు, బైరాగి తినగా మిగిలిన మాంసాహారాన్ని ప్రసాదముగా తినమనగా తిననందుకునూ, మామ ఇంట్లోనుండి ఆమెను గెంటి వేశాడు. పుట్టింటికి చేరిన జ్ఞానాంబను తండ్రి తిరిగి అత్తవారింట్లో దిగబెట్టాడనీ, ఒకరాత్రిపూట ఇంట్లోవాళ్ళందరూ ఆమెను హింసిస్తూంటే పక్కింటి ఇన్స్ పెక్టర్ వచ్చి కాపాడి తనఇంటికి తీసుకువెళ్ళాడనీ, ఆమె అక్కడనే ఉంటూ తండ్రి మరణానంతరం వచ్చిన ఆస్తిని దానధర్మాలకు వినియోగిస్తుంటే భర్తకూడా వచ్చి ఆమెకు సహకరించాడని దరిశి అన్నపూర్ణమ్మ తెలియజేసింది.

*ఈ కథలో స్త్రీ తనకు చదువునేర్పిన జ్ఞానంతో కుహనా బైరాగులను నమ్మక కష్టాలుపడ్డా, ఆ కష్టాలనుండి విముక్తురాలై ప్రజాసేవ తాను చేయటమేకాక భర్తచేత కూడా చేయించగలిగింది.*

పాకల రత్నాబాయి 'రూపపటమెందుకు' (ఏప్రిల్ 1931 గృహలక్ష్మి) అనే కథలో స్త్రీలు పరీక్షలో కృతార్థులు కాగానే తమ రూపపటాన్ని పత్రికలో వేయించుకుంటున్నారనీ, కొంతమంది ఘోషాపద్ధతివల్ల అలా వేయించుకోవటానికి యిష్టపడటంలేదనీ, పరదాలను వదిలితేనే స్త్రీలు విద్యావంతులు కాగలరని తెలిపింది. స్త్రీలు ఉన్నత విద్యాభ్యాసం చేయనంతవరకు స్త్రీలు పురుషులచేతిలో విలాసవస్తువుల గానే చూడబడతారనీ, దేశాభివృద్ధికై స్త్రీల విద్యావ్యాప్తికి కృషి చేస్తేనే భారతమాత ధన్యతనొందుతుందనీ, అదే అసలు సిసలైన కీర్తి చంద్రికలుగానీ, రూపపట ప్రకటనం కాదని భావించటం జరిగింది.

*కొంతమంది స్త్రీలు పత్రికలో తమపేరును, రూపపటాలను గొప్పగా ప్రకటించుకోవటానికై చదువుతున్నారు కాని తోటిస్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేయటమే స్త్రీవిద్యాప్రయోజనమనే భావనను వ్యక్తీకరించిన కథయిది. స్త్రీలలో స్వార్థపరత్వంకంటె దేశసేవాభావం ప్రబలుతోందని అనటానికి నిదర్శనమిది.*

కం. రంగనాయకమ్మ వ్రాసిన 'సుందరమ్మ' (ఏప్రిల్ 1931 గృహలక్ష్మి) అనే కథలో అత్త తన కోడలు 'స్వరాజ్యం' అంటూ వీధుల్లోకి వెళ్ళి ఊరేగింపులలో పాల్గొంటోందనీ, సభలలో ఉపన్యాసాలిస్తోందనీ, ఇంట్లోకూడా రాట్నం వడుకుతూ ఉంటుందనీ విసుక్కుంటుంది. కోడలు స్వరాజ్య సమరంలో పాల్గొంటే ప్రభుత్వానికి కోపం వస్తుందనే భయంతో ఆమె తన కొడుకుతో అతనియొక్క కరణీకం పోతుందని చెప్పి పొలానికి సాగునీరు కూడా యివ్వరనీ, కోడలిని అదుపులో పెట్టమని అడుగుతుంది. దక్షిణాత్య అమ్మాయిలు స్వరాజ్య ఉద్యమంలో బాగా పాల్గొంటారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారనీ, స్వరాజ్యంలో పాల్గొంటూనే సీమసిల్కు చీరెలు కడుతూ సమయానుకూలంగా స్త్రీలు నడుచుకుంటారనీ, తన కోడలు కూడా అలా ఉంటే బాగుంటుందని అంటుంది.

*అత్త తన కోడలు కూడా కుహనాదేశభక్తిని పాటిస్తే బాగుంటుందని వ్యక్తం చేసినదానిని తెలియజేసింది. అంటే కొంతమంది ఉద్యమస్త్రీలకి నిబద్ధత కొరవడిందని కూడా తెలియ చెప్పిన కథయిది. పితృస్వామ్య కుటుంబంలో అధికారవ్యవస్థలో ఉన్న అత్తాకోడళ్ళ సంబంధాలనుండి వెసులుబాటు చేసుకుని స్త్రీలు స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనటం కష్టమైన విషయం. ఈ ఉద్యమంవల్ల ప్రధానంగా కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నం కాకుండా చూసుకునే బాధ్యతను కాపాడుకుంటూ, స్త్రీలు అదనంగా ఉద్యమ బాధ్యత వహించాల్సిన అవసరం ఏర్పడింది.*

బసవరాజు వేంకటరాజ్యలక్ష్మి వ్రాసిన 'ఎవరిదదృష్టం' (మే,1931 భారతి) అనే కథలో జాతీయోద్యమంలో భాగంగా ఉద్యోగం మానేసి ఇంట్లో చరఖా త్రిప్పటం, త్రిప్పించటం, హిందీ నేర్పించటం చేస్తున్న వ్యక్తికి వివాహం అవుతుంది. ఆ భార్య కూడా భర్తతో కలిసి పిల్లలకు పాఠాలను చెబుతూ, రాట్నం వడకటాన్ని నేర్పిస్తున్న సమయంలో భర్త సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా జైలుకు వెళ్ళినా ఆమె చలించదు, దేశసేవను మానదు. అంతేకాక, కుటుంబసభ్యుల

యొక్క మత వివక్షతతో మహమ్మదీయుడైన భర్తచేత వదలిపెట్టబడిన తన స్నేహితురాలిని తనతోపాటు కలుపుకొని ఖద్దరు ధరించేటట్టు చేసి దేశసేవ ముఖ్యమని చెప్తుంది. ఆ స్నేహితురాలు స్త్రీలను వాలంటీర్లుగా చేర్పిస్తూ ఖద్దరు మూటలు అమ్ముతూ దేశసేవ చేస్తూ వివేకం తెచ్చుకొంటుంది. స్నేహితురాలి భర్తకూడా మారి హిందూమహమ్మదీయ సఖ్యతకై పాటుపడుతుండగా దుండుగులు అతడ్ని చంపటం జరిగింది. స్నేహితురాలు ఖద్దరు ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలుపాలయి, మరణావస్థలో ఉండిన ఆమె తన మిత్రురాలిని పిలిచి అదృష్టవంతురాలివనీ, దేశసేవ మానవద్దని చివరిమాటగా చెప్పి చనిపోయినట్టు తెలియజేసింది.

*కుటుంబంలోనూ, సమాజంలోనూ స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలలో స్త్రీలు పాల్గొనటం అదృష్టంగా భావించటం కనపడుతుంది. వ్యక్తిస్వాతంత్ర్యంగల స్త్రీలు దేశస్వాతంత్ర్యం కోసం పోరాడటమే స్త్రీల జీవితం ధన్యమయిందని భావించటం కనపడుతుంది.*

పులవర్తి కమలావతీదేవి వ్రాసిన 'మిహిరున్నీసా బేగం' (జూన్ 1931 వాసవి) అనే కథలో హిందూ మహమ్మదీయులమధ్య పరస్పరం ఉండవలసిన సత్సంబంధాలను, దేశాభివృద్ధికి పాటుపడాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ మతఛాందసులు, ఉగ్రవాదులైన ఒకహిందూ, ఒక మహమ్మదీయ కుటుంబాల మధ్య సఖ్యతను పెంపొందించిన కథయిది.

*మతాలను విమర్శకు పెడ్తూ వ్రాసిన కమలాదేవి నిర్భయత్వాన్ని ప్రశంసించాల్సిందే.*

ఈమె వ్రాసిన 'పుష్కరమూ బాలవైధవ్యమును మాన్పినది' (సెప్టెంబరు 1932 వాసవి) అనే మరొక కథలో తల్లిదండ్రుల మరణానంతరం బాలవితంతువుగా సోదరుడి ఇంట్లో కష్టాలు పడలేకపోతున్న ఒక యువతి కుటుంబవ్యక్తులతో పుష్కరస్నానానికి వెళ్ళి అక్కడపడి చావాలనుకుంది. ఈమెను కాపాడిన బాలభటుడు ఈమె ఆత్మహత్యకు కారణం తెలుసుకొని ఈమెను వితంతు వివాహం చేసుకొన్నాడనీ, ఆ బాలవితంతువుయొక్క పుష్కరస్నానం ఆమెను పునీతను చేయటమే గాక ఆమె భర్తతో సుఖంగా జీవించే శక్తినిచ్చినదని తెలిపింది.

*పుష్కరాల ప్రయోజనం మానవజీవితాల్ని బాగుచేసేదిగా ఉండాలనీ, మతనమ్మకాలు మంచి చేస్తే ఆ మతంమీద అభిమానం కూడా కలుగుతుంది కానీ, మూఢమైన దురాచారంగా మతాచారం ఉండకూడదని తెలియజేసింది. పుష్కరాల పరమార్థం మానవుల జీవనాభివృద్ధి ధ్యేయంగా ఉండాలని భావించింది.*

ఈమెయే వ్రాసిన 'విత్తొకటి నాటితే చెట్టొకటి మొలుస్తుందా' (నవంబరు 1932 వాసవి) అనే ఇంకొక కథలో ఒకడు 'ఇన్ కంటాక్స్ ఆఫీసరుగా' బీదప్రజలను పీడించి మానవత్వం లేకుండా పన్నులు వసూలు చేసి మరణిస్తాడు. అతడు ఆ తరువాతిజన్మలో ఒక బీదవ్యాపారి కుటుంబంలో పుట్టి అదేరకమైన బాధలు పడ్డట్టుగాచెప్పి, ప్రభుత్వశాసనాలను ఆచరించాలిగానీ, తనయిష్టానుసారం అధికారాన్ని అడ్డుపెట్టుకొని పన్నులను వసూలు చేయటం తప్పు అని పులవర్తి కమలావతీదేవి తెలియజేసింది.

*స్త్రీలు కూడా ఇన్ కమ్ టాక్స్ లకు సంబంధించిన విషయాలను ఆలోచించేస్థాయికి చేరినట్టుగా ఈ కథ అర్థం అవుతుంది.*

ఈమె వ్రాసిన 'మాదిగ వెంకడు' (జూన్ 1934 వాసవి) అనే మరొక కథలో ఒక డిప్యూటి కలెక్టరు తన ఆఫీసులోని మఱుగుదొడ్డిని శుభ్రంచేసే దళితకార్మికుడు అస్వస్థతతో ఒక రోజుపనికి రాకపోయేసరికి, అధికారమదంతో రోగగ్రస్థుడైన ఆకార్మికుడ్ని యింటినుండి పిలిపించాడు. మరుగుదొడ్డిని శుభ్రంచేయమనేసరికి అతడు చేయనని ఎదురు సమాధానం చెప్పినందుకు అతడ్ని చితగగొడ్తాడు. అప్పుడు మాదిగ సఫాయీ కార్మికుడు తిరగబడి ఆ డిప్యూటి కలెక్టరును తిరిగి కొడ్తాడు. తనని బాధపెట్టిన కలెక్టరుమీద కోర్టులో ఫిర్యాదు చేయాలంటే ప్లీడర్లెవరూ సహకరించక పోయినా మాదిగ వెంకడి చేతిలో తన్నులుతిన్న కలెక్టరుగా అందరూ నవ్వుతుంటే ఆ కలెక్టరు మాత్రం ఆ ఊరినుండి బదిలీ చేయుంచుకుంటాడని పులవర్తి కమలావతీదేవి తెలియజేసింది.

*ఇక్కడ శ్రీశ్రీ గారి 'కనకదుర్గా చండ సింహం జూలుదులిపి ఆవులించింది' అనే కవిత గుర్తుకు రాక తప్పదు. స్త్రీ వ్రాసిన ప్రథమ దళితోద్యమ కథగా దీన్ని భావించాలి. దళితుని తిరుగుబాటులోని సత్యాన్ని ఒక దళితేతర రచయిత్రిగా స్పష్టంచేసింది.*

సుసర్ల లక్ష్మీనరసమాంబ వ్రాసిన 'అత్తలు-కోడళ్ళు' (జులై 1931 గృహలక్ష్మి) అనే కథలో ఇద్దరు అత్తలు కలిసి తమ కోడళ్ళు చదువుకోవటమే గాక, సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం వంటి పనులకు కాలాన్ని వెచ్చించటాన్ని గురించి చెప్పుకుంటున్న సందర్భంలో తన కోడలు ఏకులుకొని నూలువడకటాన్ని, మీటింగులకు పికటింగులకు వెళ్ళటాన్ని నెపంగా చెప్తుంది. మరొక అత్త తనకోడలైతే తనకు అర్థంకాని ఇంగ్లీషులో, హిందీ భాషలలో మాట్లాడుతుందంటూ చెప్పి, కోడళ్ళమీద అత్తలు నెపంగా కబుర్లు చెప్పుకుంటుంటారు. అదే సమయంలో స్నేహితురాలిని కలిసిన ఆమె కోడలు తన అత్తను గురించి చెప్పుకుంటూ వీణ వాయించినా, పుస్తకం చదివినా, కుట్లు అల్లినా, తప్పేనని చెప్పగా, మరొక కోడలు తన అత్త యింట్లో వంటచేసినా దుబారా చేస్తున్నావని తిడుతుందనీ, తమ జీవితాలలో అత్తలవల్ల కలిగిన సమస్యలను కోడళ్ళిద్దరూ పంచుకుంటారు.

*ఇక్కడ అత్తలు పితృస్వామ్యపు అధికారవ్యవస్థలోనే ఉండటంతో కోడళ్ళు దేశానికి ఉపయోగపడే మంచిపని చేసినా వారిని సాధించి తరతరాలనుంచి వస్తున్న కొడుకులను కన్నతల్లులుగా ఆధిపత్యపు అత్తరికాన్ని నిలబెట్టుకోవాలనుకునే తాపత్రయం కన్పడుతుంది. అయితే ఈ అత్తాకోడళ్ళ సంబంధాలమధ్య నలుగుతున్న దేశఆర్థిక వ్యవస్థ, స్త్రీవిద్యా వ్యవస్థ, స్వాతంత్ర్యోద్యమ స్థితి అర్థం అవుతుంది. కాబట్టి అత్తలతో దేశాభివృద్ధి పట్ల స్పృహను కలిగించాల్సిన అవసరం ఉందని తెలియజేసిన కథ యిది.*

గండికోట సావిత్రీదేవి వ్రాసిన 'సాధ్వి' (సెప్టెంబరు 1931 గృహలక్ష్మి) అనే కథలో ఒక ఆమె తన యింట్లో పనిచేసిన ఒక స్త్రీ జీవితాన్ని చెబుతూ, ఆమెకు భర్త పెట్టే బాధలనుండి

విముక్తురాలు కాగలిగే వీలున్నాకూడా పూర్వస్త్రీల చరిత్రలు విని వారి జీవితములే ధర్మమని నమ్మి కష్టాలుపడిందనీ, తాగుబోతు మొగుడైనా, తనని రోజూతిడుతూ, కొడుతూఉన్నా ఆమె తన ఇంట్లో పనిచేస్తూ ఉండేదని చెప్పింది. అలా ఆమె తన కష్టాలను చెబుతున్నందుకు ఆమె భర్త ఆమెను పనికి కూడా రానీయలేదని తెలిపింది. కొన్నాళ్ళతర్వాత తన ఇంటికివచ్చి పనిచేసి వెడుతుంటే అన్నంకూరలను ఆమెకు తినటానికిస్తే, వాటిని ఆమె భర్తకు పెట్టటానికి ఇంటికి తీసుకొనివెళ్ళిందని చెప్పింది. దానిక్కూడా మిగిలిన అన్నంతెచ్చావని ఆమెను బాధపెట్టాడనీ, తను ఆమెతో అతడ్ని వదిలిపెట్టి మారుమనువుచేసికోమంటే కులంవాళ్ళు ఒప్పుకోరనీ చెప్పిందనీ, కాని ఆతర్వాత ఆమెకు మరోమార్గం కానరాక నూతిలోబడి చనిపోయిందని తెలియజేసింది. బంధువులు ఆమె చెడ్డపనులు చేసి చచ్చిపోయిందన్నారు గానీ, సాధ్విగా, పతివ్రతగా ఉండటానికై ఆమె పడిన కష్టాలను తలచుకోలేదనీ, పూర్వపు పతివ్రతలవలె స్త్రీలుండాలంటే, పూర్వపు ధర్మాలననుసరించిన సత్యవంతుడు, నలుడు, హరిశ్చంద్రులలాగా పురుషులున్నారా అనే దానిని వాస్తవికంగా ఆలోచించమని రచయిత్రి తెలియచేసింది.

*స్త్రీలు తమకష్టాలను మరొక స్త్రీకి కూడా చెప్పుకునే అవకాశం ఇవ్వని పురుషాధిక్య సాంస్కృతిక చట్రంలో పాతివ్రత్యం అంటూ నలిగిపోకుండా, స్త్రీల దృక్పథంలో మార్పురావల్సిన అవసరాన్ని సూచించిన కథ యిది.*

యెల్లాప్రగడ సీతాకుమారి వ్రాసిన 'కులమా? ప్రేమా?' (ఆంధ్రపత్రిక వార్షిక సంచిక ఏప్రిల్1933) అనే కథలో స్త్రీలు స్వతంత్రంగా ఉండాలనుకుంటే, వారికి వివాహానంతరం పూర్తి స్వాతంత్ర్యం ఉండదు కాబట్టి బ్రహ్మచారిణులుగా ఉండి దేశాభ్యుదయ కార్యాలు చేపట్టాలనీ, హిందూవనిత మహమ్మదీయుడిని వివాహమాడాలనుకున్నా అతడి తండ్రి ఒప్పుకోకపోవటంతో, అతడు తన మతానికి చెందిన యువతిని పెండ్లాడి మానసికంగా బాధపడి చచ్చిపోయాడని తెలియజేసింది.

*స్త్రీకి వివాహం తరువాత స్వాతంత్ర్యం ఉండదు కాబట్టి 'పెళ్ళి' అనేదానిని నిరసించటం ప్రారంభమయింది. హిందూ, మహమ్మదీయుల మతానికి చెందిన యువతీ యువకుల ప్రేమను ఒప్పుకుంటే మానవ ప్రేమసంబంధాలు అభివృద్ధిచెందుతాయని రచయిత పరోక్షంగా తెలియజేసింది.*

వి.సరస్వతి వ్రాసిన 'ముద్దుకూతురు' (సెప్టెంబరు 1933 గృహలక్ష్మి) అనే కథలో ఒక తండ్రి తన తనకు రోగంవచ్చినా, తనయుడు పట్టించుకోనందుకు, కూతురే దగ్గరుండి రాత్రింబవళ్ళు సేవ చేసినందుకు కూతురు పేర ఆస్తి అంతా వ్రాయాలనుకునే లోపలే అతడు మరణిస్తాడు. అప్పుడు కొడుకుకే ఆస్తి అంతా దక్కిందనీ, అతనికి చదువున్నాకూడా అనారోగ్యంతో ఉన్న సోదరిని అవమానించి వెళ్ళగొట్టాడనీ, అయినా ఆమె తనచేతి గాజులమ్మి చదువును పూర్తిచేసి

ఉద్యోగంలో చేరిందని చెప్పింది. కాని ఆమెకు అనారోగ్యం ఎక్కువై ఉద్యోగం చేయలేని స్థితికి చేరుకుంటుంది. ఆ సమయంలో ఆమె తనను దగ్గరుండి చూసుకుంటున్న స్నేహితురాలితో భారతదేశంలోని ఆస్తిహక్కును గురించి మాట్లాడుతూ వీలునామా రాయకుండా తండ్రి మరణించటంతో ఆస్తి అంతా కొడుకుకే వచ్చిందిగానీ, సేవచేసిన కూతురుకు ఆస్తి రాకపోవటానికి కారణంగా ఉన్న ఆస్తిహక్కు చట్టాన్ని విమర్శకు పెట్టింది. కూతురు, కొడుకు సమానంగానే జన్మించిన పురుషుడికి మాత్రమే ఆస్తి రావటం అన్యాయమనీ, సమానవాటా చట్టాలు రావాలనీ, 'హరవిలాస శారద' గారు శారదాచట్టాన్ని తెచ్చినట్లుగా కొడుకులతోపాటు కూతుళ్ళకు కూడా సమాన ఆస్తిహక్కు ఉండే చట్టాలు తేవాలని చివరిమాటగా చెబుతూ ఆమె చనిపోవటం జరిగింది.

*ఆనాటి స్త్రీల ఆస్తిహక్కుల ఆలోచనలే నేటి చట్టరూపంలో ఉన్నాయి. ఈ కథలో పితృస్వామ్య సంస్కృతిలో భాగంగా 1896 నుండి అమలులో ఉన్న వారసత్వ సంపదకు సంబంధించిన చట్టాలలోని అన్యాయాన్ని ప్రశ్నించటంతో పాటు స్త్రీ పురుషులు సమానంగానే జన్మిస్తారనీ, ఆడపిల్లకు ఆస్తిహక్కురావటం జన్మహక్కనీ భావించటం ఆనాడే జరిగింది. ఆంధ్రదేశంలో స్త్రీలకు ఆస్తిహక్కును కలిగిస్తూ 1985 చట్టమును చేసింది. దానికి సవరణగా 2005లో జన్మహక్కుగా స్త్రీలకు ఆస్తి హక్కు ఉండేటట్టుగా ఆ చట్టాన్ని సవరించి స్త్రీలకు న్యాయమైన దారిని ఏర్పరచింది. ఆస్తిహక్కు స్పృహ, హక్కుల చైతన్యం ఆడపిల్లలకున్నా నేటి రాజ్యాంగపు హక్కులకున్న మూలాలకు ఈ కథ నిలువెత్తు ఉదాహరణగా భావించాలి. ఈ ఆలోచనలను వ్యక్తం చేసిన 50 ఏళ్ళకు కొన్ని రాష్ట్రాలలో మాత్రమే స్త్రీలకు ఆస్తి హక్కువచ్చింది. నిజానికి బ్రిటిష్ ప్రభుత్వపుకాలంలోనే ఆస్తికి సంబంధించిన నిర్ణయాలను రాష్ట్ర శాసనసభల పరిధిలోకి తెచ్చింది. అందుకే భారతదేశస్వాతంత్ర్యా నంతరం రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులనుండి ఆస్తి హక్కును తొలగించారు. జన్మస్థాన సమానత్వమున్నచోట కొడుకుతోపాటు కూతురుకు తండ్రి ఆస్తి రావటం జన్మహక్కని న్యాయశాస్త్ర పరిజ్ఞానంతో ఆనాడే తెలియజేయటం రచయిత్రియొక్క క్రాంతదర్శనానికి ఈ కథ మచ్చుతునక.*

వెంకాయమ్మ వ్రాసిన 'దేవుడు' (సెప్టెంబరు1933 గృహలక్ష్మి) అనే కథలో తల్లి ఆడపిల్లలకు వివాహమయ్యేవరకు 'భర్తదేవుడు' అనే మంత్రాన్ని నేర్పించేసరికి కూతురు ఆలోచనలలో భర్తను దేవుడనే మాట ఎందుకంటున్నారనీ, దేవుడివలె భర్తఎటువంటి సాహసకార్యాలు చేయకపోయి నప్పటికీ భర్తగా మారిన ప్రతి పురుషుడికి 'దేవుడనే' అధికారాన్ని ఇచ్చారు కాని భార్యను 'దేవి'గా గుర్తించటంలేదనీ, నరదేవుళ్ళభార్యలు వంచింపబడటానికి లింగభేదమే కారణమని ఆలోచించింది. భర్తదేవుడనీ, భార్యమాత్రం చరణదాసి అని స్త్రీకి యింత నీచ పదవిని ధర్మశాస్త్రాలు యిచ్చినందుకు బాధ పడింది. వివాహానంతరం భర్త గుణవంతుడైతే 'దేవుడని' భావించవచ్చునీ, కాని చివరకు భర్త త్రాగుబోతు, దురాచారి అయినా అతడ్నికూడా దేవుడికింద భావించటాన్ని విమర్శకు పెట్టింది. ఆ స్త్రీ, భర్తకు కనువిప్పు కలగటానికి బయట ప్రపంచంలోవలె ఆ భర్తకు ఇష్టమైన వేశ్యగా మధుపాత్రతో నిలబడేసరికి భర్త తన భార్యను ఆ స్థితిలో చూడలేక చచ్చిపోవాలనుకుంటూ

భార్యను మృత్యువులో తనతో నరకానికి తోడు వస్తావా అని అడిగుతాడు. ఆమె ఈ సమాజములో చేయనిపనిని మరోసమాజంలో చేయటానికి మృత్యువును యిష్టపడుతున్నానని చెప్పివస్తానంటుంది.

*మరో సమాజమనే నరకమే నయమనుకొందో లేదా భూమిమీద భర్తను శిక్షింప వీలుకాని సంప్రదాయాన్ని వ్యతిరేకించే విధంగా నరకంలో భర్త శిక్షార్హుడవుతుంటే సంతృప్తిపడవచ్చని భావించటంగానో ఆమె ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అనాదిగా వస్తున్న 'పతియే ప్రత్యక్షదైవమనే' నానుడిలోని అంతరార్థాన్ని గ్రహించి స్త్రీలు వంచింపబడి దాసులుగా ఉండటానికి అటువంటి మాటలను పుట్టించారనే గ్రహింపు స్త్రీలకు కలగటం మరో ప్రపంచానికై సాగటానికి స్త్రీల స్వాతంత్ర్య రథచక్రాలు కదులుతున్నాయని అర్థం అవుతుంది.*

శత్రువుల బారి నుండి దేశాన్ని రక్షించగలగాలనే పతి ఆశయాన్ని నెరవేర్చటమే పతిభక్తిగా భావించిన సమర్థురాలైన ఒక స్త్రీని గురించి కొణకంచి వెంకట సుబ్బమ్మ "దేశభక్తి-పతిసేవ" (జనవరి 1934 గృహలక్ష్మి) వ్రాసిన కథ. శత్రువులను ఎదుర్కోవటానికి అరణ్య మార్గం పట్టిన భార్యాభర్తలలో భర్త తానొక్కడే కదనరంగానికి వెడతానని అనగా భార్య తానుకూడా మగవేషాన్ని వేసుకొని భర్తను అనుసరించింది. వారిద్దరూ నదిని దాటటానికి నావ ఎక్కగా నావకు చిల్లిపడి పడవ నదిలో మునిగిపోగా ఆ నదీ ప్రవాహపు వేగానికి ఇద్దరూ చెల్లాచెదురై చెరొక తీరాన్ని చేరగా, ఆమెను ఒక సాధువు కాపాడుతాడు. ఆమె తన భర్త ఆశయమైనటువంటి దేశప్రజలను శత్రువుల దోపిడీ నుండి రక్షించాలనుకుంటూ అదే తాను పతియందు చూపించే భక్తి అని భావించి రణరంగంవైపు కదిలి శత్రుసైన్యాన్ని ఎదుర్కొంటుంది. అదే సమయంలో వేరే తీరమును చేరుకున్న ఆమె పతిని కూడా ఒకముని కాపాడి తానుకూడా యుద్ధానికి సాయపడతానని చెప్పగా యుద్ధ రంగానికి ఇద్దరూ చేరుకుంటారు. యుద్ధంలో శత్రువు ఆమె పతిని పడగొట్టగా ఆ ముని తన ప్రాణాలొడ్డి ఆ పతిని కాపాడటంతో అతను తిరిగి శత్రువును తుదముట్టించాడు. ఆ రణరంగంలోనే భార్యాభర్తలు పరస్పరం ఎదురుపడగా ఆమె తన భర్త ఆశయమైన దేశరక్షణయే తనపతికి ఇష్టమైన పనిగా భావించిందనీ, దానికై ఆమె యుద్ధంచేసినట్లు ఆ ముని తెలిసికొని ఆమె తన పతియందు చూపించిన భక్తికి అతడు ఆనందించటం జరిగిందని కథలో రచయిత్రి తెలియజేసింది.

*స్త్రీలు పాతివ్రత్యమంటూ ఇంట్లో మగ్గటంకాక వారి దృష్టిని దేశరక్షణవైపు మరల్చే చైతన్యాన్ని యిచ్చిన కథయిది. ప్రజలను కాపాడటమే పతిభక్తి అనీ పతిభక్తి అంటే దేశభక్తి అనీ, పతిభక్తికి కొత్తనిర్వచనాన్ని ఇచ్చిన రచన.*

నండూరి సుబ్బలక్ష్మి దేవి వ్రాసిన 'స్త్రీ తత్వం' (మార్చి 1934 గృహలక్ష్మి)ను గురించిన కథలో స్త్రీ అబలకాదు ప్రబల అనీ, తనకు అనుభవంలోకి వచ్చిన వాస్తవవిషయాన్ని వివరిస్తూ ఒక గ్రామకరణం శారదాబిల్లు వస్తుందనే ఆందోళనతో సంగీతం, హిందీ, చదువుకుంటున్న తన కూతురుకు పదేళ్ళకే పెళ్ళిచేసాడని చెప్పింది. కానీ బాల్యంలో ఆమె వితంతువు కావటాన్ని భరించలేని ఆ పిల్లతల్లి మనోవేదనతో మరణించగా, ఆమె తనకు పునర్వివాహం చేయమని

అడిగినా ససేమిరా అంటూ ఆ తండ్రి తానుమాత్రం ద్వితీయవివాహం చేసుకొంటాడు. ఖాళీసమయంలో రాట్నం వడకటం ప్రధానకార్యంగా అలవాటు చేసుకున్న ఆ రెండవ భార్య కాపురానికి రాగానే తన సవితికూతురు దుఃఖాన్ని గ్రహించి ఆశయాలంటే గిట్టని ఆ భర్తకు గుణపాఠం చెప్పాలని భావించింది. భర్త తనతో సంసారం చేయాలంటే దానికి ముందుగా కూతురుకు పునర్వివాహం చేయాలని షరతు పెడుతుంది. తాను పతిఉన్న వితంతువునంటూ కూతురితో ఆమె చెబుతూంటే విన్న భర్త కూతురు పునర్వివాహానికై వరాన్వేషణకు బయలుదేరాడనీ, అదే స్త్రీతత్వమనీ, స్త్రీ తలచుకుంటే పురుషుడి చేత ఏ పని అయినా చేయించగలుగుతుందని ఈ కథలో తెలియజేసింది.

*బాలవితంతువుల విషయాలలో స్త్రీలకర్తవ్యాన్ని స్ఫృహకు తెచ్చిన కథగా వాస్తవ సంఘటన అంటూ రచయిత పేర్కొనటం స్త్రీ శక్తికి నమూనా వంటిది. ఆమె ఇంట్లోనే సత్యాగ్రహ ఉద్యమాన్ని పాటిస్తూ, దేశసేవ వంటి భావాలు ఆమెకు ఉండటంచేతనే సవతికూతురియొక్క జీవితంకోసం తన కాపురాన్నే పణంగా పెట్టింది. తోటిస్త్రీకి సహాయపడటానికి పురుషుడిని సన్మార్గంలోకి మళ్ళించగల శక్తి స్త్రీ కలిగి యుండటమే స్త్రీత్వమని భావించింది. స్త్రీల పునర్వివాహ సమస్యకు పరిష్కారంగా తన వివాహాన్ని, దాంపత్యపు హక్కును పణంగా పెట్టి స్త్రీల సమస్యను తీర్చటం అనగా వజ్రాన్ని వజ్రంతోనే కోయాలనే స్ఫూర్తిని గుర్తుచేసుకోవటమే. స్త్రీల సమస్యలను స్త్రీలే తీర్చగలరని ఋజువుపరచిన కథ యిది.*

మద్దుల దమయంతి 'సుశీలా రజస్వలానంతర వివాహం' (ఏప్రిల్ 1934 గృహలక్ష్మి) ను గురించి వ్రాసిన వాస్తవ కుటుంబగాథగా కాకినాడ దగ్గర ఉన్న గొర్లపాలెంలో వైశ్య కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి తన కుమార్తెలిద్దరినీ చదివిస్తూ, సంగీతం నేర్పిస్తుంటే, భార్య మాత్రం పిల్లలు రజస్వల కాకుండా వివాహం చేయాలనీ అలా చేయకపోతే కులం వెలివేస్తుందని పోరు పెడ్తుంది. అయినా వినకుండా ఆమె యొక్క భర్త భార్యతో ఆడపిల్లకు బాల్యవివాహంచేస్తే కుటుంబంలో స్త్రీగా కూతురు బాధ్యత సరిగా నిర్వహించలేదని నచ్చచెప్పి ఆమెను తన కనుకూలంగా చేసుకున్నాడు. కూతురు పెళ్ళికాకుండా రజస్వల అయినా ఆ వేడుకకు అందరూ బంధువులు వచ్చారనీ, ఆ పిల్లయే సుశీల అనీ, ఆమె గృహలక్ష్మికి వ్యాసాలు కూడా రాసేదనీ, ఆ తర్వాత అతడు రజస్వలానంతర వివాహాలను ఆమోదించగల భార్యాభర్తలుగల కుటుంబంతో కూతురుకు సంబంధం కుదుర్చుకొని చేసిన పెళ్ళికి అందరూ వచ్చి స్త్రీ జాతి ఉన్నతిని గుర్తించారని చెప్పింది. గొర్లపాలెంలో జరిగిన మొదటి రజస్వలానంతర వివాహాన్ని అందరూ ఆమోదించటంతో ఆ ఊరిలో రజస్వలానంతర వివాహప్రబోధం జరిగిందని రచయిత తెలియజేసింది.

*వైశ్యకుటుంబంలో వాస్తవంగా జరిగిన ఈ ఆదర్శవివాహం చరిత్రను సృష్టించటమే కాక ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి ఉంటుందనే దాంట్లో సందేహం లేదు. ఇది ఒక సామాజిక సంస్కరణకు ప్రయోగాత్మక ఫలితాలిచ్చిన సంఘటన. ఈ కథలో దర్శి అన్నపూర్ణ జీవితం ప్రతిబింబింస్తోంది.*

కామేశ్వరమ్మ వ్రాసిన 'నీలాపనింద' (మే 1934 భారతి) అనే కథలో స్త్రీలు పురుషులతో మాట్లాడితే నీలాపనిందలు వేయకూడదనీ, పురుషులలో విశాలభావం పెరగాలని తెలియజేసింది. పురుషులలో అటువంటి విశాలభావాలు పెరిగితేనే కుటుంబ స్త్రీలు స్వేచ్ఛగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనగలుగుతారని తెలియచేసింది.

*ఆ నాటి ఉద్యమ వ్యవస్థకు ఈ కథ మిక్కిలి ప్రయోజనాన్ని కలిగించి ఉంటుందని భావించవచ్చు. పురుషులకు స్త్రీలను గురించి సదభిప్రాయం ఉండాలనీ, స్త్రీల స్వేచ్ఛకు దేశస్వాతంత్ర్యసాధనకు ఉన్న లింకును గ్రహింపుకు తేగలిగిన కథ యిది.*

కె.కాత్యాయనీదేవి వ్రాసిన 'మనీపర్సుమహత్యం' (మే 1934 గృహలక్ష్మి) అనే కథలో చెన్నపురిలో జరిగిన విషయాన్ని తెలియజేస్తూ ఒక 'మనీపర్సు' సదాశయములున్న ఇద్దరు స్త్రీ, పురుషులను కలపగలిగిందని చెప్పింది. వైద్యురాలుగా ప్రజలకు కలరా వ్యాధి వ్యాపించిన సందర్భంలో ఆమె దేశసేవ చేస్తున్నప్పుడు ఆమెకూ కలరావచ్చి మరణించే సందర్భంలో తనయాస్తి నంతా ప్రియునకు వ్రాసిందనీ, అతడు ఆ డబ్బులతో ఆమె పేరున అనాథశరణాలయం కట్టించి బాలికలకు విద్యాభివృద్ధి చేయిస్తున్నాడనీ, ప్రేమికురాలిని అమరజీవిగా చేసాడని తెలియజేసింది.

*నిస్వార్థమైన ఆదర్శప్రేమను దేశసేవకై అంకితం చేయటాన్ని యువతకు తెలియచేసిన కథ యిది.*

దుర్భా హనుమావతి వ్రాసిన 'పశ్చాత్తాపమే పతితపావనం' (జూన్ 1934 గృహలక్ష్మి) అనే కథలో స్త్రీలకు జరుగు అన్యాయాలను ఖండించటానికి తనకుటుంబంలోని ఘటననే ఉదాహరణగా గొని స్వీయానుభవంతో వ్రాసినట్లు చెప్పిన రచయిత్రి తాను వార్ధాలోని సత్యాగ్రహా శ్రమంలో విద్యాభ్యాసమునకు చేరినప్పుడు, తన భర్త, చుట్టూరా ఉన్న గ్రామ పునర్నిర్మాణపు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలియజేసింది. అక్కడ ఆశ్రమవాసిగా ఉన్న ఒక స్త్రీ తన గతజీవితాన్ని తెలియజేసిందనీ, స్త్రీధనానికి ఆశపడ్డ ఆమెయొక్క భర్త ఆమెను పుట్టింటి నుండి డబ్బు తెప్పించమంటూ వేధిస్తుంటే పుట్టింటికి వెళ్ళగా, ఆమె భర్త ద్వితీయ వివాహం చేసుకొన్నాడని చెప్పింది. అయినా ఆమె చలించక సంఘ దురాచారాన్ని దూషించుకొని దానిని రూపుమాపాలంటే తాను దేశసేవలో పాల్గొనాలనుకొని భావించింది. కాని ఆమె ముసలి తల్లిదండ్రులకు సేవ చేయాలనుకుని ఇంటిదగ్గరే ఉన్న కాలంలో ఆ నాడు వస్తున్న భారతి, గృహలక్ష్మి, కృష్ణా పత్రిక, ఆంధ్రపత్రికలను తపాలా ద్వారా తెప్పించుకొని చదివినట్లు చెప్పింది. ఆ తర్వాత భర్తృబహిష్కృత జీవితాన్ని ఆదర్శంగా సార్థకం చేసుకోదలచి తన బంధువులైన ఒక భార్యాభర్తలు స్త్రీసమాజాల సేవతో పాటు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న విషయం తెలుసుకుని తానుకూడా బాలవితంతువుల, హరిజనుల సేవలకై స్త్రీసమాజంలో చేరింది. స్త్రీలు సంఘానికి వెరచి జీవితాల్ని వృథాగా గడపటం కంటే పురుషులవలె సత్కార్యాచరణలో పాల్గొనగలిగితే భారతమాత దాస్యశృంఖలాలు

తెగిపోతాయని భావించి ఆమె ఆశ్రమంలో చేరినట్లుగా తెలుసుకొంది. ఆమె అక్కడున్నవారికి రాట్నాన్ని వడకటం నేర్పిస్తోందనీ, అది తెలుసుకున్న ఆమె భర్త, సవితితో వచ్చి క్షమించమని అడిగినా, వారిద్దరినీ సాంఘిక రాజకీయాభివృద్ధికై పాటుపడమని చెప్పిందనీ, గాంధీకూడా దర్శించాలనుకునే విధంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దగలిగిందని కథలో తెలియజేసింది.

*ఈ వాస్తవజీవిత కథలో హింసించే భర్త దగ్గరనుండి విముక్తి కోరుకొని ఒక స్త్రీ పత్రికాపఠనంతో ముందుగా తను స్వతంత్రాన్ని తెచ్చుకొని, తల్లిదండ్రుల సేవతో పాటు సాంఘిక, దేశసేవలో పాల్గొని స్త్రీవిద్య, బాలవితంతువుల అభివృద్ధికై కృషి చేసింది. ఆశ్రమంలో ఖద్దరు తీయటంవంటి పనులతో సత్యాగ్రహం అనే దేశస్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామి కాగలగిందని తెలియజేసింది. ఈ కథలో స్త్రీలు ముందుగా గృహ బానిసత్వపు సంఘ దురాచారాల నుండి స్వతంత్రురాలయితేనే దేశసేవకు పాటుపడగలరనీ, స్వాతంత్ర్యోద్యమ భాగస్వాములు కాగలరనీ అదే దేశ స్వాతంత్ర్యానికి బాటలు వేయగలుగుతుందని ఋజువవటం స్పష్టమైంది.*

సమయమంత్రి వందేమాతరం వ్రాసిన 'గాజుల జత' (జులై 1934 గృహలక్ష్మి) అనే కథలో భర్తను గాజుల జత తెమ్మని అడిగిన భార్యకు అతడు పుస్తకం హస్తభూషణం కావాలనీ, చదువుకోమని చెప్పినా తలకెక్కకపోతే ఆమెతో మాట్లాడటం మానేస్తాడు. అప్పుడు ఆ భార్య ప్రక్కింటి విద్యావతి దగ్గరకువెళ్ళి అక్కడేఉండి చదువు నేర్చుకొనిరాగా మెచ్చుకొన్న భర్త గాజుల జతనిచ్చినా, అలంకారాలకంటే చదువే గొప్పదని గ్రహించిన భార్య వాటిని తన గురువుకు గురుదక్షిణగా ఇచ్చిందనీ, కాని ఆ గురువు తిరిగి శిష్యురాలికే ఆ గాజుల జతను కానుకగా ఇచ్చినట్లుగానూ తెలియజేసింది.

*ఈ కథలో స్త్రీలకు విద్యయందభిరుచి కల్గించే విధంగా భర్త భార్యవిషయంలో కఠిన నిర్ణయం తీసుకోవటం, ఆమె కూడా విద్య విలువ తెలుసుకోవటంతో ఆ కుటుంబం ప్రేమానురాగాలకు నిలయమవటంగా అర్థం అవుతుంది.*

ఈమె వ్రాసిన 'లీలావతి' (డిసెంబరు 1934 గృహలక్ష్మి) అనే మరొక కథలో వాస్తవ విషయంగా వర్ణిస్తూ వియ్యాలవారు చదువు మాన్పించమన్నప్పుడు వివాహమైనప్పటికీ కూతురును చదివిస్తున్నందుకు కోపం వచ్చి తమ కొడుకుకు మరో వివాహం చేయటం జరిగింది. కాని ఆమె విశాఖపట్నంలో డాక్టరు కోర్సు చదివి డాక్టరయి ఒకరోజు తన సవితికి రోగం వస్తే ఆమెకు వైద్యం చేసిందనీ, కానీ అప్పటికే రోగం ముదిరి ఆమె చనిపోవటం జరిగింది. మొదటిభార్య యొక్క చదువు విలువ తెలిసి అతడు క్షమించమని అడగటమే గాక విద్యావంతులైన స్త్రీలకు వినయం ఉంటుందనే భావన అతనిలో కలిగిందని సమయమంత్రి వందేమాతరం తెలియజేసింది.

*స్త్రీలు విద్యావంతులైనా వినయంతో ఉంటారనీ, తమ వివేకాన్ని, విజ్ఞానాన్ని సమాజసేవకు ఉపయోగించగలరనే భావన పురుషులలో కలగాలనీ, స్త్రీ విద్యకు విలువనిచ్చి స్త్రీని గౌరవించటానికి వాస్తవ సంఘటనను కథారూపంలో వ్రాయటం జరిగింది. భార్య చదువును కొనసాగించటం యిష్టపడని భర్తలు మరొక పెళ్ళిచేసుకోవటం సమాజంలో సాధారణవిషయమని అర్థం అవుతుంది.*

తాయి శ్రీ జయలక్ష్మి వ్రాసిన 'నా జాతకము' (ఆగష్టు 1934 గృహలక్ష్మి) అనే కథలో చదువుకుంటున్న కూతురికి కట్నం ఇవ్వలేక సంబంధాలు కుదరక, వయస్సువచ్చిన తరువాత శారదబిల్లు పెళ్ళి చేయొచ్చని తండ్రి అనుకొన్నాడు. సనాతన సభలకు తమ స్త్రీలను రానీయక పోయినా తట్టుకొని చివరికి జాతకాలు చూసి పెళ్ళిచేసినా వివాహానంతరం ఆ వరునికి జ్వరమొచ్చి చనిపోయాడనీ, దానికి కారణం రజస్వలానంతర వివాహం కారణం అని అందరూ అంటారు. అనీ రజస్వలానంతర వివాహాలలో స్త్రీలు వితంతువులు కాలేదని ఆమెయొక్క సోదరుడు వచ్చి ఆమెకు, ఆమెయొక్క కూతురికి ఆ విషయంలో నచ్చచెప్తాడు. భార్య పునర్వివాహం చేయమని కోరినా తండ్రి ఒప్పుకోనందుకు ఆ కూతురు మేనమామ సలహాతో శారదానికేతనానికి వెళ్ళి చదువుకొని పునర్వివాహానికి సిద్ధపడినట్లు తెలియజేసింది.

*జాతకాలు వివాహబంధాన్ని శాశ్వతం చేయలేవనీ, రజస్వల వివాహం వరుడి మరణానికి కారణం కాదని కథలో తెలియచేసింది. భర్త విషజ్వరం వచ్చి చనిపోగా వితంతువైన మహిళ తన జీవిత జాతకాన్ని తానే సృష్టించుకొని జీవితాన్ని స్థిరపరచుకోవాలను కోవటం ఈకథలో తెలుస్తుంది. మూఢనమ్మకాలేకాక అనుకోని విపత్తు వస్తే స్త్రీ తన జీవితాన్ని తీర్చిదిద్దుకొనే స్పృహను కల్గి ఉండాలని కూడా తెలియజేసిన కథ యిది.*

నెమలి చంద్రమతి వ్రాసిన 'విడాకులు' (సెప్టెంబరు 1934 గృహలక్ష్మి) అనే కథలో స్ఫోటకం వచ్చి భర్త గుడ్డివాడైనందుకు ఉద్యోగంపోగా ఆతనియొక్క భార్య విద్యావంతురాలవటంచేత పిల్లలకు పాఠాలు బోధిస్తూ వచ్చిన ఆ డబ్బుతో ఇల్లు గడుపుతుంటుంది. ఆమె భర్త తనను విడిచి వేరొక వివాహం చేసుకొమ్మని చెప్పినా ఆమె భారత నారీమణులకు పాతివ్రత్యమే ధర్మమని చెప్పి భర్త ప్రేమను భారత స్త్రీలు మరిచిపోరనీ, విడాకుల చట్టం అనవసరమని చెప్తుంది. కాని సదా భార్యను పీడించేవారికి ఆ చట్టం మంచిదనీ, విడాకులచట్టం మీద తన ఆభిప్రాయాన్ని రచయిత కథలోని ఒక పాత్రద్వారా చెప్పించింది.

*విద్యావంతురాలైన భార్య గృహనిర్వహణ చేస్తున్నాకూడా భర్తయందు అనురాగంతో ఉంటుందనీ, వదిలిపెట్టదనీ, తెలియజేసి సామాజిక అపోహలను పోగొట్టే ప్రయత్నం చేయటం జరిగింది.*

వెలిదండ చూడికుడుత్తమ్మ వ్రాసిన 'సంస్కరణ వివాహములు' (సెప్టెంబరు 1934 గృహలక్ష్మి) అనే సంభాషణాత్మక కథారూపకంలో భాగంగా ఇద్దరు కూతుళ్ళలో ఒక కూతురు చదువుకున్నా కూడా హిందూ సంప్రదాయపు పెళ్ళి చేసుకొని బాగున్నట్టునూ, రెండవ కూతురు సంస్కరణ వివాహంగా పరమతస్థుణ్ణి పెళ్ళిచేసుకోవటంతో, దంపతులమధ్య అన్యోన్యత లేకపోగా పిల్లలను ఆరోగ్యకరంగా పెంచలేకపోతున్నారనీ తెలియచేసింది.

*హిందూమత సంప్రదాయపు పెళ్ళిళ్ళలో అసంతృప్తులుగా ఉన్నా అవే మంచివనే అభిప్రాయాన్ని రచయిత చెప్పటం జరిగింది.*

ఆచంట సత్యవతమ్మ వ్రాసిన 'కాలమహత్యం' (అక్టోబరు 1934 గృహలక్ష్మి) అనే కథలో పడవ ప్రయాణంచేస్తున్న ఒక బాలుడు మిగిలినవారితో మాట్లాడుతూ ఆస్తిపాస్తులుపోయి తండ్రి మరణించగా తాము దుర్భరదారిద్ర్యం అనుభవిస్తున్నందుకు తనతల్లి వంటలక్కగా కుదిరిందనీ, తనకెక్కడా ఉపాధి దొరకలేదనీ చెప్పాడు. అదే బోటులో ప్రయాణం చేస్తున్న మిగిలినవారిలో ఒకడు అతని దారిద్ర్యానికి కారణంగా హిందూసమాజం మారిపోయిందని అనగా, మరొకడు ప్రాతివత్యంతో అలరారే భారతదేశపు స్త్రీలు విడాకుల చట్టాన్ని కోరటమే కారణమని అంటాడు. మరికొందరు వ్యక్తులు స్త్రీలు విదేశీనాగరికతను పాటించటంతో పలుమతాచారాలు చోటుచేసుకోవటం కారణమనీ, అలా తలా ఒకరూ తలోరకంగా పలుకుతుండగా అక్కడున్న వారిలో ఒక అతను మాత్రం భారతదేశంలో దారిద్ర్యజీవనానికి నివారణగా మత గ్రంథాలను, శాస్త్రాలను ప్రక్కనపెట్టి మనస్సులను మార్చుకోమని చెబుతాడు.

*భారతదేశపు దారిద్ర్యానికి స్త్రీల నాగరికతకు, అభివృద్ధికర భావాలకు లంకెపెట్టి భారతదేశ దారిద్ర్యానికి స్త్రీల ఆలోచనలలోని నాగరికతతోపాటు, స్త్రీలు ప్రతిపాదించిన విడాకుల తీర్మానాలు కారణమని భావించటమే భారతదేశంలో పురుషులకు స్త్రీల మీద ఎటువంటి గౌరవం ఉందో అర్థమవుతుంది. పురుషులలో సంస్కారం అలవడాల్సిన అవసరాన్ని సూచించింది ఈ కథ. శాస్త్ర, మతగ్రంథాలలో హేతుబద్ధతలేదనీ, వాటిని ప్రక్కనపడేస్తేనే మానసిక సంస్కారం ఏర్పడుతుందని భావించింది. పురుషుల భావజాలం సమాజంలో మూఢనమ్మకాలను పెంచుతూ స్త్రీలస్వాతంత్ర్యానికి అడ్డుకట్టవేస్తోందని భావించింది.*

శ్రీమతి కే.యన్. మూర్తిబాయి వ్రాసిన 'భారతి' (నవంబరు 1934 గృహలక్ష్మి) అనే కథలో భార్య ఒక పల్లెటూరి ముగ్ధగా ముందు నచ్చినా తరువాత అతనికి ఉన్న పాశ్చాత్యపు మోజుతో ఇంగ్లీషు భాష మాట్లాడుతూ అందరితో కలిసిపోయే సహఉద్యోగిని నచ్చుతుంది. భార్యనచ్చక పోవటం జరిగి ఆమెను అవమానపరిచే సరికి ఆమె ఇంగ్లీషు, హిందీ, నేర్చుకోవాలనుకుంటున్నా గానీ, పాశ్చాత్య వ్యామోహంలో భర్త ఆమెను ఇంటినుండి వెడలగొడ్తాడు. కొన్నాళ్ళకు పాశ్చాత్య నాగరికతగల తన ప్రియురాలు మరొకపురుషునితో జతకలిసినపుడు చూసి తనభార్య విలువ తెలిసి తెచ్చుకోవాలనుకుంటాడు. తాను వదిలేసిన తర్వాత తనభార్య ఇంగ్లీషు నేర్చుకొని చక్కటి గృహిణిగా కనపడేసరికి ఆమెను స్వీకరిస్తాడు. పాశ్చాత్యనాగరికతపై వ్యామోహం ఉండి వారి వేషభాషలు నేర్చుకొని సొసైటీ ఎటికసి పోతే అలా ఆడా మగా కలిసి తిరిగి పెడదారులు పట్టటం ప్రేమకాదనీ, విదేశీయులలో స్వేచ్ఛావిహారం ఉన్నవారికుండే మనోనిబ్బరాన్ని గ్రహించమని రచయిత్రి చెప్పింది.

*ఇక్కడ పురుషునియొక్క నవనాగరికతమోజుకు చురకవేయటం జరిగింది.*

చిత్రలేఖ అనే పేరుతో వ్రాసిన 'గేదల రామక్క జీవితచరిత్ర సంగ్రహం' (నవంబరు 1934 గృహలక్ష్మి) అనే కథలో మొదటి ప్రపంచయుద్ధసమయంలో ధరలు పెరుగుతున్నాయని భావించిన భర్త ధర వచ్చింతరువాత ఇల్లు అమ్ముదామనుకుంటే దానికంటె ముందే ఆ ఇల్లు అగ్నిహోత్రుడి పాలవటమేగాక పాకలోని గేదెలన్నీ మంటల్లో నశిస్తాయి. మిగిలిన ఒక్క కోడెదూడతో

బ్రతుకీడ్చుతుంటే అప్పిచ్చిన షావుకారు ఇచ్చిన కోర్టు నోటీసులకు ఆస్తి అంతా పోయిందని దుఃఖంతో భర్త మరణిస్తాడు. భార్య రామక్క అధైర్యపడక గేదెల వ్యాపారం పెట్టి, పాల ఉత్పత్తులు అమ్మి, మెల్లమెల్లగా ఇంటిముందున్న దారిలో ఒక భోజనశాలను ఏర్పాటుచేసింది. అలా వ్యాపారాన్ని విస్తరించుకుంటూ విద్యాజ్ఞానాన్ని పొంది ఆమె ప్రజలతో సత్సంబంధాలలో ఉంటూ తోటివారికి సహాయపడేది. దళారులను నమ్మక పత్రికా ప్రకటనలతో తన వ్యాపారాన్ని ప్రచారాన్ని చేసుకొనేది. లైంగిక వేధింపును ఎదుర్కొని సహాయ నిరాకరణోద్యమ సమయంలో స్వయంగా నూలువడికి వస్త్రాలునేసి, ఆ తర్వాత రాట్నాలను ఎక్కువగా తెప్పించి రాట్నశాలను ఏర్పాటుచేసి అందరిచేత నూలు వడికించి ఖద్దరు వస్త్రం తయారీచేయించేది. దేశఆర్థికాభివృద్ధికి, స్వాతంత్ర్యానికి పాటుపడిందనీ, అవసరమైన వారందరికీ ఖద్దరు వస్త్రాలు అందుబాటులో ఉంచగలిగి ఆ గ్రామంలో రామక్క పేరు ప్రఖ్యాతులు పొందగలిగింది.

*ఈ కథలో రచయిత ఆత్మవిశ్వాసం, స్వశక్తిగల స్త్రీశక్తిని ఆవిష్కరింపచేసిం, స్త్రీశక్తి దేశఆర్థికాభివృద్ధికిని, స్వాతంత్ర్యోద్యమంలోను భాగస్వామ్యమైన విషయాన్ని తెలియజేసింది. ఈ కథ ఆ నాటి బాధిత, ఒంటరిస్త్రీలకు స్ఫూర్తినిచ్చి ఉంటుందనటంలో అతిశయోక్తి లేదు. ఒక స్త్రీ తాను ఎదగగలిగి, తోటివారికి సహాయపడి ఒక వ్యాపారవేత్తగా, పత్రికాప్రకటనలద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకొని, దేశానికి ఉపయోగపడేవిధంగా రాట్నాలపరిశ్రమను పెట్టటం స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీశక్తి భాగస్వామ్యం స్పష్టమవుతుంది. ఆర్థికశక్తిగా స్త్రీ ఎదిగి దేశస్వాతంత్ర్యానికి పాటుపడటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమైన సజీవత్వాన్ని సంతరించుకొన్న కథ ఇది.*

*స్త్రీలు ఉత్పత్తిదారులుగా, వ్యాపారవేత్తగానే కాక ఆ ఉత్పత్తులను ప్రజలకు తెలిసేలా ప్రకటనలిచ్చి ఒక మార్కెట్ శక్తిగా ఎదిగినదని అర్థమవుతుంది.*

క్రీ.శ.20 శతాబ్దంలోని నాల్గవ దశకం పూర్వార్థం అంటే 1930 నుండి1934సం.వరకు వచ్చిన కథలలో స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యాన్ని సాధించటానికిగాని దేశస్వాతంత్ర్యానికై సహాయ నిరాకరణమనే సత్యాగ్రహోద్యమంలో స్త్రీలు పాల్గొనటానికిగాని మహిళాసంస్కృతిలో మార్పులు వచ్చాయి. శారదాచట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న బాల్యవివాహాలు, స్త్రీవిద్య, రజస్వలానంతర వివాహం, వివాహిత స్త్రీలయొక్క చదువుకు భర్తలు సుముఖులుగా లేకపోయినా స్త్రీలు సంసారం కంటేకూడా చదువుకే ప్రాముఖ్యాన్ని యివ్వాలనుకోవటం అర్థమవుతుంది. తమ వివాహవిషయంలో స్త్రీల నిర్ణయాధికారం, పునర్వివాహపు హక్కును పొందాలనుకోవటం, మానభంగాలనుండి తప్పించుకోవటం, వివాహవ్యవస్థలోనే ఉంటూ సహజీవన సంస్కృతిని యిష్టపడటం, విదేశీ నాగరికత మోజులో భర్తపరిత్యక్తలైన స్త్రీలు చదువుకొని స్వతంత్ర జీవనాన్ని ఏర్పరచుకోవటం జరిగింది. స్త్రీల పుట్టుకకు విలువ, తల్లిదండ్రుల విషయంలో కూతుర్లుకూడా బాధ్యతను వహిస్తారు కాబట్టి జన్మసంబంధంగా కొడుకుతోపాటు కూతురికి ఆస్తిహక్కు ఉండాలని భావించటం, భర్త దేవుడనే భావనను నిరసించటం, భర్త దుర్మార్గుడైనా సాధ్విగా ఉండాలను కోవటమే చావుకు దగ్గరవటమనే భావనలతో స్త్రీల స్వావలంబనకు సంబంధించిన కథలు వచ్చాయి.

సహాయనిరాకరణోద్యమంలో స్త్రీలు పాల్గొనాలని కొంతమంది భర్తలు భావించటం, ప్రభుత్వ వ్యతిరేకంగా పాల్గొంటే ముప్పు వస్తుందని భర్త, అత్తలు యిష్టపడక పోవటం, ఉద్యమంలో భర్త మరణించినా ఆ తల్లి కొడుకు కూడా స్వతంత్ర్యోద్యమంలో పాల్గొనటానికి ప్రాణత్యాగం చేయాలనుకోవటం కథలలో అర్థమవుతుంది. సత్యాగ్రహ ఉద్యమంలో భార్యాభర్తల భాగస్వామ్యం, అస్పృశ్యతా నివారణ, సత్యాగ్రహ నిర్మాణకార్యక్రమాలలో భాగంగా హిందూముస్లిముల మధ్యన విభేధాలు ఉండకూడదనే చైతన్యాన్ని కలిగించే కథలు వచ్చాయి. స్త్రీలు స్వశక్తిపై ఆధారపడి జీవించటం అర్థమవుతుంది.

**నాటకాలు**

ఈ దశకం పూర్వార్థంలో వచ్చిన నాటక సాహిత్యంలో స్త్రీ విద్యాభివృద్ధియే దేశసేవ అనీ, ఖద్దరు తయారీ, వ్యక్తిస్వేచ్ఛకు సంబంధించిన విషయాలలో 3 నాటకాలు వచ్చాయి.

బండారు సరోజనీదేవి వ్రాసిన 'స్త్రీ విద్యా సంవాదం' (జులై 1931 వాసవి) అనే నాటకంలో ఇద్దరు స్త్రీలమధ్య సంభాషణలో భాగంగా స్త్రీలకు విద్య మూలధనమనీ, ఇంట్లోవాళ్ళు ఒప్పుకోక పోయినా స్త్రీ చదువుకోవాలనీ, దానివల్ల వివేకం కలుగుతుందని ఒక స్త్రీపాత్ర చెప్పింది. ఆ పాత్రయే దేశానికి ఉపయోగకరమైన నూలు వడకటం వంటి పనులతో సత్కాలక్షేపం చేయవచ్చని చెప్పి బాలికలను గుంటూరు శారదా నికేతనానికి, రాజమండ్రి స్త్రీసేవాసదనానికి గానీ పంపిస్తే అన్ని విద్యలు నేర్చుకుంటారనికూడా తెలియజేసింది. అప్పుడు రెండవ స్త్రీ తన కూతురుని ఆమె చెప్పిన విద్యాసంస్థలో చేర్పిస్తానని చెప్పటంతో నాటకం ముగుస్తుంది.

*దీనిని నాటకంగానేకాక, ఒక పత్రికాముఖప్రకటనగా భావించవచ్చు. స్త్రీవిద్యపై విముఖతను చూపిన తల్లికి బోధచేసి, ఆమెయొక్క కూతుర్ని చదివించేటట్టు చేసి, చదువు కోవటానికి ఉన్న సదుపాయాలు కూడా చూపించేసరికి 'స్త్రీవిద్య' అంటే అభిమానం కలిగింది. ఆమె తన కూతుర్ని పాఠశాలలో చేర్పించాలనుకొనే చైతన్యాన్ని తెచ్చుకొందంటే చదువుకున్న స్త్రీలు సమాజంలో స్త్రీవిద్యావ్యాప్తికై కృషిచేస్తూ స్త్రీల దృక్పథంలో మార్పు రావటానికి చేసిన ప్రయత్నానికి నిదర్శనంగా ఈనాటకం అర్థం అవుతోంది.*

పులవర్తి కమలావతీదేవి వ్రాసిన 'పతివశీకరణం' (సెప్టెంబరు 1931 వాసవి)అనే నాటకంలో స్త్రీలోలుడైన భర్తకు ఇంట్లో భార్య నచ్చక ఆమెను విసుక్కుంటుంటే అతనికి గుణపాఠం నేర్పాలనుకొంటుంది. భార్య తన అన్నచేత మరొక పురుషవేషం వేయించి, భర్తకు తాను పురుషుడితో గడుపుతున్న భ్రమను కల్గించి, అనుమానించిన భర్తతో – భర్తకో న్యాయమా? భార్యకో న్యాయమా? అని ప్రశ్నించి భర్త చేసినపని చేయటమే పాతివ్రత్యంఅని చెప్పి, తన అన్నయొక్క మాయాపురుష వేషాన్ని తెలియచేసి భర్తకు జ్ఞానోదయాన్ని కల్గిస్తుంది.

*'ముల్లును ముల్లుతో తీస్తేగాని బాధతగ్గదనే' సామెత నిజమనిపించే విధంగా పతులకు జ్ఞానోదయాన్ని కల్గించే నాటకమిది. కుటుంబ సమస్యలను యుక్తితో పరిష్కరించు కోగలిగినశక్తి స్త్రీకి ఉంటేనే దేశసమస్యల పరిష్కారానికి కృషిచేయ గలుగుతుందనే స్ఫూర్తిని కలిగించింది.*

కొత్తపల్లి కౌసల్యాదేవి వ్రాసిన 'ఆత్మ ప్రేరణము'(డిసెంబరు 1931 గృహలక్ష్మి) అనే సంభాషణాత్మక నాటకంలో భాగంగా ఒక స్త్రీ దేశసేవకై ముందుకురావాలని మరొక స్త్రీని అడుగగా ఆమె ప్రభుత్వోద్యోగియైన భర్తగల భార్యకు దేశసేవచేసే స్వేచ్ఛయెక్కడిదనీ చెప్తుంది. స్వేచ్ఛ అనేది ఒకరు ఇచ్చేదికాదనీ, ఎవరికివారే ఇచ్ఛతో స్వేచ్ఛను పొందాలనీ, ఇల్లు వాకిలి వదిలిపెట్టకుండానే స్త్రీలు రాట్నమనే ఆయుధంతో ఖద్దరుధారణమనే విజయాన్ని పొందవచ్చనీ, పతాక వందనోత్సవంలో పాల్గొనమని మొదటి స్త్రీ చెప్పింది. ఆ పతాకోత్సవసభా ఉపన్యాసాలలో భాగంగా భారతీయులలో ధర్మంలేకపోవటం చేతనే దాస్యంవచ్చిందనీ, మిథ్యామతాలు, శుష్కవేదాంతం, మూఢదురాచారాలు, దంబైక జీవనం కలిసి ధర్మాన్ని హింసించాయని పేర్కొంటారు. పురుషుల భోగజీవితం, స్త్రీల రాణివాసం కలసి దాస్యానికి దారితీసిందనీ, మానవధర్మాన్ని శాసించేది దేశం, కాలం, పాత్రం, ఆత్మబుద్ధి అనీ, మహాత్ముని యొక్క సత్యసందేశంతో ఖద్దరు ధరించితే దాస్యవిముక్తులు కావచ్చనీ, దానికి ఆత్మప్రేరణం అవసరం అని నాటకంలోని పాత్ర తెలియజేసింది.

*స్వీయశక్తితో స్వేచ్ఛను అనుభవించాలిగాని, స్వేచ్ఛ అనేదానిని భర్తగాని, యంత్రంగాని ఇచ్చేది కాదని చెప్పి స్త్రీలు ముందుగా స్వేచ్ఛను అనుభవించే స్థాయికి ఎదగటమే స్త్రీల స్వాతంత్ర్య సంపాదన అనీ, అదే దేశస్వాతంత్ర్య సంపాదనకు దారితీస్తుందని చెప్పటం జరిగింది. వ్యక్తిస్వాతం త్ర్యానికైనా, దేశస్వాతంత్ర్యానికైన స్వేచ్ఛను పొందాలనే ఆత్మప్రేరణ ముఖ్యమని ప్రయోగాత్మకంగా నిరూపించింది.*

స్త్రీలను విద్యావంతులను చేసే బాధ్యత తల్లులకుఉంటే బాలికావిద్య అభివృద్ధిచెందు తుందనీ, దేశోపకారకమైన నూలువడకటంవంటి పనులను విద్యలో భాగంగా నేర్పించాలనీ, స్త్రీలోలుడైన భర్తకు గుణపాఠంనేర్పించే స్థితికి స్త్రీలు ఎదగాల్సిన అవసరాన్ని తమ నాటకాలలో స్త్రీలు తెలియజేసారు. మూఢాచారాల్ని వదిలించుకొంటూ, ఖద్దరు తయారీ, ఖద్దరుధారణతో స్వేచ్ఛను పొందే ఆత్మప్రేరణ అవసరమనే చైతన్యాన్ని కలిగించేవిధంగా స్త్రీల నాటకరచన జరిగింది.

**కవితలు**

20 వ శతాబ్దపు నాల్గవ దశకం పూర్వార్ధంలో వచ్చిన కవిత్వంలో స్త్రీ వ్యక్తిస్వతంత్రతకే కాక, దేశ స్వాతంత్ర్యోద్యమ కవితలు దాదాపుగా 35 వచ్చాయి. స్త్రీవిద్య, వితంతు సంస్కృతీ ఖండనం, స్త్రీలసబలత్వం, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్యం, దేశసేవలో పాల్గొన్న నాయికా, నాయక స్ఫూర్తి వంటి కవితలను స్త్రీలు వ్రాసారు.

అప్పలనరసమ్మ 'ఆంధ్రవనితామణులు' (జనవరి 1930 గృహలక్ష్మి) ను గురించిన కవితలో పేర్కొంటూ భారతనారీమణుల చరిత్రలు వ్రాసిన భండారు అచ్చమాంబను, 'నన్ను మరచినను దేశమును మరవద్ద'నీ చెప్పిన మాగంటి అన్నపూర్ణమ్మను, పౌరుషాన్ని ప్రకటించిన ఝాన్సీలక్ష్మీ బాయినీ, నాయకవీరులకు స్త్రీలు తీసిపోరనీ చాటిచెప్పిన దువ్వూరి సుబ్బమ్మను, స్త్రీల దుస్థితిగాంచి

జాలిపడి వేశ్యానిర్మూలనం చేసిన యామినీపూర్ణ తిలకాన్ని, కవితలల్లిన కాంచనపల్లి కనకమ్మ వంటి 'ఆంధ్రవనిత'లను ప్రశంసించింది.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ 'అనాథఘోష' (జనవరి 1930 గృహలక్ష్మి) అనే కవితలో బాల్యవివాహములు, బాలవితంతువుల దుర్భరస్థితిని వర్ణిస్తూ 'స్త్రీలకు విధి ఇటువంటి క్రూరచట్టములను విధించటం అర్థహీనమనీ, శృతివిహితోక్తములనేది శుద్ధఅబద్ధమనీ, అవి కాలం చెల్లినవనీ, సమయానుగుణంగా పద్ధతులను మార్చుకోవాలనీ, బాలికలకు పెళ్ళిఅంటే మిఠాయిలు తినటమని మాత్రమే తెలుసుగానీ, పెళ్ళిరోజే భర్త గతించగా వితంతుతనం వస్తుందని తెలియని వయస్సు అనీ "ఎక్కడి సనాతన ధర్మమో సంస్కరించు సంస్తుత్యులు లేరు మందునకుఁజూచిన నౌకరు భారతావనిన్" అనీ 'ఆమరణాంతముండెడి మహాదృఢబంధము అర్థహీనమై నీమముదప్పి పోవనవినీతిగ... మరి క్రూరచట్టములు స్త్రీలకెగా విధి నిర్ణయించెనో' అనీ

*"శృతి విహితోక్తవాక్యములు శుద్ధమృషల్ యవిచెల్లరాదుసం*
*స్తుతమను ధర్మముల్ యవలఁద్రోయవలెన్ సమయానుగుణ్యప*
*ద్ధతులును నీతి బాహ్యములితః పరమేమిక? స్వోక్తభంగివే*
*గుతుకలఁగోయుటొక్కటి యకుంఠిత ధర్మమె? హిందూదేశమా!"* అని

*బాల్యవివాహములు, వితంతువ్యవస్థగల సనాతనధర్మమును ప్రశ్నకు పెట్టింది. హిందూదేశము నందు స్త్రీలను బాధపెట్టి ధర్మములు నీతిబాహ్యములైతే సమయాను కూలముగా వాటిని ఆవలపెట్టవలెనని చెప్పి హిందూదేశసంస్కృతిలోని దోషాలను ప్రశ్నకు పెట్టగలిగిన రచయిత్రి ధైర్యస్థురాలని అర్థంఅవుతుంది. అంతేగాక 'సనాతనధర్మాన్ని సంస్కరించు సంస్తుత్యులు లేరు అని హిందూదేశ సనాతన ధర్మములను సంస్కరించుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపింది.*

కల్వాల పార్వతీదేవి వ్రాసిన "ప్రబోధం" అనే కవితలో ("ఆంధ్రకవయిత్రులు" – ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

*"ఎన్నిదినంబులుండగలవీవబలాహ్వయధారివౌచు? నా*
*సన్నము కాలచక్రము నిజప్రభలన్ సబలాత్వమూని, వి*
*ద్వన్నుత మార్గచారిణిగా వర్తిలుమంత నితాంతతేజసం*
*పన్నవరేఖలన్ జెలగుమా తరుణీ, నూత్న సంస్క్రియన్"* అని

*స్త్రీలు అబలలని అనిపించుకోకుండా స్వీయసంస్కరణతో సబలలుగా మారే నూతన సంస్కృతిని పొందమని తెలియజేసింది.*

'శారద బిల్లు ప్రశంస'ను (ఫిబ్రవరి 1930 గృహలక్ష్మిలో) చేస్తూ బి.జ్ఞానాంబ తన కవితలో

"భారతీయులు ధర్మంబు బాయరేని
వీరనారులు పతిభక్తి విడువరేని
సత్య దేవత దేజంబు సడలదేని
శారద బిల్లు తీవ్రమై సాగుగాక.

తొలగిపోవును వైధవ్య దుఃఖ సమితి
బోసిపోవును వరకట్న బాధలింక
బీదసాదలు హాయి జీవించు చుంద్రు
విపుల సుఖమబ్బు శారద బిల్లు వలన" అని

శారదచట్టంయొక్క ప్రాశస్త్యాన్ని, ఫలితాలకు, ఆర్థికస్థితికి ఉన్న సంబంధాన్ని తెలియజేయటం, కవయిత్రి తోటి స్త్రీలలో చట్టాన్ని గురించిన అవగాహనను కలిగించే ప్రయత్నం కవితలో అర్థమవుతుంది.

'కీ.శే. అన్నపూర్ణాదేవి' ని గురించి (నవంబరు 1930 గృహలక్ష్మి ఈమె వ్రాసిన మరొక కవితలో

"ఖద్దరు ధరియించి కాల్చుడీ పరదేశ వస్త్రంబులనిన ప్రశస్తవీవు
అంటరానితనంబు మటుమాయ మొనరింప నిరతంబు మదినెంచు నెలతవీవు
స్వారాజ్యమే స్త్రీల జన్మహక్కనిదెల్పి స్వాతంత్ర్య దీక్షకై సాగితీవు
విపుల విఖ్యాతి గాంచిన వెలది వీవు
సకల విద్యల నేర్చిన చతుర వీవు
నిన్ను వినుతింప నేరీతి నేర్తుమమ్మ!
సకల సద్గుణపూర్ణ! శ్రీయన్నపూర్ణ!"

అని అన్నపూర్ణాదేవి స్వాతంత్ర్యదీక్షను స్మరించు కోవటం జరిగింది.

హిందూ ముస్లింల ఐక్యతకు పాటుబడిన 'మహమ్మదాలీ మరణము' నకు స్పందించి ఈమె వ్రాసిన ఇంకొక కవితలో (గృహలక్ష్మి మార్చి, 1931)

"కాకినాడ్పురిలోన కాంగ్రేస్ నేతయై
ప్రజలుజేజేలిడ ప్రబలినాడు
భరతమాత ఋణంబు బాపగామదినెంచి
కారాగృహమునకరిగినాడు

స్వారాజ్యమార్జింప సమకట్టి పయనమై
        ఇంగ్లాండు దేశాన కేగినాడు

సింహంబురీతిగాఁ జెలరేగి ప్రభువుల
        నిండోలగంబున నుడివినాడు

తుదకు స్వాతంత్ర్యదేవతామూర్తికొఱకె
        వేడ్కమీఱంగ ప్రాణముల్ విడిచినాడు

మేటిబలశాలి ధీశాలి మాటకారి
        మహితగుణశాలి శ్రీశ్రీమహమ్మదాలి.

శ్రీకరంచెందుగాంధికి శీఘ్రజయము
భరతమాతకు తక్షణబంధముక్తి
మహితగుణశాలి శ్రీశ్రీ మహమ్మదాలి
కాత్మశాంతియనిడుఁ బరమాత్ముఁడెలమి." అని

*భారతకావ్య నాయకులకంటెకూడ నేటి స్వాతంత్రోద్యమనాయకులే గొప్పవారని చెప్పి అందులో మహమ్మదీయమతస్థుడైనా కూడా ఆలీ యొక్క హిందూమహ్మదీయ ఐక్యత అనే ఆతని ఆశయాన్ని తలచుకుంటూ భారత స్వాతంత్ర్యలక్ష్మిని పొందే లక్ష్యంతో ముందుకు సాగాలనీ సత్యాగ్రహులలో స్ఫూర్తినింపే ప్రయత్నం బి.జ్ఞానాంబ చేసింది.*

1930 మార్చిలో గాంధి సబర్మతీఆశ్రమం నుండి ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహానికి స్పందించిన రాజేశ్వరి వ్రాసిన 'లవణ సాగరమథనము' అనేకవితలో ("ఆంధ్ర కవయిత్రు"లు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

"ఆ సబర్మతీ తీర ఋష్యాశ్రమంబు
బయలు వెడలిన సత్య తపస్వివెంట
పరువు లిడినది సకల ప్రపంచ దృష్టి
ఏ ప్రళయవహ్ని పుట్టునో యేమొయనుచు

దారిపొడవున శాంతి స్వతంత్ర సమర
జైత్రయాత్రా పురోగామి చరణసరణి
ధన్యమైనట్టి ధూళి నౌదల ధరించి
పొంగిపోయెను భూదేవి నింగిదాకా

*లవణసాగర మథన వేలా ప్రభూత*

*దర్శనా తీర సర్వ స్వతంత్ర భార*

*తీయరాజ్యేందిరయే రమాదేవియయ్యె*

*మోహినీమూర్తియై మహాత్ముండు వెలసె”* అంటూ

*ఉప్పుసత్యాగ్రహ ఉద్యమ స్వరూపాన్ని దర్శనీయం చేయగలిగింది. తోటిస్త్రీలలో ఉప్పుసత్యాగ్రహం పట్ల చైతన్యాన్ని రగిలించింది.*

వెలువోలు వసంతాదేవి వ్రాసిన ‘ఉద్బోధ’ (ఏప్రిల్ 1930 ఆంధ్రపత్రిక ఉగాదిసంచిక) అనే కవితలో స్త్రీలను ఖద్దరు ధరించి బీదలకు కూడునొసంగమనీ, రాట్నం త్రిప్పమనీ, కాలాన్ని సద్వినియోగం చేసుకోమని బోధిస్తూ,

*“నీ రమణీయ జీవితవినిర్మల భోగములెల్ల వీడcగా*

*గోరcగలేదు, ప్రాణము లకుంఠితయుద్ధమునం దృజింపcగా*

*గోరcగలేదు; బీదలకు గూడునొసంగcగcజాలు ఖద్దరు*

*ధారణమింతcజేయు మనcదర్మముచేసెదవేల? సోదరీ!”* అనీ,

*“దినదినమున్ దరిద్రదశ తీవ్రతదాల్చుచు దేశనాశ భీ*

*తిని జనియింపcజేసెడిని; దీరిక గల్గిన వేళలందు ఝు*

*మ్మని మధురస్వరంబు లొలయన్ భవదీయకరాంగుళీవిచా*

*లనమున శోభలొల్కcగను, రాట్నము త్రిప్పగరాదె సోదరీ!”* అంటూ

*సత్యాగ్రహోద్యమ స్ఫూర్తిని రగిలించింది. రాట్నము త్రిప్పి ఖద్దరు తయారుచేస్తే కుటుంబ దారిద్ర్యం తీరటమేకాక బీదవారికి కూడా సహాయపడగలిగేస్థితిని చేరుకుంటారని తెలియజేసింది.*

తల్లాప్రగడ విశ్వసుందరమ్మ వ్రాసిన కవితలో (“ఆంధ్రకవయిత్రులు”–ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

*“కఠిన కారాగార లంకాపురమున*

*బధిరులమయి యున్నాము భయమువీడి*

*‘అబలలముగాక యెంతయు సబలలమయి*

*భారతదేశ విముక్తిని బడయునొరన్”*

*అని చెరసాలలో ఉన్న స్త్రీల భావాలను చెప్పింది.*

*ఉప్పుసత్యాగ్రహోద్యమ సమయంలో చాలామంది స్త్రీలను చెరసాలలో పెట్టారు. జాతీయోద్యమ భాగస్వాములుగా దేశంకోసం పోరాడే స్త్రీలను చెరసాలలో బంధించినా అధైర్యపడక*

భారతదేశవిముక్తి కోసం సబలలయ్యామనే వారి ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించింది. 'స్త్రీ అబల' అనే దేశభక్తిరహితులకు చెంపపెట్టయిన కవిత ఇది. స్త్రీలు దేశస్వాతంత్ర్యంకోసం ఉద్యమంలోకి చొచ్చుకొనిపోయి చెరసాలలో గడిపి సబలలని నిరూపించుకోవటం నేటి స్త్రీలకు స్ఫూర్తిదాయకం.

మోద ప్రసూనాంబ వ్రాసిన 'మహిళ' అనే కవితలో ("ఆంధ్రకవయిత్రులు" – ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

"సబలవీవె, మాతృసద్భావమున్నీవె
భారతాంబ నీవె, ప్రమదవీవె
అట్టినీవె యబలయైన నింకేముందు"? ॥మహిళ॥

మహిళ యనెడి మాట మఱచుటయే కాక
యామె సేవ నెందు నరయరైరి
తత్ఫలంబు దేశదాస్యంబు నానొప్పె ॥మహిళ॥

విజయలక్ష్మీవిదుషి విజ్ఞానమునుగన్న
శక్తిలీలలన్నీ సార్థకములు
దేశమహిమదెల్పి దివ్యవ్రతము బూనె" ॥మహిళ॥

అని మహిళలను సబలలనీ, శక్తిమంతులని కీర్తించింది.

ఓలేటి నిత్యకల్యాణమ్మ వ్రాసిన 'దివ్యాశీస్సు' (మార్చి 1931 గృహలక్ష్మి) అనే కవితలో

"భారతీసతి గుండెలందు
పల్లవించిన స్వేచ్ఛభావము
నిత్యలోకామోదమగుచును
నెగడుగావుత లీలగన్

ఆ యపూర్వపుటాంగ్లయువతీ
నాగరికతానిలము హిందూ
సుందరాంగిని దైవకృపచే
సోకకుండును గావుతన్". అంటూ

ప్రజలలోని స్వేచ్ఛా భావములను గురించి చెబుతూ పాశ్చాత్య నాగరికతకు ప్రభావితులు కావద్దని తెలియచెప్పింది.

ఈమె వ్రాసిన (ఆగస్టు 1930 గృహలక్ష్మి) 'సరోజనీదేవి' అనే మరొక కవితలో ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టు అయినా, ధైర్యాన్ని చూపిన సరోజనీదేవి స్త్రీలు అబలలు కారని నిరూపించిందని ఆమెను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని తెలియజేసింది.

*"దర్శనాలవణంపు సత్యా*
*గ్రహమునందున నీవుచూపిన*
*పట్టుదలకల యోరిమికి జూ*
*పరులుబ్రమానడిరి*

*శాంతి రణ భూతలములోని*
*స్థైర్య గుణమును గానబరచుచు*
*బాలలబలలు గారటంచును*
*జాటినావు సరోజనీ"* అంటూ

ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న సరోజనీదేవియొక్క స్థిరత్వాన్ని స్తుతించి స్త్రీలు అబలలు కారని చెప్పి స్త్రీలలో స్ఫూర్తిని ఓలేటి నిత్యకల్యాణమ్మ కలిగించింది.

ఈమెయే వ్రాసిన 'స్వాతంత్ర్య లక్ష్మి' అనే ఇంకొక కవితలో (గృహలక్ష్మి-అక్టోబరు1931)

*బ్రతుకుక్రొన్నన నీదు వరపాదపూజనుసలుపు మీరాబాయి లలనయుండ*
*'దర్శనా' లవణంపుదాడిఁ బ్రతాపవాసనలఁజల్లిన సరోజిని యనంగ*
*బ్రతుకుమిన్నే యల్ల స్వాతంత్ర్య దేవతానగరిబాటగ రుక్మిణమ్మ వెలయ*
*విమలహృద్వీణ పవిత్రజాతీయగీతికలుపాడు కమలాదేవికలుగఁ*

*"బ్రాణములు వీడియైన స్వాతంత్ర్యశోభ*
*లలితగతి నీకుఁ గూర్పంగుదలచు నితర*
*పుత్రికలు వేలకొలదిని పోరుసల్ప*
*భారతాంబా! శుభంబు చేకూరదొక్కొ?"*

*"సతతగృహప్రదీపితల సన్మణిరాజములట్లు వెల్గు భా*
*రతనవపుష్పకోమలులు గ్రక్కున శాటిబిగించివచ్చి య*
*ద్భుతగతి నిత్యశాంతిరణభూమినినిల్చిరి; యింకదాస్యవృ*
*త్తితొలఁగ భారతాంబ నినదించుఁజుమీ జయగీతికావళుల్"* అంటూ

భారతాంబను ప్రార్థించింది. భారతమాతను దైవంగా భావించి ప్రసిద్ధిపొందిన స్త్రీలందరూ భారతమాతసుతలని వారే దేశసేవికలనీ, ఆమెను కాపాడుకుంటారని తెలియజేసింది. మీరాబాయి, సరోజినీనాయుడు, ఆచంట రుక్మిణమ్మ, వేదాంతం కమలాదేవి వంటి దేశసేవికలను వోలేటి నిత్యకల్యాణమ్మ పేర్కొంది.

దేవులపల్లి సత్యవతమ్మ వ్రాసిన "మీరాబాయి" (గృహలక్ష్మి ఏప్రిల్ 1931) అనే కవితలో

*"ఎక్కడి యాంగ్లదేశ మిదిఎక్కడి భారతదేశ మద్దిరా!*
*ఇక్కడికేగుదెంచి ఇటు లెంతయుదీక్షను మాదు ముక్తికై*
*తక్కక రాత్రియుంబవలు తల్లిరొ! శ్లేదురో! పాటునొందునీ*
*ఎక్కువయైన ఈఋణము నేగతి నీగదెమమ్మ ఇమ్మహిన్.*

*ఆంగ్ల దేశమునందు నతివిరక్తినిజెంది గాంధిమహాత్ముని గాంచితమ్మ*
*కాంచిమహాత్ముని ఘనముగాసేవించిమించి యాతనియాజ్ఞ మీరకుండ*
*దేశసేవనుజేయ దీక్షతోపనిబూని ఖద్దరువ్యాప్తికై కదలియచ్చొటు*
*కడకు మాసీమకు వడివడినేతెంచి మేమెల్లముదమంద మీరబాయి!*

*దర్శనంబిచ్చి మమ్ముల దనిపినావు*
*మీదురాకను జేసియే మాదునాంధ్ర*
*దేశ మిదిమొదల్ స్వాతంత్ర్యదీక్షబూని*
*మాతృదాస్యంబుబాపగా మరలుగాక.*

*మృగతృష్ణను బోలెదునా*
*దగను విలాసమును విడచితల్లీ! శ్లేడూ!*
*నిగమాంతవేది గాంధికి*
*దగుకూతురవైతి వెంతధన్యవొ ధాత్రిన్.*

*ముసుగులు వెట్టి నెత్తులకు మూలలదాగెదు ఘూకరాజినాన్*
*విసువక సంచరించుమము వ్రేల్మిని తేజము నొందజేయగా*
*అసదృశలీలవచ్చితివి యాంధ్రుల దేశము ధన్యమయ్యె స్త్రీ*
*విసరము గర్వముంగొనియె వీరవు నీదగుకార్యదీక్షకై.*

*నీరదనారదకీర్తిని*
*ఆరంగా గాంచి మాదునాంధ్రావనిలో*
*గారవమారగ దిరిగిన*
*మీరాబాయిరో! హరినినుమేలుగ బ్రోచున్".* అని

*విదేశీస్త్రీ భారతస్వాతంత్రానికై కృషి చేయటాన్ని పేర్కొని భారతదేశ స్త్రీలు స్ఫూర్తి పొందాల్సిన అవసరాన్ని పేర్కొంది. గాంధీ శిష్యురాలైన స్లేడు (మీరాబాయి)అనే విదేశీయువతి భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామ్యురాలైనందుకు ఆమె ఋణం తీర్చుకోలేనిదంటూ చెప్పిన దేవులపల్లి సత్యవతి కవిత మానవాళికి స్ఫూర్తిని, దేశభక్తిని పెంచే కవితామతల్లిక వంటిది.*

ఈమెయే వ్రాసిన 'సత్యాగ్రహులకు' (గృహలక్ష్మి మే 1931) అనే మరొక కవితలో

"క్షితిలోనవిఖ్యాతిఁజెందిన శ్రీగాంధి
    నానతి నౌదలయందుఁదాల్చి
సత్యమౌ సమరంబుసాగించి మీరలు
    చెఱసాలకేగిన చెలువదేమి
బందిఖానలజేరి బలుబాములనుబొంది
    శాంతంబుచాటిన శౌర్యమేమి
అసిధారవ్రతమగునా యహింసాతత్వ
    మాచరించినయట్టి యన్నలారా!

త్యాగధనులార! ఘనులార! ఆర్యులార!
అతిసురథులార! వీరులౌ ఆంధ్రులార!
శాంతధనులార! విజ్ఞానశౌర్యులార!
వందనశతంబు మీకిదే యందికొనుడు.

రథచోదితుండౌచు రాజిల్లుకేశవున్
    మఱపించు శ్రీగాంధి మహిమదలచి
వ్యసనసప్తకమాఁచిపరగెడు ధర్మజు
    మఱపించు నాపటేల్ మహిమదలచి
సురారాజసుతునిదౌ సుప్రభావంబును
    మఱపించు జహ్వరి మహిమదలచి
వాయుపుత్రకు వీరవరు భీమసేనుని
    మఱపించు నాసుభాష్ మహిమదలచి

సేను అన్సారి ప్రభృతుల చేవనెంచి
యుద్ధవిశ్రాంతిగైకొని యుండుడయ్య
మఱల రాఁగల సంగ్రామమహితవిజయ
లక్ష్మికరగ్రహముకొఱకు లక్ష్యముంచి" అంటూ

సత్యాగ్రహోద్యమకారుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. విజయులైన సత్యాగ్రహ నాయకులను మహాభారతంలోని పాండవ నాయకులతో పోల్చి చెప్పింది.

ఈమె వ్రాసిన 'ప్రబోధము'-అనే ఇంకొక కవితలో (గృహలక్ష్మి-సెప్టెంబరు, 1931)

*"కటకటా! నేడు దాస్యశృంఖలులజిక్కి*
*శ్వేత జాతులచేతకృశించి,శల్య*
*మగుచు దుర్భరదుఃఖార్తి బొగులుచుండె*
*భవ్యగుణ యశోపేత శ్రీభరతమాత.*

*దాస్యాంధకారంబు తఱిమివేయుటకునై*
*ఖద్దరుదీక్షతో గట్టరమ్మ*
*గద్గదస్వరముతో గడు దుఃఖమందెడీ*
*పంచమసుతల పాలించరమ్మ*
*ఆత్మనాశమొనర్చునట్టి త్రాగుడుమాన్చి*
*దేశవస్తులదీక్ష దెల్పరమ్మ*
*మనభాషమనజాతి మనదేశమభివృద్ధి*
*నెనయుమార్గముల నూహింపరమ్మ*

*మనము పూర్ణ స్వతంత్రత గనెడు వరకు*
*తీరబోదమ్మ మనపని తెరవలార !*
*మాతృసేవాపరాయణ మహిత దివ్య*
*కంకణము దాల్చి రారమ్మ గరితలార!"* అని

*సత్యాగ్రహపు పిలుపును దేవులపల్లి సత్యవతమ్మ ఇవ్వటమంటేనే స్త్రీలు చదువుకుంటే దేశావగాహనను పెంచుకొని దేశాభ్యుదయానికిని, దేశస్వాతంత్ర్యానికి పాటుపడగలరనే దానికి ఈ కవితయే నిదర్శనము*

మే 1931 గృహలక్ష్మి పత్రికలో ప్రచురించిన అవటపల్లి కృష్ణవేణమ్మ వ్రాసిన కవితలో "నీవైన శాంతి నొడగూర్చి నెగడుమమ్మా" అంటూ భారతమాత సంకెళ్ళను విప్పమనీ సంవత్సరాదిని వేడుకుంది.

*పండుగ సందర్భంగ కవిత వ్రాసి దేశభక్తి ఆలోచనలను పంచిపెట్టింది.*

*మే 1931 గృహలక్ష్మి పత్రికలో వేదవల్లి తాయారమ్మ వ్రాసిన కవితలో "శాంతి సత్యాగ్రహము లిచ్చి సరవిగొనుము" అని ఉగాదిని వేడుకుంది.*

*పండగ, పర్వదినాలలోకూడా దేశభక్తిని నాటిస్త్రీలు మరచిపోలేదని భావింటానికి నిదర్శనమే ఈ కవితలు.*

దేశిరాజు భారతీదేవి 'దీవనలొసంగుమమ్మ' అంటూ వ్రాసిన కవితలో (గృహలక్ష్మి సెప్టెంబరు, 1931)

"సమకూర్చినారుగా శాంతిసైన్యంబుల
    స్వాతంత్ర్యమొనగూర్చు సమరమునకు
భూనభోంతరముల పూర్ణమౌశంఖముల్
    పూరించినారుగా ధీరలగుచు
శిరములదాల్చిరి పరమేశునాజ్ఞగా
    గాంధీసదాజ్ఞల గారవమున
ప్రకటించినారుగా పికెటింగులూరూర
    పరవస్త్రముల బహిష్కరణజరుప

తాము శాసనోల్లంఘనోద్యమముఁబూని
భారతీయులు లోకవిభ్రాంతిగొలిపి
వారికి జయంబు నింకచేకూరునట్లు
దీవనలొసంగుమమ్మ! ఓదేశమాత!" అంటూ

శాసనోల్లంఘన ఉద్యమంలో స్త్రీల ధీరత్వాన్ని స్తుతిస్తూ, అటువంటి స్త్రీల వల్ల దేశస్వాతంత్ర్యం సిద్ధిస్తుందని తెలియజేసింది.

సామవేదుల చిరంజీవమ్మ వ్రాసిన 'దేశసేవిక' అనే కవితలో (గృహలక్ష్మి-అక్టోబరు1931)

"రాతిరిగప్పు హైమపుతెరన్ మరుగొందిన కేతకీసుమం
బాతపకాంతి మందమలయానిలు కూర్మిమఱుంగవీయుచున్
వీతసమస్తమాంద్యమయి విస్ఫుర తేజములొల్కునట్లు కా
రాతమము విడంబడి విరాజిలుచుండిరి దేశసేవికల్.

ఆతపవహ్నికీల లవణాంబుధితీరమునందు నుప్పు దా
చేతులచేసినట్టి నవచెల్వమొ కృష్ణుని జన్మభూమికిన్
జాతరచేయుటన్ గలుగు శాంతరసంబొ ముఖంబునింప వి
ద్యాతతగౌరవాన్వయవిభాతి మనోజ్ఞ విలాసమొందెడిన్.

భారతదేశ మీగతినె బానిసబంధములెల్లద్రెంచి స్వే
చ్ఛారమయై ప్రపంచమున సాదృశసోదరియైచెలంగు నం
చారయ దెల్పుచుండెననినట్లు వివర్జితబంధపాశయై
భారతదేశ సేవిక ప్రభాతపుభేరిని మ్రోయవింటి రే!

తల్లి సమస్తదీక్షలకు దక్షిణభూమియ! దేశభక్తులన్
పిల్లలలోన "ఆంధ్రి" యను పేరిడిదెంతయు ధైర్యశీల యం
చెల్లజగంబు దన్వొగడ నింతలు జేసిన దాస్వతంత్రభా
స్వల్లిక దేశసేవికయ, భారత భావివిశుద్ధలక్ష్మిగా"... అంటూ

ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని కారాగార బుద్ధులైన జాతీయ సేవికల యొక్క సౌందర్యాన్ని, తేజస్సునూ గుర్తిస్తూనే వారిలోనే భావి భారతలక్ష్మిని దర్శింపజేసింది.

ఈమెయే వ్రాసిన 'మద్యపానసాత్విక నిరోధము' (డిసెంబరు 1931 గృహలక్ష్మి) అనే మరొక కవితలో

"అజునిరాణికినాటపట్టయిన నాల్క
తడబడగజొచ్చె చెనటులై తప్పద్రావు
రక్తనేత్రాలమిడి గ్రుడ్లరక్కసులను
సోదరోచిత ప్రేమతో జూచిమద్య
పాననిరసన నేర్పునప్పరమసతికి" అనీ

"తేర్చి గూర్చిన నీ నోటి తేనెమాట
కల్లుచవిగొన్న యీపలుగాకులయెదఁ
దూరదో – కలిగింపదో – దూసిపోదో
చింతమనకేల ధర్మంబు చెంతగలుగ", అని చెప్పిన కవితలో

మృదువుగా మధుపానశీలురకు బోధచేయటానికి ముందుకొచ్చి ఈ కవితను చెప్పటం జరిగింది. మద్యపాననిషేధం సత్యాగ్రహ ఉద్యమ నిర్మాణ కార్యక్రమంలో ఒక అంశం. తద్వారా ప్రజలలో వ్యసనాలు తగ్గటమేగాక విదేశీవ్యాపారానికి గండికొట్టటం కూడా జరిగుతుందని సామవేదుల చిరంజీవమ్మ భావించింది.

పి.సీతారామమ్మ వ్రాసిన 'ఆహ్వానము' అనే కవితలో (గృహలక్ష్మి–అక్టోబరు1931)

"సమయమియ్యదె లెండు రండో
సకియలారా! జాలమేలను
శాంతిసైన్యము జేరి శాశ్వత
సద్యశమ్మును గాంచగా

*పారతంత్ర్యపుదాస్యశృంఖల*
*బారిబడి కడుబడలుచుండిన*
*భారతాంబస్వతంత్రసిద్ధిని*
*కోరి పూనికపోరగన్.*

*స్వార్థ పశుబలసార రక్షిత*
*స్వార్థ దుర్గమదుర్గముంగొన*
*శాంతిసాహససహనశరముల*
*సరగసంధింపన్.*

*వినుటలేదో విజయదుందుభి*
*కనుటలేదో క్రాలుధ్వజమును*
*మనమహాత్ముల పనుపు తలనిడి*
*యనికి మునుకొని పోవన్.*

*వీరులకు వీరాధిదేవత*
*పూరుషాళికి మార్గదర్శిని*
*వీరరుద్రమ కీర్తిగీతల*
*సారమొక్కటిగ్రోలన్.*

*సంగరమున స్వరాజ్యలక్ష్మికి*
*పొంగుచును మెయిబలినొసంగిన*
*యంగనామణి ఝాన్సిలక్ష్మికి*
*మంగళమ్ములపాడన్.*

*ఆంధ్రశూరుల శౌర్యపటిమకు*
*ఆంధ్రమంత్రుల త్యాగబుద్ధికి*
*ఆకరంబగు వీరమాతల*
*సాంద్రతేజంబుండినన్.*

*చచ్చినను స్వారాజ్యమబ్బును*
*చావకున్న స్వరాజ్యమబ్బును*
*చచ్చిబ్రతుకుటొ బ్రతికిచచ్చుటొ*
*నచ్చినది చేపట్టన్" ... అంటూ*

*శాసనోల్లంఘనానికై భారతాంబ బిడ్డలుగా స్త్రీలు విజయమో వీరస్వర్గమో పొందటానికి సిద్ధపడమంటూ వీరమాతల ఉద్యమ స్ఫూర్తిని కొనియాడినది. 1931 లో ఈమె సూచించిన బ్రతుకో/చావో అనేదే నినాదమై 1942 లో చేసిన క్విట్ ఇండియా ఉద్యమంలో మారుమ్రోగింది.*

పరుచూరిభువనేశ్వరి వ్రాసిన 'పిలుపు' అనే కవితలో (గృహలక్ష్మి–అక్టోబరు 1931)

*"బాబుజీ యిదెనీకు కబురంపెన్*
*జవాబుజాబులు పనికిరావట*
*జాగుసేయక రమ్మురమ్మిక*
*బాబుజీ యిదె నీకు కబురంపెన్.*

*లేచినది ముప్పొద్దు నేమో*
*పాచిపోయినదంచు బొలమున*
*గాచుకొనియుండెదవు కాపూ!*
*లేచి రావేమోయి! ముందుగ,* ॥బాబుజీ॥

*దేశకల్యాణంబు నీలో*
*పేశలంబై యున్నదట నీ*
*కోసమే లండనుకుతా నీ*
*వేసమున పోయినవాడట,* ॥బాబుజీ॥

*వల్లభాయ్ కనుపాపలందు త*
*టిల్లలతల్ మరపించి మెరసిన*
*సల్లలితమగు భక్తికిరణాల్*
*కల్లగాదట వట్టిపోవట,* ॥బాబుజీ॥

*మ్రోడువారిన నిఖిలలోకాల్*
*జోడుకోడెలతోడ బెరిగిన*
*నీదు నరచేనధివసించి సుధాది*
*ఝురులకు జీవమిడునట,* ॥బాబుజీ॥

*మండుటెండల నిప్పుకలను*
*దండిపడమటి శాంబరములను*
*క్రాగిపోవుచు తూగిపోవుచు*
*జోగులైనను భోగివీవట,* ॥బాబుజీ॥ అని

*గాంధీని సంబోధిస్తూ, మూడవ రౌండ్ టేబుల్ సమావేశంలో భారతీయులకు స్వపరిపాలన ఇచ్చేవిధంగా గాంధీ–ఇర్విన్ మధ్య ఒడంబడిక జరిగిన నేపథ్యంలో గాంధిని స్తుతించటం జరిగింది.*

బొడ్డుపల్లి బాలా త్రిపురసుందరమ్మ వ్రాసిన 'మేలుకొలుపు' (గృహలక్ష్మి అక్టోబరు 1931) అనే కవితలో

“మేలుకో శ్రీభరతమాత దయానిధే మేదినిసంత్రాస మేలుకో మేలు మేలు
నీదుసుతులు జైలు నుండి వేళాకువొచ్చిరి మేలుకో జననీ తెల్లవారజొచ్చెను॥

గాంధియిర్వినులాకు సంధిసమకూడెను సంతోషవార్తలమ్మ మేలుకో
వందిమాగధులు వారకామినులు వాద్యములు చెలరేగె మేలుకో

నీదుకోరిక లెల్లసఫలామాయెనుతల్లి! గాధవినోదినీ! మేలుకో
కాదుకాదనకమ్మ కాంతనీ బిడ్డలకు కళ్యాణమొనగూరె మేలుకో

కష్టములో సుఖము యిట్టిదెయనుమాట దృష్టాంతము మేలుకో
నీదుపట్టి మోతిలాలు స్పష్టపరచెను జనని మేలుకో

అమ్మరో! నీబిడ్డలందారికంటెను అబలభాగ్యమె మెండు మేలుకో
మర్మములేకాను ధర్మమొనర్చినా సన్మార్గుల బ్రోవ మేలుకో

కొల్లగ నీసుతులు వల్లెయని మీ యాజ్ఞ చెల్లింపనున్నారు మేలుకో
సల్లలితంబుగ చల్లని మాతల్లి యుల్లసంబుగ నిదుర మేలుకో

నీదుసుపుత్రుడు గాంధిమహాత్ముడు నీకుశుభమొనగూర్చె మేలుకో
పాదపద్మములాకు ప్రణమిల్లి మీసుతులు ప్రార్థంచుచున్నారు మేలుకో” అని

భారతమాతను మేలుకొలుపటమంటే నిరాశా, నిస్పృహలోనున్న భారతజాతిని ఉత్సాహ పరచటంగా భావించాలి.

దీనికి అనుబంధంగా ఈమెయే వ్రాసిన మరొక కవిత అయిన ‘జన్మమదేలా’? అంటూ

“వీరమాతలుకూ కారాగారవిముక్తులాకు చేరి నమస్కరింప చేతులెత్తానివాని
గాంధీమహాత్ముని బంధవిముక్తునీ డెందమునెరుగని మందమతుల”

అని చెప్పి జన్మ వ్యర్థమని పేర్కొంది.

పి.అప్పులనరసమ్మ వ్రాసిన ‘ఆంధ్రవనితామణులు’ (నవంబరు 1931 గృహలక్ష్మి) అనే కవితలో జాతీయోద్యమములో చురుకైనపాత్ర వహించి గాంధీగారి ప్రియపుత్రికగా స్తుతించబడిన మాగంటి అన్నపూర్ణమ్మను స్తుతిస్తూ, ఆమె అమెరికా వెడుతున్న తన భర్త కు యిచ్చిన సందేశంలోని ఆమె దేశభక్తిని స్మరిస్తూ

“నన్ను మరచిన గాని మీదే
శమ్ము మాత్రము మరువవలదని
స్వర్గమునకే వెడలితమ్మా
అన్నపూర్ణమ్మా”! – అంటూ ఆమెను స్తుతించటమేగాక...

"నాయకోత్తమ వీరులకావంతయును కాంతలు తీసిపోరని చాటిచెప్పితివి"... అంటూ దువ్వూరి సుబ్బమ్మనూ, 'అబలా సచ్చరిత్రరత్నమాల'ని వ్రాసిన భండారు అచ్చమాంబను, కవితలల్లిన కాంచనపల్లి కనకమ్మను, స్త్రీల దుస్థితి తీర్చటానికి సర్వము ధారపోసిన యామినీ పూర్ణ తిలకమ్మను, స్తుతిస్తూ వ్రాసిన కవిత నాటి స్త్రీలలో స్ఫూర్తికలిగించక మానదు.

*స్త్రీలలోని నాయకత్వ పటిమను స్మరించుకోవటమే స్త్రీలలో జాతీయోద్యమ స్ఫూర్తిని జ్వలింపజేస్తుంది. సత్యాగ్రహ ఉద్యమంలో చురుకైన పాత్రవహించిన నాయక, నాయికలను స్తుతిచేసి ప్రజలలో జాతీయోద్యమంపట్ల స్త్రీ, పురుషులలో వీరస్ఫూర్తిని ఆత్మవిశ్వాసాన్ని కల్గించిన కవయిత్రులున్నారు.*

'అన్నపూర్ణ సుభాషిత రత్నావళి' అనే కవితా ఖండికలో (ఆంధ్ర కవయిత్రులు – ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ) లో అయితం ఇందిర, భారతీదేవి అను సోదర కవయిత్రులు

*"దాస్యమరసి స్వాతంత్ర్యంబు దలచినారు*
*దీక్షతో స్వరాజ్యము భారతీయుల*
*అమెరికారాను, నాకిటనర్హమైన*
*దేశసేవా ప్రకారసదీక్ష గలదు"*

*"కాల్చనిశ్చితి భక్తితో గాంధికేను*
*రెండు వేల్సేయు పట్టు చీరలను మఱియు*
*బెండ్లి చీరెను గూడ నర్పించుకొంటి*
*వలయుచో బ్రాణమే నిత్తు భరతధరకు"*

*"పెండ్లి యుంగరమును గూడ భీతి తోడ*
*తిలకు నిధి కిచ్చినాను మీ విలువ గలుగు*
*చేతిగడియారమిచ్చితి జేతమలర*
*నకట మిమునిచ్చుకొనెదు భాగ్యంబు లేదు" అని*

*అమెరికాలో వ్యవసాయ విద్యాధ్యయనానికి వెళ్లిన భర్త బాపినీడుకు భార్య అన్నపూర్ణ వ్రాసిన లేఖలిలా ఉన్నాయని ఈ సోదర కవయిత్రులు అన్నపూర్ణ యొక్క ఉత్కృష్టమైన దేశభక్తిని గురించి వ్రాసారు. విదేశాలనుండి వచ్చిన భర్తను జాతీయోద్యమంలో భాగస్వామిని చేసిందనీ, తాను అరెస్టుఅయి జైలులోనే అనారోగ్యం పాలయిందనీ, విడుదలైనా ఎక్కువకాలం బ్రతకలేదనీ దేశం కోసం మరణించిన మాగంటి అన్నపూర్ణ దేశభక్తి నేటికీ చిరస్మరణీయమని అనిపించేటట్లుగా 'ఖండకవిత'ను వ్రాసారు.*

వెంపటి అన్నపూర్ణమ్మ వ్రాసిన 'గోదావరి పుష్కరము' అనే కవితలో–(జులై 1932 గృహలక్ష్మి)

*"గోదావరీతల్లి కోర్కెలానొసగి*
*మాదేశస్వాతంత్ర్య మహిమ మాకొసగు*
*మ్రొక్కినా వరమీనిమూర్తి నేవిడుతు*
*గ్రక్కునన్ స్వాతంత్ర్య గరిమమర్పించు" అని*

విగ్రహారాధనకంటె కూడా ప్రకృతి పరమైన చైతన్య వంతమైన నదికి మ్రొక్కితే స్వాతంత్ర్యం వస్తుందని భావించటమే తరతరాల గోదావరి పుష్కరాలకు అర్పించిన స్వాతంత్ర్యోద్యమ సాహితీ సుమమాల ఈ కవిత. గుడిలో విగ్రహాలకు మొక్కిన వరమీయలేదనీ, భారతదేశంలోని ప్రకృతిసిద్ధమైన నదీమతల్లి గోదావరిని మొక్కుకుంటే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని అభిలషించిన దేశభక్తి కవిత. తరతరాల పుష్కరాలకు తరగని కవితా పూజాపుష్పం.

కనుపర్తి వరలక్షమ్మ వ్రాసిన 'అతడు' (ఆంధ్ర పత్రిక వార్షిక సంచిక 1933 ఏప్రిల్) అనే కవితలో గాంధీ మహాత్ముని గురించి

"అతడు దేవుడు భారతజాతి కిపుడు
సంఘమతరాజకీయాదిసకలకార్య
బంధ మోక్షంబులాతనిపరము జేసి
భక్తులై కొల్చుచున్నారు భరతజనులు.

అతడు ప్రభువు; చెల్లు నతని యాజ్ఞ నిఖిల
జగతి శాసనముపగిది సవ్యముగను
సార్వభౌముల శాసనసమితికైన
నడ్డు కలదేమొకాని లేదతని నుడికి.

అతడు జ్ఞాని యిలసుఖదుఃఖాది ద్వంద్వ
ములకు లేశమైనను మది కలగడతడు
యెంత యొరపిడి పెట్టిన నేమియైన
కనియు కనకుండ వానిని కచ్చితముగ.

అతడు భక్తుడు తన కార్యవితతి నెల్ల
భగవదర్పితముగ జేయు బాధగనడు
సఫలమైనను మఱి యది విఫలమైన
నీశ్వరేచ్ఛయె యని మది నెంచుగాని.

అతడు భూసురుడే నిజంబరయరేల?
దయయుసత్యంబుశౌచంబుతపము విద్య
బ్రహ్మచర్యంబు నాదియౌ బహుళదివ్య
బ్రాహ్మణోచితగుణముల వరలుగాన.

అతడు సుక్షత్రియుడు ధీరుడాహవమున
కేల శస్త్రంబు పట్టక కీర్తనీయ
శాంతిసమరాన శాత్రవసమితి గెల్చి
విజయలక్ష్మిని గైకొను విభవ మెసగ.

అతడు కోమటి పుట్టువుచేత నిజము
మూలపడియున్న రాటాన నూలువడికి
కాసువీసంబు పోనీక ఖద్దరమ్మి
దేశమున కర్థలాభంపు తెరువు జూపె.

అతడు శూద్రుడు వ్యవసాయి యనవరతము
సేవచేయుటె యాతని జీవితార్థ
మతని సేవను భారతజాతి గాదు
పూత మగుచుండు మానవజాతి యెల్ల.

అతడు మహనీయగుణుడు మహాత్ముడరయ
భారతాంబ నోముల పంట భవ్యమూర్తి
అతని నెవ్వరనుసరింతురమలభక్తి
ధన్యమవ్వారి జన్మంబు ధన్యమవని" అంటూ

'గాంధీ'భారతదేశ స్వాతంత్ర్యరథసారథిగా ప్రజలను ఉద్యమంవైపు నడిపించాడనీ, అహింసా వ్రత దీక్షను ఉద్దేశించిన భారతాంబ ముద్దుబిడ్డ అనీ వరలక్ష్మమ్మ కాంగ్రెసునేతయైన గాంధీ మీద తన భక్తిని దేశభక్తితో సమన్వయపరిచేటట్టుగా వ్రాసింది. అతనిలో నాలుగు వర్ణాల వారి లక్షణాలు ఉన్నాయనీ, అందరూ అతడిని మహాత్ముడని అంటారనీ, అతని మాటలు వినాలని భావించింది. గాంధి ఉద్యమానికి ప్రజలందరూ బాసటగానిలబడేటట్లుగా చైతన్యం కలిగించిన కవిత యిది.

ఎమ్ అనసూయ వ్రాసిన 'దేశభక్తి' అనే కవితలో (జూన్1933 గృహలక్ష్మి)

"అయ్యదియెనేను జన్మించి నట్టిపుడమి
అల్లదిగొ నన్ను గన్నట్టి తల్లి యనుచు
మనసునుప్పొంగబోవని మగువ యెపుడు
శవసమానంబు? దానిదౌ జన్మమేల" – అని

దేశాభిమానాన్ని రేకెత్తించింది. దేశాభిమానంలేని జీవత్వానికి అర్థంలేదని, దేశభక్తి కలిగియుంటేనే స్త్రీల జన్మ సార్థకం అవుతుందని భావించింది.

పరుచూరి భువనేశ్వరి మరియు అన్నపూర్ణాదేవి కలిసి వ్రాసిన 'తెలుగుబిడ్డ' (జులై 1933 గృహలక్ష్మి) అనే కవితలో హరిజనుల స్థితిని తెలియజేస్తూ హరిజనోద్ధరణలకై ప్రజలను చైతన్యపరుస్తూ

*"కడుపునిండార త్రాగంగ గంజి లేదు.*
*కట్టుకొనుటకు చింపిరి బట్టలేదు*
*నిద్రవచ్చుచో జానెడు నేల లేదు*
*దీనహరిజనస్థితి యిదే తెలుగుబిడ్డ !*

*ఉపవసించే గాంధి యిరువదొక్క దినము*
*వారి క్షేమాభివృద్ధికి పాటుపడుచు*
*పన్నమొద్దెను వారికై ప్రాణములను*
*పిలిచి జేరదీయవదేమి తెలుగుబిడ్డ !*

*హరిజనోద్ధార కార్యంబునాదరించి*
*వారి క్షేమాభివృద్ధికి పాటుపడుచు*
*వారు సోదరుల్ మనకంచు జేరదీసి*
*అలరుచుండుము దేశాల తెలుగుబిడ్డ !"*

*"గాంధిమహోజ్వాల కఠినతపస్సు*
*శీఘ్రకాలమున సిద్ధించుగాక"* అని

*సత్యాగ్రహనిర్మాణకార్యక్రమాలలో భాగంగా ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి, ప్రజలంతా ఐకమత్యంతో పోరాడటానికిని దీనులైన హరిజనోద్ధారణ కావల్సిన అవసరాన్ని గుర్తించిన గాంధీ దాన్ని సత్యాగ్రహంలో భాగంచేసారు.*

వింజమూరి వెంకటరత్నమ్మ వ్రాసిన 'పాకీవాడు' (సెప్టెంబరు 1933 గృహలక్ష్మి) అనే కవితలో

*"నెయ్యుడా! నీవు తాకరాని నరుఁడంచు*
*శుచియెరుఁగనివాడవంచు జనవితతి*
*పల్కుహేతువేమొకొ? ప్రతి పదమునందు*
*శుద్ధి నినువెంబడింప, మాసుఖముఁగోరి*
*యనిలభూమలఁగడుమనోహరములుగనొ*
*నర్చిమమ్మనారతము వనప్రవాస*
*విముఖులుగఁజేయుచున్నీవు వెలయుచుండ*
*తల్లిబిడ్డకుఁబోల్కి నూత్లబలమీయ*
*సర్వమమ్మనారతము వనప్రవాస*
*విసుగు మనుజునకెప్పుడుఁబొనగదనెడు*

నీతినుద్ధరించుటకుయత్నింతువెపుడు
నీ పవిత్రసేవాస్రవంతి బహుమలిన
వస్తునివహంబ దవ్వుగా బరిహరించి
తానుమాత్రము శుద్ధమై తనరునెపుడు
భూమికి విషప్రళయబాధ పొరయకుండ
మును మహేశుండావిషవహ్నిఁబుచ్చుకొనియె
అట్టిదివ్యశాంతముతోనెయనుదినంబుఁ
బుడమి నీవు రక్షింతువు మురికినుండి
రమ్ము మిత్రమా! రమ్ము నా ప్రళయహర్త !
పుడిమి నీవు రక్షింతువు మురికినుండి
మనుజునకు గల్గు దుర్యశోమల పదార్థ
మంతయు వహించుదాక మానవాళిసేవ
సలుపు ధైర్యసంపద మాకొసంగుమయ్య" అని

అస్పృశ్యుడిగా భావింపబడే 'పాకివాడు' తమ జీవితాలకు శుభ్రతనొసంగుచున్నాడనీ, మనుషుల మనసులలో మాలిన్యం పోగొట్టి మానవాళి సేవను అనుగ్రహించమని పాకివానిని కోరటం ఆనాటి హరిజనోద్ధరణలో భాగంగా చెప్పటం జరిగింది. కరుణశ్రీ 'పాకిపిల్ల' కవిత (1938)కు ముందే వింజమూరి వేంకటరత్నమ్మ పాకిపనివారిని గురించి ఆలోచించమని వెన్నుతట్టటం సత్యాగ్రహ ఉద్యమానికి వెన్నెముక వంటి కవిత.

వీరుబొట్ల రామలక్ష్మమ్మ 'స్త్రీవిద్య' (సెప్టెంబరు 1933 గృహలక్ష్మి) అనే కవితలో వ్రాసిన

పుడమి యందున గొందరు పొలతుకలకు
విద్య జెప్పింపరాదంచు వెఱ్ఱి మొఱ్ఱి
వాదములు జేయుచుందురవ్వారి బుద్ధి
జాడ్యమేమని కట్ట! ప్రశంలజేతు

ఎంచనొక గర్భమందె జన్మించినట్టి
పురుషులే విద్యలన్నిటిఁ గఱచుటకును
స్త్రీలు నేర్వంగరాదని చెప్పుటకును
బాపురే! మేము చేసిన పాపమేమొ? అని

స్త్రీవిద్యను అడ్డగించే పురుషులను ప్రశ్నకు పెట్టింది. స్త్రీలు దేశస్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూ కూడా ఇంకా స్త్రీవిద్యాభివృద్ధి జరగాల్సిన అవసరాన్ని తెలియజేసారు.

ఈమెయే వ్రాసిన 'ఆకర్షణ' (మార్చి 1934 గృహలక్ష్మి) అనే మరొక కవితలో

*"ఆదినుండియునైకమత్యంబు లేని*
*జనులకందరనొక్కగీటునకు దెచ్చి*
*నడుపుచున్నట్టి నీదు ప్రజ్ఞాప్రపత్తి*
*తెలియగానేరితరముగాంధీమహాత్మ"*

అనీ గాంధీని వీరుబొట్ల రామలక్ష్మమ్మ సంస్తుతించింది.

*స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులందరూ ఒక్కత్రాటిపై ఉండాల్సిన అవసరాన్ని గాంధి చెప్పాడని తెలియజేసింది. సత్యాగ్రహనిర్మాణకార్యక్రమాలకై గాంధి ఇచ్చిన పిలుపును అనుసరించి అస్పృశ్యతా నివారణ ప్రధాన విషయంగా రచనలు వచ్చాయి. దీని ఫలితంగా అస్పృశ్యులకు ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయిస్తూ 1935 చట్టం తయారుచేయబడింది.*

భువనగిరి లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'సేవకావృత్తి' అనే కవితలో (ఏప్రిల్ 1934 గృహలక్ష్మి)

*"వ్యక్తి స్వాతంత్ర్యమునుగన్న భారతదేశ*
*ప్రజలు కొందఱు తురకపాలనమున*
*విసుగుచెందిరి బానిసవృత్తి వలన*
*నిపుడు సేవకవృత్తిలో నిపుణులైరి*

*పరిజనులమీదదయ లేని ప్రభునిగొల్చి*
*యుంటకంటెను హైన్యమింకొకటిగలదె*
*హీనమానవసేవచే మానవునకు*
*తెలివిమానమ్ము ప్రాణమ్ము త్రెళ్ళిపోవు"*

*అంటూ వ్యక్తిస్వాతంత్ర్యపు విలువలను తెలియజేసింది.*

చర్ల సుశీల వ్రాసిన 'మాలపిల్ల' అనే కవితలో (మే1934 గృహలక్ష్మి)

*చాలవృద్ధిగఁబండిన సస్యమెల్ల*
*గోసికొనెఁగర్షకుఁడపుడొక్కక్కగింజ*
*యక్కడక్కడఁబడఁబక్షియట్లుమిగులఁ*
*బ్రీతినేరుచుండెను మాలపిల్లయొకట*

*'నాచుగప్పిన సుందరనలిన' మట్లు*
*కంది కమలినవదనపుఁగాంతితోడ*
*హృదయపేటిక గొనముల రొదలు లోన*
*'నదఁగి పైదుమ్మువారినయట్టులలరె' అని*

*మాలపిల్ల బీదరికాన్ని, కష్టాన్ని కళ్ళముందుంచి, వారి జీవనవిధానాన్ని అర్థం చేసుకొనే చైతన్యాన్ని కలిగించిన కవిత యిది.*

తుమ్మల చుక్కమ్మ వ్రాసిన 'భరతమాత' అనే కవితలో (ఆగష్టు1934 గృహలక్ష్మి)

"సతత శోభాపూర్ణ సస్యజాలావృత మేదినీ స్థలముల మిగులనెగడి
సర్వసౌఖ్యప్రదసకలార్థములచేత రత్నగర్భయనంగ రహినిబరగి
విమల జలాధారల విహిత గంగా యమునాది సన్నదులచే సరయ మెరసి
ఖండఖండాంతర ఖ్యాతి గాంచిన జ్ఞాననిధులకు నిలయమై పృథివి జెలగి

యనిశమును లచ్చికిరవయియలదినట్టి
నీవు పెద్దమ్మ కిప్పుడు నిలయమైతి
వక్కటక్కట హృదయము నిక్కువముగ
బ్రద్దలయ్యెడు నెట్లహో భరతమాత" అని

*పూర్వ వైభవాన్ని గుర్తుకు తెచ్చుకొని నేటి భారతదేశస్థితికి దుఃఖపడటం కనపడుతుంది. గతసంపదను గుర్తుచేసుకుంటూ నేడు భారతదేశం దరిద్రానికి నిలయమైందని బాధపడ్తూ ప్రజలకు దేశంపట్ల ఆలోచనను రేకెత్తించింది.*

*గార్లపాటి లక్ష్మీ గంగమ్మ వ్రాసిన 'గాంధీమహాత్మ' అనే కవితలో* – (డిసెంబరు 1934 గృహలక్ష్మి)

"భారతావని కెల్ల బానిసత్వము దీర్ప బూనిన యట్టి సత్పురుషుడితడు
తాకష్టములకోర్చి తన ధనరాబడంతయు ధారబోసిన యట్టిత్యాగియితడు
పాండవాగ్రజుబోలె పావన చరితుండు సత్యంబు దప్పని చతురుడితడు
హరిజన సేవయే హరిసేవయని చేసి పడరానిపాట్లను బడియెనితడు

సరసగంభీర హృదయుండుశాంతమూర్తి
కర్మఫలవర్జితుండు నిష్కపటి యితడు
దేశసేవాభిలాషి గాంధీ మహాత్మ
డాయురారోగ్యవంతుడై యలరుగాక"

*అని గాంధీ త్యాగశీలతను గార్లపాటి లక్ష్మీగంగమ్మ కొని యాడింది.*

ఈ దశకంలో1930 నుండి 1934 మధ్యకాలంలో వచ్చిన కవితలలో దేశస్వాతంత్ర్యానికై దేశసేవలో ధన్యులైన నారీమణుల, దేశసేవికల స్ఫూర్తి, దేశభక్తిని పెంపొందించేందుకు భరతమాతను, గాంధి యొక్క త్యాగాన్ని, సత్యాగ్రహులను ప్రశంసించటం, ఉప్పుసత్యాగ్రహం, శాసనోల్లంఘనంలో పాల్గొని కారాగార శిక్షను అనుభవించిన స్త్రీల సబలత్వాన్ని గుర్తించటం జరిగింది. సత్యాగ్రహనిర్మాణ కార్యక్రమాలలో భాగంగా నూలువడకటం, ఖద్దరుధారణ, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ, హిందూమహమ్మదీయుల ఐక్యతకును, భారతమాత దాస్యవిముక్తికై ఉద్యమ భాగస్వాములయ్యే విధంగా యువతను మేలుకొలిపి పిలుపునిచ్చే కవితలు,

శారదాబిల్లు ప్రచారం, వితంతు స్త్రీలసంస్కృతీ ఖండనంవంటి స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి, శాసనోల్లంఘనానికి సంబంధించిన కవితలను స్త్రీలు వ్రాసారు.

**నవల**

దామెర్ల భ్రమరాంబ మరియు కొండా జయలక్ష్మిబాయి అనే రచయిత్రులు కలసి హిందీభాషలో ప్రేమచంద్ రచించిన 'సేవాసదన్' అనే నవలను తెలుగులో 'సేవాశ్రయము' అనే పేరుతో అనువాదం చేసి తెలుగులోని స్వంతంత్ర నవలా అన్నట్లుగా వ్రాయగలిగారు. (1932లో ప్రథమము 1946లో ద్వితీయముద్రణ" సరస్వతి పబ్లిషర్స్ రాజమండ్రి). 'సేవాశ్రయం' అనే నవలలో ఒక స్త్రీ వేశ్యగా మారటానికి గల మూలకారణాలను విశ్లేషించే క్రమంలో పిల్లకు పెళ్ళిచేయలేని కుంటుపడ్డ కుటుంబ ఆర్థికవ్యవస్థ, బాల్యవివాహాలనే సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ కలిసి వెరసి వయోతారతమ్యంగల వ్యక్తికిచ్చి పెళ్ళిచేసి కాపురానికి పంపిస్తే ఒకనాడు ఆ స్త్రీ ఒక సంగీత సభకు వెళ్ళి ఆలస్యంగా వచ్చినందుకు ఆ భర్త ఆమెను ఇంటి నుండి తరిమివేస్తాడు. ఆమె ఒక ఇల్లాలి ఆదరణతో ఒక కుటుంబపు నీడన చేరుతుంది. కానీ ఆ కుటుంబంలోని భర్త సంఘసంస్కర్త అయివుండి కూడా అధైర్యస్థుడిగా ఆమెను బయటకు పంపటంతో ఆమెను అదే వీధిలో ఉన్న ఒక వేశ్య యింట్లోకి పిలిచి ఆశ్రయం ఇచ్చి, ఆమెకు సంగీతం నేర్పించటం వంటిది చేసి నెమ్మదిగా వృత్తిలోకి దింపటం చేస్తుంది. ఇదంతా ఆ స్త్రీ యొక్క ప్రమేయం లేకుండానే జరిగిపోవటంతో ఆమె తన జీవితాన్ని తలచుకుని పశ్చాత్తాప పడుతూనే ఉంటుంది. అయితే వచ్చే విటులతో ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసు కాబట్టి మోహితవంతులైన యువకులను మాత్రం చెడిపోకుండా చూడగలుగుతుంది.

సంఘసంస్కర్త అయినాకూడా ఆ యిల్లాలియొక్క భర్త ఆమెను బయటకు వెడలికొట్టినపుడు కుటుంబ స్త్రీగా ఉన్న ఆమెకు తాను ఆశ్రయం యివ్వకపోవటం చేతనే ఆమె అలా వేశ్యావృత్తిలోకి నెట్టబడిందనీ, దానివల్లనే ఆమె బాధపడటం జరిగిందని భావించాడు. అంతేగాక ఆమె చెల్లెలిపెళ్ళి కూడా ఆగిపోవటంతో ఏర్పడిన పరిణామాలు తెలుసుకొని ఆ సంఘసంస్కర్త మిత్రులతో కలసి వేశ్యలను ఉద్ధరించాలను కొని, వారసత్వ వేశ్యావ్యవస్థ లేకుండా చేయటం కోసం వారి పిల్లలకు చదువులు చెప్పించటం, పెళ్ళిళ్ళుచేయటంవంటివి చేస్తాడు. మునుపటినుంచి వేశ్యావృత్తితో ఊరివెలుపల వేశ్యలవాడలో ఉన్నస్త్రీలను సేవాశ్రయాలలోకి తరలించాలనుకోవటం జరిగింది. దానికై మున్సిపాలిటీలో ప్రతిపాదించాలనుకున్న బిల్లును ప్రవేశపెట్టి సవరణ చేయాలనుకొన్నాడు .కాని ఆ సవరణలకు అందరూ ఆమోదం తెలియజేయక పోవటంతో చివరకు తానే మున్సిపల్ అధ్యక్షుడిగా ఎన్నికకాబడి వేశ్యలను సేవాశ్రయాలలో నిలబెట్టటం చేసి వారిని సత్ప్రవర్తనగల స్త్రీలుగా పరిణామంచెందే దిశగా ప్రయత్నించాడని తెలియజేసిన నవలాంశాన్ని అనువదించారు.

*ఆనాటి ఆంధ్రప్రాంత పురుషులలో వేశ్యావ్యవస్థ నిషేధం పట్ల కలగవలసిన చైతన్యానికై అనువాద సాహిత్యాన్ని స్త్రీలు సాధనంగా చేసుకోవటం అబ్బురమైన విషయంగా భావించవచ్చు.*

*పితృస్వామ్యసమాజంలో సంపన్నులు, విశ్రాంతవర్గంవారు తమకనుకూలంగా ఉన్న వేశ్యా వ్యవస్థను రద్దు చేయటం యిష్టంలేక దానిని వ్యతిరేకిస్తారు. అయితే ఆ వేశ్యలఘోషను*

*ఎవరూ అర్థంచేసుకోలేరనీ, ఒక స్త్రీవేశ్యగా మారటానికి సాంఘిక వ్యవస్థే కారణమనీ, వేశ్యల ఆర్థికవ్యవస్థను పరిష్కరించి వారిని సన్మార్గంలో పెట్టి జనజీవన స్రవంతిలో కలపాలని భావించింది. సంస్కారయుత మైన జీవితాన్ని వారికి అందించాల్సిన బాధ్యతను గుర్తెరిగిన వారవటంతో నాటి స్త్రీ రచయితలు వేశ్యల జీవితాల మీద వ్రాయాలనుకున్నారు. అయితే వారికి వేశ్యలతో ముఖాముఖి సంభాషణ జరపాలన్నా వేశ్యావాటికలకు వెళ్ళగలిగే ధైర్యంగాని ఆనాటి స్త్రీలకు అరుదు కాబట్టి అటువంటి విషయాలుగల హిందీనవలను ఆధారంగా చేసుకొని తెలుగులోకి అనువదించారని భావించవచ్చు.*

## స్వీయచరిత

ఏడిదము సత్యవతి 'ఆత్మచరితము' అనే స్వీయచరిత్రను వ్రాస్తూ (1934 ఫిబ్రవరి– బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల ప్రచురణ) ఆమెకు జరిగిన బాల్యవివాహ విషయంలోను భర్త దగ్గరికి వెళ్ళిన సందర్భంలోనూ ఆమె ఎదుర్కొన్న సమస్యలను, పోలీస్ వ్యవస్థలోని అవినీతి నిర్లక్ష్యాన్ని, వితంతు కర్మలను నిరసిస్తూ వ్రాసింది.

*ఒక పోలీసు భార్యగా నిర్భయంగా పోలీస్‌వ్యవస్థని అంచెలంచెలు అధికార వ్యవస్థలోని అవినీతిని తన రచనలో బయటపెట్టగలిగింది. దండనాధికారుల వ్యవస్థలోని లోపాలను బయట పెట్టటమే ఆమె ధైర్యసాహసాలకు మచ్చుతునకగా భావించాలి. అదే సమయంలో ఆమె కొందరు పోలీసులలోని మంచితనాన్నికూడా పేర్కొంది.*

## కీర్తన

కోమలమ్మ వ్రాసిన 'కరుణపరిదేవనము'– అనే పాటలో (గృహలక్ష్మి 1933 డిసెంబర్) (సంగీతకీర్తనను స్వరపరచిన నాదనామక్రియ రాగం – పల్లవి)

*"జనని భారతదేవి, జయవిలసి, జనని భారతదేవి*
*పారతంత్ర్య నిగల బద్ధ*
*పరమ పూజ్యమృదుల మూర్తే*
*వీర తనయ వినుత కీర్తే*
*క్రూర వైరి సంగతార్తే. ॥జనని॥*

*దీనలోక కరుణ రుదిత*
*మ్లాన వదన సరసిజాతే*
*హీన జీవనార్తజాతే*
*సూన(శూన్య) మధుర భావ రీతే. ॥జనని॥*

*మలిన జీర్ణ వసన ఖండ*
*కలిత శుష్క సుభగ దేహే*
*గలిత మందహాస నివహే*
*లోల శూల శూన్య బాహే" ॥జనని॥* అంటూ

భారతమాతను కీర్తిస్తూ గానం చేసిన విదుషీమణిగా కర్నాటకసంగీత ప్రధానంగా అందరూ పాడుకోవటానికి వీలుగా దేశభక్తి గీతాన్ని రచించి స్వరకల్పన చేసింది. దేశ స్వాతంత్ర్య సాధనకై దేశభక్తి అభివృద్ధిచెందే విధంగా భారతమాతను స్తుతిస్తూ కవితలల్లి పాడుకోవటానికి స్త్రీలు సంగీత స్వరకల్పన చేయగల స్థాయికి ఎదిగారని అర్థం అవుతుంది.

**పాట**

ఇనగంటి రత్నమ్మ వ్రాసిన 'రాటపు పాటలు' అనే కవితలో (గృహలక్ష్మి–అక్టోబరు1931)

*"రాటాలమోతమ్మ రవ్వల మోత*
*కనకసిరిగొల్లారి కవ్వాల మోత*
*యేకులొడకలేను యెదురెట్టలేను*
*పాపజాతిదేశానికి వన్నెట్టలేను.*

*అందరిరాటాలు అవిటికుక్కాలు*
*అందులో నారాటము చిలకలకొలికి*
*చిలకలకొలికిని వలికిలోబెటితే*
*వలికంతతెగగాలి వచ్చెరాటంబు"*

*అని పాడుకుంటూ కవయిత్రికి రాట్నముమీద ఉన్న మక్కువను ఇక్కడ తెలియజేసింది. రాట్నాన్ని కసికందకుండా అపురూపంగా భావించటం కనబడుతుంది. సత్యాగ్రహఉద్యమంపట్ల స్త్రీలకున్న నిబద్ధతను తెలియపరచిన కవిత ఇది.*

**లేఖలు**

ఈ దశాబ్దంలో1930 నుండి 1934 మధ్యకాలంలో స్త్రీల లేఖాసాహిత్య ప్రక్రియ ఊపందుకొంది. స్త్రీలు వ్రాసిన 3 లేఖలు వచ్చాయి.

పులవర్తి కమలావతీదేవి వ్రాసిన 'కల్పలత లేఖలు' (ఆగష్టు 1932 వాసవి)లో రాజమండ్రిలో పుష్కరాల సమయంలో దేశభక్తిలో భాగంగా స్వదేశీవస్తు ప్రదర్శనలు ఏర్పాటు చేయగా, అందులో గుంటూరు శారదానికేతనం వారు అల్లిన ఫేముబుట్టలను, బత్తుల కామాక్షమ్మ గారి సేవాసదనబాలికలతో రాట్నంపై నూలువడికిన ఖద్దరువస్త్రాలను ప్రదర్శనకు పెట్టారనీ, ఆ బుట్టలు, వస్త్రాలు, మూకభాషలో దేశభక్తిని చాటుతున్నాయనీ స్నేహితురాలికి లేఖవ్రాసింది.

*పుష్కరాల పుణ్యంలో భాగంగా అచేతనమైన వాటిలో కూడ దేశభక్తి ఉందనీ దానినొక దేశభక్తి ప్రబోధం చేసే అద్భుతమైన స్వాతంత్ర్యోద్యమ ప్రదర్శనగా భావించగలిగింది. అంటే, గోదావరి పుష్కరాలలో పాల్గొనటం స్త్రీలకు లభించే పుణ్యంతోపాటు దేశభక్తిభావన కలసి ఉండటమనే స్వాతంత్ర్య కాంక్షకు నిదర్శనం. ఏపని చేస్తున్నా నాటి స్త్రీల దృష్టి అంతా దేశస్వాతంత్ర్యం వైపే ఉండేదని అర్థమవుతుంది.*

ఈమెయే శారదకు వ్రాసిన మరొకనాటి 'కల్పలత లేఖలు' (మార్చి 1933 వాసవి)లో ఒక హంతకురాలైన స్త్రీ కథను వ్రాస్తూ పాఠశాలలో చదువుకుంటున్న తెలివైన ఒక బాలవితంతువు ఆమెకు వయస్సు వచ్చినప్పుడు తన స్నేహితునితో పరస్పరం ప్రేమలో పడి తల్లిదండ్రులను పునర్వివాహం చేయమని అడిగింది. తల్లిదండ్రులు మండిపడి ఒప్పుకోనందుకు అతడు ఆమెను పెళ్ళిచేసుకుంటానంటే నమ్మి ఇంటినుండి వెళ్ళిపోతుంది. అతడు ఆమెను అనుభవించి నగలు తీసుకుని ఒక వేశ్యాసదనానికి అప్పజెప్పగా కొన్నాళ్ళ తర్వాత ఆమె ఆ యింట్లో నుండి తప్పించుకొని బయటకు వస్తుంది. తరువాత తనని మోసగించిన స్నేహితుడితో మరికొన్ని నగలిస్తాననే ఆశచూపించి పిలిచి తనను నమ్మించి తన జీవితాన్ని వేశ్యాసదనం పాలు చేసిన ఆ మిత్రుడిరూపంలో ఉన్న మోసగాడిని హత్యచేసింది. దానికై జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఆమెను కలవటంచేత తెలిసిన చేదునిజాన్ని 'కల్పలత' లేఖలలో పులవర్తి కమలావతీదేవి పేర్కొంది.

*స్త్రీలను మోసగించే మృగాళ్ళను వదిలిపెట్టకుండా చంపేయటమే తగిన శాస్తి అనీ, ఆ రకంగా జైల్లో తన జీవితాన్ని మగ్గింపజేసినా ఆమె ఫరవాలేదనుకుందనీ కథలో అర్థమవుతుంది. రాడికల్ చర్యకు సంబంధించిన ఆలోచనలు 1933 నాటికి స్త్రీలలో కలిగాయని అర్థం అవుతుంది. విప్లవకవి శివసాగర్ వ్రాసిన 'చెల్లీ చెంద్రమ్మ' కవితకు ముందే ఇటువంటి ఆలోచనలు స్త్రీలలో కల్గటం అశ్చర్యమనిపిస్తుంది.*

'శారదలేఖలు' అనే పేరుతో(జనవరి 1934 గృహలక్ష్మి) కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాస్తూ 1933 డిసెంబరు 23 తేదీన గాంధీ గుంటూరు వచ్చినపుడు వారి దర్శనం కలగడం ఆనందదాయకమనీ గాంధీ వెంట వచ్చిన మీరాబాయ్ అను స్లేడు కన్య (ఆంగ్ల వనిత) ను చూడటం ఆనందదాయకమని తెలిపింది. ఆ సభలో రాట్నాలను, ఆశ్రమాలలో తయారైన శిల్పాలను క్రయ వెలకి పెట్టటం జరిగిందనీ, ఆ డబ్బును దేశానికి ఉపయోగించాలని అనుకొన్నారనీ తన స్నేహితురాలికి వ్రాసినటువంటి లేఖాంశములుగా తెలియజేసింది.

ఈ లేఖాసాహిత్యంలోని అంశాలుగా దేశభక్తిలో భాగంగా గాంధీసమావేశ విశేషాలు, స్వదేశీవస్తుతయారీ, ఖద్దరువస్త్ర ప్రదర్శన,వితంతువును వివాహం చేసుకొంటానని చెప్పి మోసంచేసిన వ్యక్తిని హత్యచేయగల విప్లవ భావాలను స్త్రీలు సంతరించుకోవటం కనపడుతుంది. విషయాలను దూరాన ఉన్న మిత్రులతో పంచుకొంటూ వారిలో దేశభక్తి స్పృహను స్త్రీలు తమ లేఖలద్వారా కలిగించారు, అంతేకాక, స్త్రీలలో వచ్చిన విప్లవభావాలను మిత్రులకు తెలియజేస్తూ స్త్రీలు లేఖసాహిత్యాన్ని వ్రాసారు.

20వ శతాబ్దపు నాల్గవ దశకం పూర్వార్ధంలో వచ్చిన సాహిత్యంలో 1930 సం.నాటికే స్త్రీలు ఖద్దరుతయారీతో సహాయనిరాకణోద్యమంలో పాల్గొనటంచేత వారిలో జాతీయాభిమానం, ఆర్థిక స్వావలంబన ఇనుమడించింది. శారదాబిల్లుతో బాల్యవివాహ నిషేధానికి దారులు ఏర్పడి స్త్రీవిద్య కొంత అభివృద్ధిచెందటం జరిగింది. వివాహితస్త్రీలు కాపురంకంటే విద్యయే ముఖ్యమని భావించటం, సామాజిక, ఆర్థిక హక్కులను స్త్రీలు పొందాలంటే రాజకీయవ్యవహారాలలో,

పంచాయతీపాలనలలో తమకు భాగస్వామ్యం ఉండాలని అనుకున్నారు. స్త్రీలకు రాజకీయరంగాలలో సమర్థత ఉండాలనుకొన్నారు. స్త్రీలకు ఓటుహక్కు ఉండటమే వారి స్వతంత్రతకు చిహ్నమని భావించారు. అదేసమయంలో బ్రిటిష్ ప్రభుత్వంవేసిన ఉప్పుపన్నుకు వ్యతిరేకంగా గాంధీ నాయకత్వంతో కూడిన 'ఉప్పుసత్యాగ్రహ' ఉద్యమంలో పాల్గొన్నారు. స్త్రీలను జైళ్ళలో నిర్బంధించినా తాము అబలలు కామని కఠినకారాగారాలలో ప్రబలలుగా మారే నూతన సంస్కృతిని పుణికిపుచ్చుకొని భారదేశవిముక్తికై పాటుపడ్డారు. అందుకోసం తోటిస్త్రీలలో వారి వ్యక్తి స్వాతంత్ర్యంతో పాటు స్వాతంత్ర్యోద్యమ చైతన్యం పెరిగేలా స్త్రీలు సాహిత్యసృజన చేసారు. వ్యక్తిస్వాతంత్రపు విలువ తెలిసిన స్త్రీలు స్వవిషయాలలో నిర్ణయాత్మకశక్తులుగా ఎదగటం కనబడుతుంది. అత్తకు, భర్తకు భయపడకుండా సత్యాగ్రహోద్యమాలలో పాల్గొంటూనే లోకల్ బోర్డులపరిపాలనలో ఎన్నికలద్వారా భాగస్వాములైతే గ్రామాలయొక్క పునర్నిర్మాణం జరిగి స్త్రీల సమస్యలు తీరుతాయని భావించారు. మద్యపానాన్ని అరికట్టాలనుకోవటం, అస్పృశ్యతను నివారించాలనుకొని హరిజనోద్ధరణకు పూనుకోవటం, రాష్ట్రస్థాయి, అఖిలభారత అంతర్జాతీయ మహిళా సభలలో పాల్గొని తీర్మానాలు చేసుకోవటం జరిగింది. చట్టాలనుగురించిన అవగాహనను పెంచుకొన్నారు. తద్వారా స్త్రీలు తమసామాజిక ప్రస్థానాన్ని విశాలం చేసుకున్నారు. స్త్రీలు తాము స్వతంత్రంగా జీవించటానికి దుష్టుడైన భర్తనుండి విడాకులు తీసుకోవాలనుకోవాలనుకొన్నారు. స్త్రీల ఆరోగ్యరక్షణ గురించి ఆలోచించారు. ఆడపిల్లల పుట్టుక, పెంపకంలోని లింగవివక్షా స్వభావాన్ని ప్రశ్నకు పెట్టారు. స్త్రీలలో నిర్ణయాత్మక సామర్థ్యంపెరిగింది.సహజీవన సంస్కృతి ప్రతిపాదనచేసారు. స్త్రీల ఆస్తిహక్కును, స్త్రీధనాన్ని విశ్లేషణకు పెట్టుకొన్నారు. రాష్ట్ర స్థాయి మహిళాసభలను ఏర్పాటుచేసుకొన్నారు. హిందూమహ్మదీయ సఖ్యతకై సాహిత్యసృజన చేసారు. భారతమాత దాస్యశృంఖలాలను వదిలే విధంగా దేశానికి పూర్ణస్వాతంత్ర్యం కావాలనుకుని స్వాతంత్ర్య సాధనకై ప్రజలను మేలుకొల్పారు. నదిలో, మదిలో, వస్త్రధారణలోనూ దేశభక్తిని నింపుకున్నారు. కూతుర్ల సంసారాలకంటే కూడా స్త్రీవిద్యపట్లనే తల్లులు మక్కువను చూపించారు. ఖద్దరు తయారీలోనే గాక మిగిలిన రంగాలలో కూడా వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేయటం అర్థమయింది. భారతదేశంలో1934లోనే కమ్యూనిజం ప్రవేశించటంతో రష్యాలోని కమ్యూనిష్టుల విప్లవాన్ని తెలియజేస్తూ రష్యాలోవలె భారతదేశంలోకూడా విప్లవం అవసరమని భావించటం జరిగింది. ఈదశాబ్దంలో స్త్రీలు ఆర్థికస్వావలంబన, రాజకీయ సాధికారికత దిశగా అభివృద్ధి చెందాలనుకోవటం స్పష్టమయింది. స్త్రీలలో ప్రజాస్వామిక భావాలు అభివృద్ధిచెందాయి.

స్త్రీలకు ఓటుహక్కు లభించటంతో తమ సాంఘిక,ఆర్థిక,రాజకీయ హక్కులసాధనకై రాజకీయవ్యవహారాలలో భాగస్వాములు కావాలనుకున్నారు. దానికి ఏర్పడిన రాజకీయ పరిణామాలను తెలుసుకోవటానికి మున్ముందుకు సాగాలి.

# 5.2. (ఆ) సాహిత్యం (1935-1939) భారతదేశ ప్రభుత్వచట్టం - ఎన్నికలు - స్త్రీల రాజకీయసాధికారికత - మహిళాహక్కుల న్యాయచైతన్యం - బిల్లులు

గాంధి 1930లో మొదలుపెట్టిన ఉప్పుసత్యాగ్రహోద్యమాన్ని, శాసనోల్లంఘనాన్ని తీవ్రతరం చేసేసరికి 1930-31లలో రౌండ్ టేబుల్ సమావేశాలు మూడు దఫాలుగా జరిగాయి. గాంధితో మొదటి రౌండుటేబుల్ సమావేశం ఏర్పాటుచేసి భేదోపాయాన్ని వినియోగించే విశ్వాసంతో ప్రయత్నంచేద్దామనుకొన్నా కుదరక, రెండవ రౌండుటేబుల్ సమావేశంలోనైనా విజయం సాధించి ముస్లింల సహాయంతో కాంగ్రెస్ ప్రతిఘటనను ఎదుర్కోవాలనుకుంది. కాని మూడవరౌండ్ టేబుల్ సమావేశంలో పన్నులు కట్టకుండా ఉండే విధంగా గాంధీ, ఇర్విన్ ల మధ్య ఒప్పందం కుదిరింది.

1919 చట్టానుసారంగానే 1935 చట్టం చేసినా దీనిలో ఫెడరల్ కోర్టు స్థాపన, ఫెడరల్ పబ్లిక్ సర్వీసు కమీషను, ఫెడరల్ రైల్వేబోర్డు స్థాపన జరిగింది. కేంద్రశాసన సభలలో ముస్లింల ప్రాతినిధ్యం అధిక సంఖ్యలో ఉంది. హిందువులు దాన్ని వ్యతిరేకించినా ముస్లింలీగు నాయకుడిగా జిన్నా ఒప్పుకోకపోవటంతో కాలయాపనానంతరం 1935 చట్టాన్ని 1937లో అమలుచేసారు.

భారతదేశప్రభుత్వ చట్టం, 1935 ప్రకారం బర్మా భారతదేశం నుండి విడిపోయింది. ముస్లింల కోరిక ప్రకారం సింధుప్రాంతం బొంబాయినుండి వేరైన రాష్ట్రమైంది. 1935 పూర్వం ఒరియాభాషను మాట్లాడేవారిలో కొందరు బీహారులో, కొందరు బెంగాలులో మరి కొందరు మద్రాసు రాష్ట్రాలలో ఉంటే అలాంటి ఒరియావాళ్ళందరిని కలిపి ఒరిస్సా రాష్ట్రాన్ని ఏర్పాటుచేసింది. రాష్ట్రాలలో ద్వంద్వపరిపాలన అంతరించి పరిపాలనాశాఖా మంత్రులు శాసనసభకు బాధ్యత వహించారు. అల్పసంఖ్యాకుల కోసం గవర్నరుకు ప్రత్యేక అధికారాన్ని చట్టం ఇచ్చింది. 1935 చట్టం రాష్ట్రాలకు స్వతంత్ర అధికారాలను ఇచ్చింది.

1935 భారతదేశప్రభుత్వచట్టం ప్రకారం కాంగ్రెసు వారికి ముస్లిం లీగ్ వారికి తగిన కేటాయింపుల ప్రకారం1937లో ఎన్నికలు జరిపి, భారతీయుల మంత్రివర్గం కేంద్ర శాసనసభ పెత్తనం క్రింది పరిపాలించే విధంగా రాష్ట్రీయ స్వాతంత్ర్యం ఇవ్వటం జరిగింది.

బ్రిటిష్ పాలనా కాలంలో భారతదేశప్రభుత్వచట్టం, 1935 లో 'షెడ్యూల్ కులాలు' అనే పదాన్ని నిర్వచించింది. ఈ చట్టంలో అణగారిన వర్గాలకు కేంద్ర, రాష్ట్ర శాసనసభలలో రిజర్వేషన్ కల్పించారు. 1936 భారత ప్రభుత్వపు ఉత్తర్వులో బ్రిటిష్ ఇండియా షెడ్యూలుకులాల జాబితాను పేర్కొంది. ప్రభుత్వ పాలనలో షెడ్యూలు కులాల ప్రాతినిధ్యంకంటేకూడా ముందు వారు సమాజంలోని అగ్రవర్ణాల వారితో సమానంగా అభివృద్ధి జరగాలని భావించారు.

రాష్ట్రీయస్వాతంత్ర్యం వచ్చినా గవర్నరు అధికారాలకింద ఉండవలసి రావటం, కొన్నిరాష్ట్రాలలో ఎగువ, దిగువ సభలు ఏర్పడటంతో అది కాంగ్రెసు, ముస్లింలీగులకు ఇష్టం లేకపోయింది. 1937 రాష్ట్ర శాసనసభలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో కాంగ్రెసు ఘనవిజయం సాధించగలిగినా ముస్లింలీగు మాత్రము ముస్లింలకు కేటాయించిన స్థానాలలో ఎక్కువ స్థానాలను సంపాదించలేకపోయింది.

1935 చట్టం వచ్చినా బ్రిటీష్‌వాళ్ళయొక్క సైనికాధికారులకు లోబడి పరిపాలించాలి కాబట్టి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యము తెచ్చుకోవాలనే ఆరాటం పోరాటాన్ని ఉధృతం చేసింది. 1937లో ఎన్నికలు జరిగినా గవర్నరుకున్న అధికారాలు నచ్చక 1938 లో సుభాష్ చంద్రబోస్ సొంత సైన్యంతో ఫార్వర్డ్ బ్లాక్ ను ఏర్పాటు చేశాడు. 1938లో విప్లవోద్యమం తిరిగి ఊపందుకుంది. బాంబుల ప్రయోగం చేస్తూ వాళ్ళకు దొరకకుండా కొండల్లో తలదాల్చుకోవటం చేస్తూ బ్రిటిష్ అధికార్లను ముప్పతిప్పలు పెట్టటంతో బ్రిటిష్ ప్రభుత్వంకూడా భారతీయుల్లో వచ్చిన విప్లవభావాలను గమనిస్తున్న సమయంలో ద్వితీయ ప్రపంచయుద్ధం 1939లో ప్రారంభమైంది. భారతీయ సైన్యంతో గాని, నాయకులతో గాని సంప్రదించకుండానే భారతీయులను యుద్ధానికి పంపించాలను కున్న బ్రిటీష్ పాలకుల నిర్ణయాన్ని భారతీయులు తిరస్కరించారు. దాని ఫలితమే క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది. దేశంలో రాజకీయ పరిణామాలను అర్థంచేసుకొంటూనే స్త్రీలు స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములవటంతో పాటు స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనకై తోటిస్త్రీలను చైతన్యపరుస్తూ సాహిత్య సృజనను స్త్రీలు కొనసాగిస్తూనే ఉన్నారు.

1935 నుండి 1939 వరకు స్త్రీల సాహిత్యంలో స్త్రీల సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులకు సంబంధించి వ్రాసినవిగా దాదాపుగా 113 వ్యాసాలు, 3 ప్రచురిత ఉపన్యాసాలు, 35 కథలు, 1 నాటకం, 1 నవల, 3 లేఖలు, 1 పాట, 1 గల్పిక చోటుచేసుకున్నాయి. స్త్రీల సమగ్రస్వతంత్ర సాధనకై స్త్రీలసాహిత్యం చైతన్యాన్ని కలిగించింది.

యార్లగడ్డ చిలకమ్మ వ్రాసిన 'దేవీజోన్' (జనవరి 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ఫ్రాన్సు యువతి యొక్క స్ఫూర్తిని ఆంధ్ర స్త్రీలు పొందేవిధంగా వ్రాస్తూ 15 వ శతాబ్దానికి చెందిన ఆమె మగ వేషమును ధరించి సైన్యంలో చేరి ఆంగ్లేయుల ఆక్రమణలో దాస్యశృంఖలా బద్ధమైన ఫ్రాన్సును విముక్తిని చేసి జన్మభూమికోసం జైలులో కష్టాలు పడి జీవితాన్ని త్యాగం చేసిన సబల అని తెలియజేసింది.

*స్త్రీలు అబలలు కారనీ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనాలనే స్ఫూర్తిని కలిగించటానికి రాసిన వ్యాసమిది. దీనికి ముందే 'జోన్ ఆర్క్' అనే పేరున 1900 సం॥ నాటికే భండారు అచ్చమాంబ కూడా ఈ విషయాలతో కూడిన వ్యాసాన్ని వ్రాసింది.*

'స్త్రీలు–హక్కులు' (జనవరి 1935 గృహలక్ష్మి) అనే శీర్షికన పత్రికాధిపులు వివరిస్తూ స్త్రీల హక్కులకై, సభలుపెట్టి స్త్రీల కొత్తహక్కుల కోసం, శాసనసభలలో బిల్లులు పెట్టినా నెగ్గకున్నవనీ, స్త్రీలకు అసలు ఎటువంటి హక్కులున్నాయో తెలియజేస్తూ వాటికి సవరణ చేయటానికై అఖిల భారత మహిళాసభ చర్చకుపెట్టి, అఖిల భారత విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానం చేసిందని తెలిపింది. దానిలో భాగంగా స్త్రీలకు ఆస్తిహక్కు పుట్టింటి నుండి, భర్త నుండి సంక్రమించాలనీ, పిల్లలులేని వితంతువులు దాస్యాన్ని అనుభవిస్తున్నారనీ, ఆస్తి ఉంటే వృద్ధాప్యంలో రోగాలు వస్తే పరిచర్యలు చేసేవారిని పెట్టుకోగల స్తోమత వస్తుందనీ, పుత్రులు పెట్టకపోతే న్యాయస్థానానికి వెళ్ళి సాధించుకోవటానికి వారికి హక్కులేదని తీర్మానం చేసినట్టు తెలిపింది. స్త్రీలు స్వతంత్రజీవనం కోసం వంటిళ్ళను, వత్తులుపెట్టెలను వదిలి ప్రజాహిత వృత్తులకు దిగుచున్నారనీ, విద్యావంతులు ఉన్నతోద్యోగాలు చేస్తున్నారనీ, సకల వ్యవహారాలలో పురుషులతో సమాన భాగస్వామ్యంలో మరింతగా స్త్రీజాతి బలోపేతమవుతోందనీ, స్త్రీలు వకీళ్ళగానే కాక, శాసనసభ్యులుగా కాంగ్రెసు ఉద్యమంలో జైళ్ళకు పోతున్నారనీ, పోలీసు ఉద్యోగాలు చేయాలనుకున్నా వారిని అడ్డుకునేవారు లేరనే విషయాలను సభ చర్చించిందని తెలిపింది. స్త్రీలకు సమగ్ర స్వాతంత్ర్యం రావాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనీ, పురుషులతోపాటు ఆస్తిహక్కు కావాలనీ, కన్యాశుల్క, వరశుల్కాల నిషేధం ఉండాలనీ, ఆర్థికహక్కు స్వయంవ్యక్తిత్వానికీ పోషణకే కాక రాజకీయ హక్కులకు పునాదులయి సాంఘిక హక్కులకు కూడా పెట్టనికోట అవుతుందనీ, దానితోపాటు వివాహపు హక్కు కూడా దానంతటదే సిద్ధిస్తుందని భావించినట్టు తెలిపింది. కొన్ని రాష్ట్రాలలో విద్యాధికులకు మాత్రమే ఓటుహక్కు ఉండటమేకాక, చదువులేక పోయినా లంచంగా సైనికుడి భార్యకు ఓటుహక్కు ఉంటోంది అనీ, ఆ ఓటుహక్కు స్త్రీలందరికీ విస్తరించాలనీ, దానిని పార్లమెంటు కమిటీవారు చేబట్టేటట్టుగా స్త్రీలు ఉద్యమంచేయాలని తుర్లపాటి రాజేశ్వరి చేసిన హెచ్చరికను స్త్రీలు దృష్టిలో పెట్టుకోవాల్సినదని పత్రిక తెలియజేసింది.

*స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రధానమైనది ఆస్తిహక్కుఅనీ,అదే స్త్రీలయొక్క రాజకీయ, సాంఘికహక్కులను కాపాడుతుందని పత్రిక తెలియజేసి స్త్రీలను ఆలోచింపచేసింది.*

'దామెర్ల సీతమ్మ' (జనవరి 1935 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు తెలియజేస్తూ ఆమె తండ్రి ఉద్యోగరీత్యా చిత్తూరు జిల్లాలో ఉండటంతో తెలుగే కాకుండా తమిళంకూడా నేర్చుకుని మాట్లాడగలిగేదనీ, సెలవు దినాలలో ఇంటికి వచ్చిన సోదరుని దగ్గర అక్షరాలు నేర్చుకొని చదవటం, మొదలుపెట్టిందని తెలిపింది. విద్యనేర్చి పురాణాలు చదివి అర్థం చెప్పగల శక్తిని సంపాదించి, పద్యరచన మొదలు పెట్టిందనీ, 1907లో భర్త మరణించినా ఆమెను సోదరుడు తీసికొనివెళ్ళి,

పండితుచేత సంస్కృత గ్రంథములను చెప్పింపగా అవగాహన చేసికొందనీ, కుటుంబంలో కష్టాలు వచ్చినా చలించక, కూతురిని పూనాలోని కార్వే శరణాలయానికి పంపి తాను పూనాలో ఉండి మహారాష్ట్ర, ఆంగ్లభాషలు నేర్చుకొందని చెప్పింది. పూనా నుండి వచ్చిన తర్వాత కాకినాడలో విద్యార్థినీ సమాజాన్ని ఏర్పాటుచేసి స్త్రీ జనసామాన్యానికి బోధచేయటమేగాక పత్రికలకు వ్యాసాలు వ్రాస్తూ ఉండేదనీ, సోదరుడు చనిపోతే దహన సంస్కారం ఆమెయే స్వయంగా చేసినదనీ, సీతమ్మ విద్యార్థినీ సమాజానికి సేవచేస్తూ స్త్రీజాత్యభివృద్ధికై పాటుపడిందని పత్రిక తెలియజేసింది.

*కొరివి పెట్టేవాడు కొడుకు అనే భావనతో పురుషాధిక్యతను నిలుపుతూ అనాదిగా వచ్చిన వైదిక సంస్కృతిని అధిగమించి సోదరుని కర్మకాండలు చేయటం నేటికీ ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. దహనసంస్కారసంస్కృతి పురుషుని యొక్క ఆధిక్యతను నిలపటమేననీ, అదే పితృస్వామ్యపు పునాది అనీ, స్త్రీకూడా దహనసంస్కారం చేయటానికి అర్హురాలని తెలియజేస్తూ తద్వారా స్త్రీ పురుష సమానత్వాన్ని సమాజానికి చాటి చెప్పినట్లుగా భావించవచ్చు. ఆమె విద్యాధికురాలు కాబట్టి ధైర్యవంతురాలిగా ప్రవర్తించి సాంస్కృతిక సమానత్వాన్ని సాధించ గలిగింది. దీనినే స్త్రీవ్యక్తి స్వాతంత్ర్య నిరూపణగా భావించాలి.*

చీమకుర్తి సత్యవతి వ్రాసిన 'భర్తల కర్తవ్యం' (ఫిబ్రవరి 1935 వాసవి) అనే వ్యాసంలో స్త్రీల మీటింగ్ లందు పురుషుల మీటింగ్ లందుకూడా స్త్రీ పాతివ్రత్యం గురించి, పతిభక్తి గురించి వర్ణిస్తున్నారనీ, కవితలల్లగల స్త్రీలు, పురుషులు విద్యావంతులై కూడా స్త్రీలకు నీతి బోధక శతకాలు రచించి భర్త భగవత్సమానుడని గౌరవించి పూజించమని చెబుతున్నారని తెలిపింది. అలా పూజిస్తున్నాకూడా స్త్రీలలోపములను లెక్కించుచు, స్త్రీలు పాతివ్రత్యాన్ని పాటించాలని ఘోషిస్తుంటే వినలేక, స్త్రీలు పతివ్రతలుగా ఉన్నా మళ్ళీ ఇలాంటి నీతిబోధకాలు వల్లించే పురుషులే వారికి అజ్ఞానులుగా తోస్తున్నారనీ, స్త్రీలు పతివ్రతలుగా ఉండాలనుకున్నట్లే పురుషులు కూడా పత్నీవ్రతులై ఉండాలి అని భావించింది. ఇద్దరూ అన్యోన్య అనురాగాలతో ఉండాలంటే స్త్రీ,పురుష సమానత్వం ఉండాలనీ, కాని అలా ఉండకపోవటానికి స్త్రీలు విద్యావిహీనులుగా అబలలుగా ఉండటమే కారణమనీ, దుష్టభర్తలను కూడా స్త్రీ దైవసమానుడని పూజించటమే, భావించటమే అల్పజ్ఞానమని చెప్పింది. స్త్రీలలో నూటికొక్కరికితప్ప భర్తయందు ప్రేమలేదనీ, ప్రేమలేకున్నా విధికృత్యంగా సేవిస్తున్నారనీ, అలా సేవించకపోతే త్యజిస్తారనే భయం స్త్రీలకు ఉండేదని చెబుతూ స్త్రీలు తమ నడవడికంటేకూడా పురుషప్రవర్తనయే ముఖ్యంగా భావించాలనీ, స్త్రీ తప్పనిసరిగా దుష్టభర్తకు సేవలు చేయటమే స్త్రీలు తమ పాతివ్రత్యంగా భావించకూడదనీ ఆమె తెలియజేసింది.

*స్త్రీలు పతివ్రతలనిపించుకోవాలంటూ చేసే ప్రబోధాలలోని బానిసత్వాన్ని బయటపెట్టి దానికి విరుగుడుగా స్త్రీ విద్యావంతురాలు అవ్వాలనీ, కుటుంబాలలో పురుషప్రవర్తననీ ముఖ్యమనీ, స్త్రీ, పురుష సమానత్వాన్ని పురుషులు భావించటమే పురుషుల సత్ప్రవర్తనకు గీటురాయని తెలియజేసింది. అప్పటివరకు ఉన్న స్త్రీలపతివ్రతాధర్మాచరణ స్త్రీలకర్తవ్యంఅనే దాని స్థానంలో అదే పితృస్వామ్య సమాజంలో పురుషుల సత్ప్రవర్తన వారి కర్తవ్యమని నిర్దేశించే స్థాయికి*

*స్త్రీలు చేరుకోవటం అర్థం అవుతుంది. అనాదిగా స్త్రీపతివ్రతగా ఉండాలనిచెప్పే పురుషాధిక్య భావజాలాన్ని విమర్శకు పెట్టి స్త్రీలు సమానత్వాన్ని కోరుకోవాలిగానీ, స్త్రీలకు మాత్రమే బోధించే నీతి శతకాలను పట్టించుకోవాల్సిన అవసరంలేదని అభిప్రాయపడింది. కుటుంబ నిర్మాణపు పునాదులలోని అసమానత్వపు పితృస్వామ్య సంస్కృతి యొక్క పుట్టకేళ్ళను కదిలించేటట్లుచేసి, ముందుగా కుటుంబంలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యాన్ని సాధించటానికి చేసిన ప్రయత్నమిది.*

పొణకా కనకమ్మ చేసిన 'స్త్రీల కర్తవ్యం' (ఫిబ్రవరి 1935 ఆంధ్రభూమి) అనే ఉపన్యాసంలో స్త్రీలు తమస్వాతంత్ర్యాన్ని, స్వత్వములను (హక్కులను) సంపాదించుకోవటానికి శాసన సభలలో, స్థానిక సంస్థలలో పాల్గొనాలనీ, ఎన్నికల్లో స్త్రీలకిచ్చిన ప్రత్యేక స్థానాలలోనే కాక అన్ని నియోజక వర్గాలలో పాల్గొనాలనీ, విద్య, సాంఘిక, రాజకీయాలలో స్త్రీలు సర్వవిధాల ఉన్నతి పొందటానికి స్త్రీలప్రచారం అవసరమని చెప్పింది. పురుషులతో సమానంగా ఎన్నికలలో స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం కావాలనీ, స్త్రీలు అన్నిచోట్ల పురుషులతో సమాన స్వాతంత్ర్యం, అధికారహక్కు పొందే విధంగా స్త్రీసంఘాలు కృషిచేయడం స్వాతంత్ర్య సిద్ధికేనని, సంస్కరణలనే సమాజసేవ చేయాలనీ, రైతు సంఘాలతో, గృహ పరిశ్రమలలోనూ స్త్రీలు కృషిచేయాలని భావించింది.

*రాజకీయవ్యవస్థలలో ప్రాతినిధ్యంవహించే విధంగా స్త్రీలు సమాన స్వతంత్రజీవనహక్కునే సాధికారహక్కులు కలిగిఉంటేనే స్వాతంత్ర్యసిద్ధి కలుగుతుందని భావించింది.*

గొల్లపూడి కృష్ణవేణమ్మ వ్రాసిన 'స్త్రీ స్వాతంత్ర్యమెట్టిది' (మే 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు బయటకు వెళ్ళి ఉద్యోగాలు చేయటమే స్వాతంత్ర్యం అని అనుకోకూడదనీ, స్త్రీకి వన్నె తెచ్చేది విద్యఅయినా, ఎటువంటి విద్య స్త్రీకి అవసరమో దానిని నేర్పటంలేదని తెలిపింది. ఉన్నత చదువు చదువుకొని పురుషులకంటె గొప్ప అనిపించుకునే స్త్రీలలో కొద్దిశాతం మంది సంఘానికి, దేశానికి పాటుపడటం ప్రత్యేక విషయమనీ, మిగిలిన వారికి స్వాతంత్ర్యం, జాతీయత అంటే ఏమిటో సరిగ్గా అర్థంకావటంలేదని తెలిపింది. అందరికీ సామాన్య నియమాలు ఉన్నా స్త్రీలకు, పురుషులకు, పిల్లలకు, వృద్ధులకు విశేష నియమాలు ఉంటాయనీ, స్వాతంత్ర్యం కూడా కొన్ని నియమాలకు లోబడితే అది స్వాతంత్ర్యం అనిపించుకుంటుందని అభిప్రాయ పడింది.

*బాధ్యతాయుతమైన వ్యక్తిస్వాతంత్ర్యం స్త్రీలకు ఉండాలని ఆమెయొక్క ఉద్దేశంగా అర్థం చేసుకోవాలి.*

'స్త్రీలు-సహకారోద్యమం' (జూన్ 1935 గృహలక్ష్మి)ను గురించి పత్రికాధిపులు తెలియజేస్తూ ఆంధ్రదేశంలో మహిళాఉద్యమకర్తలు గ్రంథాలయాలను స్థాపించి సభ్యురాండ్రను చేర్పిస్తున్నారనీ, కొంతమంది క్లబ్బుల్లో టెన్నీసును ఆడుకుంటూ వ్యాయామం చేస్తున్నారనీ, కాని గ్రామాల్లో ఏర్పాటుచేసిన స్వదేశీప్రదర్శనములో పాల్గొని ప్రోత్సహించటంలేదని తెలియజేసింది. రాజమహేంద్రవరము, కాకినాడలలోని మహిళాసంస్కృత విద్యాలయాలు విద్వాన్ తరగతులను

పెట్టి విద్యావంతులను తయారు చేస్తున్నారనీ, కానీ యింకా స్త్రీలు పాశ్చాత్య దేశాలలోవలె సహకార ఉద్యమాలలో పాల్గొనాలనీ స్త్రీలు ముఖ్యముగా పొదుపుసంఘాలను స్థాపించుకోవాలని చెప్పింది. హిందుస్త్రీలు చేయని వృత్తులు లేవనీ, డా.ముత్తులక్ష్మిరెడ్డి, రుక్మిణి, కమలాదేవి, సరోజినీనాయుడు వంటివారు అలాంటివారని తెలియజేసింది. అంగడిసంఘాలు, పరపతి సంఘాలు విద్యా, వైద్య సంఘాలలో పాల్గొనాలనీ, వీటికి స్త్రీ నాయకురాండ్రులై ఉండాలని మదరాసు రాష్ట్రీయ సహకార సంఘసభలో చర్చించటం జరిగిందని తెలియజేసింది.

*నేటి మహిళా స్వయంసంఘాలకు, పొదుపుసంఘాలయొక్క అంగన్ వాడీల క్రయ విక్రయాలకు మార్గదర్శకమైన వ్యాసమిది. అంతేకాక స్త్రీలలో నాయకత్వపటిమను పెంచే దిశగా చైతన్యపరచటం అర్థమవుతుంది.*

చామర్తి భ్రమరాంబ వ్రాసిన 'ఆంధ్ర సారస్వతము-జాతీయాభ్యుదయం' (జూన్ 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశంలోని జాతీయ ప్రబోధం ఆంధ్రోద్యమమున మూర్తీభవించిందనీ, పరిపాలనకై పూర్వరాజులు సామ్రాజ్యాలను ఏర్పరచినా నాటి ప్రజలకు రాజభక్తి తప్ప దేశభక్తిలేదనీ, జాతీయభావము ఉంటేనే సుస్థిర సామ్రాజ్యం ఏర్పడుతుందని తెలిపింది. ఆ జాతీయభావాన్ని ప్రబోధించే సారస్వతాన్ని జర్మనీలు, రష్యా, ఇంగ్లాండు వారు సృజించినారనీ, ఆలస్యంగానైనా భారతదేశంలో వంగరాజ్య విభజనతో జాతీయోద్యమం ప్రబలమయి ఆత్మగౌరవాన్ని పెంపొందించే ఉత్తమ సారస్వతం సృజింపబడిందనీ, జాతిలోని వీరరస పూరితులైన వారి ప్రశంస జాతీయ ప్రబోధానికి స్ఫూర్తిని ఇవ్వగలుగుతుందని తెలియజేసింది.

*జాతీయత్వం ప్రబోధించే స్త్రీల సాహిత్యం కూడా అవసరమని భావించారు.*

సుశీలాదేవి వ్రాసిన 'ఆంధ్రరైతాంగ విద్యాలయం' (జులై 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో రైతాంగ విద్యాలయంలో స్త్రీలు చేరుతున్నారనీ, దేశానికి స్వరాజ్యం రావటానికి కృషిచేస్తున్నారనీ, భారతమాత రక్షణ కొరకు పురుషులు పట్టించుకోకపోయినా స్త్రీలు పట్టించుకోవటం తప్పుకాదనీ, స్త్రీలు చేయగలిగేది చాలాఉందనీ, స్త్రీలు, రైతురక్షకులుగా ఉన్నారని తెలిపింది. వ్యవసాయ విద్యతో పాటు దేశము నందలి ఆర్థిక, రాజకీయపరిస్థితులను స్వాతంత్ర్యోద్యమ చరిత్రనుకూడా బోధిస్తే స్వరాజ్య పిపాస ఏర్పడుతుందని భావించింది. రష్యాలోవలెకాక గాంధిఏర్పరచిన పునాదిపై దౌర్జన్య రాహిత్యంతో కూడుకొనిన సాంఘికవాదంతో పూంజీదారులను(పెట్టుబడిదారులు) పడద్రోసి కార్మిక కర్షకుల సౌధాన్ని నిర్మించవచ్చునీ, నూతనఆర్థికవ్యవస్థను ఏర్పరచుకోవచ్చని చెప్పింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఎన్.జి. రంగా బోధనచేస్తున్నా మిగతావిషయాలన్నీ అతని భార్య భారతీదేవి చక్కబెట్టినట్లు తెలుపుతూ ఆంధ్రరైతాంగవిద్యాలయం గురించిన విషయాలు తెలియజేసింది.

*సాధారణ చదువులేకాకుండా వ్యవసాయం వంటి ఉన్నతవృత్తివిద్యలను స్త్రీలు నేర్చుకుంటూ స్వరాజ్యపోరాటపు దృక్పథాన్ని అలవర్చుకున్న విషయం అర్థం అవుతుంది. భారతస్వాతంత్ర్య సంగ్రామంలో స్త్రీలు రైతులుగా మారగలిగేటట్లు చేసే విద్యను అభ్యసించటమేగాక, కర్షకులను*

*నడిపిస్తూ స్వాతంత్ర్య సాధనలో దేశఆర్థికాభివృద్ధిలో కర్షకుల భాగస్వామ్యాన్ని గుర్తించటమే స్త్రీలు సాధించిన ప్రగతిగా భావించవచ్చు. భర్తకు స్వరాజ్య చైతన్యం లేకపోయినా భార్యలు స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములు కావచ్చునీ, కార్మిక, కర్షక శ్రేయస్సుకై నూతన ఆర్థిక విధానం గల సోషలిస్టిక్ ప్రభుత్వం రావాలని భావించింది. 'కార్మికులారా, కర్షకులారా–ఏడవకండేడవకండీ–వస్తున్నాయ్, వస్తున్నాయ్ జగన్నాథుని రథచక్రాలు వస్తున్నాయ్' అనే శ్రీశ్రీ కవిత గుర్తుకు వస్తుంది.*

ఆచంట సత్యవతమ్మ 'ఆంధ్రనారీమణులకు కొన్ని సలహాలు' (జూన్ 1937 గృహలక్ష్మి) అని వేమగిరిలో (రాజమండ్రి తాలుకా) చేసిన మహిళాసభ అధ్యక్షోపన్యాసంలో అఖిలభారత మహిళా సభ హూణభాషలో (ఆంగ్లభాష) జరుగుతుంది కాబట్టి దానికోసం రాష్ట్రాలవారిగా ఏటేటా సభలు పెట్టి విద్యావంతులైన స్త్రీలు తమకు కావల్సిన హక్కులను, వాటి దిద్దుబాటును తెలియజేస్తూ నివేదికలు తయారుచేసి అఖిలభారత మహిళాసభలకు పంపుతున్నారనీ, రాష్ట్రీయ, జిల్లా, తాలుకా, గ్రామ స్థాయిలో సభలు ఏర్పాటుచేసి స్త్రీలను విజ్ఞానవంతులను చేస్తేనే మహిళాభ్యుదయం జరుగుతుందని భావించింది. స్త్రీ విద్యాసంస్థలు పట్టణాలలోనే తక్కువగా ఉన్నాయని మరి పల్లెల్లో బాలికాపాఠశాలలైనా లేవనీ, కాబట్టి చదువుకున్న స్త్రీలు పల్లెల్లో విద్యాబోధన చేసి స్త్రీల అభ్యుదయానికై వారు తమ వ్యక్తిస్వాతంత్ర్యాన్ని నిలబెట్టేందుకైనా హక్కులను తెలుసుకునేటట్లు చేయాలని తెలియజేసింది. అంతేకాదు గృహిణులు చేతి విద్యలు నేర్చుకొని చిన్న చిన్న అలంకరణ వస్తువులను తయారుచేసి ద్రవ్యార్జన చేయాలనీ, శారదాచట్టం అమలు జరిగేటట్లు చేసి ప్రౌఢవివాహాలు జరిగేటట్లు చూడాలనీ, దేశసేవ చేయాలనుకునే స్త్రీలకు నిర్బంధ వివాహం చేయాల్సిన అవసరంలేదుగాని దుర్బలలైన వితంతువులకు పునర్వివాహాలు చేయాలని చెప్పింది. దేశముఖ్ గారు పెట్టిన హిందూ స్త్రీల వారసత్వబిల్లును ఫలవంతం చేసేందుకు కృషిచేయాలనీ, దేశప్రజలకు కావలసిన సబ్బులు, నూనెలు, పళ్ళపొడులు తయారుచేయాలనీ, రాట్నాల మీద దారాలుతీసి మగ్గాలమీద బట్టనేయించాలనీ, బిస్కట్ల తయారీచేయాలనీ గ్రామాలలో పారిశుద్ధ్యం, అస్పృశ్యత నివారించాలనీ, స్త్రీలకు గౌరవం ఉండేటట్లు చూడాలని తెలియజేసింది.

ఈమె 'నేటి విద్యాపాటవము' (జూలై 1935 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ నాడున్న హూణ విద్యతో వారి వేషభాషలను అనుకరిస్తున్న వారిలో స్వజాత్యాభిమానం, జాతీయత తగ్గిందనీ, విదేశీవిద్యతో సృష్టించే సాహిత్యంలో స్త్రీని అపవిత్రంగా, అశ్లీలంగా వర్ణిస్తూ భారత స్త్రీల గౌరవాన్ని తగ్గిస్తున్నారనీ పేర్కొంది.

ఈమెయే వ్రాసిన 'ప్రజాహితులుకాని పెట్టుబడిదారులు' (మార్చి 1938 గృహలక్ష్మి) అనే మరొక వ్యాసంలో ధనవంతుడైన పెట్టుబడిదారుడు వ్యాపారపు సంస్థను స్థాపించి అస్వతంత్ర్యపు ప్రజల కూడును పడగొట్టి విదేశీ మిల్లు రహస్యములను గ్రహించి వందమంది పనిని ఒక్క మిషన్ చేత చేయిస్తున్నారని తెలియజేసింది. అంతేకాదు దున్నటానికి, విత్తనాలు చల్లడానికి, నీళ్ళుపెట్టటానికి మరలను ఉపయోగిస్తూ రైతుకూలీలకు పనిలేకుండా చేస్తున్నారనీ, దంపుడుబియ్యం బదులు తెల్లబియ్యం తినేటట్టుచేసి ప్రజలు అనారోగ్యం పాలయ్యేటట్లు చేస్తున్నారని భావించింది.

పైగా కుట్టుమిషన్, అప్పడాలపిండిమర, గ్యాసుస్టౌవులు, ఎలక్ట్రిల్ దీపాలు, శరీర శ్రమ లేకుండా నూతినుండి నీళ్ళు వచ్చే మోటారులు, గడపలకు లక్కరంగులు, బెడ్ కాఫీలు ఎక్కువై శరీరం పెరిగి స్త్రీలు ఆయాసం పడుతున్నారనీ, దానికి విరుగుడుగా స్త్రీవిద్యావిధానంలో రాట్నపరిశ్రమను ఏర్పాటుచేసి స్వంత బట్టలునేయించి, వస్త్రాలకై విదేశాలకెళ్ళే డబ్బును ఆదాచేయవచ్చని తెలిపింది. పెట్టుబడిదారుల స్వార్థపరత్వాన్ని అణగద్రొక్కటానికే సోషలిజం వచ్చిందని చెప్పింది. అందుకే యూరప్ సోషలిస్టు ఉద్యమాన్ని ఆరంభించిందనీ, ప్రజలు తమ సోమరితనాన్ని తగ్గించుకొని చేతివిద్యలను ఆదరించి గాంధీమహాత్ముని సాత్వికతను ఆదర్శంగా గ్రహించి పెట్టుబడిదారులకు అవకాశం లేకుండా చేయాలని తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'అభ్యుదయానికి అవసరమైన రచనావిధానం' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో సాంఘిక యిబ్బందులు తొలగించుకొనేటట్టు చేసి జ్ఞానాన్ని ఇచ్చే రచనలు రావాలనీ, హిందూ స్త్రీలకు వారసత్వపు హక్కులేదు కాబట్టి వారు సౌఖ్యవంతంగా జీవించే నేర్పును, నిర్వహణశక్తిని ఇచ్చే రచనలు రావాలనీ, స్వాతంత్ర్యేచ్ఛ, రాష్ట్రాల యొక్క ఆదాయ, వ్యయ విమర్శ, దేశచరిత్రలను తెలిపే రచనలు రావాలనిభావించింది. తాతలనాటి పాతశాస్త్రాలను పట్టుకుని చేసే దురాచారాలను ఖండించే రచనలు, శౌర్య, ధైర్య, విజ్ఞానాన్ని వొసగే రుద్రమ, ఝాన్సీ, ఖడ్గతిక్కన్న భార్య, దుర్గావతి సంయుక్త వంటి స్త్రీల చరిత్రను తెలపాలనీ, దేశ సేవికలుగా జీవించాలని తెలియజేసింది. స్త్రీలు మంచి చెడ్డలను తెలుసుకొని జ్ఞానవంతులు కాగలిగే రచనలు రావాలనీ, యుక్తి, యుక్తము సత్యములైన స్త్రీ రచనలు రావాలనీ, బీదలకు సహయంచేసే విద్యావిధాన ఆవశ్యకతను తెలియచేసే రచనలు కూడా రావాలని అభిప్రాయపడింది.

ఈమె వ్రాసిన 'సాంఘిక దురాచారములు వాటి దిద్దుబాట్లు' (సెప్టెంబరు 1939 గృహలక్ష్మి) అనే ఇంకొక వ్యాసంలో శాసనాలతోనే గాక ఆత్మసంకల్పం కూడా మిళితమైతేనే సాంఘిక విప్లవం వచ్చి దురాచారాలు రూపుమాపబడతాయని తెలియజేసింది. స్త్రీలకి పురుషసమానమైన విద్య కావాలనీ, స్త్రీలు ఉన్నత చదువులు చదువుకొంటేనే, జీవితవిమర్శనం చేసుకుంటూ పెడదారిన బడకుండా స్వేచ్ఛతో ఉంటారనీ, జాతీయతతో కూడిన విద్యనేర్చుకోవాలనీ, చేతివిద్యలు, సంగీత సాహిత్యాలేకాక గౌరవానికి ఇంగ్లీషు, పురాణపఠనం, సంగీతం, జాతీయతకు హిందీ నేర్చుకోవాలని భావించింది. అంతేకాక ధూమపానం, త్రాగుడు, కాఫీలు పురుషులు తగ్గించుకోవాలనీ, వర్ణభేదం ఉండకూడదనీ, శారదాచట్టం అమలుచేస్తూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలనీ, వరశుల్కం, కన్యాశుల్కాలు ఉండకూడదనీ, బహుభార్యాత్వం నిర్మూలించాలనీ, వితంతు వివాహాలు జరగాలనీ, అస్పృశ్యత నివారింపబడాలని పిలుపునిచ్చింది. వ్యభిచారంఅనే సంఘమూల క్రిమిని నశింపజేస్తేనే భారతీయ పవిత్రత నిలబడుతుందని భావించింది. కాబట్టి సంఘంలో విధినిషేధాలుంటేగానీ దురాచారాలు నిర్మూలింపబడవని ఆచంట సత్యవతమ్మ అభిప్రాయపడింది.

*ఆర్థికవిషయాల పరిజ్ఞానం స్త్రీలకు అవసరమని భావించింది. ప్రతివ్యవస్థలోని కుటుంబాలకు, సామాజికాభివద్ధికి, స్త్రీలప్రగతికి ఆర్థికవ్యవస్థ మూలమని భావించింది. స్త్రీలకున్న ఆర్జనావకాశాలను తెలుపుతూ స్త్రీలు దేశఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు కావాలని దానికై చట్టాలయొక్క పరిజ్ఞానం కావాలని కోరుకోవటం స్పష్టమైంది. రాష్ట్రాలలోని ఆదాయ, వ్యయపట్టికకు సంబంధించిన పెట్టుబడిదారీ వ్యవస్థయొక్కతత్వాన్ని చక్కగ విశదీకరించింది. ఆ నాడున్న పారిశ్రామిక యాంత్రీకరణ ప్రభావంతో చిన్నపరిశ్రమలు అనాదరణకు గురిఅవుతున్నాయనీ, అదే చిన్న పరిశ్రమలను అభివృద్ధిచేయగలిగితే బీదలు అభివృద్ధిచెందుతారని తెలియజేసి, పారిశ్రామికీకరణ తెచ్చిన వర్గబేధాన్ని గుర్తించేటట్లు చైతన్యపరచింది. దీనికి కొనసాగింపుగా వచ్చిన ఆర్థికపెట్టుబడి దారులు, మార్కెట్ శక్తుల విజృంభణమే ప్రపంచీకరణంగా విరాజిల్లటం తెలిసిన విషయమే. రచయిత్రి క్రాంత దర్శనంతో నేటి ప్రపంచీకరణ స్వభావాన్ని ముందే స్పష్టం చేయగలిగింది. స్త్రీలు సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగటానికి కావల్సిన రచనలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించటం జరిగింది. స్త్రీల సమస్యలు తీరేవిధంగా స్త్రీలకు గౌరవం కలిగేటట్లును, బీదరికాన్ని పోగొట్టేటట్లును సమాజాన్ని మార్పుచేయగల స్త్రీల అభ్యుదయరచనల అవసరాన్ని గుర్తించటం జరిగింది. స్త్రీపురుషసమానత్వానికై చట్టంతోకాక ప్రజలు ఆత్మసంకల్పంతో సాంఘిక దురాచారాల్ని రూపుమాపాలని ఆచంట సత్యవతమ్మ భావించింది.*

మల్లాది రాజ్యలక్ష్మి వ్రాసిన 'స్త్రీ బుద్ధి' (ఆగష్టు 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో 'స్త్రీ బుద్ధి ప్రళయాంతకం' అనే మాటలు స్త్రీజనశ్రేయస్సును యిష్టపడని పురుషులు పుట్టించారనీ, ప్రజాస్వామ్యంలో ఆ నానుడిని వాడి స్త్రీలోకాన్ని అవమానపరుస్తారనీ, రామాయణ, భారతాదులలో పురుషుల రాజ్యకాంక్ష, మదోన్మత్తతవల్లనే యుద్ధాలు జరిగాయి కానీ స్త్రీల వల్లకాదని తెలిపింది. గాంధారి, తారవంటి శాంతిప్రియులైన పాత్రలను తలచుకోమనీ, అహల్యాబాయి, నూర్జహాను, ఝాన్సీలక్ష్మి, విక్టోరియా, తిరువాన్కూరు రాణివంటివారు చేసిన సత్పరిపాలన వల్ల రాజ్యాభివృద్ధి జరిగిన విషయాన్ని గుర్తుంచుకొని 'స్త్రీ బుద్ధి' గొప్పదని భావించాలనీ, స్త్రీలకు గౌరవాన్ని ఇవ్వాలని ప్రతిపాదించింది.

*స్త్రీలను గౌరవించగలిగితే స్త్రీలు దేశభవిష్యత్తును కాపాడగలరని అర్థం అవుతుంది.*

అయితం హైమావతమ్మ 'స్త్రీ యెట్టి విద్య నేర్వవలయును' (సెప్టెంబరు 1935 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ పాతివ్రత్యానికి వ్యతిరేకవిద్య నేర్చుకోకూడదనీ, తన దేశగౌరవము, దేశాచార సాంప్రదాయములను నిలుపుకొనుచూ మాతృభాషయందు అభిమానం కలిగి ఉండాలనీ, రాజభాషను నేర్చి దానియందలి విజ్ఞానాన్ని తెలుసుకోవాలనీ, పరదేశభాషా వేషధారణలు గొప్పవికావని తెలిపింది. మన సాంప్రదాయాలననుసరించి పరదేశాలకెళ్ళినా మనదేశగౌరవాన్ని కాపాడుకొనే శక్తిలేని విద్య అనవసరమనీ, స్వదేశీ కళ్యాణార్థమై పరభాషలను నేర్చుకోవాలనీ, నవీననాగరికత వ్యామోహం లేక జాతీయత్వాన్ని నిలుపుకునే విద్యను స్త్రీలు నేర్చుకోవాలని తెలియచేసింది.

*భారతీయ సంస్కృతిని కాపాడుకోవటంలోనే భారత జాతీయత ఉంటుందని భావించింది.*

బి.రాజమ్మ 'స్త్రీలు-వ్యాయామ విహార స్థలములు' (సెప్టెంబరు 1935 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ ప్రతి పట్టణమందు స్త్రీలకు వేరుగా వ్యాయామ విహార స్థలములుండవలయునని, శరీర వ్యాయామక్రీడలు, వార్తా పత్రికల పఠనం, మత, సాంఘిక, రాజకీయ ఉపన్యాసములను జరపాలని తెలిపింది. అయితే స్త్రీలకు ప్రత్యేక ధర్మాలున్నాయనీ, ఆ ధర్మాలను కూడా పాటిస్తూ స్వాతంత్ర్య వాంఛను కోరువారు చేతిపనులు నేర్చుకోవాలనీ, స్త్రీలు క్లబ్బులకు వెళ్ళటంకంటే కూడా యింటిపని, శిశుపోషణ ముఖ్యమనీ, స్త్రీలను బంతియాటలో పత్రికాపఠనంలో నవనాగరికులుగా చేసినచో దేశం అభివృద్ధి చెందుతుందని తెలియజేసింది.

*స్త్రీలు పుస్తకపఠనంతో పాటు వ్యాయామాన్నికూడా ఆచరణలో పెట్టాలని తెలియచేస్తూ ఇంటిపనులతో పాటు వ్యాయామాన్ని చేయటం ఒక ప్రత్యేకమైన విషయమని గుర్తించారు. దేశాభివృద్ధికై స్త్రీలు వ్యాయామవిద్యలను అభ్యసించాల్సిన అవసరం ఉందని రచయిత్రి భావించింది.*

బాపట్లలో జరిగిన 'స్త్రీ హితైషిణీ మండలి' లో జరిగిన సభా నివేదికను, (సెప్టెంబరు 1935 గృహలక్ష్మి) కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసిందనీ, జులై 13, 14 వ తేదీలలో ఉన్నవ లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగిందనీ, ముందుగా వెలగపూడి సరస్వతమ్మ మాట్లాడుతూ ఉన్నవ లక్ష్మీబాయమ్మగారి సంఘసేవ, త్యాగశీలత, సంఘసంస్కరణాసక్తిని స్త్రీజనాభ్యుదయ చింతను ప్రశంసించినదని తెలిపింది. తరువాత మండలి కొరకై ప్రత్యేకంగా తనచే రచింపబడిన పతాకాన్ని చేదాల్చి పతాక గీతాలను బాలికలు ఆలపించారనీ, పిమ్మట స్త్రీసమాజాల ఆవశ్యకతను స్త్రీలు గుర్తించాలని వివిధ ప్రయోజనాలుగా స్త్రీవిద్య, స్త్రీల వారసత్వహక్కులు, గృహనిర్వాహకత్వం గురించి ఉపన్యాసాలిచ్చారని తెలియజేసింది. డి.భారతీరాజ, వెన్నా అనంతరామమ్మ వ్రాసి పంపిన పద్యాలుచదివారనీ, హిందీ భాషాప్రయోజనాన్ని గుర్తించి వజ్రమ్మ గారు వ్రాసిన 'పెండ్లి చేయమ'నే హాస్య ప్రహసనాన్ని బాలికలు ప్రదర్శించారని తెలియజేసింది. ఆ సభలో పురస్త్రీలు అసంఖ్యాకంగా పాల్గొన్నారని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

'సభలు-నివేదికలు' (సెప్టెంబరు 1935 గృహలక్ష్మి) అని ఈమె వ్రాసిన వ్యాసంలో 'స్త్రీహితైషిణీ మండలి' లోని సభలో స్వీయపరిచయం చేసుకున్న వెన్నా అనంతరామమ్మ ఉపన్యసిస్తూ బాపట్లలో తాను కాలుమోపగనే కనుపర్తి వరలక్ష్మమ్మ స్థాపించిన స్త్రీహితైషిణీ మండలి అనే స్త్రీసమాజం యొక్క వివరాలు తెలిసాయనీ, ప్రతి సోమ, శుక్ర వారాలలో పురస్త్రీలు పత్రికాపఠనం చేస్తారనీ, సారస్వత విషయాలు చర్చిస్తారనీ, పురాణశ్రవణం ఉంటుందని తెలియ జేసారని చెప్పింది. తాను సోమవారం నాడు వెళ్ళగా స్త్రీ హితైషిణీ మండలిలో పత్రికాపఠనంలో భాగంగా రాజ్యాంగ విషయాలు బోధిస్తున్నారనీ 'శారదాలేఖలను' వ్రాసిన కనుపర్తి వరలక్ష్మమ్మ స్త్రీలను విద్యావంతులను చేసేవిషయం అధికమయిందనీ, స్త్రీలు పైకిరావటానికి తగిన జ్ఞానాభివృద్ధిని ఈ మండలి కలిగిస్తోందని చెప్పింది. ప్రాచ్య, పాశ్చాత్య విషయ సమ్మేళనంతో చెప్పగల సమర్థతతో మండలిని నిర్వహిస్తున్నారని తెలిసిందనీ, స్త్రీ సమాజాలలో స్త్రీ హితైషిణీ మండలి మిన్న అని వెన్నా అనంతరామమ్మ ఆ సభలోని తన ప్రసంగంలో పేర్కొనటం జరిగింది.

*కనుపర్తి వరలక్ష్మమ్మ చేస్తున్న సారస్వత సేవతోపాటు స్త్రీజనోద్ధరణకై 'స్త్రీహితైషిణీ మండలిలో పత్రికా పఠనం చేయిస్తూ స్త్రీవిద్యను అభివృద్ధిచేయటం అనేది సాంఘిక ప్రయోగశాలలో ఆచరణాత్మక సాంఘిక సేవకు ఒక సాహిత్య నిదర్శనం' ఈ వ్యాసం.*

'ఉపన్యాసము' (సెప్టెంబరు 1935 గృహలక్ష్మి) అనే శీర్షికన ప్రచురితమైన వ్యాసంలో ఉన్నవ లక్ష్మీబాయమ్మ స్త్రీహితైషిణీ మండలి యొక్క చతుర్థవార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించి చేసిన ఉపన్యాసంలో అభివృద్ధిలో విదేశీస్త్రీలవలె భారతదేశ స్త్రీలు మేల్కొనటం లేదనీ, అభివృద్ధికి మూలం విద్య అనీ, దాని వలన లోకజ్ఞానం, లోకానుభవం కలుగుతుందనీ, స్త్రీ జాతిని దుర్భరపార తంత్ర్యము నుండి తొలగించుటకు స్వతంత్ర జీవనాధారమే ముఖ్యసాధనమని చెప్పింది. స్త్రీలకు తల్లిదండ్రుల ఆస్తిలో భాగం లేకుండా చేయటంతో వివాహమే జీవనాధారమైందనీ, ఆస్తి నుండి కొంతభాగాన్ని యిస్తే స్త్రీలు చదువుకోవటానికి, స్వంతంత్ర జీవనాధారానికి అవకాశం ఉంటుందనీ, గృహ నిర్వహణచేసే భార్యకు ప్రత్యేకసంపాదన లేకపోతోందని తెలిపింది. భర్త సంపాదనలో ఆమెకు భాగం ఉండాలనీ, స్త్రీ విద్యావంతురాలైతే దేశానికి సంఘానికి ఉపయోగ పడుతుందనీ, గృహ ధర్మములను మరింత సమర్థతతో నెరవేర్చగలదనియు, విద్యవల్ల ఉన్నత భావాలు ఏర్పడి ధైర్యసాహసాలను ఆచరణలో పెట్టగల శక్తి ఏర్పడుతుందని ఆమె తెలియచేసింది.

*ఆర్థికహక్కు స్త్రీలకు స్వతంత్రాన్ని కల్గిస్తే వారు ధైర్యసాహసాలతో ముందడుగు వేసి దేశస్వాతంత్ర్యానికి కృషి చేయగలరని భావించింది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ ఏలూరు నందలి 'శ్రీలక్ష్మి సేవాసదనము' (నవంబరు 1935 గృహలక్ష్మి) యొక్క వార్షికోత్సవ సభలో ఉపన్యసిస్తూ నూటికిద్దరికంటే స్త్రీలు చదువుకోవటం లేదనీ, స్త్రీవిద్య ఉద్యోగం కొరకే కాదనీ, మాతృస్థానమునందున్న స్త్రీలు చదువుకుంటే బాలబాలికలను విద్యావంతులను చేయగలుగుతారని చెప్పింది. మూఢనమ్మకాలు, మూఢాచారాలు ఉండటంతో స్త్రీలకు చేతిపనులు రాక వారు స్వయంపోషకత్వం, స్వతంత్ర జీవనం లేక ఉన్నారనీ, కాయకష్టం లేకుండా పరులమీద ఆధారపడకూడదనీ, స్త్రీలకు నీతి, విజ్ఞానం, సేవా ప్రయత్నం అలంకారాలుగా ఉండాలని తెలిపింది. స్త్రీలు సేవాసదనాలను ఏర్పరచి పత్రికాపఠనంతోపాటు ఖగోళ, భూగోళ, చరిత్ర, భౌతిక శాస్త్రముల వంటి వివిధ విషయక జ్ఞానాన్ని తోటిస్త్రీలలో కల్గించాలనీ, స్త్రీల అభ్యుదయమే దేశాభ్యుదయమనీ, రాబోయే రాజ్యాంగ సంస్కరణలవల్ల స్త్రీలు తమహక్కులను, అధికారాలను స్వతంత్రంగా స్వసంఘక్షేమకరంగా ఉపయోగించగల సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలియచేసింది.

ఈమె 'తెలుగు నవరాత్రి ఉత్సవాలు' (మే 1936 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ ఆంధ్రులు ఉగాది పండుగ నవరాత్రోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో గత 25 ఏండ్లనాడు ఏర్పడిన ఆంధ్ర ఉద్యమాన్ని తిరిగి పునరుజ్జీవింప జేయాలని తెలిపింది. ఓఢ్రులు, తమిళులు, కర్నాటక

వాళ్ళు ఆంధ్రరాష్ట్ర సరిహద్దులను ఆక్రమిస్తున్నారనీ. యూరప్ ఖండంలో ఏర్పడిన చిన్నస్వతంత్ర రాష్ట్రాలవలె ఆంధ్రరాష్ట్రం ఏర్పడేటట్లుగా గుంటూరులో ఉన్నవ లక్ష్మీబాయమ్మ ఆంధ్రోత్సవాలు జరుపుతున్నారని తెలియజేసింది. అంతేకాదు ఆంధ్రులందరూ జాతి, కుల, మత భేదం లేక అన్యోన్య సహకారాలతో ఆంధ్రఉద్యమాన్ని చేస్తేనే ఆంధ్రభూమి సస్యశ్యామలం కాగలుగుతుందనీ, పశ్చిమాంధ్రులకు నీటి ఎద్దడి పోతుందని చెప్పింది. ఆంధ్రులకు ప్రత్యేక న్యాయస్థానాలు, ఆంధ్రాస్త్రీలకు ప్రత్యేక కళాశాలలు వస్తాయనీ, దానికై కవులు, చిత్రకారులు తమ కళలతో గీతాలు రచించి ఆంధ్రమాత చిత్తరువులను గీసి ప్రజలలో ఆంధ్రోద్యమాన్ని ప్రచారం చేయాల్సిన బాధ్యతను తెలియజేసింది.

ఈమె 'మనసులో మాటలు' (ఆగష్టు 1937 గృహలక్ష్మి) అంటూ వ్రాసిన వ్యాసంలో మహిళోద్యమం ప్రారంభమై పుష్కరం దాటినా పతాకంలేదనీ, మహిళా ఉద్యమానికి చిహ్నంగా పతాకాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందనీ, స్త్రీలకు విద్య డబ్బు, వ్యక్తి స్వాతంత్ర్యం కొరతగా ఉన్నాయి కాబట్టి వాటిని తీర్చుటయే మహిళోద్యమ ఆశయమనీ, ఆ ఆశయం విశదీకరించుటయే మహిళాపతాకానికి ఉండవలసిన లక్షణమని తెలియజేసింది. ఇంకనూ గృహపరిశ్రమలలో భాగంగా, గాంధీ గారి కోటి రాట్నాలు అనే ఉద్యమంలో భాగంగా గృహిణులు రాట్నం వడికి, నూలు తీసి వస్త్రరూపం పొందేటట్లు చేయాలని చెప్పింది. అవసరమైతే నూతనంగా నిర్మించిన (తయారుచేసిన) కదరు, దిండు, చెవులు వడిదారాన్ని ఉపయోగించుకుంటూ స్వదేశీ వస్తూత్పత్తి చేస్తూ స్త్రీలు తమకు ఆర్థికప్రతిపత్తి కలిగేటట్లు చూసుకోవాలనీ, కాలాన్ని వృథాచేయక సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసింది.

'మనసులో మాటలు' (సెప్టెంబరు 1937 గృహలక్ష్మి) అంటూ ఈమెయే వ్రాసిన మరొక వ్యాసంలో కాంగ్రెసు వారు ఆరు రాష్ట్రాలలో పరిపాలన భారాన్ని చేకొని సమర్థతతో నిర్వహిస్తూ ప్రజాహితకరమైన ఉత్తర్వులు జారీ చేయటంతో స్వరాజ్యమంటే అర్థం అయిందని తెలిపింది. కాని ఈ రాష్ట్రీయస్వాతంత్ర్యం కంటె పూర్ణస్వాతంత్ర్యమే లక్ష్యంగా పనిచేయాలనీ, ఇది గ్లోబును చూపించి స్వాతంత్ర్యం అని చెప్పటం వంటిదనీ, ఖజానాకొట్టు తాళం చెవులు గవర్నరు చేతిలోనే ఉంచటంతో, మంత్రులు తడుముకొనే స్థితిలోనే ఉన్నారని తెలియజేసింది. బలవంతులైన జమీందారుల నోడించి కాంగ్రెస్ అధికారం చేపట్టినా మదరాసురాష్ట్రం స్త్రీలను మంత్రిణులుగా చేయలేదనీ, డా. ముత్తు లక్ష్మీరెడ్డికి డెప్యూటి ప్రెసిడెంట్ పదవినిచ్చి ప్రజామోదాన్ని పొందిందనీ, ఆరు కాంగ్రెసు రాష్ట్రాలలో విజయలక్ష్మిపండిట్ కి మాత్రమే మంత్రిణిపదవి దక్కిందని తెలియజేసింది. అంతేకాదు కాంగ్రెసు సభ్యులు స్త్రీల సమస్యలను పరిష్కరిస్తూ స్త్రీ విద్య, ఆరోగ్యం, ఆర్థికాధికారం, మత సాంఘిక హక్కులను స్త్రీలకు కల్పించటానికి శాసనకర్తల దృష్టికి తీసుకువెళ్ళి ఉపకారం చేయాలని భావించింది. భారతదేశంలో రాష్ట్రీయ స్వాతంత్ర్యంలో స్వేచ్ఛలేదనీ, రాష్ట్రీయ స్వాతంత్ర్యంలో స్త్రీలకు మంత్రి పదవుల్లో సమాన భాగస్వామ్యం లేదనీ, స్త్రీలు శాసన సభ్యురాండ్రుగా

ఎన్నిక కాబడి స్త్రీలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, వైద్యం, ఆర్థికాధికారం, మత సాంఘిక విషయాలలో కృషి చేయగలిగేవిధంగా స్త్రీలకు స్వాతంత్ర్యం కావాలన్న విషయాన్ని శాసనకర్తల దృష్టికి తీసుకువెళ్ళాలని తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'కృషితో నాస్తి దుర్భిక్షం' (డిసెంబరు 1937 గృహలక్ష్మి) అనే మరొక వ్యాసంలో బాపట్లలోని మహిళాసభను తలచుకుంటే ఆశ్చర్యం, ఆనందం, ఉత్సాహం కలుగుతోందనీ స్త్రీజనాభివృద్ధికై ఈ సభలు పూనుకుంటున్నాయనీ, గ్రామ, తాలూక స్థాయినుండి దేశం మొత్తంమీద స్త్రీలకు సంబంధం ఉండటానికి అఖిలభారత మహిళాసభలు వచ్చాయని తెలిపింది. స్త్రీలలో ఇప్పుడిప్పుడే అభ్యుదయ తేజస్సు పొడచూపుతోందనీ, స్త్రీలకు రాబోయే రాజ్యాధికారం గానీ, హక్కు గాని కేవలం మహిళాసభలలోని తీర్మానాల వల్లనేననీ, మహిళాసభలలో స్త్రీవిద్య, సాంఘిక సంబంధాలను గురించి చర్చలు జరుగుతున్నాయని తెలియజేసింది. అంతేకాదు భారతదేశము జనాభాలో సగంగా ఉన్న స్త్రీలలో నామతం, నాసంఘం, నాభాష, నాహక్కులు, నాదేశం అనే అభిమానం ఉంటేనే యేజాతికైనా అభ్యుదయం ఉంటుందనీ, స్వదేశీవస్తు వినియోగానికి దేశసౌభాగ్యానికి సంబంధం ఉందనీ, స్త్రీలలో విద్యావిషయంలో ఉదాసీనత పోతేనే సస్వరూప జ్ఞానం కలుగుతుందని తెలియజేసింది.

'సమాజం సాధించనిదేదీ లేదు' (మార్చి 1938 గృహలక్ష్మి పత్రిక) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ విద్యకు దూరమై విజ్ఞానం కొరతయై మతస్వాతంత్ర్యంలేక సంఘగౌరవం గాని ఆర్థికసౌకర్యం గాని లేక అధఃపతితమైయున్న స్త్రీలను ఉద్ధరించటమే స్త్రీసమాజాల ముఖ్యోద్దేశమని తెలిపింది. స్త్రీసమాజాలలో, స్త్రీలవోటింగ్ హక్కు, శారదాచట్టం, స్త్రీలహక్కులకు సంబంధించి దేశముఖ్ గారిబిల్లు, స్త్రీపురుష సమాన హక్కులకై తీర్మానాలు చేయబడ్డాయనీ, గ్రంథాలయాలు, పఠనమందిరాలు, వయోజనవిద్య, చేతిపనులవంటి ఆర్థికపరమైన ఉపాధి మార్గాలను స్త్రీసమాజాల ద్వారా బోధించవచ్చని తెలియజేసింది.

'మనసులో మాటలు' (జూన్ 1938 గృహలక్ష్మి) అంటూ ఈమెయే వ్రాసిన ఇంకొక వ్యాసంలో 'శారదాబిల్లు' మళ్ళీరావటం అనే మాటలు ఏమిటంటా అని ప్రశ్నవేస్తూనే శారదాబిల్లు ఆచరణలో పెడ్తున్నందుకే భయంతో తల్లిదండ్రులు రజస్వలకాక ముందే ఏ మారుమూల ఊళ్ళోనో, కొంపలోనో, అర్థరాత్రివేళో నిద్రపోతున్న పసిబిడ్డలకు రహస్యంగా రెండుమంత్రాలు చదివి పెళ్ళిళ్ళు చేస్తున్నారనీ, మంత్రాలేమిటని అడిగితే సత్యనారాయణస్వామి వ్రతమని అసత్యాలు పలికి మరీ పసిబిడ్డలకు పెళ్ళిళ్ళు చేస్తున్నారని తెలిపింది. ఇటువంటి బాల్యవివాహాలలో తల్లులు పసిపిల్లల్ని పమిటకొంగులో దాచిపెట్టి మరీ పెళ్ళిళ్ళు జరిపిస్తున్నారని తెలియజేసింది. అంతేకాక ఆంగ్లవిద్య, డబ్బు ఉన్న వరుడికి వరకట్నం యిచ్చేదురాచారం ప్రబలిందనీ, వరుడితోపాటు ఆతనితల్లి తోబుట్టువులకూడా శుల్కాన్ని స్వీకరించి అధికారులుగా మారారనీ, అందుకే బీహార్‌లో వరకట్న నిషేధపు బిల్లును ప్రవేశపెట్టారని చెప్పింది. ప్రజలు తమ వివేకంచేత సవరించుకోవాల్సిన

లోపాలకు రాజశాసనాలు అవసరమవటం సిగ్గుచేటయిన విషయమనీ, అయినా మద్రాసు శాసనసభకూడా ఇటువంటి బిల్లునుపెట్టి చట్టంచేయాలనీ భావించిందని తెలియచేసింది.

'స్త్రీలు పత్రికా రచన' (సెప్టెంబరు 1938 గృహలక్ష్మి) అనే శీర్షిక ఈమె వ్రాస్తూ స్త్రీలు అభివృద్ధి చెందాలంటే పత్రికా పఠనం అవసరమనీ, స్త్రీలే పత్రికా విలేఖరులుగా ఉంటే స్త్రీ సమస్యలు బాగా అర్థం అవుతాయనీ, స్త్రీలను అవమానపరిచే వ్రాతలు లేకుండా ఉండాలంటే స్త్రీలు పత్రికా రచనలలో తమ అభిప్రాయాలు వ్రాయగలగాలనీ, 18 కోట్ల భారత స్త్రీలు నిశ్శబ్దంలో ఉండకుండా ఉండాలంటే స్త్రీలు పత్రికా రచనలు చేయాలనీ తెలియచేసింది. శ్రీమతి అనిబిసెంటు 'న్యూ ఇండియా' అనే దినపత్రికను, ఠాగూర్ సోదరి స్వర్ణకుమారీ దేవి బెంగాలిభాషలో 'భారతి' అనే మాస పత్రికను, జ్యోతిర్మయి గంగులుకన్య, కమలా సత్యనాథన్, మాలతి పచ్వర్ద్ మొదలైన స్త్రీలు సామర్థ్యంతో పత్రికలను నడిపారనీ, బాలాంత్రపుశేషమ్మ 'హిందూసుందరి' పులగుర్త లక్ష్మీనరసమాంబ 'సావిత్రి' మాసపత్రిక, 1919 నుండి వింజమూరి వెంకటరత్నమ్మ 'అనసూయ' మాస పత్రికను, కళ్ళేపల్లి వేంకట రమణమ్మ 'ఆంధ్రలక్ష్మి' అనే పత్రికను నిర్వహించారని తెలియ జేసింది. అంతేకాక స్త్రీలకు స్వతంత్రం ఉన్నచోట పురుషులు కూడా ధీశాలురుగా ఉంటారని

*'ఏరాజ్యంబున దరుణులు*
*దార కళాకుశల సుస్వతంత్రులగుదురో*
*ఆ రాజ్యంబున బురుషులు*
*ధీరులు, అధికారులమల ధీ సువిచారుల్' అని తెలియజేసింది*

*కనుపర్తి వరలక్ష్మమ్మ రాబోయే రాజకీయపరిణామాలను ముందుగానే స్త్రీలకు బోధించి, వారిలో రాజకీయ చైతన్యాన్ని పెంచే ప్రయత్నంచేసినట్లుగా అర్థమవుతుంది. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ప్రతిఫలింపజేసే విధంగా మహిళాసమాఖ్యకు ఒక పతాకం ఉండాలని కోరుకొంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమిళుల ఆధిపత్యం, ఆంధ్రప్రాంతంలోని వెనకబాటుతనం కలిసివెరసి ఆంధ్రోద్యమంగా సాగిందనీ, ప్రాంతీయ అంతర్గతస్వేచ్ఛకై దాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని భావించింది.*

*భారతదేశంలో ఆర్థికస్వాతంత్ర్యం లేని రాష్ట్రీయ స్వాతంత్ర్యం వచ్చినా ఉపయోగం లేనట్లే, స్త్రీలు శాసనసభ్యురాండ్రుగా ఎంపికైనా కాంగ్రెస్ పాలనలో స్త్రీలకు మంత్రిపదవులు ఇవ్వనప్పుడు స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం లేనట్లేననీ, పురుషులతో సమానమైన రాజకీయహక్కులు ఉన్నప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉన్నట్లని భావించింది. స్త్రీలకున్న రాజకీయపు హక్కును, బాధ్యతను నిర్దిష్టంగా తెలియచేసింది. సాహిత్యంద్వారా రాజ్యపాలనలో స్త్రీలస్థానాన్ని నిర్వచించి స్త్రీలప్రగతికై శాసనసభ్యత్వాలేకాక స్త్రీలకు మంత్రిత్వాన్ని ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేసింది. భారతదేశంలో స్త్రీలు చదువుకొని రాజ్యపాలనలో మంత్రిత్వ శాఖను నిర్వహించటం గొప్పవిషయమనీ, అటువంటి స్త్రీమంత్రిణుల సంఖ్య ఎక్కువగా ఉండాలని భావించింది. స్త్రీలకు రాజ్యాధికారము రాగలగటానికి స్త్రీసంఘాల కృషియే అంటూ ఆత్మవిశ్వాసాన్ని తెలియజేసింది. స్త్రీల యొక్క సామాజిక,*

*రాజకీయార్థిక హక్కులదిశగా స్త్రీలను ఆలోచింప జేయటంలో స్త్రీసమాజాల పాత్రకున్న ప్రాముఖ్యతను తెలియజేసింది. పితృస్వామ్య వివాహసంస్కృతిలో వరుడి పెళ్ళివల్ల ఆతని కుటుంబ సభ్యులందరూ అధికారవర్గంగా మారినట్టు ఆ నాడే గుర్తించటం ఆశ్చర్యాన్ని కల్గించక మానదు. బాల్యవివాహాల నిషేధం, వరశుల్క నిషేధంవంటి చట్టాలను నిత్యం పఠించాల్సిన అవసరం వ్యవస్థకు ఉందని భావించాలి. వరశుల్కానికి ఆంగ్లభాషా విద్యాధ్యయనం కారణమని భావించింది.*

- *నాడైనా నేడైనా పత్రికాపఠనమే మనుషులను విజ్ఞానవంతులను చేయగలుగుతుంది. స్త్రీలు ఉన్నత విద్యను చదువుకోలేకపోయినా, పత్రికాపఠనం చేస్తే ప్రపంచంలో సాంఘిక, రాజకీయ, ఆర్థికవిషయాలు అర్థమయితే స్త్రీలు ప్రగతి మార్గంలో నడుస్తారనే దానికి నిదర్శనము ఈ వ్యాసం. నాల్గవ తరగతి చదివిన కనుపర్తి వరలక్ష్మమ్మ అన్ని విషయాలపై వ్యాసాలు వ్రాయటమే దానికి నిదర్శనం. అంతేకాక కళాకుశలత్వంగల విలేఖరులుగా స్త్రీలకు స్వతంత్రం ఉంటేనే మార్పు కలుగుతుందని కనుపర్తి వరలక్ష్మమ్మ భావించింది. అటువంటి పరిస్థితులలోనే పురుషులు ధీశాలురవుతారనికూడా కనుపర్తి వరలక్ష్మమ్మ ఒక చురక వేయటం గమనించవచ్చు.*

రాజమండ్రిలో జరిగిన 'మహిళా సాంఘికవిద్యావిషయిక సభ'లో రాజగోపాలన్ సతి యొక్క ఉపన్యాస ప్రచురణలో (నవంబరు 1935 రెడ్డిరాణి పత్రిక) ప్రపంచ పరిణామాలలో నిలబడే అర్హతకై భారతదేశం చేస్తున్న పెనుగులాటలో స్త్రీలకు భాగస్వామ్య బాధ్యత ఉందనీ, సాంఘిక విద్యావిషయంలోని లోటుపాట్లను చక్కదిద్దాలనీ, అస్పృశ్యతాసమస్యను పరిష్కరించాలని చెప్పింది. రాజకీయరంగాలలో స్త్రీలు చొరవ చూపించాలనీ, స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం అవసరమనీ, బాల్యవివాహాలను అరికట్టాలనీ, వ్యభిచారాన్ని రూపుమాపాలనీ, స్త్రీలకు వివాహవిచ్ఛేదనా అధికారం ఉండాలనీ, ఐకమత్యం, స్త్రీవిద్య అభివృద్ధిచెందాలని తెలియజేసింది.

'స్త్రీ ధనము' (డిసెంబరు 1935 గృహలక్ష్మి) అనే శీర్షికన స్త్రీ ధనం గురించిన విషయాలను పత్రికాధిపుల ప్రచురణలో పురాతన సంఘాలలో స్త్రీలు పురుషుల సొత్తుగా భావింపబడేవారనీ, స్త్రీలు బలహీనులు, ఆర్థిక జీవనానికి నిరుపయోగులనే హైన్యభావం తగ్గి నేడు స్త్రీల హక్కులు గుర్తింపబడుతున్నాయనీ, వేదకాలంలో స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండేదని తెలిపింది. వారిలో కొద్దిమంది విద్యావంతులైన స్త్రీలను పేర్కొంటున్నారుగాని స్త్రీ పురుషులకు సమానమైన హక్కులు లేవనీ, వేదాలందలి శ్లోకాలవల్ల భార్య, పుత్ర, దాసులకు ఆస్తిహక్కులేదని అర్థం అవుతోంది. కాని ఇది 'స్త్రీ ధనం' విషయంలో వర్తించదనీ మనుస్మృతి తెలియజేసిందని చెప్పింది. స్త్రీ ధనమంటే పుత్రుడు లేక భర్త మరణిస్తే ఆ ఆస్తి అంతా భార్యకు రావచ్చనీ, తండ్రి తాలుకు ఆస్తి కూడా స్త్రీకి రావచ్చనీ, రెండు రకాల ఆస్తులు వారసత్వమూలంగా ఉండాలని చెబుతారుగానీ, స్త్రీ ధనం స్వతస్సిద్ధమగు జన్మహక్కు అనీ, వివాహాలపడు బంధుమిత్రులు, సోదరులు, తల్లి, తండ్రి ఇచ్చినది స్త్రీధనమని మనుస్మృతి పేర్కొన్నదని తెలియజేసింది. అంతేకాక ప్రథమ భార్యను తప్పించి మరొక

వివాహం చేసుకునేటప్పుడు మొదటి భార్యయొక్క కోపం పోగొట్టటానికి భర్త యిచ్చేది స్త్రీ ధనమనీ శుల్కం రూపంలో ఇచ్చేదని మనుస్మృతి స్త్రీధనాన్ని పేర్కొంది. మితాక్షరకారియగు విజ్ఞానేశ్వరుడు స్త్రీలు తన తెలివితేటలవల్ల ఆర్జించే ధనమును, వారసత్వంవల్ల వచ్చిన ఆస్తిని 'స్త్రీధనమని' పేర్కొన్నాడనీ, మితాక్షరి స్త్రీ పురుషులకు సమానవారసత్వాన్ని పేర్కొని వారసత్వంవల్ల స్త్రీకి వచ్చిన ఆస్తిపై పురుషులకు సంపూర్ణహక్కులేదని పేర్కొన్నదని పత్రిక తెలియజేసింది. మితాక్షరి అభిప్రాయాలను ప్రస్తుతమున్న చట్టాలు పరిగణనలోకి తీసుకోవాలనీ, హిందూన్యాయశాస్త్రంపై అన్ని మతాలలోని స్త్రీలకు సంబంధించిన 'అధ్యగ్ని' అనేది ఉందనీ, అంటే వివాహ సమయమున స్త్రీకి యిచ్చిన సొమ్మును స్త్రీ ధనంగా పేర్కొన్నారని, వితంతువు తన తెలివితేటలతో స్వంతంగా ఆర్జించిన సొమ్మును స్త్రీ ధనమని పేర్కొన్నారని తెలిపింది. మితాక్షరి సాంప్రదాయం పాటిస్తున్న మద్రాసు, బొంబాయి, బెనారస్ ప్రాంతాలవారు వీలునామావల్ల, దానంవల్ల కన్యకు ఇచ్చిన సొమ్మును, వితంతువుకు ఇచ్చిన సొమ్మును స్త్రీ ధనమన్నారు కాని, సంసారంచేస్తున్న స్త్రీ తన చేతివృత్తులతో సంపాదించిన సొమ్ముగానీ, దాని భాగంగానీ స్త్రీ ధనంగా చెప్పలేదని పేర్కొన్నది. కన్యకు వారసత్వంవల్ల వచ్చిన ఆస్తి స్త్రీధనమనీ అది బొంబాయిరాష్ట్ర సాంప్రదాయమనీ, ఉత్తర వారసులతో రాజీచేసుకొనగా వచ్చిన ఆస్తిని వితంతువులకు భరణం క్రింద ఇచ్చేటటువంటిది స్త్రీ ధనమనీ, కన్యగా, వివాహితగా, వితంతువులయొక్క స్త్రీధనాలకు నిర్వచనాలు వేరుగా ఉన్నాయని చెప్పింది. నూతన సమస్య పరిష్కారానికి వీలుగా స్త్రీలకు వారసత్వపు ఆస్తి సంక్రమిస్తుందనీ విజ్ఞానేశ్వరుని సూచనలను అమలులోకి తేవాలనే భావనగా పత్రిక 'స్త్రీధనాన్ని' గురించి పత్రిక స్త్రీలకు తెలియచేయటం జరిగింది.

కె.ఎస్.రత్నమ్మ వ్రాసిన 'స్త్రీల వ్యవస్థ' (డిసెంబరు 1935 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారత జాతీయాభివృద్ధికై స్త్రీలను గౌరవించాలనీ, వివిధ సంస్థానాధిపతుల భార్యలుగా రాణులు స్త్రీల అభివృద్ధికి పాటుపడుతున్నారనీ, మైసూరు దివాన్ గారిభార్య బెంగుళూరు నందు జరిపిన మహిళాసభలో ప్రసంగిస్తూ భార్యలు వేరొకరిని వివాహంచేసుకుంటే ఎటువంటి శిక్ష ఉంటుందో, అదేవిధమైన శిక్షను భార్య ఉండగా వేరొక స్త్రీని వివాహం చేసుకునే పురుషులకు వేసి శిక్షంచాలని ఆ సభలో తీర్మానం చేసినట్లు తెలియజేసింది. అంతేకాక, 16.10.1935 వ తేదిన ఒక జడ్జిగారి భార్యయైన లక్ష్మినరసమ్మ మహిళా విద్యాలయాన్ని స్థాపించిందనీ, ముఖ్యంగా ప్రౌఢస్త్రీ విద్యార్థినులకు విద్యాభ్యాసాన్ని అందిస్తోందనీ, తల్లులు విద్య నేర్చుకుంటే బిడ్డలకు మంచి సంగతులు తెలియజేస్తారని పేర్కొన్నది. అంతేకాదు, దేశరాజకీయాలో భాగంగా స్త్రీని ఓటరుగా పరిగణించాలను కుంటున్నారనీ, చదువుకున్న స్త్రీలు ఓటర్లుగా అవుతారనీ, అప్పుడు స్త్రీలకు ప్రాతినిధ్యం ఉండి, స్త్రీలహక్కులు రక్షించుకునే శాసనాలు, స్త్రీల స్వాతంత్ర్య నిర్వహణమునకు వలయు సాధనములను నిర్మించుకొని స్త్రీజీవనానికి ఔన్నత్యం కల్గించుకొనే అవకాశం వారికి వస్తుందని తెలియజేసింది. స్థానికసంస్థలు, మిషనరీలు విద్యాసంస్థలను నెలకొల్పుతున్నారనీ, దేశంలో ధర్మాత్ములు, విద్యావంతులు ముందుకొచ్చి మరిన్ని పాఠశాలలు నెలకొల్పితే స్త్రీలను అధిక సంఖ్యలో విద్యా వంతులను చేయవచ్చునని చెప్పింది. ఆంధ్రరాష్ట్రీయమహిళాసభ జరిగినట్లుకూడా తెలియజేస్తూ,

ఆ సభలో నిస్సంతులైన హిందూ వితంతువులకు భర్త ఆస్తి వారసత్వంగా భార్యకు సంక్రమించాలనీ, పురుషులతో పాటు స్త్రీలకు పుట్టింటి ఆస్తిలో భాగం ఉండాలనీ, స్త్రీల విషయాలలోవలె పురుషుడింకొక స్త్రీని పెండ్లాడితే శిక్షకు పాత్రుడు అవ్వాలనీ తీర్మానం చేసారని తెలియజేసింది.

*స్త్రీలకు ఆస్తిహక్కును, పురుషునియొక్క బహుభార్యత్వాన్ని ఎదుర్కొనటానికి స్త్రీలు విద్యావంతులు అవటమే కాక రాజకీయాలలోకికూడా రావలసిన అవసరాన్ని తెలియజేసింది. స్త్రీవిద్య, స్త్రీల రాజకీయ, ఆర్థిక హక్కులపట్ల స్త్రీలను చైతన్యవంతం చేయగల వ్యాసమిది.*

కేరళలో జరిగిన 'అఖిలభారత మహిళా సభను' (ఫిబ్రవరి 1936 గృహలక్ష్మి) గురించి పత్రికాధిపుల ప్రచురణలో రాణిసేతు పార్వతీబాయిగారి అధ్యక్షతన సభ జరిగిందనీ, కాశ్మీరము నుండి కన్యాకుమారి వరకు గల వివిధ మండలాల నుంచి మహిళా ప్రతినిధులు వచ్చారనీ, వైద్యులు, న్యాయవాదులు, విదుషీమణులు, సంఘాభివృద్ధికి పాటుపడే గృహిణులు పాల్గొన్నారనీ, స్త్రీలలో జాతీయభావాన్ని మేల్కొలిపి భౌతిక ఆధ్యాత్మిక బలసంపన్నులు కావలిసిన అవసరాన్ని పేర్కొన్నారని పత్రిక తెలియజేసింది. బ్రిటీష్ ప్రభుత్వం క్రింద ఉన్న భారతదేశంలో 3 శాతం మహిళావిద్య ఉంటే కేరళలో 16.8 శాతం స్త్రీ విద్య ఉందని సభ ప్రశంసించింది. అంతేకాక, కొత్త రాజ్యాంగంలో స్త్రీలకు ప్రాధాన్యత ఉండాలనీ, స్త్రీ కార్మికుల కష్టాల నివారణకై సంఘాన్ని నియమించాలనీ, స్త్రీల ఆరోగ్యాభివృద్ధికి పాటుపడాలనీ, భారతీయుల ఐకమత్యానికి హిందీ భాషను దేశభాషగా చేయాలనీ, వృత్తివిద్య ప్రధానంగా గలిగిన బుద్ధివికాసాన్ని వృద్ధిపరచాలనీ, స్త్రీలకు జ్ఞానం, సామర్థ్యం కలిగించాలని సభ భావించింది. ఆస్తి హక్కుకై చట్టాలు చేయాలనీ, గ్రామాభివృద్ధికై గ్రామపరిశ్రమలలో తయారయ్యే వస్త్రములను కొనుక్కొనేటట్లుగా ప్రచారం చేయాలని సభలోనివారు భావించినట్లుకూడా పేర్కొన్నది. స్త్రీల కివ్వబడిన ఎన్నికల హక్కులను, శాసనసభలకు ప్రత్యేక స్థానాన్ని తిరస్కరించకూడదనీ, ఆ హక్కునే వినియోగించుకొని స్త్రీలు శాసనసభా ప్రవేశంగావించి దేశాభివృద్ధికి పాటుబడే తీర్మానాలు చేయాలనీ, సాంఘిక మతభేదాలు లేక స్త్రీలు అంతర్జాతీయ స్త్రీలతో కలసి హక్కులకై పోరాడాలని సభ భావించిందని పత్రిక తెలిపింది. ప్రతి సభ్యురాలు స్వదేశీవస్తువులనే వినియోగిస్తూ సంఘాన్ని ఉద్ధరించటానికి పూనుకోవాలనీ, ప్రతిభారతీయ స్త్రీ కార్యోన్ముఖురాలు కావాలనీ, స్వదేశీ వ్యాపారంలోని కిటుకులు క్రయవిక్రాలకు సంబంధించిన ఆదేశాలను గ్రహిస్తూ, వృత్తివిద్యల వల్ల ఉత్పత్తి రంగాన్ని పెంచుకోవచ్చని, స్త్రీలు నేర్చుకొని ఉత్పాదకతను పెంచాలని ఆ సభలోని వారు భావించినట్లుగా పత్రిక తెలియజేసింది.

*ఆ రోజుల్లోనే స్త్రీలు సభలను ఏర్పాటుచేసుకొని వారి ఆలోచనలను జాతీయస్థాయిలో పెంచుకోవటం అర్థమవుతుంది. స్త్రీవిద్యా ప్రచారణలో స్త్రీలు చేసిన కృషికి ఫలితంగా 1900 సం.లో 1 శాతంగా ఉన్న స్త్రీవిద్య 3 శాతానికి పెరిగిందనికూడా అర్థమవుతుంది. స్త్రీలు విద్యావంతులయితే రాజ్యాంగంలో వారికి ప్రాధాన్యత పెరుగుతుందని భావించటమే రాజకీయాలలో స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి చిహ్నమని భావించారు. అంతేకాక స్త్రీలు తమ హక్కులను*

*వినియోగించుకొనే చైతన్యాన్ని అందిచాల్సిన అవసరాన్ని సభలో చర్చించటం జరిగింది. వ్యాపారరంగ స్థాయిలో ఉత్పత్తి, ఉత్పాదకతను చర్చించుకోవటం స్త్రీల అభివృద్ధికి మచ్చుతునకగా భావించవచ్చు.*

బి. వెంకటలక్ష్మి వ్రాసిన 'గర్భస్రావం చేసుకొను హక్కు ఉండవలెను' (ఫిబ్రవరి 1936, ఆంధ్రభూమి) అనే వ్యాసంలో ఇష్టంలేనప్పుడు గానీ, స్త్రీ తన ఆరోగ్యానికి, ప్రతిష్ఠాభంగానికి గానీ, దారిద్ర్యభయంతో గానీ, గర్భస్రావం చేసుకునే హక్కు ఉండాలని భావించింది.

*స్త్రీల అణచివేతలో ముఖ్యమైనది స్త్రీల లైంగికత అనే భావన ఆ రోజుల్లోనే కలగటంతో స్త్రీల లైంగిక హక్కుకు రక్షణ ఉండాల్సిన భావనను తెలియజేసింది. ఈ 'లైంగికత'యే సామాజిక, రాజకీయార్థిక విషయాలలో అణచివేతకు ప్రధాన సాధనమని గుర్తించటం జరిగింది. తన శరీరం మీద తనకే హక్కు ఉండాలని భావించటమే స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి ముఖ్యమని భావించారు. ఆ నాడే స్త్రీలు తమ లైంగికహక్కులను గుర్తించటం ఒక విప్లవాత్మకసంస్కృతిగా భావించాలి.*

పొణకా కనకమ్మ మరియు ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ కలిసి వ్రాసిన 'ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు' (మార్చి 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీల సత్యాగ్రహచరిత్ర యొక్క ప్రాముఖ్యతను గురించి వ్రాస్తూ దేశాల, సంఘాలయొక్క చరిత్ర, ఆ యా దేశాల సంఘ, వ్యక్తుల ఉన్నతాదర్శ సేవాత్యాగాలను అనుసరించి ఉంటుందనీ, ఉత్తమాదర్శముతో స్త్రీలయొక్క కాంగ్రెసు సత్యాగ్రహచరిత్రలు దేశాభిమానానికి, భావికర్తవ్యానికి ఉపయోగపడతాయనీ, స్త్రీల ఉద్యమాల చరిత్రలను తెలియ చెయ్యాలని తెలిపింది. భండారు అచ్చమాంబ భారతదేశ స్త్రీల చరిత్రకు 'అబలా సచ్చరిత్ర రత్నమాలను' రచించి ప్రజలలో స్వాతంత్ర్యకాంక్షను, ఆత్మోత్తేజమును కలిగించారనీ, 1920 నుండి దేశస్వాతంత్ర్యం కోసం సేవా త్యాగము లొనర్చిన ఆంధ్రస్త్రీల సత్యాగ్రహ చరిత్రలో భాగంగా జైళ్ళకు వెళ్ళిన వారు, పికెటింగ్ స్వదేశీ ప్రచారం చేసిన స్త్రీల చరిత్రను సంతరించాల్సిన అవసరాన్ని తెలియజేసారు.

ద్రోణంరాజు లక్ష్మిబాయమ్మ "భారతమాత పవిత్రపుత్రుడు జవహర్ లాల్" (జనవరి 1938 గృహలక్ష్మి) అనే శీర్షికను వ్రాస్తూ జవహర్ లాల్ కాంగ్రెసు అధ్యక్షులయ్యారనీ, స్వాతంత్ర్య పిపాస, ఆదర్శం, ధర్మం దేశంలో పరివ్యాప్తం చేసిన గాంధీ మహత్ముడు కాంగ్రెస్ అధ్యక్షపదవికి అవకాశమున్నా రెండుసార్లు అధిష్ఠించలేదనీ గాంధీనే స్వయంగా జవహర్ లాల్ ను అధ్యక్షుడిగా నిలబెట్టాడని తెలియజేసింది.

డి.యస్.రాజేశ్వరమ్మ వ్రాసిన 'అస్పృశ్యతా నివారణమవసరమా' (మార్చి 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్వప్రయోజనార్థమైన వర్ణభేదాలవల్ల సుహృద్భావం తగ్గి స్వరాజ్య సంపాదనకు అవరోధంగా ఉన్నదనీ, విజ్ఞానం ప్రబలటంతో స్వతంత్ర ఆలోచనలపై ఆధారపడి పరాధీనతను రూపుమాపాలనుకుంటున్నారని భావించింది. నాల్గువర్ణములు పుట్టుకచేతగాక గుణకర్మలవల్ల ఏర్పడ్డాయనీ, భారతగ్రంథ రచనానంతరమే పంచమవర్ణము ఏర్పడినదనీ, మానవధర్మము

ఏకజనితులగు తోటి సోదరులను అంటరాదని నిషేధించుట తప్పనీ, హిందూసంఘమున స్థానం లేకపోవటం చేతనే పంచములు క్రైస్తవులను ఆశ్రయించుచున్నారనీ, వారిపరాధీనత భారత జాతీయతను బలహీనపరుస్తోందని చెప్పింది. భారతదేశాభివృద్ధికై అస్పృశ్యతాపిశాచాన్ని హతమార్చాలనీ ఐకమత్యముతో స్వాతంత్ర్యోద్యమం ముందుకు సాగాల్సిన అవసరముందని తెలియజేసింది.

*హరిజనులను కలుపుకుంటూ స్వతంత్రోద్యమం సాగితేనే భారతదేశానికి స్వాతంత్ర్యం సులభతరమవుతుందని భావించింది.*

బచ్చు మంగరాజమ్మ 'సన్మానము' (మార్చి 1936 వాసవి) అనే శీర్షికన బత్తుల కామాక్షమ్మను సన్మానించిన సందర్భంలో చెప్పిన విశేషాలుగా ఆమె ఆంధ్రవిశ్వవిద్యాలయము సెనేట్ మెంబర్ గా, ఎకడమిక్ కౌన్సిల్ మెంబర్ గాను ఎన్నుకోబడిందనీ, బాలవితంతువైన ఆమె చిన్నతనంలో గురువు లేకయే స్వల్పవిద్యను అభ్యసించినా, ఆ తరువాత పుస్తకాలను చదివి భాషాజ్ఞానాన్ని వృద్ధి చేసుకుందనీ, పత్రికా పఠనం ద్వారా దేశసేవికలైన స్త్రీల చరిత్రములను చదివి ప్రేరణపొంది తాను కూడ దేశానికి, సంఘానికి సేవచేయాలనుకుందని తెలిపింది. ఆ క్రమంలో ఆమె ముందుగా 'వైశ్యసేవాసదనము' అనే సంస్థను స్థాపించి దానిలోనే తాను విద్యాభ్యాసము చేసి ఉభయభాషా ప్రవీణ బిరుదును పొందిందని తెలిపింది. ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాల్ పదవిని పొందిందనీ, ఆంధ్రులలో స్వయంకృషితో పైకివచ్చిన స్త్రీగా చెన్నపురిలో కాశీనాథుని నాగేశ్వరరావు గారి ప్రశంసా పత్రాన్ని పొందిన తొలి వైశ్యస్త్రీ ఆమె అని బత్తుల కామాక్షమ్మను గురించి తెలియజేసింది.

శ్రీమతి సత్యం వ్రాసిన 'విద్యావతులు సంసారమున కనర్హులా' (ఏప్రిల్ 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యావంతురాలైన కన్య సంసారానికి పనికొస్తుందని తెలుసుకోవాల్సిన అక్కర ఉందనీ, ఆమెకే గృహనిర్వాహకత్వంలో ఎక్కువబాధ్యత తెలుస్తుందనీ, వివిధ దేశసాహిత్య అధ్యయనంతో వారు జీవితాన్ని చక్కగా అవగాహన చేసుకోగలుగుతారని తెలియజేసింది. అంతేకాక, చదువుకున్న స్త్రీపై హుకుం చెలాయిస్తూ అగౌరవపరిస్తే, కందిరీగతుట్టెను కదిలించటం లాంటిదనీ, తెలివిగల భర్త అయితే విద్యావతియే తనభార్య కావాలని కోరుకుంటాడనీ, ఆమె తన భర్తను కూడా విజ్ఞానవంతుడ్ని చేయగలుగుతుందనీ, పురుషుడు స్త్రీని ఉత్తమురాలిని చేయలేడు గాని విద్యావతి భర్తను మనుషునిగా తీర్చిదిద్ద గలుగుతుందని తెలియజేసింది.

*విద్యావంతులైన గృహిణులకుండే శక్తిసామర్థ్యాలను తెలియజేస్తూనే పురుషులకు మానసికచికిత్స చేయగలిగింది.*

'భారత స్త్రీ సంపూర్ణ స్వేచ్ఛనెప్పుడు బడయగలదు' (మే 1936 గృహలక్ష్మి) అనే వ్యాస రచయితయైన పాకల చంద్రకాంతామణి స్త్రీ స్వేచ్ఛను పొందాలనుకోవటాన్ని నాటి సమాజంలో ప్రబలమైన సమస్యగా భావించి స్త్రీల అభిప్రాయాలసేకరణకై పత్రికాముఖ ఆహ్వానాన్ని ఇచ్చింది.

స్త్రీల స్వేచ్ఛ విషయమై ఆమె తన అభిప్రాయలను వెల్లడిచేస్తూ ఆధునిక కాలంలో స్త్రీలు తమ బుద్ధి బలాన్ని, దేహబలాన్ని, చూపిస్తున్నారనీ, పెద్ద చదువులు చదివి కృతార్థులవుతున్నారనీ, స్త్రీలు స్వయంగా విద్యాసంస్థలు నడుపుతున్నారనీ, జిల్లాబోర్డు మండలస్థాయిలోని విద్యాసంఘము వంటి ప్రజాహిత సంస్థలలో సభికురాండ్రయి తమ సంఘాభివృద్ధిని వెల్లడిస్తున్నారని చెప్పింది. దేశమాతసౌఖ్యానికై తమ ప్రాణములను తృణప్రాయంగా భావిస్తున్నారనీ, కాని స్త్రీలు పూర్వపు స్వేచ్ఛను పొందలేక పోతున్నారనీ, దానికి కారణం వారిలో ఓర్పు, ఐకమత్యం, వినయం లేకపోవటమేననీ, స్త్రీలు విద్యావంతులయి తమ స్వధర్మములైన గృహనిర్వహణ, శిశుపోషణను వదిలి గర్వముతో మెలగుతున్నారనీ అది జ్ఞానఫలం కాదని తెలియజేసింది. పురుషులు అటువంటి స్త్రీలకు స్వేచ్ఛనివ్వటానికి భయపడుతున్నారని స్త్రీలు స్వేచ్ఛను బాధ్యతాయుతంగా ఉపయోగించు కోవాలని కూడా తెలియజేసింది.

*స్త్రీలలో విద్యాగర్వం ఉండటంతో స్త్రీలు స్వేచ్ఛను అనుభవించలేకపోతున్నారని భావించింది.*

పాకల చంద్రకాంతామణి ఆహ్వానం మేరకు 'భారత స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ' (జూన్ 1936 గృహలక్ష్మి) అనే శీర్షికన డి.కమలావతి హైదరాబాద్ నుండి పంపిన వ్యాసంలో స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం పొందటానికి తగిన అర్హత ఉందా అని వివేచించాలనీ, గృహబాధ్యతలు వదలి దేశసేవ, మానవసేవ అని సమాజములకు, సభారంగాలకు వెళ్ళి ఉపన్యాసపీఠిక లెక్కటమే స్త్రీ స్వాతంత్ర్య సంపాదన, దేశోద్ధరణ అని భావిస్తున్నారనీ, స్త్రీవిద్య శిశుపోషణకు, గృహనిర్వహణకు ఉపయోగపడాలని భావించింది. విద్యాఫలమే స్వాతంత్ర్యమనీ, స్వాతంత్ర్యమంటే ధిక్కారమని నేడు స్త్రీలు భావిస్తున్నారనీ, సంపూర్ణ స్వాతంత్ర్యం కోరుతున్నామంటూ సభలకు పరుగులు పెడుతున్నారనీ, స్త్రీలు ధనార్జనకు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదనీ, కుటుంబ నిర్వహణయే దేశసేవ అని చెప్పింది.

*కుటుంబనిర్వహణ లేని విద్యావంతులైన స్త్రీలస్వేచ్ఛ బాధ్యతాయుత స్వేచ్ఛకాదని భావించింది. ఈ వ్యాసానికి అనుబంధంగా మరికొందరి స్త్రీల అభిప్రాయాలను పత్రిక తెలియజేయటం జరిగింది.*

మంజులాదేవి షిల్లాంగ్ నుండి వ్రాస్తూ స్త్రీలకు పురుషులకు మనస్తత్వాలలో తేడా ఉందనీ, నేటి విద్యార్థినుల స్వాతంత్రేచ్ఛ పురుషులకు అధీనము గాకుండా ఉండటం, పురుషుల వలె నిస్సంకోచంగా యిష్టానుసారము తిరగటంగా ఉందనీ, అది స్వాతంత్రం అనిపించుకోదనీ, ఇంట్లో ఉండి స్త్రీలు తాము సర్వాధికారులమని భావిస్తున్నారని తెలిపింది. సంసారజీవనానికి యిష్టపడకుండా సామాజిక సంక్షేమ కార్యక్రమాలకై ఆత్మసమర్పణం గావించే రమణీ రత్నాలున్నారనీ, వారిలో దేశసేవయందు న్యాయస్థానాలందు రాజకీయ కార్యాలను నెరవేరుస్తూ సర్వత్ర పురుషస్థానంలో నిలబడి తమ మేధాశక్తితో వెలిగే స్త్రీ రత్నాలున్నారని పేర్కొంది. స్త్రీలకు నిజమగు బుద్ధి వికాసం కలిగించే విద్యాశిక్షణ అవసరమనీ, ప్రస్తుత విద్యావిధానం స్త్రీ జనోపకారి కాదని మహిళాసభలలో స్త్రీలు తెలియజేస్తున్నారనీ, విద్యావిధానంలో మార్పులు వస్తేనే భారతీయ మహిళాభివృద్ధి జరగుతుందని తెలియజేసింది.

*పురుషులవలె స్త్రీలు నిస్సంకోచంగా తిరగటానికి కాక, స్త్రీలలో సామాజిక, రాజకీయ పరిజ్ఞానంతో వారి మేధాశక్తిని పెంచే విద్యావిధానం ఉండాలని భావించింది.*

'భారత స్త్రీ స్వేచ్ఛ'ను పేర్కొంటూ అయ్యదేవర బాలాత్రిపుర సుందరమ్మ నందిగామ నుండి వ్రాస్తూ ధర్మమాచరించని భారతీయ మహిళ ఏ విద్యను చదివినను నిష్ఫలమనీ, మహారాష్ట్రంలోని ఆనందబాయి ఉత్తమవిద్యకై అమెరికా వెళ్ళినా మన భారతీయధర్మాన్ని పాటిస్తూ విదేశీయుల చేతకూడా హిందూ ధర్మాలను పాటింపజేస్తోందని తెలిపింది. భారత స్త్రీలకు స్వేచ్ఛకావాలంటే ధర్మాన్ని బట్టి వారి యోగ్యతబట్టి ఉంటుందని తెలియజేసింది.

*సాంప్రదాయాలను పాటించే విధంగా స్త్రీల స్వేచ్ఛ ఉండాలని భావించింది.*

'భారతస్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ' (జులై 1936 గృహలక్ష్మి) అనే శీర్షికన యల్లాప్రగడ సీతాకుమారి (హైదరాబాద్) వ్రాస్తూ ఈ శీర్షికన వచ్చిన మునుపటి వ్యాసాలన్నింటిలో పేర్కొన్నట్లుగా స్త్రీలు భర్తను సర్వవిధాల పూజించి, పిల్లలే సర్వస్వమనుకొని బాహ్య వ్యవహారాలతో సంబంధంలేకుండా పతివ్రతల కథలు చదువుకుంటూ ఉన్నవారెవరికీ స్వాతంత్ర్యంలేదనీ, పతిసేవావిధానమే లక్ష్యంగా పెట్టుకునే స్త్రీలకు స్వేచ్ఛలేదని తెలిపింది. స్మృతులు చట్టాలు, సాంఘిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు స్త్రీలకు సమస్యలు లేనట్లే అని భావిస్తున్నారు కాని అది నిజంకాదని స్త్రీలు కూడా పురుషులు చేయగల గొప్పపనులన్నీ చేయగలగాలనీ, దానికై ముఖ్యంగా పురుషులతో సమానమైన వారసత్వపు హక్కు ఉండాలనీ, స్త్రీలకు తమ అభిరుచికి తగిన విద్యను అభ్యసించగల స్వేచ్ఛ ఉండాలని చెప్పింది. స్త్రీల వివాహ వయోనిర్ణయిం శారదాచట్టం ప్రకారం జరగాలనీ, అలాంటి పరిస్థితులు స్త్రీలకు లేకపోవటమే వారి కున్న పెద్దసమస్యలుగా భావించాలని తెలియజేసింది. పురాణ పతివ్రతల చరిత్రలోని ఉత్ప్రేక్షలు, ఊహలు తీసివేయగా వారి నిజచరిత్ర అర్థం అవుతుందనీ, పురుషులు పెద్ద పెద్ద చదువులు చదువు కుంటున్నారనీ, వారివలె స్త్రీలు కూడా చదువుకుంటే వారికి సంపూర్ణ స్వేచ్ఛ, గౌరవాలు లభిస్తాయని అభిప్రాయపడింది.

*పురాణాలలో చెప్పిన విషయాలలోని మార్మికతను బయటపెట్టటం జరిగింది. స్త్రీలకు పురుషులతో సమానమైన విద్య, వైవాహిక స్వాతంత్ర్యం, ఆస్తిహక్కు ఉంటేనే స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ ఉన్నట్లనీ, అదే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి చిహ్నమని భావించింది.*

'భారతస్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ' (జులై 1936 గృహలక్ష్మి) అనే శీర్షికన పులవర్తి కమలావతీదేవి రాజమండ్రినుండి శిశుపోషణ చూసుకుంటూ గృహకృత్యములకు అడ్డురాని లలితకళలను అభ్యసించటమే భారతస్త్రీలస్వేచ్ఛ అని తెలియజేసింది.

దీనికి అనుబంధంగా 'భారత స్త్రీల స్వేచ్ఛ'ను గురించి పాకాల రాజమణెమ్మ మదరాసు నుండి వ్రాస్తూ "స్త్రీ స్వాతంత్ర్యం" అంటే స్త్రీలకు పురుషులతోపాటు సమాన హక్కులు ఉండాలంటూ స్త్రీవిద్య, సాంఘికవివాహం, విడాకులచట్టం, స్త్రీలు దేశసేవచేయాలనే కేకలు వినబడుతున్నాయనీ, కన్నతల్లిదండ్రుల వద్దను, భర్త ఆధీనములో స్త్రీలకు స్వతంత్రం ఉండటమే నిజమైన స్త్రీ స్వేచ్ఛ

అని తెలిపింది. దానికై ముందుగా వివాహ విధులను సంస్కరించాలనీ, ప్రేమించననే భర్తకు ఆమె ఏరకంగా ఆనందాన్ని ఇవ్వగలదనీ, విద్యావతిగా ఆంధ్రాంగ్ల విద్యలు ఆమెకు నేర్పించాలనీ, ఆమెకు యిష్టమైన అనుకూల వరునికిచ్చి పెళ్ళి చేయటమనేదే స్త్రీకిచ్చే స్వాతంత్ర్యం అని తెలియజేసింది.

దీనికి మరొక అనుబంధంగా ఇదే పత్రికలో గంటి కృష్ణవేణమ్మ బొంబాయినుండి వ్రాస్తూ భార్యను 'కరణేషు మంత్రి' అని భావించాలంటే స్త్రీకి బుద్ధి కుశలత కలగాలిగానీ, పిల్లలను పెంచటం, పిల్లల పెళ్ళిళ్ళ విషయంలో నిర్ణయంతీసుకునే స్వేచ్ఛ స్త్రీకి ఇంటియందే లభిస్తోందని భావించింది. పాశ్చాత్యాంగనలవలె స్వతంత్రంగా ఉండాలనుకోవటానికి భారతస్త్రీల ఆచార వ్యవహారాలకు కుదరని విషయమనీ, పురుషులవలె స్త్రీలకు పిత్రార్జితాన్ని భర్త ఆర్జించిన విత్తము నందు అనుభవించే స్వాతంత్ర్యం మాత్రం ఉండాలని తెలియజేసింది.

దీనికి ఇంకొక అనుబంధంగా పూల వెంకట సుబ్బమ్మ తుంబూరునుండి వ్రాస్తూ భారత స్త్రీల స్వేచ్ఛను గురించి ముందటి పత్రికలో పాకల చంద్రకాంత మణిగారి అభిప్రాయాలను ఖండిస్తూ, నేడు స్త్రీలు విద్యావంతులుగా ఉన్నా స్త్రీలకు స్వాతంత్ర్యం లేదనీ, స్త్రీలకు స్వేచ్ఛ, గౌరవం అనేవి వట్టిమాటలని తెలిపింది. పురాణ స్త్రీలకు సహజముగా ఒప్పియున్న గౌరవమే స్వేచ్ఛగా భావింపబడినదనీ, భారతదేశంలో స్త్రీలు భర్తలను మోక్షదాయకులుగా పూజించటానికి సేవించటానికి తగినట్లుగా స్వేచ్ఛను అనుభవించారని తెలియజేసింది.

దీనికి ముగింపుగా పత్రికాధిపులు స్వాతంత్ర్యం ఒకళ్ళిచ్చేది కాదనీ, హైందవ స్త్రీకి తగిన విద్యలేకుండుటయే స్వాతంత్ర్యం లేకపోవటానికి కారణమని భావించటం జరిగింది. పరభాషలు నేర్చుకొనుట తప్పు కాదనీ, సీత, ద్రౌపదివలె తెలివిగలవారైతే స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందవచ్చని పత్రిక పేర్కొనటం జరిగింది.

*బాధ్యతాయుత స్వేచ్ఛకు, సంపూర్ణ స్వేచ్ఛకు మధ్యనున్న గీతను స్త్రీలు అర్థంచేసుకొని బాధ్యతతో మెలగాలని స్త్రీల అభిప్రాయంగా అర్థమవుతుంది. పైన పేర్కొన్న స్త్రీల అభిప్రాయ సేకరణను బట్టి భారతీయ మహిళలు కుటుంబ నిర్వహణ వరకు స్వేచ్ఛఉంటే చాలని సంప్రదాయ స్త్రీలు కొంతమంది అభిప్రాయపడ్డారు. పురుషులతోపాటు సమాజంలో సమాన హక్కులు ఉండాలనీ, ముఖ్యంగా ఆస్తి హక్కు ఉండాలనీ, తన కిష్టమైన చదువు నభ్యసించే విషయంలోగానీ, వివాహ విషయంలో గానీ స్వేచ్ఛ ఉండాలని భావించిన ప్రగతిశీలురుగా మరికొంతమంది స్త్రీలు తమ అభిప్రాయాలను వెల్లడించటం జరిగింది. నాడు భర్తల ఇష్టానుసారంగా ప్రవర్తించే సంస్కృతి గల స్త్రీలు, నేడు భర్తతో సమానంగా జీవించే స్వేచ్ఛకావాలనుకొనే స్థితికి చేరుకోవాలను కోవటంలోనే వారి ఆలోచనలలోని పరిణామశీలత అర్థమవుతుంది.*

కస్తూరి రామలక్ష్మీదేవి 'సాహిత్యం-దానిమహత్వము' (జులై 1936 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ జ్ఞానాన్ని ప్రసాదించేది సాహిత్యమనీ, జాతికి జీవకళనిచ్చేదనీ, ఇతరదేశాల సాహిత్యమే

సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమస్యలలో గొప్పమార్పును కలిగించి ఆత్మస్వాతంత్ర్య బీజాన్ని నాటించగలిగినదనీ, అటువంటి స్వతంత్ర బీజాలను నాటగల తెలుగు సాహిత్య సృజన ఆధునిక కాలంలో అవసరమని తెలియజేసింది.

*అటువంటి సాహిత్యాన్ని స్త్రీలు సృజించగల్గి నాటిస్త్రీలలో ఆత్మస్వాతంత్ర్య బీజాన్ని నాటగలగటం చేతనే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యంతో దేశస్వాతంత్రోద్యమంలో భాగస్వామ్యులు కాగలిగారని అర్థమవుతుంది.*

మైదవోలు పద్మావతి వ్రాసిన 'స్త్రీ పురుష సమానత్వమావశ్యకమా ఎందేని యనర్థ దాయకమా?' (నవంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ గౌరవమే దేశగౌరవమనీ, మహిళాభివృద్ధియే దేశాభివృద్ధి అనీ, స్త్రీలు వెనుకబడిన దేశము వెనుకబడటమేననీ, స్త్రీ పురుషులు సమానస్థితి యందున్నప్పుడే స్వరాజ్యమునకు అర్హత వస్తుందనీ, జపాన్, టర్కీ, రష్యాదేశములు స్వతంత్ర దేశములగుటకు స్త్రీ-పురుష సమానత్వమే కారణమని తెలియజేసింది. అంతేకాదు దేశానికి స్వరాజ్యము కావాలంటే స్త్రీలకు స్వాతంత్ర్యమిచ్చుట మొదటి మెట్టని భావించింది. వనితలకు వ్యక్తిత్వం ఏర్పడాలంటే ఆమె పురుషుని సొత్తుకానీ, బానిసకాని కాదనీ, ఆమె ఒక ప్రత్యేక వ్యక్తియన్న భావమేర్పడాలని, అలా భావించక పోవటానికి పురుషుల దౌర్జన్యమే కారణమని తెలిపింది. అంతేకాక, స్త్రీని వంటయింటి, పడకటింటి వస్తువుగా భావిస్తున్నారనీ, మగవాడిగా ఆడుదానిపై అధికారం ఉండటమే కాక అతడు అయోగ్యుడై హింసించినా అతని నుండి విడిపోయే అధికారం స్త్రీకి లేకపోవటం అన్యాయమనీ, 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనే వజ్రాయుధాన్ని వాడటానికి కారణం ఆ శాస్త్రాలను పుట్టించినది పురుషులేనని తెలియజేసింది. స్త్రీ జాతి కూడ మానవజాతికి సంబంధించినదేనని, స్త్రీ పురుషులు సమానమైనా స్త్రీలకు పురుషులకంటే నాల్గురెట్ల బుద్ధి ఆధిక్యత ఉన్నందువల్ల స్త్రీలే అధికులని ఆ శాస్త్రకారుడే చెప్పాడనీ, స్త్రీలకు న్యూనతను కల్గించి స్త్రీ ప్రతిభను మాటుపరచటం పురుషుల స్వార్థపరత్వమేనని చెప్పింది. స్త్రీలకు వ్యక్తిత్వం ఏర్పడటానికి స్త్రీకి పురుషునితో పాటు సమానంగా విద్యాహక్కు, శాసనసభ్యత్వము ఉండాలని అప్పుడే స్త్రీల శక్తియుక్తులు దేశానికి ఉపయోగపడతాయని తెలియజేసింది. పురుషులతో సమానమైన గౌరవం స్త్రీలకుండాలనీ, అందుకని స్త్రీ స్వాతంత్ర్యానికి స్త్రీలే పనిచేయాలనీ, సంఘాన్ని సంస్కరించటం కూడా స్త్రీల పనియనీ, పురుషులు స్త్రీలకు స్వాతంత్ర్యం ఇవ్వకపోతే తమ కాళ్ళకున్న కట్టుతాళ్ళు తామే తెంచుకోవాలనీ, స్త్రీలకు స్వాతంత్ర్యం ఉంటేనే దేశానికి స్వాతంత్ర్యం ఉంటుందని చెప్పింది. స్త్రీలే కొత్త స్వేచ్ఛాధికారాలను సంపాదించుకోవాలనీ, స్త్రీలు శాసనసభలలో చట్టాలు చేయించగల సంఖ్యాబలాన్ని పెంచుకోవాలనీ, హక్కుల కంటే ఆచరణ కూడా ముఖ్యమని భావించింది. ఆస్తిహక్కు పురుషులతో సమానంగా స్త్రీలకుండాలనీ, డబ్బులేకపోతే స్వతంత్రం రాదనీ, స్త్రీలకు వివాహమే జీవనాధారమయిందనీ, భర్త ఆస్తి భాగం రాకపోయేసరికి జీవనం కోసం స్త్రీలు వంటలక్కలు గాను, నీళ్ళుమోసుకుంటూనో వారు జీవితాన్ని గడుపుతున్నారనీ, తండ్రి ఆస్తి కొడుకుతో పాటు కూతురుకు సమానంగా రావాలని భావించింది. స్త్రీకి విద్య ఉంటేనే సాంఘిక, రాజకీయ, ఆర్థిక

సమస్యలను ఎదుర్కొనే సమాన బాధ్యత స్త్రీకి కలుగుతుందనీ, స్త్రీలకు పునర్వివాహపు హక్కు ఉండాలనీ, స్త్రీకి స్వాతంత్ర్య సమానత్వం ఉంటేనే దేశస్వాతంత్ర్యం ఏర్పడుతుందని తెలియజేసింది.

*స్త్రీల సమస్యలన్నింటికి కుటుంబ సామాజిక సంస్కృతి కారణమనీ, అది స్త్రీలకు స్వతంత్రం లేకుండా చేస్తోందనీ, స్త్రీలు కూడా మానవులేనని భావించాలనీ, స్త్రీలు తమ స్వేచ్ఛాధికారాలను సంపాదించుకొని సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను సాధించుకొని స్వాతంత్ర్యాన్ని పొందితేనే దేశస్వాతంత్ర్యం కలుగుతుందని భావించింది. స్త్రీలలో మానవహక్కుల గురించిన ఆలోచనలు ఏర్పడ్డాయి. స్త్రీలకు, పురుషులతో సమానంగా విద్య, వివాహస్వాతంత్ర్యం, ఆర్థిక, రాజకీయ హక్కులుగల శాసనసభ్యత్వం ఉంటేనే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడుతుందనీ, స్త్రీల స్వాతంత్ర్యమే దేశస్వాతంత్ర్యానికి మూలమని భావించింది.*

వేదుల మీనాక్షి వ్రాసిన 'స్త్రీపురుష సమానత్వమావశ్యకమా? – ఎందేని యనర్థదాయకమా?' (నవంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారతదేశ స్వతంత్రం కోసం పురుషులు చేయు ప్రయత్నంలో స్త్రీలను కూడా చేరనివ్వమనీ, స్త్రీ,పురుషులు లింగభేదము లేకుండా పనిచేయాలనీ శరీరతత్వంలో, హృదయంలో, బుద్ధిలో స్త్రీ పురుషులు సమానమేనని తెలిపింది. స్త్రీలను బానిసలుగా చూడకూడదనీ, స్త్రీలుకూడా తమని తాము అబలలమని అనుకోకూడదనీ, సమానత్వాన్ని కోరినంత మాత్రాన శిశుపోషణ బాధ్యతను స్త్రీ విస్మరించదని తెలియజేసింది. స్త్రీ పురుషులకు సమాన విద్యావకాశాలను కలిగించే ప్రభుత్వమును ఎన్నుకొనే రాజకీయ విషయాలలో స్త్రీలు సమానులే అని గుర్తింపబడాలనీ, ఎన్నిక హక్కు ఆత్మహక్కుగా భావించాలనీ, శాసనసభలో ఆచంట రుక్మిణమ్మలాగా పాల్గొనవలెననీ, దేశసేవలో కూడా స్త్రీలుసమానత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పింది. సత్యాగ్రహవిషయంలో స్త్రీల సమానత్వ సేవను గుర్తించాలనీ, స్త్రీలకు ఆర్థిక సమానత్వం కూడా కావాలనీ, వారసత్వపుహక్కు ఉండాలనీ, స్త్రీలకు ఉద్యోగం చేసే అవకాశాలుండాలనీ, ఇంట్లో స్త్రీలు ఖైదీలుగా కాక ఆత్మగౌరవం, స్వేచ్ఛ కలిగిఉండాలని తెలియజేసింది. వివాహ విషయంలో స్త్రీలకు స్వేచ్ఛ ఉండాలంటే బాల్యవివాహాలు ఉండకూడదనీ, సంసారంలోని ఆలోచనలలోను స్త్రీలకు సమానత్వం ఉండాలనీ, కళలలోనూ స్త్రీలకు సమానావకాశాలుండాలనీ, స్త్రీలకు సాంఘిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం ఉంటే స్త్రీలకున్న భౌతిక, మానసికశక్తుల వృద్ధి దేశసేవకు ఉపయోగపడుతుందనీ, అప్పుడే భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందగలుగుతుందని తెలియజేసింది.

*స్త్రీలకు పురుషులతోపాటు సమానమైన సామాజిక, రాజకీయ, ఆర్థికహక్కులు ఉంటేనే, తమ శక్తిసామర్థ్యాలను వృద్ధిచేసుకొంటూ స్త్రీలువ్యక్తిస్వాతంత్ర్యాన్నిపొంది దేశస్వాతంత్ర్యాన్ని సాధించ గలుగుతారని భావించింది. స్త్రీలుకూడా తమనితాము అబలలుగా భావించుకోకూడదని చెప్పింది.*

ఈమెయే వ్రాసిన 'స్త్రీజనోచితమగు విద్య' (జనవరి 1939 గృహలక్ష్మి) అనే మరొక వ్యాసంలో శరీర దార్ఢ్యము, మానసిక ప్రవృత్తులను బట్టి, సాంఘిక స్థితిని బట్టి స్త్రీ పురుషుల

విద్యావిధానం వేరుగా ఉండాలని చెప్పింది. స్త్రీలు గృహనిర్వాహకత్వం, భర్తృసేవను చేస్తారనీ, స్త్రీ పురుషులు ఒకేపనిని చేయటంకంటె ఎవరి పనివారు చేయాలనీ, సంసారానికి ఉపయోగపడే శిశుపోషణ, శుశ్రూష, పిల్లలను దేశోద్ధారకులుగా తయారుచేస్తూ శౌర్యధైర్యాలు నేర్పించాలని భావించింది. దొరతనంవారి పాఠశాలలలో ఉపాధ్యాయులు, గుమాస్తాలుగా స్త్రీలే ఉండాలనీ, రాచభాష, మాతృభాష, మతగ్రంథముల భాషయైన సంస్కృతం స్త్రీలకు తెలిసి ఉండాలని చెప్పింది. కుట్టుపనులు, ఫేము కుర్చీలపని, రాట్నంతో నూలుతీయటం నేర్చి స్వదేశాభిమానంతో ఖద్దరు కట్టాలనీ, పాకశాస్త్ర జ్ఞానం ఉండాలనీ, అవి గృహనిర్వహణకు, కుటుంబ ఆదాయానికి పనికొచ్చే పనులను స్త్రీలు ఇళ్ళలోనే ఉండి చేయగలరని వేదుల మీనాక్షీదేవి తెలియజేసింది.

*స్త్రీ పురుషుల శారీరక నిర్మాణం భిన్నంగా ఉన్నా మేధోపరంగాను, మానసికంగాను ధృఢంగా ఉన్నప్పుడు, స్త్రీలు పురుషులు సమానులనే భావనకు బదులు స్త్రీలు యింటిపనితోబాటు గృహపరిశ్రమలో ఆదాయాన్ని పొందవచ్చని భావించటమంటే, స్త్రీలకు సామాజిక స్వేచ్ఛని లేకుండా చేయటమని భావించాలి.*

'తల్లి నగుట నాకు ఇష్టములేదు' అనే (నవంబరు 1936 ఆంధ్రభూమి) శీర్షికన వేదుల విశాలాక్షి వ్రాస్తూ స్త్రీ అంటే సంతానాన్ని కనటానికే అనే దృష్టితోచూసే సమాజంలో స్త్రీ గర్భిణీగా ఉన్నప్పుడు ఖైదు జీవితంలా చాలా యిబ్బందులు పడుతుందనీ, పథ్యం పేరుతో తిననీయరనీ, ప్రసూతిరోగాల బారిన పడటం అంటేనే అదొక గర్భధారణ వ్యాపారమనీ, స్త్రీ పాలను ఉత్పత్తిచేసే ప్రాణంగల యంత్రంగానూ భావింపబడటంచేతనే ఆమె శుష్కించిపోతుందని తెలిపింది. భుక్తి కోసం స్త్రీ ఏదో ఒక వృత్తిని అవలంబించే రోజులలో సంతానోత్పాదన పెద్ద అడ్డంకి అని తెలియచేసింది. పురుషుడు కామపురుషార్థాన్ని పొందుతుంటే పథ్యం చేస్తూ పిల్లల్ని కనిపెంచే కష్టమంతా స్త్రీదనీ, సమాన స్వాతంత్ర్యం కోరే ఈరోజులలో స్త్రీ తల్లికావటం అనే పనిని విరమించుకోవాలని తెలియజేసింది.

*స్త్రీల 'లైంగికత'ను గురించిన ఆలోచనల పరిణామంలో గర్భధారణ స్త్రీజాతిని నికృష్టం చేసేవ్యాపారమని, స్త్రీని సంతానాన్ని కని యిచ్చి పాలను ఉత్పత్తిచేసే ప్రాణయంత్రంగా భావిస్తున్నారనీ, అనాదిగా సమాజంలో స్త్రీపురుష సమానత్వం లేకుండా చేయటానికై గర్భధారణకు, పిల్లల పెంపకానికి స్త్రీని పరిమితం చేసారని భావించింది. బాహ్యప్రపంచంలో స్త్రీ ఉద్యోగాలకు వెళ్ళలేనిస్థితిని కల్పించి ఆర్థికస్వావలంబనలేని పరాధీనస్థితిలో ఉంచాలనుకున్నారని తెలియ జేయటమంటే రచయిత్రి ఆనాడే స్త్రీవాదభావనలు పుణికిపుచ్చుకుని స్త్రీల ఇక్కట్లను వ్యక్తం చేసిందని అర్థం అవుతుంది. ఆ నాటికి అది ఒక విప్లవాత్మక అలోచన. పని విభజనతో ఏర్పడ్డ పితృస్వామ్యపు మూలాలను కదిలించటం జరిగింది.*

'ఒక సోదరి' పేరుతో వ్రాసిన 'గృహిణీత్వానికి జీతాలా?' (డిసెంబరు 1936 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యావంతులైన స్త్రీలు ఉద్యోగాలు చేయాలని ప్రయత్నిస్తున్నారు గాని వివాహిత

ఉద్యోగం చేస్తే జీవితం సుఖంగా జరగదనీ, పి.ఎన్.మొహిలి బాంబే క్రానికల్లో వ్రాసిన దానిని పేర్కొంటూ, స్త్రీలు ఉద్యోగాలు చేయటం అనే సమస్య మొదలైందనీ, నేటి విద్యావంతులైన స్త్రీలకు ఆత్మగౌరవం, ఆర్థికంగా స్వతంత్ర జీవితం కావాలని కోరుకుంటున్నారని తెలిపింది. పెళ్ళికి ముందే స్త్రీ ఉద్యోగ విషయంలో వధూవరులు చర్చించుకోవాలనీ, పెళ్ళయిన తర్వాత భర్త, భార్య యొక్క ఉద్యోగాన్ని ఒప్పుకోకపోతే కుటీర పరిశ్రమలు పెట్టుకొని సంపాదించాలనీ, లేదా భర్త గృహనిర్వాహకత్వానికి జీతం ఇవ్వాలని భార్య భర్తను అడగాలని చెప్పింది. ఆ రకంగా భర్త జీతం యిస్తే స్త్రీ తాను స్వతంత్రాన్ని నిల్పుకొన్న భావన ఆమెకు కలుగుతుందనీ, సోదరి పేరుతో రచయిత మొహాలీ గారి అభిప్రాయాన్ని సమర్థించింది.

*స్త్రీలలో ఉద్యోగాలు చెయ్యాలనే భావన పెరిగిన కొలదీ, వారికి కావల్సిన జీతమిస్తే వారు ఇంటిదగ్గరే ఉండగలుగుతారనీ, అదే స్త్రీని ఆర్థిక స్వతంత్రురాలిని చేస్తుందని కుటీర పరిశ్రమలు నిర్వహించటం ఆత్మస్వభావంగా చేసుకోవాలనీ, ఇంటిచాకిరీకి ఆర్థిక విలువలు ఇవ్వాలనే భావన అర్థం అవుతుంది.*

యల్లాప్రగడ సీతాకుమారి 'భార్యలకు జీతాలా!! ఇచ్చేవారు భర్తలా !!!' (ఫిబ్రవరి 1937 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ భార్యలు జీతాలు కావాలని భర్తలనడిగితే సంసారాలలో ప్రశాంతత పోతుందనీ, ఏ జీతాల గొడవలేకుండానే భార్య పోషణంతా భర్త భరించాలనీ, కానీ స్త్రీ ఉద్యోగం చేస్తూ ఆర్థికంగా నిలబడితే ఆమె నీచంగా లోబడిఉండదనీ, స్త్రీలు తమ చదువంతా గృహ నిర్వహణకే ఉపయోగిస్తూ భర్తను సంతోషపెడితే భర్త కొంతజీతం ఇవ్వటం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని తెలియజేసింది. స్త్రీ ఉన్నతచదువు చదువుకోవటంవల్లగానీ, వితంతువుగానో, పర్యక్తగానో అయినప్పుడు జీవనాధారం కోసం ఉద్యోగం చేస్తోందనీ, భార్యకు జీతాలిచ్చే స్థితి భర్తలకులేదనీ, భర్త అయితే ఉద్యోగం నచ్చకపోతే నచ్చిన వేరొక చోట ఉద్యోగం చేసుకోగలడు గానీ, భార్యమాత్రం నచ్చినా నచ్చక పోయినా ఇంట్లోనే జీతం కోసం ఇంటిపని అనే ఉద్యోగం చేయాల్సివస్తుందని భావించింది. స్త్రీలు ఉద్యోగానికి వెడతానంటేనే ఇంటి నిర్వహణలో స్త్రీ విలువ పురుషుడికి తెలిసి వస్తుందనీ, సంసారాలు సజావుగా సాగాలంటే పురుషుడు స్త్రీని బానిసగా కాక ఇంటి నిర్వహణ చేస్తున్నందుకు ఆమె యిష్టానికి విలువనిచ్చి భార్యను కష్ట సుఖాలలో సమభాగ స్వామినిగా భావించాలని చెప్పింది. భార్యా భర్తల మధ్య న్యూనతాధిక్యతలు లేకపోతే స్త్రీలకు జీతాలు అవసరం లేదనీ, భార్యలకు ఆర్థిక సదుపాయాలను పరిచయం చేయాలిగానీ, భర్తలు భార్యలకు జీతాలివ్వటం మొదలు పెట్టితే స్త్రీల బానిసత్వం మరింత ఎక్కువవుతుందని తెలియజేసింది.

*ఇంటినిర్వహణలో భార్యయొక్క విలువ భర్తకు తెలియాలంటే ఆమె ఉద్యోగం చేయాలనీ, కుటుంబ సంబంధాలలో స్త్రీలు కేవలం జీతాలకోసం ఉద్యోగం చేయటమేగాక సమాజ సంబంధాలలోకి వెళ్ళటంగాకూడా అర్థం చేసుకోవాలి. భర్తలు భార్యలను ఆర్థికవ్యవహారాలలో సమభాగస్వాములుగా చూడనపుడు స్త్రీ బయటకువెళ్ళి ఉద్యోగంచేస్తే జీతమిచ్చినట్లుగానే, ఇంటిచాకిరీ, శిశుపోషణకై*

*భార్యకు జీతం ఇస్తే స్త్రీలకు ఆర్థికస్తోమత కలుగుతుంది. కాని అదే స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్య జీవితం ఉండటమని కుటుంబాలకు పెను సవాల్ విసరినా తిరిగి అవి యజమాని-బానిస సంబంధాలు అవుతాయనే భయాన్నికూడా వ్యక్తం చేయటం కనబడుతుంది.*

కె.నాగమణి అనే మద్రాసులోని క్వీన్ మేరీ కళాశాల విద్యార్థిని 'స్త్రీ విద్య' (ఏప్రిల్ 1937 హిందూ సుందరి) ను గురించి వ్రాస్తూ పూర్వకాలంలో స్త్రీలు చదువుకొన్నారనీ, ఇప్పుడు కూడా స్త్రీలు జీవితపర్యంతము విద్యాభిలాషులై పరోపకారపరిణతితో ఉండాలనీ, దానికై భాషాజ్ఞానం, గృహకృత్య నిర్వాహకత్వం తెలియాలని భావించింది. పురుషులకన్నా స్త్రీలకు గణిత శాస్త్రంలో ఆలోచనాశక్తి ఎక్కువగా ఉంటుందనీ, విద్యాభివృద్ధి కావాలనుకున్న స్త్రీలు పరిశోధనలు చేయాలనీ, మెదడు చేసే పనికి తగినంత శాంతం వారిలో ఉంటుందనీ, వారే వైద్యసేవలు, ఉద్యోగాలు చేయటానికి అర్హులని తెలియజేసింది.

*స్త్రీలు అన్నిరకాల విద్యలను నేర్చుకోవటానికి అర్హులని భావించింది. స్త్రీలకు ఇంద్రియ నిగ్రహం ఉంటుందని స్త్రీల మెదడు ప్రకృతి సహజంగానే గొప్పదనీ, స్త్రీలు చదువుకోవటమేగాక పరిశోధనలు చెయ్యాలనే ఆలోచలను పెంచుకోవటంగా అర్థం అవుతుంది. ప్రాథమిక, ఉన్నత, వృత్తివిద్యలే కాక స్త్రీలుపరిశోధనారంగంలోకూడా అడుగు పెట్టాల్సిన అవసరాన్ని సూచించింది.*

బులుసు ప్రకాశమ్మ 'సంతాననిరోధము అవసరమా' అనే (ఏప్రిల్ 1937 ఆంధ్రభూమి) శీర్షికన సంతాన నిరోధము హిందూ స్త్రీలకు, హిందూ సంఘానికీ ఆచరణీయంకాదనీ, కావాలను కున్నప్పుడు పిల్లలు కలగరనీ, ఒకవేళ బీదలకు పిల్లలు పుట్టినా కాస్త పెరిగిన తరువాత ఏదో ఒకటి సంపాదించి ఇంట్లో ఇవ్వగలరనీ, మరణాలరేటు ఎక్కువైతే జనాభా తగ్గుతుందనీ, సంఘం బాగుపడాలన్నా, ఆరోగ్యవంతులు వృద్ధిపొందాలన్నా స్త్రీలు సంతానవంతులు కావాలనీ తెలియజేసింది.

*దీనినొక సాంఘిక-ఆర్థిక విషయంగా భావించాలి. స్త్రీలు ఆరోగ్యంగా ఉన్నప్పుడును, జనాభా సమస్య లేనప్పుడును భావించే విషయంగా అర్థం అవుతుంది. గర్భధారణ, సంతానాన్ని, జనాభా నియంత్రణకు, బీదలయొక్క ఆర్థికవ్యవస్థకు ఉన్న సంబంధాన్ని గురించిన స్త్రీల ఆలోచనల పరిణామం అర్థం అవుతుంది.*

వల్లభనేని సీతామహాలక్ష్మి 'స్త్రీలకు విద్యలేనిచో దేశమునకు ముక్తిలేదు' (జూన్ 1937 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాసిన రెండు వ్యాసాలలో బిడ్డలు జ్ఞానవంతులు కావాలంటే తల్లి జ్ఞానవంతురాలు అవ్వాలనీ, అప్పుడే పిల్లలు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనగలుగుతారనీ, స్త్రీలకు విద్యను తప్పనిసరి చేయటానికి స్త్రీవిద్యాలయాలు నెలకొల్పాలని తెలియజేసింది. అంతేకాదు ఎవరో వచ్చి స్త్రీలను స్వతంత్రులను చేస్తారని అనుకోకుండా స్త్రీలు తమంతటతామే సంఘాలు నిర్మించుకొని వాటిద్వారా స్త్రీస్వాతంత్ర్యం, స్త్రీవిద్య, బాల్యవివాహనిషేధం, పునర్వివాహాలు మొదలగు సాంఘిక సంస్కరణలను పాఠశాలలోవలె బోధించాలనీ, స్త్రీలను తమశక్తికొలది జాతీయసేవలో

పాల్గొనేటట్లు చేయాలని భావించింది. పురుషులతోపాటు సమానస్వాతంత్ర్యాన్ని స్పెయిన్ దేశస్త్రీలు అనుభవిస్తున్నారనీ, రష్యా సామ్యవాదం వల్లనే స్త్రీలు, పురుషులతో సమానంగా విద్యాఉద్యోగాలలో ప్రవేశించి వారి శక్తియుక్తులు సంపూర్ణంగా వికసింపజేసుకుంటున్నారని తెలిపింది. స్త్రీ స్వాతంత్ర్యానికి తప్పుడు అర్థాలు కనిపెడుతూ, 'స్త్రీసామ్రాజ్యం' అనే నాటకాలు ప్రదర్శిస్తూ తద్వారా స్త్రీలు సంతానాన్ని కని, పెంచాలి కాబట్టి, వారు సరిగ్గా ఉద్యోగం చేయలేరని ప్రచారం చేయటం తప్పు అని స్త్రీల ప్రగతికి చేస్తున్న వ్యతిరేకప్రచారాన్ని తిప్పికొట్టాలనితెలియజేసింది.

'స్త్రీలకు విద్యలేనిచో దేశమునకు ముక్తిలేదు' (తెలుగుతల్లి, సెప్టెంబరు 1937) అనే శీర్షికన ఈమె మరొక వ్యాసాన్ని వ్రాస్తూ, స్త్రీలు విద్యావంతులయితేనే బిడ్డలు యోగ్యులుగా పెరిగి దేశస్వాతంత్ర్యంకోసం పోరాడగలరనీ, స్త్రీలకు విద్య, పత్రికాస్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం వంటి ప్రజాస్వామిక హక్కులు ఉండాలని తెలిపింది. స్త్రీలస్వాతంత్ర్యంకోసం పోరాడే స్త్రీసంఘాలకు పురుషులు చేదోడుగా ఉంటే స్త్రీలు దేశసేవలో నిమగ్నులు కాగలరనీ, స్త్రీలదాస్యం పోతేనే దేశానికి దాస్యవిముక్తి కలుగుతుందని తెలిపింది. సామ్యవాద దేశాలలో స్త్రీలకు పురుషులతోపాటు సమానహక్కులు ఉంటాయనీ, దానికి విద్య, వైవాహిక స్వాతంత్ర్యంతోబాటు తెలివితేటలను ప్రదర్శించుకొనే అవకాశాలు స్త్రీలకు ఉండటమే కారణమనీ, స్త్రీలస్వాతంత్ర్యానికి సాహిత్యం తోడ్పాటునివ్వాలని వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ తెలియజేసింది.

*స్త్రీలు చదువుకొని తాము స్వాతంత్ర్యంకోసం కృషిచేయటమే గాక, జ్ఞానవంతులుగా పిల్లల్ని తీర్చిదిద్ది వారిని కూడా స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములను చేస్తే దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని భావించింది. అంతేకాక స్త్రీస్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా కళల ద్వారా జరిగే ప్రచారాన్ని త్రిప్పికొట్టటం ముఖ్యమనీ, స్త్రీలు ఇన్నాళ్ళనుండి స్త్రీ స్వాతంత్ర్యంకోసం పడిన కష్టమంతా బూడిదపాలవుతుందనీ తెలియజేసింది. స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి సంబంధించిన విషయాలను స్త్రీసంఘాలలోపాఠ్యాంశాలవలె పెట్టాలనే ఆలోచన చాలా గొప్పది. ఈ విషయాలనే ఉన్నత విద్యాబోధనలో ఉండాలని 1986 లో యు.జి.సి ప్రతిపాదించింది.*

*స్త్రీలు ఉద్యోగానికి వెడితే వారికి అధికారం వస్తుందనీ, అప్పుడు స్త్రీలు ఇంటా, బయటా కూడా అధికారులు అవుతారనే భయం పురుషులకు ఉండటంతో, స్త్రీల ఉద్యోగానికి వ్యతిరేకంగా ప్రచారం చేయటానికే కళారూపాలను వాడుకోవటం అర్థమవుతుంది.*

ఇ.కనకవల్లి 'స్త్రీలు-వృత్తి' (జూన్ 1937 గృహలక్ష్మి)అనే శీర్షికన వ్రాస్తూ ప్రతివ్యక్తి చైతన్యంతో ఉండాలంటే ఉద్యోగం చేయాలనీ, సంతానాన్ని కని పెంచటమే స్త్రీలు వృత్తిగా పెట్టుకున్నారు గానీ విదేశాలలోని స్త్రీలలో నూతన వికాసం కలగటానికి గాని ఆహారసంపాదనకు గాని అమెరికా, ఇంగ్లాండు, రష్యా, ఫ్రాన్సు దేశాలలోవలె స్త్రీలు భర్తపై ఆధారపడి ఉండకూడదని తెలిపింది. యుద్ధం చేయటానికి కూడా సిపాయిలుగా స్త్రీలు తయారవుతున్నారనీ, స్త్రీలు వంట పనియే కాక, కుట్టుపని, చదువుకోవటం, సంగీతంవంటివి నేర్చుకోవాలని తెలియజేసింది.

అంతేకాదు డబ్బున్న స్త్రీలకు కష్టపడకుండానే జీవితం గడిచినా మధ్యతరగతి స్త్రీలు శ్రామికవర్గ స్త్రీలవలె పొలం పనులు చేసి డబ్బు సంపాదించి పురుషుడితో సమానంగా కుటుంబపోషణ చేయగలిగేటట్లుగా అలవాటు చేసుకోవాలని సూచించింది. అయితే బయటకుపోయి మధ్య తరగతి స్త్రీలు కష్టపడకపోయినను మానసికంగా కృషిచేసే పనులు చేయవచ్చని స్త్రీలు చేపట్టాల్సిన వృత్తులను గురించి తెలియజేసింది.

*భర్తమీద ఆధారపడకుండా వర్గస్థాయిలకు తగ్గట్టుగా స్త్రీలకు స్వయంపోషకత్వం ఉంటేనే స్త్రీలకు సమాన స్వాతంత్ర్యం ఉంటుందని భావించారు.*

'ధర్మ శాస్త్రములలో స్త్రీహక్కులు' (జూన్ 1937 గృహలక్ష్మి) అనే పత్రికాధిపుల ప్రచురణలో అనంతపురంలోని న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ, భర్త మరొక స్త్రీని వివాహ మాడటంతో అనారోగ్యం ఏర్పడిందనీ, తనకు ప్రాణహాని ఉంటుందనే భయంతో భర్త నుండి విడిపోయి మనోవర్తి అడిగేసరికి భర్త ఆమెను తనదగ్గరకు వచ్చి ఉండమన్నా ఆ భార్య ఒప్పుకోక దావా వేసిందని తెలిపింది. క్రింది న్యాయస్థానం భర్తకు అనుకూలమైన తీర్పునిస్తే ఆమె హైకోర్టులో అపీలుకు వెళ్ళగా ఆ కోర్టు తిరిగి విచారించవలసిందనీ క్రింది కోర్టును ఆదేశించింది. క్రింది కోర్టు జడ్జి స్త్రీని పశువుగా చూడకూడదనీ స్త్రీకి ప్రాణహాని ఉన్నప్పుడు భర్త దగ్గరే ఉండమని తీర్పు నివ్వాల్సిన అవసరం లేదనీ, ధర్మశాస్త్రాలలో లేకపోయినా సారమెరిగి న్యాయం జరిగేటట్లుగా చూడాలంటూ ఆ తీర్పును కొట్టివేస్తూ ఆమెకు మనోవర్తి ఇవ్వాలని న్యాయస్థానం తిరిగి నిర్ణయించిదనీ, భర్తాబాధితులైన వివాహిత స్త్రీలను స్వతంత్రంగా జీవించేటట్లు చేసిందని పత్రిక తెలియజేసింది.

*న్యాయవ్యవస్థలో స్త్రీలు తమ జీవనహక్కులకై చేసిన వ్యక్తిస్వాతంత్ర్యపు పోరాటమే స్త్రీల సాధికారికతకు బాటలు వేయగలుగుతుంది. స్త్రీల కుటుంబ హింసను గుర్తించటంచేతనే నేడు గృహహింస చట్టం తయారయింది.*

1934 లో కేంద్రం స్త్రీలకు వ్యవసాయభూములను వారసత్వపు ఆస్తిహక్కుగా పేర్కొన్న, 1935 చట్టం రాష్ట్రీయస్వాతంత్ర్యం ప్రకటించటంతో దానిప్రకారం వ్యవసాయభూములు రాష్ట్ర ప్రభుత్వం క్రింద ఉన్నాయంటూ స్త్రీలకు ఆస్తిహక్కును నిరాకరించటం జరిగింది. కొడుకులు చూడనప్పుడు స్త్రీకి ఆస్తి వారసత్వం లేకపోవటంతో వితంతు స్త్రీలకు మనోవర్తిని భరణం రూపంలో యివ్వాలని చట్టం తీసుకొచ్చినట్లే భర్తనుండి విడిపోయిన భార్యకు భర్త ఆమె పోషణకై చట్ట ప్రకారం యివ్వాలనే ప్రతిపాదనను చేసింది.

కొమర్రాజు అచ్చమాంబ వ్రాసిన 'నేటి రాజకీయాలు – స్త్రీలు' (జూన్ 1937 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో దేశాభివృద్ధికి, దేశ స్వాతంత్ర్యానికి రాజకీయ పరిజ్ఞానం అవసరమనీ, గాంధీ గారు చెప్పినట్లుగా దేశం మనది, రాజ్యం చేసుకోవాల్సినవాళ్ళం మనమనీ, మన హక్కులు

ఇచ్చేందుకుగాని యివ్వక పోవటానికిగాని గవర్నమెంటువారికి ఏ అధికారమున్నదనే విషయం గుర్తించినప్పుడు భారతీయులకు కావల్సింది సంపూర్ణ స్వాతంత్ర్యమే అని అర్థమవుతుందని తెలిపింది. 1919 లోని మాంటేగ్– ఛేమ్స్ వర్డ్ సంస్కరణల వల్ల వోటర్ల సంఖ్య అధికమైందనీ, ముఖ్యమైన మంత్రిత్వశాఖలు ప్రజలచేత ఎన్నుకోబడినవారికే దక్కాలని భావించిన భారతీయులు 16 ఏళ్ళ తర్వాత బ్రిటీష్ వారు హక్కులిస్తామన్నా దాన్ని కాంగ్రెస్ వారు నిరాకరించారని తెలిపింది. దీనికి 10 ఏళ్ళ తర్వాత సైమన్ కమిషన్ వస్తే నిరసించారనీ, మూడవ రౌండుటెబుల్ కాన్ఫరెన్సుల వల్ల ఇండియన్ కాన్స్టిట్యూషన్ యాక్ట్ (భారతదేశ ప్రభుత్వ చట్టం 1935) లభించింది కానీ దానివల్ల రాజకీయంగా ఆర్థికంగా ప్రయోజనం లేకపోయిందని తెలియజేసింది. అంతేకాదు, పరిపాలనకు ముఖ్యమైన డబ్బు, సైన్యం వారి చేతిలో ఉంటే స్వతంత్రం అనేది హాస్యాస్పదమనీ శాసనసభలో మెజారీటి కాంగ్రెస్ వారే ఉండటంచేత 'ఇన్ స్ట్రుమెంట్ ఆఫ్ ఇన్ స్ట్రక్షన్స్' ప్రకారం తాత్కాలిక మంత్రుల నేర్పరచి బ్రిటిష్ ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తిస్తూ మాటల్లో రాష్ట్రీయస్వాతంత్ర్యం ఉందని చెబుతున్నారనిచెప్పింది. గవర్నరు చేతిలో ప్రత్యేక అధికారాలుండటం వల్ల ప్రయోజనం ఉండటం లేదనీ, ప్రజాపరిపాలనకు కొత్త ఎన్నికలు కావాలనే గొడవల్లో రాజకీయ లక్ష్యమైన సంపూర్ణ స్వాతంత్ర్యమనే సంగతి మరుగునపడిందని పేర్కొన్నది. ప్రజాప్రతినిధుల వశంకాని ప్రభుత్వానికి పన్నులు కట్టాల్సిన అవసరం లేదనీ, ఇది పరిమిత స్వేచ్ఛగల భార్య అదృష్టం లాంటిదని భావించింది. రాజకీయార్థికవిషయాల్లో పురుషునితో సమానమైనహక్కు, బాధ్యత, వ్యక్తిత్వంతో సంపూర్ణ స్వేచ్ఛగా పెరిగే అవకాశాలు స్త్రీలు ఏర్పరచుకోవాలనీ, దానికై స్త్రీలు శాసనసభ్యురాండ్రుగా ఎదిగితేనే దేశ రాజకీయ స్వాతంత్రానికి స్త్రీలు తమ యావచ్ఛక్తిని వినియోగించగలరని తెలియజేసింది.

*స్త్రీలలో దేశరాజకీయ విషయాలపట్ల స్పష్టమైన అవగాహన కల్గించేందుకు కొమర్రాజు అచ్చమాంబ (భండారు అచ్చమాంబయొక్క మేనకోడలు) చేసిన ప్రయత్నం ఈ వ్యాసంలో అర్థం అవుతుంది. రాజకీయార్థిక విషయాలలో స్త్రీలకు శాసనసభ్యత్వపు ప్రాతినిధ్యంఉంటేనే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యంతోపాటు దేశానికి రాజకీయస్వాతంత్ర్యం వస్తుందనీ, అందుకని స్త్రీలు సంపూర్ణ స్వరాజ్యం కోసం పోరాడాల్సిన అవసరాన్ని తెలియజేసింది. బ్రిటిష్ రాజకీయాలకు, కుటుంబ స్త్రీలస్వేచ్ఛా పరిమితికి, దేశస్వాతంత్ర్య స్థితికి ఉన్నసామ్యం చెప్పటం ఆలోచింపజేసే విషయం.*

ఈమెయే 'సహకారమా? విధ్వంసమా?' (అక్టోబరు 1937 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ 'నూతన ఇండియాచట్టం, 1935' వచ్చి హిందూ దేశాన్ని బానిస స్థితిలోనే ఉంచుతోందనీ, ఈ రాజ్యాంగచట్టము స్వాతంత్ర్యంలో శతాంశమైనా నెరవేర్చటం లేదనీ, కాంగ్రెసు మంత్రులు గవర్నరును పొగుడుతున్నారనీ, అర్హతలేని వ్యక్తిని అధికారిగా గవర్నరు నియమించటంతో మిక్కిలి పొగడ్తలు చేస్తున్నారని తెలియజేసింది. అంతేకాదు రాజకీయ నిర్బంధితుల విడుదలను ఆలస్యం చేస్తున్నారనీ, విడుదల సందర్భంలోనూ, పత్రికల ముద్రణాలయ ధరావతు వాపసు విషయంలో పెట్టేషరతుల విషయంలో వారి అధికారాన్ని చూపిస్తున్నారని భావించింది. జాతీయ పతాకం,

జాతీయ గీతం, రాజకీయ నిర్బంధితులయెడగల నిషేధం తొలగించే విషయంలో కృషిచేయటం లేదనీ, ఆయువుపట్టు విషయాలైన జమీందారీ పద్ధతిని నిర్మూలించుటకు గాని మరణపు పనుల విషయాలలోనూ, అండమాన్ ఖైదీల విషయాలలోనూ రాజప్రతినిధులుగా తమ అధికారాలను వినియోగించటం లేదని భావించింది. రాజకీయ వేసవి పాఠశాలలపై నిషేధం తొలగించనందుకు కాంగ్రెస్ మంత్రివర్గం సమాధానం చెప్పాలనీ, సంపూర్ణ స్వరాజ్యం లేనందుకు ప్రభుత్వంలో చేరిన కాంగ్రెసువారు ప్రజలను కాపాడలేని దుస్థితిలో ఉన్నారనీ, రాజకీయ ఖైదీలను విడిపించలేక పోతున్నారనీ, ఇక ప్రస్తుత చట్టంవల్ల వచ్చిన శాసనసభాధికారాలు నిరుపయోగంగా ఉన్నాయని కొమర్రాజు అచ్చమాంబ తెలియజేసింది.

*రాష్ట్రీయపాలనలో కాంగ్రెస్ లోని మంత్రివర్గపాలనను, అర్హతలేని అధికారులతో దేశసమస్యలు తీరవని ఆనాడే విమర్శించటం జరిగింది.*

కృష్ణకుమారి వ్రాసిన 'అభ్యుదయమున కాయువుపట్టు' (సెప్టెంబరు 1937 గృహలక్ష్మి) అనే వ్యాసంలో హైందవ భూమియందు 'సాధ్వియే సర్వసమ్మాన్య' అని చెప్పిన సాంఖ్యమత సూక్తియే స్త్రీయౌన్నత్యాన్ని ఎలుగెత్తి చాటుతున్నదనీ, విద్యావంతురాలైన స్త్రీసర్వత్ర పూజనీయురాలనీ, పూర్వకాలం ఉన్నతవంశస్త్రీలుకూడా చాపలల్లుట, కత్తి యొరలను చేయుటవంటి పనులలో పురుషులకు చేదోడువాదోడుగా ఉండేవారని తెలియజేసింది. ఆ తర్వాత కొన్నాళ్ళకు నిద్రాణమైన స్త్రీశక్తి రామమోహనరాయలు యొక్క సంస్కారములతో నిద్రలేచిందని పేర్కొన్నది. ఆధునిక కాలంలో చదువుకున్న స్త్రీలు పాశ్చాత్యులపోకడతో మితిమీరిన స్వాతంత్ర్యాన్ని పొందాలను కుంటున్నారని భావించింది. అంతేకాదు స్త్రీలు తమ మనుగడకై అవసరమైన వృత్తివిద్యలను నేర్చుకోవాలనీ, స్త్రీల కళాశాలలో స్త్రీలకు విద్యావకాశాలు ఉన్నాయనీ, స్త్రీలు విద్యాసంస్థలలో చేరి దేశహితైక కార్యక్రమాలు చేపట్టాలని భావించింది. అటువంటి విద్యాసంస్థలుగా మదరాసులోని సేవాసదనం, రాజనగరి(రాజమండ్రి)లో ఆంధ్రయువతీ సంస్కృతకళాశాల, గర్తపురి (గుంటూరు) లో శారదానికేతనము, కాకినాడలో హిందూసుందరి బాలికాపాఠశాల, హేలాపురి (ఏలూరు)లో లక్ష్మీ సేవాసదనము, భావపురి(బాపట్ల) లో హితైషిణీమండలి యువతీవిద్యాలయాలవంటి సంస్థలు స్త్రీలపక్షమున పనిచేస్తున్నాయని చెప్పింది. విద్యతోపాటు, ఓటింగ్ పవర్, హరిజనోద్ధరణ, సమన్యాయ దాయభాగపుహక్కు, విడాకుల చట్టం వంటివానిని ముఖ్య సమస్యలుగా తీసుకున్నారనీ, అటువంటి విద్యాసంస్థలకు దాతలు ధనమిచ్చి అభివృద్ధి చేయాలని తెలియచేసింది.

*పాశ్చాత్యపుపోకడలకు పోకుండా స్త్రీ సాధ్విగా ఉంటూనే తన శక్తిసామర్థ్యాలను పెంచుకోవాలని భావించింది.*

రాష్ట్రీయస్వాతంత్ర్య సమాజంలో ఆరోగ్యశాఖామంత్రి అయిన విజయలక్ష్మీ పండిట్ 'స్త్రీ సమస్యల'ను గురించి పత్రికావిలేఖరులు అడుగుతున్న ప్రశ్నలకు "భారత స్త్రీల పరమధర్మము" (అక్టోబర్ 1937 గృహలక్ష్మి)ను గురించి ఆమె చెప్పిన అభిప్రాయాల యొక్క ఆంధ్రఅనువాద ప్రచురణలో, స్వరాజ్యమునకై పోరాటం సలుపు ఈ కాలంలో శీఘ్రంగా స్వాతంత్ర్యాన్ని

సంపాదించటమే ముఖ్యమని చెప్పింది. సంఘంలో స్త్రీ యొక్క స్థానాన్ని, సంఘానికి, దేశానికి స్త్రీలెట్లు తోడ్పడాలో గుర్తించటమే స్త్రీ సమస్య అనీ, నేటి విద్యావిధానం స్త్రీలకు వ్యక్తిత్వాన్ని వికసింపచేసేది కాక సంఘాల అలంకారంగా ఉందని తెలియజేసింది. నాగరికత పురుషాయత్తమే కాబట్టి దానికోసం స్త్రీ పోరాడాలి అనీ, పురుషుని ప్రాబల్యాన్ని ధిక్కరించాలనీ, పిల్లలను మంచి గుణములుగల పూర్ణారోగ్యంతో పెంచటం నేర్చుకోవాలనీ, నేడు స్త్రీ ముందుకు వచ్చి ప్రభుత్వమును చక్కబరచాలనీ, స్త్రీలకు నిర్ణయాధికారం ఉండాలని చెప్పింది. స్త్రీలప్రతిభ లలితకళల విజ్ఞానమునందే కాక, రాజ్యాంగం నడుపుటయందు చూపించగలిగితే స్త్రీల సమస్యలు పరిష్కరింపబడతాయనీ, స్త్రీలు ధైర్యవర్తనముతో ధర్మాన్ని నెరవేర్చటంలోనే భారత స్త్రీల గొప్పతనం ఉందనీ తెలియజేసింది.

> *ఆధునిక స్త్రీల నాగరికత అంతా పురుష ప్రయోజనాలకు వీలుగా ఉందనీ, ముందుగా స్త్రీలు తమకు వ్యక్తిస్వాతంత్ర్యం లేదని గుర్తించటమే సమస్యను గుర్తించటమనీ, దాని పరిష్కారంగా స్త్రీలు రాజ్యాంగాన్ని నడిపే స్థితికి అభివృద్ధి చెందాలని తెలియజేసింది. ఇంటా బయటా స్త్రీలకు సమస్యలు పోవాలంటే ప్రభుత్వంలో నిర్ణయాధికారం చేయగల స్థితికి స్త్రీలు కృషిచేయాలని భావించింది. స్త్రీలకు సామాజికగౌరవం, వ్యక్తిస్వాతంత్ర్యం ఉన్నప్పుడే దేశస్వాతంత్ర్యం వస్తుందనీ, అప్పుడే స్త్రీల సమస్యలను స్త్రీలే రూపుమాపుకోగలరని భావించింది.*

గుమ్మడిదల దుర్గాబాయమ్మ వ్రాసిన 'బందీ' (అక్టోబరు 1937 గృహలక్ష్మి) అనే వ్యాసంలో తన కారాగార అనుభవాన్ని వ్రాస్తూ అదొక పంజరమనీ, అనేక కుటుంబాలనుండి వచ్చిన బందీలు ఏకకుటుంబంగా ఉంటూ, వార్డరుల కఠోరవాక్యాలు, అత్యాచారాలను సహిస్తూ గడుపుతుంటారని తెలిపింది. ఖైదీలు నిర్దిష్ట కాలంలో పాఠశాలాభవనానికి వెళ్ళటం పరమోత్సవమనీ, వారుఇచ్చే ఆహారం సరిపోదనీ, బీదల పిల్లలు ఆకలితో అలమటిస్తారనీ, బందీలచేత వెట్టిచాకిరీ చేయిస్తారనీ, ఉరిశిక్షవేయటం అమానుషమనీ, దానిని ఏధర్మశాస్త్రాలు కానీ, మతగ్రంథాలు గాని చెప్పలేదని తెలియచేసింది.

ఈమె వ్రాసిన 'ముక్తి' (డిసెంబరు 1937 గృహలక్ష్మి) అనే మరొక వ్యాసంలో మానవ ప్రకృతి సహజమైన సత్వరజస్తమోగుణములతో శృంఖలాబద్ధమై సాంసారిక, సాంఘిక జాతీయ జీవనము నాగపాశములచే బాధితమవుతుందనీ, స్వర్గతుల్యమగు ముక్తి అమూల్యమగు వస్తువనీ, ముక్తి యొక్క ఇంద్రజాలమహిమ మానవహృదయాలను వశీకృతం చేసుకుంటుందని తెలియజేసింది. అంతేకాదు సాంసారిక కలహాలుగానీ, సాంఘిక కల్లోలాలుగానీ, జాతీయ విప్లవములు గానీ ముక్తి గమ్యానికి సాధనాలనీ, గాంధి ముక్తి ఉపాయాన్ని తన ఆదర్శజీవితంలో చూపించాడని తెలిపింది. ఆత్మశక్తి, సత్యాగ్రహములనే సహాయసంపదలచే కామక్రోధాలను అరికట్టగలరనీ, నిష్కామ కర్మలద్వారా అహంభావాన్ని ఆత్మత్యాగాన్ని ఆహుతి చేయగలిగితే మానవుడు కారాగారబంధన భయకంపితుడు కాడని చెప్పింది. గాంధి ముక్తికాంతయను స్వరాజ్యమును హస్తగత మొనర్చుకున్నాడనీ, ముక్తియొక్కరుచిని రాష్ట్రనైతిక జీవనమునందే అనుభవించటమే

కాక అనేకములగు బాధలనెదుర్కొని అంతరాత్మయందు ముక్తినిబొంది మహత్తరమగు సత్యాగ్రహధర్మమును జగత్తుకు చాటవచ్చని గుమ్మడిదల దుర్గాబాయమ్మ తెలియజేసింది.

గుమ్మడిదల దుర్గాబాయమ్మ 'స్త్రీజాతి దృక్పథం' (జూన్ 1939 గృహలక్ష్మి) ను గురించి చేసిన రేడియో ప్రసంగంయొక్క ప్రచురణలో స్త్రీజాతికి పురుషులలో కనబడే లోట్లును గురించి విమర్శించి చెప్పాలంటే స్త్రీలు తమ నాజూకుతనాన్ని చంపుకోవాలని నిష్పాక్షక దృష్టితో చెప్పాల్సి వస్తుందనీ, స్త్రీలు కొంత స్వతంత్రత చూపించాలనుకుంటే పురుషులు వారిని అధఃపాతాళానికి త్రొక్కాలను కుంటారని చెప్పింది. స్త్రీలకెప్పుడూ అన్యాయం జరుగుతూనేఉందనీ, కఠినత్వం తెచ్చుకొని నోరెత్తి పురుషులకు చెపుతుంటే స్త్రీలు సాధిస్తున్నారని అంటారనీ, బయటకు స్త్రీ తన అభిప్రాయాన్ని చెబితే అధికుడుగ తనను తాను భావించుకునే పురుషుడు ఆ స్త్రీపై ఆగ్రహం చూపిస్తాడని చెప్పింది. విమర్శను సహించక నిప్పులు తొక్కిన కోతి వలె మారతాడనీ, సాహసించి విమర్శిస్తే స్త్రీని కృతఘ్నురాలంటాడనీ, పైగా స్త్రీయొక్క వేషాన్ని విమర్శిస్తూ వెక్కిరిస్తాడని తెలిపింది. స్త్రీలు తమ గౌరవస్థానాన్ని పొందటానికి తిరిగి కృషిచేయాలనీ, స్త్రీజన సమస్యలపై ఎన్నో గ్రంథాలు వచ్చాయి గానీ, పురుషజాతి సమస్యను పట్టుకుందామంటే ఒక్క పుస్తకం కూడా ఉండదనీ, నిజానికి స్త్రీజాతి కష్టాలకు సంబంధించిన గ్రంథాలన్నీ పురుషజాతి సమస్యలకు సంబంధించినవని చెప్పింది. స్త్రీకి స్వాతంత్ర్యాన్ని పురుషుడు ఇవ్వటానికి అది భిక్షకాదనీ, స్వాతంత్ర్యాన్ని స్త్రీలు ఎవరికి వారే తెచ్చుకోవాలనీ, స్త్రీ సమస్యలు పురుషులు పరిష్కరించాలని భావించకూడదనికూడా చెప్పింది. స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని స్త్రీసమాజాలు పెంపొందించాలనీ, పాశ్చాత్యదేశాలలో స్త్రీకి ఆర్థికబాధ ఉండదనీ, మగవాడు సంపాదిస్తున్నా ఆ వృత్తివల్ల సమాజానికి మేలుకల్గుతోందా అనేదానినే స్త్రీపురుషులు ఆలోచించి అలా సంఘానికి మేలుజరిగేలా సేవచేయటానికి స్వాతంత్ర్యం ఉండాలనీ, సేవచేయటానికి స్త్రీకి స్వాతంత్ర్యం ఉండటం వారిహక్కు అని తెలిపింది. గ్రామసీమలలోని పొలంపనిపాటలను వింటూ పొలం పనులలో స్త్రీ పురుషులిద్దరూ సమాన స్వాతంత్ర్యాన్ని అనుభవించారనీ, సమాన బాధ్యత ఉండేదనేదానికి నిదర్శనాలున్నాయనీ, స్త్రీ జనసంఘాలు స్త్రీలను గురించి చెబుతూ స్త్రీ సంతానాన్ని కనేయంత్రం అంటారుగాని ఇది గ్రామసీమలోని స్త్రీలకు సంబంధించిందని తెలియజేసింది. స్త్రీపురుషులు జాతివిద్వేషాలు లేకుండా ప్రాచీన సంప్రదాయాన్నీ పునరుజ్జీవింపచేయటం స్త్రీ లక్షణమనీ, స్త్రీ పురుషుడికి దూరమవ్వాలనుకోదనీ, కేవలం స్త్రీగా తన బాధ్యతలను సలక్షణంగా నిర్వహించటానికి తగిన వ్యక్తిత్వాన్ని పెంపొందిం చుకునే అవకాశాన్ని మాత్రం వాంఛిస్తోందని చెప్పింది. స్త్రీ జనోద్ధరణ స్త్రీలను మగరాయుళ్ళుగా చెయ్యటానికి కాదని అర్థంచేసుకోవాలనీ, స్త్రీలకు కూడా భిన్నరంగాలతో సంబంధం ఉంటుందనీ, అలా జోక్యం చేసుకోకూడదంటే స్త్రీ స్వాతంత్రాన్ని అడ్డుకోవటమేనని స్పష్టం చేసింది. స్త్రీలు వైద్య, న్యాయవాద వృత్తిని అవలంబించటానికి మన సాంప్రదాయాలలో నిషేధంలేదనీ, స్త్రీలు విద్యతో పురుషుడ్ని అనుకరించటానికి కాదని, స్త్రీగా ఆమెకు అన్ని రంగాలలో పురుషులతోపాటు సమానమైన హక్కులున్నాయని, తెలియజేసింది. అంతేకాక స్త్రీలువృత్తుల ద్వారా

మానవసేవ చేయగలమనే నమ్మకంతో ఉండాలనీ, మగవారు ఫ్యాక్టరీలో ప్రాణహీనమైన భౌతిక సంపదను ఉత్పత్తి చేస్తారుగాని ప్రపంచానికి మూలాధారులైన ఉత్తమ సజీవ మానవోత్పత్తి చేయటం గొప్పదని చెప్పింది. అందుకే ఆమె ఆర్థికసంబంధమైన బాధలను పడాల్సిన అవసరం అనాదిగా ఆమెకు ఏర్పడలేదనీ, అటువంటివాతావరణం భారతభూమిలో తిరిగి ఏర్పడాలనీ కోరుకుందామని గుమ్మడిదల దుర్గాబాయమ్మ తన ప్రసంగంలో తెలియజేసినట్లుగా పత్రిక ప్రచురించింది.

*స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు వారుశిక్షకు గురికాబడి జైల్లో పెట్టబడి నప్పుడు వారియొక్క బాధలను తెలియజేయటంతో స్త్రీలు పడ్డబాధలు అర్థమై స్వాతంత్ర్యం యొక్క విలువ మరింతగా అర్థం అవుతుంది. స్త్రీలు తమ మానప్రాణాలను పణంగాపెట్టి తెచ్చిన దేశస్వాతంత్ర్యపు విలువను నేటి యువతరం గుర్తించాలి. స్త్రీ పురుషులు స్వాతంత్ర్యోద్యములో పాల్గొనటానికి దేశదాస్యవిముక్తి యెడల ప్రేరణ కలిగిస్తూ ప్రజలు నిరాశానిస్పృహులుగా మారకుండా ఉద్యమస్ఫూర్తిని కొనసాగించటానికి అహింసాయుత ముక్తి మార్గాన్ని నిర్దేశించింది. ఆత్మశక్తితో సాధించే దాస్య విముక్తిమార్గాన్ని తెలియజేసింది.*

*స్త్రీలపునరుత్పత్తి శక్తికి ఉన్న విలువను గుర్తిస్తేనే స్త్రీలను గౌరవంగా, ఉన్నతంగా చూడగలరనీ, స్త్రీలు తమంతటతామే సమాజంలోని అన్నిరంగాలలో ఎదగగలిగితే స్త్రీలు స్వాతంత్ర్యాన్ని పొందగలరనీ, పురుషులు స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యాన్ని అడ్డుకోవటం అంటే స్త్రీ పురుషసమానత్వాన్ని అంగీకరించకపోవటమేనని భావించింది.*

చెరుకూరు నాగభూషణమ్మ వ్రాసిన 'మన పతనానికి మనమే కారణము' (నవంబరు 1937 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారతదేశమందు సంఘం అభివృద్ధి చెందకపోవటానికి మూఢాచారాలతోపాటు, జ్ఞానాభివృద్ధి స్త్రీలలో లేకపోవటమేనని, పురుషుల దౌర్జన్యాలు కారణమని, స్త్రీలు ఘోషాను వదలి సభలకు వస్తే వారిని తోటి స్త్రీలే నీచంగా మాట్లాడుతుంటే సంఘమెట్లు అభివృద్ధిచెందుతుందని ప్రశ్నించింది. సంఘంలో స్త్రీలకే ఎక్కువ బాధ్యత ఉందనీ, ఆడువారు నోములతో కాలక్షేపం చేస్తూ, బాల్యవివాహాలను వినోదంగా చూస్తున్నారనీ, ఇంటిలో పురుషదౌర్జన్యానికి తలవంచటం చేస్తున్నారని తెలిపింది. స్త్రీలు విద్యావంతులై పిల్లలను విద్యావంతులు చేస్తూ సంఘంలోని కల్మషాలను పారద్రోలి సంస్కరించే బాధ్యత స్త్రీలు వహించక పోతే స్త్రీల పతనానికి స్త్రీలే కారకులవుతారని హెచ్చరించటం జరిగింది.

ఈమె వ్రాసిన 'స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యములత్యవసరము' (నవంబరు 1939 గృహలక్ష్మి) అనే మరో వ్యాసంలో ప్రపంచానికి పురుషులవలె స్త్రీలు ఉపకరిస్తున్నారనీ, స్త్రీలను పనిముట్లుగా చూడరాదనీ, స్త్రీలు విద్యావంతులైతే మంత్రులవలె సలహాలిస్తారనీ, వారి చేత దాస్యం చేయించుకోకూడదనీ, స్త్రీలకు విద్యావసరము సంసారవికాసానికి తోడ్పడుతుందని తెలిపింది. చదివిన స్త్రీలు చెడిపోరనీ, స్త్రీలు విద్యారహితులైతే కుటుంబంలో అత్యాచారాలు, అతివ్యయం, అజ్ఞానంతో కూడిన కష్టనష్టాలుంటాయని తెలియజేసింది. స్త్రీలుగా బయటకు రావటంచేతనే

కస్తూరిబాగాంధీ, భారతీరంగా, కమలాదేవి ఛటోపాధ్యాయి వంటివారు ప్రజలకు ప్రబోధం చేయగలిగారనీ, స్త్రీలుగా చదువుకోవటంచేతనే రష్యాస్త్రీలను చూసి ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ దేశస్థులు ఆశ్చర్యచకితులవుతున్నారనీ, రష్యాలో 20 సంవత్సరాల క్రిందట స్త్రీలచదువు కొద్ది శాతమే ఉన్నా ఇప్పుడు 90 శాతం చదువుకున్న విద్యావంతులున్నారనీ, ఉపాధ్యాయ పదవిని జడ్జి పదవులను కూడా స్త్రీలు అలంకరించారని తెలియజేసింది. టర్కీలో కూడా ముస్తఫా రెమాల్ పాషా తమ దేశంలోని నిరంకుశపాలనను నిర్మూలం చేసి, స్త్రీ, పురుషులలోని మూఢమతాచారాలు పోగొట్టి, ప్రజారాజ్యం స్థాపించి స్త్రీలకనేక విధములైన స్వాతంత్ర్యాన్నిచ్చి, బురఖా జాడ్యాన్ని కూడా నశింపచేసాడని చెప్పింది. పురుషులతోపాటు స్త్రీలకు ఆస్తిపాస్తులలో సర్వవిధాల హక్కులనిచ్చారనీ, కళాశాల విశ్వవిద్యాలయాలలోని చదువును స్త్రీలకు అందుబాటులోకి తెచ్చి వారికి సర్వవిధ స్వాతంత్ర్యాలను ఇచ్చేసరికి టర్కీలో స్త్రీలు ఓటుహక్కును, చట్టసభలలో సభ్యురాలుగా ఉండే హక్కును సంపాదించారని తెలిపింది. స్త్రీలసభలు, సంఘాలను, ఏర్పరచుకొని కవయిత్రులుగా, వక్తలుగా, పత్రికాధిపతులుగా, సంఘసేవాధురీణులై మాతృదేశ ఔన్నత్యానికి పాటుపడుతూ, దేశాభిమానంతో దేశసేవలో పురుషులతోపాటు స్త్రీలు పట్టుదల వహించటంచేతనే టర్కీదేశం అభివృద్ధిని సాధించిందని కూడా తెలియజేసింది. విదేశీయువతులైన మిస్ మేయోవంటి వారిచేత హేళనచేయబడుతూ స్వపరిపాలనకు భారతజాతి అర్హమైనదికాదని అనిపించుకోవటానికి కారణం ఆమెయొక్క దేశంలో పురుషులకంటే స్త్రీలే హెచ్చుగా అధికవిద్యావంతులని గ్రహించాలని చెప్పింది. దేశకాల పరిస్థితులను బట్టి స్త్రీలలో విజ్ఞానాన్ని నెలకొల్పి వివాహ, ఆర్థికాది సమాన హక్కులనిచ్చి సర్వవిధ స్వాతంత్ర్యములతో వారియొక్క వ్యక్తిత్వాలను గౌరవించే పురుషులు దేశోద్ధారకులైతేనే భారతాంబకు శాంతి కలుగుతుందని చెరుకూరు నాగభూషణమ్మ తెలియజేసింది.

*స్త్రీలు సమాజాభివృద్ధితో ముందుండాలని హెచ్చరిక చేసింది. స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవటం స్త్రీలచేతులలోనే ఉందని భావించింది. స్త్రీలు సామాజిక కార్యక్రమాలలో స్వేచ్ఛగా పాల్గొన గలిగితే వారికి సాంఘిక స్వాతంత్ర్యం ఉన్నట్టనీ,దానికి రక్షణగా ఆర్థిక హక్కులు ఉంటే, రాజకీయహక్కులనుకూడా సాధించుకోగలిగి స్త్రీలు సర్వస్వతంత్రులయి దేశస్వాతంత్ర్యాన్ని సాధించగలరని భావించింది.*

'మధుపానము' అనే శీర్షికన కుమారి బి.పి.సుశీలాబాయి వ్రాస్తూ సత్యాగ్రహ కార్యక్రమాలను చైతన్యపరిచే క్రమంలో పురుషుల మద్యపానంవల్ల వారి ఆరోగ్యం పాడయి కుటుంబహింస ఎక్కువవుతుందనీ, ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలు చేసుకొంటున్నారనీ మద్యపానాన్ని నిషేధించాలని తెలియజేసింది.

సీతాదేవి వ్రాసిన 'మహిళాలోకము-స్త్రీ ప్రభావం' అనే (డిసెంబరు 1937 ఆంధ్రభూమి) వ్యాసంలో మనదేశంలో స్త్రీ ఇదివరకు ఉన్న స్థానంలోనే ఉందనీ, మగవానితో సమానమైన హక్కు కావాలని నేడు స్త్రీలనుకుంటున్నారనీ, మన పురాణాలలో స్త్రీలకు గౌరవస్థానాన్ని యిచ్చారని

తెలిపింది. ఆధునిక కాలంలో దేశసేవకై తన జీవితాన్ని నెహ్రూ ధారపోయటానికి ప్రేరణశక్తి కమలానెహ్రూ అనీ, రైతుభార్యకు కుటుంబంలో గొప్పస్థానం ఉందని చెప్పింది. కాని నేడు విద్యాధికులైన స్త్రీలు స్వేచ్ఛపేరుతో చపలచిత్తులగుచున్నారనీ, ఆత్మవిశ్వాసంతో గృహములను చక్కదిద్దు కోవాలనీ, 'నాగరికత' అనే రాక్షసిని గుర్తించి, జాగ్రత్తగా మసలుకోమని తెలియజేసింది.

*రచయిత దృష్టిలో స్త్రీ అంటే ఒక గృహిణిగా మాత్రమే ఉంటూ భర్తకు ప్రేరణశక్తి గా ఉండాలిగానీ, సామాజికస్వేచ్ఛ ఉండక్కరలేదనే రచయిత యొక్క తిరోగమనపు ఆలోచనలు అర్థం అవుతాయి. భార్యలుగ అయినప్పుడు స్త్రీలు భర్తయొక్క దృష్టితోనే ఆలోచించాలనే సాంస్కృతిక వాసనలు వారిలో పోకపోవటమే కారణం అని గ్రహించాలి. నాగరికతకు, స్త్రీలస్వేచ్ఛకు ఉన్న తేడాను గుర్తించకపోతే అభివృద్ధి ఉండదని భావించింది.*

వెలగపూడి సరస్వతమ్మ వ్రాసిన 'మన కర్తవ్యము' (డిసెంబరు 1937 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ప్రతి గ్రామంలో స్త్రీల ఔన్నత్యానికి కావలసిన విషయాలను బోధించటానికి సమాజాలను నెలకొల్పాలని అన్ని సమాజాలు కలసి తీర్మానాలు చేసుకొని అఖిలభారతసభలకు అందించాలనీ, అప్పుడే స్త్రీలకు కావల్సిన హక్కులు విద్యావిషయాల సౌకర్యాలు ఏర్పడతాయని తెలియజేసింది. అంతేకాక ప్రపంచమును కలవరపరచే సంగ్రామ విషయాలు, గాంధీ మహాత్ముని విద్యావిధానము, ప్రపంచంలో రోజూ జరిగే మార్పులను గ్రహించటం స్త్రీలకర్తవ్యమని తెలియజేసింది. విద్యావిధాన సంస్కరణ సభలో గాంధి చెప్పినట్లుగా పాఠశాలలు 5 గంటలు పనిచేయాలనీ, దానిలో 1 గంట శాస్త్రాధ్యాయనం, 4 గంటల వృత్తి విద్యలు నేర్పాలని చెప్పింది. ఆ సభలో సౌదామిని మెహతా విద్యార్థులకు చదువు సంధ్యల కంటే కూడా పౌష్టికాహారాన్ని ఇవ్వాలనీ, శాస్త్రాధ్యాయనం, చేతిపనులు నేర్చుకోవటానికి ఆరోగ్యం ముఖ్యమనీ, సి.ఆర్.రెడ్డిగారు చెప్పినట్లుగా మనదేశపు శీతోష్ణస్థితి గతులనుబట్టి పాఠశాలవేళలు ఉండాలని చెప్పారని తెలియజేసింది. అంతేకాదు ప్రాథమిక విద్యవరకు బాలబాలికలు కలసి చదువుకోవచ్చుగానీ, మాధ్యమిక విద్యాశిక్షణకై బాలికలకు ప్రత్యేక పాఠశాలలుండాలనీ, దేశంలో శిశుసంరక్షణాలయాలు ఉండాలని చెప్పింది. స్త్రీలకు పురుషులతో పాటు సమానంగా రాజకీయ విషయాలు తెలిసిఉండాలనీ, దానివల్ల దేశస్వాతంత్ర్యమునకు, హక్కులకొరకు పాటుపడగలుగుతారనీ, గృహనిర్వహణానంతరం స్త్రీలు రాజకీయాలలో పాల్గొనాలని కూడా తెలిపింది. బాల్యవివాహాలు కాక 16 సంవత్సరములకు వివాహం చేస్తే ఆడపిల్ల చదువు అభివృద్ధి చెందుతుందనీ, వరశుల్కాలు తగ్గుతాయనీ తెలియజేసింది. 1913 లో ప్రారంభమైన భాషాప్రయుక్త ప్రత్యేకరాష్ట్రాలకై ఆంధ్రరాష్ట్రావశ్యకతకు స్త్రీలు సమాంతరంగా పోరాటాలు చేస్తున్నారనీ, దానివలన మహానదుల నీటిని అరికట్టి వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుందనీ, ఎక్కువశాతం ఆదాయాన్ని తమిళదేశపు ఖర్చులకింద వాడుతుంటే రాయలసీమ అభివృద్ధి చెందటంలేదనీ తెలియజేసింది. ఆంధ్రుల అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని భావించింది.

*స్త్రీసమాజాల కర్తవ్యం స్త్రీల ఔన్నత్యానికి ఉపయోగపడటమేకాక, రాష్ట్ర, దేశస్థాయి సమస్యలపై తీర్మానాలు చేసి పంపగల స్థాయికి చేరుకొన్నట్లు అర్థమవుతుంది. ఇక ఆంధ్ర ప్రాంతంలోని స్త్రీలలో రావల్సిన రాజకీయచైతన్యాన్ని ఉద్దేశించి వ్రాసిన వ్యాసమిది. నాడే నీటియాజమాన్య నిర్వహణకు, వ్యవసాయాభివృద్ధికి, ప్రాంతీయాభివృద్ధికి ఆంధ్రరాష్ట్రం రావాల్సిన అవసరాన్ని తెలియజేసింది. రాజకీయవ్యవస్థను గురించిన స్త్రీల ఆలోచనలు వారియొక్క రాజకీయ చైతన్యానికి నిదర్శనం. అందుకే స్త్రీలు రాజ్యవ్యవస్థలో భాగస్వాములయితేనే తమ హక్కులను, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని దేశస్వాతంత్ర్యాన్ని సాధించుకోగలరని భావించింది.*

స్వర్ణకంకణగ్రహీతయైన 'బత్తుల కామాక్షమ్మను' గురించి (జనవరి 1938 గృహలక్ష్మి) పత్రికాధిపులు ప్రచురిస్తూ ఆమె బాలవితంతువైనా గౌతమీ గ్రంథాలయములందలి పుస్తకాల పఠనం వల్ల విద్యాభివృద్ధిని పొంది సంఘోద్ధరణ కార్యములు చేయాలని సంకల్పించిందనీ, దేశంలోని పుణ్యక్షేత్రాలను అన్నింటినీ దర్శించిందనీ, నాళం రామలింగయ్యగారి సహాయంతో సంఘాన్ని స్థాపించి సంఘసేవకు పూనుకున్నదని తెలియజేసింది. 1924లో గుంటూరులో జరిగిన ఆర్యవైశ్య మహిళాసభకు అధ్యక్షతవహించిందనీ, 1927లో ఆంధ్రరాష్ట్ర మహిళాసభకు, అఖిలభారతీయ మహిళాసభ నిర్వహణా సభ్యురాలిగా ఉండి సాంఘిక, రాజకీయ, వైజ్ఞానికముగా ఆంధ్రమహిళలు అభ్యున్నతిని పొందాలని ఆలోచించిందని తెలిపింది. ఈమె 1929 లో పట్టభద్రురాలై వైశ్య స్త్రీలలో ప్రథమురాలిగా విద్వాన్ బిరుదము పొందిందనీ, నాళం రామలింగయ్యగారు రాజమండ్రిలో 1920 లో స్థాపించిన వైశ్యసేవాసదనపాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేసిందని కూడా తెలియజేసింది. అంతేకాక 1931లో ఈమె స్వయంగా 'ఆంధ్రయువతీ సంస్కృతకళాశాలను స్థాపించిందనీ ఆ కళాశాలలో సంస్కృతాంధ్రాంగ్ల భాషలతోపాటు కుట్టుపని, సంగీతం, చిత్రలేఖనాలను నేర్పించే వారనీ, 1935లో రాజమండ్రిలో 'గౌరవ న్యాయాధికారిణిగా నియమింప బడిందనీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సెనేట్ మెంబరుగా, ఎకడమిక్ కౌన్సిల్ సభ్యురాలుగా ఉండి పాఠ్యాంశ నిర్ణయంలో భాగస్వామురాలైందనీ పత్రిక తెలియజేసింది.

*ఒక వితంతుస్త్రీ విద్యాభివృద్ధి చేసుకొని న్యాయాధికారిణి కాగలగటమే స్త్రీల అభివృద్ధికి చిహ్నమని, అదే వారిని ఉన్నత స్థానానికి చేర్చగలిగిందని రుజువుకాబడటం అర్థం అవుతుంది.*

పులుగుర్తు కనకమ్మ వ్రాసిన 'గృహపరిశ్రమలు' (జనవరి1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు తీరిక సమయాలలో పత్తినికొని, రాట్నంతో నూలువడికి ఆ నూలుతో దుప్పట్లు, చొక్కాగుడ్డలు, ముదుక చీరెలు నేసుకోవచ్చునీ, ఆ రకంగా స్త్రీలు ధనమును సంపాదించవచ్చునీ, కఱ్ఱ బ్లాకులతో రంగులు అద్దవచ్చునీ, బొమ్మలను ముద్రించవచ్చని తెలిపింది. అంతే కాక, కూరలు పండించ వచ్చునీ, దంపుడు బియ్యం, పసుపు, కారాలు, కాటుక తయారీ వంటివిచేస్తే దాని కొనుగోలు ధరకంటే రెట్టింపు లాభం వస్తుందని చెప్పింది. ఇప్పుడు వడ్రంగము, లోహపు పనులు కూడా స్త్రీలు చేస్తున్నారనీ, స్త్రీలు గృహపరిశ్రమల ద్వారా ధనార్జనచేసి స్వతంత్రముగా జీవనముచేస్తే దేశసౌభాగ్యమును పెంపొందించగలరని తెలియజేసింది.

*ఆనాడే స్త్రీలు సూక్ష్మతరహా స్థాయి గృహపరిశ్రమలను నిర్వహిస్తూ ఆర్జనచేసి స్వయంపోషకదిశగా అడుగులు వేసి, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించే మార్గాలను ఆలోచించటం ఆశ్చర్యాన్ని కలిగించే విషయంగా భావించాలి.*

'మాడభూషి చూడమ్మ' ను (ఫిబ్రవరి 1938 హిందూసుందరి) గురించి బాలాంత్రపు శేషమ్మ వ్రాస్తూ చూడమ్మ విద్యావతిగా హిందూసుందరి పత్రికకు 10 సం.లపాటు సంపాదకురాలిగా ఉందనీ, బాలవితంతువైన బ్రహ్మచారిణిగా పెరుగుతూనే ఆమె తన మిత్రురాలితోపాటు విజ్ఞానచంద్రికా పరిషత్తు వారి పరీక్షలు వ్రాసిందని తెలిపింది. ఆమె మద్రాసులో 1920 నుండి ప్రభుత్వ స్కూలులో తెలుగుపండితురాలుగా స్థిరపడిందని తెలిపింది. అంతేకాక, దామెర్ల సీతమ్మ 1910 లో తన విద్యావ్యాపకానికి ప్రోత్సాహాన్నిచ్చిందనీ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ గారిచే నెలకొల్పబడిన కాకినాడ విద్యార్థి సమాజానికి నూతనోజ్జీవాన్ని కలిగించినట్టును, తన కూతురు కాళ్ళకూరి మహాలక్ష్మి సుందరమ్మగా పేరు పొందేవరకు చూడమ్మచేతిలో పెరిగిందని తెలియజేసింది. అంతేకాదు, చూడమ్మ అనాథబాలికలను చేరదీసి విశాఖపట్టణంలో నర్సులుగా సేవచేసే స్థితికి స్త్రీలను తెచ్చిందని, వారిలో ఇద్దరికి ఇళ్ళు కట్టించి యిచ్చిందనీ, తన అరువదవఏట విద్వాన్ పరీక్షా గ్రంథములు చదవ మొదలుపెట్టిందనీ, స్మార్తవైష్ణవ భేదం లేకుండా చూసిందనీ, 1938 ఫిబ్రవరి లో పరమపదించిందని తెలియజేసింది.

*బాలాంత్రపు శేషమ్మ తన మిత్రురాలిగా మాడభూషి చూడమ్మయొక్క విద్యాసంస్కారాన్ని, సాంఘిక సేవను తెలియజేసింది. అనాథ బాలికలను నర్సులుగా చదివించి, ఇళ్ళు కట్టించి ఇవ్వటం, ఆమె అరవయ్యేళ్ల వయస్సులో విద్యావంతురాలిగా విద్వాన్ పరీక్షలు వ్రాయాలను కోవటం, స్త్రీలవయోజన విద్యకు పాదులు వేయటం, ఆమె సామాజిక సేవకు, విద్యార్జనా కాంక్షకు నిదర్శనమని అర్థమవుతుంది. స్త్రీగా తాను ఎదుగుతూ మాడభూషి చూడమ్మ సమాజాన్ని ఎదిగింప జేయటం గొప్ప విషయం.*

క్రొవ్విడి మాణిక్యాంబ వ్రాసిన 'శాసనసభలు–స్త్రీ కర్తవ్యం' (ఫిబ్రవరి 1938 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో నూతన సంస్కరణలవల్ల శాసనసభలలో కొంతమంది మహిళలు ఎన్నుకోబడటం, మరికొంతమంది నియమింపబడటం జరుగుతుందనీ, దీనికి స్త్రీసంఘాలు కృషి చేయాలని తెలియజేసింది. అంతేకాక, శాసనసభలలో స్త్రీసభ్యురాండ్రు తమ ఆశయాలను వెల్లడించి స్త్రీల అభ్యుదయానికి పాటుపడాలనీ, బాలికలకు ఉన్నతపాఠశాలలు ఏర్పాటుచేయటమే గాక వాటియందు పారిశ్రామిక విద్యలు నేర్పాలనీ, పరిశ్రమలపైన దేశౌన్నత్యం ఆధారపడి ఉంటుందని చెప్పింది. పాలన, పరిస్థితులను స్త్రీలకు తెలియజేస్తూ పరిపాలనలో స్త్రీలకుకూడా పురుషులవలె సమానహక్కులున్నాయని తెలియజేసింది.

*స్త్రీలు పాలనావ్యవస్థలోఉండాలనుకోవటం స్త్రీల అభ్యుదయానికి పాటుపడటం కోసమేననీ, స్త్రీ పురుషులు పాలనావ్యవస్థలో సమానంగా ఉండాలని భావించింది. స్త్రీలు శాసనసభ్యులైతే పాలనా విషయాలన్ని స్త్రీలకు తెలియజేయగలరని స్త్రీల సమస్యలను తీర్చగలరని భావించింది.*

'శాసనసభకెన్నుకొనబడిన సభ్యురాండ్రు' (ఫిబ్రవరి 1938 గృహలక్ష్మి) అనే శీర్షికన పత్రికాధిపుల ప్రచురణలో నూతన రాజ్యాంగసవరణలనుబట్టి మద్రాసు రాష్ట్రపు శాసనసభకై స్త్రీలకు కేటాయించిన ప్రత్యేక నియోజకవర్గాలకు తొమ్మిదిమంది స్త్రీలు ఎన్నుకోబడ్డారనీ, అందులో ఒకరు క్రైస్తవ వనిత, ఒకరు మహ్మదీయ వనిత, ఒక జనరల్ స్థానానికి లక్ష్మీదేవి పోటిచేసారనీ, దానికై కాంగ్రెసు వారు తొమ్మదిమంది స్త్రీలను నిలబెట్టారని తెలియజేసింది. వారిలో భారత స్త్రీమహిళామండలి కార్యదర్శి, డిస్ట్రిక్టుబోర్డు సభ్యురాలును, మదరాసు విశ్వవిద్యాలయ సెనేట్ మెంబరు, సత్యాగ్రహ ఉద్యమంలో రెండుమార్లు జైలుకు వెళ్ళిన మహిళగానూ, 1935 లో లెజిస్లేటరు కౌన్సిలు సభ్యురాలిగాను ఎన్నుకోబడిన ఆచంట రుక్మిణమ్మ నేడు మదరాసు శాసనసభకు చెన్నపురి స్త్రీలస్థానంనుండి సభ్యురాలుగా ఎన్నుకోబడిందని తెలియజేసింది. 1930 నుండి కాంగ్రెస్ లో ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తూ, ఒక ఏడాది పాటు జైలుకెళ్ళిన ఎన్. లక్ష్మీదేవమ్మ బళ్ళారి నియోజకవర్గం నుండి ఎన్నుకోబడిందనీ, ఏలూరు నియోజకవర్గం నుండి గంధం అమ్మన్న రాజాగారు, ఖడిజాయాకుబ్ హుస్సేన్ చెన్నపురి మహమ్మదీయ స్త్రీ నియోజకవర్గం నుండి ఎన్నుకో బడిదని తెలిపింది. తిర్నవేలి పల్లంకోడు నియోజకవర్గం నుండి మాసిలామణి పిళ్ళై క్రైస్తవ స్త్రీగా ఎన్నుకోబడినదనీ, దిండికల్ నియోజకవర్గం నుండి లక్ష్మీకృష్ణస్వామి భారతిగారు, తిరునల్వేలి రూరల్ స్థానంలో జనరల్ సీటుకై జస్టిస్ పార్టి నాయకులను ఓడించి మరీ గెలుపొందిన వారిగా శ్రీమతి లక్ష్మీ శంకరయ్యగారినీ, కడలూరు నుండి అంజలి అమ్మాళ్ గారు, కాలికట్ స్త్రీ నియోజక వర్గంలో అమ్మకుట్టి అమ్మాళ్ గారు ఎన్నుకోబడిన విషయాన్ని పత్రిక తెలియజేసింది.

*స్త్రీలు శాసనసభలలో ఎన్నికకాబడటమే తమకున్న రాజకీయ హక్కును, పాలనా హక్కును సాధించుకొన్నారు అని అనటానికి నిదర్శనంగా ఈ వ్యాసం ఉంది. దీనినే స్త్రీలు సాధించుకొన్న రాజకీయ స్వాతంత్ర్యంగాను, స్త్రీల రాజకీయ సాధికారికతగా భావించాలి.*

అ.రాధమ్మ వ్రాసిన 'స్త్రీలు-నిర్బంధవిద్యా శాసనం' (మార్చి1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీల విద్యావ్యాప్తికి పాఠశాలలు నెలకొల్పినా, అది స్త్రీల జ్ఞానాభివృద్ధికి తోడ్పడి అక్షరజ్ఞానం కలిగించినా, స్త్రీలు కార్యనిర్వహణలో తికమక పడుతున్నారని తెలిపింది. ప్రతిగ్రామంలో నిర్బంధ బాలికా పాఠశాలలు పెట్టాలనీ, రాట్న పరిశ్రమలను నేర్పించాలనీ, వీటితోపాటు స్థిర, చర గ్రంథాలయాలు ఉండాలనీ, విద్యాగంధం ఉంటేనే స్త్రీలకు స్వతంత్ర జీవనం ఏర్పడుతుంది కాబట్టి స్త్రీలకు 'నిర్బంధ బాలికా విద్యాశాసనాన్ని' చేయాలని తెలిపింది.

*ప్రతి బాలిక చదువుకుంటే స్త్రీలకు స్వాతంత్ర్యంవస్తుందనీ, అప్పుడే సంపూర్ణంగా దేశస్వాతంత్ర్య సాధన సులభమవుతుందనే భావన వ్యక్తం అయింది. శాసనసభకు ఎన్నిక కాబడిన స్త్రీలు చదువుకుంటే కార్యనిర్వహణా సామర్థ్యం పెరుగుతుందని భావించింది. అందుకే ఈమె నిర్బంధ బాలికా విద్యను చట్టం చేయాలని కోరుకుంది.*

'స్త్రీసమాజాలు' (మార్చి 1938 గృహలక్ష్మి) అనే శీర్షిక క్రింద పత్రికాధిపులు వ్రాస్తూ 1902లో ప్రారంభమైన స్త్రీసమాజాలు స్త్రీలను ఉద్ధరించాలనే లక్ష్యంగా సాగాయనీ, స్త్రీలకు స్వతంత్ర జీవనం గావించి చైతన్యాన్ని కలిగించాయని తెలిపింది. స్త్రీపురుష సమానత్వం, స్త్రీల వోటింగ్ హక్కు, స్త్రీల ఉన్నత విద్య, పారిశ్రామిక విద్యాబోధనకై స్త్రీ సంఘాలు కృషి చేసాయని పత్రిక తెలియజేసింది.

*ఈ పత్రికలోని ప్రచురణ సాక్ష్యంగా స్త్రీసమాజాలయొక్క లక్ష్యం ఫలించిందని నిరూపితమైనది.*

మర్ల రోజాబాయి 'ఆంధ్రయువతి నిరాడంబర జీవనము' (ఏప్రిల్ 1938 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ ఆంధ్రయువతులు నిరాడంబర జీవనాన్ని గురించి, ఖద్దరు వస్త్రధారణను గురించి ఉపన్యాసాలిస్తున్నారు కానీ ఆచరణలో పెట్టటం లేదని తెలిపింది. దేశీయ, రాష్ట్రీయ, గృహ ఆరోగ్యానికి ఖద్దరు వస్త్రధారణ ప్రధానమనీ, భోజనాలకెంత ఖర్చు పెడుతున్నామో అంతఖర్చు విదేశీవస్త్రాలకు పెట్టటంతో ఆ డబ్బు విదేశీఫ్యాక్టరీలకు వెళుతున్నదనీ, కాఫీలు త్రాగటంతో కూడ అనారోగ్యం పాలవుతున్నారని తెలియజేసింది.

*స్త్రీలు పెట్టుబడిదారీ వ్యవస్థను, దేశంయొక్క ఆర్థికస్థితిని అంచనా వేయగల స్థితికి చేరుకున్నారని అర్థమవుతుంది.*

దేవినేని మాణిక్యాంబ 'వర్ణవ్యవస్థ' (ఏప్రిల్ 1938 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ వర్ణములను అంతమొందించాలంటే విశ్వసోదరప్రేమ ఉండాలనీ సమాజంలో కొంతమంది ధనవంతులు, కొంతమంది బీదవారు ఉంటున్నారనీ, వాటికి కారణాలు ఆలోచించకుండా వర్ణవ్యవస్థను కల్పించారని తెలిపింది. బీదవారు చింతతో స్వయంకృషి వదిలి అన్యవృత్తుల నవలంబిస్తున్నారనీ, వారిని అందరితో సమానంగా చూడాలనీ, జాతిభేదం గుణగతమైనది కాని, వ్యక్తిగతం, వృత్తిగతం కాదనీ, దీనికి ఆత్మచికిత్స అవసరమనీ, తనకంటే తక్కువ వారిని దగ్గరకు తీస్తే విశ్వమానవ ప్రేమ ఏర్పడుతుందని తెలియజేసింది.

*వర్ణవివక్ష ఏర్పడటానికి వర్గవ్యవస్థ మూలమనే చారిత్రక సత్యాన్ని ఆవిష్కరించింది. కులంకంటె గుణము ముఖ్యమని ఎవరికివారు చేసుకొనే ఆత్మచికిత్స ద్వారా మాత్రమే కుల సామరస్యం సాధ్యమవుతుందని తెలియజేసింది.*

దర్శి సుభద్రమ్మ వ్రాసిన 'భారతస్త్రీల ప్రస్తుత స్థితి' (మే 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో దేశంలో దారిద్ర్యం, బానిసత్వం ప్రజలను బాధపెడ్తుంటే స్త్రీలు మరింతగా అణగద్రొక్క బడుతుంటే, స్త్రీలకు స్వేచ్ఛగానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులుగానీ లేవని తెలిపింది. స్త్రీల సమస్యలను ప్రత్యేకంగా చూడటం కాక అవి పురుషుల సమస్యల్లో కలిసి ఉన్నాయనీ, అవి ప్రజలందరి సమస్యగా భావించాలనీ తెలియజేసింది.

*స్త్రీల 'అణిచివేత' యొక్క విశ్వరూపాన్ని తెలియజేయటం నాటికది క్రాంతదర్శనం. స్త్రీలకు రాండవలసిన హక్కులను పేర్కొంది. స్త్రీల సమస్యలు పురుషుల సమస్యల్లోనే ఉన్నాయన్న భావన కాలం గడిచిన కొద్దీ నిరూపింపబడుతున్న సత్యం. ఓల్గా వ్రాసిన విముక్త వంటి కథాసంపుటిలో ఈ సత్యమే తెలియజేయబడింది.*

ఈమె వ్రాసిన 'భారతస్త్రీల ఉద్యమం-భావపరిణామం' (అక్టోబరు 1938 గృహలక్ష్మి పత్రిక) అనే మరొక వ్యాసంలో ప్రపంచ స్త్రీలు తమ సంకెళ్ళను తెంచుకోవటానికి చేస్తున్న ఉద్యమ ప్రభావం భారతస్త్రీల మీద కూడా ఉండి పరివర్తన ఏర్పడుతోంది కానీ పురాణాలు, ధర్మశాస్త్రాలు, మూఢభక్తి విశ్వాసాలు భారతదేశస్త్రీల సంకెళ్ళను తెంచలేకపోతున్నాయని తెలిపింది. సంఘసంస్కరణలను, శాసనాలను ఆచరణలో పెట్టటం లేదనీ, భారత స్త్రీల అభ్యుదయానికి స్త్రీ ఉద్యమం వచ్చినా ఆశయం నెరవేరటంలేదనీ తెలిపింది. కొంతవరకు ప్రభుత్వపుపాలన భారతీయుల స్వాధీనంలోకి వచ్చింది కనుక సాంఘిక లోపాలను తొలగించి స్త్రీలను ఉన్నతదశకు తేవాలనీ, స్త్రీలయొక్క ప్రతి విషయం ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ప్రధానమైన దేశఆర్థిక విధానం మారాలని చెప్పింది. స్త్రీలకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కులు కావాలని, భారతదేశ స్త్రీలు స్వాతంత్ర్యం తమ జన్మహక్కని భావించాలని దర్శి సుభద్రమ్మ తెలియజేసింది.

*స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని కలిగించగల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలు ఏర్పడితే తప్ప దేశానికి సంపూర్ణస్వాతంత్ర్యం లభించదని భావించింది. స్త్రీలకు ఆర్థిక రాజకీయ, సాంఘిక హక్కులను కల్పించటమే కాక, స్త్రీలను కాపాడే విధంగా ఆర్థిక విధానాలు ఉండే విధంగా రాజకీయ వ్యవస్థ అవసరమని ఆనాడే స్త్రీలు ప్రభుత్వానికి మార్గనిర్దేశం చేయటం ఆశ్చర్యపరచే విషయం. పాశ్చాత్యదేశాలలోని స్త్రీలప్రగతి భారతీయ స్త్రీలమీద ప్రభావం చూపించినా అనాదిగా వస్తున్న మూఢాచారాలవల్ల మహిళోద్యమాలవల్ల ఫలితాలు తగినంతగా లేవనీ, దాని కోసం ప్రభుత్వం కృషిచేస్తేనే స్త్రీల జీవితం సాంఘిక, ఆర్థిక, రాజకీయాలతో ముడిపడి ఉంటుందని ఉంటుదని సుభద్ర ఆ నాడే గుర్తించింది. కనుక స్త్రీలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులు కలిగి ఉండాలనీ, స్త్రీలు స్వాతంత్ర్యం తమ జన్మహక్కని భావించాలని తెలియజేసింది. స్త్రీల స్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యం పరస్పర ఆశ్రితాలని అర్థమవుతుంది. స్త్రీల వ్యక్తిగత జీవితమంతా రాజకీయమేననే నానుడిని స్త్రీలు ఆనాడే గుర్తించారు.*

'కార్ల సరదా తీరాలంటే కాంగ్రెస్ కు వోటు చెయ్యాలి' (జూన్ 1938) అనే శీర్షికన బులుసు ప్రకాశమ్మ వ్రాస్తూ 1935 శాసనసభా చట్టం ప్రకారం ఎన్నికలు వచ్చాయనీ, సంతకం చేయటం వచ్చిన వారికి ఓటువేసే అర్హత వచ్చిందని తెలిపింది. కాంగ్రెసు వారు ఇంటింటికీ వచ్చి స్త్రీలను కారులో తీసికెళ్ళి వోటు వేయించుకుంటున్నారనీ, ఓటు వేసి బయటకు వచ్చిన తర్వాత తిరిగి ఆ కారులో ఇంటిదగ్గర దింపటం లేదనీ, కారు వైభోగానికి ఆకర్షింపబడి స్త్రీలు ఓటు వేస్తున్నారని తెలియజేసింది.

*స్త్రీలకున్న ఓటు విలువను నీరుకార్చే రాజకీయవ్యవస్థలోని కుహనాతత్వాన్ని ఆనాడే వ్యంగ్యంగా తెలియజేసిన కళాత్మక హెచ్చరిక ఇది.*

*1928లో బ్రిటిష్ ప్రభుత్వం స్త్రీలకు ఓటు హక్కును ఇచ్చింది. 1935 చట్టంప్రకారం రాష్ట్ర శాసనసభలకు 1937 లో ఎన్నికలు జరిగాయి. ఆకర్షణలతో ఓటువేయించకొనే నేటిరాజకీయాలు 1937 లో రాష్ట్రీయస్వాతంత్ర్యానికై జరిగిన భారతదేశంలో ప్రథమ ప్రజాస్వామ్యపు ఎన్నికలప్పుడే ఆరంభమయ్యాయనీ, నేటికీ అదేఎన్నికలవ్యవస్థ కొనసాగుతోందని అందరికీ తెలిసిన విషయమే.*

'వైశ్యవనితా రత్నాలు'గా (జులై 1938 వాసవి) పేర్కొన్న పత్రికాధిపుల ప్రచురణలో మహిళలుగా వారిలో కలిగిన సాంఘిక, రాజకీయ చైతన్యానికి నిలువెత్తు ఉదాహరణగా వైశ్యస్త్రీలను పేర్కొంటూ లేడి వెంకట సుబ్బారావుగా చెప్పబడిన ఆండాళమ్మ స్వదేశీ, విదేశీయ మహనీయుల సంఘములలో సమర్థతతో మెలిగి వివిధసభలలో ఆంగ్లోపన్యాసలిచ్చేదనీ, యువతులకు వసతి భోజన సౌకర్యాలతోపాటు ఉన్నతవిద్య, వృత్తివిద్యను నేర్పటానికి ఏర్పడిన మదరాసు సేవాసదనాన్ని నైపుణ్యతతో నిర్వహించి ప్రభుత్వంవారిచే 'కేసరీహిందు' పతకాన్ని పొందిందని తెలియజేసింది.

బత్తుల కామాక్షమ్మ 'ఉభయభాషాప్రవీణ' బిరుదుతో రాజమండ్రిలోని వైశ్యసేవాసదనాన్ని, ఆంధ్రయువతీ కళాశాలల ప్రిన్సిపాల్ బాధ్యతలను నిర్వహించి, ఆనరరీ మెజిస్ట్రేటుగా పనిచేయటమే గాక ఆంధ్రాయూనివర్సిటీ సెనేట్ మెంబరుగా స్త్రీ విద్యావిధానంలో మార్పులను ప్రవేశపెట్టిందనీ, తదనంతరము రాజమండ్రి పురపాలకసంఘ సభ్యురాలిగా స్త్రీ విద్యాభివృద్ధికి కృషిచేసిందని తెలియజేసింది.

అత్సం సత్యవతీదేవి కారాగారగృహము నందలి స్త్రీలను చూసి వారి యోగక్షేమములు కనుక్కుంటూ ఆనరరీ మెజిస్ట్రేటు పదవిని అలంకరించిందనీ, శిశుపోషణ సంఘాలలో నాయకత్వం, వహించిదనీ, నరసాపురం డిస్ట్రిక్ట్ బోర్డు మెంబరుగా ఉంటూనే నిరాధార అనాథలకు వివాహములు జరిపించి అందరి మన్ననలు పొందిందని తెలియజేసింది.

పాదర్తి సుందరమ్మ ఆంధ్రంలో చక్కటి ఉపన్యాసాలిస్తూ దేశాభివృద్ధికరములైన కార్యములలో తోడ్పడుచూ, బెజవాడ పురపాలకసంఘ సభ్యురాలుగా రెండుసార్లు ఎన్నుకోబడి ప్రజాసేవ చేసిందని తెలియజేసింది.

పులవర్తి కమలావతిదేవి సభలలో తన ఉపన్యాసాలతో అమృతవాహినిని ప్రవహింప చేసేదనీ, ఎన్నో కావ్యాలు రచించిదనీ, వ్యాసాలు, కథలు వ్రాసి 'కవితిలక' బిరుదును పొందిందనీ తెలిపారు. చుండూరి కళ్యాణి సంఘ సంస్కరణాభిలాషి అనీ, సత్యాగ్రహోద్యమంలో పాల్గొని కారాగార శిక్షను అనుభవించిందని తెలియజేసింది.

గోనుగొంట్ల లక్ష్మీనరసమ్మ విద్యావతియైన సంఘ సంస్కరణాభిలాషి అనీ గుడివాడ పురపాలకసంఘ సభ్యులుగా ఎన్నుకోబడిందని తెలియజేసింది.

చీమకుర్తి సత్యవతీదేవి కవయిత్రి అనీ, పత్రికలో చక్కటి వ్యాసాలు వ్రాసేదనీ, మరియు ఉదుత్త మంగళారాజమ్మగారు రెండు అరటిపండ్లతో ఆకలిని శమింప జేసుకొని తోటివారికి సహాయ పడటమేగాక విద్యాభివృద్ధికి, వ్యాధినివారణకు వచ్చినవారికి సహాయం చేసిందనీ, ఈమెను 'కర్మయోగి' గా భావించేవారని తెలియచేసింది.

*వర్ణప్రాధాన్యతకంటే కూడ వైశ్యకులస్త్రీల అభివృద్ధిని అన్నివర్ణాల స్త్రీలు స్ఫూర్తిమంతంగా భావించేటట్లు వ్రాసిన వ్యాసమిది. ఒకప్రక్క స్త్రీస్వాతంత్ర్యానికి ఉపయోగపడే స్త్రీవిద్యను ప్రోత్సహిస్తూనే పాలనాధికారం గల మున్సిపల్ బోర్డులలో సభ్యులుగా ఉంటూ, న్యాయాధికారిణి పదవిని వహిస్తూ మరొక ప్రక్క దేశస్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనటం స్త్రీల సాధికారికతకు, స్వావలంబనకు చిహ్నమైన విషయంగా భావించాలి. కొంతమంది స్త్రీలు సాధికారికతతో, నిర్ణయాత్మకశక్తులుగా ఎదగగలిగారనే దానికి నిదర్శనంగా అర్థమవుతుంది.*

పులవర్తి కమలావతిదేవి 'వైశ్యులు–విద్య' (సెప్టెంబరు 1938 వాసవి)ను గురించి వ్రాస్తూ గ్రామాలలో వైశ్యులు విద్యయందు వెనకబడియున్నారనీ, వైశ్యులకు ఉచితవిద్య నేర్పించటానికి తగిన 'ఫండు' (ఆర్థిక నిధి) లేదనీ, ఒకప్పుడు రాజమండ్రికి సబ్ జడ్జిగా వచ్చిన పూండి రాజగోపాలాచార్యులు చెప్పిన మాటల్లోని విషయంగా 'పూండి' చిన్నగ్రామమైనా అక్కడినుండి పదిమంది ఐ.సి.యన్. ఆఫీసర్లుగా తయారయ్యారని తెలిపింది. దానికోసం సార్వజనికనిధినుండి ఖర్చుపెట్టుకొని ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారనీ, పిమ్మట వారు ఆ నిధికి నెలకింత డబ్బును సమకూరుస్తున్నారని చెప్పారని తెలియజేసింది. ఉన్నతవిద్య చదువుకోదలచుకున్న వారికి సార్వజనికనిధి ఎప్పటికీ అక్షయపాత్ర అని తెలిపింది.వైశ్యులు అలా వైశ్యకులోన్నతికి పాటుపడాలనీ, విశాఖపట్నవాసులు సాహిత్యబ్రహ్మగా అష్టావధానులుగా ప్రసిద్ధిపొందిన వైశ్యకులస్థుడు కంచర్ల రామబ్రహ్మంగారు మార్గదర్శకులనీ, నాళం లక్ష్మి గొప్ప నర్తకీమణీ అనీ, బాలికలకు పతకాలిచ్చి ప్రోత్సహిస్తే విద్యలు రాణిస్తాయనీ, అదే జాతిక్షేమమనీ, జాత్యాభివృద్ధియే వైశ్యుల అభివృద్ధి అని కూడా తెలియజేసింది.

'వైశ్యుల భావిస్థితి' (డిసెంబరు 1939 వాసవి)ని గురించి ఈమె వ్రాస్తూ గుజరాతీలు, మార్వాడీలు వర్తకం ప్రారంభించటంతో వైశ్యుల చేతిలో నుండి వర్తకం చేజారిపోతోందనీ, దానికి కారణం వైశ్య సంఘాల మధ్య ఐకమత్యం లేకపోవటమేననీ, వైశ్యులు శాసన సభలో ప్రాతినిధ్యం వహిస్తే బ్రిటిష్ ప్రభుత్వం వారు వేసే సేల్స్ ట్యాక్సు, పొగాకు పన్ను, అదనపు లాభాలపన్ను వంటి వాటిని ఎదుర్కొనవచ్చని తెలిపింది. దానికి విద్య అవసరమనీ, అభివృద్ధిలోనున్న వైశ్యుల విద్యా విషయమై కొంత మూలధనపు ఫండును ఏర్పాటు చేయాలనే పట్టుదలతోవైశ్య సంఘం ముందుకు రావలసిందనీ వైశ్యకుల అభివృద్ధికి పులవర్తి కమలావతి దేవి పిలుపునిచ్చింది.

*రచయిత్రి కులాభివృద్ధిలోనే భారతజాతి, స్త్రీజాతి అభివృద్ధి ఉంటుందని భావించింది. వ్యాపారవర్గంవారు విద్యతో శాసనసభలలో ప్రాతినిధ్యం వహించగలిగితే పన్నులరాయితీని*

*పొందగలరని భావించింది. వైశ్యులవ్యాపారాలలో నష్టం ఎలా వస్తోందో, పన్ను భారాన్ని వదిలించుకునే ఆలోచనలను పెంచుకొన్న కమలావతిదేవిని నిజంగా పెద్ద వ్యాపారవేత్తగా భావించవచ్చు. ఆనాడే అంతర్జాతీయ మార్కెట్ శక్తుల ఆధిపత్యాన్ని చెప్పింది. మొదట్లో వర్తకులు బ్రిటిష్ వారికి అనుకూలంగా ఉన్నా, ఆ తర్వాత భారతదేశ స్వాతంత్ర్యం వస్తేతప్ప, తమ వ్యాపారాలు సజావుగా సాగేవిధంగా చేయాలంటే స్వరాజ్యానికై వైశ్యులు శాసనసభ సభ్యులు కావల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

'పులవర్తి కమలావతి దేవి'ని గురించి (జనవరి 1938 గృహలక్ష్మి) పత్రికాధిపులు తెలియజేస్తూ, 1906 లో జన్మించిన ఆమె వివాహానంతరం ఇంటిదగ్గర ఏర్పాటుచేసిన పండితుల దగ్గర తెలుగు కావ్యాలన్నింటినీ విశేషాలతో కూడా అభ్యసించిందనీ, ఈమె రచించిన 'కుముద్వతి' అనే నవలను ఆనాడే స్కూలుఫైనల్ పాఠ్యాంశంగా పెట్టారని తెలిపింది. ఈమె విజయభాస్కర విజయము, రాధికాచంద్రావళులు, భారతవీర కథామంజరి, విక్టోరియాక్రాసు, కమలాబాయి, క్రీస్తుచరిత్ర, అబిసీనియా విధ్వంసము, మీర్ జుమ్ లా, కుముద్వతి అనే 9 నవలలను వ్రాసిందనే విషయాన్ని డిసెంబరు 1937 గృహలక్ష్మి పత్రికలో కూడా ప్రచురించటం జరిగిందని తెలిపింది. ఈమె రచించిన ఈ తొమ్మిది నవలలు అనేక పత్రికలలో వ్యాసాలు, కథలుగా ప్రచురింప బడ్డాయనీ. పానుగంటి, చిలకమర్తి వంటి పండితుల మన్ననలను పొందిందని పత్రికలో తెలియజేయటం జరిగింది.

పులిపాక బాలాత్రిపుర సుందరమ్మ వ్రాసిన 'అభ్యాసములు-ఆదాయమార్గములు' (సెప్టెంబర్ 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పాశ్చాత్యనాగరికతవల్ల అలవాటైన కాఫీ అలవాటుతో డబ్బుల నష్టంతోపాటు పిల్లలకు మజ్జిగ సరిపోవనీ, కాఫీ త్రాగటం దర్జా అని భావించకూడదనీ, కాఫీమాని వేడినీళ్ళు తాగాలనీ, ఆరోగ్యాన్ని పాడుచేసుకొని డాక్టరు దగ్గరికి వెడితే అదొక డబ్బు ఖర్చనీ, దానికి మిరియాలఉండ నోట్లో వేసుకోవాలని తెలిపింది. అంతేకాదు, పిల్లలకు కాసులిచ్చి బజారుకు పంపకూడదనీ, వారు పెద్దవాళ్ళయినా ఆ విధంగా బజార్లోవన్నీ కొనుక్కోవాలనే బుద్ధి వారికి వదలదనీ, పిల్లలకు కష్టసుఖములు, లాభనష్టాలను, చెడ్డఅలవాట్ల గురించి చెప్పి అహింస బోధించి, పొదుపరితనం నేర్పి వారిని దేశభక్తులుగా తీర్చిదిద్దాలని తెలియజేసింది. ఖద్దరుబట్టలను కొనుక్కోవటం చేస్తే చాలారోజులపాటు ఆ వస్త్రాలు మన్నుతాయనీ, విదేశీవస్త్రాలకు డబ్బుఖర్చు చేయకూడదనీ, కాయకష్టం చేసుకోవాలనీ, విస్తర్లు కుట్టడం, కూరగాయలను పండించటానికి మొక్కలను పెంచాలనీ, చొక్కాలు కుట్టాలనీ, విదేశీస్నోలకు, సోపులకు, డబ్బుఖర్చు చేయకుండా స్వదేశీ వస్తువులను వాడాలనే విషయాలను అందరూ గుర్తించాలని తెలియజేసింది.

*ఆరోగ్యనష్టాన్ని కలిగించగల విదేశీ వ్యాపారానికి గండి కొట్టగలిగి, స్వదేశవస్తు వినియోగం జరిగితేనే ఆర్థికవ్యవస్థ చక్కబరచుకోవచ్చనే భావనను వెలికితీసింది. అంతేకాక రేపటిపౌరులైన పిల్లలకు బాల్యం నుండి పొదుపును స్వదేశీయతను నేర్పాలని భావించింది.*

'శ్రీమతి సుబ్బరాయను గారి బిల్లు' (సెప్టెంబరు 1938గృహలక్ష్మి)ను గురించి కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాస్తూ ఈ బిల్లును స్త్రీ, పురుషులకు వర్తింపజేయాలని భావించినా అందులోని మినహాయింపులను సవరించాల్సిన అవసరంఉందని తన అభిప్రాయలను తెలియజేస్తూ పురుషుల బహుపత్నీత్వాన్ని నిరోధించటం బిల్లుయొక్క ఉద్దేశ్యమని తెలిపింది. భార్యలపై హక్కు ఉంటుందని భావించే మగవారును, అల్లుడుగా అడిగినపుడల్లా అత్తవారు తనకు డబ్బుఇవ్వనప్పుడును, పిల్లలు కలుగలేదనే వంకతోనూ పురుషులు మరొక స్త్రీని వివాహమాడటం సబబుకాదనీ, భర్తచే అవమానింపబడిన స్త్రీని సమాజంలోని పురుషులు అవమానంగా చూస్తారనీ, అది అత్యాచారం కంటే దుర్భరమని చెప్పింది. భార్య ఉన్నప్పుడు భర్త వివాహమాడటానికి ఇచ్చిన మినహాయింపులు ఉచితంగా లేవని తెలియజేసింది. అయిదు సంవత్సరాలు వ్యాధి గల భార్యను, ఐదేండ్లు భార్యకు దూరంగా ఉన్నాకానీ, ఆమె వ్యభిచారిణిగా ఒక సంవత్సరంపాటు ఉన్నాగానీ, ఆరోగ్యానికి భద్రత గానీ, భంగకరమగు క్రూరప్రవర్తన కలిగియున్నాగాని అటువంటి భార్యల విషయంలో భర్తలు సివిల్ కోర్టులో పిటిషన్ వేసినచో అతనికి కోర్టు పునర్వివాహానికి అనుమతి నివ్వవచ్చని బిల్లులో ఉందని చెప్పింది. ఈ మినహాయింపులు స్త్రీలకు కూడా వర్తిస్తాయని చెప్పినా, 'స్త్రీ వ్యాధిగ్రస్థురాలైతే పుట్టింటివారిచ్చిన కట్నాన్ని, సొమ్ములోను ఆస్తిలో మూడవ వంతు భాగాన్ని ఆమెకు కోర్టులో ఇవ్వాలనీ', దూరంగా ఉన్నారనే, నెపంతో విడాకులు ఇవ్వవచ్చని భావిస్తే, బిల్లు యొక్క ప్రయోజనం ఉండదని భావించింది. అంతేకాదు, దేశంలో చేయబడిన చట్టాలు చేసేటప్పుడు అన్ని వర్గాల వారిని గురించి ఆలోచించాలనీ, రాధాబాయి సుబ్బరాయనుగారు విద్యాధికులను సంపన్నులను తమ దృష్టిలో పెట్టుకొని ఈ బిల్లును రూపొందించినట్టు అర్థమవుతోందని భావించింది. శాసనాలకంటే నైతిక ప్రవర్తన ముఖ్యమనీ, సనాతన ధర్మపరులు కాలానుగుణమార్పులను అంగీకరిస్తేనే దేశం అభివృద్ధిచెందుతుందని కనుపర్తి వరలక్ష్మమ్మ అభిప్రాయపడింది.

ద్వివేది సత్యవతి బిల్లును (అక్టోబరు 1938 గృహలక్ష్మి) గురించి వ్రాస్తూ రాధాబాయి సుబ్బరాయనుగారు శాసనసభలో పెట్టాలనుకున్న బహుపత్నినిరోధ చట్టానికి తన స్పందనను తెలియజేస్తూ, భార్యకు తెలియకుండా భర్త మరోపెళ్ళి చేసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పుడు ఐదు సంవత్సరాలు సంతానవతిగా అనారోగ్యంగాఉంటే ఆమె బాధ్యతను భర్త పట్టించుకోవాలనీ, భారతీయ స్త్రీ అనారోగ్యం కలిగిఉన్నా భర్తకు శుశ్రూష చేసుకొనే తత్త్వం ఆ స్త్రీలకుంటుంది కాబట్టి ఆ షరతును తీసివేయాలని చెప్పింది. అసలు భార్యను గౌరవంగా చూసుకుంటే భర్తకు భార్యలో ఏలోపం కనపడదనీ చెప్పింది. ఈ బిల్లువల్ల భర్త భార్యయొక్క అనారోగ్యకారణాలను చూపి విడాకులు తీసుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి బిల్లును గురించి లోతుగా ఆలోచించాలని తెలియజేసింది.

దీనికి అనుబంధంగా ఒం.వెంకటరత్నమ్మ వ్రాస్తూ స్త్రీలకు నిర్బంధ విద్యాశాసనం లేకపోవటంతో స్త్రీలు చదువుకోకపోయేసరికి, విద్యావంతుడైన భర్తకును ఆమెకును అంతరం

ఎక్కువగా ఉంటోందనీ, అందుకనే ఏభైయేళ్ళ ముసలివాడు భార్య చనిపోయినా చిన్నపిల్లలను పెళ్ళి చేసుకోకూడదనే షరతు పెట్టాలనీ, యాక్టులను పకడ్బందీగా రూపొందించాలని పేర్కొంది. స్త్రీ విద్యకు, ముసలివాళ్ళ పునర్వివాహ సంస్కృతి ఉన్న లంకెను తెలియజేసింది. వివాహ చట్టాలకు–స్త్రీ విద్యకు బాల్య వివాహాలకు ఉన్న సంబంధాలను బిల్లు రూపొందించే సమయంలో గుర్తింపుకు వచ్చేటట్టు చేసింది.

దీనికి అనుబంధంగా మేరీ కె.మాణిక్యాంబ బిల్లును గురించి తన అభిప్రాయాన్ని తెలుపుతూ రాధాభాయి బిల్లునందు చూపబడినట్లుగాక, కారణాలులేకుండానే పురుషుడు పెళ్ళిచేసుకుంటే ఆ పురుషుడికి ఆతడు పెండ్లాడే స్త్రీకి, ఆ స్త్రీయొక్క తల్లిదండ్రులకు శిక్షలను వేసే విధంగా బిల్లును సవరించాలని చెప్పింది. ఐదు సంవత్సరములు జబ్బుగాఉన్న భార్యను వదిలిపెట్టి భర్త పునర్వివాహము చేసుకొంటే, భార్యయొక్క రోగానికి ఋజువు చూపించినపుడు భార్యకు ఆస్తిలో మూడవభాగం ఇవ్వాలని సూచించింది. ఆమెయొక్క 'స్త్రీధనాన్ని' తిరిగి ఇచ్చేయాలనీ, బిల్లులో ఉందికాని ఆస్తిలేని భర్త విడాకులిచ్చేటప్పుడు భార్యకు ఏమివ్వగలడనీ, మరియు స్త్రీధనాన్ని భర్తచదువుకు, అవసరాలకు వాడితే ఇంక స్త్రీధనము ఎక్కడుంటుందని భావించింది. భర్త ఉద్యోగస్తుడైతే వేతనములో మూడవవంతు ఇవ్వాలనీ, పిల్లలు మైనర్లైతే వారివిద్య, పోషణకు డబ్బులివ్వాలని తెలియజేసింది. అంతేకాక 5 సంవత్సరములనుండి అనారోగ్యురాలైన భార్యకు పరిహారము ఇవ్వకుండానే విడాకులు ఇవ్వకూడదనీ, భర్త రహస్యపుపెళ్ళి చేసుకొని కోర్టులో అబద్ధమాడితే భార్య ఏ రకంగా ఋజువు చేయగలదని తెలియజేసింది. పుట్టింటివారు చేరదీయకపోతే ఆమెకు ఆత్మహత్య ఆధారమనీ, భర్త వేశ్యాలోలుడై భార్యను పరిత్యజించ గలుగుతాడు కాబట్టి వ్యభిచారవృత్తి పూర్తిగా నిర్మూలనం అయ్యేవరకు బిల్లుయొక్క ప్రయోజనము ఉండదని చెప్పింది. ప్రతి స్త్రీ తాను పరిణయం చేసుకొనేటప్పుడు భార్యను వదలిన పురుషుడిని వివాహము చేసుకోకుండా ఉండటమే స్త్రీల కర్తవ్యమని తెలియజేసింది.

కొరప్రోలు వెంకటరంగమ్మ వ్రాసిన 'శ్రీమతి సుబ్బరాయనుగారిబిల్లు–ఇది ఎట్లు పరిణమించునో' (నవంబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ–పురుషల ప్రేమలతకు కొడవలి వంటి బిల్లును సవరణలతోనే తేవాలనీ, అప్పుడే ఆ బిల్లు ప్రయోజనకారి కాగలుగుతుందని భావించింది.

దీనికి అనుబంధంగా నెమలి చంద్రమతి వ్రాస్తూ 'బహుపత్నీత్వ నిరోధచట్టం' అవసరంగానీ, విడాకుల చట్టం అవసరంలేదనీ, భార్యభర్తలు విడిపోరాదని తెలిపింది. భర్తలు దుర్మార్గులైతే శిక్షించేటట్లుగా చట్టాలు ఉండాలనీ, త్రాగుబోతు, పరస్త్రీలోలుడు, భార్యను పీడించే వాడు, భార్య జీవించి యుండగా మరొక స్త్రీని వివాహమాడే భర్తలను శిక్షించే చట్టాలు కావాలని భావించింది.

వేదవల్లి తాయారమ్మ బిల్లుకు 'సవరణలు కావలెనా'? (నవంబరు 1938 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ భారతదేశంలో స్త్రీ తన భర్తతో విడాకులంటే గుండెలు బాదుకునే స్థితి అనీ, ఐదేండ్ల తర్వాత ఆనారోగ్యవతియైన స్త్రీని పోషించే బాధ్యత ఎవరు తీసుకుంటారనీ, పురుషుల

జారత్వం నిరూపించటం కష్టమని తెలిపింది. చట్టంలోని వెసులుబాటుతో పురుషుడు రెండో వివాహం చేసుకుని ఆ స్త్రీని భార్యతోపాటు కలిపి ఉంచితే నష్టాలేఉంటాయనీ, కనీస మనోవర్తి కూడా లేక చచ్చిపోయే పరిస్థితి అనీ, ఈ బిల్లువల్ల పురుషులలో పునర్వివాహఇచ్ఛను రేకెత్తించటమేననీ, వాటికి విరుగుడుగా బాల్యవివాహాలుమాని స్త్రీ పురుషులిద్ధరూ పరస్పరం అర్థం చేసుకొనే ప్రౌఢవివాహాలు రావాలని తెలియజేసింది.

పాలూరి సత్యకుమారి 'శ్రీమతి సుబ్బరాయను గారి బిల్లు' (డిసెంబరు 1938 గృహలక్ష్మి) ను గురించి వ్రాస్తూ, అది పురుషులకే ఉపయోగంగా ఉంటుందనీ, చట్టంలోని విషయాలతో భార్యను పురుషుడు వదలిపెడితే ఆస్తి లేని ఆ భార్య ఎలా బ్రతుకుతుందనీ, అలా వదిలిపెట్టే భర్త భార్యకు తన ఆస్తిలోగాని, తన జీతంలోగాని 3 వ వంతు భార్యకు ఇస్తేనే విడాకులకు స్త్రీలు ఒప్పుకోవాలని సూచించింది. భర్త విడాకులిస్తే భార్యకు భరణం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలిపి, భరణం ఇవ్వాలంటేనే భర్త భార్యనుంచి విడాకులు తీసుకోవటానికి కాస్త వెనకాడతాడని తెలియజేసింది. వితంతుస్త్రీల భరణంవంటిది కాక భర్తనుండి విడాకులు తీసుకొన్న స్త్రీకి భరణం యిచ్చే స్థితి ఉండాలని భావించింది. విడాకులిచ్చిన భర్త చచ్చిపోయినవాడితో సమానంగా భావించింది.

దీనికి అనుబంధంగా రచయిత్రులు రాధా సుబ్బరాయను ప్రవేశపెట్టబోయే విడాకుల బిల్లుసవరణలను గురించి తమ అభిప్రాయాలను తెలియజేసారు.

కాకులపాటి రాధాసుందరమ్మ 'పురుషుల కవకాశమీయరాదనీ', అనే శీర్షికన వ్రాస్తూ భార్య జబ్బుకు భర్త మందులిప్పించాలిగానీ, దానిబదులు మరొక స్త్రీని వివాహమాడటం అమానుషత్వం అనీ, ఆమెయొక్క నగలను, తన ఆస్తిలో సగభాగాన్ని ఆమెకు ఇచ్చి విడాకులివ్వవచ్చని తెలియజేసింది.

ఈ బిల్లును గురించి రామాబాయమ్మ వ్రాస్తూ, బిల్లు స్త్రీలకు మహోపకారాన్ని కలిగిస్తుందనీ, విడాకులు తీసుకొని స్త్రీలు నిర్భయంగా బ్రతకవచ్చనీ, భర్తల, అత్తమామల దౌర్జన్యం భరించక్కరలేదనీ, శాసన సభ్యులందరూ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని తెలియజేసింది. భర్త సరియైనవాడు కానప్పుడు విడాకులు కోరుకోవటమే నయమని ఈ రచయిత్రి అభిప్రాయపడింది.

పంగలూరి రాజ్యలక్ష్మి 'హెచ్చరిక' చేస్తూ రోగిష్ఠి భార్య అయినా పురుషుడు మరో వివాహం చేసుకున్నా మొదటి భార్యను ఇంటిదగ్గరే చూసుకొనే బాధ్యత వహించాలనీ చెప్పి పురుషుని యొక్క వైవాహిక బాధ్యతను తెలియజేసింది.

డి. భారతీదేవి బిల్లును 'పురుషులకే వర్తించవలెను' అని వ్రాస్తూ స్త్రీ వితంతువివాహ నిషేధం ఉన్నచోట స్త్రీలకు ఈ బిల్లువల్ల ప్రయోజనం ఉండదనీ, ఇది పురుషులకే మిక్కిలి

ఉపయోగకరమనీ, పురుషుడు భార్యకు ఐదేండ్లు దూరంగా ఉండి భర్తరాకకై ఎదురుచూస్తున్న భార్యకు విడాకులివ్వటం సమంజసం కాదని తెలిపింది. పురుషులు స్వల్ప విషయాలకే ఋజువుచేసినట్లుగా స్త్రీలు చేయలేరనీ, అనారోగ్యపీడిత భార్యకు నష్టపరిహారమివ్వక విడనాడే ఈ బిల్లును నిరాకరించాలని చెప్పింది.

కందర్ప కమలకుమారి 'సవరించాలి' అంటూ వ్రాస్తూ బిల్లు సవరణకు సూచనలిస్తూ ద్వితీయ వివాహం చేసుకునే పురుషుడికి పిల్లనిచ్చే తల్లిదండ్రులను, పెండ్లాడే పిల్లను శిక్షించాలనీ భార్య సుఖదుఃఖాలను పట్టించుకోని భర్తను విడిచివేయాటానికి ఆమె మూగజీవి కాదనీ, అవసరమైన మూడవ వంతు జీతాన్నిచ్చి కోర్టులో విడాకులు తీసుకోవాలనే సవరణను చేయాలని ప్రతిపాదించింది.

భూపతిరాజు వెంకమ్మ వ్రాస్తూ 'బిల్లును దీర్ఘరోగాలకే వర్తింపచేయాలని' శాసనాల ద్వారా భర్తలకు సహనాన్ని కలిగించాలిగానీ, ద్వితీయ వివాహానికి అనుమతి ఉండకూడదనీ, పురుషులు కోర్టుకెళ్ళినట్లుగా రోగిష్ఠి భర్త విషయంలో స్త్రీలు వెళ్ళలేరనీ, ఒండొరుల యిష్టప్రకారం నష్టపరిహారం ఇచ్చి విడాకులు పొందవచ్చని అభిప్రాయపడింది.

స్త్రీలోలుడై పీడించే భర్తనుండి విముక్తిని పొందే ఈ విడాకుల బిల్లు భార్యలకు ఉపయోగపడుతుందనీ, స్త్రీలందరూ ధైర్యంగా బిల్లును ఆమోదించాలని పాకల రాజమణి అభిప్రాయపడింది.

స్త్రీలు భర్తచే విడిచిపెట్టబడుతున్నప్పుడు స్త్రీల స్వీయపోషకత్వానికి వీలుగా బిల్లును తయారు చేస్తున్న క్రమంలో స్త్రీల అభిప్రాయసేకరణతో శాసనసభ్యురాండ్రు బిల్లును ప్రవేశపెడితే బాగుంటుందని అనుకొన్నారు. విడాకుల బిల్లు ప్రతిపాదనల స్థాయిలోనే బిల్లును గురించిన చర్చలు పత్రికా ముఖంగా రాగలిగితేనే రాజ్యాంగ శాసనంలో స్త్రీల ఆలోచనలకు ప్రాతినిధ్యం ఉంటుందనే భావన అర్థం అవుతుంది.

'పెళ్ళిళ్ళు రిజిష్టరు చేయుట అవసరము' (డిసెంబరు 1938 భారతి) అనే శీర్షికన బి.కామేశ్వరమ్మ వ్రాస్తూ అఖిలభారత మహిళాసభలకు సంబంధించిన సభలలో స్త్రీలు తమకు సమాన హక్కులు కావాలనీ, పెళ్ళిళ్ళు రిజిష్టరు చేయాలనీ, రాధాబాయ్ సుబ్బరాయన్ భారత శాసనసభలో బిల్లును ప్రతిపాదింప బోతున్నారని తెలియజేసింది. శాస్త్రాలు స్త్రీలపట్ల వివక్షతను చూపిస్తున్నా, భర్త ఆస్తికి భార్య వారసురాలు కావల్సిన అవసరాన్ని గుర్తించాలనీ, ఏదో ఒక నెపం మీద భర్త, భార్యను వదిలిపెట్టకూడదనీ, సివిల్ మారేజి చట్టం 1872 వర్ణాంతర, మతాంతర వివాహాలను అనుమతించింది కాబట్టి పెళ్ళిళ్ళను రిజిష్టరు చేస్తే స్త్రీలకు చట్టపరమైన రక్షణ ఉంటుందని తెలియజేసింది.

*మొత్తంమీద అగౌరవం, ప్రేమరాహిత్యాలే విడాకులకు దారి తీస్తోందని అర్థమౌతుంది. చట్టనిబంధనలు స్త్రీలకు సమస్యకాకుండా స్త్రీలే నిర్ణయించుకొనే విధంగా ఉండాలని, బహుపత్నీ వత్రంకల పురుషుడికి రెండవ భార్యగా వెళ్ళకూడదని నిర్ణయానికి వచ్చారు.*

*రాధాసుబ్బరాయనుబిల్లును సవరించే విషయంలో ఇంకొక అడుగు ముందుకు వేసి పురుషుడి ద్వితీయ వివాహానికి పిల్లనిచ్చేవారిని కూడా చట్టపరంగా బాధ్యుల్ని చేస్తే పురుషునికి ద్వితీయ వివాహాలను తగ్గించవచ్చుని భావించారు. నేడు దీనినే గృహహింస చట్టంలో పొందుపరిచారు.*

*కుటుంబంలో కారణాలను సృష్టించి భార్యలను వదిలించుకునే భర్తలకు చెంపపెట్టుగా భార్యలకు రక్షణ కవచాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరాన్ని ఆ నాడే గుర్తించటం జరిగింది. విడాకుల బిల్లు కంటే ముందుగా పెళ్ళిళ్ల రిజిష్టరు చేయబడేవిధంగా స్త్రీలు చట్టపరహక్కులను పొంద గలిగితేనే రాధాబాయి సుబ్బరాయన్ బిల్లులో ఉన్నట్టుగా భార్యలు కోర్టులలో తమ పెళ్ళిని నిరూపించుకో గలుగుతారని భావించటం రచయిత్రి ముందుచూపుకు నిదర్శనం.*

*స్త్రీలు తమ సమస్యల యొక్క నివారణకై చట్టాలు చేయాలని కోరుకొంటూ బిల్లును ప్రతిపాదించగానే స్త్రీలు ఆ బిల్లుపై తమ అభిప్రాయాలను వ్యక్తంచేయటంతోపాటు, దానికి చేయాల్సిన సవరణలను సూచించటమంటేనే స్త్రీలు తమకున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను ఉపయోగించాలను కోవటంగా అర్థమవుతుంది. అదే స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్యానికి మచ్చుతునక. స్త్రీలు కుటుంబంలోని సంస్కృతిని ప్రశ్నిస్తూ వివాహం తమప్రగతికి అడ్డుపడకుండా దాన్ని ఎదుర్కొనే క్రమంలో అవసరమైన విడాకులు తీసుకోవచ్చునుకొని, దానికి బిల్లును ప్రవేశపెడుతూ దాని ఉద్దేశాలను విమర్శకు పెట్టుకోవటం జరిగింది. కాని ఆబిల్లు ఆస్తిలేని స్త్రీలకు వీలుగాలేదనీ, అందుకని ఆ భార్యకు ఆస్తిని ఇవ్వాలని భావించారు. పెళ్ళి రిజిష్టరు చేయాలనే ఆ నాటి ప్రతిపాదన 40 ఏళ్ళ తరువాత చట్టరూపం దాల్చింది. బిల్లుకంటే కూడ ఆధునిక పరిస్థితులకు అనుకూలంగా ప్రజలలో రావల్సిన మార్పు ముఖ్యమని భావించింది. ఎప్పటికప్పుడు రచయిత్రులు వ్రాసిన వ్యాసాలలో వారికున్న రాజకీయచైతన్యపు స్పృహ స్పష్టమవుతోంది.*

*1860 లో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన అన్యసంబంధాల నిషేధచట్టం ఉన్నా నిరుపయోగం అని స్త్రీలు ఆనాడే భావించారు. అందుకే నేడు నేరవిచారణసంహిత 1973 (సి. ఆర్.పి. సి)లోని 497 సెక్షన్ ను రద్దుచేయటం జరిగింది.*

పసుపులేటి లలితాదేవి వ్రాసిన 'స్త్రీలు పత్రికా సంపాదకులుగా ఉంటే' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు పత్రికా సంపాదకులుగా మారితే స్త్రీసంఘం బాగుపడుతుందనీ దేశక్షేమం స్త్రీలపై ఆధారపడిఉందనీ, స్త్రీలే విద్యార్థులకు ఉపాధ్యాయినులుగా ఉండాలనీ, శిశువులను తీర్చిదిద్దటానికి నైతిక, ఆర్థిక, లౌకిక, రాజకీయ విషయాలలో స్త్రీల ద్వారానే బోధన జరగాలని తెలిపింది. శిశుపాలన, ఆరోగ్యాభివృద్ధి, రోగనివారణ, కుటుంబనియంత్రణవంటి విషయాలను స్త్రీలకుబోధించాలన్నా స్త్రీలేపత్రికాసంపాదకులుగా ఉండాలని తెలియచేసింది. స్త్రీల సమస్యలను పత్రికలద్వారా పదిమందికి తెలియజేసి ఆలోచింపచేస్తూ పరిష్కారాలను సూచించటానికి స్త్రీలు పత్రికాసంపాదకులుగాఉంటే స్త్రీలప్రగతి కలుగుతుందని కూడా తెలియజేసింది.

*స్త్రీల సమస్యలకు పరిష్కారాలు పత్రికా ముఖంగా తెలియజేయాలంటే స్త్రీలు పత్రికారంగంలో ఉండాలని భావించింది. పత్రికారంగం సామాజికాభివృద్ధిలో ప్రముఖపాత్ర వహించగలదని స్త్రీలు గుర్తించగలిగారు. ఆక్రమంలోనే రాధా సుబ్బరాయన్ బిల్లుపై అభిప్రాయ సేకరణ జరిగింది.*

వి.ఎస్.ఎన్. లక్ష్మి వ్రాసిన 'జీవిత వికాసమునకు విద్య' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యావిధానసంస్కరణ అవసరమనీ స్త్రీల కొసగు విద్య ఎలా ఉండాలో ఆలోచించాలనీ, సంగీతము, అల్లికపనులవంటి కళలతో పాటు, ఆరోగ్యకరమైన పిల్లల పెంపకానికి సంబంధించిన విద్యను, ప్రపంచ విజ్ఞాన చరిత్రను నేర్పాలని తెలిపింది. భార్యలు విద్యా విహీనులగుటచే భర్తలకు నచ్చుటంలేదనీ, సుఖసంసార యాత్రకు స్త్రీవిద్య ఆవశ్యకమని చెప్పింది.

*తమ భార్యలకు చదువులేదనే అసంతృప్తి భర్తలలో కలుగుతోందనే స్పృహను స్త్రీలలో కలిగించే వ్యాసం ఇది. భార్యలకు చదువు అవసరంలేదనే స్థాయినుండి భర్తలు తమకు విద్యావంతురాలైన భార్య కావాలనుకోవటమే ఒక సామాజిక సాంస్కృతిక పరిణామం క్రింద భావించాలి. ఆ రకంగా స్త్రీలు చదువుకోవటం తప్పుకాదనీ, పైపెచ్చు పెళ్ళి చేసుకునే వరులకు స్త్రీవిద్యయిష్టమని భావించగలిగితే తల్లితండ్రులు ఆడపిల్లలను చదివించే స్థితికి చేరుకో గలుగుతారని భావించటం అర్థం అవుతుంది.*

పాకల రాజమణెమ్మవ్రాసిన "స్త్రీసమాజములు స్థిరంగా ఉండాలంటే" (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు తీరిక సమయాలలో ఊరి గొడవలతో కాలక్షేపం చేయక స్త్రీలందరూ ఒకచోట చేరి స్త్రీల కష్టస్థితులను, తన్నివారణోపాయాలు ఆలోచించుకోవటానికి వేదికగా స్త్రీసమాజాలు ఉండాలని తెలిపింది. భర్త ఆఫీసుకు వెళ్ళినపుడు, శని, ఆదివారాలు బయటకు వెళ్ళినపుడును స్త్రీసమాజలలోను, గ్రంథాలయాలలోను పుస్తక పఠనం చేయాలని తెలిపింది. పిఠాపురం రాణి ఒక స్త్రీసమాజాన్ని, యువతీ పాఠశాలను స్థాపించిందనీ, అక్కడ ఇంగ్లీషు, తెలుగు, కుట్టుపని, సంగీతం నేర్పిస్తున్నారనీ, సరోజినీదేవి, మృణాళినీ, బాలాంత్రపు శేషమ్మ, కొటికలపూడి సీతమ్మ, కమలా సత్యనాథమ్మ వంటివారు స్త్రీసమాజాలకు వచ్చి ఉపన్యాసాలు ఇస్తున్నారనీ, స్త్రీసమాజాలకు కొంత మూలధనం కావాలనీ, బాలికలు నాటకములను ప్రదర్శించి ఆ డబ్బును సమకూర్చుకోవాలని తెలియజేసింది.

*స్త్రీసమాజాల నిర్వహణకై ఆర్థికవనరులను పెంచుకొనే మార్గాలను సూచించటం, స్త్రీల ఆర్థికప్రణాళికా సామర్థ్యంగా అర్థమవుతుంది.*

కె.సుగుణమణి వ్రాసిన "విదేశీ వెట్టి వీడితే"(అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో సంసారం చక్కబడాలంటే నిరాడంబరజీవితం, విదేశీవస్తు నిరసన, సాత్వికాహారం, ఖద్దరు వస్త్రధారణయేకాక యవలు, రాగులతో ఇంటిలో వంటలు తయారుచేసి పిల్లలకు పోషకాహారంగా ఇస్తే హోటళ్ళలో డబ్బు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదని తెలిపింది. జొన్నలు, గోధుమలు, మొలకెత్తిన ధాన్యాలను వాడితే ఎంజైమ్సు శక్తివంతమై ఆహారం సులభంగా జీర్ణమవుతుందనీ,

జొన్నల ఆహారాన్ని తీసుకోవాలని చెప్పింది. అందువల్ల స్త్రీలు పొదుపుగా సంసారం చేయవచ్చునీ, దానివల్ల దేశ చరితము తేజిరిల్లుతుందని భావించింది.

*ఆహారవిషయంలో ఈనాటి భావనలుగాఉన్న మొలకలు చిరుధాన్యాలను పోషకాహారాలుగా తీసుకొంటే, ఎంజైమ్స్ శక్తిమంతమై జీర్ణక్రియ బాగుంటుందని ఆనాడే స్త్రీలు విజ్ఞాన రూపంలో చెప్పటం ఆశ్చర్యాన్ని కల్గించక మానదు. మొలకెత్తిన ధాన్యాలు, మిల్లెట్లు వాడాలని చెప్పడం అంటేనే నేడు భూమి గుండ్రంగా ఉంటుందని అర్థమవుతుంది.*

డి.అనసూయ వ్రాసిన 'పతివ్రతార్థం పతితమైంది' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ప్రపంచ పరిస్థితులు మార్పు చెందుచున్నప్పుడుకూడా సనాతనధర్మములను పూజించుట ప్రాణసంకట మవుతుందనీ, పాతివ్రత్యం నిలపాలనే భావనతో నిరంతర సంతప్త హృదయాలతో బానిసత్వాన్ని నెరపాలనీ, భర్తలకు భార్యలు శారీరక,మానసిక దాస్యం చేసినా వారి మనస్సును తృప్తిపరచలేక మనోవ్యథ బాధితులుగా స్త్రీలున్నారని తెలియజేసింది. బాల్యవివాహాలకు ఆహుతులైన బాలికలను సంఘసంస్కృతి కష్టపెట్టినా ఆ సంస్కృతినే ప్రేమిస్తూఉంటున్నారనీ, యవ్వనం వచ్చిన తరువాత నవవికసితమైన భార్య హృదయాన్ని ఆకర్షించే శక్తి భర్త యందుంటేనే అనుకూల దాంపత్యం ఉంటుందని భావించింది. బాల్యవివాహాలను రూపుమాపుటంచేసి స్త్రీవిద్యా వ్యాప్తిని కలిగించాలనీ, స్త్రీలకు బంధవిముక్తి 'విడాకుల' వలననే కలుగుతుందనీ, దేశరక్షణకై పాటుబడే స్త్రీలే ఆ బాధ్యతను వహించగలరని భావించింది.

*సామాజిక ధర్మాలు మారినప్పుడు స్త్రీల జీవితాలలో కూడా మార్పు అవసరమని భావించింది. పాతివ్రత్య ధర్మాలపేరుతో స్త్రీలు పతనంచెందాల్సిన అవసరం లేదని భావించింది. విడాకులు స్త్రీకి వ్యక్తిస్వాతంత్ర్యాన్ని యిస్తుందని భావించింది.*

వెలిదండ చూడికుడుత్తమ్మ వ్రాసిన "హిందూ-మహమ్మదీయ సఖ్యత" (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భారతదేశం ఎదుర్కొంటున ప్రధానసమస్యకు హిందూ మహమ్మదీయలకు మధ్యన సామరస్యంలేకపోవటం కారణం అని చెప్పింది. దేశంలోని ముఖ్య మతనాయకులు సమస్త జనసౌభాగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి తరగతినుండి స్కూలు ఫైనల్ వరకు నైతిక అధ్యాత్మిక విషయాలున్న మతగ్రంథాలను పాఠ్యాంశంగా పెట్టాలనీ, సర్వమానవ సౌభ్రాతృత్వం పెంచే విధంగా మత నాయకులచేత పత్రికాముఖ బోధనాలు చేయించాలనీ, ఉపదేశ ఉపాన్యాసాలన్నీ దేశభాషలలో ఉండాలని తెలియజేసింది.

*రచయిత్రి భావించినట్టుగానే బ్రిటిష్ వాళ్ళయొక్క 'విభజించి-పాలించు' అనే వలలో మహమ్మదీయులు చిక్కుకొన్నారని హిందువులలో ద్వేషం ప్రజ్వరిల్లకుండా ఉండాలంటే బాల్యం నుండి పాఠ్యాంశాలలో భారతీయులైన హిందూమహ్మదీయలసఖ్యత ఏర్పడే విధంగా బోధనలు ఉండాలనీ అదే స్వాతంత్ర్య సాధనకు ప్రధానమని భావించింది. ఇది లేకపోతే భారతదేశం రెండు ముక్కలయి పోతుందని ముందే గ్రహింపుకు వచ్చినట్లుగా వ్రాసిన వ్యాసాన్ని నేడైనా*

*ఆచరణలో పెట్టాల్సిన పాఠ్యాంశవిధానంగా భావించాలి. మత సమస్యకు పరిష్కారదిశగా సూచనలు చేసింది.*

మో.మాణిక్యాంబ 'స్త్రీల అభ్యుదయము-రచనలు' (నవంబరు 1938 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ పౌరాణికంగా వస్తున్న పురుషనిర్మిత ధర్మ, మత, ఆచార నిబంధనలను పరిశీలిస్తే పురుషజాతి స్వార్థంతో స్వేచ్ఛగా జీవించటానికి చేసిన పన్నుగడగా వాటిని భావించాలని చెప్పింది. స్త్రీల హృత్తాపాన్ని పోగొట్టటానికి రాజా రామమోహనరాయ్, వీరేశలింగం, అనిబిసెంటులను దైవం భూలోకానికి పంపించిందని భావించింది. సత్యపూజారి అయిన గాంధి చేసిన స్వతంత్ర శంఖారావం మారుమ్రోగుతుంటే కలిగిన గంభీర ఆలోచనల ఫలితంగా స్త్రీల అభ్యుదయం అనే మాటలు వినబడేసరికి పురుషజాతి కలవరపడిందని భావించింది. అంతేకాదు పాశ్చాత్యపాశంలో చిక్కుకుంటే స్వాతంత్ర్యం వచ్చి పడుతుందని స్త్రీలు భావించకూడదనీ, పెళ్ళి అనేది ఒక సాంఘిక సమస్యగా మారటానికి కారణం పురుషుడు స్త్రీని సుఖానికి పనికి వచ్చే యంత్రంగా భావించటమేనని చెప్పింది. పాశ్చాత్య సంస్కృతి స్త్రీలను గబ్బిలాలుగా తయారుచేస్తోందనీ, అందుకనే పాశ్చాత్య సంస్కృతిని అనుకరించే స్వతంత్రత గల స్త్రీని సమాజం వింత పశువుగా చూస్తున్నదని తెలియజేసింది. మనోవైశాల్యతయే మానవాభ్యు దయానికి ముఖ్య సూత్రమనీ, మనోవిశాలత్వమే స్త్రీలను గృహమనే ఖైదులో బంధించకుండా ఉంటుందనీ, స్త్రీలలో బుద్ధి సూక్ష్మత అభివృద్ధి కావాలని చెప్పింది. స్త్రీల అభ్యుదయానికై వ్యావహారిక భాషలో, స్త్రీలు ఏకాంకికలు, కథానికలు, వ్యాసాలు, గేయాలను రచిస్తూ స్త్రీలు తమ హృత్తంత్రులను మ్రోగించాలని తెలియజేసింది.

*స్త్రీలు 'పెళ్ళి' అనేదానిని ఒక సాంఘిక సమస్యగా భావించటం మొదలుపెట్టారు. పితృస్వామ్యపు కుట్ర స్త్రీలను అస్వతంత్రులను చేసిందనీ, పాశ్చాత్య సంస్కృతి అవసరంలేదనీ, మనోవైశాల్యంగల కుటుంబాలు ఏర్పడాలనీ, అప్పుడే పెళ్ళి సాంఘిక సమస్యగా మారదనీ, స్త్రీలను గౌరవించే దృక్పథం ఏర్పడుతుందని భావించింది. స్త్రీల అభివృద్ధికి అవసరమైన సాహిత్య పరిణామశీలత ముఖ్యమని భావించింది.*

వడ్లపూడి అన్నపూర్ణమ్మ వ్రాసిన 'స్త్రీలు-సంఘసేవ' (నవంబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో, సంఘం అభివృద్ధి చెందాలంటే స్త్రీల అభివృద్ధి ముఖ్యమనీ, స్త్రీ విద్యావతియైతే కుటుంబం బాగుపడుతుందనీ, స్త్రీలకు గౌరవం లేదనీ, స్త్రీ పుట్టుకను తక్కువగా చూడటానికి సంఘమూఢత్వం కారణమనీ, స్త్రీలు కూడా స్వశక్తులను, గౌరవాన్ని కోల్పోయి వంటయింట్లో మగ్గుతూ కాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నారనీ, స్త్రీలు తమసత్తాను తెలుసుకోవాలని సూచించింది. అందుకనే స్త్రీలు తమ స్థితిని తెలుసుకోవటానికి వారికి విద్య అవసరమనీ, కళలు, శిశుపోషణ కుటుంబపోషణ వంటివి స్త్రీలు ప్రత్యేకంగా నేర్చుకునేటట్లు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని సలహానిచ్చింది. ఆస్తిలేనందువల్ల కలిగేనష్టాలను తొలగించుకోవటంకోసం వారనుభవించు ఇక్కట్లను పోగొట్టుకోవటానికి రాజకీయంగా ఓటుహక్కును ముందుగా సంపాదించుకోవాలనీ,

దానికై స్త్రీలే ప్రయత్నించాలని తెలిపింది. స్త్రీలు దురాచారాలను పోగొట్టుతూ తమబాలికలకు విద్యను నేర్పించాలనీ, స్త్రీలు కట్నాలు రాబట్టుకోవాలని ప్రయత్నించకూడదనీ, తీరిక సమయాలలో ధనం చేకూర్చుకునే విధంగా స్త్రీసమాజాలు పూనుకోవాలనీ, స్త్రీలసమావేశాలలో వార్తాపత్రికలు చదివి దేశవిషయాలు తెలుసుకోవాలని కూడా బోధించింది. అంతేకాక స్త్రీలు తలచుకుంటే ఇంటివద్ద నుండియే అనాథలను దగ్గరకు తీసి సంఘసేవచేయ వచ్చుననియు, తమ బిడ్డలను మంచి పౌరులుగా తీర్చిదిద్దితే పరోక్షంగా స్త్రీలు సంఘాన్ని ఉద్ధరించినట్లుగా భావించవచ్చునీ, సంఘసేవలో జీవనమౌలిక లక్షణాలకు ప్రాధాన్యమివ్వమని తెలియజేసింది.

*సమాజాభివృద్ధిలో స్త్రీల బాధ్యతకూడా ఉందని ముందుగా స్త్రీలు తమ అస్థిత్వాలకు ఉన్న విలువను గ్రహించాలని తెలియజేసింది. ఇంటినుండి సంఘసేవచేయటం వల్ల స్త్రీల అభివృద్ధి, సాంఘికాభివృద్ధి జరుగుతుందని భావించింది. స్త్రీలు చదువుకొని రాజకీయ ఓటింగ్ హక్కును పొందితేనే ఆర్థిక హక్కులను సాధించవచ్చుని తెలియజేసింది. ఆ నాడు చదువువచ్చిన స్త్రీలకు ఓటింగ్ హక్కు అమలులో ఉంది. స్త్రీల అభివృద్ధిలో రాజకీయ, ఆర్థిక హక్కులు పరస్పర ప్రచోధకాలను అర్థమౌతుంది.*

వట్టి శేషాంబ 'కట్నములు–లాంఛనములు' (డిసెంబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు పురుషులు వరకట్ననిషేధ దీక్షను పట్టాలనీ, విదేశాలలో ఈ వరకట్న దురాచారం లేదనీ, అత్తగారి, ఆడబడుచుల లాంఛనాలకింద తల్లిదండ్రులు ఆస్తిని తాకట్టు పెట్టుకొనే స్థితిని ఈ దురాచారం కల్పిస్తోందని తెలిపింది. వరకట్న దురాచారాన్ని రూపుమాపటానికి స్త్రీలే పూనుకోవాలనీ, అప్పుడే దేశానికి దారిద్ర్య విముక్తి కలుగుతుందని అభిప్రాయపడింది.

ఈమెయే వ్రాసిన 'స్త్రీ జనాభ్యుదయమునకు వలయుసాధనము' (అక్టోబరు 1939 గృహలక్ష్మి) అనే మరో వ్యాసంలో జాతీయోద్యమంలో వలె స్త్రీలు ఆంధ్రరాష్ట్రోద్యమంలో పాల్గొనాలనీ, సంఘశక్తితో కట్నాలనివారణ, అస్పృశ్యుల దేవాలయప్రవేశం, మద్యపాననిషేధం వంటి వాటిని ప్రయోజనకరంగా అమలు చేయబడితేనే సాంఘిక సౌమనస్యం ఏర్పడుతుందని తెలిపింది. స్త్రీల నిరక్షరాస్యత నిర్మూలిస్తూ విద్యావంతులు వయోజనవిద్యను అభివృద్ధి చేయాలనీ, స్త్రీసమాజాలు స్త్రీవిద్యకు పాటుపడాలని చేతిపనులలో వారికి తర్ఫీదునిప్పించాలనీ, సంసారాన్ని సౌఖ్యప్రదంగా చేసుకుంటూ మర్యాదకరంగా మాట్లాడుతూ, మూఢాచారాలను పోగొట్టే సూచనలివ్వాలని చెప్పింది. శిశుపోషణ విషయంలో పిల్లలకు ప్రసవమైన 3,4 గంటలలోపలనే ముర్రుపాలు పడితే వారికి రెండుమూడు రోజులవరకు మంచి ఆహారమవుతుందని, చక్కని విరేచనమవుతుందనీ, ఒక వేళ తల్లిపాలు సరిపోకపోతే ఆవుపాలలో నిమ్మరసం పిండి ఆ నీటిని వడబోసి ఆ నీళ్ళలో చిటికెడు పంచదార వేసి పట్టాలనీ, అదే శిశుపోషణఅని తెలియచేసింది. అంతేకాక, పిల్లలకు ప్రతి అవయవము స్వేచ్ఛగా కదలటానికి వీలుగా వదులుగా శుభ్రమైన దుస్తులు వేయాలనీ, ప్రతీయింటిలో వారికి అవసరమైన వస్తువులను తయారుచేసుకొనే గృహపరిశ్రమలు ఉండాలని కూడా భావించింది. భారతదేశంలో 1400 మంది బాలికలకు ఒక ప్రాథమిక పాఠశాల ఉందని వారి చదువుకు సంవత్సరానికి 26 శాతం మాత్రమే ఖర్చుచేస్తున్నారని కూడా వట్టి శేషాంబ తెలియజేసింది.

*ఆంధ్రరాష్ట్రోద్యమసమయంలోనే స్త్రీవిద్య, శిశుపోషణ, పారిశ్రామిక ఉత్పత్తులు, ఆరోగ్యంవంటి విషయాల ప్రణాళికను తెలియజేయటం జరిగింది. ప్రసవానంతరం వెంటనే ఉత్పత్తి అయ్యే మాతృస్తన్యంలో పోషకవిలువలు ఉంటాయని ఆనాడే తెలియజేసింది. భారతదేశానికి రాష్ట్రీయస్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో ఆంధ్రరాష్ట్రానికి కూడా మద్రాసు ప్రభుత్వంనుండి స్వతంత్రప్రతిపత్తి కావాలని భావించారు.*

పంతం అమ్మాజీ వ్రాసిన 'స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయములు' (డిసెంబరు 1938 గృహలక్ష్మి) అనే వ్యాసంలో వ్రాస్తూ స్త్రీలకు గ్రంథపఠనము, పత్రికలు చదవటంలో అభిరుచి కలిగితే వారియొక్క మూఢత్వం తగ్గుతుందనీ, అది స్త్రీవిద్యవల్ల కొంతతగ్గినా, పల్లెలలో విద్యావ్యాప్తి లేక మూఢాచారా లున్నాయని తెలిపింది. పల్లెలలో స్త్రీల జ్ఞానాభివృద్ధికి స్త్రీలకు ప్రత్యేకంగా గ్రంథాలయాలు నెలకొల్పాలనీ దానికై ప్రభుత్వంపై వత్తిడి తేవాలని అభిప్రాయపడింది.

*పల్లెలలో స్త్రీలు పత్రికాపఠనం చేయటానికి గ్రంథాలయాలకు వెళ్ళి పురుషులతో కూర్చొని పుస్తకపఠనం చేయటానికి బిడియంగా ఉంటుందనీ, పల్లెస్త్రీలు పట్టణ స్త్రీల నాగరికతలలో తేడా ఉంటుంది కాబట్టి పల్లెలలో స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయాలను పెట్టటాన్ని అత్యవసరంగా భావించింది.*

వల్లభనేని రంగాదేవి 'స్త్రీధర్మం' (డిసెంబరు 1938 గృహలక్ష్మి)ను గురించి వ్రాస్తూ మహిళోన్నతి మానవ సంఘోన్నతిలో మిళితమై ఉంటుందనీ, మహిళోద్ధరణ గురించి చర్చలు జరుగుతున్నాయనీ, వర్తమాన సాంఘిక దురవస్థలో స్త్రీలు కష్టపడుతున్నారని స్త్రీసంఘాలు పోరాడుతున్నాయనీ, స్త్రీలు సంస్కారవంతులుగా పరోపకారానికి ముందుండి స్త్రీలకు స్వాతంత్ర్యం వచ్చేటట్లు చేయాలనీ, స్త్రీజనసేవయే శ్రేష్ఠమని తెలియజేసింది. అంతేకాదు మానవ స్వభావాలు మారాలనీ, న్యాయ త్రాసు స్వార్థ వైషమ్యాలను దూరం చేయాలనీ, అప్పుడు అదే ధర్మం అవుతుందనీ, స్త్రీలు స్వాశ్రయులై నిర్భయులై మెలగినపుడే సంఘోద్ధరణ జరుగుతుందని చెప్పింది. పురాతన అభిప్రాయాలు, ఉదార భ్రాతృభావం, సహిష్ణుత తగ్గించుకోవాలనీ, స్త్రీలే అహింసాధర్మాలను అవలంభించి సాంఘిక అత్యాచారాలను రూపుమాప గలుగుతున్నారనీ, దానికై స్త్రీలు తమ యావచ్ఛక్తినీ వినియోగిస్తున్నారని రంగాదేవి తెలియజేసింది.

*స్త్రీల ఉద్ధరణకి సామాజిక బాధ్యతకి లంకె ఉందని, మనోన్యాయం ధర్మమనీ,అప్పుడే దేశాభ్యున్నతి జరుగుతుందనీ, అదే దేశస్వాతంత్రానికి దారితీస్తుందనే భావనను కలిగించటం అర్థం అవుతుంది. మహిళాభివృద్ధియే సామాజికాభివృద్ధి అని భావించింది.*

ఎ.సుబ్బాయమ్మ 'స్త్రీజాతి ఆనాడు-ఈనాడు' (జనవరి 1939 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ వేదకాలంనాడు స్త్రీ, పురుషులు మిత్ర, సఖి శబ్దాలతో చెప్పటంచేత వారిద్దరూ సమానంగా చూడబడ్డారనీ, యాజ్ఞవల్క్యుడు బ్రహ్మవాది ఐతే మైత్రేయికి బ్రహ్మవాదినిగా సమానస్థానం

ఇవ్వబడిందని తెలియజేసింది. ఆదినుండి స్త్రీలకున్న హక్కులు మధ్యలో కాలరాయబడటంచేత నేడు స్త్రీలు తమహక్కులను పునరుద్ధరించుకోవటానికి పురుషులద్వారా ప్రభుత్వచట్టాలను శరణుకోరాల్సి వచ్చిందనీ, ఏనాడు వేద గ్రంథాలు బోధింపబడుతాయో ఆనాడే స్త్రీ జాతికి తిరిగి గౌరవం వచ్చి దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని తెలిపింది. చీనా, జపాను దేశాలలోవలె స్త్రీలకు పారిశ్రామిక విద్యలను నేర్పాలనీ, కాని నేడు బాల్యవివాహాలవల్ల స్త్రీలు చదువుకోలేక నాగరికత పేరిట ఆయురారోగ్యాల్ని క్షీణింపజేసుకుంటున్న విషయాన్ని గుర్తించాలని భావించింది. 'గతకాలం మేలు' అంటూ వైదికనాగరికత కాలంలోని స్త్రీలహక్కులు పునరుద్ధరింపబడితే స్త్రీ-పురుషుల సమానత్వం వస్తుందని తెలియజేసింది.

*స్త్రీలు తమ హక్కులను వైదికనాగరికత ద్వారా పురుషులద్వారా పునరుద్ధరించుకోవాల్సిన అవసరం లేదని భావించింది.*

కుడితిపూడి అచ్చమాంబ 'వైధవ్యము-ధర్మశాస్త్రములు' (ఫిబ్రవరి 1939 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ భర్త గతించినవారు మంగళ సూత్రమును మాత్రమే విసర్జించాలనీ, ఆహార నియమాలు, కట్టుబొట్టు వంటివాటి విషయాలలో నియమాలు ఉండకూడదనీ, విధవ కన్యా స్వరూపంలో ఉండాలనీ స్మృతులుచెబుతున్నాయనీ, స్త్రీకి పునర్వివాహంతో సపిండులవలన సంతానాన్ని కనవచ్చని వితంతువులకు శాస్త్రం చెప్పిందని తెలియజేసింది. అంతేకాదు స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యాలుండాలనీ, 70 ఏళ్ళ పురుషుడికి బాలికను కట్టబెడుతుంటే ఆ విషయాలలో స్త్రీలు సత్యాగ్రహములు చేస్తే తప్పు ఎలా అవుతుందనీ, వితంతువులను అగౌరవంగా చూడకూడదనీ, అప్పుడే స్త్రీలకు సంపూర్ణమగు సౌఖ్య, స్వాతంత్ర్యములు కలుగుతాయని తెలియజేసింది.

*సమాజంలో చిన్నచూపు చూడబడిన బాధిత స్త్రీల తిరుగుబాటు, వ్యక్తిస్వాతంత్ర్యానికి మరోమెట్టు వేయగలుగుతుందని భావించింది. వితంతు పునర్వివాహ చైతన్యం ఏర్పడి పాతికేళ్ళయినా స్త్రీపునర్వివాహపు సంస్కృతిని చర్చించుకునే స్థితి కొనసాగుతూనే ఉందని అర్థమౌతుంది.*

కామరాజు సరోజినీ దేవి వ్రాసిన 'ఏ జీవిక స్త్రీలకు?' (ఏప్రిల్ 1939 భారతి) అనే వ్యాసంలో అనాది నుండి స్త్రీలు తమకు గృహజీవితమే పరమార్థం అనే విశ్వాసంలో ఉన్నారనీ, కానీ మారుతున్న ఆర్థిక, సాంఘిక పరిస్థితులలో పశ్చిమదేశాలలోని స్త్రీలకు స్వాతంత్ర్య కాంక్ష పెరిగి నవీనభావాలు ఏర్పడ్డాయని తెలిపింది. స్త్రీల విద్య, ఉద్యోగం వారి సాంఘికపరిస్థితులపై ఆధారపడి ఉందనీ, స్త్రీలకు ఉపాధ్యాయ, న్యాయవాద, వైద్యవృత్తిలో ప్రవేశాలను కల్పిస్తే చాలామంది చదువుకుంటారని చెప్పింది. అంతేకాక స్త్రీవిద్యవల్ల స్త్రీలకున్న హక్కులేమిటో అర్థమవుతాయనీ, ఆర్థికస్వాతంత్ర్యం ఉంటేనే వారికి దాస్యవిమోచనం కల్గుతుందనీ, స్త్రీలలో స్వయంనిర్ణయం చేయగలశక్తి పెరుగుతుందని భావించింది. తమహక్కులకోసం పోరాడాలంటే న్యాయశాస్త్రపఠనం అవసరమనీ, అదే స్త్రీ స్వాతంత్ర్య ప్రాప్తికి మార్గమవుతుందనీ, జాతీయాభివృద్ధికి ఆరోగ్యం ముఖ్యం

కాబట్టి మాతృహృదయం కల స్త్రీ వైద్యవృత్తిలో ఉంటే ప్రజారోగ్యం బాగుంటుందని తెలిపింది. సారస్వతంలో స్త్రీల నూతనాదర్శమును, నూతన వ్యక్తిత్వాన్ని నిరూపించే సాహిత్య సృజన జరగాలనీ, స్త్రీహృదయం స్త్రీలకే అర్థం అవుతుందని తెలియజేసింది.

*స్త్రీవిద్యకు, స్త్రీలవ్యక్తిత్వానికి, స్త్రీలసాహిత్యానికి ఉన్న లింకును తెలియజేసింది. వివిధ శాస్త్రీయవిజ్ఞానంతో స్త్రీల విద్యాస్థాయి సామాజికాంశాలకు అనుగుణంగా పెరగగలిగితేనే వారికి ఆర్థిక స్వాతంత్ర్యం, నిర్ణయాధికారం పెరుగుతుందని భావించింది. సామాజిక, రాజకీయమార్పులకు అనుగుణంగా స్త్రీల జీవికకు, స్త్రీలధర్మాలు మారాల్సిన అవసరం ఉందనీ, అప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఏర్పడే వీలుంటుందనీ, ఆ జీవిక, జీవితం స్త్రీలకు ఉండాలని భావించింది.*

గుమ్మళ్ళ అహల్య 'స్త్రీ కర్తవ్యము' (జూన్ 1939 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ దేశాభివృద్ధికి విద్యాధికులైన స్త్రీలు పాశ్చాత్య నాగరికతను విడిచి స్త్రీలు తమ విద్యుక్త ధర్మము నెరవేరుస్తూ ఆర్థిక, రాజకీయ, సాంఘిక కలవరాలను తగ్గించుకుని కార్యదీక్షను వహించాలని తెలియజేసింది. అంతేకాక, విద్యావంతురాలైన స్త్రీయే సమర్థురాలైన తల్లి అవుతుందనీ, ఆహార విహారాదులందును వేషభాషలందును స్త్రీలకు పురుషులతో సమాన స్వాతంత్ర్యాలుండాలనీ స్త్రీలు భారతీయ నాగరికతను, మాతృభాషను ఆరాధిస్తూ దేశాభ్యుదయానికి తోడ్పడాలని పిలుపునిచ్చింది.

*స్త్రీలు బాధ్యతాయుత స్వేచ్ఛను కోరుకోవటంగా అర్థమవుతుంది.*

'ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభలను' (సెప్టెంబరు 1939 గృహలక్ష్మి) గురించిన పత్రికాధిపుల ప్రచురణలో స్త్రీలు ఆంధ్రరాష్ట్రమంతా సభలను ఏర్పాటుచేసుకొని చర్చించిన అంశములను పేర్కొంటూ స్త్రీలు రాజ్యాంగ వ్యవహారాలలో పాల్గొనుట, స్వరాజ్య సంపాదనకు పోరాటంచేయుట, సంపూర్ణ స్వాతంత్ర్యానికి మాతృభాష మంచి సాధనంగా చేసుకొనుట, ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుతో పరిశ్రమల అభివృద్ధి, మద్యపాన నివారణ, అస్పృశ్యత నివారణ, స్త్రీ జనోద్ధరణ వంటి ముఖ్యమైన విషయాలను సభలలో స్త్రీలు చర్చించినట్లు పత్రిక తేలియజేసింది. మరియు గుంటూరులోని సభలో రామసుబ్బమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ ఉపన్యసించారని తెలియజేసింది. కనుపర్తి వరలక్ష్మి గారిని ఉద్దేశిస్తూ 'ఆంధ్రరాష్ట్రానికి జై' అంటూ వేసిన కేకలు మిన్నుముట్టాయనీ, శ్రీమతి రాయసం రత్నమ్మ మాట్లాడుతూ ఆంధ్ర స్త్రీలు సద్విద్యను పొంది దేశక్షేమాభివృద్ధికి, ఆంధ్రవిశ్వవిద్యాలయానికి జీవాన్ని ప్రసాదించటానికి అతిశీఘ్రంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని కోరుకున్నారని తెలియజేసింది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రానికై 1911-12లో గుంటూరు మండలివాసులైన జొన్నవిత్తుల గుర్నాథంతో ఉద్యమం ప్రారంభమై, కొండ వెంకటప్పయ్యగారి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని విస్తరింపజేసేందుకు ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నది. కాంగ్రెసు సంస్థ గాంధి యజమాన్యంలో స్వాతంత్రేచ్ఛను రగులుకొల్పి భారతజాతిని ఏకసూత్రానికి తేవటంలో జాతి ప్రత్యేకతగల ఆంధ్రరాష్ట్ర ఉద్యమం మరుగున పడిందనీ, ప్రస్తుతం రాష్ట్ర పరిపాలనా భారం ఆంధ్రులమీద ఉండటంచేత ప్రత్యేక

రాష్ట్రం కావాలని ఉద్యమం చేయాలని రాయసం రత్నమ్మ సభలో తెలియజేసిందని పత్రిక తెలియజేసింది.

పత్రికలో దీనికి అనుబంధ ప్రచురణగా, బాపట్లలోని సభలో కనుపర్తి వరలక్ష్మమ్మ 1913 లో జరిగిన ప్రథమాంధ్రమహాసభలో తాను ప్రసంగించానని, తిరిగి 29 ఏండ్ల తరువాత సభ జరుగుతోందని 1935 ఇండియా చట్టంవల్ల ఉత్కళను, సింధూను ప్రత్యేక రాష్ట్రాలుగా బ్రిటిష్ వారు గుర్తించారని తెలిపింది. మాంటేగ్–ఛేమ్స్ ఫర్డ్ సంస్కరణలు వచ్చినప్పటి నుండి మద్రాసు ప్రభుత్వమునందు తెలుగువారే మంత్రులుగా కార్యదర్శులుగా, కార్యనిర్వాహక సభ్యులుగా ఉంటూవచ్చినాకూడా ఆంధ్రరాష్ట్రం గురించి పట్టించుకోలేదని చెప్పింది. జాతీయోద్యమంలో పోరాటంచేసి, జైలుకెళ్ళటంవలన ఆంధ్రరాష్ట్ర ఉద్యమం మరుగున పడిందనీ, భాషాప్రయుక్త రాష్ట్రానికి కాంగ్రెస్ అంగీకరించిందని చెప్పింది. అంతేకాదు, ఆంధ్రుల వ్యాపారం, పరిశ్రమలు, కళలు అభివృద్ధిచెందాలన్నా నిరుద్యోగ సమస్యా నిర్మూలనం చేయాలన్నా సముద్రతీరం చక్కబడి, ఖనిజసంపద అభివృద్ధి జరగాలనీ, జలాధారములను బాగు చేసుకొని సుభిక్షం చేసుకోవాలని పిలుపునిచ్చింది. స్త్రీలవిద్య అభివృద్ధిచెంది రాష్ట్రాదాయం రాష్ట్రాభివృద్ధికే వినియోగించుకోవాలనీ, ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఏర్పడాలని ఆమె తెలియజేలింది. యూరప్ లోని చిన్న దేశాలలోవలె ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కేంద్రం సహకారం లేకుండానే నదీజలాలనుపయోగించి స్వదేశీ, విదేశీవాణిజ్యం చేస్తూ చట్టసభలలో రాజకీయ వ్యవహారాలలో ఆంధ్రభాషను ఉపయోగిస్తూ రాష్ట్రపరిపాలన చేసుకోవచ్చని చెప్పింది. దానికోసం ప్రత్యేకాంధ్ర కావాలనీ, మద్రాసు రాజధానిలో స్త్రీల పరిస్థితి శోచనీయంగా ఉందని చెప్పింది. ఆంధ్రస్త్రీలకు ప్రత్యేక కళాశాలగానీ, బోధనాభ్యసన కళాశాల లేదనీ, స్థానిక సంఘాలలో స్త్రీల ప్రాతినిధ్యం అల్పంగా ఉందనీ, కాబట్టి ప్రత్యేక రాష్ట్రం కావాలని రాయలసీమ, పశ్చిమంవారు తెలుగువారుగా పోరాటంచేయాలని సభలో వరలక్ష్మమ్మ ఉపన్యసించిందని పత్రిక తెలియజేసింది.

కడపలో ఏర్పాటు చేసిన సభలో, ఆ జిల్లా బోర్డు అధ్యక్షురాలైన రామసుబ్బమ్మ చేసిన ఉపన్యాసంలో భారతీయులకు సంపూర్ణస్వరాజ్యం ఎటువంటిదో ఆంధ్రులకు స్వరాష్ట్రం కూడా అటువంటిదే అనీ, భారతజాతి అభివృద్ధి చెందటానికి స్త్రీవిద్య కావాలనీ, స్త్రీలు బాధ్యతాయుత ఉద్యోగాలను నిర్వహించాలనీ, విడాకులచట్టం ఉండాలని చెప్పింది. ప్రత్యేక రాష్ట్రావశ్యకత ఉందనీ, అప్పుడే పరిశ్రమలు ప్రాజెక్టు నిర్మాణాలుజరిగి ఆంధ్రదేశం యొక్క ఆర్థికాభివృద్ధి జరుగుతుందని చెప్పింది. రాజ్యాంగవ్యవహారాలలో పాల్గొనాలన్నా దేశానికి సంపూర్ణస్వాతంత్ర్యం రావాలన్నా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలనీ, భారతీయ సంపూర్ణస్వరాజ్యంవంటిదే ఆంధ్రులకు భాషాప్రయుక్త రాష్ట్రవిభజన జరగటమనీ, ఉద్యమంలో జైలుకువెళ్ళిన స్త్రీల పవిత్రాత్ములు జైళ్ళను సంస్కరిస్తాయని చెప్పింది. కటిక దారిద్ర్యం వలన రాయలసీమ స్త్రీలు ఎక్కువగా స్వరాజ్యోద్యమంలో

పాల్గొనలేదనీ, స్త్రీలకు స్వాతంత్ర్యం లేనిదే సత్కారం ఉండదని తెలియజేసింది. అంతేకాదు స్త్రీలకు సంపూర్ణ స్వరాజ్యం ఉండాలనీ, రష్యా, టర్కీ, చీనీ స్త్రీలు, అభివృద్ధిచెందటానికి జపాన్ వారి బలాన్ని అణచటానికి స్త్రీల స్వాతంత్ర్య శక్తియే ఉపయోగపడిందనీ, స్త్రీజాతి తన స్వశక్తి వలననే స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంటుందని తెలిపింది. మద్యపానం కుటుంబ ఆర్థిక స్థితిని దిగజారుస్తోందనీ, బాల్యవివాహాలను నివారించాలనీ, అస్పృశ్యతానివారణచేయాలని చెప్పింది. గృహపరిశ్రమలలో ఖద్దరును ఉత్పత్తులనుచేసి భారతదేశ దారిద్ర్యం విమోచనం చేయాలనీ, ఆంధ్రరాష్ట్ర స్త్రీలు భారతజాతీయ పోరాటంలోవలె స్వరాష్ట్ర సంపాదనకు కృషిచేయాలనీ, ఆంధ్రరాష్ట్ర మహిళా సభలలో ఉపన్యసించిన తర్వాత ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలో స్త్రీలందరూ పాల్గొనాలనీ, రాయలసీమలోని కళాశాలలకు వెళ్ళి వారియొక్క ఆమోదంకూడా పొందాలని తీర్మానాలు చేసుకున్నారని పత్రిక తెలియజేసింది.

*భారతదేశంలో రాష్ట్రీయస్వాతంత్ర్య ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలోనే మధ్యలో ఆగిపోయిన ఆంధ్రరాష్ట్ర ఉద్యమాన్ని తిరిగి కొనసాగించి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించుకోవాలని ఆంధ్ర స్త్రీలను ప్రేరేపించటం జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాల్సిన అవసరాన్ని చాలా నిర్దిష్టంగా, నిర్దుష్టంగా చెప్పి ఆంధ్రస్త్రీలను చైతన్యవంతుల్ని చేయటం స్పష్టమవుతుంది. 1911లో మొదలైన ఆంధ్రరాష్ట్ర ఉద్యమం తిరిగి 1938లో పుంజుకోవటానికి చైతన్యపరచిన కనుపర్తి వరలక్ష్మమ్మను కూడా ఆంధ్రులు పొట్టి శ్రీరాములతోపాటు స్మరించుకోవాలి. భారతదేశ స్వాతంత్ర్య సాధనతోపాటు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర స్వాతంత్ర్యంకూడా సమానమని, అవసరమని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.*

సోమయాజుల లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'స్త్రీలకు స్వాతంత్ర్యమవసరము' (అక్టోబరు 1939 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలను హృదయరాణి అంటుంటే సంతృప్తి పడక విద్యావంతులై పురుషుల అన్యాయాధికారాన్ని తిరస్కరించాలని తెలిపింది. భార్యత్వం దాసత్వానికి పర్యాయపదంగా భావిస్తున్నారనీ, స్త్రీస్థానం పురుషుని స్థానంబట్టి నిర్ణయింపబడుతుందనీ, స్త్రీల స్వాతంత్ర్య నిరోధమే అవినీతి అనీ, స్త్రీలు పరిశ్రమ చేసినప్పుడే స్వాతంత్ర్య ఫలాన్ని పొందటానికి అర్హులవుతారనీ, స్త్రీలను సమానంగా చూడాలనీ, స్త్రీలు తమ హక్కులకై పోరాడాలని తెలియజేసింది.

*స్త్రీల స్వాతంత్ర్య నిరోధమే 'అవినీతి'అంటూ ఆ పదానికి క్రొత్త అర్థాన్ని నిర్వచించింది. స్త్రీలకు కష్టపడి పనిచేసే వెసులుబాటు ఉండటమే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి అర్హతను ఇస్తుందని భావించింది. కుటుంబంలోగాని, సమాజంలోగాని పురుషుడు స్వతంత్రుడైతేనే స్త్రీని గౌరవించ గలడనీ, అప్పుడే స్త్రీపురుషసమానత్వం కలుగుతుందని భావించింది.*

కోకా భానుమతి 'నిరుద్యోగసమస్య-గ్రామపునర్నిర్మాణం' (నవంబరు 1939 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ ఆంగ్లవిద్యా ప్రపూర్ణులగు యువకులను నిరుద్యోగ సమస్య పీడిస్తోందనీ,

యువకులకు స్వతంత్ర జీవనోపాధిని కలిగించుకునే జ్ఞానంలేక వారిలోని ఆత్మశక్తి చచ్చిపోతోందనీ, కళాశాల చదువులవల్ల బానిసత్వమే ఏర్పడిందని తెలిపింది. యువత పల్లెలకు పోయి గ్రామాభివృద్ధికి కావల్సిన ప్రజారోగ్యం, సాంఘిక, ఆర్థికవిషయాలకు సంబంధించిన, విద్య, వైద్యం, సహకార సంఘాలను ఏర్పరచి, శాస్త్రవిజ్ఞానంలో నూతన పద్ధతులపై వ్యవసాయం వంటి పనులు చేస్తే పట్టభద్రులైన యువకులు దేశాభివృద్ధికి తోడ్పడగలరని తెలియజేసింది.

*స్వయంకృషితో దేశాభివృద్ధి మార్గాలను యువతకు సూచించటం స్త్రీలలోని గొప్ప ఆలోచనగా భావించాలి. నేడు పల్లెల్లో సేవ చేయటానికి జాతీయసేవా పథకంలో భాగంగా శిక్షణను ఇవ్వాల్సిన అంశాలను ఆనాడే ఆమె తెలియజేసింది. అంతేకాదు యువత యొక్క నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా ఉపాధికై శిక్షణా కార్యక్రమాలను సూచించింది. ఆంగ్లవిద్యలో చదువుకోవటం యువత నిరుద్యోగానికి కారణం అని భావించింది.*

గుంటూరు విశాలాక్షి వ్రాసిన 'గృహపరిశ్రమలు' (నవంబరు 1939 గృహలక్ష్మి) అనే వ్యాసంలో మానవ జీవితానికి అవసరమైన అన్నవస్త్రాదులను, ఆరోగ్యకర పథకాలను తయారు చేసుకొనగల జ్ఞానం స్త్రీలకు అవసరంఅనీ, వంట చేయటం, పాకశాస్త్రం, రాట్నపరిశ్రమ, సంసారానికి ఉపయోగపడే విధంగా ప్రాధాన్యతగల గృహపరిశ్రమ, విద్యాపరిశ్రమ, ఖద్దరు పరిశ్రమలతో దేశం అభివృద్ధిచెందితే స్వరాజ్యం వస్తుందంటున్నారని తెలియజేసింది. అంతేకాక, అభిలాషగల పరిశ్రమలను నిర్వహించాలనీ, గృహపరిశ్రమలో ఊలు, లేసులు అల్లుట, రంగు దారాలతో కుట్టడం, అప్పడాలు, వడియాలు, చారుపొడి ఇంట్లో తయారుచేసి అమ్మటమే గాక సబ్బులు, వాసన నూనెలు, ఫేసు పౌడర్లు మొదలైన వాటిని ఇంట్లోనే తయారుచేసి విక్రయించవచ్చని భావిస్తున్నారనీ, దానివల్ల ధనికులు కొనుక్కోగలుగుతున్నారు కాని వారిలో సోమరిపోతుతనం ఏర్పడుతుందని తెలిపింది. ఎవరి కుటుంబానికి సరిపోయే వస్తువులు వారు తయారు చేసుకోవటమే పరిశ్రమ అనీ, విక్రయిస్తే అది వ్యాపారం అవుతుందని తెలియజేసింది. అంతేకాదు ఆరోగ్యమే మహాభాగ్యమనుకుంటూ దేహపరిశ్రమ అవసరమని, దానికోసం క్లబ్బులకు వెళ్ళి టెన్నిస్ ఆడటంకంటే ఇంట్లోనే సూర్యనమస్కారాలు చేస్తే బాలబాలికలు ఆరోగ్యవంతులుగా పెరుగుతారనీ, భోజనంకూడా శుభ్రమైనదిగా, ఆరోగ్యకరమైనదిగా ఉండాలని భావించింది. వస్త్రాలు వడకటం, నూనెలు, సీకాయ, నలుగుపిండిని ఇంట్లోనే తయారు చేసుకొని దేహసౌందర్యాన్ని పొందవచ్చుననీ, దేహాలంకారాలు, గృహాలంకారాలు చేయవచ్చునీ, గృహిణులు తమ పిల్లలను సంగీత సాహిత్యాలలో ప్రవీణులుగా చేయవచ్చని తెలియజేసింది.

*స్థానికోత్పత్తులతో గ్రామస్వరాజ్యం గృహస్వరాజ్యంతో ప్రారంభంకావాలని భావించింది.*

దొంతి రాజరత్నమ్మ వ్రాసిన 'వైశ్యులకు కావలసిన విద్య'ను (డిసెంబరు 1939 వాసవి) అనే వ్యాసంలో వైశ్య సంఘంలో పరస్పర సహకారం లేక పోవటంతోనే వర్తకవ్యాపారం

తగ్గిందనీ, దానికి కారణం అవిద్య అని తెలిపింది. అందులో స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, వైశ్య స్త్రీలకు ముందుగా స్వదేశీభాషా సాహిత్యం. లలితకళలు, దేశచరిత్రలు, గృహపరిశ్రమలను నేర్పించుట అవసరమనీ. ఆ తరువాత అన్యభాషా పరిచయం, శాస్త్రవిజ్ఞానం నేర్పాలని తెలియజేయటం జరిగింది.

*స్త్రీవిద్య స్త్రీలను వ్యాపారభాగస్వాములను చేయగలిగితే వ్యాపారాభివృద్ధి జరుగుతుందని భావించింది. వైశ్య స్త్రీల అభివృద్ధిని ఆకాంక్షించటం అర్థంఅవుతుంది.*

1935 నుండి 1939 వరకు వచ్చిన వ్యాసాలలో స్త్రీల సమగ్ర స్వాతంత్ర్యానికి, స్వయం వ్యక్తిత్వపోషణకు ఆర్థికస్వాతంత్ర్యం ఉండాలనీ, రాజకీయహక్కులు ఉన్నప్పుడే స్త్రీల సాంఘిక, ఆర్థిక హక్కులకు రక్షణ ఉంటుందని భావించారు. స్త్రీల పాతివ్రత్యానికి పురుషుల సత్ప్రవర్తన అవసరమనీ, హక్కులను సంపాదించుకోవటం స్త్రీల కర్తవ్యమనీ, జాతీయతగల స్వాతంత్ర్యం స్త్రీలకు అవసరమనీ, దేశభక్తి, జాతీయాభ్యుదయం సాహిత్యప్రయోజనంగా ఉండాలని నిర్ణయించుకొన్నారు. స్త్రీపురుషుల సమానత్వాన్ని, స్త్రీల ఆస్తిహక్కును బలంగా ప్రతిపాదించారు. రైతాంగ విద్యాభ్యాసం స్త్రీలకు ఉండాలనీ, స్త్రీలు సహకార రంగాలలో సభ్యులుగా ఉండాలనీ, బాపట్ల లోని స్త్రీహితైషిణీ మండలిలో ప్రాచ్య, పాశ్చాత్య విద్యాబోధనతో స్త్రీజనోద్ధరణ జరుగుతోందనీ, స్త్రీజాతి పారతంత్ర్యం పోవాలంటే స్త్రీలకు స్వతంత్ర్య జీవనాధారం కావాలని భావించారు. స్త్రీల అభ్యుదయమే దేశాభ్యుదయమనీ, దేశరాజకీయాలలో చదువుకొన్న స్త్రీలకు ఓటుహక్కు వచ్చిందనీ,స్త్రీలకు గర్భస్రావం చేసుకునే హక్కు ఉండాలని అనుకొన్నారు. భారత స్త్రీలు సంపూర్ణ స్వేచ్ఛపొందటానికి, ఎన్నికల తర్వాత ఏర్పడిన భారతదేశ రాష్ట్రీయస్వాతంత్ర్యపు శాసనసభలలో స్త్రీలు ప్రవేశపెట్టబోయే బహుపత్నీనిషేధం, విడాకులవంటి బిల్లులవిషయంలో చేసిన పత్రికాముఖ సూచనలతో నలుమూలలనుండి స్త్రీల అభిప్రాయసేకరణ చేసారు. పెళ్ళిళ్లను రిజిష్టరు చేయాలనీ, స్త్రీపురుషసమానత్వం ఉండాలనీ, గృహిణీత్వానికి జీతాలు ఉండాలనీ, స్త్రీలు వృత్తివిద్యలనేకాక, యుద్ధవిద్యలనుకూడా అభ్యసించాలనీ, స్త్రీలు శాసనసభలకు ఎన్నికకాబడి దేశస్వాతంత్ర్యానికి కృషిచేయాలనీ, ఎన్నికలలో స్త్రీలశాసన సభ్యత్వం, శాసనసభలలో స్త్రీలకర్తవ్యం గురించీ, మహిళోద్యమంవల్లనే, నూతనచట్టాలు రాగలుగుతున్నాయనీ, రాష్ట్రీయ స్వాతంత్ర్యంలో మంత్రి పదవుల్లో స్త్రీలకు సమాన భాగస్వామ్యం ఉండాలని భావించారు. స్త్రీల కారాగారవాసంలోని యిబ్బందులను తెలియజేసారు. దేశానికి సంపూర్ణస్వరాజ్యం కావాలనీ, విదేశీనాగరికతా వెఱ్ఱి తగ్గాలనీ, దేశస్వాతంత్ర్యం, ఆంధ్రరాష్ట్ర స్వాతంత్ర్యం ఒకటేనని భావించారు. ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులయొక్క యాంత్రికత ప్రజాహితం కాదనీ, స్వదేశీ పరిశ్రమలవల్ల ఆదాయాన్ని పొందాలనీ, ఖద్దరుధారణ ఆచరణలో ఉండాలనీ, వర్గవ్యవస్థ వర్ణవ్యవస్థకు కారణమని భావించారు. స్త్రీలు పత్రికావిలేఖరులుగా,సంపాదకులుగా ఉండాలంటే విషయపరిజ్ఞానం, స్వతంత్రత ఉంటేనే సామాజిక మార్పుకు అవకాశం ఉంటుందనీ, సాంఘికాభ్యుదయానికి ఉపయోగపడే రచనలు రావాలనీ, నూతనఆదర్శం నూతనవ్యక్తిత్వం

నిరూపించే సాహిత్యసృజన జరగాలనీ, స్త్రీలు సంఘసేవచేయాలనీ, మహిళాగ్రంథాలయాల స్థాపన జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచస్త్రీల ఉద్యమ ప్రభావం భారత స్త్రీలపై ఉండటంచేతనే స్త్రీలు తమకు సాంఘిక, ఆర్థిక, రాజకీయహక్కులు ఉండాలని భావించారనీ, స్త్రీల హక్కులు పునరుద్ధరింపబడితేనే స్త్రీపురుష సమానత్వం వస్తుందనీ, స్త్రీలు తమ హక్కులను కాపాడుకోవటానికి న్యాయశాస్త్ర పఠనం అవసరమనీ, స్త్రీల అభ్యుదయానికి కావాల్సిన సాధనంగా స్త్రీవిద్యాస్వాతంత్ర్యం ఉండాలని తెలియజేసేవిగా స్త్రీలు వ్రాసిన వ్యాసాలు వచ్చాయి. స్త్రీల స్వాతంత్ర్యాన్ని నిరోధించటమే అవినీతి అని ప్రతిపాదన చేశారు.

**కథలు**

క్రీ.శ.1935 నుండి1939 వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో దాదాపుగా 35 కథలు వచ్చాయి. స్త్రీలపుట్టుక, పెంపకంలోని వివక్ష, వైవాహిక విషయంలో స్వతంత్ర నిర్ణయం, వితంతుస్త్రీల సంస్కృతిలో విప్లవాత్మకధోరణివంటి సామాజిక న్యాయచైతన్యంతోపాటు, రాజకీయ చైతన్యం కలిగించే కథలు వచ్చాయి.

ఆచంట సత్యవతమ్మ వ్రాసిన 'సరస్వతి-పుష్పావతి' (ఫిబ్రవరి 1935 గృహలక్ష్మి) అనే సంభాషణాత్మక కథలో ఇద్దరు స్త్రీల మనస్తత్వాలను తెలియజేస్తూ సనాతన విద్యాభిలాషిణి, జాతీయవాదియైన సరస్వతితో నవీనవిద్యాధురీణయైన పుష్పావతి సరస్వతితో మాట్లాడుతూ తానుమాత్రం క్లబ్బులకు వెళ్ళి, స్త్రీలకు కావల్సిన సమస్తహక్కులను గురించి చర్చిస్తూ, ఉపన్యాసాలను ఇస్తూ ఉంటాననీ, హోటల్సు నుండి మీల్సు తెప్పిస్తుంటే పిల్లలు, భర్త పెట్టుకుతింటారనీ, తాను టెన్నీసు ఆడి వార్తాపత్రికలు చదివి విదేశీయతను తెలుసుకుంటున్నానని ఆ తర్వాత ఇంటికి చేరుకుంటానని చెప్పింది. దానికి సరస్వతి, నిర్మల జీవనం, గృహసౌఖ్యం ఉండాలనీ, భారతీయ వేదాంతము మొదలు పెట్టినచోట విదేశీవేదాంతం అంతమొందినదనీ, స్త్రీలఆస్తి హక్కులకై మీటింగులతో ఎన్నిపాట్లయినా పడాలిగాని పురుషులపై విజృంభించటం తగదని చెబుతుంది. దానికి పుష్పావతి వివాహ విషయంలో స్త్రీలకొక నీతి, పురుషులకొక నీతి ఉంది కాబట్టి స్త్రీలకు విడాకుల చట్టం అవసరమని చెప్పగా, సరస్వతి మాత్రం స్తన్యాన్ని ఇచ్చిన చోట శిశుపోషణ జరగాలనీ, భర్తలను నీతిమంతులుగా మార్చుకోవాలని చెప్పి స్త్రీ విడాకులు తీసుకొని మళ్ళీ పెళ్ళి చేసుకోవటం పబ్లిక్ వ్యభిచారమని అంటుంది. దీనికి విరుగుడుగా ప్రౌఢవివాహాలు అవసరమని చెప్పగా, పుష్పావతికి సరస్వతి చేసిన ఆధ్యాత్మిక బోధన నచ్చి ఆమె పిల్లల సంరక్షణ చూసుకొంటూ, స్వహస్తపాకం చేస్తూ గృహిణివలె మారిపోయిందని కథముగింపు చేయటం జరిగింది.

*హిందూసనాతన ధర్మాచరణమే పద్ధతి అనీ, శాంతియుతంగా సమస్యలు పరిష్కరించు కోవచ్చనే భావాన్ని సమర్థిస్తూ, నవీకరణవల్ల కుటుంబవ్యవస్థ అస్తవ్యస్తమవు తోందనే రచయిత భావన అర్థమవుతుంది. ఇది నేటికీ వెన్నుచరిచే విషయమే.*

ఈమె వ్రాసిన 'పుత్రపుత్రికా భేదము' (జూన్ 1935 గృహలక్ష్మి) అనే మరొక కథలో తమకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటారనే భావనతో మగపిల్లల్ని చదివించి ఆడపిల్లలకు మాత్రం పెళ్ళిచేస్తున్న ఒక తండ్రి, తన చివరి కూతురుయొక్క పెళ్ళికి సంపాదనపరుడైన కొడుకులను ఆర్థికంగా సహాయపడమని అడుగగా వారు మొఖం చాటేస్తారు. ఉన్న ఇల్లు అమ్మి కూతురు పెళ్ళి చేసిన తరువాత కొడుకులు తల్లిదండ్రులను ఆదరించకపోయినా మూడవ కోడలు కొద్దిగా నయం కాబట్టి ఆడబడుచులను పండగకి పిలుస్తుంది. కాని వచ్చిన కూతుళ్ళు తల్లిదండ్రుల స్థితి గమనించి వారిని తమతో తీసుకెళ్ళి తల్లిదండ్రులను బాగాచూస్తుండేసరికి, ఆ తల్లితండ్రులకు కొడుకులు శిలలాంటివారనీ, ఆడపిల్లలకు ద్రవహృదయం ఉంటుందని భావించి కూతుళ్ళే నయమనుకున్నారని ఆచంట సత్యవతమ్మ తెలియజేసింది.

*మగపిల్లల పెంపకంలో తల్లిదండ్రుల ఆశలు అడియాశలవటం, పెద్దతనంలో పేదతనంలో తమని కూతుళ్ళే బాగా చూసినట్లుగా భావించి కుటుంబ సంబంధాలలో కూతుళ్ళ పాత్రకు విలువ ఉంటుందని తెలియజేసిన కథ యిది. 'కంటే కూతుళ్ళనే' కనాలనే భావన ఆనాటికే ఏర్పడటం ఆశ్చర్యకరం. మగపిల్లల కంటే ఆడపిల్లలే గొప్పవారనే భావనకు నాందిపలకటం కనపడుతుంది. ఆడపిల్లల పుట్టుకకు విలువ పెరిగితే స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి గట్టి పునాది ఏర్పడినట్లుగా భావించవచ్చు.*

కూనిశెట్టి రామరత్నం వ్రాసిన 'మార్పులమంగ' (ఫిబ్రవరి 1935 గృహలక్ష్మి) అనే కథలో బాలవితంతువుగా విరూపిణియైన మంగ తల్లిదండ్రుల మరణానంతరం చూసేదిక్కులేక వితంతు కళాశాలలో చేరుతుంది. అక్కడ ఆమె గుండును వెక్కిరిస్తే, మాలతిగా పేరు రిజిష్టరు చేయించుకొని వెంట్రుకలను పెంచుకొని వేషభాషలను మార్చుకుంటుంది. వార్తాపత్రికలు చదివి అవగాహన పెంచుకొని పురుషులకు వివాహవిషయంలో స్వేచ్ఛ ఉందనీ, స్త్రీలకు మాత్రం రజస్వలకుముందే వివాహం ఎందుకుచేయాలని ఆలోచించింది. రజస్వల అయిన కన్యకు మూడు సంవత్సరాల వరకే తండ్రికి కన్యాదాన అధికారమనీ, ఆ తర్వాత కన్యకే స్వయంగా వివాహాధికారాన్ని మనువు ఇచ్చాడని భావించి, పరిచయమైన యువకుడ్ని పెళ్ళిచేసుకుంటుంది.

*వితంతువులు దీనంగా బ్రతకాల్సిన అవసరం లేదనీ, సంస్కృతిని ఎదిరించి, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవచ్చునీ, దానికై ముందుగా విద్యాధికురాలు కావాలనీ తెలియజేసిన కథయిది. విద్యావతిగా పీడాకరమైన మహిళాసంస్కృతిని ఎదిరించి ఒక స్త్రీ తన జీవితంమీద, తనశరీరం మీద తనకే నిర్ణయాధికారం ఉందని భావించటమే స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని పొందటంగా అర్థం చేసుకోవాలి.*

మల్లంపల్లి బాలాత్రిపుర సుందరమ్మ వ్రాసిన 'శ్యామల పెండ్లి' (ఫిబ్రవరి 1935 గృహలక్ష్మి) అనే కథలో తల్లి చూసిన ధనవంతుడు, దుర్గుణుడైన వరుని ఇష్టపడక పెళ్ళికి ముందురోజే ఉత్తరం వ్రాసిపెట్టి చిన్నప్పటి నుండి తన స్నేహితుడిగా ఇంట్లో పెరిగిన అబ్బాయి కోసం ఇల్లు వదిలి వెళ్ళిపోయి తనకు ఇష్టమైన ఆ వ్యక్తిని వివాహం చేసుకొంటుంది.

*వివాహవిషయంలో శ్యామల స్వతంత్ర నిర్ణయాధికారాన్ని తీసుకోగలగటం ఈ కథలో అర్థం అవుతుంది. స్త్రీలయొక్క వైవాహిక స్వాతంత్ర్యం స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి చిహ్నంగా అర్థమవుతుంది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మూడు తీర్మానాలు' (ఫిబ్రవరి 1935 భారతి) అనే కథలో హాస్యపత్రికలో స్త్రీలను తక్కువజేస్తూ వ్యాసాన్ని వ్రాసిన ఒక రచయితయొక్క భార్య పేరంటానికి వెళ్ళగా అక్కడ అదేవిషయంలో ఆమె అవమానింపబడి యింటికి వచ్చి భర్తను అటువంటి రచనలు చేయవద్దని చెప్పింది. తానొక భార్యగా కంటే కూడా తనొక స్త్రీననే వ్యక్తిత్వస్ఫూర్తి ఆమెకు ఉండాలనుకొంటుంది. ఒకరోజు ఆమె స్త్రీసమాజానికి వెళ్ళినప్పుడు అక్కడ వచ్చిన కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, గృహలక్ష్మి, భారతివంటి పత్రికలలో వచ్చిన దేశవిషయాలు, సంఘవిషయాలు, ఆర్థిక విషయాలు, మహాత్ముని వ్యాసాలు చదివింపజేసుకొని స్త్రీలందరు చర్చించుకున్నారు. తర్వాత హాస్యపత్రిక చదివేటప్పుడు అందులో స్త్రీలను కించపరుస్తూ, స్త్రీల ఆత్మ గౌరవాన్ని తగ్గించి కథలను వ్రాసినందుకు అటువంటి రచయితలను, ఆ రచనలను ప్రచురించిన పత్రికలను నిషేధించాలనీ, ఒకవేళ అటువంటి పత్రికలు ఇంటికి వచ్చినా చించి పోగులుపెట్టే బాధ్యత ప్రతి స్త్రీ తీసుకోవాలని స్త్రీసమాజంలో మూడు తీర్మానాలు చేసారని తెలియజేసింది.

*సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది కాబట్టి, సంఘంలోనైనా సాహిత్యంలోనైనా స్త్రీల వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని తగ్గిస్తే స్త్రీలు ఊరుకోరనే స్ఫురణను రచయితలకు కలిగించే కథ ఇది. ఇదే స్త్రీల వ్యక్తిత్వ స్పృహకు స్వతంత్రతకు నిదర్శనం. నేటికీ ప్రసార మాధ్యమాలకు తెలియాల్సిన విషయం.*

ఈమెయే వ్రాసిన 'చట్ట సభలల్లో మెజారిటీ మీదేగా' (జులై1936 గృహలక్ష్మి పత్రిక) అనే మరొక కథలో స్త్రీసభలకు హాజరవటానికి పిల్లలతో సహా బయలు దేరుతున్నప్పుడు ముందుగా పిల్లలకు కావలసినవన్నీ సమకూర్చుకొనేందుకు భర్తను డబ్బు అడగాల్సిన స్థితికి వగచి స్త్రీలు సంపాదన పరురాలైతేనే పరాధీనత పోతుందని, అదే స్వతంత్రంగా జీవించటం అని భావించింది. అంతేకాక, రచయితలు స్త్రీని భోగవస్తువని తోచినట్లు వ్రాస్తారు గానీ నారీ హృదయాన్ని అర్థం చేసుకోలేరనీ, స్త్రీ పురుషునితో సమానమైన ప్రాణి అని గుర్తించరనీ, స్త్రీకి పురుషులతో సమానమైన స్వతంత్ర హక్కులు ఉంటాయని భావించరని బాధపడింది. ఆమె హాజరైన 'విడాకుల చట్ట నిర్ణయ సభ' లోని విశేషాలుగా ఇంటికి వచ్చిన తర్వాత భర్త అడుగగా, ఆమె పెళ్ళిళ్ళ మీద పెళ్ళిళ్లు చేసుకొనే భర్త నుండి స్త్రీ విడాకులు తీసుకుంటే పిల్లలు ఇబ్బంది పడతారు కాబట్టి పురుషుడు భార్య జీవించి ఉండగా మరో వివాహం చేసుకోవటానికి వీలులేకుండా బిల్లును తయారు చేసుకున్నామని చెప్తుంది. దానికి భర్త మహిళా సభలలో లక్షతీర్మానాలు చేసుకొన్నా తమకు భయంలేదనే సరికి చట్టసభలో మెజారిటీ పురుషులకు ఉండటంతో భర్త అటువంటి మాటలు అనగలిగాడని భార్య గ్రహించటాన్ని కథలో కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

*ఈ రచయిత్రి వ్రాసిన కథలలో స్త్రీలు లోకల్ బోర్డుల్లో, చట్టసభలో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలని ఎన్నో రచనలు చేయటం జరిగింది. చట్టాలు తయారుచేసే శాసనసభలో స్త్రీల ప్రాతినిధ్యం ఉంటే తప్ప స్త్రీల సమస్యలు తీరవని ఆనాడే ప్రతిపాదించిన క్రాంతదర్శినిగా కనుపర్తి వరలక్ష్మమ్మ అర్థం అవుతుంది. ఆనాడే మహిళాబిల్లు చట్టంగా రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించి నేటికీ స్ఫురణను కల్గించటంగా ఈ కథ అర్థమవుతుంది.*

గొట్టుముక్కల వెంకాయమ్మ వ్రాసిన 'అయ్యోపాపం' అనే (మార్చి 1935 గృహలక్ష్మి) కథలో హరిజన దంపతులు అనారోగ్యంతో ఉన్న ఆమె తల్లిని చూడటానికి గ్రామానికి బయలుదేరి 15 మైళ్ళు నడిచేసరికి దారి మధ్యలో వేసవి కాలం కారణంగా దాహమై వరుసగా చలివేంద్రం పెట్టిన బ్రాహ్మణుని, మరొక బ్రాహ్మణ యిల్లాలినీ, వేశ్య యింటికి వెళ్ళి త్రాగునీటిని అడిగినా మాలలకు పోయమని వారిని తరిమిగొట్టారు. వారు స్పృహ తప్పిపడిపోయినప్పుడు ఒక సాహెబ్ ముందుకువచ్చి వారి దప్పిక తీర్చటంతో వారు తేరుకున్నారని తెలియజేసింది.

*'అస్పృశ్యత' మానవత్వాన్ని మంటగలిపిన విషయాన్ని తెలియజేసిన కథయిది. అస్పృశ్యులుగా సమాజంలో వారికి జరుగుతున్న అన్యాయాలను, చిత్రీకరిస్తూ స్త్రీలు కథలు వ్రాసారు. వారిలో పులవర్తి కమలావతీదేవి, గొట్టుముక్కల వెంకాయమ్మ వంటివారు ప్రముఖులు.*

పి. హేమలతాదేవి వ్రాసిన 'ఇంటనొకటి రచ్చనొకటి' (ఏప్రిల్ 1935 గృహలక్ష్మి) అనే కథలో భర్త బయట ప్రపంచంలో మీటింగులకు వెళ్ళి సభలలో ఉపన్యసిస్తూ స్త్రీలు సమస్యలు నెదుర్కొంటున్నారు కాబట్టి వారికి స్వతంత్ర జీవనం కావాలని ఉపన్యసిస్తుంటాడు. కాని, ఇంటికి వస్తే మాత్రం తన భార్యకు స్వతంత్రం ఉండటానికి వీలులేదనీ, ఏ విషయాలు ఆమెకు చెప్పాల్సిన అవసరం లేదనీ భావిస్తూ భార్యను బానిసగా చూస్తాడు. భార్య అతని సామాజిక ప్రవర్తనకు, ఇంట్లో ప్రవర్తనకు ఉన్న తేడాను ప్రశ్నించేసరికి ఆమెను భౌతిక హింసకు గురిచేసి బయటకు వెళ్ళిపోయాడని తెలియజేసింది.

*సంస్కారిగా స్త్రీస్వాతంత్ర్యం గురించి మాట్లాడి బయట ఉపన్యాసాలిచ్చినా ఇంటిదగ్గర మాత్రం మొగాడిగా తన కింద భార్య బానిసలాగా ఉండాలనుకొనే భర్తలలోని ద్వెముఖాలను, కుహనాతత్వాన్ని కథలో పరిచయం చేయటం జరిగింది.*

వెలిదండ చూడికుడుత్తమ్మ వ్రాసిన 'కమల' (ఏప్రిల్ 1935 గృహలక్ష్మి) అనే కథలో ఇంగ్లీషు చదువులు చదువుకున్న యువతి భారతదేశపు కుటుంబవ్యవస్థలో స్త్రీలను బానిసలుగా భావిస్తారనీ, తన స్వేచ్ఛకు వివాహం అడ్డువస్తుందని భావించి తల్లిదండ్రులు, బావ చెప్పినా వినక పెళ్ళిని నిరాకరించింది. యువతులు వ్యక్తిస్వాతంత్ర్యం కోరుకుంటున్నారనీ, స్వేచ్ఛా వ్యామోహంలో మునిగిపోయారనీ, స్వాతంత్ర్యం అనే పదం పవిత్రతకు సంబంధించిన పదమనీ,

చాపల్య సూచకమైన అహంకారంతో కూడిన ఇచ్ఛ స్వేచ్ఛకాదని తల్లిదండ్రులు చెప్పినా అర్థం చేసుకోదు. ఆ తర్వాత ఆమె తనకు యిష్టమైన ముస్లిమును పెళ్ళిచేసుకొన్నా సరిపడక ఇంటికి తిరిగివచ్చిందనీ, ఆ తర్వాత మరొక క్రిష్టియను వ్యక్తిని రెండవ పెళ్ళిచేసుకొన్నా అతడూ మోసం చేయటంతో, రోగాలపాలయి పిల్లలను మిషనరీ హాస్టల్స్ లో పెట్టి చివరకు పశ్చాత్తపపడుతుందని తెలియజేసింది.

*అప్పుడప్పుడే ఉన్నతవిద్యను నేర్చిన మహిళలు స్వాతంత్ర్యానికి ఉన్న పవిత్ర ఆశయంలోని స్వేచ్ఛకు, ఇచ్ఛకు ఉన్న తేడాను గ్రహించలేక జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్న భావనను రచయిత తెలియచేసి 'తస్మాత్ జాగ్రత్త' అని యువతులను హెచ్చరిక చేయటం అర్థం అవుతుంది.*

ఈమెయే వ్రాసిన 'పేదరాలు' (నవంబరు 1935 గృహలక్ష్మి) అనే మరో కథలో సమాజంలోని వర్గస్వభావమే, వర్గ సంఘర్షణలై, పేదలు, ధనికులు ఏర్పడటానికి కారణమని చెప్పింది. ప్రభుత్వం వారు వేసే పన్నులు కట్టలేక కర్షకులు పట్నాలకు వలసవచ్చి, పరిశ్రమలో వెట్టిచాకిరీచేసి తాగుడుకు బానిసలవుతుంటే కుటుంబాలు దుర్భరదారిద్ర్యాన్ని వహిస్తున్నాయనీ, ఆకలితో అలమటిస్తూ అన్నంకోసం ధనవంతుల యిళ్ళకి వెళ్ళి అడుక్కోగా, వాళ్ళు పార్టీలకు డబ్బు ఖర్చు పెడుతున్నారుగానీ, బీదలకు సహాయం చేయటంలేదని చెప్పింది. ధనికులు, బీదల స్థాయిని, పనుల కష్టాలను బట్టి సంవత్సరానికి ఒక్కసారే పన్ను వేస్తే సమస్యలు తీరుతాయనీ, బీదరికం వల్ల పిల్లల చదువుకోలేక పోతున్నారనీ, సరైన తిండిలేక పిల్లలు, వృద్ధుల పోషణ కరువైందనీ, ప్రభుత్వంవారు, ధనికులు పూనుకొని పేదల దారిద్ర్యాన్ని పోగొట్టే విషయాలను ఆలోచించాలని తెలియజేసింది. కొత్తకొత్త పనిముట్లను కనుక్కుంటున్నారనీ, పాలకులు ఆ పనిముట్లను తమ స్వాధీనంలో ఉంచుకొని, శ్రమజీవులు వాటిని ఉపయోగించుకొనేటట్టు చేయాలనీ, అధికారులు డబ్బును సమానంగా వినియోగించి సద్వినియోగ పరచాలనీ, వ్యవసాయాభివృద్ధికై ఖర్చుపెడితే ప్రజలలో శాంతి సౌఖ్యాలు ఏర్పడతాయని వెలిదండ చూడికుడుత్తమ్మ తెలియజేసింది.

*ఆదాయాలనుబట్టి పన్నులు విధించాలనీ, దారిద్ర్యాన్ని పోగొట్టే ఆర్థికవిధానాన్ని ఆలోచించాలనీ, పనిముట్లను శ్రమజీవులకు ఉచితంగా అందుబాటులో ఉంచితే వ్యవసాయోత్పత్తి పెరుగుతుందనీ చెప్పటమే స్త్రీలలో పెరిగిన ఆలోచనలు దేశఆర్థిక విధానాలను నిర్ణయించే స్థాయికి అభివృద్ధి చెందాయని భావించవచ్చు. నాటి స్త్రీల ఆలోచనలే నేటి ప్రభుత్వాల ఆలోచనలకు ఆదర్శం. అప్పుడప్పుడే భారతదేశంలో ప్రవేశించిన కమ్యూనిజం యొక్క భావాలు ఈ కథా రచయితను ప్రభావితం చేసాయని అర్థమవుతుంది.*

ఈమెయే వ్రాసిన "ఆదర్శ ప్రపంచం" (ఆగష్టు-సెప్టెంబర్ 1936 గృహలక్ష్మి) అనే ఇంకొక కథలో ఒక సంఘసంస్కరణాభిలాషి హిందూదేశ దారిద్ర్యాన్ని గురించి పుస్తక పఠనంతో తెలుసుకొని తన చుట్టూ ఉన్న సమాజంలోని దరిద్రులను తలచుకుంటూ వారికి సహాయం చేసే

శక్తిని దీక్షను తనకిమ్మని ఈశ్వరుడ్ని ప్రార్థించి అతడు స్నేహితునితో పేదజనుల ఉన్నతిని గురించి చర్చిస్తుంటాడు. ఆ క్రమంలోనే ఒక రోజు పనిలోకి కూలీగా వచ్చిన గర్భవతి నీరసించి కూర్చున్నప్పుడు కాంట్రాక్టరు చూసి ఆమెను తిడుతుండేసరికి చలించిన అతడు ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఆమెగురించి అడుగగా నాల్గునెలలక్రితం తన భర్త కుటుంబాన్ని వదలివెళ్ళి పోయాడనీ, తనకు ఆరుగురు బిడ్డలనీ, వారికోసం తాను కష్టపడగా వచ్చిన కూలిడబ్బులతో బిడ్డల్ని పోషిస్తున్నట్టు చెబుతుంది. అలాగే అక్కడ కూలిపనులు చేస్తూ దారిద్ర్యజీవనం గడుపుతున్న వారిని గురించి తెలుసుకున్నాడనీ, సాగునీళ్ళులేక పంటలు పండక దారిద్ర్యాన్ని అనుభవించలేక రైతులు పట్టణాలబాట పట్టినట్టును, పట్నవాసంతో వారి పిల్లలు వ్యసనానికి బానిసలవుతున్నారనికూడ తెలుసుకొని బాధపడ్డాడు. అతడు కలెక్టరు అనుమతితో ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని చందాలకై ఊరిలోని పెద్దలను కలిసి కర్మసిద్ధాంతం ప్రక్కనపెట్టి దరిద్రులకు సహాయం చేయమని అడగటంతో పాటు, పౌరుల బాగోగులను గురించి అధికార్లు బాధ్యత వహించాలని చెప్తాడు. మరొకప్రక్క సంతాన నిరోధాన్ని పాటించమని గ్రామంలో ప్రచారంచేస్తూ గృహసంక్షేమ కార్యక్రమాలతో గ్రామాన్ని అభివృద్ధిచేయటానికి పూనుకొన్నాడని వెలిదండ చూడి కుదుత్తమ్మ తెలియజేసింది.

*భర్త పలాయనం చెందినా తల్లిగా ఒక స్త్రీ పిల్లల పోషణార్థమై కష్టపడటం కన్పడుతుంది. అంతేకాదు దీనజనపోషణకై సంక్షేమ కార్యక్రమాలలో గ్రామాభివృద్ధిలో యువత పాల్గొనాల్సిన అవసరాన్ని ఈ కథ తెలియజేస్తుంది.*

సమయమంత్రి రాజ్యలక్ష్మి వ్రాసిన 'క్లబ్బు' (జూన్ 1935 గృహలక్ష్మి) అనే కథలో విదేశాలలో చదువుకొని వచ్చిన భారతీయ పురుషులకు ఇక్కడి స్త్రీలు అనాగరికంగా కనపడుతున్నారని, క్లబ్బులకు వెడితేనే స్త్రీపురుషసమానత్వం స్త్రీలస్వేచ్ఛ ఉంటుందని అనుకుంటున్నారుగానీ, భార్యలకు మాత్రమే పాశ్చాత్య నాగరికతను గురించిన వ్యామోహముందని భావిస్తున్నారని తెలిపింది. నిజంగా పురుషులతో స్త్రీలు స్వేచ్ఛగా మాట్లాడితే సహించలేరని తెలుసుననీ, దాన్ని ఒప్పుకోని పురుషులు తమ భార్యలు క్లబ్బులకు రానందుకు కోపం తెచ్చుకొంటారని చెప్పింది. జాతీయతా భావాలు, రాట్నం వడకాలనే భావాలు గల ఆ భార్యలు అటు విదేశీయతకు, ఇటు స్వదేశీయతకు మధ్యేమార్గంగా స్త్రీల క్లబ్బులు పెట్టుకొని, పుస్తకాలు, వార్తాపత్రిక పఠనం చేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చిందనీ తెలియజేసింది. ఆ పాశ్చాత్య నాగరికతను పాటించే భార్యల విషయంలో భర్తల ఆలోచనలను రుజువుచేయటానికి ఇద్దరు స్త్రీలలో ఒకరు మగవేషం వేసుకొని చదరంగం ఆడుతుంటారు. అది చూసిన ఆ భర్త సహించక అతనిలో ఉన్న ప్రాచీన సంస్కృతి బయటపడి, మగవాడితో గదిలో ఉన్నటువంటి భార్యను నిందించటంతో ఆ స్నేహితురాలు పురుషవేషం విడిచిపెటుతుంది. భర్త తనతప్పు తెలుసుకుంటాడని తెలియజేయటం జరిగింది.

*భారతదేశంలో భర్తలు భార్యల స్వేచ్ఛను నిజంగా యిష్టపడరనీ, పాశ్చాత్య వ్యామోహంతో క్లబ్బులకు వెడితేనే ఆడామగా సమానహక్కులతో ఉంటారని అనుకుంటారుకాని అది*

*కుహనాసమానత్వమని చెప్పింది. భారతస్త్రీలు తమ జాతీయతను నిలబెట్టుకుంటూ ఆధునిక విజ్ఞానాన్ని అందుకునే క్రమంలో 'స్త్రీల క్లబ్బులు' ఏర్పాటు చేసుకోవాలనుకునే నాగరికతతోపాటు భారతీయ సంస్కృతికి జాతీయత ఒప్పుతుందనే భావన రచయిత వ్యక్తం చేసింది. చెప్పాలనుకున్న విషయాన్ని ప్రయోగాత్మకంగా అంతర్నాటకీయంగా నిర్వచించటం పాఠకుల మనస్సులో నాటుకునేటట్లు చేయగలిగిన కథయిది. స్వదేశీయతకు, విదేశీయతకు సంఘర్షణ ఏర్పడినప్పుడు జాతీయతా భావం విజయం సాధిస్తుందని అర్థమవుతుంది.*

సి. హెచ్. వు. రమణమ్మ వ్రాసిన 'ఆదర్శ ప్రాయురాలు' (జూన్ 1935 గృహలక్ష్మి) అనే కథలో ధనవంతురాలిగా ఒకరికి లొంగివుండటం యిష్టంలేక పెళ్ళిని మానేసి తండ్రి వ్యాపారాన్నే తాను కొనసాగించాలనుకుంటుంది. కాని పేదలమీద, కార్మికుల కష్టాలను పట్టించుకునే మనస్తత్వం ఆమెకు లేదని భావించిన ఆమె స్నేహితురాలు దీనికి భిన్నంగా పేదలను ఆదరించాలనుకుంటుంది. ఆ క్రమంలో తాను టీచరుగా తెచ్చుకున్న జీతాన్ని పేదల సంక్షేమానికి ఉపయోగించాలనుకొని గుంటూరులో శ్రీ భారత అనాథశరణాలయాన్ని స్థాపించి బాలికలను వితంతువులను చేర్పించు కుంటూ ఉచితవసతి సౌకర్యం ఏర్పాటు చేస్తుంది. వాళ్ళకి భాషలను, సంగీతం, కుట్టు పనులు నేర్పుతూ క్రమశిక్షణలో ఆ విద్యాలయాన్ని నడుపుతూ ఉంటుంది. దాని నిర్వహణకోసం చందాకై ధనవంతురాలి దగ్గరకు వెళ్ళినపుడు అక్కడ ఆమెకు వ్యతిరేకంగా కార్మికులు పనివేళలు తగ్గించాలనీ, జీతం పెంచాలంటూ సమ్మెబాటలో ఉండటంతో, ఆ ధనవంతురాలు కార్మికులను పట్టించుకోనందుకు వారి తరుపున వకాల్తాపుచ్చుకొని మాట్లాడాలనుకొని వెళ్ళింది. కానీ ఆ మిత్రురాలు తనను గుర్తించినా పట్టించుకోక పోయేసరికి కార్మికులనందరినీ ఏకంచేసి తన డబ్బును పెట్టుబడిగాపెట్టి, ఆ కార్మికుల జీతంలో కొంత డబ్బును నిలువధనంగా యిచ్చే విధంగా కార్మికులను వాటాదారులను చేసి, ఒక ఫ్యాక్టరీని చక్కగా నడుపుతుంటుంది. దానిని వ్యతిరేకించి ఆమెను చంపించాలను కొన్న ఆ ధనవంతురాలే చివరికి ప్రమాదంలో పడి పశ్చాత్తాపంతో చివరి క్షణాలలో స్నేహితురాలిని ఆదర్శప్రాయురాలని పేర్కొంటూ జీవితాన్ని ముగిస్తుంది.

*ఈ కథలో పేదలకష్టాలపట్ల, కార్మికుల సంక్షేమంపట్ల స్త్రీల స్పందన, అవసరమైతే కార్మిక నాయకురాలిగా వారి పక్షాన వహించి కార్మిక క్షేమాన్ని కోరుకున్న శక్తిమంతురాలుగా స్త్రీశక్తి అభివృద్ధి చెందిందని అర్థం అవుతుంది. భారతదేశంలో అప్పుడప్పుడే కార్మిక సంఘాల చట్టాలు వచ్చి కార్మిక శ్రేయస్సును కోరుతూ వ్యాప్తి చెందుతూ కమ్యూనిజం ధనిక-బీద, కార్మిక-యాజమాన్యం మధ్య సత్సంబంధాలుండాలని కోరుకోవటం అర్థంఅవుతుంది. దేశం యొక్క ఆర్థికవ్యవస్థలో కార్మిక భాగస్వామ్యానికి ప్రాధాన్యతనివ్వాలనే భావనకలిగించింది. పారిశ్రామిక సత్సంబంధాలు ఎలా ఉండాలో ఆ నాడే రచయిత చెప్పటం నేటి యాజమాన్యాలకు చుక్కానివంటి కథయిది.*

చామర్తి సీతాదేవి వ్రాసిన 'ప్రేమతత్వం' (జూలై 1935 గృహలక్ష్మి) అనే కథలో పిల్లల్నికనే విషయంలో భార్యాభర్తలమధ్య జరిగిన సంభాషణలో భాగంగా భార్య ప్రకృతి సిద్ధమైన దానిని

అడ్డుకోకూడదని వాదిస్తుంది. అభిప్రాయ భేదాలవలన కలిగిన విద్యాకాంక్ష, జ్ఞానాభివృద్ధియే దేశక్షేమాభివృద్ధికి కారణమని, జనసంఖ్య అవసరమని భావించారు. మృత్యుదేవతను తరిమే ఉపాయం కనిపెట్టాలని, మనసును దుర్వ్యాపారాలలో చొరనీయకుండా కట్టుబాట్లు చేసుకుంటూ జననతత్వంమీద స్వతంత్రతను సంపాదించాలని భావించారు. కాని ఇద్దరు పిల్లల వరకు మాత్రమే కనాలని భర్త నిర్ణయించటంతో అభిప్రాయబేధాలను సమన్వయ పరచుకోవటంతో భార్యాభర్తలిద్దరి మధ్య ప్రేమతత్వం స్థిరపడిందనీ తెలియజేసింది.

*ప్రకృతిమీద, మనస్సుమీద, ఇంద్రియాల మీద కూడా స్వతంత్రతను సంపాదించటమే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి దారితీస్తుందనే భావనతో స్వాతంత్ర్యపు మూలాలను తరచిచూడటము జరిగింది. ప్రతిసామాజిక కుటుంబవిషయాన్ని చర్చించేటప్పుడు అభిప్రాయ భేదం ఉంటుందనీ, ఆ భేదాభిప్రాయాలను సమన్వయం చేసుకొంటూ అభివృద్ధికరమైన నిర్ణయం చేసుకొంటే ప్రేమసంబంధాలు నిలబడతాయనీ దేశక్షేమాభివృద్ధి కలుగుతుందని రచయిత్రి భావించింది.*

ఈమెయే వ్రాసిన 'బంగారు పతకము' (ఆగష్టు 1935 గృహలక్ష్మి) అనే మరొక కథలో శారదాచట్టం వల్ల బాల్యవివాహాలు చేసే తండ్రులకు జుల్మానా గానీ, జైలుశిక్షగాని వేస్తున్నారు కాబట్టి వాటినుండి తప్పించుకొని హిందూమతాచారం ప్రకారం బాల్యవివాహం చేయటానికి తగినయుక్తి చెప్పినవారికి బంగారు పతకాన్ని యిస్తానని జమీందారు ప్రకటిస్తాడు. దానికై అన్ని కులాలవారితో సమావేశం ఏర్పాటుచేసిన సందర్భంలో ఒక నవనాగరికుడు బాల్యవివాహాల వల్ల అనారోగ్య శిశువులు పుడతారనీ, అందుకే శాసనం చేసారని చెప్పి, వారిని చట్టానికి పట్టిస్తానని బెదిరిస్తాడు. అయినా, వారు వినకుండా తమకు శిక్షపడకుండా ఉండే విధంగా బాల్యవివాహాలు చేసే యుక్తికై చర్చను పెట్టగా ఒకరు కడుపులో ఉన్నప్పుడే పెళ్ళిచేస్తే చట్టాన్ని అమలుచేయలేరని అంటాడు.దానికి ఆడ, మగో తెలియకుండా ఎలా చేస్తారని మరొకరు సందేహాన్ని వ్యక్తపరచగా ఇంకొకరు కత్తికిచ్చి పెళ్ళిచేసి పెరిగిన తర్వాత పిల్లనిచ్చి సంధానం చేయవచ్చని అంటాడు. మిగిలినవారిలో ఒకడు పామునే 'వరునిగా చూపించి కట్టిన జానపద పాటలున్నాయంటూ ఉదహరించగా, ఇంకొకరు ఆ కత్తికే రాముడనే పేరుపెట్టి పెళ్ళిచేసి, పెరిగిన తర్వాత పెళ్ళి జరిగితే ఆ వరుడికి ఆ పేరుపెట్టవచ్చనీ, ఆరకంగా చేస్తే శారదా చట్టం ప్రకారం శిక్షించలేరనీ సలహాయిస్తాడు. అలా చెప్పిన ఆ యిద్దరికి బంగారుపతకాలు ఇచ్చి తన జమీందారీ తనం నిరూపించుకున్నాడని చామర్తి సీతాదేవి కథను ముగించింది.

*పెత్తందారీతనం ఉన్నచోట ప్రభుత్వ శాసనాలుకాక మతాచారంగా పురుష ప్రయోజనాలకు వీలుగా ఉన్న బాల్యవివాహాలను అమలుచేయటానికి చర్చలుపెట్టటం, వారిలో మేధావితనాన్ని ఉపయోగించుకుంటూ సనాతన ధర్మసంరక్షణ చేయటంగా భావించటం కనపడుతుంది. శారదాచట్టాన్ని అమలులోకి రానీయకుండా ఎత్తులకు పైయెత్తులు వేస్తూ చట్టపరమైన శిక్షను*

*ఎదుర్కొనే ఉపాయాలు చెప్పినవారికి బంగారు పతకాలు ఇవ్వాలనుకోవటమే గొప్పతనంగా భావిస్తూ చట్టాన్ని నిర్వీర్యంచేసే కుయుక్తులను పన్నటం అర్థమవుతుంది. పితృస్వామ్య సంస్కృతి రక్షణయొక్క పరాకాష్ఠస్థితి అర్థమవుతుంది.*

మామిడిపూడి వెంకమ్మ వ్రాసిన 'నేనేమో మొద్దునుగాను' (ఆగష్టు 1935 భారతి)అనే కథలో భార్య చదువుకోలేదనీ నల్గురిలో నాగరికంగా మసలుకోవటం, మాట్లాడటం ఆమెకు తెలియదనీ భావించి ఏ మీటింగ్ లకు తనను బయటకు వెళ్ళనీయడని స్నేహితురాలికి చెప్పగా, ఆమె వచ్చి ఆ భర్తతో మాట్లాడి ఒప్పిస్తాననంటుంది. తన భర్త తనను ముందుగా చదువుకుంటే గానీ బయటకు వెళ్ళద్దన్నాడని స్నేహితురాలికి చెప్పి, భర్తకిష్టం లేకుండా తాను బయటకు పోదల్చుకోక ఇంటిదగ్గరే మాస్టార్ని పెట్టి చదువునేర్పించమని భర్తనడుగుతుంది. అతడు తన మిత్రుడ్ని గురువుగా ఏర్పాటు చేసినా, ఆ గురువు ఆమెను తక్కువచేసి మాట్లాడుతున్నా పట్టుదలగా స్కూలుఫైనల్ పరీక్షకు కడుతుంది. కాని ఆ గురువు ఒక పాఠాన్ని మాత్రమే చెప్పి ఆంగ్లభాష నేర్చుకోవటం ఆడవాళ్ళకు సులభంకాదని చెబుతూ, ఆమె చదువును ముందుకు సాగనీయకుండా చేస్తాడు. పురుషుల కుట్రను అర్థంచేసుకొని, స్త్రీలకు పాఠాలుచెప్పటం రాకపోతే గురువును వెళ్ళిపొమ్మని ఆమె చెప్పటంతో కథ ముగిస్తుంది.

*సమాజంలో స్త్రీలు చదువుకోవటం పురుషులకు సుతరామూ యిష్టముండదు కాబట్టి స్త్రీలుపట్టుదలతో ఇంటిదగ్గరగానీ, పాఠశాలలోగానీ, విద్యనభ్యసించాలనీ మీటింగ్‌లకు హాజరవ టానికి బయటకు వెళ్ళే పరిస్థితులు కల్పించుకోవాలని భావించింది. చదువురాని భార్యను భర్త అగౌరవపరుస్తూ ఉంటాడనీ, పురుషులకు చదువుకున్న స్త్రీలే నాగరికులుగా కన్పిస్తారనీ గ్రహించమని కథ తెలియజేసింది. స్త్రీవిద్యాభివృద్ధిని కుంటుపరచే పురుషాధిక్యపు సంస్కృతీ కుట్రను వ్యక్తంచేసింది.*

తాడి నాగమ్మ వ్రాసిన 'కథగాదు' (సెప్టెంబరు1935 భారతి)అనే కథలో విదేశీ వస్త్రాలు, వేషధారణ అంటే మోజు గల ఒక యువకుడు స్వదేశీదీక్ష పట్టి ప్రచారం చేస్తున్న స్త్రీతో వెకసక్కంగా మాట్లాడుతూ, ఆమె ముద్దిస్తే స్వదేశీ దీక్ష పడతానంటాడు. దానికి ఆమె అతడు స్వదేశీదీక్ష పడతానంటే రోజులాగే తాను దీక్షకై వస్తూన్నప్పుడు తనఅన్నలు తనకు ముద్దులిచ్చినట్లుగానే సోదర భావంతో ముద్దుపెట్టటానికి తనకు అభ్యంతరం లేదనే సరికి, ఆ యువకుడు ఖంగుతిని పరిస్థితిని అర్థం చేసుకొని అక్కడినుండి జారుకుంటాడు.

*కథలో స్వాతంత్ర్యోద్యమ భాగస్వాములైన స్త్రీలు భయపడకుండా వీధుల్లో తిరుగుతుంటే ఎదురయ్యే లైంగిక వేధింపులను తెలియజేస్తూ అటువంటి సమస్యలు ఎదురైనపుడు స్త్రీలు యుక్తిగా ఎలా ఎదుర్కోవాలో తెలియచేసే కథయిది. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా స్త్రీ పురుషులు దేశస్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ బానిసత్వంపై పోరాడుతుంటే, అంతర్గత సమాజంలో స్త్రీలు అదనంగా ఉద్యమంలో 'లైంగిక హక్కుల సంరక్షణకై' కూడాపోరాడాల్సిన అవసరాల్ని సూచించే కథ ఇది.*

*ఈ కథలోనే 'ఇర్విన్ ఒప్పందం' విఫలమవటంతో, స్వదేశీ దీక్ష పతాకస్థానానికి చేరిందనీ, జనీవాలో జరిగిన అఖిల ప్రపంచ మహిళా సమావేశంలో హిందూ స్త్రీలు తమ ఖద్దరు చీర కొంగును చింపి భారత జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తే మిగిలిన స్త్రీలందరూ జాతీయగీతం పాడిన విషయాన్ని తాడినాగమ్మ తెలియచేసింది.*

*స్త్రీల స్వదేశాభిమానం స్పష్టం అవుతుంది. స్వదేశీదీక్షలో విదేశీ, వస్తు వ్యాపారాలన్నింటికి భారతీయులు గండికొట్టటంతో భారతదేశంలో బ్రిటీష్ వారి వ్యాపారం తగ్గిందనీ, అందుకే స్త్రీలందరూ స్వదేశీదీక్షతో విదేశీ వస్తుబహిష్కరణలో ముమ్మరంగా పాల్గొన్న విషయం అర్థమయి, అదే ఉద్యమ సందర్భంలో స్త్రీలకు ఎదురైన లైంగిక వేధింపులను వారు యుక్తితో ఎదుర్కొన్నారని అర్థమవుతుంది. వారి యొక్క ధైర్యస్థైర్యములు భారత జాతీయపతాకం ఎగిరినన్నాళ్ళు భారత స్త్రీలకు స్ఫూర్తినిచ్చే విషయంగా భావించవచ్చు. అంతర్జాతీయ వేదికపై స్త్రీలు భారతదేశ పతాకాన్ని అప్పటికప్పుడు సృష్టించుకొని ఎగురవేసి నాటి భారతజాతీయగీతం పాడటమే భారతదేశ స్వాతంత్ర్యానికి చిహ్నమని దాన్ని స్త్రీలే సాధించారని స్ఫురణకల్గి గగుర్పాటు కల్గించకమానదు. నాడే స్త్రీలు విదేశాలకు వెళ్ళి సమావేశాలలో పాల్గొనటం స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి బాటలు వేయటంగా భావించాలి.*

కె.కృష్ణకుమారి వ్రాసిన 'ఆనందమయి' (నవంబరు 1935 గృహలక్ష్మి) అనే కథలో బాలవితంతులైన ఆనందమయి బాలికాపాఠశాలలో చేరి చదువుకోవటంతో నవీన భావములు ఏర్పడి తన స్నేహితురాలి అన్నను పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. ఆమె సంరక్షకులు, పాఠశాల అధికారిణి ఆ పెళ్ళిని వ్యతిరేకించటంతో చేసేదిలేక ఆమె గోదావరిలో దూకి చనిపోయిందనీ, ఆ నదీ ప్రవాహంలో బాలవితంతువులఘోష, వారి పునర్వివాహం, జాతీయత్వపు బోధ వినపడు తోందని రచయిత తెలియజేసింది.

*నదీప్రవాహపు గలగలలో బాధిత స్త్రీల ఘోషను వినగలిగితేనే స్త్రీల సమస్యలు, స్త్రీలు స్వాతంత్ర్యానికై ఆరాటపడే విషయమర్థమవుతుంది. అప్పుడే స్త్రీలలో చైతన్యానికి ప్రేరణఅవుతుంది. స్త్రీల సమస్యలకు ప్రకృతికూడా ఘోషిస్తోంది కాబట్టి సమాజం పట్టించుకోవాల్సిన అవసరాన్ని సూచించింది.*

పులవర్తి కమలావతీదేవి వ్రాసిన 'మెదడుంటే తలకాస్తుంది' (మార్చి 1936 గృహలక్ష్మి) అనే కథ/గల్పికలో ఒక ఊరిలోని చాకలివాండ్రు అందరూ కలసి హాస్యకళలో చతురుడైన ఒక భాగవతుడికి డబ్బులిచ్చి తమ ఊరికి పిలిపించుకొంటారు. అతడు చేసిన హాస్యప్రదర్శనలో భాగంగా 'ముట్టుకట్టల హాస్యం' ను మొదలుపెట్టి వారి కులవృత్తిని అపహాస్యం చేస్తుంటే, ఇద్దరు చాకలివాండ్రు అక్కడి నుండి బయటకు వెళ్తారు. అది చూచిన ఆ హాస్యభాగవతుడు తెలివిగా అక్కడున్న వారిలో ఒకచాకలి వాడిని పిలిచి తాను నిలబడ్డచోట అతనిని నిలబెట్టి తన మెడలోని పూలదండను అతని మెడలో వేసి హాస్యం అంటూ అక్కడున్న కాగడాలను ఆర్పి, చీకటిమయం చేసి ఆ భాగవతుడు జారుకొంటాడు. బయటకు వెళ్ళి వచ్చిన చాకలివారు బడితెను తెచ్చి భాగవతులను కొట్టాలనే ఆలోచనతో చీకటిలో భాగవతుడి స్థానంలో నిలబడ్డ తమకులపు వ్యక్తిని చావకొట్టటం జరిగింది.

*ఈ కథలో ఆ హాస్యభాగవతుడు తనను కొడతారని ముందుగానే ఊహించి తనపై దెబ్బలు పడకుండా ఆత్మరక్షణ చేసుకున్నాడని చెప్పి మెదడు ఉండటంచేతనే ప్రాణాలను కాపాడుకోవచ్చునీ చదువుకుంటే తెలివిపెరుగుతుందని చాకలివారికి అన్యాపదేశంగా చెప్పిన కథ. మత, కులాల పరంగా ప్రజలలో రావాల్సిన చైతన్యం గురించిన కథారచనలో పులవర్తి కమలావతీ దేవిది అందెవేసిన చేయి.*

ఈమెయే వ్రాసిన 'పోశమ్మగండి' (ఆగష్టు1938 వాసవి) అనే కథలో భద్రాచలం–పోలవరానికి మధ్య ఒక 'గండి' గా కనపడే కొండ ప్రాంతమైదానానికి వస్తూన్న బ్రిటీష్ దొరసాని తాను నడుపుతున్న విమానం కొండను ఢీకొని కిందపడిపోతుంది. ఆ గిరిజన ప్రాంతంలో కొండ మీద ఉన్న పోశమ్మ గుడి పూజారి శంభన్న దొర ఆ చప్పుడు విని క్రిందకు వచ్చి చూస్తాడు. కాని విమానంలో నుండి రాత్రిపూట సహాయానికై దొరసాని అరుస్తుంటే విని ఆ భాష అర్థంకాక ఆ విమానాన్ని 'పెనుభూతం'అని భయపడి తిరిగి కొండమీదకు వెళ్ళాడు. తెల్లవారి తిరిగి వచ్చి దానిలోపల ఆత్మ మూలుగూతోందని తీయాలనుకునేసరికి లోపల కాలికి గాయం అయిన దొరసాని పెద్దగా అరిచేసరికి భూతం అనుకొని భయపడి మళ్ళీ శంభన్న తిరిగి కొండపైకి వెళ్ళి మరి కాసేపటికి తిరిగి వస్తాడు. కానీ, ఈ లోపల ఆ పోశమ్మ గుడి పూజారిత్వానికి ఆశపడుతున్న మరొక గంటందొర, అతనితోపాటు వచ్చిన ఆతని కొడుకు కలిసి నిర్భయంగా ఆ దొరసానిని బయటకు తీస్తారు. దానికి కోపం వచ్చిన శంభన్నదొర ఆ భూతాన్ని భుజముమీద వేసికొని కొండమీద ఉన్న గుడిదగ్గరకు తీసుకువెళ్ళి ఆ భూతంలోని ఆత్మను పోగొట్టటానికై దానికి పసుపు కుంకుమలు పూసి పోశమ్మగుడి దగ్గరున్న బలిపీఠంమీద పడుకోపెడ్తాడు. అక్కడ దొరసానిని బలియివ్వటానికి శంభన్న కత్తితో ఉండగా, అదే సమయానికి దొరసానిని వెతుకుతూ వచ్చిన బ్రిటిష్ దొరలు చూసి, తమ దొరసానిని ఆ గిరిజనులు చంపుతున్నారని భావించి ఫైరింగ్ కి ఆర్డరు ఇచ్చేసరికి శంభన్న చచ్చిపోతాడు.

*ఈ కథలో ఎప్పుడూ విమానాన్ని గురించి వినని, చూడని గిరిజనుడు దాన్నొక పెనుభుతంగా భావించి, అందులో ఉన్న ఆమెను భూతాత్మకింద భావించి పోశమ్మగుడిలో బలి ఇవ్వాలను కోవటం జరిగిందంటే అది గిరిజనుల అవిద్యకు చిహ్నమనీ, ఆ దొర వారిని అర్థం చేసుకోలేదని తెలుస్తుంది. వారిని బాధపెట్టకుండా విద్యావాసనలేని గిరిజనులను ప్రపంచంపట్ల జ్ఞానవంతులను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందని తెలియజేసేకథ. గోదావరి,విశాఖపట్టణపు కొండ ప్రాంతపు గిరిజన తెగలు బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసినందుకు కలిగిన భయం బ్రిటీష్ వారిలో ఉండటం చేత సాయుధ సంస్కృతిని పాటించి 1870 నుండి ఉన్న నేరస్తజాతుల చట్టాన్ని వారు అమలు చేసేవారనే దానికి అద్దంపట్టినది ఈ కథ. అప్పటికే శాసనోల్లంఘన సమయంలోనూ, సత్యాగ్రహ ఉద్యమ సమయంలోనూ అవిద్య, అధికారం మధ్య హింసకు గురియైన ఆదివాసీల చరిత్రకు దర్పణంగా ఉంది. పులవర్తి కమలావతిదేవి రచించిన ఈ కథనే స్త్రీలసాహిత్యంలోని మొదటి గిరిజన కథగా భావించవచ్చు.*

చిల్కపాటి సీతాంబ వ్రాసిన 'సజ్జనమైత్రి' (మే 1936 గృహలక్ష్మి) అనే కథలో పేదరాలైన ఒకస్త్రీ దారిద్ర్యాన్ని భరించలేక పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాలనుకొన్న సమయంలో సజ్జనురాలైన ఒక ధనికురాలువచ్చి ఆమెను కాపాడటమే గాక అభిమాన వంతురాలైన ఆపేద స్త్రీకి, ఆమె పిల్లల జీవనార్థమై బ్రతుకు తెరువును చూపిస్తుంది. గాంధీబోధ ప్రకారం నూలువడకి నాణ్యమైన దారం తీయమని దారి చూపుతుంది. ఆమె ఆ విధంగా పనులు చేసుకొని డబ్బును సంపాదించటమే గాక, హిందీ భాష నభ్యసించి పలువురు శిష్యులకు బోధచేస్తూ డబ్బు సంపాదించటంతో ఆమె తన దారిద్ర్యాన్ని తొలగించుకుందనీ, సొమ్ము నిలువజేసుకునే స్థితికి చేరుకుందని తెలియచేసింది.

*అభివృద్ధికి, ఆర్థికవ్యవస్థకు ఉన్న తేడాను స్పష్టంచేసిన కథ ఇది. ధనికులు దానం చేయటం కన్నా బ్రతుకుతెరువును చూపించటమే ముఖ్యమని చెలియజేసిన కథ కూడా. బీద, ధనికుల మధ్యన ఉండే సజ్జనమైత్రి ఆర్థికవ్యవస్థను బాగుచేయటమే గాక స్వాతంత్రసాధనలో కూడా భాగస్వామ్యం చేయగలుగుతుందనే స్పృహను కలిగించే కథ యిది. మానవసంబంధాలకున్న లింకు అర్థమైయింది. ఓటు బ్యాంకు రాజకీయాలు నడపాలనుకొనే ప్రభుత్వాలు గ్రహించాల్సిన పచ్చినిజం యిది.*

సు.అన్నపూర్ణ వ్రాసిన 'తుదిమెట్టు' (జులై 1936 గృహలక్ష్మి) అనే కథలో చెడుస్నేహాలు, వ్యసనాలకు అలవాటుపడి చదువును ఆపేసిన కొడుక్కి తండ్రిపెళ్ళి చేసి పోషిస్తున్నా బాధ్యత తెలియక పోవటంతో చదువుకున్న భార్య కాపురానికి వచ్చిన తరువాత కొడుకును బాగుచేయమని మామ అడుగుతాడు. చదువుకున్న ఆ కోడలు భర్తకు బాధ్యతను తెలియజేసి చదువును కొనసాగించేటట్టు చేయటంతో అతని జీవితం బాగుపడుతుంది.

*చదువుకున్న స్త్రీ భర్త ప్రవర్తనను కూడా సరిదిద్దగల సామర్థ్యం కలిగియుంటుందని తెలియజేసిన కథ యిది. కుటుంబపరిధిలోని స్త్రీలశక్తి సామర్థ్యాలకు నిదర్శనంగా కన్పడుతుంది. చదువుకొన్న స్త్రీలు భర్తలను చదివింపజేసే స్థితికి చేరుకోవటం అర్థమవుతుంది.*

రాణి చాకుంట సరస్వతీబాయి వ్రాసిన 'అపజయం' (జులై 1936 గృహలక్ష్మి) అనే కథలో విద్యావంతురాలైన స్త్రీకి 'పెళ్ళి' అంటే భర్త భార్యను బానిసగా చూస్తాడనే పురుషద్వేషం ఏర్పడటంతో ఆమె వివాహాన్ని చేసుకోదలచుకోకపోగా తన స్నేహితురాలు పెళ్ళిచేసుకుంటుంటే పిల్లలు పుట్టిన తరువాత బానిస జీవితం ఆమెకు ఏర్పడుతుందని భయపెడుతుంది. అయినా ఆ స్నేహితురాలు వివాహంలో అన్యోన్య అనురాగంతో స్త్రీ, పురుషులుండే అవకాశం ఉందని చెప్పి చివరకు తన అన్నయ్యతో పెళ్ళికి ఒప్పుకోమంటుంది. ఆమె మాత్రం స్త్రీ పురుషులు పెళ్ళిచేసుకోకుండా ఒకరికొకరు స్నేహంగా ఉండొచ్చన్న తన అభిప్రాయాన్ని చెపుతుంది. కానీ పెద్దలు దానికి ఒప్పుకోక ఆమెకు పెళ్ళిచేయటంతో స్నేహితురాలు ఆమె ఫోటోక్రింద 'అపజయం' అనే అక్షరాలు వ్రాయటం జరిగిందని తెలియజేసింది.

*చదువుకున్నస్త్రీలు పురుషుల భావాలను మార్చగల సమర్థురాలవ్వాలిగాని, పురుషద్వేషి కాకూడదనే భావనతోపాటు, స్త్రీపురుష సంబధాలు వివాహసంస్కృతిలో యిమిడి పోవాలని రచయిత్రి భావించినట్లు అర్థం అవుతుంది.*

అడపా సుగుణమణి వ్రాసిన 'పశ్చాత్తాపము' (అక్టోబరు 1936 గృహలక్ష్మి) అనే కథలో తండ్రియొక్క మరణానంతరం కూతురు ఉన్నతవిద్యను అభ్యసించి విశ్వవిద్యాలయమునందు తనప్రతిభతో అందరి గుర్తింపును పొందుతుంది. సహాధ్యాయుడు ఆమెను యిష్టపడి పెళ్ళిచేసు కున్నాడు కాని గర్భవతి ఐన ఆమె బలహీనురాలైనందుకు సేవచేయ్యాల్సిందిపోయి విసుగుతో ఉండటమేగాక ప్రసవంలో శిశుమరణానికి కారణం ఆమె యొక్క రోగిష్ఠిమారితనమని భావించి, ఆమెను వదిలిపెట్టి మరొక వివాహం చేసుకుంటాడు. కాని అతని ద్వితీయ భార్య కూడా ప్రసవమరణం చెంది శిశువును మిగల్చగా ఆ పిల్లను సాకలేకపోయినప్పుడు అతడు ఉద్యోగం చేసుకుంటున్న మొదటిభార్యయే దిక్కయి పశ్చాత్తాపంతో శిశువును పెంచమని అతడు ఆమెను అడగగా ఆమె అతడ్ని మన్నించిందని తెలియజేసింది.

*రోగిష్ఠి భార్యకు విడాకులివ్వవచ్చనే బిల్లును పెట్టాలనుకున్న సమయంలో దాని పరిణామాలను తెలియజేసిన కథ.*

ఓలేటి నిత్యకల్యాణమ్మ వ్రాసిన 'మహాలక్ష్మమ్మ' (ఆంధ్రభూమి డిసెంబరు 1936) అనే కథలో ఒక ఆంధ్రబ్రాహ్మణ స్త్రీ చరిత్రను గురించి వ్రాస్తూ మంత్రి భార్యగా ఆమెకున్న రాజభక్తికి నిదర్శనంగా శత్రువైన రుస్తుంఖాన్ వల్ల ఏర్పడిన ప్రమాదంలో ఉన్న రాణి తన కొడుకునిచ్చి కాపాడమంటే తాను రుస్తుంఖాన్ పెట్టిన బాధలను భరిస్తూకూడా తన భర్త, పిల్లలకు దూరమై కారాగారాలలో ఉంటుంది. తనతో ఉన్న ఆ పిల్లవాడు రాజుపుత్రుడు కాదని తెలియజేయటానికి ఆతడి ఎంగిలిని కూడా తాను సహించిందనీ, అలా ఆమె యుక్తితో రాజుపుత్రుడితో సహా చెరసాల నుండి బయటపడి రాజకుమారుడికి రాజ్యాన్ని అప్పగించి తన రాజ భక్తిని నిరూపించు కుంటుంది. ఆ యువతి చరిత్రలో నిలిచిందని తెలియజేసింది.

*స్త్రీలకు తెలివి, ధైర్యం ఉంటే ఎటువంటి రాచకార్యాలనైనా సమర్థవంతంగా నిర్వహించగల శక్తియుక్తులు వారికుంటాయని తెలియజేసి ఆనాటి స్త్రీలలో స్ఫూర్తిని నింపిన కథయిది.*

యెల్లాప్రగడ సీతాకుమారి వ్రాసిన 'పునిస్త్రీ పునర్వివాహం' (1937 ఆంధ్రపత్రిక వార్షిక ఏప్రిల్ సంచిక) అనే కథలో పెళ్ళిచేసుకున్న యువకునికి తెలియకుండానే ఆతని తండ్రి వియ్యంకునితో కట్నం పూర్తిగా యిచ్చినప్పుడే పిల్లను కాపురానికి తీసుకువెడతానని చెప్తాడు. ఇటు కొడుకుతో అమ్మాయిని వారు కాపురానికి పంపడం లేదని అబద్ధమాడి అతడికి మళ్ళీ పెళ్ళి చేయాలనుకొంటాడు. అదే సమయంలో, ఆ పెళ్ళికూతురు తన స్నేహితురాలియొక్క భర్తయే తనను పెళ్ళి చేసుకుంటున్నాడని తెలుసుకొని, ఆమె తనకు కాబోయే వాడితో అతని మొదటి భార్యకు విడాకులిప్పిస్తుంది. ఆ స్నేహితురాలు కూడా విడాకులపత్రం తీసుకొని, తనని ఇష్టపడిన వ్యక్తిని రెండవ పెళ్ళిచేసుకొంటుంది.

*విడాకులచట్టం అప్పటికి రాలేదు కాబట్టి పురుషులకు రెండవ పెళ్ళి చేసుకోగల స్వతంత్రం రాండటంతో దానికి ప్రతిగా స్త్రీ చేసిన ప్రయత్నం అర్థమవుతుంది. పురుషుడు రెండవ పెళ్ళి చేసుకునే అవకాశం ఉన్న రోజుల్లో, విడాకుల చట్టానికి అంకురార్పణగా, పరస్పరం విడాకులు తీసుకుంటే స్త్రీ కూడా పునర్వివాహం చేసుకునే స్వతంత్రం కలిగియుండటమే స్త్రీపురుషుల సమాన హక్కుకు నిదర్శనమని భావించటం అర్థంఅవుతుంది. ఇది స్త్రీలు వైవాహిక స్వాతంత్ర్యాన్ని పొందటానికి చేరుకొన్న మరోమెట్టు. మునుపు వితంతువుల పునర్వివాహచట్టం ఉన్నదికాని విడాకులచట్టం లేనందువల్ల భర్తపరిత్యక్తయైన స్త్రీనిపెళ్ళిచేసుకోవటమే పునిస్త్రీ పునర్వివాహం చేసుకోవటం అనే ఒక నవీన సాంస్కృతిక ఆలోచనను ముందుకు తీసుకురావటం జరిగింది.*

బులుసు ప్రకాశమ్మ వ్రాసిన 'కట్నాలకాంక్ష' (జూన్ 1937 ఆంధ్రభూమి) అనే కథలో వరకట్నాల విషయంలో పిల్లవాడియొక్క తండ్రికే ఎక్కువ ఆశ ఉంటుందనీ, భార్య వద్దన్నా అతడే కట్నం ఎక్కువ కోరుకుని పెళ్ళిపీటల మీద నుండి కొడుకుని తీసుకొని వెళ్ళాడనీ, చివరికి డబ్బున్న వాళ్ళమ్మాయిని చేసుకోవాలనుకుంటే వారిచేత వెళ్ళగొట్టించుకున్నాడనీ తెలియజేసింది.

*కట్నంకోసం మగవాళ్ళే ఎక్కువ పేచీపెడతారనీ, పైకి అత్తలు అలా చేస్తారనే వదంతులను నమ్మి అపోహపడవద్దనే విధంగా తెలియజేసిన కథయిది.*

పాకల రాజమణమ్మ తనకు తెలిసిన ఒక కుటుంబం బెజవాడ నుండి ఊరికి దూరంగా ఉంటూ జీవనాన్ని సాగిస్తున్న వాస్తవిక విషయాన్ని 'ఆదర్శగృహిణి' (ఆగష్టు 1937 గృహలక్ష్మి) అనే కథలో తెలియజేస్తూ సహాయనిరాకరణలో భాగంగా ఉద్యోగాన్ని వదిలిన ఒక వకీలు కుటుంబం జీవనానికై ఊరిచివర స్థలం కొని చిన్నయిల్లు కట్టి, పత్తి చెట్లు, టెంకాయి చెట్లను నాటించి కూరగాయలు పండిస్తున్నారని తెలిపింది. గేదెలను పాడికై కొనుక్కొని పాలు, పెరుగు, వెన్నను తీసి కొంత ఖరీదుకు ఇచ్చేవారనీ, తండ్రి సహాయంతో పిల్లలు బావిలో నీరు తోడి చెట్లకు పోసే వారనీ, పిల్లలు పాఠశాలకువెళ్ళి చదువుకుంటున్నారని చెప్పింది. స్వయంగా రాట్నంవడికి నూలువస్త్రాలు నేసి వేసుకుంటున్నారనీ, వకీలు వృత్తి లేకపోయినా సుఖజీవం సాగిస్తున్నారనీ, తమ కుటుంబం గురించి ఆ ఆదర్శగృహిణి చెప్పినట్లుగా రచయిత వివరించింది.

*సహాయనిరాకరణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలకు, లాయర్లు కోర్టులకు వెళ్ళరాదనే నిర్ణయం తీసుకోవటంతో, బ్రతుకుతెరువుకై స్వశక్తిమీద ఇంటి ఆవరణలోనే కూడూ, గుడ్డను సమకూర్చుకోవచ్చునీ, పరాయిపాలనలో బానిసబ్రతుకుకంటే స్వయంఉపాధిని కల్పించుకొని స్వేచ్ఛగా బ్రతకవచ్చుని తెలియజేసినకథ.*

*ఇదే స్త్రీపురుషులు కలిసి దేశస్వాతంత్ర్యసాధనకు వాస్తవంగా కృషిచేయటంగా భావించాలి.*

ఈమె వ్రాసిన 'నా స్వప్నము' (జులై 1938 గృహలక్ష్మి) అనే మరో కథలో భార్య ఇంటికి వచ్చిన తర్వాత తాను చూసిన సినిమాలో చూపించిన విషయాన్ని తలచుకుంటూ స్త్రీలపై భర్తలు పెట్టుకష్టాలకు న్యాయచట్టాలతో ఉపశాంతి లేదనీ భావిస్తూ నిద్రపోతుంది. కలలో ఆమెకు న్యాయ

వ్యవస్థలోని లింగవివక్షను ప్రశ్నిస్తున్న స్త్రీలు కన్పడ్డారనీ, కలలో భాగంగా కాషాయాంబర ధారిణులైన స్త్రీలు ఊరేగింపు చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారనీ, వారు శాసనసభాధ్యక్షుల వారితో న్యాయచట్టాలను ప్రశ్నించాలనుకుంటున్నామని చెప్పగా అడ్డుతగిలి వారిని జైలుకెడతారని పోలీసు బెదిరించాడని అనిపించింది. అయినా వారు లోపలికివెళ్ళి అక్కడున్న అధ్యక్షుల వారిని కలిసినట్లుగా కలలో భావించింది. అక్కడకు వెళ్ళినవారిలో ఒక ఆమె తనభర్త మరొక స్త్రీని యింటికితెచ్చి వ్యభిచరిస్తూ తనను నిర్లక్ష్యం చేస్తూ ఇంటి నుండి పొమ్మంటున్నాడు కాబట్టి పోషణకు డబ్బు యిప్పించమని అడిగిందనీ, దానికి న్యాయాధిపులు అలా అడగటానికి తగినవిధమైన చట్టంలేదని చెప్తాడు. మరొక స్త్రీ తన భర్త ఎలాంటివాడైనా బానిసగాపడి ఉంటానన్నా, ఒప్పుకోకుండా ఇంటినుండి పొమ్మంటున్నాడనీ, అత్తగారువాళ్ళు తన కన్నబిడ్డలను కూడా చూడనీయకుండా కష్టాలు పెడుతుంటే వారిని శిక్షంచే చట్టాలు లేవా అని న్యాయాధిపతిని అడుగుతుంటుంది. స్త్రీగా పుట్టటంచేత తండ్రియాస్తిలోనూ వాటా లేకపోయేసరికి ఆస్తిలో వాటాఇచ్చే విధంగా చూడమని ఇంకొక స్త్రీ న్యాయాన్ని అడుగగా, అటువంటి చట్టాలూ లేవని చెప్పాడు. మరి ఆ స్త్రీలు తమను ఉద్ధరించే చట్టాలు నిర్మించమని ఆ శాసనసభాపతిని అడుగుతారు. ఆ సభాధ్యక్షుడు ఆ స్త్రీలను సంఘాలుగా ఏర్పడి తమ కష్టాలను, వాటిపరిష్కారానికి తగిన ప్రణాళికను తయారుచేసుకొనివస్తే శాసనసభలో ఆ నివేదికను తాను పెట్టగలనని చెప్పాడనీ, దానికే సంతోషపడిన స్త్రీలు ఆ క్రమంలోనే జయజయ ధ్వనాలతో ఊరేగింపు చేస్తూంటే తనకు ఆ కల నుండి మెలకువవచ్చినట్టు రచయిత్రి పాకల రాజామణి తెలియజేసింది.

*కలలు స్వేచ్ఛకు నిదర్శనం. అందుకే కలలో కలిగిన చైతన్యం జీవితాన్ని సామాజికకోణం నుండి చూసేటట్లు చేసింది. న్యాయచట్టాలయొక్క లింగవివక్షాస్వభావం స్త్రీల బాధల పరిష్కారాలకు, సమానహక్కులకు వీలుగాలేదనీ, న్యాయ చట్టాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని భావించింది. చట్టాలపై స్త్రీలు అవగాహన పెంచుకోవటమే స్త్రీలు తమ స్వతంత్ర సాధనకై తొలి, మలి, తుది అడుగులు వేయటంగా భావించాలి. స్త్రీలు లింగవివక్ష కల్గిన న్యాయశాస్త్రాలపట్ల అవగాహన పెంచుకొని దాన్ని ఎదుర్కొనే కలలు కని కర్తవ్యోన్ముఖులుగా సాకారం చేసుకోవా లనుకొనే మార్గమే స్త్రీలన్యాయానికి దారులు వేయటంగా అర్థం అవుతుంది. సమాజంలో కుటుంబసంస్కృతిలో భాగంగా ఉన్న అధికారవ్యవస్థను, ఆర్థిక వ్యవస్థను ప్రశ్నకు పెట్టటం అర్థం అవుతుంది. స్త్రీల యొక్క న్యాయం స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్య సాధనకు నిదర్శనం. ఇది ఒక చైతన్యస్రవంతికి అద్దంపట్టే కథ.*

పాకల చంద్రకాంతమణి వ్రాసిన 'తండ్రియా? తనయుడా?' (సెప్టెంబరు 1937 గృహలక్ష్మి) అనే కథలో ఒక మాలపిల్ల క్రిందపడితే ఆమెను లేవదీసినందుకు మరియు చెరువులో మునిగిపోతున్న మాలపిల్లవాడ్ని రక్షించినందుకును ఆ మనవడిని ఒక అగ్రహారిక బ్రాహ్మణుడు ఇంట్లోనుండి వెడలగొడ్తాడు. కొడుకు కావాలనుకుంటే తన కూతుర్ని కూడా బయటకు పొమ్మని చెప్పేసరికి ఆమె వెళ్ళకుండా తండ్రి ఇంట్లోనే ఉండిపోతుంది. బయటకు వెళ్ళిపోయిన ఆ మనవడు

మాలపాకలో కలరావస్తే హరిజన సేవా సంఘం తరపున మాలవారికి సహాయంచేస్తూ కలరా వచ్చి చనిపోతాడు. బ్రాహ్మణ నిర్బంధాలవల్ల చివరి క్షణాలలో ఉన్న తండ్రిని ఆ కూతురు వదలలేక అటు కొడుకు శవం దగ్గరకు వెళ్ళలేక ఆ తల్లి ఘర్షణపడింది.

*ఈ కథ అస్పృశ్యత సమాజంలో ఎంత బలంగా ఉందో తెలియచేస్తూ, నవనాగరిక యువకులు ముందుకొచ్చి అశ్పృశ్యతా నివారణకై పాటుపడితే సంఘం వారినెంత బహిష్కరిస్తుందో కూడా స్పష్టం చేయటం జరిగింది. కులవివక్షవల్ల సహజ మానవసంబంధాలు, సమాజ సంబంధాలు విచ్ఛిన్నం అవుతున్నాయనే ఒక సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించిన సాహిత్యం యిది.*

పులిపాక బాలాత్రిపురసుందరమ్మ వ్రాసిన 'వరకట్న పరిణామం (డిసెంబరు 1937 గృహలక్ష్మి) అనే కథలో మగపిల్లవాడి తండ్రియొక్క వరకట్నపు అత్యాశతో ఆడపిల్ల నిచ్చిన వారు ఆర్థికనీతికి పోగా ఉద్యోగం లేని కొడుకు తనను వరక్రయం చేయటంతో తనకొక స్వతంత్ర జీవనంలేదనీ భావిస్తాడు. కడసారి భార్యను కూతుర్ని చూడటానికి ఆమె పుట్టింటికి వెళ్ళి తాను చనిపోదలచుకున్నానని భార్యతో చెప్పగా, భార్య కూడా అతనిని అనుసరించాలనుకున్నట్లుగా చెప్పింది.

*కథలో వారిద్దరూ అత్తవారింట్లో విషాన్ని సేవించటంతో వరకట్న పరిణామం భార్యాభర్తల బలిదానంగా ముగిసిందనే విషయాన్ని తెలియజేసింది. వరకట్నం తీసుకోవటం పురుషుడి యొక్క వ్యక్తిస్వాతంత్ర్యానికి భంగకరమైన విషయమనీ, స్వాతంత్ర్యపు విలువలు తెలియనివాళ్ళు దేశస్వాతంత్ర్యాన్ని, ఎలా సాధిస్తారనే నూతన ఆలోచనను రేకెత్తించగలిగింది.*

ఈమె వ్రాసిన 'పిల్లికి చరలాటము-ఎలుకకు ప్రాణసంకటం' (మార్చి 1938 గృహలక్ష్మి) అనే మరో కథలో ఒక రచయిత భార్య పత్రికలో స్త్రీలను అసభ్య చిత్రీకరణ చేసినందుకు చింతించి, స్త్రీలను గౌరవంగా చూడాలంటే పత్రికలో స్త్రీల నగ్నచిత్రాలను ప్రచురించకూడదనీ, స్త్రీనవీనఅయిన, పూర్వాచార పరాయణయైన ఆమెకు గౌరవనష్టం కలిగితే భరించలేదని తెలిపింది. అంతేకాదు, రాజ్యాంగవిషయంలో, ఉద్యోగవిషయంలో, రణరంగాలలో స్త్రీలు తీసిపోరనీ, స్త్రీలకు వ్యక్తిత్వం ఉందనీ, స్త్రీలు అబలలు కారనీ, స్త్రీ సమాజంలో స్త్రీల నగ్న చిత్తరువులను, అసభ్య వ్రాతలను గురించి పత్రికలలో ప్రచురించరాదని తీర్మానం చేసుకోవాలని భావించింది. కళాకారులు తమ చాతుర్యాన్ని వృథాపరచవద్దనీ, అటువంటి రాతలు మగవాళ్ళకిష్టమైతే "పిల్లికి చర్లాటం - ఎలుకకు ప్రాణసంకటం" లా ఉంటుందనీ తెలిపి పత్రికల బాధ్యతను తెలియజేసింది.

*స్త్రీలభౌతికరూపానికికాక స్త్రీలమనస్సుకు, శక్తికి విలువలుంటాయనీ, స్త్రీలను అసభ్యకరంగా చిత్రిస్తే వారివారి కుసంస్కారమే బయటపడుతుందనీ, దాన్ని సభ్యసమాజం ఆమోదించదని పులిపాక బాలాత్రిపుర సుందరమ్మ స్పష్టం చేసింది. ఇది నేటి సోషల్ మీడియాకు చెంపపెట్టువంటి విషయం.*

చుండూరి రమాదేవి వ్రాసిన "ధర్మతల్లి" (మార్చి 1938 గృహలక్ష్మి) అనే కథలో దారిలో మాలపిల్ల అడ్డుగా వచ్చిందనీ ఆమెను అంటరాని పిల్లగా చూస్తూ మాయదారి స్వరాజ్యం (రాష్ట్రీయ స్వాతంత్ర్యం) రావటంతో మాలపిల్ల అలా నిర్భయింగా అగ్రవర్ణాలప్రక్కన దారిలో నడిచిందని తిట్టిపోస్తుంది. ఆమె మరో సంఘటనను కూడా చెప్తూ తన సోదరిడికి జ్వరం వచ్చి ఉపాధిలేక, అన్నంలేక ఆకలితో అలమటించి ఒకబ్రాహ్మణ కుటుంబపు అరుగుమీద స్పృహతప్పి పడిపోతే ఆమెకు తాను మాలపిల్లనని తెలిసినా తనకు నోట్లో అన్నరసంపోసి బ్రతికించిందనీ, తన సోదరునికి కూడా అన్నాన్ని తీసుకెళ్ళమని ఇచ్చిందనీ, ఆమెయే దళితులపట్ల ధర్మదేవత అని భావించింది.

*ఇద్దరు అగ్రకుల స్త్రీల మనస్తత్వాలలోని తారతమ్యమే అస్పృశ్యతకు కారణమని గ్రహించాలనీ, కులము కారణం కాదని తెలియజేసింది. పూనా ఒడంబడిక ప్రకారం, 1935 చట్టం వల్ల అస్ప్రుశ్యులకు అధికసంఖ్యలో, ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించటంవల్ల వారికి అధికారం వచ్చిందనే భావనతో ఆమె అలా మాట్లాడినట్లు అర్థమవుతుంది.*

సి.వి.కృష్ణమ్మ వ్రాసిన 'అనాథ వనిత'(మే 1938 గృహలక్ష్మి) అనే కథనంలో మహాలయ అమావాస్య రోజున ఒక హరిజనస్త్రీ త్రాగుబోతైన తన భర్త బియ్యానికి డబ్బుతెచ్చి యివ్వక పోవటంతో ఆకలితో అలమటిస్తున్న తనకూతుళ్ళతో వచ్చి ఆమె వీధులలో బిచ్చం అడుగుకుంటూ తిరుగుతుంది. ఒకయింటి వనిత వారికి పెట్టటానికై అన్నం తీసుకొని వస్తుంటే అత్తగారు వచ్చి తిథిరోజున పెట్టకూడదని వారించిందనీ, తర్వాత ఆ హరిజనస్త్రీ సమీపంలోని చెరువులో పడి చనిపోయిన వార్త తెలిసిందనీ, ఇటువంటి ఘోరాలు జరుగకుండా శాసనసభ్యురాండ్రు బాధ్యత వహించాలని తెలియజేసింది.

*హరిజనులయొక్క బీదరికపు నిర్మూలనతోపాటు అస్పృశ్యతా నివారణకై శాసనసభ్యులు చట్టం తేవాల్సిన అవసరాన్ని సూచించింది. అప్పటికే బ్రిటిష్ ప్రభుత్వం అస్పృశ్యకులాల వారికి శాసన సభ్యత్వం ఉండటానికి ప్రత్యేక స్థానాలను కేటాయించింది. శాసనసభలలో హరిజనులకు ప్రత్యేకంగా అధికస్థానాలను యిచ్చి గుర్తించటంతోపాటు వారికి సామాజిక అస్తిత్వన్యాయం అవసరమని ఆనాడే స్త్రీలు గుర్తించారు.*

ఆర్.అలివేలుమంగాదేవి వ్రాసిన 'లక్ష్మి' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే కథలో, మురికివాడలో నివసిస్తూ భార్యాభర్తలిద్దరూ కార్మికులుగా పనిచేస్తుంటారు. పగలు తమపిల్లలు తల్లుల కోసం రోదిస్తూ ఉంటారని తలచుకుంటూనే, ఆనాటి పనిని పూర్తిచేసి కార్మికమాతలు ఇల్లుచేరుతుంటారు. ఫ్యాక్టరీలో కూలీగా చేస్తున్నా భర్త మద్యపాన వ్యసనానికి బానిస అవుతాడు. తల్లిపాలు సరిలేక పిల్ల ఏడుస్తుంటే, నీరసించిన ఆమె ఫ్యాక్టరీ పనికి వెళ్ళటంలేదు. అలానీరసంగా ఉండికూడా కూలికి వెళ్ళినప్పుడు, ఆమెను, ఆమె తోటి కార్మికులను మనుషులుగా గాక యంత్రాలుగా చూసే మిల్లు యజమానియొక్క సౌభాగ్యానికి తనకూఉన్న తేడా ఆమెకు గ్రహింపుకు వచ్చింది. యజమానికి, కార్మికులకు ఉన్న అంతరం ఆమెకు అర్థం అయింది. పోయిన నెలలో కొన్నాళ్ళు పనిచేసిన కాలానికి కూలిని అడగటానికి యజమాని దగ్గరకు వెళ్ళింది. పిల్లల

ఆకలిబాధను గురించి చెప్పినా, అతడు కూలీని ఇవ్వకపోగా తన కోర్కెను తీరిస్తే ఇస్తానని చేయిపట్టుకుంటుంటే ఆమె విదిలించేసరికి కూలిదానికింత పొగరా అని బలాత్కరించబోతాడు. అదే సమయంలో ఆ యజమాని బాకీ తీర్చటానికి వచ్చిన ఋణగ్రస్తుడొకడు గమనించి ఆమెను కాపాడుతాడు. ఆ కూలిదాని జీవిత చరిత్రను విన్న తరువాత కార్మికసంఘం ఏర్పరచాల్సిన అవసరం ఉందని ఆ కార్మిక శ్రేయోభిలాషి భావించి, ఆమెకు తిండికి డబ్బులివ్వగా, ఆమె ఇంటికి వెళ్ళింది. ఆమె భర్త ఆ డబ్బులు తీసుకోవాలని భావించి ఆ డబ్బును అడుగుతాడు. ఆమె ఇవ్వనందుకు ఆమెను కొట్టాడు. కాని ఆ తరువాత ఆమె భర్త శ్రేయోభిలాషుల యొక్క హితబోధతో త్రాగుడు మానేసాడు. 5 సంవత్సరాల తర్వాత ఆ శ్రేయోభిలాషి తన ఆస్తితో ఆ కార్మికవాడ రూపురేఖలు మార్చాడనీ, బడులు కట్టించాడనీ, అందుకే నాడు కార్మిక సమితి వార్షికోత్సవంగా ఊరేగింపుచేస్తూ జాతీయగీతాలు పాడుకుంటున్నారని కథలో తెలియజేయటం జరిగింది.

*ఇంటా, బయటా కార్మికస్త్రీలు కష్టాలలో నలిగినట్లు అర్థమవుతుంది.కార్మికుల కష్టాలు తీరాలంటే కార్మిక సంఘాలు ఏర్పడాల్సిన అవసరాన్ని సూచించిన కథ ఇది. ముఖ్యంగా మహిళా కార్మికులు బిడ్డ ఏడుస్తున్నా పాలివ్వలేని స్థితి, వారు చేసిన పనికి కూలీఇవ్వకపోవటం, భర్త వ్యసనంవల్ల ఇంట్లోని ఆర్థిక దుస్థితి, చేసినపనికి కూలి అడిగినందుకు ఇవ్వకపోగా యజమాని-కార్మిక సంబంధాలలో భాగంగా మహిళా కార్మికురాలుకి అదనంగా లైంగిక వేధింపులుంటాయని తెలియజేసిన చేసిన కథ. 1926 లో కార్మిక సంఘాల చట్టం ఏర్పడినా, అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు రక్షణ లేదని గుర్తించాలి. అంతేకాక పని ప్రదేశంలో యజమానినుండి స్త్రీకార్మికులకు లైంగిక వేధింపులు అదనంగా ఉంటాయని అర్థంఅవుతుంది. అసంఘటిత రంగాలలోని కార్మికుల హక్కుల రక్షణకు స్వతంత్ర భారతదేశం చట్టాల్ని తీసుకువచ్చింది.*

*భారతదేశంలో కమ్యూనిష్టుల అభ్యుదయ దృక్పథానికి ప్రచారం జరుగుతున్న రోజులలో దాని ప్రభావంతో స్త్రీకార్మిక అభ్యుదయం కోరుతూ కార్మిక సంఘాల ప్రాధాన్యతను తెలుపుతూ వచ్చిన కథ ఇది. వ్యవస్థీకృత రంగంలో యూనియన్ చట్టాలు 1926 లో వచ్చాయి గాని అవ్యవస్థీకృత/అసంఘటిత రంగాలలో పనిచేసే ఒప్పంద కార్మికుల రక్షణకై కార్మిక సంఘాలు ఏర్పడాల్సిన అవసరాన్ని సూచించింది.*

గాదంశెట్టి అహల్యాదేవి వ్రాసిన 'సుశీల' (జులై 1939 గృహలక్ష్మి) అనే కథలో బాలికను ఖర్చులేదని వృద్ధుడికిచ్చి పెళ్ళిచేస్తే, పెళ్ళయిన వెంటనే అతడు మరణించాడు. తర్వాత ఆ తండ్రి చింతించి, తాను వితంతూద్వాహ సంఘంలో సభ్యుడిగా చేరి కూతురునొక విద్యావంతుడికిచ్చి గాంధిబొమ్మ సమక్షంలో పెళ్ళిచేసినందుకు పత్రికలు ప్రశంసించినట్లుగా తెలియజేసింది.

*వితంతుస్త్రీ పునర్వివాహాన్ని అందరూ ఆమోదిస్తారని సమాజానికి ఈ కథ ద్వారా తెలియజేసింది. దీనిని ఒక వాస్తవ సంఘటనగా భావించేటట్లు రచనచేసింది. సంఘసంస్కర్తలేకాక, తల్లిదండ్రులు కూడా స్త్రీపునర్వివాహాన్ని అంగీకరిస్తున్నట్లును, సామాజిక సాంస్కృతిక పరిణామంతో స్త్రీల అభివృద్ధిని కోరుకొంటున్నట్లును అర్థమవుతుంది.*

1934 నుండి 1939 వరకు వచ్చిన కథలలో చదువుకొన్న స్త్రీ భర్తనుకూడా చదివించే స్థితికి చేరుకోవటం, స్త్రీల వైవాహిక స్వతంత్ర నిర్ణయాధికారం, భర్త పరిత్యక్తలైన భార్యలు విడాకులు తీసుకొని పునర్వివాహం చేసుకోవటం, వివాహనిరసన, వితంతుస్త్రీ సంస్కృతిలో విప్లవాత్మక మార్పులు అర్థమవుతాయి. చట్టాల యొక్క లింగవివక్షాస్వభావాలు గుర్తించి కుటుంబ స్త్రీలు ఎదుర్కొంటున్న న్యాయవివక్షను ప్రశ్నించటం, స్త్రీలను అగౌరవపరిచే పత్రికలను నిషేధించాలను కోవటం, పిల్లల పెంపకంలోని వివక్షతను గ్రహించటం, వరకట్న దురాచారాన్ని నిరసించటం, గృహపరిశ్రమలద్వారా స్త్రీలు ఆర్థికస్వావలంబనను పొందాలను కోవటం కనపడుతుంది. వర్గస్వభావపు పోకడలు, అస్పృశ్యతలోని అమానవీయత, ఆదివాసీ గిరిజనులలోని నిరక్షరాస్యత, ఇంటాబయటా మహిళాకార్మికులు ఎదుర్కొనే వేధింపులు, కార్మికసంక్షేమ కార్యక్రమాలలో యువత బాధ్యత,స్త్రీలకు లోకల్ బోర్డులలోను, చట్టసభలలోను ప్రాతినిధ్యం ఉంటేనే స్త్రీలసమస్యలు తీరుతాయనేటటువంటి సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయాల విషయాలలో విప్లవాత్మక చైతన్యాన్ని కలిగించే కథలు వచ్చాయి.

**నాటకం**

సి.వి.రమణమ్మ వ్రాసిన 'మానవ ప్రకృతి' (డిసెంబరు 1937 గృహలక్ష్మి) అనే ఏకాంక నాటకంలో చదువుకున్న మణి బ్రహ్మమతావలంబిగా స్త్రీ స్వాతంత్ర్యానికి ప్రాధాన్యాన్ని ఇస్తూ ఉంటుంది. స్త్రీ స్వాతంత్ర్యాన్ని సరిగా అర్థం చేసుకోని నిరీశ్వరవాదిగా, స్త్రీలు చదువుకొని రోడ్ల మీద తిరుగుతున్నారంటూ స్త్రీస్వాతంత్ర్యం గురించి గౌరవం లేని వ్యక్తితో వాదిస్తుంది. తరువాత స్త్రీస్వాతంత్ర్యం గురించిన విచక్షణాజ్ఞానం లేని మానవ ప్రకృతిని సంస్కరించకపోతే దేశానికి స్వాతంత్ర్యం రావటం కష్టం అవుతుందన్న విషయాన్ని గ్రహిస్తుంది.

*పురుషులయొక్క స్వభావంలో స్త్రీలకు స్వాతంత్ర్యం ఉంటుందనే భావన కలిగేటట్లు చేయలేకపోతే దేశానికి స్వాతంత్ర్యం రావటం కష్టమని చెప్పటంలోనే పురుషస్వభావానికి, స్త్రీ స్వాతంత్ర్యానికి, దేశ స్వాతంత్ర్యానికి ఉన్న లింకు స్పష్టమైంది. సమాజంలో వ్యక్తులకు మానసిక చికిత్స చేస్తేనే స్త్రీకి వ్యక్తిస్వాతంత్ర్యం నిలబడుతుందనీ, అప్పుడే సమైక్యపోరాటంతో దేశస్వాతంత్ర్య సాధన వీలవుతుందని చైతన్యపరచిన నాటకమిది.*

**నవల**

1935లో చిల్కపాటి సీతాంబ వ్రాసిన 'అరవింద' అనే నవలలో పరాక్రమవంతులైన అరవింద, వాసంతిక అనే యిద్దరు స్త్రీలు ధైర్యసాహసాలను చూపిస్తూ, రాజకీయాలలో భాగంగా రాజ్యంలోని చెడును యుక్తితో నిర్మూలించి, మంచిని నిలబెట్టటానికై తమ శక్తియుక్తులను, చాతుర్యాన్ని ప్రదర్శించి విజయాన్ని సాధించటాన్ని తెలియజేసిన నవల యిది.

*స్త్రీలలో ధైర్యసాహసాలను అభివృద్ధి పరుచుకోవాలన్న చైతన్యాన్ని కలిగించే తెలుగు నవల ఇది.*

**కవితలు**

1935నుండి 1939 వరకువచ్చిన కవిత్వంలో మొత్తం 17 కవితలు వచ్చాయి. స్త్రీవిద్యాభివృద్ధి, కుటుంబస్త్రీలకష్టాలు, ఉద్యమ స్త్రీల వీరత్వం, స్త్రీలస్వాతంత్ర్యోద్యమ భాగస్వామ్యం వంటి కవితలు వచ్చాయి.

చీమకుర్తి సత్యవతి దేవి వ్రాసిన 'సతుల వెతలు' అనే కవితలో (వాసవి జనవరి 1935)

*"సారాయియంగళ్లు సర్దువేళాయెగా*
*సరగుననేనందు జనగవలయు*
*వేశ్య యింటికిబోవ వేళాయె నాకిందు*
*సంధ్యనైననువార్పజాలకుంటి*
*సతులెట్టులానంద సామ్రాజ్యమొందంగ*
*గలరొకో? సుంతైన గాంచనైతి"... అని భార్య బాధపడుతూ*

*"పతిసేవయే స్త్రీలగతి యంటిరేగాని*
*పతియుండదగు రీతి బలుకరేరి*
*అతనిపాదములకే నర్చింత మనుకొన్న*
*వేశ్యాంగకడకు వేగజనియె*
*పతివాక్కులే మోక్ష పథములంచు దలంచ*
*సతతమాటవెలంది స్మరణజేయు*
*సేవజేయుటకునై చేరబోయిన నన్ను*
*భావంబుగని దయ బ్రోవదయ్యె*

*అతనిసేవింపకున్ననా గతులికెట్లు?*
*చేడెపొడగిట్టకను పతి సేవ లెట్లు?*
*దైవమనుమాట తలుపని ధవుడికెట్లు*
*దైవసముడౌచు నెగడెడి ధర్మమెట్లు?"* అంటూ

*దుర్గుణుడైన భర్తను దేవుడనుట ధర్మమా? అని ధర్మాన్ని ప్రశ్నకు పెట్టింది. కుటుంబంలో 'భర్త' కు దేవుడనే పదాన్ని వాడటాన్ని, అతడు కూడా తనని తాను అలాగే భావించుకోవటాన్ని, భార్య అనే జీవిపై పెత్తనం వహించాలనే భర్తకున్న ఆధ్యాత్మికాధికారాన్ని ప్రశ్నకు పెట్టటం జరిగింది. అంతేకాదు కుటుంబంలో భర్తలు ఎలా ఉండాలో చెప్పటంలేదెందుకని కూడా సమాజాన్ని ప్రశ్నించింది.*

భువనగిరి లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'స్త్రీవిద్యావిధానం' (ఫిబ్రవరి 1935 గృహలక్ష్మి) అనే కవితలో స్త్రీలకు విద్య అవసరమనీ, అప్పుడే ధైర్యముతో సంసార నిర్వహణము తెలుస్తుందని

చెప్పింది. స్త్రీలు దేశీయవిద్యలు నేర్చుకోవాలనీ, దేశాభివృద్ధికి భాషాభివృద్ధికి విద్య ఉండాలనీ, "స్త్రీలకు ప్రథమ చికిత్సయు, బాలెంతల వైద్యమందు ప్రావీణ్యంబున్ వీలుగా శిశుపోషణమును వాలాయముగా నేర్పవలయును చెల్మిన్" – అనీ, కుట్టుపనులు నేర్చుకొని ధనలాభాన్ని పొందాలని తెలిపింది. ఆంగ్లభాషను నేర్చుకోవచ్చుగానీ, ఆ దేశవేషాలు అనవసరమనీ, చదివినందుకు ఫలితం జ్ఞానం పొందాలనీ, స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నా కుటుంబాన్ని విస్మరించకూడదనీ, గురుకులాల్లో బాలికలకు విద్య వస్తోందిగానీ, "స్త్రీల విద్యావిధానంబు చెప్పుకొనుటే కాని దారిద్ర్యభూతంబు కౌగలించియున్న భారతదేశాననున్న విద్య మార్పుచెందిన గతిలేదు మానినులకు" అని స్త్రీలవిద్యలో ఆర్థికపుష్టిని కల్గించే నూతన విద్యావిధానం కావాలని తెలియజేసింది.

*'నీతిన్ వీడక శీలరక్షణకునై నిర్భీతితో ప్రాణముల్*
*ప్రీతిన్ వీడిన భారతాబ్జముఖులన్ బేర్కొన్న చారిత్రముల్*
*చేతో మోదముగాగ బాల్యమునన్ చెప్పిందగున్ స్త్రీలకున్ .....'*

*'కాలనువ్రేల దున్నుకొనుగాక, ధనంబు, నగల్ సమృద్ధిగా*
*దాలిచి యుండుగాక, వివిధంబగు విద్యలు నేర్చుగాక, దు*
*శ్శీలపథంబు పట్టుబడు స్త్రీలకు గౌరవ మబ్బకుండ స*
*చ్ఛీలము ముఖ్యమైనదని చెప్పుట ధర్మము విద్య నేర్పుచోన్' అని*

*'శీలేన శోభతే విద్యా' అనేదానిని నిర్వచించింది. చిల్కపాటి సీతాంబ వ్రాసిన 'వీరచంద్రావతి' అనే కవితలో (మార్చి 1935 గృహలక్ష్మి)*

*"ఆజికిదప్పి శత్రువులకౌదలలొగ్గితిరేని మేమికన్*
*గాజుల నూడ్చి కత్తులను కత్తళముల్గొని వైరి సేనలన్*
*తేజమడంచి యీ భారతదేశము కున్నతి గూర్చి హైందవ*
*స్త్రీ జన శౌర్యము ల్దెలసి చేతులు మోడ్చగ జేతుమీతరిన్"*

*"చచ్చిన స్వర్గమో జయముం*
*దెచ్చిన రాజ్యంబో యేదియొ దేల్పక కోటం*
*జొచ్చిన మిమ్మందరనిట*
*వ్రచ్చెద తరలుండు జయము వడయుడు వేగన్"*

*అంటూ స్త్రీలల్లో వీరత్వ ప్రదర్శనగా చావో, రేవో తేల్చు కోవాలంది. ఇదే తరువాత క్విట్ ఇండియా ఉద్యమంలో నినదించింది.*

గార్లపాటి లక్ష్మీగంగమ్మ 'కమలా నెహ్రూ'ను (మార్చి 1935 గృహలక్ష్మి) గురించి కవిత వ్రాస్తూ

*"భారతావని నీసేవ బడయు కొరకు*
*నిన్ను సృష్టించెనాబ్రహ్మ నిక్కముగను*
*ధరను జిరకాల జీవివై తనరుమమ్మ*
*కమలనాభుని కృపగల్గి గమలనెహురు" అని*

*స్వాతంత్రోద్యమ నాయకురాలైన కమలానెహ్రూని స్తుతించింది.*

పోతుల జయలక్ష్మి వ్రాసిన 'లెమ్మోయి లెమ్మోయి' అనే కవితలో-(సెప్టెంబరు 1935 గృహలక్ష్మి)

*"భారతావని గాఢాంధకార మెల్ల బాపవచ్చిన విజ్ఞానదీపమదిగొ*
*దాని నవనవ దేదీప్యమాన రుచులు కొరవడక మున్నెలెమ్మోయి భారతపుత్ర"*

అని మరియు

*"భారతమాతకొరకె మరణమెందుట భారతమాత కొరకెగాని*
*సౌఖ్యంపు వీచులదేలగాదు త్వరగలెమోయి లెమ్మోయి భారతపుత్ర"*

*అంటూ ప్రజలను ఉద్యమానికి మేలుకొల్పింది. సూర్యోదయానికి ముందే మేల్కొని భారత మాతకై ప్రాణాలనర్పించే విధంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని యువతకు పిలుపు నిచ్చింది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మహిళాప్రబోధం' (సెప్టెంబరు 1935 ఆంధ్ర భూమి) అనే కవితలో కాలంలో మార్పు వచ్చిందనీ, ఇదివరకటి పద్ధతులు ఇప్పుడూ లేవనీ స్త్రీలు సంఘసేవకు ముందుకొస్తున్నారనీ, 'హితైషిణీ' మండలి వంటి స్త్రీలసమితులను స్థాపించారనీ, ఆ సమితులలో స్త్రీలకూ వోటింగ్ హక్కు, క్రొత్త వివాహచట్టాలను దేశదాస్యం పోగొట్టటానికి రాజకీయాలలో స్త్రీ, పురుష సమానత్వాన్ని గురించిన ఊహలను పెంచుకుంటున్నారనీ, వివిధ దేశాల వార్తలు స్త్రీసమితులలో ఏనాటికానాడే తెలుసుకోగలుగుతున్నారనీ, నిజదేశ విషయాలు, ప్రాచీన గాథలు, మహనీయుల బోధలు తెలుసుకుంటూ తోటిస్త్రీలతో స్నేహసంబంధాలతో ఉండటానికి స్త్రీ సమాజాలు మేలు చేస్తున్నాయని చెప్పింది. అందుకే

*"వివిధ దేశములందు వెలసెడి వార్తల*
*కేనాటికానాడే యెఱుగవచ్చు*
*నిజదేశమునగల్గు నిఖిల విశేషముల్*
*తేటతెల్లముగాగ దెలియవచ్చు*
*ప్రాచీనగాథల పరమార్థమెల్లను*
*నింపుగా మది గ్రహియింపవచ్చు*
*మాన్యుల పెద్దల మహనీయబోధలు*
*వీనులవిందుగా వినగవచ్చు*

పరగనన్యోన్య పరిచయ భాగ్యమునను
స్నేహమభివృద్ధి జెందగ చేడెలెంద
రొక్కతల్లి బిడ్డలవలె నుండవచ్చు
స్త్రీ సమాజంబులిదు మేలు జెప్పదరమె" అంటూ

మహిళా సమాజాలలో స్త్రీలు పాల్గొంటే ఒనగూడే ప్రయోజనాలను తెలియజేసింది. స్త్రీలు చైతన్యవంతులు కాగలగటానికి స్త్రీ సమాజాల కృషి ఎంతో ఉందని అర్థం అవుతోంది.

ఈమెయే వ్రాసిన 'చదువుచెప్పింప తల్లిరో! శ్రద్ధగొనుము' (నవంబరు 1936 గృహలక్ష్మి) అనే మరో కవితలో

"గురుతరవ్యవహార గుట్టుమట్టులనైన స్వయముగానరసెడి శక్తి లేక
ప్రాణనాథుడు వ్రాయు ప్రణయలేఖలనైన తనకు జదివెడియనువు లేక
అత్తవారెన్నెన్ని యగచాట్లుబెట్టిన తల్లిదండ్రులకు దెల్పుదారి లేక
చాకలిదెచ్చిన చలువగుడ్డలనైన పద్దువేయగ జాలు పటిమలేక

చదువురానట్టి యువిద దాముదిమి దనుక
పడయరానట్టి బాధల పడెదుగాన
బాల్యము నుండి కూతుండ్ర బడికి బంపి
చదువుచెప్పింప తల్లిరో! శ్రద్ధగొనుము' అంటూ

తల్లిదండ్రులు ఆడపిల్లకు చదువుచెప్పించకపోతే భవిష్యత్తులో ఆమె నిరక్షరాస్యతతో ఎన్నో కష్టాలుపడే పరిస్థితులు ఏర్పడతాయని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

స్త్రీల స్వాతంత్ర్యం గురించి చదువుకున్న స్త్రీలకు మాత్రమే అవగాహన కలిగింది కాబట్టి ఇంకా చదువుకోని స్త్రీలు చాలమంది ఉండటంచేతనే కనుపర్తి వరలక్ష్మమ్మ స్త్రీవిద్యా విషయంలో తల్లిదండ్రుల బాధ్యత గురించి పదేపదే గుర్తుచేయటం కనబడుతోంది.

ఈమె వ్రాసిన "లక్ష్మి" అను మకుటంగల ఒక శతకములో ('ఆంధ్రకవయిత్రులు' ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

"విద్య చూపరాదో! వెఱవు చూపగ రాదా!
మఱల పెండ్లి చేసి మనుపరాదొ
పతిగతించినంత బాధింపగానేల?
తెరువు చూపకుండ తెలుపు లక్ష్మి" అంటూ

వితంతు స్త్రీలను చదివించటము గాని, పునర్వివాహం చేయటం గాని చేసి వారి జీవితాలకు మార్గం చూపించకుండా వారిని బాధించుట ఏమిటని కనుపర్తి వరలక్ష్మమ్మ ప్రశ్నించింది.

జటావల్లభుల వెంకట రత్నమ్మ వ్రాసిన 'నీకర్తవ్యం'అనే కవితలో(ఏప్రిల్ 1936 గృహలక్ష్మి)

*"పోయెను దేశభాగ్యమెటో పోయినవాత్మ విశేషశక్తులున్*
*పోయెననర్ఘ్య విద్యలును పోయియు బోవక నన్యదేశముల్*
*మీయెడ గౌరవించెడు నయ్యయ్యో పతివ్రత యన్నశక్తియే*
*మాయని మార్గమేదో కనుమా గృహలక్ష్మిరో యిద్దెముఖ్యమో". అని*

*విదేశీయతతో సాంప్రదాయ విముఖులవుతున్న భారతీయుల శక్తిహీనతను బయటపెట్టింది.*

తల్లాప్రగడ విశ్వసుందరమ్మ వ్రాసిన 'మేలుకొలుపు' అనే కవితలో (సెప్టెంబరు 1936 గృహలక్ష్మి)

*"మేలు కొనుమో భారతీయుడా....*
*మేలుకొనుమో దేశభక్తుడ*
*మేలుకో నీతల్లిదేశపు*
*గాంధిప్రభుని సుబోధలందున*

*గణ్యత నుంచి*
*జ్యోతి వెల్గున జూడుమా*
*నవభారతీయదైవసృష్టిని*
*సర్వులును సమమనెడి భావము*

*స్వాంతమందునను*
*అంటరాదుముట్టరాదన*
*తుంటరత్వము మాని బుద్ధిని*
*గనవయ్య ముక్తి" అని*

*గాంధీ చెప్పిన అస్పృశ్యతా నివారణను ఆలోచించమంది. ఆ రకంగా ప్రజలంతా ఐక్యమై స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని బోధచేసింది.*

'ప్రబోధము'అనే కవితలో–సమయమంత్రి రాజ్యలక్ష్మి (అక్టోబరు 1936 గృహలక్ష్మి) వ్రాస్తూ

*"దేశభాగ్యము కొల్లబోవగ*
*దేశమాత కృశించుచున్నది*
*ఆశపడదా నీసహాయము*
*లేశమునకైనన్" అని,*

*దేశసౌభాగ్యంకోసం, భారతమాత విముక్తి కోసం ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రబోధించింది.*

దేశస్వాతంత్ర్యం కోసం స్త్రీపురుషసమానత్వాన్ని వ్యతిరేకించే సమాజాన్ని చైతన్యపరచాల్సిన అవసరాన్ని గుర్తించి ఆ దిశగా రచన చేయాల్సిన అవసరాన్ని స్త్రీలు గుర్తించారు.

కోకా హనుమాయమ్మ 'కులము కులమందువేటికి తెలుగుబిడ్డ' (అక్టోబరు 1937 గృహలక్ష్మి) అనే కవితలో గాంధిమహాత్ముని ఉపదేశాన్ని చెప్తూ..

*'జాతిభేదము విడనాడి జనుల మిగుల*
*సఖ్యభావంతో నుండి సంతతంబు*
*హెచ్చు తగ్గులు విడనాడి హితముగల్గి*
*అందరున్ సమభావమున్ పొందువరకు*

*భారతావని మరి ముక్తిబడయలేదు*
*అనుచు చెప్పుట సభలో నహరహంబు*
*వినుచు నింకను వదలక పెద్దవగుచు*
*కులము కులమందు వేటికి తెలుగుబిడ్డ'* అంటూ

*ప్రజలందరూ తాము సమానులమనే మిత్రభావంతో కలిసిమెలిసి ఉండాలికాని, కులములంటూ తమని తాము వేరుచేసుకుంటూ ఉంటే భారతదేశం పరాయిపాలననుండి ముక్తి పొందలేదని తెలియజేసింది.*

బులుసు అన్నపూర్ణ వ్రాసిన 'ప్రబోధము' (నవంబరు 1937 గృహలక్ష్మి) అనే కవితలో

*"మేలుకొనుమోభారతీయుడ*
*మేలుకొని మీ మాతృదేశము*
*మేలుగాంచెడి విధముదెలియుము*
*మేలుకొమ్మోయీ*

*తోడిదేశములందువలెనెంతో*
*స్వతంత్రత సేకరింపగ*
*బారతంత్ర్యముఁబాఱద్రోలెడి*
*పథమును గనుమోయి*

*మాతృదేశపు పారతంత్ర్యము*
*మాపి మనదేశమ్మువలె*
*దాస్యమ్ముఁబొందిన దేశములకును*
*సాయపడుమోయీ"* అంటూ

*భారతీయులను స్వాతంత్రసాధనకై మేలుకొల్పటమేకాక దాస్యాన్ని అనుభవిస్తున్న మిగతాదేశాల స్వాతంత్ర్యంకోసం కూడా పాటుపడాల్సిన విశాల దృక్పథాన్ని పెంచాలనుకుంది.*

పి.కమలాదేవి వ్రాసిన 'ప్రబోధము' (ఫిబ్రవరి 1938 గృహలక్ష్మి) అనే కవితలో భారతీయుల శౌర్యము గొప్పదనియు, మాతృభూమి గొప్పదనీ,

"మేలుకొనుమో మాతృభక్తుడ
మేలుకొనుమో దేశభక్తుడ
మేలుకొని మీ మాతృభూమిని
ఏలుకొనవయ్యా..

భారతీయుల భూరి శౌర్యము
ధారుణింగడు బ్రసిద్ధము
అట్టివీరుల గన్నదేశము
గొడ్డు పోయిందీ",

అంటూ భారతీయులను ఉద్యమముపట్ల మేల్కొనేటట్లు చేసింది.

వీరపనేని సరోజినీదేవి వ్రాసిన 'ప్రబోధము'(ఆగష్టు 1938 గృహలక్ష్మి)అనే కవితలో

"చదువు సంధ్యల సమయమా చాలులెండు, రండు తడవేల
యెల్లకార్యములువిడిచి మాతృ సేవకు తరుణంబు
మఱలరాదు, ధైర్యనిధులారా ఆంధ్రవిద్యార్థులారా
ఆలోచించెదరేల? యాంధ్రవరులాహా ధర్మసంరంభము

ద్వేలంబై జగమెల్ల నల్లుకొనెడున్ ధీరాత్ములై లెండు లెం
డే లోటుండదు దానికిన్ మనము రాలేదన్న మాటుండు నేఁ
డేలా యీ యపనింద? వేగపడిరండి తల్లిసేవింపగన్
ఎంతకాలంబు నిద్రింతురింకమీరు, మేలుకొనుడుద్యమంబునుబాలుగొనుడు
పాలుగొని మేలుకొని రాజ్యమేలుకొనుడు, ఆర్యరత్నమ్ములారా యోయాంధ్రులారా" అని

స్వాతంత్రోద్యమంవైపు ఆంధ్రులను మరలించి ఆంధ్రుల గౌరవాన్ని ఇనుమడింపచేయాలని చైతన్యపరిచింది. భారతీయులు రాష్ట్రీయ స్వాతంత్ర్యంతో తృప్తి పడకుండా సంపూర్ణ స్వాతంత్ర్యానికై పోరాటం చేయాలని భావిస్తూ మేలుకొలుపు చేయటం అర్థమవుతుంది.

వల్లభనేని రంగాదేవి వ్రాసిన 'దౌర్భాగ్య సంఘము' (అక్టోబరు 1938 గృహలక్ష్మి) అనే కవితలో ఆటలాడుకునే వయస్సులో "పచ్చని పందిట్లో, పదిమంది పెద్దల్లో మేళాల సందట్లో మధ్యలో బెట్టేసి, ముప్పేటి త్రాడొకటి సోదరికి ముడిపెట్టె కంఠాన" అనీ, పన్నెండేళ్ళు రాగానే ఆమెను కట్టబెట్టిన ముసలివాడిని చూసి వెకసక్కము చేసేటట్టుగా తల్లిదండ్రులు తమకూతుళ్ళను

కడగండ్ల పాల్జేస్తున్నారనీ, మరొక రెండు నెలలకు 'అత్తాస్తే సొత్తంచు' ఆవలకు తరుముతున్నారనీ, ముసలాడితో మురిసేదేటనీ, కొత్త కోక కడితే గుడ్లిరిమి చూస్తూ "కొక్కి దగ్గు, నేల చూపులతోటి కూకుండి దినమెల్ల పవిటచెంగూ బట్టి కాపలా కాయునే, సోదరీ కంటికున్కేలేక చూసే" ముసలి మొద్దుకు పసికందులనిచ్చి పెండ్లి చేస్తున్నారనీ, అలా విశ్వమంతట కూడా జరుగకుండా సంస్కరించాలని తెలియజేసింది.

*స్త్రీలసమాజాలను బాల్యవివాహ నిషేధంపట్ల చైతన్య పరిచేవిధంగా జానపదపాటల బాణిలో తెలియజేయటం జరిగింది. ముసలి భర్తలకు పడుచు భార్యలమీద అనుమానం ఉటుందనీ, అందుకే నిరంతరం ఆమెను నిర్బంధాలకు గురిచేస్తాడని భావించింది.*

ఈమెయే వ్రాసిన 'అబల కాదు-సబల?' (ఫిబ్రవరి 1939 గృహలక్ష్మి) అనే మరొక కవితలో 'మహిళామాన సమర్థముగాన అబలని పలుకుచు నుండెదరా యీ పురుషులూ?' 'ఆడువారి పయిపెత్తనమాడగ నయమున భయమున నమ్మబలకే పలుకులివా?' 'ఆత్మబలంచే అంగనశక్తీ నైతికబలమే నారీశక్తికి పూతంగా?' 'జగతీ, సంఘపు క్షేమంబంతా మహిళామణిలో ఘనీభవించుట మరచారా?' అని మహిళా శక్తిని గుర్తించమని బోధచేసింది.

*'అబల' అనే మాటను విసర్జించాలని భావించినప్పుడే స్త్రీలలో ఆత్మవిశ్వాసం పెరుగు తుందని వల్లభనేని రంగాదేవి భావించింది.*

టి. కామాక్షమ్మ వ్రాసిన 'ఉద్బోధము' (ఫిబ్రవరి 1939 గృహలక్ష్మి) అనే కవితలో భూమి మీద విద్య మానవులకు శీలవృత్తములను అలవడచేస్తుంది కాబట్టి ఆడపిల్లలను చదివించాలనీ, కావ్యాలు వ్రాసిన స్త్రీలు ఉన్నారనీ, విద్యకు సాటియైనది లేదనీ, శత్రువులను జయించటానికి రణరంగంలో భర్తలకు సహాయపడ్డ భార్యలున్నారనీ, మతధర్మాలను బోధించిన తొలితరం తల్లులకు చదువులు కల్లలైన నేటితరం ఆడపిల్లలు రేపటి గృహకల్పవల్లులు కాబట్టి వారికి చదువు చెప్పించాలని చెబుతూ........

*"సకల వాంఛితములుదీర్పజాలునట్టి*
*కలుషములబాపు మార్గంబుఁ గరపునట్టి*
*విద్యసాటికి పుడమిలో వేరేగలదే*
*ఆడబిడ్డలచదివింపుడన్నలారా.......*
*ఘోషయందును మగువల ఘోషపెట్టి*
*వేషభాషల వనితల వెలినివేసి*
*ఏమిగట్టుకుపోయదో వెఱ్ఱియన్న*
*కుళ్ళుబోగొట్టుకొనుచూ హృద్గోళమందు*
*ఆడబిడ్డలచదివింపుడన్నలారా!"* అని

ఒక సోదరిగా సమాజంలోని పురుషులను అర్థించటం కనబడుతుంది. కఠినగుండెలను కూడా 'అన్నా' అంటూ ప్రాధేయపడితే ఆడపిల్లల విషయంలో కరగకుండా ఉంటారా అని భావించినట్లు కనబడుతుంది.

ఈ దశాబ్దపు ఉత్తరార్ధంలో వచ్చిన కవితలలో స్త్రీవిద్యాభివృద్ధి, బాల్యవివాహాల నిరసన, స్వాతంత్ర్యోద్యమ స్త్రీల స్ఫూర్తి, కుటుంబస్త్రీల వెతలు, మహిళలకు, యువతకు ఉద్యమప్రబోధం, స్త్రీలు అబలలు కాదు సబలలని భావింపజేయటం, ప్రజలలో ఉద్యమచైతన్యాన్ని కలిగించటం కనపడుతుంది.

**మంగళహారతి**

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మంగళహారతి' (గృహలక్ష్మి అక్టోబరు, 1939) రూపంలో ఉన్న కవితలో

*"రాట్నలక్ష్మికి మంగళం మా రాజ్యలక్ష్మికి మంగళం*
*పాలబోలిన నూలునొసగే భాగ్యలక్ష్మికి మంగళం*
*మా భాగ్యలక్ష్మికి మంగళం ॥రా॥*

*సిరులుతొలుకెడు దివ్యవేళల కఱవులుఱిమెడి కటికవేళల*
*కన్నబిడ్డల కాచిప్రోచిన కదురుతల్లికి మంగళం ॥రా॥॥రా॥*

*భిన్నమతముల భిన్నకులముల భిన్నభాషా భేదములనూ*
*భిన్నమయ్యెడు చిన్నబిడ్డల చేర్చుజననికి మంగళం ॥రా॥*

*దండి భారత భాగ్యసంపద పిండిపీల్చిన యంత్రరక్కసి*
*మదమడంచగనుదయమందిన ఆదిశక్తికి మంగళం ॥రా॥*

*ప్రతీద్యదేశ ప్రజలువారలు పారుటాకులు గట్టునాటికె*
*మేలివలువల చెలువుజూపిన నూలుతల్లికి మంగళం ॥రా॥*

*జారిపోయిన దేశగరిమము మీరిపోయిన దేశసంపద*
*తిరిగిచేర్చగ తరలివచ్చిన వరప్రదాయికి మంగళం" ॥రా॥* అంటూ

*భారతీయుల ఆర్థికవ్యవస్థ రాట్నంద్వారా వడికే నూలుమీద ఆధారపడి ఉందనీ, విదేశీ వస్త్రాలకంటే రాట్నంద్వారా వడికిన నూలువస్త్రాలే ప్రపంచంలోకెల్లా విలువైనవనీ పేర్కొంది.*

*స్త్రీలు పండగలప్పుడు కలిసినప్పుడు మంగళహారతులు పాడుకుంటుంటారు కాబట్టి ఆ విధంగా పాడుకోవటానికి వీలుగా రాట్నం గురించి పాటను వ్రాయటంతో స్త్రీలకు రాట్నం మీద గురి ఏర్పడుతుందనీ, నాటి స్త్రీల మనస్తత్వానికి అనువుగా వ్రాయటం జరిగింది.*

**లేఖలు**

1935 నుండి 1939 వరకు వచ్చిన లేఖా సాహిత్యంలో3 లేఖలు వచ్చాయి.

సి.వి. రమణమ్మ 'లేఖ' (మే 1938 గృహలక్ష్మి)ను మణి అనే పేరుతో కమలకు వ్రాసిన లేఖలో సంక్రాంతి రోజుల్లో జపానువారి పింగాణీ బొమ్మలను ఖరీదుకుకొని పెడుతున్నారు గానీ, కళావైశిష్ట్యంగల ఆకులమధ్య పూరిగుడిసెల్లో బాలబాలికల భవనాన్ని రూపొందించి బొమ్మలు పెట్టటం జరగటంలేదని వ్రాస్తుంది. విదేశీ బొమ్మలపై మోజు ఉండటం అనేది ఆత్మనాశన హేతుకారి అనీ, ఆత్మ మాతృస్థానంఅనీ, ఆత్మ స్వాతంత్ర్యాన్ని పోగొట్టు కోవటమేననీ, ఇక బొమ్మలను పెట్టే పిల్లల మనస్తత్వం ఎలా ఉంటుందో ఆలోచించాలనీ, కళ కోసం ఆత్మయొక్క మాతృత్వాన్ని, కాపాడుకోవాలని లేఖలో తెలియజేసింది.

*విదేశీయ మోజు ఆత్మనాశనకరమైందని స్పష్టంచేసింది.*

ఈమెయే మణి అనే పేరుతో మళ్ళీ కమలకు వ్రాసిన మరొక'లేఖ' (జూన్ 1938 గృహలక్ష్మి)లో తల్లుల ఆంగ్ల సాంప్రదాయంమీద ఆంగ్ల విద్యమీద గల మోజుతో పిల్లల్ని అలాగే పెంచుతున్నారనీ, విద్య అనేది మానవులకు, దేశానికి, ప్రపంచానికి సహాయకారిగా ఉండాలనీ, మనస్సుయొక్క దృష్టిపథానికి సరియైన శిక్షణయిచ్చేది విద్య అని తెలిపింది. వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని సమష్టిలో గోల్పోవటమే భారతీయవిద్యా దర్శనమనీ, పిల్లలు పెరిగే పరిస్థితులకు, నేర్చుకునే విద్యకు సామరస్యం ఉంటేనే వారికి సంఘం, దేశం పట్ల అభిమానం, గౌరవం ఏర్పడుతుందని తెలియజేసింది. అంతేకాదు, మాటలను కలిపి సమాసపదాలను సృష్టించుకొని జాతీయ సాంప్రదాయాలను వెల్లడి చేయాలంటే మాతృభాషలో విద్యాధ్యయనం చేయాలని వ్రాసింది. భాషాతర్క శాస్త్రాలకు అనువైన సంబంధం ఉందని లాటిన్ వాళ్ళు భావించారనీ, వ్యవసాయం అన్నా, కలంకారీ అన్నా ఆంగ్లంలో చదువుకున్న వారికి అర్థం కాదనీ, అందుకే గాంధి పిల్లలకు చేతిపనులద్వారా విద్యనేర్పాలనీ, మన జాతీయ విద్యను తయారు చేసుకోవాలని భావించాడని వ్రాసింది. అందుకే కళాజ్ఞానం విద్యలో భాగంకావాలనీ అప్పుడే సాంఘిక ధర్మాలు, సాంప్రదాయాలు, దేశస్థితి అభివృద్ధిచేసే మేధోశక్తి వారిలో కలుగుతుందనీ, సహృదయత పెరుగు తుందనీ, దాస్యశృంఖలాలు తెంచివేసే వీరమూర్తులు కాగలుగుతారని లేఖలో సి.వి. రమణమ్మ తెలియజేసింది.

*మాతృభాషలో బోధన, జాతీయవిద్య దేశాన్ని ఉన్నతస్థితికి తీసుకెళ్ళగలదని విద్యకు దేశస్వాతంత్ర్యాభిమానానికి ఉన్న సంబంధాన్ని తెలియజేసింది.*

పాకల రాజమణి 'కమల' కు వ్రాసిన లేఖ(సెప్టెంబర్ 1938 గృహలక్ష్మి) లో తల్లిగా స్త్రీ ఉత్తేజకారిణిగా, భవిష్యజ్జాతి నిర్మాతగా, పిల్లలు పాఠశాలలో నేర్చుకునే పాశ్చాత్య దైనిక జీవితానికి, గృహంలోని హైందవ మత ధర్మాలకు మధ్యన విజ్ఞాన స్వరూపిణిగా నేటి తల్లులు ఉండాలని తెలిపింది. రైతు కట్టాల్సిన పన్నుక్రింద రాట్నం వడకగా వచ్చిన డబ్బులో కొంత

కట్టవచ్చునీ, రాట్న పరిశ్రమ కుటుంబం యొక్క పవిత్రతను కాపాడుతుందనీ, పెట్టుబడి, వడ్డీలు, యంత్రాలు అవసరంలేని పరిశ్రమ అనీ, పిల్లల స్వభావాలను చక్కగా తీర్చిదిద్దగల అవకాశాన్నీ రాట్నపరిశ్రమ ఇస్తుందని లేఖలో తెలియజేసింది.

*బ్రిటిష్ ప్రభుత్వం పంటలు పండకపోయినా పన్నులు వేస్తుంటే, పన్నులు కట్టలేని రైతుల భార్యలు కనీసం రాట్నం వడికి సొమ్ము చేసి దానితో శిస్తు కట్టి శిక్షల నుండి రైతులను కాపాడుకోవాలని చెప్పింది. అంతేకాక రాట్నపరిశ్రమకు పిల్లల ప్రగతికి, దేశఆర్థిక పరిస్థితికి, జాతీయతకు, దేశస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని తెలియజేస్తూ అందులో స్త్రీల భాగస్వామ్యం ప్రధానమని భావించింది. భారతీయ ధర్మాచరణలో తల్లియొక్క విజ్ఞానం అవసరమని భావించింది.*

*ఈ లేఖలలో స్వదేశీవస్తు వినియోగం, స్వదేశీభాష, స్వదేశీవృత్తుల ప్రాధాన్యాన్ని , దానికై స్త్రీల బాధ్యతను తెలియజేస్తూ స్త్రీలు మిత్రులకు లేఖలు వ్రాసారు.*

20 శతాబ్దపు నాలుగవ దశకం, ఉత్తరార్ధంలో అంటే 1935 నుండి 1939 వరకు వచ్చిన సాహిత్యంలో స్త్రీల భావపరిణామశీలతలో పెనుమార్పులు చోటుచేసుకొన్నాయి. 1930 సం.లో స్త్రీలు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైళ్ళజీవితాన్ని గడపటంతో ఆత్మవిశ్వాసం పెరిగి తాము పురుషులతో సమానమనే ఆలోచనలు పెరిగి నూతనోత్సాహము కలిగింది. భారతదేశ ప్రభుత్వ చట్టం 1935 భారతదేశానికి రాష్ట్రీయ స్వాతంత్ర్యం ఇవ్వటంతో స్త్రీలు దేశస్వాతంత్ర్యం కోసం అభ్యుదయపంథాలో నడిచి విప్లవాత్మక ఆలోచనలను పెంచుకున్నారు. ఐతే కొంతమంది స్త్రీలలో విదేశీనాగరికతమోజు పెచ్చుపెరిగి జాతీయాభిమానం తగ్గుతుండటంతోపాటు గృహకృత్య నిర్మాణము శిశుపోషణము నిర్లక్ష్యము చేస్తున్నారని దానిప్రభావము స్త్రీస్వతంత్రత మీద పడుతుందని భావించి దానినివారణకై కుటుంబవ్యవస్థను కాపాడే ప్రయత్నము చేయాలనుకుని సాహిత్య సృజన చేసారు. కుటుంబ నిర్వహణలో రాట్న పరిశ్రమకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించారు.

విద్యావంతులైన స్త్రీలు స్వంతంత్రంగా వ్యాపారాన్ని కొనసాగిస్తూ పెళ్ళివద్దనుకోవటంతో స్త్రీలను 'పెళ్ళితంతు'కు లోబడేటట్లుచేసే ప్రయత్నాలు కనబడుతాయి. స్త్రీలు వ్యవసాయవిద్యను అభ్యసించాలనీ అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికస్త్రీలకు సంఘాలు ఉండాలని భావించారు. స్త్రీపురుషసమానత్వ ఆవశ్యకతను తీవ్రతరంచేసారు. ఓటింగ్ హక్కు, విద్యాహక్కు, వివాహనిర్ణయ స్వతంత్రం ఉంటేనే స్త్రీ, పురుష సమానత్వం ఉంటుందనీ, దాన్ని కాపాడుకోవటానికి స్త్రీలకు రాజకీయహక్కులు ఉండేలా శాసనసభలలో సభ్యత్వం ఉండాలని భావించారు. గృహిణులుగా ఉంటూనే స్త్రీలు సంపూర్ణస్వేచ్ఛను పొందే మార్గాలను అన్వేషించారు. 1935 చట్టం స్త్రీలకు ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించటంతో (మహిళా రిజర్వేషన్) స్త్రీలు ఎన్నికకాబడి శాసనసభ్యత్వాన్ని పొందటం జరిగింది. రాజకీయవ్యవహారాలలో స్త్రీల శక్తియుక్తులమీద నమ్మకం కలిగేలా రచనలు చేసారు. ఉద్యమస్త్రీలు లైంగికవేధింపులను యుక్తితో ఎదుర్కొనే విధానాన్ని

తెలియజేసారు. మాతృభాషలో విద్యాబోధన ఉండాలని కోరుకొన్నారు. గ్రామ, జిల్లా, రాష్ట్రస్థాయి మహిళాసభలలో స్త్రీలు తీర్మానాలను చేసి పంపి కేంద్ర, రాష్ట్ర శాసనసభలలో స్త్రీలుప్రాతినిధ్యం వహించాలని భావించారు. అఖిలభారత మహిళా సభలలో పాల్గొనటానికి హిందీభాషా నైపుణ్యాన్ని పెంచుకోవాలనుకున్నారు. సంపూర్ణస్వాతంత్ర్యం ముఖ్యోద్దేశ్యంగా ఉద్యమాలు జరుగుతుంటే మరొకప్రక్క మహిళలకు సంపూర్ణస్వేచ్ఛ కావాలనే ఆలోచనలను పెంచుకొన్నారు. స్త్రీలు విద్యావంతులై పరిశ్రమల ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకుంటూ ప్రజాహిత సంస్థలలో పాల్గొని దేశసేవలో నిమగ్నులైనా కూడా భారత స్త్రీలు సంపూర్ణస్వాతంత్ర్యాన్ని పొందలేక పోవటానికి కారణాలను అన్వేషించారు. రాష్ట్రీయస్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో స్త్రీలు తమకు గృహహింస కారణంగా వైవాహిక విముక్తికై బిల్లును ప్రతిపాదించేటప్పుడే దాని సవరణలకై సభలలో చర్చించటమేకాక, పత్రికాముఖంగాను సూచనలను చేసారు.

స్త్రీలకు వారసత్వపు హక్కులు ఉంటేనే స్త్రీ, పురుష సమానత్వం ఏర్పడుతుందనీ అప్పుడే స్త్రీలు సంపూర్ణస్వేచ్ఛను పొందగలరని భావించి దానికితగ్గ సాంఘికపరిస్థితులు అనుకూలించటానికి స్త్రీలకు రాజకీయప్రాతినిధ్యం కావాలని అనుకున్నారు. అంతేకాక భాషాప్రయుక్త రాష్ట్రాలుగా విభజన జరిగి ఆంధ్రరాష్ట్రము ఏర్పడితేనే ఆంధ్రస్త్రీలకు సంపూర్ణస్వేచ్ఛ ఏర్పడుతుందని భావించారు. దానికోసం స్త్రీని గౌరవించాలనే విచక్షణాజ్ఞానం లేని పురుషులయొక్క మానవ ప్రకృతికి చికిత్స చేయాలనుకున్నారు.

బ్రిటిష్ ప్రభుత్వం చేసిన 1937 వారసత్వపు చట్టంలోని సాంకేతిక లోపాలవల్ల స్త్రీలకు ఆస్తిహక్కు రాదని భావించి దానికోసం శాసనసభ్యురాండ్రుగా ఎన్నికకాబడి స్త్రీలకు వారసత్వపు చట్టం వచ్చేటట్లుగా చేయాలనుకున్నారు. స్త్రీల చట్టాలకై ప్రవేశపెట్టవలసిన బిల్లులను చర్చించి సూచనలు చేసారు. దానికై శాసనసభలలో స్త్రీల కర్తవ్యాన్ని గురించి ఆలోచనలు చేసి, వారు ప్రజాహితులు కావల్సిన అవసరాన్ని భావించారు. స్త్రీలు లోహపుపనులు కూడా నేర్చి యాంత్రికతను కాపాడే పెట్టుబడులుదారులు కావల్సిన అవసరాన్ని గుర్తించారు. వైవాహిక చట్టాలలోని లింగవివక్షను గుర్తించి విడాకులవంటి చట్టాలు ఎలా ఉండాలో నిర్ణయించారు. న్యాయవ్యవస్థలోని లింగవివక్షను విమర్శకుపెట్టి ప్రశ్నించే చైతన్యం తెచ్చుకొన్నారు. విడాకుల చట్టం లేనప్పుడు పురుషుడు పెళ్ళిచేసుకొంటే, ఆ భర్తదగ్గర విడాకుల అంగీకారపత్రాన్ని ఇప్పించుకొని స్త్రీ పునర్వివాహం చేసుకొనే వైవాహిక స్వాతంత్ర్యాన్ని పొందటం కనపడుతుంది. గ్రామాలపునర్నిర్మాణంలో భాగంగా పరిశ్రమలను అభివృద్ధిచేసి నిరుద్యోగ సమస్య తీర్చాలనుకున్నారు. సమాజంలోని వర్గస్వభావాన్ని అర్థంచేసుకొన్నారు. స్త్రీలలైంగికత, గర్భధారణ, విడాకులవంటి విషయాలలో స్త్రీలస్వతంత్రతకు ప్రాముఖ్యతను ఇచ్చారు. స్త్రీలకు ఎటువంటి విద్యకావాలో, ఎటువంటి బతుకు ఉండాలో చర్చించారు.

ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేసారు. స్త్రీలు పత్రికారంగంలో నిలదొక్కుకుంటూ, అభ్యుదయరచనలు చేయాలనీ, స్త్రీలను అగౌరవపరిచే పత్రికలను నిషేధించాలని భావించారు.

స్త్రీ, పురుష సమానత్వం ఉంటేనే స్త్రీలహక్కులు కాపాడబడతాయనీ, దానికి కుటుంబ సంస్కృతిలోగాని ఆస్తిహక్కులోగాని స్త్రీలకు సమాన న్యాయం ఉండేలా చట్టాలు రూపొందింప బడాలని భావించి న్యాయశాస్త్రాలలోని లింగవివక్షను బయటపెట్టి న్యాయాధిపతులను ప్రశ్నించే విధంగా 1938 నాటికే కలలుగన్నారు. గృహణీత్వానికి విలువకడుతూ జీతాలిస్తేనే కాని స్త్రీల గృహఉద్యోగానికి విలువఉండదని భావించారు. గ్రామస్వరాజ్యం గృహస్వరాజ్యంతో ప్రారంభం కావాలనుకొన్నారు. వర్ణవ్యవస్థ వర్గవ్యవస్థతో కూడుకున్నదని అస్పృశ్యతను విశ్లేషణకు పెట్టారు. మతంలోని వర్గపోరాటమే హిందూ మహమ్మదీయుల మధ్యన ఐక్యతను సాధిస్తుందని భావించారు. స్త్రీలకు సంపూర్ణస్వేచ్ఛ కావాలనీ, దానితో సమాజకార్యక్రమాలలో భాగస్వాములై ఆర్థిక,రాజకీయహక్కులను సాధించి వ్యక్తి స్వాతంత్ర్యంతో దేశస్వాతంత్ర్యాన్ని సాధించవచ్చని భావించారు. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యోద్యమం ఎంత బలంగా ఉంటే దేశస్వాతంత్ర్యసాధన అంత సుసాధ్యమవుతుందని భావించారు. స్త్రీలు శాసనసభ్యత్వాన్ని పొంది భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములవ్వాలనుకొన్నారు.

20 శతాబ్దపు నాలుగవ దశకంలో స్త్రీల సంఘటిత చైతన్యమే స్వాతంత్ర్యసాధనకు అవసరమని భావించారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభం అవటంతో స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యోద్యమం, దేశస్వాతంత్ర్యోద్యమాలలో కొనసాగిస్తూనే ప్రపంచరాజకీయ పరిణామాలను అర్థంచేసుకోవటం మొదలుపెట్టారు. ద్వితీయప్రపంచయుద్ధ పరిణామాల సందర్భంలో సామాజిక ఐక్యత సాధిస్తూ, రాజకీయ, ఆర్థిక పరిణామాలను స్త్రీలు అవగతం చేసుకోవాల్సిన అవసరం ఉందని భావించారు. స్వీయరాజ్యాంగ నిర్మాణంవైపు అడుగులు వేసేవిధంగా స్త్రీలను చైతన్యపరిచే సాహిత్యసృజనను స్త్రీలు చేపట్టారు. 1940 దశకంలో తీవ్రతరమవుతున్న దేశస్వాతంత్ర్యోద్యమ చరిత్రను తెలుసుకోవటానికి ముందుకు సాగాలి.

# 6. సాహిత్యము (క్రీ.శ.1940-47) క్విట్ఇండియాఉద్యమం - 'సాధించు-మరణించు' నినాదం - బ్రిటిష్ వారి నిష్క్రమణం - భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన

పరిపాలనా దక్షత ఏర్పడితేనే భారతీయులు స్వాతంత్ర్యాన్ని పొందటానికి అర్హులని మునుపే బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ఇవ్వకపోవటానికి కారణాన్ని చూపించారు. అందుకనే హిందూ ముస్లింల మత కలహాలు ఏర్పడినా రాష్ట్ర ప్రభుత్వాలలోని భారతీయ మంత్రులు కర్షకుల, కార్మికుల సమస్యలు తీర్చిదిద్ది తమపరిపాలనా దక్షతను నిరూపించుకోగలిగారు. అయితే సంస్థానాలను రూపుమాపి అక్కడకూడా ప్రజాస్వామ్యం ఏర్పడితేనే స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలందరి సహకారం ఉంటుందని కాంగ్రెస్ వారు భావించారు. ఆ సమయంలో బ్రిటిష్ వారిని లొంగదీయటానికి సాయుధపోరాటం అవసరమని భావించిన బోసు 1939 లో కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామా చేసి 'ఫార్వర్డ్ బ్లాక్' అనే పార్టీపెట్టారు. సంస్థానాలతో కలసి కేంద్రంలో భారతదేశప్రభుత్వం 1935 చట్టప్రకారం సమాఖ్య ఏర్పడటానికి ముందే రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. బ్రిటిష్ వాళ్ళు కాంగ్రెస్ వారితో సంప్రదించకుండానే జర్మనీవారిపై బ్రిటన్ చేసే యుద్ధంలో భారతీయ సైన్యం పాల్గొనాలని అనేసరికి, తమతో సంప్రదించకుండా నిర్ణయించినందుకు భారతీయులు యుద్ధంలో పాల్గొనకూడదనుకొన్నారు. కాంగ్రెసుమంత్రివర్గం రాజీనామాచేసింది. ముస్లింమంత్రులు రాజీనామాచేయలేదు. జాతీయాభిమానం పెరిగిన భారతీయ సైన్యం సహకరించాలనే ఉద్దేశ్యంతో యుద్ధానంతరం 'సంపూర్ణ స్వాతంత్ర్యం' ఇస్తామని బ్రిటిష్ వారు చెప్పారు.

ద్వితీయ ప్రపంచయుద్ధానంతరం బ్రిటీష్ వాళ్ళు గెలిచినా బ్రిటీష్ సైన్యానికి ఎక్కువ నష్టం జరిగింది. యుద్ధానంతరం సంపూర్ణ స్వరాజ్యం ఇస్తామని చెప్పి సహాయంపొందినా పట్టించుకోనందుకు గాంధీ తిరిగి సత్యాగ్రహాన్ని ప్రారంభించేసరికి లండన్ నుండి 'క్రిప్స్' అనే వ్యక్తిని రాయబారిగా పంపి సంపూర్ణ స్వాతంత్ర్యంకొరకు యుద్ధానంతరం జరిగే ఎన్నికల్లో భారత శాసన సభలోని మెజార్టీపార్టీ నిర్ణయిస్తుందనీ, ఏరాష్ట్రమైనా విడిగా కావాలంటే స్వతంత్రంగా ఉండవచ్చని చెప్పింది. భారతీయులను విభజించాలని చూస్తున్న "బ్రిటీష్ వారికి చెంపపెట్టుగా వాళ్లని దేశం

నుండి పారద్రోలేందుకు, చావో బ్రతుకో తేల్చుకునే విధంగా 1942 లో 'క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది. ఆగస్ట్‌లో విప్లవంగా విజృంభించింది. ప్రజలందరూ బ్రిటీష్ ఆఫీసులను ధ్వంసం చేసారు. గాంధిని అరెస్టు చేసారు.

బ్రిటిష్ వారు మాట నిలబెట్టు కోకపోయే సరికి తిరిగి గాంధి వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించి 'క్విట్ ఇండియా' ఉద్యమంలో భాగంగా 'సాధించు లేదా మరణించు' అనే నినాదంతో హర్తాళు లు, ఊరేగింపులు చేసారు. జైళ్ళు, అరెస్టులు జరిగి చాలమంది కారాగారబద్ధులయ్యారు. బ్రిటిష్ వారు రెండవ ప్రపంచయుద్ధ సమయంలో సైన్యం, ఆయుధాల కోసం అప్పులుచేసి డబ్బు ఖర్చుపెట్టేసరికి ఆర్థికవ్యవస్థ దెబ్బతింది. సైన్యంలో చాలామంది చనిపోయారు.

అంతేకాక, బోసు నాయకత్వంలో జాతీయవాదులతో కూడిన సైన్యం బ్రిటిష్ వారిపై యుద్ధానికి దిగారు. వారికి కన్నుతప్పి లొట్టబోయిన చందంగా తయారయింది. ఇక భారతదేశంలో పరిపాలించగలమనే స్థితిలో లేని బ్రిటిష్ ప్రభుత్వంలో నాడు ఉన్న లేబర్ పార్టీ నాయకత్వంలో ప్రధానమంత్రి అయిన ఆట్లే భారతదేశాన్ని వదిలించుకోవటం మంచిదనే అభిప్రాయానికి వచ్చాడు. ఆనాడున్న వారి ఆర్థికపరిస్థితి దృష్ట్యా బ్రిటీష్ పాలనను చేపట్టిన కార్మికవర్గపుపార్టీ (లేబర్ పార్టీ) భారతీయులకు స్వాతంత్ర్యం ఇవ్వటానికి నిర్ణయించింది. 1944 లో విడుదలైన గాంధితో స్వాతంత్ర్యం ఇవ్వాల్సింది మహమ్మదీయులకా, హిందువులకా అన్న చర్చపెట్టింది. జిన్నా ప్రత్యేక పాకిస్థాన్ కావాలని పట్టుపట్టారు. కాంగ్రెసు, ముస్లింలీగులు కలిసివస్తే ఫెడరల్ సమాఖ్యగా స్వీయరాజ్యాంగాన్ని నిర్మించుకోవటానికి వీలుగా భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం యిస్తామన్నారు. కాని ముస్లింలీగు నాయకుడిగా జిన్నా అప్పటికే ప్రభుత్వశాఖలో ఉన్న ముస్లిం మంత్రులు పాకిస్థాన్ కావాలని పట్టుబడ్డారు.

చివరకు గాంధి అయిష్టంగానే ఒప్పుకోవటంతో హిందూ మహమ్మదీయులకు భారతదేశ స్వాతంత్ర్యాన్ని పంచటం జరిగి ఇండియా, పాకిస్థాన్ అనే రెండు దేశాలు ఏర్పడ్డాయి. భారతదేశంలో ముస్లిం రాష్ట్రాలైన పంజాబ్, సింధు, రాష్ట్రాలలోని కొంతభాగం, కొంత వాయువ్య భాగం కలసి పశ్చిమ పాకిస్థాన్, తూర్పు బెంగాల్ తూర్పు పాకిస్థాన్ రాజ్యంగా ఏర్పడింది.

1947లోనే జరిగిన హిందూ ముస్లింల ఒడంబడికలో భాగంగా 1947 ఆగష్టు 15వ తేదీన భారతదేశం మరియు పాకిస్థాన్ అనే రెండు దేశాలకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వటానికి బ్రిటిష్‌వారు అంగీకరించి, భారతీయుల పరిపాలనను భారతీయులకు అప్పగించారు.

ఈ నేపథ్యంలో స్త్రీలు తమ వ్యక్తిస్వాతంత్ర్య సాధనను మరిచిపోకుండానే సమాంతరంగా స్వాతంత్ర్యసాధనకై ఉద్యమ చైతన్యంతో ముందుకు సాగుతూ సాహిత్య సృజన చేసారు.

1940 నుండి 1947 అంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినంతవరకు స్త్రీల సాహిత్యంలో 76 వ్యాసాలు, 2 ప్రచురిత ఉపన్యాసాలు, 11 కథలు, 3 నాటకాలు, 23 కవితలు, 3 లేఖలు, 1 గల్పిక వచ్చాయి.

ఈ కాలంలో స్త్రీపురుషసమానత్వం, సర్వోదయం, సామ్యవాదం, శాసనసభలలో స్త్రీలకర్తవ్యం గురించిన ఆలోచనలతో మొత్తం 72 వ్యాసాలు వచ్చాయి.

సి. హెచ్. చంద్రమతి వ్రాసిన 'పుష్పచయము' (ఏప్రిల్ 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలకు విద్యలేకపోవటం, ధనలోపం వంటివి ఉండటంచేతనే స్త్రీలు సమస్యలను ఎదుర్కొంటు న్నారనీ, స్త్రీలు పురుషులతో పాటు సమానులు కావాలంటే, అన్నివిషయాలలో వారితోపాటు స్త్రీలు సమాన బాధ్యత వహించాలని భావించింది. అంతేకాదు, ప్రపంచమంతయు కల్లోల పడుతున్న యుద్ధసందర్భాలలో స్వరాజ్య సంపాదనకై కాంగ్రెసు నాయకులు కష్టపడుతున్నారనీ, భారతీయులలో ఐకమత్యం లేదనే భావనతోనే బ్రిటిష్ ప్రభుత్వంవారు యుద్ధానంతరం ఇస్తామన్న సంపూర్ణ స్వరాజ్యం ఇవ్వలేమంటున్నారని తెలిపింది. వర్ణ, జాతుల, మతాలమధ్య సామరస్యం ఉండాలనీ, స్త్రీజాతి పురుష జాతి సమైక్యతతో ఉండాలని భావించింది. స్వరాజ్యాన్ని స్త్రీలే సాధించాలనీ, గృహ పరిపాలనకు, దేశంలో ప్రజాపాలనకు సంబంధం ఉందనీ, ఆడపిల్లలకు మగపిల్లలకు సమానంగా ఆస్తియివ్వాలనీ, బాలికలకు నిర్బంధవిద్యావిధానం ఉండాలని, స్త్రీ జాతి క్షేమంకోరి రాజారామ మోహనరాయలు తెచ్చిన శారదాచట్టం, వితంతూద్యమాన్ని ఆచరణలో పెట్టాలని తెలియజేసింది.

*ఒకప్రక్క స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యోద్యమం నడుపుతూనే మరొక ప్రక్క హిందూ ముస్లిముల ఐక్యతకోసం పోరాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య రాజ్యాంగం అవసరమని భావించి తోటిస్త్రీలను చైతన్యపరచటం స్పష్టమవుతుంది.*

చుండూరు రమాదేవి 'స్త్రీకి ఎట్టి విద్య అవసరము' (ఏప్రిల్ 1940 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ స్త్రీవిద్య, స్త్రీస్వాతంత్ర్యం అంటూ స్త్రీల సమస్యలనే చర్చిస్తున్నారనీ, ప్రతిగ్రామంలో పల్లెలో స్త్రీవిద్య అభివృద్ధి చెందాలంటే అవసరమైన పాఠశాలలు లేవని తెలిపింది. స్త్రీలకు ప్రత్యేక పాఠశాలలు పెట్టి గానం, చిత్రలేఖనం, పాకశాస్త్రం, రాట్నపరిశ్రమ, గృహాలంకరణ విద్యలు నేర్పాలనీ, దానికై ఉపాధ్యాయినులను నియమించాలనీ, ఆంగ్లభాష నేర్చుకోవటమే విద్యాభ్యాసం కాదని తెలిపింది. గృహకృత్యములందు, ధనవ్యయమునందు, శిశుపోషణయందు స్త్రీలు ఆరితేరి ఉండాలనీ, మాతృభాషలో విద్య అర్థజ్ఞానాన్ని కలిగిస్తుందనీ, వార్తాపత్రిక పఠనం స్త్రీలకు ప్రపంచ జ్ఞానాన్ని కలిగిస్తోందనీ, అటువంటి విద్యావంతురాలైన స్త్రీరక్షణ క్రింద గృహమే శాంతి దేవతావాసమై ఉంటుందని తెలియజేసింది.

*వైశ్యకుటుంబ జమిందారిణి 'చుండూరు రత్నమాంబ' (సెప్టెంబరు 1940 గృహలక్ష్మి) ను గురించిన పత్రికాధిపుల ప్రచురణలో ఆమె ప్రథమ పురపాలక సంఘాధ్యక్షిణి అనీ, సత్యాగ్రహమున సర్వకష్టాల కోర్చి పేరొందిన యోధురాలనీ, వితంతు వివాహాలు చేయించారనీ, మహిళోద్యమాలకు మార్గదర్శినియని పేర్కొన్నది. ఈమెకు స్వదేశీభక్తి, జాతీయత్వం చిన్నప్పటినుండి వచ్చిందనీ, ఈమె చుండూరు శ్రీరాములు గారి భార్య అనీ, దేశాభ్యుదయ*

*కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనేదనీ, రాజమండ్రి, విజయవాడ వంటి మహిళామండలి సభలలో అగ్రాసనాన్ని వహించిందని తెలియజేసింది. గాంధి మహాసభలో చేసిన శంఖారావంతో సత్యాగ్రహంలో పాల్గొని ఆర్నెల్లు జైలు శిక్షను అనుభవించిందని కూడా తెలియజేసింది. 1931లో వచ్చిన కొల్లేటివరద సహాయపు పనులలోపాల్గొని ధనసహాయాన్ని చేసిందనీ, ధర్మసంస్థానాలకు, పాఠశాలలకు, పుస్తకభండాగారాలకు నిధులనందించిందనీ, రాజకీయ, సాంఘిక, సారస్వత కార్యక్రమాలలో పాల్గొనటమేకాక భూస్వాములను భారత జాతీయనిర్మాణానికి పూనుకొనేటట్లుగా చేసిన కార్యశూర్యురాలు అని పత్రిక తెలియజేసింది. అంతేగాక ఆమెకు 'సంఘసేవాపరాయణి' అని బిరుదునిచ్చి వైశ్యసభ తమనుతాము సన్మానించుకుందని జూన్ 1941, నవంబరు 1941లోనూ గృహలక్ష్మిపత్రిక ప్రచురించింది.*

చుండూరి రత్నమ్మ అనే జమీందారిణిని 'సంఘ సేవా పరాయణి' గా (నవంబరు 1941 గృహలక్ష్మి) పత్రిక ప్రచురిస్తూ, ఆమె ఆర్యవైశ్యస్త్రీలకే కాక ఆంధ్రస్త్రీలందరికీ ఆమె ఉపన్యాసం హితోపదేశం చేస్తుందనీ, ప్రపంచంలోని స్త్రీలు పురుషులకంటె ముందంజ వేసి దేశసేవ చేస్తున్నారనీ, అక్కడ స్త్రీలసంస్థలు ఎక్కువనీ, వారు విద్యావంతులు, ధైర్యవంతులనీ, పురుషులు యుద్ధంలో పాల్గొంటే స్త్రీలు, పురుషులు చేసే సమస్త కార్యములు చేస్తున్నారని ఆమె చెప్పిందని పత్రిక పేర్కొంది. హిందూస్త్రీలు మాత్రం అజ్ఞానాంధకారంలో ఉన్నారనీ, సంస్కృతాంధ్ర, హిందీ, ఆంగ్లభాషా ప్రావీణ్యం స్త్రీలకు కావాలనీ, సంఘాభివృద్ధికై స్త్రీలు విద్యాలయాలు స్థాపించాలని చెప్పిందని పత్రిక తెలిపింది. వైశ్యస్త్రీలకు ఆభరణాలతో పాటు సమానంగా విజ్ఞానమందిరాలు ఉండి జాతినుద్ధరించి దేశసౌభాగ్యానికి తోడుగాఉండే పరిశ్రమల ఆలయాలు కావాలని, బాల్యవివాహాల వంటి సంఘ దురాచారాలు పోతేగానీ స్త్రీవిద్య అభివృద్ధి చెందదని ఆమె భావించిందని చెప్పింది. బాలవితంతువులకు వివాహస్వేచ్ఛకావాలనీ, స్త్రీలకు పఠనమందిరములు గ్రంథ భాండాగారాలు, స్త్రీవిద్యాలయాలు స్థాపించాలనీ, వారిని పోటీపరీక్షలకు పంపాలనికూడా భావించేదని తెలిపింది. ఖద్దరు వస్త్రధారణ చేస్తూ మహాత్ముని స్వాతంత్ర్య దళంలో స్వాతంత్ర్య సంపాదనకై యోధురాండ్రుగా పనిచేయాలని ఆమె భావించినట్లు పత్రిక తెలిపింది. బత్తుల కామాక్షమ్మ, ఊటుకూరి కృష్ణకుమారి, నాళం సుబ్బమ్మ, పాదుర్తి సుందరమ్మ, కొల్లా కనకతాయారమ్మ వంటి వైశ్య నారీమణులు కృషిచేస్తూ ఉన్నారనీ స్త్రీలు అందరూ కలసి తోటిస్త్రీలు అభివృద్ధి చెందటానికి పాటుపడాలని పత్రిక తెలియజేసింది.

*స్త్రీలు దేశస్వాతంత్ర్యదీక్షను వహించాలనీ, అవసరమైతే యుద్ధంలో పాల్గొనే స్థాయికి స్త్రీలు ఎదగాలని భావించింది.*

వట్టి శేషాంబ వ్రాసిన 'అతివలయాదర్శము' (ఆగష్టు 1941 గృహలక్ష్మి) అనే మరో వ్యాసంలో స్త్రీలు పాశ్చాత్యవ్యామోహంతో విచ్చలివిడితనమే సత్యమని భావిస్తున్నారనీ, స్వాతంత్ర్యము అంటే ఇంద్రియ స్వేచ్ఛా విహారమనే భ్రాంతిలో ఉండకూడదనీ, ఉన్నతాదర్శాలు గలిగి జాగరూకతతో మెలగుచూ సత్కార్యాచరణకు ధనము, న్యాయశీలత, నిష్కళంక చరిత కావలెనని భావించింది.

శరీరశిక్షణ ఆధ్యాత్మిక శిక్షణ మానవశ్రేయస్సుకు అవసరమనీ, బాలబాలికలకు భాషా, జ్ఞాన, గణిత చిత్రలేఖనాలలలో భారతనాగరికత వికాసం ఉంటుందని తెలియజేసింది. పవిత్రవర్తనచే ఆత్మగౌరవాన్ని ప్రకటించి న్యాయసమ్మతంగా సర్వవిధహక్కులను కాపాడుకోవాలనీ, విజ్ఞానమనే సౌందర్యం, నైతిక సంపద ఉండాలని భావించింది. అంతేకాక స్త్రీలు స్వతంత్రభారత వర్షోదయానికి తమ శక్తిసామర్థ్యాలను గృహపాలనయందు చూపించాలనీ, స్త్రీలు గృహయజమానులుగా ఉండి కుటుంబాన్ని ఒక శాంతినికేతనం, అనాథశరణాలయం, పారిశ్రామిక కేంద్రం, ఆరోగ్యసంస్థ, లలిత కళానిలయం, నైతికశిక్షణాలయంగాను తీర్చిదిద్ది ఆనందవనంగా మార్చితే భరతమాత దాస్యవిమోచనం చేయవచ్చని వట్టిశేషాంబ తెలియజేసింది.

*పాశ్చాత్య వేష, భాషలను అనుకరించే నాగరిక స్త్రీలకు ఆధ్యాత్మిక శిక్షణ అవసరమనీ, స్త్రీకి జ్ఞానమే సౌందర్యాన్ని యిస్తుందనీ, సత్కార్యాచరణయే స్త్రీల స్వాతంత్ర్యమని భావించింది.*

గృహలక్ష్మి పత్రిక సహాయ సంపాదకురాలుగా ఉన్న చేబ్రోలు సరస్వతీ దేవి 'స్త్రీలు-జర్నలిజం' (ఏప్రిల్ 1940 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ జర్నలిస్టుకు ధీరత్వం, నియమబద్ధత, ప్రపంచాన్ని దర్శించి చిత్రించగల నేర్పు, మేధాశక్తి ఉండాలని తెలిపింది. అవి స్త్రీలలో పుష్కలంగా ఉంటాయనీ, స్త్రీ జర్నలిస్టు అయితే సంఘాభివృద్ధికి అనువగు మార్గాలను గ్రహించగలుగుతుందనీ, స్త్రీ జర్నలిస్టులకు లౌకిక, నైతిక, ఆర్థిక, రాజకీయ విషయాలలో తగినంత ప్రబోధం అవసరమని చెప్పింది. స్త్రీలు పత్రికా సంపాదకత్వం వహించగలిగితే శిశుసంరక్షణ, ఆరోగ్యం, గృహపరిశ్రమ, దేశసేవ, సంఘసేవ వంటి విషయాలను స్త్రీలోకాలకు అందజేయగలరని తెలియజేసింది.

*స్త్రీలు జర్నలిస్టులుగా అర్హులనీ వారికి ఆర్థిక, రాజకీయవిషయాలలో శిక్షణ అవసరమని భావించింది. స్త్రీలుపత్రికారంగంలో ఉండటానికి, స్త్రీలఅభివృద్ధికి ఉన్న సంబంధాన్ని గ్రహించారు.*

ఈమెయే వ్రాసిన 'స్త్రీ వాఙ్మయం' (జూలై 1940 గృహలక్ష్మి పత్రిక) అనే మరో వ్యాసంలో ప్రస్తుత కాలంలో స్త్రీలకు గృహధర్మాన్ని, సంఘ ధర్మాన్ని, జాతి ధర్మాన్ని నిర్వహించటానికి ఆధారమైన విద్య అవసరమనీ, నదీమతల్లులగానూ, దేవతా శక్తులుగానూ, విద్యాధిదేవతగానూ స్త్రీల పేర్లే ఉంటున్నాయనీ, మునుపు మొల్ల, తరిగొండ వెంగమాంబ, ముద్దుపళని వంటి తెలుగు కవయిత్రులున్నారని తెలియజేసింది. నవయుగ వాతావరణమున పాశ్చాత్యవ్యామోహంలో భారతీయ సనాతనసంస్కృతి అడుగంటినది కానీ స్త్రీలు సంఘసేవలో పాల్గొంటూ, వాఙ్మయసేవ కూడా చేస్తున్నారనీ తెలిపింది. ఆదర్శస్త్రీల చరిత్రలకు వాఙ్మయంలో చోటు ఉండాలని భావించింది. దేశ, కాలాన్ని బట్టి పరభాష, పరవాఙ్మయం అభ్యసించినా వివేకదృష్టితో వాటి గుణగణాలను గమనించాలనీ, మాతృభాషలో సారస్వత సేవకులుగా స్త్రీల హృదయసీమలోని స్వతంత్ర శక్తి, సహజమైన ప్రజ్ఞ, ప్రతిభను వెలికితీయటానికి జాతీయవిద్యాసౌధం ఏర్పరచాలని భావించింది. జాతీయతకు, వాఙ్మయానికి సంబంధం ఉంటుంది, కాబట్టి 'స్త్రీవాఙ్మయ' నిర్మాణానికి స్త్రీలు సారస్వత

సేవకులుకావాలని పిలుపునిచ్చింది. 'స్త్రీలవాఙ్మయ నిర్మాణానికి' స్త్రీలు పూనుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసింది. అంతేకాదు, కాలపరిణామాన్ని బట్టి స్త్రీవాఙ్మయం పరిణామం చెందటానికి నేటి భారతదేశ పారతంత్ర్యపాలన, పాశ్చాత్య వ్యామోహం కారణాలైనా, స్త్రీలు అబలలుకారని ధీరగుణాఢ్యులని పేర్కొన్నది. సంఘసేవలో పురుషుల కంటే స్త్రీలు పనిచేస్తూ వాఙ్మయ సేవయందు, సాహితీరంగమున స్త్రీలు అగ్రస్థానాన్ని పొందుతున్నారనీ, ధర్మశాస్త్రముల ఆదర్శాలు సాహిత్యంలో ప్రతిఫలించాయనీ, స్త్రీచారిత్రమును నిలబెట్టాలంటే గృహధర్మ, సంఘధర్మ, జాతి ధర్మములను నిర్వహించటానికి అవసరమైన విద్య స్త్రీలకవసరమని తెలియజేసింది. దేశకాల పరిస్థితులను బట్టి వ్యవహారదక్షతకై పరభాషను, పరభాషా వాఙ్మయం చదివి జ్ఞానం గ్రహించాలనీ, విద్యావంతులు సహజప్రజ్ఞ, స్వతంత్రశక్తిని వెలువరించాలని తెలిపింది. జాతీయతకు, వాఙ్మయానికి అవినాభావ సంబంధము ఉంటుంది కాబట్టి స్త్రీలకు సంబంధించిన వాఙ్మయముగానీ, స్త్రీలచే నిర్మింపబడిన వాఙ్మయంగాని వస్తే స్వాతంత్రయుగ వాతావరణంలో భావిభారత సారస్వత సేవకులుగా స్త్రీవాఙ్మయ నిర్మాణానికి దీక్ష పట్టాలనికూడా తెలియజేసింది.

*స్త్రీలవాఙ్మయం జాతీయాభిమానాన్ని పెంచే సారస్వత స్వాతంత్ర్యసాధనమని భావించటం జరిగింది. భారతదేశ పారతంత్ర్య పాలన స్త్రీవాఙ్మయంలో పరిణామాలు తెచ్చిందనీ, స్త్రీలకోసం, స్త్రీలచేత, స్త్రీలయొక్క సాహిత్యం రావటమే స్త్రీలస్వాతంత్ర్యానికి చిహ్నంగాను, స్త్రీలు సారస్వతో పాసకులుగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాల్సిన అవసరాన్ని తెలిపింది. స్త్రీలలోని స్వతంత్ర శక్తికి, జాతీయతకు లంకె కలిగేటట్లుగా స్త్రీల వాఙ్మయ నిర్మాణం కావల్సిన అవసరం ఉందని స్పష్టమైంది.*

చేబ్రోలు సరస్వతి చేసిన 'పత్రికా రచయితలుగా స్త్రీలొనరింపగల సేవ' (డిసెంబరు 1941 గృహలక్ష్మి) అనే ప్రచురిత రేడియో ప్రసంగంలో ఎటుచూసినా సంఘసేవ, మానవసేవ, దేశసేవ అని నిరక్షరాస్యతను నిర్మూలించాలని అంటున్నారుగానీ, దీనిని సేవాతత్పరులైన స్త్రీలే చేయగలుగుతారనీ, పత్రికా నిర్వహణకు స్త్రీలు పూనుకున్నారంటే సంఘంలో ఉండే లోటుపాట్లు చక్కగా అవగాహన చేసుకొని వాటిని ఏ విధంగా సంస్కరించుకోవాలో సూచన చేయగలరని చెప్పింది. అంతేకాక, నేటి స్వాతంత్ర్య యుగంలో రేడియోలు, తంతిలేనివార్తలు అంటే వైర్లెస్, టెలిగ్రాము, వార్తాపత్రికలద్వారా వార్తలు ఏనాటి కానాడే తెలియజెప్పి, నానా విషయాలను ప్రబోధించగలగుతున్నాయనీ, చదువుసంధ్యలు లేనివారికి కూడ దేశ దేశాలనాగరికతను తెలియజేస్తాయనీ, పత్రికానిర్వహణమే గొప్పదేశసేవ అని తెలియజేసింది. ఆర్థిక, సాంఘిక సమస్యలు, స్త్రీజనోద్ధరణ, రాజకీయాలు పారిశ్రామిక సమస్యలలోని వాణిజ్య విషయాలు, గృహవైద్యం, శిశుసంరక్షణ వంటి విషయాలను స్త్రీలు ప్రబోధిస్తారనీ, పాఠకులకు చెప్పాలనుకొన్న విషయాలను కథలు, పాటలు, వ్యాసాలు, నాటికలు వంటి సాహిత్య ప్రక్రియలను వార్తా పత్రికలలో ప్రచురించి తెలియజేయవచ్చని చెప్పింది. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, దేశీయ స్త్రీలను గురించి

తెలియజేయటమే గాక, స్త్రీ పురుష స్నేహసౌభ్రాతృత్వం వంటి విషయాలను గ్రహించేటట్లు చేయాలని చెప్పింది. సంఘంలో జరుగుతున్న మార్పులను స్త్రీలు తెలుసుకుంటే జాతి ధర్మం, సంఘ ధర్మం పాటిస్తూ దేశసౌభాగ్యం గురించి ఆలోచించవచ్చనీ, స్త్రీలలో నిద్రాణమై ఉన్న శక్తులను పత్రికా రచనద్వారా మేల్కొలుప వచ్చునికూడా చేబ్రోలు సరస్వతి తెలియజేసింది.

*ఈ వ్యాసకర్త గృహలక్ష్మి పత్రికా సంపాదకురాలిగా స్వీయానుభవంతో పత్రికారంగం ద్వారా స్త్రీలు చేసే దేశసేవ గొప్పదని భావించింది.*

ఆదిలక్ష్మి, వేంకటరత్నసోదరీమణులు కలిసి వ్రాసిన 'పల్లెటూళ్ళ సాంఘిక దుస్థితి' (జూలై 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో పట్టణాలవలెగాక పల్లెలో కులకట్టుబాట్లు కఠినమనీ, గ్రామాలలో స్త్రీ విద్య శూన్యమనీ, భర్తకు ఉత్తరాన్ని వ్రాయగల ప్రాథమికవిద్య అబ్బితే చాలని భావిస్తున్నారనీ, బాలవితంతువులకు చదువుచెప్పించి వారిస్థితిని బాగుచేయాలని తెలియజేసింది. అంతేకాదు స్త్రీలు కత్తుల బోనులో కాపురం చేస్తున్నారనీ, బాలవితంతువులు మూఢాచారాలకు బలిఅవుతున్నారనీ, ఆచారాలపట్ల పల్లెటూరి స్త్రీలకు పట్టుదల ఎక్కువనీ, పల్లెలో అవినీతి దురాచారాలను వదిలించి స్త్రీలకు యభివృద్ధి మార్గమును చూపిస్తేనే సంఘజీవితం బాగవుతుందని భావించారు. పట్టణాలలో మహిళాసభలు, గ్రంథాలయాలు పట్టణస్త్రీల పురోభివృద్ధికేగానీ అవి పల్లెలలో లేకపోవటంతో స్త్రీలు అభివృద్ధి చెందటంలేదనీ, పల్లెలలో మహిళా సంఘాలు స్థాపించి అనాథస్త్రీలను, నిరక్షరవనితా లోకాన్ని ఉద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

*పల్లెల్లో స్త్రీల అభివృద్ధికి మహిళాసమాజాలను స్థాపించాల్సిన అవసరాన్ని తెలియజేసింది.*

దేవులపల్లి వేంకటరత్నమ్మ 'దేవదాసి' (జులై 1940 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ ప్రభుత్వం దేవాలయాలలోంచి దేవదాసీలను తరిమివేయటంతో హిందూసంఘములో వారు 'గణికలు-వేశ్యలు'గా పిలవబడుతున్నారనీ, కొంతమంది మాత్రమే గాన, నాట్య కళోపాస కులుగానున్నారనీ, మిగిలినవారు వ్యభిచారాన్ని వృత్తిగా చేసుకొని ధనసంపాదన చేస్తున్నారని తెలిపింది. ఆ కులంలో పుట్టిన బాలికలు బాధపడుతున్నారనీ, దీనికి తరుణోపాయంగా వారికి విద్యనేర్పితే భారతదేశ సౌభాగ్యానికి ఎంతగానో ఉపయోగపడతారనీ, అదే వారికి గౌరవస్థానం అనీ, భారతమాత దాస్యాన్ని తొలగించగలరని తెలియజేసింది.

*వేశ్యల బిడ్డలను చదివించితే తరువాతి తరమన్నా సమాజంలో భాగస్వాములై భారతమాత సేవకు ఉపయోగపడతారని భావించింది.*

వల్లభనేని రంగాదేవి వ్రాసిన 'సర్వోదయం-సామ్యవాదం' (జులై 1940 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో విశ్వమానవ కల్యాణానికి అహింస ఆచరణీయమని, ఉజ్జ్వలమైన రాజకీయ నైతిక జీవనాన్ని ప్రాతిపదిక చేసుకుంటే సర్వోదయం సిద్ధిస్తుందనీ, అదే గాంధీ అభిప్రాయమని తెలియజేసింది. కాని మరొక వైపు అశాంతి, హాహాకారాల్ని రూపుమాపాలంటే సామ్యవాదం ముఖ్యం

అనీ కార్లమాక్స్ కమ్యూనిజంలో వర్గరహిత సమాజం ఏర్పడితే సర్వ మానవ హక్కులు, సర్వమానవ సమానత్వం సిద్ధిస్తుందనే దృక్పథాల్ని రచయిత్రి తెలియజేసింది. అందుకే ఉత్పత్తి సాధనాలమీద వ్యకిగత అధికారం తొలగాలనేది సామ్యవాదం అనీ, దానివల్ల ఆదర్శ సంఘం ఏర్పడుతుందని భావించింది. వ్యక్తిగత సాంఘిక జీవితంలో అహింసకు సర్వోన్నత స్థానం ఇచ్చి ఇతరులను తన సత్ప్రవర్తన వల్ల సద్భావంతో కూడిన ప్రేమతోనూ, సహనంతోనూ తమకు అనుకూలంగా చేసికో గలిగేది సర్వోదయం అని చెప్పింది. దీనిలో హింసకు తావులేదనీ చెప్తూనే అహింసా సంగ్రామం ఏళ్ళ తరబడి సాగుతుందనీ, వెంటనే విముక్తి కావాలంటే మాత్రం హింసామార్గం అవసరం అవుతుంది కాబట్టి సామ్య-సర్వోదయ వాదాలు కలిస్తే బాగుంటుందని తెలియజేసింది.

*నాటి కాంగ్రెస్, కమ్యూనిస్టువాదాల మధ్య స్వాతంత్ర్యోద్యమ సమన్వయం చేయటానికి రచయిత్రి ప్రయత్నించింది.*

*ప్రపంచ పరిణామాల్లో భారతదేశ పరిస్థితులను పోల్చిచూసుకుంటూ 'ఇజాలలోని' నిజాలను ఆలోచించమంటూ రచయిత్రి సిద్ధాంతాలను పర్యాలోచన చేయటమే స్త్రీల రాజకీయార్థిక పరిజ్ఞానానికి నిదర్శనం. అంతేకాదు మితవాదులు అతివాదుల భావాలు కలిస్తేనే స్వాతంత్ర్యం సిద్ధించగలదనే భావన వ్యక్తం చేసింది.*

ఆచంట సత్యవత్మమ్మ 'శారదా చట్టము- యువకుల బాధ్యత' (ఆగస్టు 1940 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ కన్యల భావిసౌఖ్యం కోసం బాలికల అనుకూల దాంపత్యం కొరకు శారదాచట్టం వచ్చిందనీ, విద్యావతియైన తరువాత పెళ్ళిచేద్దామంటే వరకట్నాలు ఎక్కువై అమ్మాయిలను కన్న తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపింది. వరకట్నాలు యివ్వలేక వృద్ధుడికిచ్చి పెళ్ళిచేస్తున్నారనీ, భార్యావియోగం చెంది నలుబది సంవత్సరాలు దాటినవ్యక్తిని ద్వితీయ వివాహం చేసుకోకూడదనీ, అలాచేస్తే దేశసౌభాగ్యం నిలబడదనీ తెలియజేసింది.

*స్త్రీల విద్యాభివృద్ధి జరిగిందనీ, బాల్యవివాహాలను నిషేధిస్తుంటే మరొకప్రక్క వరకట్న బాధలు వచ్చాయని తెలిపింది. ఏదోరకంగా వైవాహిక సంస్కృతి స్త్రీల జీవితాలకు ఇబ్బందులు కలిగిస్తోందని అర్థం అవుతుంది.*

ఈమెయే వ్రాసిన 'స్త్రీకిస్వాతంత్ర్య మెంతవరకు'(మార్చి 1941 గృహలక్ష్మి) అనే మరో వ్యాసంలో ఎంత విద్యావతియైనను, బలశాలియైనను స్త్రీకి పురుషసమాన స్వేచ్ఛ ముప్పు తెస్తుందనీ, జాతీయవిద్యావిధానమైన సనాతన ధర్మాచారాలననుసరించిన స్వేచ్ఛాజీవితమే గృహిణికి ముఖ్యమనీ భావించింది.

*రచయిత్రికి జాతీయవిద్యమీద ఉన్న అభిమానంతోపాటు ఆధునిక వేషభాషలుగల విద్యావంతులైన స్త్రీలపైన ఉన్న అపోహ కూడా అర్థమవుతుంది.*

'బ్రతుకు తెరువు' (జులై 1947 గృహలక్ష్మి) అనే శీర్షికన ఈమె వ్రాస్తూ ఆంధ్రస్త్రీలకు సలహాలనిస్తూ బ్రతుకు తెరువుకై స్త్రీలు చేతిపనులు నేర్చుకోవాలనీ, కుట్లు, అల్లికలు, బుట్టలు,

పళ్ళెములు తయారుచేయుట నేర్చుకోవాలని తెలిపింది. స్త్రీలు రచనలద్వారా, సమాజాల ద్వారా నేర్చుకోవాలనీ స్త్రీలకు బద్ధకం తగ్గాలనీ, దౌర్బల్యం పోవాలనీ, నామోషీ ఉండకూడదనీ, దోసగింజలు వలుచుటలోనూ, విస్తళ్ళు కుట్టుటలోనూ ఆరితేరిన స్త్రీలున్నారనీ, స్త్రీలు గృహకృత్యము లలో కాలాన్ని గడుపుతున్నారనీ, తినుబండారాలు తయారుచేసుకొని, ఒకరికిచ్చే సరుకు లాభమును మిగుల్చుకోవచ్చని ఆంధ్రస్త్రీలకు ఆచంట సత్యవతమ్మ సలహా నిచ్చింది.

*భారతదేశంలో స్వాతంత్ర్య ప్రకటన చేసిన తర్వాత ఆంధ్రస్త్రీలు భారతదేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవ్వాలని స్త్రీసమాజాలలో అవసరమైన స్థాయిలో ఆంధ్ర స్త్రీలు తమ శక్తియుక్తులను నిరంతరంగా వినియోగించాలని చైతన్యపరిచే రచన ఇది.*

'కార్యశూర కమలాదేవి' అనే (ఆగష్టు 1940లో గృహలక్ష్మి) శీర్షికన పత్రికాధిపుల ప్రచురణలో దేశసేవిక (వేదాంతం) కమలాదేవి మరణించిన సందర్భంలో ఆమెను గురించి తెలియజేస్తూ వేదాంతం కమలాదేవి డాక్టరైన భర్తతో ఆమె కలకత్తాలో ఉన్నప్పుడే మత, సాంఘిక రాజకీయ ఉద్యమంలో పాల్గొంటూ సేవచేస్తూ పరిజ్ఞానాన్ని సంపాదించిందని తెలిపింది. అంతేకాక ఆమె కాకినాడలో వైద్యపరమైన కేసులలో భర్తకు సహాయభూతురాలుగా ఉంటూనే అనాథ బిడ్డలను ఇంటికి తీసుకొనివచ్చి తల్లిలా చూచి విద్యాబుద్ధులు నేర్పించిందనీ, తనబిడ్డలతోపాటు అనాథశిశు వులను సమానంగా చూడటం ఈమె నింతర ప్రక్రియ అని తెలియజేసింది. 1921లో ఈమె రాజకీయ జీవితం ప్రారంభమై 1923 లో కాకినాడ కాంగ్రెస్ లో కార్యదర్శిగా ఉండి ఖద్దరు ప్రచారాన్నిచేస్తూ తిలక్ స్వరాజ్యనిధికి నిధులను ప్రోగుచేసిందనీ పత్రిక తెలియజేసింది. అంతేకాదు, 1931లో గుంటూరులో ఆంక్షలున్నా అఖిలభారత మహాసభను నిర్వహించిన యోధురాలనీ, ఆ సభలో ఉపన్యసించినందుకు ఆర్నెల్ల జైలు శిక్షను అనుభవించిందనీ, గుంటూరులో కాంగ్రెసు సభను నిర్వహించినందుకు వేదాంతం కమలాదేవిని అరెస్టుచేసి పోలీసుజీపులో ఎక్కించి తీసుకొని వెడుతున్నప్పుడు ఆమె మూడేళ్ళ కూతురు వెంటబడి ఏడ్చినా పోలీసులు కనికరించలేదని తెలిపింది. దత్తమండలాలలో జనరల్ ఎలక్షన్స్ లో కాంగ్రెస్ విజయానికి కృషిచేసిందని కూడా తెలియజేసింది. ఇంట్లో హరిజనులను పనికి పెట్టుకొని మొక్కలను పెంచేదనీ, కాకినాడలో మూడుసార్లు మున్సిపల్ కౌన్సిలర్ గా పరిపాలనా దక్షతను చూపించుకొందనీ, 43 సంవత్సరముల వయస్సులో చనిపోయిందని పత్రిక తెలియజేసింది.

గుమ్మడిదల దుర్గాబాయమ్మ, పొణకాకనకమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ ఈమెను గురించిన స్మారకోపన్యాసాలలో ఈమె సేవలను స్తుతించారనీ, దుర్గాబాయమ్మ ప్రసంగిస్తూ కమలాదేవి మృతజీవి అనీ, ప్రజాసేవలో పరమార్థంపొందిన జీవయాత్ర ఆమెదని తెలియజేసింది. 'అచ్చెరువు గొలిపే శౌర్యసాహసాలు' ఆమె సొంతమని ధైర్యస్థైర్యాలు, నిర్మాణ కార్యదీక్ష, కళాప్రాభవము, రాజకీయ చైతన్యం, సాంఘికనిర్మాణదక్షత ఒకేచోట ఉన్న నారీమణి అనీ, ఆంధ్రులవీరమాత అనీ, వీరపూజకు అర్హురాలనీ, ఒక వీర 'మహిళా సిపాయి' ని గౌరవిస్తే భారతదేశాన్ని గౌరవించటమేననీ వారంతా చెప్పారని పత్రిక తెలియజేసింది.

పొణకా కనకమ్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ విజృంభణము, శాసనోల్లంఘనము ఉప్పుసత్యాగ్రహము, లాఠీచార్జీలు, కారాగృహాలు వంటి సందర్భాలలో విక్రమించి వీరవిహారం చేసిన కమలాదేవియొక్క దేశసేవాసక్తి విస్మృతం కానిదనీ, సంతానంతో సమానంగా అనాథశిశువులను పెంచి, హరిజనసేవచేసి సాంఘికంగా పేరుపొందటమే కాక దేశసేవలో పరమార్థాలెన్నో పొందిందని తెలియజేసింది.

ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ కమలాదేవి మరణానికి పరితపిస్తూ ఆమె దేశసేవాపరత, కార్యదీక్ష గొప్పదనీ మహాత్ముని పిలుపు వినగానే వెంటనే వెళ్ళి ఉద్యమంలో శౌర్యసాహసాలు చూపించేదనీ, సంఘాన్ని దేశాన్ని కుటుంబంగా చేసుకున్న విశ్వజీవి అనీ, దేశారాధనలో శరీరం అర్పించిన ధన్యజీవి అనీ ఆమె దేశభక్తుల హృదయంలో యదార్థస్మృతికి నిత్యజీవంగా ఉంటుందని తెలియచేసింది.

కళ్ళేపల్లె వెంకటరమణమ్మ (సెప్టెంబరు 1940 గృహలక్ష్మి) ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ 1864లో పుట్టిన ఆమె వివాహానంతరం భర్తదగ్గర విద్యనేర్చి పిల్లల పోషణ చూసుకుంటూనే తీరికచేసుకొని పత్రికలకు వ్యాసాలు వ్రాసేదని తెలిపింది. కాకినాడలోని 'స్త్రీ విద్యాభివర్థనీ', 'సమాజానికి అధ్యక్షురాలిగానూ, హిందూసుందరి పత్రికా సంపాదకత్వాన్ని వహించి స్త్రీవిద్యాభ్యుదయానికి కృషిచేసిందనీ, బరంపురంలో 'ఆంధ్రలక్ష్మి' పత్రికను పెట్టి స్త్రీ జనోద్ధరణకై విశేషంగా కృషిచేసిన ఆమె 1935లో చనిపోయిందని పత్రిక తెలియజేసింది.

కనకదేశగుప్త చేసిన ఉపన్యాసానికి అనువాదంగా 'స్త్రీవిద్యార్థి సంఘములెందుకు' అనే శీర్షికన ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘం (అక్టోబరు 1940 గృహలక్ష్మి) వారు తెలియజేస్తూ దేశీయోద్యమంలో విద్యార్థి సంఘాలు ఉపాంగాలనీ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ మనోదాస్యాల నుండి రక్షించే విధంగా విద్యావిధానం ఉండటంలేదనీ, పైపెచ్చు విద్యార్థినుల ప్రత్యేక సమస్యలను విద్యార్థి సంఘాలు ఆలోచించటంలేదు కాబట్టి స్త్రీల విద్యార్థినీ సంఘాలు ఉండాలని భావించిందని విద్యార్థి సంఘం తెలియజేసింది. అంతేకాక, బాలికలకు తగినన్ని విద్యాలయాలు గ్రామాలలో కూడా ఉండాలనీ, దూరగ్రామాల నుండి వచ్చి విశ్వవిద్యాలయాల్లో చదివే స్త్రీలకు వసతి గృహాలుండాలనీ, జాతులవారీగా విద్యాలయాలు పెడితే వివక్షతలు, భేదాలు ఏర్పడితే దేశాభ్యుదయానికి భంగకరమని భావించిందని విద్యార్థి సంఘం తెలిపింది. స్త్రీవిద్యార్థులకు సమాజంలో గౌరవంలేదనీ, వారసత్వపు హక్కు యువకులతోపాటు యువతులకు సమానంగా ఉండాలనీ, స్త్రీలకు ప్రత్యేక ఆటస్థలాలుండాలనీ, ప్రతివిద్యాలయంలో ప్రాథమిక సంఘాలు ఉండాలనీ, పఠనబృందాలు, వాగ్వాద సభలు జరగాలని భావించిందనీ విద్యార్థి సంఘం తెలిపింది. విద్యార్థినులు స్వాతంత్ర్యం కోసం లాఠీదెబ్బలు తిని జైళ్ళకుపోవాలని భావించవద్దనీ, వారి సమస్యలు విద్యార్థి సంఘాలలో చర్చించు కొనే సావకాశం కల్పిస్తే చాలనీ, వారే సంఘంలోని స్వార్థపరులనోళ్ళను కట్టేస్తారనీ ఆమె చెప్పిందని విద్యార్థిసంఘం తెలియజేసింది.

*ఆ నాడే స్త్రీవిద్యార్థినీ సంఘాల ఉనికి అవసరమనీ, విద్యార్థినులసమస్యలను గుర్తించి పరిష్కార సూచన చేస్తూనే విద్యార్థిసంఘాల బాధ్యతలను కూడా తెలియజేసిన వ్యాసమిది.*

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మహిమోపేతుడు మహాత్ముడు' (అక్టోబరు 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో గాంధి అక్టోబరు రెండవతేదీన భారతీయుల భాగ్యసర్వస్వంగా జన్మించాడనీ, భారతభూమి విదేశీయ పరిపాలనా పీడితయై పారతంత్ర్యపాలనా శృంఖాలాలున్న సమయంలో జన్మించాడని సత్యము, త్యాగనిరతి, బుద్ధివైశద్యం, దేశాభిమానం, ఋజువర్తనం నిరాడంబర జీవితం, అహింసాతత్వం వంటి గుణాలతో అతడు అవతరించినవాడని తెలియజేసింది. అంతేకాదు, పశుబలంతో దుష్టశిక్షణ చేసిన రాముడు, ఋజుగామికాని కృష్ణుడు, ఈశ్వర విశ్వాసి కాని బుద్ధుడు మొదలగు వారికంటె గాంధియే గొప్పవాడనీ, ఆ ముగ్గురిలోని, సత్యశీలత, కార్యదీక్ష, అహింసా తత్వాలవంటి గొప్పలక్షణాలను కలిపి నింపుకున్న అవతారపురుషుడని భావించింది. అహింసతో స్వరాజ్యసిద్ధి కలగాలని భావించటంతో అహింసతో స్వాతంత్ర్యాన్ని తెచ్చినా, దేశరక్షణ చేయలేమనే హింసావాదులతో గాంధి అంగీకరించలేదని తెలియజేసింది. అహింసాతత్వమే దేశానికి శ్రీరామరక్ష అనీ భావించాడనీ, కాని కాంగ్రెసు వాదులలోని అభిప్రాయభేదాలు, మతభేదాలను గ్రహించి బ్రిటీష్ వారు స్వరాజ్యం ఇవ్వమని చెప్పినా గాంధి అహింసనే నమ్ముకొన్నాడని భావించింది. పశ్చిమ ఖండాలవారు హింస ద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించారు గాని గాంధి మాత్రం స్వరాజ్యం కోసం అహింసా శంఖాన్ని ఊదాడనీ, ధర్మోపదేశం చేస్తున్న గాంధీ మానవ మాత్రుడు కాడని మహిమోన్నతుడని తెలియజేసింది.

'భారత మహిళామండలి, బెజవాడ' (మే 1941 గృహలక్ష్మి) సభలో కనుపర్తి వరలక్ష్మమ్మ చేసిన ఉపన్యాసంలో 1929 లో బెజవాడలో ఆంధ్రమహిళాసభ జరిగినప్పుడు మునుపుతాను ఉపన్యసించినట్టును, తెలుగు సీమలో స్త్రీసమాజాలు ఉద్భవించి 30 సంవత్సరాలు దాటినా తగిన అభివృద్ధి పొందలేదని చెప్పింది. భక్తురాండ్రుగా, ఇల్లు వెడలిన సాధ్వీలుగా, సినిమాలకు వెళ్ళటానికి వీలుకల్పిస్తూ స్త్రీలవిషయంలో ఆంక్షలను తొలగించారు గానీ, స్త్రీసమాజాలకు రావటానికి మాత్రం నిషేధాన్ని ఉంచారనీ, పురాణాలు చెప్పే పురుషులు స్త్రీలను గురించి తక్కువగా మాట్లాడుతున్నా అటువంటి విషయాలను స్త్రీలు పట్టించుకోవటంలేదని తెలియజేసింది. లోకోపకారమైన సేవాధర్మాల పరమార్థాన్ని పొందాలనీ, యుగయుగాలుగా వెంటాడివస్తున్న అజ్ఞానాన్ని, బానిసత్వాన్ని, ఆర్థిక దారిద్ర్యాన్ని సంఘశక్తి ద్వారా నివారింపచేసుకోవాలనీ, స్త్రీల హక్కులు, అధికారాలు, బాధ్యతలను స్త్రీసమాజాల ద్వారానే సాధించుకోవాలని చెప్పింది. విద్యాలక్ష్యం, క్రీడాలక్ష్యం కూడా స్త్రీలకు అవసరాలనీ, స్త్రీలు బీదలకు, వ్యాధిగ్రస్తులకు వైద్యము, చూలింతలకు అవసరమైన సేవను రెడ్ క్రాసు సొసైటీ ద్వారా చేయవచ్చని తెలిపింది. స్త్రీసమాజాలన్ని ఒక గొడుగు క్రిందకు వచ్చి స్త్రీల సమస్యలను పరిష్కరించుకోవాలనీ, ఐరోపాలో స్త్రీలు తాము భర్తలతోపాటు సమానంగా యుద్ధంలో పాల్గొంటారనీ, మనదేశంలో ఆయుధయుద్ధం లేకపోయినా స్త్రీలు కనీసం శాంతి సంగ్రామంలోనైనా

పాల్గొని గాంధీ సూచితమైన ఆర్థికోపద్రవమును తొలగించగల నూలువడకుట, గృహపరిశ్రమలు చేయటం వంటివి చేసి మాతృదేశ ఋణం తీర్చుకోవచ్చని కూడా తెలియచేసింది.

కనుపర్తి వరలక్ష్మమ్మ 'మనసులో మాటలు' (జూన్ 1941 గృహలక్ష్మి) అంటూ వ్రాస్తూ 1937 వ సంవత్సరపు హిందూ స్త్రీల వారసత్వపు చట్టం గురించి అవగాహన కల్పిస్తూ స్త్రీలకు ఉపయోగకరమైన ఏ బిల్లును శాసనసభలో పెట్టినా అందులోనూ ఆస్తిహక్కుకు సంబంధించినది అయినచో ఏకాభిప్రాయంతో వ్యతిరేకిస్తారనీ, స్త్రీలను అణగద్రొక్కి వారికి తమతోబాటు సమానవాటా ఇవ్వటానికి పురుష శాసనసభ్యులు ఒప్పుకోరని తెలియజేసింది. విగతభర్తృకకు కొడుకులు చందాలు వేసుకొని మనోవర్తి ఇవ్వటం చాలా బాధాకరమనీ, కానీ 1934 లో విగతభర్తృకలకు హిందూస్త్రీల వారసత్వం చట్టాన్ని ఒప్పుకొన్నా దానికి అవాంతరం కల్గిస్తూ కేంద్రప్రభుత్వం వారసత్వానికి సంబంధించి వ్యవసాయ భూములు 1935 ఇండియా చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉంటాయి కాబట్టి వాటిని తప్పించి హక్కులిచ్చిందని తెలిపింది. వ్యవసాయ భూములే ఆస్తిగా ఉండేచోట ఆ వ్యవసాయ భూములివ్వనపుడు విగతభర్తృకలకు హిందూ స్త్రీలవారసత్వ చట్టం అనుపయోగమని భావించింది. వ్యవసాయభూములు వారసత్వంగా రావటానికి వీలుగా స్త్రీలు రాష్ట్రప్రభుత్వాన్ని అడగాలనీ, అవసరమైతే ఆవిషయంలో పోరాడాలని పిలుపునిచ్చింది.

ఈమెయే వ్రాసిన 'స్త్రీల వేసంగి పాఠశాల' (సెప్టెంబరు 1941 గృహలక్ష్మి) అనే ఇంకొక వ్యాసంలో విద్య, ఆరోగ్యం, వైద్యం, రాజకీయం, సాంఘిక సహకారంవంటి గ్రామపునర్నిర్మాణానికి సంబంధించిన అవసరమైన విషయాలను తెలియజేయాలంటే యువకులకు వేసంగి పాఠశాలలను పెట్టినట్లే ప్రతిగ్రామంలో స్త్రీలకు కూడా ప్రత్యేకమైన వేసంగి పాఠశాలను (వేసవికాలంలో) గ్రామాలలో ఏర్పాటు చేయాలని భావించింది. బాపట్లలో ఏర్పడిన స్త్రీహితైషిణి ఏర్పాటు చేసినటువంటి వేసంగి పాఠశాలలు పట్టణాలలో ఉన్నాయనీ, అనుభవజ్ఞుల చేత వారికి పారిశ్రామిక విద్యలను కూడా నేర్పాలని తెలియజేసింది. రోజువారి పనితో పాఠశాలలో చేరి చదువుకునే వీలులేని స్త్రీలకు ఇటువంటి వేసంగి పాఠశాలలు బాగా ఉపయోగపడ్తాయనీ, తద్వారా వారిలో విజ్ఞానం పెరిగి, ఆర్థికస్థితిని కూడా పెంచుకోగలిగితే స్త్రీలకొక స్వతంత్ర జీవనవిధానం ఏర్పడుతుందనీ అదే దేశస్వాతంత్ర్యంలో భాగమవుతుందని తెలియజేసింది.

1941సం. డిశంబరు చివరివారంలో కాకినాడలో ప్రారంభిస్తున్న అఖిలభారత మహిళాసభ (డిసెంబరు 1941 గృహలక్ష్మి) ను గురించి ఆలోచిస్తూ కనుపర్తి వరలక్ష్మమ్మ 1923 లో ఇదే కాకినాడలో క్రితంసారి జరిగిన సమావేశానికి తాను వెళ్ళినప్పటి సభావిశేషాలను స్మరించుకుంటూ ఆనాటి తీర్మానాలను గుర్తుకు తెచ్చుకుంది. నాడు జరగబోయే సభకు దేశం నలుమూల నుండి వేలకొలది స్త్రీలు వస్తున్నారనీ, సభలోని చర్చనీయాంశములుగా స్త్రీ విద్యావిధానంలో స్త్రీలకు అనుకూలంగా మార్పులు జరగాలనీ, స్త్రీల ప్రత్యేక కళాశాలలో పారిశ్రామిక పాఠశాలలు ఉండాలనీ, రాజకీయములలో సంపూర్ణ ప్రాతినిధ్యం స్త్రీలకుండాలని చర్చకు పెడుతున్నారని తెలిపింది.

ఉభయ వంశముల వారసత్వం కావాలనీ, వివాహవయస్సు పెంచాలనీ, దాయాదుల అనుమతి అవసరం లేకుండానే స్త్రీలకు దత్తాధికారం ఉండాలనీ, మహిళా సంఘాలకు స్త్రీ వోటరులను చేర్చు అధికారమివ్వాలనీ, కట్నాల దురాచారం పోవాలనీ, ఆసుపత్రులు, విద్యాలయాలు, రైల్వేస్టేషనులో, స్థానికసంఘములో స్త్రీలకు కలుగుచున్న అసౌకర్యాలను చర్చించి తీర్మానములు చెయ్యాలను కుంటున్నారని తెలియజేసింది. నాడు జరగబోయే అఖిలభారత మహాసభకు నెహ్రూ చెల్లెలును, చెఱసాలకు వెళ్ళిన క్రమశిక్షకురాలును ఐన విజయలక్ష్మిపండిట్ ఆధిపత్యమున సరోజనీనాయుడు, కమలాదేవి ఛటోపాధ్యాయ, లీలావతి మున్షీ, రాజకుమారి అమృతకౌర్, ముత్తులక్ష్మీరెడ్డి, ఆచంట రుక్మిణమ్మ, అమ్ముస్వామినాథన్, షానవాజబేగమ్, కజిన్సుసతి మొదలగు నారీరత్నములు తీర్మానాలన్నింటినీ చర్చకు పెడ్తున్నారని ఆంధ్రనారీమణులు తీర్థయాత్రగా భావించి ఆ సభలకు వెళ్ళాలని తెలియజేసింది.

గుంటూరులో జరిగిన 'ఆంధ్ర రాష్ట్ర మహిళాసభ'లో (నవంబరు 1944 హిందూ సుందరి) కనుపర్తి వరలక్ష్మమ్మ చేసిన ఉపన్యాసంలో గాంధి దేశస్వాస్థ్యం కోసం, భారతసమస్యాపరిష్కారం కోసం హిందూ మహమ్మదీయ సామరస్యం కోసం, వివిధ ప్రయత్నాలు చేస్తున్నారనీ, అవి విఫలమవటంతో నిరాహార దీక్షయే మార్గాంతరమని గాంధి భావించటం భారతమహిళల దురదృష్టమని తెలియచేసింది. అంతేకాదు, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వంలో 1941-42, 1943-44 లెక్కలను బట్టి స్త్రీల విద్యాభివృద్ధి తగ్గిపోతోందనీ, 1941-42లో ప్రాథమిక బాలికాపాఠశాలలు 4502 నుండి 4492 కును విద్యార్థినులు 184979 సంఖ్య నుండి 120842 సంఖ్యకి తగ్గిపోయారనీ, కానీ కళాశాల విద్యార్థినులు 871 నుండి 976 పెరిగినట్లు గాను తెలియచేసింది. బాలికల విద్యాభివృద్ధియే గాక వయోజన విద్యావ్యాప్తికూడా జరిగితేనే బిడ్డల చదువు విషయంలో తల్లికి శ్రద్ధ పెరిగి బాలికా విద్యాభివృద్ధి జరుగుతుందని భావించింది. నూతన విద్యాప్రణాళికలో భాగంగా బాలబాలికలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టి, స్త్రీ ఉపాధ్యాయినులును ఎక్కువగా నియమించాలని, నర్సరీ పాఠశాలలో స్త్రీలకే యెక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పింది. ఉన్నత పాఠశాల లోని విద్యార్థినులకు గృహనిర్వాహకత్వం కూడా నేర్పాలనీ, జీవనోపాధికి అనువైన వృత్తి విద్యలు నేర్పిస్తే స్త్రీలలో స్వయంపోషకత్వం పెరుగుతుంది కాబట్టి మహాళాసంఘాలు కూడా నూతన విద్యావిధానానికి తగిన సహకారాన్ని అందించాలని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

*స్త్రీల ఆస్తిహక్కు చట్టాలలోని లోపాలను ఎత్తి చూపించింది. పల్లెలో సాగుపనిలేని వేసవి కాలంలో పాఠశాలలను నడిపితే పల్లెస్త్రీలలో విద్యాభివృద్ధి ఉంటుందని భావించింది. నాడే వయోజన విద్యను గురించిన ప్రతిపాదన చేయటం ఆశ్చర్యకరం. 1941 సంవత్సరం డిసెంబరు చివరివారంలో కాకినాడలో ప్రారంభించిన 'అఖిలభారత మహిళాసభ'లో స్త్రీల ఆస్తిహక్కు చట్టాలలోని లోపాలను ఎత్తి చూపించింది. దేశానికి సంపూర్ణస్వాతంత్ర్యం అవసరమనీ, స్త్రీలకు రాజకీయాలలో సంపూర్ణప్రాతినిధ్యం ఉండాలనీ, పారిశ్రామికవిద్యలను స్త్రీలు పొందాలని, అన్ని*

*విషయాలలో స్త్రీలస్వాతంత్ర్యాన్ని చర్చించాలనుకోవటం ఆమె భావనగా అర్థమవుతుంది. హిందూమహమ్మదీయుల సఖ్యత భారతదేశ సమస్యకు పరిష్కారమని భావించింది. స్త్రీసమాజాల ఏర్పాటు స్థాయినుండి స్త్రీలు ప్రాంతీయ, రాష్ట, జాతీయస్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసుకొనే స్థాయికి చేరుకోవటమే స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యానికి నిదర్శనంగా భావించాలి.*

"వెలగపూడి సరస్వతమ్మ" (జనవరి 1944 భారతి) ను గురించి ఈమె వ్రాస్తూ తాను బాపట్లలో ఒక స్త్రీసమాజాన్ని స్థాపిస్తానంటే సరస్వతమ్మ సలహాయిస్తూ యువతులు చదువుకోవటానికి వీలైన స్కూళ్ళు పెడుతామనీ చెప్పిందనీ, తాను నెలకొల్పిన 'స్త్రీహితైషిణీ మండలి'కి ధన సహాయం చేయటమేగాక సభ్యురాలిగా ఉన్నదని తెలిపింది. 1932వ సం.లో స్వీయ యాజమాన్యంలో 'యువతీ విద్యాలయము'ను స్థాపించిందనీ, తర్వాత అది హైయర్ గ్రేడ్ ట్రైనింగ్ స్కూలైందనీ, చక్కని వసతిగృహం ఉండటంచేత తండోపతండాలుగా విద్యార్థినులు అందులో ప్రవేశం పొందుతున్నారనీ, తత్ఫలితంగానే స్త్రీలు చదువుకొని స్వతంత్ర జీవనం చేయగలిగిన వారయ్యారనీ తెలిపింది. తన నలుగురు కుమార్తెలను ఆమె చదివించగలిగిందనీ 1892లో జన్మించిన ఈమెయే ఐదవఫారం వరకూ చదువుకోగలిగిందనీ, భర్త లాయరు వృత్తిలో ఉండటంతో న్యాయశాస్త్ర పుస్తకాలు కూడా చదువుకునేదనీ, ఈమె అత్తవారింట్లో వారు కూడా స్త్రీ విద్యాసంస్థలు నడిపేవారని తెలిపింది. ఈమె ఆడబడుచుయే చోరగుడి సీతమ్మ అనీ, వీరిది అన్యోన్య దాంపత్యం అనీ, సంఘసంస్కార విషయాలలో వరకట్నాలు కూడదనీ, హరిజనోద్ధరణ అవసరమనీ, వివాహ వయస్సు హెచ్చించాలనే మాటలను చేతల్లో చూపించాలని చెప్పారనీ, వెలగపూడి సరస్వతమ్మను గురించి కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేయటం జరిగింది.

బూరుగుల రుక్మిణీబాయి వ్రాసిన 'విద్యా స్వరూపము ఆదర్శమునకు నైతికవిచ్ఛితి' (అక్టోబరు 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో విద్యార్థియొక్క మెదడునుండి ఉత్పత్తి అయిన జీవితాదర్శమునందు ఐక్యత చెడిపోయిందనీ, స్త్రీ, పురుష ధర్మమనే సాంప్రదాయ విచ్ఛితి కలిగిందనీ, ప్రాచ్య, పాశ్చాత్య సంఘటనముల వలన దాస్యస్వాతంత్ర్యపోరాటం ఏర్పడిందనీ, ఆధునికకాలంలో భారతీయులు బానిసలని తెలియజేసింది. అంతేకాదు విద్యార్థి బ్రహ్మచర్యంతో సాధింపదగిన రాజకీయ, నైతిక, ఆర్థికశక్తి కుంటుపడటంతో సంపూర్ణస్వాతంత్ర్య సంగ్రామంలో విజయం సాధించలేక పోతున్నారనీ, వ్యవహారంలో రాజభక్తి, కోరికలో ప్రజాస్వాతంత్ర్యపు ప్రబోధం పరస్పరవిరుద్ధంగా ఉన్నాయనీ తెలిపింది. నేడు సోషలిజం, కమ్యూనిజంతో స్వాతంత్ర్యం సంపాదించుకోవాలను కుంటున్నారు గానీ, ఆ రెండిటినీ వేదాలే బోధించాయని భావించింది. ఉపాధ్యాయవృత్తి మరియు వివిధ వృత్తులను దేశ, దేహ ప్రవృత్తులకునూ, మత, సాంఘిక, సాంప్రదాయాలకు ఐక్యత ఉండాలనీ, మతానికి వృత్తికి అభేదంకలిగి గృహోపకరణాలను తయారుచేసుకుంటే దేశఆర్థికపరిస్థితి బాగుండి దేశభవితవ్యాన్ని సిద్ధింపజేయటం జరుగుతుందని కూడా తెలియజేసింది.

*సమాజం యొక్క కుహనాతత్వాన్ని, ద్విముఖాలను, అనైతికతను బయటపెట్టిన వ్యాసమిది. మెదడు విచ్చిపోవటంచేతనే స్త్రీపురుషవివక్షా సంస్కతి ఏర్పడిందని భావించింది. బ్రిటిష్ వారికి భారతీయులు విధేయులుగా ఉన్నంతకాలం స్వాతంత్ర్యం రాదని తెలిపింది.*

దుర్గాబాయమ్మ వ్రాసిన 'స్థానికసంస్థలు' (అక్టోబరు 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీల విధులు కేవలం గృహానికిని, పురుషుని విధులు బయట ప్రపంచంగాను సమాజంలో పని విభజన సంస్కృతి ఉంది కాబట్టి, స్థానికసంస్థల పరిపాలన గృహపరిపాలన వంటిదనీ దానికి ఓర్పు, చురుకుదనం, చాకచక్యం కావాలనీ, అవి స్త్రీల కుంటాయని తెలిపింది. శిశుసంక్షేమం, విద్య, ఆరోగ్యం, రక్షణలో స్త్రీ ఆరితేరిందనీ స్త్రీలకు స్థానిక సంస్థల పాలనా శిక్షణ యిచ్చి, వాటిలో స్త్రీలకు ప్రాతినిధ్యం ఇస్తే దేశాభ్యుదయం ఉంటుందని తెలియజేసింది.

*ఆ విధంగా స్త్రీలు స్థానికసంస్థల పరిపాలనలో భాగస్వాములైతే వారిని పురుషులు అర్థం చేసుకోవాలని భావించింది. 1940 లోనే స్థానిక సంస్థలలో మహిళా రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలియజేసింది. 1993, 94 సం.లో పంచాయితీరాజ్ చట్టంతో స్థానికసంస్థలలో మహిళల రిజర్వేషన్‌ను పొందుపరిచారు. కానీ పంచాయితీలలో భార్యలు సర్పంచులైతే భర్తలే కార్యనిర్వహణ చేస్తున్న విషయం తెలిసినదే.*

దుర్గాబాయమ్మ ఆధ్వర్యంలో 'చెన్నపురి ఆంధ్రమహాసభ – స్త్రీలశాఖ' చేసిన కృషిని (నవంబరు 1940 గృహలక్ష్మి) గురించి పత్రికాధిపుల ప్రచురణలో 1939 లో చెన్నపురిలో ఆంధ్రమహాసభలోని స్త్రీల శాఖ ఏర్పాటు కావింపబడినదనీ, దీనిలో విద్యాశాఖ, లలిత కళాశాఖ, క్రీడాశాఖ, పారిశ్రామిక శాఖగా విద్యను నేర్పిస్తున్నారని తెలిపింది. అంతేకాక విద్యార్థులకు సంస్కృతం, తెలుగు, హిందీ విద్వాన్ పరీక్షలకు పంపుతున్నారనీ, పారిశ్రామిక విద్యలో ఖద్దరు పరిశ్రమను, గృహ పరిశ్రమలు నేర్పుతున్నారనీ, స్త్రీ శాఖకు దుర్గాబాయమ్మ నిర్వాహకురాలుగా నూలువస్త్రాలను తయారుచేయించి దేశపురోభివృద్ధికి పాటుపడ్డారని తెలియజేయటం జరిగింది.

'సేవాన్వేషిణీ! – జాగ్రత్త!' (నవంబరు 1941 గృహలక్ష్మి) అంటూ దుర్గాబాయమ్మ వ్రాసిన వ్యాసంలో 'స్త్రీ తన జీవితాన్ని సంఘసేవకు వినియోగించదలచుకుంటే మంచిదేకాని వారు దరిద్రం అనుభవించటానికి, ప్రాణం అర్పించటానికే కాక కృతజ్ఞత లేని సంఘం యొక్క సమ్మెటపోట్లకు కూడా తయారుగా ఉండాలని ఉద్బోధ చేసింది. నిరక్షరాస్యత, దారిద్ర్య నిర్మూలనలో స్త్రీల తోడ్పాటు ఎక్కువగా ఉంటుందనీ, ఆడపిల్లలకు పాఠశాలలో పెద్దలకు వృత్తి విద్యలు నేర్పటం, రక్షణ గృహాలు నిర్వహించటం వంటి సేవలను స్త్రీలు చేయవచ్చనీ, అయితే సంఘజీవితం పబ్లిక్ లైఫ్ కాబట్టి వాటిలోఉండే సాధక బాధకాలు ఆలోచించుకొని సంఘజీవితంలో ప్రవేశించాలని తెలియజేసింది. అంతేకాదు, సంఘాన్ని పెద్దకుటుంబంగా భావించి స్త్రీ జ్ఞానసంపత్తిని అందించటమేగాక సమాజంలోని పత్రికలు, క్లబ్‌లు, బార్‌రూములు, మార్కెట్లు, పురాణాలు, పేరంటాలు అవయవాలుగా గల సమాజానికి తనను విమర్శించే అవకాశం ఉంటుందని గ్రహించమంది. కాబట్టి సంఘసేవకు

దిగేముందు కావల్సిన అర్హతలుగా నిస్వార్థబుద్ధి, నిష్కళంక దేశభక్తి, గుండె నిబ్బరం ఉండేటట్టుగా ఉన్నామా లేదా అని తమనితాము స్త్రీలు అంచనా వేసుకొని స్త్రీలు ఉద్యమంలోకిగాని, సంఘసేవకుగాని పూనుకోవాలని స్వీయానుభవంతో దుర్గాబాయమ్మ తెలియజేసింది.

బాలాంత్రపు శేషమ్మ 'చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీలశాఖాభివృద్ధి' (జనవరి 1941 గృహలక్ష్మి) ని గురించి వ్రాస్తూ శ్రీమతి దుర్గాబాయమ్మ ఆధ్వర్యంలో స్త్రీలశాఖ విజయవంతంగా వర్ధిల్లుతోందనీ, దుర్గాబాయమ్మ కాకినాడలో ఉన్నప్పుడు విద్యార్థినీ సంఘానికి సహాయంగా ఉండి స్త్రీలకు విద్య, చైతన్యం, ఉద్రేకం, ఉత్సాహం రేకెత్తింపజేసిందని తెలిపింది. స్వాతంత్ర్య సమరమప్పుడు జెండా పట్టుకొని దుర్గాబాయి బయలుదేరిందంటే జనమంతా వచ్చి గుంపులు గూడే వారనీ, ఆమె బి.యల్.పరీక్షలో కృతార్థురాలయిందని చెప్పింది. చెన్నపురి ఆంధ్రమహాసభ స్త్రీలశాఖలో సంగీతం, నృత్యం, హిందీ, బెనారస్ మెట్రిక్ కోర్సులు నేర్పుతున్నారనీ, మాతృభాషయైన తెలుగుకు ఒక ప్రత్యేకశాఖ ఉండాలనీ, చేతిపనులైన నూలువడకుట, నవారునేత వంటివి స్త్రీలకు నేర్పించాలని తెలియజేసింది.

'కాస్యపి' అనే పేరుతో 'గుమ్మడిదల దుర్గాబాయమ్మ' (డిసెంబరు 1941 ఆంధ్రభూమి) ను గురించి వ్రాస్తూ ఆమె యొక్క సేవానిరతి, కార్యదీక్ష గొప్పదనీ, 1909 లో రాజమండ్రిలో జన్మించిందనీ, ఈమెది బాల్యవివాహం అనీ, సంసారిక జీవితం ఇష్టంలేక చిన్నప్పటినుండి ప్రజాసేవకు అంకితమయిందనీ, కాకినాడలో 1922లో హిందీ బాలికా పాఠశాలను స్థాపించిందనీ. ఆ పాఠశాలను స్వశక్తితో పోషించిందని తెలిపింది. 1924 సం.లో కాకినాడలో కాంగ్రెస్ స్వచ్ఛందసేవకులతో రాజకీయరంగంలో ప్రవేశించి 1929 లో గోదావరిజిల్లా బోర్డు సభ్యురాలిగా ఉన్నా, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాప్రభుత్వం కాదని గ్రహించి ఆ పదవిని వదిలేసిందని చెప్పింది. ప్రకాశంపంతులతో కలసి మద్రాసులో లవణసత్యాగ్రహ సమరంలో వీరవిహారం చేసిందనీ, లాఠీదెబ్బలుతిన్నదనీ, ఒక సంవత్సరం జైలుకెళ్ళిందనీ, 1931లో జైలునుండి విడుదలయిందని తెలియజేసింది. తమిళనాడు నవజనభారతసభకు అధ్యక్షురాలుగానూ, మహిళా సమావేశాలకు అధ్యక్షురాలుగాను ఉన్నదని తెలిపింది. 1932సం.న బొంబాయిలో హిందూస్థాని సేవాదళ క్యాంపులో శిక్షణ పొంది, అదే సంవత్సరం సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆర్నెల్లు శిక్షను అనుభవిస్తున్నప్పుడు జైలులో హత్య చేయబోయిన బాలికను రక్షించిందని తెలియజేసింది. 1933లో జైలునుండి బయటకువచ్చి ఇంగ్లీషు నేర్చుకుందనీ, కాశీహిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్ చదివి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆనర్స్ చదివిందనీ, 1939లో మద్రాసు లా కాలేజీలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించిందని చెప్పింది. చెన్నపురిలోని ఆంధ్రమహాసభలో స్త్రీశాఖను నిర్వహించి దానికొక ప్రత్యేకతను కల్గించిందనీ, హిందీ, ఇంగ్లీషు తెలుగుభాషలో అనర్గళంగా ఉపన్యసించ గలదనీ, ఆమె చేసిన హిందీ ప్రచారానికి గాంధీ ఆమెకు బంగారుపతకాన్ని ఇచ్చారనీ, విద్యావంతులుగా, దేశసేవాపరాయణరాలిగా సంఘసేవాధురీణురాలిగా దుర్గాబాయి యొక్క వ్యక్తిత్వం గొప్పదనికూడా తెలియజేసింది.

గుమ్మడిదల దుర్గాబాయమ్మ స్వాతంత్ర్యోద్యమ సమరశీలి అనీ, సామాజిక సేవాధురీణు రాలనీ, ఆంధ్ర స్త్రీలలో ఉద్యమస్ఫూర్తిని కలిగించిన మహిళగా చరిత్రలో చోటుచేసుకుంది. ఈ దుర్గాబాయమ్మయే తర్వాత దుర్గాబాయ్ దేశముఖ్ గా ప్రసిద్ధిని పొందింది.

'విద్యావతులు అవివాహితులుగా మిగిలిపోతున్నారు' (డిసెంబరు 1940 గృహలక్ష్మి) అనే శీర్షికన కె. సరోజిని వ్రాస్తూ ఆస్తి పంపకంలోని అసమానత్వం వల్ల స్త్రీలు విద్యావంతులైనా కూడా వారి పెళ్ళికి వరకట్నం ఇవ్వాల్సివస్తోందనీ, ఇవ్వలేకపోతే స్త్రీలు అవివాహితులుగానే మిగిలి పోతున్నారని తెలియజేసింది.

*వరకట్న దురాచారానికి భయపడి తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఉన్నతవిద్యను అందించటాన్ని మానేస్తారనేదాన్ని సహజ పరిణామంగా భావించి ఆ దిశగా తన ఆందోళను వ్యక్తం చేసింది. స్త్రీవిద్యాభివృద్ధికి వరకట్నసంప్రదాయం అడ్డుగానిలుస్తోందని ఆ వరకట్న దురాచారాన్ని రూపుమాప గలిగితే స్త్రీలు ఉన్నత విద్యావంతులు కాగలుగుతారని భావించవచ్చు.*

1940 లో 'సజీవమైన వాఙ్మయం కావాలి–కవిత్వమున్నది కాని నిర్మాణంలేదు' (అక్టోబరు 1940 గృహలక్ష్మి) అనే శీర్షికన రోహిణి వ్రాస్తూ, ప్రాచీన వాఙ్మయంతో తులతూగే విధంగా నేటి వాఙ్మయం ఉండటంలేదనీ, పురుషులతో నిర్మింపబడ్డది ఉందిగాని స్త్రీలచే నిర్మింపబడ్డది ఏదీ లేదని చెప్పినదానికి సమాధానంగా అలా లేకపోవటం వ్యక్తి దౌర్బల్యంకాదని, జాతి దౌర్బల్యమని చెప్పింది. వాఙ్మయప్రపంచంలో స్త్రీలకుసంబంధం తక్కువగా ఉన్నదని భావించింది. ఆధునికరచన పూర్వపుదారిని పోయినదేతప్ప స్వతంత్ర రచన కానరావటంలేదనీ, కవిత్వం ఉన్నా నిర్మాణం లేదని భావించింది. భావకవిత్వం తాటాకుమంటల పొంగుగా చూడబడుతోందనీ, దానికి సరియైనపంథా లోపించిందని భావించింది. శాశ్వతంగా నిలిచి క్రొత్తదనానికి మార్గదర్శకత్వం కాగలిగిన గ్రంథాలు నిర్మితంకావాలనీ, పరదాస్యప్రకృతి అనే తమస్సులో ఉండక ఇది సజీవమైనవాఙ్మయం, ఇది స్త్రీలచే నిర్మాణమైందని చెప్పుకోగల రచన సృష్టింపబడాలని చెప్పింది.

*స్త్రీలసాహిత్యసృష్టి జరిగితేనే నూతనత్వం మార్గదర్శకమౌతుందనే దానిని సాహిత్య ప్రయోజనంగా భావించింది.*

వట్టికొండ విశాలక్షి వ్రాసిన 'సజీవమైన వాఙ్మయం కావాలి' (డిసెంబరు 1940 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ప్రాచీన వాఙ్మయాన్ని మించి తులతూగే సాహిత్యం రావటం లేదు అనే రోహిణి గారి సారస్వత హెచ్చరికకు బదులిస్తూ సాహిత్యము ఎప్పుడూ ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని తెలియజేసింది. సాహిత్యవికాసం సన్నగిల్లటానికి కారణం జాతి దౌర్బల్యమేగాని, వ్యక్తిగత దౌర్బల్యం కాదనీ, రాజరాజనరేంద్రుడు నన్నయ్యను గురువుగా, మనుమసిద్ధి తిక్కన అమాత్యకవిగా ఉన్నాడనీ, శ్రీనాథుడు రాజాశ్రయుడైన ప్రజాభిప్రాయ కవిగా పల్నాటి వీరచరిత్రను వ్రాసాడని, రాయలకాలంలో కవితా కన్యకూడ భోగవస్తువైందనీ, రామరాయల

కాలానికి సాహిత్యం క్షీణదశనొందిందని భావించింది. కానీ పరదాస్య ప్రవృత్తిలోనే స్థిమితమేర్పడి పాశ్చాత్యభాషా సంపర్కంవల్ల ఆధునికయుగం ఆరంభమైనదనీ, అప్పటివరకున్న పద్యకావ్య సాహిత్యమే కాక ఆధునిక కాలంలో కావ్యాలు, గేయాలు, నాటకాలు, నవలలు, కథలు, వ్యాసాలు, చరిత్రలు స్వీయచరిత్రలు వంటి సాహిత్య ప్రక్రియలెన్నో వచ్చాయని తెలియజేసింది. అంతకు మునుపు యిద్దరో, ముగ్గురో కవయిత్రులు మాత్రమే ఉన్నా ఆధునికకాలంలో కవులతో తులతూగే కవయిత్రులు లేకపోవటానికి పురుషులతోపాటు సమానంగా స్త్రీలకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటమే కారణమని చెప్పింది. పురుషులు స్త్రీలను వంటయింటి పనిముట్లుగా, భోగవస్తువుగా, దాసిగా చూసి బందిఖానాలో ఉంచటమే కారణమనీ, నేడు ఘోషాతగ్గింది గాని అన్ని విషయాలలో సమానహక్కులుంటే స్త్రీలు ఏమాత్రం సాహిత్యసృజనలో వెనకబడరని భావించ వచ్చని తెలియజేసింది.

*స్త్రీలసాహిత్యసృజనను విమర్శకు పెట్టి కారణాల అన్వేషణ చేయటం కన్పడుతుంది. స్త్రీలకు సమానహక్కులు లేకపోవటంచేత కవులతో తులతూగే కవయిత్రులు లేకపోతున్నారనీ, అన్ని సామాజికరంగాలలో స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉంటే స్త్రీల స్థితి బాగున్నప్పుడు మంచి కవితలతో గొప్ప స్త్రీలసాహిత్యం సృజింపబడుతుందని తెలియజేసింది. విమర్శచేసిన రోహిణికి బహుశ స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీలు వ్రాసిన అనంత సాహిత్యానికి సంబంధించిన ఎఱుక లేదేమోనని అనిపిస్తుంది. ఆధునికయుగంలో స్త్రీలచేత సృజింపబడిన నూతన సాహిత్యము, స్త్రీల ప్రగతికి మార్గదర్శకమైనదని నిరూపింపబడినది.*

'స్త్రీవిద్య' (విభూతి మాసపత్రిక డిశెంబరు 1940) గురించి బి.శ్యామలాంబ వ్రాస్తూ బాలికా విద్య కుంటుపడటానికి బాల్యవివాహాలు, కులాచారకట్టుబాట్లు కారణమనీ, స్త్రీలు యింటిపని చేయటం మానేస్తారనే భయం పురుషుల్లో ఉండి స్త్రీలకు విద్య అనవసరమని చెప్పారని తెలిపింది. స్త్రీలు గృహకృత్యములు చేస్తూనే తీరిక సమయాలలో ప్రకృతి ధర్మాలను, దేశచరిత్రలను తెలుసు కుంటూ స్త్రీలు విద్యను అభివృద్ధిచేసుకోవాలని తెలియజేసింది.

'స్త్రీస్వాతంత్ర్యం' (ఉదయభారతి త్రైమాసిక పత్రిక డిశెంబరు 1940) అనే శీర్షికన నర్రా జానకీదేవి వ్రాస్తూ స్త్రీకి గృహిణి అనే పేరుపెట్టి పురుషుడు స్త్రీని గృహంలో బంధించి స్త్రీకి స్వాతంత్ర్యం లేకుండాచేసాడనీ తెలిపింది. స్త్రీలకు పురుషులకు సమానమైన చట్టాలు లేవనీ, సమర్థత ఉన్నా స్త్రీలకు ఉద్యోగాలు యివ్వరనీ, విద్య, వివాహం, పిల్లల విషయాలలోగాని, జీవిత నిర్ణయాలుగాని చేసుకొనే హక్కుగాని, స్వాతంత్ర్యంగాని స్త్రీలకు లేదని అభిప్రాయపడింది.

*ఉద్యోగాలలోను, చట్టాలలోను ఉన్న లింగవివక్షాస్వభావాన్ని బయటపెట్టింది.*

'హిందూమహమ్మదీయ సమస్య'ను (ఉదయభారతి త్రైమాసిక పత్రిక ఏప్రిల్ 1941) గురించి ఈమె వ్రాసిన వ్యాసంలో బ్రిటిష్ వారి స్వార్థపూరిత ప్రేరణతో నాయకులమధ్యన హిందూ మహమ్మదీయ సమస్యవిద్వేషాలను పెంచుతోందనీ, ప్రజలకు మతోన్మాదం లేదనీ, జిన్నా వల్లనే

భారతదేశానికి స్వాతంత్ర్యం రావటంలేదని తెలిపింది. మంత్రిపదవులకు కాంగ్రెసు రాజీనామా చేసినప్పుడు జిన్నా విమోచనదినంగా ప్రకటించాడనీ, ప్రజాసామ్యంతో సంబంధం పెట్టుకొని ముస్లిమ్ లీగు కాంగ్రెస్ లో ఐక్యమై పరప్రభుత్వంవారి జిత్తులను ఎదుర్కోవాలనీ, అప్పుడే భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తుందని తెలియజేసింది. అంతేకాదు, భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత మహమ్మదీయులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను వారికి సొంతంచేసి వారి మత, భాష, విజ్ఞానాన్ని అభివృద్ధిచేసుకొనే వీలును కలిగించవచ్చనీ, కావాలంటే స్వతంత్ర హిందూదేశంలో అఖిలభారత ఫెడరేషన్ నుంచి విడిపోవచ్చనీ, అవసరమనుకొంటే వారు స్వాతంత్ర్యాన్నికూడా పొందవచ్చనీ తెలియజేసింది. అంతేకాక, స్వాతంత్ర్య పోరాటంలోనే సఖ్యత ఉంటుందనీ, పన్నులు పెంచినా, కూలి తగ్గించినా మతాన్ని మరచి ఐక్యతతో పోరాటాన్ని చేస్తారు కాబట్టి వర్గపోరాట సిద్ధాంతం మీదనే హిందూమహమ్మదీయ సఖ్యతను సాధించవచ్చని నర్రా జానకీదేవి తెలియజేసింది.

*భారతదేశ స్వాతంత్ర్యంకోసం హిందూమహమ్మదీయ సఖ్యత సాధనకై ఒక సూత్రాన్ని ప్రతిపాదించింది. కమ్యూనిజమ్ లోని వర్గపోరాటం అన్ని మతాలలో ఉంటుంది కాబట్టి దానితో హిందూమహమ్మదీయ ఐక్యతని సాధించవచ్చని భావించింది. మతానికి వర్గస్వభావం ఉంటుందని నర్రా జానకీదేవి గ్రహించింది.*

గోపరాజు సీతాదేవి 'పల్లెటూళ్ళు–వాటి ప్రస్తుత దౌర్భాగ్యపు స్థితి' (ఫిబ్రవరి 1941 గృహలక్ష్మి)ని గురించి వ్రాస్తూ గ్రామాలు పునరుద్ధరింపబడాలనీ, వయోజనవిద్య అవసరమనీ, ప్రాథమిక విద్యావిధానం సంస్కరింపబడాలని తెలిపింది. ప్రతి పల్లెలో మహిళాసంఘాలు స్థాపించాలనీ, స్త్రీలలో సోమరిపోతుతనం తగ్గించే విధంగా పఠనమందిరాలు పెట్టి వారికి ఆర్థిక విషయాలను కూడా తెలియజేసి వారిని జ్ఞానవంతులను చేయాల్సిన అవసరాన్ని తెలియచేసింది.

*పల్లె స్త్రీలు ఆర్థిక విషయాలను ఆలోచించే స్థితికి వస్తేనే దేశప్రగతి బాగుంటుందని భావించింది.*

చెరుకూరి నాగభూషణమ్మ వ్రాసిన 'స్త్రీలు చెడ్డవారా?' (మార్చి 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలు చెడ్డవారనీ, స్త్రీలను నమ్మగూడదనే అనుమానంతో వస్తున్న మాటలను ఖండిస్తూ, పురుషులలో దుర్గుణాలు ఉన్నాయనీ, స్త్రీలలో భూతదయ పరోపకారత్వం ఉంటుందని తెలిపింది. స్త్రీలకు ఆస్తిహక్కు లేకపోవటంతో పురుషుడి దౌర్జన్యాధికారాల క్రింద యిక్కట్లుపడుతూ భయంతో అబద్ధమాడవలసిన వారైనారనీ, స్త్రీల అస్వతంత్ర జీవనాన్ని గుర్తించక వారిపై దోషారోపణచేస్తూ కపటధర్మాలను అంటగడుతున్నారనీ, వారిని సమభాగినులుగా భావించి సర్వవిధమైన హక్కులు ఇస్తే వారెంతటి విజ్ఞానవంతులో సత్యసంధులో కూడా అర్థం అవుతుందనీ తెలియజేసింది.

ఈమెయే వ్రాసిన 'ఇంకెన్నాళ్ళు మనకీ బానిసత్వం' (అక్టోబరు 1941 గృహలక్ష్మి పత్రిక) అనే మరో వ్యాసంలో కుటుంబసంబధాలలోని అన్నిపనులలో పురుషులకు స్త్రీలు భయపడుతూ ఉంటున్నారంటే స్త్రీలకు స్వతంత్ర వ్యక్తిత్వం లేదనీ, స్త్రీలు తమ బానిసత్వాన్ని వారు గుర్తించలేక తాము మనుషులు అన్నవిషయాన్ని కూడా మరచిపోతున్నారని తెలిపింది. పురుషులకున్న హక్కులన్నీ

తమకు ఉన్నాయని భావించి స్త్రీలు స్వతంత్రాన్ని పొంది పురుషుల సహకారంతో పరస్పర గౌరవంతో జీవనాన్ని సాగించాల్సిన అవసరాన్ని చెప్పింది. పురుషులతోపాటు ఆస్తి, వివాహం, విడాకులవంటి విషయాలలో స్త్రీలకు సమాన స్వాతంత్ర్యం ఉండాలనీ, స్త్రీలు ఆత్మగౌరవంతో బ్రతకటానికి స్త్రీలే ముందుకువచ్చి కృషిచేయాలని రచయిత్రి అభిప్రాయపడింది. మగవారి కంటే స్త్రీలు హీనస్థితిలో ఉన్నారనీ, చిన్న చిన్న పనులలో కూడా స్వతంత్రతతో బాధ్యత తీసుకోవటానికి స్త్రీలు ప్రయత్నించకపోవటం అవమానకరమనీ, మూఢాచారాలనే పాటించాలనుకుంటున్నారని భావించింది. స్త్రీలకు తమ వ్యక్తిత్వం, స్వాతంత్ర్యంయొక్క విలువ తెలియటం లేదనీ, భర్తలపరంగా గుర్తింపు పొందటంగాక తమశక్తి సామర్థ్యాలవల్ల సమాజంలో గుర్తింపు పొందాలనీ, పురుషులవలె తమకు హక్కులున్నాయనీ తెలిస్తే తప్ప స్త్రీల అభివృద్ధి జరగదని చెరుకూరు నాగభూషణమ్మ భావించింది.

*స్త్రీలకు 'విడాకుల' వంటి విషయాలలో సమానత్వం ఉండాలని కూడ ఈ వ్యాసంలో ప్రతిపాదించటం జరిగింది. ఆస్తిహక్కు విషయాలలోనూ వైవాహిక హక్కులలోను స్త్రీ, పురుషులకు సమానత్వం ఉండాలనీ, పరస్పరం గౌరవించుకోవటంలోనే స్త్రీల స్వాతంత్ర్యం ఇమిడి ఉన్నదని భావించింది. స్త్రీలకు ముందుగా తమ బానిసబ్రతుకును గురించిన స్పృహ కలిగితే తమకు సమాన హక్కులున్నాయని తెలుస్తుందనీ, వ్యక్తిస్వాతంత్ర్యం కావాలనే భావన ఏర్పడుతుందని భావించింది. స్త్రీల వ్యవహారాలు స్త్రీలే సరిచేసుకోవాలనీ, ఆస్తి, వివాహం, విడాకులలో స్త్రీకి కూడా సమాన స్వాతంత్ర్యం ఉండాలని తెలియజేసింది. స్త్రీల వ్యక్తిత్వపు ఉనికి దేశాభివృద్ధికి ప్రధానమని ఆనాడే భావించటం వారి క్రాంతదర్శనానికి నిదర్శనంగా భావించవచ్చు.*

'బత్తుల కామాక్షమ్మ' (మార్చి 1941 గృహలక్ష్మి)ను గురించి వేదవల్లితాయారమ్మ వ్రాసిన వ్యాసంలో ఆమె జీవిత విశేషాలను వ్రాస్తూ ఆమె సంఘసేవాధురీణ, 'విద్యాప్రదాయినీ' అనే బిరుదగ్రహీత అనీ, స్వశక్తిపై కృషిచేసి స్త్రీలోకమున వారిఉన్నతికై అకుంఠిత దీక్షతో పనిచేసి ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలను స్థాపించిన వినిర్మల ఆదర్శజ్యోతి అని పేర్కొంది. ఆమె పట్టుదల, కృషి, దైవబలాన్ని కలిగి ఉన్నతాశయాలతో జీవించినదని తెలియజేసింది. 1886 లో జన్మించిన ఈమెకు పూసప్రాయమునందే వైధవ్యం వచ్చినా, పదిమందికి నాయకత్వం వహించి మద్రాసులో మాతామహులగు నాళము లక్ష్మీ కాంతంగారింట 15 సంవత్సరాలు గడిపి వచ్చిన తరువాత తన 34 వ ఏట కాలము యొక్క విలువను గ్రహించి వృథాకాలక్షేపం చేయటం యిష్టంలేక రాజమండ్రి నుండి వీరేశలింగంగారి సలహాతో 'వైశ్యసేవాసదనము'ను స్థాపించటంలో పాత్ర పోషించింది. బాలికలను పరీక్షలకుపంపాలని భావించి, వారిని చదివించటానికై ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలను స్థాపించినదని కూడా తెలియజేసింది. స్వార్థత్యాగి, నిరాడంబర జీవి, ఉత్సాహపూరిత, ప్రేమస్వరూపిణి, విశ్రాంతి ఎరుగని కార్యదీక్షయే గాక ఈతవిద్యను నేర్చి పదిమందికి నేర్పిన ఆమె, అఖండ గౌతమీనదిలో అతిస్వేచ్ఛగా పరుండి పద్మాసనము వేసి పరతత్వాన్ని ధ్యానించిన యోగీశ్వరీ అనీ, వేగవంతముగల నడక కలిగిన ఈమె పండ్లనే ఆహారంగా తీసుకునేదని తెలియచేసింది. 1924లో గుంటూరులో జరిగిన 'ఆర్యవైశ్య మహిళాసభ' కు అధ్యక్షత

వహించిందనీ, సంఘసేవ చేస్తూనే 'విద్వాన్' పరీక్ష చదివిందనీ, 1927లో అఖిలాంధ్ర మహిళాసభకు కార్యనిర్వాహక సభ్యురాలిగాను మహిళాసభ యొక్క సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక శాఖల కార్యనిర్వాహక సభ్యురాలిగాను ఉంటూ మహిళాభ్యుదయానికై శక్తివంచనలేని ప్రచారం చేసిందని తెలిపింది. 1929 లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి ఉభయ భాషాప్రవీణ పట్టాన్ని పొందిందనీ, ఆ సంవత్సరమే పెద్దాపురము నందలి ఆర్యవైశ్యమహాసభలో ఈమెకు 'సంఘసేవాధురీణ' అని బిరుదునిచ్చారని తెలియజేసింది. 1931 నాటికి 'వైశ్యసేవాసదనం' అనేసంస్థ 'ఆంధ్రయువతీ సంస్కృతకళాశాల'గా పరిణామంచెందిందనీ, రాజమండ్రిలోని గరల్స్ హైస్కూలు, గౌతమీ గ్రంథాలయం, అఖిలభారత స్త్రీల ఆటల సంఘానికి ఉపాధ్యక్షురాలుగా, పురపాలక సంఘ సభ్యురాలుగాను, రాజమండ్రిలో గౌరవ న్యాయాధికారిణిగా భాగస్వామురాలయిందని చెప్పింది. ఆంధ్రరాష్ట్రమహాసభలో వస్తుప్రదర్శన ఏర్పాటు చేయించినదనీ, విద్యార్థినులను కేవలం ప్రాచ్యవిద్యలందే గాక చిత్రలేఖనం, కుట్లు, సంగీతం, హిందీ, ఇంగ్లీషు మొదలగు గవర్నమెంటు వారి పరీక్షలకు పంపి స్త్రీలనుద్ధరించిన దేశోపకారిణి అని బత్తుల కామాక్షమ్మను ప్రశంసించింది.

*నాటి వితంతు స్త్రీగా ఈతవంటి క్రీడారంగంలో ఒక స్త్రీ ఉండటం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. స్త్రీలకు ఇంటిపనితప్ప వ్యాయామం అవసరంలేదనుకొనే రోజుల్లో, ఒక వితంతుస్త్రీగా విద్యావంతురాలై, వ్యాయామవిద్యను నేర్చుకోవటమేకాక, అందరికి నేర్పటం విశేషం. అందులోనూ ఈతకొట్టే విద్యను నేర్చుకొన్నదంటేనే ఆమెదొక ప్రత్యేకవ్యక్తిత్వమనీ, అదే స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య చిహ్నమని భావించాలి. బత్తుల కామాక్షమ్మ నిర్వహించిన పదవులే స్త్రీజాతియొక్క ఔన్నత్యాన్నికి చిహ్నం.*

చెన్నపురిలోని గృహలక్ష్మి జయంత్యోత్సవసభలో 'బత్తుల కామాక్షమ్మ' (మార్చి 1941 గృహలక్ష్మి) యొక్క గృహలక్ష్మి స్వర్ణకంకణ మహోత్సవ సందర్భంలో దుర్గాబాయమ్మ ఉపన్యసిస్తూ బత్తుల కామాక్షమ్మ యొక్క సంఘసేవ, దేశసేవాపరాయణతను గురించి పేర్కొంటూ, ఆమె 'ఆంధ్ర యువతీ సంస్కృతకళాశాల'ను స్థాపించినదనియూ, వైశ్యసేవా సదనాన్ని నిర్మించి ఆంధ్రస్త్రీలకు విద్యాదానం చేయటమేగాక, అనాథబాలికలకు ఆశ్రయం కల్పించిన మాతృమూర్తి అని చెప్పింది. చేబ్రోలు సరస్వతిగారు కూడా బత్తుల కామాక్షమ్మను గురించి తెలియజేస్తూ గృహలక్ష్మి పత్రికాధిపులైన కేసరిగారు స్త్రీలు పురుషులకెందు తీసిపోరనే రహస్యమెరింగినవారు కాబట్టి సంఘసేవ, దేశసేవ చేసిన స్త్రీలను బంగారు కంకణ గ్రహీతలుగా సన్మానం చేస్తున్నారనీ అలా బత్తుల కామాక్షమ్మను సత్కరించారనీ, భారతదేశాభివృద్ధి స్త్రీల అభివృద్ధి మీద ఆధారపడి యుంటుందనీ చెబుతూ

*"భారతగాథలెల్లఁబసివారికిఁజిత్తము పల్లవింపగా*
*నేరుపు మీరఁజెప్పునెడ నీతికి దూరముగాక నెమ్మదిన్*
*ధీరతగాంచి జీవితము నెట్టగఁజూచెద రాంధ్రభూమికిన్*
*గీరితిఁదెచ్చుగాన బరికింపఁదగున్ సతులిట్టి పద్ధతుల్"* అని

దేశభక్తులను తయారుచేయు బాధ్యత స్త్రీలమీద ఉన్నదని తెలియజేసింది. కాంచనపల్లి కనకాంబ బత్తుల కామాక్షమ్మ గారికి 'విద్యాప్రదాయిని' బిరుదును ప్రదానం చేస్తూ

*'స్త్రీలను బాగు సేయుటది దేశమునంతయు బాగు సేయుటే*
*శీలము ధర్మమున్ బలము చేదెలకయ్యవినేర్పకున్న నె*
*క్కాలము నార్యసంతతికి గల్గును సేమము లాభమింతకున్*
*మూలము స్త్రీలు వారి పరిపూర్ణత జాతి కంతయున్'*

అని స్త్రీలశ్రేయస్సు దేశ శ్రేయస్సుకు మూలం అని భావించింది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వేదవల్లి తాయారమ్మ 'స్త్రీలు–ఉద్యోగాలు' అనే అంశంపై ప్రసంగిస్తూ ఒకప్రక్క స్త్రీని ఆటవస్తువుగా భావిస్తుంటే, మరొకప్రక్క స్త్రీలుగూడా విద్యాగంధం లేక తమకుగల సర్వశక్తులను పోగొట్టుకుంటున్నారనీ, స్త్రీకి స్వయంపోషకశక్తిని కలిగించాలని చెప్పింది. స్త్రీ ఓరిమితో పట్టుదలతో పనులు చేయగలుగుతుందనీ, విజయలక్ష్మి, సరోజనీనాయుడు రాజకార్యములందు పురుషులకు తీసిపోవటంలేదనీ అన్ని రాజ్యాంగ శాఖలలో స్త్రీలు ఉద్యోగం చేయగలరనీ, అన్నిరంగాలలో స్త్రీ అభివృద్ధి చెందగలదని తెలియజేసారు.

ఈ సందర్భంలోనే స్థానాపతి రుక్మిణమ్మ

*"గరిటెఁనమృతమ్ము చిలికించు కాంతలౌర!*
*కలముఁగొని కైతలల్లంగఁగడగినారు*
*కనక కంకణా రవఘుళంఘుళలుచెలగ*
*నెందఱెందరోగృహలక్ష్మిబంధులగుచు"* అని

స్త్రీలు చదువుకొని కవితలల్లి ప్రసిద్ధి పొందుతున్నారని ప్రశంసించింది.

పులవర్తి కమలావతీదేవి బత్తుల కామాక్షమ్మను గురించి చెబుతూ, చిన్న తనముననే వైధవ్య మొందినను దిగులుచెందక ఉభయభాషాప్రవీణయై ఉత్కృష్టసేవాసదనమును స్థాపింపచేసి అనేక మంది వితంతువుల ఉపాధికి మార్గదర్శియైనందుకు ప్రశంసిస్తూ సభకు లేఖపంపించటం జరిగిందని గృహలక్ష్మి పత్రిక తెలియజేసింది.

దేశిరాజు భారతీదేవి ఆచంట సత్యవతమ్మ వంటి వారు స్వర్ణకంకణ గ్రహీతురాలైన బత్తుల కామాక్షమ్మను, ఆమె సేవను ప్రశంసించారు.

తెన్నేటి వెంకటరత్నావతి వ్రాసిన 'స్త్రీ స్వాతంత్ర్యము' (మే 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో మారిన కాలానికి తగ్గట్టుగా నేడు స్త్రీలు పురుషులతో పాటు తమకూ సమాన హక్కులు కావాలని అడుగుతున్నారనీ, స్త్రీస్వాతంత్ర్యం అంటే స్త్రీని పశుప్రాయంగా చూడకుండా స్త్రీ మనసును సంకట పరచకుండా స్త్రీలకు కూడా భావాలు, వివేకం ఉంటాయని మగవారు గ్రహించాలని తెలిపింది. స్త్రీలకు విద్యనేర్పిస్తే మగవారికంటె ఎక్కువ సమర్థత చూపించగలరనీ, దానికి ముఖ్యముగా స్త్రీలు

కూడా తమ భావములను వెలిబుచ్చే స్వాతంత్ర్యం అవసరమనీ, భర్తవీడినా పునర్వివాహం చేసుకొనే అవకాశం ఉండాలి అని తెలియజేసింది. స్త్రీలలో పెరిగిన ఆత్మవిశ్వాసం అర్థం అవుతుంది.

1941 వ సంవత్సరము జూన్ నెల 4వ తేదిన చిలుకూరులో జరిగిన నిజాంరాష్ట్రాంధ్ర మహిళామహాసభ (జులై 1941 గృహలక్ష్మి) లో రంగమ్మ ఓబల్ రెడ్డి ఉపన్యసిస్తూ ఆంధ్రస్త్రీలలో అవిద్య, మూర్ఖవిశ్వాసం, ఆత్మవిశ్వాసరాహిత్యం, అనారోగ్యం, ఆయుఃక్షీణత, సాంఘిక దురాచారాలు, అత్యాచారములు, దిక్కులేనితనం ఉన్నాయనీ, వాటి నివారణకై ప్రజలు విరివిగా స్త్రీల పాఠశాలలు పెట్టి విద్యావిషయంలో ఉదారతతో ఉండాలని చెప్పింది. మాతృభాషలో విద్యాభ్యాసం ఉండకపోవటంతో ప్రస్తుతం స్త్రీలలో నూటికి 90 మంది సాంఘికంగా, ఆర్థికంగా పనికిరాని వారైయున్నారని తెలియజేసింది. అంతేకాక ప్రతి స్త్రీకి వైద్యం, వ్యాయామం శిక్షణ, ఆదాయవ్యయాలు శిశుపోషణ, గృహపరిశ్రమలను నేర్పాలనీ నూలువడకటం, చేతికుట్లు, మిషన్ కుట్లు, బొమ్మలు, మంచం నవార్లు, అగ్గిపెట్టెలు, అద్దకపు పనులు నేర్పించాలని చెప్పింది. విడాకులను ఉపేక్షించాలని, బాల్యవివాహాలు కాని, కామప్రధానంకాని, వరశుల్కాలు లేని పెళ్ళిళ్ళు జరగాలనీ అనాథలను, వ్యభిచారవృత్తి నుండి రక్షింపబడినవారిని సేవాసదనాలలో చేర్పించాలనీ, స్త్రీలు బలాఢ్యులుగా ఆత్మరక్షణం చేసుకునే స్థితిలో ఉండాలని తెలియచేసింది.

*స్త్రీలు శక్తిహీనతను అధిగమించే విధంగా విద్యావిధానం ఉండాలని తెలియజేసింది. తెలంగాణా ప్రాంతంలో సభనుపెట్టి స్త్రీలలో సాంఘిక, ఆర్థికచైతన్యం కలిగించాలనుకొన్నారు. ఆ ప్రాంతం నిజాంరాజు సంస్థానం కాబట్టి ఆ సభలో రాజకీయవిషయాలు చర్చించలేదని అర్థమవుతుంది.*

వేముగంటి పాపాయమ్మ వ్రాసిన 'కాళ్ళకూరి మహాలక్ష్మి సుందరమ్మగారు' (జులై 1941 హిందూసుందరి) అనే వ్యాసంలో 25 సం.ల వయస్సులో మరణించిన ఆమె బాలాంత్రపు శేషమ్మ కుమార్తె అనీ, సంస్కృత మహిళావిద్యాలయంలో విద్యనభ్యసించి అక్కడనే గౌరవ ప్రధానోపాధ్యాయిగా పనిచేసినదనీ, పిదప కాశీవిశ్వవిద్యాలయంలో, 'జయం' అనే ఆనర్సు ఎల్.టి పూర్తిచేసి ఏలూరులోని స్త్రీల పాఠశాలకు ప్రధానోపాధ్యాయినిగా ఉద్యోగం చేసిందనితెలిపింది. మద్రాసులోని క్వీన్ మేరీ కళాశాలలో కాంచనపల్లి కనకమ్మగారి స్థానంలో యాక్టింగ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిందనీ, మహాలక్ష్మి సుందరమ్మని స్మరించుకుంటూ ఆమె విద్యావిశేషాలను పేర్కొంది.

*చిన్నతనంలోనే ఒక ఆంధ్రస్త్రీ కాశీవెళ్ళి చదువుకోవటం, ఉద్యోగం చేయటాన్ని అపురూపం గానే భావించాలి.*

రాణిరావు రాజ్యలక్ష్మి మురళీకృష్ణరావు అనే ఆమె చెన్నపురిలోని దుర్గాబాయమ్మ నెలకొల్పిన 'ఆంధ్రమహాసభ-స్త్రీలశాఖ' (ఆగష్టు 1941లో గృహలక్ష్మి) లో పారిశ్రామిక శాఖయొక్క ప్రారంభోపన్యాసంచేస్తూ ఆంధ్రనారీఉద్ధరణ, స్త్రీలశాఖావిద్యావ్యాప్తి, విజ్ఞానాభివృద్ధి, కళావికాసనానికి చేస్తున్న కార్యక్రమాలు గొప్పవనీ, హిందీ, తెలుగు, బెనారస్ మెట్రిక్యులేషన్, నృత్యం, సంగీతం, చిత్రలేఖనం నేర్పుతున్నారని చెప్పింది. స్త్రీల పారిశ్రామిక శాఖలో బట్టలకు రంగువేయుట,

అద్దకములు చేయుట, బుట్టలల్లుట, కాగితాల తయారీ, నవారు నేత మొదలగు గృహపరిశ్రమలలో ఉచితంగా స్త్రీలకు తర్ఫీదునిచ్చుటవంటిది ఆంధ్రుల కీర్తికి నిదర్శనమని భావించింది.

శనివారపు అన్నపూర్ణాదేవి వ్రాసిన 'ప్రపంచమున స్త్రీకిగల గౌరవం' (ఆగష్టు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీల సమానత్వాన్ని కోరుకొనే నవ్యనాగరికత ప్రపంచంలో ఉందిగానీ, హిందూ దేశంలో మాత్రం నిరక్షరాస్యులైన స్త్రీలను హింసిస్తూ అద్దుకత్తెలవలె చూస్తూన్నారనీ, విద్యావంతుడు, మేధావి, క్రమవర్తనుడైన పురుషుడైతే స్త్రీకి పురుషునితో సమానహక్కును ఇస్తాడనీ, స్త్రీకి విద్యాదానం చేయాలని భావించింది. ఫ్రెంచి రచయిత్రి స్త్రీవిద్యను ప్రశంసిస్తూ 'ఒక పిల్లవాడికి విద్యగరపిన ఒక్క వ్యక్తియే విద్యావంతుడగును, అదే ఒక పిల్లకు విద్యనేర్పిన వంశమంతట విద్యశోభిల్లును' అని, చెప్పిందని తెలియజేసింది. అంతేకాదు, స్త్రీ గూటిపిచ్చుకలవలె ఉంటే పతిని సహితం ఇంట్లో అరికట్టజూస్తుందనీ, చిరకాలంనుండి మగవాడి అధికారంక్రింద లొంగి కృశించిన స్త్రీ, నేడు స్వతంత్రతతో బతకాలనుకోవటం దోషంకాదనీ, స్వేచ్ఛగా బహిరంగ సభలకు వెళ్ళుటయే గాక పురుషాధిక్యతగల విద్యాలయాలలో చదివి ఆత్మరక్షణ చేసుకోవటాన్ని నేర్చుకోవాలని భావించింది. 'డికెన్స్' వచించినట్లుగా 'పదిమంది యాడువారిలో యువకుడొకడు మెలకువతో చరించుటకన్ననూ, సులభముగనొక స్త్రీ పదుగురు యువకులలో కడునేర్పరిగా తన్నుతాను రక్షించుకొనగలదని' చెప్పిన భావాలను తెలియజేసింది.

*భారతదేశంలో స్త్రీలు విద్యతో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మరక్షణను చేసుకోగల సామర్థ్యం పెంచుకోవాల్సిన అవసరాన్ని, పురుషులు స్త్రీల సమానహక్కులను గౌరవించాల్సిన చూడాల్సిన అవసరాన్ని నొక్కివక్కాణించింది.*

కామరాజుమైత్రేయి వ్రాసిన 'పంజరంలో చిలక' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో మొదటి నుండి స్త్రీలు పంజరంలో ఉంచబడి తండ్రి, భర్త, కొడుకుల దగ్గర జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నారనీ, ఆర్థికంగా స్వాతంత్ర్యము ఉంటేనేకాని స్వాతంత్ర్యం ఉండదనీ, ఆడపిల్ల పుట్టుకను హీనంగా చూస్తారనీ, తల్లిదండ్రులు ఆడపిల్లను పరాయిగానే చూస్తారనీ తెలిపింది. ఉపన్యాసాలలో తప్ప ఆచరణలో స్త్రీలకు పురుషులతోపాటు సమానహక్కులివ్వటానికి ఇష్టపడరనీ, భర్తనగలు తెస్తే సంతోషపడుతున్నారేగాని తమకు ఎలాంటి స్వాతంత్ర్యం కావాలో స్త్రీలు తెలుసుకోలేకపోతున్నారని తెలియజేసింది. కూలీనాలీ చేసుకునే స్త్రీలు ఆర్థికసమానత్వం కోసం ప్రయత్నిస్తారనీ, స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం ముఖ్యమనీ, అదివుంటే స్త్రీలు కుటుంబాన్ని వదలరని చెప్పింది. స్త్రీలకు వ్యవసాయభూములు లేని ఆస్తి హక్కు ఇవ్వాలనుకుంటున్నారనీ, ఆచరణలో స్త్రీ ధనం ఆడపిల్లలకు చెందటంలేదనీ, స్త్రీధనంతో పురుషుడు అప్పులు తీర్చకుంటున్నాడనీ, అన్ని సమానత్వాలు, హక్కులు అర్థం/ధనం మీదనే ఆధారపడి ఉన్నాయని తెలిపింది. స్త్రీలు ఆర్థికంగా, సాంఘికంగా బలపడాలంటే, విద్యావంతులుకావాలని భావించింది. ఇప్పుడిప్పుడే పురుషులు స్త్రీలకు జరిగే అన్యాయాలను ఆలోచిస్తున్నారనీ స్త్రీలు స్వాతంత్ర్యానికి సంబంధించిన విషయాలను చర్చించి తీర్మానాలుచేసి స్త్రీలఅభివృద్ధికి పాటుపడటాన్ని అభినందించాలని తెలియజేసింది.

*పురుషులకువలె తాము సమానంగా ఆర్థికస్వాతంత్ర్యం, సాంఘిక స్వాతంత్ర్యాన్ని పొందాలనే ఆలోచనలు స్త్రీలలో బలంగా ఏర్పడిన విషయంగా అర్థం అవుతుంది. స్త్రీల పుట్టుకకు విలువ ఉందనీ, స్త్రీ పురుషుల సమాన ఆర్థిక హక్కులు స్త్రీ పురుషుల సాంఘిక సమానత్వానికి చిహ్నమని భావించటం జరిగింది. శ్రామికవర్గపు స్త్రీలలో ఆర్థికస్వాతంత్ర్యకాంక్ష ఉన్నట్లు తెలియజేసింది.*

గంటి కృష్ణవేణమ్మ వ్రాసిన 'హింస-అహింస' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో మహాత్ముడు బోధించిన అహింసాతత్వం యుద్ధకాలంలో, దేశరక్షణ విషయంలో సంశయాన్ని కల్గించి, మున్షీవంటివారు కాంగ్రెసు నుండి రాజీనామాచేసారనీ, దానిమీద గాంధి తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ హింసకు స్వార్థం కారణమనీ, అహింస స్వభావవిరుద్ధంగా తోచినా ప్రాణత్యాగానికి సిద్ధపడియైన అహింసాధర్మాన్నే ఆచరించాలనీ, దేశపరిస్థితికి అహింస క్షేమకరమని చెప్పాడు. పూనాసభలో నాయకులు మహాత్మునితో విభేదించి శాంతిరక్షణకు స్వపరిరక్షణకు హింసకొంత వరకు ఆవశ్యకమని భావించారనీ, అలాంటివారు కాంగ్రెసును వదలిపెట్టి వెళ్ళిపోవటానికి వారికి స్వాతంత్ర్యం ఉందని గాంధీ చెప్పాడు. మతకలహాలు పోయి శాంతినెలకొల్పటానికి అహింసయే ప్రధానకార్యమనీ, మతసహనానికి, జాతీయైక్యతకు, గ్రామాభివృద్ధికి అహింసా పద్ధతి దోహద మొనర్చుననీ, జాతీయరంగమునకు స్వాతంత్ర్య సాధనకు అహింస అవసరమనీ, పరదేశ దండయాత్రలు, స్వదేశీవిప్లవాలను అణచటానికి అహింస విరుద్ధమైనా అప్పుడు కూడ హింస రాక్షసత్వానికే నిదర్శనంగానే ఉంటుందని తెలియజేసింది.

*స్వాతంత్ర్యసాధనకు గాంధి చెప్పిన అహింసయే పరమాయుధంగా భావించింది.*

దేశిరాజు భారతీదేవి వ్రాసిన 'అభివృద్ధి కావలెనన్నా' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే వ్యాసంలో రాజకీయ పరిస్థితులవల్ల ప్రపంచ సాంఘిక వ్యవస్థలలో మార్పులు జరుగుతూ ఉంటాయనీ, కాని స్త్రీల విషయంలో సంఘాచారాలు, వివాహాచారాలు, స్త్రీలహక్కులు మాత్రం మారక గడ్డకట్టుకొని ఉన్నాయనీ, మహమ్మదీయుల పరిపాలనలోనూ హిందూ స్త్రీల హక్కులు మారలేదని తెలియజేసింది. తండ్రి ఆస్తి యందు సోదరులతోపాటు ఆస్తిహక్కులేదనీ, హిందూరాజులు శాస్త్రాలలో చెప్పినట్టుగా స్త్రీలస్థితిని మార్పుకు గురికాకుండాచేస్తూ 'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనేది ఉందనీ, నేడు స్త్రీల దుస్థితిని చూసి శాసనసభలో చట్టాలు పెడుతున్నారుగానీ, ముఖ్యమైన ఆస్తి హక్కు చట్టం రావటంలేదనీ, 1934 స్త్రీల వారసత్వచట్టం ప్రకారం వ్యవసాయ భూములను అన్వయింపరాదని ఫెడరల్ న్యాయస్థానంవారు నిర్ణయించారనీ, దానివల్ల ప్రయోజనంలేదని భావించింది. అంతేకాక శారదాచట్టంవల్ల స్త్రీవిద్యాభివృద్ధి, బాలికారోగ్యం జరిగినా కొంత ఉపయోగమే కాని, శారదాబిల్లుకూడా భయపెట్టలేక పోతోందనీ, దేశంలో మరోచోటకెళ్ళి బాల్యవివాహాలు చేయించి వస్తున్నారని చెప్పింది. శారదాబిల్లుచట్టాన్ని అమలుచేస్తూ 15 ఏండ్లు లోపల వివాహం కాకుండా విద్యాభ్యాసం చేయిస్తే స్త్రీలకు కొంతవరకు బాధతగ్గుతుందని భావించింది. ఆస్తిహక్కుఉంటే స్త్రీ దేశంలో ఏసంఘమునైనా పోషించగలదనీ, దేశసేవ చేయగలదనీ

స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యం వల్ల సమాజాభివృద్ధి జరుగుతుంది కాబట్టి స్త్రీలకు పురుషులతో పాటు సమానమైన ఆస్తి హక్కు ఉండాలని తెలియజేసింది.

*రాజకీయపరిణామాలతో ప్రజాస్వామ్యం ఏర్పడుతున్నప్పుడే దానికి తగ్గట్టుగా స్త్రీల సాంఘిక, ఆర్థిక హక్కులలో మార్పులు రావాలనీ, అప్పుడే స్త్రీలవ్యక్తి స్వాతంత్ర్యసాధన ఫలవంత మవుతుందని భావించింది.*

వడ్డాది కమలాదేవి బరంపురంలోని 'సప్తమ గంజాం మండల మహిళాసభలో' (నవంబరు 1941 గృహలక్ష్మి) చేసిన అధ్యక్షోపన్యాసంలో స్త్రీల స్వాతంత్ర్యం తీర్మానస్థాయిలోనే ఉంటోందనీ, స్త్రీకి పురుషుడితో పాటు సమానమైన ఆస్తి హక్కులేదనీ, స్వాతంత్ర్యం లేదని చెప్పింది. పురుషులతోపాటు స్త్రీలు ఆంధ్రరాష్ట్ర ఆందోళనకు పూనుకోవాలని చెప్పింది. మహాత్మాగాంధి చెప్పినట్లుగా అంటరానితనం రూపుమాపితే మాలవాళ్ళు చదువుకోగలుగుతారని తెలిపింది. జాతీయ పరిశ్రమను అభివృద్ధిచేయాలనీ, రైల్వేస్టేషనులో, సముద్ర తీరాలలో స్త్రీలకు ప్రత్యేక స్థానాలుండాలనీ, స్త్రీలకు డాక్టర్ పరీక్ష రుసుము మినహాయింపు ఉండాలనీ, కట్నం ఇవ్వకూడదనీ తెలియజేసింది. అదే సభలో న్యాయపతి రంగనాయకమ్మ ఉపన్యసిస్తూ హిందూ ధర్మశాస్త్రాలలో కొన్ని మార్పులు చేసి స్త్రీలకు ఆస్తిహక్కు ఉండేటట్లు చేయాలనీ, అదే స్త్రీ స్వాతంత్ర్యం అని చెప్పింది. జాతీయ పరిశ్రమలయందు అభిరుచి కలిగించే విద్యను స్త్రీలకు నేర్పించాలనీ, గాంధిగారికి స్త్రీసమాజాలు సహకరించాలనీ, అదే హైందవస్త్రీయొక్క జాతీయత అని పేర్కొంది.

*స్త్రీలకు ఉచిత విద్య, వైద్యం చేయాలని, ఆస్తిహక్కు ఉంటేనే స్త్రీలకు స్వాతంత్ర్యం ఉన్నట్లని భావించటం నూతన ఆలోచనగా అర్థం అవుతోంది. స్త్రీలు తమ అవసరాలను గుర్తించటమే స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యానికి, హక్కుల చైతన్యానికి మార్గదర్శకత్వం అవుతుంది. ఆంధ్రరాష్ట్రోద్యమంలో కూడా స్త్రీల భాగస్వామ్యం ఉండాలని కోరుకొంది. ఆస్తిహక్కు కలిగిఉండటమే స్త్రీల స్వాతంత్ర్యం అని వక్కాణించింది.*

'దేవదాసీల సంస్కరణము' (నవంబరు 1941 గృహలక్ష్మి) అనే శీర్షికన పత్రిక ప్రచురిస్తూ కొచ్చిన్ లో డా.ఎన్.ముత్తులక్ష్మిరెడ్డి సభలో చేసిన ఉపన్యాస ప్రభావంతో కొచ్చిన్ ప్రభుత్వము వారు దేవాలయాలలో దేవదాసీల నాట్యమును, గానమును నిషేధించుచూ ప్రకటన చేసారని తెలియజేసింది. దేవదాసీవ్యవస్థ రూపంలో అవినీతిని, అపవిత్రతను ప్రోత్సహించకూడదనీ, దేవదాసీలంటే కన్యాత్వంతో గాన, నాట్యాలలో దేవాలయాలలో దైవసేవ చేసేవారనీ, 1909 లోనే మైసూరు సంస్థానం వారు దేవదాసీల సేవను నిషేధించారని తెలిపింది. 1930 మదరాసు శాసన సభలో హిందూమతధర్మాదాయముల చట్టమును సవరించి దేవాలయములో దేవదాసీల సేవను నిషేధించి వారికి ఇనాము హక్కులిచ్చారనీ, బాలికలను దేవదాసీ వ్యవస్థకు అర్పణ చేస్తే, వారు శిక్షార్హులని చెప్పింది. గాంధీనాయకత్వంలో దేవదాసీ సంస్కరణ చట్టమును చేయాల్సిన అవసరముందనీ, మదరాసులో సెలెక్షన్ కమిటీ స్థాయి దాటి దేవదాసీ సంబంధమైన బిల్లును చట్టం క్రింద తీసుకురావాలని డాక్టరు ముత్తులక్ష్మి కోరటాన్ని పత్రిక తెలియజేసింది.

కాకినాడలోని విద్యార్థినీ సమాజం, మహిళావిద్యాలయం, రాజ్యలక్ష్మి పుస్తకభండాగారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన హిందూసుందరి పత్రిక 30 వ రజతోత్సవ సభలో (మార్చి 1944 హిందూసుందరి) విద్యాసంస్థల నివేదికల ప్రచురణలో 1910లో విద్యార్థినీ సమాజం పునరుద్ధరింప బడిందనీ, స్త్రీలకు విజ్ఞానాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుందనీ, 1923లో బాలికలకు యువతుల విద్యాభివృద్ధికై మహిళావిద్యాలయం పేరుతో సంస్కృత పాఠశాలను స్థాపించగా, దానిని 1927లో ప్రభుత్వం ప్రాథమిక బాలికాపాఠశాలగా గుర్తించిందనీ తెలిపింది. అంతేకాక, ఈ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు, ఆంగ్లం, కుట్టుపని, సంగీతం, ఎంబ్రాయిడరీ, ఫేము అల్లిక మొదలగునవి బాలికలకు నేర్పిస్తున్నారనీ చేతిపరిశ్రమలో భాగంగా రాట్నం పరిశ్రమను నడుపుతున్నారని తెలిపింది. కందుకూరి రాజ్యలక్ష్మి పేరుతో ఉన్న గ్రంథాలయంలో 1679 గ్రంథాలున్నాయనీ, నేడు విద్యార్థినీ సమాజంలో లేసు అల్లిక, ఖద్దరు గుడ్డలను నేయించి అమ్మకం చేసి కళాశాల అప్పులను తీర్చటం జరిగిందని పేర్కొన్నది. రాట్నపరిశ్రమవల్ల పెట్టుబడికంటె ఆదాయం అధికంగా వచ్చిందనీ, విద్యార్థులచే తోటపనిచేయించి పండ్లు, కూరగాయలు అమ్మి స్వల్పాదాయంలో విత్తనాలు కొనటం చేస్తున్నారన్న విషయాలను నివేదికలో తెలియజేయటం జరిగింది.

*ఈ వ్యాసంలో పేర్కొన్న విద్యాలయంలో దారిద్ర్యనిర్మూలనలో భాగంగా వస్తూత్పత్తిని నేర్పి, ప్రయోగాత్మక శిక్షణను యిచ్చినట్లుగా అర్థమవుతుంది.*

*కాకినాడలో జరిగిన 'విద్యార్థినీ సమాజం' (మే 1944 హిందూసుందరి) యొక్క రజతోత్సవ సభలో చుండూరి వెంకటరత్నమ్మ గారి అధ్యక్షోపన్యాస ప్రచురణలో స్త్రీల ప్రగతికై ఉద్యమ స్థాయిలో చేస్తున్న కార్యక్రమాన్ని అభినందించిందనీ, విద్యార్థినులు తయారు చేసిన వస్తు ప్రదర్శనను తిలకించి 'ఉత్సాహవంతులైన స్త్రీల వస్తూత్పత్తి దేశదారిద్ర్యాన్ని పోగొడ్తుతుందని ఆమె తెలియజేసిందని పత్రికాధిపులు ప్రచురించారు.*

పి.రాజరాజేశ్వరి వ్రాసిన 'స్త్రీలహక్కులు' (అక్టోబరు,1944 రూపవాణి పత్రిక) అనే వ్యాసంలో నూతన శక్తుల ప్రేరేపణతో స్త్రీలు చేస్తున్న అన్వేషణ కొంతవరకు ఫలించింది కానీ, స్త్రీలు హక్కులకోసం ఉద్యమం చేస్తున్నా, పురుషుడు స్త్రీని అర్థంచేసుకోకుండా తనకింద బానిసఅని అనుకుంటున్నాడని తెలిపింది. భార్యలు కర్మసిద్ధాంతంతో బతుకుతున్నారనీ, స్త్రీలకు విద్యావకాశాలు లేక తమ శక్తియుక్తులను వంటయింటికే పరిమితంచేస్తున్నారనీ, బాల్యవివాహాలు పోవాలనీ, పునర్వివాహాలు జరగాలనీ, స్త్రీలకు ఆస్తిహక్కు, విడాకులు యిచ్చేహక్కు ఉండాలని భావించింది.

*స్త్రీలలో హక్కుల చైతన్యాన్ని కలిగించే వ్యాసమిది.*

'స్త్రీలు ఆరోగ్యము' (అక్టోబరు 1946 వాసవి) అనే శీర్షికన శిఖరం కమలాంబ వ్రాస్తూ స్త్రీలు తమ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తూ, శుభ్రమైన వాయువును

పీల్చాలనీ, నిర్మలమైన నీరు త్రాగాలనీ, ఆరోగ్యకరమైన ఆహారాన్ని భుజించాలనీ, ధరించు వస్త్రాలను, ఇంటినీ శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపింది. అంతేకాక, దేశంలోని మాతాశిశు మరణాలకు కారణం బాల్యవివాహాలేనని పురుటిగదులలో గాలి, వెలుతురు బాగుండాలనీ, గర్భిణులు లఘు ఆహారాన్ని భుజించాలనీ, తల్లులు శిశుపోషణాన్ని తెలుసుకోగలగితే శిశువుల ఆరోగ్యం, తల్లుల ఆరోగ్యం, స్త్రీలప్రవర్తన, విద్యాకుశలతనుబట్టీ ఉంటుందని అదే దేశానికి క్షేమకరమని తెలియజేసింది. అంతేకాదు, దేశంలో జరిగే బాల్య వివాహాలవల్లను, చిన్నతనంలోనే జరిగే ప్రసవాలవల్ల అటు శిశు మరణాలేగాక స్త్రీలకు వ్యాధులు ఎక్కవౌవుతున్నాయనీ, చిన్నతనంలో ప్రసవాల వల్ల స్త్రీలు బలహీనులుగా మారుతున్నారనీ, మేనరికం వివాహాలవల్ల సంతతి యొక్క దేహశక్తి, మేధాశక్తి తగ్గుతుందని తెలిపింది. పిల్లలే తల్లులయేసరికి వారి పిల్లలకు ఎటువంటి ఆహారం ఇవ్వాలో తెలియక, పిల్లల వ్యాధులకు తగిన మందులు ఇవ్వక పోవటంతో శిశువులు అనారోగ్యానికి గురి అవుతున్నారు కాబట్టి మాతా శిశువుల ఆరోగ్యమే దేశక్షేమమని అదే దేశశ్రేయస్కరమని తెలియజేసింది.

*మానవాభివృద్ధిలో ప్రజాఆరోగ్యం ఒక సూచికాంశమనే భావన ఆనాడే ఆమెలో కలగటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.*

1941 నాటి జనాభా లెక్కలను (జనవరి 1947 గృహలక్ష్మి) పత్రిక ప్రచురిస్తూ 1000 మంది పురుషుల నిష్పత్తికి 935 మంది స్త్రీలున్నారనీ, పంజాబ్ లో పశ్చిమోత్తర పరగణాలో స్త్రీల జనన నిష్పత్తి 84.7 శాతం మాత్రమే ఉందని తెలిపింది. ప్రాథమిక విద్యాభ్యాసం చేసేవారిలో 1040 మంది మగపిల్లలు పాఠశాలలకు పోతుంటే ఆడబిడ్డలు 10 మంది మాత్రమే వెళుతున్నారనీ చదవనూ వ్రాయనూ నేర్చిన స్త్రీలు పురుషులలో 4వ వంతు మాత్రమే ఉన్నారనీ తెలియజేసింది. జనాభాలో స్త్రీలశాతం, స్త్రీలవిద్యకు సంబంధించిన ఈ గణాంకాలు స్త్రీల జీవనహక్కులకు నిదర్శనం.

పాకల రాజామణెమ్మ వ్రాసిన 'సంఘాన్ని బాగుచేసే ముఖ్య శాసనాలేవి' (జనవరి 1947 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో భారతస్త్రీల కష్టాలుపోయి కుటుంబంలో శాంతి సౌఖ్యం ఏర్పడేటట్లుగా చట్టాలు చేయటానికి స్త్రీలు కష్టపడాలని చెప్పింది. వరకట్న వివాహాలు, బాల్యంలోనే వైధవ్యం ఏర్పడటానికి, తండ్రి ఆస్తిలోగానీ భర్త ఆస్తిలోగానీ హక్కులేక పడియుండటానికి గానీ, అనుకూల దాంపత్యాలు లేకపోవటానికి, బహుపత్నీ నిరోధకానికిగానీ అవసరమైన స్త్రీపురుష సమాన హక్కులు శాసనరూపంలో రావాలని తెలియజేసింది.

*స్త్రీల సంఘం బాగుపడటానికి, స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యానికి అటువంటి శాసనాలు దోహద పడతాయని రచయిత్రి భావించింది.*

*స్వాతంత్ర్యం రాకమునుపే స్వతంత్ర భారతదేశంలో స్త్రీలసమస్యలు తీరటానికి తయారు చేయాల్సిన రాజ్యాంగ నిర్మాణాన్ని గురించి ప్రతిపాదించటం స్త్రీల ముందుచూపుకు నిదర్శనం. వారియొక్క రాజకీయ చైతన్యంలో ప్రజాస్వామ్య దృక్పథం స్పష్టమౌతోంది.*

'రెండవ ప్రపంచయుద్ధ పరిణామా'లను గురించి (జనవరి 1947 గృహలక్ష్మి) పత్రిక ప్రచురిస్తూ ఐదేండ్లపాటు చేసిన ద్వితీయ ప్రపంచ యుద్ధంలో గొప్ప రాజ్యములు అంతరించాయనీ, జర్మనీ, ఇటలీ, జపానుదేశాలు వాటిననుసరించిన చిన్నరాజ్యాలు పడి పోయినాయనీ, పట్టణాలు, కర్మాగారాలు, గ్రామాలు శిథిలములైపోయాయనీ, లక్షలకొలది ప్రజలు నశించారని తెలిపింది. శాంతికుటీరమువంటి, ఐరోపాఖండంలో దేశములమధ్య అనుమానము, అసూయ, భయం, తగ్గలేదనీ, ఆసియాలో సామ్రాజ్యవాద సిద్ధాంతం మారలేదని తెలిపింది. అంతేకాక, అరేబియా, బర్మా, జావా, సుమాత్ర మొదలైన దేశాలలో స్వాతంత్ర్యోద్యమాలు ప్రబలి అధికారవర్గము వారికిని జాతీయసంస్థలకును సంఘర్షణ హెచ్చుగా ఉన్నదని తెలియజేసింది. యుద్ధము రెండు పరస్పర విరుద్ధమైన సాంఘిక, నైతిక, ఆదర్శములకు మధ్య జరిగిన పోరాటమనీ, ఒక నూతనవ్యవస్థ నిర్మించి జాతి, మత, దేశ భేదములులేని ప్రజాస్వామ్యమునకు స్వాతంత్ర్యాన్ని, ఆర్థికాభివృద్ధిని కలగజేయాలని అనుకున్నారని తెలియజేసింది. ప్రజలకు కావలసినది రాజనీతికాదనీ, అమెరికా ప్రెసిడెంటు రూజ్‌వెల్టు చెప్పిన స్వాతంత్ర్య సూత్రమువలె ఆర్థిక విధానముల వ్యవస్థలతో పనిలేదనీ. అన్నము, బట్ట, గూడు చాలనీ, మత స్వాతంత్ర్యం, ఆత్మగౌరవంను కాపాడుకొనుటకు శాంతి కావాలనీ ఆ అభయమివ్వలేని ప్రభుత్వము నిరర్థకమని తెలిపింది. భారతదేశంలో 1942 సంవత్సరమున ఆగష్టులో కాంగ్రెసు నాయకులను అరెష్టు చేసిన వెంటనే దేశమంతా గొప్ప ఆందోళనలు, అల్లర్లు, బయలు దేరినవనీ, బెంగాలులో అసాధారణమగు క్షామంవల్ల లక్షల కొలది ప్రజలు మరణించారని చెప్పింది. 1945లో బ్రిటిష్ ప్రభుత్వంవారి తరపున ముగ్గురు మంత్రులు మనదేశమునకు వచ్చి రాజకీయ సమస్య పరిష్కరించటానికై దేశనాయకులను సంప్రదించి అంగీకారం కుదరక ఒక ప్రణాళికను తయారుచేసిందని తెలిపింది. ఆ ప్రణాళికను కాంగ్రెసు వారొక విధముగాను, ముస్లిమ్ లీగువారు మరొక విధంగానూ వ్యాఖ్యానంచేస్తుంటే, బెంగాల్, బీహార్ లో హిందూ మహమ్మదీయుల కలహాలు పెరిగి అనేకమంది ప్రజలు తమప్రాణాలను, ఆస్తులను కోల్పోయారని తెలియజేసింది. ప్రజలలో నూతన చైతన్యం వచ్చి నిద్రాణమైన జాతి మేల్కొందనీ, దేశానికి స్వాతంత్ర్యం లభించకపోతే దేశాభ్యుదయానికి ఆటంకం కలుగుతూనే ఉంటుందనీ, వాటిని తొలగించేటట్లుచేసి ప్రజలలో శక్తిని వికసించేటట్లుగా, భారతదేశం నాయకత్వం వహించగలదనే నమ్మకం వారిలో కల్గించాలని పత్రిక భావించింది. ముఖ్యంగా స్త్రీలకు ఆర్థిక, సాంఘిక, స్వాతంత్ర్యం వంటి హక్కులు లేని కారణంగా స్త్రీలు కర్తవ్యాన్ని నెరవేర్చలేకపోతున్నారనీ, స్త్రీలకు అన్యాయం తొలగి స్వాతంత్ర్యం వస్తే స్త్రీలు దేశకళ్యాణానికి ఉపయోగపడతారనే భావన ఏర్పడుతోందని పత్రిక తెలియజేసింది.

*శ్రీశ్రీ కవితలో వలె రెండు పరస్పర విరుద్ధ శక్తుల మధ్య చరిత్ర పుట్టిందనేది నిజమని ఈ వ్యాసంలో అర్థమవుతుంది.*

'విజయలక్ష్మి పండిట్'ను గురించి (జనవరి 1947 గృహలక్ష్మి) పత్రికాధిపుల ప్రచురణలో 1900 సం.లో ఆగష్టు 18వ తేదీనాడు ప్రయాగలో మోతీలాల్ నెహ్రూ యింట స్త్రీశిశు జననమవటంతో మబ్బులు కమ్మి వర్షం వచ్చిందనీ, కరువు మాయమైందనీ ఆమెయే విజయలక్ష్మి

పండిట్ అని తెలిపింది. విజయలక్ష్మి యొక్క తాత 1857 కి ముందు మొగలాయి సామ్రాజ్యంలో ఢిల్లీ కొత్వాల్‌గా ఉన్నారనీ, తెల్లవాని పెత్తనాన్ని ధిక్కరించాలని అనుకొన్నారని పత్రిక తెలియజేసింది. విజయలక్ష్మి పెదతండ్రి భార్యను ఆంగ్ల సోల్జరులు ఆమెను ఒక ఆంగ్ల బాలికగా తలంచి నెహ్రూ కుటుంబం అపహరించుకొని పోవుచున్నారని దూషించి వారిని సైనిక విచారణ చేయించారనీ, నెహ్రూ పూర్వులది మొగలాయి సాంప్రదాయమైతే, మోతీలాలు నెహ్రూ ఆంగ్ల సాంప్రదాయమును స్వీకరించి విజయలక్ష్మిని విద్యావంతురాలుగా చేయటంకోసం ఒక ఆంగ్ల యువతిచేత ఇంటి దగ్గరే శిక్షణను యిప్పించారని తెలియజేసింది. ఆ తరువాత 1915 లో తండ్రితోపాటు బొంబాయి వెళ్ళిన విజయలక్ష్మికి హృదయంలో దేశసేవాసక్తి కలిగిందనీ, పంజాబులో జరిగిన హత్యలవల్ల తన తండ్రికి, అన్నకు కలిగిన మనోవేదన ఆమెలో స్వాతంత్ర్య సమరాసక్తిని కల్గించిందని చెప్పింది. తండ్రితో అనేకసార్లు విదేశాలకు వెళ్ళిందనీ, గుజరాత్ వాసుడైన మహాదేవ దేశాయ్ తో 1921లో పెళ్ళి జరిగిందనీ, 1944లో జైలు నుండి బయటకు రాగానే ఆమె భర్త రోగగ్రస్థుడై మరణించినప్పటికి 1945 నుండి ఆమె తిరిగి దేశసేవలో తన కర్తవ్యాన్ని గుర్తుంచుకొని అమెరికాకు వెళ్ళి ప్రపంచం దద్దరిల్లేటట్టు స్వాతంత్ర్య ప్రబోధం గావించిందని తెలిపింది. 1945లో అమెరికా ఫ్రాన్సిస్కోలో జరిగిన యునైటెడ్ నేషన్సు సమావేశానికి వెళ్ళి ప్రతినిధిగా భారతీయ జాతీయాభిప్రాయాన్ని ప్రచారంచేసిందని తెలిపింది. అంతేకాదు, 1946 లో వివిధ రాష్ట్రముల మంత్రివర్గం ఏర్పడినప్పుడు వచ్చిన కాబినెట్ మిషన్ సంప్రదింపుల ఫలితంగా కేంద్రప్రభుత్వం ఏర్పడినదనీ, ఆ ప్రభుత్వంలో జవహర్ లాల్ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి కావటంతో తన తరపున ప్యారిస్ కి విజయలక్ష్మిని పంపగా, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కులు నిరాకరిస్తూ చట్టాలు చేయగా అక్కడ సత్యాగ్రహోద్యమం నడుస్తున్న సమయంలోనే అంతర్జాతీయ సభకు స్వతంత్ర భారతదేశపు ప్రతినిధిగా వెళ్ళి ధైర్యస్థైర్యాలతో యుక్తి ప్రయుక్తులతో మాట్లాడిందని తెలిపింది. దక్షిణాఫ్రికా ప్రధానియైన స్మట్సుపై వాదించి అక్కడి భారతీయుల ఆత్మగౌరవము నిలబెట్టగలిగిందనీ, అనేకసార్లు ఖైదును అనుభవించిందనీ, భారతదేశంలో ప్రప్రథమమున రాష్ట్రమంత్రిణిగా పరిపాలన సమర్థతతో సాగించిందనీ, మాస్కోప్రభుత్వం దగ్గర భారతప్రభుత్వ రాయబారిగా నియమింప బడిందని పత్రిక తెలియచేసింది.

*గృహలక్ష్మి పత్రిక దేశరాజకీయ పరిణామాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు స్త్రీలకు తెలియజేయటానికి ఎంతో కృషిచేసిందని అర్థమవుతుంది.*

వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ 'భోగంమేళాల నిషేధం' (ఫిబ్రవరి 1947 గృహలక్ష్మి) అనే బిల్లును గురించి వ్రాస్తూ మదరాసు రాష్ట్రం చట్టంగా చేసిందనీ, దాని ప్రకారం ఇది కళావంతుల మేళముల నిషేధ చట్టం 1947 అనీ, భోగం, సాని, నాగవాసీలు, దేవదాసీలు, కూర్మాపులు అని పిలువబడిన వారందరూ కళావంతులని తెలిపింది. మేళమనగా ఒక అవివాహిత స్త్రీ గానీ, ఎక్కువ మందిగానీ, ఇతరులెవ్వరితో కలసి గాని దేవాలయాలు, వివాహాలు, మతసాంఘిక ఊరేగింపులలో, రహస్యప్రదేశాలలో గానీ నృత్యం చేయరాదనీ, 16 సం.లు పైబడినవారు ఇటువంటి పనులు చేస్తే

1898 శిక్షాస్మృతి ప్రకారం నేరస్థులుగా పరిగణింపబడతారని చెప్పింది. చట్టాన్ని తయారుచేస్తే పురుషులు కొంతమంది భోగంమేళం నిషేధచట్టాన్ని వ్యతిరేకించటం పురుషుల భోగలాలసకు చిహ్నమని తెలియజేసింది.

*దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భోగంమేళ నిషేధపు బిల్లు దేవదాసి నిషేధచట్టంగా వచ్చింది. చివరికి డా.ముత్తు లక్ష్మిరెడ్డి ప్రయత్నం ఫలించిందని అర్థమవుతుంది.*

ఆచంట రత్నకుమారి వ్రాసిన 'వరకట్నాలు' (ఫిబ్రవరి 1947 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో వరకట్న దురాచారం తల్లిదండ్రులను పీల్చి పిప్పిచేస్తోందనీ, ఆ కట్నం స్త్రీ ధనమనీ దానితో యువకులు పెద్ద చదువులు చదువుకోవాలనుకోవటం అనైతికత అనీ, యువకులు తమ తల్లిదండ్రుల బానిసత్వంనుండి విముక్తులై స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలగాలని తెలియజేసింది.

*వరకట్న దురాచారం వల్లనే తల్లిదండ్రులు పెళ్ళికెదిగిన కూతురును గుండెలమీద కుంపటని భావించటం స్పష్టమౌతుంది.*

మద్దూరి మీనాక్షమ్మ వ్రాసిన 'నవోదయము' (మార్చి 1947 గృహలక్ష్మి) అనే వ్యాసంలో భావిభారత భాగ్యోదయానికి స్త్రీలే మూలవిరాట్స్వరూపులనీ, నూతన వ్యవస్థ అభ్యుదయ పంథాలో నడుస్తుందనీ, స్త్రీలే భావిపౌరులకు ఆదర్శనారీమణులనీ, శిశువుల అభివృద్ధికి స్త్రీలే కారణభూతులని తెలిపింది. దేశాభ్యుదయానికి, స్త్రీలఅభివృద్ధికి కార్యకారణాలతోనే నూతనవికాసం కలుగుతుందనీ గ్రామాల అభివృద్ధి స్త్రీలచేతుల్లో ఉండాలని చెప్పింది. పూర్ణస్వరాజ్యం వచ్చినా నిర్మాణకార్యక్రమంలో యంత్రపరిశ్రమలకు ముఖ్యమైన ఆర్థిక శక్తిలేదనీ, అందుకని ప్రతివారు తమ కాళ్ళమీద తాము నిలబడి ఆహారాన్ని, వస్త్రాలను పొందాలంటే స్త్రీల అవసరం తెలుస్తుంది కాబట్టి స్త్రీ లందరూ ఇళ్లలోనే రాట్నములు వడకాలని స్త్రీ సంఘాలు కృషిచేసిన పల్లెభారతమే వాస్తవ ఇండియాగా భావించాలని తెలియజేసింది.

*భారతదేశానికి స్వాతంత్ర్య ప్రకటన రాబోయేసమయంలో ఆనాటి స్థితిలో యంత్ర పరిశ్రమలకు పెట్టుబడినిపెట్టే శక్తి దేశానికి లేదుకాబట్టి స్త్రీలు కుటీరపరిశ్రమలద్వారా ఉత్పత్తిని చేయాలని భావించింది. దేశాభివృద్ధిలో పల్లెస్త్రీల భాగస్వామ్యాన్ని తెలియజేసింది.*

వల్లూరుపల్లి వెంకట రత్నమణీబాయి వ్రాసిన 'వైవాహికాచారములు' (ఏప్రిల్ 1947 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీ జాతికిగల అభివృద్ధి నిరోధకశక్తులలో వరకట్నాలు ఒకటి అనీ, వివాహాలు చేయలేక పోతే వారిని నిందిస్తారనీ, వరకట్నం ఇవ్వలేక ధనాశతోనూ తండ్రులు, పిల్లలను కడువృద్ధులకిచ్చి పెళ్ళిచేస్తున్నారనీ, దేశములో వైవాహికాచారాలు పోతేనే దేశానికి మోక్షం కల్గుతుందనీ తెలియజేసింది.

*ఆ నాడే ఆర్థిక సంబంధాలతో కుదుర్చుకొనే వివాహాన్ని నిరసించే ఆలోచనలు కలిగాయని అర్థమవుతుంది.*

కృష్ణబాయి వ్రాసిన 'పెండ్లి చూపులెంతవరకు సమంజసం' (జులై 1947 గృహలక్ష్మి పత్రిక) అనే వ్యాసంలో విద్యావంతులైన వరులు కట్నాలు కావాలని అంటున్నారనీ, విద్యావిహీనులైన వరులను చదువుకున్న ఆడపిల్లలు యిష్టపడటంలేదని తెలిపింది.'పెండ్లి' చూపుల వ్యవహారం తగ్గాలనీ, బాలికా విద్యావిధానం సక్రమంగా ఉండేటట్లుచేసి పెండ్లి విషయాలు వారికే వదిలిపెడితే స్త్రీసంఘాభివృద్ధి జరుగుతుందనీ, స్త్రీలు హైస్కూలులో చదువుకోవటానికి జీతాలు కట్టించుకో కూడదనీ, స్త్రీలు చదువుకోవటమే వరకట్న సమస్యకు పరిష్కారమని తెలియజేసింది.

*వివాహవ్యవస్థలో పురుషాధికారానికి నాంది పలికే పెళ్ళిచూపుల సంస్కృతికి చరమగీతం పాడాలను కోవటమే గాక స్త్రీలకు ఉచితవిద్య అందుబాటులో ఉంటే స్త్రీ విద్యాభివృద్ధి జరుగుతుందనే విషయాన్ని ప్రతిపాదించటమే స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్య రథసారథ్యానికి చక్రాలను సమకూర్చటంగా భావించాలి. స్వాతంత్ర్య ప్రకటన జరిగే సమయంలో భారతదేశంలో ముందుగా వివాహ సంస్కృతిలో మార్పు రావాలని స్త్రీలు కోరుకోవటం అర్థం అవుతుంది.*

బోడపాటి అలివేలమ్మ వ్రాసిన 'రావుకమిటీ శిఫార్సులు' (జులై 1947 గృహలక్ష్మి) అనే వ్యాసంలో స్త్రీలకు సంపూర్ణస్వాతంత్ర్యం వస్తే బహుపత్నీ నిరోధం, విడాకుల బిల్లు వంటివి చట్టాలుగా వస్తాయనీ, స్త్రీలకు ఏవిధమైన ఆస్తిహక్కు లేదనీ, ఆస్తి హక్కును యిస్తే మహిళాభ్యుదయం కలుగుతుందని రావు కమిటీ అభిప్రాయపడిందని తెలియజేసింది. 1937 లో స్త్రీలవారసత్వపు హక్కును కేంద్రప్రభుత్వం ఇచ్చినా దానికింద చట్టంలో సాగు భూములు లేకుండా చేయటంతో, దానిని కోర్టు కూడా ఆమోదించాల్సివచ్చింది. స్త్రీలకు భూమిమీద హక్కు లేకుండా పోతుందనీ, వీలునామా రాయకపోతే తండ్రి ఆస్తిని కొడుకుకు, కూతురుకు సమానంగా ఇవ్వాలనీ, కానీ వీలునామా ముందే వ్రాసుకొని కూతురికి తల్లియొక్క ఆస్తిమీద హక్కుఉన్నా కొడుకుకి సగం వాటాలివ్వాలంటారని చెప్పింది. పిత్రార్జితానికి మనుమడు హక్కుదారుడై ఉన్నాడనీ, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే మనుమరాలికి కూడా పుట్టుకతో ఆ హక్కును కలిగిస్తే రావు కమిటీ న్యాయం చేసినట్లని తెలియజేసింది.

*కూతురికి పిత్రార్జిత ఆస్తిహక్కు లేకపోగా, స్త్రీధనంగా వచ్చిన ఆస్తిలో కూడా వాటా లేకుండా చేస్తున్న సామాజికసంస్కృతిపట్ల నిరసనను వ్యక్తంచేసింది. అందులో విడాకులను యిచ్చేముందే స్త్రీలకు ఆస్తిహక్కును యివ్వమని తెలియజేసింది.*

ఆంధ్రదేశంలో స్త్రీలకు వారసత్వపు ఆస్తిహక్కు చట్టాన్ని 1985 నుండి అమలు చేయబడి, దానికే 2005 లో కూతుర్ల జన్మహక్కునుకూడా పొందుపరచి సవరణ చేయటాన్ని, ఆనాటి స్త్రీలు ముందుగానే కోరుకొన్నారని అర్థం అవుతుంది.

1940 నుండి 1947 వరకు వచ్చిన వ్యాసాలలో స్త్రీలకు విద్య, ధనలోపం ఉండకూడదనీ, మహిళాచట్టాలను ఆచరణలో పెడితే స్త్రీపురుషసమానత్వం వస్తుందనీ, దేశ స్వాతంత్ర్యం కోసం

హిందూముస్లిముల ఐక్యత అవసరమనీ, స్త్రీలకు ప్రపంచజ్ఞానాన్ని యివ్వగలిగే పత్రికాపఠనం అవసరమనీ, స్త్రీలు జర్నలిష్టులయితే గృహపరిశ్రమలు, ఆరోగ్యం, శిశుపోషణ, దేశసేవ, సంఘసేవలను గురించి స్త్రీలకు తెలియజేస్తారని అర్థమవుతుంది. స్త్రీల వాఙ్మయానికి, జాతీయతకు సంబంధం ఉన్నదనీ, దేవదాసీ వ్యవస్థను రద్దుచేయాలనీ,స్వాతంత్ర్యసాధనకై హింసా, అహింసల స్వభావంగల సర్వోదయ, సామ్యవాదాల కలయిక అవసరమనీ, వరకట్న దురాచార నిర్మూలనలో యువతకు బాధ్యత ఉందనీ, స్త్రీవిద్యార్థి సంఘాలు ఉండాలనీ, మత, సాంఘిక సాంప్రదాయాలలో ఐక్యత ఉండాలనీ, స్థానికసంస్థలలో స్త్రీలు విధులను నిర్వర్తించాలనీ, సజీవమైన వాఙ్మయం రావాలని భావించారు. స్త్రీలు ఉద్యోగాలు చేయాలనీ, స్త్రీలకు వారసత్వపు ఆస్తి హక్కు ఉండాలనీ, స్త్రీలు గృహపాలనలో భాగంగా యింటిని ఒక ఆరోగ్య, పారిశ్రామికసంస్థగాను, లలితకళా నిలయంగాను, నైతిక శిక్షణాలయంగాను తీర్చిదిద్దగలిగితేనే భారతమాత యొక్క దాస్యవిమోచనం కలుగుతుందని భావించారు. స్త్రీలు అభివృద్ధిచెందాలంటే స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనీ, స్త్రీలు రాజకీయాలలోకి, సంఘసేవలో ప్రవేశించాలంటే సామాజికనిందలను ఎదుర్కొనే ధైర్యం ఉండాలనీ, స్త్రీపురుష సమానహక్కులు శాసనరూపంలో ఉండాలనీ, భావిభారత భాగ్యోదయానికి స్త్రీలే మూలవిరాట్టులనీ, బ్రతుకుతెరువుకై స్త్రీలు కుటీరపరిశ్రమలను పెట్టుకొని ఆదాయాన్ని పొందాలనీ, బహుపత్నీ నిషేధచట్టం, విడాకుల చట్టం రావాలని తెలియజేస్తూ స్త్రీలు వ్యాసాలను వ్రాసారు.

**కథలు**

క్రీ.శ.1940 నుండి 1947వరకు అంటే భారతదేశ స్వాతంత్ర్యం వచ్చేంతవరకు స్త్రీల సాహిత్యంలో 11 కథలు వచ్చాయి. స్త్రీపురుష సమానత్వం, వైవాహిక స్వాతంత్ర్యంగల స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యాన్ని, దేశస్వాతంత్ర్యం కోసం ఖద్దరుఉద్యమం యొక్క కొనసాగింపులో స్త్రీల భాగస్వామ్యానికి తగిన చైతన్యాన్ని యిచ్చేకథలను స్త్రీలు వ్రాసారు.

వట్టి శేషాంబ వ్రాసిన 'మా గృహిణి' (ఏప్రిల్ 1940 గృహలక్ష్మి) అనే కథలో స్త్రీ చదువుకుంటే చక్కగా శిశుపోషణకై చక్కని ఆహారాన్ని అందిస్తూ, శిశువులో సద్గుణాలను సత్యసంధతను, దేశభక్తిని ప్రబోధిస్తూ పెంచితే ఆ శిశువులే రేపటి దేశభక్తులవుతారని తెలియజేసిన కథ.

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'ఎప్పటికో జ్ఞానోదయం' (ఆగష్టు 1940 గృహలక్ష్మి) అనే కథలో స్త్రీలు భగవత్సేవకని గుడికి వెళ్ళి అక్కడ చెబుతున్న పుక్కిట పురాణ ప్రవచనాలను వినటానికి ఇష్టపడతుంటారని ఒక భర్త స్త్రీలను వెకసక్కంచేయగా, ఆ భార్య హరికథలు కూడా ఆడవారి అలంకారాలను గురించి మాట్లాడుతూ ఉంటే స్త్రీలు తమ సంగతి కాదన్నట్టు పట్టించుకోకుండా ఆనందిస్తూ ఉంటారనీ, హరికథకులను శిక్షించాలని చెప్పింది. అప్పుడు దానికి భర్త భార్యతో ఆమె వెళ్ళిన సమాజ సమావేశాన్ని గురించిన విశేషాలను చెప్పమని అడగగా, ఆమె స్త్రీలచే స్థాపింపబడి స్త్రీల అభ్యుదయం కోసం పనిచేస్తున్న సమావేశాలకు స్త్రీలు తక్కువగా హాజరవుతారనీ, భర్తలు

తమ భార్యలకు అవిద్యాగంధం ఉండటంచేతనే వారిని హరికథలకు యిష్టంగా పంపుతారని చెప్పింది. దానికి కారణంగా స్త్రీలు సమాజాలకు వెడితే వారిలో జ్ఞానదీప్తి వెలిగి వారిలో స్వాతంత్ర్యకాంక్ష రేకెత్తుతుందనీ, స్త్రీల మధ్య సంఘీభావం ఏర్పడితే తమ అధికారాలకు ముప్పు వస్తుందనే భయం భర్తలకు కలగటమేనని తెలియజేసింది. కాబట్టి స్త్రీలకు జ్ఞానోదయం కలగాలంటే హరికథలకంటే కూడా స్త్రీసమాజాలకు వెళ్ళాలనే యిష్టం స్త్రీలకు ఏర్పడాలని రచయిత్రి సూచించింది.

*స్త్రీలు స్త్రీసమాజాలకు వెళ్ళి వ్యక్తిస్వాతంత్ర్యపు విలువలను తెలుసుకోవాలని భావించింది. అప్పుడే సమాజం బాగుపడుతుందని కూడా భావించింది.*

ఈమెయే వ్రాసిన 'నీలాటిరేవు' (జులై 1945 ఆంధ్రజ్యోతి మాసపత్రిక) అనే కథలో చదువుకున్న యువకులు వరకట్నానికి, లాంఛనాలకు మరింతగా కన్యాదాతను పీడిస్తూ వున్నారనీ, హిందూ లా అనే చట్టం వస్తే గానీ ఈ వరకట్న సమస్య తీరదనీ, దానికంటే ముందు యువకులలో హృదయ పరివర్తన కలగటం అవసరమని కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

*'హిందూ లా' రావాల్సిన అగత్యాన్ని 1945లోనే కనుపర్తి వరలక్ష్మమ్మ పేర్కొనటం ఆశ్చర్యాన్ని కలగజేసింది. భారతదేశ స్వాతంత్ర్యానంతరం 1955 లో 'హిందూ మ్యారేజ్ యాక్ట్' ని చేసారు. స్వతంత్ర భారతదేశంలో 1961లో వరకట్న నిషేధచట్టం వచ్చింది.*

పులిపాక బాలాత్రిపురసుందరమ్మ వ్రాసిన 'ఆదర్శ నారీమణి' (జులై 1941 గృహలక్ష్మి) అనే కథలో పల్లెలో పుట్టి పెరిగిన అమ్మాయి అయినా ఆమెకు పెళ్ళయిన తరువాత పట్నంలో ఉండటంతో, ఆమె భర్తకు ఎంత జీతం వచ్చినా క్లబ్ లకు, పండ్లు, టానిక్కు, పిల్లలఆటవస్తువులు, బిస్కట్లకు ఎంబ్రాయిడరీదారాలకు ఖర్చుచేస్తూ సోమరిపోతుగా తయారయిందనితెలిపింది. ఆమె స్నేహితురాలు మాత్రం చదువుకుంటూ పెళ్ళయినా కూడా భర్తతో పల్లెలోనే అడుగు పెట్టి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇంటిపనీ, తోటపనీ, రాట్నంపని వంటివి చేసుకుంటున్నదని తెలియజేసింది. బస్తీవాళ్ళు పల్లెలమీద ఆధారపడతారు గానీ, పల్లెలో వారు బస్తీల మీద ఆధారపడరని భావిస్తూ ఆ స్నేహితురాలు స్వయంగా నూలువడికి తయారుచేసిన ఖద్దరు వస్త్రాలనే ధరిస్తూ పుట్టింటి పొలం మీద వచ్చిన డబ్బును దానధర్మాలు చేస్తూ, ఆదర్శ గృహిణిగా ఉన్నదని చెప్పి కథను ముగించింది.

*పట్టణనాగరికతపై మోజులేకుండా ఒక గృహిణిగా ఆదర్శంగా పల్లెలో జీవిస్తూ ఖద్దరు ఉత్పత్తులు చేస్తూ దేశానికి సేవచేయటం ఒక ఆదర్శగృహిణియొక్క లక్షణమని తెలియజేసింది. స్త్రీలలో ఆడంబరాలు తగ్గి కాలాన్ని ధనాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఖద్దరు ఉత్పత్తి, తోటలో కూరగాయల ఉత్పత్తులు తయారుచేయటమే ఆదర్శజీవితం అని స్త్రీలందరికీ ఆదర్శగృహిణి నమూనా ఎలా ఉంటుందో తెలియచేసింది. పట్టణాలలో పాశ్చాత్యనాగరికతపై మోజుకలిగిన వారికి కనువిప్పు కల్గిస్తూ చైతన్య పరచిన కథయిది.*

చంద్రకాంతం వ్రాసిన 'ప్రేమవేదిక మీద' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే సంభాషణాత్మక కథలో జడ్జికూతురైన ఒక భార్యకు ఖద్దరును కట్టటం యిష్టం ఉండదు. ఆమెభర్త మాత్రం సహాయ నిరాకరణోద్యమ నిర్మాణ కార్యక్రమాలలో భాగంగా తాను చేస్తున్న మునిసిపల్ కమీషనర్ ఉద్యోగానికి రాజీనామాచేసి రాట్నం వడికి ఖద్దరు తయారుచేసి బేళ్ళను తీసుకొని వెళ్ళి, ఇంటింటా విక్రయించి ఆ సొమ్మును స్వరాజ్యనిధికి యిచ్చేవాడు. అతడు భార్యను మంచి ఖద్దరు నూలువస్త్రాలను కట్టుకోమన్నా తన భార్య విననందుకు బాధపడి ఆమెను కొన్నాళ్ళు పుట్టింటికి పంపి, తాను ఖద్దరు ఉద్యమంలో పాల్గొనటంతో అరెస్టు చేయబడ్డాడు. అక్కడ పుట్టింట్లో పనిమనిషి ఆమె తన భర్తకిష్టమైన మిల్లు ఖద్దరు కడుతున్నానని చెప్పేసరికి భార్యలో జ్ఞానోదయం కలిగి తానంతవరకు కడుతున్న విదేశీవస్త్రాలను తగులబెట్టి ఖద్దరు ధరించి జైలునుండి విడుదలయిన భర్తకు స్వాగతం పలికి హృదయభారాన్ని దింపుకుందని తెలియజేసింది.

*భర్తలు తమభార్యలు ఖద్దరు వస్త్రధారణతో ముతకగా కనిపిస్తున్నప్పటికీ ఖద్దరును కట్టడాన్ని యిష్టపడేంతగా ఖద్దరు ఉద్యమం ఊపందుకోవాలనీ, భార్యలుకూడా దాన్ని గ్రహించాలని, సత్యాగ్రహ ఉద్యమంతో స్వాతంత్ర్య సాధనకై చైతన్య పరచిన కథ.*

ఆచంట సత్యవతమ్మ వ్రాసిన 'దసరా బహుమానం' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో బాల్యంలో స్నేహితులమధ్య బీద, ధనిక తేడాలేనట్లే వివాహానంతరం కూడా భర్తల ఉద్యోగ స్థాయిలనుబట్టి తేడా లేకుండా ఉండటం అనేదే దేశభక్తిఅని చెప్పింది. దానికి ఉదాహరణగా రాట్నంవడికి నూలునుతీసి తయారుచేసిన ఖద్దరు బట్టలనే బీదరికంలో ఉన్న ఒక ఆమె తన స్నేహితురాలైన ధనికురాలి అబ్బాయి పుట్టినరోజున కానుకగా తీసికెళ్తుంది. ఆ ధనికురాలు మిగిలిన పేరంటాండ్రు తెచ్చిన బహుమానాలు వద్దని చెప్పి స్నేహితురాలిచ్చిన ఆ ఖద్దరు బట్టలనే దసరా బహుమానంగా భావించి కొడుకుకు వేసిందని తెలిపింది.

*కొడుకుని దేశభక్తుడిగా చూసుకోవాలనుకున్న ఆమె దేశభక్తి, బీద స్నేహితురాలియొక్క దేశభక్తితో పోటీపడటమే దసరాబహుమానంగా భావించటం జరిగింది. ఖద్దరును యిష్టపడటం దేశస్వాతంత్ర్య కాంక్షకు చిహ్నంగా నిలిచింది. ముఖ్యంగా వర్గభేద దృష్టిపోతే స్త్రీలలో సమైక్యత, దేశభక్తి ఇనుమడిస్తుందని భావించింది. దేశభక్తికి బీద, ధనిక భేదాలు ఉండకూడదని భావించింది.*

ఆయపెళ్ళి రామలక్ష్మి వ్రాసిన 'ధన్యజీవులు' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన కొడుకు మాలవారికి వైద్యం చేయటం నచ్చక ఆతని తండ్రి యింట్లోనుండి వెళ్ళకొట్టగా అతనితో పాటు ఆతని భార్యకూడా వెంటవెళ్ళి మాలపల్లిలోనే ఉంటూ, వారిద్దరూ మాలపిల్లలకు చదువు చెప్తూ, రాట్నంవడకటం నేర్పిస్తూ, వారిని ఖద్దరు ధరించేటట్లు చేస్తూ ఉంటారు. అంతేకాక వారికి వైద్యంచేస్తూ వారిజీవితాలలో అభివృద్ధిని ఆకాంక్షించిన వారుగా ఆ భార్యాభర్తలిద్దరూ ధన్యజీవులనీ, మాలవారిని కూడా సోదరభావంతో చూడాలనీ, వశిష్ఠుదే

అరుంధతిని భార్యగా స్వీకరించాడని గ్రహించాలని చెప్పింది. మధ్యలో అంతస్థుల తేడాతోనే వారు బీదరికంలోకి నెట్టబడటంతోవారికి పరిశుభ్రత లేకపోయిందనీ, వారిని అస్పృశ్యులని భావించటంకంటె కూడా వారికి శుభ్రత నేర్పి సోదరులక్రింద భావించటమే దేశసేవఅని తెలిపింది.

*మాలవారిని కలుపుకోవటం స్వాతంత్ర్య సాధనకు మార్గమవుతుందనే భావనను కలిగించే కథయిది. అస్పృశ్యతకు, బీదరికానికి, శుచికి, వెలికి ఉన్న స్వభావాన్ని అర్థం చేసుకోవాలని భావించింది.*

సమయమంత్రి రాజ్యలక్ష్మి వ్రాసిన 'రెండు వరాలు' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో చదువుకున్న స్త్రీకి వివాహమైన తర్వాత అత్తగారింట్లో నిరుద్యోగి ఐన భర్తదగ్గరకూడా స్వాతంత్ర్యం లేక బాధపడుతున్న సమయంలో తాను తిరిగి సంఘవిషయమైన స్త్రీ స్వాతంత్ర్యం గురించి వ్యాసాలు రాద్దామనుకొని భర్తకు తన భావాలను తెలియచేస్తుంది. దానిలో భాగంగా మారిన ఆధునికకాల దేశపరిస్థితినిబట్టి స్త్రీలు చేయాల్సిన పనులెన్నో ఉన్నాయికాబట్టి స్త్రీస్వాతంత్ర్యం కావాలనీ, స్త్రీ పరదాలు దాటి బయటకు వస్తేనేగాని స్వరాజ్యం, స్వాతంత్ర్యం సాధించలేమనీ తెలపింది. స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యంలేని రోజుల్లో కనీసం స్త్రీలను పరదాలలోనుంచి బయటకు వచ్చేటట్లు పురుషులు చేయగలిగితే దేశానికి మోక్షంవచ్చేదని భర్తతో అంటుంది. కాని ఆమెకు ప్రసవసమయంలో ప్రాణాంతకం అయినప్పుడు ఆమె దేశస్వాతంత్ర్యాన్నిగురించి తపిస్తూ భర్తను రెండువరాలు అడిగిందనీ దానిలో మొదటిదిగా స్త్రీకి పురుషునితోపాటు సమానహక్కులు ఇవ్వాలనీ, రెండవదిగా అతడు వితంతువును వివాహంచేసుకోవాలని మాటతీసుకొని చనిపోయినట్లు తెలియజేసింది.

*కథలో ఆమెయొక్క చివరినిముషంలోకూడా ఆమెకున్న స్త్రీ, పురుష సమానత్వకాంక్ష, దేశభక్తి అర్థం అవుతుంది. స్త్రీలు సమాజసంబంధాలలోకి ప్రవేశించి దేశసేవ చేయాలంటే వారికి సమానహక్కులతో కూడిన వ్యక్తిస్వాతంత్ర్యం ఉండాలని భావించింది.*

బులుసు ప్రకాశమ్మ వ్రాసిన 'పిచ్చిది' (నవంబరు 1941 గృహలక్ష్మి) అనే కథలో వితంతువైన ఒకతల్లి పునర్వివాహం చేసుకోవటంతో ఆమెయొక్క కన్నకూతురిగా బ్రహ్మసమాజ మతస్థురాలిగా, విద్యావంతురాలుగా ఉన్నప్పటికీ, ఆమె సంఘద్వేషానికి, లోకాచారానికి, ఇరుగుపొరుగువారి వెకసెక్కాలకు బలియై జీవచ్ఛముగా, మృతజీవిగాఅయిన ఒకస్త్రీ జీవితాన్ని తెలిపింది. కాల పరిస్థితులబట్టి సంఘాచారాలకు సామాజిక విమర్శలకు బలియై పిచ్చివాళ్ళైన అలాంటి స్త్రీలు ఎంతోమంది ఉన్నారనికూడా కథలో తెలియజేయటం జరిగింది.

*వితంతువును పునర్వివాహం చేసుకొని పిల్లను కంటే ఆ పిల్లను సంఘంకూడా పితృస్వామ్య భావజాలంతో ఎలా ద్వేషించి, వెలివేసిందో తెలియజేస్తూ, వితంతువివాహాలను సంఘం ఒప్పుకోని తనానికి పిచ్చివారై బలియైన స్త్రీల గాథలు భారతదేశంలో ఉన్నట్టు రచయిత తెలియజేసింది.*

ఈమెయే వ్రాసిన 'నీకేసి చూసినంతమందీ' (ఏప్రిల్ 1942 ఆంధ్రభూమి) అనే మరో కథలో స్త్రీలకు పురుషులతో పాటు సమానహక్కు ఉండాలనే భావన గలిగిన పురుషుడు స్త్రీ స్వాతంత్ర్యం గురించి ఖద్దరుధారణ, హిందీ భాషాభ్యాసాన్ని గురించి భార్యకు తెలియజేస్తూ భార్యకు చదువు చెప్పిస్తాడు. కాని ఆమె పరపురుషులతో మాట్లాడితే సహించలేడనీ, ఆ భార్య నల్గురిలో ఉపన్యాసమిచ్చి అందరి ప్రశంసలు పొందినప్పుడు ఆ భర్తలలోని సహించలేనితనం వెలికి వస్తుందనీ, భార్య తనకంటే గొప్పదిగా గుర్తింపబడితే సహించలేని మనస్తత్వంగల భర్తలు స్త్రీస్వాతంత్ర్యవాదులమనే ముసుగులో బతుకుతున్నారని బులుసు ప్రకాశమ్మ తెలియజేసింది.

*ఉద్యమవాదులుగా ఉన్నాకూడా స్త్రీస్వాతంత్ర్యాన్ని భరించలేని డొల్లతనం పురుషుల నరనరాల్లో ఉంటుందని రచయిత్రి ఉద్దేశంగా అర్థం వుతుంది. ఒక రకంగా స్త్రీలు విద్యావంతులైతే, వారు పురుషులను దాటుకొని ఎదగగలరనే దానికి నిదర్శనమైన కథ ఇది. ఈ రచయిత్రి సాంప్రదాయపు పునాదులమీద అభ్యుదయభవనాలను నిర్మించినట్లు అర్థమవుతుంది.*

సి. హెచ్. చంద్రమతి 'దిక్కుమాలు మాలబాలకుని రక్షణ' (జూన్, జులై 1944 హిందూ సుందరి) అనే కథను వ్రాస్తూ తన అనుభవంలో తెలిసిన వాస్తవ సంఘటన విషయంగా చెబుతుంది. కడపజిల్లా రాయచోటిలో డిప్యూటి కలెక్టరు గారు తన కుటుంబాన్ని సంఘం వెలివేసినప్పటికి దిక్కులేని ఒక మాల బాలుడిని దగ్గరకు తీసి శుభ్రత నేర్పి, విద్య నేర్పించి పెంచిన విధానం హరిజనోద్ధరణ స్ఫూర్తిని కల్గిస్తుందనీ, అప్పుడే భారతీయులకు ఐకమత్యం పెరిగి, స్వాతంత్ర్య సాధన, దేశాభివృద్ధి జరుగుతుందని తెలియజేసింది.

*ఇది హరిజనోద్ధరణను ఆచరణలో పెట్టినదానిని రుజువుచేసిన సామాజిక ప్రయోగాత్మక సాహిత్యం.*

చుండూరు రమాదేవి వ్రాసిన 'బాతాఖాని' (ఫిబ్రవరి 1947 గృహలక్ష్మి) అనే గల్పికలో ఇద్దరు స్త్రీల సంభాషణలో భాగంగా ఇంటికి వచ్చిన ఒకామె అప్రస్తుతమైన విషయాల గురించి ఆరాతీస్తుంటే అప్పటివరకు భాగవతం చదువుకుంటున్న ఆ ఇల్లాలు బాతాఖానీ వల్ల ప్రయోజనం లేదనీ, ఎవరింట్లో ఏమివండుకుంటారో తెలుసుకోవటం అనవసరమనీ, దేశానికుపకరించే పనిచేయవచ్చని చెప్పింది. అంతేకాక, సద్గ్రంథపఠనం లేదా పిల్లలకు చదువు చెప్పటం వంటిది చేయవచ్చనీ, ఖాళీసమయంలో రాట్నం వడకమనీ, పిల్లలకు నేర్పించమనీ, వార్తాపత్రిక చదివి ప్రపంచ పరిస్థితులు తెలుసుకోవచ్చనీ, లేదా అప్పడాలు, వడియాలు, చారుపొడి, సబ్బులు తయారు చేసుకోవచ్చనీ చెప్పి తనకు వంటవేళైందని వచ్చిన ఆమెకు సెలవు చెప్పింది.

*స్త్రీలు కాలాన్ని సద్వినియోగం చేసుకోవటమే స్త్రీల దేశసేవలో భాగమనీ చిన్నసందర్భాన్ని ఆధారంచేసుకొని భారతదేశ స్వాతంత్ర్యోద్యమం ప్రతిఫలించేవిధంగా రచన చేసిందని అర్థం అవుతుంది.*

ఆచంట శారదాదేవి వ్రాసిన 'ఏమి అదృష్టం!' (మే 1947 భారతి) అనే కథానికలో స్త్రీలకు డబ్బున్న భర్త దొరకటం కంటే కూడా అనురాగవంతుడైన భర్తా, పిల్లలు ఉండటమే అదృష్టమని తెలియచెప్పే కథ ఇది.

*కుటుంబంనుండి ప్రజాస్వామ్యం ప్రారంభంకావాలనే ఆకాంక్ష అర్థం అవుతుంది. భార్యాభర్తలమధ్య అనురాగముంటే పరస్పరస్నేహం ఏర్పడుతుందనీ, అప్పుడు అధికారంగానీ, ఆధిక్యతగానీ ఉండదనీ, కుటుంబ సంబంధాలలో ధనంకంటే ప్రేమ ముఖ్యమని భావించింది. భారతదేశంలో నాటి కుటుంబ వ్యవస్థ ఆర్థికంగా ప్రేమసంబంధాలలో స్థిరపడి పుంజుకోవటానికి ఉపయోగపడే కథ యిది. అంతేకాదు, కుటుంబంలో అధికారవ్యవస్థ ఉంటే స్త్రీపురుషసమానత్వం ఉండదని భావించింది.*

1940 నుండి1947 మధ్యకాలంలో వచ్చిన కథలలో స్త్రీలకు ఇంకా జ్ఞానోదయం కలగాల్సిన అవసరాన్ని, పల్లె స్త్రీల ఆదర్శ గృహిణీత్వం, ఖద్దరు ఉద్యమం, హరిజనోద్ధరణ, స్త్రీపురుష సమానత్వపు ఆకాంక్ష, వితంతు పునర్వివాహం, భార్యాభర్తృసంబంధాలను గురించిన కథలు వచ్చాయి.

**నాటకాలు**

1940–1947 మధ్యకాలంలో స్త్రీవిద్య, వరకట్న దురాచారానికి సంబంధించిన 2 నాటకాలు మాత్రమే వచ్చాయి. ఎన్నికలు, ద్వితీయ ప్రపంచయుద్ధంవంటివి కారణాలుగా భావించవచ్చు.

దేశిరాజు భారతీదేవి వ్రాసిన 'వరకట్న ప్రహసనము' (జులై 1941 గృహలక్ష్మి)అనే నాటకంలో పెళ్ళికూతురు చదువుకంటే కూడా కట్నమే ముఖ్యమనీ భావించిన ధనవంతుడైన వరునికి, ఆతని తల్లికిని, అతని స్నేహితుడు గుణపాఠం చెప్పాలనుకొని బీదవారి కుమార్తెను కుదిర్చి వారు కట్నం బాగాయిస్తారని నమ్మిస్తాడు. దేవుడిగుళ్ళో పెళ్ళికి ఒప్పించి తీసుకొని వస్తాడు. పెళ్ళిముహూర్తానికి వరుని తండ్రి ముందే కట్నం డబ్బు ఇమ్మన్నప్పుడు ఆ స్నేహితుడు స్వామిజీ రూపంలో వచ్చి వరుని తండ్రికి భగవంతుడు కట్నం తీసుకోవటం అధర్మమంటూ దైవం పెళ్ళికి ఒప్పుకోవటంలేదని చెప్పి, వరుని జీవితానికే భద్రతలేదని భయపెట్టేసరికి వరుడు, ఆతని తల్లి వరకట్నం వద్దంటూ, ఆ పిల్లను పెళ్ళిచేసుకోవటానికి ఒప్పుకుంటారు.

*ఎంతటి మానవులైనా దైవానికి భయపడతారు కాబట్టి వరుని స్నేహితుడు స్వామీజీ పాత్రను సృష్టించి, వరకట్ననిషేధాన్ని ప్రయోగాత్మకంచేస్తూ ప్రహసన రూపంలో వ్రాయటం జరిగింది. వరకట్న నిషేధాన్ని నాటకరూపంలో ప్రదర్శించి కనువిప్పు కల్గించటం ఈ ప్రహసనోద్దేశమని అర్థం అవుతోంది.*

భావరాజు రాజ్యరత్నమ్మ 'చర్చ' (అక్టోబరు 1941 గృహలక్ష్మి) అనే పేరుతో వ్రాసిన సంభాషణాత్మకంగా ఒక స్త్రీ ఒక పురుషుని మధ్య సాగిన చర్చలో భాగంగా సమాజంలోని సంఘ పునాదియైన స్త్రీ పురుష సంబంధాలను చర్చకు పెడుతూ, ఆధునిక యుగంలో విద్యాప్రభావంతో స్త్రీలు తమ మృదుస్వభావాన్ని పోగొట్టుకుంటున్నారని ఒక పురుషుడు అనగా దానికి ఒకస్త్రీ స్పందిస్తూ స్త్రీలు సాధనతో స్వావలంబనను కోరుకోవటం వారి స్వభావ విరుద్ధం కాదనీ, పురుషులు స్త్రీలలో కోరుకునే స్నేహం, సహనశీలత, దయ కరుణ అనేవి స్త్రీల దుర్బలత్వానికి కారణభూతం అవుతున్నాయని అంటుంది. అంతేకాక పురుషులలో ప్రేమ, త్యాగం అనేవి లేక స్త్రీలను బానిసలుగా చూస్తున్నారనీ, పురుషుడిపై ప్రేమ ఉన్నా, ఆ ప్రేమపైన స్త్రీకి అధికారంలేదనీ, యుగధర్మం సాహిత్యంలో ప్రతిఫలిస్తుందని చెప్పింది. సంఘంలో, సాహిత్యంలో స్వతంత్రభావాలు చేరియుండటం నాటి యుగధర్మమనీ, శక్తియున్నచోట కదలిక ఉంటుందని కూడా ఆమె అంటుంది. దానికి అతడు స్త్రీ విద్య, విధవా వివాహాలు, అసవర్ణ వివాహాలు వర్తమాన యుగంలో పాటించకపోతే సమాజానికి రక్షణ లేదని చెప్పగా తిరిగి ఆమె స్త్రీలకు కర్మ స్వాధీనత, భావస్వాధీనత కలిగియుండటమే యుగఆదర్శమనీ, స్త్రీలకు కావల్సింది స్వతంత్రం, సరళమగు ఉదారహృదయం అనీ, స్త్రీ హృదయంలో కలిగే భావ ప్రవాహాలకు సమాజం భయపడాల్సిన అవసరం లేదని చెప్పటంతో ఆ చర్చను అంతటితో వారిద్దరూ సమాప్తం చేసారు.

*పురుషులు తమస్త్రీలు సాంప్రదాయపద్ధతిలో ఉండాలనుకొన్నప్పటికీ, స్త్రీలు మాత్రం నాటి స్వాతంత్ర్యోద్యమ యుగధర్మాన్ని వంటబట్టించుకొని స్త్రీల భావాలు, పనులు వారి అధీనంలో ఉన్నప్పుడే తమకు వ్యక్తిస్వాతంత్ర్యం, సాధికారికత ఉంటుందని కావాలనుకొనే ఆలోచనలు వారిలో పెరగటం సహజపరిణామంగా భావించాలి. దాన్ని పురుషులు కూడా అంగీకరించటాన్ని తెలిపింది.*

**కవితలు :**

1940 నుండి 1947 వరకు స్త్రీల సాహిత్యంలో స్త్రీస్వాతంత్ర్యం, దేశ స్వాతంత్ర్యోద్యమ కవితలు13 వచ్చాయి.

కాంచనపల్లి కనకమ్మ వ్రాసిన 'స్త్రీస్వాతంత్ర్యము' (గృహలక్ష్మి ఏప్రియల్ 1940) అనే కవితలో

*"స్వాతంత్ర్యంబన నెయ్యది ఖ్యాతిగ బురుషులును స్త్రీలు గాంక్షింతురు ము*
*న్నే తెలుగు దాని కిపుడిది భూతలమును గలిగె వివరముగ రూపింతున్.*

*స్వపదమారయ బ్రహ్మవాచకమటంచు తత్త్వవేత్తలు పల్క స్వాతంత్ర్యమనఁగ*
*బ్రహ్మ భావంబహో దానిఁ బడయు వారు ధర స్వతంత్రులనఁగఁ జెప్పఁదగినవారు.*

*భరతఖండంబునందునఁ బ్రజలు బక్క జిక్కియుండంగ నిట్లుండి రొక్కొ యితర*
*దేశములను స్వతంత్రులై లేశమేని కొఱతలేకుండనున్నారొకో యరయఁగ."* అని

*భారతదేశస్వాతంత్ర్యం బ్రహ్మభావన అని ఆధ్యాత్మికకోణంనుండి దేశస్వాతంత్ర్యాన్ని విశ్లేషించింది.*

దేశిరాజు భారతీదేవి వ్రాసిన 'రాష్ట్ర ప్రబోధము' (ఏప్రిల్ 1940 గృహలక్ష్మి) అనే కవితలో భారతావని బానిసత్వాన్ని పోగొట్టాలనుకొన్న ఆంధ్రస్త్రీలు ధైర్యంతో "తామెంతసేసిరి కార్యనిర్వహణంపూని మీరొక దీక్షతోడ మానితంబగు నాత్మశక్తిని తేజరిల్లగ సేవచేసి తెండు రాష్ట్రంబు–శాంతి సమరమునందు నాంధ్రకాంతలెల్లరు దేశసేవకు యెట్టి తెగువను బూనినారో యట్టి త్యాగముతో–కార్యరంగమునకు దూకుము – శక్తి రూపిణులైన స్త్రీల శక్తి విజృంభింప జేసిన కాని, కార్యము గలదె జూడగ బూను దీక్షలను" – అంటూ, భారతదేశ సేవలో ఆంధ్ర స్త్రీల శక్తియుక్తుల వినియోగానికై ప్రబోధించింది.

వల్లభనేని రంగాదేవి వ్రాసిన 'మహిళా–మహత్తు' (జూన్ 1940 గృహలక్ష్మి) అనే కవితలో

"దేశీయసంఘం, ముస్లింసంఘం, అద్వైతసంఘం, మహిళాసంఘపు చీలికలా" –
*గాంధియిజమును, కమ్యూనిజమును, యేయిజమును–స్త్రీ ప్రేమించిన యాకేశబంధమే?*
*హిందూస్త్రీసభ–ముస్లిమ్ స్త్రీలీగ్, కాంగ్రెస్ స్త్రీ సభ మహిళాసంఘములోలేవే?*
*చీలికలేని స్థిరముగనున్న, భారతమహిళా సంఘమే మాకాదర్శంబూ!*
*పడతుల కలయిక నారులనేస్తము, మహిళల మైత్రే దైవశక్తులా సంఘటనంబే"*– అంటూ

రాజకీయాలతో చీలికలు లేని ఐక్యతగల మహిళా సంఘాలు గొప్పవనీ వ్రాసింది.

వక్కలంక రామాబాయి వ్రాసిన 'అబలలము కాము' (జూన్ 1940 గృహలక్ష్మి) అనే కవితలో దేశమాతను స్మరిస్తూ మహిళలు దేశసేవలో పాల్గొంటున్నారనీ,

*"అబలలము కాము తేజమ్మునందినట్టి గృహిణులము మేము; మగవారి కూర్మిఁబడయు*
*లలితకళలలను వ్యాపింప లాస్యగతిని కంకణముఁదాల్చు మమునేలు కన్నతల్లి*
*బలము నరయగనున్నది భారతాంబ, కన్యవలె మాతవలె భూమి కష్టపడుచు*
*దేశసేవను నిరతంబు దేలువారమమ్మ, భారతమాతరో, యక్కజముగ "........*

*"లలితమూర్తుల మేమన్చు లాలసమున బురుషశ్రేష్ఠులుమమునింటఁబూడ్చుచుంద్రు,*
*కాని, యరయంగనేరరు కార్యదీక్షకులము మనమన్ననుడి, దానిఁగూల్చుమమ్మ,*
*ముదముగూర్తుము పతులకు ముద్దుచేతలెలమిఁగొల్పెడు సేవకైయెదురుచనుదు*
*మమ్మరో, దేశసేవను యనవరతము నుందునట్టుల భామల మన్పుతల్లి"* అని

*దేశసేవలోపాల్గొనుట స్త్రీల బాధ్యత అని స్త్రీలు అబలలు కారనీ, భర్తలు రానీయకపోయినా గృహిణులు యింటిబాధ్యతలను నెరవేరుస్తూనే దేశసేవ చేసేటట్టుగా స్త్రీలు ఉండేట్లు చూడమని తెలియజేసింది. భారతదేశసేవను ఎల్లప్పుడు చేసే భాగ్యాన్ని కోరుకోవటం వారి ఆకాంక్షలలోని పరమార్థానికి నిదర్శనం.*

గంటి కృష్ణవేణమ్మ వ్రాసిన 'దేశభక్తి' (గృహలక్ష్మి జులై 1940) అనే కవితలో

*"మొగలు రాచఱికఁపు దండిమగలకఱకు కత్తులందలి నెఱమానికంపుఁగెంపు*
*దిగువనీడల భారతదేశలక్ష్మి, శిరమువాలిచి ప్రొద్దుపుచ్చిన దినాలు.*

*యవన పటుప్రతాపవిలయానలదీర్ఘ శిఖాచయమ్ము శా*
*త్రవ బలదర్పగోచలఁ బరాజయ ధూమములందు ముంపఁహైం*
*దవజన గౌరవమ్ము పరతంత్రతకౌదల యాయరాదు, ఆ*
*హవమునఁ గత్తిపోటులె సుఖావహమన్నది; యామె యొక్కతే.*

*అనిఁగత్తివట్టినిల్చిన దండిమగలకు నూత్న దీక్షాశక్తి నూరిపోసి,*
*జాతీయతానలజ్వాల హైందవ వీరరక్త నాళమ్ముల రవులుకొల్పి*
*తన ప్రతాపానలోద్ధత శుభారుణ రేఖ దేశమాతకు రత్న దీపమెత్తి*
*స్వాతంత్ర్య సమరనిష్ఠల మాతృభూమికి ప్రాణాశుగమ్ములుపాయనమిడి*

*జీవనరథమ్ము స్వచ్ఛందభావవీధి ద్రిప్పుకొనుచుండి కీర్తి పొందినది; గోండు*
*రాణి దుర్గావతీదేవి రక్తి నామెపేరు భారతహృదయాల మారుమ్రోయు"* – అని

*దుర్గావతి యోధత్వాన్ని గుర్తుచేసింది. భారతదేశ స్వాతంత్ర్యానికి ప్రాణాలొడ్డిన విషయాన్ని గుర్తుచేస్తూ కవిత ద్వారా చైతన్యపరిచటం జరిగింది.*

కొండపల్లి సుభద్రాంబ వ్రాసిన 'క్షమార్పణ' (ఆగష్టు 1940 గృహలక్ష్మి) అనే కవితలో పంచమ సోదరులను అస్పృశ్యులుగా భావించినందుకును, సమాజం పంచముల శ్రమను వాడుకొని వారిని తృణీకరించినందుకు వారిని క్షమించమని కోరుతూ

*"దినమునకొక పూటయును గంజి లేమిచేఁజిక్కివెన్నంటినడొక్కతోఁడ*
*కటితలంబేనియు గప్పు చేలములేక విచ్ఛిద్రమాగోచి పేల్కతోడ*
*చలికినెండకు నింత తలదాచుకొన నీడఁగానక కృశియించు మేనితోడ*
*సంఘతృణీకృత జాతి హైన్యతఁగల్గు నిర్బంధబానిస వృత్తి తోడ*
*సంఘసేవయొనర్చు పంచమసహోదరా!యికన్మమ్ముక్షమియింపరాదటయ్య!*
*నీయుసురు గొట్టియేకాదె నిశ్చయంబు హైందవావనిపారతంత్ర్యమ్ము గుడుచు!"* అని

*అస్పృశ్యులుగా నిర్బంధబానిసలుగా హరిజనులను భావించుటచేతనే భారతజాతిలో ఐకమత్యం కొఱవడి పారతంత్ర్యంలో దేశం బాధపడుతోందని తెలియజేసింది. పంచముల్ని క్షమాపణ కోరటం జరిగిందంటే సమాజజీవన విధానములోని వారు బానిసత్వానికి గురికాబడ్డారని పరోక్షంగా బయటపెట్టటమే. అస్పృశ్యులు వృత్తిపరంగా చేసే దేశసేవను గుర్తించాలని చెప్పింది.*

స్థానాపతి రుక్మిణమ్మ వ్రాసిన 'గీత' అనే కవిత (సెప్టెంబరు 1940 భారతి) లో

'నీలిమములేని ఈ శరత్కాల రాత్రి
విధివశమ్మును బ్రిదిలిన హృదయవీణ
కోరుచున్నది జీవాలతారతంత్రి
గగన మంటెడి జయపతాకములుగాంచి,
పారతంత్ర్య నిర్మూలన పథముద్రొక్కి
విశ్వమంతయు మనముగా విరిసిపోయి
తారుమారైన యావదాంధ్ర ప్రశస్తి
మరల రేకెత్తుదాక కర్మ ప్రకర్ష,
పాడుకొందాము జగతి విప్లవము రేగ
మానగారాదు-గీతోక్తగాన రవళి'. అంటూ

పారతంత్ర్యపాలన నిర్మూలనవరకూ ఐకమత్యంతో ఆంధ్రులందరు విప్లవగీతాలతో స్వాతంత్ర్యోద్యమంలో ముందుకు సాగుదాం అని తెలియజేసింది.

మధురాపంతుల విజయలక్ష్మి వ్రాసిన 'దేశసేవిక' (అక్టోబరు 1940 గృహలక్ష్మి) అనే కవితలో

'స్వారాజ్యప్రాప్త్యభిలాషఁబూరుషులు విశ్వస్తుత్యమారీతిఁదా
మారంభింపగ దేశసేవలను, దేశౌన్నత్యసంసిద్ధికై
నారీలోకము కూడఁజాలునని సానందాత్మవైచాటఁగాం
తారత్నంబ! ధరింతువెల్లప్పుడుఁజేతఁరంగుజెండానహో!' అని

దేశ స్వరాజ్యంకోసం పురుషులుతోపాటు సమానంగా స్త్రీలు కూడా దేశసేవలో పాల్గొనుటకు సమర్థులని, దేశసేవతోను దేశౌన్నత్యం సిద్ధించటానికి నారీలోకం చాలునని చేతిలో జెండాతో దేశసేవికలు చాటి చెబుతున్నారని తెలియజేసిన కవిత యిది.

వేదవల్లి తాయారమ్మ వ్రాసిన 'పతాక సందేశము' (అక్టోబరు 1940 గృహలక్ష్మి) అనే కవితలో భారతదేశ స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించే పతాకాన్ని గురించి సందేశానందించింది.

'జాతికి చిహ్నమ్ము జండాయెసుమ్ము
నీతినిఁదెల్పుచు నిలుచున్నదిచట
భారతీయులశక్తి భారతీయుల యుక్తి
భారతీయుల ప్రతిభ - భద్రపరిచినది

జాతీయతాసక్తి శాశ్వతమ్ముగఁజేయ
జాతీయకేతువే సాధనమ్మరయ
మూడురంగులతోడ ముచ్చటై యుండి
వేడుకను గలిగించు విజ్ఞాన మొసఁగు

మూడుగుణంబులు ముడిపడినట్లు
మూడుమతములకు మూలమ్ము జండా
హిందూముసల్మానులందుఁగ్రైస్తవుల
సందేహమందకే సమకూర్పఁగలదు

ఎవ్వారు చెప్పినెట్లు చెప్పినను
భావైక్యమందిన ఫలమందవచ్చు
పలుజాతి జనములు కలిసినట్లైన
వెలలేని ఫలమబ్బునిలలోన నిజము

ఐకమత్యంబె మన కాదర్శ ధర్మ
మికనైన భారతా! వేగిరంపడుమ!
ఎన్ని వర్ణాలైననిటులేకమైన
నెన్నికల్ జయముతో సన్నుతికెక్కు

త్యాగంబహింస సాహసమను మూటి
యోగంబుఁ జూపుచునున్నదీ జండా
త్యాగమ్మునకు గుర్తు జేగూరురంగు
భోగమ్ములను వీడిపొందనుచుండె

సహనమహింసయే జయమిచ్చుననుచు
రహివహించెను తెల్లరంగు నందముగ
నిరపాయమును దెల్పు తరచైన పచ్చ
వరసాహసాంకమై వరలుచునుండు

పైని రాట్నఁపుబొమ్మ బంగారుదిమ్మ
మన పరిశ్రమ యిదే మరువకుఁడనుచు
చాటిచెప్పెడు భంగిసూటిగా నమరె
నేఁటి కాలమునకు నిదియె ధర్మమ్ము

*యంత్రములనుగూడననణపంగఁజాలు*
*మంత్ర మాధ్వనియందు మారు మ్రోగెడి!*
*కాదనకీవృత్తిఁ గడకతోఁబెఁనుప*
*బీదల పాలిఁటి పెన్నిధియగును*

*పోయిన స్వాతంత్ర్యమును గోరునెడల*
*వేయుఁడు ముందంజ వీరత్వమునను*
*గాంధీమహాత్ముని ఘన మైన కోర్కె*
*సందేశరూపాననిందిమిడి యుండె' అని*

మతవిద్వేషాలు లేని సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించింది.

నేటిజెండాలోని అశోకచక్రం స్థానంలో మునుపు రాట్నం ఉండేదనీ, జెండామీద అభిమానం ఉండటమంటే దేశాభిమానం ఉండటం అనీ, దేశాభిమానాన్ని పెంపొందించేది జాతీయజెండా అనీ భావించిన వేదవల్లి తాయారమ్మ 'ప్రజల్లో జాతీయజెండాపై జాతీయాభిమానాన్ని పెంపొందించే విధంగా చేసిన ప్రయత్నమిది.

చేబ్రోలు సరస్వతీ దేవి వ్రాసిన (1940 అక్టోబర్ గృహలక్ష్మి) 'అంజలి' అనే కవితలో భారతమాతను స్తుతిస్తూ

*'సర్వమంగళగాన "సర్వదేశంబుల*
*మంగళ" మొప్పార మనుపుమమ్మ*
*కలితవీణాపుస్తక కరాంబుజవుగాన*
*"మాతృభాషాప్రేమ" మాకునిమ్మ*

*వహ్నిశుద్ధాంశుక భాసితాంగివిగాన*
*"ఖాది" పై లక్ష్యంబు గలుగనిమ్మ*
*భవరోగసంహార ప్రౌఢవీవేగాన*
*"ఆరోగ్యబోధ" సంవ్యాప్తినిమ్మ*

*చెడుగురక్కసిమూక జిదుము దిట్టరి గాన*
*"అస్పృశ్యతా" ధాటి నవియనిమ్మ*
*సకలలోకాధారజనని నీవే గాన*
*"స్త్రీజనోద్ధరణ" కై దీక్షనిమ్మ*

అంబ! జగదంబ! గాంధీమహాత్మ "సూక్తు"
లెలమి వర్ధిల్ల సూత్ర ధారణివి నీవె
శక్తి యుక్తుల మాకిచ్చి సాదరముగ
నీ ప్రణాళిక సాధింపనిమ్ము జనని'! అంటూ

ఖద్దరుపై లక్ష్యాన్ని మాతృభాష, ఆరోగ్య బోధన, అస్పృశ్యతా నివారణకు స్త్రీజనోద్ధరణ దీక్షను చేపట్టటానికి తగిన ధీశక్తినిమ్మని భారతాంబకు అంజలి ఘటించింది. స్త్రీల స్వాతంత్ర్య దీక్షలోనే స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలను కవితలో పొందుపరచటం జరిగిందని అర్థం అవుతుంది.

అడుసుమల్లి సరస్వతిదేవి వ్రాసిన 'పయనముగండీ' (మార్చి 1941 గృహలక్ష్మి) అనే కవితలో

'భారత మాతదాస్యము బాప ఆంధ్రమహిళలే పయనమవ్వుడీ'
భారతమాత దాస్యము బాప స్వతంత్రమహిళలే పయనమవ్వుడీ
వంటయింటికి స్వస్తి చెప్పి, వంటసామగ్రికి గుడ్ బైచెప్పి
భారతమాత శోకముబాప హైందవస్త్రీలే పయనమవ్వుడీ
సంతోషముతో స్వాతంత్రముకై నేడేపయనముగండీ, రండీ' అని

వ్యక్తి సత్యాగ్రహోద్యమం స్వాతంత్ర్య సమరపోరాటంలో ప్రతిగృహిణి పోరాటం చేయాలని పిలుపునిచ్చింది. రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్నా స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యాన్ని, దేశస్వాతంత్ర్యాన్ని గురించి తోటి స్త్రీలను చైతన్యపరిచే విధంగా రచనలను కొనసాగించారు.

క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో దేశంలో కమ్యూనిజం అభివృద్ధిచెంది 1943 లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది.

లలిత వ్రాసిన 'మనది భారతదేశం' అనే కవితలో (ప్రజాశక్తి ప్రచురణయైన 'స్త్రీల పాటలు' అనే పుస్తకం) పోరాటయోధురాలైన ఝాన్సీ లక్ష్మీబాయి వీరత్వాన్ని స్మరణకు తెస్తూ.

"భారతీయుల పౌరుషమ్ము
భారత స్త్రీ పౌరుషమ్ము
భారత స్త్రీల మేధస్సు
కంపెనీ సైన్యాన్ని గగ్గోలు పరిచాయి
పాశ్చాత్య సామ్రాజ్య పటిమ నెదిరించాయి". అంటూ,

భారతీయ స్త్రీ శక్తిబలాన్ని గుర్తుచేస్తూ ఈ కవయిత్రి

"జాతి స్వతంత్రతా సంరక్షణకోసమై
ఈస్టిండియా మిలిటరీ ఫోర్సునుడికించి
వీరధర్మము జూపి మరణించింది తల్లి" అంటూ

ఝాన్సీ లక్ష్మీబాయి వీరమరణ స్ఫూర్తిని కవితతో రగిలించింది. అంతేకాక

"మన జాతికై, మనహక్కుకై
మనచంద్రశేఖరుడు మరణించినాడమ్మ" అంటూ

*జాతీయోద్యమ నాయకుల పట్ల ఉండవలసిన ఆత్మీయతను రగిలించింది.*

భారతదేశంలో బ్రిటీష్ వాళ్ల అణచివేతను ఎదుర్కొవాలనీ, స్వపరిపాలన కావాలని భావించి స్వతంత్రం కోసం ఆధునిక తుపాకులు, మరఫిరంగులు లేకపోయినా బ్రిటీష్ వాళ్లను ప్రజలు ఎదుర్కోవాలంటూ, మరొక ప్రక్క అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం చేయాలంటూ

*"మనకు మరఫిరంగులు లేవని*
*యుద్ధమంటే భీతి గొనకు"*
*మన గెరిల్లా యుద్ధమంత్రమ్ము శత్రులను*

*మంత్రముగ్ధులచేసి మట్టుపెడుతుంది.*
*స్వాతంత్ర్యకాంక్షతో చావునకు తెగించి*
*యుద్ధతంత్రమ్మునేర్చి యుద్ధభూమికి రమ్మా*

*ఫాసిజాన్నెగర గొడదాము*
*ప్రజల శక్తిని చూపుదాము.*
*మనది భారత దేశమమ్మా .... అంటూ*

*కవయిత్రి ఆధునిక ఆయుధాలు లేకపోయినా గెరిల్లాదాడితో వారిని మట్టుపెట్టవచ్చని నాటి స్త్రీలను ప్రోత్సహించటం జరిగింది.*

*మన్యం వీరుడైన అల్లూరి సీతారామరాజును కాల్చి చంపిన సంఘటనలకు స్పందించింది. కవిత లోని సంఘటనలు బట్టి 1857 నుండి మొదలై 1942 క్విట్ ఇండియా వరకు ఉన్న చరిత్రను పేర్కొంటూ 'చావో బతుకో ? తేల్చుకోవాలనుకున్న సందర్భంలో వ్రాసినట్లుగా అర్థమవుతుంది.*

రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ శత్రువులైన జపానువారిని ఓడిస్తే, సంపూర్ణ స్వాతంత్రం ఇస్తామని బ్రిటిష్ పాలకులన్నపుడు వారి మాటలమీద నమ్మకం కుదరలేదు. అందుకే భారతీయ విప్లవవాదులు బ్రిటిష్ వారిపై విరుచుకుపడుతున్న సమయంలో....

వట్టికొండ విశాలాక్షి వ్రాసిన 'అభ్యుదయగీతాలు' అనే కవితా సంపుటి (1943 లో స్వీయప్రచురణ) లోని 'ప్రబోధ'మనే గీతంలో

*"పవిత్ర భారత భూమి మీదనే...*
*బాంబుల వర్షం కురియుచున్నది*
*ఆలసించెదవదేల ! సోదరా*
*హతమార్చర నీ శత్రుసైనికుల"*

“భారతభూమిని పరులకు వదలి
బ్రతుకుట కన్న చావే మేలురా..
పరాక్రమములో బిరానలేచి
ఫాసిస్టులను పరిమార్చుమురా

జై జై భారత భూమికి జైయని
జయ దుందుభిని మ్రోగించరా ..
జపాను శత్రువుల జయించి
వేగమే జయ కేతనమెగరవేయరా..”

“హిందూ ముస్లింకు సందేహాలు
ఎందులకోయీ మనమందరమొకటై
భారతరక్షణ కొరకై మనమిక
ప్రజల ఐక్యతకు పాటుపడదాం

ఆయుధాల్లేకున్న
ఐకమత్యమే మంచి
ఆయుధమ్మని నమ్మి మనము
సమర రంగమున చంపేసి పరుల

స్వాతంత్ర్యమును సాధించి
శాంతి నెలకొల్పాలి” అని

గాఢమైన సంపూర్ణ స్వాతంత్ర్య కాంక్షను వెలిబుచ్చి నేటి వారికి కూడ గగుర్పాటును, స్ఫూర్తిని కలిగించే కవిత వ్రాసిన వట్టికొండ విశాలాక్షి తన కవితను గట్టికొండగా నిలిపి ప్రజలకు స్వాతంత్ర్యసాధనా మార్గం అదేనని తన కవితలో ప్రబోధించింది.

ఈమె వ్రాసిన. “చెలో వీర యువతి” అనే మరొక కవితలో
చెలో వీర యువతీ రణానికి చెలో ధీరయువతీ
శౌర్యసహిత సద్గుణ జాత, పావన చరిత, భారతవనితా”

“ఫాసిజమే నీ ప్రక్కలో బల్లెము
ఖండించుము ఈ ఘాతుక భూతము
స్వదేశ సంరక్షణ సాధించుము
మన స్వాతంత్ర్యమును సంపాదింప...” అంటూ ఫాసిజాన్ని ఎదుర్కోమంది.

ఈమెయే వ్రాసిన 'భవిష్యత్తు' (భారతి జులై, 1945) అనే ఇంకొక కవితలో

> అక్షయమ్మగు స్వాతంత్ర్యలక్ష్మి గోరి
> ఎత్తునకు నిండు బ్రతుకునే ఎత్తుబెట్టి
> స్వీయ మొనరించుకొన్నాను– హేయమనక
> అమ్ముకొన్నారు ఏ నిర్ణయాత్మపరుల్! అంటూ

*స్వాతంత్ర్యం కోసం భారతీయులు తమ నిండు జీవితాలనే పణంగా పెట్టిన విషయాన్ని తెలియజేసింది.*

వట్టికొండ విశాలాక్షి 'శపథం' (మార్చి 1946 తెలుగుతల్లి) అనే కవితలో కవియెక్క బాధ్యతను తెలుపుతూ "లోకమును మేల్కొలిపి నీకవితా కృతింగొనినట్టి భావము వేగుచుక్కవలె జగత్తున వెలుగుజిమ్మెడిని" అనీ కవయిత్రిగా తాను మాత్రం

> "కష్టములు ఎన్నైనా రానీ నిష్ఠురములైన్నైనా రానీ
> ఇష్టపడి స్త్రీ జాతి కొరకే కష్టపడగలనని" కవితా 'శపథం' చేసింది.

వీరమాచనేని సరోజని 'జయహో భారతమాత' అని వ్రాసిన కవితలో (విజయగీతావళి పబ్లికేషన్ డివిజన్)

> *"జయహో భారతమాత! నీకీర్తికాంతి ఈ చరిత్రలో వెదజల్లవే మాతల్లి,*
> *వీరులెందరికో జన్మనిచ్చిన వీరమాతవమ్మా"* అని భారతమాతను కీర్తించింది.

అవ్వారి పూర్ణ వ్రాసిన 'ఆశయం' (మార్చి 1947 గృహలక్ష్మి) అనే కవితలో 'దురాచారమగు ఘోషా పద్ధతిని బలవంతంగా చించివేసుకొని విశ్వవిహారం సల్పుదమనియేనా నీ ఆశయం, ఐతే రా–నాతో రా, మూఢనమ్మకాలను రూపేద్దామని నీ ఆశయము–బాల్యవివాహ హక్కు సనాతనాలను, కట్నాలడిగే వారిని, వృద్ధవివాహహక్కు కర్మిష్ఠలను హతమార్చాలనియేనా నీ ఆశయము–ఐతే రా నాతోరా శారదాఆక్టు, దేవదాసీ బిల్లు, ఏకపత్నీవ్రతం, వారసత్వపు బిల్లు ఆమూలంగా ఆశించా లనియేనా నీ ఆశయం ఐతే రా–నాతోరా–ఆక్టులన్నింటిని ఆశిద్దాం, ఆక్టులన్నిటి–అభ్యసిద్దాం' అంటూ ఆశయాలు కలిగాయని తెలియజేసింది.

*తోటివారితో కలసి సంఘటితశక్తిగా మారటానికి తగిన ఉత్తేజం తెచ్చుకోవటానికి ప్రేరణ ఇచ్చే వాచక కవిత్వం యిది.*

1940–1947 వరకు వచ్చిన కవితలలోస్త్రీ స్వాతంత్ర్యం గురించి, మతపరమైన విభేదాలు, దేశభక్తి, దేశసేవికలు, జాతీయపతాకం యిచ్చే సందేశం, అస్పృశ్యత, స్త్రీ జనోద్ధరణ, ఫాసిజం వ్యతిరేక ధోరణి, భారతీయుల అభ్యుదయానికై ఐకమత్యంతో స్వాతంత్ర్య సాధనకై ప్రబోధగీతాలు వంటి కవితలు వచ్చాయి.

**పాటలు**

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఫాసిజాన్నికలిగిన నాజిజమ్ అంతరించిన సమయాన వట్టికొండ విశాలాక్షి వ్రాసిన 'ప్రజలుమేల్కొన్నారులే' ('తెలుగుతల్లి'–మే, జూన్ 1945 అరసం) అనే కవితలో బ్రిటిష్ అధికారమంత్రి ఐన చర్చిల్ ని 'చర్చిలూ' అని సంబోధిస్తూ

*"ఫాసిజమ్మంతటకి*
*పట్టుగొమ్మైనట్టి*
*నాజిజాన్ని జనాళియే, చర్చిలూ*

*నాశనము చేసిందిలే*
*దాస్యాంధకారాన*
*దారితెలియని ప్రజలు*
*నిస్పృహను వదిలారులే, చర్చిలూ*

*నేత్రాలు తెరిచారులే*
*అజ్ఞాన మార్గమ్మునవరోధము చేసి*
*విజ్ఞాన మార్గమునసే, చర్చిలూ, విజయమ్ముసాధింత్రులే"* అని

జర్మనీలో హిట్లరుయొక్క నాజిజమ్ ను– చర్చిల్ యొక్క ఫాసిజమ్ ను గురించి తెలియజేసింది.

**లేఖలు**

కనుపర్తి వరలక్ష్మమ్మ తన నెచ్చెలియైన కల్పలతకు వ్రాసిన 'శారదలేఖల'లో (జూన్ 1940 గృహలక్ష్మి) దేశంలో మత, వర్ణ, శాఖాభేదాలతో ప్రజలు మాతృగర్భాన్ని రెండు ముక్కలుగా చీల్చాలనుకుంటున్నారనీ, ఈ వివాదాలే పరదేశీయపాలనకు హేతుభూతమైనదనీ, దేశంలోని మతకలహాలు, సాంఘికవిప్లవాలు మునుపు ఎన్నివచ్చినా దేశాన్ని విభజించాలనుకోలేదనీ, మహమ్మదీయరాజ్యం, హిందూరాజ్యమనీ, భారతదేశం రెండుగా విడిపోవాలని నేడు అనుకుంటున్నారని లేఖలో తెలియజేసింది. అంతేకాదు, దేశంలో హిందూ, మహమ్మదీయులే కాక పారశీకులు, సిక్కులు, క్రైస్తవుల వంటి ఇతర మతస్థులు తమ భాగాలను ఇమ్మంటే ఇంకా దేశాన్ని విభజించాల్సి వస్తుందనీ, ముస్లింలలో కూడా షియాలు, సున్నీలనీ, హిందువులు ఆర్యులు, ద్రావిడులు అని విడిపోతే వైషమ్యాలు ఏర్పడి ఐకమత్యం నశిస్తే స్వరాజ్యసంపాదన కష్టమవుతుందని వ్రాసింది. అంతేకాక, పాకిస్థానమని దేశాన్ని విభాగంచేయటం గర్హింపదగినది కానీ, ఆమోదింపదగినది కాదనీ, ముస్లింలు భారతదేశంలో ఒకానొకప్పటి హిందువులేననీ, ముస్లింలీగ్ మహమ్మదీయ సంఘాన్ని ఏర్పరచి ఆందోళనచేస్తున్న 'జిన్నా'కూడా ఒకానొకప్పుడు హిందువేనని తెలియజేసింది.

అంతేకాక సరోజనీదేవి చెప్పినట్లుగా హిందూమహమ్మదీయులు ఈ దేశమనే వస్త్రంలో పడుగు పేకలవలె కలిసిఉన్నారనీ, ఏదారాన్ని ఏవైపునుండి తీసినా భారతదేశ స్వరూపం విరూపం అవుతుందని తెలిపింది. హిందువులు ముస్లింల మతగురువైన మస్తాన్ పేరును తమ పిల్లలకు పెట్టుకుంటున్నారనీ, ముస్లింలు నరసింహుని ప్రార్థించటం చేస్తున్నారనీ, భద్రాచలంలో తానీషా పంపే తలంబ్రాలతోనే సీతారాములకళ్యాణము జరిగే విషయం అందరికీ తెలిసిందేననీ, భోజన, ప్రతిభోజనాలలో తేడావున్నా దేశవ్యవహారాలలో హిందూ మహమ్మదీయులతేడా ఉండదని కూడా వ్రాసింది. మరియు ఆంగ్లదేశస్థులు భిన్నపక్షాలకు చెందినవారైన మంత్రివర్గంలోచేరి దేశరక్షణ చేసేవారనీ, అలాగే భారతాభ్యుదయానికి మహమ్మదీయులు, క్రైస్తవులు పాటుపడాలని భావించిన భారతీయ మహిళామణులు ఐకమత్యానికి, సంఘైక్యానికి పాటుబడే ధ్యేయంతోనే అఖిలభారత మహిళాసభను ఏర్పాటుచేసుకున్నారని తెలియజేసింది. నేటి ప్రభుత్వం తమ పాలనను భారతదేశంలో సుస్థిర పరుచుకోవటానికి హిందూమహ్మదీయుల మధ్య విభేదాలను కలిగిస్తోందనీ, విద్యాధికులలో ఈ భేదాలు ఎక్కువైనాయనీ, మామూలు జనంలో ఈ పొరపచ్చాలులేవనీ, ఈ భేదాలన్నీ స్వార్థకల్పితాలేననీ, స్త్రీలు కూడా శాఖాసభలలో పాల్గొనటం విచారకరమనికూడా తెలియజేసింది. ఆయుధనిర్మాణము ఉన్నన్నాళ్లూ యుద్ధం తప్పదన్నట్లుగా మత, వర్ణ, శాఖ సభలు ఉన్నన్నాళ్లూ విభేదాలు తప్పవనీ, కాబట్టి అఖిల భారతకళ్యాణము ఆదర్శంగా తీసుకొని దేశక్షేమాభిలాషు లందరూ ఐక్యతకై పూనుకోవాలని వ్రాసి లేఖను ముగించింది.

*భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వటం బ్రిటిష్ ప్రభుత్వానికి ఇష్టంలేకపోవటంతో విభజించి పాలించెడి రాజనీతితో మతబేధాలు కల్పిస్తోంది కాబట్టి హిందూముస్లింల ఐక్యత అవసరమనీ, అప్పుడే భారతీయులు స్వాతంత్ర్యాన్ని పొందగలరని తోటి స్త్రీలను చైతన్యపరచాలనుకోవటం రచయిత్రి యొక్క రాజనీతిజ్ఞతకు ముందుచూపుకు నిదర్శనము.*

భావపురి (బాపట్ల) నుండి 'శారద' అనే పేరుతో కనుపర్తి వరలక్ష్మమ్మ తన నెచ్చెలికి వ్రాసిన 'శారదలేఖ' (జనవరి 1947 గృహలక్ష్మి)లో 1942 సంవత్సరం అనేక విధములుగా స్మరణీయమైనదనీ విప్లవాత్మక బ్లాకౌట్ లతో మిలిటరి విహారములతో దేశభక్తుల కడగండ్లతో ప్రభుత్వంవారి భీతావహకృత్యములతో ప్రజల క్రమశిక్షణా విరహిత చర్యలతో భారతదేశమంతా కల్లోలం నిండిన రోజులవి అని పేర్కొంది. ఉప్పుకు, పప్పుకు, నిప్పుకు, నీరుకు బియ్యం, కట్టెలు పొట్టు, బొగ్గు, నూనెకు, పంచదార, కట్టుగుడ్డ వంటి అన్నింటికీ రేషనింగ్, కంట్రోలు ఉందనీ, యుద్ధం పుణ్యమా అని వస్తుపంపిణీ ధరలనిర్ణయ విజ్ఞానం అందరికీ వంటబట్టిందనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలలో భారతీయులు రాజ్యం నడుపుతున్నారు కాబట్టి దేశంలోని ఆహారసమస్య తీరటానికి ప్రభుత్వ సహాయంకోసం ప్రజలు ఎదురుచూస్తున్న రోజులని తెలియజేసింది. మిత్రరాజ్య సమితిలో విజయలక్ష్మి విజయ పరంపరలు, లండన్ సభలలో 'చర్చిల్' ప్రభువు చర్చలు, జిన్నా పన్నాగాలు, నెహ్రూ సింహగర్జనలు, ఆట్లీ ప్రధానమంత్రి అటుయిటు మాటలు, ముస్లింలీగు

ప్రభుత్వంతో కలుషితమైనా, గాంధి అహింసా సిద్ధాంతంతోనే హిందూ, మహమ్మదీయులసఖ్యత కోసం పాటుపడుతున్నాడని తెలిపింది. ఢిల్లీలో ప్రజాపరిషత్తు ప్రారంభమైనా లీగువారు కలవలేదనీ బ్రిటీష్ వారు ప్రజాపరిషత్తు యొక్క నూతన మార్గానికి అడ్డుపుల్లలు వేస్తున్నప్పుడు భారతదేశ రాజ్యాంగ ప్రజాపరిషత్తు సమావేశాలకు శాఖలపరంగా ఉపసంఘాలు వేశారనీ, ఆ ఉపసంఘాలలో దుర్గాబాయి సభ్యురాలుగా ఉండటం ఆనందమని వ్రాసింది. అంతేకాదు, మద్రాసుపాలనలో ఆచంట రుక్మిణీ ఆరోగ్యశాఖా మంత్రిగాను, అమ్మన్న రాజాగారు అసెంబ్లీ ఉపాధ్యక్షురాలిగా, వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ సభ్యురాలిగా స్త్రీలకు హితమైన బిల్లులు పెట్టే ప్రయత్నాలు చేయటమే ఆంధ్రమహిళల పురోభివృద్ధిని సూచిస్తోందని వ్రాసింది. నూలు వడికితే గుడ్డల కరువు పోతుందను కుంటే తగినన్ని అవసరమైన రాట్నాలు సప్లై కానప్పుడు కష్టమనీ, రాట్నాలు చవుక ధరలకు సప్లైచేస్తే బాగుంటుందని ఆ లేఖలో తెలియజేసింది.

*ఈ స్త్రీల సాహిత్యమే చరిత్ర, చరిత్రయే సాహిత్య మనటానికీ, స్త్రీలప్రగతికి నిదర్శనమే ఈ వ్యాసం. ఈ నాటి వృద్ధులయొక్క ఆనాటి తల్లిదండ్రులు ప్రతి ఇంట్లో 1942 నాటి ఆహార ధాన్యాలు, కిరోసిన్, నూనె, పంచదార వంటి వాటి రేషన్ గురించి తమ మాటల్లో పేర్కొనడాన్ని నేటికీ స్మరించుకోవటం జరుగుతున్న విషయమే.*

ఈ లేఖలలో బ్రిటిష్ వారి విభజించే రాజకీయాలకు బలికాకుండా హిందూముస్లింల మధ్యసఖ్యత అవసరమనీ, ద్వితీయప్రపంచయుద్ధ సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయనీ, చవకగా వస్తువులు అందుబాటులో ఉంటే బాగుంటుందంటూ తన అభిప్రాయాలను నెచ్చెలికి వ్రాసిన లేఖలలో కనుపర్తి వరలక్ష్మమ్మ పేర్కొంది.

20 శతాబ్దపు 5వ దశకంలో అంటే 1940 నుండి 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో రెండవ ప్రపంచ యుద్ధసమయంలో బ్రిటిష్ ప్రభుత్వానికి భారతీయులు సహకారాన్ని అందిస్తే సంపూర్ణస్వాతంత్ర్యం ఇస్తామని వారు హామీ ఇచ్చినా, యుద్ధానంతరం ఆ హామీని గాలికొదిలేసారు. గాంధిపిలుపుతో ఎంపికకాబడ్డ కొంతమంది స్త్రీ,పురుషులతో వ్యక్తిసత్యాగ్రహం ప్రారంభిపబడింది. అయినా వారిలో మార్పురానందుకు క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించి 'సాధించు లేదా మరణించు' అనే నినాదంతో స్వాతంత్ర్యోద్యమాన్ని తీవ్రతరం చేసారు. భారతీయుల ఐక్యతకై స్త్రీలు పురుషులతో సమానంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని స్త్రీలను చైతన్యపరిచారు. స్త్రీలలో హక్కులచైతన్యం పెరిగి విస్తరించింది. హిందూ మహ్మదీయులను బ్రిటిష్ వారు రాజకీయంగా చీలుస్తున్నారనీ మహ్మదీయులు ఒకానొకప్పటి హిందూభారతీయులేనని మతసామరస్యాన్ని చాటించారు. స్త్రీల శక్తికి జాతీయతకు లంకె కుదిరే విధంగా వాఙ్మయనిర్మాణం కావల్సిన అవసరాన్ని గుర్తించారు. గాంధి సిద్ధాంతమైన సర్వోదయం, కమ్యూనిష్టు సిద్ధాంతమైన సామ్యవాదాన్ని సమన్వయం చేస్తూ స్వాతంత్ర్యం సంపాదించాలను

కున్నారు. వ్యవహారంలో రాజభక్తి, కోరికలో ప్రజాస్వాతంత్ర్యం ఉండటంతో రెండిటి మధ్య వైరుధ్యం ఏర్పడి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించలేకపోతున్నామని గుర్తించారు. స్త్రీలు దేశసేవికలుగా జెండాతో ప్రచారంచేస్తూ దానిలో అహింసా, త్యాగం, సాహసంతో కూడిన దేశస్వాతంత్ర్యపు మువ్వన్నె జండాను కవితలో ప్రతిఫలింపజేసారు. స్త్రీలు సంఘటితశక్తిగా తమ హక్కులను, అధికారాలను, బాధ్యతలను స్త్రీసమాజాల ద్వారా సాధించుకోవాలనుకున్నారు. స్త్రీల వారసత్వపు బిల్లు రాకపోవటానికి ఫెడరల్ కోర్టు వారు చెప్పిన సాంకేతిక కారణాలు సమంజసంగా లేవని భావించారు. స్త్రీల ఆస్తిహక్కుకై చట్టాలు రావాలని భావించారు. స్త్రీల అభ్యుదయం కోరుకునే సాహిత్యం రావాలనుకున్నారు. రెండవ ప్రపంచయుద్ధంలో ప్రబోధగీతాలు వ్రాసారు. అంతేకాక ఆ అభ్యుదయ గీతాలలోనే విప్లవాత్మక భావాలను పొందుపరచారు. వేశ్యానిషేధపు బిల్లుని ప్రతిపాదించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకమునుపే స్త్రీలకు స్వతంత్రత కలిగే విధంగా వివాహ సంస్కృతిలో మార్పురావాలని కోరుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తూ తాము భారతదేశము నుండి వైదొలుగుతున్నామని బ్రిటిష్ వారు ప్రకటించగానే స్త్రీలు స్వంతంత్రభారతం చేయాల్సిన అభివృద్ధికర పనులను స్త్రీలకొరకు చేయాల్సిన చట్టాలను చర్చించుకోవటమే కాక, మాతృదేశస్వాతంత్ర్య సంరక్షణ బాధ్యత స్త్రీలపై ఉందని భావించారు. స్వాతంత్ర్యం వచ్చినా భారతీయులందరూ అన్నవస్త్రముల కొరత రానీయకుండా బ్రతకగల సామర్థ్యం వచ్చినపుడు భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని భావించారు. స్త్రీలస్వాతంత్ర్యానికిని, దేశస్వాతంత్ర్యానికిని ఉన్నలంకెను గుర్తించి, సమాంతరంగా వచ్చిన స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యోద్యమం మరియు దేశస్వాతంత్ర్యోద్యమ సాహిత్యం తరతరాలకు సజీవత్వంతో ఉండేలా స్త్రీలు సాహిత్య సృజన చేసారు. ఇక అంతిమంగా భారతీయులు స్వాతంత్ర్యాన్ని సాధించిన విషయాన్ని తెలుసుకోవటానికి దేశస్వాతంత్ర్య సిద్ధి చేరువలోకి తీసుకెళ్ళిన సాహిత్య ప్రస్థానాన్ని చేరుకొందాము. స్త్రీలసాహిత్యంలోవచ్చిన విప్లవాత్మక ఆలోచనలు ఫలించేటట్లుగా సాహిత్యం ప్రతిఫలించింది.

# 7.1. సాహిత్యము - (క్రీ.శ.1947-1948) - భారతదేశ స్వాతంత్ర్య చట్టము - దేశ స్వాతంత్ర్యసిద్ధి

జులై 1947 గృహలక్ష్మి పత్రికాధిపుల ప్రచురణలో భారతస్వాతంత్ర్య చట్టానికై బిల్లును జులై 4 తేదీన బ్రిటిష్ పార్లమెంటులో ప్రధాని అయిన ఆట్లీ ప్రతిపాదించాడనీ, దాని ప్రకారం భారతదేశం, పాకిస్తాన్, అని రెండు డొమీనియన్లుగా 15-8-1947 నుండి ఏర్పడుతాయని తెలిపింది. తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాలు సరిహద్దు పరగణాలు, రిఫరెండమ్ బౌండరీల కమీషన్ వల్ల తేలగలిగే సిల్హట్, సరిహద్దు పరిగణాలును, బెలూచిస్థాన్ బ్రిటిష్ ప్రాంతం పాకిస్థాన్ కి చెందుతాయనీ, మిగిలినవి భారతదేశానికి చెందుతాయనీ, ఈ రెండు డొమీనియన్లకు వైస్రాయ్ ఉంటాడనీ, తమతమ శాసనసభలలో గవర్నర్ జనరల్ ని రాజు ఏర్పాటు చేస్తారనే చట్టప్రతి పాదనలను పేర్కొంది. రెండు డొమీనియన్ లు చేసే శాసనాలకు రాజుకు అభ్యంతరం ఉండదనీ, ఆనాటితో స్వదేశీసంస్థానాల మీద సార్వభౌమాధికారం తొలగి ఇష్టమైన డొమీనియనులో చేరవచ్చని ఉన్న విషయాన్ని పత్రిక తెలిపింది. డొమీనియనులలో స్వతంత్ర రాజ్యాంగ చట్టం వచ్చేదాక 1935చట్టమే తగు మార్పులతో అమలులో ఉంటుందనీ, సేనలు ఉభయ రాజ్యాలకు విభాజ్య మవుతాయనీ అందుకే పాకిస్థాన్ కి జిన్నా, భారతదేశానికి మౌంట్ బ్యాటిన్ ప్రభువును గవర్నరు జనరల్ గా రాజుగారు ఏర్పరిచారని పత్రిక తెలియజేసింది.

భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన సందర్భాన్ని పురస్కరించుకొని స్త్రీలయొక్క భావి కర్తవ్యాన్ని సూచిస్తూ స్త్రీల సాహిత్యంలో 10 వ్యాసాలు వచ్చాయి.

వల్లభనేని సీతామహాలక్ష్మి యం.యల్.ఎ. వ్రాసిన 'స్వతంత్ర భారతం' (ఆగష్టు 1947) అనే వ్యాసంలో ఆగష్టు 15 వ తేదీ భారత దేశంలో నూతన శకారంభమనీ, విదేశీ ప్రభుత్వం పోయినా దేశములో ప్రతివారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యములు లభించినట్లు కాదనీ, భారతదేశ స్వాతంత్ర్యంతో పాటు దేశం విభజింపబడిన సంగతి స్త్రీ పురుషులు విస్మరింపరాదని తెలిపింది. పాకిస్థాన్ ఇండియా ఐక్యభారతంగా ఉండే రోజులకు భారత సంతానం నిరంతరం కృషి చేయాలనీ,

పల్లెలో అంటరానితనం సమస్యతీరకపోతే ఐక్యత ఉండదని తెలియజేసింది. జమీందారీ పద్ధతి పోయింది కాబట్టి హరిజనుల ఆర్థికస్థితి బాగుపడాలనీ, హరిజన బాలబాలికల సంఖ్యాబలానికి తగ్గట్టు విద్యాబోధనపై రాత్రి పాఠశాలలు పెట్టి దేశాభ్యుదయానికి తోడ్పడాలనీ, అంబేద్కర్ సమష్టి నియోజక వర్గములను ఏర్పాటుచేయటంతో స్వతంత్ర భారతందేశంలో రాజకీయంగా హరిజనాభ్యుదయానికి ఆటంకం ఉండదని భావించింది. భారతదేశ స్త్రీలకు గౌరవంతోపాటు ఆస్తిలో సమాన భాగస్వామ్యం ఉండాలనీ, అప్పుడే కట్నాలు తగ్గుతాయనీ, కేవలం చట్టాలవల్ల వరకట్నం తగ్గదనీ, స్త్రీపునర్వివాహం చేసుకొన్నప్పటికీ పురుషుల విషయంలో భార్యఆస్తి వచ్చినట్లు ఆమెకు భర్తఆస్తి సంక్రమించాలనీ, విడాకులచట్టాన్ని స్త్రీలు సద్వినియోగం చేసుకొంటారనీ, దీనిని శాసనసభ్యులు గమనించాలని చెప్పింది. బీద, ధనికుల మధ్య అంతరాలు లేకుండా సామ్యవాద సిద్ధాంతంగా ప్రజాస్వామ్యం రాజ్యాంగ శాసనంద్వారా నిర్మింపబడాలనీ, అప్పుడుగానీ వర్గ పోరాటాలు తగ్గవనీ, భారతదేశంలో ప్రధాన సమస్యలు పరిష్కరింపబడినప్పుడే ప్రతి వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందినట్లుగా భావించాలని తెలియజేసింది.

*భారతదేశ స్వాతంత్ర్యానంతర ఫలితాలను ఊహిస్తూ దేశస్వాతంత్రం స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యం పరస్పర ఆధారితాలని భావించినట్టు అర్థం అవుతుంది. స్త్రీలకు ఆస్తిహక్కు లభించినప్పుడే స్త్రీలకు వ్యక్తిస్వాతంత్ర్యం ఉన్నట్టు భావించాలనీ, అన్ని వర్గాలవారిసమస్యలు తీరేవిధంగా సామాజిక జీవనప్రమాణాలలో భద్రత ఏర్పడినప్పుడే దేశానికి ప్రజాస్వామికమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని భావించింది.*

డాక్టరు ముత్తు లక్ష్మీదేవి మాజీ మదరాసు మరియు ప్రస్తుత బళ్ళారి శాసనసభ్యురాలు 'వందేమాతరం' (ఆగష్టు 1947) అనే శీర్షికన తెలియజేస్తూ ఆగష్టు 15వ తేదీన భూమ్యాకాశాలు జయజయధ్వానాలతో మారుమ్రోగుతాయనీ, ఆ నాడు భారతమాత దాస్యశృంఖలాలను తెంచుకొని స్వతంత్రపదవిని పొందుతుందనీ, 60 సంవత్సరాల నుండి గాంధి చేసిన కృషిగా శాంతి, అహింసాతత్వంతో సాధించాడని తెలిపింది. అజాద్, పటేల్, జవహర్ రాజాజీ వంటివారును, విఠల్ బాయ్, పటేల్, మోతీలాల్ మరియు కస్తూరిబాయి గాంధీ, కమలానెహ్రూ మొదలగు వారియొక్క సేవ గొప్పదనీ, 15వ తేదీన భారతీయులందరూ తోరణాలు కట్టి దేశకల్యాణదినంగా చేసుకోవాలని విజ్ఞప్తిచేసింది.

*రెండవ ప్రపంచయుద్ధానంతరం బ్రిటిష్ వారు భారతదేశ పరిపాలనను భారతీయులకు అప్పగించటమే స్వాతంత్ర్య సాధన. బ్రిటిష్ వారు పరిపాలననుండి తాము వైదొలగి భారతదేశానికి 1947 ఆగష్టు 15 నుండి స్వాతంత్ర్యం ఇస్తున్నామని ముందే ప్రకటించటంతో నాటి స్త్రీలు ఆ రోజును ఒక పర్వదినంగానూ, మహోత్సవదినంగాను ఊహించుకుంటూ ఆనందపడటం అర్థం అవుతుంది. నేటికీ ప్రతి సంవత్సరము ఆగష్టు 15 వ తేది భారతీయులైన ఆబాలగోపాలానికి జాతీయ పండుగే. జాతి పండగే.*

‘భారతజాతీయ పతాకం – భారతనారీమణుల జాతీయాభిమాన జన్యము’ అనే (ఆగష్టు 1947 గృహలక్ష్మి) పత్రికాధిపుల ప్రచురణలో వర్సెల్ సంధి అనంతరం స్వతంత్రరాజ్యం సమకూడినా విదేశీపర్యటనలో పాల్గొన్ననాటి సభలో 44 దేశాల పతాకాలున్నాయిగానీ, భారతదేశపతాకం లేనందుకు తనకు సిగ్గుచింత కలిగిందనీ సరోజినీనాయుడు చెప్పిన మాటలను పత్రిక ఉటంకించింది. మునుపు బెర్లిన్ పట్నంలో జరిగిన అంతర్జాతీయ స్త్రీల ప్రతినిధుల సభలోనూ భారతదేశానికి పతాకం లేనందున మేడమ్ కామా ఆధ్వర్యంలో స్త్రీలు వారి చీరె చెరుగులను చించి ఆకుపచ్చ, తెలుపు, వంగపండురంగులో ఉన్నవాటినికూర్చి జాతీయ పతాకంగా ప్రదర్శించారనీ, పతాకం లేకపోవుటచే స్త్రీలు, పురుషులు అన్ని కులాల, మతాలవారు బాధపడ్డారని పత్రిక తెలిపింది. అంతేకాక, ఢిల్లీలో జరిగిన ఆసియాదేశ సభలలోనూ జాతీయపతాకం లేదనీ, భారతదేశ జెండా క్రింద రైతు, రాజు భేదం లేదనీ, స్త్రీ పురుష తారతమ్యం లేదనీ నూతనంగా ఆవిర్భవించిన స్వతంత్ర భారతదేశపు సంతానమైన స్త్రీ, పురుషులు, హిందువులు, ముసల్మానులు, క్రిష్టియనులు, జైనులు, సిక్కులు, పారశీకులు అందరూ ఏకస్వరూపమేననీ చెప్పింది. ఆనాడు ఒక తెలుగు ముత్తైదువ ఆ పతాకానికి వందనము చేసి భారతమాత గౌరవాన్ని నిలబెట్టిందనీ, 1905 బెర్లిన్ సమావేశంలో ‘అభినవ భారతం’ కొరకు ఏర్పాటైన పతాకాన్ని చేబట్టి అది భారత స్వాతంత్ర్య పతాకమనీ దీనికి నమస్కరించమని చెప్పిందని తెలియజేసింది. ఇప్పుడు తొలిసారిగా భారతదేశ కేంద్రశాసనసభ మీద ఆగష్టు 15 న ఎత్తబడే నూతన జాతీయపతాకాన్ని అనేక విధాల దేశసేవ, సంఘసేవ చేసిన 50 మంది నారీమణులు రాజ్యాంగ చట్టసభకు 14వ తేదీన సరోజనీదేవి అధ్యక్షతన సమర్పిస్తారని తెలియజేసింది. మదాంకామా (మేడమ్ కామా) అను భారతదేశ వాసియగు పారశీకస్త్రీ దాదాభాయి నౌరోజీ పార్లమెంటు అభ్యర్థిగా నిలబడినప్పుడు ఆయన విజయానికి కృషి చేసి హోమ్ రూల్ ఉద్యమాన్ని నడిపిందనీ, దాని తరువాత ఆమె అమెరికాలో ప్రచారం చేసిందనీ, వీరసావర్కర్ ఇంగ్లాండ్ నుండి వచ్చి ప్రారంభించిన ‘అభినవ భారత’ అనే విప్లవ సంఘమునజేరి వారిని ప్రోత్సహించిందని చెప్పింది. అంతేకాక ఆనాడు బెర్లిన్ సభలో చీర ధరించిన ఆమె మాట్లాడిన తరువాత ఒక పతాకాన్ని చూపించి వీరుల త్యాగఫలంగా రక్తంతో తడిసినదని చూపించటంతో మొట్ట మొదట భారత జాతీయ పతాకాన్ని ప్రదర్శించిన కీర్తి ఒక స్త్రీకి దక్కిందనీ, ఆమె స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీల భాగస్వామ్యం మీద నివేదిక సమర్పించిందని పత్రిక తెలియజేసింది.

*పారశీకస్త్రీ అంటే చారిత్రకంగా వలసవెళ్ళిన ఒకానొకప్పటి కాశ్మీరీ పండితుల వారసురాలని గ్రహించాలి.*

కడప రామసుబ్బమ్మ (మాజీ కడప జిల్లా బోర్డు అధ్యక్షురాలు) ‘స్వాతంత్ర్యము–మనకర్తవ్యం’ (ఆగష్టు 1947 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ మహాత్మాగాంధీ నాయకత్వం క్రింద నడిచిన స్వాతంత్ర్యోద్యోమంలో ఎందరో అసువులు బాసారనీ, స్త్రీలు అహింసా సిద్ధాంతంతో త్యాగాలు చేసారనీ

వారు కుటుంబ సభ్యుల ప్రాణాలను దేశానికి అర్పించారనీ, దానివల్లనే స్వాతంత్ర్యం సిద్ధించిందని తెలిపింది. కాని నేడిచ్చిన స్వాతంత్ర్యం భారతఖండాన్ని చీల్చిందనీ, మతాలపేరిట హత్యాకాండలు జరుగుతున్నాయనీ, భారతదేశంలో తప్ప మిగిలిన ప్రపంచంలో స్వాతంత్ర్య పోరాటం హింసతో ఉందనీ, గాంధీ, కాంగ్రెసు త్యాగాలు చేసి సాధిస్తే, జిన్నా మొండి పట్టుదలతో సాధించాడని తెలియజేసింది. అంతేకాదు, స్వతంత్ర సంపాదనతో భారతీయుల బాధ్యత పెరిగిందనీ, మాతృదేశ సంరక్షణకు నిర్మాణాత్మక పనులు చేయాలనీ, ఆ బాధ్యత స్త్రీలపైనే ఉందనీ, దేశంలో శాంతిని స్థాపించటానికి ప్రతి యిల్లు వ్యాయామశాలగా మారి స్వయంరక్షణ తర్ఫీదుండాలనీ, ఇంటికొక్కరైనా భారత సంరక్షణ దళంలో చేరాలని పిలుపునిచ్చింది. జాతీయ సంపదల అభివృద్ధికి నిరంతరం కృషిచేయాలనీ, ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, పారిశ్రామిక, నైతిక, ఆధ్యాత్మిక సంపదలను అభివృద్ధిపరిస్తే ప్రాచీన భారతదేశం సౌభాగ్యాన్ని తిరిగి పొంది ప్రపంచంలో సుస్థిరశాంతిని నెలకొల్పగలుగుతుందని తెలియజేసింది.

*స్వతంత్ర భారతదేశ నిర్మాణం, అభివృద్ధి, సంరక్షణలో స్త్రీలపాత్ర ఇంకా కొనసాగాలని తెలియజేసింది. భవిష్యత్తులో స్త్రీలు సైన్యంలో శిక్షణ పొందాల్సిన అవసరాన్ని ఆనాడే తెలియజేసింది.*

'గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ గారు' ను గురించి (ఆగష్టు 1947 గృహలక్ష్మి) పత్రికాధిపులు తెలియచేస్తూ ఈమె పతి గుడివాడ మునిసిపల్ సంఘసభ్యులుగా ఉండి కాంగ్రెస్ ఆదేశానుసారం రాజీనామచేసారనీ, ఈమె 1927లో మద్రాసుకాంగ్రెస్ లో 'దేశసేవిక' అనీ, 1930 లో ఉప్పుసత్యాగ్రహం, 1931లో విదేశీవస్త్ర దుకాణాలవద్ద పికటింగ్, 1932లో గుడివాడలో స్త్రీ సత్యాగ్రహదళాన్ని నడిపిందనీ, 3 మాసాలు తీవ్ర నిర్బంధాలకు గురియై ఒక సంవత్సరం పాటు సి.క్లాసు జైల్లో కఠినశిక్షను ననుభవించిందని తెలిపింది. 1938లో గుడివాడలో హరిజన బాలికా వసతి గృహమును స్థాపించిందనీ, 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మూడుమాసాలు కఠిన కారాగార శిక్షను అనుభవించిందనీ, రెండుసార్లు జైలుశిక్షను అనుభవించిన ఆంధ్ర స్త్రీయని పేర్కొంది. గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రి అడ్వైజరీ బోర్డులో సభ్యులనీ, 1936 నుండి స్త్రీ పునర్వివాహ సహాయకసంఘ కార్యదర్శిగా పనిచేసిందనీ, రాజకీయసాంఘిక రంగంలో భర్తకు చేదోడు వాదోడుగా ఉన్నదని పత్రిక తెలియజేసింది.

'యామినీపూర్ణ తిలకమ్మ దేశసేవ' (ఆగష్టు 1947 గృహలక్ష్మి) ను గురించి ఆమె కూతురు కనకదుర్గ వ్రాసిన వ్యాసంలో తన తల్లి 1920 నుండి గాంధీ సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్న దేశసేవాభిలాషియనీ, మాతృభాషలో ఉపన్యాసంచేసి ప్రజాదళాలలో దేశసేవాభిమానాన్ని ప్రజ్వలింపజేసిందనీ, రాజకీయరంగంలో వీరవనితగా పోరాడిందని తెలిపింది. పతితస్త్రీల ఉద్ధరణానికై 1923 లో హిందూ యువతీ శరణాలయాలను మద్రాసులో స్థాపించిందనీ, 1928 తరువాత 'హిందూ యువతి' అనే పత్రికను నడిపి సాంఘిక దురాచారనిర్మూలన మొనర్చి స్త్రీ

స్వాతంత్ర్యం కోసం పాటుబడిందని తెలియజేసింది. అంతేకాక సైమన్ కమీషన్ రాక సందర్భంగా ఉపన్యసించిందనీ, జైలుకు వెడుతున్నప్పుడు కూడా శరణాలయ ఉద్యమాన్ని విడనాడలేదని, విదేశీవస్త్ర బహిష్కరణం చేసినందుకు మద్రాసులో జైలు శిక్ష అనుభవించిందనీ, 'విశ్వజనని' అనే పత్రిక స్థాపించినా అనారోగ్యకారణంగా అది నిలిచిపోయిందనీ తెలియజేసింది.

*పతితస్త్రీ జనోద్ధరణ ఆమెయొక్క ప్రత్యేకతగా నేటికీ స్మరణీయమే.*

ఆచంట సత్యవతమ్మ 'రామరాజ్యం' (ఆగష్టు 1947 గృహలక్ష్మి) అనే శీర్షికన వ్రాస్తూ వర్తకరూపేణ వచ్చిన బ్రిటిష్ వారు మన కడుపులు కొల్లగొట్టారనీ, నేడు కలతలు సృష్టించి వెడుతున్నారనీ భారతీయులు పార్టీలుమాని నడుముకట్టి ఐకమత్యంగా పనిచేస్తే భారతాంబ ఋణం తీర్చుకోగలుగుతారని విశ్వసించింది. రాజకీయ పార్టీల ప్రభావం దేశాభివృద్ధికి ఆటంకం కల్గిస్తుందని ఆనాడే ఊహించిన క్రాంతదర్శి.

పాటూరు బాలసరస్వతమ్మ (ఆగష్టు 1947 గృహలక్ష్మి)ను గురించి పత్రికాధిపులు వ్రాస్తూ నెల్లూరు వాసి ఐన ఆమె 1917లో విజ్ఞాన చంద్రికా పరిషత్ లో స్వర్ణపతకాన్ని పొంది గాంధీ పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమంలోను, అసహాయోద్యమంలో పాల్గొని 1920-24 మధ్య నాల్గుసార్లు శిక్షకు గురిఅయిందనీ, రాట్నం ప్రచారం, సీమగుడ్డల దుకాణాలముందు పికెటింగ్ లో పాల్గొన్నదని తెలియజేసింది. అంతేకాదు, 'శారద' అను సారస్వత పత్రికకు సంపాదకురాలనీ, కస్తూరిబాలికా హైస్కూలులో ఉపాధ్యాయురాలిగా ఉండి పాఠశాల విద్యార్థులకై బియ్యము వసూలు చేసేదనీ, 1939-40 లో 'యువతీ సమితి' అనే స్త్రీసమాజాన్ని స్థాపించిందనీ, 1947 లో కస్తూరిబా జ్ఞాపకార్థం కస్తూరిబా సమాజాన్ని స్థాపించిందనీ, ఆంగ్ల, హిందీ, భాషలలో చక్కని పరిశ్రమ చేసిందని పత్రిక తెలియజేసింది.

'ముత్యాల సరోజనీ దేవి' ని గురించి (ఆగష్టు 1947 గృహలక్ష్మి) పత్రికాధిపుల ప్రచురణలో సంయుక్త పరగణాలకు తాత్కాలిక గవర్నరు పదవిని అలంకరించిందనీ, భారతదేశానికి స్వతంత్రతతోపాటు భారతనారీ లోకానికికూడా స్వతంత్రం వచ్చిందని భావించవచ్చనీ, మంత్రిణిగా, విదేశీరాయబారిగా, (విజయలక్ష్మి పండిట్) ఒక స్త్రీ ఉంటే మరొక స్త్రీ (సరోజినీ నాయుడు) రాష్ట్ర గవర్నరుగా ఉండటం, ఆమె విద్వాంసురాలిగా, కళావేత్తగా, రాజనీతిచతురగా, ధైర్యసాహసోపేతగా ఉందనీ, 'ఆంధ్రులమనుకొనుటయే గాక విశాలభారతమని ఆంధ్రమహిళలు మరువరాద'ని తెలియజేసింది.

*కొంతమంది సాధించిన విజయాలతో వచ్చిన స్వాతంత్ర్యం భారత స్త్రీలందరికి దక్కిందను కోవటం భ్రమే అని, కాని ప్రతి స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్యం, దేశస్వాతంత్ర్యం పరస్పర పోషకాలనే మాట మర్చిపోకూడదు.*

నడింపల్లి శారదా కుమారి వ్రాసిన 'స్వాతంత్ర్యపోరాటమున ఆంధ్రస్త్రీలు పడినపాట్లు' (ఆగష్టు 1947 గృహలక్ష్మి) అనే వ్యాసంలో ఉన్నవ లక్ష్మీబాయమ్మ 1922లో గుంటూరు లో స్త్రీవిద్యకై శారదానికేతనాన్ని స్థాపించి స్త్రీ విద్యకు పాటుపడుతున్నారనీ, 1920 నుండి కాంగ్రెస్ రాజకీయాలలో సహాయనిరాకరణలోనూ పాల్గొని జైలుశిక్షను అనుభవించారనీ, అహింసా సిద్ధాంతంతో గాంధీజీ నాయకత్వంలో తోటి స్త్రీలకు ముందుండి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెప్పించారని తెలియజేసింది. అంతేకాదు, భారతీయులు ప్రభుత్వఉద్యోగాలు మాని, ఖద్దరు ధరించి, విదేశీ వస్త్ర బహిష్కరణ చేయాలనీ, స్వదేశీ దీక్షను పట్టాలనీ ప్రజలకు ఆమె పిలుపునిచ్చారనీ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ స్వాతంత్ర్యోద్యమంలో సత్యాగ్రహప్రచారం చేసారనీ, మూడుసార్లు కారాగృహానికి వెళ్ళారనీ, అలాగే అన్నపూర్ణ (ఏలూరు) బ్రహ్మజ్యోస్యుల లక్ష్మీనరసమ్మగారు (రాజమండ్రి) పొణకా కనకమ్మ (నెల్లూరు) గుమ్మడిదల దుర్గాబాయమ్మ, యామినీ పూర్ణతిలకమ్మ వంటివారు నాటి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్షను కూడా అనుభవించారనీ తెలియజేసింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న స్త్రీల సమాచారాన్ని అందించింది.

బత్తుల కామాక్షమ్మ 'మనకర్తవ్యం' (ఆగష్టు 1947 గృహలక్ష్మి పత్రిక) అనే శీర్షికన వ్రాస్తూ భారతీయులందరు ఏనాడయితే అన్నవస్త్రములకు కొరతలేకుండా సుఖమయ జీవితాలను హాయిగా గడుపుతారో ఆనాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లనీ, దానికై ముందుగా నిరక్షరాస్యత, భావదాస్యం పోవాలని అది ఏర్పడబోయే భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రధాన కర్తవ్యం అని తెలిపింది. ఏ జాతికైనా వ్యక్తిత్వం, గౌరవం, మర్యాద ఉంటే అస్వతంత్రత తొలగిపోతుందనీ, స్వాతంత్ర్యం సంపాదించటం ఒక యెత్తు అయితే దాన్ని నిల్పుకోవటం కూడా మరియొక యెత్తు అని చెప్పింది. భారతదేశానికి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యము కలగటానికి భారత స్వాతంత్ర్యచట్టాన్ని చేయటం నిజమైన స్వాతంత్యాన్ని ఇచ్చిందని తెలియజేసింది.

*భాషా, భావ దారిద్ర్యాలు పోయి స్త్రీపురుషులు పరస్పర వ్యక్తిత్వాలను గౌరవించుకొంటూ జీవించటమే నిజమైన స్వాతంత్ర్యం. నేటి యువత నిత్యం మననం చేసుకోవాల్సిన వ్యాసమిది.*

స్వాతంత్ర్య ప్రకటన సందర్భాన్ని పురస్కరించుకొని స్త్రీలు దాదాపుగా 10 వ్యాసాలను వ్రాసారు. ఆ వ్యాసాలలోబ్రిటిష్ వారు హిందూ ముస్లిములను విడగొట్టి భారతదేశం, పాకిస్థాన్‌లను స్వతంత్రదేశాలుగా ప్రకటించి అధికారాలను అప్పగించినట్లు సాహిత్యంలో తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో తీసుకోవాల్సిన నిర్ణయాలు, స్త్రీల గౌరవం, స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు, ప్రాణత్యాగం చేసిన దేశభక్తుల స్మరణ చేసారు. భారతదేశ నారీమణుల జాతీయాభిమాన జన్యమే భారతదేశపతాకమనీ, భారతీయులందరు దేశాభివృద్ధికై స్వాతంత్ర్యపోరాటంలో ఆంధ్రస్త్రీలు పడ్డపాట్లను స్మరించి నిరంతరం కష్టపడి భారతదేశానికి పూర్వ వైభవాన్ని తేవాలనీ, స్వతంత్ర భారతదేశంలో స్త్రీల కర్తవ్యాన్ని నిర్ణయించు కోవటం వంటి విషయాలను తెలియజేస్తూ స్త్రీలు వ్యాసరచన చేసారు.

**కవిత**

వింజమూరి సీతాదేవి వ్రాసిన 'పంజరము' అనే కవితలో (ఆంధ్రకవయిత్రులు – ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

"అరుణరాగాన పూర్వాద్రియందు స్వేఛ్ఛ
కొలువు తీర్చు ప్రొద్దున వియత్తలములోన
కెగరిపోయితిగాని, యీగగనపథము

దూరమైతోచె, స్వేఛ్ఛయే భారమయ్యె
తరతరముల దాస్యమ్ముపై బరువుదోచు,
స్వేఛ్ఛ నీహృదయమ్ము మోసికొనలేదు" అని

*తరతరాలుగా దాస్యంలో మగ్గిన స్త్రీలకు ఆధునికకాలంలో స్త్రీవిద్యవల్ల స్వేఛ్ఛ లభించినా అది బరువుగానే తోస్తుందనీ, రోగి పథ్యాన్ని అరిగించుకోవటానికి అన్నీ తినలేనట్లుగా అర్థమవుతుంది.*

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో ఉత్సవాలను చేసుకోవటమే మిగిలింది.

**లేఖలు**

కనుపర్తి వరలక్ష్మమ్మ 'శారద' అనే పేరుతో ఊహామిత్రురాలైన కల్పలతకు 'శారద లేఖలు' (ఆగష్టు 1947 గృహలక్ష్మి) అనే పేరుతో వ్రాస్తూ 1947 ఆగష్టు 15వ తేదీ భారతీయులకు సంతోషకరమైనదనీ, ప్రజలు కోరుకున్నవారే శాసనసభా ప్రతినిధులనీ, వారు చేసిన తీర్మానాలే చట్టాలనీ, ప్రజలు శాసనసభ్యులనెన్నుకొనుటలో తమ పరిశీలనా బుద్ధిని వినియోగిస్తే సుపరి పాలితమగు స్వపరిపాలన ఏర్పడుతుందని తెలిపింది. 60 ఏండ్ల నుండి భారత జాతీయ మహాసభ కృషిఫలితంగా 27సంవత్సరములు మహాత్మాగాంధీ తపోఫలంగా స్వరాజ్యప్రాప్తి కలిగిందనీ, భారతమాత పుత్రరత్నాలు ఉరికంబాలు ఎక్కి, అండమాను దీవులలో, జైళ్ళలో కష్టాలుపడి, బ్రిటిష్ తుపాకీగుండ్లకు బలియై, లాఠీ దెబ్బలకు గురియై, ఆస్తిపాస్తులను కోల్పోయిన వారి త్యాగఫలమే నేటి స్వతంత్రమని తెలియజేసింది. వందేమాతరం, హోంరూలు, అసహాయోద్యమం, లవణ సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో నిండు ప్రాణాల నర్పించిన దేశభక్తుల అస్థికలతో నిర్మితమైనదే ఈ స్వతంత్రసౌధమని తన లేఖలో పేర్కొంది. అంతేకాదు స్వాతంత్ర్యం జన్మహక్కనీ నొక్కి వక్కాణించిన దాదాభాయ్ నౌరోజీ, తిలక్, లాలా లజపతిరాయ్, చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ, మహాదేవ్ దేశాయ్, మదన మోహన మాలవ్య, మాతా కస్తూరిబాయివంటివారును స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి చనిపోయారనీ, ఇరువది లక్షల శిక్షితా సైన్యాన్ని తయారుచేసి భారతదేశానికిచ్చిన సుభాష్ చంద్రబోస్ నాడు లేడనీ, వారి పవిత్రాత్మలు మహోదయాన్ని

ఉపలక్షిస్తున్నాయని భావించవచ్చని వ్రాసింది. అదేకాక, పాకిస్థాన్ వేరింటి కాపురం పెట్టటం జరిగిందనీ, బ్రిటిష్ వారి సహకారం ఉండటంతో జరిగిన హత్యలు, దోపిడిలు, గృహ దహనాలు, స్త్రీల అపహరణలు వంటి అకృత్యాలు మిత్రభేదంతో సృష్టించిన మతకల్లోలాలతో దేశంలో హానికర సంఘటనలు కోకొల్లలుగా జరిగాయని వ్రాసింది. నిన్నటి ప్రజలు ప్రభుత్వం వేరనీ, నేడు ప్రజలే ప్రభుత్వం, ప్రభుత్వమే ప్రజలనీ, త్రివర్ణపతాకాన్ని పెట్టుకున్నందుకు నిన్నటివరకు చావ కొట్టిన పోలీసులే నేడు ఆ పతాకానికి వందనాలను అందిస్తూ ఊరేగుతున్నారని తెలిపింది. భారత దేశస్వాతంత్ర్య పతాకపు విలువలను పేర్కొన్నారు. భారతజెండాపై నేటినుంచి రాట్నం గుర్తులోని కదురు, దారములుపోయి రాట్నచక్రం మాత్రము మిగిలిందని అది అహింసను పాటించిన అశోకుని ధర్మచక్రంలా మిగిలిందనీ, అది భారతదేశ ప్రజల అహింసా చిహ్నమని, భారతదేశస్థితి కరి మింగిన వెలగపండువంటి డొప్ప అనీ, ఈ స్థితి నుండి దేశం ఉద్ధరింపబడాలంటే భారతీయు లందరూ కృషిచేసి దేశాభివృద్ధి చేయాలనికూడా తన లేఖలో కనుపర్తి వరలక్ష్మమ్మ తెలియజేసింది.

భారతదేశ స్వాతంత్ర్యపు విలువను స్వాతంత్ర్యోద్యమకారుల త్యాగమును తరతరాలు గుర్తుపెట్టుకొనేలా తెలియజేసింది. అమరులైన దేశనాయకులను స్మరించి, నాటి ఆర్థిక స్థితిగతులను తెలుపుతూ భారతీయుల తదనంతర కర్తవ్యాన్ని మిత్రురాలికి వ్రాసిన లేఖద్వారా ఉద్బోధించింది.

# 8. సాహిత్యం - స్వాతంత్ర్యమహోత్సవము 15-8-1947

20 వ అఖిల భారత మహిళా మహాసభలలోని తీర్మానాలను (జనవరి 1948 గృహలక్ష్మి) పత్రిక ప్రచురిస్తూ సభలో ముందుగా సరోజనీదేవి గవర్నరుగాను, విజయలక్ష్మి పండిట్ రష్యారాయబారిగా, అమృతకౌరు ఆహారశాఖామంత్రిణిగా, రాణీలక్ష్మీబాయి ఏషియన్ రిలేషన్ కాన్ఫరెన్స్ కౌన్సిల్ ప్రతినిధిగాను, కామేశ్వరీ నెహ్రూ రిలీఫ్ ఫండు రిహాబిలేషన్ మంత్రిత్వంలోని స్త్రీల శాఖకు డైరక్టరుగా నియమింపబడినందుకు అఖిలభారతమహిళాసభ ముందుగా ఆహ్లాదాన్ని తెలిపింది. 'హిందూకోడ్' పునర్నిర్మాణం ఆలస్యమైందనీ, భారత్ యూనియన్ ప్రధాని వద్దకు రాయబారం పంపాలనీ, నర్సింగ్ కౌన్సిల్ చట్టం తేవాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకింద నర్సులకు తర్ఫీదునిచ్చి వారిని ఉద్యోగాలలో నియమించాలనీ, ప్రసూతి వైద్యశాలలతోపాటు ఆరోగ్యశాఖ అభివృద్ధి చెందాలనీ, నిర్బంధోచిత వార్ధా విద్యావిధానం (ప్రాథమికవిద్య) ఏర్పాటుచేయాలనీ, శిశు శిక్షణాలయ విద్యాలయాలలో ఫలములను బోధనాసాధనంగా ఉండాలని ఆ మహాసభలలో తీర్మానాలు చేసారని పత్రిక తెలిపింది. అంతేకాదు, దేహపరిశ్రమకు తర్ఫీదు, బాలబాలికలకు దాంపత్య ధర్మసూత్రాలు, గృహవైద్యోపచారములు, (ప్రాథమిక చికిత్స) విద్యాలయాలలో మధ్యాహ్నభోజనపు ఏర్పాట్లు, చేపట్టాలనీ, మహిళలు చేసిన తీర్మానాలైన బహుభార్యానిషేధం, విడాకుల వంటి వాటిని చట్టాలుగా చేయాలని తీర్మానించిన విషయంగా పత్రిక తెలిపింది. అంతేకాదు, రైలుప్రయాణీకుల సౌకర్యాలు, సంచార వైద్యాలయాలు, ధరలస్థిరీకరణ, కంట్రోళ్ళు తొలగించాలనీ దేశమంతటా అధికోత్పత్తి విధానం, రైతుకు న్యాయమైన ధర లభించటానికి, బ్లాక్ మార్కెట్, లంచగొండితనం లేకుండా చేయాలని క్రీడాక్షేత్రాలును ఏర్పాటుచేయాలని ఆ సభలో తీర్మానించారని పత్రిక తెలిపింది. సోషల్ సర్వీసు డిపార్టుమెంటువారు తాత్కాలిక ఉద్యోగాలనిచ్చిన స్త్రీలను వివాహానంతరం తొలగించి నందుకు వారికి ఉద్యోగ కల్పనచేయాలని, అన్ని వృత్తులు అన్నిపరిశ్రమలలో స్త్రీలకు పురుషులతో పాటు సమాన వేతనాలు ఇవ్వాలనీ, మతం పేరుతో ప్రత్యేక స్కూళ్ళు ఉండకూడదని అఖిలభారత మహిళా సభ తీర్మానాలను చేసిందని పత్రిక తెలియజేసింది.

స్త్రీలు స్వాతంత్ర్య ప్రకటనానంతరం అఖిలభారతమహాసభలను ఏర్పాటుచేసుకొని స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి భారతదేశపు ఆర్థికస్థితి యొక్క డొల్లతనాన్ని అందరికీ తెలియజేసారు.

స్వాతంత్ర్యానంతరం దేశ సాంఘిక, ఆర్థికాభివృద్ధికై ఆచరణలో పెట్టాల్సిన విషయాలలో తీర్మానాలను చేసారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి విద్యాభివృద్ధిని సాధిస్తూ దేశాభివృద్ధి జరగాల్సిన అవసరాన్ని సూచించింది. మొత్తం మీద స్వతంత్ర భారతదేశంలో కొంతమంది స్త్రీలను కార్యనిర్వాహకులుగా గుర్తించినందుకు సంతోషాన్ని వ్యక్తంచేస్తూ ప్రజలందరూ అభివృద్ధి చెందటానికి అవసరమైన తీర్మానాలను చేసారు.

**కవితలు**

భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న స్త్రీ, పురుషులు ఆత్మత్యాగఫలంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిన సందర్భంలో సంతోషం పంచుకుంటూ

కనుపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన 'మహోదయము' అనే (1947 సెప్టెంబరు భారతి) కవితలో

*ఇది మహామహోదయమౌర యిండియాకు*
*ఎప్పుడేదేశమున గాంచి యెఱుగనట్టి*
*శస్త్రవిరహిత సమరంబు సలిపి సలిపి*
*భవ్యస్వాతంత్ర్య ఫలమును బడయుకతన*

*"కాషాయవర్ణంపు కమనీయకాంతిలో*
*త్యాగమూర్తుల తేజు తాండవింప*
*ధవళాతి ధవళమైతరళించు చాయలో*
*శాంతి సత్యంబుల సొరుజూప*

*సహజసుందరమైన శ్యామలకాంతిలో*
*పైరుపచ్చల రీవి ప్రతిఫలింప*
*నిగనిగమెరిసెడినాణెంపువన్నెలో*
*ధర్మచక్రము శోభతళుకులీన*

*సరసస్వాతంత్ర్య భారత జయపతాక*
*అతులనయనాభిరామమై యాకసమున*
*బాలభాస్కరు కిరణంపు సభలోన*
*ఎగురుచున్నవి కనుదోయిసొగసు గుల్క"...*

*"పరదేశీయుల పాలనంబు కతనన్*
*భాగ్యంబు గోల్పోయి హా*
*కరి దా మ్రింగిన వెల్గపండు పగిదిన్*
*కాన్పించె దేశంబు వే*

సరియా రీతుల చక్క బెట్టుటకునై
        సామర్థ్యమే లేనిచో
పరిపూరణంబగు సౌఖ్యముండదు సుమీ
        స్వాతంత్ర్యమేతెంచియున్ ”....

“కులతత్వభేదంపు కుటిలత్వములు లేక
        మతవిభేదంబుల మాటలేక
రాష్ట్రాభిమానంపు రగడలు లేకుండ
        భాషావిభేదంపు పట్టులేక
ధనిక దరిద్రుల తారతమ్యము లేక
        అధికారమోహపుం టాశలేక
వ్యవసాయ కార్మిక వ్యత్యస్తములు లేక
        స్త్రీ పురుషవిభేద రీతి లేక

భారతాంబ స్వాతంత్ర్యంబు బడయుకొఱకు
శాంతి సమరంబు పూన్కిమై సలిపినటులో
భరతదేశాభివృద్ధికై పాటుబడగ
దీక్షగొనవలె నింక నీదేశ ప్రజలు”

“దిగవాఱిపోయిన దేశపరిశ్రమల్
        తిరిగి పెంపొందెడి తెన్నులరయ
వసివాడియుండిన వాణిజ్యమును బెంచి
        పరదేశములదాక ప్రాకజేయ
అరగొరయైయున్న ఆహార ధాన్యముల్
        సర్వసమృద్ధిగా సంతరింప
ఆయురారోగ్యాల కాధారమౌ పాడి
        పశుల పోషణ ప్రబలజేయ

మహితసేవావ్రతాత్ములు మాననీయ
దేశభక్తాగ్రగణ్యులు దీక్షతోడ
బహుళనిర్మాణ పద్ధతుల్ ప్రస్తరించి
చేయవలయును నిజ దేశ సేవ నిపుడు”...

"వినుదహింసావ్రతోపాస్తి పెంపువలన
సేకరించిన స్వారాజ్య సిద్ధఫలము
కులమతద్వేషముల నెల్ల కూలద్రోసి
ఐకమత్యంబున భుజించు టర్హమగును" ...

"పరులుమెచ్చెడి భూమి నా భరతభూమి
వేయికాలాలు స్వేచ్ఛమై వెలయుగాక" అని వ్రాస్తూ

స్వాతంత్ర్యసిద్ధిని జెండామహోత్సవాన్ని కీర్తించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని విశ్రాంతి తీసుకోకూడదని స్త్రీపురుష సమానత్వంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో దేశరక్షణకు, అభివృద్ధికి స్త్రీలు, పురుషులు దీక్షపట్టాల్సిన అవసరాన్ని తెలియజేసింది.

పొణకా కనకమ్మ వ్రాసిన 'స్వతంత్ర మహోత్సవము' అనే కవితలో

"నవ స్వతంత్ర మహా మహోత్సవ రథమ్ము
విమల కల్యాణ రాజమార్గముందిరుగ
వచ్చే దినమణి ప్రాభాతవర్తనముల
అమ్మా! నీచేతి కాగడాయై వెలగ" అని

స్వాతంత్ర్యలక్ష్మియొక్క చేతిలో సూర్యుడే కాగడా అయ్యాడనీ భావించింది. అంతేకాదు

"సత్యమును ధర్మమును నహింసయును ప్రేమ
త్యాగమును పంచప్రాణములై స్వరూప
మున తరించుచు బాపూమహాత్మ తేజ
మెప్పుడు ముందయి మము నడిపించు గాక"

అని గాంధీ మహాత్ముని స్ఫూర్తిని తరతరాలు గుర్తించుకోవాలని కూడా భావించింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినతర్వాత కొనసాగింపుగా దేశసంరక్షణ సాహిత్యాన్ని కూడా తెలుసుకోవాలి.

దేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలో జీవించిన కవయిత్రిగా చేజర్ల రామరత్నమ్మ, తన కవితలో వీరుల కష్టఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని ముఖ్యంగా ఆనాటి మహిళలు జైళ్లలో మగ్గటం నాటి స్త్రీల దేశభక్తి కి పరాకాష్ఠయైన విషయంగా చెప్తూ,స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే చేజెర్ల రామరత్నమ్మ వ్రాసిన 'హెచ్చరిక' అనే కవితలో(ఆంధ్రకవయిత్రులు – ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ)

"చేదెలెందరొమున్ను చెఱసాలలకునేగి
అష్టకష్టంబుల ననుభవించి
సతులసుతులవీడి సత్యాగ్రహము సల్పి
ధనధాన్యముల కూడ ధారపోసి

*ఆహార నిద్రలు వ్యవహారములు మాని*
*కారాగృహములందు కాలముడిపి*
*మహనీయులెందరో మనదేశకాంక్షతో*
*లాటీల దెబ్బలధాటికోర్చి*

*ప్రాణములసైతమర్పించి ప్రజ్ఞమెఱయ*
*పరులహింసింప దలపక భావమునను*
*గాంధి దేవుని ఆజ్ఞను గారవించి*
*భారతీయులు పలుపాట్లు బడిరిగాదె" అనుచు స్వాతంత్ర్యయోధులత్యాగాన్ని స్మరిస్తూ*

*"అక్రమంబగు పాలనమంతమొంది*
*సత్యపాలన మిపుడే సంస్థాపనాయే*
*ఎర్రకపిగము లీనాడుతుర్రుమనిరి*
*బడసితిమిగాదె స్వారాజ్యభవనమిలను".*

*అని భారతదేశాన్ని స్వరాజ్యభవనంగా భావించింది. ముఖ్యంగా జైలుశిక్షలను అనుభవించిన స్త్రీల త్యాగాలకు భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రత్యేకగుర్తింపు ఉండాలని భావించింది.*

స్వాతంత్ర్యానంతరం వచ్చిన స్త్రీలసాహిత్యంలో కొసమెఱుపుగా కొనసాగింపుగా ఆర్. జనాబాయి వ్రాసిన 'కమల కాపురం' (జులై 1948 గృహలక్ష్మి) అనే సంభాషణాత్మక రూపకంలో రాట్నం వడికి దారం తీస్తున్న ఒకస్త్రీ దగ్గరకు ఆమె స్నేహితురాలైన పిల్లలతల్లియైన మరొక స్త్రీ వచ్చి తీరిక దొరికినందుకు కాలక్షేపానికి వచ్చానంటే, మొదటి స్త్రీ గాంధి వ్రాసిన నిర్మాణ కార్యక్రమాలను గురించి వ్రాసిన పుస్తకం చదవమని విషయాలు తెలుస్తాయని చెప్తుంది. కాని ఆ వచ్చిన స్త్రీ చీరె కూడా కొనుక్కోలేని తన దారిద్ర్యాన్ని వెళ్ళబోసుకోగా మొదటి స్త్రీ తీరికసమయం చేసుకొని యింటికి వస్తే రాట్నం యిచ్చి నూలువడకటం నేర్పుతానని చెప్పింది. ఆ వనిత రోజూ వచ్చి నూలు దారం తీసి ఖద్దరు వస్త్ర తయారీ చేయటం నేర్చుకొని, ధరలు ఎక్కువైనాయని పిల్లలకు బట్టలు కొనలేని స్థితిని నిందించుకొన్న ఆమెయొక్కభర్తకు ఉపశమనంగా తాను కుటుంబానికి సరిపోయే ఖద్దరుబట్టలను నేసిపెట్టిన వస్త్రాలను చూపించిందని తెలియజేసింది.

కుటుంబంలోని ఆర్థికవ్యవస్థను పంచుకొన్న స్త్రీనిగురించి తెలియజేసింది. స్వాతంత్ర్యానంతరం కూడా ఆ రాట్నాన్ని ఖద్దరును వదలక కుటుంబ ఆర్థికస్థితిని బాగు చేసుకోమన్న జ్ఞానాన్ని అందించిన కథయిది.

తలసరి కుటుంబ ఆదాయమే దేశంయొక్క ఆదాయం అవుతుందనీ, అది దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడే విషయంగా స్వతంత్ర భారతదేశ స్త్రీలు కోరటం జరిగింది. స్త్రీలు దేశ ఆర్థికరంగంలో భాగస్వాములయితేనే వారికి ఆర్థిక హక్కులు లభిస్తాయనీ, స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యం, స్త్రీల సాధికారికతలకై స్త్రీలు స్వాతంత్ర్యానంతరం కూడా పోరాడాల్సిన అవసరం ఉందని ఈ సాహిత్యం ప్రబోధించింది.

ఈసాహిత్యం అంతా ఎంతో అమూల్యమైనది.

# 9. అమూల్యం - స్త్రీల సాహిత్యం (క్రీ.శ.1900-1947)

స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యసాధనకు అవసరమైన చైతన్యాన్ని కలిగించి, క్రియాశీలకమైన ప్రేరణశక్తి కాగలిగిన ఈ స్త్రీలసాహిత్యం సంస్కరణోద్యమకాలంలో ఉద్భవించింది. దేశస్వాతంత్ర్యసాధనలో ప్రముఖపాత్ర వహించినదిగా భారతదేశచరిత్రలో విలువైనస్థానాన్ని పొందింది. జనాభాలో సగం శాతంగా ఉన్న స్త్రీలకు స్వతంత్రత ఉంటేగానీ దేశ స్వాతంత్ర్యం వచ్చినా ప్రయోజనం లేదనే గ్రహింపుతో సంఘసంస్కర్తలు అడుగులు వేయటం జరిగింది. స్త్రీల వ్యక్తిస్వతంత్రతను అంగీకరించటానికి సిద్ధంగాలేని నాటి సమాజంలో స్త్రీలు స్వీయచైతన్యంతో స్వతంత్ర జీవనాన్ని పొందటానికి ప్రయత్నం చేసారు. దానికై ముందుగా స్త్రీలలో విద్యాచైతన్యాన్ని కలిగిస్తూ అనంత సాహిత్యాన్ని స్త్రీలు సృజించారు. ఆనాడు జనాభాలో 1 శాతం స్త్రీలు మాత్రమే అక్షరాస్యులు ఉన్నారు. కనీస అక్షరజ్ఞానం కల స్త్రీలు పత్రికాపఠనం ద్వారా సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకునే శక్తిని పొంది, తోటి స్త్రీలను విద్యావంతుల్ని చేస్తూ వారు తమ బానిసత్వాన్ని గుర్తించగలిగిటట్లుచేసారనీ, దాని ఫలితంగా స్వతంత్ర జీవనావశ్యకత గురించిన ఆలోచనలను స్త్రీలు పెంచుకోగలిగారనీ ఈ సాహిత్యం తెలియజేస్తుంది. అంతేకాదు సృజనకారులైన స్త్రీలు తమకు తోచిన రూపంలో చిన్న చిన్న సంభాషణాత్మక నాటకాలు, కథలు వ్రాసి స్త్రీవిద్యను ప్రోత్సహించటంచేసారు. అంతేకాక స్త్రీవిద్యకు కంటకప్రాయమైన బాల్య వివాహాల నిరోధానికై, స్మృతుల ప్రమాణాలను చెప్పి స్త్రీ సమాజాలలో నాటకాలు వేసి, వంటింటి కుందేళ్ళుగా భావించబడ్డ స్త్రీలను చైతన్య పరిచిన విషయం క్రీ.శ.1900 సం. నుండి ప్రారంభమైన స్త్రీలసాహిత్యం ఋజువు చేసింది. అందుకే ఇది ప్రయోగాత్మకమైన ప్రగతిమార్గసాహిత్యం. వసతులు లేని ఆరోజుల్లోనే అనగా 120 సం.ల నాటినుండి వచ్చిన స్త్రీల సాహిత్య చైతన్యమే మిన్నగా ఉన్నదనీ, ఆ చైతన్య ప్రవాహమే నేటి స్త్రీలకు ఆధారమని అర్థం అయింది.

స్త్రీవిద్యాభివృద్ధి కొంత జరగగానే, దేశంలోని సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ పరిణామాలపై అవగాహనను పెంచుకొన్నారు. స్త్రీలకున్న హక్కులకు సంబంధించిన పరిజ్ఞానం సమాంతరంగా పెరిగింది. పురుషులతో పాటు తమకు కూడా సహజమైన సమానత్వం ఉండాలని భావించారు. స్త్రీలందరూ స్వతంత్ర జీవనావశ్యకతకై స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యాన్ని గుర్తించటంతోపాటు తమ జీవితాల మీద తమకే హక్కులుండాలనే భావన పెరగటం, దానికై సాంఘిక, ఆర్థిక హక్కులను సాధించాలనుకోవటం, పురుషులతో పాటు సమాన ఆస్తిహక్కు కావాలనుకోవటం స్పష్టమైంది. అయితే ఆర్థిక హక్కులను పొందటానికి రాజకీయ హక్కులు ఉండాలని భావించారు. ఆ రాజకీయహక్కులను సాధించటానికి తమకు వోటు హక్కు కావాలనీ, నియోజక స్వాతంత్రం కావాలనీ, లోకల్ బోర్డులో, శాసనసభలలో పురుషులతోపాటు తమకి సభ్యత్వం ఉంటే, స్త్రీల సమస్యలు తీరగలుగుతాయనే భావన పెరిగింది. అందుకని స్త్రీలు స్వాతంత్రోద్యమంలో మరింతగా భాగస్వాములు కావాలని భావించి 1938లో జరిగిన ఎన్నికలలో శాసనసభలలో సభ్యురాండ్రు కాగలిగారు. ముందుగా ఇంట్లో పురుషుడి బానిసత్వం నుండి విముక్తిని

చెందుతూ స్త్రీలు పురుషులతో కలిసి దేశ బానిసత్వాన్ని రూపుమాపటానికి కంకణం కట్టుకున్నారనే సత్యం భారతదేశ స్వాతంత్రసిద్ధి జరిగేంత వరకు వచ్చిన స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించింది. ఆనాటి స్త్రీల ఆలోచనలలో కలిగిన పరిణామశీలమైన చైత్యన్యం క్రియాశీలకమై ఆచరణలో ఉండేటట్లుగా సాహిత్యసృజన జరిగింది.

క్రీ.శ.1900-1947 వరకు వచ్చిన స్త్రీలసాహిత్యం స్త్రీలసామాజిక చరిత్రకు, దేశస్వాతంత్ర్యోద్యమ చరిత్రకు ఉన్న అవినాభావ సంబంధాన్ని ప్రతిఫలింపజేస్తూ 'స్త్రీవ్యక్తి స్వతంత్రత'ను అన్ని కోణాల నుండి విశ్లేషణకు పెట్టింది. దేశ స్వాతంత్ర్యోద్యమానికి పునాది సాంఘిక సంస్కరణ. సామాజిక సంస్కరణలతో స్త్రీలు తమ జీవనహక్కుల చైతన్యాన్ని పుంజుకోగలిగి సాంఘిక, ఆర్థిక సమానత్వంవైపు ఆలోచనలను పెంచుకొని రాజకీయ స్వాతంత్ర్యంవైపు ముందడుగు వేయటాన్ని ప్రయోగాత్మకంగా నాటి స్త్రీలసాహిత్యచరిత్ర నిరూపించింది. స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య సాధనోద్యమానికై మొదటి దశలో స్త్రీసమాజాలను నెలకొల్పి స్త్రీవిద్యను ప్రచారంచేస్తూ, ఐకమత్య భావాలను స్త్రీలు పెంపొందించుకున్నారు. స్త్రీవిద్యకు ఆటంకమైన వైవాహిక సంస్కృతిని విమర్శకుపెట్టి తోటిస్త్రీలలో వ్యక్తిస్వాతంత్ర్యంపు స్పృహను రగిలించటానికి స్త్రీలు సాహిత్యాన్ని సాధనంగా చేసుకున్నారు. స్త్రీలు సాహిత్యాన్ని సృష్టించి స్త్రీలలో సాంఘిక స్వాతంత్ర్యానికి పునాదులు వేసారు. మలిదశలో స్త్రీలు తమ గృహబాని సత్వాన్ని, సమానస్వాతంత్ర్యం లేకపోవటాన్ని, స్వీయ పోషకత్వపులేమిని గుర్తించేటట్లుగా చేసి దానికి కారణమైన ఆర్థికస్థోమత స్త్రీలకు లేకపోవటాన్ని గ్రహించేటట్లుగా రచనలు చేసారు. స్త్రీలు తమకు సమానమైన ఆర్థికహక్కులు లేవని గ్రహించి ఆర్థికస్వావలంబన దిశగా ఆలోచనలను పెంపొందించుకొన్నట్లుగా చైతన్యపరచినట్లు ఈ స్త్రీలసాహిత్యం అర్థమవుతుంది. స్త్రీలు తమ సామాజిక స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక సమానత్వాన్ని గుర్తించేటట్లు చేయటమేకాక దేశ ఆర్థిక- రాజకీయస్థితిని ఆకళింపు చేసుకొనేటట్లుగా సాహిత్య సృజన జరిగింది. ఆనాటి స్త్రీలసాహిత్యం స్త్రీలలో సాంఘిక, ఆర్థిక. రాజకీయ చైతన్యాన్ని రగిలించింది. తత్ఫలితంగానే స్త్రీలు భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములు కాగలిగారు. అందుకే దేశ దారిద్ర్యనిర్మూలనలో భాగంగా సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనటం జరిగింది. రాట్నం వడికి ఖద్దరు తయారు చేయటంలో భాగస్వాములై దేశరాజకీయచైతన్యాన్ని అభివృద్ధి చేసుకోవటం జరిగింది. తత్ఫలితంగా వారు గ్రామపరిపాలనలో భాగస్వాములు అవ్వాలని భావించటం మూడవ దశలో అర్థం అవుతుంది. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైళ్ల జీవితాలను అనుభవించటంతో హక్కులపట్ల, శాసనాలపట్ల అవగాహనను ఈ సాహిత్యం కలిగించింది. నాల్గవదశలో అటు స్త్రీలస్వాతంత్ర్యానికి ఇటు దేశ స్వరాజ్యంకోసం ఉద్యమిస్తూ ఎన్నికల ద్వారా శాసననిర్మాణాలలో స్త్రీల భాగస్వామ్యం ఉండాలని రాజకీయచైతన్యాన్ని ఈ స్త్రీలసాహిత్యం కలిగించింది. సంపూర్ణ స్వరాజ్యం కోసం పరాయిపాలకుల యొక్క నిష్క్రమణకై పాటుపడటంలో తమవంతు భాగస్వామ్యాన్ని వహించటం జరిగింది. వర్ణవ్యవస్థయొక్క వర్గస్వభావాన్ని, పెట్టుబడిదారీ స్వభావాన్ని అర్థం

చేసుకొన్నారు. వర్గపోరాటంతోనే హిందూమహమ్మదీయ సఖ్యతను సాధించవచ్చని అనుకొన్నారు. స్త్రీల సాంఘిక స్వాతంత్ర్యం, ఆర్థిక స్వావలంబనకై చేసిన ఆలోచనల పరిణామక్రమమే స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలించి నాటిస్త్రీలను చైతన్యవంతులను చేయగలిగింది. దేశస్వాతంత్ర సాధనవైపు స్త్రీలను అడుగులు వేయించింది. వారు రాజకీయ స్వాతంత్రాన్ని పొందాలనుకొనే క్రమంలో స్త్రీలలో పెరిగిన అభివృద్ధి భావాలను, ఆలోచనలను ఈ స్త్రీలసాహిత్యం ప్రతిబింబించింది. స్త్రీవ్యక్తిస్వాతంత్ర్య సాధనతోపాటు దేశస్వాతంత్ర్యసాధనకై స్త్రీలు చేసిన ప్రయత్నాన్ని అంచలంచెల వారిమెట్లుగా స్త్రీలసాహిత్యం ప్రతిఫలించింది.

ఈ స్త్రీలసాహిత్యంలో స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యసాధనకు దేశస్వాతంత్ర్యసాధనకు కృషి చేసిన వారుగా ఆంధ్రప్రాంతంలోని స్త్రీలు అర్థమవుతారు. బహుశ తెలంగాణప్రాంతంలోని తెలుగువారైన స్త్రీలు అంతగా ఉద్యమంలో పాల్గొనలేకపోవటానికి అది నిజాంప్రభుత్వంకింద ఉండటం కారణంగా భావించవచ్చు

1900 నుండి 1920 వరకు స్త్రీవిద్య, స్త్రీల వైవాహికస్వాతంత్ర్యం, స్త్రీపురుష సమానత్వానికి సంబంధించిన సాంఘిక చైతన్యాన్ని కలిగించే సాహిత్యసృజన విస్తృతంగా జరిగింది. 1920 సం. తరువాత దేశస్వాతంత్ర్య సాధనవైపు దృష్టిని సారించి స్త్రీలు స్వాతంత్రోద్యమ భాగస్వామ్యమే కాక, స్త్రీలు ఆర్థికస్వావలంబన దిశగాసాగేందుకు తగినచైతన్యాన్ని ఇవ్వటానికి దోహదపడింది ఈ స్త్రీలసాహిత్యం. 1930 అనంతరం స్త్రీ వ్యక్తిస్వాతంత్ర్య ఉద్యమంతోపాటు దేశస్వాతంత్రోద్యమంలో స్త్రీలభాగస్వామ్యాన్ని పెంచగల రచనలు చాలా వచ్చాయి. ఉద్యమభాగస్వామ్యం, కారాగారవాసశిక్షలు స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచటంతో స్త్రీలలో రాజకీయహక్కులపట్ల చైతన్యం అభివృద్ధిచెందే స్త్రీల రచనలు వచ్చాయి. 1935 తరువాత వచ్చిన స్త్రీలసాహిత్యంలో స్త్రీలయొక్క సామాజిక, ఆర్థిక, రాజకీయహక్కుల చైతన్యాన్ని పెంపొందించే సాహిత్యసృజన జరిగింది. స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్య, దేశస్వాతంత్ర్యసాధన క్రమంలో వచ్చిన ఈ విస్మృతమైన విస్తృత స్త్రీల సాహిత్యం ఎంతో అమూల్యమైనదని భావించాలి.

స్త్రీలు రాజకీయాలలో పాల్గొనటానికి ముందుగా వ్యక్తి స్వాతంత్రాన్ని పొందే దిశగా సాగి, దేశ స్వాతంత్ర్య సాధన దిశగా కదిలి సఫలీకృతులైయ్యారని అర్థమయింది. భారతదేశ స్వాతంత్ర చరిత్రకి స్త్రీల సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులకు స్త్రీవ్యక్తిస్వాతంత్ర్యానికి ఉన్న సంబంధాన్ని తెలుసుకోవటానికి 1900 నుండి 1947 వరకు తెలుగులో వచ్చిన స్త్రీలసాహిత్యం భారతదేశ స్వాతంత్ర్యమంత విలువైనదిగా భావించాలి.

స్త్రీలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకుంటూ దేశస్వాతంత్ర్యాన్ని సంరక్షించుకోవటమే స్త్రీ, పురుషుల ముందున్న నిరంతర కర్తవ్యం. ఆ ఉద్యమసాహిత్యాన్ని చదివి స్త్రీలు వ్యక్తి స్వాతంత్ర్యపు విలువలను తెలుసుకోవాల్సిన అవసరం నేటికి ఉంది.

# 10. అనుబంధము

## (10.1) అంజలి - స్వాతంత్ర్యోద్యమ స్త్రీలు - కారాగారవాస పట్టిక

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన స్వాతంత్రోద్యమంలో ప్రధాన ఘట్టాలుగా పేర్కొనబడిన సహాయనిరాకరణోద్యమం 1920 నుండి మొదలై దాదాపుగా స్వాతంత్రం వచ్చే వరకు సాగింది. సమాంతరంగా 1930 లో ఉప్పు సత్యాగ్రహం, వెనువెంటనే 1932 లో మొదలు పెట్టిన శాసనోల్లంఘనోద్యమాలలోనూ 1940-42 లో వ్యక్తి సత్యాగ్రహంతోపాటు క్విట్ ఇండియా ఉద్యమంలోను స్త్రీలు పాల్గొన్నారు. తెలుగు జిల్లాలకు సంబంధించిన స్త్రీలు అరెస్టులు, జైలు శిక్షలను అనుభవించారు. ఉద్యమ నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొని, నిర్బంధింపబడి ఎన్నో కష్టాలు పడి తమ జీవితాలను పణంగా పెట్టిన నాటి ఉద్యమ స్త్రీల త్యాగాలను స్మరించుకోవటానికి క్రింది పట్టికలో వారి సమాచారం ఇవ్వటం జరిగింది. ఈ స్త్రీలలో పసిపిల్లల తల్లులు, గర్భిణీస్త్రీలు, జైళ్ళలో ప్రసవవేదన పడ్డ స్త్రీలున్నారని తెలుసుకొంటే స్వాతంత్రోద్యమ విలువలు గుండె బరువును పెంచక మానవు. మాతృమూర్తులు కుటుంబబాధ్యతలు వహిస్తూనే సామాజిక కుటుంబ సంస్కృతిని ఛేదించుకుని, నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న స్త్రీలు ధైర్యసాహసాలకు ప్రతీకలై దారి దీపాలుగా భారతమాతకు నీరాజనం పట్టారు. ఆ దీపకాంతులను ఆరిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నేటిస్త్రీలపై ఉంది. ఆ స్త్రీలకు అంజలి ఘటించాలి. ఈ పట్టికలోని సమాచారం దీనిని అనుబంధంగా ఉటంకించిన ఉపయుక్తగ్రంథాలు, సాహిత్యసూచికలనుండి గ్రహింపబడింది.

### స్వాతంత్ర్యోద్యమ స్త్రీలు - కారాగారవాస పట్టిక

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| **శ్రీకాకుళం జిల్లా** | | | | |
| 1 | కప్పగంతుల ఆదిలక్ష్మి | పాల్గొన్నారు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 2 | ఆదుర్తి లక్ష్మిబాయమ్మ | పాల్గొన్నారు | 03 నెలలు | 2 సార్లు జైలుకి |
| 3 | పూడిపెద్ది రమణమ్మ | పాల్గొన్నారు | 03 నెలలు | పాల్గొన్నారు |
| 4 | మంత్రాల రామసీతమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | పాల్గొన్నారు |
| 5 | టంకాల సుందరమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 6 | ఎల్లాయి సూరమ్మ | పాల్గొన్నారు | 1½ సం॥లు | పాల్గొన్నారు |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 7 | జయంతి సూరమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | పాల్గొన్నారు |
| 8 | పోకల తాయారమ్మ | పాల్గొన్నారు | 09 నెలలు | పాల్గొన్నారు |
| 9 | కోరాడ వరలక్ష్మి | పాల్గొన్నారు | 06 నెలలు | పాల్గొన్నారు |
| 10 | అంధవరపు వెంకటరమణమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 11 | మర్మగంటి వెంకటరమణమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | పాల్గొన్నారు |
| 12 | టేకుమళ్ళ బుచ్చిరామాయమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | పాల్గొన్నారు |
| 13 | టి. వరాహలక్ష్మి | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 14 | మూల వెంకమాంబ | 10 నెలలు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 15 | అంపాలం హైమవతమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 16 | సాసుమాను గున్నమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | తుపాకీ మరణం |
| 17 | దువ్వాడ బాలకృష్ణమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | 12 నెలలు |
| 18 | గొర్ల పున్నమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | అరెస్టు |
| 19 | టేకుమళ్ళ మహాలక్ష్మమ్మ | - | పాల్గొన్నారు | - |
| | | విశాఖ జిల్లా | | |
| 20 | శిష్టా సోదమ్మ | - | - | 03నెలలు |
| 21 | లేడీ దేశాయి | - | - | అరెస్టు |
| 22 | కొడుకుల కామేశ్వరమ్మ | - | - | 03నెలలు |
| 23 | శిష్టాలక్ష్మి నరసమ్మ | - | - | 03నెలలు |
| 24 | కిలంధీభట్ల మహలక్ష్మి | - | పాల్గొన్నారు | 03నెలలు |
| 25 | దర్భావెంకటరమణమ్మ | - | - | 04 నెలలు |
| 26 | మంత్రప్రగడ బంగారమ్మ | - | - | 06నెలలు |
| 27 | దిగుమర్తి జానకీబాయమ్మ | - | పాల్గొన్నారు | 1½ సం.లు |
| 28 | యలమంచిలి కామేశ్వరమ్మ | - | పాల్గొన్నారు | - |
| 29 | మిస్సుల లక్ష్మి నరసమ్మ | - | 12 నెలలు | - |
| 30 | శిష్టా లింగమ్మ | - | 09 నెలలు | 03 నెలలు |
| 31 | భమిడిపాటి మహలక్ష్మమ్మద్వారక | - | 16నెలలు | - |
| 32 | గావె నరసాయమ్మ | - | 06 నెలలు | - |
| 33 | గుండుమళ్ళ రంగనాయకమ్మ | - | 06 నెలలు | - |
| 34 | బాలా త్రిపురసుందరమ్మ | - | జైలు శిక్ష | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| | **తూర్పు గోదావరి జిల్లా** | | | |
| 35 | దువ్వూరి సుబ్బమ్మ | 12 నెలలు | అరెస్టు | పాల్గొన్నారు |
| 36 | దుర్గాబాయ్ దేశ్ ముఖ్ | పాల్గొన్నారు | 1½ సం.లు | పాల్గొన్నారు |
| 37 | వేదాంతం కమలాదేవి | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 38 | కాశీభట్ల వెంకటరమణమ్మ | పాల్గొన్నారు | అరెస్టు | - |
| 39 | శివరాజు సుబ్బమ్మ | - | 12 నెలలు | - |
| 40 | పాలకొడేటి శ్యామలాంబ | - | 07 నెలలు | - |
| 41 | కోదూరి లీలావతి | పాల్గొన్నారు | - | - |
| 42 | నాళం సుశీలమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 43 | రాచర్ల సామ్రాజ్యం | పాల్గొన్నారు | పాల్గొన్నారు | 06 నెలలు |
| 44 | పెద్దాడ కామేశ్వరమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 45 | బెన్మూరి కృష్ణవేణమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 46 | కె.సుగుణమణి | పాల్గొన్నారు | - | - |
| 47 | దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ | పాల్గొన్నారు | - | - |
| 48 | బ్రహ్మజోస్యుల లక్ష్మీనరసమ్మ | - | పాల్గొన్నారు | - |
| 49 | కామేశ్వరీ కుప్పుస్వామి | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 50 | బత్తుల కామాక్షమ్మ | పాల్గొన్నారు | - | - |
| 51 | వేముగంటి పాపాయమ్మ | పాల్గొన్నారు | - | - |
| 52 | మానాప్రగడ రామసుందరమ్మ | - | 06 నెలలు | - |
| | **పశ్చిమ గోదావరి జిల్లా** | | | |
| 53 | సత్తిరాజు మంగమ్మ | పాల్గొన్నారు | 07 నెలలు | ఒకనెల |
| 54 | చేబియ్యం సోడమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 55 | దేవులపల్లి సత్యవతి | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 56 | తల్లాప్రగడ విశ్వ సుందరమ్మ | పాల్గొన్నారు | 10 నెలలు | పాల్గొన్నారు |
| 57 | దర్భి సుభద్రమ్మ | పాల్గొన్నారు | - | - |
| 58 | పసల అంజ లక్ష్మమ్మ | పాల్గొన్నారు | 16 నెలలు | పాల్గొన్నారు |
| 59 | ఆలూరి అన్నపూర్ణాదేవి | - | 02 నెలలు | - |
| 60 | తలారి చంద్రమతీదేవి | పాల్గొన్నారు | - | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం– 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940–41 |
| 61 | తూము చూడామణి | – | 06 నెలలు | – |
| 62 | కోటమర్తి కనకమహాలక్ష్మి | పాల్గొన్నారు | 1½ సం.లు | అరెస్టు |
| 63 | కోవలి కనకమ్మ | పాల్గొన్నారు | 07 నెలలు | – |
| 64 | దాసరి కృష్ణవేణమ్మ | – | – | 10 నెలలు |
| 65 | మూల్పూరి చుక్కమ్మ | పాల్గొన్నారు | 12 నెలలు | 03 నెలలు |
| 66 | చింతపర్తి బుచ్చమ్మ | – | 07 నెలలు | – |
| 67 | జవ్వాజి రాజారత్నం | పాల్గొన్నారు | 06 నెలలు | – |
| 68 | మొటపర్తి రామతులసమ్మ | – | 15 రోజులు | – |
| 69 | చుండూరి రత్నమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | 06 నెలలు |
| 70 | ఆచంట రుక్మిణీలక్ష్మీపతి | పాల్గొన్నారు | 02 సం.లు | 06 నెలలు |
| 71 | సూరంపూడి మహాలక్ష్మమ్మ | – | 06 నెలలు | – |
| 72 | మాజేటి మాణిక్యాంబ | – | 15 రోజులు | – |
| 73 | ఉద్దరాజు మాణిక్యాంబ | – | 10 నెలలు | – |
| 74 | వెలమాటి మాణిక్యాంబ | – | 6 నెలల 15రో. | – |
| 75 | గజ్జ నాగరత్నమ్మ | పాల్గొన్నారు | 10 నెలల 15రో. | – |
| 76 | కంది నాగరత్నమ్మ | – | 6 నెలల 15రో. | – |
| 77 | పాలకోడేటి నాగరత్నమ్మ | – | 10 నెలలు | – |
| 78 | దాట్ల నరసమ్మ | – | 03 నెలలు | – |
| 79 | మంతెన నరసాయమ్మ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| 80 | కలగర పిచ్చమ్మ | – | 06 నెలలు | – |
| 81 | దామరాజు లక్ష్మమ్మ | – | 12 నెలలు | – |
| 82 | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | – |
| 83 | ముడుంబై లక్ష్మిదేవి | పాల్గొన్నారు | 08 నెలలు | – |
| 84 | శృంగారకవి లక్ష్మీ నరసమ్మ | – | 11 నెలలు | పాల్గొన్నారు |
| 85 | ముండుంబ వెంకటమ్మ | – | 13 నెలలు | – |
| 86 | కొమ్మూరి వీరవెంకటమ్మ | – | 14 నెలలు | – |
| 87 | మాగంటి అన్నపూర్ణ | పాల్గొన్నారు | – | – |
| 88 | కంభంపాటి మాణిక్యాంబ | – | 15 రోజులు | 06 నెలలు |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| | | కృష్ణా జిల్లా | | |
| 89 | ఎర్నేని అమృతమ్మ | పాల్గొన్నారు | - | 2సం.నెలరోజులు |
| 90 | కొర్రపాటి అంకమ్మ | పాల్గొన్నారు | - | - |
| 91 | సూరపనేని అన్నపూర్ణమ్మ | - | 1½ సం.లు | - |
| 92 | వల్లభనేని అన్నపూర్ణమ్మ | - | 12 నెలలు | - |
| 93 | కోనేరు అనసూయ | - | 12 నెలలు | - |
| 94 | కోనేటి అనసూయ | - | 06 నెలలు | - |
| 95 | మావిరెడ్డి అన్నపూర్ణమ్మ | - | 12 నెలలు | - |
| 96 | సూర్యదేవర అన్నపూర్ణమ్మ | - | 12 నెలలు | పాల్గొన్నారు |
| 97 | కేశవరాజు కామాక్షమ్మ | - | 12 నెలలు | - |
| 98 | దుగ్గిరాల కమలమ్మ | పాల్గొన్నారు | 04 నెలలు | - |
| 99 | చాగర్లమూడి కామేశ్వరమ్మ | - | 12 నెలలు | - |
| 100 | ఘంటసాల కనకదుర్గాంబ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | - |
| 101 | పి.కౌసల్యాదేవి | పాల్గొన్నారు | - | - |
| 102 | చెరుకూరి కృష్ణవేణమ్మ | - | 12 నెలలు | - |
| 103 | గొట్టిపాటి కుటుంబమ్మ | - | 03 నెలలు | - |
| 104 | పొట్లూరి పున్నమ్మ | - | 12 నెలలు | - |
| 105 | ఎక్కల పున్నమ్మ | - | పాల్గొన్నారు | - |
| 106 | పూర్ణ తిలకం | - | 06 నెలలు | - |
| 107 | గాదిరెడ్డి పుట్లమ్మ | - | 10 నెలలు | - |
| 108 | దోనేపూడి బాలమ్మ | - | పాల్గొన్నారు | - |
| 109 | అయ్యదేవర బాలాత్రిపురసుందరమ్మ | పాల్గొన్నారు | - | పాల్గొన్నారు |
| 110 | కోనేరు భారతమ్మ | - | 12 నెలలు | - |
| 111 | సుంకర దుర్గాంబ | - | 10 రోజులు | - |
| 112 | అరెకపూడి మహాలక్ష్మమ్మ | - | 12 నెలలు | - |
| 113 | నాదెండ్ల మహాలక్ష్మమ్మ | - | 06 నెలలు | - |
| 114 | ఘంటా మల్లికాంబ | పాల్గొన్నారు | 18 నెలలు | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 115 | కోటగిరి మంగతాయారమ్మ | - | 06 నెలలు | - |
| 116 | అరెకపూడి మాణిక్యాంబ | - | 12 నెలలు | - |
| 117 | కన్నెగంటి నాగరత్నమ్మ | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 118 | నాదెళ్ళ నాంచారమ్మ | - | అరెస్టు | - |
| 119 | కోగంటి రాఘవమ్మ | - | పాల్గొన్నారు | - |
| 120 | రామినేని రాజమ్మ | - | 12 నెలలు | - |
| 121 | కానూరి రాజ్యలక్ష్మమ్మ | - | 12 నెలలు | - |
| 122 | గుత్తికొండ రామమ్మ | - | 06 నెలలు | - |
| 123 | పంచాంగం రామానుజమ్మ | - | 06 నెలలు | - |
| 124 | యార్లగడ్డ రత్తమ్మ | - | అరెస్టు | - |
| 125 | కాట్రగడ్డ రామసీతమ్మ | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 126 | అన్నే రమణమ్మ | పాల్గొన్నారు | - | - |
| 127 | నాదెళ్ళ రంగమ్మ | - | 12 నెలలు | 06 నెలలు |
| 128 | గుత్తికొండ లక్ష్మమ్మ | - | 06 నెలలు | - |
| 129 | కోగంటి లక్ష్మమ్మ | - | 06 నెలలు | - |
| 130 | బొప్పన లక్ష్మీకాంతమ్మ | - | అరెస్టు | - |
| 131 | గొర్రెపాటి లక్ష్మీకాంతమ్మ | - | 03 నెలలు | - |
| 132 | కొల్లిపర లక్ష్మీకాంతమ్మ | - | 06 నెలలు | అరెస్టు |
| 133 | వెనిగెళ్ళ లక్ష్మీకాంతమ్మ | - | పాల్గొన్నారు | - |
| 134 | గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ | - | 12 నెలలు | 21 నెలలు |
| 135 | ఎర్నేని లీలావతి | - | 12 నెలలు | అరెస్టు |
| 136 | అరికెపూడి ఉషారాణి | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 137 | దావులూరి తులసమ్మ | - | అరెస్టు | - |
| 138 | మిక్కిలినేని వరలక్ష్మమ్మ | - | 06 నెలలు | - |
| 139 | పాలడగు వరలక్ష్మమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 140 | గుమ్మడి వెంకమ్మ | - | పాల్గొన్నారు | - |
| 141 | కాళింగి వెంకటరత్నమాంబ | పాల్గొన్నారు | అరెస్టు | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 142 | సూరపనేని వెంకటసుబ్బమ్మ | - | 12 నెలలు | - |
| 143 | కొల్లి విమలాదేవి | - | అరెస్టు | - |
| 144 | సజ్జా వీరరాఘవమ్మ | - | 12 నెలలు | - |
| 145 | చెరుకూరి వియ్యమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 146 | రామినేని వియ్యమ్మ | - | పాల్గొన్నారు | - |
| 147 | ఈడ్పుగంటి వెంకటరత్నమ్మ | - | - | 01 నెల |
| 148 | మద్దాలి వెంకట సుబ్బమ్మ | - | - | అరెస్టు |
| 149 | కోయవెంకట నరసమ్మ | - | - | 15 రోజులు |
| 150 | మల్లంపాటి రత్నమాణిక్యం | - | - | పాల్గొన్నారు |
| 151 | గొర్రెపాటి సరస్వతమ్మ | - | 03 నెలలు | - |
| 152 | తుమ్మల సత్యవతమ్మ | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 153 | యలమంచిలి సత్యవతమ్మ | పాల్గొన్నారు | అరెస్టు | - |
| 154 | గుత్తికొండ సీతమ్మ | - | 12 నెలలు | - |
| 155 | కొల్లిపర సీతమ్మ | - | 12 నెలలు | - |
| 156 | వారణాసి సీతమ్మ | - | 03 నెలలు | - |
| 157 | వీరమాచనేని సీతమ్మ | - | పాల్గొన్నారు | - |
| 158 | నూతక్కి సీతారామమ్మ | - | 12 నెలలు | - |
| 159 | తంగిరాల సీతారామమ్మ | - | 12 నెలలు | - |
| 160 | వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ | పాల్గొన్నారు | 12 నెలలు | 03 నెలలు |
| 161 | చెరుకూరి సౌభాగ్యమ్మ | - | 12 నెలలు | - |
| 162 | మైనేని సీతారామమ్మ | - | అరెస్టు | - |
| 163 | వల్లభనేని శ్రీరంగనాయకీదేవి | పాల్గొన్నారు | - | - |
| 164 | గాదె సుబ్బమ్మ | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 165 | పెరంబదూరి సుభద్రమ్మ | - | 06 నెలలు | 1½ సం.లు |
| 166 | అరెకపూడి సుగుణమణి | - | 12 నెలలు | - |
| 167 | పానూరి సుందరమ్మ | - | 12 నెలలు | - |
| 168 | గోపరాజు మనోరమ | - | - | 06 నెలలు |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 169 | పోతరాజు రాధామనోహరం | పాల్గొన్నారు | - | 1½ సం.లు |
| 170 | మెల్లీ షోలింగల్ | పాల్గొన్నారు | పాల్గొన్నారు | 2½ సం.లు |
| 171 | సింగారపు యశోదమ్మ | - | 12 నెలలు | - |
| 172 | త్రిపురనేని వెంకాయమ్మ | - | 15 రోజులు | - |
| 173 | దుళ్ళ వెంకటరమణమ్మ | పాల్గొన్నారు | - | - |
| 174 | విద్యాదేవి ఓం ప్రకాష్ | పాల్గొన్నారు | - | - |
| 175 | గోపరాజు సరస్వతి | పాల్గొన్నారు | - | 04 నెలలు |
| 176 | సీతంరాజు సీతారామమ్మ | - | 04 నెలలు | - |
| 177 | వాసిరెడ్డి అఖిలాండేశ్వరి | - | - | 16 నెలలు |
| 178 | గాయత్రి అనంతరామమ్మ | పాల్గొన్నారు | - | - |
| 179 | బొప్పన మాణిక్యమ్మ | పాల్గొన్నారు | - | - |
| 180 | పసుపులేటి రాధా నీరాచలన్ | 04 నెలలు | - | - |
| 181 | చిట్టా వర్జుల రామకృష్ణమ్మ | పాల్గొన్నారు | - | - |
| 182 | సరస్వతీ గోరా | పాల్గొన్నారు | - | 06 నెలలు |
| 183 | ఉప్పల మెల్లీ షిల్లాంగ్ | - | పాల్గొన్నారు | 3 సం.3 నెలలు |
| 184 | బసవరాజు రాజ్యలక్ష్మమ్మ | - | - | 02 నెలలు |
| 185 | చిట్టూరి అన్నపూర్ణాదేవి | పాల్గొన్నారు | - | - |
| | **గుంటూరు జిల్లా** | | | |
| 186 | రావూరి అలివేలుమంగతాయారు | 12 నెలలు | - | - |
| 186 | కల్లూరి తులశమ్మ | పాల్గొన్నారు | - | 16 నెలలు |
| 187 | ఆర్మండల్ ఉషాదేవి | - | - | 03 నెలలు |
| 188 | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | పాల్గొన్నారు | అరెస్టు | 06 నెలలు |
| 189 | వేదాంతం లక్ష్మీకాంతమ్మ | 12 నెలలు | - | - |
| 190 | పాటిబండ్ల అన్నపూర్ణమ్మ | అరెస్టు | అరెస్టు | - |
| 191 | మంతెన అచ్చమ్మ | - | 06 నెలలు | - |
| 192 | కోట ఆదెమ్మ | పాల్గొన్నారు | - | - |
| 193 | ఆవుల బాలనాగు | అరెస్టు | - | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 194 | పిట్టా నాగమ్మ | - | ఒక నెల | - |
| 195 | ఏనుగుల రామమ్మ | పాల్గొన్నారు | - | - |
| 196 | కాంచనపల్లి వెంకమ్మ | 04 నెలలు | - | - |
| 197 | కొండా వెంకమ్మ | పాల్గొన్నారు | - | - |
| 198 | వడ్లమూడి అన్నపూర్ణమ్మ | పాల్గొన్నారు | - | అరెస్టు |
| 199 | మంతెన అచ్చాయమ్మ | - | 06 నెలలు | - |
| 200 | సుఖవాసి అచ్చమ్మ | - | అరెస్టు | - |
| 201 | మొవ్వ అచ్చమ్మ | - | అరెస్టు | - |
| 202 | వేగేన అచ్చమ్మ | - | అరెస్టు | - |
| 203 | కొండా అలివేలుమంగసత్యవతి | పాల్గొన్నారు | 16 నెలలు | - |
| 204 | గోగినేని భారతీదేవి రంగా | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 205 | యార్లగడ్డ కమలాంబ | - | అరెస్టు | - |
| 206 | కొల్లా కనకవల్లి తాయారమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 207 | కొడాలి కమలమ్మ | - | - | 15 నెలలు |
| 208 | ఉన్నవ కల్యాణి | - | - | అరెస్టు |
| 209 | మాడుగుల కౌసల్యాదేవి | పాల్గొన్నారు | - | 15 నెలలు |
| 210 | పర్వతనేని కౌసల్య | - | 06 నెలలు | - |
| 211 | నాగళ్ళ కృష్ణవేణమ్మ | - | 06 నెలలు | - |
| 212 | యల్లాప్రగడ ఇందుమతిదేవి | - | 06 నెలలు | - |
| 213 | తుమ్మల చంద్రమ్మ | - | 06 నెలలు | - |
| 214 | తుమ్మల చిన్నమ్మాయి | - | 06 నెలలు | - |
| 215 | మద్దుల చిన్నమ్మ | - | 06 నెలలు | - |
| 216 | ఉప్పల అన్నపూర్ణమ్మ | - | - | 15 నెలలు |
| 217 | వడ్లమూడి అన్నపూర్ణమ్మ | - | అరెస్టు | అరెస్టు |
| 218 | మంతెన జానకమ్మ | - | అరెస్టు | - |
| 219 | గొంది జనార్ధనమ్మ | - | అరెస్టు | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 220 | కొల్లా జయలక్ష్మి | - | 18 నెలలు | - |
| 221 | తెలిగర నాగరత్నమ్మ | - | అరెస్టు | - |
| 222 | చిట్రా నాంచారమ్మ | - | 06 నెలలు | - |
| 223 | కొల్లి నాగభూషణమ్మ (రేపల్లె) | - | 06 నెలలు | - |
| 224 | కొల్లి నాగభూషణమ్మ (తెనాలి) | - | అరెస్టు | - |
| 225 | తట్టా నరసమ్మ | - | 06 నెలలు | - |
| 226 | వందెనపు నాగలక్ష్మి | - | - | 02 నెలలు |
| 227 | వాసిరెడ్డి నాగమ్మ | - | 06 నెలలు | - |
| 228 | కోనేరు మంగమ్మ | - | 06 నెలలు | - |
| 229 | వేములపల్లి మహాలక్ష్మమ్మ | - | 06 నెలలు | - |
| 230 | వావిలాల మాణిక్యమ్మ | - | - | 06 నెలలు |
| 231 | చుక్కపల్లి మాణిక్యమ్మ | - | - | 03 నెలలు |
| 232 | కోటిపల్లి మాణిక్యమ్మ | - | - | 33 నెలలు |
| 233 | గునుపాటి మహాలక్ష్మమ్మ | - | - | 03 నెలలు |
| 234 | పాటిబండ్ల పార్వతమ్మ | - | 10 నెలలు | - |
| 235 | వాసిరెడ్డి పార్వతమ్మ | - | 06 నెలలు | - |
| 236 | ముప్పలనేని పుష్కరమ్మ | - | 06 నెలలు | - |
| 237 | కొరటాల దుర్గమ్మ | - | 06 నెలలు | - |
| 238 | తుమ్మల దుర్గాంబ | పాల్గొన్నారు | 12 నెలలు | - |
| 239 | వేజెండ్ల దుర్గాంబ | - | 06 నెలలు | - |
| 240 | వెలగలేటి దుర్గాంబ | - | 05 నెలలు | 15 నెలలు |
| 241 | ఎక్కలపున్నమ్మ | - | 1½ సం.లు | - |
| 242 | గరికపాటి రాధాకృష్ణమ్మ | - | అరెస్టు | - |
| 243 | వట్టికూటి రాధాకృష్ణమ్మ | - | 06 నెలలు | - |
| 244 | వట్టికూటి రాధమ్మ | - | అరెస్టు | - |
| 245 | కొల్లి రాఘవమ్మ | - | అరెస్టు | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం– 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940–41 |
| 246 | పాతూరు రాఘవమ్మ | – | 06 నెలలు | – |
| 247 | రవ్వవరపు రాఘవమ్మ | – | 06 నెలలు | 15 నెలలు |
| 248 | దేవభక్తుని రాజ్యలక్ష్మమ్మ | – | 12 నెలలు | – |
| 249 | కానూరు రాజ్యలక్ష్మమ్మ | – | 06 నెలలు | – |
| 250 | మునగపాటి రాజ్యలక్ష్మమ్మ | – | 08 నెలలు | – |
| 251 | రావిపాటి రాజ్యలక్ష్మమ్మ | – | అరెస్టు | – |
| 252 | సూర్యదేవర రాజ్యలక్ష్మమ్మ | – | 04 నెలలు | – |
| 253 | చిలకమర్రి రామానుజమ్మ | – | 06 నెలలు | – |
| 254 | బద్దుపల్లి రామశేషమ్మ | – | అరెస్టు | – |
| 255 | సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి | – | 12 నెలలు | 2 నెలలు |
| 256 | మాదుల రామాయమ్మ | – | అరెస్టు | – |
| 257 | ఆలపాటి రంగమ్మ | – | 12 నెలలు | – |
| 258 | కొత్తపల్లి రంగమ్మ | – | 12 నెలలు | – |
| 259 | నాదెళ్ళ రంగమ్మ | – | 12 నెలలు | 06 నెలలు |
| 260 | పరుచూరి రంగమ్మ | – | అరెస్టు | – |
| 261 | గోళ్ళమూడి రత్నమ్మ | అరెస్టు | 16 నెలలు | – |
| 262 | సజ్జా రత్నమ్మ | – | అరెస్టు | – |
| 263 | కొల్లి రత్నమ్మ | – | 12 నెలలు | – |
| 264 | యార్లగడ్డ రత్నమ్మ | – | 06 నెలలు | – |
| 265 | యలమంచిలి రత్నమ్మ | – | 06 నెలలు | – |
| 266 | గడ్డిపాటి రాఘవమ్మ | – | – | 06 నెలలు |
| 267 | వాసిరెడ్డి రాజ్యలక్ష్మి | – | – | పాల్గొన్నారు |
| 268 | సుంకర లక్ష్మమ్మ | – | అరెస్టు | – |
| 269 | ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ | పాల్గొన్నారు | – | – |
| 270 | గట్టు వెంకమ్మ | – | అరెస్టు | – |
| 271 | మంతెన వెంకమ్మ | – | అరెస్టు | – |
| 272 | సూర్యదేవర వెంకమ్మ | – | అరెస్టు | – |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 273 | గోళ్ళమూడి వెంకాయమ్మ | - | 04 నెలలు | - |
| 274 | తట్టా వెంకటనరసమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 275 | దర్శి అన్నపూర్ణమ్మ | పాల్గొన్నారు | - | - |
| 276 | వెలగపాటి దుర్గాంబ | - | - | 15 నెలలు |
| 277 | యలమంచిలి సరళకుమారి | - | 06 నెలలు | - |
| 278 | తన్నీరు సత్యవతమ్మ | - | అరెస్టు | - |
| 279 | వల్లూరు సావిత్రీదేవి | - | అరెస్టు | - |
| 280 | కాళంగి శేషమాంబ | - | 12 నెలలు | - |
| 281 | మల్లిపెద్ది శేషమ్మ | - | 06 నెలలు | - |
| 282 | సుఖవాసి శేషమ్మ | - | 06 నెలలు | - |
| 283 | యలవర్తి శేషమ్మ | - | అరెస్టు | - |
| 284 | దండు సీతమ్మ | పాల్గొన్నారు | అరెస్టు | - |
| 285 | కలిదిండి సీతమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 286 | మంతెన సీతమ్మ | - | అరెస్టు | - |
| 287 | పత్తిపాటి సీతమ్మ | - | 06 నెలలు | అరెస్టు |
| 288 | పెనుమత్స సీతమ్మ | - | అరెస్టు | - |
| 289 | బొప్పూడి సీతారావమ్మ | - | 10 నెలలు | - |
| 290 | కర్రపాటి సీతారావమ్మ | - | 06 నెలలు | - |
| 291 | నాదెళ్ళ సీతారావమ్మ | - | 06 నెలలు | - |
| 292 | కాజ సౌభాగ్యమ్మ | - | 06 నెలలు | 15 నెలలు |
| 293 | దేవినేని శ్రీరాజ్యలక్ష్మమ్మ | - | 06 నెలలు | - |
| 294 | దంతులూరి సుబ్బమ్మ | 06 నెలలు | - | - |
| 295 | గుత్తా సుందరమ్మ | - | 12 నెలలు | - |
| 296 | వాసిరెడ్డి హనుమాయమ్మ | - | 2½ సం.లు | అరెస్టు |
| 297 | సూర్యదేవర హైమావతి | - | - | అరెస్టు |
| 298 | రామకోటి పున్నమ్మ | - | 06 నెలలు | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 299 | పీసపాటి త్రిపురాంబ | - | 01 నెల | - |
| 300 | చేగిరెడ్డి లీలావతి | - | - | 04 నెలలు |
| 301 | చుండూరి కళ్యాణి | - | 06 నెలలు | - |
| 302 | పాదుర్తి సుందరమ్మ | పాల్గొన్నారు | 06 నెలలు | - |
| 303 | మైనేని బసవపూర్ణమ్మ | - | 06 నెలలు | - |
| 304 | యలమంచిలి బసవమ్మదేవి | - | 06 నెలలు | - |
| 305 | దూళ్ళ వెంకట రమణమ్మ | పాల్గొన్నారు | - | - |
| | | నెల్లూరు జిల్లా | | |
| 306 | చెంచులక్ష్మమ్మ | - | - | 06 నెలలు |
| 307 | ముత్తుకూరు కమలమ్మ | - | 10 నెలలు | - |
| 308 | కూరపాటి మంగళాంబ | - | 06 నెలలు | - |
| 309 | పల్లా ఓబమ్మ | - | 11 నెలలు | - |
| 310 | పినకాటి పోలమ్మ | - | 06 నెలలు | - |
| 311 | ద్వారం పుల్లమ్మ | - | 06 నెలలు | - |
| 312 | దర్భారమణమ్మ | - | పాల్గొన్నారు | - |
| 313 | పొన్నలూరు రమణమ్మ | - | 06 నెలలు | - |
| 314 | కట్టా రాఘవశంకరమ్మ | - | 06 నెలలు | - |
| 315 | రామలింగం సుబ్బమ్మ | - | 06 నెలలు | - |
| 316 | బాట్టారంసుందరమ్మ | - | 06 నెలలు | - |
| 317 | సబ్బవరపు తాయారమ్మ | - | 06 నెలలు | - |
| 318 | చవనం తిరుపతమ్మ | - | 10 నెలలు | - |
| 319 | తిరుపతమ్మ | - | పాల్గొన్నారు | - |
| 320 | రెంటాల వెంకటసుబ్బమ్మ | - | 06 నెలలు | - |
| 321 | బెజవాడ లక్ష్మికాంతమ్మ | - | - | 03 నెలలు |
| 322 | కోబాక రుక్మణమ్మ | - | - | 03 నెలలు |
| 323 | అల్లాడి అన్నపూర్ణమ్మ | పాల్గొన్నారు | - | - |

| వరుస సంఖ్య | స్త్రీల పేర్లు | జైలు శిక్షా కాలం | | |
|---|---|---|---|---|
| | | సహాయ నిరాకరణోద్యమం 1920 నుండి 1947 | ఉప్పు సత్యాగ్రహం 1930/ శాసనోల్లంఘనం 1932 | క్విట్ ఇండియా ఉద్యమం- 1942 / వ్యక్తి సత్యాగ్రహం 1940-41 |
| 324 | పొణకా కనకమ్మ | పాల్గొన్నారు | 2 సం.లు | - |
| 325 | ఓరుగంటి మహాలక్ష్మమ్మ | పాల్గొన్నారు | 1½ సం.లు | - |
| | చిత్తూరు జిల్లా | | | |
| 326 | తంబళ్ళపల్లి అనసూయదేవి | - | - | 03 నెలలు |
| 327 | నల్లపరెడ్డి శకుంతల | - | - | 06 నెలలు |
| | కడప జిల్లా | | | |
| 328 | హర్ధగిరి నరసమ్మ | - | - | అరెస్టు |
| 329 | డా.ముత్తు లక్ష్మీ రెడ్డి | పాల్గొన్నారు | - | - |
| 330 | పడ్డిపర్తి శకుంతలాదేవి | - | 06 నెలలు | - |
| 331 | కొటికలపూడి సరస్వతీదేవి | - | 07 నెలలు | 03 నెలలు |
| 332 | వారణాసి సీతమ్మ | - | 03 నెలలు | - |
| 333 | అద్దునూరి సీతమ్మ | - | 10 నెలలు | - |
| 334 | కడప రామసుబ్బమ్మ | - | పాల్గొన్నారు | పాల్గొన్నారు |
| | కర్నూలు జిల్లా | | | |
| 335 | సర్దార్ అమరావతమ్మ | - | - | 12 నెలలు |
| 336 | పేరంబోయమ్మ | - | - | 09 నెలలు |
| 337 | యలకూరు సుబ్బరత్నమ్మ | - | - | శిక్షను అనుభవించారు |
| 338 | ఔకు లక్ష్మాదేవమ్మ | - | - | శిక్షను అనుభవించారు |
| 339 | బల్లేకల్లు రామక్క | - | - | పాల్గొన్నారు |
| 340 | డా. లక్ష్మీసెయీగల్ | - | - | 12 నెలలు |
| | అనంత పురం జిల్లా | | | |
| 341 | నివర్తి లక్ష్మీ దేవి శాస్త్రి | - | 06 నెలలు | - |
| | హైదరాబాద్ | | | |
| 342 | సంగం లక్ష్మీబాయమ్మ (గుంటూరులో) | - | 12 నెలలు | - |
| 343 | సరోజినీ నాయుడు (కలకత్తాలో) | పాల్గొన్నారు | 1 సం | 5 సంవత్సరాలు |

# 10.2. ఆనవాళ్ళు - సాహిత్య సూచికల పట్టిక

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **ఉపన్యాసాలు** | | |
| 1 | స్త్రీవిద్యను కూర్చిన నియామకం | రోజా లీలలు | జనానా | జనవరి 1900 |
| 2 | స్త్రీవిద్య | బరోడా మహారాణి | జనానా | మార్చి 1900 |
| 3 | స్త్రీవిద్య | సిరూరకాంత | జనానా | నవంబరు1901 |
| 4 | బాలికావిద్య | కమలాంబ సత్యనాథం | జనానా | మే 1902 |
| 5 | నీతిని గూర్చిన | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | మే 1902 |
| 6 | స్త్రీవిద్య | ఓ. ఆదెమ్మ | హిందూసుందరి | జూన 1902 |
| 7 | ఈశ్వరభక్తి | కందుకూరి రాజ్యలక్ష్మి | హిందూసుందరి | జులై 1902 |
| 8 | హిందూ స్త్రీల విద్యావశ్యకత | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | జుల 1902 |
| 9 | స్త్రీవిద్య యొక్క ప్రభావం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | ఆగష్టు 1902 |
| 10 | స్త్రీవిద్య | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1902 |
| 11 | బాలికావిద్యాభివృద్ధి | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1902 |
| 12 | స్త్రీవిద్య | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1902 |
| 13 | స్త్రీవిద్య | అ.లక్ష్మీ కాంతమ్మ | హిందూసుందరి | నవంబరు 1902 |
| 14 | స్త్రీవిద్య | రుద్రవరపు కామేశ్వరమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి 1903 |
| 15 | భండారు అచ్చమాంబ | వేమర్సు మహాలక్ష్మి | హిందూసుందరి | ఫిబ్రవరి 1903 |
| 16 | స్త్రీవిద్య | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | ఫిబ్రవరి 1903 |
| 17 | బాలికాపాఠశాలలోనిలోపం-తన్నివారణోపాయం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | మార్చి 1903 |
| 18 | స్త్రీవిద్యార్థినీ సమాజస్థాపన | పులగుర్త లక్ష్మీనరసమాంబ | హిందూసుందరి | మార్చి 1903 |
| 19 | ఆనందం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | మే 1903 |
| 20 | స్త్రీల యున్నత విద్య | పులగుర్త లక్ష్మీనరసమాంబ | హిందూసుందరి | మే 1903 |
| 21 | విద్యావతులగు యువతులకొక విన్నపం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | జూన్ 1903 |
| 22 | మచలీపట్నంలో జరిగిన స్త్రీ సమావేశం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | జులై 1903 |
| 23 | రాజామునందలి జనానా సభ | వలివేటి బాలా త్రిపుర సుందరమ్మ | హిందూసుందరి | జులై 1903 |
| 24 | స్త్రీవిద్య | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | హిందూసుందరి | నవంబరు 1903 |
| 25 | హిందూ బాలల విద్య | అనిబిసెంటు | హిందూసుందరి | జనవరి 1904 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **ఉపన్యాసాలు** | | |
| 26 | స్త్రీవిద్య | కమలాకరమ్మ | జనానా | ఫిబ్రవరి 1904 |
| 27 | స్త్రీ సమాజవార్షికోత్సవసభ | బుచ్చి బంగారమ్మ | జనానా | ఫిబ్రవరి 1904 |
| 28 | మహిళ మనోరమ | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | సావిత్రి | ఫిబ్రవరి 1904 |
| 29 | స్త్రీవిద్య | భట్టిప్రోలు రాజేశ్వరమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి 1904 |
| 30 | హిందూ ఆచారాలను | బుచ్చి బంగారమ్మ | జనానా | మార్చి 1904 |
| 31 | కందుకూరి వీరేశలింగం | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | మే 1904 |
| 32 | కందుకూరి వీరేశలింగం | దామెర్ల సుందరమ్మ | హిందూసుందరి | మే 1904 |
| 33 | పరోపకారం | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1904 |
| 34 | స్త్రీవిద్య | అత్తివిల్లి కామేశ్వరమ్మ | హిందూసుందరి | నవంబరు 1904 |
| 35 | హిందూసుందరుల విద్యాభివృద్ధి | కొటికలపూడి సీతమ్మ | జనానా | జనవరి 1905 |
| 36 | ఉన్నతవిద్య | బాలాంరపు శేషమ్మ | హిందూసుందరి | జులై 1905 |
| 37 | విజ్ఞాపనము | మోటుపల్లి రాజాబాయమ్మ | హిందూసుందరి | ఆగష్టు–సెప్టెంబరు 1905 |
| 38 | స్త్రీవిద్య | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | డిశంబరు 1905 జనవరి 1906 |
| 39 | కాశీలోని హిందూ స్త్రీల సభ | బంగళా స్త్రీ | జనానా | ఏప్రిల్ 1906 |
| 40 | హిందూస్త్రీల మహా సభ | దామెర్ల సీతమ్మ | హిందూసుందరి | జూలై 1910 |
| 41 | స్త్రీవిద్య | మామిడన్న కామేశ్వరమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1910 |
| 42 | హిందూస్త్రీల ప్రస్తుతవిద్యాస్థితి | జె.సి.బోసు దొరసాని | సువర్ణలేఖ | అక్టోబరు 1910 |
| 43 | ఆంధ్రవార్తాపత్రికల ప్రచారము | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | నవంబరు 1910 |
| 44 | బాలాంత్రపు శేషమ్మగారు | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | నవంబరు 1910 |
| 45 | ఆంధ్రపత్రికల ప్రచారము | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | నవంబరు 1910 |
| 46 | స్త్రీవిద్య | మామిడన్న కామేశ్వరమ్మ | హిందూసుందరి | డిసెంబరు 1910 |
| 47 | సత్యసంవర్ధినీ సమాజము | పిళ్ళారిశెట్టి లక్ష్మీకాంతమ్మ | హిందూసుందరి | జనవరి 1911 |
| 48 | సత్యసంవర్ధినీ సమాజము | గుండాల సుభద్ర | హిందూసుందరి | జనవరి 1911 |
| 49 | ఆంధ్ర మహిళా సభ | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | సావిత్రి | ఏప్రిల్ 1911 |
| 50 | స్త్రీవిద్య వివాహమునకు తగిన వయస్సు | ఆచంట రుక్మిణి | హిందూసుందరి 1912 | ఫిబ్రవరి |
| 51 | బాల్యవివాహము ఉన్నత విద్యకు ఆటంకము | మిస్.కేరి.ఏ. టినెంటు | హిందూసుందరి | ఏప్రిల్ 1912 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **ఉపన్యాసాలు** | | |
| 52 | స్త్రీల స్థితి | కందుకూరి వెంకాయమ్మరావు | వివేకవతి | జూన్ 1912 |
| 53 | స్త్రీ స్వాతంత్ర్యం | కందుకూరి వెంకాయమ్మ | వివేకవతి | సెప్టెంబరు 1912 |
| 54 | స్త్రీ సమాజాలు | కళ్ళేపల్లె వెంకట రమణమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1912 |
| 55 | భారతీయ సమాజ వార్షికోత్సవ సభ | కందూకూరి వెంకాయమ్మ | వివేకవతి | సెప్టెం- అక్టోబర్ నవంబర్ 1912 |
| 56 | పిల్లల పెంపకము | కందూకూరి వెంకాయమ్మ | వివేకవతి | అక్టోబరు 1912 |
| 57 | స్త్రీలకు ఉన్నత విద్య | కళ్ళేపల్లె వెంకట రమణమ్మ | సావిత్రి | అక్టోబర్-నవం డిసెంబర్ 1912 |
| 58 | సంఘ సంస్కరణము | కందూకూరి వెంకాయమ్మ | వివేకవతి | నవంబరు 1912 |
| 59 | ఆంధ్రమహిళాసభ | కాశీనాధుని రామాబాయమ్మ | హిందూసుందరి | మార్చి 1913 |
| 60 | వైశ్యబాలికారత్నము-పూలమ్మ | కాంచనపల్లి కనకమ్మ | హిందూసుందరి | నవంబరు 1913 |
| 61 | ఆంధ్రమహిళా మహాజనసభ | ముద్దాసుబ్బమ్మ,అ.దుర్గాంబ | హిందూసుందరి | ఏప్రిల్ 1914 |
| 62 | స్త్రీవిద్య | ఏకా వెంకట రత్నమ్మ | హిందూసుందరి | జులై 1914 |
| 63 | ఆంధ్ర మహిళా మహాసభ | మహారాజ్ఞి లలితకుమారమ్మ | హిందూసుందరి | జూన్,జులై1915 |
| 64 | ఆంధ్ర మహిళా సభ | చోరగుడి సీతమ్మ | హిందూసుందరి | అక్టోబరు 1915 |
| 65 | మహిళా సభ | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | హిందూసుందరి | జూన్ 1916 |
| 66 | అష్టమాంధ్ర మహిళా సభ | కోకా కృష్ణవేణమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1917 |
| 67 | బాల్యవివాహము | చుండి తులశమ్మ | హిందూసుందరి | మార్చి 1918 |
| 68 | ఐకమత్యము | చదలపాటి వరలక్ష్మి | అనసూయ | ఫిబ్రవరి 1920 |
| 69 | హిందూస్త్రీలు గృహమునందు నేర్చుకోదగిన సకాయకష్టకర్మలు | నెమలి కనకమ్మ | విద్యాభివర్ధని | మార్చి, ఏప్రిల్, మే 1920 |
| 70 | సత్యవర్దని సమాజమున ఉపన్యాసము | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | డిసెంబరు 1921 |
| 71 | అఖిలభారతమహిళామహాసభ | పులుగుర్త లక్ష్మీనరసమాంబ | ఆంధ్రసర్వస్వము | జనవరి 1924 |
| 72 | స్త్రీలు-వారి సేవాసంపత్తి | డా. అనిబిసెంట్ | స్త్రీధర్మ | మార్చి 1926 |
| 73 | డా.అనిబిసెంట్ | వి.పాపమ్మ | స్త్రీధర్మ | అక్టోబరు 1926 |
| 74 | రాటపు సందేశం | ఆర్.సోనాబాయమ్మ | స్త్రీధర్మ | అక్టోబరు 1926 |
| 75 | అఖిలభారత స్త్రీమహాసభ | బరోడా మహారాణి | స్త్రీధర్మ | ఫిబ్రవరి 1927 |
| 76 | స్త్రీవిద్యకులలితకళలప్రాధాన్యం | డి.బుచ్చి కృష్ణమ్మ | హిందూసుందరి | జనవరి 1928 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| **ఉపన్యాసాలు** | | | | |
| 77 | ఆంధ్ర రాష్ట్ర మహిళా విద్యా సంస్కరణ సభ | దు. సూర్యకాంతమ్మ | హిందూసుందరి | జనవరి 1928 |
| 78 | బ్రహ్మకృపాహి కేవలం ? | సత్యరాజు శ్యామలాంబ | హిందూసుందరి | జులై 1928 |
| 79 | దేవదాసీల సంస్కరణము | డా. యన్. ముత్తు లక్ష్మీదేవి | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |
| 80 | బెజవాడలో జరిగిన ఆంధ్రమహిళా సభ | తుర్లపాటి రాజేశ్వరి | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |
| 81 | స్త్రీవిద్య | బత్తుల కామాక్షమ్మ | వాసవి | మార్చి 1932 |
| 82 | సప్తమాంధ్ర మహిళా సభ | చుండూరి రత్నమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1933 |
| 83 | స్త్రీల కర్తవ్యం | పొణకా కనకమ్మ | ఆంధ్రభూమి | ఫిబ్రవరి 1935 |
| 84 | శ్రీలక్ష్మి సేవాసదనము | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 85 | స్త్రీవిద్యా విషయిక సభ–రాజమండ్రి | రాజగోపాలనుసతి | రెడ్డిరాణి | నవంబరు 1935 |
| 86 | భారతస్త్రీల పరమధర్మము | విజయలక్ష్మి పండిట్ | గృహలక్ష్మి | అక్టోబరు 1937 |
| 87 | నిజాంరాష్ట్రాంధ్ర మహిళా మహాసభ | రంగమ్మ ఓబుల్ రెడ్డి | గృహలక్ష్మి | జులై 1941 |
| 88 | దేవదాసీల సంస్కరణము | డా. యన్. ముత్తులక్ష్మి | గృహలక్ష్మి | నవంబరు 1941 |
| **కథలు** | | | | |
| 1 | లలితా శారదలు | భండారు అచ్చమాంబ | జనానా | సెప్టెంబరు 1901 |
| 2 | దంపతుల ప్రథమకలహం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | జూన్ 1902 |
| 3 | ధనత్రయోదశి | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | నవంబరు 1902 |
| 4 | భార్యాభర్తల సంవాదం స్త్రీవిద్య | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | డిసెంబరు 1902 |
| 5 | సాధువర్తనం | పి. కౌసల్య | హిందూసుందరి | మే 1903 |
| 5 | భార్యాభర్తల సంవాదం | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | ఆగష్టు 1903 |
| 6 | అద్దమును–సత్యవతియును | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | ఫిబ్రవరి 1904 |
| 7 | బీదకుటుంబం | భండారు అచ్చమాంబ | సావిత్రి | ఫిబ్రవరి 1904 |
| 8 | వృద్ధభర్త–బాలభార్య | వాడ్రేవు సుందరమ్మ | వివేకవతి | డిసెంబరు 1912 |
| 9 | చంపక సందేహనివృత్తి | పత్రికాధిపులు | అనసూయ | నవంబరు, డిశెంబరు 1919 |
| 10 | హిందూ దైవము | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | మార్చి 1924 |
| 11 | కనకవల్లి | కనుపర్తి వరలక్ష్మమ్మ | అనసూయ | ఏప్రిల్ 1924 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **కథలు** | | |
| 12 | కుటీరలక్ష్మి | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్రపత్రిక– ఉగాది సంచిక | ఏప్రిల్ 1924 |
| 13 | బాంకి బుచ్చిరాజు | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | జనవరి– ఫిబ్రవరి 4,1926 |
| 14 | సఫేద్ టోపీ | రాజ్యలక్ష్మి | భారతి | మార్చి 1926 |
| 15 | ప్రభావతి | అ.భాస్కరమ్మ | భారతి | ఆగష్టు 1926 |
| 16 | ప్రేమ ప్రభావము | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | మే 1727 |
| 17 | శాంతి | శ్రీలక్ష్మి | భారతి | జూన్ 1928 |
| 18 | దీర్ఘ సుమంగళీ భవ | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | ఆగష్టు 1928 |
| 19 | నే ధన్యనైతిని | గుమ్మడిదల లక్ష్మీబాయమ్మ | భారతి | జనవరి 1929 |
| 20 | శాంతి | కంచి మంగళమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1929 |
| 21 | చిట్టి | వి. సుబ్బమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 22 | బీదకుటుంబం | బండారు అచ్చమాంబ | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 23 | సుందరి | పి.రుక్మిణీబాయి | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 24 | ఇది అశాస్త్రీయమా | పెద్దాడ కామేశ్వరమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |
| 25 | సరస్వతి కష్టములు గట్టెక్కుట | మాగంటి శకుంతల | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 26 | ముందు కథ | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | జులై 1930 |
| 27 | లలిత | ద్రోణంరాజు సీతాదేవి | భారతి | సెప్టెంబరు 1930 |
| 28 | సుశీల | దరిశి అన్నపూర్ణ | వాసవి | డిసెంబరు 1930 |
| 29 | త్యాగిని | మైలవోలు పద్మావతి | గృహలక్ష్మి | మార్చి 1930 |
| 30 | జ్ఞానాంబ | దరిశి అన్నపూర్ణమ్మ | గృహలక్ష్మి | జనవరి 1931 |
| 31 | రూపపటమెందుకు | పాకల రత్నాబాయి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1931 |
| 32 | సుందరమ్మ | కం. రంగనాయకమ్మ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1931 |
| 33 | ఏవరిదదృష్టం | బసవరాజువెంకటరాజ్యలక్ష్మీ | భారతి | మే 1931 |
| 34 | మిహరున్నీసా బేగం | పులవర్తి కమలావతీదేవి | వాసవి | జూన్ 1931 |
| 35 | అత్తలు కోడళ్లు కథ | సుసర్ల లక్ష్మీనరసమాంబ | గృహలక్ష్మి | జులై 1931 |
| 36 | ఐదుమాసములు ఇరువది దినములు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | అక్టో–నవంబరు 1931 |
| 37 | సాధ్వి | గండికోట సావిత్రీదేవి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1931 |
| 38 | పుష్కరము బాలవైధవ్యమును మాన్పింది | పులవర్తి కమలావతీదేవి | వాసవి | సెప్టెంబరు 1932 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **కథలు** | | |
| 39 | విత్తొకటి నాటితే చెట్టొకటి మొలుస్తుందా | పులవర్తి కమలావతీదేవి | వాసవి | నవంబరు 1932 |
| 40 | కులమా-ప్రేమా | ఎల్లాప్రగడ సీతాకుమారి | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1933 |
| 41 | ఐతేపాపం లలిత గతి ఏమిటి | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | మే 1933 |
| 42 | దేవుడు | వెంకాయమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1933 |
| 43 | ముద్దు కూతురు | వి. సరస్వతి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1933 |
| 44 | ఒట్టు | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | డిసెంబరు 1933 |
| 45 | నీలాపనింద | కామేశ్వరమ్మ | భారతి | మే 1934 |
| 46 | మనీపర్సు మహత్యం | కె. కాత్యాయనీ | గృహలక్ష్మి | మే 1934 |
| 47 | మాదిగ వెంకడు | పులవర్తి కమలావతీదేవి | వాసవి | జూన్ 1934 |
| 48 | పశ్చాతాపమే పతిత పావనం | దుర్భ హనుమావతి | గృహలక్ష్మి | జూ౦ 1934 |
| 49 | గాజుల జత | సమయమంత్రి వందేమాతరం | గృహలక్ష్మి | జులై 1934 |
| 50 | నా జాతకము | తాయి శ్రీ జయలక్ష్మి | గృహలక్ష్మి | ఆగష్టు 1934 |
| 51 | విడాకులు | నెమలి చంద్రమతి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1934 |
| 52 | కాలమహత్యము | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1934 |
| 53 | గొంగళిపురుగుల | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్రభూమి | అక్టోబరు 1934 |
| 54 | భారతి | కె.యన్. మూర్తీభాయి | గృహలక్ష్మి | నవంబరు 1934 |
| 55 | గేదేల రామక్క జీవితచరిత్ర | చిత్రలేఖ సంగ్రహం | గృహలక్ష్మి | నవంబరు 1934 |
| 56 | లీలావతి | సమయమంత్రి వందేమాతరం | గృహలక్ష్మి | డిసెంబరు 1934 |
| 57 | సరస్వతి పుష్పావతి | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1935 |
| 58 | మార్పుల మంగ | కూనిశెట్టి రామరత్నం | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1935 |
| 59 | శ్యామల పెండ్లి | మల్లంపల్లి బాలాత్రిపుర సుందరమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1935 |
| 60 | మూడు తీర్మానాలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | ఫిబ్రవరి 1935 |
| 61 | అయ్యోపాపం | గొట్టుముక్కల వెంకాయమ్మ | గృహలక్ష్మి | మార్చి 1935 |
| 62 | ఇంటనొక్కటి రచ్చనొకటి | పి. హేమలతాదేవి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1935 |
| 63 | కమల | వెలిదండ చూడి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1935 |
| 64 | క్లబ్ | సమయమంత్రి రాజ్యలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జూన్ 1935 |
| 65 | ఆదర్శప్రాయురాలు | సి.హెచ్.వు. రమణమ్మ | గృహలక్ష్మి | జూన్ 1935 |
| 66 | పుత్ర పుత్రికాభేదము | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | జూన్ 1935 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **కథలు** | | |
| 67 | ప్రేమ తత్త్వము | చామర్తి సీతాదేవి | గృహలక్ష్మి | జులై 1935 |
| 68 | బంగారు పతకము | చామర్తి సీతాదేవి | గృహలక్ష్మి | ఆగష్టు 1935 |
| 69 | నేనేమొ మొద్దును కాను | మామిడిపూడి వెంకమ్మ | భారతి | ఆగష్టు 1935 |
| 70 | కథ కాదు | తాడి నాగమ్మ | భారతి | సెప్టెంబరు 1935 |
| 71 | పేదరాలు | వెలిదండ చూడి కుడుత్తమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1935 |
| 72 | ఆనందమయి | కె.కృష్ణకుమారి | గృహలక్ష్మి | నవంబరు 1935 |
| 73 | సజ్జన మైత్రి | చిల్కపాటి సీతాంబ | గృహలక్ష్మి | మే 1936 |
| 74 | తుది మెట్టు | సు. అన్నపూర్ణ | గృహలక్ష్మి | జులై 1936 |
| 75 | అపజయం | రాణి చాకుంటసరస్వతీబాయి | గృహలక్ష్మి | జులై 1936 |
| 76 | చట్టసభలలో మెజారిటీ మీదేగా | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జులై 1936 |
| 77 | ఆదర్శ ప్రపంచం | వెలిదండ చూడి కుడుత్తమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు-సెప్టెంబరు 1936 |
| 78 | పశ్చాత్తాపము | అడపా సుగుణమణి | గృహలక్ష్మి | అక్టోబరు 1936 |
| 79 | మహాలక్ష్మమ్మ | ఓలేటి నిత్య కళ్యాణమ్మ | ఆంధ్రభూమి | డిసెంబరు 1936 |
| 80 | స్త్రీ పునర్వివాహము | ఎల్లాప్రగడ సీతాకుమారి | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1937 |
| 81 | కట్నాల కాంక్ష | బులుసు ప్రకాశమ్మ | ఆంధ్రభూమి | జూన్ 1937 |
| 82 | ఆదర్శ గృహిణి | పాకాల రాజమణి | గృహలక్ష్మి | ఆగష్టు 1937 |
| 83 | తండ్రియా, తనయుడా | పాకల చంద్రమణి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1937 |
| 84 | వరకట్న పరిణామం | పులిపాక బాలాత్రిపుర త్రిపురసుందరమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1937 |
| 85 | పిల్లికి చరలాటము-ఎలుకకు ప్రాణసంకటం | పులిపాక బాలా త్రిపురసుందరమ్మ | గృహలక్ష్మి | మార్చి 1938 |
| 86 | ధర్మతల్లి | చుండూరి రమాదేవి | గృహలక్ష్మి | మార్చి 1938 |
| 87 | అనాథ వనిత | సి.వి. కృష్ణమ్మ | గృహలక్ష్మి | మే 1938 |
| 88 | నా స్వప్నము | పాకల రాజామణి | గృహలక్ష్మి | జులై 1938 |
| 89 | పోశమ్మ గండి | పులవర్తి కమలావతీదేవి | వాసవి | ఆగష్టు 1938 |
| 90 | లక్ష్మి | ఆర్.అలివేలు మంగాదేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 91 | సుశీల | గాధంశెట్టి అహల్యా దేవి | గృహలక్ష్మి | జులై 1939 |
| 92 | మాగృహిణి | వట్టి శేషాంబ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1940 |
| | | | | |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| **కథలు** | | | | |
| 93 | ఎప్పటికో జ్ఞానోదయం | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1940 |
| 94 | ఆదర్శనారీమణి | పులిపాక బాలాత్రిపుర సుందరమ్మ | గృహలక్ష్మి | జులై 1941 |
| 95 | దసరా బహుమానం | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 96 | ధన్యజీవులు | ఆయపెళ్ళి రామలక్ష్మి | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 97 | రెండు వరాలు | సమయమంత్రి రాజ్యలక్ష్మి | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 98 | ప్రేమ వేదికమీద | చంద్రకాంతం | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 99 | పిచ్చిది | బులుసు ప్రకాశమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1941 |
| 100 | నీకేసి చూసినంతమంది | బులుసు ప్రకాశమ్మ | ఆంధ్రభూమి | ఏప్రిల్ 1942 |
| 101 | నీలాటిరేవు | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్రజ్యోతి | జులై 1945 |
| 102 | ఏమి అదృష్టము | ఆచంట శారదా దేవి | భారతి | మే 1947 |
| **గల్పికలు** | | | | |
| 1 | మెదడుంటే తలకాస్తుంది | పులవర్తి కమలావతీదేవి | వాసవి | మార్చి 1936 |
| 2 | బాతాఖానీ | చుండూరి రమాదేవి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1947 |
| **నాటకాలు** | | | | |
| 1 | అవివేకపు వెంకమ్మ | విన్నకోట లక్ష్మీజోగమ్మ | హిందూసుందరి | జులై– సెప్టెంబరు 1902 |
| 2 | నీలాటిరేవు | మొసలిగంటి రామాబాయమ్మ | హిందూసుందరి | డిసెంబరు 1902 |
| 3 | ధైర్యస్థైర్యములు | బాలాంత్రపు శేషమ్మ | సావిత్రి | జనవరి 1904 |
| 4 | స్త్రీవిద్య | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | హిందూసుందరి | మార్చి 1904 |
| 5 | అనామకం | వల్లూరి మాణిక్యమ్మ | జనానా | మార్చి 1904 |
| 6 | వింతలమారి వీరమ్మ | అనామిక రచయిత | హిందూసుందరి | సెప్టెంబరు 1904 |
| 7 | కమలా విమలా సంవాదం | పత్రికాధిపులు | సావిత్రి | నవంబరు 1904 |
| 8 | కమల | అనామిక రచయిత | హిందూసుందరి | డిసెంబరు –జనవరి 1905–06 |
| 9 | విమల | సంపాదకులు | హిందూసుందరి | సెప్టెం–అక్టో నవం–1906 |
| 10 | శారదా కుసుమ సంవాదం | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | జులై 1910 |
| 11 | స్త్రీపునర్వివాహ ప్రహసనము | కవికొండల సుబ్బలక్ష్మి | హిందూసుందరి | డిసెంబరు–ఫిబ్రవరి 1910–11 |
| 12 | స్త్రీపునర్వివాహ ప్రహసనము | కవికొండల సుబ్బలక్ష్మి | హిందూసుందరి | ఫిబ్రవరి 1911 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **నాటకాలు** | | |
| 13 | ఆరోగ్యము | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | ఏప్రిల్ 1911 |
| 14 | ఆరోగ్యము | ఓరుగంటి ఆదెమ్మ | హిందూసుందరి | ఏప్రిల్ 1911 |
| 15 | హాస్యసంజీవి | గూడపాటి లక్ష్మీనరసమ్మ | హిందూసుందరి | మే 1911 |
| 16 | సంభాషణము | పి.లింగమాంబ | హిందూసుందరి | మార్చి 1914 |
| 17 | జ్ఞానోదయం | ఆరణి చూడామణి | హిందూసుందరి | జనవరి 1915 |
| 18 | సంఘసంస్కరణ విషయములు | వాడ్రేవు సుందరమ్మ | వివేకవతి | ఏప్రిల్,మే 1918 |
| 19 | స్త్రీవిద్యాప్రసంశ | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | జూన్ 1918 |
| 20 | సంఘసంస్కరణ విషయములు | వాడ్రేవు సుందరమ్మ | వివేకవతి | ఏప్రిల్ 1919 |
| 21 | ఉపాధ్యాయిని | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | జనవరి 1923 |
| 22 | పురిటిగది | కనుపర్తి వరలక్ష్మమ్మ | శారద | ఏప్రిల్ 1923 |
| 23 | బ్రాహ్మణకన్యావివాహ ప్రహసనము | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | జూన్ 1924 |
| 24 | ఖద్దరు | అయ్యదేవర బాలా త్రిపురసుందరి | హిందూసుందరి | జూన్ 1928 |
| 25 | సరిసమానులుగారా | ముస్తా కోటీశ్వరమ్మ | స్త్రీధర్మ | అక్టోబరు 1929 |
| 26 | స్త్రీవిద్యా సంవాదము | భండారు సరోజనీదేవి | వాసవి | జులై 1931 |
| 27<br>28 | పతివశీకరణము<br>ఆత్మప్రేరణము | పులవర్తి కమలావతీదేవి<br>కొత్తపల్లి కౌసల్యా దేవి | వాసవి<br>గృహలక్ష్మి | సెప్టెంబరు 1931<br>డిసెంబరు 1931 |
| 29 | సంస్కరణ వివాహము | వెలిదండ చూడి కుడుత్తమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1934 |
| 30 | మానవ ప్రకృతి | సి.వి.రమణమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1937 |
| 31 | వరకట్న ప్రహసనం | దేశిరాజు భారతీ దేవి | గృహలక్ష్మి | జులై 1941 |
| 32 | చర్చ | భావరాజు రాజ్యరత్నమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 33 | కమల కాపురంనాటకం | ఆర్. జానాబాయి | గృహలక్ష్మి | జులై 1948 |
| | | **కవితలు** | | |
| 1 | స్త్రీవిద్యా ప్రసంశ | ఉ.నారాయణమ్మ | ఆంధ్రపత్రిక (ఉగాదిసంచిక) | ఏప్రిల్ 1910 |
| 2 | స్త్రీవిద్య పంచరత్నములు | ఉప్పల నరసమాంబ | సావిత్రి | సెప్టెంబరు 1910 |
| 3 | జనని వియోగవిచారము | జూలూరి తులసమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1910 |
| 4 | సమాజఆశీర్వాజ పద్యము | పులుగుర్త లక్ష్మీనరసమ్మ | సావిత్రి | జనవరి 1911 |
| 5 | సమాజలాభము | కె. కనకమ్మ | హిందూసుందరి | జూన్ 1911 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **కవితలు** | | |
| 6 | భార్యలపాలిటిమృత్యుదేవతలు | అనామక రచయిత్రి | సావిత్రి | నవంబరు 1911 |
| 7 | అబలావిలాసం | బ్రహ్మాండం కనకసుందరమ్మ | అనసూయ | సెప్టెం- అక్టోబరు 1919 |
| 8 | స్వరాజ్యలక్ష్మి | కనుపర్తి వరలక్ష్మమ్మ | అనసూయ | నవంబరు 1923 |
| 9 | విద్యలాభమా | ఓడరేవు రంగనాయకమ్మ | శారద | మే 1925 |
| 10 | శారద | ఆదిపూడి వసుంధరా దేవి | శారద | జులై 1925 |
| | భారతమహిళాతారావళి | వత్యం వెంకట అనంత రాజ్యలక్ష్మి | స్త్రీధర్మ | అక్టోబరు 1925 |
| 11 | శ్రీ అన్నపూర్ణాదేవి స్మృతి | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | భారతి | నవంబరు 1927 |
| 12 | ఆంధ్రమాత | కాలనాథభట్ల సూర్యప్రకాశమ్మ | అనసూయ | ఏప్రిల్ 1928 |
| 13 | స్త్రీవిద్య | వెలివోలు వసంతకుసుమావతి | గృహలక్ష్మి | మార్చి 1929 |
| 14 | మహాత్మాగాంది | వెలివోలు వసంత | గృహలక్ష్మి | జులై 1929 |
| 15 | ఝూన్సీలక్ష్మీబాయి | స్థానాపతి రుక్మిణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 16 | అన్నపూర్ణాదేవి | చట్టి రాధమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1929 |
| 17 | శారదా చట్టము | నడివింటి వెంకటరత్నమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1929 |
| 18 | మాగంటి అన్నపూర్ణాదేవి | వి.జ్ఞానాంబ | గృహలక్ష్మి | నవంబరు 1929 |
| 19 | అనాథ ఘోష | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | గృహలక్ష్మి | జనవరి 1930 |
| 20 | ఆంధ్ర వనితా మణులు | అప్పల నరసమ్మ | గృహలక్ష్మి | జనవరి 1930 |
| 21 | శారదాబిల్లు ప్రశంస | వి.జ్ఞానాంబ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 22 | ఉద్బోధ | వెలివోలు వసంతా దేవి | ఆంధ్రపత్రిక- ఉగాదిసంచిక | ఏప్రిల్ 1930 |
| 23 | ఉప్పుసత్యాగ్రహము | వోలేటి నిత్యకళ్యాణమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1930 |
| 24 | కీ.శే. అన్నపూర్ణాదేవి | బి. జ్ఞానాంబ | గృహలక్ష్మి | నవంబరు 1930 |
| 25 | దివ్యాశ్శీస్సు | వోలేటి నిత్యకళ్యాణమ్మ | గృహలక్ష్మి | మార్చి 1931 |
| 26 | మహ్మదాలీ మరణం | బి. జ్ఞానాంబ | గృహలక్ష్మి | మార్చి 1931 |
| 27 | మీరాబాయి | దేవులపల్లి సత్యవతమ్మ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1931 |
| 28 | సత్యాగ్రహులకు | దేవులపల్లి సత్యవతమ్మ | గృహలక్ష్మి | మే 1931 |
| 29 | ప్రబోధము | దేవులపల్లి సత్యవతమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1931 |
| 30 | దీవెన లొసంగుమమ్మ | దేశిరాజు భారతీ దేవి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1931 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
| --- | --- | --- | --- | --- |
| | | **కవితలు** | | |
| 31 | స్వాతంత్ర్య లక్ష్మి | ఓలేటి నిత్యకళ్యాణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 32 | దేశసేవిక సామవేదుల | చిరంజీవమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 33 | ఆహ్వానము | పి. సీతారావమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 34 | పిలుపు | పరుచూరి భువనేశ్వరి | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 35 | మేలుకొలుపు | బొడ్డుపల్లి బాలా త్రిపురసుందరి | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 36 | ఆంధ్రవనితామణులు | పి.అప్పలనరసమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1931 |
| 37 | గాంధీ | గార్లపాటి లక్ష్మీగంగమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1931 |
| 38 | మద్యపాన తాత్విక నిరోధము | సామవేదుల చిరంజీవమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1931 |
| 39 | గోదావరి పుష్కరాలు | వెంపటి అన్నపూర్ణమ్మ | గృహలక్ష్మి | జులై 1932 |
| 40 | అతడు | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్రపత్రిక– ఉగాదిసంచిక | ఏప్రిల్ 1933 |
| 41 | దేశభక్తి | యమ్.అనసూయ | గృహలక్ష్మి | జూన్ 1933 |
| 42 | తెలుగుబిడ్డ | పరుచూరి భువనేశ్వరి, అన్నపూర్ణ | గృహలక్ష్మి | జులై 1933 |
| 43 | హరిజనులు | పరుచూరి భువనేశ్వరి, అన్నపూర్ణ | గృహలక్ష్మి | జులై 1933 |
| 44 | స్త్రీవిద్య | వీరుభట్ల రామలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1933 |
| 45 | పాకీవాడు | వింజమూరి వెంకటరత్నమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1933 |
| 46 | ఆకర్షణ | వీరుభట్ల రామలక్ష్మమ్మ | గృహలక్ష్మి | మార్చి 1934 |
| 47 | సేవకా వృత్తి | భువనగిరి లక్ష్మీకాంతమ్మ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1934 |
| 48 | మాలపిల్ల | చర్ల సుశీల | గృహలక్ష్మి | మే 1934 |
| 49 | భారత మాత | తుమ్మల చుక్కమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1934 |
| 50 | గాంధీమహాత్మ | గార్లపాటి లక్ష్మీగంగమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1934 |
| 51 | సతులవెతలు | చీమకుర్తి సత్యవతీ దేవి | వాసవి | జనవరి 1935 |
| 52 | స్త్రీవిద్యా విధానము | భువనగిరి లక్ష్మీకాంతమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1935 |
| 53 | కమలా నెహ్రూ | గార్లపాటి లక్ష్మీగంగమ్మ | గృహలక్ష్మి | మార్చి 1935 |
| 54 | వీర చంద్రావతి | చిల్కపాటి సీతాంబ | గృహలక్ష్మి | మార్చి 1935 |
| 55 | లెమ్మోయి లెమ్మోయి | పోతుల జయలక్ష్మి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 56 | మహిళా ప్రబోధము | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్రభూమి | సెప్టెంబరు 1935 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **కవితలు** | | |
| 57 | నీ కర్తవ్యము | జుఠావల్లభుల వెంకటరత్నమ్మ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1936 |
| 58 | మేలుకొలుపు | తల్లాప్రగడ విశ్వసుందరమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1936 |
| 59 | ప్రబోధము | సమయమంత్రి రాజ్యలక్ష్మమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1936 |
| 60 | చదువుచెప్పింపతల్లిరో | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1936 |
| 61 | ప్రబోధము | పి. కమలాదేవి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1937 |
| 62 | కులము కులమందువేటికి తెలుగు బిడ్డ | కోకా హనుమాయమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1937 |
| 63 | ప్రబోధము | బులుసు అన్నపూర్ణ | గృహలక్ష్మి | నవంబరు 1937 |
| 64 | సుపుత్రికా జననము | సామవేదుల చిరంజీవమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1938 |
| 65 | ప్రబోధము | వీరపనేని సరోజనీదేవి | గృహలక్ష్మి | ఆగష్టు 1938 |
| 66 | అబల కాదు సబల | వల్లభనేని రంగా దేవి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1939 |
| 67 | ఉద్బోధము | పి.కామాక్షమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1939 |
| 68 | రాష్ట్ర ప్రబోధము | దేశిరాజు భారతీ దేవి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1940 |
| 69 | స్త్రీ స్వాతంత్ర్యం | కాంచనపల్లి కనకాంబ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1940 |
| 70 | మహిళా–మహత్తు | వల్లభనేని రంగా దేవి | గృహలక్ష్మి | జూన్ 1940 |
| 71 | అబలలము కాము | వక్కలంక రామాబాయి | గృహలక్ష్మి | జూన్ 1940 |
| 72 | దేశభక్తి | గంటి కృష్ణవేణమ్మ | గృహలక్ష్మి | జులై 1940 |
| 73 | క్షమార్పణ | కొండపల్లి సుభద్రాంబ | గృహలక్ష్మి | ఆగష్టు 1940 |
| 74 | గీతా | స్థానాపతి రుక్మిణమ్మ | భారతి | సెప్టెంబరు 1940 |
| 75 | దేశసేవిక | మధురాపంతుల విజయలక్ష్మి | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 76 | పతాక సందేశము | వేదవల్లి తాయారమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 77 | అంజలి | చేబ్రోలు సరస్వతీ దేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 78 | పయనము గండి | అడుసుమల్లి సరస్వతీ దేవి | గృహలక్ష్మి | మార్చి 1941 |
| 79 | జయ హే భారతమాత | వీరమాచనేని సరోజనీ | విజయగీతావళి ప్రజాశక్తి ప్రచురణలు | 1943 |
| 80 | మనది భారతదేశం | లలిత ప్రజాశక్తి కార్యాలయం | స్త్రీల పాటలు | 1943 |
| 81 | ప్రబోధ గీతాలు | వట్టికొండ విశాలాక్షి | స్వీయప్రచురణ | 1943 |
| 82 | ఛలో వీర యువతి | వట్టికొండ విశాలాక్షి | స్వీయప్రచురణ | సెప్టెంబరు 1943 |
| 83 | భవిష్యత్తు | వట్టికొండ విశాలాక్షి | భారతి | జులై 1945 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| **కవితలు** | | | | |
| 86 | శపథము | వట్టికొండ విశాలాక్షి | తెలుగు తల్లి | మార్చి 1946 |
| 87 | ఆశయము | అవ్వాడి పూర్ణ | గృహలక్ష్మి | మార్చి 1947 |
| 88 | మహోదయము | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1947 |
| 89 | భారతీ నక్షత్ర మాలిక | భారతీ రత్నాకరాంబ | భారతి | సెప్టెంబరు 1947 |
| 90 | హెచ్చరిక | చేజేర్ల రామరత్నమ్మ | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 91 | ఉప్పుసత్యాగ్రహము | రాజేశ్వరి | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 92 | స్త్రీవిద్య | భువనగిరి లక్ష్మాకాంతమ్మ | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 93 | మహిళాసభల గురించి | కాంచనపల్లి కనకమ్మ | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 94 | మహిళ | మోద ప్రసూనాంబ | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 95 | ప్రబోధము | కల్వాల పార్వతీదేవి | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 96 | బీదరికం | వెలువోలు వసంతాదేవి | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 97 | అబలలము కాము | తల్లాప్రగడ విశ్వసుందరమ్మ | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 98 | స్త్రీవిద్య | కొటికలపూడి సీతమ్మ | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| 99 | అన్నపూర్ణ సుభాషిత రత్నావళి | అయితం ఇందిర, భారతిదేవి | ఆంధ్రకవయిత్రులు | 1953 పబ్లికేషన్ |
| **కీర్తనలు** | | | | |
| 1 | కీర్తన | నుదురుపాటి లక్ష్మీనరసమ్మ | హిందూసుందరి | మే 1905 |
| 2 | కీర్తన | దె. సుబ్బలక్ష్మి | హిందూసుందరి | సెప్టెంబరు 1914 |
| 3 | కరుణపరిదేవనము | కోమలమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1933 |
| **లేఖలు** | | | | |
| 1 | ఆచంట లక్ష్మీపతి గారికి రాయబడిన లేఖ | దామెర్ల సీతమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి 1912 |
| 2 | శారదకు ప్రత్యుత్తరము | ధర్మవరం లక్ష్మీదేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 3 | శారద లేఖలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |
| 4 | కల్పలత లేఖలు | పులవర్తి కమలావతీదేవి | వాసవి | ఆగష్టు 1932 |
| 5 | కల్పలత లేఖలు | పులవర్తి కమలావతీదేవి | వాసవి | మార్చి 1933 |
| 6 | శారద లేఖలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జనవరి 1934 |
| 7 | కమలకు | సి.వి. రమణమ్మ | గృహలక్ష్మి | మే 1938 |
| 8 | కమలకు | సి.వి.రమణమ్మ | గృహలక్ష్మి | జూన్ 1938 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **లేఖలు** | | |
| 9 | కమలకు | పాకల రాజామణి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1938 |
| 10 | శారద లేఖలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జూన్ 1940 |
| 11 | శారద లేఖలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జనవరి 1947 |
| 12 | శారద లేఖలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| | | **వ్యాసాలు** | | |
| 1 | దివ్యజ్ఞాన సమాజం–అనిబిసెంటు | దామెర్ల సీతమ్మ | జనానా | మార్చి 1900 |
| 2 | కన్యామహావిద్యాలయము | పత్రికాధిపులు | జనానా | జూన్ 1900 |
| 3 | అతి బాల్యవివాహఫలితములు | పత్రికాధిపులు | జనానా | జూన్ 1900 |
| 4 | స్త్రీలకు రాజకార్యవిషయములు | పత్రికాధిపులు | జనానా | జూన్ 1900 |
| 5 | గుండు అచ్చమాంబ | పత్రికాధిపులు | జనానా | జులై–ఆగష్టు 1900 |
| 6 | పుల్లాబట్ల పార్వతమ్మ | పత్రికాధిపులు | జనానా | అక్టోబరు 1900 |
| 7 | స్త్రీవిద్య యొక్క ప్రస్తుత పరిస్థితి | పత్రికాధిపులు | జనానా | జనవరి 1901 |
| 8 | కమలాంబ సత్యానాథం | పత్రికాధిపులు | జనానా | ఏప్రిల్ 1901 |
| 9 | హిందూసుందరి పత్రిక | పత్రికాధిపులు | జనానా | మే 1901 |
| 10 | గుణవతియగు స్త్రీ | భండారు అచ్చమాంబ | జనానా | మే 1901 |
| 11 | స్త్రీవిద్యను గురించిన తీర్మానములు | పి.కౌసల్య | జనానా | జూన్ 1901 |
| 12 | సత్యము | కొటికలపూడి సీతమ్మ | కలావతి | ఆగష్టు 1901 |
| 13 | కృతి విమర్శనము | పత్రికాధిపులు | జనానా | సెప్టెంబరు 1901 |
| 14 | దైవభక్తి | కొటికలపూడి సీతమ్మ | కలావతి | సెప్టెంబరు 1901 |
| 15 | స్త్రీవిద్యాభిమానులకు విన్నపం | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | జనవరి 1902 |
| 16 | విద్యాధికులగు హిందూ పురుషులకు విన్నపం | సత్యవతి | జనానా | ఏప్రిల్ 1902 |
| 17 | స్త్రీవిద్యావిజయవార్త | పులగుర్త లక్ష్మీ నరసమాంబ | హిందూసుందరి | ఏప్రిల్ 1902 |
| 18 | కృతి విమర్శనము | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | జులై 1902 |
| 19 | స్త్రీలు గమనింపవలసిన కొన్ని యంశాలు–పరోపకార చింత | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | సెప్టెంబరు 1902 |
| 20 | భండారు అచ్చమాంబ | సంపాదకులు | హిందూసుందరి | సెప్టెం–అక్టోబరు 1902 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | వ్యాసాలు | | |
| 21 | దక్షిణదేశపు, మనదేశపు స్త్రీల తారతమ్యము | ఓరుగంటి ఆదెమ్మ | హిందూసుందరి | అక్టోబరు 1902 |
| 22 | స్త్రీవిద్యాభిమానులకు విన్నపం | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | జనవరి 1903 |
| 23 | గృహిణీ-ధర్మములు | భండారు అచ్చమాంబ | హిందూసుందరి | ఏప్రిల్ 1903 |
| 24 | స్త్రీనీతిని | ఒక సుందరి | హిందూసుందరి | ఏప్రిల్ 1903 |
| 25 | పత్రికా సహపాఠినులకొక విజ్ఞాపనము | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | ఏప్రిల్ 1903 |
| 26 | హిందూ స్త్రీల గుట్టు | గంటి జోగమాంబ | హిందూసుందరి | ఏప్రిల్ 1903 |
| 27 | సాధువర్తనం | పుల్లాభట్ల కౌసల్య | హిందూసుందరి | మే 1903 |
| 28 | దేశాభిమానంగల స్త్రీలకొక ప్రార్థన | గొడవర్తి బంగారమ్మ | హిందూసుందరి | జూన్ 1903 |
| 29 | చెన్నపురి జనాభా లెక్కలు- స్త్రీవిద్య | పత్రికాధిపులు | జనానా | ఆగష్టు 1903 |
| 30 | స్త్రీ విద్యాశాతం | పత్రికాధిపులు | జనానా | ఆగష్టు 1903 |
| 31 | మనకు బలము కలుగుటెట్లు | వి. సీతమ్మ | హిందూసుందరి | నవంబరు 1903 |
| 32 | సమాజలాభము | వెంపల శాంతాబాయి | హిందూసుందరి | నవంబరు 1903 |
| 33 | దేవునియెడలమనము చెల్లించవలసిన విధులు | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | జనానా | జనవరి 1904 |
| 34 | కొటికలపూడి సీతమ్మ | సంపాదకులు | హిందూసుందరి | ఫిబ్రవరి 1904 |
| 35 | కాలము సద్వినియోగమునకు తెచ్చుటెట్లు | బుచ్చిబంగారమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి 1904 |
| 36 | ఐకమత్యం | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | హిందూసుందరి | మార్చి 1904 |
| 37 | కొటికలపూడి సీతమ్మ | కందుకూరి రాజ్యలక్ష్మి | హిందూసుందరి | మార్చి 1904 |
| 38 | స్త్రీవిద్య | పత్రికాధిపులు | జనానా | మే 1904 |
| 39 | స్త్రీవిద్య | కొలిచిన కాంతమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1904 |
| 40 | వెలిభయంలేని సంస్కరణ | దామెర్ల సీతమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1904 |
| 41 | పూర్వకాలపు హిందూస్త్రీలస్థితి | మొసలిగంటి రామాబాయమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1904 |
| 42 | స్త్రీవిద్య | గాదె వెంకట లక్ష్మీ నరసమ్మ | హిందూసుందరి | అక్టోబరు- నవంబరు 1904 |
| 43 | భండారు అచ్చమాంబ | పత్రికాధిపులు | హిందూసుందరి | డిసెంబరు-జనవరి 1904-05 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | వ్యాసాలు | | |
| 44 | భండారు అచ్చమాంబ | పత్రికాధిపులు | జనానా | ఫిబ్రవరి 1905 |
| 45 | బృందావన స్త్రీసమాజంలో స్త్రీవిద్య | మోటుపల్లి రాజాబాయమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి-మార్చి 1905 |
| 46 | స్త్రీవిద్య | నూలు సత్యవతమ్మ | హిందూసుందరి | ఫిబ్ర-మార్చి1905 |
| 47 | మన హిందూవితంతువుల దుస్థితి | వారణాసి కామేశ్వరి | హిందూసుందరి | ఏప్రిల్ 1905 |
| 48 | దేశాభిమానం | కొలిచిన కాంతమ్మ | హిందూసుందరి | ఏప్రిల్ 1905 |
| 49 | ఐకమత్యం బృందావన స్త్రీసమాజము | మోటుపల్లి రామాబాయమ్మ | బాలసరస్వతి | జులై 1905 |
| 50 | ఆస్కా స్త్రీ సమాజం | బుర్రా బుచ్చి బంగారమ్మ | సావిత్రి | సెప్టెం- అక్టోబరు 1905 |
| 51 | వితంతు కేశఖండనం | మోటుపల్లి రామాబాయమ్మ | హిందూసుందరి | అక్టోబరు- నవంబరు 1905 |
| 52 | 19 వ సంఘసంస్కరణ మహాసభ | పత్రికాధిపులు | సువరణలేఖ | జనవరి 1906 |
| 53 | పురాతన హిందూసుందరులు | పత్రికాధిపులు | సువర్ణలేఖ | మార్చి 1906 |
| 54 | హిందూస్త్రీల ముఖ్యవిధులు | పత్రికాధిపులు | జనానా | ఏప్రిల్ 1906 |
| 55 | విద్యాభిలాష గల ఓ బాలికామణులారా | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1906 |
| 56 | స్త్రీవిద్య | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | జనవరి 1907 |
| 57 | హిందూస్త్రీల సభ | ఒకానొకరు | జనానా | ఏప్రిల్ 1907 |
| 58 | స్త్రీ సహాయం | పత్రికాధిపులు | హిందూసుందరి (జనానా) | ఏప్రిల్ 1907 |
| 59 | విద్యవలని లాభాలు | దామెర్ల సీతమ్మ | సావిత్రి | జులై 1907 |
| 60 | ఐకమత్యం | జూలూరి తులశమ్మ | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1910 |
| 61 | స్వధర్మసేవ | పులుగుర్త లక్ష్మీనరసమ్మ | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1910 |
| 62 | స్త్రీలు పత్రికా రంగం | పత్రికాధిపులు | సావిత్రి | జులై 1910 |
| 63 | స్త్రీవిద్య | చిన్నారప్పగారి వెంకమ్మ | హిందూసుందరి | జులై 1910 |
| 64 | ప్రస్తుత తెలుగుస్త్రీల విద్యాస్థితి | పత్రికాధిపులు | సావిత్రి | జులై 1910 |
| 65 | స్త్రీలకు ఓట్లు | సంపాదకులు | హిందూసుందరి | ఆగష్టు 1910 |
| 66 | బహుమానపు హెచ్చరిక | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1910 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 67 | పూర్వస్త్రీల ఔన్నత్యము | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1910 |
| 68 | కందుకూరి రాజ్యలక్ష్మి | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1910 |
| 69 | స్త్రీవిద్య | జూలూరి తులసమ్మ | హిందూసుందరి | అక్టోబరు 1910 |
| 70 | కళ్ళేపల్లి వెంకట రమణమ్మ | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | డిసెంబరు 1910 |
| 71 | ఆంధ్రమహిళాసభ | పులుగుర్త లక్ష్మీనరసమ్మ | సువర్ణలేఖ | డిసెంబరు 1910 |
| 72 | బృదావనపుర స్త్రీసమాజము | పత్రికాధిపులు | సావిత్రి | జనవరి 1911 |
| 73 | నవీననారీ రత్నాలు | సోదరి | హిందూసుందరి | జనవరి 1911 |
| 74 | విద్యావశ్యకత | పిళ్ళారిశెట్టి లక్ష్మీకాంతమ్మ | హిందూసుందరి | జనవరి 1911 |
| 75 | బృందావనపుర స్త్రీసమాజము | పత్రికాధిపులు | సావిత్రి | జనవరి 1911 |
| 76 | స్త్రీవిద్య | అనాసవరపు సీతారావమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి 1911 |
| 77 | శాస్త్రములు స్త్రీలకావశ్యకమా | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | మార్చి 1911 |
| 78 | స్త్రీవిద్య | కమ్మచన్నారప్ప వెంకమ్మ, పూర్ణమ్మ | హిందూసుందరి | మార్చి 1911 |
| 79 | స్త్రీ ఉన్నతవిద్య | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | ఏప్రిల్ 1911 |
| 80 | హిందూ స్త్రీల ప్రస్తుతస్థితి | మామిడన్న కామేశ్వరమ్మ | ఆంధ్రపత్రిక- ఉగాదిసంచిక | ఏప్రిల్ 1911 |
| 81 | ఎవరెక్కువ స్త్రీలా, పురుషులా | మాడభూషి సీతమ్మ | ఆంధ్రపత్రిక- ఉగాదిసంచిక | ఏప్రిల్ 1911 |
| 82 | హిందూదేశాభ్యుదయానికి స్త్రీలెట్లుతోడ్పడగలరు | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | ఆంధ్రపత్రిక- ఉగాదిసంచిక | ఏప్రిల్ 1911 |
| 83 | దామెర్ల సీతమ్మ | పత్రికాధిపులు | హిందూసుందరి | మే 1911 |
| 84 | మహిళామృదువాణి | పత్రికాధిపులు | సువర్ణలేఖ | మే,జూన్ 1911 |
| 85 | శ్రీమతి కాళహస్తి అలమేలుమంగమ్మ | సుభద్ర | హిందూసుందరి | జూన్ 1911 |
| 86 | నీతివిద్య బోధించుటకు జాతిమతములావశ్యకమా | మాడభూషి చూడమ్మ | హిందూసుందరి | జులై 1911 |
| 87 | మనుధర్మశాస్త్రములోని స్త్రీలయాచారములు | దామెర్ల సీతమ్మ | హిందూసుందరి | జులై 1911 |
| 88 | పులుగుర్త లక్ష్మీనరసమాంబ కొక విన్నపము | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1911 |
| 89 | వివాహములు | గూడపాటి లక్ష్మీనరసమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1911 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 90 | వితంతు శిరోముండనము | పిల్లలమర్రి కామేశ్వరమ్మ | హిందూసుందరి | ఆగష్టు 1911 |
| 91 | హైందవయువతీ పతనము | గూడపాటి లక్ష్మీనరసమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1911 |
| 92 | పరీక్షాప్రయోజనము | మామిడన్న కామేశ్వరమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1911 |
| 93 | స్త్రీపునర్వివాహములు | ఉప్పలూరి నాగరత్నమ్మ | హిందూసుందరి | అక్టో– నవం1911 |
| 94 | పునర్వివాహితులు | బుచ్చి బంగారమ్మ కులాంగనలేనా | హిందూసుందరి | అక్టో–నవంబరు 1911 |
| 95 | హైందవయువతీపతనము | గూడపాటి లక్ష్మీనరసమ్మ | విజ్ఞానవల్లరి | డిశెంబరు 1911 |
| 96 | స్త్రీవిద్యావిషయము | దామెర్ల సీతమ్మ | హిందూసుందరి | జనవరి 1912 |
| 97 | హిందూసోదరులకు విన్నపము | పెద్దచిగుర్లరేవు వెంకమ్మ, పేరమ్మ | హిందూసుందరి | జనవరి 1912 |
| 98 | హిందూస్త్రీల ప్రస్తుతపు స్థితి | మందపాటి భారతమ్మ | హిందూసుందరి | జనవరి 1912 |
| 99 | స్త్రీలకు ఇంగ్లీషువిద్య అవసరమా | సుభద్ర | హిందూసుందరి | ఫిబ్రవరి 1912 |
| 100 | స్త్రీవిద్య, వివాహమునకు తగినవయస్సు | ఆచంట రుక్మిణి | హిందూసుందరి | ఫిబ్రవరి 1912 |
| 101 | ఆచంట రుక్మిణమ్మ | పత్రికాధిపులు | హిందూసుందరి | ఫిబ్రవరి 1912 |
| 102 | రజస్వలానంతరము వివాహములు | మొసలిగంటి రామాబాయమ్మ | హిందూసుందరి | మార్చి 1912 |
| 103 | ఆంధ్రస్త్రీల స్థితి | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | ఆంధ్రపత్రిక– ఉగాదిసంచిక | ఏప్రిల్ 1912 |
| 104 | స్త్రీవిద్య ఎట్లున్నది | దామెర్ల సీతమ్మ | వివేకవతి | ఏప్రిల్ 1912 |
| 105 | స్త్రీవిద్యకు భంగకరమగు వైవాహిక ధర్మములు తొలగించు ఉపాయములు | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | హిందూసుందరి | మే 1912 |
| 106 | హిందూ స్త్రీల దుస్థితి | జూలూరి తులశమ్మ | హిందూసుందరి | జులై 1912 |
| 107 | ఆచంట రుక్మిణమ్మ | పత్రికాధిపులు | హిందూసుందరి | ఆగష్టు 1912 |
| 108 | ఆచంట రుక్మిణమ్మ | పత్రికాధిపులు | వివేకవతి | ఆగష్టు 1912 |
| 109 | ఉపన్యాసం | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1912 |
| 110 | స్త్రీలను బాలికలను రక్షించుట | సంపాదకులు | హిందూసుందరి | అక్టోబరు 1912 |
| 111 | స్త్రీలకు ఉన్నతవిద్య | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | సావిత్రి | అక్టోబరు 1912 |
| 112 | స్త్రీవిద్య | చిల్లంబి త్రిపురసుందరమ్మ | హిందూసుందరి | నవంబరు 1912 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 113 | భక్తి జ్ఞాన వైరాగ్య స్త్రీ సమాజము | ఇప్పగుంట వెంగమాంబ | హిందూసుందరి | నవంబరు 1912 |
| 114 | ఆంధ్రయోగినీమణులు | కళ్ళేపల్లె వెంకటరమణమ్మ | హిందూసుందరి | డిసెంబరు 1912 |
| 115 | ఉప్పలూరి నాగరత్నమ్మ | వివేకవతి | హిందూసుందరి | మార్చి 1913 |
| 116 | స్త్రీల ముఖ్య విధులు | వింజమూరి వెంకటరత్నమ్మ | హిందూసుందరి | జూన్ 1913 |
| 117 | శ్రీమతి కె.కనకమ్మగారి చరిత్రము | సంపాదకులు | హిందూసుందరి | జులై 1913 |
| 118 | సత్కార్యోత్సాహము | కొటికలపూడి సీతమ్మ | హిందూసుందరి | జులై 1913 |
| 119 | బాలికా వివాహములు | ఆదుర్తి భాస్కరమ్మ | హిందూసుందరి | జులై–ఆగష్టు 1913 |
| 120 | కాంచనపల్లి కనకమ్మ | పత్రికాధిపులు | వివేకవతి | సెప్టెంబరు 1913 |
| 121 | మన అభివృద్ధి ఎట్లు | దేవరకొండ వెంకట సుబ్బమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1913 |
| 122 | అనాథ స్త్రీ విద్యాభివృద్ధి | వై.వి. రంగనాయకమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1913 |
| 123 | వివేకము | కాంచనపల్లి కనకాంబ | వివేకవతి | సెప్టెంబరు 1913 |
| 124 | అవున్నత్యము | బులుసు సూరమ్మ | హిందూసుందరి | అక్టోబరు 1913 |
| 125 | ప్రస్తుతోన్నత విద్య | పులివర్తి ఈశ్వరమ్మ | హిందూసుందరి | జనవరి 1914 |
| 126 | నవీనోద్యమము | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | మార్చి 1914 |
| 127 | ఆంధ్ర ఉద్యమం | యమ్.సుశీల | ఆంధ్రపత్రిక–ఉగాదిసంచిక | ఏప్రిల్ 1914 |
| 128 | విద్యావశ్యకత | కె. కనకమ్మ | హిందూసుందరి | ఏప్రిల్ 1914 |
| 129 | స్త్రీ విద్యా విధానము | చట్రాతి లక్ష్మీనరసమ్మ | హిందూసుందరి | జూన్ 1914 |
| 130 | స్త్రీవిద్య | జూలూరి తులసమ్మ | హిందూసుందరి | జులై 1914 |
| 131 | స్త్రీవిద్య | వెన్నా మంగ తాయారమ్మ | హిందూసుందరి | అక్టోబరు 1914 |
| 132 | దేశభక్తి | పెండ్యాల బాలా త్రిపురసుందరమ్మ | హిందూసుందరి | అక్టోబరు 1914 |
| 133 | స్త్రీవిద్య | దామెర్ల భ్రమరాంబిక | హిందూసుందరి | జనవరి 1915 |
| 134 | ఆర్.యన్.సుబ్బలక్ష్మమ్మ | సంపాదకులు | హిందూసుందరి | ఫిబ్రవరి 1915 |
| 135 | స్త్రీవిద్య | కాంచనపల్లి కనకమ్మ | హిందూసుందరి | మార్చి 1915 |
| 136 | విజ్ఞానచంద్రికా పరీక్షలు | ఎర్రగుంట్ల జనార్ధనమ్మ | వివేకవతి | మార్చి 1915 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 137 | స్త్రీవిద్య | ఆకెళ్ళ కామేశ్వరమ్మ | హిందూసుందరి | జూన్-జులై 1915 |
| 138 | విద్యార్థినీ సమాజము | సంపాదకులు | హిందూసుందరి | జులై 1915 |
| 139 | స్త్రీవిద్య | మంతిని వెంకటరమణమ్మ | వివేకవతి | జులై 1915 |
| 140 | విద్యామూల్యత | జూలూరి తులశమ్మ | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1916 |
| 141 | స్త్రీస్వతంత్ర జీవనావశ్యకత | చాట్రాతి లక్ష్మీనరసమ్మ | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1916 |
| 142 | హైందవస్త్రీలు దేశసేవ | యమ్.యన్.కమల | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1917 |
| 143 | స్త్రీవిద్యావశ్యకత | కాంచనపల్లి కనకాంబ | హిందూసుందరి | మే 1917 |
| 144 | ఉన్నత విద్య | ఎర్రగుంట్ల జనార్థనమ్మ | హిందూసుందరి | మే 1917 |
| 145 | అష్టమాంధ్ర మహిళా సభ | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | జూన్ 1917 |
| 146 | హిందూస్త్రీల పవిత్ర ధర్మములు | పొణకా కనకమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1917 |
| 147 | ఆంధ్ర స్త్రీల విద్యాస్థితి | కాశీనాథుని రామాబాయమ్మ | హిందూసుందరి | సెప్టెంబరు 1917 |
| 148 | వితంతువులకొక విన్నపము | వాడ్రేవు సుందరమ్మ | వివేకవతి | అక్టోబరు 1917 |
| 149 | హిందూ స్త్రీ పవిత్ర ధర్మములు | పొణకా కనకమ్మ | హిందూసుందరి | నవంబరు 1917 |
| 150 | సంఘసంస్కరణవిషయములు | వాడ్రేవు సుందరమ్మ | వివేకవతి | నవంబరు 1917 |
| 146 | ఆంధ్ర మహిళా సమాజము | దేవరాజు వెంకటరత్నమ్మ | అనసూయ | మార్చి 1918 |
| 147 | సంఘసంస్కరణవిషయములు | వాడ్రేవు సుందరమ్మ | వివేకవతి | ఏప్రిల్-మే 1918 |
| 148 | స్త్రీ స్వాతంత్ర్యం | కనుపర్తి వరలక్ష్మమ్మ | అనసూయ | సెప్టెంబరు 1918 |
| 149 | స్త్రీలుపురుషులకంటే తక్కువవారా | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | సెప్టెంబరు 1918 |
| 150 | స్త్రీనియోజక స్వాతంత్ర్యం | జరుగుమిల్లి రామాబాయమ్మ | అనసూయ | జులై 1919 |
| 151 | సుకుమారము | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | జులై- ఆగ1919 |
| 152 | స్త్రీవిద్య | గోపీశెట్టి సూర్యనారాయణమ్మ | అనసూయ | నవం-డిసెం1919 |
| 153 | దేశాభివృద్ధి కరణమార్గము | దేశిరాజు లక్ష్మీబాయమ్మ | అనసూయ | ఏప్రిల్, మే, జూన్ 1920 |
| 154 | స్త్రీల స్థితిని అభివృద్ధి చేయు మార్గము | ఆలమూరి వీరలక్ష్మమ్మ | వివేకవతి | జూన్ 1920 |
| 155 | బాల్యవివాహములు | పత్రికాధిపులు | వివేకవతి | జులై 1920 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 156 | హిందూబాలికల యాటలలోని తత్వము | వింజమూరి వెంకటరత్నమ్మ | వివేకవతి | ఆగష్టు 1920 |
| 157 | స్వయంవరవివాహములు | కృ.వేం.లక్ష్మమ్మ | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1921 |
| 158 | స్త్రీధర్మము | సంపాదకురాలు | స్త్రీధర్మ | ఏప్రిల 1924 |
| 159 | వృత్తాంతములు -వ్యాఖ్యలు | సంపాదకురాలు | స్త్రీధర్మ | ఏప్రిల్ 1924 |
| 160 | స్త్రీల విద్యా పరిస్థితి | ప్రయాగ గంగాభవానమ్మ | అనసూయ | మే 1924 |
| 161 | స్త్రీసమాజ నివేదిక ప్రశంసము | కోటా లక్ష్మీనరసమ్మ | అనసూయ | మే 1924 |
| 162 | స్త్రీవిద్య | కోట లలిత | స్త్రీధర్మ | మే 1924 |
| 163 | అబలాభివర్ధినీ సమాజము | ఆర్. సోనాబాయమ్మ | స్త్రీధర్మ | మే 1924 |
| 164 | వృత్తాంతములు-వ్యాఖ్యలు | సంపాదకురాలు | స్త్రీధర్మ | మే 1924 |
| 165 | స్త్రీ సంతానమూ లేక పురుషసంతానముకోరదగినది | వింజమూరి వెంకటరత్నమ్మ | అనసూయ | జులై 1924 |
| 166 | వృద్ధ వివాహము | జరుగుమిల్లి రామాబాయమ్మ | అనసూయ | జులై 1924 |
| 167 | వివేకానందస్వామి ఉపన్యాసము | పి.కమలమ్మ | అనసూయ | జులై 1924 |
| 168 | పొణకా కనకమ్మ | పత్రికాధిపులు | అనసూయ | ఆగషు 1924 |
| 169 | దామరాజు సుందరమ్మ | కొటికలపూడి సీతమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1924 |
| 170 | స్త్రీలకు ఉద్యోగము | గుడిపూడి ఇందుమతీదేవి | అనసూయ | నవంబరు 1924 |
| 171 | నిర్బంధవిద్య | సంపాదకురాలు | స్త్రీధర్మ | డిశెంబరు 1924 |
| 172 | స్త్రీవిద్య | వి.పద్మ | స్త్రీధర్మ | డిశెంబరు 1924 |
| 173 | స్వరాజ్య సంపాదనయందు స్త్రీలవిద్యుక్తధర్మము | పులవర్తి కమలావతీదేవి | ఆంధపత్రిక-ఉగాదిసంచిక | మార్చి 1925 |
| 174 | స్త్రీవిద్య | ఎ.ఎల్.బైడికోపర్ | స్త్రీధర్మ | జూ౧ 1926 |
| 175 | వృత్తాంతములు-వ్యాఖ్యలు | సంపాదకురాలు | స్త్రీధర్మ | జూన్ 1926 |
| 176 | వృత్తాంతములు-వ్యాఖ్యలు | సంపాదకురాలు | స్త్రీధర్మ | అక్టోబరు 1926 |
| 177 | బాలికలు-లోకసేవ | రొట్టెకల్ సుబ్బమ్మ | భారతి | జూన్ 1927 |
| 178 | అతి బాల్యవివాహము | ఆ.భాస్కరమ్మ | భారతి | డిసెంబరు 1927 |
| 179 | ఉమెన్స్ డే సభ | పత్రికాధిపులు | హిందూసుందరి | ఫిబ్రవరి 1928 |
| 180 | ఆంధ్రరాష్ట్ర మహిళా విద్యాసంస్కరణ సభ | మల్లి మడుగుల ఉపనిషద్దేవి | హిందూసుందరి | ఫిబ్రవరి 1928 |
| | | | | |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 181 | అఖిల భారత మహిళా విద్యావిషయక సభ | సి. సుబ్బలక్ష్మి | హిందూసుందరి | ఏప్రిల్ 1928 |
| 182 | నారి | మాగంటి అన్నపూర్ణమ్మ | సమదర్శినీ ఉగాదిపత్రిక | ఏప్రిల్ 1928 |
| 183 | మాగంటి అన్నపూర్ణాదేవి | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | నవంబరు 1928 |
| 184 | బాల్యవివాహ సమస్య | గుండాల రాజామణి | గృహలక్ష్మి | మార్చి 1929 |
| 185 | స్త్రీలు-జాతీయత | పత్రికాధిపులు | గృహలక్ష్మి | మార్చి 1929 |
| 186 | స్త్రీలు రాజకీయమున పాల్గొను విధము | అయ్యదేవర బాలా త్రిపురసుందరి | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1929 |
| 187 | స్త్రీలు నాటకరంగ ప్రవేశము | పులవర్తి కమలావతీదేవి | గృహలక్ష్మి | మే 1929 |
| 188 | మదరాసు శాసనసభ యెన్నికలు | సంపాదకురాలు | స్త్రీధర్మ | మే 1929 |
| 189 | స్త్రీలు నాటకరంగ ప్రవేశము | ధర్మవరము లక్ష్మీదేవి | గృహలక్ష్మి | జూన్ 1929 |
| 190 | స్త్రీ స్వాతంత్ర్యం | పురిటి సూర్యనారాయణమ్మాళ్ | గృహలక్ష్మి | జులై 1929 |
| 191 | స్త్రీవిద్యా విజయధ్వజం | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1929 |
| 192 | స్త్రీ స్వాతంత్ర్యం | వి.సరస్వతి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1929 |
| 193 | స్త్రీలు నాటకరంగ ప్రవేశము | జాగర్లమూడి జానకమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 194 | స్త్రీ | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 195 | ఆంధ్రదేశ స్త్రీవిద్యాసంస్థలు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 196 | బాల్యవివాహాల నిషేధము | అట్లూరి వేంకటసీతమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 197 | నన్ను మరచినను దేశమును మరువవద్దు | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | భారతి | అక్టోబరు 1929 |
| 198 | స్త్రీలు గృహపరిశ్రమలు | అయ్యదేవర బాలా త్రిపురసుందరి | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 199 | హైందవ స్త్రీ సమస్య | పద్మావతి శ్రీరాం | గృహలక్ష్మి | అక్టోబరు 1929 |
| 200 | బాల్యవివాహములు | మద్దాలి సీతారామమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1929 |
| 201 | డా. కొటికల లక్ష్మమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | నవంబరు 1929 |
| 202 | గృహకృత్య విజ్ఞానము | కొడాలి సీతారామదేవి | గృహలక్ష్మి | నవంబరు 1929 |
| 203 | స్వయంకృషి-స్వతంత్ర జీవనం | కొత్తపల్లి కౌసల్యా దేవి | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |
| 204 | స్త్రీలహక్కులు-తత్స సంస్కరణలు | ఆలపాటి సీతమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 205 | వర శుల్కము | కొంగర అన్నపూర్ణ | గృహలక్ష్మి | డిసెంబరు 1929 |
| 206 | పొణకా కనకమ్మ | పత్రికాధిపులు | జమీన్‌రైతుపత్రిక | 1930 |
| 207 | ఆచంట రుక్మిణమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1930 |
| 208 | స్త్రీవిద్య | లేళ్ళ నాగభూషణమ్మ | గృహలక్ష్మి | జనవరి 1930 |
| 209 | స్త్రీవిద్య | కొత్తపల్లి లక్ష్మీకాంతమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 210 | వి. సరస్వతి గారికి | యన్. కమలావతీ దేవి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 211 | స్త్రీలకు విద్యాస్వాంత్ర్యమున యావశ్యకత | మద్దాలి సీతారామమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 212 | భరతమాతకొక జాబు | ఇల్లిందల సరస్వతీసీతారామ్ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 213 | అబలల యెడ అన్యాయములు | గుమ్మడిదల దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | మార్చి 1930 |
| 214 | స్త్రీవిద్య–దానియావశ్యకత | ముప్పలనేని పుష్కరాంబ | గృహలక్ష్మి | మార్చి 1930 |
| 215 | విడాకుల చట్టం | పులవర్తి కమలావతీదేవి | గృహలక్ష్మి | మార్చి 1930 |
| 216 | వివాహమా–విచ్ఛేదమా | పెద్దాడ కామేశ్వరి | సమదర్శిని | మార్చి 1930 |
| 217 | స్త్రీలకు నవీన చట్టములు–వాని ప్రయోజనములు | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్రపత్రిక–ఉగాదిసంచిక | ఏప్రిల్ 1930 |
| 218 | స్త్రీ అబలకాదు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1930 |
| 219 | నాల్గవ అఖిలభారతమహిళాసభ | పత్రికాధిపులు | వాసవి | ఏప్రిల్ 1930 |
| 220 | మానవ సంఘం | ఇందిరాదేవి | వాసవి | ఏప్రిల్ 1930 |
| 221 | పల్లెటూర్లు | అయ్యగారి రుక్మిణమ్మ | గృహలక్ష్మి | జూన్ 1930 |
| 222 | ప్రౌఢ వివాహముల వలన లాభ–నష్టములు | జి. వెంకమ్మ | గృహలక్ష్మి | జులై 1930 |
| 223 | దామెర్ల కమలరత్నమ్మ | పులవర్తి కమలావతీదేవి | గృహలక్ష్మి | ఆగష్టు 1930 |
| 224 | స్త్రీల కెట్టి విద్య అవసరము | యన్. రాజ్యలక్ష్మమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1930 |
| 225 | వ్యాయామవిద్య | ఆచంట రుక్మిణమ్మ | స్త్రీధర్మ | జనవరి 1931 |
| 226 | వైశ్యసేవాసదనము | పత్రికాధిపులు | వాసవి | ఫిబ్రవరి 1931 |
| 227 | హిందూదేశ ఆశయములు | దరిశి అన్నపూర్ణ | వాసవి | ఫిబ్రవరి 1931 |
| 228 | వైశ్యవితంతువుల యొక్క విద్యాభివృద్ధి | జి. శ్యామలాంబ | వాసవి | మార్చి 1931 |
| 229 | గ్రామపునర్నిర్మాణం–స్త్రీల బాధ్యత | గంటి శేషమ్మ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1931 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | వ్యాసాలు | | |
| 230 | గ్రామపునర్నిర్మాణం-స్త్రీలబాధ్యత | సమయమంత్రి రాజ్యలక్ష్మమ్మ | గృహలక్ష్మి | మే 1931 |
| 231 | గ్రామపునర్నిర్మాణం-స్త్రీలబాధ్యత | రామరాజూ మైత్రేయి | గృహలక్ష్మి | జూన్ 1931 |
| 232 | ఇంటరంటే ఏంటి | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | గృహలక్ష్మి | జూన్ 1931 |
| 233 | అఖిల ఆసియా మహా సభ | కోకా భానుమతి | గృహలక్ష్మి | జూన్ 1931 |
| 234 | ఆశ్రమములో- ఋషులు | బత్తుల కామాక్షమ్మ | వాసవి | జులై 1931 |
| 235 | ఆచంట రుక్మిణమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జులై 1931 |
| 236 | శీరం సుభద్రాంబ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జులై 1931 |
| 237 | స్త్రీలు క్షయరోగం | పరుచూరి భువనేశ్వరీ దేవి | గృహలక్ష్మి | జులై 1931 |
| 238 | దుర్గాబాయమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 239 | ఆంధ్ర స్త్రీజనోద్ధారకుడు | పాలపర్తి సరోజనీదేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 240 | స్త్రీల చరిత్ర ఎవరునెరగరు | పేరి అన్నపుర్ణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 241 | స్త్రీలయాధిక్యత | చావలి అన్నపూర్ణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 242 | దరిశి అన్నపూర్ణమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1932 |
| 243 | శారదానికేతనమునందు వైశ్యబాలికరజస్వలఅగుట | తూనుగుంట్ల వెంకటసుబ్బమ్మ | వాసవి | ఫిబ్రవరి 1932 |
| 244 | ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభ విశేషాలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1932 |
| 245 | అసెంబ్లీసభ స్త్రీల సమస్యలు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | మార్చి 1932 |
| 246 | చోరగూడి సీతమ్మ వరలక్ష్మమ్మ | కనుపర్తి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1932 |
| 247 | స్వర్గీయ అన్నపూర్ణా దేవి | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | ఆనందబోధిని | ఏప్రిల్ 1932 |
| 248 | హిందూ వితంతువులు | పరిమి సీతామణి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1932 |
| 249 | జాతీయఆరోగ్యము స్త్రీలకర్తవ్యము | పాలపర్తి సరస్వతి | గృహలక్ష్మి | మే 1932 |
| 250 | ఆంధ్రరాష్ట్రములో స్త్రీలు | కొప్పర్తి కృష్ణవేణి | గృహలక్ష్మి | మే 1932 |
| 251 | లోకల్ బోర్డులు-స్త్రీలు | చిలుకూరి లక్ష్మీనరసమ్మ | భారతి | జులై 1932 |
| 252 | లోకల్ బోర్డులు-స్త్రీలు | చిలుకూరి లక్ష్మీనరసమ్మ | గృహలక్ష్మి | జులై 1932 |
| 253 | అసహాయ మహిళా గృహాల ఆవశ్యకత | కమలారత్నమ్మ | గృహలక్ష్మి | జులై 1932 |
| 254 | స్త్రీలు భీమా సమస్య | మనపాకం కమలమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1932 |
| 255 | మద్రాసు విశ్వవిద్యాలయం-స్త్రీ పట్టభద్రులు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | సెప్టెంబరు 1932 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 256 | స్త్రీ సమాజములు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1932 |
| 257 | ఇంకనెంతకాలముండునా | వలివెల శాతమ్మ | గృహలక్ష్మి | జనవరి 1933 |
| 258 | స్త్రీలు బ్రహ్మసమాజము | పాకాల సౌభాగ్యవతి | గృహలక్ష్మి | జనవరి 1933 |
| 259 | అస్పృశ్యత | చిలకపాటి భారతీ దేవి | గృహలక్ష్మి | జనవరి 1933 |
| 260 | స్త్రీలు వార్తా పత్రికనిర్వహణము | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1933 |
| 261 | పిఠాపురం మహారాణి | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | మార్చి 1933 |
| 262 | పంచములు | స్థానాపతి రుక్మిణమ్మ | గృహలక్ష్మి | మార్చి 1933 |
| 263 | గ్రామపునర్నర్మాణంలో స్త్రీలు | దేశిరాజు భారతీ దేవి | ఆంధ్రపత్రిక-ఉగాదిసంచిక | ఏప్రిల్ 1933 |
| 264 | అస్పృశ్యతా నివారణము-స్త్రీల విధికృత్యములు | మందా ముత్యాలమ్మ | గృహలక్ష్మి | మే 1933 |
| 265 | తెల్ల కాగితములు-నల్ల అక్షరములు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | మే 1933 |
| 266 | స్త్రీలు రాజకీయ వ్యవహారములో పాల్గొనగలరా? | మద్దింశెట్టి తిరునాథమ్మ | గృహలక్ష్మి | మే 1933 |
| 267 | అస్పృశ్యతా నిర్మూలన | దేశిరాజు భారతీ దేవి | గృహలక్ష్మి | మే 1933 |
| 268 | కనుపర్తి వరలక్ష్మమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | సెప్టెంబరు 1933 |
| 269 | స్త్రీలకర్తవ్యము | వింజమూరి వెంకటరత్నమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1933 |
| 270 | రాజారామమోహనరాయ్ | చుండూరి రత్నమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1933 |
| 271 | ఆంధ్రమహిళా సభ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | నవంబరు 1933 |
| 272 | కందుకూరి శ్రీమహాలక్ష్మమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | నవంబరు 1933 |
| 273 | బాల్యవివాహములు | వేదవల్లి తాయారమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1933 |
| 274 | గాదె చూడికుదుత్తమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1934 |
| 275 | స్త్రీ మహిమ | చిల్కపాటి సీతాంబ | గృహలక్ష్మి | జనవరి 1934 |
| 276 | చుండూరి రత్నమాంబ గారు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1934 |
| 277 | స్త్రీతత్వం | నండూరి సుబ్బలక్ష్మీ దేవి | గృహలక్ష్మి | మార్చి 1934 |
| 278 | సుశీల రజస్వలానంతర వివాహము | మద్దుల దమయంతి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1934 |
| 279 | కనుపర్తి వరలక్ష్మమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఏప్రిల్ 1934 |
| 280 | కొటికలపూడి సీతమ్మ | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జూన్ 1934 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 281 | భారతనారీమణుల భావికర్తవ్యం | ప్రేమాదేవి | గృహలక్ష్మి | జూన్ 1934 |
| 282 | స్త్రీ కన్నీరు | తాడి నాగమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1934 |
| 283 | స్త్రీ జన్మ ప్రసంశమైనదే | శ్రీ సాధ్వీ రత్నమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1934 |
| 284 | ఆంధ్రమహిళా మహాసభ | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1934 |
| 285 | రష్యన్ స్త్రీల వీరత్వము | యార్లగడ్డ చిలుకమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1934 |
| 286 | డి.వి. జోన్ | యార్లగడ్డ చిలుకమ్మ | గృహలక్ష్మి | జనవరి 1935 |
| 287 | స్త్రీలు–హక్కులు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1935 |
| 288 | దామెర్ల సీతమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1935 |
| 289 | భర్తల కర్తవ్యం | చీమకుర్తి సత్యవతీ దేవి | వాసవి | ఫిబ్రవరి 1935 |
| 290 | స్త్రీ స్వాతంత్ర్యమెట్టిది | గొర్లపూడి కృష్ణవేణమ్మ | గృహలక్ష్మి | మే 1935 |
| 291 | ఆంధ్రసారస్వతము–జాతీయాభ్యుదయము | చామర్తి భ్రమరాంబ | గృహలక్ష్మి | జూన్ 1935 |
| 292 | స్త్రీలు సహకారోద్యమము | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జూన్ 1935 |
| 293 | ఆంధ్రరైతాంగ విద్యాలయము | సుశీలా దేవి | గృహలక్ష్మి | జులై 1935 |
| 294 | నేటి విద్యాపాటవము | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | జులై 1935 |
| 295 | స్త్రీ బుద్ధి | మల్లాది రాజ్యలక్ష్మి | గృహలక్ష్మి | ఆగష్టు 1935 |
| 296 | సభలు నివేదికలు | వెన్నా అనంతరామమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 297 | స్త్రీ ఎట్టి విద్య నేర్వవలయును | ఐతం హైమావతి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 298 | స్త్రీలు–వ్యాయామ విహారస్థలములు | బి. రాజమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 299 | ఉపన్యాసము | ఉన్నవ లక్ష్మీబాయమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 300 | స్త్రీ హితైషిణీ మండలి | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1935 |
| 301 | స్త్రీల వ్యవస్థ | కె.యస్.రత్నమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1935 |
| 302 | స్త్రీ ధనము | పత్రికాధిపులు | గృహలక్ష్మి | డిసెంబరు 1935 |
| 303 | అఖిలభారత మహిళాసభ–కేరళ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1936 |
| 304 | గర్భస్రావం చేసుకొను హక్కు ఉండవలెను | డి.వెంకటలక్ష్మి | ఆంధ్రభూమి | ఫిబ్రవరి 1936 |
| 305 | ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ పొణకా కనకమ్మ | గృహలక్ష్మి | మార్చి 1936 |
| 306 | అస్పృశ్యతానివారణము నవసరమా | డి.యన్. రాజేశ్వరమ్మ | గృహలక్ష్మి | మార్చి 1936 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 307 | సన్మానం-బత్తులకామాక్షమ్మ | బచ్చు మంగరాజమ్మ | వాసవి | మార్చి 1936 |
| 308 | విద్యావతులు సంసారమును కనర్వాలా | శ్రీమతి సత్యం | గృహలక్ష్మి | ఏప్రిల్ 1936 |
| 309 | తెలుగు నవరాత్రి ఉత్సవాలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | మే 1936 |
| 310 | భారతస్త్రీ సంపూర్ణస్వేచ్ఛ నెప్పుడుబడయగలదు | పాకల చంద్రకాంతామణి | గృహలక్ష్మి | మే 1936 |
| 311 | భారతస్త్రీ సంపూర్ణ స్వేచ్ఛ | డి. కమలావతి | గృహలక్ష్మి | జూన్ 1936 |
| 312 | భారతస్త్రీ సంపూర్ణ స్వేచ్ఛ | యెల్లాప్రగడ సీతాకుమారి | గృహలక్ష్మి | జులై 1936 |
| 313 | సాహిత్యం దాని మహత్వం | కస్తూరి రామలక్ష్మీ దేవి | గృహలక్ష్మి | జులై 1936 |
| 314 | స్త్రీ పురుష సమానత్వమా వశ్యకమా, అనర్థదాయకమా | మైదవోలు పద్మావతి | గృహలక్ష్మి | నవంబరు 1936 |
| 315 | తల్లినగుట నా కిష్టములేదు | వేదుల విశాలాక్షి | ఆంధ్రభూమి | నవంబరు 1936 |
| 316 | స్త్రీ పురుష సమానత్వమా వశ్యకమా, ఆనర్థదాయకమా | వేదుల మీనాక్షి | గృహలక్ష్మి | నవంబరు 1936 |
| 317 | గృహిణీత్వానికి జీతాలా | సోదరి | గృహలక్ష్మి | డిసెంబరు 1936 |
| 318 | భార్యలకు జీతాలా ఇచ్చేవారు భర్తలా | ఎల్లాప్రగడ సీతాకుమారి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1937 |
| 319 | స్త్రీవిద్య | కె. నాగమణి | హిందూసుందరి | ఏప్రిల్ 1937 |
| 320 | సంతాన నిరోధము అవసరమా | బులుసు ప్రకాశమ్మ | ఆంధ్రభూమి | ఏప్రిల్ 1937 |
| 321 | ఆంధ్ర నారీమణులకు కొన్ని సలహాలు | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | జూన్ 1937 |
| 322 | స్త్రీలు-వృత్తి | ఈ. కనకవల్లి | గృహలక్ష్మి | జూన్ 1937 |
| 323 | ధర్మశాస్త్రములలో స్త్రీ హక్కులు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జూన్ 1937 |
| 324 | నేటి రాజకీయాలు స్త్రీలు | కొమర్రాజు అచ్చమాంబ | గృహలక్ష్మి | జూన్ 1937 |
| 325 | స్త్రీలకు విద్యలేనిచో దేశమునకు ముక్తి లేదు | వల్లభనేని సీతామహాలక్ష్మి | గృహలక్ష్మి | జూన్ 1937 |
| 326 | మనసులో మాటలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1937 |
| 327 | అభ్యుదయమునకు ఆయువుపట్టు | కృష్ణకుమారి | గృహలక్ష్మి | సెప్టెంబరు 1937 |
| 328 | మనసులో మాటలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1937 |
| 329 | స్త్రీలకు విద్యలేనిచో దేశమునకు ముక్తిలేదు | వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ | తెలుగుతల్లి | సెప్టెంబరు 1937 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | వ్యాసాలు | | |
| 330 | బంది | గుమ్మడిదల దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1937 |
| 331 | సహకారమా? విధ్వంసమా? | కొమర్రాజు అచ్చమాంబ | గృహలక్ష్మి | అక్టోబరు 1937 |
| 332 | మనపతనానికి మనమేకారణము | చెరుకూరు నాగభూషణమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1937 |
| 333 | మధుపానమువ్యాసం | బి.పి.సుశీలాబాయి | తెలుగుతల్లి | నవంబరు 1937 |
| 334 | కృషితోనాస్తి దుర్భిక్షం | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1937 |
| 335 | మహిళా లోకం స్త్రీ ప్రభావము | సీతాదేవి | ఆంధ్రభూమి | డిసెంబరు 1937 |
| 336 | మనకర్తవ్యము | వెలగపూడి సరస్వతమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1937 |
| 337 | ముక్తి | గుమ్మడిదల దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1937 |
| 338 | బత్తుల కామాక్షమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1938 |
| 339 | పులవర్తి కమలావతీ దేవి | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1938 |
| 340 | గృహపరిశ్రమలు | పులుగుర్తు కనకమ్మ | గృహలక్ష్మి | జనవరి 1938 |
| 341 | భారతమాత పవిత్రపుత్రుడు జవహర్ లాల్ | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | గృహలక్ష్మి | జనవరి 1938 |
| 328 | శాసనసభకు ఎన్నుకొనబడిన శాసనసభ్యురాండ్రు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1938 |
| 342 | మాడభూషి చూడమ్మ | బాలాంత్రపు శేషమ్మ | హిందూసుందరి | ఫిబ్రవరి 1938 |
| 343 | శాసనసభలు స్త్రీ కర్తవ్యవం | క్రొవ్విడి మాణిక్యాంబ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1938 |
| 344 | స్త్రీలు నిర్బంధ విద్యాశాసనము | అ. రాధమ్మ | గృహలక్ష్మి | మార్చి 1938 |
| 345 | స్త్రీ సమాజాలు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | మార్చి 1938 |
| 346 | సమాజం సాధించనిదేదీలేదు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | మార్చి 1938 |
| 347 | ప్రజాహితులు కాని పెట్టుబడిదారులు | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | మార్చి 1938 |
| 348 | ఆంధ్రయువతి–నిరాడంబర జీవనం | మర్ల రోజాబాయి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1938 |
| 349 | వర్ణ వ్యవస్థ | దేవినేని మాణిక్యాంబ | గృహలక్ష్మి | ఏప్రిల్ 1938 |
| 350 | భారత స్త్రీల ప్రస్తుత పరిస్థితి | దరిశి సుభద్రమ్మ | గృహలక్ష్మి | మే 1938 |
| 351 | మనసులో మాటలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జూన్ 1938 |
| 352 | శారదా బిల్లువ్యాసం | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జూన్ 1938 |
| 353 | కార్ల సరదా తీరాలంటే | బులుసు ప్రకాశమ్మ | ఆంధ్రభూమి | జూన్ 1938 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 354 | వైశ్య వనితా రత్నాలు | పత్రికాధిపులు | వాసవి | జులై 1938 |
| 355 | అభ్యాసములు-ఆదాయమార్గాలు | పులిపాక బాలా త్రిపురసుందరమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1938 |
| 356 | శ్రీమతి సుబ్బరాయునుగారి బిల్లు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1938 |
| 357 | స్త్రీలు పత్రికా రచన | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1938 |
| 358 | వైశ్యులు-విద్య | పులవర్తి కమలావతీదేవి | వాసవి | సెప్టెంబరు 1938 |
| 359 | స్త్రీలు పత్రికా సంపాదకులుగా ఉంటే | పసుపులేటి లలితా దేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 360 | హిందూ మహమ్మదీయ సఖ్యత | వెలిదండ చూడి కుదుత్తమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 361 | భారత స్త్రీల ఉద్యమం-భావపరిణామం | దరిశి సుభద్రమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 362 | శ్రీమతి రాధాబాయి సుబ్బరాయనుగారి బిల్లు | ద్వివేది సత్యవతి | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 363 | జీవిత వికాసమునకు విద్య | వి.యస్.యస్. లక్ష్మి | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 364 | అభ్యుదయానికి అవసరమైన రచనావిధానము | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 365 | స్త్రీ సమములు స్థిరంగా ఉండాలంటే | పాకల రాజామణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 366 | విదేశీ వెర్రివీడితే | కె.సుగుణమణి | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 367 | పతివ్రతార్థం పతిత అయ్యింది | డి. అనసూయ | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 368 | శ్రీమతి సుబ్బరాయనుగారి బిల్లు | కొత్రప్రోలు వెంకటరంగమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1938 |
| 369 | స్త్రీల అభ్యుదయము రచనలు | మొ.మాణిక్యాంబ | గృహలక్ష్మి | నవంబరు 1938 |
| 370 | స్త్రీలు సంఘ సేవ | వడ్లమూడి అన్నపూర్ణమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1938 |
| 371 | శ్రీమతి సుబ్బరాయనుగారి బిల్లు | పాలూరి సత్యకుమారి | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 372 | పురుషుల కవకాశమీయరాదు | కాకులపాటి రాధాసుందరమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 373 | పురుషులకే వర్తించవలెను | డి. భారతీ దేవి | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 374 | సవరించాలి | కందర్ప కమలకుమారి | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 375 | కట్నములు లాంఛనములు | వట్టి శేషాంబ | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 376 | బిల్లులు దీర్ఘ రోగాలకే వర్తింపచేయాలి | భూపతి వెంకమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 377 | స్త్రీ ధర్మం | వల్లభనేని రంగా దేవి | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 378 | పెళ్ళిళ్ళు రిజిష్టరు చేయటం అవసరం | డి. కామేశ్వరమ్మ | భారతి | డిసెంబరు 1938 |
| 379 | స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయము | పంతం అమ్మాజీ | గృహలక్ష్మి | డిసెంబరు 1938 |
| 380 | స్త్రీ జనోచితమగు విద్య | వేదుల మీనాక్షి | గృహలక్ష్మి | జనవరి 1939 |
| 381 | స్త్రీ జాతి ఆనాడు, ఈనాడు | ఎ. సుబ్బాయమ్మ | గృహలక్ష్మి | జనవరి 1939 |
| 382 | వైధవ్యము ధర్మశాస్త్రములు | కుడితిపూడి అచ్చమాంబ | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1939 |
| 383 | ఏ జీవిక స్త్రీలకు | కామరాజు సరోజనీ దేవి | భారతి | ఏప్రిల్ 1939 |
| 384 | స్త్రీ జాతి దృక్పథము | గుమ్మడిదల దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | జూన్ 1939 |
| 385 | స్త్రీ కర్తవ్యము | గుమ్మళ్ళ అహల్య | గృహలక్ష్మి | జూన్ 1939 |
| 386 | సాంఘిక దురాచారములు వాటి దిద్దుబాట్లు | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1939 |
| 387 | ఆంధ్ర రాష్ట్రీయ మహిళాసభలు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | సెప్టెంబరు 1939 |
| 388 | స్త్రీలకుస్వాతంత్ర్యము అవసరము | సోమయాజుల లక్ష్మీకాంతమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1939 |
| 389 | స్త్రీ జనాభ్యుదయమునకు వలయు సాధనము | వట్టి శేషాంబ | గృహలక్ష్మి | అక్టోబరు 1939 |
| 390 | నిరుద్యోగ సమస్య-గ్రామ పునర్నిర్మాణము | కోకా భానుమతి | గృహలక్ష్మి | నవంబరు 1939 |
| 391 | స్త్రీలకు విద్యాస్వాతంత్ర్యం ములత్యవసరము | చెరుకూరు నాగభూషణమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1939 |
| 392 | గృహపరిశ్రమలు | గుంటూరు విశాలక్ష్మి | గృహలక్ష్మి | నవంబరు 1939 |
| 393 | వైశ్యులకు కావలిసిన విద్య | దొంతి రాజరత్నమ్మ | వాసవి | డిసెంబరు 1939 |
| 394 | వైశ్యుల భావ్యస్థితి | పులవర్తి కమలావతీదేవి | వాసవి | డిసెంబలు 1939 |
| 395 | స్త్రీకి ఎట్టి విద్య అవసరము | చుండూరి రమాదేవి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1940 |
| 396 | స్త్రీలు- జర్నలిజం | చేబ్రోలు సరస్వతీ దేవి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1940 |
| 397 | పుష్పచయము | సి. హెచ్. చంద్రమతి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1940 |
| 398 | స్త్రీ-వ్యాయము | చేబ్రోలు సరస్వతీ దేవి | గృహలక్ష్మి | జులై 1940 |
| 399 | పల్లెటూర్ల సాంఘిక దుస్థితి | ఆదిలక్ష్మి, వెంకట రత్నసోదరిలు | గృహలక్ష్మి | జులై 1940 |
| 400 | దేవదాసి | దేవులపల్లి వెంకటరత్నమ్మ | గృహలక్ష్మి | జులై 1940 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | వ్యాసాలు | | |
| 401 | సర్వోదయము-సామ్యవాదం | వల్లభనేని రంగా దేవి | గృహలక్ష్మి | జులై 1940 |
| 402 | శారదాచట్టం-యువకులబాధ్యత | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1940 |
| 403 | దేశసేవిక కమలా దేవి | ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1940 |
| 404 | కార్యశూర కమలా దేవి | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఆగష్టు 1940 |
| 405 | చుండూరు రత్నమాంబ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | సెప్టెంబరు 1940 |
| 406 | కళ్ళేపల్లి వెంకట రమణమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | సెప్టంబరు 1940 |
| 407 | విద్యా స్వరూపము ఆదర్శమునకు నైతికవిచ్ఛితి | బూర్గుల రుక్మిణీబాయి | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 408 | స్థానిక సంస్థలు | దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 409 | స్త్రీ విద్యార్థి సంఘము లెందుకు | కనకదేశ గుప్త | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 410 | మహిమోపేతుడు మహాత్ముడు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1940 |
| 411 | చెన్నపురి ఆంధ్రమహాసభ-స్త్రీల శాఖ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | నవంబరు 1940 |
| 412 | విద్యావతులు అవివాహితులుగా మిగిలిపోతున్నారు | కె. సరోజనీ | గృహలక్ష్మి | డిసెంబరు 1940 |
| 413 | సజీవమైన వాఙ్మయము కావాలి | వట్టికొండ విశాలాక్షి | గృహలక్ష్మి | డిసెంబరు 1940 |
| 414 | స్త్రీవిద్య | బి.శ్యామలాంబ | విభూతి | డిశెంబరు 1940 |
| 415 | స్త్రీస్వాతంత్ర్యము | నర్రా జానకీదేవి | ఉదయభారతి | డిశంబరు 1940 |
| 416 | చెన్నపురి ఆంధ్రమహాసభ-స్త్రీల శాఖ అభివృద్ధి | బాలాంత్రపు శేషమ్మ | గృహలక్ష్మి | జనవరి 1941 |
| 417 | పల్లెటూర్లు-వాటి ప్రస్తుత దౌర్భాగ్య స్థితి | గోపరాజు సీతాదేవి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1941 |
| 418 | స్త్రీకి స్వాతంత్ర్యం ఎంతవరకు | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | మార్చి 1941 |
| 419 | స్త్రీలు చెడ్డవారా? | చెరుకూరు నాగభూషణమ్మ | గృహలక్ష్మి | మార్చి 1941 |
| 420 | బత్తుల కామాక్షమ్మ | వేదవల్లి తాయారమ్మ | గృహలక్ష్మి | మార్చి 1941 |
| 421 | బత్తుల కామాక్షమ్మ | దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | మార్చి 1941 |
| 422 | హిందూమహమ్మదీయ సమస్య | నర్రా జానకీదేవి | ఉదయభారతి | ఏప్రల్ 1941 |
| 423 | స్త్రీ స్వాతంత్ర్యం | తెన్నేటి వెంకటరత్నావళి | గృహలక్ష్మి | మే 1941 |
| 424 | భారతమహిళామండలి బెజవాడ | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | మే 1941 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 425 | మనసులో మాటలు | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | జూన్ 1941 |
| 426 | కాళ్ళకూరి మహాలక్ష్మి సుందరమ్మ | వేముగంటి పాపాయమ్మ | హిందూసుందరి | జులై 1941 |
| 427 | చెన్నపురి ఆంధ్ర మహాసభ–స్త్రీల శాఖ | రాణి రావు రాజ్యలక్ష్మి | గృహలక్ష్మి | ఆగష్టు 1941 |
| 428 | ప్రపంచమున స్త్రీకి గల గౌరవం | శనివారపు అన్నపూర్ణా దేవి | గృహలక్ష్మి | ఆగష్టు 1941 |
| 429 | అతివల యాదర్శము | వట్టి శేషాంబ | గృహలక్ష్మి | ఆగష్టు 1941 |
| 430 | స్త్రీల వేసంగి పాఠశాల | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | సెప్టెంబరు 1941 |
| 431 | ఇంకెనాళ్లు మనకీ బానిసత్వం | చెరుకూరు నాగభూషణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 432 | పంజరంలో చిలుక మైత్రేయి | కామరాజు | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 433 | హింస – అహింస | గంటి కృష్ణవేణమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 434 | అభివృద్ధి కావలెనన్న | దేశిరాజు భారతీదేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1941 |
| 435 | సప్తమగంజాం మండల మహిళా సభ | వడ్డాది కమలా దేవి | గృహలక్ష్మి | నవంబరు 1941 |
| 436 | సంఘసేవా పరాయణి | పత్రికాధిపులు | గృహలక్ష్మి | నవంబరు 1941 |
| 437 | సేవాన్వేషిణి!–జాగ్రత్త | దుర్గాబాయమ్మ | గృహలక్ష్మి | నవంబరు 1941 |
| 438 | పత్రికారచయితలుగా–స్త్రీలొనరింపగల సేవ | చేబ్రోలు సరస్వతీ దేవి | గృహలక్ష్మి | డిసెంబరు 1941 |
| 439 | అఖిలభారత మహిళా సభ | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | డిసెంబరు 1941 |
| 440 | గుమ్మడిదల దుర్గాబాయి | కాస్యపి | ఆంధ్రభూమి | డిసెంబరు 1941 |
| 441 | వెలగపూడి సరస్వతమ్మ | కనుపర్తి వరలక్ష్మమ్మ | భారతి | జనవరి 1944 |
| 442 | విద్యార్థినీ సమాజము–రజతోత్సవ సభ | సంపాదకులు | హిందూసుందరి | మే 1944 |
| 443 | దిక్కుమాలు మాలబాలకునిరక్షణ | సి.హెచ్. చంద్రమతి | హిందూసుందరి | జూన్–జులై1944 |
| 444 | ఆంధ్రరాష్ట్ర మహిళా సభ | కనుపర్తి వరలక్ష్మమ్మ | హిందూసుందరి | నవంబరు 1944 |
| 445 | స్త్రీలహక్కులు | డి. రాజరాజేశ్వరి | రూపవాణి | అక్టోబరు 1944 |
| 446 | స్త్రీలు ఆరోగ్యము | శిఖరం కమలాంబ | వాసవి | అక్టోబరు 1946 |
| 447 | సంఘాన్ని బాగుచేసే ముఖ్యశాసనాలేవి | పాకల రాజమణి | గృహలక్ష్మి | జనవరి 1947 |
| 448 | రెండవ ప్రపంచ యుద్ధ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1947 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **వ్యాసాలు** | | |
| 449 | విజయలక్ష్మి పండిట్ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1947 |
| 450 | జనాభా లెక్కలు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1947 |
| 451 | వరకట్నాలు | ఆచంట రత్నకుమారి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1947 |
| 452 | భోగం మేళాల నిషేధము | వల్లభనేని సీతామహాలక్ష్మి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1947 |
| 453 | నవోదయము | మద్దూరి మీనాక్షమ్మ | గృహలక్ష్మి | మార్చి 1947 |
| 454 | వైవాహికాచారములు | వల్లూరుపల్లి వెంకట రత్నమణీబాయి | గృహలక్ష్మి | ఏప్రిల్ 1947 |
| 455 | పెండ్లిచూపులు ఎంతవరకు సమంజసము | కృష్ణాబాయి | గృహలక్ష్మి | జులై 1947 |
| 456 | భారతస్వాతంత్ర చట్టము | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జులై 1947 |
| 457 | రావుకమిటీ సిఫారసులు | బోడపాటి అలివేలమ్మ | గృహలక్ష్మి | జులై 1947 |
| 458 | బ్రతుకుతెరువు | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | జులై 1947 |
| 459 | స్వతంత్ర భారతము | వల్లభనేని సీతామహాలక్ష్మి | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 460 | వందేమాతరము | డా. యన్. ముత్తు లక్ష్మిదేవి | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 461 | స్వాతంత్ర్యము మన కర్తవ్యము | కడప రామసుబ్బమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 462 | గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 463 | యామినీపూర్ణ తిలకమ్మ దేశసేవ | కనకదుర్గ | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 464 | రామరాజ్యం | ఆచంట సత్యవతమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 465 | పాటూరు బాలసరస్వతమ్మ | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 466 | ముత్యాల సరోజినీ దేవి | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 467 | భారత నారీమణుల జాతీయ అభిమానజన్యము | పత్రికాధిపులు | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 468 | స్వతంత్రపోరాటమున ఆంధ్రస్త్రీలు పడినపాట్లు | నడింపల్లి శారదా కుమారి | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 469 | మన కర్తవ్యమువ్యాసం | బత్తుల కామాక్షమ్మ | గృహలక్ష్మి | ఆగష్టు 1947 |
| 470 | అఖిలభారత మహిళా మహాసభ–తీర్మానాలు | పత్రికాధిపులు | గృహలక్ష్మి | జనవరి 1948 |

| క్రమ సంఖ్య | పేరు | రచయిత పేరు | ప్రచురణ పత్రిక | నెల మరియు సంవత్సరం |
|---|---|---|---|---|
| | | **స్వీయచరిత్రలు** | | |
| 1 | ప్రేమలత | కనుపర్తి వరలక్ష్మమ్మ | అనసూయ | జులై– ఆగష్టు 1919 |
| 2 | నా జీవనావ యాత్ర | డి. రాజేశ్వరి | గృహలక్ష్మి | ఫిబ్రవరి 1930 |
| 3 | ఆత్మచరితము | ఏడిదం సత్యవతి | స్వీయప్రచురణ | ఫిబ్రవరి 1934 |
| | | **శతకాలు** | | |
| 1 | మాధవశతకము | వేమూరి శారదాంబ | కలావతి | మార్చి–మే 1901 |
| 2 | సుగుణబోధిని శతకము | ఆత్మూరి అన్నపూర్ణ | ఆంధ్ర కవయిత్రులు | 1953 |
| 3 | లక్ష్మీ శతకము | కనుపర్తి వరలక్ష్మమ్మ | ఆంధ్ర కవయిత్రులు | 1953 |
| | | **నవలలు** | | |
| 1 | రాధ | కాంచనపల్లి కనకాంబ | స్వీయప్రచురణ | 1917 |
| 2 | కుముద్వతి | పులవర్తి కమలావతీదేవి | సరస్వతీ శక్తి సంస్థ | 1924 |
| 3 | శోభావతి | అ.పె.పిరాటమ్మ జానకీ | ముద్రాక్షరమాల | 1924 |
| 4 | సేవాశ్రమము | దామెర్ల భ్రమరాంబ, కొండా జయలక్ష్మి | రాజమండ్రి పబ్లికేషన్స్ | 1932 |
| 5 | అరవింద | చిల్కపాటి సీతాంబ | స్వీయప్రచురణ | 1935 |
| | | **పాటలు** | | |
| 1 | మంగళహారతి | దామెర్ల సుందరమ్మ | హిందూసుందరి | మే 1904 |
| 2 | రాటపుపాటలు | ఇనగంటి రత్నమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1931 |
| 3 | దౌర్భాగ్య సంఘం | వల్లభనేని రంగాదేవి | గృహలక్ష్మి | అక్టోబరు 1938 |
| 4 | ప్రజలు మేల్కొన్నారులే | వట్టికొండ విశాలాక్షి | తెలుగు తల్లి | మే–జూన్ 1945 |
| 5 | మంగళ హారతిపాట | కనుపర్తి వరలక్ష్మమ్మ | గృహలక్ష్మి | అక్టోబరు 1939 |

# ఉపయుక్త గ్రంథావళి


| క్రమ సంఖ్య | రచయిత పేరు | ప్రక్రియ | గ్రంథం పేరు | ప్రచురణ/పత్రిక | సం. |
|---|---|---|---|---|---|
| 1 | భండారు అచ్చమాంబ | గ్రంథం | అబలాసచ్చరిత్ర రత్నమాల -1 భాగం | చింతామణి ముద్రాక్షరశాల, చెన్నపురి మరియు అభ్యుదయ ప్రెస్, విజయవాడ | 1901 |
| 2 | భండారు అచ్చమాంబ | గ్రంథం | అబలాసచ్చరిత్ర రత్నమాల-2 | వేదం అండ్ కో మద్రాసు | 1917 |
| 3 | వట్టికొండ విశాలాక్షి | కవితా సంపుటి | ప్రబోధగీతాలు | స్వీయప్రచురణ | 1943 |
| 4 | ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ | గ్రంథం | ఆంధ్ర కవయిత్రులు | స్వీయప్రచురణ | 1953 |
| 5 | మామిడిపూడి వెంకటరంగయ్య | గ్రంథం | స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-1 భాగం | స్వీయప్రచురణ | 1974 |
| 6 | మామిడిపూడి వెంకటరంగయ్య | గ్రంథం | స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-2 భాగం | స్వీయప్రచురణ | 1976 |
| 7 | మామిడిపూడి వెంకటరంగయ్య | గ్రంథం | స్వాతంత్ర్యోద్యమ చరిత్ర-3 భాగం | స్వీయప్రచురణ | 1977 |
| 8 | దుర్గాబాయ్ దేశముఖ్, మరియు గిరిజ | గ్రంథం | స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రమహిళలు | ఆంధ్రపురావస్తు శాఖ | 1986 |
| 9 | వి.కోటేశ్వరమ్మ | గ్రంథం | స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళల మహోజ్వలపాత్ర | నాగార్జున ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ | 2001 |

రచయిత : **జంధ్యాల కనకదుర్గ**

పుట్టినతేది : 10-04-1953

తల్లిదండ్రులు : జంధ్యాల కుమారస్వామి, లక్ష్మీప్రసన్నమ్మ

విద్యార్హతలు :

1) ఎమ్.ఏ - ఆంధ్రా విశ్వవిద్యాలయం (బంగారుపతకం) 1974
2) ఎమ్.ఫిల్ - కాకతీయ విశ్వవిద్యాలయం (రెండు బంగారు పతకాలు) 1990
3) పి.ఎచ్.డి - కాకతీయ విశ్వవిద్యాలయం 1994

వృత్తి అనుభవం :

34 సం.లు - లెక్చరర్, రీడర్, ప్రిన్సిపాల్ -
సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, ఖమ్మంజిల్లా.
సత్కారం - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం, 1994
మరియు ఇతర సంస్థల పురస్కారాలు

పరిశోధనలు :

1) యు.జి.సి. రీసెర్చి ఫెలోషిప్ అవార్డు - 1975
2) యు.జి.సి.మైనర్ రీసెర్చి ప్రాజెక్టు-సింగరేణి గనికార్మికజీవన చిత్రణ 1998
3) యు.జి.సి.మేజర్ రీసెర్చి ప్రాజెక్టు- ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ పురుష సంబంధాలు-2004
4) BOLT అవార్డు ఆఫ్ ఎయిర్ ఇండియా

ప్రచురణలు :

పుస్తకాలు 7-(1) కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక (2) తెలుగు స్వతంత్ర కథాకావ్యాలలో మహిళా జీవన చిత్రణ (3) తెలుగు సాహిత్యం-మహిళా చైతన్య ప్రస్థానం (4) సింగరేణి సాహిత్యం-గని కార్మిక జీవనం (5) సాహితీ సుమాలు (6) సాహిత్యం-సత్త్వదర్శిని (7) స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి - (తెలుగులో స్త్రీల సాహిత్యం 1900-1947)

వివిధ పత్రికలలో ప్రచురింపబడిన విమర్శ వ్యాసాలు - 40

అభిరుచి - నిరంతర తెలుగు సాహిత్యాధ్యయనం - పరిశోధన

## “స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి”

మీ ముందున్న గ్రంథం. “స్వతంత్రతనుండి– స్వాతంత్ర్యానికి” వెలువడుతోంది. ఇదొక జమిలి ఆశయం. ఒకవైపు స్త్రీలు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం ఉద్యమిస్తూ, రచనలు చేస్తూనే, మరోపార్శ్వంలో స్వాతంత్ర్యసాధనకోసం తమ కలాలకు పనిపెట్టారు. ప్రస్తుత గ్రంథం వారి రచనలను పరామర్శించి, సమీక్షించింది. **– వకుళాభరణం రామకృష్ణ**

1900 నుండి ప్రతి ఒక దశాబ్దాన్ని ఒక యూనిట్ గా చేసుకొని స్త్రీలు ఎన్ని ప్రక్రియలలో ఏయే విషయాలమీద వ్రాసారో వాటన్నిటినీ వేరువేరుగా చర్చించారు. వీటన్నిటినీ కలిపే అంతఃసూత్రం స్త్రీల వ్యక్తిగతస్వాతంత్రాన్ని కోరుతూ ప్రారంభమైన సంస్కరణ ఉద్యమం ఇచ్చిన చైతన్యం స్త్రీలను దేశస్వాతంత్ర్యం కోసం జాతీయోద్యమంలో భాగస్వాములు అయ్యేట్లు చేసిందన్న ఒక అవగాహన. ఇది చాలా కీలకమైనది. 1900–1947 వరకు వివిధపత్రికలలోను, విడిగా పుస్తకాలుగాను వచ్చిన స్త్రీల రచనలను సేకరించి స్త్రీల ఆలోచనలో, ఆచరణలో క్రమానుగతంగా వచ్చిన మార్పులను బేరీజు వేస్తూ ఈ పుస్తకాన్ని రూపొందించారు కనకదుర్గ.

**– కాత్యాయినీ విద్మహే**

చరిత్రలో దాచేస్తే దాగని సత్యాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా రచయిత్రుల విషయంలో. వాటిని ఎల్లకాలం అణచిపెట్టి ఉంచలేం. వాటిని దాటిపెట్టి ఉంచలేం. ఆ దాచేస్తే దాగని సత్యాలకోసం ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు భగీరథ ప్రయత్నం చేయకపోరు. ఆ స్వచ్ఛమైన ఊట ఉవ్వెత్తున ఎగసి పడకపోదు. ఇప్పుడు ప్రకటిస్తున్న “స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి” అనే ఈ గ్రంథం – తొలి పేజి నుంచి అనుబంధాల చివరి పుట వరకూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒక సాహిత్య సామాజిక, సాంస్కృతిక, రాజకీయచరిత్రకు నిలువెత్తుసాక్ష్యం.

**– మేడిపల్లి రవికుమార్**

ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ప్రత్యేకమై, తెలుగుజాతి ఉనికికి, ప్రగతికి, స్త్రీవ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశస్వాతంత్ర్యానికి పట్టంకట్టగలిగినది ఈ స్త్రీలసాహిత్య చరిత్రయే. ఇది స్త్రీల కొరకు, స్త్రీలచేత, స్త్రీల యొక్క సాహిత్యంగా చరిత్రలో చోటుచేసుకోవటమే దీని ప్రత్యేకతగా భావించాలి. ఈ స్త్రీలసాహిత్యం ఒక సాంఘిక చరిత్ర, నీతి, ఆరోగ్యం, ఆర్థికం, రాజకీయం, సమాజం, గణాంకం, పత్రికారంగం (జర్నలిజం), వాణిజ్యం, పౌర, న్యాయశాస్త్రాల పరిజ్ఞానంతో సమ్మిళితమైన సమాహార సంపూర్ణ మానవ శాస్త్రం. క్రీ.శ.1900–1947సం.ల వరకు వచ్చిన స్త్రీలసాహిత్యంలో నిక్షిప్తమై, విస్మృతంగా పడిఉన్న ఆ నాటి స్త్రీల ఉద్యమ భావజాలాన్ని తొలిసారిగా భారతదేశ 75వ స్వాతంత్ర్యదినోత్సవాల సందర్భంలో వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నమే “స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి” – అనే ఈ పుస్తకం.. ఈ స్త్రీలసాహిత్యం ఆధునిక ఆంధ్ర స్త్రీలఅభివృద్ధి చరిత్ర, సామాజిక వాస్తవిక చరిత్ర కూడా. సాహిత్యం చరిత్రగానూ, చరిత్ర సాహిత్యంగానూ భాసిల్లి ప్రయోగాత్మకంగా నిరూపింపబడిన సామాజికశాస్త్రం. సమాజమనే ప్రయోగశాలలో మథించగా ఉద్భవించిన సజీవసాహిత్యం. **– జంధ్యాల కనకదుర్గ**